
చరిత్ర

# ఆంధ్ర సాహిత్య చరిత్ర



ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్

www.freegurukul.org


సదాశివ సమారంభాం
గురు దక్షిణామూర్తి
గురు వేదవ్యాస మహర్షి
గురు శుక మహర్షి
గురు నారద మహర్షి
గురు వాల్మీకి మహర్షి
గురు శ్రీకృష్ణ
శంకరాచార్య మధ్యమాం
గురు దత్తాత్రేయ
గురు బాబాజి
గురు గౌతమ బుద్ధ
గురు ఆదిశంకరాచార్య
గురు రామానుజాచార్యులు
గురు జ్ఞానేశ్వర్
గురు రవిదాస్
గురు కబీర్ దాస్
గురు చైతన్య మహా ప్రభువు
గురు నానక్
గురు రాఘవేంద్ర స్వామి
గురు వీరబ్రహ్మేంద్ర స్వామి
యోగి వేమన
అస్మదాచార్య పర్యంతాం
గురు త్రైలింగ స్వామి
గురు లాహిరి మహాశయ
గురు రామకృష్ణ పరమహంస
అమ్మ శారదా దేవి
గురు వివేకానంద
గురు సాయిబాబా
గురు అరబిందో
గురు రమణ మహర్షి
గురు యోగానంద
గురు భక్తివేదాంత ప్రభుపాద
గురు మళయాళ స్వామి
గురు విద్యాప్రకాశానందగిరి
గురు చంద్రశేఖర పరమాచార్య
వందే గురుపరంపరాం..

Free Gurukul

"ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్" ద్వారా విలువలు, నైపుణ్యాలతో కూడిన విద్య ఉచితంగా + సులభంగా + ఆకర్షణీయంగా + నాణ్యతతో కూడి అందించే సేవా కార్యక్రమంలో బాగంగా ఈ పుస్తకాన్ని భారత ప్రభుత్వపు వెబ్ సైట్( డిజిటల్ లైబ్రరీ అఫ్ ఇండియా) నుంచి సేకరించి అందిస్తున్నాము. ఇందుకు మేము వారికి కృతజ్ఞత తెలియచేసుకుంటున్నాము.

సాయి రామ్ వారి సేవల విస్తరణలో బాగంగా ఈ ఫౌండేషన్ స్థాపించబడినది. ఈ స్వచ్ఛంద సంస్థ ద్వారానే అన్ని సేవలు అందించబడును. ఇటువంటి పుస్తకాలు మీరు వ్రాసినట్లయితే (లేక) సేకరిస్తే మాకు తెలియచేయండి. మేము ప్రతి విద్యార్థికి ఉచితంగా అందేలా చేస్తాము, తద్వారా ఉన్నత విలువలు, నైపుణ్యాలు కలిగిన విద్యార్థులను మన దేశానికి అందించవచ్చు. మాతో కలిసి నవ భారత నిర్మాణ కార్యక్రమంలో పనిచేయుటకు, భాగస్వామ్యం అగుటకు ఆసక్తి ఉంటే సంప్రదించగలరు.

ఈ గ్రంధాలను ఉచితంగా ఆన్ లైన్ లో చదువుటకు, దిగుమతి(డౌన్లోడ్) చేసుకొనుటకు గల మార్గాలు:

1) భారత ప్రభుత్వపు వెబ్ సైట్: http://www.new.dli.ernet.in
2) ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్ వెబ్ సైట్ : www.freegurukul.org
3) సాయి రామ్ వెబ్ సైట్ : https://sites.google.com/site/sairealattitudemanagement
4) మొబైల్ ఆప్: Free Gurukul

గమనిక: భక్తి,జ్ఞాన,ధర్మ ప్రచారార్ధం ఉచితంగా eBook రూపంలో భారత ప్రభుత్వపు డిజిటల్ లైబ్రరీ సహాయంతో ఇవ్వడం జరిగింది. ఇది లాభార్జన దృష్టిలేని ఉచిత సేవ. ఈ సేవలో అంతర్జాలంలోని(ఇంటర్నెట్) లైసెన్సు / కాపీరైటు అభ్యంతరాలు లేనివి అనుకొన్న పుస్తకాలను గ్రహించటం జరిగినది. అనుకోకుండా ఏవైనా అభ్యంతరకరమైనవి ఉన్నచో మాకు తెలుప మనవి, వాటిని తొలగించగలము అని మనవి చేసుకొంటున్నాము.

Website: www.freegurukul.org Mobile App: Free Gurukul email: support@freegurukul.org

Facebook: www.facebook.com/freegurukul Help Line / WhatsApp: 904 202 0123

" మన లక్ష్యం: విలువలు, నైపుణ్యాలతో కూడిన విద్య అనేది ఉచితంగా + సులభంగా + ఆకర్షణీయంగా + నాణ్యతతో కూడి అందరికి అందించబడాలి "

ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్ – Free Gurukul Education Foundation

సర్వం పరమాత్మ పాద సమర్పణమస్తు

## భారత ప్రభుత్వపు వెబ్ సైట్ - డిజిటల్ లైబ్రరీ అఫ్ ఇండియా

## http://www.new.dli.ernet.in



# అతి విశిష్టం ఈ దానం!

స్వామి వివేకానంద

"దానాలలోకెల్లా ఆధ్యాత్మిక విద్యాదానం చాలా శ్రేష్ఠమైంది! దాని తరువాతిది లౌకిక జ్ఞానదానం, ప్రాణదానం, అన్నదానం" అని వ్యాసమహర్షి చెప్పారు.

మన ఆధ్యాత్మిక జ్ఞానం భారతదేశ హద్దులలో నిలిచి పోకూడదు. లోకమంతటినీ ఆవరించాలి! ఇలా లోకవ్యాప్తమైన ధర్మప్రచారాన్ని మన పూర్వులు చేశారు. హైందవ వేదాంతం ఎన్నడూ ఈ దేశం దాటి పోలేదని చెప్పేవారూ, మతప్రచారార్థం తొలిసారిగా, పరదేశాలకు వెళ్ళిన సన్న్యాసిని నేనే అని చెప్పేవారూ, తమ జాతిచరిత్ర నెరుగని వారే! ఇలాంటి సంఘటనలు ఎన్నోసార్లు జరిగాయి. అవసరమైనప్పుడల్లా, భారతీయ ఆధ్యాత్మిక జ్ఞానప్రవాహం వెల్లువలా లోకాన్ని ముంచెత్తుతూ వచ్చింది.



రాజకీయ ప్రచారాన్ని రణగొణధ్వనులతో, యోధులతో సాగించవచ్చు. అగ్నిని కురిపించి, కత్తిని ఝళిపించి, లౌకిక జ్ఞానాన్నీ, సంఘనిర్మాణ విజ్ఞానాన్నీ విరివిగా ప్రచారం చేయవచ్చు. కానీ ఆధ్యాత్మిక జ్ఞానదానం కళ్ళకు కనిపించకుండా, చెవులకు వినిపించకుండా కురుస్తూ, రోజా పువ్వుల రాసుల్ని వికసింపజేసే మంచులాగా నిశ్శబ్దంగా జరగవలసి ఉంది. భారతదేశం నిరాడంబరంగా, లోకానికి మళ్ళీ మళ్ళీ చేస్తూ వచ్చిన దానమిదే!

మిత్రులారా! నేను అవలంబించే విధానాన్ని తెలియజేస్తాను వినండి. భారతదేశంలోనూ, ఇతర దేశాల్లోనూ మన పారమార్థిక ధర్మాలను బోధించడానికి తగినవారుగా మన యువకుల్ని తయారు చేయడానికై భారతదేశంలో కొన్ని సంస్థలను నెలకొల్పాలి! ఇప్పుడు మనకు కావలసింది బలిష్ఠులు, జవసంపన్నులు, ఋజువర్తనులు, ఆత్మ విశ్వాసపరులు అయిన యువకులు. అలాంటి వారు నూరుమంది దొరికినా, ప్రపంచం పూర్తిగా పరివర్తన చెందగలుగుతుంది!!

ఇచ్ఛాశక్తి తక్కిన శక్తులన్నిటి కన్నా బలవత్తరమైంది. అది సాక్షాత్తూ భగవంతుని దగ్గరి నుండి వచ్చేదే కాబట్టి దాని ముందు తక్కినదంతా లొంగిపోవలసిందే. నిర్మలం, బలిష్ఠం అయిన 'ఇచ్ఛ' (సంకల్పం) సర్వశక్తిమంతమైంది. దానిలో మీకు విశ్వాసం లేదా? ఉంటే మీ మతంలోని మహోన్నత ధర్మాలను ప్రపంచానికి బోధించడానికై కంకణం కట్టుకోండి. ప్రపంచం ఆ ధర్మాల కోసమై ఎదురుచూస్తోంది. అనేక శతాబ్దాలుగా ప్రజలకు క్షుద్రసిద్ధాంతాలు నేర్పడం జరిగింది. వారు వ్యర్థులని ప్రపంచమంతటా బోధలు జరిగాయి. ఎన్నో శతాబ్దాల నుండి వారు ఈ బోధనల వల్ల భయభ్రాంతులై, పశుప్రాయులైపోతున్నారు. తాము ఆత్మస్వరూపులమనే మాటను వినడానికైనా వారెన్నడూ నోచుకోలేదు. "నీచాతినీచుడిలో కూడా ఆత్మ ఉంది. అది అమృతం, పరమ పవిత్రం, సర్వశక్తిమంతం, సర్వవ్యాపకమైనది" అని వారికి ఆత్మను గురించి చెప్పండి. వారికి ఆత్మవిశ్వాసాన్ని ప్రసాదించండి. ❖

మూలం: శ్రీ రామకృష్ణ ప్రభ - ఫిబ్రవరి 2014

## పింగళి లక్ష్మీకాంతం



# ఆంధ్ర సాహిత్య చరిత్ర

# ఆంధ్ర సాహిత్య చరిత్ర

పింగళి లక్ష్మీకాంతం

విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్
విజ్ఞాన భవన్ 4-1-435 బ్యాంక్ స్ట్రీట్
హైదరాబాద్- 500 001.

# తొలిపలుకు

స్వర్గీయ పింగళి లక్ష్మీకాంతంగారిని తెలుగు సారస్వత ప్రపంచానికి పరిచయము చేయవలసిన పనిలేదు ఉత్తమశ్రేణి కవులుగా, పండితులుగా, ఉపాధ్యాయులుగా వారిది విద్వత్ ప్రపంచములో సమున్నత స్థానము ఆంధ్ర విశ్వవిద్యాలయములో తెలుగు విభాగానికి అధ్యక్షులుగా వారు అనేక సంవత్సరాలు పనిచేసినారు వారి శిష్యులు ఈనాడు తెలుగు దేశములోని అనేక కళాశాలలలో ఉపాధ్యాయులుగా ఉన్నారు ఇంతటి శిష్యగణము గల ఆచార్యులు తక్కువమంది అని చెప్పవలెను

స్వర్గీయ లక్ష్మీకాంతంగారి రచనలలో యీ సాహిత్య చరిత్ర విశిష్టమైనది వారు ఎం.ఏ తరగతి విద్యార్థులకు అనేక సంవత్సరాలు బోధించిన అనుభవముతో యీ సాహిత్య చరిత్ర వ్రాసినారు కాని దురదృష్టవశాత్తు యీ సాహిత్య చరిత్రను తమ జీవితకాలములో పూర్తి చేయలేకపోయినారు అంతేకాదు, ఈ చరిత్ర వారి జీవితకాలములో ముద్రణ కాలేకపోయినది

వారు పరమపదించిన తర్వాత వారి కుమారులు అకాడమీ పక్షాన ఈ గ్రంథము ప్రచురించిన బాగుండునని సూచించగా ఇందుకు అకాడమీ కార్యవర్గము అంగీకరించింది వారు గతించి సంవత్సరము పైగా గడచిపోయినది కాగితము కరువు వలన యీ గ్రంథముద్రణలో కొంత ఆలస్యము జరిగినది ఈనాడు యీ సాహిత్య చరిత్రను ఆంధ్ర పాఠక లోకానికి అర్పించగలుగుచున్నందుకు అకాడమీ సంతసించుచున్నది ఈ అవకాశము కలిగించిన వారి కుమారులకు అకాడమీ పక్షాన అనేక ధన్యవాదాలు.

హైదరాబాదు,
1–8–1974

దేవులపల్లి రామానుజరావు,
కార్యదర్శి

మొదటి ప్రచురణ సందర్భంగా రాసినది

శ్రీ

ఆంధ్ర సాహిత్య చరిత్ర

## కృతి సమర్పణము

కం॥ శ్రీధరునకు నలమే ల్మం
గాధవునకు, శేషశైల నాధునకు, సురా
రాధిత పదాబ్జునకు, తే
జోధవళిత దిఙ్ముఖునకు, సూర్యాత్మునకున్

ఉ॥ బాలిశుఁడైన నాకు, నొకపాటి వివేక మొసంగి, గాలికిన్
తూలెడు నాకు కాలు నిలఁద్రొక్కు కొనందగు దార్ఢ్యమిచ్చి, వా
చాలుఁడనై పొనర్చు నపచార సహస్ర శతాపరాధ సం
క్షాళనచేసి యేలుకొను స్వామికి నియ్యది యంకితమ్మగున్

కం॥ గురుఁడౌ వేంకటకవి, సొం
దరనందము స్వీకరించి ధన్యత యొసఁగెన్
పరమేశ, కుమార వ్యా
కరణము నీకొసఁగి విబుధ గణ్యత గంటిన్

కం॥ ఇది యింకొక కానుక నీ
మృదు పదముల నిడితి స్వీకరింపుము దీనిన్
పదమల కోమల కరుణా
స్పద శుభదాలోకనములఁ బరికింపు ననున్

ఉ॥ పారతదాంధ్రవాఙ్మయ విశాల జగత్పరిణామ కారణో
దార కవీంద్ర కావ్య పురుషార్థ నిరూపిత తత్తదాత్మ సం
స్కార విలోక దర్పణ ముఖమ్మిది, యీ చరితమ్ము సాహితీ
మేరువులౌ బుధోత్తముల మెప్పగడించెను మున్నె నీ కృపన్

గీ॥ ఇది జనించిన నలువదియేండ్లనుండి
సరససాహిత్యవిజ్ఞాన సత్రమనుచు
ఆశ్రయింపని తెలుఁగు విద్యార్థిలేఁడు
చొచ్చి చూడని తెల్గు వ్యాసుండు లేఁడు

- పింగళి లక్ష్మీకాంతం

# ధన్యవాదాలు

మా నాన్నగారు, శ్రీపింగళి లక్ష్మీకాంతంగారు, తమ 'ఆంధ్ర సాహిత్య చరిత్ర' గ్రంథరచన పూర్తికాక మునుపే స్వర్గస్థులయ్యారు (1972) ఆ అసమగ్ర గ్రంథాన్నే ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడెమీవారు ముద్రించారు (1974) ఆ గ్రంథమే చాలాసార్లు పునర్ముద్రింపబడింది

ఈ గ్రంథాన్ని సమగ్రమైన రూపంలో వెలువర్చాలని అనుకున్నాం దీనికై వారు క్లాసులో చెప్పిన పాఠాలననుసరించి వారి ప్రత్యక్షశిష్యులు వ్రాసుకున్న నోట్స్ సంపాదించవలసి వచ్చింది తాము వ్రాసుకున్న నోట్స్‌ని ఉపయోగించుకోవటానికి అనుమతినిచ్చిన వారి శిష్యులు ఆచార్యులు బాలాంత్రపు రజనీకాంతరావు, కొత్తపల్లి వీరభద్రరావు, పోణంగి శ్రీరామ అప్పారావు, భమిడిపాటి భైరవ కృష్ణమూర్తిగారలకు కృతజ్ఞులం

ఆ యా నోట్స్‌లోని విషయాలని తులనాత్మకంగా పరిశీలించి ఈ సమగ్ర గ్రంథాన్ని తయారు చేసినవారు ఆచార్య కోలవెన్ను మలయవాసినిగారు ఆమెకు మేమెంతో ఋణపడి ఉన్నాం ఆమె ఎంతో పూజ్యభావంతో ఈ పనిని చేశారు ఆమెతో సహకరించినవారికి మా ధన్యవాదాలు ఈ కొత్తకూర్పును తయారు చేయటానికి ఆమె అవలంబించిన పద్ధతిని తమ "వినతి"లో వివరించారు

అంతకుపూర్వం, క్రిందటి ముద్రణలోని అచ్చుతప్పులను సరిదిద్దినవారు శ్రీ వాగళ్ళ గురుప్రసాదరావుగారు వారికి మా ధన్యవాదాలు

ఈ కొత్త ఎడిషన్‌ను ప్రచురిస్తున్న విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ వారికి మా ధన్యవాదాలు

పింగళి వేంకటరత్నం

# వినతి

ఆచార్య శ్రీపింగళి లక్ష్మీకాంతంగారి శతజయంత్యుత్సవాలు 1994-1995లో జరిగాయి ఆ సందర్భంలో వారి "ఆంధ్ర సాహిత్య చరిత్ర" పునర్ముద్రణ విషయమై కొందరమాలోచించాం ఈ గ్రంథం ఆచార్యులవారి జీవితకాలంలో ప్రచురింపబడలేదు వారు గతించిన రెండు సంవత్సరాల తరువాత ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడెమీవారు మొట్టమొదటిసారిగా ప్రచురించారు

అప్పటికే ఆంధ్రదేశం నలుచెరగులా వారి నోట్సు వ్రాతప్రతులు వ్యాప్తిలో ఉన్నాయి ఆ వ్రాతప్రతులలోని కొన్ని ముఖ్యమైన అంశాలు అచ్చయిన పుస్తకంలోకి రాలేదు. అంతేగాక, వారి అభిప్రాయాలుగా, శైలిగా ప్రసిద్ధిపొందిన వాక్యాలుకూడ లేవు వీటికి తోడు ముద్రితమైన గ్రంథం "శ్రీకృష్ణదేవరాయల యుగం"తోనే ముగిసింది వీటన్నిటినీ దృష్టిలో పెట్టుకొని "ఆంధ్ర సాహిత్య చరిత్ర"ను సమగ్రంగా, నిర్దుష్టంగా పునర్ముద్రించాలన్న ఆలోచన శ్రీ లక్ష్మీకాంతంగారి కుమారులకు కలిగి ఆ భారాన్ని నన్ను వహించమని కోరారు దానికి నేనంగీకరించాను

ఈ పనికి నేనవలంబించిన పద్ధతిని వివరిస్తాను శ్రీ లక్ష్మీకాంతంగారు క్లాసులో చెప్పిన లెక్చర్ల ఆధారంగా విద్యార్థులు నోట్సు వ్రాసుకునేవారు ఆ నోట్స్‌యొక్క వ్రాతప్రతులు కొన్ని వారి కుమారులు సేకరించి నాకిచ్చారు అవి ఆచార్యులు బాలాంత్రపు రజనీకాంతరావు, కొత్తపల్లి వీరభద్రరావు, పోణంగి శ్రీరామ అప్పారావు విద్యార్థులుగా వ్రాసుకున్నవి వీరంతా శ్రీ లక్ష్మీకాంతంగారి ప్రత్యక్షశిష్యులు అయితే, వీరు యూనివర్సిటీలో సహాధ్యాయులు కారు శ్రీ భమిడిపాటి భైరవకృష్ణమూర్తి మరొక ప్రత్యక్ష శిష్యులు వారు క్లాసులో వ్రాసుకున్న నోట్సును ఆచార్యులు కొర్లపాటి శ్రీరామమూర్తి, వేదుల సుబ్రహ్మణ్యశాస్త్రిగారలు కాపీ చేసుకున్నారు ఈ నోట్సులనుండి నేను వ్రాసుకున్నాను ఈ పైన చెప్పిన ప్రతులనన్నింటినీ నేను సంప్రదించాను

ఈ ఆరు ప్రతులకూ, అచ్చయిన గ్రంథానికీగల వ్యత్యాసాలను గమనించి ఆ యా వ్రాతప్రతులలో అదనంగా ఉన్న విమర్శక వాక్యాలను, అభిప్రాయాలనూ చేర్చి ఒక ప్రతిని తయారుచేశాను. విషయంలో ప్రధానంగా చేసిన మార్పులివి

1. పింగళివారు ఆ యా కవులగురించీ, కావ్యాలగురించీ చెప్పిన విమర్శక వాక్యాలు ఆ యా లిఖిత ప్రతులనుండి తీసి సందర్భానుసారంగా చేర్చాను
2 అచ్చయిన పుస్తకంలో నిడివిగల కథా సంగ్రహాలను తొలగించాను
3. పునరుక్తులనిపించిన పేరాలను తొలగించాను
4 శ్రీనాథుని నైషధాంధ్రీకరణ పద్ధతి – లిఖితప్రతిలో ప్రణాళికాబద్ధంగా, సోదాహరణంగా ఉంది అచ్చు పుస్తకంలోని దానిని పూర్తిగా తొలగించి దాని స్థానంలో వ్రాతప్రతులలోని దానిని కూర్చాను

లిఖిత ప్రతులనుండి కొత్తగా చేర్చినవి ఇవి

1 యుగవిభజన ప్రస్తావన

2 శివకవుల సాధారణ ధర్మములు

3 శివకవి యుగములోని ఇతర కవులు

4 తిక్కన నిర్దేశించిన కవితా లక్షణములు

5 తిక్కన విడిచిన ఘట్టములు

6 తిక్కన యుగ సింహావలోకనము

7 జక్కన అనంతామాత్యుల కవితా తారతమ్యము

8 మడికి సింగన

9 వెన్నెలకంటి సూరన

10 శ్రీకృష్ణదేవరాయల యుగము శ్రీ భమిడిపాటి భైరవకృష్ణమూర్తిగారి వ్రాతప్రతికి, మరిప్రతి వ్రాసిన ఆచార్య వేదుల సుబ్రహ్మణ్యశాస్త్రిగారి ప్రతిని ప్రధానంగా తీసుకొని, తక్కిన వ్రాతప్రతులతో పోల్చి తయారు చేశాను

11 దక్షిణాంధ్రయుగము, క్షీణయుగములకు – ఆచార్య వీరభద్రరావు, ఆచార్య శ్రీరామ అప్పారావుగారల లిఖిత ప్రతులను సంప్రదించి ఆ రెండు యుగాలకూ సంబంధించిన ప్రతిని తయారు చేశాను

ఆధునికయుగము – దీనికి సంబంధించిన నోట్సు లభ్యం కాలేదు ఆ నాటి లక్ష్మీకాంతంగారి శిష్యులెవరివద్దనైనా ఉంటే మరో ముద్రణలోనయినా చేర్చే అవకాశం లభిస్తుందని ఆశిస్తున్నాను ఆచార్య లక్ష్మీకాంతంగారి అభిప్రాయాలుగా, శైలిగా ప్రసిద్ధిపొందిన వాక్యాలను మాత్రమే వీలయినంత వరకూ ఇందులో కూర్చి, ఉన్నంతలో సమగ్రప్రతిని తయారు చేశాను

అసలు శ్రీ లక్ష్మీకాంతంగారు తమ గ్రంధానికి "సవిమర్శ ఆంధ్ర వాఙ్మయ చరిత్ర" అని పేరు పెట్టుకున్నారు కాని గ్రంధాన్ని మొదటిసారిగా ప్రచురించిన ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడెమీ వాళ్ళు పుస్తకం పేరును "ఆంధ్ర సాహిత్య చరిత్ర"గా మార్చేశారు ఈ పేరులోనే ఈ గ్రంధం ప్రాచుర్యంలో ఉండటంవల్ల దానినే ఉంచాను

పైన చెప్పిన వ్రాతప్రతుల పరిశీలనలో చిరంజీవులు డా॥ ఎమ్ విజయశ్రీ, డా॥ ఎ బాలకృష్ణ, శ్రీమతి వి శారద, శ్రీమతి ఎమ్ జ్యోతికుమారి, డా॥ కె మురళీకృష్ణ ఉత్సాహంతో తోడ్పడ్డారు

ఆంధ్రసాహితీలోకం ఈ కృషిని హర్షిస్తుందని ఆశ ఆచార్య పింగళి లక్ష్మీకాంతం గారిని ఈ ప్రతుల రూపంలోనేగాని, ప్రత్యక్షంగా నేనెరుగను సాహిత్యవిద్యార్థినిగా ఆ గురుమూర్తి స్థానీయుని ఋణాన్ని ఈవిధంగా తీర్చుకునే అవకాశం నాకిచ్చిన వారి కుమారులకు నా కృతజ్ఞతాభివందనలు

కోలవెన్ను మలయవాసిని

# విషయసూచిక


| | | |
|---|---|---|
| | తొలిపలుకు (మొదటిముద్రణలో) | III |
| | ధన్యవాదాలు | V |
| | వినతి | VI |
| | ప్రస్తావన | 1 |
| | వాఙ్మయము | 1 |
| | కావ్య పరిశీలనము | 5 |
| | యుగ విభజన | 7 |
| 1. | ప్రాఙ్నన్నయ యుగము<br>కవిత్వావిర్భావము | 10 |
| 2. | నన్నయ యుగము<br>నన్నయ – అధర్వణాచార్యుడు – వేములవాడ భీమకవి | 23 |
| 3. | శివకవి యుగము<br>నన్నెచోడుడు – పండితారాధ్యుడు – పాల్కురికి సోమనాథుడు – శైవశాఖలు | 55 |
| 4. | తిక్కన యుగము<br>గోనబుద్ధారెడ్డి – చక్రపాణి రంగనాథుడు – రంగనాథ రామాయణ కర్తృత్వము – కవిబ్రహ్మ తిక్కనసోమయాజి – తిక్కన సమకాలికులు – కేతన – కాచవిభుడు – విట్ఠలుడు – మంచన – యథావాక్కుల అన్నమయ్య – మారన – బద్దెన – శివదేవయ్య – తిక్కన యుగ సింహావలోకనము | 115 |
| 5. | ఎఱ్ఱన యుగము<br>ఎఱ్ఱన – భాస్కరుడు – నాచన సోముడు – ఎఱ్ఱన సోమనలు – రావిపాటి త్రిపురాంతకుడు | 204 |
| 6. | శ్రీనాథయుగము<br>శ్రీనాథుడు – శ్రీనాథుని జీవితకాలము – పోతన – తిక్కన, పోతన – మడికి సింగన – జక్కన – జక్కన, అనంతామాత్యుడు – గౌరనమంత్రి – దగ్గుపల్లి దుగ్గన – పిల్లలమఱ్ఱి పిన వీరన – దూబగుంట నారాయణకవి – బైచరాజు వేంకటనాథుడు – వెన్నెలకంటి సూరన – పిడుపర్తి సోమన – నంది మల్లయ–ఘంట | 251 |

సింగయ – కొఱవి గోపరాజు – వెన్నెలకంటి అన్నయ్య – శ్రీనాథయుగ సింహావలోకనము

7. శ్రీకృష్ణదేవరాయల యుగము 366
రాయలయుగము–స్వర్ణయుగము – రాయలయుగము నేల ప్రబంధ యుగమున వలెను? – పెద్దన – ముక్కుతిమ్మన – అయ్యలరాజు రామభద్రుడు – ధూర్జటి – మాదయ్యగారి మల్లన – అష్టదిగ్గజ కవులు – శ్రీకృష్ణదేవరాయలు – రాయల సమకాలికులయిన యితర కవులు – చింతలపూడి ఎల్లనార్యుడు – ఎడపాటి ఎఱ్ఱన – సంకుసాల నృసింహకవి – రాయల యుగమున దరువాతి తరమువారు – పింగళి సూరన – రామరాజభూషణుడు – తెనాలి రామలింగడు – చదలువాడ మల్లయ – సారంగుతమ్మయ – కుమార ధూర్జటి – బట్టుపాటి తిరుమలయ్య – కందుకూరి రుద్రయ – పొన్నగంటి తెలగన్న – శంకర కవి – తరిగొప్పు మల్లన – ఎలకూచి బాలసరస్వతి – కుమ్మరి మొల్ల – మాదయ్య – నాదెండ్ల గోపయమంత్రి – దోనేరు కోనేరు కవి – కాకుమాని మూర్తి కవి

8. దక్షిణాంధ్రయుగము 417
నాయక రాజులు – రఘునాథ నాయక్ – చేమకూర వేంకటకవి – కృష్ణాధ్వరి – మధురవాణి – రామభద్రాంబ – విజయరాఘవుడు – రంగాజమ్మ – చల్లాసూరయ్య – కోనేటి దీక్షిత చంద్రుడు – మహారాష్ట్రులు – యక్షగాన స్వరూపము – కూచిపూడివారు – మధురశాఖ – వెలిదండ్ల వేంకటపతి – చొక్కనాథుడు – విజయరంగచొక్కనాథుడు – శేషము వేంకటపతి – తొండమండరు శాఖ – వేమన – పోతులూరి వీరబ్రహ్మము

9. క్షీణ యుగము 435
కంకంటి పాపరాజు – కనుపర్తి అబ్బయామాత్యుడు – కూచిమంచి తిమ్మకవి – కూచిమంచి జగ్గకవి – వక్కలంక వీరభద్రకవి – అడిదము సూరకవి – ధరణిదేవుల రామయమంత్రి – 19వ శతాబ్ది కవులు – దిట్టకవి నారాయణకవి – చిత్రకవి సింగనార్యుడు – కృష్ణదాసు – వేమనారాధ్యుల సంగమేశ్వరకవి – అయ్యలరాజు నారాయణకవి – గట్టుప్రభువు – కృష్ణకవి – ద్వ్యర్థికావ్య కవులు – తరిగొండ వేంకమాంబ – చెళ్లపిళ్ల నరసకవి – మండపాక పార్వతీశ్వరశాస్త్రి

★ ★ ★

# ప్రస్తావన

## వాఙ్మయము:

వాఙ్మయ మనగానేమి? "వాక్" శబ్దమునకు, వికారార్థమున "మయట్" ప్రత్యయము చేర్చిన యీ పదమునకు గల అవయవార్థమును బట్టి విచారించినచో శబ్దకృతములైన రచనలన్నియు లక్ష్యభూతములగును "రచన" అన్నప్పుడు, వ్రాయకపోయినను, నోటితో నుచ్చరించు వాక్యములుఁ గూడ రచనలే అని గ్రహింపవలెను రచన యనగా కూర్పు అని యర్థమేగాని, వ్రాతయనే యర్థములేదు కూర్పు అనగా శబ్దములతోఁ గూర్చిన వాక్య రచన; ఉత్తపాడి శబ్దములు కూర్పు అనిపించుకొనవు. నోటితో ఉచ్చరించిన వాక్యములు రచనలగునా యన్నచో అగును అని యీ క్రింది తిక్కన సోమయాజి కృతపద్యము నిరపవాదమైన నిదర్శనము కాగలదు భీష్ముడు అంపశయ్య మీద పరుండి వృషాకపిస్తవమనుపేర శ్రీ మహావిష్ణువును స్తుతించినప్పుడు తాను భగవంతుని వాఙ్మయాధ్వరార్చితుని జేసి కృతార్థుడనైతినని ఆత్మ తృప్తి కల్గించుకొనెను (వాఙ్మయాధ్వరార్చి) కాని వ్యావహారికముగా రచనయనగా వ్రాసిన భాషకే వర్తించుచున్నది

తే॥ తపమునకు విద్యకును జనుస్థానమైన
జనన రహితుని యజ్ఞాత్ము శౌరి వాఙ్మ
యాధ్వరార్చితుఁ జేసితి నా జనార్ద
నుండు మద్భజనమునఁ బ్రీతుండుగాత. (శాంతిపర్వం)

కావున మానవుడు నోటితో మాటలాడెడి భాషను చేతితో వ్రాసినప్పుడు ఆ వాక్యములు తాల్చెడి స్థిరరూపము వాఙ్మయ శబ్దవాచ్యముగా పరిగణింపబడినది. అయితే మానవుడు వ్రాసిన వ్రాతలన్నియు వాఙ్మయమనిపించుకొనునా యంటే "అవును" అని, వాటిలో వెలిపెట్టతగినది ఏదియు నుండదని హాలం (Hallam) అనే యొక విమర్శకుడు సమాధానము చెప్పెను. ఈ సిద్ధాంతమును నిర్దయముగా ఖండించి (Charles Lamb) పద్య రచనలే వాఙ్మయమగును గాని తక్కినవేవియు ఆ బిరుదుకు తగవని వేరొక సిద్ధాంతము చేసెను వీరిర్వురును అతివాదులని సమబుద్ధుల తీర్పు. వ్రాతలన్నియు వాఙ్మయమే యగుచో మనము నిత్యకృత్యముగా వ్రాసికొను పద్దులు, ఉత్తరాలు మొదలైనవి కూడ వాఙ్మయమేయై మన మందరము వాఙ్మయ కర్తలమే కావలసి వచ్చును అగుట మనకు సంతోషదాయకమేగాని, పరులకు మాత్రము హాస్యాస్పదుల మగుదుము మరి పద్యరచనలే వాఙ్మయమనుకొని, తక్కిన ఛందోరహిత మహారచనలను వెలిపెట్టినచో, ఆ రచయితలకును సారస్వతమునకును అపచారము చేసిన పాపమున పోదుము కావున పై సిద్ధాంతములు రెండును

ఉపాదేయములుగావు. ఇక సమబుద్ధులైన విమర్శకులు, వాఙ్మయ శబ్దార్థములైన రచనలకు కొన్ని లక్షణములను నిర్దేశించి, వాటిలో ఏ యొక్కటియున్నను ఆ రచనను వాఙ్మయముగానే స్వీకరింపవలెనని సిద్ధాంతీకరించిరి వారు నిర్దేశించిన లక్షణములలో ముఖ్యమైనవి రెండు:- అందులో మొదటిది ఆ రచన మనకు విజ్ఞానమును ప్రసాదించునదిగా ఉండవలెననుట. రెండవది విజ్ఞానముతోపాటు భావనాత్మక నిర్వృతిని కల్గింపవలెననుట (Imaginative pleasure) కొన్ని రచనలలో కేవలము విజ్ఞాన బోధయే యుండవచ్చును. కొన్ని ఆనందమును మాత్రమే కల్గించవచ్చును. మరికొన్ని రెండు గుణములును కలవియై యుండవచ్చును ఈ వివరణమును మనసున పెట్టుకొనియే రాజశేఖరుడనెడి ఆలంకారికుడు సారస్వతమును శాస్త్ర సారస్వతము, కావ్య సారస్వతము అని రెండు భాగములు చేసెను ఆ విభజన ప్రకారము మానవుని విజ్ఞాన సంపాదనకును బుద్ధి వికాసమునకును అక్కరకు వచ్చెడి తర్క వ్యాకరణ మీమాంసాది సమస్త శాస్త్రములు మొదటి విభాగమునకును, రామాయణాది కావ్యములు, శాకుంతలాది నాటకములు విజ్ఞానముతోపాటు ఆనందమును గూడ ప్రసాదించెడి రెండవ విభాగమునకును లక్ష్యభూతములగును మరియే విధమైన విజ్ఞానలేశమును కల్గింపలేని పదములు కీర్తనలు మొదలైన చిల్లర రచనలును ఉండవచ్చును గదా! విజ్ఞాన ప్రబోధము లేకున్నను చిత్తసుఖమును కల్గించునేని అవికూడ కావ్యజాతిగానే పరిగణింపబడును ఈ రెండవ విభాగమునే సుప్రసిద్ధ వాఙ్మయ చరిత్రకారులు, తమ చరిత్రకు లక్ష్యముగా గైకొనుట ప్రపంచమున ఆచారమైనది కావ్య వాఙ్మయమును పాశ్చాత్యులు "సాధారణ వాఙ్మయము" (General Literature) అని పేర్కొందురు మరి యే భాషలోనైనను కావ్యేతరములైన గ్రంథములు అసంఖ్యాకములుగా ఉండును గదా! వాటికి జాతివాచక మేమి? అని అడుగుదుమేని వారు చెప్పెడి సమాధానమిది:- శాస్త్రములు అనేకములు గదా! ప్రతిభాషలోను ఏ శాస్త్రమున కాశాస్త్రమే అనేక గ్రంథములుగా రచింపబడియుండును. ఆ గ్రంథములన్నింటిని కలిపి "తచ్ఛాస్త్ర వాఙ్మయము" అని పేరు పెట్టవలెను వ్యాకరణ గ్రంథములన్నియు కలిసి వ్యాకరణ వాఙ్మయముగా, తర్క గ్రంథములన్నియు కలిసి తర్కవాఙ్మయముగా, ధర్మశాస్త్రములన్నియు కలిసి ధర్మశాస్త్ర వాఙ్మయముగా పేర్కొనబడవచ్చును. ఆయా శాస్త్ర శాఖలకు, ఆయా వాఙ్మయముల పేరుమీద చరిత్రలను వ్రాయవచ్చును; నిజమే; కావ్య వాఙ్మయములో మాత్రము అనేక శాఖలుండునుగదా! ఆయా శాఖల పేరుమీద పురాణ వాఙ్మయమని ప్రబంధ వాఙ్మయమని నాటక వాఙ్మయమని వేరువేరుగా అవాంతర వాఙ్మయచరిత్రలు వ్రాయవచ్చును

అయితే ఏది కావ్యము? ఏది కాదు? అనే ప్రశ్నకు నిష్కృష్టమైన నిర్వచనము నొసగుట కష్టమైనపని అందుచే కావ్యశబ్దార్థత కలిగి యుండవలసిన గ్రంథమునకు ముఖ్యముగా మూడు లక్షణము లుండవలెనని పాశ్చాత్య విమర్శకులు సిద్ధాంతీకరించిరి అందు మొదటిది దాని సర్వజనానురంజకత్వము అనగా గ్రంథము నందలి విషయము (Subject Matter) సర్వజనులకు ఆమోదజనకముగా నుండవలెననుట. రెండవది రచన ఆలంకారికముగా (సుందరముగ) నుండుట మూడవది ఆ గ్రంథముయొక్క పఠనమువలనగాని, శ్రవణమువలనగాని భావనాహ్లాదము కలుగుట. దానిపేరే రసానంద

జనకత్వము ఈ మూడు లక్షణములును సమగ్రముగా నున్న గ్రంథము చిన్నదైనను, పెద్దదైనను కావ్యమనిపించుకొనును. ఎందేని ఈ మూడు గుణములలో రెండవదియైన సుందర శాబ్దిక రచన లోపించినను తక్కిన రెండు లక్షణములు మాత్రము విధిగా ఉండి తీరవలయును. ఆ రెండును లేని యెంత సుందర రచనయైనను కావ్యమనిపించుకొనదు. ఈ లక్షణములు శాస్త్రమునకు పట్టవు శాస్త్రములోని విషయము తత్పరిశ్రమ చేయువారికి, చేసిన వారికి, అందు నిష్ణాతులైనవారికి మాత్రమేగాని యెల్లరకును అక్కరకు వచ్చునది కాదు మరి అది భావనాహ్లాద జనకమును గాదు పతంజలి మహాభాష్యము, ఆది శంకరుల ఉపనిషద్భాష్యము, సంస్కృత భాషలో నుత్తమోత్తమమైన సుందరరచనలుగా చెప్పుదురు. కాని ఆ గ్రంథములు వ్యాకరణశాస్త్ర పరిశ్రమ చేయువారికి, వేదాంత శాస్త్రాభ్యాసము చేయువారికి మాత్రమే ప్రయోజనకరముగాని మానవమాత్రుల కెల్లరకును అక్కరకు రావు. మరి తత్పఠనము వేళ కల్గెడి అనుభూతి భావనాహ్లాద మనిపించుకొనదు. అదేగాక శాస్త్రకర్త తనకంటె పూర్వమే – జగత్తున అవిర్భవించి, నిగూఢమైయున్న సత్యములను దర్శించువాడే కాని కొత్తవాటిని సృష్టించువాడు కాడు. కావున అతడు ద్రష్ట కావ్యకర్త స్రష్ట కావ్యకర్త సృష్టికి అపరసృష్టి చేయగల బ్రహ్మ కావ్యము నందలి విషయము శాస్త్ర విషయమువలె లోకమున తత్పూర్వమే అవిర్భవించి నిగూఢమైయున్న వస్తువుకాదు దాని జన్మస్థలమే కవి హృదయక్షేత్రము ఇది నాది అని అతడు చెప్పుకోదగిన స్వంత ధనము. ఒకే ఇతివృత్తమును గైకొని యెవరెన్ని కావ్యములు రచించినను ఆ యన్నింటను ఆయా రచయితలయొక్క ప్రత్యేకత వేరువేరుగా గోచరించుచునే యుండును తన సృష్టి తనదిగా గోచరింపజేయలేని యే రచయితయు కావ్య నిర్మాత కాజాలడు. అతనిదిగా ఇతరులకు గోచరించెడి ఆ పదార్థమునే ఆత్మీయత (Personality) అని విమర్శకులందురు ఆ ఆత్మీయత ముద్రగలవన్నియు కావ్యములు. అవి పౌరుషేయములు (Subjective Writings) ఆ ముద్ర లేనివన్నియు శాస్త్రములు, అవి అపౌరుషేయములు (Objective Writings)

పిండితార్థమేమనగా, సుందరమైన రచనయు సార్వజనీనమైన ప్రయోజనమును కలిగి భావనాత్మకమైన నిర్వృతిని ఇచ్చుచు కర్తయొక్క ఆత్మీయతను స్ఫురింపజేయు గ్రంథము కావ్యము. అట్టి కావ్యముల యొక్క చరిత్రయే సాధారణ వాఙ్మయ చరిత్ర అని అంగీకరింపవలసి యుండును ఇది పరిమితార్థమే అయ్యును అపరిహార్యము వాఙ్మయ స్వరూపమిది.

ఇక వాఙ్మయ చరిత్ర యనగానేమి? ఏ చరిత్రయైనను, తద్విషయభూతమగు, పదార్థముయొక్కగాని, జాతియొక్కగాని, దేశముయొక్కగాని పుట్టుక మొదలు వర్తమానము వరకు జరిగిన ఉత్పత్తి వికాస క్షయాది దశలయొక్క సహేతుకమైన వ్యాఖ్యానము. వాఙ్మయ చరిత్రకు విషయభూతమైనవి గ్రంథములు. కనుక ఈ గ్రంథ సమూహముయొక్క ఉత్పత్తి వికాస క్షయాది దశలను పై సూత్రానుసారము వ్యాఖ్యానించుటయే వాఙ్మయ చరిత్ర వ్రాయుట. పరిపూర్ణ సహాయ సంపత్తి కలిగి వాఙ్మయ చరిత్ర వ్రాయగలిగినచో యది యా జాతియొక్క దేశచరిత్రల కంటే నీతి స్ఫుటంగా దాని యాత్మను బట్టి చూపును ఒక జాతి యొక్క

ఆత్మప్రవృత్తి వాఙ్మయము నందువలె మరెక్కడను ప్రతిబింబింపదు దేశచరిత్రలు ఎంత పెనుగులాడినా కూడా ఆ జాతియొక్క బాహ్యప్రవృత్తినే చెప్పగలవుగాని అంతర ప్రవృత్తిని చెప్పలేవు.

గ్రంథకర్తలేని గ్రంథముండుట అసంభవము గనుకను, గ్రంథకర్త జీవితమునకు గ్రంథమునకును పొరానిపొత్తు ఉండును గనుకను ఈ కర్తలయొక్క జీవిత గాథలను ఇచ్చుట అవశ్యకమే యగును కాని ఆ జీవితగాథలే ప్రధానముగాగల చరిత్రలు కవి జీవితచరిత్ర లనిపించుకొనునుగాని వాఙ్మయచరిత్ర లనిపించుకొనవు కవి జీవిత చరిత్రలో కొంతభాగమే వాఙ్మయ చరిత్రకు అక్కరకు వచ్చును అతని జీవితమునకును, తత్కృత గ్రంథమునకును కారణబద్ధమైన సంబంధమును నిరూపించెడి అంశములు మాత్రమే యిందు గ్రహింపబడును. మరియు అతని కాలమునందలి సాంఘిక, రాజకీయాది దేశ పరిస్థితులు అతని జీవితముమీదను, అతని గ్రంథముమీదను ఏమేని ప్రభావము నెరపినట్లు పొడకట్టినచో వాటి పరిశీలనము, వివరణము జరుగును. అంతేకాదు, మహా ప్రతిభాశాలియైన ఒక కవి తన ప్రభావమునే తత్కాలసంఘముమీద నెరపిన వాడుండును. ఇష్టమున్నను లేకున్నను కాలప్రవాహమున బడి కొట్టుకొని పోవువారు అనేకులుండగా, దానికెదురీది తాముచేరదలచిన ఒడ్డుఎక్కినవారు కొందరుందురు అట్టివారి పురుషకారము చరిత్రగతినే మార్చగల సామర్థ్యము గలది కావున వాఙ్మయచరిత్రలో కేవల గ్రంథనామముల నుదాహరించి వ్యాఖ్యానించుటేగాక తత్కర్తల యొక్క ప్రతిభావిశేషములను, దానికిని దేశకాల పరిస్థితులకునుగల అన్యోన్య సంబంధమును, ఆ సంబంధము కావ్యమున ప్రతిఫలించిన విధమును, ఆ ప్రతిఫలమువలన ఆ రచనకు కల్గిన గుణదోషములను వివరించి వ్యాఖ్యానించుట చరిత్రాశయమై యుండును. ప్రతిభాహీనులైన చిల్లర కవుల విషయములో ఇంత పరిశ్రమ అవసరము కాదు. కాని, ప్రతిభా సంపన్నులైన మహాకవుల విషయములో పడెడు శ్రమ సఫలమై వారి యాత్మీయతా దర్శనమునకు వలసిన కనువెలుగు నొసగును ఇట్టి లక్ష్యములతో చరిత్ర రచనకు ఉపక్రమించెడి చరిత్రకారుడు విధిగా విమర్శకుడై యుండును. కావ్య విమర్శకుశలుడే యథార్థమైన వాఙ్మయ చరిత్రకు పూనుకొనును. అట్టివాడు రాగద్వేష రహితమైన సమబుద్ధియై యుండును కావున వాఙ్మయ చరిత్రకారుడు పాండిత్యము, పరిశీలనము, సమబుద్ధి, నిశితదృష్టి, వ్యాఖ్యాన నైపుణిగలవాడగుచో ఆ చరిత్ర విమర్శనాత్మకమైన చక్కని వచన రచనగాకూడా వెలుగొందును. ప్రపంచ భాషలలో ఉత్తమమైన వాఙ్మయ చరిత్రలన్నియు ఇట్టి గుణములు కలవియేయై యున్నవి. అయితే కావ్య చరిత్రయే వాఙ్మయ చరిత్ర కాదగియున్నను, కావ్యేతరములైన గ్రంథములను అవశ్యకమైనపుడు తడవక తప్పదు. ఎట్లనగా, ఇష్టములేని ఒక సాక్షిని న్యాయ నిర్ణయార్థము న్యాయస్థానమునకు రప్పించినట్లు, ఇందు ప్రవేశార్హతలేని యే కావ్యేతరమునైనను, ఒక సిద్ధాంతము సమర్థించుటకో, వేరొక దానిని నిరాకరించుటకో సాక్ష్యముగా స్వీకరించవలసి వచ్చును మరి స్వదేశచరిత్రయందు ఆ జాతిలో నెల్లరకు ఆస్థ యుండునుగదా! అట్టి సార్వజనీనాదరముగల దేశ చరిత్ర చక్కని శైలిలో రచింపబడినచో, అది వాఙ్మయచరిత్రలో గ్రాహ్యముగునా? అను ప్రశ్నకు సమాధానమిది:— ఆ చారిత్రక గ్రంథములో చక్కని శైలియేగాక రసవత్తగూడ ఉన్నచో

అది కావ్యము అనిపించుకొని వాఙ్మయకోటి కెక్కును సంస్కృతమున హర్షచరిత్రము, విక్రమాంకదేవచరిత్రము అట్టివే తెనుగున కృష్ణరాయవిజయము, రంగరాయవిజయము మొదలగు ప్రబంధములును, పలనాటి వీరచరిత్ర, కాటమరాజుకథ మొదలగు పదములును అట్టివే అయితే చరిత్ర యధార్థ కథనము చారిత్రకేతివృత్తమును గైకొన్న రచయిత రససంపాదనార్థమై కావ్య మర్యాదానుసారముగా. కొన్ని కల్పనలను చేయవలసి వచ్చును అవి ఒక్కొక్క యెడ సత్యకథనమునకు భంగము కల్గింపవచ్చును ఆ గ్రంథమును అసత్య కల్పనా భూయిష్ఠమని ఐతిహాసికులు త్రోసి పుత్తురు. సారస్వతులు దానిని తమదిగా చేరదీసి వాఙ్మయ కులములో చేర్చుకొందురు కావున మంచి శైలి యున్నంత మాత్రమున దేశచరిత్ర గ్రంథములు వాఙ్మయము కాజాలవు అదీగాక చరిత్రలో తనకు నచ్చిన ఏదో ఒక ఘట్టమును ఇతివృత్తముగా గైకొని రసవంతముగా రచించిన గ్రంథకర్త లుందురుగాని దేశచరిత్రనంతను అట్లే వ్రాసిన వారుండరు

## కావ్య పరిశీలనము

వాఙ్మయ చరిత్రకు విషయభూతమైన కావ్యజాలమునంతను సవిమర్శముగా వ్యాఖ్యానింపవలెనన్నచో కావ్యపఠనమునకు సక్రమమైన ఒక పద్ధతి నేర్పరచుకొనవలెను రసాస్వాదనార్థము కావ్యపఠనము చేయుట వేరు చరిత్రార్థము కావ్య పఠనము చేయుటవేరు రసపిపాసువు తన ఇచ్చవచ్చిన కావ్యమును, ఇచ్చవచ్చిన కావ్యభాగములను, ఏ కాలమునాటివైనను చేకొని చదివి ఆనందింపవచ్చును చారిత్రకుడు తన కిష్టమున్నను లేకున్నను కాలానుసరణపద్ధతిని, తులనాత్మక పద్ధతిని కావ్యముల నన్నింటిని పఠించి తీరవలయును.

1. కాలానుసరణ పద్ధతియనగా కావ్యముళను కవుల జీవితకాలాను సారముగా జ్యేష్ఠానుపూర్విగా చదువుట. అనగా వాఙ్మయములో ఆదికవి యొక్క గ్రంథమును తొలుదొల్త చదువుట. తరువాతి కవులవి ఆ వరుసలో ఒకదాని వెంట ఒకటి స్వీకరించుట. ఒక కవి పెక్కు గ్రంథములు రచించియున్నపుడు వాటి రచనాకాలమును బట్టి పూర్వాపరములను నిర్ణయించుకొని ఆ వరుసలోనే చదువుట దీనివలన వాఙ్మయము ఏయే కవుల వశమున ఏయే కాలమున పెంపుచెందినదో ఏయే కాలమున ఏయే కవుల వశమున క్షీణించినదో అట్లే ఏయే కాలమున ఏయే మార్పుల నొందినదో గ్రహించుటకు తగిన యుపపత్తి లభించును మఱియు అనేక గ్రంథములు రచించిన కవుల ప్రతిభా విశేషములు నానాటికి తరిగినవో పెరిగినవో గ్రహించుట సుకరమగును.

2 తులనాత్మక పద్ధతి: సమానేతి వృత్తములుగల కావ్యములను, సమానధర్మముగల కవులను, సమకాలికులైన కవులను పరస్పరము పోల్చి చూచుచు తారతమ్య నిరూపణము చేయవలెను. మఱియు నే కావ్యమేని అనువాదమైనపుడు దానిని మూలముతో పోల్చి, అనువాదకుడు మూలకర్తతో ఎంతవరకు సాటిరాగలడో, ఆ యనువాద మెంతవరకు మూల విధేయమో, ఎంతవరకు స్వతంత్రమో, స్వతంత్రమైనపుడు అనువాదమునకు గుణాధిక్యము గలిగినదో లేదో, పరిశీలనచేసి నిర్దేశింపవలెను గుణభేదము గోచరించిన

అది యాంత్రికకర్త వ్యక్తి వైలక్షణ్యము వలన కలిగెనా లేక యతని జాతి వైలక్షణ్యము వలన గలిగెనా యని విమర్శించుట యిందలి ప్రయోజనము

ఈ పరిశ్రమలో పర్వతశ్రేణిలో శిఖరములవలె గుణౌన్నత్యముచే వెలుగొందు మహాకవులు కొందరు కానవత్తురు. వారినే యుగకర్తలని శకకర్తలని పేర్కొని, వారి పేరుమీద ఈ చరిత్రను విభాగములు చేయవలసి యుండును. చరిత్రను విభజించుట వలన సౌకర్యార్థము – అని సాధారణమైన సమాధానము చెప్పవచ్చును. కాని, అందులో అంతకంటె విశేషమున్నది.

వాఙ్మయమొక జీవనది వంటిది అనది యెంత తరుముకొనిపోయి చూచినను కానరాని, యొక అజ్ఞాతప్రదేశములో సన్నని ధారగ ఉత్పన్నమై యుండును. అపైని కొంతదూరము అది ఇరుకైన కొండ సందులలో పారి, పిమ్మట బయళ్ళలో ప్రవేశించి విశాలమైన ప్రవాహముగా పారుచు సముద్రాభిముఖముగా నడచును.

మధ్యే మార్గమున దానికి కొన్ని ఉపనదులు చేరవచ్చును. దానినుండి కొన్ని శాఖానదులు వెలువడవచ్చును. తీరభూములలో కొన్ని ఘట్టములు తీర్థభూతములగును. అట్టివానిని ప్రతిష్ఠించిన కర్తలెవ్వరో నిష్ఠతో పరించి, భక్తితో విచారించి చారిత్రకముగా చర్చించుటే వాఙ్మయచరిత్ర నిర్మాణము. నదులవలెనే వాఙ్మయముయొక్క పుట్టుకయు పరిశోధనలకు అందని అత్యంత దూరకాలముననే జరుగును నదీ ప్రవాహము కొండలను దాటి జనపదముల ప్రవేశించినప్పుడే సంసేవ్యమైనట్లు, వాఙ్మయముకూడ సాహిత్యభక్తులకు ఉపలభ్యమైన నాటినుండియే సంసేవ్యమగును. వాఙ్మయమునకు తీర్థభూతులైన కొందరు మహాత్ములుందురు వారే యుగకర్తలనియు శకకర్తలనియు వ్యవహరింపబడు మహాకవులు వారు కవి వంశములో కులదీపకుల వంటివారు. ఆ కులదీపకులు ఆ వంశమున ఆది పురుషులే కానక్కరలేదు ఆది మధ్యాంతరములలో ఎచ్చటనైనను ఆవిర్భవించి ఆ వంశమును ఉన్నతికి కొనిపోయిన చాలును. సూర్యవంశమునకు కులదీపకులుగా వెలుగొందిన ఇక్ష్వాకువు, రఘువు మొదలైనవారు ఆ వంశమునకు కూటస్థులుకారు. ఆ వంశ చరిత్రలో ఎప్పుడో ఆవిర్భవించి, తదాదిగా తమ పేరుమీద ఆ వంశమునకు ప్రతిష్ఠను సంపాదించి ఉన్నతికి గొనిపోయిన మహాపురుషులు అట్లే వాఙ్మయ యుగకర్తల విషయముననను, ఎవని పేరుమీద ఒక కాలమున కవి వంశము ప్రతిష్ఠ సంపాదించునో ఎవని నడచిన మార్గమును అర్వాచీనులు శిష్యప్రాయులుగా ననుసరించెదరో, ఎవని అవతారమునకై ఆ కాలమునందలి పూర్వకవుల సాధన తపఃప్రాయమగునో, ఎవడు సూత్రధారుడై, కావ్య సరస్వతిని నూత్నవేషముతో అలంకరించి రంగమున ప్రవేశపెట్టునో, ఎవడు క్షీణదశయందున్న వాఙ్మయమును నూత్న మార్గముదొక్కి శక్తిమంతము చేయునో అతడు యుగకర్త అనిపించుకొనును అతని కాలములో అతడే సాహితీ సింహాసనమున పట్టభద్రుడై యుండును. ఆయా కాలములయందు వాఙ్మయమున శైలిలో, ప్రక్రియలో, వస్తుస్వీకారములో కలిగెడి రూపపరిణామమునకు అతడే కర్తయు కారకుడును అయి యుండును.

# యుగవిభజన

వాఙ్మయచరిత్రమును కొన్ని యుగములుగా విభజించిన కలుగు లాభమెద్ది? వాఙ్మయము జాతియొక్క ఆత్మీయతనే-ఎప్పుడూ వ్యక్తము చేయునది అయినప్పటికి భిన్న భిన్న కాలములలో భిన్న భిన్న రూపాంతరములు పొందును ఈ రూపాంతరమునకు పరజాతీయములగు సంస్కార సంపత్తి (అలీన్ కల్చర్) కారణము అట్లుకాక కొన్ని సమయములందు పరసంపర్క రహితముగా ఈ సరస్వతి స్వయముగానే రూపాంతరము పొందుచుండును. అట్టితరులందు కలుగు పరివర్తనములు బాహ్యప్రవృత్తినేకాక కొంత అంతరప్రవృత్తిని కూడా మార్చుచుండును. ఆత్మీయత మాత్రము మారక ఒక క్రొత్త తొడుగు తీసికొనునని చెప్పనగును ఆయా కాలములందు కలిగిన ఈ రూప పరిణామములకు సోపపత్తికమైన వివరణము ఈ యుగవిభజన వలన కలుగును కనుక ఈ యుగవిభజన చేయునపుడు పూర్వయుగము కంటె ఎక్కడ మార్పు వచ్చినదో అక్కడనే దానికొక హద్దు నిడవలెను యుగ విభాగము సహేతుకముగా (రేషనల్) వుండవలెను. కాని నిర్హేతుకముగా వుండచనదు ఎవరి చిత్తమువచ్చినట్లు వారు (యథేచ్ఛగా) చేయరాదు

ఆ యుగకర్తల పేరుమీద వాఙ్మయ చరిత్రను విభాగము చేయుట సమంజసమైన పద్ధతి. రాజవంశముల పేరులమీదను, దేశ విభాగముల పేరుమీదను, మరికొన్ని ప్రమాణముల మీదను ఈ విభాగములు చేయవచ్చును గాని, మహాకవుల పేరుమీదనే ఆ యుగములను విభజించి పిలుచుట న్యాయము ఆంధ్రకవిత్వము రాజాశ్రయముననే వృద్ధి పొందుట సత్యమయ్యు సాహిత్య చక్రవర్తులగు కవిసార్వభౌములకు మార్గుగా వారికాశ్రయమిచ్చిన ధారుణీశ్వరులను సారస్వత సింహపీఠిక నుంచుట అన్యాయము. ఏ యుగముననైనను ఒకరాజు ప్రశస్తకవి కూడనైనచో ఆ యుగమతని పేర వెలయింపనగును అదియు నాతని కవిగానెంచియే.

అవసరమైనచో ఒక కాలమున సర్వోన్నతుడు అని చెప్పదగిన కవి కానరాక సమస్కంధులు పెక్కురున్నప్పుడు ఆ కాలమునకు ఇంకొకపేరు వాడవచ్చును

దేశ చరిత్రయందువలె ఈ చరిత్రయందును రాజవంశముల పేర్లమీదనే కాలవి భాగములు చేయనేల? ఆ రాజులు పోయిరి, ఆ వంశములును ఏనాడో అస్తమించి పోయినవి. ఇక కవిరాజులు వారి గ్రంథరూపములలో సజీవులై యున్నారు. వీరివి త్రోసిపుచ్చి గతించినవారికై అన్వేషణలు జరుపుట భావ్యముకాదు వారి రాజ్యముల కంటె వీరి రాజ్యములు స్థిరములు, అజరామరములు మఱి ఆంధ్ర వాఙ్మయ చరిత్రను అనువాదయుగము, స్వతంత్రయుగము అనుపేర్లతో కాని, పురాణయుగము, ప్రబంధయుగము అనుపేర్లతోగాని, ఆదికాలము, మధ్యకాలము, ఆధునిక కాలము అనే పేర్లతోగాని పిలుచుటయు సార్థకమైన విభజన కాదు ఏమన, అనువాదయుగమనుకొన్న దానిలో స్వతంత్రములు పుట్టుటయు, పురాణయుగ మనుకొన్న దానిలో ప్రబంధములు పుట్టుటయు కలదు. మరి యీ విభాగములు ఒక్కొక్కటి కొన్ని వందల యేండ్లు సాగవలసివచ్చును అంత దీర్ఘకాలము ఒకే యుగముగా అంగీకరించినచో ఆ కాలములో వచ్చిన ఎన్నో మార్పులు విస్మరింపబడును. అదియు న్యాయముకాదు మరియు

సమగ్రమైన సాధన సామగ్రిగల భాషలలో వాఙ్మయ చరిత్రల విభాగములు అనతికాల పరిమితములై, అల్ప పరిణామములనుకూడ నిర్దేశించుచుండును మనకు అట్టి సాధన సామగ్రి లేదు మన భాషలో పుట్టిన గ్రంథములలో సగము నశించిపోయినవి ఉన్నవాటిలో సగము అచ్చుపడి చేతికందుటలేదు కవుల జీవిత చరిత్రలు లేవు అసలు కొన్ని గ్రంథములకు కవుల పేర్లే తెలియవు కొన్ని పేర్లు వివాదగ్రస్తములు – దేశచరిత్ర సమగ్రమైనది లేదు సాంఘిక మత చరిత్రలు వ్రాయుట మనవారు అసలే ఎరుగరు. ఈ పరిస్థితులలో అదర్శప్రాయమైన వాఙ్మయ చరిత్ర వ్రాయుట సాధ్యముకాదు మన పూర్వులు అముష్మిక చింతచే చరిత్రములు వ్రాయలేదన నొప్పను వారేపని చేసినను కీర్త్యాంశ ఉండకూడ దనుకొనుట ఒక కారణము వారి ఆశయము తమ కావ్యములు అపౌరుషేయములుగా ఉండవలెననియే.

అంధ్రకావ్య పథము తీర్చిన మహాకవి నన్నయభట్టు అని ఆయన భారతము పుట్టినది మొదలు నేటివరకును అంధ్రులెల్లరును అంగీకరించిన చారిత్రకాంశము ఆయనకు పూర్వము అంధ్రభాష లేదా? అంధ్రకవులు లేరా? అంధ్ర కావ్యములు లేవా? అనే ప్రశ్నలను పరిశీలనచేసి ఆ కాలమునకు ప్రాఙ్నన్నయ యుగము అని పేర్కొనుట అచారమైనది కాబట్టి యీ చరిత్ర ప్రాఙ్నన్నయ యుగముతో ప్రారంభమగుచున్నది. అది క్రీ శ 1000 వఱకు

| | | |
|---|---|---|
| 1. ప్రాఙ్నన్నయ యుగము | .శ | 1000 వఱకు |
| 2. నన్నయ యుగము | క్రీ శ. | 1000–1100 వఱకు |
| 3. శివకవి యుగము | క్రీ.శ | 1100–1225 వఱకు |
| 4 తిక్కన యుగము | క్రీ శ | 1225–1320 వఱకు |
| 5 ఎఱ్ఱాప్రగ్గడ యుగము | క్రీ శ | 1320–1400 వఱకు |
| 6. శ్రీనాధుని యుగము | క్రీ.శ | 1400–1500 వఱకు |
| 7. రాయల యుగము | క్రీ శ. | 1500–1600 వఱకు |
| 8 దక్షిణాంధ్ర యుగము లేక నాయకరాజుల యుగము | క్రీ శ | 1600–1775 వఱకు |
| 9 క్షీణ యుగము | క్రీ శ. | 1775–1875 వఱకు |
| 10. అధునిక యుగము | క్రీ.శ | 1875 మొదలు.. |

నన్నయ మొదలు శ్రీనాధుని వరకు కలిపి ఒకటే భాషాంతరీకరణ కాలమనుటకంటె ఈ భాషాంతరీకరణము నందే నన్నయ చేసిన ప్రారంభమెట్టిదో, తిక్కన కలిగించిన పెంపెట్టిదో, ఎఱ్ఱన పెట్టిన వన్నె యెట్టిదో, శ్రీనాధుడు అందమిచ్చిన మార్గాంతర మెట్టిదో స్పష్టముగా గోచరించి వారివారికి గల ప్రత్యేకతలు నిర్ణయింపబడును. వీరందరుకూడా ఒకేవిధమగు భాషాంతరీకర్తలే యనుకొని స్థూలముగా ఒకే వర్గములోనికి చేర్చుట వారి వ్యక్తిత్వమును మరిచిపోవుటయే యగును. అందుచే అట్టి వర్గీకరణము అశాస్త్రీయము వీరందరును వాఙ్మయ విశ్వమున విహరించు ప్రత్యేక దిగ్గంతులు కాని ఒకే కొట్టము నందలి ముసలి ఏనుగులు కారు ప్రబంధయుగము అనుటలో రాయలకాలమునాటి ప్రబంధములకును, దక్షిణాది ప్రబంధములకు చాలా అంతర మున్నదని గ్రహించుట అవశ్యకము నాయక రాజులకాలమున అంధ్రభాషలో ఒక్క

ప్రబంధములేకాక అనేక ప్రక్రియలు వెలసినవి రాయలనాడేకాక తత్పూర్వముగూడా ఎక్కడను మన వాఙ్మయములోలేని రూపములు వచ్చినవి కనుక వారి ప్రత్యేకత విచారింపకపోవుట వారి కన్యాయము చేయుటయే కదా! 1875 వరకు కూడా ప్రబంధములున్నవనుమాట నిజమే కానీ ఈ ప్రబంధములు రాయలనాడు పుట్టిన ప్రబంధములవంటివి కావు వారిలోని తేజస్సు, జీవము వీనిలోలేవు. ఆకాలములో రచనలు దేశములోని సౌభాగ్యము వలెనే కవులలోని శక్తులుకూడా క్షీణించినవి. ఒకే అచ్చున పోసిన బొమ్మలవలె ప్రబంధములో కొంచెమేనియు స్వతంత్ర కవితలేక చర్వితచర్వణయే అనునట్టి రచనలు పుట్టినవి ఆకాలమున అట్లు క్షీణదశ కలుగుటచేతనే అతర్వాతి కాలమున ఒక నూతన చైతన్యమువెలసి ఆధునికము అనుపించుకోదగిన వాఙ్మయము వెలసినది. ఈవిధముగా వానిని రాయలనాటి ప్రబంధముగమున జేర్పక చారిత్రకముగా వాటి ప్రత్యేకత ఉంచుట చాలా అవశ్యకము అందుచేత ఈ విభజనము ఇంతకంటే ఉత్తమము అగునది తోచు పర్యంతము చాల సార్థకమైనది

★ ★ ★

# ప్రాఙ్నన్నయ యుగము (క్రీ.శ. 1000 వరకు)

మనభాషకు తెనుఁగు, తెలుఁగు, ఆంధ్రము అని మూడుపేర్లు కలవు. ఈ మూడింటిలో తెనుఁగు, తెలుఁగు అనునవి రూపాంతరములే గనుక, ఆంధ్రము తెలుఁగు అనునవి మాత్రమే పర్యాయపదములుగా మిగులునని నాయూహ మఱియు ఈ రెంటిలో ఆంధ్రము అనునది మొదట రాజవంశపరముగ, పిమ్మట ఆ రాజవంశముచే పరిపాలింపబడిన దేశపరముగ, ఆపై ఆదేశ ప్రజల భాషాపరముగ ప్రయోగింపబడియుండెను మఱి తెలుఁగు అనునది మొదట ఈ భూఖండమున జీవించిన ప్రజల పరముగ, ఆ పిమ్మట ఆ భూఖండ పరముగ, ఆపై వారి భాషాపరముగ వాడబడియుండెను ఒక జాతి ప్రజలను బట్టియే వారు నివసించు భూభాగమునకు పేరువచ్చును, గాని భూభాగమునుబట్టి ప్రజలకు పేరువచ్చుట చాల అరుదు. ఈ భారతదేశములో తొలినాడు ఇది తెలుఁగు దేశమని ఇది అరవదేశమని నిర్జన ప్రదేశములకు పేర్లులేవు తెలుఁగువారు అరవవారు మొదలైన వారు సంఘజీవనము మొదలిడి పల్లెలు, గ్రామములు నిర్మించుకొని వ్యవసాయము కొఱకు కొంత భూభాగము నాక్రమించుకొని దానిని తమ సొత్తుగా అనుభవించుటకు మొదలిడినప్పుడు వారి యధీనములో నున్న ఆ భూభాగమును దెలుఁగు దేశమని, అరవదేశమని, కన్నడదేశమని పేర్కొనుట అచారమైనది వారు దక్కించుకొన్న భూఖండములు కాలక్రమమున విస్తరించి నంతవరకు అవి వారిపేరుమీదనే చెల్లుచుండును అట్లే కాలవశమున వారి భూమిని ఇతరులు ఆక్రమించుకొని తమ దేశములో కలుపుకోగా ఆ భాగము ఆ విజేతలజాతి పేరుమీదను, మిగిలినదే పరాజితులజాతి పరముగాను పేర్కొనబడును. అంటే ఒక ప్రజ తాము అనుభవించు భూమికి తమ పేరొసంగుట సహజము ఆ భాషకు ఆపేరు వచ్చుట ఆ ప్రజలను బట్టియే! ఇది సర్వసాధారణమైన చారిత్రక ధర్మము దీని ననుసరించియే తెలుఁగు అనునది మొదట ప్రజాపరముగ, ఆపై దేశపరముగ, ఆపై భాషాపరముగ వాడబడి యుండునని నేనూహించితిని. కాగా మేము తెలుఁగువారము అనుకొన్న యొక సంఘప్రజలు మాట్లాడుకొన్న భాషకు వారినిబట్టి తెలుఁగు అనే పేరు వచ్చినది గాని తెలుఁగు భాషను మాట్లాడుటబట్టి వారు తెలుగువారు కాలేదు. వ్యక్తి, భాష అను రెండింటిలో వ్యక్తి తరువాతనే భాష పుట్టుటయు, ఆ వ్యక్తి యే సంఘమునకు జెందినవాడో ఆసంఘము పేరే ఆ భాషకు సంక్రమించుటయు లోకధర్మము ఈ సిద్ధాంతము ఆది కాలమునకు సంబంధించినది యుగములు గడచిన కొలది ఈ

న్యాయము తారుమారై రాజులనుబట్టి దేశమునకు, దేశములనుబట్టి ప్రజలకు క్రొత్త పేర్లు సంక్రమించుచుండును కనుక చరిత్ర నిర్దేశింపలేని ఒక కాలమున ఒక తెలుగు సంఘము తమలో తాము మాటాడుకొన్న భాష తెలుఁగుభాషయైనది అనాడు వారు నివసించిన ఆ కొద్దిపాటి ప్రదేశమే అనాటి తెలుఁగుదేశము కాలక్రమమున ఆ ప్రజల సంఖ్యయు అభూభాగముయొక్క వైశాల్యమును ఆ భాషయొక్క విస్తృతియు పెరిగి నేటి ఆంధ్ర ప్రదేశము, ఆంధ్రజాతి, ఆంధ్రభాషగా పరిణమించినవి. కాబట్టి తెలుగు భాషను మాటాడిన మనజాతి కూటస్థులు అని చెప్పదగిన ఆ చిన్న సంఘము మాటాడుకొన్న భాషలో ఏ సహస్రాంశమో, నేడు మనము వ్యవహరించు భాషలో మిగిలియున్నది గాని అనాటి భాషయే ఈనాటి భాషగాదు అట్లే మన కూటస్థులు నివసించిన భూభాగము నేటి ఆంధ్రప్రదేశములో యే మూలనో ఉండునుగాని నేటి ఆంధ్ర దేశమంతయు అదికాదు

భాషయు, నాగరకతయు సంఖ్యా జీవితమునకు ఫలములు, జాతి సంస్కృతి ఈ రెంటికిని ఫలము ఇవి అన్యోన్యాశ్రయములు. మఱి వాటి పెంపుకూడ క్రమపరిణతమేగాని ఆకస్మికముగాదు. ఈ సూత్రమునుబట్టి తెలుగుభాష యే దశలు గడచి వాఙ్మయ మనిపించుకొనదగిన గ్రంథ రచనకు అనువైన భాషగా పరిణమించినదో విచారింతము.

భాషయొక్క పుట్టుకకును వాఙ్మయముయొక్క పుట్టుకకును సంబంధము లేదు. ఆ రెంటికిని కొన్ని శతాబ్దుల వ్యవధాన ముండును. "తెలుఁగులు" అనిపించుకొన్న ప్రజలు ఏనాడు పుట్టిరో ఆనాడే తెలుఁగుభాషయును పుట్టెను. భాషయే లేనిచో వారి జీవితమే సాగదు. ఒకరినొకరు వరుసలతో పిలుచుకొనుట, తమ పల్లెలకు పేర్లు పెట్టుకొనుట, తాము చేసెడి పనులకు క్రియలు కల్పించుట, తాము తినెడి పదార్థముల రుచులు చెప్పుట, తమ కంటి యెదుట కానవచ్చెడి మూర్త పదార్థములకు పేర్లు కల్పించుట, మొదలగు వాటితో ఆనాటి సంఘజీవితమున కాధారభూతమైన కొంత శబ్దజాలము కర్తృ, కర్మ, క్రియ, విశేషణాది పదములతో రూపము తాల్చి యుండును, ఇదియే ప్రజాభాష. కాలవశమున ఆ ప్రజలు తమకంటె బలసంపన్నులును, నాగరికులును ఐన రాజులచే పరిపాలింపబడవలసిన పరిస్థితి తటస్థించినపుడు ఆ రాజుల భాష వేరుగను, ఈ ప్రజలభాష (Popular language) వేరుగను ఉండును అప్పుడు ప్రజాభాషకు భిన్నముగ ఒక ఆస్థానభాష (Court language) వెలయును ఈరెండునుకాక విద్వద్భాష అనే పేరుతో విద్యా పరిశ్రమోచితమైన వేరొక ప్రాచీన భాష (Classical language) పైరెండింటిని మించి రాజాస్థానముల మీదను విద్వత్పరిషత్తుల మీదను విద్యా సముపార్జనాభిలాషకల ప్రజలమీదను తన ప్రభావము నెఱపుచుండెను. ఇది సాధారణముగా అన్ని దేశములలోను పూర్వకాలమున ప్రవర్తిల్లిన సాంఘిక సంప్రదాయము.

## కవిత్వావిర్భావము

సంఘములో రసార్ద్రహృదయుడైన వ్యక్తి సుఖాత్మకమో దుఃఖాత్మకమో యైన తన ఆవేదనను అవశుడై తనకువచ్చిన కొలదిపాటి శబ్దములతోనే ఒకపాటగ నోట

వ్యక్తము చేయుటయే ఆ ప్రాక్తనభాషలో కవిత్వము అవతరించుట. భాషయొక్క పుట్టుకవలెనే అట్టి కవిత్వము యొక్క పుట్టుకయు ఏ పరిశోధనకును అందని అతిదూరకాలమున జరుగును కవిత్వము రాజ్యములయొక్కయు సభ్యతలయొక్కయు పుట్టుకకుముందే పుట్టును అయితే ఆనాటి పాట గాలిలో పుట్టి గాలిలోనే అడగిపోవు ఆశుకవిత్వమేగాని భావికాలమువారు చదువుకొనుటకు అక్కరకు రాదగిన స్థిరరూపము కలదికాదు లిపి అనెడి సాధనము లేనిదే కవిత్వమునకుగాని, భాషకుగాని అట్టి స్థిరత్వము కలుగదు కావున భాషకును దానితోపాటు ఆ భాషా కవిత్వమునకును అక్షరరహితమైన దశయొకటియు, అక్షరబద్ధమైన దశ యొకటియు రెండు, విధిగా ఏర్పడును లిపి ఏర్పడిన పిమ్మట గూడ వెంటనే అది కావ్యరచనకు అక్కరకు వచ్చునని చెప్పుట సాహసమే యగును ఏమనగా ప్రజాభాష అనునది ఆస్థానభాషగ స్వీకరింపబడి అదియే విద్యా పరిశ్రమకు గూడ తగిన భాషగ పరిణమించినపుడుగాని ఆ లిపిని కవిత్వ రచనకు ఉపయోగింపరు ప్రజలకును, ప్రభువులకును, పండితులకును ఒకేభాష సంసేవ్యమగుట ఈ 20వ శతాబ్దిలోగూడ ప్రపంచమందలి అన్ని దేశములలోను సాధ్యము కాలేదు. లిపి అనునది మొదట పరిపాలనా వ్యవహారములకు వినియోగపడును. రాజులు తమ లెక్కలను, తమ శాసనములను వ్రాయించుకొనుటకు ఆ లిపిని ఉపయోగింతురు పిమ్మట కొంతకాలమునకు ప్రజాభాష, తక్కిన రెండు భాషల సహాయమున పెంపొంది కావ్య రచనకు అనువైన శబ్దసంపన్నతను సేకరించుకొన్నప్పుడు ఆ లిపి ప్రజాసారస్వత సాధనముగ నుపయోగపడును ఈధర్మము ఇంచుమించు లోకములోని అన్ని భాషలకును సాధారణమే

ఆంధ్రుల నాగరక సంఘజీవితము ఏనాడు సుప్రతిష్ఠితమైనదో కనుగొనుటకు ఇంకను చారిత్రక పరిశోధనలు జరుగుచునే యున్నవి సంఘ జీవితము సుప్రతిష్ఠమగు టయే రాజ్యము సప్తాంగములతో పరిపాలింపబడుట ఇప్పటికి తెలియవచ్చినంతవరకు శాతవాహన వంశపు రాజులు (వారు ఆంధ్రులే) ఈ ఆంధ్రభూమిలో పౌరాణిక కాలమునాటి మహారాజులవలె క్రీ.పూ. 2 శతాబ్ది మొదలుకొని క్రీ.శ. 2, 3 శతాబ్దుల వరకు ఇంచుమించు నాలుగైదు వందలయేండ్లు ప్రజాహితముగ సుపరిపాలన చేసిరని తెలియవచ్చినది గదా! వారి కాలములో విద్వద్భాష సంస్కృతము; రాజభాష ప్రాకృతము; ప్రజాభాష – ఆనాటి తెలుఁగువారి శాసనములన్నియు సంస్కృత ప్రాకృతములలోనే యున్నవి ఆ లిపికూడ ఆనాటి సంస్కృత ప్రాకృతభాషల లిపియే. తెలుగును వారు రాజభాషగ స్వీకరింపలేదు కాని తెలుగుప్రజలు తమకువచ్చిన భాషలో పదములు, పాటలు కట్టుకొని పాడుకొనుచు, ఆడుకొనుచు సుఖముగ, సుందరముగ సంఘజీవితమును గడపుకొనుచుండిరి. వారి పాటలుమాత్రము సంస్కృత ప్రాకృతములవలె లిఖిత రూపమును తాల్చలేదు. శాసనములలోని లిపితోనే ఆ పాటలను గూడ వ్రాయగ అవి నశించిపోయినవో లేదా అవి వ్రాయదగినంత ప్రౌఢములు కావని ఉపేక్షింపబడినవో తెలియదు కాని అప్పటికి ప్రచారములోనున్న ప్రాకృత పద్యములను, గాధలుఅనువాటిని గాధాసప్తశతి అను పేర హాలుడు అనే శాతవాహనరాజు సంకలనము చేసెను. ఆ గాధలలో కొన్నిట ఆనాటి ప్రజలు పాడుకొను పాటల ప్రశంస కలదు అవి పొలము పాటలు, పెండ్లి పాటలు,

శృంగార గీతికలు మొదలైన సరసజీవితమునకు సంబంధించినవి ఆ ప్రాకృత గాధలు వ్రాసినవారిలో కొందరైనను ఆంధ్రకవులే అయి యుండవలెను అనగా ఆంధ్రభాషలో కవిత్వము చెప్పిరని కాదు తమ భాష కావ్యరచనా సమర్ధము కాకపోబట్టి విద్వద్భాషయైన సంస్కృతమును, రాజభాషయైన ప్రాకృతమును అభ్యసించి ఆ భాషలలో కవిత్వము చెప్పిన ఆంధ్రకవులు మరి శాతవాహనుల కాలములోనే గుణాఢ్యుడు అనే ఒక ఆంధ్రుడు బృహత్కధ అను పేర ఒక ఉద్గ్రంధమును పైశాచి భాషలో వ్రాసెను పైశాచి భాషకూడ ఒక ప్రాకృత విశేషమే కాని శౌరసేనాదులైన ఇతర ప్రాకృత భాషలకంటె తక్కువ ప్రౌఢత్వము గలది నేటి తెలుగు భాషలో గ్రాంధికము, శిష్టవ్యవహారము, గ్రామ్యము అనే భాషాభేదములలో శిష్టవ్యవహారమువంటిది ప్రాకృతము గ్రామ్యము వంటిది పైశాచి

అప్పటి సంస్కృత ప్రాకృతభాషలతోడి పొత్తువలన ఆంధ్రము సంస్కృత భవములును, ప్రాకృతభవములును అయిన కొన్ని శబ్దములను తనలో కలుపుకొని కొంత విస్తృతిని చెందియుండును ఆ తద్భవములు శాస్త్రానుసారము పండితులు నిష్పన్నము చేసెడివికావు ఆ మూలపదములు వాడుకొనుటలో ప్రజలు ఉచ్చరించిన వర్ణలోప వర్ణాగమాదులైన మార్పులకు లోనై క్రొత్త రూపములో తద్భవములనే పేర అంగీకరింపబడినవి ఆ మార్పులను, వాటివల్ల శబ్దములకు వచ్చిన క్రొత్తరూపములను వ్యాకరించి సూత్రబద్ధముచేసి, వైయాకరణులు తద్భవ శబ్ద నిష్పత్తికి ఒక శాస్త్ర ప్రక్రియ వ్రాసియుందురు. మరియు శాతవాహనుల కాలమున బౌద్ధమతము ఆంధ్రభూమిలో బహుళ ప్రచారమున ఉండెను ఆ రాజులు బ్రాహ్మణులయ్యు వారిలో కొందరు ఆ మతమును ఆదరించిరి; కొందరు అవలంబించిరి; కొందరు తాము వైదికమతావలంబులై యుండియు తమ శుద్ధాంతజనము బౌద్ధమునే ఆశ్రయించుటకు అంగీకరించిరి అమరావతి, విజయపురి ఆ రాజుల రాజధానీ నగరము లగుటయేగాక బౌద్ధమత పీఠస్థానములయ్యెను. ఆ మత ప్రబోధ ప్రచారములు పాళీ భాషలో జరిగెను పాళీభాష అర్ధమాగధి యనబడెడు ఒక ప్రాకృత విశేషము ఆ మతాచార్యుల యొక్క బోధలను వినియు, ఆ మత గ్రంధములను పఠించియు చాలామంది ప్రజలు పాళీభాషా పరిచయము గలవారైరి. వారు ఆ నూతన పదజాలమును వాడుకలో ప్రవేశపెట్టి ఆంధ్రశబ్ద జాలమును మరికొంత విస్తృతపరిచిరి. అరవభాషలో, తత్సమ, తద్భవాత్మకమైన సంస్కృత ప్రాకృత భాషా ప్రభావము ఆంధ్రమున ప్రసరించుటకు చారిత్రకమైన కారణమిదియే! సంస్కృత పాండిత్యము కలిగి ప్రాకృతభాషను ఆస్థానభాషగా స్వీకరించిన ఆంధ్ర శాతవాహనులు చిరకాలము ప్రజాపరిపాలకులగుటయు, వారి రాజధానీ నగరమును కేంద్రముగా జేసికొని బౌద్ధులు పాళీ భాషలో మత ప్రచారము చేయుటయు ప్రజలు మతముద్వారా సంక్రమించిన పాళీపదములను, ప్రభుత్వము ద్వారా సంక్రమించిన ప్రాకృత పదములను తమ తాతలనాటి తెలుగుతోపాటు కలిపి వాడుకొనుటయు ఆ కార్యకారణ పరంపర శాతవాహనుల రాజ్యము తూర్పు సముద్రమునుండి పశ్చిమ సముద్రము వరకును దక్కను పీఠభూమిని ఆక్రమించి యుండెను ఒకప్పుడు ఉత్తరమున మాళవా మొదలగు దేశములను గూడ ఆక్రమించినను, దక్షిణమున వ్యాప్తి చెందినట్లు లేదు ఆ రాజ్యపుగడి దేశపు ప్రజలు

(Frontier area) సమీపదేశములకు సరిహద్దు భూములలో ఉండుటచేత ఆ సమీపదేశ ప్రజల భాషాపదములను తమ తెలుగుతో పాటు వాడుకొనుటకూడ సంభావ్యమే కావుననే ఆంధ్రులైయుండి, ఆంధ్రరాజులచేత పాలింపబడు గడి దేశప్రజలు తమకు సరిహద్దు భూముల భాషలైన అరవము, కన్నడము, మరాఠి భాషా పదములను తమవిగా వాడుకొనుటయు న్యాయమే. కనుకనే నేటికిని చిత్తూరు ప్రాంతమువారు తెనుగుతోపాటు అరవమును, అనంతపురమువారు తెనుగుతోపాటు కన్నడమును, రాయచూరు ప్రాంతమువారు తెనుగుతోపాటు మహారాష్ట్రమును, బరంపురమువారు తెనుగుతోపాటు ఓఢ్రమును మాటలాడ నేర్చియుండుటయు, వారి సంభాషణలలో ఆయా భాషా పదములు ప్రయోగించుకొనుటయు జరుగుచున్నది కేంద్రములో జరుగుచుండిన భాషా పరివర్తనము గడి ప్రదేశములకు త్వరగా వ్యాపించి యుండదు. ఆ కాలమున ప్రాకృతపదములు తెలుఁగులోనికి చొచ్చినట్లే పెక్కు తెలుగుపదములు ప్రాకృతములోను చొచ్చియుండును రెండు భిన్నభాషలు పొత్తునకో పోరాటమునకో తారసిల్లి చిరకాలము ఏకత్ర మెలగుట తటస్థించినపుడు పరస్పర శబ్ద వినిమయము తప్పదు ఇట్టి కార్య ప్రతికార్యములు (Action and Reaction) భాషలలోనేగాక ఆచార వ్యవహారములలో కూడ కలుగుచుండును.

శాతవాహనులు తెలుగును రాజభాషగా స్వీకరింపలేదనుటకు నిదర్శనము వారి శాసనములన్నియు ప్రాకృతములో నుండుటయే. రాజ్యపరిపాలనా వ్యవహారములందైనను తెనుగు వాడబడియున్నచో అది యే మాత్రమేని శాసనములకెక్కి యుండెడిదే ఒకటి రెండు శతాబ్దుల పిమ్మట నేడు రాయలసీమ అని పిలువబడెడి భూభాగమును రేనాటిచోడులు అనుపేర బరగెడి ఒక చోడవంశశాఖ పరిపాలించుచుండెను వారు వేయించిన శాసనములలో తెనుఁగుభాష వాడబడినది వారి ఆస్థానభాష గూడ తెలుఁగే అయియుండవలెను. తెలుగు ఆస్థానభాషయైనను కాకున్నను వారికిని విద్వద్భాష సంస్కృతమే యై యుండును. ఏమనగా మొన్నమొన్నటివరకు – నేటికికూడ – సంస్కృతమే భారతదేశమున విద్వద్భాషగా నడుచుచున్నది మతగ్రంథముల సంగతి అటుండగా ఇతర శాస్త్ర గ్రంథములు పురాణేతిహాస కావ్య నాటకాదులైన ఉదాత్త సాహిత్యమంతయు ఆ భాషలోనే నిక్షిప్తమై యుండుటచేత విద్వాంసులు కాదలచినవారు ఆ భాషనే సేవింపక తప్పదు. దేశభాష, రాజభాషగ, సాహిత్యభాషగ పెంపు చెందినను విద్వద్భాషగ సంస్కృతమును త్రోసిపుచ్చజాలదు ఆ కార్యము ఇప్పటికిని జరుగలేదు. మన దేశములో వలెనే ఇంగ్లాండులో కూడా "చాసర్" నకు పూర్వము "లాటిన్" భాష విద్వద్భాషగా నార్మన్–ఫ్రెంచిభాష రాజభాషగా, "ఆంగ్లోశాగ్జన్" ప్రజాభాషగా కొంతకాలము వ్యవహారము సాగెను రెండు శతాబ్దులకాలము ప్రజాభాషయైన "ఆంగ్లో శాగ్జన్" తక్కిన రెండింటి పొత్తున సత్తువ చేకూర్చుకొని, రాజభాషతో పెనుగులాడి ఓడించి ఆగద్దె తానెక్కెను కాని "లాటిన్" భాషను విద్వద్భాషగానే శిరసావహించి సేవించెను. ఆంగ్లము ప్రపంచ విఖ్యాతి గడించిన తరువాత ఈ శతాబ్దిలో తానే విద్వద్భాషయు నయ్యెను నార్మన్–ఫ్రెంచి రాజభాషగా ఉన్నప్పటి ఆంగ్లో శాగ్జన్ రచనలు మన శాసనాలలోని తెలుగువలె ఉండును అది ప్రాత ఆంగ్లము. భారతీయ భాషల చరిత్రయు అట్టిదే! శాతవాహనుల పిమ్మట

మూడు నాల్గు శతాబ్దులకు చాళుక్యరాజులు మధ్యాంధ్ర దేశమును పరిపాలింప దొడగినది మొదలు (7వ శతాబ్ది ప్రారంభము)-శాసనములలో సంస్కృతముతోపాటు తెలుగు విరివిగా ఉపయోగింపబడినట్లు పొడకట్టును. భాషాచారిత్రక ప్రాధాన్యముగల వాటిలో జయసింహ వల్లభుని కాలమునాటి విప్పర్తి శాసనము మొదటిది (క్రీ శ. 633). మఱికొన్ని నాళ్ళకు మంగి దొగరాజు కాలమున వేయబడిన లక్ష్మీపుర శాసనము రెండవది. ఆపై మఱి 50 ఏండ్లకు వేయబడిన (క్రీ శ. 727). అహదనకర శాసనము మూడవది. పైని పేర్కొన్న శాసనములను పరిశీలించి చూచినవారు ఇవి పూర్తిగా తెలుగు శాసనములు కావనియు ప్రాకృతభాషా ప్రభావమునకు వశమైన తెనుఁగు వాక్యములు కలిపి వ్రాయబడిన శాసనములనియు నిర్ణయించిరి అవి తెలుగు శాసనములే యైనను ఆ తెలుఁగు ఇప్పుడు మనకు అర్థము కాదగిన తెలుఁగు కాదు. ఆ శాసనములు పుట్టిన నాటికిని నేటికి ఎంతకాల వ్యవధానమున్నదో ఆ భాషకును నేటి మన భాషకును అంత వ్యవధానమున్నది అహదనకర శాసనము పిమ్మట సుమారు 125 సంవత్సరములకు నేటి తెలుఁగువారికి ఎక్కువ భాగము బోధపడదగిన భాషలో అద్దంకిశాసనము వెలువడినది ఇది చాళుక్యరాజైన గుణగ విజయాదిత్యుని కాలమునాటిది (క్రీ శ 850 ప్రాంతమున) ఈ శాసనము పూర్వ శాసనములవలె వచన రూపమునగాక పద్యరూపమున నున్నది అది తరువోజ. ఆ పద్యము శుద్ధదేశిచ్ఛందస్సు పూర్వకాలపు తాళప్రధానములైన తెనుగు పాటలనియు ఛందశ్శాస్త్రానుసారముగ గణబద్ధము చేసినచో తరువోజ, రగడ, ద్విపద మొదలైన జాత్యుపజాతి పద్యములుగ రూపొందును. పాట తాళానుగుణముగ నుండుటకై కొన్ని అక్షరములకు శబ్ద స్వరూప విరుద్ధముగ కలుగు దీర్ఘాదులు పాటను ఛందోగణానుసారముగ మార్చునపుడు లోపించిపోవుట తప్ప పాటలకును తరువోజాది పద్యములకును వేరు భేదముండదు శాసనములలో కానవచ్చిన మొదటి తెలుగు పద్యము ఈ అద్దంకి శాసన తరువోజయే! అప్పటికి 2 శతాబ్దుల పూర్వము తప్పటడుగులు వేయ ప్రారంభించిన తెలుగుభాష 9వ శతాబ్ది మధ్యకాలమునాటికి నిలద్రొక్కుకొని సంస్కృత ప్రాకృతములను జీర్ణించుకొని పుష్టి చెంది స్వతంత్ర స్థితికి వచ్చినదని చెప్పవచ్చును ఆ గుణగ విజయాదిత్యుని కాలముననే వెలసిన ఇంకొక పద్యశాసనము ధర్మవర శాసనము అందు గుణగ విజయాదిత్యుని సేనాధిపతియైన పండరంగని ప్రశంస కలదు. ఈ వరుసలో మూడవది గుణగ విజయాదిత్యుని తమ్ముడైన యుద్ధమల్లుని బెజవాడ శాసనము ఈ శాసనము మధ్యాక్కరలో నున్నది మొదటి అద్దంకి శాసనమువలెనే తరువాతి రెండు శాసనములలోనుగల పద్యములు దేశీయ ఛందస్సున ఉన్నవే. ఈ మూడు శాసనములును కొంతకు కొంతమనది అని చెప్పుకోదగిన తెనుఁగు భాష కలవి దైనందిన వ్యవహారములో మాత్రమే ఉపయోగపడుచు, ఆశువుగ పుట్టిన పాటలు, పదాలు, గాలిలో కలిసి పోవుచుండ, నిలుపుకొనదగిన శక్తిలేక నిర్విణ్ణమై వెచ్చనూర్చుచుకాలము పుచ్చుచుండిన తెనుగు, చాళుక్యరాజుల ఆదరముచే – అందును గుణగ విజయాదిత్యుని చేయూతచే – పద్యరూపము దాల్చి ఆ నాటి తెలుగువారికి కనువిందొనర్చినది.

పైని ఉదహరించిన అరు శాసనములలో మొదటి మూడును ఒకవర్గముగా రెండవ

మూడును ఇంకొక వర్గముగా గ్రహించుట లెస్స ఏమన రెండింటికిని నడుమ సుమారు 125 సంవత్సరముల వ్యవధానముండెను ఆ వ్యవధిలో తెలుఁగునకును సంస్కృత ప్రాకృతములకును జరిగిన సంఘర్షణలో కార్య ప్రతికార్యవశమున చేకూరిన బలముతో తెలుఁగు రాజభాషగా నెలకొని, స్వతంత్ర స్థితికి వచ్చెను

రేనాటి చోడుల శాసనములలో కానవచ్చెడి భాష తెలుగేయైనను అది మన తెలుగుగాదు. మన భాషా ప్రాచీనతను కొనియాడుకొనుటలో నిదర్శనముగా చూపుకొనుటకు అక్కరకు వచ్చు మాటలు మాత్రమే అందు కలవు ఇక చాళుక్య శాసనములలోని భాష–వర్ణక్రమాది వ్యత్యాసములు, లిపి భేదములు ఉన్నను – నేటి తెలుఁగునకు కూటస్థ భాషగా చెప్పకొనదగిన సుపరిష్కృత భాష

పైని పేర్కొన్న రెండవ వర్గపు శాసనములు మాత్రాగణబద్ధములైన దేశీయ ఛ్ఛందోరీతులై యుండగ మఱి ఆ పై ఒక నూరేండ్లలో సంస్కృతము నందువలె అక్షర గుణబద్ధములైన వృత్తములు కూడ శాసనములలో వ్రాయబడినవి సంస్కృతమునుండి తెలుగు కవులు అవలంబించిన వృత్తములలో మత్తేభ శార్దూలములు యథాతథముగానే తెనుగున వ్రాయబడినవి. చంపకోత్పలముల పద్ధతి సాంస్కృతికమే యైనను గణపరి సంఖ్యానములో కొంత భేదమున్నది. ఈ మార్పు కన్నడములోనే తటస్థించెనట తెలుగువారును దానినే అనుకరించియుందురు నన్నయకు పూర్వమే ఈ సంస్కృత వృత్తములు తెలుగు శాసనములకు ఎక్కెను క్రీ.శ 10 వందల ప్రాంతమున పుట్టిన విరియాల కామసాని శాసనము అను దానిలో ఈ చంపకోత్పలమాలలు కలవు

నన్నయకు పూర్వమే ఆంధ్రమున మాత్రాగణబద్ధములును అక్షరగణబద్ధములును అయిన పద్యములు తెనుగున విరివిగా వ్రాయబడుచుండెననుటకు ప్రత్యక్ష ప్రమాణముగ ఈ శాసనములు ఉదాహరింపబడినవి. విడివిడి పద్యములే కాక అనాడు శాసన పద్య కవిత్వము వంటి కవిత్వములో గ్రంథ రచన కూడ సాగుచుండెనని తలంచుటకు తగిన అనుమాన ప్రమాణములు గూడ ఉన్నవి అరవమున "యాప్పిరంగన్" అను ఒక ఛందశ్శాస్త్రములో (ఇది నన్నయకు పూర్వకాలము నాటిది) ఆ గ్రంథకర్త తాను వాంఛయ్య అను ఒక తెలుగు లక్షణవేత్త రచించిన గ్రంథమును చూచినట్లు ఈ క్రింది వాక్యములో చెప్పకొనెనట. "వాంఛియార్ సేయిదవడగు ఛందపుం" అనగా వాంఛయ్య చేసిన వడగు భాషయొక్క ఛందము అని అర్థము, వడగు అనగా తెనుగు. ఆ గ్రంథకర్త నాటికి తెనుగులో వాంఛయ్య వ్రాసిన ఛందో గ్రంథమున్నట్లు ఊహించుటకు నిర్బాధకమైన అవకాశమున్నది వాంఛయ్య వ్రాసిన ఛందో గ్రంథము సంస్కృత ప్రాకృత పద్యములకు మాత్రమేగాక తెలుగు పద్యములకు గూడ లక్షణము గలది యగుచో అనాటికి తెలుగు గ్రంథములు దేశిచ్ఛందములో చాల వెలసియుండవలెను. బహు సంఖ్యాకములైన లక్ష్యములు పుట్టిన పిమ్మటనే లక్షణము పుట్టుట సారస్వత ధర్మము లక్షణము తరువాత లక్ష్యము లెప్పడును పుట్టవు మఱియు ఒకటి రెండు లక్ష్యములు మాత్రమే యున్నపుడు వాటిని ఆధారము చేసికొని లక్షణ కర్త శాస్త్రమును వ్రాయడు కనుక వాంఛయ్య నాటికి పెక్కు తెలుగు గ్రంథములు ఉండి యుండవలెను అదిగాక పాల్కురికి సోమనాథుడు పండితారాధ్య చరిత్రావతారికలో "అనియతగణైః యతిర్వా ప్రాసోవా" అని మాత్రాగణబద్ధములైన

పద్యముల గుఱించి ఒక లక్షణ వాక్యమును ఉదాహరించెను *

జాతులు మాత్రాను సంధాన గణవి
నీతులుగాగ 'అనియతగణై'ర
నియును 'ప్రాసోవా' యనియు 'యతిర్వా'యు
నియుఁజెప్ప ఛందోవినిహితోక్తిగాన
ప్రాసమైనను యతిపై వడియైన
దేసిగా నిలిపిన యది ప్రాసనియతి
తప్పకుండగ ద్విపదలు రచియింతు.

ఆ పద్యములకు యతిగాని ప్రాసయతిగాని చెల్లుచుండుననియు అది శాస్త్ర సమ్మతమనియు అర్థము. అట్టి యతి చెల్లుచుండునవియే నేటి మన ఉపజాతి పద్యములు సోమన ఉదాహరించిన ఈ లక్షణవాక్యము తెలుఁగు కవిత్వమునకు సంబంధించిన యొక ఛందశ్శాస్త్రములోనిదై యుండును ఆ శాస్త్రము గూడ తెనుగున శాస్త్రబద్ధము చేయదగినంత కవిత్వము విస్తరించియున్న కాలముననే పుట్టియుండ వలెను. కాగా శాస్త్రములకు లక్ష్యములు కాదగిన గ్రంధములు పెక్కు వెలసియున్నవన్నమాట కాబట్టి ప్రాఙ్నన్నయ యుగములో తెనుగున పామరభాషలో ప్రజలు పాడుకొను పదములు, పాటలు మాత్రమేకాక ఛందోబద్ధమైన దేశీయ పద్యములును విరివిగ నుండెననియు పద్యమయములైన గ్రంధములును కొన్ని రచింపబడి యుండుననియు ఆ గ్రంధముల ననుసరించి లక్షణ గ్రంధములు పుట్టియుండుననియు నిర్ధారణ చేయుట సహేతుకమే కాని నిరాధారముకాదు భాషకు ఈ మహోపకారమంతయు చాళుక్య రాజుల సేవ వలన కలిగినది. అంతకు పూర్వము మార్గకవిత్వ మనిపించు కొనెడి సంస్కృత ప్రాకృత గ్రంధములను చదువుకొనుచుండిన ఆంధ్రులు చాళుక్య రాజులు పుట్టించిన దేశీయ కవితలను చదువుకొని ఆనందింపదొడగిరి

శాతవాహనులకును చాళుక్యులకును మధ్య కాలములో మన దేశమును చాలమంది ఆంధ్రేతర రాజులు పరిపాలించిరి, వారిలో పశ్చిమ చాళుక్యులు ముఖ్యులు తూర్పు చాళుక్యులును వారి దాయాదులే నిజమునకు వీరును ఆంధ్రేతరులే అయినను ఆంధ్రభూమిని తమ స్వదేశముగ నభిమానించి ఆంధ్రభాషను రాజభాషగ మాతృభాషగ కూడ మన్నించి ఆంధ్రమునకు, ఆంధ్రప్రజలకు మహోపకారము చేసిరి. పశ్చిమ చాళుక్యుల కాలములో కన్నడము రాజభాష అయ్యెను. దేశ భాషాభిమానము గల సంస్కృత విద్వాంసులు కూడ రాజాదరము కొఱకో, గ్రంధ రచన కుతూహలము చేతనో, ఆ కన్నడమునే అభ్యసించి కన్నడ పండితులైరి అనాడు ఆంధ్ర కన్నడములకు చెప్పఁకోదగినంత ఎడము లేదు. ఆ రెంటిలో ఒక భాషలో ప్రవేశమున్నవారు రెండవ దానిని సులువుగా అభ్యాసము చేయగలిగి యుండిరి అయినను ఆంధ్రముకంటె కన్నడమే ఒకటి, రెండు శతాబ్దులకు పూర్వము

* (ఈ శాసనములన్నియు నేను పరిశీలనము చేసినవి కావు చరిత్ర పరిశోధకులు సంపాదించి, చదివి, అర్థనిర్ణయము చేసి ప్రకటించి ఆంధ్రులకు అర్పింపగా అందరివలె నేను ఆ ఉమ్మడి సొత్తును కొంత ఉపయోగించుకొంటిని.)

సాహిత్య భాషగా పరిణతి చెందియుండుటచేత సోదర భాషయైన దానిని ఆంధ్రులు పఠింపసాగిరి.

ఆంగ్లేయులు కూడ తమ స్వభాషయైన "ఆంగ్లో శాగ్జన్" ఆంగ్లభాషగ స్థిరరూపము తాల్చకముందు సాహిత్య భాషగ ఫ్రెంచి భాషను అభ్యసించుచుండెడివారు ఆదికాలమునాటి ఆంగ్ల గ్రంథములు కొన్ని ఫ్రెంచి గ్రంథములకు అనువాదములును, అనుకరణములును అగుట తటస్థించెను అన్యభాషా పరిచయము వలన స్వభాషకు శబ్దజాలములోనే గాక కవుల మనోభావ సంపదలోకూడ ఉన్నతి కలుగుచున్నప్పుడు దాని నరికట్టుటకు భాషాభ్యుదయము కోరెడి విద్వాంసులెవ్వరును తలపెట్టరు. కావున వివేకవంతులైన ప్రాచీనాంధ్రులు సంస్కృత ప్రాకృతములనేకాక కన్నడమును కూడ అలవరచుకొని బహుభాషాపాండిత్యము సంపాదించుకొని యుందురు పంపడు, రన్నడు మొదలైన వేగినాటి కవులు కన్నడ భాషలో గ్రంథములు వ్రాయుటకు అది ఒక కారణము. ఆ కాలమున తెనుఁగు భాషకు మిక్కిలి పుష్టి చేకూర్చిన భాషలలో సంస్కృతము మొదటిది. తత్సమతద్భవ రూపమున సంస్కృత పదజాలము తెలుఁగున ప్రవేశించి దేశ్యపదములతోపాటు తెనుగు దనమును తాల్చి ఆంధ్రభాషయు సంస్కృత భాషవలె ఉద్గ్రంథ రచనకు ఉచితమైన ద్రవ్యముగా ఫలింపజేసెను. ఒక్క శబ్దజాలములోనేకాదు, ప్రజల మనోభావ పరంపరలో కూడ సంస్కృత భాష కలిగించిన పెంపు ఎంతో యున్నది చిరకాల సముపార్జితమైన భారతీయ విజ్ఞానమునకు నిధానమైన సంస్కృతభాష నభ్యసించుట చేతనే ఒక్క తెలుగువారేకాక ఇతర ప్రాంతీయ ప్రజలును ఆదిభౌతిక, ఆధ్యాత్మిక శాస్త్ర ధర్మములను మర్మములను గ్రహించి తత్తద్భావానుగుణమైన ఆలోచనలతో మనోమయ, విజ్ఞానమయ, ఆనందమయ కోశములను వికసింప జేసికొనిరి. అన్నమయ ప్రాణమయ కోశములను అతిక్రమించి మానవుని ఆలోచన మనోమయకోశమును ప్రవేశించినప్పుడే పశుత్వము నశించి బుద్ధిజీవి యగుట తటస్థించును. ఆపై విజ్ఞానమయ, ఆనందమయకోశములు వికసించుటయే సంస్కృతిగల మానవుడగుట. అట్టి సంస్కారమును భారతీయులెల్లరకు ప్రసాదించిన భాష గనుకనే సంస్కృతము భరతఖండము నందలి ఎల్లభాషలకు తల్లిభాష అయ్యెను. సంస్కృతమునుండియే ఎల్ల భాషలు పుట్టినవి అనెడి పూర్వభాషావేత్తల అభిప్రాయము తప్పైనను ఆ భాషల కన్నిటికి అత్యుత్తమ సంస్కృతిమయమైన భావపరంపరను ప్రసాదించిన తల్లి భాష యనుట ఒప్పేయగును ఒక ఉదాహరణము చూడుడు. మానవ శరీరములో బహిరంతరాయవములగు ముక్కు, చెవి, కాలు, చేయి, పొట్ట, వీపు, కందనగాయ మొదలైన అచ్చ తెనుఁగు పదములు సంస్కృత పదముల ఆవశ్యకము లేకయే గ్రంథముల యందును వ్యవహారమునందును .వాడుకొనవచ్చును. సంస్కృత మెరుగని ప్రాచీనాంధ్రులు వాటినే వాడుకొనిరి అట్లే తోలు, నల్ల, ఎరచి, ఎముక, మూలగ అనే దేశ్యపదములు వరుసగ రక్తము, మాంసము, అస్థి, మజ్జ అనెడి తత్సమ పదముల ఆవశ్యకము లేకుండగనే తెలుఁగు వారి వ్యవహారమున చెల్లు చుండదగును. కాని వాటికి పర్యాయపదములైన తత్సమములను గూడ స్వీకరించుటచేత తెలుఁగు శబ్దజాలము ఒకటికి రెండు రెట్లయ్యెను దానిని స్వీకరించి భాషను పెంపొందించుకొనుటకు మన పూర్వులు వెనుదీయలేదు. అదీగాక పైని చెప్పిన

పదములన్నియు, మూర్త పదార్థములకు సంబంధించినవి. ఏ జాతిలోనైనను ఏ విధమైన నాగరకతయు లేని ప్రాక్తన మానవులు సైతము ప్రకృతిలో దృశ్యమానమగు మూర్త పదార్థములకు తమ తమ బుద్ధికి తగినట్లు శబ్దములు కల్పించుకొనుటకు సమర్థులయ్యే ఉందురు. అట్లుకానిచో వారి నిత్యజీవితమే సాగదు. అమూర్త పదార్థములకు శబ్దములు కల్పించుట వారికి దుర్ఘటమైన కార్యము తెలుగులో బుద్ధి, చిత్తము, అహంకారము, ఆత్మ మొదలైన అమూర్త పదార్థములకు ఆనాడుగాని, నేడుగాని దేశీయ పదములున్నట్లు నేనెరుగను అట్టి పదములును వాటికి అనుషంగికములైన ఆలోచనలును సంస్కృతము నుండియే మనకు సంక్రమించి ఆంధ్రభాషను సుసంపన్నమైన భాషలలో ఒకటిగా తీర్చి దిద్దగలిగెను కావున సంస్కృతము తెలుగును అణచివేసి తానే రాజ్యమేలుకొనజొచ్చెనని వాపోవుట తగనిపని. అయితే తత్సమ, తద్భవ, దేశ్యములలో ఏది ఎక్కడ ప్రయోగించి వాక్యమునకు, శైలికి వన్నె చేకూర్చవలెనో తెలియక తెలుగు మాటలతో పొత్తు కలియని అప్రసిద్ధ, నైఘంటిక, సంస్కృత పదప్రయోగముతో తెలుగు రచనలు చేయువారు తెలుగు భాషకే గాక తెలుగు ప్రజలకును అపచారము చేసినవారే అగుదురు. మన పూర్వకవులలో ఏ ఒకరిద్దరో తప్ప అట్టి దుష్కార్యమును చేసిన కవులు లేరు

తెలుగు ద్రావిడ భాషా వర్గములోనిదే యని చరమ సిద్ధాంతము చేయబడినది. ఇది సంస్కృత భవమనెడి వాదము శాస్త్రీయముగ నిలువదు. ఆర్యభాషా స్వభావమునకు భిన్నములును, ద్రావిడ భాషా కుటుంబమునకు సాధారణములును అయిన లక్షణములు మన భాషలో చాలా కలవు పుట్టుకను గూర్చి ఇది ద్రావిడభాషయే అని అంగీకరింపక తప్పదు పోషణలో మాత్రము తెలుగునకు సంస్కృతోపకారమే ఎక్కువ కలిగినది. మన భాష సర్వసంపన్న మగుట సంస్కృత శిక్షలో పెరుగుటవలననే! సహజముగ ద్రావిడ లక్షణములను బట్టి సరళమును, సుకుమారమును అయిన తెలుగువాణి కాలక్రమమున సంస్కృత సేవ వలన గాంభీర్య పటుత్వముల నలవరచుకొని, తల్లికిని అక్కసెల్లెండ్రకును లేని క్రొత్త సొగసుదనమును కైసేసికొన్నది. పరస్పర భిన్నములైన ఆర్య ద్రావిడ భాషలైన రెంటిని ఒక్కచో సమ్మేళన మొనర్చి సమరస భావము సాధించినది గనుకనే ఆంధ్రము ఆ రెంటికిని లేని గుణాతిశయమున విలసిల్లుచున్నది కాకున్న "దేశభాషలందు తెలుగులెస్స" అగుట యెట్లు?

భాష అనునది శబ్దమయము గనుకను ఆ శబ్దమును ముందు గ్రహించునది శ్రవణేంద్రియము గనుకను చెవికి ఇంపుగా నుండు భాషను మానవుడు ఆరాధించుట సహజము సంస్కృత భాషలో గాంభీర్య మాధుర్యములతోపాటు పారుష్యము కూడ కొంత ఉన్నది. ద్రావిడ కుటుంబములో నుండి బయలుదేరిన తెలుగు, సంస్కృతముతో అధికముగ చెలిమి చేసినను, అందలి పారుష్యము తన కంటకుండ, గాంభీర్య మాధుర్యములను మాత్రమే జీర్ణము చేసికొని తన సహజ సౌకుమార్యమునకు వన్నె పెట్టుకొన్నది మేలి పువ్వులను ఏర్చి కూర్చెడి నేర్పుగల మాలకరి గూర్చిన దండవంటిది తెలుగు. సంస్కృతములో ఇట్లు క్షీరనీర న్యాయముగ కలిసిపోవు నేర్పు మరి ఏ ఇతర భారతీయ భాషలకును కుదిరి యుండదు. ఇతర కీటకములకు సారూప్యము నిచ్చు భ్రమరము వంటిది తెలుగు సంస్కృత ప్రాకృత శబ్దములలో

ఏవి తమ మెత్తని మాటలతో పోహళించుటకు పనికివచ్చునో వాటినే ఏర్చుకొని, అవసరమైన సంస్కారములు చేసి తనలో కలిపివేసికొన్నది కనుకనే తెలుగు కవీశ్వరుడు శుద్ధ సంస్కృత సమాస కల్పనము చేసినను, అది తెలుగు సమాసమంత మెత్తగా చెవికి వినిపించును.

*"మేలిపసిండి గాజుల సమేళపు పచ్చల కీల్కడెంపు డాకేలు"*

*అన్న తెలుఁగు సమాసము ఎంత మృదువుగా నున్నదో –*

*"జలధివిలోల వీచి విలసత్కలకాంచి సమంచితావనీతల వహనక్షమంబు"*

అన్న సంస్కృతసమాసముగూడ అంత మృదువుగానే యున్నది మరి సంస్కృత పదములను తెలుగుపదములను జోడించుటలో ఆంధ్రకవి చూపెడి నేర్పు ఇంతకంటెను ఎక్కువగ నుండును

*"ఈసునబుట్టి డెందమున హెచ్చిన శోకదవానలంబుచే*
*గాసిలియేడ్చె బ్రాణవిభు కట్టెదుటన్ లలితాంగి పంకజ*
*శ్రీ సఖమైన మోముపయి చేల చెఱంగిడి.. "*

ఈ పద్యములో తెలుఁగు పదములు సంస్కృత పదములు భేదము తెలియరాకుండ ఒండొంటిని బెరసి గానకళలోని రాగమువలె శ్రవణసుభగమైన ఒక ఆంధ్రశైలిని ఆలపించినవి. తెలుగు కవుల సంస్కృత సమాసములు సంస్కృత భాషలో సంస్కృత కవులు గూర్చిన సమాసములకంటె ఎక్కువ సరళముగ మధురముగ ఉండుననుట నిస్సందేహము. తెలుగులో చేరిన సంస్కృతమునకు పుట్టినింటలేని ఆ సౌలభ్యము తెలుఁగు పలుకుబడి యొక్క సాహచర్యముతో లభించెనని చెప్పుటయు నిస్సందేహమే! ఈ సంస్కృతాంధ్ర సమన్వయము కాలక్రమమున మూడు నాలుగు శతాబ్దుల పరిశ్రమవల్ల జరిగినది గాని హఠాత్తుగా రెండు భాషలయొక్క మొదటి సమావేశముననే జరుగలేదు. ఈ భాషా సామరస్యము ఆర్య ద్రావిడ సామరస్యములో ఒక భాగము. అది మన నడవడికలో ఆచార వ్యవహారములలో సభ్యతలో విశదమగుచుండును ఇంత చక్కని పొత్తు ఏ ఇతర రాష్ట్రములందును కుదురులేదని చెప్పుట అతిశయోక్తి కాదు. ఆర్యులైన ఔత్తరాహులకును, ద్రావిడులైన దాక్షిణాత్యులకును, మధ్యగానున్న భూభాగము ఆదికాలమునుండియు మనకు ఉనికిపట్టగుటచే ఆ రెండు జాతుల సంప్రదాయములను చేపట్టి పదను చెడకుండ పాకము చేసి ఆంధ్రత్వమనెడి అమృతమును చేసితిమేమో అనిపించును. అందుచే గంగా యమునల మధ్య ప్రదేశమైన ఆర్యావర్తము వైదికవిజ్ఞానమునకు పీఠమైన పవిత్రక్షేత్రముగ పరిగణింపబడినట్లు ఆర్య ద్రావిడ విజ్ఞాన సంప్రదాయ సమన్వయమునకు ఆంధ్రభూమి కూడలియైనది బాహుళ్యము మీద చూచినచో ఔత్తరాహులు, పూర్వయుగముల మాట ఎట్లున్నను చారిత్రకయుగమునుండి మతములో భక్తిపరాయణులనియు, దాక్షిణాత్యులు కర్మ పరాయణులనియు, స్థూలముగా నిర్దేశించవచ్చును. కొన్ని కులములలో గాని, కొన్ని వంశములలో గాని, కొందరు వ్యక్తులలోగాని ఈ సిద్ధాంతమునకు అపవాదము లుండినను ఇది సాధారణ సత్యముగ అంగీకరింపవలెను. ఇక ఆంధ్రుల సంగతి మనము ఏకాంతభక్తులము కాము. వాలాయముగ కర్మనిష్ఠులముకాము, శుద్ధ జ్ఞానమార్గ మవలంబించిన వారముగాము యథోచితమైన భక్తియు యథావకాశ కర్మయు

యధాశక్తి జ్ఞానమును కలిగి ఒక విధమైన తాత్త్వికదృష్టితో జీవితమును గడుపుచు త్యాగ భోగములను సమముగా కొనియాడే ఒక చిత్తధర్మము మనమవలంబించితిమి. ఆ తాత్త్విక దృష్టితోపాటు మనకు ఆత్మీయయోగక్షేమముల పట్లను ఉదాసీనత వహించుట అలవాటైనది. చరితము (Conduct) మంచిదైనచో ఐహికాముష్మిక ప్రాప్తి సుకరమగుననెడి భావము మనలో నిరూఢమైనది. ప్రజలలో ఇట్టి తాత్త్వికదృష్టి ఏర్పడుటకు గల ముఖ్య కారణము మనదేశము చిరకాలము బౌద్ధమత ప్రచార ప్రబోధక్షేత్రముగ వర్థిల్లుటయే అని నాయూహ. కావున భాషలో గాని మతములోగాని ఆచారములలో గాని మనము సమన్వయదృష్టి కలవారమగుట ఒక విశేషము దీనివలన కొంతమేలును కొంతకీడును అనుభవించితిమి. అదివేరు విషయము ఇట్టి పవిత్ర క్షేత్రమున పూర్వోదాహృతములైన ఆ భాషా సభ్యతలు రూపముదాల్చిన మొదటి ఆంధ్ర గ్రంథము నన్నయభట్టు రచించిన భారతము నన్నయభట్టు ఆదికవి కాకపోయినను ఆయన భారతము మాత్రము ఆదికావ్యముగ అంగీకరింపబడినది నన్నయకు పూర్వమే తెలుగున కొన్ని ఉద్గ్రంథములు వెలసెనని కొందరు చెప్పుదురుగాని అవి లభింపనపుడు లక్ష్యమైన భారతమునే ప్రథమ గ్రంథముగ అంగీకరించుటలో పాపమేమియు లేదు. నన్నెచోడుని కుమార సంభవము నన్నయకు పూర్వకాలముననే పుట్టినది అనెడి శ్రీ మానవల్లి రామకృష్ణ కవిగారి ప్రతిపాదన పెక్కురు చేసిన చారిత్రక పరిశోధనల ఫలితముగా నిలువలేదు. మరి సర్వదేవుడను ఒక కవి క్రీ శ 10వ శతాబ్దములో ఆదిపురాణమనెడి ఒక జైనగ్రంథమును వ్రాసినట్లును ఆ గ్రంథము నష్టపోయినట్లును అందలి పద్యములలో మూడు మాత్రము లభించునట్లును మరికొందరు చెప్పుదురు. అనగా భారతమునకు పూర్వమే ఉద్గ్రంథ రచన తెలుగులో జరిగినదని భావన మరి ఆనాటికి మన దేశమున జైనమతము కన్నడ దేశమందువలెనే జనాదరపాత్రమై వ్యాప్తి చెందియుండెననియు ఆ సర్వదేవుడను ఆ కన్నడకవి తెనుగున కూడ ఆదిపురాణము పేర ఒక మహా గ్రంథమును రచించెననియు అందుచే భారతము మొదటి గ్రంథము కాదనియు కొందరు చెప్పుదురు 10వ శతాబ్దిలో సర్వదేవుడను ఒక కన్నడ కవి నన్నయకు పూర్వకాలమున ఉన్నమాట నిజమే. తెనుగున నశించిపోయినదని చెప్పెడి ఆ ఆదిపురాణమును రచించినవాడు ఆ సర్వదేవుడే అని చెప్పుటకు తగిన ఆధారములు లేవు. సర్వదేవనామధేయులు వివిధకాలములలో పెక్కురుండవచ్చును పురాణకర్తయైన సర్వదేవుడు కాక నన్నయకు తరువాత కాలములో ఇంకొకడు ఉండకూడదా? అను ప్రశ్నకు నిరుత్తరమైన సమాధానము చెప్పుట కష్టము అదియునుగాక జైనమతము వ్యాప్తిలోనున్న కాలముననే అది రచింపబడినదనుటయు, యుక్తి సహజముగాదు అట్లే యగునేని తిరుపతి వేంకట కవులు నిన్న మొన్న రచించిన బుద్ధచరిత్ర బౌద్ధమతము ప్రచురముగనున్న కాలమున పుట్టలేదు గదా! మరి తిరుపతివేంకటకవులు బౌద్ధులును కారుగదా! కావున జైనమతాభిమానముగల ఒక సర్వదేవుడు నన్నయకు తరువాత ఏ శతాబ్దిలోనైనను ఆ పురాణము వ్రాసియుండవచ్చును అదియునుగాక ఆ గ్రంథము 10వ శతాబ్దిలో పుట్టియున్నచో అందలి భాషాశైలి ఆశతాబ్దిలో పుట్టిన శాసనముల భాషను పోలియుండవలెను కాని లక్షణదీపికలో ఉదాహరింపబడినవి అని చెప్పెడి ఆ పద్యముల శైలి ఆంధ్రప్రబంధముల శైలిని పోలియున్నది ఒక పద్యము చూడుడు

మ॥ సరసీజాత వియోగకారి పురయోషా వక్త్రప్రాద్యాతి సుం
దర కాంతిన్ దరిగించుబో యని మదిం దర్కించి దోషాకరున్
పురముద్దండ కరంబులెత్తి చరవన్ పొత్తైన యట్లొప్పు ను
ద్దుర సౌధాగ్ర నిబద్ధకేతువు మహోందోలాభి రామంబుగన్.

ఈ పద్యము యొక్క తాత్పర్యమిది:-

పద్మములకు విరోధియైన చంద్రుడు సుందరముఖులైన ఆ పురస్త్రీల ముఖకాంతిని హరించునేమో? అని యూహించి ఆ పురము, దీర్ఘములైన తన భుజదండములెత్తి చంద్రుని కొట్టబోయినట్లుగా ఆ పుర సౌధాగ్రములయందు కట్టబడిన కేతువు (గాలిలో) ఆడుచున్నది.

ఇటువంటి అర్థముగల శ్లోకము శ్రీహర్షనైషధమున కలదు. దానిని శ్రీనాథుడు ఈ క్రింది విధముగ తెనిగించెను.

శా॥ వేదాభ్యాస పవిత్ర పూతరసనావిర్భూత భూరిస్తవా
సాది బ్రహ్మముఖౌఘవిఘ్నిత నవస్వర్గ క్రియాకేళిచే
ఆదిన్ గాధితనూజుచే సగము చేయంబడ్డ మిన్నేరు ప్రా
సాద స్వచ్ఛదుకూల కైతవమునన్ చాలంగ నొప్పున్ పురిన్.

ఈ పద్యమున కూడ ఆదిపురాణ పద్యమునందు వలెనే ప్రాసాదాగ్రకేతువు గాలి వశమున చలించుట ఉత్ప్రేక్షింపబడినది. ఇట్టి ఉత్ప్రేక్షలు ప్రబంధ శైలికి సహజములు ఆ గ్రంథములు ఉత్ప్రేక్షాతిశయోక్తులతోనే నిండి యుండును పురాణములు సాధ్యమైనంత వరకు ఆ వర్ణనలు చేయవు. వాటి శైలికూడ నిర్మల శరత్కాల నదీజలమువలె ప్రసన్నముగ ప్రవహించుచుండును కావున లక్షణ దీపికలో నుదాహరింపబడిన పై పద్యము ప్రబంధకాల కవిత్వచ్ఛాయలు గలదని నా యుద్దేశము ప్రబంధయుగమున పుట్టిన పురాణములు కూడ ప్రబంధశైలిలోనే యుండును దానికి యుగశైలి అని పేరు కావచ్చు; కాకపోవచ్చు అదియును గాక నేను పైని చెప్పినట్లు మన భాషా సభ్యతల సమన్వయ దృష్టి భారతమున ప్రతిఫలించినట్లు ఆ సర్వదేవుని ఆదిపురాణమున ప్రతిఫలింపదు ఒకవేళ భాష సంస్కృతాంధ్ర సమన్వయరూపము కలదియే యైనను ఆ పురాణేతివృత్తము మాత్రము ఆంధ్ర సంస్కృతిని వ్యక్తము చేయునదిగాదు ఇంతకు ఈ ఆదిపురాణము మాట ఎట్లున్నను నన్నయ్యకు పూర్వమే తెనుగున సుపరిష్కృతమైన భాషలో పద్యరచన విరివిగ సాగినదనియు, అట్టి పద్యములు రచించిన కవులు పెక్కండ్రు కలరనియు, వారిలో కొందరు భారతము వంటివి కాకపోయినను ఏవో కొన్ని గ్రంథములు రచించియుందురనియు ఎల్లరు అంగీకరింపదగిన విషయము కావున నన్నయ ఆదికవి కాకపోయినను భారతము మాత్రము ఆది గ్రంథమని ఇప్పటికి అంగీకరింపక తప్పదు

★ ★ ★

# నన్నయ యుగము (1000-1100)

నన్నయకు పూర్వము ఆంధ్రవాఙ్మయనాటకప్రదర్శనమునకు అనువైన సన్నాహ మంతయు జరిగినది. రంగము అలంకృతము చేయబడెను ప్రస్తావనాంతమున పాత్ర ప్రవేశ సూచనయు చేయబడెను భారతరూపమున నన్నయ సూత్రధారునిచే ఆ పాత్ర ప్రవేశపెట్టబడెను. భారత రచనా ప్రేరణ యశస్సు రాజరాజనరేంద్రునకు దక్కినను, మార్గకవితను సేవించుచుండిన ఆంధ్రులకు తెనుఁగు కవితను పుట్టించి రుచి చూపిన యశము అతడు పుట్టిన చాళుక్య రాజవంశమునకు దక్కెను చారిత్రక నిర్ణయము చేయుటకు నన్నెచోడుడు తన కుమారసంభవములో వ్రాసిన ఈ క్రింది పద్యము ప్రబల సాక్ష్యము.

*కం॥ మును మార్గకవిత లోకంబున వెలయగ దేశికవిత పుట్టించి తెనుం*
*గున నిలిపి రంధ్రవిషయంబున జన చాళుక్యరాజు మొదలుగ పలువుర్*

## మార్గకవిత - దేశికవిత

మార్గ–దేశి–అను పదములు రెండును సాహిత్యపరముగ ఏ అలంకార గ్రంథమందును వాడబడినట్లు కానరాదు ఒకవేళ ఎందేని వాడబడెనేమో నేనెరుగను. కాని ఇవి, గానకళాపరముగ సంగీతదర్పణమునందును; నాట్యపరముగ దశరూపకమునందును కలవు. సంగీతదర్పణమున మార్గదేశి విభాగమునకు సంబంధించిన ఈ క్రింది లక్షణ వాక్యములుకల శ్లోకములను వీరేశలింగముగారు ఎత్తిచూపిరి.

*శ్లో॥ మార్గదేశి విభాగేన*
*సంగీతం ద్వివిధం మతం*
*ద్రుహిణేన యదుద్దిష్టం*
*యదుక్తం భరతేనచ*
*తన్మార్గోహి యయారీత్యా*
*యత్స్యాల్లోకాను రంజనం*
*దేశే దేశేషు సంగీతం*
*తద్దేశీత్యభిధీయతే॥*

బ్రహ్మచేత ఉద్దేశింపబడి భరతునిచే చెప్పబడినది మార్గ సంగీతము అయా ప్రదేశములయందు అయా ప్రజల అనురంజనార్థమై ఒక్కొక్క ప్రదేశమున ఒక్కొక్క

రీతిగా ఉండునది దేశి సంగీతము – అని పై శ్లోకమునకు తాత్పర్యము అనగా నియమబద్ధమును లక్షణయుక్తమును శాస్త్రసమ్మతమును ఐన సంగీతము మార్గము. ఈ లక్షణమే సంగీత రత్నాకరమునను కలదు

*"దేశే దేశే జనానాం యద్*
*రుచ్యా హృదయరంజకం*
*గీతంచ, వాదనం, నృత్తం*
*తద్దేశీత్యభిధీయతే"* ॥

అట్టి నియమముగాని, లక్షణముగాని లేక శాస్త్రముల కెక్కక సామాన్య ప్రజారంజనార్థమై పాడెడి చిల్లరపాటలు, పదములు, కీర్తనలు మొదలైనవి దేశి సంగీతము. ఈ రెండు జాతులకును సమానధర్మము గానము లక్షణబద్ధమై శాస్త్రానుసారముగ పాడెడి సంగీతములో ఆనందదాయకమైన ఏకళాంశము కలదో శాస్త్రబద్ధము కానట్టి సంగీతములోను ఆనందదాయకమైన అట్టి కళాంశమే కలదు అదియే గాన మనగ ఐనను మార్గ సంగీతములో గానగర్భితమైన ఆ గేయము లక్షణ యుక్తమైన ఒక రాగమునకు ఒక తాళమునకు అనుబంధింప బడియుండును ఆ గేయమును ఆ రాగలక్షణము చెడకుండ స్వరప్రధానముగా పాడుదురు అట్టి సంగీతమునకు శాస్త్ర నిబద్ధత వలన "మార్గ" అను పేరు ఏర్పడెను ఆ గేయమును పాడు గాయకుడు ఆ రాగ లక్షణమును ఆ స్వర గ్రామమును అ తాళగతులను శాస్త్రము చదివి తెలిసికొని శాస్త్ర విరోధము లేకుండ పాడును మరి దేశి సంగీతమున కూడ ఏదో ఒక రాగము, ఏదో ఒక తాళము ఉండితీరును రాగతాళములులేనిది సంగీతమే కాదుగదా! కాని ఆ రాగముయొక్కయు ఆ తాళముయొక్కయు లక్షణమును దేశిపాట పాడువాడు ఎరుగడు. కాకపోయినను ప్రజలు పాడుకొనెడి కొన్ని పాటలలో ఏది ఏ రాగమో వివరించి చెప్పుట సంగీత శాస్త్రజ్ఞులకును సాధ్యముకాదు కొన్ని పాటలలో రాగ సాంకర్యము కలుగుచుండును కొన్నింటిది శాస్త్రమునకెక్కని ఏదో యొక రాగమై ఉండును. త్యాగరాజు కీర్తన, సంగీత శాస్త్రము తెలిసినవాడు లక్షణ విరోధము లేకుండ ఉద్దిష్ట రాగతాళ పూర్వకముగా పాడి, గానకళాభిజ్ఞులను మెప్పించగలడు అతని గానములో లక్షణ విరోధమే యున్నచో గాన కళాభిజ్ఞులు నిరసింతురు మరి శాస్త్ర పరిజ్ఞానము లేని సామాన్యుడొక్కడు ఏదేని జానపద గేయమునో శృంగార పదమునో భజనకీర్తననో పాడునపుడు తాళము తప్పినను రాగసాంకర్యము కలిగినను ప్రజాసామాన్యము దానిని గుర్తింపలేరు గనుక గుర్తింపక పాటయందలి అర్థమునకును, పాటగాని గాత్రమాధుర్యమునకును ముగ్ధులై ఆనందింతురు ఈ పాటలు ఒక జాతిలోనే ఒక భాషలోనే ఒక్కొక్క సీమకు ఒక్కొక్క రకముగ – అసంఖ్యాకములు – పాడబడుచుండును వీటినన్నిటిని క్రోడీకరించి లక్షణములు కల్పించి శాస్త్రబద్ధము చేయుట పొసగదు కామచార ప్రవర్తనమే వాటి లక్షణము లక్షణబద్ధము చేసితిమా! అవి మార్గ కక్ష్యకే చెందును

పెళ్ళిళ్లలో స్త్రీలు అప్పగింతల పాట పాడునపుడు శ్యామ శంకరాభరణ రాగముల సాంకర్యము కలుగుచుండును ఇది లక్షణ విరుద్ధము ఐనను ఆ పాట ఆలకించునప్పటి పెండ్లివారికి అబాలవృద్ధము హృదయము ద్రవీకరించి ఈషద్బాష్పాదశబలితమైన

ఆనందమును పొందుదురు ఆ పాట కలిగించిన అనురంజన ఫలమే ఆ ఆనందము. ఆ పాట పాడిన ముత్తైదువులు ఆ రాగమెరుగరు అట్లే రామదాసు కీర్తనలు పాడుచు రామభజన చేసిన భక్తులు ఆ కీర్తనల రాగతాళజ్ఞానము లేకయే పాడుచు భజన చేయుచు ప్రజలను భక్తి పరవశులను చేయుదురు

పాట.– సీతమ్మకు చేయిస్తీ చింతాకూ పతకము రామచంద్రా!

ఆ పతకామునకు బట్టే పదివేలా వరాహాలు రామచంద్రా!

ఆపాట యదుకులకాంభోజి రాగమున పాడుచున్నామనిగాని, దాని లక్షణమిదియని గాని ఆ భజనపరులెరుగరు ఎరుగనక్కరను లేదు ఆ పాటవినుటవలన ప్రజానురంజనము కలుగుటయే వారి భజనకు ఫలము.

మరి సంగీత రత్నాకరమునందలి ఈ క్రింది శ్లోకములు ఈ అర్థమునే చెప్పుచున్నవి.

శ్లో॥ *దేశే దేశే జనానాంయద్రుచ్యా హృదయం రంజకమ్*

*గీతం చ వాదనం నృత్తం తద్దేశీత్యభి ధీయతే।*

*యేషాం్రశుతి స్వర గ్రామ*

*జాత్యాది నియమోనహి*

*నానాదేశ గతిచ్ఛాయా*

*దేశరాగాస్తుతే మతాః*

*కామచార ప్రవర్తిత్వం*

*దేశిరాగస్య లక్షణం*

*నియమేసతి చేత్తత్ర*

*మార్గత్వ మనులక్షితం॥*

వివిధదేశ ప్రజల అభిరుచియు హృదయ రంజనమును మాత్రమే లక్షణముగా కలిగిన పాట, నృత్యము మొదలగునవియే దేశి నామవ్యపదిష్టములని తెలియుచున్నది కావున తెలుగులో త్యాగరాజ కృతులకును జానపద గేయములకును ఉన్న భేదమే మార్గ, దేశి సంగీత విభాగములకు గల భేదము మరి ఈ భేదమే దశ రూపకమున నృత్య, నృత్తపరముగ చెప్పబడినది

శ్లో॥ *ఆద్యం భావాశ్రయం నృత్యం; నృత్తం తాలలయాశ్రితం,*

*ఆద్యం పదార్థాభినయోమార్గో; దేశితధాపరం*

నృత్య, నృత్తములలో నృత్యము భావము నాశ్రయించి యుండును అది గేయములోని పదములయొక్క అర్థాభినయ పూర్వకము. అది మార్గమనిపించుకొనును రెండవది తాళమును, లయను మాత్రమే ఆశ్రయించి యుండును అది నృత్తము అది దేశియనిపించుకొనును నృత్త, నృత్య, నాట్యములకు గల భేదమును, గాత్ర విక్షేప విద్యాపరిణతిలో ఈ మూడింటికిగల స్థానమును, నా గ్రంథములలో ఒకటి రెండుచోట్ల విశదీకరించితిని ఆ వివరణమే ఇయ్యెడ పునరుద్ఘాటించుచున్నాను నృత్తము, నృత్యము, నాట్యము అనెడి మూడు పదములను లోకము సాధారణముగ సమానార్థకములుగానే వాడుచుండును అది పొరపాటు ఈ మూడును పర్యాయపదములు గావు అవి నిరూపించెడి అర్థములయందు, సామ్యముకంటె భేదభావమే ఎక్కువ కలదు. వీటిలో

నృత్తము తక్కిన రెండింటికంటె ముందు పుట్టినది తరువాత నృత్యనాట్యములు వెలసినవి.

శరీరావయవ విక్షేపమును లయాన్వితము చేయనెంచిన ప్రాక్తన మానవుడు మొట్టమొదట సృష్టించుకొన్న కళనృత్తము, ఏ పటహావాద్యమునో నెరపుచు, ఆ తాళమునకు అనుగుణముగ లయశుద్ధి యొప్పునట్లు అతడు చూపిన పాదన్యాసమే నృత్తమునకు ప్రారంభదశ. క్రమముగా దానిని అన్ని తాళములకును, అన్ని కాలములకును (1,2,3 కాలములు) అనురూపముగ ప్రవచించి పెంపుచేయవలెనని అతడు యత్నించెను. ఎంత యత్నించినను పాదన్యాసము తాళమును తుదముట్ట అనుగమింపజాలదు హస్తనాడులకు గల లాఘవము పాదనాడులకు ఉండదు గనుక హస్తముచే వేయు తాళగతుల నన్నిటిని పాదముచేయు నృత్తగతులన్నియు అనుసరింపలేవు. కనుక నృత్తవిద్య తాళముతో కొంత దూరమే నడచినది నృత్తముచేయునపుడు పూర్వాపర కాయములకు సమత కుదురుటకై వేరొకదశలో పాదవిక్షేపమునకు హస్తవిక్షేపము తోడైనది. ప్రారంభదశలో గాని ఈదశలోగాని నృత్తమునకు శబ్దముతోడి సంబంధము ఇంచుకయులేదు అనగా నృత్తము చేయునపుడు తాళము మాత్రమే అపేక్షింపబడునుగాని, గీత మపేక్షింపబడదు ఈ గాత్ర విక్షేప విద్య తాళలయాన్విత ముగ నుండుటయేగాక, శబ్దార్థ సూచకముగను ఉండవలెననెడి యాశతో మానవుడు కల్పించిన ప్రక్రియాంతరము నృత్యము నోటితో గీతము పాడుచు ఆ గీతమునందలి భావమునకు అనుగుణముగా శబ్దముల అర్థమును హస్తన్యాస, నేత్రన్యాసములతో ప్రదర్శించుట దాని ప్రధానాశయము ఆ పాడెడి గీతము తాళబద్ధముగా నుండును గనుక ఆ తాళమునకు తగినట్లు కాలితో నృత్తము చేయుచుండుట దానికొక అంగము కావుననే నృత్యమునందు అర్థసూచకమైన హస్తన్యాసమేకాక ఒక్కొక్క యెడ తాళాశ్రయమైన నృత్తము కూడ ప్రకటితమగుచుండును కృష్ణలీలా తరంగ నృత్యము దీనికి తార్కాణము. కావున భావాశ్రయమును శబ్దార్థసూచకమును అయిన నృత్యము శుద్ధతాళాశ్రయమైన నృత్తముకంటె గుణాధికమై శాస్త్ర నిబద్ధమైనది. అందుచేతనే దానిని 'మార్గ' యనియు, నృత్తమును దేశియనియు ఆలంకారికులు పేర్కొనిరి. దశరూపకమును ఆంగ్లములో అనువదించిన ప్రొఫెసర్ హాస్ (Prof. Hass) అను విద్వాంసుడు నృత్యమును 'High style', నృత్తమును 'Popular style' అనియు అనువదించెను. ఈ అనువాదము పైవివరణమునందలి అర్థమునకు అనుగుణముగ నున్నదనుట స్పష్టము. నృత్త, నృత్యపదములకుగల ఈ అర్థభేదమును సాహిత్య పరముగ అన్వయించుకొన్నచో తేలెడి సారాంశమిది:– నియమబద్ధమైన శిష్టసమ్మతమును శాస్త్ర సమ్మతమును అయి ఉత్తమ ఫణితిని రచింపబడినది మార్గకవిత; నియమరహితమై శాస్త్రమునకెక్కక కేవల ప్రజానురంజనమునకై రచింపబడినది దేశి కవిత

అయినచో పూర్వకాలమున మార్గకవిత యుండగా చాళుక్యరాజు దేశికవితను పుట్టించెనను మాట కర్థమేమి? అదివరకు శాస్త్ర సమ్మతమైన ఉత్తమ కవిత్వముండగా దానిని త్రోసిపుచ్చి, పామర కవిత్వమును పుట్టించెననియా నన్నెచోడుని యభిప్రాయము? అట్లే యగుచో తెనుగుదేశమున తెనుగును ప్రతిష్ఠించుట ఎట్లగును? మంచి కవిత్వమును రూపుమాపుట భాషా ప్రతిష్ఠాపనము కాజాలదు కావున భారతీయ

సాహిత్యమున అన్నిదేశముల వారికి సంస్కృత కవిత్వము మార్గి (Classical); మరి ఆయాదేశ భాషలలో తత్తత్సంప్రదాయానుసారముగ ప్రవర్తిల్లు కవిత్వము దేశి (Vernacular). చాళుక్యరాజు నాటికి ఈ దేశమున మార్గకవిత్వ మనిపించుకొన్న సంస్కృతమే యున్నది. అతడు దేశికవితను అనగా దేశభాషా కవితను పుట్టించెనన్న అర్థమే చక్కగా పొసగును దేశభాషా కవిత్వమే దేశి ఈ ప్రమాణమునుబట్టి నన్నయ భారతము దేశి కవిత్వము. వ్యాస భారతము మార్గ కవిత్వము నన్నయకు పూర్వమే పాటలుగ, పదములుగ దేశీయ ఛ్ఛందస్సులో రచింపబడిన కవిత్వము దేశి కవిత్వము కాదా? అది చాళుక్య రాజులకు పూర్వమే దేశ మెల్లెడను కలదుకదా? మరి చాళుక్యరాజే దేశి కవిత్వము పుట్టించెననుమాట కర్థమేమి? అని ఒక ప్రశ్న పుట్టును. దానికి సమాధానమిది. ఆ పాటలు పదములు ఒకరాజుగాని, ఒక కవిగాని పుట్టించినవి గావు. వాటికి కారకత్వము ఉండదు కర్తృత్వముండును గాని ఆ కర్తల నామముద్ర వాటిపై నుండదు వారు కవియశమును అర్థించి ఆ పాటలు వ్రాసినవారు గారు మరి విద్యావంతులును గారు వాటి స్వత్వము రచయితలతో పాటు ప్రజలకెల్లరకు దక్కును. ఆ విధమైన దేశి కవిత్వమే నేటికిని తెలుగు పల్లెలన్నింటిలోను కలదు చాళుక్యరాజు ప్రయత్న పూర్వముగ పుట్టించిన దేశి కవిత్వము కావ్యరూపము తాల్చగల ఒక గ్రంథ రచన ఆ గ్రంథమే భారతము అని నేననుకొందును. ఆ భారతము సంస్కృతమునెదుట అనాటికి దేశికవిత్వ మనిపించుకొనెను దేశభాషలో వ్రాయబడుట చేతనే దేశికవిత్వమయ్యెను. ఆ తెలుగు భారతముతో నేడు మనము జానపద రచనలను పోల్చి చూచితిమేని భారతము మార్గకవిత్వమును జానపద రచనలు శుద్ధదేశి కవిత్వమును అగును అనగా భారతము దేశభాషలో వ్రాయబడినను రచనాపద్ధతియంతయు మార్గకవిత్వానుకరణముగ ప్రౌఢముగ ఉండునుగాన దానిని మార్గియనియే మనము భావింతుము ఆ భారతము ఒక్కటియే కాదు. తరువాత తెలుఁగున వెలసిన పురాణేతిహాసములు, ప్రబంధములు, నాటకములు మొదలగు ప్రౌఢ వాఙ్మయమంతయు మార్గకవిత్వమే యనిపించుకొనును. ఆ గ్రంథకర్తలను మార్గానుయాయు (Neoclassicists) లని పేర్కొనదగును

## నన్నయ

ఆ రాజెవరైనను అతనితోపాటు మరికొందరుకూడ ఆ ఉద్యమమున పాల్గొనిరి అని నన్నెచోడుని పద్యములో చెప్పబడియున్నది. ఆ పలువురు అట్టి ఉద్యమమున పాల్గొనదగిన అర్హతగలిగి, రాజు మన్నన పొందినవారై యుండవలెను అనగా పండితులై, నూతన కవిత్వావిర్భావామోదకులై యుండదగుదురు గాని సామాన్యులై యుండరు. అట్టివారి సహాయమున రాజు ఆ ఉద్యమమును ప్రారంభించి వారిలో మేటియైన ఒక కవిని ఆహ్వానించి గ్రంథమును వ్రాయించెననుకొన్నచో అరాజు రాజరాజనరేంద్రుడనియు ఆయన సంకల్పమునకు తోడ్పడినవారు నారాయణభట్టు మొదలైన విద్వాంసులనియు, అట్టి విద్వాంసులు సభ్యులుగా గలవి అనాటి పరిషత్తులనియు, రాజుచే ఆహూతుడైన మేటికవి నన్నయభట్టనియు ఒక పక్షమున ఊహింపవచ్చును. అట్లుగాక తెలుగుభాషను

రాజభాషగ ఆదరించి శాసనముల కెక్కించిన చాళుక్య రాజు గుణగ విజయాదిత్యుడుగ కానవచ్చుచున్నాడుగాన తెనుగు కవితను పుట్టించిన చాళుక్యరాజు అతడే అనుకొనుట ఇంకొక పక్షము కాని నన్నెచోడుడు కొనియాడదగిన తెలుగు కవితగల గ్రంథమేదియు, గుణగ విజయాదిత్యుని కాలమునగాని తరువాత రాజనరేంద్రుని కాలమువరకుగల 200 సంవత్సరములలో ఏకాలమునగాని లభింపలేదు గనుక నన్నెచోడుడు స్మరించిన చాళుక్యరాజు రాజరాజ నరేంద్రుడే యనియు అతడు పుట్టించిన తెలుగు కవిత్వము ఆంధ్రభారతమే యనియు ఇప్పటికి అనుకొనుటలో విప్రతిపత్తి ఏమియు ఉండదు అదియుగాక, భారతము పుట్టినదాదిగా భారతమే ఆది గ్రంథమగునాయని అనుమానము పొడమిన నిన్న మొన్నటిదాక, నన్నయ భారతమునే మొదటి కావ్యముగ పూర్వకవులందరును ప్రస్తుతించిరి. అంతకంటె ప్రాచీనమైన గ్రంథము లభించువరకు భారతముతోనే ఆంధ్రవాఙ్మయము ప్రారంభమయ్యెనని ఒప్పుకొని ముందడుగు వేయుట మంచిది మరియు తత్పూర్వము లోకమున ఎంత విరివిగ పద్యరచన సాగినను ఆ పద్యములన్నియు వాఙ్మయారంభమునకు మూలభూతములు కాజాలవు. కావున నన్నయ ఆదికవి కాకపోయినను ఆది కావ్యకర్త భారతమే ఆంధ్ర వాఙ్మయసృష్టికి మూలస్తంభము

నన్నయకు పూర్వమే పెక్కు దేశికావ్యములును, వాటిని పురస్కరించుకొని లక్షణ గ్రంథములును పుట్టియుండెనని నిర్ధారణమైన పిమ్మట నన్నయ భారతమే ప్రథమ కావ్యమెట్లగును? అనే ప్రశ్నకు నిష్కర్షమైన సమాధానము కుదరదు కాకపోతే అవన్నియు ప్రజాదరణలేకనో, రాజు మన్ననలేకనో వస్తుతః వాటిలో జీవము లేకనో నశించిపోయి ఉండునని ఇష్టము లేని తృప్తి పొందవలసి యుండును జీవమున్న గ్రంథము ఎవరు చంపదలిచినను చావదు భాసుని నాటకములవలె ఏ మూలనో ఒదిగియుండి కాలానుకూలత తటస్థించినప్పుడు వెలువడి అర్ఘ్యపూజలను అందుకొనును గ్రంథవిషయములలో ఉదాత్తతయు, భాషాశైలిలో నిర్దుష్టతయు గ్రంథకర్త భావములలో గంభీరతయు లేని రచనలు ఇతరములైన సొగసులేవియున్నను చిరకాలము నిలిచి యుండవు పూర్వకాలపు గ్రంథములు నశించిపోవుటకు వాటిలో ఆలోచనల లేమియే కారణమై యుండవచ్చును మరియు గేయరూపమున ఉన్న రచనలు, వాటిని లోకములో పాడుకొనుచున్నంతవరకే బ్రతికి యుండునుగాని పాటగాడు లేనినాడు విస్మృతములగును. దేశీయచ్ఛందములో వ్రాయబడిన పూర్వపు రచనలన్నియు స్వభావమునుబట్టి చదువుకొనుటకుగాక పాడుకొనుటకే అనువైయుండినచో వాటిని పాడగలవారి అభావము వలన అవియు లోపించి యుండవచ్చును. ఇవన్నియు ఊహలు, ఇదమిత్థమని ఏ సిద్ధాంతము చేయుటకును చరిత్రకారులకు ఆధారములు ఇంతవరకు దొరకలేదు. నన్నయను ఆదికవిగ స్తుతించిన కవులందరు ఇట్టి చారిత్రక చర్చచేసి యుండరు. "గతానుగతికో లోకః" అను న్యాయముచొప్పున ఒకరినిబట్టి ఇంకొకరు ఆయనకు ఆ బిరుదమిచ్చి యుందురు కాని ఆంధ్రభారత రచనారూపమున నన్నయ ఉత్తమ కావ్యపథకము తీర్చినవాడు అని వారు నమ్ముట సమంజసమే! కావ్యపథము తీర్చుట అనగా కథానిర్వహణములో, భాషలో, శైలిలో అర్వాచీనులకు మేలుబంతి కాదగిన ఆదర్శ గ్రంథరచన చేసి చూపించుట అది ఇతరులకు అనుకరణీయమైనపుడు

ఆ కవినే ఆదికవి యని వారు కొనియాడుకొనుటను కాదనలేము కొలని గణపతిదేవుడు తన శివయోగసాగరమున పూర్వకవి స్తుతిచేయుచు నన్నయభట్టు ఆంధ్ర కావ్యపథము తీర్చిన కవియని అభినుతించెను

"వీరినెల్లను సంస్కృత విమలవాణు
లని ప్రశంసించి మఱియును నంధ్రకావ్య
పథము దీర్చిన నన్నయభట్టుగారి
నుభయ కవిమిత్రు, నెఱ్ఱన నభినుతించి"

ఈ పద్యమునకును నన్నయకును ఇంచుమించు మూడు శతాబ్దుల అంతరమున్నది. ఈ గణపతిదేవుడు అకాలమున లోకమున వ్యాపించియున్న జనశ్రుతినిబట్టి ఈ వాక్యము వ్రాసియుండునుగాని చారిత్రక ప్రమాణమునుబట్టి వ్రాసియుండడు. భారతము పుట్టినది మొదలు ఈ గణపతిదేవుని వరకు లోకమున పరంపరగా చెప్పుకొనుచుండిన వృత్తాంతమునే అతడు నమ్మియుండెననియు, అది లోక నిరూఢమగుటచే అతని నమ్మకము నిరాధారము కాదనియు అనుకొనవచ్చును అంతకు పూర్వమే 100 ఏండ్లనాడు తిక్కన శిష్యుడైన మారన తన మార్కండేయ పురాణమున నన్నయ ఆంధ్రకవితాగురువని స్తుతించెను

ఉ॥ సారకథాసుధారస మజస్రము నాగళపూరితంబుగా
నారఁగఁ గ్రోలుచున్ జనులు హర్షరసాంబుధిఁ దేలునట్లుగా
భారత సంహితన్ మునుఁద్రిపర్వములెవ్వఁ డొనర్చె నట్టి వి
ద్యారమణీయు నంధ్రకవితాగురు నన్నయభట్టుఁ గొల్చెదన్

పూర్వము తమిళదేశమున సంగములు అనుపేర కొన్ని విద్వత్పరిషత్తులు ఉండెడివట. వారు గ్రంథములయొక్క మంచి చెడ్డలను వివేచించి శుద్ధమైన వాటిని ఆమోదించెడివారట వారి ఆమోదమును పొందిన గ్రంథముల భాషకు "శెందమిళ్" అను పేరువచ్చెడిదట అనగా శుద్ధమైన తమిళమని అర్థమట. వారు ఆమోదింపని గ్రంథములకు వ్యాప్తి వచ్చెడిదికాదట వారు ఆమోదింపనివాటి నన్నిటిని సంకలనముచేసి కాలగర్భమున కలిసిపోకుండ భద్రపరచి యుంచిరట. రాజనరేంద్రుని కాలముననో అతని తండ్రి కాలముననో మనదేశములో గూడ తమిళ సంప్రదాయానుకరణముగ కొన్ని విద్వత్పరిషత్తులు స్థాపింపబడి యుండవచ్చును ఆ పరిషత్తుల ప్రశంస నన్నయ భారతావతారికలో ఎక్కువచోట్ల కలదు కృత్యాదినే ఆయన ఇష్టదేవతా నమస్కారములతోపాటు పండిత సభలకు కూడ నమస్కారము చేసెను

చ॥ పరమ వివేక సౌరభ విభాసిత సద్గుణ పుంజవారిజో
త్కర రుచిరంబులై సకల గమ్యసుతీర్థములై మహామనో
హర సుచరిత్ర పావన పయఃపరిపూర్ణములైన సత్సభాం
తర సరసీవనంబుల ముదంబొనరం గొనియాడి వేడుకన్.

అని గ్రంథారంభమునచెప్పి పూర్వానుక్రమణికలో "సభలనుతింపగ జెల్లును" ఇత్యాది వాక్యములచే గూడ విద్వత్సభలను నుతించెను రాజనరేంద్రుని యాస్థానమందలి విద్వత్సభకు నన్నయ అధ్యక్షుడై యుండనోపును. ఆ పరిషత్తులు శబ్దముల సాధుత్వాసాధుత్వములను చర్చించి నిర్ణయించెడి కార్యములో నన్నయ యెక్కువ

భారమునే వహించి యుండును అందుచేతనే ఆయనకు "విపులశబ్దశాసనుడు" అనెడి బిరుదము కలిగియుండనోపు.

సంస్కృతమున వాల్మీకి రామాయణము ప్రథమ కావ్యమై యుండగా దానిని విడిచిపుచ్చి, రాజనరేంద్రుడు భారతాంధ్రీకరణమునే మొదట ఏల కోరవలెను?

కృతిపతికి పార్వతీపతి పదాబ్జధ్యాన పూజా మహోత్సవముతోపాటు సతతము భారత శ్రవణాసక్తి మిక్కిలి ఇష్టమట మరి ఆకథ చంద్రప్రభవమైన తన వంశమున ప్రసిద్ధులైన పాండవోత్తముల చరిత్ర గనుక దానిని వినుట అతనికి అభీష్టము. అది యట్లుండగా కన్నడమున విక్రమార్జునవిజయమను పేర ప్రసిద్ధికెక్కియున్న పంప భారతమును చదివిచూచి అతడు తనివిచెందియుండడు ఏమనగా అది వ్యాసప్రోక్తమైన భారతమునకు సరియైన అనువాదముకాదు అందు భారతకథ యంతయులేదు. పంపకవికి పోషకుడైన విక్రమాదిత్యునకు భారతవీరుడైన అర్జునునితో అభేదాధ్యవసాయము కల్పించి అతని పరాక్రమాదులను వర్ణించిన గ్రంథము తమిళమునకూడ 7,8 శతాబ్దుల మధ్యకాలమున "పెరిందేవనార్" అనునొక కవి భారతమును దేశిచ్ఛందములో రచించెనట చోళరాజు దౌహిత్రుడైన రాజనరేంద్రుడు ఆ తమిళభారతమును చదివి యుండవచ్చును అదియు, వ్యాస భారతమువలె నుండని కారణమున అతనికి తృప్తి గొలిపియుండదు కాగా ఆ రెండు భాషల భారతముల కంటె గుణాతిశయముచే మిన్నయై తెలుగు భారతము రాణింపవలెను అనెడి స్వాభిమానముతో అతడు వ్యాసభారతానుసారియైన భారతరచనకు కారకుడు కావలెనని సంకల్పించి యుండును ఇది మొదటి కారణము అప్పట్ల ఉదాత్త కథాత్మకమైన ఉత్తమ కావ్యముతో వాఙ్మయ ప్రతిష్ఠాపనము జరుగునని అతని యాశ

వ్యాసభారతమును పురాణమనియో, ఇతిహాసమనియో, కావ్యమనియో వర్ణింపరాదు అది నన్నయభట్టు చెప్పినట్టు.

సీ॥ "ధర్మ తత్త్వజ్ఞులు ధర్మ శాస్త్రంబని యధ్యాత్మవిదులు వేదాంతమనియు
నీతి విచక్షణుల్ నీతిశాస్త్రంబని కవివృషభులు మహాకావ్యమనియు
లాక్షణికులు సర్వలక్ష్య సంగ్రహమని యైతిహాసికు లితిహాసమనియు
బరమ పౌరాణికుల్ బహుపురాణ సముచ్చయంబని మహిఁగొనియాడ"

దగిన విజ్ఞానసర్వస్వము "ఆ విజ్ఞానమంతయు ఆర్యజాతిదేగాని ద్రావిడులమైన మనజాతిది కాదు దానితో మనకేమిపని" అనెడి భేదభావమును సంకుచిత బుద్ధియు ఆనాటితెలుగువారికిగాని అరవవారికిగాని లేవు. ఆసేతుశీతాచలము ఒకే భూఖండమనియు అందుగల కులపర్వతములు, మహానదులు, పుణ్యక్షేత్రములు అన్ని రాష్ట్రములవారికిని, అన్ని జాతులవారికిని సంసేవ్యములే యనియు మన పూర్వుల ఉదారాశయములు అందుచేత దాక్షిణాత్యులుగాని ఔత్తరాహులుగాని భరతభూమికి మాతృభాష అని చెప్పదగిన సంస్కృత గ్రంథ జాలమును మొదట దేశభాషలలోనికి అవతరింపజేసిరి భారతజాతి కంతకు ఒకే సంస్కృతి కలదనియు అది సంస్కృత భాషలో నిక్షిప్తమై యున్నదనియు అంగీకరించిన దేశభాషా కవులు విజ్ఞానదాయకమును, ఉపదేశపూర్వకమును అయిన ఉత్తమ సాహిత్య రచనలకు దొరకొన్నప్పుడు ఆ సంస్కృత మహానిధులను త్రవ్వి తమ దేశీయులకు ఆ ధనములను

పంచి పెట్టుటకంటె తాము క్రొత్తగా సృష్టించేది ఏదీ ఉండదని భావించియుందురు. వారు సంస్కృతానువాదములను ప్రారంభింపక ముందు ఆయా భాషలలో కవులు లేకపోలేదు; కవిత్వము పుట్టకపోలేదు కాని అది యంతయు బాల్యదశ ఆ దశలోని కవిత్వమంతయు రమణీయముగ ఆనంద జనకముగ ఉండవచ్చు. ఆనంద జనకమైనంత మాత్రమున సారస్వత ప్రయోజనము పూర్తిగా నెరవేరదు ఆహ్లాదముతోపాటు విజ్ఞాన బోధకత్వముకూడ ఉన్నప్పుడే సారస్వతము ఉత్తమకక్ష్యకు ఎక్కును సంగీతాది చిత్రకళలు ఆనందదాయకములే కాని విజ్ఞానదాయకములు కావు ఆ యుభయ సామర్థ్యములు కలది కావ్యము తక్కిన సోదర కళలకు దుర్గమమైన భూములను సాహిత్య కళ మెట్టగలదు అందుచేత మహాకావ్యము లెప్పుడును విజ్ఞానోపదేశముతో విశ్వశ్రేయమును కాంక్షించుచునే యుండును "విశ్వశ్రేయః కావ్యం" అనెడి కారికకు ఇదియే అర్థము మరియు అట్టి మహాగ్రంథముతో ప్రారంభమైన వాఙ్మయమున అదియే ఆదర్శముగ, ఆ పోలికలతో తరువాతి గ్రంథములు పుట్టుచుండును మంచికిగాని చెడ్డకుగాని ఇంకొక ఆదర్శము ప్రాదుర్భవించువరకు తొలినాటి గ్రంథ ప్రభావము సాహిత్యముపై నెగడుచునే యుండును తెలుగు భారతమునకు అట్టి ప్రభావమే కలదు. మరి ప్రజలు ఎంత నాగరికులైయున్న, రాజులకు ప్రజాపరిపాలనము అంత సుకరము సంస్కారహీనమై జాంతవ స్వభావము వదలని ప్రజాసమూహామును రాజు దండించి శిక్షించి హింసించి పరిపాలింపగలడు గాని ఆ పరిపాలనలో అతనికి చిత్తశాంతి యుండదు. కావున ప్రజాశ్రేయస్సునే గాక తన శ్రేయస్సును కాంక్షించెడి రాజు ఉత్తమ పురుషుల జీవితములను, ఉత్తమ ధర్మములను ప్రజలకు ఆదర్శములుగ నెలకొల్పి వారికి సన్మార్గ వర్తనము పరోక్షముగ అలవరచుచుండును ఆ కాలమునసేమి, ఈ కాలమునసేమి ప్రభుత్వములు విద్వాంసులను విద్యాసంస్థలను పోషించుట కదియే కారణము అందు స్వార్థమును పరార్థమును రెండును కలవు. ఆంధ్ర భారతావతరణము నాడు రాజరాజు ఆశించినది ప్రజల విజ్ఞానమయజీవితమనే నా నమ్మకము.

వ్యాసభారతము కేవలము కురుపాండవ యుద్ధమునకు సంబంధించిన చరిత్ర మాత్రమేకాదు. ఆ యుద్ధము అంతకుపూర్వము ఎంతో కాలమునుండి భారతదేశములో విజృంభించుచుండిన సాంఘిక దావాగ్ని యొక్క పరిణామము ఆ దావాగ్నిలో పురాతన భారతీయ విజ్ఞానమంతయు ఇంచుమించు దగ్ధమైపోయినది. వేదములు తారుమారైనవి ధర్మశాస్త్రములు విస్మృతములైనవి. ఆనాడు విజ్ఞానమంతయు గ్రంథరూపములో గాక శ్రుతరూపములో ఉండెడిది ద్వాపరాంతమున జరిగిన ఆ యుపప్లవములో శ్రుతరూపమైన ఆ విజ్ఞానమంతయు మృగ్యమై అసద్ధర్మములు, అసత్య సిద్ధాంతములు తలయెత్త సాగినవి ఇంచుమించుగా అస్తమించిపోయిన ఆ విజ్ఞానమును పునస్సంస్థాపన చేయుటయే తన జన్మప్రయోజనముగ వ్యాసుడు అవతరించెను ఆ యుగాంతములో యాదవకృష్ణుడును కృష్ణద్వైపాయనుడు పుట్టియుండకపోయినచో భారతీయ నాగరకత కథావశేషమయ్యెడిది

వ్యాసుడు తద్విజ్ఞాన సంరక్షణకు పూనుకొని మొదటజేసిన కార్యము వేదములను విడదీయుట. ఆనాటి వేదములు చిక్కువడ్డ నూలుగుట్టవలె పోగుతీయుటకు

వీలులేకుండ చేతపట్టినచో తెగిపోయెడి స్థితిలో నున్నవి. ఆ నూలి రాశివద్ద కూర్చుండి పోగులు తెగకుండ ఆ చిక్కు తీసి పడుగుగా చాచినవాడు వ్యాసుడు. ఈ యర్థమునే ఎఱ్ఱాప్రగ్గడ "ప్రోగులై యెందును పోగేర్పడక యున్న శ్రుతులన్నియును నోజ సూత్రపరిచె" అని చక్కగా సంగ్రహముగా ధ్వని ప్రధానమైన పద్యపాదములో ప్రశంసించెను. వేదములు విడదీసినంతనే భారతీయ సంస్కృతి భవనమునకు దృఢమైన పునాది యేర్పడెను అపై అయన భారతమును రచించుట, ఆ పునాది మీద విజ్ఞాన సౌధమును నిర్మించుట. కురుపాండవ చరిత్రను నిమిత్తమాత్రముగ గ్రహించి ఆ మహాకవి భారతములో ధర్మశాస్త్ర వాక్యములను ఆగమ తాత్పర్యములను ఉపనిషద్రహస్యములను ఐతిహాసిక గాథలను పురాణ చరిత్రలను రాజవంశ వర్ణనలను – అదీ ఇదీ అననేల – మన ప్రాచీన సంస్కృతి సారమంతయు రాశీభూతముచేసి ఏకత్ర నిబంధించెను. మీదు మిక్కిలి సర్వోపనిషత్ సారమైన భగవద్గీతను అందు నిబంధించి, ఉపనిషదర్థములకు స్థిరమైన వసతి కల్పించెను. ఇంచుమించు సనత్సుజాతీయము కూడ అట్టిదే!

ఈ మహారచనలవల్ల చివికి జీర్ణించి పోవుచుండిన భారతీయత ఆరోగ్యవంతమై నూతన యౌవనముతో వసంతోద్యానమువలె కలకలలాడ జొచ్చెను ఆ కల్పవాటికలో లభింపని సత్పదార్థములేదు ఎవరు ఏ భావముతో సేవింతురో ఆ భావితార్థమే అందు వారికి లభించినది. "ధర్మతత్త్వజ్ఞులు ధర్మశాస్త్రంబని" అనెడి పద్యముతో నన్నయభట్టు చేసిన ప్రశంసకు ఇదియే అర్థము ఈ అర్థమునే సూత్రప్రాయముగ

*"ధర్మే చార్థేచ కామేచ*
*మోక్షేచ భరతర్షభ!*
*యది హాస్తి తదన్యత్ర*
*యన్నేహాస్తి నతత్క్వచిత్"॥*

అని వైశంపాయను డన్నాడు అయితే వారి వారి అభిమతములను బట్టి నానామూర్తులుగా గోచరించే ఈ భారత సరస్వతి యొక్క నిజస్వరూపమేమిటని ప్రశ్నించినచో అది "ధర్మాద్వైతమూర్తి" అని తిక్కన సోమయాజి చరమపరమ సిద్ధాంతము చేసెను

కావున – సమస్త వేదవేదాంగసారము క్రోడీకరించిన కోశము గావున ఆ మహాగ్రంథము పంచమవేదమైనది

ఇట్టి పంచమువేదమును ఆంధ్రులకు తమ భాషలో అర్పించుటకంటె ఆ భాషకు గాని ఆ ప్రజలకు గాని చేయదగిన మహోపకారము మరియొకటి యుండదని ఆ మహారాజు తలచియుండును. ఇది రెండవ కారణము ఆ తలంపు ఫలించినదనుటలో సందేహమక్కరలేదు.

అయితే నానా ధర్మ ప్రసంగ సమేతమును లక్షశ్లోక పరిమితమును ఐన ఆ మహాభారతమంతయు వ్యాసరచితము కాదనియు మూడు దశలలో ఆ గ్రంథ విస్తృతి జరిగినదనియు కొందరు పరిశోధకులందురు వారి మతము ప్రకారము వ్యాసుడు తొలుత తన చేతిమీదుగా వ్రాసిన గ్రంథము 8800 శ్లోకముల పరిమితి గల జయము అను పేరు గలది. అది మొదటి దశ. రెండవ దశలో వైశంపాయనుడు జనమేజయునకు సర్పయాగ సందర్భమున వినిపించిన గ్రంథము, దానికి భారతము

అని పేరు. అది 24,000 శ్లోకములు గలది మూడవ దశలో సౌతి శౌనకాదులకు నైమిశారణ్య సత్రయాగమున వినిపించిన గ్రంథము దానికి మహాభారతము అనిపేరు. అది లక్షశ్లోక పరిమితము కాబట్టి ఈ గ్రంథమునకు మూడు ప్రారంభములున్నవనియు అందుచేత ఏకకర్తృకము కాదనియు కాలక్రమమున పెంపుచెందినదనియు ఆ మతము వారందురు వారు ప్రమాణముగా చూపెడి ఆ శ్లోకము లివి –

1 "అష్టౌశ్లోక సహస్రాణి
అష్టౌశ్లోక శతాని చ
అహంవేద్మి శుకోవేత్తి
సంజయో వేత్తివానవా॥

2 చతుర్వింశతి సాహస్రీం
చక్రే భారత సంహితాం
ఉపాఖ్యానైర్వినాతావద్
భారతం ప్రోచ్యతే బుధైః॥

3 ఇదంశత సహస్రంతు
లోకానాం పుణ్యకర్మణాం
ఉపాఖ్యానైః సహజ్ఞేయ
మాద్యం భారత ముత్తమం॥"

సంప్రదాయాభిజ్ఞులు ఈ వాదములు పూర్వపక్షము చేయుటకు ఎన్నోయుక్తులు చెప్పుదురు అందు ముఖ్యమైనది వ్యాసుడును ఆయన శిష్యుడైన వైశంపాయనుడును ప్రశిష్యుడైన సౌతియు ఒకే తరమువారు. కావున వ్యాసుడు జీవించియున్న కాలముననే ఆయన వ్రాసిన భారతము మూలస్వరూపము కానరాకుండ మార్పుచేయుటకు ఆ శిష్య ప్రశిష్యులు సాహసింపలేరు అనెడి యుక్తి మరి రెండవది వ్యాసభారతమున 8,800 శ్లోకములు గ్రంథపరిమితి సూచకములు కావనియు అవి వ్యాసునకును శుకునకును తెలిసిన గూఢార్థముగల శ్లోకములనియు చెప్పుదురు 24,000 శ్లోకముల పరిమితిగల గ్రంథము ఉపాఖ్యానరహితము, లక్ష శ్లోకములు గలది ఉపాఖ్యాన సహితమనియు పై శ్లోకములలోనే చెప్పబడి యుండుటబట్టి భారతము మహాభారతమగుట, అది యితర కర్తృకము కాక వ్యాసకృతములోనే అధికారిక కథకును, సప్రాసంగిక కథకును సంబంధించినదనియు పూర్వపక్షము చేయుదురు కాని వ్యాసభారతము అనుపేర మనకు లభించిన గ్రంథములో అనేక కాలముల అనేక ప్రక్షిప్తములవల్ల వచ్చిన గ్రంథ విస్తృతి చిరకాలమునాడే జరిగినదనియు సమబుద్ధులైన పరిశోధకులు వేరొక అభిప్రాయమును చెప్పుదురు ఆ వివాదముతో మనకు అంతగా ప్రసక్తిలేదు. నన్నయ వ్యాసభారతమును చేపట్టు నాటికి అది లక్షశ్లోక పరిమితమైన గ్రంథముగానే లోకవిదితమై యున్నది. తర్వాత నన్నయ పర్వానుక్రమణికను బట్టి 1,10,000 శ్లోకములు గలవు అందుచే భారతమున ప్రక్షిప్తములు కలవందురు ఆ గ్రంథము కేవలము కురుపాండవ కథయే గాక సర్వ ధర్మసార సంగ్రహముగా గూడ ఉండుటను బట్టియే దాని మహత్త్వమును ఆంధ్రమున ప్రదర్శించుటకు ఆయన పూనుకొనెను ఈ గ్రంథము వ్యాసకర్తృకమా కాదా? మూలగ్రంథము ఎన్ని దశలలో ఎంత పెరిగినది? అనెడి మీమాంసలకు, పరిశోధనలకు ఆయన దిగలేదు ఆయనకది అవశ్యకమును గాదు

# ఆంధ్ర భారత కర్తృత్వము

నన్నయ రచితమని మన మనుకొనుచున్న భారతభాగము నిజమునకు నన్నయ వ్రాయలేదనియు నన్నయాదుల సహాయముతో రాజరాజనరేంద్రుడే దానిని రచించె ననియు ఒక వింత సిద్ధాంతము ఇటీవల బయలుదేరినది దానికి ఉపపత్తిగా రాజ రాజనరేంద్రుడు వేయించిన శ్రీ కూర్మ శాసనములోని ఈ క్రింది శ్లోకమును చూపుదురు:

శ్లో॥ *"తస్మాదభూత్ క్షితిపతి ప్రణుతాంఘ్రిపద్మః*
*శ్రీరాజరాజనృపతిః ప్రవిశాల కీర్తిః*
*యస్సూరి భిస్సహాకిల స్మృతిజాలపార*
*మంత్రీచకార వరభారత వంశవృత్తం "*

ఈ శాసన లేఖకుడు "కృ" ధాతువునకు "లిట్"లో ప్రేరణార్థకమున వచ్చెడి "కారయామాస" అను రూపమును ఎరుగకయో పొరపాటుననో "చకార" అనెడి స్వార్థరూపమును వాడుటచే భారతమునకు రాజరాజే కర్తయనెడి సిద్ధాంతము బయలుదేరినది. ఇయ్యెడ క్రియాపదము తప్పినది ఇట్టి దోషములు శాసనములలో తండోపతండములుగ నుండును. శాసన వ్యాఖ్యాతలు వాటిని సవరించుకొనియే అర్థమును సరిపెట్టుకొందురు శాసనార్థమును యథాక్షరముగానే గ్రహించినచో చరిత్ర నిర్మాణమునకే అనేక ప్రతిబంధకము లేర్పడును అదీగాక కొన్ని యెడల ధనాశచే ఆస్థాన కవులు తాము రచించిన గ్రంథములకు రాజుల పేర్లు పెట్టుట ఉండవచ్చునుగాని, రాజే తాను రచించిన గ్రంథమునకు ఆస్థానకవి పేరు పెట్టుట విపరీత కార్యము మరియు కొద్దిగనో గొప్పగనో గ్రంథరచనా సందర్భమున నారాయణభట్టు తనకు చేసిన సాయమునకు నన్నయ ఎంత కృతజ్ఞతా పూర్వకముగా అతనిని నుతించెనో చూచిన మనము అన్యకర్తృక గ్రంథమునకు తన పేరు పెట్టుకొనుటకు సమ్మతించెనని నమ్మజాలము. ఈ శాసనకర్తకు రాజరాజును స్తుతించుటే ప్రధాన ప్రయోజనము గనుకను భారత రచనా ప్రోత్సాహము ఆ ప్రశంసకు ఒక వన్నెపెట్టును గనుకను అతడు భారత ప్రసక్తి తెచ్చెనేగాని, భారతకర్త రాజరాజు అని స్థాపించుటకుకాదు ఇంతకు ఈ శాసన శ్లోకములో క్రియాపద ప్రయోగము దుష్టమగుట దప్ప వేరు విశేషము లేదు. అది యట్లుండగా భారత రచనలో నన్నయయును, నారాయణభట్టును కలిసి జంటకవనము చెప్పి యుందురనియు దానినే నన్నయ "సహాధ్యాయుడునైన వాడభిమతంబుగ తోడయి నిర్వహింపగన్" అని యుదాహరించె ననియు జంటకవనమే కానిచో తోడై నిర్వహించుట అనుమాట పొసగదనియు మరికొందరు చెప్పుదురు. అది జంటకవనమే అయినచో నన్నయ తన పేరుమీదనే భారతమును చెల్లించుకొనుటకు సాహసింపడు ఆశ్వాసాంత గద్యములన్నిటిలో నన్నయ రచించినట్లే కలదు కదా! అట్టి కృతఘ్నత ఆ పవిత్ర వర్తనునకు అంటగట్టరాదు. అయినచో నారాయణభట్టు చేసిన సాయము ఎట్టిదైయుండును? భారతము పంచమ వేదమనెడి ప్రశస్తి కలదగుటచే దానిని దేశభాషలో అనువదించుటకు శ్రోత్రియులు అంగీకరించి యుండరు నాడేకాదు నేటికిని వేదములు దేవభాషలో ఉండవలెనుగాని

దేశభాషలో ఉండతగవని చాలమంది యభిప్రాయము వేదములను తెనిగించినచో ప్రజలకు వేదార్థములు బోధపడెడు మాట నిజమే కాని, ఆ తెలుగుసేతలో వేదమంత్రముల మహత్వము మాత్రము ఉండదు మంత్రముల యొక్క అలౌకిక శక్తియు అవి యొసగు సత్ఫలములును వాటి అక్షర సంపుటిలో, స్వరశక్తిలో గర్భితమై యున్నవి గాని అర్థములో లేదని అరవిందయోగి చేసిన ఉద్ఘాటనలో చాల సత్యము కలదని పెక్కుర అభిప్రాయము. భారతములో వేదమంత్రములు లేకపోయినను, వేద శిరస్సులని చెప్పెడి ఉపనిషత్తుల సారమైన భగవద్గీత అందు ఒక భాగమై ఉన్నది గనుకను అనువాదమునకు ఉపక్రమించిన కవి ఆ భాగమును గూడ తెనిగింపవలసియుండును గనుకను ఆ తెనిగింపు వేదములు తెనిగించుటయే అగునని వారు భయపడి యుందురు భారతాంధ్రీకరణము వంటి మహాకార్యము శిష్ట జన సమ్మతమైనపుడే సఫలమగును గాని రాజాజ్ఞామాత్ర నిర్వర్తితమైనంత మాత్రమున సఫలముకాజాలదు. నిరంకుశుడైన రాజైనను సదసద్వివేచనగల పౌరులకు సమ్మతము కానట్టి కావ్యమును తలపెట్టి నెగ్గలేడు రాజనరేంద్రుడు అట్టి నిరంకుశుడై యుండడు. నన్నయభట్టు పండిత సమ్మతము కాని రచనకు పూనుకొనువాడును గాడు ఆ రాజుగాని ఆ కవిగాని దేశభాషాహితము కోరి చేయబూనిన ఆ సారస్వత కార్యము శిష్టజనామోదము మీదనే నెరవేర్ప కుతూహలపడి యుందురు ఈ ఊహ నిజమయ్యేనేని పండితవర్గములో కొంతమందికి కలిగిన భయసందేహములను పండితసదస్సులో తర్కించి, వారినిసమాధాన పరచుటకు నారాయణభట్టువంటి బహుభాషా విజ్ఞుడును, ఉద్దండ పండితుడును అయిన ఒక మిత్రుని సహాయము నన్నయభట్టునకు అవశ్యకమై యుండును ఆ వాగ్వివాదములో పాల్గొని నారాయణభట్టు శిష్టజనులను సమాధానపరచి నన్నయ పూనికను సుకరముచేసి యుండును. మత గ్రంథములు దేశభాషలలోనికి అవతరించుట తగదనెడి అభిప్రాయము పూర్వకాలమున మనదేశముననే కాక ఇతర దేశములలో కొన్నింట కలదు ఇంగ్లాండులో 16వ శతాబ్దిలో "రోమన్ క్యాథలిక్" మతమును త్రోసిపుచ్చిన మత సంస్కారము జరిగినపుడు బైబిలు గ్రంథమును ఇంగ్లీషు భాషలో అనువదింపవచ్చుననియు, అనువదింపరాదనియు రెండువర్గములవారు పట్టుదలతో వాగ్యుద్ధములు చేరిసి అనువాదమునకు అనుకూలమైన వర్గమునకు టిండేల్ (Tindale) అనునొక విద్వాంసుడు నాయకత్వము వహించెను. మరి థామస్ మోర్ (Thomas More) అను ఇంకొక విద్వాంసుడు బైబిలు ఇంగ్లీషులో అనువదించుట యనగా దానిని అపవిత్రము చేయుటయేయని ఎదిరి వాదమును నిర్దయముగ ఖండించెను. ఆ వాగ్యుద్ధము ఖడ్గ యుద్ధముకంటె ఘోరముగా టిండేల్ (Tindale) ప్రజల కోపాగ్నికి ఆహుతి యయ్యెను అయినను 8వ హెన్రీ (Henry VIII) థామస్ మోర్ (Thomas More) కు మరణశిక్ష విధించి మత సంస్కారముతో పాటు బైబిలుయొక్క ఆంగ్లానువాదమును కూడ ప్రజలచే శిరసావహింపజేసెను ఏ కాలమందైనను, ఏ దేశమందైనను జాతిభేదములు మతభేదములు ఎట్లున్నను మానవస్వభావము సర్వత్ర ఒకటిగానే యుండునని తెల్పుటకు ఈ నిదర్శనమీయబడినది ప్రాచీన కాలమున జరిగిన మహాయుద్ధములలో అనేకము ధర్మయుద్ధములనుపేర మతమును పురస్కరించుకొని జరిగినవే యధార్థముగ కొన్ని యుద్ధములలో మతము

మూలకారణము గాకున్నను మత సంరక్షణార్థమే పోరుటకు తారసిల్లినట్లు రాజులు ప్రజలను ఉద్బోధించెడివారు. మతావేశముతో యుద్ధము జేసెడి సేన ప్రళయకాలునివలె తాండవించి శత్రుసంహారము చేయగలదు. కనుక మత రక్షణార్థము, ధర్మరక్షణార్థము జరిగెడి వివాదములుకూడ చాల తీక్షముగానే యుండును. అట్టి వివాదములలో ఎదిరి పక్షమును సమాధానపరచుట సర్వతంత్ర స్వతంత్రుడును, సమర్థుడును, సమదర్శియును అయిన విద్వాంసునికే సాధ్యమగును నారాయణభట్టు అట్టివాడై యుండును. మరియు నారాయణభట్టు చేసినది రచనలో ఏదోకొంచెపు మాట మాత్రపు సహాయమే అయినచో

*ఉ॥ పాయక పాకశాసనికి భారత ఘోరరణంబునందు నా*
*రాయణునట్లు వాణస ధరామరవంశ విభూషణుండు నా*
*రాయణభట్టు వాఙ్మయధురంధరుఁడుం దనకిష్టుఁడున్ సహా*
*ధ్యాయుడునైన వాఁడభిమతస్థితిఁ దోడయి నిర్వహింపగన్.*

అనెడి ఉపమానమే నిరర్థకమగును. ఈ యుపమానములో ఇంకొక విశేషము ఉన్నట్లు నాకు పొడగట్టుచున్నది. పాకశాసనికి నారాయణుడు భారతయుద్ధమున చేసినది ఆయుధము పట్టని సహాయము.

కం॥ "ఊరక నిరాయుధ వ్యాపారతమై నుండువాడ బరమాప్తుడనై." అది రథసారథ్యరూపమునను, సమయోచిత హితోపదేశ రూపమునను నెరవేరినది. అట్లే ఇయ్యెడను నారాయణభట్టు గంటము పట్టని సహాయమేచేసి సారథ్యము నడపెను. మూల భారతమును తెనిగించుటలో ఏ ప్రకరణమును ఎత్తివేయవలెనో, ఏ ప్రకరణమును ఎంతవరకు తగ్గింపవలెనో, ఏ అర్థము ఎంతవరకు చెప్పవలెనో, ఏ వాక్యార్థమును మార్చవలెనో ఇరువురును కలసి సంప్రదించుకొన్నప్పుడు నారాయణభట్టు చేసిన సముచిత సూచనలను సంతోషపూర్వకముగ స్వీకరించి ఆ ప్రకారము నన్నయభట్టు రచన సాగించియుండును. నన్నయ నందంపూడి శాసనము నందు 'సంస్కృత కర్ణాట ప్రాకృత పైశాచికాంధ్ర భాషా సుకవిరాజశేఖర ఇతి ప్రథిత సుకవిత్వ విభవేన్' అని నారాయణభట్టును గూర్చి ప్రశంసించెను. అట్టి నారాయణభట్టు కన్నడ భారతమును చదివి యందలి లోపములిందు కలుగకుండునట్లు సలహా నిచ్చియుండును గ్రంధారంభమునుండి కవికి ఆ సహాధ్యాయుడు చేదోడువాదోడుగా సహాయపడుటబట్టియే కృతజ్ఞతాపూర్వకమైన ఆ పై పద్యము నన్నయ నోట వెలువడినది. అది యెంతయో సార్థకమైన పద్యము

## భారతాంధ్రీకరణ పద్ధతి

నన్నయగాని – తదుపరి, తిక్కన, ఎఱ్ఱనలుగాని సంస్కృత భారతమును ఎంతవరకు అనుసరించిరో, ఎంతవరకు అనువదించిరో తెలిసికొనుట చాల దుష్కరము ఏమన సంస్కృత భారత ప్రతులు అనేక రాష్ట్రములలో అనేక రీతులుగా నున్నవి వాటిలో ఉత్తరదేశ ప్రతులకును, దక్షిణదేశ ప్రతులకును చాల వ్యత్యాసము ఉన్నవి! ఉత్తరాది ప్రతులలో కూడ ఒండొంటికిని భేదమున్నది. వాటిలో నుండు కొన్ని ప్రకరణములు,

ఉపాఖ్యానములును వీటిలో కనబడవు. అట్లే వీటిలో నుండునవి వాటిలో కానరావు అందును ఇందును సమానముగా నున్న భాగములయందైనను శ్లోకసంఖ్య సరిపోదు మూలభారతము పుట్టిన పిమ్మట గడచిన ఇన్నివేల సంవత్సరములకాలములో ప్రతులు వ్రాసికొనువారు ఎవరికి తోచినట్లు వారు కొన్ని శ్లోకములు కల్పించి, కొన్నిటిని తొలగించి, కొన్ని ప్రకరణములను పెంచి, కొన్నిటిని తగ్గించి యుందురు కావున సమగ్ర గ్రంథము మనకు యధాతథముగా దక్కలేదు. ఈ తారుమారు నన్నయనాటికే జరిగినది ఎట్లనగా నన్నయకు పూర్వము కొన్ని వందల సంవత్సరములనాడే జావాద్వీపమునకు తరలిపోయి భారతము, ఉత్తరదేశ ప్రతులకంటె కొంచెము భిన్నముగా దక్షిణదేశ ప్రతులలో కొన్నిటిని పోలియున్నదట! ఇది సహజమే! బలి, జావా మొదలగు ద్వీపములకు వలసపోయిన భారతీయులు పూర్వకాలము కళింగాంధ్రము నుండి తూర్పు సముద్రము తరించిపోయినవారే గాన, వారు తమ వెంట గొనిపోయిన భారతము మనదేశమున అప్పుడు ప్రచారములో ఉన్న భారత ప్రతికి ప్రతియై యుండును. దానికిని నన్నయ పర్వ సంగ్రహములో చెప్పిన శ్లోక సంఖ్యకును ఎక్కువ తేడా లేదట మరి అరవ దేశమున గ్రంథలిపిలో కానవచ్చు భారతమునకును దానికిని ఎంతో భేదము లేదట నన్నయ పర్వసంగ్రహములో గణనజేసిన శ్లోక సంఖ్య లక్షకుమించి ఉన్నను (1,00,700) ఆనాటి తెలుగుదేశమున ప్రచారముననున్న భారతము ఇంచుమించు లక్ష శ్లోకపరిమితమై యుండుటబట్టి అదే ఎక్కువ ప్రక్షిప్తములు లేని మూల భారతముగ నన్నయ స్వీకరించియుండును. కవిత్రయమువారు ముగ్గురును దాక్షిణాత్యులే గనుకను, ఆంధ్రులే గనుకను ఆంధ్రదేశమున మొదట నన్నయకు లభించిన ప్రతివంటిదే తక్కిన ఇరువురకును లభించి యుండుననుకొనుటలో సామంజస్యము కలదు. ఇటీవల వ్యాస భారత పాఠనిర్ణయమును గూర్చి భారతదేశమున పరిశోధనలు చేయుచున్న విద్యత్సంస్థలు నన్నయనాటికి తెలుగుదేశమున ప్రచారములోనున్న తెలుగు భారతమే తక్కిన వాటికంటె మూలభారతమునకు ఎక్కువ సన్నిహితముగ నున్నదని ఒప్పుకొనిరి దానినిబట్టియే కీ.శే P.P S. శాస్త్రి సంపాదకత్వమున నాగరిలిపిలో వావిళ్లవారు అచ్చువేసిన భారతము నన్నయ గణించిన పర్వసంగ్రహ శ్లోకసంఖ్యకు అనుగుణముగ పరిష్కరింపబడినది. శ్రీ శాస్త్రి పరిష్కరించిన ఈ భారత ప్రతి దక్షిణదేశమునందు తెలుగులిపిలో, గ్రంథలిపిలో లభించిన ప్రతులన్నింటి తోడ్పాటుచే నిర్ణయింపబడినది గావున తెలుగు భారతమును మూలముతో పోల్చి చూచునపుడు ఆ ప్రతినే ఆధారముగా గైకొన్నచో ఎక్కువ దారి తప్పిపోకుండ నడువవచ్చును.

నన్నయ కథామాత్ర ప్రధానమును, యథోచితానుసరణమును అయిన అనువాదమునే ప్రారంభించెనుగాని, మూలవిధేయముగా యధాతథముగ తెనిగింప పూనుకొనలేదు అట్లని మిక్కిలి స్వతంత్రించి మూలమునకు దూరముగ తొలగి పోలేదు. సందర్భ వశమున ఒక మూలశ్లోకము రమణీయమని తోచినపుడు మురిపెముతో దానిని ఒక పద్యమున తెనిగింపకపోలేదు

నన్నయభట్టు వ్రాసిన భారత భాగములో సుమారు నాలుగువేల పద్యములు గలవు. ఆ భాగము సంస్కృతమున సుమారు పదునేడువేల శ్లోకములలో నున్నది. ఈ లెక్కనుబట్టి నన్నయ తన గ్రంథమును నాల్గవ వంతునకు సంక్షేపించెనేమోయని

భ్రమపడరాదు కథాప్రాధాన్యమునకు భంగము రాకుండ గ్రంధము సంక్షిప్తమైనమాట నిజమేకాని, అది నాల్గవ వంతునకు తగ్గిపోవుట మాత్రముకాదు ఏమన మూలశ్లోకములను యథాక్రమముగ అనువదింపవలెనని గాని, అనుసరింపవలెననిగాని ఆయన సంకల్పించలేదు. మూలార్థమును గైకొని కథను నడుపుచున్నప్పుడు రెండు మూడు శ్లోకముల అర్థము ఒక పద్యములో ఇమిడిన సందర్భములును, అనేక శ్లోకముల యర్థము ఒక వచనమున వ్రాయబడిన సందర్భములును కలవు సంస్కృత శ్లోకములు తెలుగు వృత్తముల కంటె చాలచిన్నవి గనుక అట్లు ఇముడుట సహజమే! మరి కథావశమున ఏదేని యొక శ్లోకార్థము ఒక పద్యమున కానవచ్చినపుడు సర్వత్ర అట్లే ప్రతి శ్లోకమునకు ప్రతి పద్యము ప్రతిబింబముగా నుండుననియు అనుకొనరాదు. ఆ శ్లోకము యొక్క ఇంపునకు మురిసి నన్నయ ప్రత్యేకముగ దానిని ఒక పద్యముగ వ్రాయును మరికొన్ని యెడల రమణీయములైన శ్లోకములను తడవక వదిలి వేయుటయు కలదు. దారిలేని చోట నడచువాడు దారి చేసికొనవలసివచ్చినపుడు అటునిటు తీగలను పొదలను ఒత్తిగించి నడచుటలోకొన్ని పూతీగలు తెగిపోవుటయు కొన్ని పూలు రాలిపోవుటయు సహజమేగదా! మరియు పరంపరాగతములై తన చెవిసోకిన అనేక చరితములను, అర్థవంతములును, నీతిదాయకములును అని తనకు తోచిన వాటిని – సంప్రదాయ సంరక్షణార్థము పురాణేతిహాసములు అను పేర వ్యాసుడు భారత కథతో అతికి వాటి ఉనికికి స్థిరత్వము చేకూర్చెను. చిన్నవియు పెద్దవియునైన ఆ ఉపాఖ్యానముల మూలమున ప్రధాన గ్రంధము అవశ్యకమునకు మించిన విపులత తాల్చినట్లు పొడగట్టును. అందును అవతారికాప్రాయమైన మొదటి రెండుమూడు ఉపపర్వముల గ్రంధము మహాగహనమువలె నీరంధ్రముగ అల్లుకొని ఉన్నది. భారత కథారంభమునకును ఈ భాగములోని కొన్ని ప్రకరణములకును దూరబంధుత్వమే గాని దగ్గరి చుట్టరికము లేదు. మరియు బ్రహ్మకోశమువలె ఇతిహాస పురాణములు సయితము శ్రుతముగానే నేర్వబడి సంరక్షింపబడవలసిన ఆ కాలములో గ్రంధ సందర్భమునకు విషయ సూచిక కాదగిన అంశములుకూడ ఈ గ్రంధములో అంతర్భాగములే కావలసిన అవశ్యకము కలిగినది పర్వసంగ్రహ పర్వానుక్రమణికాది కధనమంతయు ఆ జాతిలోనిదే. ముద్రణ సౌభాగ్యమెరుగని మన పూర్వులు గ్రంధ సంరక్షణార్థము పడినపాట్లకు పన్నిన ఉపాయములకు ఇదియొక దృష్టాంతము. నన్నయభట్టు వ్యాసుని గ్రంధావతారికాగహనమును చాలవరకు ఛేదించి మార్గమును సుగమము చేసెను. చూడుడు –

మూలమున ఉదంకుని చరిత్ర అతని గురుపరంపరతో ప్రారంభమగును. అతనికి పరమాచార్యుడైన అయోధధౌమ్యుడు అనే ఒక ఋషి తన శిష్యుల భక్తి శ్రద్ధలను నిశితముగా పరీక్షించి వారి అర్హతలను మెచ్చుకొని ఆశీర్వదించి పంపుచుండును. ఆ గురుశిష్యుల చరితమును ఉగ్గడించుచు వ్యాసుడు మూడు కథలను వ్రాసెను వాటిలో ఉపమన్యుడనెడి బాలునికథ అతి రమణీయముగ హృదయావర్జకముగ నుండును నన్నయ ఆ భాగమునంతను అనావశ్యకమను బుద్ధిచే ఎత్తివేసెను. ఆ విసర్జనలో రమణీయమైన ఉపమన్యుని కథ పోవుచున్న దనెడి విచారము అయనకు కలిగియుండదు అట్లుగాక ఇంపైన ఆ కథను చెప్పబూనినచో మీరరాని ఒక క్లేశము తటస్థించును.

అది ఏదన! ఉపమన్యుడు వనములో గురువుగారి గోవులు కాయుచు ఆకలి భరింపలేక జిల్లేడాకులు తిని అంధుడై ఒక నూతిలోపడి వెదకుకొనుచు వచ్చిన గురువుగారి ఆదేశమున అశ్వినీ దేవతలను స్తుతించి వారి అనుగ్రహమున దృష్టిబడసెను. ఈ స్తుతి ఋక్కులలో చేయబడ్డది అవి వేదమంత్రములు. తత్కాధారామణీయకముచే వశీకృత చిత్తుడైన నన్నయ ఈ భాగమును తెనిఁగింప పూనుకొన్నచో ఈ ఋక్కులను తెనిగించుటెట్లు? వేదమంత్రములను తెనిగింపరాదుకదా? తెనిఁగించినచో పండితనింద తప్పదుకదా? తెనిగింపక "అశ్విని దేవతలను స్తుతించి దృష్టిబడసెను" అని ఒక వాక్యముతో దాటిపోయినచో ఆ కథకు మకుటాయమానమైన ఆ ఋక్కుల అర్థము జారిపోవునుగదా? ఉదంకుని కథకు ఆ భాగము అనావశ్యకమనెడి అభిప్రాయమున కాక ఈ ఋక్కుల యనువాద విషయమునగల క్లేశమును గుర్తించి నన్నయ దానిని ఎత్తివేసెనని నేను అనుకొందును. అట్లే సభాపర్వమున పాండవులు దిగ్విజయము చేసిన ఘట్టమున నానారాజుల వంశములును వారి చరిత్రలును విపులముగ వర్ణింపబడియున్నవి. తెలుగు భారతమున ఆ భాగమంతయు సంక్షిప్తము చేయబడినది. ఆ రాజుల చరిత్ర యంతయు తెలుగున లేదు కావున ఐతిహాసిక జిజ్ఞాసగలవారికి తెనుగు భారతము తృప్తి నీయదు. ఇదియేకాదు, తెనుగున ఏ పురాణమును సంస్కృత పురాణమువలె ఐతిహాసిక పరిశోధనలకు పనికిరాదు భారతాది పురాణేతిహాసములు దేశభాషలో అవతరించు కాలమునాటికి ఆ చరిత్రాంశముల ఆవశ్యకము లేకపోగా అవి అప్రస్తుతములనెడి భావముకూడ అనువాదకులకు కలిగియుండును. నన్నయ సభాపర్వభాగమును చాల సంగ్రహపరచెను.

మూలమున ఉదంకుని నాగస్తుతి తొమ్మిది శ్లోకములలో నున్నది. వాటి తాత్పర్యమును నన్నయ నాలుగు పద్యములలో చెప్పెను

ఆ శ్లోకముల వ్యస్తపదములనుగాని, సమస్తపదములనుగాని అనుకరించుటకును, అనువదించుటకును ఆయన ప్రయత్నము చేయలేదు నాగస్తుతి పూర్వకములైన ఈ క్రింది నాలుగు పద్యములు మూలకరావలంబమైనను లేని స్వతంత్ర గమనము కలవి

*1.చ॥* బహువన పాదపాబ్ధికుల పర్వతపూర్ణ సరస్సరస్వతీ
సహిత మహామహీభర మజస్రసహస్ర ఫణాలి దాల్చి దు
స్సహతర మూర్తికిన్ జలధిశాయికిఁ బాయక శయ్యయైన య
య్యహిపతి దుష్కృతాంతకుఁడనంతుడు మాకుఁ బ్రసన్నుఁడయ్యెడున్.

*2 చ॥* అరిది తపోవిభూతి నమరారుల బాధలు వొందకుండఁగా
నురగుల నెల్లఁగాచిన మహోరగనాయకుఁడాన మత్సురా
సుర మకుటాగ్రరత్నరుచి శోభిత పాదున కద్రినందనే
శ్వరునకు భూషణంబయిన వాసుకి మాకుఁ బ్రసన్నుఁడయ్యెడున్.

*3.ఉ॥* దేవమనుష్య లోకములఁ ద్రిమ్మరుచున్ విపులప్రతాప సం
భావిత శక్తి శౌర్యులు నపార విషోత్కట కోపవిస్ఫుర
త్పావక తాపితాఖిల విపక్షులునైన మహానుభావులై
రావతకోటి ఘోరఫణి రాజులు మాకుఁ బ్రసన్నులయ్యెడున్.

4 ఉ॥ గో(త్రమహామహీధర నికుంజములన్ విపినంబులం గురు
క్షేత్రమునం (బకామగతి ఖేలననొప్పి సహాశ్వసేనుcడై
ధాత్రిc బరి(భమించు బలదర్ప పరా(క్రమదక్షుcడీక్షణ
(శ్రోత్ర విభుండు తక్షకుcడు శూరుcడు మాకుc (బసన్నుcడయ్యెడన్.

పౌష్యోదంకులు పరస్పర శాపము లిచ్చుకొని శాపములు ఉపసంహరించుకొనవలసి వచ్చినపుడు పౌష్యుడు తనకు ఉపసంహారశక్తి లేమికి కారణమును నిర్దేశించిన ఈ క్రింది శ్లోకమును నన్నయ యధాతథముగ తెనిగించి తెలుగు పద్యమునకు మూలముకంటె ఎక్కువ నిండుదనమును సంపాదించెను. ఇట్టి తెనిcగింపు మూల శ్లోకమునకు మురిసి చేసినది.

శ్లో॥ "యథానవనీతం హ్పాదయం (బాహ్మణస్య
వాచిక్షురో నిశిత స్తీక్ష్ణధారః
తదుభయమేత ద్విపరీతం క్షత్రియస్య
తదేవంగతేన శక్తోహం తీక్ష్ణహ్పాదయ
త్వాత్తం శాతమన్యథా కర్తుం గమ్యతాం"

తెలుcగు సేత

ఉ॥ నిండుమనంబు నవ్యనవనీత సమానము పల్కు దారుణా
ఖండల శస్త్రతుల్యము జగన్నుత విప్రులయందు నిక్కమీ
రెండును రాజులందు విపరీతముగావున విప్రుcడోపు నో
పం డతిశాంతుcడయ్యు నరపాలుcడు శాపము (గమ్మరింపగన్.

మూలమున ఒక ఆశ్వాస మంతయు నిండియున్న దుస్సలా జననము
ఆ తనూజుల కందఱ కనుజయై ల
తాంగి దుస్సలయను గూతు రమరcబుట్టె
నందు శాహ్రతవంతుల పైన పుణ్య
గతియు గాంతునే నని పొంగెcగౌరవుండు – ఆ.5,ప 108

అని యొక పద్యమున జెప్పెను

పాండురాజు మరణమునకు హేతుభూతమైన మాద్రీసంగమ సందర్భమున ఆ దంపతులు ఇరువురు విహరించిన వసంతోద్యాన శోభావర్ణనలో నన్నయ్య మూల శ్లోకార్థము నేమియు తడవక స్వయముగ తుమ్మెద ఝుంకారములును, కోయిల కూజితములును, చెవిసోకునట్టి రెండు లయ(గాహి వృత్తములను (వాసెను. ఇయ్యెడ సందర్భానుసరణమే గాని శ్లోకానువాదము లేనేలేదు.

1. లయ(గాహి:

కమ్మని లతాంతములకు మ్మొనసివచ్చు మధుపమ్ముల సుగీత
నినదమ్ము లెసగెం జూ
తమ్ముల లసత్కిసలయమ్ముల సుగంధి ముకుళమ్ములను నానుచు
ముదమ్మొనర వాచా
లమ్ములగు కోకిలకులమ్ములరవమ్ము మధురమ్మగుచు విన్చె ననిశమ్ము సుమనోభా

*రమ్ముల నశోకనికరమ్ములును జంపకచయమ్ములును గింశుక*

*వనమ్ములును నొప్పెన్*

2. లయగ్రాహి:

*చందనతమాలతరులందునగరుద్రుమములందు గదళీ వనములందు లవలీమా*
*కందతరుషండముల యందు నని మీలదరవింద సరసీ వనములందు వన రాజీ*
*కందళిత పుష్ప మకరంద రసముందగులుచుం దనుపు సౌరభము*

*నొంది జనచిత్తా*

*నందముగ బ్రోషితుల డెందము లలందురఁగ మందమలయా*

*· నిల మమందగతి వీచెన్.*

కచదేవయాని కథ మూలమున రమ్యాతిరమ్యముగా నున్నది. ప్రాప్త యౌవనయు, స్వతంత్రయు నగు దేవయాని, సురూపబ్రహ్మచర్యవ్రతుడగు కచుని ప్రేమించుట అస్వాభావికముగాదు అంతవరకు వ్యాసుడు సమ్మతించెను దేవయాని కోర్కె సహజమయ్యును, ధర్మవిరుద్ధ మగుట నది ఫలించుట కాత డంగీకరింపజాలడు కచుడు మృదూక్తులచే తప్పించుకొనును తాను శుక్రుని గర్భము నుండి వెడలిన వాడగుట నేకగర్భ జనితులకు దాంపత్యము పొసగదగును వ్యాసుడీ పాత్రములను నిష్పాక్షికముగా చిత్రించెను వ్యాసుడు దేవయానియెడ సానుభూతి చూపినను, కచుని యందు కూడ అట్టి ధర్మబుద్ధినే నెఱపి ధర్మరక్షణమును కవి కృత్యమును చక్కగా నిర్వహించెను

నన్నయ దేవయాని కోర్కె ధర్మ విరుద్ధ మగుట, కచుని పక్షమూని ఆమె ఆశయమును ఖండించును కచుని మాటల యందు మూలమున నున్న నేర్పు లేదు. కచుడు విషాదాకులుడై ఆమె కోర్కె నింద్యము, అనుచితము అని పలికి ఖండితముగా నిరాకరించును. దాన మూలమునకు వన్నె తగ్గినది

కచుని గురు శుశ్రూషా సందర్భమున నన్నయ వ్రాసినవి రెండు లోకోత్తరములైన పద్యములు గలవు ఆ రెండింటికిని ఆధారమైన మూల శ్లోకములును గలవు. కాని తెలుగు పద్యములు మూలార్థమునే గ్రహించినను వాటికంటె పుష్టి మంతములును ఉజ్జ్వలములును అయి యున్నవి. ఇవియును కథావశమున విడిచిపెట్టరాని శ్లోకములని భావించుట చేతనే ఆయన వాటిని తెనిగించెనని యనుకొనవలెను. ఆ శ్లోకములు, పద్యములు ఇవి:

శ్లో॥ *ఆహూతంచాగ్ని హోత్రంతే! సూర్యశ్చాస్తం గతః ప్రభో*
*అగోపాశ్చాగతా గావః। కచస్తాత నదృశ్యతే॥*

శ్లో॥ *వ్యక్తం హతోమృతో వాపి। కచస్తాత భవిష్యతి*
*తంవినానచజీవేయం, కచం సత్యం బ్రవీమితే॥*

తెలుగు:

ఉ॥ *వాఁడిమయూఖముల్ గలుగువాఁడపరాంబుధిఁ గ్రుంకె ధేనువుల్*
*నేఁడిట వచ్చెనేకతమ నిష్ఠ మెయిన్ భవదగ్ని హోత్రముల్*
*పోఁడిగ వేల్వఁగాఁ బడియెఁ బ్రొద్దుసుబోయెఁ గచుండు నేనియున్*
*రాఁడు వనంబులోన మృగరాక్షస పన్నగ బాధనొందెనో*

శ్లో॥ యస్యాంగిరా వృద్ధతమః పితామహో
బృహస్పతి శ్చాపి పితా తపోనిధిః
ఋషేః పుత్రం తమధో వాపి పౌత్రాం
కథం న శోచేయ మహం నరుద్యామ్॥

**తెలుగు:**

మ॥ మతిలోకోత్తరుఁడైన యంగిరసు మన్మండాశ్రితుండా బృహ
స్పతికింబుత్త్రుఁడు మీకు శిష్యుఁడు సురూప బ్రహ్మచర్యాశ్రమ
వ్రతసంపన్నుఁడకారణంబ దనుజవ్యాపాదితుండైన న
చ్యుత ధర్మజ్ఞ! మహాత్మ! యక్కచునకే శోకింప కెట్లుండుదున్

కాని ఈ కథలో కచుడు దేవయానిని వీడ్కొని గురుకులమును విడిచిపోవు సందర్భమున వారిరువురి సంభాషణలో మూలమున కానవచ్చెడి సౌకుమార్యము తెనుగునకానరావు. ఈ లోపమునకు గల కారణము వేరొకచో చెప్పెదను

ఈ గ్రంథమంతయు నిట్లే అనువాదమయ్యు కానట్లు స్వేచ్ఛగా సాగిపోవును

## నన్నయ శైలి - భాష - ఆత్మీయత

శైలియను పదము భాషాపరముగ నే నెరిగిన ఏ అలంకార శాస్త్రములోను లేదు ఇతరత్ర ఎచ్చటనైన ప్రయుక్తమై యున్నదేమో నేనెరుగను. దానికి శబ్ద నిష్పత్తిని బట్టి "శీలవంతుని భావకర్మ" అని ఒక నిఘంటువులో నున్నది. ఈ నిర్వచనములో "శీలవంతుని" అనెడి విశేష వాచకము సాధారణవాచకముగా గ్రహించినచో మానవుని భావకర్మ అని యర్థమగును. భావకర్మ అనగా మానవుడు శారీరకముగా గాక మానసికముగా చేసెడి వ్యాపారము కాగా శైలికి మానవుని మనోవ్యాపారము అని యర్థము వచ్చును దానికే భావగతి యనిపేరు. ఆ భావమును శబ్దరూపమున వ్యక్తము చేయునపుడు ఆ భావగతి శబ్దగతిగా రూపొంది ఆంగ్లమున Style అను పదము ఏ యర్థమున వాడబడుచున్నదో ఆ యర్థమునకు సరిపోవును. కావున కల్పితమైనను శైలియను పదము శాస్త్రసమ్మతమే యగునని నా తలంపు. ఇది బహుజనాంగీకృతమగుటచే విమర్శకులు ధారాళముగా వాడుచుండిరి. ఆంగ్లమున సాహిత్యపరముగానే గాక ఆ పదమును తీరు, సరణి, రీతి మొదలగు ఇతరార్థములలో కూడ వాడుచుందురు.

సాహిత్యపరముగ శైలిని రెండు విధములుగ విభజింపవచ్చును. ఒకటి కావ్య సామాన్య సరణి; రెండవది పదగుంభన సరణి. మొదటిది వస్తు విన్యాసమునకు సంబంధించినది. రెండవది శబ్ద విన్యాసమునకు సంబంధించినది మొదటిదాని వివరణ మిది:– వాఙ్మయము అనిపించుకొనదగిన గ్రంథజాలమంతయు ఏ యే రూపములలో ఉన్నను అది ప్రధానముగ మూడు శాఖలకు చెంది యుండును. ఆ మూడింటిలో మొదటిది ఆఖ్యానము (Narrative) రెండవది నాటకము (Dramatic) మూడవది వర్ణనము (Description) కథన రూపమున చెప్పబడిన కావ్యములన్నియు ఆఖ్యానములు. వాటి సరణి ఆఖ్యానశైలి. సంవాద రూపమున

చెప్పబడిన కావ్యములన్నియు నాటకములు వాటి సరణి నాటకీయ శైలి కథనమునకు గాని, సంవాదమునకు గాని ఆధారమైన ఇతివృత్తమేదియు లేకుండ కేవలము ఒక మనోభావము యొక్కగాని ఒక రమణీయ పదార్థము యొక్కగాని ప్రపంచనము కల రచనలు వర్ణనలు. అట్టి వర్ణనలతో ఇతివృత్తము పెంచి రచించిన కావ్యముల సరణి వర్ణనాత్మక శైలి

ఈ మూడును ఒండొంటికి సంబంధము లేని ప్రత్యేక లోకములు కావు ఆఖ్యానములలో సంవాదములు గాని వర్ణనలుగాని యుండవని అనుకొనరాదు. అట్లే నాటకీయ శైలిగల కావ్యమున ఆఖ్యానశైలి యుండదనియు తలపరాదు ఏకావ్యమున ఏ సరణి ఎక్కువగా భాసిల్లునో ఆ ప్రాధాన్యముబట్టి ఆ శైలిని స్థూలముగా నిర్ధారణ చేయుటయే గాని కేవలము ఆ గుణము ఒక్కటే కలదని యభిప్రాయము కాదు. ఒక వ్యక్తిని సత్వగుణ ప్రధానుడు అనిగాని రజోగుణప్రధానుడు అనిగాని తమోగుణ ప్రధానుడు అనిగాని అన్నప్పుడు అతనిలో తక్కిన రెండుగుణములును తక్కువపాలు ఉండునను అర్థమే కాని పూర్తిగా నశించిపోయినవని యర్థముకాదు అందుచేతనే ప్రధానమను విశేషణము వాడబడుచుండును అట్లే కావ్యశైలి విషయమునకూడా.

రెండవదాని వివరణ మిది కావ్యకర్త స్వీకరించిన శబ్దములయొక్కయు ఆ శబ్దముల కూర్పుచే రచించెడి వాక్యముల యొక్కయు గుణమును వ్యక్తము చేయునది పదగుంఫన సరణి. పాఠకునకు కావ్యపఠనమువేళ కలిగెడి విక్రియ (Reaction) కు కవియొక్క వాక్య రచనాసరణియే కారణము. అలంకార శాస్త్రమున చెప్పబడిన గుణదోష ప్రకరణములు ఈ శబ్ద విన్యాస సరణిమీద ఆధారపడి రచింపబడినవియే ఆ శాస్త్రములలో చెప్పబడినట్టియు, చెప్పబడనట్టియు కావ్యగుణములన్నియు (1) బుద్ధిగమ్యము (Intellectual) (2) భావస్ఫోరకము (Emotional) (3) కర్ణపేయము (Aesthetic) అనెడి మూడు వర్గములకు చెంది యుండును. ఏ కావ్యమునందైనను ఈ మూడు వర్గముల గుణములు సందర్భమును బట్టి సమ్మిళితములై యుండుట నిజమే అయినను ప్రధానముగా ఒక్కొక్క కవికి ఒక్కొక్క శైలి ఆత్మధర్మమై నెగడుచుండుట అంతకంటెను నిజము ఆ శైలిని బట్టియే అతని స్వభావము కూడ వ్యక్తమగుచుండును. శైలియే శీలము. ఆత్మీయతలో అదియొక భాగము

పై రెండు లక్షణముల బట్టి పరిశీలించిచో నన్నయది ప్రధానముగ ఆఖ్యాన శైలియని చెప్పదగును. అక్కడక్కడ నాటకీయ శైలియు కలదు వర్ణనలును కలవు బకవధకు పూర్వము బ్రాహ్మణకుటుంబమున భార్యాభర్తలకు, తండ్రి కొడుకులకు జరిగిన సంవాదము చక్కని నాటకీయరంగముగ దిద్దబడినది. సభాపర్వమున మయసభా దర్శనాంతరమున దుర్యోధనుని అసూయాగ్రస్త చిత్తవృత్తియు నాటకీయ ముగానే ప్రదర్శింపబడినది ఇది ఆంగ్లేయ విషాదాంత నాటకములలో నాయకుని అకార్యాచరణమునకు పురికొల్పెడి చిత్తాందోళనము వంటిది. మరియు అచ్చటచ్చటనిట్లే క్వాచిత్కములైన వర్ణనలును కలవు ఇట్టివి యున్నను నన్నయ శైలి నాటకీయముకాదు; వర్ణనాత్మకమును కాదు ఆయన ఉత్తమజాతి కథకుడు కథాగమనమునకు క్లిష్టతగాని, వక్రతగాని, అతి సంకుచితత్వముగాని, అతి విస్తృతిగాని కలుగకుండ ప్రసన్నముగ నిర్వక్రముగ అనతివిస్తారముగ నడపగలడు – ఈ ప్రజ్ఞనే

"సారమతింగవీంద్రులు ప్రసన్న కథాకలితార్థయుక్తి లోనారసి మేలునాన్" అని ప్రతిజ్ఞగా పేర్కొని దానిని సార్థకము చేసినాడు ఈ కథాప్రసన్నతతోపాటు ఆయన రచనలో చూడవలసిన రెండవ యంశము అర్థయుక్తి ఇతఃపూర్వము ఉదంకుని చరిత్రలో ఉదాహరించిన నాగరాజస్తుతి పూర్వకములైన పద్యములు మరల ఒకమాటు చదివి చూచినచో ఈ అర్థయుక్తికి చక్కని దృష్టాంత మేర్పడును. ఆ నాల్గు పద్యములలో ఉన్న రహస్య మేమనగా – మొదటి పద్యము అనంతుని స్తుతి. అనంతుడు సర్పజాతిలో ముఖ్యుడు. అతడు మహావిష్ణునకు శయ్యయగుటయేగాక సపత్నినాముడును అయి, భూభారము వహించి జగత్పూజ్యుడగుటచే మొదట ప్రస్తుతింపబడెను. అతని తరువాత ప్రధానుడు వాసుకి అనంతుడు విష్ణునకు శయ్యకాగా వాసుకి శివునకు భూషణమయ్యెను అందుచే రెండవ పద్యమున స్తుతింపబడెను. మూడవ పద్యములో దేవమనుష్య లోకముల సంచరించు ఐరావత నాగరాజ వంశస్థులందరు స్తుతింపబడిరి. ఇది సర్పజాతికంతకు సాధారణ స్తోత్రము. నాల్గవది ఉదంకుని కుండలములను హరించిన తక్షకునకు ప్రత్యేకముగా అంకితము చేయబడినది. ఈ విధముగ ఈ నాల్గుపద్యముల అనుక్రమములో గర్భితమై యున్న అర్థయుక్తిని గ్రహించి, 'సారమతింగవీంద్రులు లోనారసి మేలు' అందురని నన్నయ ఆశ తరచి చూచినకొలది ఇట్లే ఈ యర్థయుక్తి పెక్కుచోట్ల కానవచ్చు చుండును.

ఇక రెండవదియగు శబ్దవిన్యాసశైలీ భేదములు మూడింటిలో నన్నయది కర్ణపే యమైన శైలి. ఈ శైలి లక్షణ మేమనగా పద్యము విన్నంతనే అర్థము తెలిసినను తెలియకపోయినను పాఠకుని చెవికి ఇంపునింపి పోయిగొల్పుట. పై ఉదంకుని స్తోత్రపద్యములు మరల దీనికిని ఉదాహరణములు. మరి ప్రసిద్ధములైన–

మ॥ "నరచాపప్రవిముక్తదారుణ బృహన్నారాచ ధారల్ భయం
కరదైతేయనికాయ కాయములపైఁ గప్పెన్ దిశల్ నిండ బం
ధుర ధాత్రీధర తుంగశృంగతట సందోహంబుపై గప్పు దు
ర్ధర ధారాధరముక్త సంతత పయోధారావళిం బోలుచున్.

చ॥ జలధివిలోలవీచి విలసత్కలకాంచిసమంచితావనీ
తల వహనక్షమంబయిన దక్షిణహస్తమునందదున్న మ
ద్గళ దురుఘర్మవారి కణక్రమకరాబ్జమువట్టి నూతిలో
వెలువడఁ గోమలిందిగిచె విశ్రుతకీర్తి యయాతి ప్రీతితోన్

మ॥ మద మాతంగతురంగ కాంచనలసన్మాణిక్య గాణిక్య సం
పదలోలిం గొనివచ్చి యిచ్చి ముదమొప్పంగాంచి సేవించి ర
య్యుదయాస్తాచల సేతుశీతనగ మధ్యోర్వీపతుల్ సంతతా
భ్యుదయున్ ధర్మజుఁ దత్సభాస్థితు జగత్పూర్ణ ప్రతాపోదయున్."

ఈ పద్యములు అర్థమునకు మించిన శబ్దగురుత్వము కలవి అయినను శబ్దముల కూర్పువల్ల వ్యక్తమయ్యేడి మాధుర్యమునకు ముగ్ధులమై అర్థవిచారణ పొంతబోము నాచనసోముడు, పోతన, శ్రీనాథుడు తరువాతి ప్రబంధకవులలో చాలమంది ఈ శబ్దగుంఫన నైపుణిని నన్నయవలననే నేర్చుకొనిరి అసలు ఈ సమాస ఘటనాచాతుర్యమును నన్నయయే కన్నడమున ఆదిపంపనిభారతమును

చదివి నేర్చుకొనెననియు ఈయన సమాసములు పెక్కు పంపభారత సమాసమునకు అనుకరణములే గాక యథాక్షరములే యనియు కొందరు చెప్పుదురు భవతు!

అయినను నన్నయ సంస్కృతము నంతను అధ్యయనము చేసినట్లే తనకు పూర్వము కన్నడమున వెలసిన పంప భారతాది గ్రంథములను కూడ శ్రద్ధగా చదివి, ఆ బాషా పాండిత్యమును సైతము సంపాదించెననుట నిస్సందేహము. సంస్కృత గ్రంథములువలెనే కన్నడ గ్రంథములును ముఖస్థములై యున్నపుడు అందలి అర్థములును, శబ్దములును, రీతులును బుద్ధిపూర్వకముగానే అయినచో ఆ యనుకరణము పంపకవియెడ నన్నయకు గల గౌరవమునకు దృష్టాంతమగును దానివల్ల నన్నయకు ఏమియు న్యూనతరాదు.

నన్నయశైలికి వచ్చిన గాంభీర్యమంతయు బహుళ సంస్కృత పదప్రయోగమువలన, ఆయన చేసిన విద్యా పరిశ్రమ మంతయు సంస్కృత సంబంధియే అయియుండుటయు ఆయనకు పఠనయోగ్యము కాదగిన ఆంధ్ర సాహిత్యమేమియు లేకపోవుటయు దానికి ప్రథమకారణము. మరియు నన్నయ, రాజులు రాజపురుషులు పండితులు మొదలైన అనాటి శిష్టజనవర్గములో మెలగిన రాజాస్థానకవి రాజధానిని రాజవంశమును విడిచి అవలకుపోయి గ్రామసీమల యందలి ప్రజలతో కలసిమెలసి తిరిగినవాడు కాడని నా యభిప్రాయము. అందుచేతనే తరువాతికవులు – అందు ముఖ్యముగ తిక్కన – వాడిన లోకవ్యవహార భాషను నన్నయ వాడలేకపోయెను.

ఆయన శైలి ఎంత తత్సమ పదభూయిష్ఠమైనను అందు అర్థకాఠిన్యము గాని శబ్దపారుష్యముగాని యుండవు ఈ శబ్దగాంభీర్యమువలన రచనకు ఉదాత్తతయు, ఠీవియు లభించినవి. ఎఱ్ఱన నన్నయను భద్రగజముతో పోల్చుట భారతపద్యముల నడకనుబట్టియే యని నేననుకొందును

ఉ॥ ఉన్నతగోత్ర సంభవము నూర్జితసత్త్వము భద్రజాతి సం
పన్నము నుద్ధతాన్యపరిభావిమదోత్కటమున్ నరేంద్రపూ
జోన్నయనోచితంబునయి యొప్పెడు నన్నయభట్టకుంజరం
బెన్న నిరంకుశోక్తిగతి నెందునుగ్రాలుట బ్రస్తుతించెదన్

తొట్రుపడుటగాని పరువెత్తుటగాని లేకుండ గంభీరముగా నడచుచు అటుసిటు తొండమును విసరుచు తన ప్రాభవమును ప్రదర్శించెడి భద్రగజము వలెనే నన్నయ రచనకూడ తొట్రుపాటుగాని వేగిరపాటుగాని లేకుండ గంభీరముగ సమాస విక్షేపములతో సాగిపోవుచుండును. ఈ గాంభీర్యమునకు కారణమైన శబ్ద ప్రయోగమునే ఆయన అక్షరరమ్యత అని తన కవిత్వమునకు రెండవ గుణముగ చెప్పెను అక్షరరమ్యతకై అనుప్రాసాది శబ్దాలంకారములను అతిమాత్రముగ ప్రయోగించి పెనుగులాడిన కవులు పెక్కురుందురు. అట్టిది శబ్దాడంబరమగునుగాని అక్షర రమ్యత గాదు నన్నయ కవనమునకు ఈ అడంబరదోషము పట్టలేదు. అడంబరమేమోయని భ్రమగొల్పెడి శబ్దజటిలత మాత్రము అందుకలదు. (అడంబరము Pomposity - జటిలత. Closeness). ఈ జటిలత అయినను మొదటి రెండు పర్వములకంటె మూడవదానిలో చాలా వరకు తగ్గిపోయినది గ్రంథము సాగినకొలది ఆయన శైలికి సాధుత్వముతోడి కొత్తవన్నె వచ్చినదని చెప్పవచ్చును.

ఒక శైలిలోనే కాదు, కథ నడుపుటలో సైతము అరణ్యపర్వములోనే నన్నయ కృతహస్తుడయ్యెను. ఆదిపర్వమునందలి శకుంతలోపాఖ్యానమును, అరణ్య పర్వమందలి నలోపాఖ్యానమును పోల్చి చదువుదురేని నా వివరణ మక్కరలేకయే ఆ తారతమ్యమును గ్రహింపగలరు.

శబ్దసంగ్రహమునే కాక వాక్యరచనలోకూడా నన్నయ చాలావరకు సంస్కృత సంప్రదాయమునే అనుకరించును కారకము–క్తాంతకర్మణి ప్రయోగము సంబంధార్థక యత్, తత్, యోగముతోకూడిన వాక్యములు – వ్యవహిత విశేషణ విశేష్యములు – ఏకవాక్యగతములైన అనేక సంబోధన ప్రథమలు మొదలైనవన్నియు తెలుగు భాషాజాత్యములు కావు.

**నన్నయ ఆత్మీయత:** ఏ మహాపురుషునియొక్క ఆత్మీయతను తెలిసికొనవలెన న్నను మనము ముఖ్యముగా గ్రహింపవలసిన ప్రమాణమును అందుకు మిక్కిలి తోడ్పడునదియును, వానియొక్క జీవితచరిత్ర; మనమిప్పుడు నన్నయభట్టారకుని ఆత్మీయత యేమో తెలుసుకొనుటకు వాని జీవితచరిత్ర మనకు లభ్యముగాలేదు త్రికరణశుద్ధిగా మన మాయన గ్రంథమున ప్రవేశించినగాని ఆయన ఆత్మీయత మనకు గోచరించదు అందరి కవుల వలెనే నన్నయ కృత్యాదియందు తనను గురించి చెప్పికొనిన విశేషణములు కొన్ని కలవు ఆయన చాళుక్యరాజవంశమున కులబ్రాహ్మణుడు * అనగా తాతతండ్రులవలె తానును ఆ రాజవంశమునకు ఆశ్రితుడు; విశేషించి రాజునకు అనురక్తుడు; అవిరళ జపహోమతత్పరుడు; సంహితాభ్యాసుడు. (నిరంతర వేదాధ్యయనపరుడు), నానా పురాణ విజ్ఞాననిరతుడు ఈ విశేషణములను బట్టి స్థూలముగా నన్నయ నిష్కళంక బహిరంతర పవిత్రమూర్తియని కొంతకు కొంత గ్రహింపవచ్చును. స్వాధ్యాయ తపస్సునకు భంగము కల్గించెడి దురాచారములలో వాచాలత యొకటి. అట్టి తపోభంగమును తనంతట తాను కలిగించుకొనెడి లఘు చిత్తవృత్తి కలవాడైననే తప్ప, సంహితాభ్యాసులు సాధారణముగ వాచాలురై యుండరు. అధ్యయన శీలుడు చాల మితభాషిగ నుండును. అట్టివాడు కావ్యమే వ్రాసినపుడు అతని యాత్మ స్వభావమే కావ్యమున ప్రతిఫలించును గనుక కావ్యగత జీవులచేతను మితముగానే పలికించును మితభాషి మానవ హృదయ సాధారణ ధర్మమైన భావావేశము లేనివాడని యనుకోగూడదు కాని ఆ యావేశమును యిచ్ఛవచ్చినట్లు నోట మాటలలో వెడలనీయక నిగ్రహించుకొని పరిమిత వాక్యములలో ఆ భావమును వ్యక్తము చేయును. కర్ణ జనన వృత్తాంతములో నన్నయ కుంతికి ఆ యాత్మ గుణమునే ఆపాదించి ఆకన్యను వయస్సుకు మించిన ధీరత్వము కలదానినిగా చిత్రించెను

**తరువోజ:**

*ఏలయమ్మని నాకు నిచ్చె నిమ్మంత్ర మిమ్మంత్రశక్తియే నెఱుఁగంగ వేఁడి*
*యేల పుత్రకుఁగోరి యెంతయు భక్తి నినుఁ దలంచితిఁ బ్రీతి నినుఁడును నాకు*

---

* ఈ శబ్దమునకు వేరొక అర్థము కలదట. దానిని భాస్కర రామాయణ ప్రకరణమున చెప్పితిని. దానిని చూడదగును.

నేల సద్యోగర్భమిచ్చెఁ గుమారుఁడేల యప్పుడ యుదయించె నింకెట్టు
లీ లోక పరివాదమే నుడిగింతు నింతకు నింతయు నెఱుగరె జనులు.

**వసంత తిలకము:**

ఈ బాలు నెత్తికొని యింటికిఁ జన్న నన్నున్
నా బంధులందఱు మనంబుననేమనా రె
ట్లీ బాలు సూర్యనిభు నిట్టుల డించి పోవం
గా బుద్ధి పుట్టునని కన్య మనంబులోనన్.

ఆయన ఆశ్రమవాస జీవితమును వర్ణించెడి కథలను చెప్పునపుడు కల్పించెడి ఉద్దీపన విభావము తపోవనోచితముగ నుండి పాఠకుని ఆత్మను తపోవనముల విహరింపజేయును. భారతీయచరిత్రలో ఐతిహాసికయుగమునకు పూర్వము జరిగిపోయిన వైదిక యుగమును భావనచేసి చెప్పుటలో నన్నయకు గొప్ప నైపుణి కలదు. ఆ యుగముననే బ్రాహ్మణయుగమని చారిత్రకులు పేరు పెట్టిరి. ఆ యుగమున పురోహితుడు మూర్తీభవించిన బ్రహ్మవర్చసము అనదగి యుండెడువాడు కాబోలు! ఈ భారతమున పురోహిత పాత్రను చిత్రించ వలసి వచ్చినపుడు గతించిపోయిన ఆ బ్రహ్మతేజమును నన్నయ పునఃసృష్టి చేయును. మరియు ఈయన కఠోర ధర్మనిష్ఠ కలవాడు. ధార్మికజీవనము ఆయనకును, ఆయన కవిత్వమునకు జీవగఱ్ఱ. ధర్మాపేతమైన వాక్కును వినలేడు, పలుకలేడు. కథావశమున ఒక పాత్రచే అట్టిది పల్కించవలసివచ్చినపుడు ఆ వాక్యమును లోకము వినుటకు వ్రాయునే గాని తాను మాత్రము చెవులు మూసికొనివ్రాసెనేమో అన్నంత యుదాసీనముగా వ్రాయును. ధార్మికేతరమైన వర్తనమును శిక్షించునపుడు నిర్దయముగా శిక్షించును అధార్మికమైనను, సరసమైన కచదేవయాని కథ నన్నయ చేతిలో నీరసమై పోయినది. కచుని సంభాషణము తెలుగు భారతమునందుకంటె మూలమున సరసముగా నుండును. తెనుఁగున నన్నయభట్టే కచుడై దేవయానికి సమాధానము చెప్పినవాడుగా తోచును. కాని యది కచుని వయస్సునకు, అతడు దేవయానితో చేసిన స్నేహమునకు అనురూపముగా నుండదు కచదేవయానీ సంవాద శ్లోకములు సంస్కృతమున ఉత్తర దక్షిణ ప్రతులన్నిటను కలవు అందుచేత అవి ప్రక్షిప్తములని త్రోసిపుచ్చుటకు వీలులేదు. వాటిలో రెండుమూడు శ్లోకములు అతి మనోహరములై హృదయమును ద్రవింప జేయుచుండును. నన్నయ వాటిని ముట్టక విసర్జించెను. ఆ విసర్జనము దారి చేసికొని నడచువాడు ప్రక్కకు ఒత్తిగింపగా తెగిన తీగలు కావు మరి కాలితో మట్టగించి వేసిన తీగలు కనుక ఎంత సుందరములైనను ధర్మేతరములైన వాక్యములు ఆయన మనస్సున కెక్కవు.

సంహితాభ్యాసుడును, అనవరత జపహోమతత్పరుడును అని చెప్పుకొనుట వలన ఆయన కర్మిష్ఠియని తాత్పర్యము. వేదోక్తమైన కర్మాచరణమునకు 'అపూర్వ' మనుపేరుగల స్వర్గసుఖము ఫలము. అది పూర్వమీమాంసా శాస్త్రమున ఉపదేశింపబ డినది. నన్నయ ఇతర శాస్త్రములతోపాటు పూర్వమీమాంసకూడ అధ్యయనముచేసి తదుపదేశములను యథాతథముగ ఆచరించి యుండును. కావుననే తత్కృత

భారతమును పఠించుటవలన ఐహికముగ శుచి వర్తనమునందును, అముష్మికముగా స్వర్గప్రాప్తియందును మనస్సు లగ్నమగును. నన్నయ చేతిలో పాండవులు శౌచవంతులుగా సత్ప్రవర్తకులుగా కన్పట్టుదురు (నన్నయభట్టు పాత్రలన్నియు పావన గంగోదకమువలె నుండునని కట్టమంచి రామలింగారెడ్డిగా రనిరి) ప్రవర్తన యందలి పవిత్రత నన్నయ తనకున్నదానిని పాత్రల యందు ఊది చెప్పెను అదిగాక నిరంతర సంహితాభ్యాసపరుడుగాన వేదమునందలి త్రిస్వరసంపాదితమైన గంభీర నినాదమునకు అలవాటుపడి తన పద్యములలో అట్టి నినాదము ధ్వనితము చేయుట అయనకు సహజమైనది. కావుననే స్తోత్రాత్మకములైన కొన్ని పద్యములు వేద ఋక్కులవలె నినదించుచుండును. ఉదంకుని నాగస్తోత్రము మరల నిచ్చుటను ఉదాహరణమే!

**నన్నయ భారత రచనా కాలము:** భారత కృతిపతియైన రాజనరేంద్రుడు 1022వ సంవత్సరములో పట్టాభిషిక్తుడై 1063 వరకు రాజ్యపరిపాలన చేసెను కాని ఆ పరిపాలనము అవిచ్ఛిన్నముగ జరుగలేదు మొదటి ముప్పది సంవత్సరములలో అతడు రెండు మూడుమార్లు సవతిసోదరుడైన విష్ణువర్ధనుని చేతిలో ఓడిపోయి పదభ్రష్టుడయ్యెను. తుదిసారి 1051లో కాబోలు అత్తింటివారైన చోళరాజుల సాయమున సోదరుని మరల తలయెత్తకుండ అణచివేసి, సింహాసనమెక్కి రాజ్యమును సుస్థిరము చేసికొనెను. ఆ పండ్రెండు సంవత్సరముల కాలములోనే అతడు విద్యాపోషకుడుగా, అగ్రహార దాతగా ప్రజాశ్రేయస్కాముడుగా సుపరిపాలనముచేసి యుండును. ఆ కాలముననే భారత రచనకు నన్నయను నియోగించియుండునని పలువుర అభిప్రాయము అది యట్టిదే కావచ్చును పట్టాభిషిక్తుడైనది మొదలు పట్టుమని కొంత కాలమైనను చిత్త సుఖమెరుగని ఆ రాజు సారస్వత కార్యములకు పూనుకొనుటగాని, అందు నిమగ్నుడగుటగాని తటస్థింపదు స్వస్థత చిక్కిన పిమ్మట రాజ్యము చేసిన పండ్రెండు సంవత్సరముల కాలములో ఏ సంవత్సరము నన్నయభట్టు భారతరచనకు ఉపక్రమించెనో తెలియదగిన ఆధారము లేవియు లేవు. కాని గ్రంథము పూర్తిగాక నడుమనే ఆగిపోవుటనుబట్టి అది రాజరాజ నరేంద్రుని పరిపాలనాకాలములో చివరి భాగమున ఉపక్రమింపబడి యుండుననియు, రాజు మరణముచే నిర్విణ్ణుడైన నన్నయ గ్రంథ రచన విరమించెననియు కొందఱనుకొందురు. కాని రాజనరేంద్రుని జీవితము, భారతగ్రంథము అను రెండింటిలో మొదటిది ఏనాటికైనను నశ్వరమే! రెండవది ఎంత కాలమునకైన అనశ్వరమే! 'నలసారము సంసారము' అని యుపదేశించిన నన్నయ నశ్వర వస్తువు నశించినదని విలపించుచు అనశ్వర వస్తువును చేజార్చె ననుటను నామనస్సు ఒప్పదు తెలుగున భారతమును అవతరింపజేయుటయే అయన పూనిన దీక్ష ఆ క్రతువు విఘ్నమగుటను రాజనరేంద్రుని మరణముగాక నన్నయ స్వర్గ గమనమే కారణమని నే ననుకొందును నా వలెనే ఈ యభిప్రాయము గలవారు పెక్కురు ఉందురని నా నమ్మకము.

**నన్నయ ఇతర కృతులు:** భారతము గాక ఈయన చాముండికా- విలాసము, ఇంద్ర విజయము అను రెండు కావ్యములు వ్రాసెనని లోకమున వాడుకగా నున్నది.

చాముండికా విలాసమునకే చౌడేశ్వరీవిలాసమని యింకొక పేరు కలదు - ఇది మూడాశ్వాసములును, దాదాపు 120 పద్యములును గల చిన్న పుస్తకము మూడా

శ్వాసముల చివరను ఆశ్వాసాంత గద్యములు మూడు భిన్నవిధములుగ నున్నవి. ఈ మూడాశ్వాసములలో మొదటిదాని యందు నందవరీక బ్రాహ్మణులను గూర్చియు, రెండు మూడు ఆశ్వాసములయందు దేవాంగకులములోని ఒక శాఖకు సంబంధించిన కథలును గలవు. మరి గ్రంథావతారికలో కవి తనను గూర్చి చెప్పికొన్న ఈ క్రింది పద్యము గలదు:

సీ॥ వ్యాసాది ఋషులకు వందనం బొనరించి
కవి భల్లటుల చాల ఘనత నెంచి
సుకవీశ్వరుల నెల్ల సొంపుగా వినుతించి
గురు పాదపద్మముల్ సరసఁగాంచి
యిష్టదేవాళి సంప్రాప్తత సేవించి
మంత్రాది దేవత ల్మదిని నుంచి
సర్వజనాళికి సంతోష మొనరించి
పార్థివ సభల వైభవముగాంచి
యాంధ్ర వాక్యానుశాసనం బతిశయిల్లఁ
జేసి లోకోపకారార్థ సిద్ధిఁజెంది
ఘనత రాజనరేంద్రుని కరుణ వడసి
నట్టి వాఁడను నన్నయభట్టు నేను

గద్యభాగముల వైవిధ్యమునకు తోడు బాలిశమైన ఈ పద్య రచన కూడ ఈ గ్రంథము భారత కర్త నన్నయ రచించినది కాదు అని విమర్శకుల దాక పోనక్కర లేకుండ ఏ విద్యార్థియైనను చెప్పగలడు రెండవదియైన ఇంద్రవిజయము సంగతి. ఆనందరంగరాట్ఛందమున ఇంద్రవిజయము లోనిదిగా ఈ క్రింది పద్యము ఉదాహరింపబడి యున్నదట:

చ॥ ఒక పలువాఁతగొన్నకిటి యుందలలోనిడు క్ష్మూర్మ భర్తనా
*ళి కలిరుగొన్న సీఁదరపు జోఁడు, పయోధరధారఁ బొట్ట వెం
చుకులనగాలి యూడు ప్రతిజోడని యెన్నఁగఁగూడ దేరి కె
న్నికగ యయాతియందె ధరణీ భరముండి చెలంగు దానికిన్.

4,5 మాటలు తప్ప తక్కిన భాగమంతయు అచ్చ తెనుఁగు పదములతో కూర్చబడిన యీ పద్యము నన్నయ శైలికి అసహజము. మరి రెండవ పాదమందలి "ల" "ఌ" ల యతి నన్నయ నాటికి ఈ భాషలో పుట్టలేదు అదీగాక "చెలంగు – దానికిన్" అనెడి పలుకుబడి నెల్లూరు మాండలిక జాత్యమేగాని గోదావరి మాండలిక జాత్యము గాదు. ఈ పలుకుబడి తిక్కన భారతమున తండోపతండములుగ గలదు నన్నయ భారతమున ఒక్కటియు లేదు. కనుక ఈ రెండు గ్రంథములును నన్నయవి కావు.

**నన్నయ సమకాలికులు:**

అథర్వణుడు, వేములవాడ భీమకవి అను ఇరువుర సుప్రసిద్ధులు నన్నయకు సమకాలికులుగా చెప్పబడుచున్నారు. వీరిలో –

## అధర్వణాచార్యుడు

ఇతడు నన్నయ కాలము వాడనుటకు ఒక పుక్కిటి పురాణమే ఆధారము నన్నయ భారతము వ్రాయు దినములలోనే అధర్వణుడు ఒక భారతము వ్రాసి తీసికొనివచ్చి చూపగా నన్నయ అసూయచే దానిని తగులబెట్టించెనని ఆ పుక్కిటి పురాణము యొక్క సారము. ఈ పాపపు కథ కల్పించిన వానికి వచ్చిన పుణ్యమెట్టిదో వానికే ఎరుక అధర్వణునిచే ఒక భారతము రచింపబడిన మాట నిజమే! సర్వలక్షణసార సంగ్రహము, కవిచింతామణి, అప్పకవీయము మొదలగు లక్షణ గ్రంథములు ఆ భారత పద్యములను ఉదాహరించినవి వాటినన్నిటిని ఒకచోజేర్చి పరిశీలించిన శ్రీవీరేశలింగము పంతులు ఆ పద్యములు విరాటోద్యోగ భీష్మ పర్వముల కథకు సంబంధించినవని నిర్ధారణ చేసెను తిక్కనవలెనే అధర్వణుడు విరాటపర్వాదిగా రచనకు పూనుకొని కొంతభాగము వ్రాసియుండుననియు, తిక్కన రచితమైన సమగ్ర భారతము నెదుట అధర్వణుని అసంపూర్ణగ్రంథము నిష్ప్రయోజనమై లోకముచే విస్మరింపబడినదేమో ననియు విమర్శకులు ఊహించిరి ఈ యూహ నిజమైనచో ఆతడు నన్నయకు తరువాతి వాడగును కాని సమకాలికుడు గాడు

మరి అధర్వణుని పేరుమీద వికృతి వివేకము. త్రిలింగ శబ్దానుశాసనము. అధర్వణ ఛందస్సు అను మూాడు లక్షణ గ్రంథముల పేర్లు వినవచ్చుచున్నవి వీటిలో అధర్వణ ఛ్ఛందమునుండి ఒక లక్షణ గ్రంథములో క్రింది పద్యము ఉదాహరింపబడినదట

*మగణంబుఁ గదియ రగణము*
*వగవక కృతి మొదట నిలుపు వానిక మరణం*
*బగు నిక్కమంద్రు; మడియఁడె*
*యగునని యిడి తొల్లి వేంకణాదిత్యుఁడనిన్*

ఈ పద్యము అధర్వణునిదే యయినచో అతడు నన్నెచోడునకు పూర్వుడు కాడు ఎట్లనగా మగణము ప్రక్క రగణముంచి కృతి మొదలు పెట్టరాదు అనియు దీనిని పాటింపక సాహసించి మగణము ప్రక్క రగణము నిలిపిన వానికి మరణమగుననియు, అట్లు నిలిపి వేంకణాదిత్యుడు మరణించెననియు ఈ పద్యము యొక్క తాత్పర్యము. కృత్యాదిని మగణము ప్రక్క రగణము నిలిపిన కవి నన్నెచోడుడు. కుమారసంభవ మంగళాచరణ పద్యము స్రగ్ధర దానిలో మగణము ప్రక్క రగణమే నిలుచును. ఆ నిషేధమును పాటింపక పోబట్టియే నన్నెచోడుడు మరణించెనని అధర్వణుని యభిప్రాయము కాబోలు. ఏమైనను 12వ శతాబ్ది మధ్యకాలమువాడైన నన్నెచోడుని తరువాతనే అధర్వణుడుండెననుటకు ఈ పద్యము నిదర్శనము కాగలదు

## వేములవాడ భీమకవి

ఇతని చరిత్ర అధర్వణుని చరిత్ర కంటెను నిరాధారము. ఇతనిని పురస్కరించు కొనికూడ నన్నయకు దుష్కీర్తి నాపాదించు కథ యొకటి అప్పకవి అల్లెను. ఆ కథ సారాంశ మేమనగా భీమకవి రాఘవపాండవీయమును రచించి రాజమహేంద్రవరమునకు

పోయి నన్నయకు చూపగా దాని ముందు, తాను రచించు భారతము నిలువదనెడి భయముచే నన్నయ దానిని రూపుమాపెనట అంతట భీమకవి ప్రతీకారార్థము నన్నయభట్టు రచించిన ఆంధ్రశబ్దచింతామణిని సంగ్రహించుకొని పోయి గోదావరిలో కలిపెనట

1.తే॥ భారతముఁ దెనిఁగించుచుఁ దా రచించి
నట్టి రాఘవపాండవీయంబు నడఁచె
ఛందమునడంప నీఫక్కి సంగ్రహించె
ననుచు భీమన ముచ్చిలి నడఁచె దాని.

2 కం॥ ఆదిని భీమ కవీంద్రుడు
గోదావరిలోనఁ గలిపెఁ గుత్సితమున, నా
మీఁదట రాజనరేంద్ర
క్ష్మాదయితునిపట్టి దాని మహి వెలయించెన్. (అప్పకవీయము)

ఆంధ్రశబ్దచింతామణిని నన్నయకు అంటగట్టి ఆయనకులేని కీర్తిని సంపాదించి పెట్టదలచిన అప్పకవి ఈ పాపపు వృత్తాంతమును గూడ ఆతనికి అంటగట్టి లేని దుష్కీర్తిని సంపాదించి పెట్టెను.

ఈ కట్టుకథనే నమ్మినచో భీమకవి నన్నయకు సమకాలికుడగునని భ్రమ కలుగును ప్రాచీన కవులలో చాలమంది భీమకవిని పూర్వకవులలో ఒకనినిగా స్తుతించిరి లాక్షణికులు చాలమంది తమ సూత్రములకు లక్ష్యములుగా అతని గ్రంథములలోనివిగా కొన్ని పద్యములు ఉదాహరించిరి. అవి అన్నియు నిజమైనను కాకపోయినను వేములవాడ భీమకవి విస్మృత కవి వర్గములో చేరిన యొక ప్రాచీనకవియని నమ్ముటకు అవి కొంత ఆధారమగును. అదీగాక శ్రీనాథుడు కాశీఖండమున వేమారెడ్డి నోట పలికించినట్లుగా తన నానావిధశైలీ విశేషములను ఉగ్గడించుకొనుచు వేములవాడ భీమకవిని నన్నయ, తిక్కన, ఎఱ్ఱనల కంటె ప్రథమముగ పేర్కొని యుండుటచే భీమన నన్నయ కంటె ప్రాచీనుడేమో అని ఒక సంశయము కలుగుటకు అవకాశమేర్పడినది

సీ॥ వచియింతు వేములవాడ భీమనభంగి
నుద్దండ లీల నొక్కొక్కమాటు,
భాషింతు నన్నయభట్టు మార్గంబున
నుభయ వాక్ప్రౌఢి నొక్కొక్కమాటు,
వాక్రుత్తు తిక్కయజ్వ ప్రకారము రసా
భ్యుచితబంధముగ నొక్కొక్కమాటు
పరిఢవింతు ప్రబంధపరమేశ్వరుని రేవ
సూక్తివైచిత్రి నొక్కొక్కమాటు
నైషధాది మహాప్రబంధములు పెక్కు
చెప్పినాఁడవు మాకు నాశ్రితుఁడవనఘ!
యిపుడు చెప్పఁ దొడంగిన యీ ప్రబంధ
మంకితము సేయు వీరభద్రయ్య పేర.

ఆపై సుమారు నూట యిరువదియైదు సంవత్సరములకు పిమ్మట పింగళిసూరన తన రాఘవపాండవీయమున పూర్వకాలమున భీమన రాఘవపాండవీయము రచించెనన్న ఒక వదంతి కలదనియు అందు "ఏమియు ఏయెడన్ నిలుచువెవ్వరు కానరు" అనియు చెప్పుటబట్టి ఆ గ్రంధము భీమకవి రచించెనన్న సంగతి లోకమున వ్యాపించి యుండెననుట నిజము.

"భీమన తొల్లి చెప్పెనను పెద్దల మాటయె కాని యందు నొం
డేమియు నేయెడ న్నిలుచు టెవ్వరుఁ గాన రటుండ నిమ్ము నా
నా మహిత ప్రబంధ రచనాఘన విశ్రుతి నీకుఁ గల్గుటన్
నామదిఁ దద్ద్వయార్థకృతి నైపుణియుం గలదంచు నెంచెదన్"

రాఘవ పాండవీయము

పెక్కు గ్రంధములతోపాటు అదియును నశించిపోయి యుండవచ్చును ఆ నాశనమునకు కారణ మూహింపలేక అప్పకవి పైని చెప్పిన కట్టుకథ అల్లెనను మాట నిజము సారాంశమేమనగా గ్రంధములు పోయినను భీమకవి పేరు మాత్రము నిలిచియున్నది అతడు నన్నయకు పూర్వుడా సమకాలికుడా యనునది ప్రస్తుతాంశము. శ్రీనాధుని సీసపద్య పాదమునుబట్టి పూర్వుడే యను భ్రమ కలిగినను భీమన చాటుపద్యములను బట్టి పూర్వుడు కాకపోవుటయేగాక నన్నయకు సమకాలికుడును కాడనియు అనంతర కాలము వాడనియు నిర్ధారణ చేయవచ్చును

భీమన చాటువులని చెప్పబడునవి లోకమున చాల పద్యములు గలవు కాని వాటిలో అతని పేరు కలవి మాత్రమే కాలనిర్ణయమునకు సాధనములగును. తక్కినవి నిరుపయోగములు ఉపయుక్తములైన వాటిలో ఈ క్రింది రెండు పద్యములు మాత్రమే ముఖ్యమైనవి. వీటిలో మొదటిది తెలుంగాధీశుని దర్శింపబోయినపుడు అతడు చెప్పినది; రెండవది రాజకళింగ గంగును శపించినది

మ॥ "ఘనుఁడన్ వేములవాడ వంశజుఁడ ద్రాక్షారామ భీమేశ నం
దనుఁడన్ దివ్య విషామృత ప్రకట (ప్రముఖ) నానాకావ్య ధుర్యుండ భీ
మన నా పేరు వినంగఁ జెప్పితి, దెలుంగాధీశ! కస్తూరికా
ఘన సారాది సుగంధ వస్తువులు వేగందెచ్చి లాలింపరా!

ఉ॥ వేములవాడ భీమకవి వేగమె చూచి కళింగ గంగు తా
సామముమాని కోపమున సందడి దీఱిన రమ్ము పొమ్మనెన్
మ్రోమును జూడ దోసమిఁక ముప్పది రెండు దినంబు లావలన్
జామున కర్దమం దతని సంపద శత్రులఁజేరుఁగావుతన్"

పై పద్యములలో పేర్కొనబడిన తెలుంగాధీశ కళింగ గంగులు సమకాలము వారైననే తప్ప భీమకవి వారిరువురిని దర్శింపబోవుట తటస్థింపదు. కావున ఆ కవి ఆ యిరువురకు సమకాలమువాడై యుండవలెను. శ్రీనాధుడు దర్శించిన తెలుంగాధీశు డొక్కడు కలడని ఆతని చాటుపద్యము వలన తెలియవచ్చుచున్నది.

శా॥ "అక్షయ్యంబుగ సాంపరాయని తెలుంగాధీశ! కస్తూరికా
భిక్షాదానము చేయరా సుకవి రాడ్బృందారక శ్రేణికిన్

ద్రాక్షారామచళుక్యభీమవర గంధర్వాప్సరోభామినీ
వక్షోజద్వయ కుంభి కుంభములపై వాసించుఁ దద్వాసనల్"

ఈ పద్యములో శ్రీనాథుని పేరు లేకపోయినను కస్తూరిని యాచించుటయు, దాని వినియోగమును గూర్చి బాహాటముగ వక్కాణించుటయు శ్రీనాథునకే చెల్లును. కాబట్టి ఈ పద్య కర్తృత్వమును శంకింప నక్కరలేదు శ్రీనాథుని తెలుంగాధీశుడును, భీమకవి తెలుంగాధీశుడును ఒక్కడే యయినచో ఆ కవులు ఇరువురును సమకాలికులు కావలసివచ్చును. కాని అది యట్టిదికాదు భీమన శ్రీనాథునకు మిక్కిలి ప్రాచీనుడని శ్రీనాథుని సీసపద్య పాదమే సాక్ష్యము కావున ఈ తెలుంగాధీశులు భిన్నులు. మొదటి పద్యమందలి 'తెలుంగాధీశ' అనెడి సమాసము వ్యాకరణ యుక్తము కాదనియు దానిని 'కళింగాధీశ'యని సవరించుకొన్నచో వ్యాకరణ యుక్తమగుటయేగాక రెండవపద్యములో చెప్పబడిన కళింగగంగు ఆ కళింగాధీశుడే అగుననియు అప్పుడు ఇతర వికల్పము లేవియులేకుండ భీమన కళింగ గంగు సమకాలికుడని నిర్ధారణ చేయవచ్చుననియు శ్రీ జయంతి రామయ్యపంతులు కవిజనాశ్రయ పీఠికలో ఒక సూచన చేసెను ఈ సూచనలో 'తెలుంగాధీశ' సమాసము తప్పనుట ఒప్పుకొన దగినదికాదు శ్రీనాథుడు ప్రయోగించిన తెలుంగాధీశ సమాసము ఒప్పైనపుడు భీమన ప్రయోగము తప్పగుట యెట్లు? కాని ఈ వివాద భూమియొక్క విస్తృతిని సాధ్యమైనంతవరకు తగ్గించి ఆ పద్యములలో ఏదో యొకదానిని అంగీకరించుట లెస్స తెలుంగాధీశులు పెక్కురుండుటచే దానిని విసర్జింపవచ్చును అప్పట్ల వేములవాడ భీమకవి రాజు కళింగ గంగునకు సమకాలికుడని సారాంశము తేలును ఆ రాజు 11వ శతాబ్ది అంత్య భాగమువాఁడట 1077 లో పట్టాభిషిక్తుడై సుమారు ఏబది అరువది సంవత్సరములు రాజ్యపాలన చేసెనట కాగా అతని సమకాలికుడైన భీమన 11వ శతాబ్ది చివరి పాదముననో 12వ శతాబ్ది ప్రథమ పాదముననో ఆ రాజును దర్శించి యుండవచ్చును ఆ దర్శనము నాటికి అతడు ప్రౌఢ వయస్కుడు అనుకొన్నచో నన్నయ కంటె వయసున చాల చిన్నవాడై యుండును వారిరువురకు గల సమకాలికత్వము ఆ మాత్రమే ఆ పిన్నవయస్సులోనే భీమన అసాధారణ ప్రజ్ఞా సాధ్యమైన రాఘవపాండవీయ రచనకు సాహసించి యుండునని నేననుకోను ఆ సమకాలికత్వమును పురస్కరించుకొని రాఘవపాండవీయ నాశనమునకు నన్నయ కారణమని నమ్మకూడదు

పోయినవి పోగా భీమకవి పేరుమీద 'కవి జనాశ్రయ' మనెడి ఛందోగ్రంథ మొకటి సజీవమై యున్నదనియు లక్షణ గ్రంథములలో ప్రస్తావింపబడిన భీమన ఛందము ఇదియే యనియు ఆ గ్రంథము ప్రకటించిన శ్రీ జయంతి రామయ్యపంతులు ఒక నిర్ధారణ చేసెను ఆయన తన సిద్ధాంతమున కాధారముగా కవి జనాశ్రయ తాళపత్ర ప్రతులలో ఒక దానియందు గల ఈ క్రింది పద్యమూధారముగా చూపెను

"వేములవాడను వెలసిన
భీమేశ్వరు కరుణ గలుగు భీమ సుకవినేఁ
గోమటి రేచన మీఁదను
నీ మహిఁగవులెన్న ఛంద మెలమి రచింతున్"

ఈ పద్యము కవి జనాశ్రయ ప్రతులు పదింటిలో తొమ్మిదింటలేదు. గద్యమున నిది 'శ్రావకాభరణాంక' విరచితమని కలదు. భీమన దీనిని రేచన పేర జెప్పనుద్దేశించినచో తాను రచించినట్లు పయి పద్యము వ్రాయుట స్వవచో వ్యాఘాతమేకాక ఆశ్రయమిచ్చిన వానిని మోసపుచ్చుటయు అగును. అదిగాక, భీమన పరమ శైవుడు, రేచన జైనుడు. 11వ శతాబ్దమున శైవులకు, జైనులకు సాంఘిక యుద్ధములు తీవ్రముగ జరుగుచుండగా భీమన దీనిని రేచన పేర రచించుట పొసగదు. ఒకవేళ మత భేదముల నతిక్రమించిన మైత్రి వారిరువురకు నున్నను, నిందు జినమత ప్రశంస చేయు విశేషణము లుండరాదు. జిన మత ప్రశంస కవిజనాశ్రయమున విశేషముగా గలదు. కావున కవిజనాశ్రయమునకు భీమనకు నెంత మాత్రమును సంబంధము గలదని చెప్పవీలులేదు.

కాకతీయుల సామంతుడగు గోకర్ణుడను ఒక రాజు కవి జనాశ్రయ కర్త అనెడు ప్రతీతి కలదు

అథర్వణుడును భీమకవియుకాక నన్నయకు సమకాలికులైన యితర కవులు పెక్కురుందురు ఇతరులమాట అటుండనిండు; ఆయనకు సహాధ్యాయుడై భారత రచనకు తోడ్పడిన నారాయణభట్టే ఆంధ్రముతో సహా నానాభాషలలో కవిత్వము చెప్పగలవాడుగదా! అట్టివారే మరికొందరు గ్రంథకర్తలు కాకపోయినను కవిత్వము చెప్పిన వారును ఉండవచ్చును. నన్నయ యుగము అని చెప్పిన ఈ 11వ శతాబ్దిలో ఒక్క భారతము తప్ప వేరొక గ్రంథము కానరాక పోవుటచే ఆ యుగమునకు నన్నయ కర్త యయినట్లుగానే ఆ భారతము ఆ శతాబ్ది వాఙ్మయమునకు ఏకైక ప్రాతినిధ్యము వహించినది

★ ★ ★

# శివకవి యుగము
# (1100-1225)

రాజనరేంద్రుని తరువాత రాజ్యమునకు వచ్చిన అతని కుమారుడు కుళోత్తుంగ చోళుడు వేంగీ రాజ్యమును స్వయముగా పరిపాలింపక తన ప్రతినిధుల పాలనకు వదలి, తన మేనమామల రాజ్యమైన చోళదేశము లభించుటచే ఆ సింహాసన మధిష్ఠించి చాళుక్య చోళ రాజ్యముల రెండింటికి చక్రవర్తియై దక్షిణ దేశముననే ఉండిపోయెను అతని కుమారులు ఇద్దరు ముగ్గురు రాజ్య ప్రతినిధులుగా వేంగీ దేశమును పరిపాలించిరి. తరువాత తెలుగు దేశమునకు రాదగిన రాజవంశీయులెవరును లేకపోవుటచే చాళుక్య సేనాధిపతులలో ఒకడైన గొంకరాజు అనెడి మహావీరుడు చాళుక్య సామంత రాజుగా ధనదపురమను నామాంతరముగల చందవోలును రాజధానిగా జేసికొని, చాళుక్య రాజ్యమును పరిపాలింపదొడగెను ఈ గొంక వంశపు రాజులు వెలనాటి చోళులమని పేరు పెట్టుకొనిరి రాజనరేంద్రుడు పలుపాట్లు పడి రాజ్యమునకు కలిగించిన స్థిరత్వము, క్రమముగా సడలి వెలనాటి చోళుల కాలములో సామంత నృపతుల పరస్పర–అసూయాద్వేషములవల్ల సామ్రాజ్యము ఖండ ఖండములై తుదకు చాళుక్య రాజ్యమనెడి పేరే లేకుండపోయెను. ఆ స్థితిలో ఒకప్పుడు చాళుక్యులకు సామంతులైన కాకతీయులు తమ పేరుమీద ఒక స్వతంత్ర రాజ్యమును స్థాపించుకొనిరి. ప్రథమదశలో ఈ కాకతీయులు పశ్చిమ చాళుక్యులకు సామంతులుగా నుండి తుదకు స్వతంత్రులై ఆంధ్రదేశమున చాల భాగమునకు అధిపతులై సామ్రాజ్యమును స్థాపించుకొనిరి వారి అధిపత్యము ఇంచుమించు 125 సంవత్సరములు అవిచ్ఛిన్నముగ సాగెను. (1200 మొదలు 1323 దాక) ఈ కాలములో తెలుగు దేశమున అవైదికములైన బౌద్ధ జైన మతములనే కాక వైదికమైన అద్వైతమును కూడ తిరస్కరించుచు, శివుడుతప్ప వేరు దేవుడు లేడు అని శివపారమ్యమును బోధించెడి శైవమతము తలయెత్తి విజృంభింపసాగెను ఆ మతమును వాఙ్మయము ద్వారా విస్తరిల్లజేసిన తెలుగు కవులు ఆ శతాబ్దిలో ముఖ్యముగ ముగ్గురు కలరు వారే నన్నెచోడుడు, పండితారాధ్యుడు, పాల్కురికి సోమనాధుడు. ఈ ముగ్గురిలో మూడవ వాడైన సోమనాధుడు 13వ శతాబ్దిలో కూడ కొంతకాలము జీవించి గ్రంధ రచన చేసినను అతని జీవితాంతమును నిర్ణయించెడి యధార్ధ చరిత్ర లేకపోవుటచే సౌలభ్యము కొరకు రంగనాధ రామాయణమునకు పూర్వము ఈ శైవ కవితా విజృంభణమునకు ఒకమేర యేర్పరచుట న్యాయమని ఈ యుగమును 1225తో ఆపితిని

# నన్నెచోడుడు

ఈ ముప్వురిలో నన్నెచోడుడు తక్కిన ఇరువురివలె శివాచార్యకత్వమును వహించి మత ప్రచారకుడుగా వర్తించినవాడు కాడు. అతడు శివాచార తత్పరుడును జంగము భక్తుడును అయినను మతగ్రంథమును వ్రాయక కావ్యగుణముచే వాఙ్మయమునకు అలంకారము కాదగిన ఒక ప్రబంధమును వ్రాసి శైవులకే గాక అన్యమతస్థులకు కూడ కవిగా ఆదర్శపాత్రుడయ్యెను అతని ప్రబంధము కుమారసంభవము 1910వ సంవత్సర ప్రాంతమున కీ.శే శ్రీ మానపల్లి రామకృష్ణ కవి ఈ ప్రబంధముయొక్క వ్రాత ప్రతిని సంపాదించి దానిని ప్రకటించు వరకును ఆంధ్రములో ఈ పేరుగల కవి యొకడున్నాడన్న మాటయే ఎవ్వరును నెరుగరు. ప్రాచీన గ్రంథ సంపాదన ప్రకటనములే సాహిత్యోపాసనగా వర్తించిన శ్రీ రామకృష్ణ కవి ఈ గ్రంథమును ప్రచురించినపుడు నన్నెచోడుడు నన్నయకంటె పూర్వుడు అని ఒక సిద్ధాంతమును చేసెను అంతకుముందు నన్నయయే ఆదికవియని, భారతమే ప్రథమ గ్రంథమని విశ్వసించియున్న ఆంధ్రసాహిత్యలోకమున శ్రీ రామకృష్ణ కవి సిద్ధాంతము ఒక సంచలనము కలిగించినది తదాదిగా ఈ కవీశ్వరుని యధార్థ కాల నిర్ణయము చేయుటకు ఎన్నో పరిశోధనలు జరిగినవి ఇప్పుడును జరుగుచున్నవి ఇక ముందును జరుగవచ్చును ఏవో శాసన పరిశోధనలవల్ల నేడు చేయబడిన ఒక సిద్ధాంతము అచిర కాలములోనే వేరొక శాసనాధారము వలన నిరస్తమగుచున్నది పురాతత్త్వ పరిశోధనలు జరిగినంత కాలము శాసనములు లభించుచునే యుండును. ఆ పరిశోధనలకును, వాటి లబ్ధికిని అంతముండదు కాగా తెలుఁగు కవుల కాలమును, జీవిత చరిత్రలను నిష్కర్షగా చెప్పుట సాధ్యముకాదు కావున నన్నెచోడుని విషయముకూడ ఇంతవరకు సాధ్యముకాలేదు. కాకపోతే అతని పేరుమీద జరిగిన వాదోప వాదములతో అతని గ్రంథముమీద జరిగిన విమర్శలతో చారిత్రక విమర్శనాత్మకమైన ఒక గ్రంథజాలము వెలసినది తెనుఁగున ఏ కవిని గురించియు ఇంత విమర్శ వాఙ్మయము పుట్టలేదు శ్రీ రామకృష్ణ కవి ఇతనిని నన్నయకు పూర్వుడనే సిద్ధాంతమే చేయకపోయినచో ఆయనగాని, మరి యితరులుగాని సంపాదించి ప్రకటించిన ప్రాచీన గ్రంథములలో కుమార సంభవము కూడ ఒకటియై ఇంతమంది దృష్టిని ఆకర్షించెడిదే కాదు కృష్ణదేవరాయనిచే సమ్మానితుడై రాధామాధవ బిరుదమును సంపాదించిన చింతల పూడి ఎల్లనార్యుని రాధామాధవమనెడి కావ్యము శ్రీనడకుదుటి వీరరాజు పంతులు వ్రాసిన పీఠికతో మొన్న మొన్న ప్రకటితమగు పర్యంతము లోకము దాని పేరైనను విని యుండలేదు ప్రకటితమైన పిమ్మట దానిమీద వివాదములుగాని విమర్శనలుగాని బయలుదేరలేదు. ఉత్తమ జాతి కవియైనను ఎల్లనార్యుని గురించి మహాకవులలో ఒకనినిగా పేర్కొనువారును లేరు తాళపత్రగ్రంథభాండార పరిశోధకుల దయవలన పునర్జన్మనెత్తిన కవులు అట్టి వారెందరో కలరు వారెవ్వరికిని రాని ప్రచారము ఈ నన్నెచోడునకు వచ్చుటకు కారణము అతని కాలనిర్ణయ సమస్యయే! నన్నెచోడుని గ్రంథమున కవికాల నిర్ణయమునకు అక్కరకు రాదగిన చారిత్రకాధారములు అంతగా లేవు. కృతి కర్తయొక్క వంశవర్ణనముగాని కృతిపతి వంశ వర్ణనముగాని పూర్వాంధ్ర

కవుల అనుస్మరణముగాని ఈ గ్రంధమున లేవు గ్రంధకర్త స్వవిషయమును చెప్పుకొన్న పద్యములనుబట్టి అతడి తండ్రి పేరు చోడబల్లి అనియు, తల్లిపేరు శ్రీసతి అనియు, ఆ తండ్రి పాకనాటియందు ఇరువదియొక్క వేయి గ్రామముల కధీశుడనియు, తాను టెంకణాదిత్యుడనియు మాత్రము తెలియవచ్చును టెంకణాదిత్యుడనగా దక్షిణసూర్యుడు ఇది మొదట దక్షిణదేశ చోళరాజైన కరికాలచోడుని బిరుద నామము అతడు తమకు మూలపురుషుడని చెప్పుకొన్న చోడరాజులు పెక్కురు ఆ బిరుదమును తాము కూడ తాల్చిరి నన్నెచోడుడు టెంకణాదిత్యుడనని చెప్పుకొనుటలోగల యర్థమిదియే!

కృతికర్తకు సంబంధించిన వృత్తాంతము ఇంతమాత్రమే! మరి ఈ గ్రంధమునకు కృతిపతి మల్లికార్జునయోగి యనెడి యొక శైవాచార్యుడు కృతిపతి కృతికర్తకు మతగురువే కాకుండ విద్యాగురువు కూడ అయి యుండునేమో! అంతేకాదు ఆ కవి ఆచార్యుని ఇష్టదైవముగా, జీవితేశ్వరునిగా ఆరాధించిన శిష్యుడు పై అంశములకు ఆధారములైన పద్యము లివి·

*ఉ॥ జంగమ మల్లికార్జును నిసర్గ కవిస్తవనీయ సూక్తి యు*
*క్తిం గొనియాడి తత్కరుణఁ గేనములే కనురక్తయైన భా*
*షాంగనఁ దక్క నేలిన మహత్త్వము లోకమునం బ్రసిద్ధి గా*
*భంగిగ విస్తరించెదఁ బ్రబంధము సద్రససంబంధురంబుగాన్.*

*చ॥ గురువున కిష్టదైవమునకుం బతికింగృతి సెప్పి పుణ్యమున్*
*వరమును దేజముం బడయవచ్చు జగంబుల నిశ్చయంబు మ*
*ద్గురువును నిష్టదైవమును గూర్చు నిజేశుఁడు దాననాకుఁగా*
*కొరునకునిట్లు సేకుఱునె యొక్కట లాభములెన్ని యన్నియున్*

*చ॥ అరినరపాల మౌళిదళితాంఘ్రియుగుండయి మేటి పాకనా*
*డిరువది యొక్క వేయిటి కధీశుఁడు నాఁజను చోడబల్లి కిం*
*జిరతర కీర్తి కగ్ర మహిషీ తిలకంబన హైహయాన్వయాం*
*బరశశి రేఖయైన గుణభాసిని శ్రీసతికిం దనూజుఁడన్*

శ్రీ రామకృష్ణకవి నన్నెచోడుడు నన్నయకంటె చాల పూర్వుడని సిద్ధాంతము చేయుటలో ఆయన యుదాహరించిన ఉపపత్తులు రెండు తరగతులకు చెందియున్నవి ఒకటి శాసన ప్రమాణము, రెండు భాషాప్రాచీనత

1. **శాసన ప్రమాణము :** ఆయన పేర్కొన్న శాసనములు మూడు:

**కుడుంబాలూరు శాసనము:** ఈ శాసనములో 900–950 మధ్య కాలమున ఉన్న విక్రమ కేసరి యను నొక చోళరాజు మల్లికార్జునుడనెడి ఒక యోగిని గౌరవించి ఆయన పేర నొక మఠమును కట్టించెనట

**బీచుపల్లి శాసనము:** ఈ శాసనములో చోడబల్లిదేవుడు అనెడి ఒక రాజు 902 వ సంవత్సరములో కృష్ణా తీరమున విశ్వనాధ దేవాలయమునకు భూదాన మిచ్చినట్లు ఉన్నదట.

**పేరులేని మరియొక శాసనము:** నన్నెచోడుడు ఒక రాజు పశ్చిమ చాళుక్యులతోడి యుద్ధమున 940 వ సంవత్సరములో హతుడైనట్లు కలదట

మొత్తము మీద ఈ మూడు శాసనములలోని పేర్లు గ్రంథములోని తండ్రి, కొడుకుల యొక్కయు, గురుశిష్యుల యొక్కయు పేర్లతో సరిపోవుచున్నవి కనుక ఆ ముమ్మురే ఈ ముమ్మురనియు 940 లో యుద్ధమున చనిపోయిన నన్నెచోడుడే ఈ గ్రంథకర్తయనియు కవిగారి సిద్ధాంతము

**2. భాషాప్రాచీనత :** ఇక భాషా ప్రాచీనత విషయములో శ్రీ రామకృష్ణ కవి వ్రాసిన వాక్యములివి· నన్నెచోడుడు నన్నయ భట్టారకునికంటె ప్రాచీనుడని, కుమార సంభవమునందలి వ్యాకరణ ఛ్ఛందో విశేషాత్మకాపూర్వపద ప్రయోగములు సహస్ర ముఖములు ఘోషించుచున్నవి

పై సిద్ధాంతమునకు ఈ క్రిందివి ఉదాహరణము లగును

1. **ఛందో విశేషములు:** దీర్ఘము మీది అరసున్నను నిండు సున్న చేసి సిద్ధానుస్వార పూర్వకాక్షరముతో ప్రాసను చెల్లించుట

క॥ వీండేమి సేయుఁ బంచిన
వాండుండఁగ నిక్కమునకు వధ్యుఁడుగా నా
ఖండలుఁడుగాక, యేసిన
వాండుండఁగ నేమిసేయు వరశర మనిలోన్

ఉ॥ చందన కర్దమంబు ఘనసారరజః ప్రసరంబు శీతలుల్
.. . . .
. ... .. . ..
నాందగు శీతలోపకరణంబుల నర్చన లిచ్చి సిద్ధికిన్

ఉ॥ వీంగునపార
... . .. .. .. .
లోంగిన పేర్మితో నఖిల లోకములుందగఁగాచు చున్నవే
దాంగు ననంతు విష్ణుఁగమలాధిపు సంస్తుతిఁ దేల్చి సమ్మతిన్

మొదలగునవి.

(వీంగు, లోంగి అని కవి వ్రాసియున్నచో దీర్ఘముమీద నిండు సున్న నుంచి నట్లగును. లేకున్నచో పూర్ణార్ధ బిందు ప్రాసమగును )

రేఫ పూర్వాక్షరముగాగల సంయుక్తాక్షరమునకు రేఫతో కూడని రెండవ అక్షరము యొక్క ద్విత్వముతో ప్రాస చెల్లించుట

శా॥ "భర్గుండంతక వాహినుల్ శరహతిన్ భంజించు నట్లెమ్మెయిన్
దర్గంగా రథ పత్రముల్ విఱిగి వేదండాంకురానీకముల్
నుగ్గాడన్ భటకోరకంబులలరన్ నూత్నాశ్వ పుష్పౌఘముల్
మ్రగ్గింతున్ బరసైన్యపద్మ వనముం మద్బాణ వర్షంబునన్"

**2. వ్యాకరణ విశేషములు:** సాధ్యములుగాగాని, మిశ్రములుగా గాని యంగీకరించుటకు వీలులేని సంస్కృతాంధ్ర పదఘటిత సమాసములు; వీటిని వైరి సమాసములందురు

"వానికురియుననే శాస్త్ర వర్షమెల్ల
నశ్రమమున విఖండించి యరద సూత

రథ్య కోదండ కేతనరాజితోడ
వరకిరీటంబు దెగి నేలనురులనేసె

స్ర॥ ... ... ... ... ... ... ...
... .. ... ... ... ... ..
యతిపారీనాతిభీమం బరద కమర మీశాత్మజేం దూదయక్షో
భితమై సంగ్రామ రంగోత్ప్రుథు జలధిమహోభీకరంబయ్యెఁ జూడన్

చ॥ పుడమిపుఁడున్ ధనాఢ్యుఁడును భూరి బలుండును శౌర్యవంతుడున్
గడు దృఢ పాణిపద్ముఁడును గాక యొడంబడ దశ్వమే ధమిం
దడరఁగఁజేయఁ దన్మఖము నందుల పుణ్య ఫలంబులందఁగా
నడుగడుగశ్వమేధమగు నాజి మొనంజని చావు సేగియే."

3. అలంకార విశేషములు: ఉపమావాచక ద్విరుక్తి.

సీ॥ "వేలావనము నందు విలసిల్లు విద్రుమ
వల్లిక యుదయించు వడువుపోలెఁ
బూర్వ దిక్సతి కళి స్ఫురణతో నుతసుధా
కర రేఖ యుదయించు కరణివోలెఁ"

4. అశ్రుత పూర్వ శబ్దములు, అర్థములు:

1. అగు ధాతువుయొక్క భావార్థక రూపము "అగుటకు" బదులు "అగుడు"
"దో, షారంభులు వర్జనీయ లగుడది యరుదే"
"అతి సత్త్వులఁ గూడిబలియు లగుడది యరుదే"
2. కుందు ధాతువునకు "కుందిల్లు" అను రూపము
"వనటం గుందిల్లి చింతించుచున్"
3. సమూహాము అను అర్థమున సమూహి
"శారద నీరద సమూహి చాడ్పునఁబోలెన్"
4. గ్రహ శబ్దమునకు తద్భవముగ గ్రాము. (నేటి ప్రయోగము గాము)
"పఱతెంచి మగుడఁబెట్టిన నఱిముఱివలి గ్రాము పట్టినట్ల నలుడుమై"
5. పరభాగ శబ్దమునుండి అతిశయిల్లు లేక అతిశ యిల్లజేయు అను నర్థమున
"పరభాగిల్లు" అని నామ ధాతువును నిష్పన్నము చేయుట.
"ఉమా మహేశ్వరుల పురోభాగంబుం బరభాగిల్లుచు"
దానివంటివే కావడించు, ఎంగిలించు అను ఈ క్రింది నామధాతువులు
"ప్రమథ గణము దక్షుఁబడగొట్టి కట్టుచుఁ
గాలుఁజేయు బడియఁ గావడించి"
"మొనలావులించి వాసన సల్లఁబసికొని
లేఁదేటిగము లెంగిలింప కుండ"
6. వెంటబడు, వెంబడించు అనునర్థమున వెనుదెంచు
"ప్రజ్వరిల్ల దిగ్గజేంద్రంబు వెనుదెంచెఁ దెరలగుహూడు"

| | | | | |
|---|---|---|---|---|
| 7. ఆండురు | – | స్త్రీలు, – | ఏకవచనము | – అలు |
| బేటము | – | అనురాగము | మేలిల్లు | – శ్రేష్ఠము |
| కేనము | – | అసూయ | కందవడము | – తెర |
| కొలవేరు | – | వట్టివేరు | గోమిని | – లక్ష్మి |
| తలతంత్రము | – | సేవ | | |

ఇవిగాక అసంఖ్యాకములైన కన్నడ పదములు, తమిళ పదములు విచ్చలవిడిగా వాడబడియున్నవి

సంస్కృత పుంలింగ శబ్దములు తత్సమములగునపుడు ఉకార పూర్వక "డు" ప్రత్యయము చేరును అని నియమము దీనికి భిన్నముగ శాసనములలో ఉత్వము మాత్రమే వచ్చి "డు" చేరని రూపములు అరుదుగా నున్నవి ఆ యాచారమును బట్టియు నన్నయ నీచు, మూర్ఖు, వృద్ధు శబ్దములకు "డు" చేర్చకుండగనే ప్రయోగించెను నన్నెచోడుడు అట్టిదేయగు కరికాలచోడు అను ప్రయోగము చేసెను.

*"జలధి మహీసతి మొలనూలుగాఁజుట్టి పాలించెఁగలిఁగరికాలచోడు"*

మరి శాసనములలో ఉకార పూర్వకము గానట్టి "డు" చేరిన రూపములును ఉన్నవి

దేవండు, భీమండు, రామణ్డు, గరుడడు మొదలైనవి

ఇట్టి విశేష రూపములు నన్నయ భారతములో గాని, తరువాతి గ్రంధములలోగాని కానరాకపోవుటకు కారణము నన్నయ నాటికి తెలుగుభాష అన్ని విధముల సుపరిష్కృతమై నియతి చెందినదనియు నన్నెచోడుని నాటికి అట్టి సంస్కారము జరుగలేదనియు అనాటికి తెలుఁగు సోదర భాషలైన ద్రావిడ, కన్నడములతో పూర్తిగా విడివడిపోక ఆ భాషల పదములను అర్థములను కొంత వరకు వాడుకొనుచున్న కాలములో ఈ గ్రంధము పుట్టినదనియు ఆయన వ్యాఖ్యానించెను

ఈ సిద్ధాంతములకు పూర్వపక్షము కవిగారు చూపిన శాసనాధారములో ఒక దోషమున్నది ఎట్లనగా–

చోడ రాజవంశమున నన్నెచోడ నామాంకితులు పెక్కురు కలరట అట్లే చోడబల్లి, బల్లిదేవుడు అనే పేర్లును పెక్కుమందికి కలవట శివాచార్యులలో మల్లికార్జున నామధేయులును కొందరు కలరట కావున ఏ శాసనమునందైన ఒక నన్నెచోడ నామము కానవచ్చినంత మాత్రమున ఆ వ్యక్తి కుమారసంభవ కర్తయనిగాని, వేరొక శాసనమున చోడబల్లి పేరు కానవచ్చినంత మాత్రమున ఆ పురుషుడు నన్నెచోడుని తండ్రియనిగాని ఆ కాలముననే మల్లికార్జునుడనెడి ఒక ఆచార్యుని పేరు కానవచ్చినంత మాత్రమున అతడు నన్నెచోడుని గురువేయని గాని వేగిరపడి చుట్టరికమును కలుపరాదు

శ్రీ జయంతి రామయ్య పంతులు, శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రి ఈ చారిత్రక వివాదమును పరిష్కరించుటకు శాసన పరిశోధనలుచేసి ఆ ముగ్గురకు అట్టి సంబంధమును నిరూపింపగల మూడు శాసనములను ప్రకటించిరి. వాటిలో రెండు పెదచెఱుకూరు శాసనములు. వీటిని వేయించినవాడు మల్లిదేవుడనెడి ఒక చోళరాజు అతడు ఆ గ్రామమున వేంచేసియుండిన భీమేశ్వరస్వామికి 'పరిదంపూడి'

అను గ్రామమును అర్పించుట ఈ శాసన విషయము మరి ఆ గ్రామదానము అప్పటి కాకతీయ చక్రవర్తియగు గణపతిదేవుని పుణ్యప్రాప్తి కొరకు జరిగినట్టు ఆ శాసనముననే వ్రాయబడియున్నది. గణపతిదేవుని రాజ్యకాలమైన 1198 నుండి 1260 వరకు గల మధ్యకాలములో ఈ శాసనము పుట్టియుండును అది యతని చరమదశలో వేయబడిన శాసనమని యూహించుటకు పెదచెఱుకూరు రెండవ శాసన మాధారమగుచున్నది. అదియు ఈ మల్లిదేవుడు వేయించినదే! అందు గణపతిదేవుని ప్రశంసలేదు. గణపతిదేవ చక్రవర్తి అంత్యకాలమున అతని సామంతులు ఒకరొకరే స్వతంత్రులు కాజొచ్చిరని దేశ చరిత్రవలన తెలియవచ్చినది కావున మొదటి శాసనము నాటికి సామంతుడుగా నున్న మల్లిదేవుడు రెండవ శాసనము నాటికి స్వతంత్రుడయ్యెనేమోయని తలచుటకు వీలున్నది కాగా మొదటి శాసనము 1260 ప్రాంతమున పుట్టియుండవచ్చును. అప్పటికి మల్లిదేవుడు గణపతి చక్రవర్తి సామంతుడు. ఆ శాసనములో ఆ మల్లిదేవుని వంశవృక్షము ఈ విధముగా నున్నది:

కరికాలచోళుడు (మూలపురుషుడు)
|
చోడబల్లి
|
నన్నిచోడడు
|
సూరభూపతి
|
రాజరాజమహీపతి – (ఇతడు సూరరాజు తమ్ముడట)
|
ఘంటాకారుడు
|
మల్లిదేవుడు
|
నన్నిచోడడు
|
మల్లిదేవుడు (శాసనదాత)

ఈ వంశములో చోడబల్లి కుమారుడు నన్నిచోడు డొకడు గలడు అతఁడే శాసనదాత కైదుతరములు పైవాడు పురావస్తు పరిశోధన శాఖవారి సూత్రము ప్రకార మొక్కొక్క రాజు తరమునకు 25 సంవత్సరముల చొప్పున లెక్కించుచుబోగా నన్నిచోడ డీతనికి 125 సంవత్సరములు పూర్వుడు అనగా 1125 ప్రాంతమువాడు. ఈ శాసనము తప్ప చోళరాజుల శాసనములలో చోడబల్లి కుమారుడు నన్నిచోడడని నిరూపించు శాసనము మరొకటి యింతదనుక దొరకలేదు

*2. కొప్పురపు శాసనము (1115).*– దీని దాత చోడబల్లి ఇతడు సోమేశ్వరమను గ్రామమును ధృతకాల ముఖవ్రతుడును తత్త్వవేత్తయునగు మల్లికార్జునున కర్పించినట్లిందు

గలదు. 1115 లో చోడబల్లిచే సత్కృతుడయిన మల్లికార్జునయోగి 1125-30 ప్రాంతమున నన్నిచోడనిచేత గ్రంధ ప్రధాన రూపమున సత్కృతుడగుట చూడగా నీ ముప్పురు పురుషులకు గ్రంధ సూచితమగు సంబంధమే కలదని నిశ్చయముగా జెప్పవచ్చును 1115 ప్రాంతముననే తన తండ్రితోడి పరిచయముగల మల్లికార్జునయోగి యీ కవికి గురువగుట సంగతమే ఇంతకంటె ప్రబలమైన యాధారము దొరికి యీ సిద్ధాంతమును పూర్వపక్షము చేయువఱకు ఇదియే నిజమని యనుకొనవలెను

ఇవిగాక త్రిభువన మల్లచక్రవర్తి (చలమర్తి గండనృపతి) రామేశ్వరుడు అను ఒక శివయోగికి ఒక సూర్యగ్రహణ కాలమున భూదానము చేసినట్లు 1090వ సంవత్సరమున వేయించిన ఒక శాసనము కలదు శ్రీశైలమరచరిత్రమును బట్టి ఆ మఠమున ఒకప్పుడు రామేశ్వరుడనెడి ఒక భక్తకవి యుండినట్లు తెలియవచ్చినది

గ్రంధావతారికలో ఏ తెలుగు కవిని ప్రస్తుతింపని నన్నెచోడుడు గ్రంధమధ్యమున ఒక రామేశ కవీంద్రుని పేర్కొని ఈ క్రింది పద్యమును చెప్పెను

*శా॥ "శ్రీరామేశ గవీశ్వరాదులెద నీ శ్రీపాదముల్ భక్తితో*
*నారాధించి సమస్తలోక సముదాయాధీశులైరన్న సం*
*సారుల్ దుఃఖనివారణార్థ మభవున్ సర్వేశు లోకత్రయా*
*ధారున్ నిన్ మదిఁగెల్వ కున్కి యుఱవే దారిద్ర్య విద్రావణా!"*

ఈ "దారిద్ర్య విద్రావణా!" మకుటముతో బృహస్పతి పరమేశ్వరుని స్తుతించినట్లు ఈ వరుసలో పది పద్యములు గలవు ఈశ్వరానుగ్రహమునకు పాత్రుడైన ఆ రామేశకవి విధిగా శివకవియై యుండవలెను అతడు శ్రీశైలమరచరిత్రలో పేర్కొనబడిన రామేశుడేయైన యెడల నన్నెచోడుడు 1090 సంవత్సరమునకు తరువాతివాడు కావలెను ఈ శాసనము కూడ అతని కాలము 12వ శతాబ్ది పూర్వభాగ మనుటకు తోడ్పడుచున్నది అనగా ఈ కవి నన్నయకు ఇంచుమించు 70,80 సంవత్సరముల తరువాతివాడని ఈ శాసనాధారముల వలన తేలినది మరియు నన్నెచోడుడు "సురవరులన్ క్రమంబున" అనెడి పద్యములో మార్గసత్కవీశ్వరులను దేశి సత్కవులను సంస్తుతి చేసితినని చెప్పకొనెను కాని దేశి సత్కవి స్తుతి పూర్వకములైన పద్యములు ఈ గ్రంధమున లేవు. అతడు మానసికమైన స్తుతి నెరపి తృప్తిపడెనో, లేదా "మునుమార్గకవిత" అను పద్యములో ఆంధ్ర విషయంబున తెలుగు నిలిపిన చాళుక్యరాజు మొదలగు పలువుర సంస్మరణమే స్తుతి యనుకొని సరిపెట్టెనో తెలియదు అట్టి వానిని పేరుపెట్టి స్తుతించినచో ఈ గ్రంధముయొక్క కాల విషయిక వివాదము ఉండెడిదే కాదు. అదియునుగాక నన్నయకు పూర్వము శాసనములలోను, నన్నయ భారతములోను కానవచ్చెడి మధ్యాక్కర వృత్తములు కుమార సంభవమున ఒక్కటియైనను లేదు అది దేశివృత్తము దేశికవితాదీక్ష వహించిన ఈ కవి తరువోజాది ఇతర దేశిఛ్ఛందములను ఆదరించి మధ్యాక్కరను కన్నెత్తి చూడకపోవుటకు కారణము ఆ వృత్తమునెడ కవులకు ఆస్థపూర్తిగా తగ్గిపోయిన కాలప్రభావమై యుండును ఇదియు అతడు నన్నయకు తరువాతి వాడనుటకు ఒక నిదర్శనము. ఇంతకంటెను నియతోపకారము కాదగిన శాసనము ఏదియైన లభించి యీకాలనిర్ణయమును సవరించుటకు ఆధారమైనచో ఏమగునో చెప్పలేముగాని,

ఇప్పటివరకు చారిత్రకముగా ఇతని కాలము 12వ శతాబ్ది పూర్వభాగమనుకొనుట కొంత సమంజసము కాకపోదు (శ్రీ) దేవరపల్లి వెంకటకృష్ణారెడ్డి నన్నెచోడుని గురించి ఎక్కువ పరిశ్రమచేసి ఆ కవి 11 వ శతాబ్ది చివరి భాగమున నుండి యుండునని తేల్చెను అనగా నన్నయకు ఇంచుమించు సమకాలికుడన్నమాట మరియు (శ్రీ) (శ్రీపాద లక్ష్మీపతిశాస్త్రి) ఈ కవి తిక్కనకు తరువాతి వాడని వేరొక సిద్ధాంతము చేసెను. నిరపవాదముగ సత్యనిరూపణము చేయలేని ఈ అరగొర శాసనములను నిరాకరించి, తిక్కన రచనలలోని పోలికలు కొన్ని ముఖ్యముగా యుద్ధవర్ణనలు కుమార సంభవమున కానవచ్చుచుండుటచేత నన్నెచోడుడు తిక్కన తరువాతివాడై యుండునని (శ్రీ) లక్ష్మీపతి సిద్ధాంతసారము ఇరువురి గ్రంథములయందు కానవచ్చు ఆ పోలికలు తిక్కనయే నన్నెచోడుని అనుకరించుటవల్ల తటస్థించి యుండునని పై సిద్ధాంతమునకు ప్రతివాదము కలదు కాని తిక్కన నన్నెచోడుల యుద్ధ వర్ణనలలో కానవచ్చే పెక్కు అర్థసంవాదములను, శబ్ద సంవాదములను తిక్కన నన్నెచోడుని గ్రంథమునుండి అపహరించెననుకొనుట అంత విశ్వాస యోగ్యము కాదు అయిదు పర్వములలో పునరుక్తి లేకుండ పదునెనిమిది రోజుల కురుపాండవ యుద్ధమును పదునెనిమిది గంటలు చూడదగిన చలన చిత్రమువలె చిత్రించి ప్రదర్శించిన తిక్కనకు కుమారసంభవమునందలి రెండాశ్వాసముల యుద్ధవర్ణనా భాగమునుండి ఎరవు తెచ్చుకొనవలసినంతటి భాగ్యహీనత యేమి తటస్థించును? మీదు మిక్కిలి నన్నెచోడుని కాలము భావి పరిశోధనలవల్ల నికరముగా తేలినపుడు తిక్కన యుద్ధ వర్ణనలే కుమారసంభవ యుద్ధ వర్ణనలకు మాతృకలని తేలునేమో! అయినను అదియును నన్నెచోడునకు న్యూనతను కలిగింపదు. అదిగాక వారిరువురును పాకనాటి సీమవాసులు. ఆ మాండలిక పదజాలము వారిరువురికి సాధారణము

వారిలో ఒకరు రాజు, వేరొకరు మంత్రి ఇరువురకును రాజధర్మ, యుద్ధ తంత్ర పరిజ్ఞానము సమానము కాగా ఒకరిని ఒకరు అనుకరించుటగాక ఎవరికి వారే స్వతంత్రముగ అట్టి వీరవిహారవర్ణనలు చేసిరనుకొన్నను తప్పులేదు అసలు కవులలో ఎవరిని ఎవరు అనుకరించినను అనుకరణము దోషము కాదు. తమకు పూర్వులైన కవుల భావములను పలుకుబడులను స్వేచ్ఛగా ఏకకుటుంబ ధనమువలె వాడుకొనుట పూర్వాంధ్ర కవులకేగాక సంస్కృత కవులకును ఆచారము అట్టి యనుకరణములు, అనుసరణములు తమకు న్యూనతను తెచ్చెడి గ్రంథ చౌర్యములుగా వారెన్నడును భావించియుండరు వాల్మీకి వాగ్విలాసములు కాళిదాసు గ్రంథములలో పెక్కుచోట్ల ప్రతిబింబించుచుండును దానివల్ల కాళిదాసు ఘనతకు లోకమున ఏమియు లోటురాదు తెనుగున నన్నయ భారతమునందుకూడ దానికి మూలమైన వ్యాసభారత పదబంధములే కాక కాళిదాస భారవి ప్రముఖకవుల శబ్దములు, భావములు అక్కడక్కడ కానవచ్చును. వాటి యునికి నన్నయకు అపకీర్తి హేతువుకాదు ఒక యుదాహరణ చూడుడు· అర్జునుడు పాశుపతాస్త్ర సంపాదనార్థము తపస్సునకు వెడలునపుడు ద్రౌపది యతనిని "తన స్నేహలాలస విలోలాపాంగ విలోకనంబులం బార్థుఁబరిగృహీతపాథేయుం జేయుచు" అన్న నన్నయ భారతములోని వాక్యమునకు మూలము భారవిలో ఉన్నది ఆ శ్లోకమిది.

"అకృత్రిమ ప్రేమ రసాభిరామం
రామార్పితం దృష్టి విలోభి దృష్టం
మనః ప్రసాదాంజలినా నికామం
జగ్రాహ పాథేయ మివేంద్ర సూనుః"

పూర్వకవులకు అనుకరణ రూప పూజ చేసిన తెలుఁగు కవులలో శ్రీనాధుని మించిన భక్తాగ్రేసరుడు లేడు సందర్భము పొసగినపుడెల్ల కవిసార్వభౌముడు కాళిదాసు, భట్ట, బాణ, మురారి, భవభూతి, మయూర ప్రముఖ సంస్కృత మహాకవుల శ్లోకములను అనుకరించియో అనువదించియో తన గ్రంథముల నలంకరించుకొనెను. తెనుగు కవులలో తిక్కన పలుకుబడులను పెక్కింటిని శ్రీనాధుడే వేడుకపడి ప్రయోగించెను

అట్లే కుమారసంభవములో కాళిదాసాది కవుల అనుకరణములు చాల ఉండును. కుమారసంభవములోని యనుకరణములు తరువాతి తెలుఁగు కవుల గ్రంధములలో అక్కడక్కడ కానవచ్చును అంతమాత్రమున అనుకారి అనుకార్యునికంటె తక్కువ వాడనికాని స్వయముగా అమాత్రపు భావమును ఊహింపలేడనిగాని తలచుట, పూర్వకవులయెడ అపచారము చేయుటయేయగును. ఒకే భావము ఒకే కాలమునగాని అనేక కాలములగాని, అనేక దేశముల అనేక భాషలలో అనేక కవులకు స్ఫురింపవచ్చును దీనిని బట్టియే శబ్దస్ఫోటతో పాటు భావస్ఫోటయు కలదని తార్కికులందురు. ఆ భావమును ఆయా కవులు వ్యక్తము చేసెడి విధానమేవారి రచనానైపుణి వారి విశిష్టతకు ఆ కూర్పు నేర్పే కారణభూతము.

"త ఏవ పద విన్యాసా స్తాయేవార్థ విభూతయః,
తథాపి నవ్యం భవతి కావ్యం గ్రథన కౌశలాత్"

కావున భావ చౌర్యమునునది లేనేలేదు. కాకపోతే అసమర్థుడై అధమ కవిత్వము చెప్పెడివాని గ్రంధములలో అట్టి అనుకరణములు కానవచ్చునపుడు ఆ కవిని యధార్థముగా చౌర్యము చేసిన వాడనుటలో తప్పలేదు సమర్థులైన కవులకు అట్టిది ఆపాదింపరాదు

నేను మొదట చెప్పినట్లు ఈ కవీశ్వరుడు చేసిన పుణ్యమువల్ల ఇతని గుఱించి, ఇతని కాలమును గుఱించి మరి కొంతకాలము గ్రంధము పెరుగుచునే యుండును

శ్రీ రామకృష్ణకవి చూపిన అపూర్వ ఛందోవ్యాకరణాది ప్రయోగ విశేషములు కొన్ని నన్నయ తరువాతి కవులలోకూడ కానవచ్చుచున్నవనియు అందును ముఖ్యముగ పాల్కురికి సోమనాధుని రచనలలో విస్తారముగ ఉన్నవనియు ఆ ప్రయోగ విశిష్టతయే నన్నెచోడుని ప్రాచీనతకు నిదర్శన మగునేని సోమనాథ ప్రభృతులు కూడ నన్నయకంటె ప్రాచీనులని చెప్పవలసి వచ్చుననియు రెండవ పక్షమువారు ఆ నిదర్శనమును త్రోసిపుచ్చిరి. ఈ క్రిందివి వారు చూపిన ఉదాహరణములలో కొన్ని:

"పొందు రాంగంబైన పడఁతి గర్భమునఁ
బోఁడిగా బెరుగుఁచు పుత్రుఁడీ క్రియను".

(ఇవి పోండిగా అని కవి వ్రాసి యున్నచో దీర్ఘముమీద నిండుసున్న నుంచినట్లగును. లేకున్నచో పూర్ణార్థబిందు ప్రాసయగును) – బసవ పురాణము

వైరి పదములు:

"పుడ మీశ్వర గొంక నృపతి భోగ సురేంద్రా"
(మనుమంచి భట్టు – హయలక్షణము)

"దినవెచ్చ మేరాజు తీర్పఁగలఁడు" – శ్రీనాధుడు

"ప్రాణగొడ్డము" – నన్నయ

"ఆ పరంజ్యోతి స్స్వరూపంబునకును
దీపకంబంబు లెత్తించిన యట్లు" – బసవ పురాణము

"పుడమీశ మీధనంబునకు జేసాఁప
నొడయల కిచ్చితి నొడయల ధనము" – బసవ పురాణము

శాంతప్రాసము:

"సర్వజ్ఞ భక్తి విరహితుఁ డెవ్వఁడు" – శివతత్వసారము

"సర్పంబు పడగ నీడను
గప్ప వసించిన విధంబు" – సుమతిశతకము

దిగ్వాసుం డురుపింఛ లాంఛిత శిఖోదీర్ణుండు వర్షాపయో
ముగ్వర్ణుండు నవాంబుజాహితలతా ముక్తాంగదుండున్ సుధా
రుగ్విస్మేర ముఖుం డనంగశత జిద్రూ పాధికుం డగ్ర భూ
వాగ్గర్వోద్భవ భూమి శ్రీవిభుఁడు శ్రీవత్సాంక వక్షుండునై.
– పాండురంగ మహాత్మ్యము

"ద్యూత క్రీడకు కొండొక
నేర్తున్" – తిక్కన విరాటపర్వము

"... ... .. ......పొం
గారెడు నేతికిఁబై పై
నీరలికిన యట్టు వోలె నిష్ఫలమయ్యేన్" – కేతన దశకుమారము

ఇట్టివి ఎఱ్ఱాప్రగడ రచనలలోను కలవు ఇట్టి వింత ప్రయోగములే కాక "సమూహి, బేటము", మొదలైన అపూర్వ పదములు కూడ పాల్కురికి సోమనాధుని రచనలలో మిక్కిలి కానవచ్చుచున్నవి.

(1) భక్త సమూహికి బసవయ్య మహిమ

(2) వలచుట పాపమే వట్టి బేటంబు సలుపుట నీతియే

ఇవన్నియు ఇటుండుగాక. ఇంకొక విషయము.

భాష - పాతదనము:

అరువదియేండ్లనాడు శ్రీమానవల్లి రామకృష్ణకవి ఈ గ్రంధమును ప్రకటించినపుడు ఏ మాత్రమేని సాహిత్యజ్ఞానము కలిగి గ్రంధ పఠనాభ్యాసముకల యువకులందరు చారిత్రక చర్చలవరకు పోకుండ శైలినిబట్టి ఈ గ్రంధము శాసన భాషవలె దుర్బోధమై పఠనయోగ్యముగా లేదని దీనియెడ విముఖులైరి. నన్నయకంటె ప్రాచీనుడని సిద్ధాంతమును సహింపలేని విద్వాంసులు మాత్రము దీని జననకాల

పరిశోధనలకు పూనుకొని కవిగారి సిద్ధాంతమును పూర్వపక్షము చేసిరి. శ్రీ మానవల్లి రామకృష్ణకవి ఈ గ్రంథము ప్రతిని సంపాదించి అచ్చు వేయునపుడు ఆ వ్రాతప్రతి చక్కగా సంస్కరింపక యథాతథముగ ముద్రించుటచేత ఈ గ్రంథమునకు సహజముగా లేని పాతదనము వచ్చినది దానివల్లనే పాఠకులకు ఆ భాష దుర్బోధమైనది. మన దేశమున పుస్తక భాండారములలోగాని ఇతరత్రగాని లభించెడి వ్రాతప్రతులన్నియు ఇంచుమించు మూడు వందల సంవత్సరములకంటె పూర్వము వ్రాసినవి కావు ముద్రణ యంత్రములు వెలసిన తర్వాత పూర్వ గ్రంథములను అచ్చువేయ తలపెట్టినవారు వాటిని నేటి భాషకు అనుగుణముగ వర్ణక్రమములను, వ్యాకరణ విశేషములను మార్చి వాటియెడ పాఠకులకు సుముఖత్వమును గలిగించిరి ఈ సంస్కారములో వ్యాకరణ విషయక భాగమునకు చిన్నయసూరి వ్యాకరణమునే ప్రమాణముగా గైకొని ఆ సూత్రములకు విరుద్ధములైన ప్రయోగములన్నిటిని మార్చి మూల గ్రంథకర్తలకే అపచారము చేసిరి ఇట్టివి పరమప్రమాణములైన భారతాది మహా గ్రంథములలోనే జరుగబట్టి మనము మూలరూపములు ఎరుగక ఈ రూపములకే అలవాటు పడి ఇవే ఒప్పుగా తక్కినవి తప్పుగా నమ్మబూనితిమి శ్రీ రామకృష్ణ కవి కుమారసంభవ ప్రతిని భారతాదులను వలెనే నేటి భాషకు అనుగుణముగ సంస్కరించి ముద్రించి యుండినచో ఈ గ్రంథమునకు ఇప్పుడున్నంత పాతదనము వచ్చెడిదికాదు. ఇది ప్రాఙ్నన్నయ యుగమునకు చెందినదని స్థాపింప దలచి కవిగారు అట్టి సంస్కారమే చేసి యున్నచో తన ప్రతిపాదనకు భంగము వాటిల్లును గాన ఆ పనిచేయ తలపెట్టలేదు మరి తంజావూరు మొదలైన స్థలములందలి పుస్తక భాండారములలో కానవచ్చెడి ప్రాతకాలపు వ్రాత ప్రతులన్నిటిలోను దీర్ఘముల మీద అరసున్న స్థానమున నిండు సున్నయు, ప్రథమాక్షరము రేఫముగాగల సంయుక్తాక్షరములో రెండవదానికి పలపలగిలకయు మొదలైన పూర్వకాలపు వర్ణక్రమము సర్వసాధారణముగ కానవచ్చును ఆ రూపములు అచ్చు వెలసిన తరువాత, నేటి వర్ణక్రమానుసారము అచ్చులో సవరింపబడినవి. శ్రీ రామకృష్ణ కవి ఇట్టి వాటిని కూడ సవరింపలేదు మరియు, ఆయన తరువాత ఇటీవల ఈ గ్రంథమునకు రెండుమూడు ముద్రణములు బడినవి. వీటిలో ఆయన గ్రంథమున కానవచ్చెడి "వనలచ్చి, మరహారుడు" మొదలైన వైరి సమాసములు కానరాక, వాటి స్థానమున "వనలక్ష్మి, స్వరహారుడు" అని ముద్రింపబడి యున్నవి

ఈ పరిష్కృత రూపములు మూలమున నున్నవేకాని కల్పితములు కావని మన మనుకొనవచ్చును. సత్యాన్వేషణ తత్పరములైన ఇట్టి పరిశోధనలవల్లనే నన్నెచోడుని కుమారసంభవము అనాటి కంటె నేటికి కొంత సుబోధముగ నున్నది అయినను ఇప్పటికిని ఈ గ్రంథము సులభ గ్రాహ్యము గాదు ఏ గ్రంథమైనను దుర్బోధ మగుటకు రెండు కారణములుండును ఒకటి - కవి యూహించిన అర్థము (Idea) లోతుగ నుండుట రెండు - ఆ యర్థమును సర్వసాధారణ భాషలో తాను వ్యక్తము చేయలేకనో ఆ భాష తన యర్థమును వ్యక్తము చేయజాలదను తలంపుచేతనో అసాధారణములైన మారుమూల పదములను వాడుట ఈ రెండింటిలో మొదటిదైన అర్థ గాంభీర్యము గ్రంథమున ప్రతి పద్యములోను ఉండదు. ఉన్నచోట కవి

అసమర్థుడైనచో రెండవది తటస్థించును. నన్నెచోడుని పద్యములలో కొన్నింట తరచి చూచినగాని తెలియని అర్థ గాంభీర్యము కలమాట నిజమే! ఆ యర్థమును వ్యక్తము చేయుటకు సర్వత్ర కాకున్న కొన్నిచోట్ల నయినను అతడు అపూర్వ శబ్దములు ప్రయోగించుటయు నిజమే వీటివల్లనే అతని రచన దుర్భోధ మనెడి నిందకు పాత్రమైనది ఈ యపూర్వపద ప్రయోగములు కూడ సంస్కృతశబ్దముల యందుకంటె తెలుఁగు పదములలోనే ఎక్కువ కానవచ్చుచున్నవి అరవ కన్నడ పదముల సాహచర్యము దీనిని మరికొంత దూరము కొనిపోయినది

ఇతడు వాడిన పదములు నిఘంటువున కెక్కక పోవుటచే అర్థావబోధమునకు నిఘంటువులు కూడ నిరుపయోగములైనవి. నిఘంటువులైనను గ్రంథస్థములైన పదములనే స్వీకరించునుగాని గ్రంథస్థములు కాకుండ వాడుకలోనేయున్న పదములను స్వీకరింపవు కుమార సంభవము నిఘంటుకారులు చూడలేదు. నన్నెచోడుడు వాడిన దేశీ పదజాలములో ఎక్కువపాలు మాండలికము ఆంధ్రుల అందరిభాష ఆంధ్రమే యనిపించుకొన్నను ఈ దేశమునగల నానామండలములలో నానావిధములైన మాండలిక పదములు ఉన్నవి దేశి యనెడి పేరుమీద ఆ మాండలిక పదములనే ఎక్కువగా ప్రయోగించినవాని కవిత్వము నిఘంటు సహాయము లేకుండ ఇతర ప్రాంతములకు అర్థముగాదు ఈ లక్షణము ఒక్క తెలుఁగునకేకాక ప్రపంచ భాషలన్నింటిలోను కలదు ఏ ప్రాంతమువారు ఆ ప్రాంతీయపదములనే వ్యవహారమున వాడుకొనుచున్నను గ్రంథకర్తలు మాత్రము బహుళముగా సాధారణీకృతమైన భాషనే వాడుచుందురు. ఆంధ్రభాషయొక్క సాధారణీకృతికి సంస్కృతము ఎక్కువగా తోడ్పడినది. అందుచేతనే నన్నెచోడుని కవిత్వములో సంస్కృత భాగము సుబోధము, దేశిభాగము దుర్భోధము అయినవి అదియునుగాక ఆంధ్రసాహిత్య విద్యార్థులు మొదట నన్నయ భారతము ద్వారానే భాషా పరిజ్ఞానమును సంపాదించిరి. ఆ గ్రంథమున కూడ కొన్ని మాండలికములున్నను, అవి తద్గ్రంథ పఠనా భ్యాసము వలన పాఠకులకు సుపరిచితములై కేవల మాండలికత్వమును కోల్పోయినవి. కుమారసంభవమునకు భారతమువలె పఠన యోగ్యత కలుగకపోబట్టి ఆ భాష నేటికిని వింతగానే తోచుచున్నది. పాల్కురికి సోమనాథుడు నన్నెచోడునివలెనే ఎక్కువగా మాండలిక దేశి పదములనే వాడెను కాని అతని గ్రంథములు భారతమువలె సాహిత్యపరులందరకు సంసేవ్యములు కాలేదు దానికి కారణము సోమనాథుడు కావ్యములను పేర మతగ్రంథములను వ్రాయుట. ఆ మతస్థులు తప్ప ఇతరులు ఆ గ్రంథములను సాహిత్య సంపాదనార్థమైనను చదవకపోవుట సహజమే! మరి నన్నెచోడుని తర్వాత తిక్కన కూడ దేశ భాషను సుప్రతిష్ఠితము చేయుటలో కొంత పాలు నెల్లూరి మాండలికము అని చెప్పదగిన దేశిపదములను, జాత్యమును తన గ్రంథములలో వాడెననుటలో సందేహములేదు అయినను అట్టి పదములు నిఘంటువులకు ఎక్కుటచేత, తెలియని యర్థములను వాటిద్వారా గ్రహింపగలిగితిమి. అదియునుగాక తిక్కన భావములు ఇతర కవుల భావముల కంటె ఎక్కువ లోతుగలవి యయినను ఆయన ఇతరులవలె తాను క్లేశపడక పాఠకులను క్లేశపెట్టక సుకరముగా ఆ భావమును వ్యక్తము చేయగలడు. తిక్కన తరువాతనే దేశి పదజాలమునకు మన

భాషలో సాధారణీకృతమేర్పడినది కావున మాండలిక పదప్రయోగమునే ఎక్కువగ చేయు కవి దేశవ్యాప్తమైన ఆదరమును పొందలేడు. నన్నెచోడుని గ్రంథమునకు అట్టి స్థితియే పట్టినదని నా యభిప్రాయము

గ్రంథ సమీక్ష:

తెలుగు కవులలో కొందరు తమ గ్రంథావతారికలలో కావ్యకళను గూర్చిన తమ ఆశయములను, ఆదర్శములను సూత్రప్రాయములైన కొన్ని లక్షణ వాక్యములలో వ్యక్తము చేసిరి. ఆ లక్షణ నిర్దేశములో తమకు పూర్వమునగాని సమకాలమున గాని రచింపబడిన కొన్ని గ్రంథములను గూఢముగా అధిక్షేపించుటయు, అట్టి దోషములు లేని తమ రచనా విధానమును సూచించుటయు గలదు. అట్టివారిలో నన్నెచోడుడు ప్రథముడు సత్కవి కావ్యము ముఖ్యముగా ఈ క్రింది లక్షణములు కలిగి యుండవలెనని ఈ కవి యాశయము.

1. భావములు జాను తెనుగున సరళముగా వ్యక్తము చేయుట
2. కావ్యము కలిగించెడి ఇంపు పెంపుతో పిరిగొనియుండుట. అనగా రచన హృదయమునకు ఇంపు నిలుపుటయే గాక చిత్తమునకు ఔన్నత్యము కలిగించునది కావలెను, అనుట. అట్టి ఔన్నత్యము ఉదాత్తవస్తు స్వీకారమున కలుగును.
3. శైలి కర్ణరసాయనముగా నుండవలెను
4. పైపై తళుకు బెళుకులతో చూపరకు మిరుమిట్లు గొలిపియు లోన ఉత్తగుల్లయైన ప్రతిమవలె గాకుండ, ఉత్తమ కావ్యము చూచుటకు అన్నివిధముల సుందరముగా నుండుటయే గాక అంతరమున సారవంతమై, సాలభంజిక వలె నుండవలెను (Substantial).
5 కృతి చెప్ప బూనినవానికి చతుష్షష్టి కళా పరిజ్ఞాన ముండవలెను
6. గ్రంథమున నవరసములు, అష్టాదశ వర్ణనలు ఉండవలెను ఇవిగాక

"మార్గ కుమార్గము, దేశీయ
మార్గము, వదలంగఁ దమకు మది గొల్పక దు
ర్మార్గపథవర్తు లనఁదగు
మార్గకవుల దలఁప నలఁతి మహీ సుకవులకున్"

అను పద్యములో ఆనాటి మార్గ కవితాభిమానులను అతడు నిరసించిన సూచన కలదు ఎట్లనగా చాళుక్యుల కాలమున దేశి కవిత్వము పుట్టి నన్నయ భారతరూపమున సుప్రతిష్ఠితమైనను, దానిని మెచ్చక మార్గ కవితయందే – సంస్కృతమునందే – ఇంకను పక్షపాతము చూపెడి ఛాందసులను గూర్చి పలికిన వాక్యములివి. అంతేగాని నన్నయ భారతము మార్గ కవిత్వమనియు తదనుయాయులు తత్పక్షపాతులు మార్గకవులనియు నితని యభిప్రాయము గాదు అట్లే యగుచో ఆ అక్షేపణ తన గ్రంథమునకును తగులును ఎట్లనగా నన్నయ కవిత్వమునకును తన కవిత్వమునకును సంస్కృతాంధ్ర పదముల పాళ్ళలో హెచ్చుతగ్గు లుండవచ్చునుగాని, పద్య రచనా విధానము రెండింటను ఒకటియే! ఎక్కువపాలు దేశి పదములుండుట తప్ప కుమార సంభవములో మార్గకు భిన్నమైన దేశితన మేమియులేదు. నేను ఇతః పూర్వము

చెప్పినట్లు ఆనాడు మార్గకవిత్వము సంస్కృత కవిత్వమనియే అతని యభిప్రాయమై యుండును. దానినే ఆరాధించి దేశిని మెచ్చక పోవుట "కుమార్గము" అని యతని నింద. (కుమార్గము = మంచిపద్ధతి కాదు) ఈ పద్యమునకు ఇంతవరకు సరియైన అర్థము కుదురలేదు. పైది నాకు తోచిన అర్థము

ప్రస్తుతము మన దేశములో ఉన్నతవిద్యా బోధన మంతయు మాతృభాష ద్వారా జరుగుట శ్రేయస్కరమని కొంతమంది ప్రతిపాదించుచుండగా వేరొక వర్గమువారు ఆంగ్లము ద్వారానే ఆ బోధనము ఫలప్రదమగుననుగాని మాతృభాషద్వారా బోధించుట తగదు అని వాదించుచున్నారు గదా! ఈ వివాద మెట్టిదో నన్నెచోడుని నాటి కావ్యభాషా వివాదముకూడ అట్టిదేయై యుండును కాబోలు. ఇతని యాశయములలో ప్రధానమైనది - భావములను జాను తెనుఁగున సరళముగా చెప్పవలెననుట ఈ 'జాను తెనుఁగు' అనెడి పదమును ఇతడే మొదట ప్రయోగించినవాడుగా పొడగట్టును. జాను తెనుఁగనగా ఏమియో అతడు చెప్పక పోయినను సరళమైన తెలుఁగు అని పద్యతాత్పర్యమునుబట్టి యూహింపవచ్చును ఈ పదమును పాల్కురికి సోమనాథుడు తన గ్రంథములలో ప్రయోగించి దాని స్వరూపమును గూర్చి కొంత వివరణమును చెప్పెను.

*ఉరుతర గద్య పద్యోక్తులకంటె సరసమై బరగిన జాను తెనుంగు*
*చర్చింపగా సర్వ సామాన్యమగుట కూర్చెద ద్విపదలుకోర్కిదైవార*

(బసవ పురాణము)

*ఆరూఢ గద్యపద్యాది ప్రబంధ పూరిత సంస్కృత భూయిష్ఠ రచన,*
*మానుగా సర్వసామాన్యంబుగామి జాను తెనుఁగు విశేషము ప్రసన్నతకు*

(పండితారాధ్య చరిత్ర)

పై ద్విపదలనుబట్టి సర్వ సామాన్యమైన భాష జాను తెనుఁగని ఆ కవులనుకొన్నట్లు మనము భావింపవచ్చును కాని "ఆరూఢ గద్య పద్యాది ప్రబంధ పూరిత సంస్కృత భూయిష్ఠ రచన" అను సమాసము సర్వ సామాన్యమేనా? అని ప్రశ్నించిన వారికి నా సమాధానమిది: సర్వులు అనగా ఆబాలగోపాలము, ప్రజలు అని యర్థము కాదు. కొద్దియో గొప్పయో భాషాజ్ఞానము కలిగి, పాండిత్యము లేకపోయినను ఇతర సాహాయ్య మపేక్షించకుండ, చదివెడి గ్రంథమును అర్థము చేసికొన కలిగిన అక్షరాస్యులను మాత్రమే అతడు ఉద్దేశించెనని నేను భావింతును. అనగా సంస్కృత శబ్దములను వాడినను తెలుఁగువారికి నిత్య వ్యవహారమున సుపరిచితములై తెలుగు తనమును తాల్చిన శబ్దములైనచో అవి తెలుఁగు పదములతోపాటు సర్వసామాన్యములే యగును. ఇంతవరకు లెస్సగా నున్నది. కాని ఆ సోమనాథుడే తన వృషాధిప శతకమున జాను తెనుఁగునకు ఉదాహరణముగా ఒక పద్యమును వ్రాసెను

చ॥ *బలుపొడతోలు సీరయును బాఁపసరుల్ గిలుపారు కన్ను వె*
*న్నెలతల సేదుకుత్తుకయు నిండిన వేలుపు టేరు వల్గు పూ*
*సలు గల జేని లెంకనని జానుఁదెనుంగున సన్నుతించెదన్*
*వలపు మదిందలిర్ప బసవా! బసవా! బసవా! వృషాధిపా!*

ఈ పద్యమునుబట్టి జాను తెనుఁగనగా అచ్చ తెనుఁగు అని స్ఫురించుట తథ్యము.

అచ్చ తెనుఁగు పద్యములు కొన్ని సంస్కృత సమాస ఘటిత పద్యములకంటె దుర్బోధముగా నుండుట అందర మెరిగినదే! అచ్చ తెనుగు భాష ఎన్నటికీ సర్వ సామాన్యము కాదు చాళుక్యరాజు మొదలగు పలువురు దేశి కవిత్వమును నిలిపిననాడే తెనుగు తత్సమ సంయుతమై ఉత్తమ కావ్య రచనా యోగ్యమయ్యెను. పోనీ, తత్పూర్వము ఎట్టి సంస్కృత ప్రాకృత శబ్ద సంక్రమణములేని కాలమున అచ్చ తెనుఁగు వాక్యములు ఉండెనని చారిత్రకముగా నిరూపితమైనను ఆ వాక్యముల తెలుఁగు అతి ప్రాచీనములైన శాసనముల భాషవలె మనము ఎన్నడును వినని ఏదో పరిభాషగ వినబడునేగాని సర్వ సామాన్య భాషగ వినబడదు కావున సోమనాథుడు జాను తెనుఁగు పేర అచ్చ తెనుగు పద్యము వ్రాయుట సరియైన యుదాహరణము కాదు. నన్నెచోడుని అభిప్రాయమునను జాను తెనుగనగా అచ్చ తెనుగుగాదు అతని గ్రంధము అచ్చ తెనుగున వ్రాయబడలేదు పోతే అతని అభిప్రాయము సోమనాథుని వివరణము వలెనే సర్వసామాన్య భాషయే జాను తెనుగై యుండవలెను. కాని గ్రంధమునందలి భాష సర్వ సామాన్యమని చెప్పలేము. ఈ గ్రంధమున కొన్ని కొన్ని పద్యములు, కొన్ని కొన్ని వాక్యములు సరళముగా, సుబోధముగా నున్నను ఇంచుమించు నూటికి ఏబదిపాళ్ళు కఠిన సంస్కృత భూయిష్ఠమైన రచనయే యనుట సత్యదూరము కాదు. కావున సర్వ సామాన్యమైన జాను తెనుఁగు రచన అతనికి ఆదర్శము మాత్రమే! ఆచరణ సాధ్యములు గాకపోయినను ఉత్తమాదర్శములు ప్రశంసనీయములే!

ఈ జాను తెనుఁగు శబ్దము వంటిదే ఇతడు వాడిన వస్తుకవిత యనెడి అస్పష్టమైన యింకొక శబ్దము అవతారికలో ఈపదము నతడు పదేపదే ప్రయోగించెను. తాను జంగమమల్లికార్జునగురువు వలన వస్తుకవిత్వమును నేర్చెనట.

*ఆ॥ "నింగి ముట్టియున్న జంగమ మల్లయ*
*వరమునందుఁ గనిన వస్తు కవితఁ*
*దగిలి వారియందనె గడింతు రవికి దీ*
*పమున నర్చలిచ్చు పగిదివోలె."*

ఆ గురువునకు తన కుమారసంభవ వస్తుకవితను రవికి దీపమున అర్చలిచ్చుపగిది సమర్పించెనట అనగా ఈ గ్రంధము వస్తుకవితా బంధురమని మన మనుకొనవలెను. మరి ఈ గ్రంధమునే అతడు ప్రబంధమని ఇంకొక పద్యమున పేర్కొనెను.

*ఉ॥ "జంగమ మల్లికార్జునుని. ...*
*....విస్తరించెదఁ బ్రబంధము సద్రస బంధురంబుగాన్"*

ఈ ప్రబంధ కవిత్వమునే అతడు వస్తు కవిత్వముగా పేర్కొనెనని తలపవచ్చునుగాని మరి సంస్కృతకవిస్తుతి సందర్భమున వాల్మీకిరామాయణమును భారవి కిరాతార్జునీయమును వస్తుకావ్యములుగాను, ఉద్భటుని కుమారసంభవమును గూఢవస్తుమయ కావ్యముగాను ప్రశంసించెను

*కం॥ "కవితామృతోదయాంబుధి*
*కవి సజ్జనజనకు వస్తుకావ్యాబ్జరవిన్*

గవితారంభంబుల స
త్కవు లభినందింతు రాదికవి వాల్మీకిన్.
కం॥ భారవియు వస్తు కవితను
భారవియును బరఁగి రుదయ పర్వత శిఖరా
గ్రారోహణేంద్ర కీల న
గారోహణ వర్ణనల జనారాధితులై.
కం॥ క్రమమున నుద్భటుఁడు గవి
త్వము మెఱయఁగుమార సంభవమ్ము నలంకా
రము గూఢవస్తుమయకా
వ్యముగా హరులీల చెప్పి హరు మెచ్చించెన్."

ఈ ప్రశంస చూడగా వాల్మీకియు భారవియు ఉద్భటుడు మాత్రమే సంస్కృత ములో వస్తుకవులనియు అందులోను ఉద్భటుడు గూఢవస్తు కవియనియు అనుకొనవలసి వచ్చును. అతని కుమార సంభవము లభ్యముకాదు గనుక అది ఏ విధముగా గూఢమో మనము చెప్పలేము. బహుశా ప్రబోధచంద్రోదయమునందువలె అతని కుమారసంభవములో వాచ్యార్థము కాక ఆధ్యాత్మిక అంతరార్థము ఏమైన ఉన్నదేమో! ఇక భారవియు, వాల్మీకియు ప్రత్యేకము వస్తుకవులుగా ప్రస్తుతింపబడుట ఏకవితా గుణమునుబట్టియో మన మూహింపలేము. భారవి వస్తుకవియైనపుడు మాఘుడు ఏల కాకూడదు! భట్టహర్షుడు ఏల కాగూడదు? కావున ఆ యిరువురనే ఇతడు ప్రశంసించుటలో విశేషార్థమేమియులేదు తన గ్రంథమును ప్రబంధము అని చెప్పుకొన్నాడు గనుక ప్రబంధ కవిత్వమే వస్తు కవిత్వమని అతని అభిప్రాయముగా గ్రహింపవచ్చును.

అలంకార శాస్త్రములలో వస్తు శబ్దమును కథాపరముగాను, కథాంశపరముగాను వాడిరి. వస్తునేతృ రసభేదములనుబట్టి దశరూపకము లేర్పడునని ఈ క్రింది సూత్రమున కలదు.

"వస్తునేతృరసాస్తేషాం రూపకాణాం హి భేదకాః" (ప్రతాపరుద్రీయము)

ఈ సూత్రములో వస్తువనగా నాటకేతి వృత్తమనియే అర్థము మరి

"యత్స్యాదనుచితంవస్తు నాయకస్య రసస్యవా,
అవశ్యం తత్పరిత్యాజ్యం అన్యథావా ప్రకల్పయేత్" (దశరూపకము)

ఈ కారికయందలి 'వస్తు' శబ్దమునకు ఇతివృత్తములో ఏదో యొక అంశమని యర్థమేగాని ఇతివృత్తమంతయు అని యర్థముకాదు కథయంతయు అనుచితమైనచో కవి దానిని చేపట్టనే చేపట్టడు కావున ఈ రెండు కారికలను బట్టి అభిజ్ఞాన శాకుంతల మునందు ప్రధానకథయైన శకుంతలాదుష్యంతుల దాంపత్యగాథ వస్తువు అయినట్లే ఆ నాటకమునందలి జాలరివృత్తాంతముగాని, దుర్వాసశ్శాప వృత్తాంతముగాని, దుష్యంతుని మృగానుసరణముగాని వస్తువులే యగును మానవ శరీరమువలె కావ్యశరీరముకూడ అనేకావయవ సంయుతమై యుండును. అవయవ పరిపుష్టియే అవయవి పరిపుష్టి. ఏ అవయవము క్షీణించినను అవయవికి అంగవైకల్యము రాకమానదు కావున కావ్యములో ప్రధానకథను గుణాలంకార వర్ణనాదులతో రసవంతము చేయుటేకాక

తదవయవ స్థానీయములైన ఇతర కథాంశములనుగూడ ఆ విధముగానే పరిపోషించి రసవంతములు చేయుటయే వస్తు కవిత్వము చెప్పుట. అదియే ప్రబంధ రచన చేయుట అని ఈ కవి యూహయని నేను ఊహింతును. నా యూహయే నిజమైనచో ఇతని వస్తుకవితా శబ్దప్రయోగములో నూత్న ప్రతిపాదనమేమియులేదు.

ప్రబంధశబ్దము సంస్కృతములో ఏయే అర్థములలో వాడబడినదో, తెనుగున ఎట్టి గ్రంథములు ప్రబంధములుగా పేరెన్నికగన్నవో ఆ వివరణమంతయు ఇంకొక ప్రకరణమున చెప్పబడును. ప్రస్తుతము కుమార సంభవము ప్రబంధమగునా? కాదా? అను ప్రశ్నకు రచనా విధానమునుబట్టి ఇది ప్రబంధమేయని అసందిగ్ధమైన సమాధానము చెప్పవచ్చును. కానీ ప్రబంధమునకుండ వలసిన లక్షణములలో ముఖ్యమైన వస్త్వైక్యము మాత్రము ఇందులేదు.

**మహాస్రగ్ధర:**

*"సతి జన్మంబున్ గణాధీశ్వరు జననము దక్షక్రతుధ్వంసముం బా*
*ర్వతి జన్మంబున్ భవోగ్ర వ్రత చరితయు దేవద్విషత్ క్షోభమున్ శ్రీ*
*సుతసంహారమ్ము భూభృత్సుత తపము నుమాసుందరోద్వాహమున్ ద*
*ద్రతి భోగంబుం గుమారోదయము నతఁ డనిందారకుంబోరఁగెల్వున్"*

అనెడి పద్యములో చెప్పబడిన కథాంశములలో సతి జన్మంబును, గణాధీశ్వరు జననమును, దక్షక్రతు ధ్వంసమును అనెడి మూడింటికి ఉత్తర కథతో ఉన్న సంబంధము అపరిహార్య కారణబద్ధముకాదు. ఈ కావ్యము కుమారస్వామి సంభవమునకు సంబంధించినది. అతని సంభవము తారకాసుర సంహారార్థమే గనుక తారకాసురవధ కుమారుని సంభవమునకు కార్యమైనది కనుక కుమార సంభవకావ్యము కుమారుని సంభవముతోనే ముగియుటకంటె తారక వధతోనే ముగియుట కథా బీజారోహణమునకు అనురూపమైన ఫలము. ఉమామహేశ్వరుల పరస్పరానురాగమే ఆ బీజము. ఆ అనురాగమునకు పార్వతి పూర్వ జన్మగాథను చెప్పుట వస్త్వైక్యమును సాధింపదలచిన కవికి అవశ్యకము కాదు. ఆ భాగము నందలి మూడంశములలో మొదటి రెండును ప్రధానకథకు, మూడవదియైన దక్షాధ్వరధ్వంసముకంటె, ఎక్కువ దూరమున నున్నవి వాటిని బలవంతముగా లాగికొనివచ్చి ఉమామహేశ్వరుల కథతో అతుకుట పౌరాణిక పద్ధతియే గాని ప్రబంధ పద్ధతికాదు ఈ ఔచిత్యము నెరిగియే కాళిదాసు –

"అస్త్యుత్తర స్యాం దిశి దేవతాత్మా
హిమాలయో నామ నగాధి రాజః"

అని పార్వతీ జనకుఁడైన హిమవంతుని వర్ణనతో కథను ఉపక్రమించెను. అంతే గాక ప్రబంధమునకు ఉచితముగానట్టియు పురాణములయందు మాత్రమే చెప్పదగినట్టియు కథాంశములు కొన్ని నన్నెచోడుని గ్రంథమున గలవు కుమారుని జననమునకు పూర్వము జరిగిన కార్యకలాపమంతయు పౌరాణికమే గాని ప్రాబంధికముగాదు కావున నన్నెచోడుడు పౌరాణిక గాథను పురాణముగా గాక వర్ణనాదులచే నలంకరించి ప్రబంధముగా రచించెను ఈ యర్థమునవే ఇది ప్రబంధము.

ఈ కథ బ్రహ్మాండ పురాణములో ఉన్నదట మరి ఇతర శైవ పురాణములలో కూడ నుండవచ్చును. దీనికి ప్రపంచ వ్యాప్తి వచ్చుటకు కారణము కాళిదాసు చేపట్టుట

ఆ కవికులగురువే కుమారసంభవము వ్రాసియుండనిచో ఈ కథ గణపతి సంభవ కథవలెనే పురాణములలోనే యుండిపోయెడిది నన్నెచోడుని గ్రంథము కాళిదాసుని కుమారసంభవమునకు ఆంధ్రీకరణము కాదు ఒకవేళ ఉద్భటుని కుమార సంభవమే ఈ తెలుగు గ్రంథమునకు మూలమేమోయని అనుమానించుటకైనను వీలులేకుండ నన్నెచోడుడు అవతారికలో ఒక ప్రమాణ వాక్యము వ్రాసెను

"అస్మదీయా నూన ప్రతిభార్ణవోద్దీర్ణ రుచిరవస్తు విస్తారితోత్తమ కావ్య రత్నంబు" – ఇది నా ప్రతిభా సముద్రమున పుట్టిన కావ్యరత్నమే తప్ప ఎరవు తెచ్చుకొన్నది గాని, కొన్నదిగాని గాదని ఈ వాక్యముయొక్క తాత్పర్యము అయితే, ఈ కావ్యమే అతని ప్రతిభా సముద్రమున పుట్టినది కాని, కథమాత్రము కాదు పురాణములలోని కథను నిమిత్త మాత్రముగా తీసికొని దానిని తానిచ్చవచ్చినట్లు సృష్టించినాడు స్వతంత్ర రచన అనెడి మాటకు అర్థమింతే కథను గూడ కల్పించినాడని కాదు మరి కాళిదాసు కావ్యములైనను మూలముగా గైకొన్నాడేమో అని యనుమానించుటకు వీలు లేకుండ అతడు చేసిన ప్రతిజ్ఞ సందేహ నివృత్తిని జేయుచున్నది కాళిదాసుపై ఇతనికి ఎనలేని భక్తి "భాసురమతి వాల్మీకి వ్యాసాదులు చనిన జగతి వరకవితాసింహాసన మెక్కి కవీంద్రుల దాసులఁగా నేలెఁగాళిదాసుఁడు పేర్మిన్" ఇంత భక్తిగలవాడు అతని కుమారసంభవమును ఇతర సంస్కృత కావ్యములకంటె ఎక్కువ శ్రద్ధతో చదివి యుండుననుట తథ్యము ఊరక చదువుటయే కాకుండ దానిని చిరకాల మననముచేసి తన కవితాత్మను ఆ కావ్యసౌందర్యవాహినిలో నోలలాడించి యుండును అందుచేతనే గ్రంథ రచనవేళ కాళిదాసుమూర్తి ఇతనికి అడుగడుగునను సాక్షాత్కరించుచునే యుండెనని తలపవచ్చును ఆసాక్షాత్కార ప్రభావము ఈ గ్రంథమున చాలవరకు నీడలారుచుండును అందుచేతనే విమర్శకులు ఈ గ్రంథమునకు కాళిదాసు కుమారసంభవమే మూలమనుకొని దానితో పోల్చిచూచుటకు ఉద్యమించిరి అది మూలము, ఇది ప్రతికృతి అని పోల్చి చూచుటకంటె ఈ రెండును స్వతంత్ర గ్రంథములుగ భావించి తారతమ్యము నిర్ణయించుట సముచితము ఎఱ్ఱన, సోమనల హరివంశమువలె ఈ రెండును తెలుఁగు గ్రంథములే అయి యుండినచో అట్లు పోల్చి చూచుట కొంత సుకరమే యగును గాని కాళిదాసుది సంస్కృతమును, నన్నెచోడునిది తెలుగు అగుటచేత వాటిని పోల్చిచూచుట కొంత దుర్ఘటనమైన పని అయినప్పటికిని ఈ రెండు గ్రంథములలోని కథను, ఈ కవులు ఆ కథను నడిపిన పద్ధతి, కవితా శక్తిలో చిత్త సంస్కారములో ఇరువురకును గల తారతమ్యమును కొంత వరకైనను పోల్చి చూడవచ్చును నిజమునకు తెనుఁగుమాట అటుంచి సంస్కృతములోనైనను కాళిదాసు చేపట్టిన వస్తువును ఇంకొక కవి చేపట్టియున్నచో – అట్టి సాహసుఁడు లేడు – కాళిదాసుతో అతనికి పోలిక ఏమిటి? అని యతని గ్రంథమును విప్పి చూడకుండగనే త్రోసిపుచ్చవచ్చును. ఎందుచేతననగా కవి కులములో కాళిదాసుని పేరు చెప్పిన తర్వాత ద్వితీయుడుగానైనను చెప్పుటకు వెంటనే రెండవ వానిపేరు స్ఫురింపదు అందుచేతనే "అనామికాసార్థవతీ బభూవ" అన్న అభియుక్తోక్తి పుట్టినది అట్టి కాళిదాసుతో ఈ తెనుఁగు కవిని పోల్చి చూచినపుడు ఇతనికి ఏమి న్యూనత కలుగునో యనెడి సంకోచము సహజమే కాని బరిమీద వదిలిపెట్టినచో

గెలవకపోయినను కాళిదాసుతో పెనగగల వాడేగాని మల్లచరపు విన్నంతనే భయపడి పారిపోవువాడు కాడనుమాట మాత్రము నిజము

కాళిదాసు పేరుమీద చెల్లుచున్న కుమారసంభవములో ఉత్తరభాగము (9 వ సర్గంనుండి) అతడు వ్రాసినది కాదనియు ప్రతిభాశాలియైన ఏ కవియో దానిని పూర్తిచేసి యుండుననియు, సూక్ష్మదృష్టికి ఆ భేదము కానవచ్చుచుండుననియు కొందరందురు. మల్లినాథసూరి మొదటి ఎనిమిది సర్గలకే వ్యాఖ్యానము వ్రాసి తక్కినవి విడిచిపెట్టుటవల్ల ఆ మహావ్యాఖ్యాతకు కూడ ఉత్తరభాగము కాళిదాసు కృతము కాదనియే తోచెనని తమ యభిప్రాయమును సమర్థింతురు నన్నెచోడునకుగూడ ఇట్టి అభిప్రాయమే కలిగి యుండవచ్చును ఇతడు పూర్వభాగమును అనుసరించి నడచినంతగా ఉత్తరభాగము వెంట నడక సాగింపలేదు నన్నెచోడుడు చేసిన అనుసరణములు, అనుకరణములు, అనువాదములు పూర్వభాగమునకే సంబంధించి యున్నవిగాని ఉత్తరభాగమున లేవు. అందును 5వ సర్గ తరువాత కాళిదాసుదగ్గర సెలవు తీసికొని తన దారిని తాను పరుగెత్తిపోయెను సప్తర్షులు కన్యావరణార్థము హిమవంతునొద్దకు వెళ్ళి మనువు నిశ్చయము చేసికొని వచ్చిన 6వ సర్గను నన్నెచోడుడు ఎట్లు విస్మరింపగలిగెనా? యని నాకు విస్మయము కలుగుచుండును ఆ సర్గలో కాళిదాసు చిత్రించిన ఆర్యత్వము మన కుమారసంభవమున – ఛాయామాత్రముగా నైనను – లేదు. భారత జాతియొక్కయు భారతీయకవియొక్కయు సంస్కృతి సంపన్నతకు నిధానమైన ఆ సర్గను తెనుగున అనువదించుటకు గాని అనుసరించుటకు గాని నన్నెచోడుడు చాలడు ఈ గ్రంథమును కాళిదాసునకు వినిపించినచో అతడు ఒకమారు తలయూచుచు, ఒకమారు పెదవి విరచుచు ఆలకించును

సంస్కృత కుమారసంభవములోని కథ హిమవద్వర్ణనతో పార్వతీ జననముతో ప్రారంభమై కుమారుని తారకాసురసంహారముతో అంతమగును తెనుఁగున పార్వతియొక్క పూర్వజన్మమైన సతీదేవి యొక్క జననము, దక్షుడు ఆమెను శివునకిచ్చి పెండ్లిచేయుట, ఆ పరమ దంపతులకు గజాననుడు పుట్టుట, తండ్రియైన దక్షుడు తన భర్తను అవమానించినందులకు సతీదేవి యోగానల దగ్ధయగుట, ఆపై దక్షాధ్వరధ్వంసము జరుగుట అనెడి అధిక కథ మొదటి రెండాశ్వాసములలోను కలదు

మూడవ అశ్వాసము నుండి నడిచిన కథ మాత్రము కాళిదాసు కథాక్రమముతో సంప్రదించుచుండును. అది మొదలు రెండు గ్రంథములయందును కథా ప్రణాళిక సమానమే! ఆ ప్రణాళికను ఉన్మీలనము చేయుటలో మాత్రము నన్నెచోడుడు కాళిదాసుకంటె ఎక్కువ పెంపుచేసెను ఆ పెంపు అనేకవిధముల జరిగినది ముఖ్యముగా వస్తు వర్ణనలోను భావ ప్రపంచములోను అది ఎక్కువ ద్యోతితమగును ఈ భేదము ఒక్క ఈ యిరువురకే కాదు; ఇది ప్రాచీన నవీన కవి వర్గములకు ఉండెడి సర్వసాధారణ ధర్మము. ఈ ప్రాచీన నవీనతలననవి కాలమునుబట్టి యేర్పడునవి కావు. ఆయా కవుల రచనా పద్ధతులనుబట్టియు నేర్పడును. ప్రాచీన కవిత్వమునకు సాధుత్వము, సహజ సౌందర్యము, అలంకరణ విరళత్వము, బహువర్ణనా రాహిత్యము, కథా ప్రాధాన్యము, భావసంయమనము ముఖ్య లక్షణములు నవీన కవిత్వమునకు శబ్దాడంబరము, అర్థచమత్కారము, అలంకరణ ప్రచురత్వము, వర్ణనా

బాహుళ్యము, భావావేశము, ఇతివృత్త ప్రపంచనము ముఖ్యలక్షణములు ఈ విభాగమునే ఆంగ్లములో Classicism and Romanticism అని యందురు ఈ యర్థములో మన ప్రాచీన నవీనకవులను ఆర్షకవులు, లౌకికకవులు అనవచ్చును ఆర్ష కవులనగా కేవలము ఋషికవులనియే అర్థముకాదు పైని చెప్పిన లక్షణానుసారముగ పురాణేతిహాసములను కావ్యములను వ్రాసిన కవులందరును అర్షకవులే యగుదురు కుమార సంభవ కథగల ప్రాచీన పురాణములు చూచినపుడు ఆ రచన ఆర్షమనియు దానితో పోల్చినపుడు కాళిదాసు రచనపై జెప్పిన లక్షణములను బట్టియే కొంత వరకు లౌకికమనియు స్పష్టమగును ఆ కాళిదాసుతో ఈ నన్నెచోడుని పోల్చి చూచినచో ఈ తెనుగు కవిత్వము లౌకికము ఆ కాళిదాస కవిత్వము ఆర్షము అనిపించును అనగా లౌకికమనదగిన నవీనకవిత్వలక్షణము కాళిదాసు గ్రంథమునందుకంటె నన్నెచోడుని గ్రంథములో అధికముగా నుండునన్నమాట. ఈ పెంపు జరిగిన కొలదియు లౌకిక గ్రంథము విస్తృతి చెందుటయే గాక కొన్నిచోట్ల ఆ విస్తృతి, కావ్యశరీర నిర్మాణదృష్ట్యా అనావశ్యకముకూడ అగును మరికొన్ని చోట్ల వ్యంగ్య ప్రధానమై సూచనా మాత్రముగ ఉన్న యర్థము వివరణవల్ల పలచబడును. ఒక యుదాహరణ చూడుడు.

*"అపచిత బలిపుష్పా వేది సమ్మార్గ దక్షా*
*నియమ విధి జలానాం బర్హిషాం చోపనేత్రీ*
*గిరిశముపచచార ప్రత్యహం సా సుకేశీ*
*నియమిత పరిఖేదా తచ్ఛిరశ్చంద్రపాదైః"*

ఈ శ్లోకమునందు కాళిదాసు పార్వతి తపస్స్థితుడైన శివునకు చేసిన పరిచర్యా స్వరూపమును సంగ్రహముగా, అంతకంటె అపేక్షణీయము లేకుండ వ్యక్తీకరించెను.

ఈ శ్లోకములోని భావములచే ఛాయా మాత్రముగా అనుకరించుచు నన్నెచోడుడు మూడుపద్యములను వ్రాసెను మూడవదానిలో పార్వతి నిత్యముకోసి తెచ్చిన పువ్వుల ప్రత్యగ్రతను వివరించుచు రమణీయమైన యొక అర్థమును కొనితెచ్చెను

సీ॥ *"మొనలావురించి వాసనసల్లఁ బసిగొని*
*లేఁ దేటిగము లెంగు లింపకుండ*
*నెడ సూఁడఁగొని వేచి సుడియు తెమ్మెరలచే*
*బొడము పుప్పొడి వొలివోవకుండఁ*
*దరణి కూటమున మే యెరలి పద్మిని మేన*
*మొలతెంచు మధుమద మొలుకకుండ*
*మేల్కొని గోమిని మెలఁగి మై మురిసినఁ*
*బొది గొన్నయకరువుల్ సెదరకుండఁ*

తే॥ *దెలిసి జక్కవ లొండొంటి గలయఁదారు*
*కలకలంబున రేకులు గదలకుండ*
*మున్నకొని వచ్చి గణికా సమూహితోడ*
*గిరిజ పూజించెఁ బసిఁడి తామరల వరదు"*

ఈ పద్యమును కాళిదాసే చూచియున్నచో 3వ పాదము తప్ప తక్కిన భాగమును నిజముగా సంస్కృతములో అనువదించెడి వాడేమోయని నాకు తోచును (అ

పాదము నందలి యర్థము అసభ్యము.) కాళిదాసునే మురిపించెడి పద్యములు ఇట్టివి ఈ గ్రంథములో అక్కడక్కడ చాల కలవు వాటిలో రెండు మూడు ఉదాహరణము లిచ్చుచున్నాను.

"మ॥ వల రాజామని బిల్చి వేగమెయి నీవాసంతి కానంద దో
హల మీకానన లక్ష్మి కిమ్మనుడు నాహ్లాదంబుతో నెయ్యము
గ్గలమై యుండ వసంతకుండు దమపైఁ గన్విడ్డఁ గారాకుఁ గెం
దలి రాకయ్యెనొనాఁ దలిర్చె వడిఁ గాంతారాంత రోర్వీజముల్"

కం॥ కని కోపించెనో? కానక
మును గోపించెనొ మహోగ్రముగ నుగ్రుఁడు సూ
చినఁ గాలెనొ చూడక యట
మును గాలెనొ నాఁగ నిమిషమున నఱఁగాలెన్.

కం॥ గిరిసుతమైఁ గామాగ్నియు
హరుమై రోషాగ్ని యుం దిదంగజుమై ను
ద్ధుర కాలాగ్నియు రతి మై
నురు శోకాగ్నియునుఁ దగిలి యొక్కట నెగసెన్.

మన్మధుడు తన సఖుఁడైన వసంతునితోను, శంకితస్వాంతయైన రతితోను కలిసి ప్రాణములర్పించి యైనను సరే నెరవేర్చవలసిన కార్యము కొరకు హిమవత్పర్వతము మీది శివుని తపోవనమునకు బయలుదేరి వెళ్లెను అని చెప్పుటకు కాళిదాసు ఈ క్రింది శ్లోకమును వ్రాసెను

"సమాధవేనాభి మతేన సఖ్యా
రత్యాచ సా శఙ్కమను ప్రయాతః
అంగవ్యయ ప్రార్థిత కార్యసిద్ధిః
స్థాణ్వాశ్రమం హైమవతం జగామ"

ఇందులో అతడు వాహనారూఢుడై వెళ్లెనో కాలినడకనే వెళ్లెనో ఆకాశ గమనమున వెళ్లెనో కాళిదాసు వివరించలేదు. ఆ గమన ప్రకారమును అవసరమైనచో మనము ఊహించుకొనవలసినదేగాని దానిని వివరించి చెప్పుట ఆకవికులగురుని పద్ధతికాదు నన్నెచోడుడు మన కా యూహించుకొనవలసిన భారము లేకుండ వారి గమనమునకు ఒక పుష్ప రథమును సృష్టించి చూపెను. (నిజమునకు అది రథము కాదు – తెలుగువారి రెండెడ్ల బండి)

సీ॥ పంకరుహంబులు బండి కన్నులు
చంపకంబులు నొగ, లుత్పలంబు లిరుసు
గరవీరములు పలుఁగాడి, జాదులు
సనుఁగొయ్య, లశోకముల్ గోడిపీఁట
సింధువారంబులు సీలలు, గేతకుల్
మెట్టులు, మొల్లలు మెట్టుగుదెలు
పొగడలు పలుపులు, పున్నాగములు
పగ్గములు, సహకారముల్ పూనుగాడి

కురవకానీక మాలంపుఁ గోల, కైర
వములు మునుకోల, కోకముల్వాహనములు
గా వసంతుండు సూతుఁడై పూవుఁదేర
నెరయఁ గుసుమాయుధంబులు నినిపి తెచ్చె.

రథమునకు చక్రాలు, ఇరుసు, కాడి మొదలైన ఎన్ని అవయవములుండునో అన్నిటికి అన్ని రకముల పువ్వులు సంపాదించి ఆ రథ నిర్మాణము చేసిన ఈ శిల్పి నేర్పు ఎంతయో కొనియాడదగినది కాని ఆ రథనిర్మాణమెంత బాగున్నను చమత్కార భూయిష్ఠమే గాని రసవంతమని చెప్పదగిన రామణీయకతా భూయిష్ఠము కాదు ఇట్టి చమత్కార పద్యమును వ్రాయుట సంస్కృత కవులలోనైనను ఉత్తర కాలమందలి శ్రీహర్షాదులకు పరిపాటి యైనదిగాని అశ్వఘోష కాళిదాసాదులనాడు లేదు. ఈ సంగతి యటుండనిండు శివుని తపోవనములో వసంతుడు అడుగుపెట్టగానే అకాల వసంతోదయమైనది ఆ ఘట్టములో, కాళిదాసు వ్రాసిన శ్లోకములలో కొన్నిటిని ఇతడు యధాతథముగా తెనిగించెను. మరికొన్నిటిని ఇంచుక మార్పులలో అనుకరించెను చూడుడు.

"మధు ద్విరేఫః కుసుమైక పాత్రే
పపౌ ప్రియాం స్వా మనువర్తమానః
శృంగేణ సంస్పర్శ నిమీలితాక్షీం
మృగీమకండూయత కృష్ణసారః॥
దదౌరసా త్పఙ్కజరేణు గన్ధి
గజాయ గండూష జలం కరేణుః
అర్ధోపభుక్తేన బిసేన జాయాం
సంభావయామాస రథాఙ్గనామా॥
గీతాన్తరేషు శ్రమవారి లేశైః
కించిత్సముచ్ఛ్వసితపత్త్రలేఖమ్
పుష్పా స వా ఘూర్ణిత నేత్రశోభి
ప్రియా ముఖం కిం పురుష శ్చుచుమ్బే "॥

సీ॥ "కరియిచ్చె నరమేసి కరిణికి సల్ల కీ
పల్లవ ముల్లంబు పల్లవింప
మృగమర్థిఁ గబళించి మృగికిచ్చెనన్ను ద
ర్భాంకురంబులు చిత్త మంకురింప
హంస పెక్కువ యిచ్చె హంసికి నోర్నోర
నెలదూడు మొగముల నెలమి మిగుల
భృంగమ్ము ద్రావితా భృంగికి దయనిచ్చె
వికసితాబ్జ మధువు వికసితముగఁ
గీ॥ గిన్నరుండు గ్రోల్చెఁ గిన్నరి వీనుల
రాగరసము మేన రాగమెసఁగ

మధు విడంబనమున మగలును మగువలు
విరలి గొనిరి మదన పరవశమున."

ఈ ప్రకరణమును కాళిదాసు 9 శ్లోకములతో సరిపెట్టగా నన్నెచోడుడు ఇరువది పద్యములతోగాని తృప్తి పడలేదు ఈ పెంపు లౌకిక కవులలో భావ నిగ్రహముగల ఎవరికో తప్ప తక్కిన వారందరికి సహజ లక్షణము. నన్నెచోడునకు కాళిదాసుమీద గల భక్తి ఇంతంత యనరానిది ఒక కుమారసంభవము నుండియేగాక, అవసరమైనపుడు కాళిదాసు ఇతర గ్రంధములనుండి కూడ మేల్తరములైన శ్లోకములను అనువదించుటకు ముచ్చటపడెను ఒకమారే చంద్రాస్తమయము, సూర్యోదయము జరుగుచున్న ప్రకృతి సన్నివేశమును వర్ణించిన నన్నెచోడుని ఈ పద్యమును చూడుడు

తే॥ "అస్తగిరి బొందె రా, జుదయాద్రి నెక్కె
నినుఁడు, దేజస్వులగు వారికెల్ల ప్రొద్దు
మానితంబగు నిల నొక్కమాట పొందు
హాని వృద్ధులు సూచించు నట్లువోలె"

ఇది శాకుంతలములోని ఈ క్రింది శ్లోకమునకు అనువాదము

శ్లో॥ "యాత్యేకతోఽస్త శిఖరం పతి రోషధీనా
మావిష్కృతోఽరుణ పురస్సర ఏకతోఽర్కః
తేజోద్వయస్య యుగపద్వ్య సనోదయాభ్యాం
లోకో నియమ్యత ఇవాత్మ దశాన్తరేషు"

మొదట ఇది స్వతంత్ర ప్రబంధమని కదా కవి చేసిన ప్రతిజ్ఞ, మరి ఈ యనువాదములేమి; ఈ యనుకరణములేమి? అని ఒక ప్రశ్న పుట్టవచ్చును అచ్చటచ్చట ఇటువంటి అనుకరణములున్నను ఇది స్వతంత్ర రచన మాత్రము కాకుండపోదు ఆ మాత్ర మనుకరణమైనను లేకుండ వ్రాయవలెనని ఈ కవి సంకల్పించనూలేదు; వ్రాయుదునని ప్రతిజ్ఞయు చేయలేదు ఒకవేళ ప్రతిజ్ఞ చేసినను అది నెరవేరుట దుర్ఘటము ఎందుకనగా, ఆకాశమున సూర్యునివలె కాళిదాసు దేదీప్యమానముగా వెలుగుచుండగా ఆ రశ్మి తనకు సోకకుండ నడవగలనని ఎవడు ప్రతిజ్ఞ పట్టగలడు? గొడుగు అడ్డము పెట్టుకొన్నను ఆ వేడి సుషిరమార్గము వెంట ఒడలికి తాకుచునే యుండును కాళిదాసు శ్లోకములు సందర్భవశమున జ్ఞప్తికి వచ్చినపుడు నన్నెచోడుడు వాటిని నమస్కార పూర్వకముగ స్వీకరింపక ఎట్లు ఉండగలడు? కొంచెమో గొప్పయో కాళిదాసునకు తాను ఋణపడుదునని ఋణపడితినని యెరుగును పూర్వకవి స్తుతిలో కవులందరును కాళిదాసునకు దాసులే యని భక్తి పూర్వకముగా నమస్కారము చేసియే - ద్రోణాచార్యుల వారికి ప్రదక్షిణము చేసియే యుద్ధమునకు తలపడిన అర్జునునివలె - కావ్యరచనకు ఉపక్రమించి ఉద్దిష్ట గమ్యమును చేరెను.

కావ్యము రసవంతముగా నుండవలెనన్నచో ప్రసన్నముగా నుండుటయే గాక ఔచిత్యబంధురమై కూడ ఉండవలెను ఈ ఔచిత్య మనునది శబ్దములో, అర్థములో, వస్తువులో, వర్ణనలో, భాషణలో, సంవాదములో - అది యిది యననేల - శరీరమంతయు వ్యాపించి యుండెడి ఓజస్సువలె కావ్యమంతట నిండి యుండవలెను కాళిదాసు

కవికుల గురువనిపించుకొనుటకు గల కారణములలో యౌచిత్య పరిపాలనమొకటి. ఆ శక్తి సంస్కృత కవులలోనే చాలమందికి లేదు. తెలుగు కవులలోను మరిపెక్కు మందికి లేదు. ఆ లేనివారిలో నన్నెచోడుడొకడు. వివాహ నిశ్చయమునకు హిమవంతుని వద్దకు వెళ్ళి వచ్చిన సప్తర్షులు వధువు చాల అందగత్తె అని శివునితో, జగన్మాత కాబోయెడి పార్వతియొక్క అవయవములను వర్ణించి చెప్పుట యెంతమాత్రమును ఉచితముకాదు ప్రబంధమునకు స్త్రీ రూపవర్ణనము ఒక అలంకారము గనుక కవి పార్వతీవర్ణనను ఆ ఋషులనోట పలికించెనని సమాధానపడుద మనుకొన్నను పొసగదు ఆ రూపవర్ణన అంతకుముందే యొకమాటు జరిగినది మరి అట్టి వర్ణననే ఇంకొకమారు చేయుట అనావశ్యమేగాక సందర్భోచితమును పాత్రోచితమును కాదు. ఒకవేళ కవికి ఆమె రూపమును మరికొంత వర్ణింపవలెననెడి కుతూహలమున్నచో రెండవ పక్షముగా తానై తన మాటలతో వర్ణింపవచ్చును గాని, ఆ ఋషి పాత్రలకు ఆరోపించరాదు.

మరి శివుని తపోభంగమునకు బయలుదేరిన మన్మథుని వారించుటకు రతి చేసిన హితోపదేశము కూడ ఔచిత్యపుమేరను మీరుచునే యున్నది. భార్యభర్తకు హితముగరపుట న్యాయమేగాని ఆ యుపదేశము అనునయపూర్వకముగా మృదు మధురముగ నుండవలెను గాని తర్జనపూర్వక శాపవాక్యములుగా నుండరాదు. ఈ ఘట్టమున కవి రతినోట పలికించిన వాక్యములన్నియు తనవేకాని, రతి పాత్రవి కావు. కావ్యములో కవి తాను పాత్రయగుట యొకటి, పాత్రయే తానగుట యింకొకటి – అనెడి రెండు విధములుగా భాషించుచుండును అనగా పాత్ర భావములు తన నోట పలుకుట యొకటి, తన భావములే పాత్రనోట పలికించుట యింకొకటి. ఈ రెండింటిలో మొదటిది కావ్యధర్మము, రెండవది కావ్యధర్మభంజకము తానే పాత్రయైనచో కవి పాత్రోచితమైన భావములు, వాక్యములు వ్యక్తము చేయుచుండును. పాత్రయే తానైన కవి ఆ యౌచిత్యమును విస్మరించి తన వాక్యములే పాత్రనోట పలికించును. రతి హితోపదేశ ఘట్టమున నన్నెచోడుడు ఈ రెండవ పద్ధతి నవలంబించి పాత్రౌచిత్యమునకు భంగము కలిగించెను.

ఇతడు స్త్రీ జనావయవవర్ణనా కుతూహలమును తీర్చుకొనుటలో స్థానాస్థాన, వేళావేళ పరిజ్ఞానమును కూడ కోల్పోవుననుటకు ఇంకొక నిదర్శనము చూడుడు పార్వతీ పరమేశ్వర వివాహానంతరము హిమవంతుడు అల్లునకు అరణమొసంగి వీడ్కోలుపు సందర్భమున మేనకయు ఉమాదేవియు ఒండొరులను కౌగలించుకొందురు. ఆ సమయమున వారిరువురి హృదయములలో అమృతరసపూరితములైన ఏయే భావ తరంగములు పుట్టునో ఆడపిల్లను అత్తింటికి సాగనంపెడి దంపతులందరు ఎరుగుదురు. ఆ సన్నివేశమును మహాకవియైనవాడు ఎంతో రసవంతముగా వర్ణింప వచ్చును. నన్నెచోడునకు ఆ సన్నివేశ సౌందర్యమే గోచరింపలేదు. పైపెచ్చు వారి యాలింగనమును జుగుప్సాకరమైన ఈ క్రింది పద్యమున చిత్రించెను.

*తే॥ "ఉరుకుచాగ్రంబు లొండొంటినొత్తుదేర*

*నెదురు కౌఁగిలింపఁగ నను వెట్లుఁగాక*

కెలని కౌఁగుచుఁ గుచతటుల్ బలిమినొత్త
నదిమి కేలెటకేనియు నందికొనిరి "

ఇట్టి పద్యములు ఇయ్యెడనేకాదు సారస్వతమున ఎక్కడ నున్నను సరసుల మదికెక్కవు అవి యీ కావ్యములకు కళంకములనుటకు సందేహింపనక్కరలేదు

పరాకాష్ఠ చెందిన ఇతని గురుభక్తి యారాధనీయమే కాని ఆ గురునకు పరమశివునితో అభేదమును పాటించెడి పారవశ్యము మాత్రము సమర్థనీయము కాదు పార్వతికి శివమంత్రోపదేశము చేసిన ఋషీశ్వరుని జంగమ మల్లికార్జునుని పేర పిలిచినప్పటి కంటె, శబరకాంతలు వెదురుబియ్యము దంచునపుడు జంగమ మల్లికార్జునుని పేరుతోనే పాడిన రోకటిపాట కంటె, పెండ్లికి తరలివచ్చెడి శివుని చూడవచ్చిన పౌరకాంతలు చూచిన వ్యక్తి జంగమ మల్లికార్జునుడే యని వర్ణించుట సమంజసము కాదు వరుసగా ఆ పద్యములివి

చ॥ "కమలదళాక్షి సాలఁదమకంబునఁగూర్చునిజేశుతోడఁ జి
త్తము దనివోవఁగా బహువిధంబులఁగూడిన ప్రౌఢతాను రా
గము వెలిఁబేర్చెనోయన నఖక్షతచుంబన రంజితాంగ వి
భ్రమగతి వచ్చిచూచె నొకభామిని జంగమ మల్లికార్జునున్

ఉ॥ వాసనగా శివాగమము వర్ణనకెక్కఁగ్రదయీ సదర్థముల్
దేసిగ నాత్మశిష్యులకుఁ దెల్పుచు సద్విధినున్న నిష్కళా
భ్యాసమునందు లీనమగు భావమునిల్పి వెలుంగుచున్న స
ద్భూసుర ముఖ్య విప్రమునిపుంగవు జంగమ మల్లికార్జునున్.

తే॥ మగువ జంగమ మల్లయ్యఁ దగిలి చూచి
యందకన్నుల మనమును నంటియున్న
నచల భావన నిల్చెఁ దానట్ల పరము
నభవుఁగని జను లచలాత్ములగుట యరుదె?

చ॥ పటికపు ఱోల ముల్ వెదురు బాలొగిపోయుచు గౌరుకొమ్మరో
కటఁగొని దంచుచున్ శబరకామిని పెక్కులు రాగముల్ మదో
త్కటముగఁ బాడెఁ జుట్టిన మృగంబులు సోమ, మనుష్యరూప ధూ
ర్జటి మునిముఖ్యలోకగురు జంగమలింగమ మల్లికార్జునున్.

భక్తి పారవశ్యము నానావిధభావావేశములలో ఒకటి మితిమీరిన భావావేశముగల కవి కావ్యరచనా మర్యాదలను పాటించుట దుష్కరము.

ఇతని సామెతలు, పలుకుబళ్ళు, జాత్యములు దేశీయములుగా నుండుటయే గాక కథకు సంబంధించినను సంబంధింపకపోయినను దేశీయములైన అనాటి సాంఘికాచారములు కూడ కొన్ని యీ గ్రంథమున ప్రవేశపెట్టబడినవి. అట్టివి కూడ ఇతడు ప్రతిన చేసిన కావ్యరచనా దేశీయతకు కొంత సాధనభూతములై యుండెనని నా యూహ. యుద్ధమునకు పూర్వము సేనాకటకమున వీరభటులు తమ తమ ప్రతాపములను ప్రకటించుట, త్యాగభోగపరాయణులగుట, ప్రియురాండ్రను తుదిసారి వీడ్కొనుట, ప్రియురాండ్రు భావి వియోగభారమును సహింపలేక ప్రియులకన్న ముందే

ప్రాణములు విడుట మొదలైన వీరశృంగార కృత్యములన్నియు క్షత్రియకులజుడును యుద్ధవిశారదుడును అయిన ఈ కవికి సాక్షాదనుభూతములై యుండును

మరి రాజసేవకులకు పసిడిరాసులుబోసి జీతము లిచ్చుటయు, యుద్ధ భటులలో ముక్కిడిమూకలకు జొన్నలు గొలుచుటయు ఆనాటి యాచారము కాబోలు!

క॥ భావజ విభుఁడలిశుకపిక
సేవకతతికెడరు దీర జీతము సేయం
గావెలిఁబోసిన పసిఁడుల
ప్రోవులు నాఁదమ్ము లెలమిఁబూచె బెడంగై

చ॥ మునుమిడివైరి వాహినులముట్టి పడ ల్వడ వ్రేసినట్టి కై
పునఁ బయికెత్తువాహకుల పొంకముఁ అందల కొంతగోసి ము
న్నొనివడి వాఱు పందలను గోవుల సూరెలఁ దోలిమార్చు పే
ర్చునఁ బలికెత్తి కేగ్లలన జొన్నలుగొన్న ఋణంబు నీఁగుదున్

రాజు ఒక అసాధారణ కార్యనిర్వహణమునకై ఒక సేవకుని వినియోగించినపుడు అతనికి సత్కారపూర్వముగ తాంబూలమొసంగుటయు అతడు దానిని అంగీకార సూచకముగా గ్రహించుటయు ఆనాటి రాజసేవా మర్యాదలలో ఒకటియైయుండును. ఆ మర్యాదయు ఈ కావ్యమున పాటింపబడినది

వ॥ "నాకుందగిన కెలసంబు (Service) గంటి దీనికింతకు మైకొంటిఁ దాంబూలంబు దయసేయుమని వసంతసహితంబుగా, వలరాజు సురరాజుచేత నపారసత్కారంబులుగొని వీడుకొని చనుదెంచు నంతనక్కడ."

కథ ఏకాలమునాటిదైనను కవికాలమునాటి ఆచారవ్యవహారములు కావ్యమున చోటుచేసికొని ప్రవేశించును అట్టివి కాలధర్మ విరుద్ధములని కవులు శంకింపరు

"ఒలినకడచన నఱువది
నాలుగు విద్యలను నేర్పునైసర్గికమై
వాలిన సుకవులకుం గా
కేలతరమె కృతులుచెప్ప నెవ్వరికైనన్"

అనిగదా ఇతడు ఉత్తమకవి కుండవలసిన విజ్ఞానమును నిరూపించెను ఇది అలంకారికులు కావ్యహేతువులుగ చెప్పిన ప్రతిభా, వ్యుత్పత్తి, అభ్యాసములనెడి మూడిటిలో వ్యుత్పత్తికి సంబంధించినది విజ్ఞానము ఆ విజ్ఞానము నానావిధశాస్త్ర సంబంధియు, నానావిధ కళాసంబంధియు అయియుండి కవికి చక్కని సంస్కృతి నిచ్చును అట్టి సంస్కృతిగల కవి పండితకవి యనిపించుకొనును. మన పూర్వ కవులలో చాలమందికి అనేక శాస్త్ర పరిచయముతోపాటు సంగీతాది కళాపరిచయ మును కలదు. ఆయా శాస్త్ర విషయములను, కళా విషయములను సందర్భము పొసగినపుడు వారు కావ్యములలో ప్రదర్శించుటయు కలదు నన్నెచోడుడు అట్టి పండిత కవులలో ఒకడు ఇతనికి కవిత్వముతో పాటు చిత్రలేఖనము నాట్యము సంగీతము మొదలైన కళల నైపుణియు, అశ్వశాస్త్ర, గజశాస్త్ర, యోగశాస్త్ర యుద్ధతంత్రాది పరిజ్ఞానమును కలవని చెప్పుటకు ఈ గ్రంథమున అనేక నిదర్శనములు

చూపవచ్చును. ఈ పరిజ్ఞానమును అతడు అవసరమునకు తగినంతగాక ఎక్కువగానే ప్రదర్శించుచుండును. మరియు చిత్రకవిత్వము, బంధకవిత్వము, ముద్రాలంకారము మొదలైన కేవల పాండిత్య ప్రదర్శకమైన రచనయందును ఇతనికి కుతూహల మెక్కువ ఇట్టి రచనలు ఆంధ్రవాఙ్మయములో ఆదికాలమున లేవు. అందుచేతనే ఇతడు నన్నయకు ప్రాచీనుడు కాకపోవుటయేకాక అర్వాచీనులలో కూడ చాల తర్వాతికాలపు వాడని కొంతమందికి సందేహము కలుగుచుండును మొత్తముమీద చూచినచో ఈ కావ్యము రెండు విరుద్ధాంశములకు సంగమ స్థానమేమో యనిపించును ఒకవంక కాళిదాసాది సంస్కృత కవులయొక్కయు, తిక్కనాది ఆంధ్రకవుల యొక్కయు శిల్ప లక్షణములును ఇంకొకవంక క్షీణయుగములోని అధమ ప్రబంధ లక్షణములును ఈ కావ్యములో రాశీభూతములై యున్నవి. అయినను నన్నెచోడుడు ఆంధ్ర కవిశ్రేష్ఠులలో ఎన్నదగ్గవాడేగాని, సామాన్యుడుకాడు అతి స్వతంత్రమైన బుద్ధిమత్తయు అతి నిశితమైన భావనయు నానాశాస్త్ర పరిజ్ఞానమును గల మహావ్యక్తియునని ఉపచారపూర్వకముగ కొనియాడదగిన కవీశ్వరుడు.

## పండితారాధ్యుడు

ఈయన పేరు మల్లికార్జునుడు. మహాపండితుడును, ఆరాధ్య బ్రాహ్మణుడును అగుటచేత పండితారాధ్యుడనే పేరు ప్రసిద్ధికెక్కినది. ఈ పేరు తదుపరి కొన్ని ఆరాధ్య బ్రాహ్మణుల కుటుంబములకు ఇంటిపేరైనది

ఈయన వీరశైవ మత సంస్కర్తయైన బసవేశ్వరునితో తులతూగ గల మహాత్మ్యము కలవాడు అందుచేతనే పాల్కురికి సోమనాథుడు బసవని చరిత్రమును బసవపురాణమను పేర వ్రాసినట్లే, ఈతని చరితమును పండితారాధ్య చరిత్రమను పేర ఒక మహాగ్రంధముగ వ్రాసెను పండితుడు బహు గ్రంధకర్తయట ఈయన లింగోద్భవదేవు గద్యము, రుద్రమహిమ, గుణసహస్రమాల, అమరేశ్వరాష్టకము, పర్వతవర్ణన, ఇష్టలింగ స్తోత్రము, బసవదేవతలు, శివతత్త్వసారము అను గ్రంధములు రచించెను పండితారాధ్య చరిత్రలో సందర్భవశమున ఆ గ్రంధములలో కొన్ని పేర్కొనబడినవి వాటిలో కొన్ని సంస్కృత కర్ణాట భాషలలో కూడ కలవట కాని ఇతడు వ్రాసిన గ్రంధములలో ఏది తెలుగో ఏది కాదో నిర్ణయించుటకు వీలు లేకుండ అవి యన్నియు నామమాత్రావశిష్టము లయినవి ఒక శివతత్త్వసారము మాత్రము అయుర్భాగ్యము కలిగి, శేషించి యున్నది ఈ మధ్యను శ్రీముఖ గద్యమను ఒక తెలుగు వచన భాగము దొరికినది. శైలి మొదలగువానిని బట్టి యిది పండితారాధ్యునిదే యని నిర్ణయింపబడినది.

సోమనాధుడు పండితారాధ్య వాద ప్రకరణములో పేర్కొన్న పెక్కుగ్రంధములలో శివతత్త్వసారము తప్ప తక్కిన వాటిలో ఏవి పండితుని రచనలో ఏవి కావో చెప్పలేము.

*"అత్తఱి భట్టుగైవారంబు సేయ*
*"శ్రుతిఁ బంచ గద్యముల్" "రుద్రమహిమ"యు*

శతకంబు "శివతత్త్వసార" మాదిగను
గద్య పద్యంబు లాకాంక్షఁ జదువుచును
హృద్యంబుగా సత్కవీశ్వరుల్ వొగడ
మదినుబ్బి "సంసార మాయా స్తవంబుఁ"
బదములుఁ దుమ్మెద పదముల్ ప్రభాత-
పదములుఁ బర్వతపదము లానంద-
పదములు శంకరపదముల్ నివాళి-
పదములు వాలేశు పదములు గొబ్బి-
పదములు వెన్నెల పదములు సంజ-
వర్ణన మఱి గణ వర్ణన పదము
లర్ణవ ఘోషణ ఘూర్ణిలుచుండఁ
బాడుచు నాడుచుఁ బరమ హర్షమునఁ
గూడి సద్భక్తసంకుల మేఁగుదేర" (పం.చ.వాద)

పైపాటిలో తుమ్మెద పదములు గొబ్బి పదములు వెన్నెల పదములు మొదలైనవి పండితారాధ్యుడు రచించినవై యుండవు అవి పద కవిత్వములో కొన్ని ఫణుతుల పేర్లు. నేటికిని సంక్రాంతి పండుగ దినములలో-

"పంచ పాండవులే తుమ్మెదా" అనియు
"గొబ్బియాడో గొబ్బియాడో" అనియు

పల్లెప్రజలలో స్త్రీలు జట్టులుగా పాడుట కలదు

పండితుని శిష్యులు అతనివెంట ఈ పదములు పాడుచు కోలాహలముగ నడచిరని పాల్కురికి సోమనాథుడు చెప్పినదాని కర్థము అవి తుమ్మెద పదముల, గొబ్బి పదముల ఫణుతుల మీద శివపరముగ వ్రాయబడిన యేవో పదములై యుండును. ఆ శివపరములైన పదములుకూడ లోకములో అనాటికి ప్రచారములో నున్నవే కాని పండితారాధ్యుడు ప్రత్యేకము వ్రాసినవి కావని యనుకొనుట లెస్స!

శ్రీకంఠుఁడను పువ్వు దుమ్మెదా! పర
మై కాంతమున వెల్గు తుమ్మెదా!

అని వేదాంతార్థముగల ఒక తుమ్మెద పదము ఇప్పటికిని అచ్చటచ్చట పాడుచుండుట కలదు.

**కాలము:** ఇతని జీవితకాలము 1100–1170 కావచ్చును ఇతడు వెలనాటి చోడుని యాస్థానమునకు వెళ్ళి అచటి బౌద్ధాచార్యుని, మత వివాదమున నోడింపగా ఆ బౌద్ధుడు శివనింద చేసెనట. శివునిగాని, శివమతమునుగాని, శైవులనుగాని నిందించిన వారిని హత్యజేయుట పాపముగాకపోవుటయేగాక దానివల్ల కైలాసప్రాప్తి కలుగుననెడి పండితుని మత విశ్వాస ప్రకారము అతని శిష్యులు ఆ బౌద్ధ పండితుని ఉపాంశువధ గావించిరట. దానికి ప్రతీకారముగ ఆ రాజు పండితుని కనులు తీయించెనట. ఈ భయంకర నాటకమున ఒక పాత్ర ధరించిన ఆ వెలనాటి చోడుని రాజ్యకాలము 1173–1180 అని చారిత్రకులు నిర్ణయించిరి మరి పండితుడు వెలనాడుదాటి శ్రీశైలము మీదుగ బసవేశ్వరుని దర్శనార్థము కళ్యాణ కటకమునకు

పయనమై పోవుచు మధ్యే మార్గముననే బసవని శివైక్యమును గూర్చి విని ఆ పయనము మానుకొనెనట బసవని నిర్యాణము 1167లో జరిగిన దనుట చరిత్ర ప్రసిద్ధము. అప్పటికి పండితారాధ్యుడు ముసలితనముచే శ్రీశైల పర్వత మెక్కలేక అతని శిష్యులద్వారా స్వామికి తన భక్తిని నివేదించెనట అపై వయోభారము వల్లను, బసవని చూడలేక పోయితినను నిర్వేదమువల్లను, మరి రెండుమూడు సంవత్సరములలో తనువు చాలించెనట కాగా ఇతడు 12 వ శతాబ్ది ప్రారంభమున పుట్టి 1170 పర్యంతము బ్రతికి యుండెనని నిర్ణయింపబడినది

**శివతత్త్వసారము:** ఈ గ్రంధము కొద్ది సంవత్సరముల క్రితమే ప్రకటితమైనది. తత్పూర్వము దీనిపేరు సోదర గ్రంధములతోపాటు పండితారాధ్య చరిత్రమున వినవచ్చుట మాత్రముతోనే సరిపోయెడిది పండితారాధ్య చరిత్రలో సోమనాధుడు "శతకంబు శివతత్త్వసార మాదిగను గద్యపద్యంబు లాకాంక్ష చదువుచును" అని వ్రాయుటబట్టి ఇందలి శతక శబ్దము శివతత్త్వ సారమునకు విశేషణముగా ఈ గ్రంధమును శతకముగ అంగీకరింప పూనిరి కాని ఇందు శతకలక్షణ మేమియు లేదు. శతకమున కుండదగిన సంఖ్యానియమముగాని మకుట నియమముగాని లేదు పైగా గ్రంధమునగల 489 పద్యములును ఏకసూత్ర బద్ధములుగావు అదియునుగాక లాక్షణికు లుదహరించిన.

> *"ఆయతిఁద్రిపురాంతక దే*
> *వాయని పిలుచుటయుఁ గటక మంతయు వినఁగాఁ*
> *బాయక కిన్నర బమ్మయ*
> *కో యని యెలుగిచె తొల్లి యురగాభరణా!"*

అనెడి యీ పద్యము ఇందు కానరాదనియు ఇటువంటివే మరికొన్ని నశించి యుండు ననియు అందుచే ఈ గ్రంధము అసంపూర్ణమనియు కొందరందురు పాల్కురికి సోమనాధుని "శతకంబు శివతత్త్వ సారమాదిగను" అన్న పంక్తిలో సూచింపబడిన శతకము వేరుగా నున్నదనియు అది "శ్రీగిరి మల్లికార్జునా" అను మకుటముగల శతకమనియు ఇంకొక వాదమున్నది శివతత్త్వసారమునందలి ప్రకీర్ణతనుబట్టి ఇది విషయైక్యముగల గ్రంధముగా కవి సంకల్పింపలేదని యనుకొనవచ్చును దక్షాధ్వర ధ్వంసము ప్రళయ వర్ణనము గణతాండవము మొదలైన కొన్ని శైవలీలలను, అద్వైత ఖండనము జగత్కర్తృత్వ విచారము పశుపతి శబ్ద సమర్ధనము మొదలైన కొన్ని శాస్త్ర మీమాంసలను, శివదీక్షితులు పాటింపవలసిన ఆచార వ్యవహారములను పురాతన భక్తుల మహిమలను గూర్చి విశదీకరించుచు తన భక్తితో మేళవించి వ్రాసిన కొన్ని పద్యముల సంపుటిగా మాత్రమే ఈ గ్రంధమును గ్రహించుట లెస్స ఇందులో తన భక్తిని ఈశ్వరునికి నివేదించిన పద్యములు తప్ప తక్కిన భాగములో కావ్యమునకు యోగ్యమైన కవితా పదార్థ మేమియు లేదు శివతత్త్వసారమనెడి పేరు పెట్టుటలోనే శైవమత సిద్ధాంత సంగ్రహముగా కవి ఊహయైనట్లు ద్యోతిత మగును కావున దీనిని శైవస్మృతి యనుట బాగు. కవిత్వ మనిపించుకొన దగిన లక్షణ మేదైన నిందున్నచో అది శైలిలో మాత్రమే కలదు

ఇతర శివ కవులవలె జాను తెనుఁగు దీక్ష యితనికి లేదు. నన్నయవలె ఇతడును చాలవరకు సంస్కృతపద భూయిష్ఠమైన రచనయే చేసెను. సంస్కృత జటిలమైనను సుబోధకవిత్వము కలిగి అప్రసిద్ధపద ప్రయోగము గాని అన్వయ కాఠిన్యముగాని లేకుండ, సమతాగుణ శోభితములైన వాక్యములతో రచన నిండుదనము గలిగి యుండును. ఈ క్రింది పద్యములు కొన్ని యుదాహరణములు

కం॥ అవి కలదేవాసుర నర
నివహసదా పూజనీయ నిత్యోత్సవ స
చ్ఛివలింగ పరాఙ్ముఖ మా
నవ సంభాషణములెల్ల నరకార్థమగున్

కం॥ సకలామరదైతేయ
ప్రకర సదారాధ్యమాన పాదాబ్జ భవాం
తక నీ భక్తుల దుర్గుణ
శకలంబుల వెదకువాఁడు చండాలుఁ డజా!

కం॥ ప్రాజ్ఞులు వేదజ్ఞులు లో
కజ్ఞులు చేకొంద్రె గత శిఖా గాయత్రీ
యజ్ఞోపవీత నాస్తికు
లజ్ఞులు చేకొంద్రుగాక యద్వైత మజా!

కం॥ అతి మూఢుం డతిపతితుం
డతి దుర్జనుఁడనఁగ వలవ దతిశయ భక్తి
స్థితి నెగడునేని నాతం
డతి పండితుఁడతి పవిత్రుఁ డతి సుజనుఁ డజా!

ఇష్ట దేవతమీద కవిత్వము చెప్పెడి భక్త కవులు అందరికిని ఉండెడి ఆవేగము, ఆర్ద్రత, ఊష్మలత, ప్రసన్నత మొదలైన హృదయ ధర్మములు ఇతని కవిత్వములో స్పష్టముగా గోచరించును.

చూడుడు

కం॥ పూజింపఁడు పూజింపఁడు
పూజింపఁడు శివుని భక్తిఁ బూజింపుడు మీ
రోజ సెడి నడవకుండుఁడు,
రాజులురట్టళ్ళు నగుట రావెళ్లిటికిన్.

కం॥ దేవా సంసారాంబుధి
లో వెలువడఁజేసి ప్రమథ లోకం బెఱుఁగన్
నావాఁడు వీఁడు సుండీ
నావే నన్నుంపవే గణంబుల నడుమన్

కం॥ ఒండేమి మల్లికార్జున
పండితుఁడననుండుకంటెఁ బ్రమథులలో నె
న్నెండొకొ నీ యాజ్ఞోన్నతి
నుండఁగఁ గాంతునని కోరుచుండుదు రుద్రా.

కం॥ నేనొక నికృష్ట మనుజుఁడ
మానస వచనాతిదూర మహనీయ మహా
త్మ్యానంద! నిన్నుఁ బొగడఁగ
నేనెంతటివాఁడ సుర మునీంద్రవరేణ్యా!

కం॥ పన్నుగ లజ్జింపగ శివ!
నిన్నేఁ బొగడెద ననంగ నేర్తునె దేవా!
విన్నపము వినుము సకల జ
గన్నాథ! యనాథనాథ! కరుణాంబు నిధీ!

మత గ్రంథములు వ్రాయు వారందరకు పరమత నిరసనము, స్వమత స్థాపనము అనెడి రెండు యుక్తి ప్రక్రియలు అవలంబనీయములై యుండును ఆ రెండింటిలో పరమత నిరసన యుక్తి, శాస్త్రసమ్మతమేకాక సభా సాధువుగా కూడ నుండవలెను వాదమున సాధుత్వము చెడకుండగనే తీక్ష్ణత యుండిన నుండవచ్చునుగాని వాక్పారుష్యము మాత్రము పండితులు మెచ్చరు. అట్టిది అసాధువేగాక అనాగరకము కూడ. ఈ కవి పరమతనిరసనము చేయుటలో చార్వాకమతము మొదలైన అవైదిక మతములను ఎంత నిర్దయముగ తిరస్కరించెనో అద్వైతమును గూడ అంత పరుషముగానే నిరసించెను.

కం॥ కలదననోపక లేదని
పలుకఁగ నేరకయు మూక బధిరుల క్రియ ని
మ్ముల నద్వైతులు తమలో
పల వగతురు భువన భిన్న భావమున శివా!

కం॥ ఆరాధ్యం డారాధకు
డారాధన మనఁగలేని యద్వైత దురా
చార కృత సర్వ శూన్యా
కార స్థితి నేమి సేయఁగా వచ్చు శివా!

కం॥ పాతకము సకల నాస్తిక
జాత నివాసంబు సర్వ సంకర మాత్మా
ద్వైతంబనఁగా జగ దు
త్పాతము దొరకొనునె యిట్లు పరమానందా!

కం॥ నిత్య మహోజన దూష్యము,
ప్రత్యక్షాది ప్రమాణ బాధా బాహ్యం
బత్యనుచితమద్వైతము,
కృత్యా కృత్యాది శూన్య కీటకము శివా!

కం॥ ప్రాజ్ఞులు వేదజ్ఞులు లో
కజ్ఞులు చేకొంద్రె గత శిఖా గాయత్రీ
యజ్ఞోపవీత నాస్తికు
లజ్ఞులు చేకొంద్రుగాక యద్వైత మజా!

కం॥ స్వేచ్ఛా చారులు మిధ్యా
విచ్ఛేదన వేదశాస్త్ర విప్లవవాదుల్
ప్రచ్ఛన్న దోషు లజ్ఞా
నాచ్ఛాదిత దుష్టచిత్తు లద్వైతు లజా!

ఇట్లు అద్వైతమును నాస్తిక మతముగ దూషించుట, అంత మేటి పండితునకు తగని పని. అద్వైత ప్రతిపాదితములైన జగన్మిధ్యత్వము, జీవాత్మపరమాత్మల అభిన్నత్వము మొదలైన సిద్ధాంతములు శ్రుతి వాక్య ప్రామాణ్యము చేతనే ఇతర మతాచార్యులు ఖండించుట కలదు. ఈ శైవాచార్యుడు కూడ ఆ పద్ధతినే కొంతవరకు అవలంబించి వాదము నడపి యంతలో తృప్తిపడక దూషణమునకు పూనుకొనెను పై పద్యములు ఆ వాసన గలవి.

కం॥ తన తెగిన తలయు మడిసిన
తనయునిఁ బుట్టింపఁగావఁ దారోపని యా .
వనజాసన కేశవులకు
జననస్థితి కర్తృతాది శక్తులు గలవే?

మొదట తనకుగల అయిదు శిరములలో ఒకటి తెగిపోగా దానిని మరల మొలిపించుకొనలేక చతుర్ముఖుడుగానే ఉండిపోయిన బ్రహ్మకు విశ్వమును సృజించు శక్తి కలదా? యనియు, శివునికంటబడి భస్మమై పోయిన తన కుమారుని (మన్మధుని) బ్రతికించుకొనలేని విష్ణువునకు విశ్వరక్షణశక్తి కలదా? యనియు ఈ మల్లికార్జున కవికి గలిగిన సందేహము. అనగా బ్రహ్మ విష్ణువులకు సృష్టి స్థితి కారకత్వములు లేవని తాత్పర్యము. ఈ ప్రశ్న చాల చమత్కారముగ నున్నమాట నిజమేగాని పౌరాణికార్థ వాదములను పరతత్త్వ నిర్ణయవాదములలో సాధనములుగా ఉపయోగించుకొనుట సమబుద్ధులైన ప్రాజ్ఞులు అంగీకరింపరు 16వేల గోపికా స్త్రీలతో క్రీడించిన కృష్ణుడు దేవుడెట్లగునని అనార్య మతస్థులు చేసెడి ఆక్షేపణకును దీనికిని భేదమేమియు లేదు. ఇతని కోపావేశము భక్త్యావేశము కంటె తీక్ష్ణతరమైనది తన పండిత బిరుదమునకు కళంకము తెచ్చెడి ఇట్టి వాదము చేయరాదని ఆ యుద్రేకములో అతడు మరచిపోయెను కాబోలు ఈ అన్యదేవతాదూషణము దక్షాధ్వరధ్వంసములో గణవిహారములలో కూడ ఎక్కువ కానవచ్చును

కం॥ "మురారి ద్రోహానింటికిఁ
బేరంటము వచ్చి తనుచుఁ బెలుచను గోసెన్
వైరమున నదితి ముక్కును
భారతి నాసికయు వీరభద్రుఁడు రుద్రా!

కం॥ నరసింహాని కంఠంబును
నరుణ జటా కేసరంబు లంబిక పాదాం
బురుహామణి పీఠమునఁబొ
ల్పరుదుగ రచియించు నొక గణాధిపుఁడు శివా!

కం॥ వారిజభవుని కపాలము
గోరి త్రివిక్రముని వీఁపుకో లెమ్ము తుదిం

జారుగతి నిలిపి ఛత్రా
కారంబుగఁ దాల్చియాడు గణనాథుఁ డజా!"

ఇంతకంటెను దుస్సహమైన విషయము ఈ గ్రంథమున ఇంకొకటి కలదు. అది సంఘమున శివభక్తులు నడచుకొనవలసిన విధము నుపదేశించు నియమములకు సంబంధించినది.

కం॥ శివభక్తుఁడవగుమని పతి
కవిరతమును బుద్ధి చెప్పనగు శివభక్తిం
దవిలిన సతి కతఁడొడఁబడఁ
డవునేనియు నతని మీఱనగు భక్తిమెయిన్

కం॥ కాదప్పఁ గొనఁగ నప్పీఁ
గా దీఁ గొనఁగాదు గాదు కనఁ దమలో నా
హ్లాదమునఁ బలుకఁగాదు మ
హాదేవపరాఙ్ముఖాత్ములగు పతితులతోన్.

కం॥ కాదు సమశయ్యఁ బొందం
గాదు సమాసనమునందుఁ గదియఁ జరింపం
గాదు సహావాసమును మ
హాదేవ పరాఙ్ముఖాత్ములగు పతితులతోన్

కం॥ ధ్రువముగ సర్వ ప్రాణుల
నవశ్యమునుఁ జేయకుండునది హింస మదిన్
శివ నిందకులగు పాపుల
నవిచారితవృత్తిఁ జంపనగు నీశానా!

కం॥ శివనిందా విషయంబగు
నవమానము సెప్పనట్టి యప్పుస్తకముల్
అవిచారంబునఁ గాల్పఁగ
నవుఁ జెప్పెడివానిఁ జంపనగు నీశానా!

కం॥ సంప్రాప్త శివ! నీ భక్తికి,
సంహోమతి వక్రులైన నప్పుడ 'తేశీ
ఘ్రం హన్తవ్యా' యనుటను
సంహారించుటయ పథము జనకులనైనన్.

పై గురూపదేశ వాక్యములను అనాటి శివభక్తులు పాటించియే యున్నచో వారి సంఘమును వారిమతమును శైవేతరులు ఎంతో గర్హించి యుందురు. సంఘమున ఎంతో కల్లోలము పుట్టియుండును. మతము పేర చెలరేగిన అట్టి విప్లవమును అణచవలసిన రాజులు కూడ పక్షపాతబుద్ధి గలవారగుటచే సర్వప్రజాక్షేమమును కాపాడజాలని యసమర్థులై ఉందురు.

ఈ కవికి శ్రుతి, స్మృతి పురాణాగమాదులు ముఖస్థములై యుండుటయే గాక అందలి వాక్యములను సులువుగా వాక్యయోజనకు భంగము లేనట్లు తెలుగు వాక్యములలో గర్భితము చేయగల నేర్పు గలదు:

కం॥ వసుమతిఁ జిత్రము జితచి
త్తసంభవా "న కర్మణా న తపసా న జపై
ర్న సమాధిభి" రవ్యయ నీ
య సదృశ భక్తికినిఁ బ్రియుడవగు దీశానా!

ఈ నేర్పు ఇతని నుండియే పాల్కురికి సోమనాధుడు గ్రహించెను

తాను నమ్మిన సత్యమును ప్రబోధించుటలో లోకభీతిగాని, శంకాతంకములుగాని లేక త్రికరణశుద్ధిగా చాటి ఈతడు ప్రచారము చేయఁగలడు ఆ భక్త్యావేశ మాయన ధర్మ ప్రచారమునకుఁ జాల నక్కఱకు వచ్చినది మఱి, యీా భక్తి శాస్త్రజ్ఞానములేని మూఢభక్తి గాదు అయన వైదుష్యము వేదవేదాంగ విద్యాసంపన్నము.

కం॥ జ్ఞాన జ్ఞేయజ్ఞాతృని
దాన త్రయమున నబాధిత ప్రత్యయమై
నానాగతి నవగతమగుఁ
గాన జగద్భేద మెన్నఁగా సిద్ధ మజా!

కం॥ భేదము దృష్టాదృష్టని
పాదకమై వైదికోక్త పథ దర్శన సం
పాదన సమర్థమగుటను
భేదము దర్శనము ప్రమితి పిండితము శివా!

## పాల్కురికి సోమనాథుడు

ఈ కవి, వాఙ్మయమునందును శైవ మతమునందును కూడ పండితారాధ్యునికంటె ఎక్కువ ప్రాధాన్యము కలవాడు అతనివలె వ్రాసినను ఈతని రచనలు కావ్యత్వ శోభితములు కూడ అయి యుండుటచే ఉభయ తారకములై తెలుఁగు కవులలో అగ్రశ్రేణికి చెందిన వాడైనను ఈతని కవితా సృష్టియంతయు మత పరిమితమగుటవలన, శైవేతర రసికవర్గములలో రావలసిన కీర్తి రాలేదు

దేశికవితా పదమును కొంత వరకు సార్ధకము చేసినవాడీ సోమనాధుడు. ఇతివృత్తము – భాష – ఛందస్సు – ఈ మూడును శుద్ధ దేశీయములైననాడే దేశి కవిత్వమనే పదము సార్థకమగును. ఈతని మొదటి పెద్ద గ్రంధమైన బసవపురాణములో అధికారికమైన బసవని చరిత్ర కన్నడ దేశీయమే కాని తెలుగుఁదేశీయము కాదు అందుచే ఇతివృత్తము నిరవద్యముగా దేశీయమని చెప్పుటకు వీలులేదు అయితే ఆనాడు ఆంధ్ర కర్ణాటకములకు సంఘమునందును, సారస్వతమునందును గల సన్నిహితత్వమునుబట్టి కర్ణాటకులను పరులుగా భావింపరాదందురేమో? అగుచో భరతఖండమంతయు ఒకే దేశముగా భావించి అందు ఏ రాష్ట్రముల ఏనాడు ఏ మహాపురుషుడు జన్మించినను అతని చరిత్రను దేశీయముగానే భావించి కావ్యేతివృత్తముగా స్వీకరించుటలో ఏమి దోషమున్నది? రామాదులు సర్వభారతజాతికి స్వదేశీయులుగానే వెలుగొందుటబట్టి వారి చరిత్రలు సమస్త భారతీయ సంసేవ్యములైన కావ్యములుగా వన్నె కెక్కినవి. కావున దేశీయేతివృత్తము అనే పరిమిత భావన కావ్యసృష్టికి అంతగా మంచిదికాదు

ఒకవేళ అతివేలమైన ఆంధ్రాభిమానము గలవారు దేశీయేతివృత్తముగల కావ్యమే తమకు సంసేవ్యము అగునని భావింతురేని వారికి విందుసేయదగిన ఇతివృత్తములు బొబ్బిలి కథ, కాటమరాజు కథ, కామమ్మ కథ మొదలగునవి పదకవిత్వ జాతిలో లభించును ఆ వర్గములో తలమానికము వంటిది పల్నాటి వీరచరిత్ర కాగా బసవ పురాణేతి వృత్తము ఆంధ్రులకు శుద్ధ దేశీయము కాదు.

ఇక భాషా విషయము దేశి కావ్యములలో భాష దేశీయముగా నుండవలె నన్న సంస్కృత పదవాసన సోకని శుద్ధ తెలుఁగు మాటల కూర్పు కావలెను గదా! అట్టిది ఏ తెలుఁగుకవికి . తెలుఁగు భాష, కావ్య రచనకు ఎంతవరకు ఉపకరించెనో, సంస్కృత సాహయ్యము తెలుఁగునకు ఎట్టిమేలు చేకూర్చెనో పూర్వ ప్రకరణములలో సహేతుకముగా సోదాహరణముగా నిరూపించితిని అది యటుండుగాక, దేశి కవితావ్రత దీక్షితుడైన యీ సోమనాథుడు కూడ తన రచనలో నూటికి ఏబదిపాళ్లకు తక్కువ కాకుండ తత్సమపద ప్రయోగము చేయుటకు వెనుదీయలేదు అతని నోట తెలుఁగు పదములు ఎంత అప్రయత్నముగా వెల్లివిరిసివచ్చుచుండునో సంస్కృత సమాసములును అట్లే పొంగిపొరలు చుండును వాటి సహజ ప్రాదుర్భావమును అతడు అరికట్టజాలడు; అరి కట్టుటకు ప్రయత్నమును చేయడు అట్టి సంస్కృతాంధ్రముల కలయికవలన తన రచనకు కలిగెడి నిండుదనమును మాధుర్యమును గాంభీర్యమును అతడు ఎరుగని వాడుకాడు. అయితే మరి ఇతని భాషలో దేశీయత లేదా అందురేమో! లేకేమి? పుష్కలముగ నున్నది పలుకుబడిలో, జాత్యములో, కారకములో, సామెతలలో ఇందుగల దేశీయత ఒక్క తిక్కన భారతమునదప్ప మరెందును కానరాదు. అదిగాక అతడు వర్ణించిన ప్రత్యంశము ఆనాటి యాంధ్రుల నిత్య జీవితమునకు ప్రతిబింబమైన చిత్రముగా నుండునుగాని తద్వ్యతిరిక్తమై యుండదు పసిపిల్లలకు ఉగ్గుపెట్టి నీళ్ళుపోసి బొట్టుపెట్టి తొట్టెలో పరుండబెట్టుట మొదలగు తల్లుల నిత్యకృత్యములు మొదలు, బంతులు తీర్చి విందులొసగెడి భోజన సమారాధనలవరకు గల జీవిత వ్యాపారములు వర్ణించునపుడు సోమనాథుడు ప్రదర్శించిన ఆంధ్ర సంప్రదాయము మరియొక కావ్యమున కానరాదు అది యిది యననేల? తెలుఁగునాటి చెట్లు చేమలు, మందులు, మ్రాకులు, పండుగలు, పబ్బములు, భాషణములు, వేషములు అతని రచనకు వస్తువులైనవి ఇదియే సోమనాథుని దేశీయత

మరి ఛందోవిషయము ఆదికాలమున తెలుఁగునాట ఉద్భవించిన సహజ కవిత్వమంతయు గేయ ప్రాయము తాళ ప్రధానమైన ఆ గేయ కవిత్వమును కొద్దిపాటి హ్రస్వ దీర్ఘాది సంస్కారములతో గణ ప్రధానముగా ప్రస్తరించినపుడు ద్విపదలుగా, రగడలుగా, అక్కరలుగా రూపొందును వీటిలో ద్విపదవలె తక్కిన జాతులు విపుల కావ్య రచనకు అంతగా నుపకరింపవు. సోమనాథుడు దానిని చేపట్టి పామర కవిత్వమను పేర పండితులచే అనాదరింపబడిన పద కవిత్వమునకు వాఙ్మయమున ప్రతిష్ఠ చేకూర్చి ద్విపదకవితా శాఖకు ప్రథమాచార్యుడుగా కీర్తికెక్కెను ఈ ద్విపద కవిత్వము పద కవిత్వమయ్యు పామర కవిత్వము కాదు. పండిత కవిత్వమయ్యు దేశికవిత్వముకాకపోదు. కావున శిష్టకావ్యపథము తీర్చిన గౌరవము నన్నయకు దక్కినట్లే ద్విపదకావ్యపథముతీర్చిన గౌరవము సోమనాథునకు దక్కెను. అయితే ఈ ద్విపదలు పద్యకావ్యములవలె

సుఖపఠనీయములుకావు. ఒకే ఛందస్సులో నడుపబడిన కావ్యమంతయు పఠనములో విసుగుపుట్టించునుగాని సంతోషమును గొలుపదు పద్యకావ్యములలో ఛందోవైవిధ్య ముండునుగాన అది చదివిన కొలది రాగ వైవిధ్యము, కీర్తన వైవిధ్యముగల గాన సభలవలె చిత్తమునకు ఉల్లాసము గొలుపుచుండును కావున పద్యకావ్యమువలె ద్విపదకావ్యపఠన సౌలభ్యము కలది కాదు కాకపోతే బొబ్బిలి కధ, పలనాటి చరిత్రము మొదలైన వీరపదములు రాగతాళయుక్తముగా పాడబడుచుండును గావునను ఆ పాటలో కధకుడు మధ్యమధ్య సంధి వచనములతో నాటకమునందలి అర్థోపక్షేపకములవలె వృత్తవర్తిష్యమాణ కధాంశములను వ్యాఖ్యానించుచుండును గావునను ఆ పదములు ఎంత దీర్ఘములైనను వినసొంపుగా నుండును. విసుగు గొల్పవు. అవికూడ గ్రంధస్థములై పాఠ్యములుగానే స్వీకరింపబడినపుడు మరల ఈ ద్విపద కావ్యముల దుస్థితికే వచ్చును. సంస్కృత కావ్యములలో ఒక్కొక్క సర్గ ఒకే ఛందములో నడుచును గదా! ఆ కావ్యముల పఠనవేళ విసుగు పుట్టదా అని ప్రశ్నింతురేని దానికి సమాధానమిది – సంస్కృత కావ్యములందలి సర్గలు అనతి విస్తృతములై, సగటున ఒక్కొక్క సర్గ నూరు శ్లోకములకు మించని పరిమితి కలిగియుండును సర్గ సర్గకు ఛందస్సు మారుచుండును మరియు ఆ శ్లోకములను ఛందోనుగతమైన గీతితో పఠింతుమేని పాటవలెనే శ్రవణసుఖము నిచ్చుచుండును ద్విపదములు కూడ రాగయుక్తముగ పాడినపుడు వినసొంపుగానే యుండునుగాని కావ్యము యొక్క దీర్ఘతనుబట్టి ఆ సొంపు ఆసాంతము నిర్వహింపబడజాలదు అదిగాక కవి హృదయమున జనించెడి భావములు కొన్ని తద్వ్యక్తీకరణమునకు అనుగుణమైన పదబంధములను స్వయముగా వరించుచుండును. అనగా ఆ భావము ఆ పదములలో కాక వేరు పదములలో వ్యక్తము చేయుట దుష్కరము కాక పోయినను అసహజమగుచుండును భారతములో "వచ్చినవాఁడు ఫల్గునుడు" అనే పదబంధము ఉత్పలమాలలో తప్ప ఇంకొక వృత్తమున కెక్కదు. ఆ వాక్యములో తిక్కనగారు పాఠకునకు ఏ స్ఫురణ కలిగింపదలచెనో దానిని ఇంకొక వాక్యములో చెప్పుట కుదురదు అట్లే పాండవ విజయమున దుర్యోధనుడు –

ఉ॥ "కాలము చేరువయ్యె కలకాలము రాజ్యము చేసిరే మహీ
పాలురు కాలకర్మ పరిపాకము దాటదరంబె? కంఠమే
వాలున ద్రుంచి నాకు ద్రిదివంబున జూపుము వారినెల్ల చం
డాలుడు భీముడేల కురునాధుని జంపవలెన్ ద్విజోత్తమా!"

అని యశ్వత్థామను సంబోధించినపుడు వ్యక్తమయ్యెడి నిర్వేదము, శత్రు తిరస్కారము, నిస్సహాయత ఆ వాక్యములో వలె ఇంకొక వాక్యములో వ్యక్తము కాజాలవు మరి ఆ వాక్యము ఉత్పలమాల పద్యములో ఇమిడినంత సుఖముగ ఇంకొక పద్యమున ఇముడదు. ఇంకొక ఉదాహరణ చూడుడు "కృష్ణద్వైపాయన" శబ్దమును విధిగా ప్రయోగింపవలసి వచ్చినపుడు ద్విపద కావ్యకర్త దానిని ద్విపదలలో ఇముడ్చలేదు. దాని పర్యాయపదములను కాక ఆ శబ్దమునే వాడవలసి వచ్చినపుడు పద్య కావ్యకర్త ఆ శబ్ద ప్రయోగానుకూల్యముగల శార్దూలవృత్తమును స్వీకరించును. ద్విపదకర్తకు అట్టి అవకాశముండదు. అతడా శబ్దమును ప్రయోగింపలేడు కావున ఛందో వైవిధ్యము

విసుగుదలను పరిహరించుటకే కాక భావానుగుణమైన శబ్ద ప్రయోగమునకు వాక్యరచనకు కూడ అవశ్యకమగుచుండును ఈ యోగ్యత ద్విపద కావ్యములకు ఉండదు

**సోమనాథుని కాలము:** కన్నడమున ఉద్భటకావ్యము రచించిన సోమరాజు అనే కవి పూర్వకవిస్తుతి ప్రకరణమున ఒక సోమనాథుని స్తుతించెను ఆ ఉద్భటకావ్యము క్రీ శ 1222 లో వ్రాయబడెనట. ఆ స్తుతి గల పద్యమిది

"ప్రమాధానీక కర్ధార్ణవేందు హరిదేవాచార్యనం ధైర్యనం
సముదంచ ద్వృషభస్త వామర మహీజారామనం సోమనం
విమల జ్ఞానసుదీపికా స్ఫురితచేతః పద్మనం పద్మనం
క్రమ దిందంబలగొండు పేళ్వెనొసె దానీ కావ్యమం సేవ్యమం"

ఈ పద్యములో హరిదేవాచార్యుని, సోమనను, పద్మని గ్రంధకర్త స్తుతించెను ఈ ముప్పురిలో సోమనకు వృషభస్తవామర మహీజారాముఁడు అనే విశేషణము కలదు కన్నడమునగాని తెలుఁగునగాని వృషభస్తవము చేసిన కవి మన సోమనాధుడు తప్ప వేరొకడు కానరామిచే ఆ స్తుతి పాల్కురికి సోమనాథుని గురించియే అని పెక్కుమంది విమర్శకులు నిశ్చయించిరి సోమనాథుని వృషాధిప శతకమే ఆ వృషభస్తవము కావున సోమన క్రీ శ. 1222 సంవత్సరమునకు పూర్వుడై యుండవలెను

బసవపురాణ రచనకు తనను ఆశీర్వదించి ప్రోత్సహించిన పెద్దలలో కరస్థలి సోమనాధయ్యగారు ఒకరని సోమనాధుడు ఈ క్రింది పంక్తులలో పేర్కొనెను

"పండితారాధ్య కృపాసముద్గతుడు
మండిత సద్భక్తి మార్గ ప్రచారి
విలసిత పరమసంవిత్సుఖాంభోధి
నలి గరస్థలి సోమనాధయ్యగారు"

ఈ కరస్థలి సోమనాధయ్య మల్లికార్జున పండితారాధ్యుని శిష్యుడు; మరి పాల్కురికి సోమనాధునకు కవితాశక్తిని ప్రసాదించిన గురువు మల్లికార్జున పండితుడు క్రీ శ 1170 ప్రాంతమున శివైక్యము నొందెను కావున అతని శిష్యుడైన కరస్థలి సోమనాధయ్యకు సమకాలికుడైన పాల్కురికి సోమనాధుడు క్రీ శ 1170 ప్రాంతమున శివైక్యము నొందెను కావున అతని శిష్యుడైన కరస్థలి సోమనాధయ్యకు సమకాలికుడైన పాల్కురికి సోమనాధుడు క్రీ.శ 1170 సంవత్సరము నాటికి యువకుడై యుండును మరి బసవ పురాణము 1170 నాటికి పూర్వము రచింపబడలేదు కావున ఈ గ్రంధము 1170–1222 మధ్య కాలమున రచింపబడి యుండవలెను బసవ పురాణమున బిజ్జలుని రాజ్యము విచ్ఛిన్నమగుట ఉదాహరింపబడినది

"అంత రాజ్యార్థమై అనిసేసి అతని
సంతానమెల్ల నిస్సంతానమయ్యె
బసవని సత్యశాపమున గాజేసి
వసజని కటకంబు పాడయ్యెనంత."

ఈ రాజ్యవిచ్ఛిత్తి బిజ్జలుని మరణమునకు తరువాత 16 సంవత్సరములకు జరిగెను. అతని మరణము 1167, రాజ్యనాశము 1183 కావున బసవ పురాణము 1183

నకు పిమ్మట రచింపబడినది మరి సోమన కాకతి రుద్రునకు సమకాలికుడని రాచకవిలెలలోను, కథలలోను గలదు కాకతీయ రాజులలో మొదటి ప్రతాపరుద్రునకే కాకతి రుద్రుడు అను నామాంతరము గలదు అతని రాజ్య కాలము 1135-1199. వీటన్నిటిని బట్టి చూడ బసవపురాణము 1183 నకు పిమ్మట నెప్పుడో 12వ శతాబ్దము ముగియక పూర్వమో, 13వశతాబ్ది మొదటి దశకములోనో రచియింపబడి యుండును సంయుక్తికమైన ఈ సిద్ధాంతము శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రిగారిది. నాకు ఇదియే సమంజసమని తోచెను ఇది యిటుండ సోమనాథుఁడు రెండవ ప్రతాప రుద్రుని కాలమునాటి వాఁడనియు, కాగా తిక్కనకు తరువాతి యుగమువాఁడనియు, ఎఱ్ఱాప్రెగ్గడకు ఇంచుమించు సమకాలికుఁడనియు వాదించువారు కొందరు గలరు ఆ వాదమును తదుపపత్తులను పలువురు అంగీకరింపలేదు నేను ఆ యప్రస్తుతాంశముల నన్నిటిని వదలి గ్రంథస్థములైన ఒకటి, రెండు నిదర్శనములచేత సోమనాథుఁడు తిక్కనకు పూర్వుఁడే యని నిశ్చయించితిని అవి యేవన, తిక్కన నిర్వచనోత్తర రామాయణావతారికలో ఆత్మ వ్యవస్థానార్థమును, కవిజనోపదేశార్థమును వ్రాసిన ఉత్తమ కావ్యలక్షణాత్మకములైన వాక్యములలో పాల్కురికి సోమనాథుని పరోక్షముగా అధిక్షేపించిన యర్థములు కొన్ని గలవు తెలుగు వాక్యమున సంస్కృతమును జొప్పించుట, సంయుక్తాక్షరమున ఏకదేశమునకే ప్రాసగూర్చి ప్రాసభంగము చేయుట, ప్రాతబడిన మాటలు వాడుట మొదలైన అవలక్షణములు పాల్కురికి సోమనాథుని రచనలోనే అధికముగా కానవచ్చును వాటినే తిక్కన నిరసించెను కావున తిక్కన నిందకు లక్ష్యభూతమైనవాఁడు పాల్కురికి సోమనాథుఁడే మఱియు బసవపురాణములో—

*"నారదుండను మునినాయకోత్తముఁడు*
*భూరి సర్వాంగముల్ భువిబొంద మ్రొక్కి*
*ముకుళిత హస్తుఁడై మ్రొక్కుచు మఱియు*
*సకలలోకాలోక చరితంబులెల్ల*
*విన్నవింపగనున్న కన్నెర్రి శివుఁడు*
*వెన్నెలగలకంట వీక్షింపుచున్న"* ..

అనే ద్విపదలు గలవు నారదుఁడు కైలాసమునకేగి శివునకు నమస్కరించి భూలోక వృత్తాంతములు విన్నవింపదలంచుచుండగా శివుఁడు అతని మనస్సు గ్రహించి ఆ ఋషిని వెన్నెలగలకంట వీక్షించెనట ఇందు ఒక చమత్కారమున్నది శివుఁడు త్రిలోచనుఁడే అయినను అగ్నినేత్రముతో ఎవ్వరినీ ఎప్పుడూ చూడడు మఱియు మిగిలిన సూర్యచంద్ర నేత్రములు రెండిటిలో సూర్యనేత్రముగూడ దాహాత్మకమగుటచే దానితో వీక్షించుటయు మంగళప్రదముగాదు కనుక ఒక్కచంద్రనేత్రముతోనే ఆయన చల్లగా చూచెనని తాత్పర్యము ఇంతవఱకు లెస్సగానే యున్నది కాని శివుఁడు ఆ వీక్షణ వేళ సూర్యనేత్రమును ముకుళించుకొనెనా? చేతితో కప్పివేసుకొనెనా? అని చమత్కారార్థ మాక్షేపింపదలచిన వారికి సోమనాథుఁడు చక్కని అవకాశమిచ్చెను ఈ ఆక్షేపణావకాశము తిక్కనకు గూడ పొడగట్టెను ఆయన తన భారతావతారికలో హరిహరనాథుఁడు ప్రత్యక్షమై తనను వీక్షించునపుడు సూర్యనేత్రము గూడ

చంద్రనేత్రమే యగునట్లుగా జేసి ప్రసన్నముగా నిరీక్షించెనని నిరాక్షేపకముగా ఈ క్రింది పద్యమును వ్రాసెను.

*"అనుకం పాతిశయంబునఁ*
*దన దక్షిణ నేత్రమును సుధారోచియ కా*
*నను వింతలేక చూచి వ*
*దనమున దరహాసరసము దళుకొత్తంగన్"*

పైని పేర్కొన్న సోమనాథుని ద్విపదలను, ఈ పద్యమును జోడించి చూచిన వారికి తిక్కన సోమనాథుని మనస్సున బెట్టుకొనియే ఈ పద్యమును వ్రాసెనని విధిగా స్ఫురించి తీరును. కావున సోమనాథుఁడు తిక్కనకు పూర్వుఁడే. ఇన్ని యుక్తులతో నవసరములేకుండగనే సోమనాథుఁడు తిక్కనకు పూర్వుఁడని బసవపురాణావతారికలోని చారిత్రకాంశములే ప్రబల సాక్ష్యము. కరస్థలి సోమనాథయ్యగారు పండితారాధ్యునకు శిష్యుఁడై సోమనాథునకు హితైషి యగుటయు బసవేశ్వరుని తండ్రియైన మండిగ మాదరాజుగారికి శిష్యుఁడగు గొబ్బూరి సంగనామాత్యుఁడు ఈ గ్రంథమునకు శ్రోతయగుటయు నిజమే గనుక వారికి సమకాలికుఁడగు సోమనాథుఁడు ఆ పండ్రెండవ శతాబ్దిలోనివాఁడు గాక మరెప్పటి వాఁడగును? బసవేశ్వరునకును, పండితారాధ్యునకును తరువాతి తరమువాఁడు సోమనాథుఁడు.

అదీగాక సోమనాథుఁడు పుట్టుకచే కర్ణాటకుఁడనియు తెలుఁగు అతనికి నేర్చిన భాషయనియు ప్రతిపాదించువారు కొందరు గలరు అంతకంటె అనాలోచితమైన సిద్ధాంతమింకొకటి ఉండదు. ఎంత కష్టపడి చదివినను నేర్చిన భాష మాతృభాషవలె వశముగాదు అందునను గ్రంథస్థమైన వాగ్జాలమంతయు మనోవిధేయము గావచ్చునుగాని వాయువువలె స్వేచ్ఛగా సంచరించు వాడుకభాష, యెన్నడును క్రొత్తవానికి అబ్బదు. సోమనాథుని రచనలలో జానుతెనుఁగుగా పేర్కొనదగిన పదములు, పదబంధములు, వాక్యములు మాత్రమేగాక తెలుఁగునాట కానవచ్చెడి సర్వవస్తు నిర్దేశకములైన నామములు, తద్విశేషణములు, గుణములు ప్రజాభాషాసముద్రమున ఓలలాడిన వానికేగాని ఇతరులకు లభ్యమగునవిగావు అతని వాక్కునకు సహజమైన తెలుగుదనము తెలుగుతల్లి పెట్టిన యుగ్గుతో వచ్చినదేగాని నేర్చినదిగాదు.

సోమనాథుఁడు కర్ణాటకుఁడే అగునేని ఈ గ్రంథమును కన్నడ భాషలోనే వ్రాసియుండవచ్చునుగదా! తెలుగున ఏల వ్రాయవలె? పదునాల్గవ శతాబ్దిలో భీమన అను కన్నడకవి ఈ గ్రంథమును ఆ భాషకు అలంకారముగ ఏల అనువదించుకొనవలెను? కావున సోమనాథుని మాతృభాష తెలుగు, కన్నడమే నేర్చిన భాష.

**సోమనాథుని గ్రంథములు:**

ఇతడు సంస్కృతాంధ్ర కర్ణాటభాషలలో పెక్కు గ్రంథములు రచించెనట. వాటిలో ఆంధ్ర వాఙ్మయచరిత్రకు ఎక్కదగినవి మూఁడు మాత్రమే. (1) బసవ పురాణము (2) పండితారాధ్య చరిత్ర (3) వృషాధిప శతకము.

**(1) బసవపురాణము:** పండితారాధ్య చరిత్రలోను, వృషాధిపశతకములోను బసవపురాణ ప్రశంస గలదు. కావున ఈ పురాణము ఆ రెండింటికంటె పూర్వరచన.

"మును బసవపురాణమున నెన్నబడిన
పెనుపొరుజనులకు పెంపుడు కొడుక
బసవని పుత్రుండ, బసవ గోత్రుండ" (పండితా చ.)

"బసవడు ప్రీతి గైకొనియె భక్తిమెయిన్ రచియించె సోముడున్
బసవపురాణమంచు మును ప్రస్తుతి చేయుదురట్లుగాన నీ
యసమదయాధురీణతకు నంకిలిపాటు ఘటిల్లకుండ నన్
బసగొని బ్రోవుమయ్య బసవా! బసవా! బసవా! వృషాధిపా!"

(వృషాధిప శతకము)

ఈ పురాణమందలి అధికారిక వస్తువు వీరశైవ మత ప్రవర్తకుఁడగు బసవేశ్వరుని జీవిత మహాత్మ్యము. బసవేశ్వరునకు పూర్వమే శైవులలో వీరమాహేశ్వర వ్రతము గలదనియు, బసవేశ్వరుఁడు వీరశైవమత నిర్మాతకాడనియు కొందఱు శైవమతస్థులే చెప్పుదురు. అగుచో నతడు తన్మత పునఃప్రతిష్ఠాపకుఁడో, సంస్కర్తయో యైయుండవలయును. మహనీయమైన అతని చరిత్ర అసాధారణ విశేషాంశమయమై యుండుటచే దానిని కొనియాడదలచిన ఈ కవిగ్రంధమును చారిత్రక సత్యబద్ధముగా గాక, పౌరాణిక వాసనామయముగ సంతరించెను పురాణములలో చారిత్రకాంశములు తక్కువగను, అలౌకికాద్భుతములు ఎక్కువగను ఉండును కవి ఈ గ్రంధమునకు కూడ ఆ లక్షణము పట్టించి, పురాణమని నామకరణము చేసెను. అనగా ఇంచుమించు తనకు సమకాలికుఁడును, చారిత్రక పురుషుఁడునునైన బసవేశ్వరుని పురాణ పురుషకోటిలో పరిగణించి అతనికి గల సహజ ఘనతను ఎన్నో అతిశయోక్తులతో పెంపొందించి అవతార పురుషునిగా ప్రదర్శించెను. మఱి ప్రస్తుతములైనను కాకున్నను పురాతన శివభక్తుల కధలను కొన్నింటిని ప్రాసంగికములుగా చొప్పించి పురాణ శబ్దమును మరికొంత సార్ధకము చేసెను ఇది జైనసంప్రదాయమట జైనపురాణమున ఒక తీర్ధంకరుని చరిత్ర అధికారికమై యుండుటయు ఆ మతము నవలంబించి సిద్ధిపొందిన యితర నిష్ఠాపరుల కధలు ఉపాఖ్యానములుగా చెప్పబడుటయు ఆచారమట. జైనమతమునకు గర్భశత్రువైన పాల్కురికి సోమనాధుడు జైనులసంప్రదాయమునే స్పర్ధచే అనుకరించి బసవని చరిత్రను పురాణముగా వ్రాసియుండును. ఆ ఉపాఖ్యాన కధానాయకులైన భక్తులలో కొందరు ద్రావిడులు, కొందరు కర్ణాటకులు, కొందరు ఆంధ్రులు, కొందరు ఔత్తరాహులు గలరు ఆ కధలేగాక బసవనికి సమకాలికుఁడైన అల్లమయ్య మొదలగు శివభక్తుల కధలుగూడ ప్రసక్తానుప్రసక్తముగ ఇందు చేర్చబడినవి

**బసవేశ్వరుడు:-** మండిగ మాదిరాజు, మాదాంబ అను బ్రాహ్మణ పుణ్యదంపతులకు బసవేశ్వరుడు నందికేశ్వరాంశమున జన్మించెను. చిన్ననాటనే జ్ఞానియై వర్ణ వ్యవస్థను తిరస్కరించి ఉపనయనాది బ్రాహ్మణ కర్మలను వర్జించి కేవల భక్తిసాధ్యమైన శివపారమ్యము నుద్బోధించుచు తల్లితండ్రులను వీడి, యిల్లువెడలిపోయి, కళ్యాణకటకమున బిజ్జలుని మంత్రిగానున్న తన మేనమామ యిల్లుచేరెను. ఈతని తల్లిదండ్రులును, మేనమామయును శైవులే. అయినను వారు బ్రాహ్మణకర్మలను విసర్జించిన వీరశైవులుకారు. మేనమామ తనకుమార్తెయగు గంగాంబను బసవేశ్వరునికిచ్చి వివాహము చేసి, అల్లునకు రాజాస్థానమున నుద్యోగమిప్పించెను మామగారి అనంతరము

మంత్రియై, తనచే ప్రవర్తితమైన వీరశైవమత ప్రచారమునకు తన సర్వస్వమునేగాక రాజభాండారమును గూడ వినియోగించిన మహాభక్తుడీతడు ఆనాడు శైవమునగల నానాశాఖలకు ధర్మాచరణమున ఏకవాక్యత లేకపోవుటచేతను, వాటికి అవైదికములైన జైన, బౌద్ధమతముల యొత్తిడి కలుగుటచేతను, అదే సమయమున విష్ణుపారమ్యమును ప్రతిపాదించెడి వైష్ణవము తరుముకొని వచ్చుచుండుటచేతను, శివకేశవభేదమును పాటింపని అద్వైతము సర్వమతసామరస్య పరాయణమై యుండుటచేతను ఆ శైవశాఖల స్థిరత్వమునకు వలసిన బలమును సమకూర్చి, శివసామ్రాజ్యము ఆంధ్ర, కన్నడ భూముల నెలకొల్పుటకై యత్నించినవాడు ఈ వీరుడు దీనికితోడు బసవని కాలమునాటికి హిందూమతమునకు మహమ్మదీయుల ఒత్తిడి ఎక్కువైనది ఉత్తరహిందూదేశము నందు మహమ్మదీయులు తమ మతమును బలవంతముగ పాలితులకు ఇప్పింపసాగిరి అట్టిపాటునకు వెఱచి దేశము నంతను కాకపోయినను శైవుల నందరినేనా కలుపుటకు బసవుడు ప్రయత్నించెను ఇందువలన బసవడు గొప్ప సంఘ సంస్కారి అని చెప్పవచ్చును ఈయన తలపెట్టిన సంస్కారములవలన ఆయా శైవశాఖలకు చాల వరకు ఏకవాక్యత కుదిరి వీరశైవము పేర నూతన ధర్మము నెలకొనెను ఐనప్పటికిని వర్ణ వ్యవస్థను, కర్మ ప్రాధాన్యమును విడనాడలేక కొందరు బ్రాహ్మణ శైవులు వీరశైవమును చేరకయే బసవేశ్వరుని యెడల భక్తి ప్రపత్తులు కలిగియుండిరి శివభక్తి పారవశ్యము వీరశైవులకును, వీరికిని సమమే వైదికకర్మలను బ్రాహ్మ్యమును వీడలేకపోవుట బ్రాహ్మణ శైవమునకుగల విశిష్టత అట్టివారు తప్ప, వైదిక కర్మాధికారములేని బ్రాహ్మణేతరులైన నానా కులములవారు బసవని యుపదేశములను శిరసావహించి వీరశైవ కుటుంబమును నలుదెసల వ్యాపింపజేసిరి బసవేశ్వరుడు సహజముగ సంగీత సాహిత్య కళాకోవిదుడట అతడు స్వయముగా రచించిన రసవత్తర గీతములను గొంతెత్తి గానము చేయుచుండగా కృష్ణుని మురళీగానమును ఆలకించిన గోపికాజనమువలె జనులందరు భక్తి పరవశులై ఆయన చుట్టును మూగుచుండిరి కాబోలు! ఈ గీతములనెడి అనుపానముతో తన నూతన మతమనెడి ఔషధమును ప్రయోగించి జనులను దృఢకాయులను జేసిన భిషగ్వరుడు బసవేశ్వరుడు! కర్మానుష్ఠానమువలె దుష్కరమును, దుస్సాధ్యమును కానట్టి కేవల భక్తిమార్గము సర్వజన సంసేవ్య మగుటచేత సుకరమైన ఆ మార్గమున జనులెల్లరును తొట్రుపాటులేక నడవగల్గిరి. వర్ణవ్యవస్థ తుడిచివేయబడుటచే జనులలో న్యూనాధికతలు లేక నూతనోత్సాహము వెల్లివిరిసెను వీరశైవమను పేర వారి కానాడు గలిగిన ఆవేశము ఇన్ని తరములు గడచినను నేటికిని చల్లబడలేదు స్వమత రక్షణార్థమై శూరత్వమును, భక్తి ప్రదర్శనమున వీరత్వమును చూపువారగుటచేత వీరు వీరశైవులైరేమోయని తోచును. ఇదంతయు నొక యెత్తు కాని బసవేశ్వరుఁడు మతము పేర మిండ జంగములను ప్రోత్సహించి పోషించుట, రాజాజ్ఞను ధిక్కరించుట, రాజధనాగారమును దుర్వినియోగము చేయుట, మతము పేరను భక్తిపేరను పరావరజ్ఞతను పాటింపకుండుట, తుదకు ప్రభుహత్యకు కారణమగుట మొదలగు కృత్యము లన్నియు ఎన్నటికిని సమర్థనీయములు కావు అసలు మతమునందు భక్తికి గల స్థానమేమి? జ్ఞానహీనమైన భక్తి అంధము, భక్తిహీనమైన జ్ఞానము వంధ్యము (Faith without wisdom is blind, and wisdom without faith is

barren.) ఈ సిద్ధాంతము తత్త్వవేత్తలందరూ అంగీకరించినది మతావేశపరులకు నచ్చదేమోకాని ఇది పరమసత్యము. బసవేశ్వరుడు జ్ఞానియు, భక్తుడును అనుటకు సందేహము లేదు అతని అనుయాయి వర్గములో చాలమంది జ్ఞానరహితులైన భక్తులనుటకును సందేహములేదు అనాడు శైవేతరులైనవారికి బసవని మతమునెడ ఏవగింపు గలుగుటకు ఆ అజ్ఞాన భక్తుల అనుచిత కృత్యములే కారణమైయుండును.

శివ భక్తులు చేసిన అత్యాచారములు ఎంత ఘోరమైనవో నిరూపించుటకు కక్కయ్య అనెడి భక్తుడు చేసిన ఒక మహాకార్యము బసవపురాణము నుండి ఉదహరించెదను. ఒక బ్రాహ్మణుడు కల్యాణ కటకములో నగరివాకిట కూర్చిండి పురాణము చెప్పుచుండెను. అతడు వ్యాఖ్యానించుచుండిన పురాణము విష్ణుమహిమలను వర్ణించెడి హరివంశమో, విష్ణుపురాణమో మరి అట్టిదేదో అయియుండును. విష్ణువు నృసింహావతారమెత్తి హిరణ్యకశిపుని సంహరించుట, వామనావతారమున త్రివిక్రముడై ఒకపాదమును అకాశమున కెత్తుట మొదలగు గాథలు సహింపలేక కక్కయ్య ఆ బ్రాహ్మణుని చిత్రవధ చేసి బసవేశ్వరుని చేతనే కొనియాడబడెనట కక్కయ్యకు బొందితో కైలాసము వచ్చినదేమో చెప్పలేముగాని వీరశైవమునకు మాత్రము త్రిలోక నిందవచ్చిన దనుటకు సందియములేదు పాపము ఆ బ్రాహ్మణభట్టు పురాణము చెప్పుటలో చేసిన శివనింద ఏమియులేదు. ఆ గ్రంథమున ఉన్న పంక్తులకు వ్యాఖ్యానము చేసెను. నరసింహుడు హిరణ్యకశిపుని సంహరించుటకు ప్రతీకారముగ శరభావతారము ఆ నృసింహుని చీల్చివేసెనట. ఆ పద్యములు ఆనాడు పురాణభట్టు చదువుచుండిన పురాణములో నుండియుండవు. ఉన్నచో అతడు వానిని కూడ వ్యాఖ్యానించెడి వాడే! అందులేకపోయినను ఆ వృత్తాంతమును ఇందు పొందుపరచి చెప్పలేదని కక్కయ్యకు కోపమువచ్చి యుండును. అంతమాత్రమునకే కక్కయ్యకు అక్కసుపుట్టి శివమెక్కెను

కక్కయ్య చేసిన యీ రాక్షస కృత్యమునకు కూడలి సంగమదేవుడు–

"చిత్తజాంతకు భక్తి చెడనాడుఖలుల
మృత్యువుగతి త్రుంపుమీ బసవన్న!"

అని బసవనికి ఉపదేశించుటయు అతడు తదనుగుణముగ–

*"పరసమయంబుల బరిమార్చు బాస
పరవాదులనుబట్టి భంజించు బాస"*

చేయుటకు (ప్రతిజ్ఞచేయుట) తదనుగుణముగ అతని శిష్యులు ప్రవర్తించుటయు ముఖ్యకారణము మరి వారు చేసిన అన్యదేవతా దూషణకు ఏమి శిక్షయో మనమెరుగము. బిజ్జలుని మంత్రిగానున్న కాలములో బసవేశ్వరుడు సంకల్ప మాత్రమున జొన్నలను ముత్యములుగ మార్చుట, వంకాయలను లింగకాయలుగ మార్చుట, విషమును అమృతప్రాయముగ ద్రావుట మొదలగు పెక్కు మహిమలు జూపి తన అప్రాకృత శక్తిని వ్యక్తముచేసెనట కాని అతని ఆశ్రయమును కోరి కల్యాణ కటకమును జేరిన ముక్కుడి మూకలు అనతగిన శివభక్తుల గుంపులవలన నగరమున రాజాజ్ఞా తిరస్కారము ప్రబలి అరాచక స్థితి యేర్పడెనట తుదకు బసవేశ్వరుడు రాజాగ్రహమునకు పాత్రుడై, తాను ఆత్మ రక్షణార్థమో, మరెందుకో సకుటుంబముగ

నగరము వీడిపోయి కూడలి సంగమున లింగైక్యము పొందెనట తత్ప్రతీకారముగా బసవేశ్వరుని యనుచరులిద్దరు బిజ్జలుని వధించిరట. బసవ పురాణమునుబట్టి యితర చరిత్రాధారములను బట్టియు గ్రహింపగలయంతవరకు ఆ మహావీరుని సంగ్రహ జీవిత చరిత్ర యిది

బసవేశ్వరుడు వ్రాసిన భక్తి గీతములు నాలుగు లక్షలకు పైగా గలవట వాటికి 'వచనములు' అని పేరు తరువాతి కాలమున తాళ్ళపాక అన్నమయ్య వ్రాసిన వేంకటేశ్వర వచనములు, కృష్ణమాచార్యుడు వ్రాసిన సింహాద్రి నారసింహ వచనములు ఆ జాతిలోనివే! వీరందరు తమ యిష్టదైవములమీద భక్తిజ్ఞానమయముగ వ్రాసిన స్తోత్రములవి. ప్రతి వచనము చివర మకుటముగ వారి యిష్టదేవతా సంబోధనము ఉండును తాళ్ళపాకవారి వచనములకు 'వేంకటేశ్వరా!' అను సంబోధన మకుటము; కృష్ణమాచార్యుల వచనములకు 'నరసింహా!' అను సంబోధన మకుటము అట్లే బసవని వచనములకు ప్రాయికముగ "కూడలిసంగమదేవరా!" అను సంబోధన మకుటము కూడలి సంగమదేవుడనగా కృష్ణా, తుంగభద్రానదులు సంగమించిన తీర్థస్థలమున గాని కృష్ణామలాపహనదులు సంగమించిన తీర్థస్థలమునగాని వెలసియున్న సంగమేశ్వరలింగము బసవేశ్వరునకు ఇష్టదైవమును గురువును ఆ కూడలి సంగమేశ్వరుడే; తుదకు ఆయన లింగైక్యము బొందినదియు ఆసంగమక్షేత్రముననే.

**గ్రంథ ప్రయోజనము:** ఈ గ్రంధము ప్రాయికముగా శైవులకు పురాణముగా పారాయణ గ్రంధముగా ప్రయోజనకారియైనట్లు శైవేతరులకు కేవల పారాయణ గ్రంధముగ ఎక్కువ వినియోగపడదు మత ప్రాధాన్యము గల యే గ్రంధమునకైనను నదియే స్థితి. తన్మతావలంబులకు దప్ప నితరుల కది ప్రీతిగొలుపదు అంతేగాక ఇతర మతములను, మతస్థులను ఉచితానుచిత వివేచనము లేకుండ దూషించెడి గ్రంధములకు వాఙ్మయమున ఉత్తమ స్థానము లభింపదు ఏ భాషలోనైనను కావ్యము సర్వమానవ సంసేవ్యమైనపుడే పఠనీయమును, ఆరాధనీయమును అగునుగాని లేనిచో పరిమిత ప్రచారము గలదియే యగును తనను తిట్టినవానిని బాగుగా తిట్టితివని మెచ్చుకొనెడి మానవుఁడు దుర్లభుడు అందును ఆ తిట్టు పరుషముగా నున్నచో చెప్పెడిదేమి? అందుచే గ్రంధకర్త నిందలకు భాజనమైన శైవేతరులు సారస్వత ప్రీతి చేతనైనను ఈ బసవ పురాణమును చదువక పోవుట తటస్థపడెను అయినను ఇందు కొన్ని ఉపాఖ్యానములు సారస్వత ప్రియులకుగూడ పరమానందమును కలిగించెడివి లేకపోలేదు. వానిలో ముఖ్యమైనవి: (1) గొడగూచి కథ (2) బెజ్జమహాదేవికథ (3) కన్నప్ప కథ (4) సిరియాళుని కథ ఇందు మొదటిదానిలో అనగాయికురాలైన బాలికకు శివుఁడు సులభముగా ప్రసన్నుఁడై, తనలో లీనమొనర్చుకొన్న యనుగ్రహము వర్ణింపబడినది రెండవదానిలో భక్తురాలు శివుని తన బిడ్డగా భావించి తల్లి పసిపాపకు జేసెడి యుపచారములన్నియు నెరపుటలో గల మాతృ వాత్సల్యమును, భగవంతుడు ఆ ప్రేమకు ప్రీతుడై చూపిన భక్తవాత్సల్యమును వర్ణింపబడినవి. మూడవదానిలో ఆటవికుడైన కిరాతబాలుఁడు ఆచార రహితమైన తన మూఢభక్తిచేతనే, జ్ఞానులకు సహితము దుర్లభమైన ముక్తిని పొందిన విధము నిరూపితమైనది నాల్గవదానిలో చిఱుతొండనంబి యనెడి కాంచీపురనివాసియగు ఒక భక్తుని దృఢవ్రతమును

శివుఁడు మాయతపసి వేషమునవచ్చి పరీక్షించుటకై, ఆ భక్తుని కుమారుని చంపించి ఆన్మాంసమును విందారగించుటయు, తుదకు పరీక్షలో నెగ్గిన భక్తుని యచంచల భక్తి విశ్వాసములకు తృప్తుడై పిల్లవానిని బ్రతికించి యిచ్చుటయు మొదలగు నంశములు భయానకరమ్యముగ వర్ణింపబడినవి అసలు ఆ పిల్లవానిని ఖండించి అవయవ విచ్ఛేదముచేసి తిరిగి నలినలిగా నలగగొట్టి వంటచేయుట అను ఘోరకృత్యమును వీరశైవవేశము గల కవితప్ప ఇంకొకడు భావన చేయలేడు. ఈ కథను చెప్పగా వినుటకే భయకంపితులయ్యెడి సుకుమార చిత్తులకు చదివి యానందించుట యెన్నటికిని పొసగదు కాకపోతే కథాంతమున మాయా తపసి యాదేశానుసారము తల్లి పిల్లవానిని చేతులు చాచి యెలుగెత్తి 'నా వడుగా రారా! నా కన్నయ్య రారా! నా సిరియాళ రారా!" అని పిలుచునపుడు కట్టలు త్రెంచుకొని ప్రవహించెడి కరుణరస ప్రవాహములో కొట్టుకొని పోదుము ఆ పిలుపు నందుకొని శివానుగ్రహముచే పిల్లవాడు సజీవుడై తల్లిని చేరవచ్చెడి ఘట్టమున ఆనంద తన్మయులముగుదుము. కాని ఇందును సోమనాథుడు తల్లినోట పలికించిన ఆ పిలుపులో కొంత కృతకత్వమున్నది ఆ సమాసములు ఆ శ్లేషలు దుఃఖపరవశయైన తల్లి నోట పలికింపదగినవి కావు

మఱి ఈ పురాణమున స్థూలముగ బసవని జీవితచరిత్రయు, తన్మహిమలును, కొందరు భక్తుల గాథలును మాత్రమే కానవచ్చునుగాని, అసలు బసవేశ్వరుడు ప్రతిపాదించిన వీరశైవమత స్వరూపమిట్టిదని స్పష్టముగ గానరాదు అతని మహిమలును, ఆ భక్తుల నడవడియు మాత్రమే తన్మత స్వరూపమని తృప్తిపడుట మత ప్రవర్తకునకును, తన్మతమునకును నపచారము చేసినట్లగును వీరశైవ సంప్రాదాయమును గురించి తెలిసికొన గోరువారికి ఈ గ్రంథము అంతగా నుపకరింపదు.

## పండితారాధ్య చరిత్ర

బసవపురాణానంతరము సుమారు పది సంవత్సరములకు ఇది వ్రాయబడి యుండును ద్విపద రచన మొదటి దానియందుకంటె దీనియందెక్కువ ధారాళముగా నడచినది అందు చెప్పబడిన కొన్ని యుపాఖ్యానము లిందును పునరుక్తము లైనవి. ఈ పునరుక్తిలో కథ కొన్నింట విపులీకృతమైనటువంటి సందర్భములును గలవు. బసవపురాణమున క్లుప్తముగానున్న 'కళియంబనైనారు' కథ పండితారాధ్య చరిత్రలో చాల పెరిగినది. ఈ భక్తుడు తన యింటికి వచ్చిన శివభక్తుని పాదమును కడిగి తత్పాదోదకము పానముచేయు నలవాటు గలవాడు ఒకనాడు ఆ యింటి పనికత్తెకొడుకు జంగమవేషముదాల్చి యజమాని యొద్దకు రాగా అతడు వాని పాదములు కడుగుటకుద్యమించెను అతని గృహిణి కలరూపు గ్రహించి ఆ యనుచిత కార్యము చేయవద్దని భర్తను నిరోధించెను అతడు రౌద్రావేశముతో ఆ యిల్లాలిని నానా దుర్భాషలాడి ఆమె కాలుసేతులు బంధించి బాడితతో నరికి వధించి కాళ్ళకు త్రాడుగట్టి చచ్చిన గొడ్డును లాగినట్లు బయటకు లాగి అవల పారవైచెను ఈ కథయంతయు బసవ పురాణములో పండ్రెండు పంక్తులలో గలదు (6 ద్విపదలు) ఆరాధ్య చరిత్రలో అది 160 పంక్తులను పెరిగినది ఈ పెంపంతయు భార్యచేయు నుపదేశ వాక్యములలోను, భర్తచేయు దూషణ వాక్యములలోను, ఆపై ఆ కులసతీ వధ విధానములోను జరిగినది

కిన్నర బ్రహ్మయ్య: ఈ బ్రహ్మయ్య యొక శివాలయ ప్రాంగణమున గూర్చుండి కిన్నర శ్రుతిలో ఈశ్వరుని స్తోత్రము చేయుచుండెడి భక్తుడు ఒకనాడు ఒక విటుడు తన ప్రియురాలి కోరికమీద సంజాడుకై ఒక గొఱ్ఱెను తోలుకొని పోవుచుండగా అది తప్పించుకొని పారిపోయి శివాలయమున జొచ్చెను దానిని బట్టుకొనుట కావిటు డాలయమున ప్రవేశించబోగా బ్రహ్మయ్య శివుని శరణుజొచ్చిన ప్రాణిని జంప వలనుపడదని వారించి తత్పరిహారముగా దాని వెలనిచ్చి పంపివేసెను కాని ఆ విటుని ప్రియురాలు ఆ గొఱ్ఱెయే కావలయునని పట్టు బట్టుటచే వాడు తిరిగివచ్చి గొఱ్ఱెను ఆశించి కలహింపగా బ్రహ్మయ్య వానిని ఖండించివైచెను ఈ కలహ వృత్తాంతము రాజునకు విన్నవింపబడగా ఆయన శివాలయము నొద్దకు వచ్చి విచారణ చేయగా బ్రహ్మయ్య జరిగిన వృత్తాంతమంతయుఁ దెలిపి దీనికి సాక్ష్యము శివుఁడేయని ప్రతిజ్ఞ జేసెను శివునిచే సాక్ష్యమిప్పించుమని రాజు నిర్బంధింపగా బ్రహ్మయ్య శివుని వేడుకొని ప్రతివచనము లేమిచే కత్తిచే పొడుచుకొని పడిపోయెను అతనిపాటుతో పరిసరమున ఉన్న సర్వప్రాణులు స్రుక్కి పడిపోయెను ఆ వార్తవిన్న బసవేశ్వరుడు దుఃఖ పరవశుడై బ్రహ్మయ్య గుణగణములను కీర్తింపగా అతడు సజీవుడై లేచెను స్రుక్కి పడియున్నసర్వప్రాణులును సజీవములయ్యెను రాజు బ్రహ్మయ్య సత్యవాక్కునకు మెచ్చుకొని, నిర్దోషియని వెడలిపోయెను ఆరాధ్యచరిత్రమున ఈ కథలో బసవేశ్వరుడు బ్రహ్మయ్య మృతికి శోకాకులుడై నిర్వేదముతో అతనిని గీర్తించిన భాగము మాత్రము విపులీకరింపడి యున్నది ఇట్టివే మఱికొన్ని

పండితారాధ్య చరిత్రమునకు అధికారికేతి వృత్తము శివతత్త్వసార కర్తయగు మల్లికార్జున పండితారాధ్యుని జీవిత చరిత్ర ఈ పండితుఁడు బసవేశ్వరునకు సమకాలికుఁడగుటయేగాక అతనివలెనే శైవమత ప్రచారమునకు జీవితమును ధారపోసిన శివభక్తుడు. కన్నడ దేశమున బసవేశ్వరుఁడును, ఆంధ్రదేశమున మల్లికార్జున పండితుడును ఏక కాలముననే అన్యమతములమీద దాడిసల్పి శైవ సామ్రాజ్యమును స్థాపించిన మహావీరులు

ఈ పండితుఁడు ద్రాక్షారామ భీమేశ్వరాలయపు పూజారి కుమారుడు తత్సమీప గ్రామమగు కోటిపల్లి యందుండిన ఒక యారాధ్య దేవరవల్ల శాంభవ దీక్షపొంది చిన్ననాటనే కులాచారమునకు విరుద్ధముగా శివభక్తులపాదోదక ప్రసాదముల యొక్కయు, విభూతి రుద్రాక్షమాలల యొక్కయు మహిమలను చాటుచు, తత్ప్రకారము తాను నడచుకొనసాగెను మరియు శ్రుతిస్మృతి పురాణేతిహాసాత్మకమగు మత గ్రంథ జాలమంతను క్షుణ్ణముగా పరనము చేసి అందలి పరమార్థసారము శివపరముగా అన్వయింప సాగెను. ఈ పాండిత్యబలమే చతురంగబలముగా వెంటగొని, సామ్రాజ్య పతనానంతరము బలహీనులై అచ్చటచ్చట ప్రాభవహీనమైన రాచరికము చేయుచున్న సామంతరాజులవలె నిలిచియున్న బౌద్ధమత కేంద్రములపై దాడివెడలి వాటిని విచ్ఛిన్నముఁ జేయనుద్యమించెను అనాడు ధనదపుర మన బరగిన నేటి చందవోలు రాజధానిగ వెలనాటి చోళులు వేంగీదేశమును పాలించుచుండిరి ఆ రాజు బౌద్ధమతావలంబికాబోలు అతని యాస్థానమున నొక బౌద్ధ పండితుడు గురుపీఠ మలంకరించి యుండెను ఆ యాస్థానముపై దండెత్తి బౌద్ధపండితుని ఓడించి రాజునకు

శైవదీక్ష నిప్పించినచో తన యుద్యమము సంపూర్ణముగా ఫలవంతమగుననెడి యాశతో పండితుడు ఆ రాజధాని జేరి ఒక బౌద్ధాచార్యునేగాక ఇతర మత గురువులను కూడ సమావేశపఱచి నిండు సభలో ఆయా మతములనన్నిటిని ఖండించి శివపారమ్యమును సిద్ధాంతీకరించెను. బౌద్ధాచార్యుడు తన ఓటమిని, శివపారమ్యమును నంగీకరింపక పండితునిఁ జులకనఁ జేసి వెడలిపోగా, దానిని సహింపలేక పండితుని శిష్యులిరువురు ఆ బౌద్ధుని ఏకాంతమున వధించిరి రాజు కోపాయత్తుఁడై కొలువునకు పిలిపించి యడుగగా, పండితుడు ఆ శివద్రోహిని తానే చంపించితినని ఆ నేరము తనమీద మోపుకొనెను రాజు ఆ దారుణచర్య సహింపలేక పండితుని కండ్లు పొడిపించెను అయన 'ఆరాజ్యము నాశనమగుగాక!' యని శపియించి అటనుండి బసవేశ్వరుని దర్శింపవలయునను తహతహతో ప్రయాణమై పోవుచుండగా మధ్యేమార్గమున, ఆ దండనాధుఁడు కూడలి సంగమమున లింగైక్యము పొందిన విషాద వార్త వినవచ్చెను. పండితుఁడు దుర్భర నిర్వేదముతో పలవించి పలవించి, శ్రీశైలమునకు ప్రయాణమై పోవుచు తత్సమీపమున నొక గ్రామములో విడిసెను అప్పటికే వయసుమీరి యుండబోలు, పర్వతమెక్కలేక తన భక్తిని మల్లికార్జున స్వామికి నివేదింపు మని ఒక శిష్యుని కొండమీదకు పంపెను. పర్వతము ఒక లింగాకారముగా కానవచ్చుటచే ఆ లింగమూర్తిని తన పాదములతో మెట్టుట మహాపాతకమను భయముచే తన ప్రతినిధిగా శిష్యుని బంపినట్లు ఈ గ్రంధమునఁ జెప్పఁబడి యున్నది. శ్రీశైలస్వామి వృద్ధతపసి వేషముతో ఆ శిష్యుని ఎదుర్కొని ఆదరించి పండితుని యోగక్షేమములు అడిగెనట శిష్యుడు తెచ్చిన ఆసంతోషవార్త విని మల్లికార్జున పండితుఁడు 'ధన్యోస్మి' యని పారవశ్యానందమగ్నుఁడయ్యెనట. ఆ గ్రామముననే మరికొన్ని నాళ్ళుండి శివసాయుజ్యము పొందెనట ఇందలి ప్రధాన కథ యిది. ఈ కథాంశములే శివతత్త్వసార ప్రకరణమున సంగ్రహముగా చెప్పబడినవి బసవపురాణమునందు వలెనే దీనియందును పెక్కు ఉపాఖ్యానములు. పండితుని సాహిత్య ప్రకర్షను, మహిమలను దెల్పు పెక్కుగాధలును, ఉపదేశములును వర్ణింపబడినవి అదియునుగాక శివతత్త్వ సారమునందలి కొన్ని ప్రకరణములు యధామాతృకముగా ద్విపదలైనవి వాటి పేర్లలో మాత్రము కొంచెపాటి మార్పుగలదు

శివతత్త్వసారము–పండితారాధ్య చరిత్ర
అద్వైత ఖండనము–వేదాంత వాదఖండనము (వాద.ప్ర.)

దక్షాధ్వర ధ్వంసము–దక్షాధ్వర ప్రశంస
ప్రళయ వర్ణనము–ప్రళయలీల
శివగణముల వర్ణనము–మహాతాండవలీల
తన్ను శివగణములో–జేర్పుమని కోరుట
పండితుని చరమ ప్రార్థన (పర్వత.ప్ర )

శివతత్త్వ సారమున పండితుఁడు రచించిన పద్యములను కొన్నింటిని సుకరముగ ఈ ప్రకరణములో ద్విపదలందు ఇమిడ్చి సోమనాధుడు తన శబ్దానుకరణ కౌశలమును, వాక్యానుకరణ నైపుణిని సొగసుగా ప్రదర్శించెను శివతత్త్వసార కర్తగా పండితుడు

వ్రాసిన శ్లోకములను పండితారాధ్యచరిత్రలో తానే పాత్రగాపలుకుటలో ఎంతో ఔచిత్యమున్నది.

అట్లు యథాతథముగ అనుసరించిన పద్యములుగాక తక్కిన వాటిని, సోమన తాత్పర్య ప్రధానముగ సంతరించెను శివతత్త్వ సారమందలి పద్యములు సోమనాథుని ద్విపదలలో నిమిడిన కొన్ని నిదర్శనములు చూడుడు:

కం॥ కలదన నోపక లేదని
పలుకఁగ నేరకయు మూకబధిరులక్రియ ని
మ్ముల నద్వైతులు దమలో
పల వగతురు భువనభిన్న భావమున శివా! (శివతత్త్వ)

ద్వి॥ కలదనంగా నోపకయును లేదనియుఁ
బలుక నేరక మూక బధిరుల క్రియను
బరఁగుభువనభిన్న భావంబుఁజూచి
యరయంగ నద్వైతమనఁగ లావేది. (పండిత–వాదప్రక)

కం॥ ఒండేమి మల్లికార్జున
పండితుఁడన నుండుకంటెఁ బ్రమథులతో నె
న్నండొకొ నీ యాజ్ఞోన్నతి
నుండఁగఁ గాంతునని కోరుచుండుదు రుద్రా! (శివతత్త్వ)

కం॥ దేవా సంసారాంబుధి
లో వెలువడఁజేసి ప్రమథలోకం బెఱుఁగన్
నావాఁడు వీఁడుసుండీ
నావే నన్నుంపవే గణంబుల నడుమన్ (శివతత్త్వ)

ద్వి॥ ఊర్జిత ప్రమథాత్మ యొండేమి మల్లి
కార్జున పండితుఁడనఁగ నిచ్చోట
నుండుటకంటె నెన్నండొకో ప్రమథ
మండలిలో భవన్మహాజ్ఞఁజేసి
యుండంగఁ గాంతునొకోయని కోరు
చుండుదు నన్నట్టులనుపఁగదయ్య
దేవ! యీ సంసార తీవ్రదుఃఖాగ్ని
లోవెలిఁ బ్రమథాదిలోకం బెలర్ప
నావాఁడు వీఁడు సుండీ వేఱుగాఁడు
నావె నన్నుంపు గణంబుల నడుమ (పండితారాధ్య–పర్వప్ర)

కం॥ జ్ఞాన జ్ఞేయ జ్ఞాతృని
దానత్రయమున నబాధిత ప్రత్యయమై
నానాగతి నవగతమగుఁ
గాన జగద్భేద మెన్నగా సిద్ధమజా! (శివతత్త్వ)

ద్వి॥ ఎఱుగంగఁ బడువస్తు వెలిఁగెడి తాను
నెఱుకయు ననుమూఁడు తెఱఁగులు భువిని
బరఁగి యబాధిత ప్రత్యయమగుచు
నరయ నానాగతి నవగతంబగుట
హస్తామలక మెట్టులట్లను సుప్ర
శస్త జగద్భేదసరణి సిద్ధముగఁ
దమకించి మఱియు భేదమ పల్కఁజనునె. (పండిత–వాద)

**వృషాధిప శతకము:** ఇప్పుడుపలభ్యములగుచున్న శతకములో శతకమను పేరు సార్థకమైన మొదటి శతకము ఇదియే యని చెప్పవచ్చును పండితారాధ్యుని శివతత్త్వసారము కాక "శ్రీగిరి మల్లికార్జునా" అను మకుటము గల శతకము ఒకటి యుండెనని యొప్పుకొన్నను అది లభింపలేదు. కాన వృషాధిప శతకమే సజీవములైయున్న శతకములలో మొదటిదిగా పేర్కొనదగును. శ్రీ గిరి మల్లికార్జున శతకము లభించినపుడు వృషాధిప శతకము రెండవదియగును. ఇది ఆత్మీయభావమున్న శతకము భక్తిపారవశ్యమున కవి తాండవమాడి పాఠకులను తాండవింపజేయు శక్తిగల భక్తిశతకమిది. సోమనాథుడు ద్విపద కావ్యములకే కాక తెలుఁగు శతకములకు కూడ ఒరవడి తీర్చిన ప్రథమాచార్యుడు. అంతేకాదు, బసవోదాహరణము అను స్తుతిని వ్రాసి ఉదాహరణకావ్యములకును అతడే ఆదిగురువై కన్పట్టుచున్నాడు. ఈ శతకము ఆంధ్రమునగల ఉత్తమోత్తమ భక్తిశతకములలో నొకటి దీనికి సాటిరాగల శతకము కంచర్ల గోపన్నది మాత్రమని నా యుద్దేశము. మఱియట్టివి ఎన్ని నశించిపోయినవో చెప్పలేము. సోమనాథుడు ద్విపదలు ఎంత ధారాళముగా నడపగలడో వృత్తములను అంత ధారాళముగా నడపగలడని ఈ శతకము ఋజువు చేయును "బసవా! బసవా! బసవా! వృషాధిపా!" అను మకుటము చంపకోత్పలమాల వృత్తములచే సంఘటిత మగునుగాన ఈ శతకమంతయు ఒకే వృత్తమునగాక రెండువృత్తములలో నడచినది

ఈ శతకములో సోమనాథుడు సమాసాంత్యప్రాసలు ముక్తపదగ్రస్తములు మొదలగు శబ్దాలంకారములను ప్రయోగించి పద్యమునకు అర్థగౌరవమే కాకుండ, శబ్ద గాంభీర్యమును కూడ సంపాదించెను.

తజ్ఞ! జితప్రతిజ్ఞ! యుచిత ప్రమథానుగతజ్ఞ! నమ్రదై
వజ్ఞ! కళావిధిజ్ఞ! బలవచ్ఛివ భక్తి మనోజ్ఞ! ధూత శా
స్త్రజ్ఞ! సునాదపూరిత రసజ్ఞ! తృణీకృత పంచయజ్ఞ!స
ర్వజ్ఞ! శరణ్యమయ్య బసవా! బసవా! బసవా! వృషాధిపా!

సురవరమల్ల! మల్లలిత సూత్ర సుధాంబుధిఖేల! ఖేలసం
గరకలకంఠ! కంఠమణి నాయకభీమ భుజంగ! జంగమ
స్థిరతరనాథ! నాధక నిధీకృతరూప! విరూప సమ్మతా
వర! కరుణార్ద్రి! ప్రోవు బసవా! బసవా! బసవా! వృషాధిపా!

శతకమున ఇంచుమించు అర్ధభాగము బసవేశ్వరుని సంబోధనలతో నిండియున్నది. ఆ సంబోధనలలో అర్థ పునరుక్తిగాని శబ్ద పునరుక్తిగాని యుండదు. మరికొన్నింట

బసవేశ్వరుడు జీవితములో చూపిన మహిమలును– జొన్నలు ముత్యములు చేయుట, చల్లలమ్ము గొల్లపడుచు కాలుజారి పడిపోవుచు బసవా! అని ఎలుగెత్తి పిలిచినంత ఆ పిల్లకు దూరమునుండియే చేయూతనిచ్చి నిలవబెట్టుట మొదలగునవి – మరికొందఱి భక్తుల అద్భుత చర్యలును సంగ్రహముగ ప్రశంసింపబడినవి ఇంతమాత్రమే కాదు, కవి యీ తెనుఁగు శతకములో సంస్కృత వాక్యమయమైన పద్యమొకటియు, ద్రావిడ వాక్యమయమైన పద్యమొకటియు, కన్నడ వాక్యమయమైన పద్యమొకటియు, మణిప్రవాళ (మళయాళ) వాక్యమయమైన పద్యమొకటియు, అరెమరాటి (మహారాష్ట్ర భాషాశాఖ) వాక్యమయమైన పద్యమొకటియు, సర్వభాషామయమైన దింకొకటియు రచించి తన బహుభాషా పాండిత్యానికి నిదర్శనముగ ఒక చిత్రప్రదర్శనము చేసెను. ఆ సందర్భముననే యచ్చతెనుఁగు పద్యమొకటి రచించి దానిని జానుఁదెనుఁగనెను

"బలుపొడతోలు సీరయును బాపసరుల్ గిలుపారు కన్ను వె
న్నెల తల సేదుకుత్తుకయు నిండిన వేలుపుటేఱు వల్వపూ
సలుగలతేని లెంకవని జాను దెనుంగున సన్నుతించెదన్
వలపు మదిందలిర్ప బసవా! బసవా! బసవా! వృషాధిపా"!

జానుఁతెనుఁగు సర్వజన సామాన్య భాషయని పండితారాధ్య చరిత్రలో చెప్పినాడు కాని యచ్చ తెనుఁగు సర్వసుబోధముకాదు నన్నెచోడుని ప్రకరణమున ఈ పద్యమునే ఉదాహరించి జానుతెనుఁగు శబ్దచర్చ చేసితిని అది చూడదగును సోమనాథుడు బసవనియెడ తనకుగల ప్రపత్తిని చాటుకొన్న యీ క్రింది పద్యముతో ఈ శతక ప్రశంస ముగింతును

"నా యొడయండ! నా విభుఁడ! నా హృదయేశ్వర! నా మనోరమా!
నా యిలువేల్పు! నా వరుఁడ! నా గురులింగమ! నాదు జంగమా!
నా యధినాథ! నా వరద! నన్నుఁ గృపామతిఁ బ్రోవుమయ్య దే
వా యమి బృందవంద్య! బసవా! బసవా! బసవా! వృషాధిపా!"

**వైదుష్యము:** ఈ కవి వీరశైవమునకు గురుపీఠము. మత ప్రవర్తకుడగు బసవేశ్వరుడు మహాభక్తుడే కాని పండితుడు కాడు. ఆ మతమున చేరిన యితరులు పెక్కుమంది పరాకాష్ఠ ముట్టిన భక్తి తత్పరత కలవారు ఉద్దండులైన ఇతర మత పండితులతో శ్రుతిస్మృతి ప్రమాణ పూర్వకముగా వాదోపవాదములు సలిపి ఆ మతమును సర్వమతాతిశాయిగ ప్రతిష్ఠింపదగిన శక్తి వారిలో ఒక్కరికిని లేదు. జ్ఞానవిజ్ఞానాత్మకమైన శాస్త్ర పాండిత్యమువలె, కేవల భక్త్యావేశము అన్యమత తిరస్కారమునకు పనికి వచ్చునేమోకాని స్వమతస్థాపనకు చాలదు. సర్వశాస్త్ర నిష్ణాతుడు మహాపండితుడునైన సోమనాథుడు ఈ మతమును చేపట్టి దానికి అట్టి కొరత లేకుండచేసెను సంస్కృతమున ఇతడు వ్రాసిన రుద్రభాష్యాది గ్రంథములు ఇతర పండితులకు పర్యాలోచన పాత్రములై వీరశైవమనగా భక్త్యున్మాదము మాత్రమే యనెడి నిందను తొలగించి యుండును ఆ గ్రంథములలో సోమనాథుడు చూపిన శ్రుతిస్మృతి పురాణాగమ విజ్ఞానము వీరశైవ ప్రతిష్ఠకు తగిన శాస్త్రాధారములను కలిగించినదట ఇంతవాఁడు అవలంబించిన మతము శుద్ధ మిధ్యయగునాయని రుద్రదేవుడు మొదలగు రాజులు సయితము అతనిని

మన్నింపసాగిరట కాబట్టి మతమును ప్రవర్తింపజేసినవాడు బసవేశ్వరుడును, దాని స్థితికి కారణమైనవాఁడు సోమనాథుడును అని చెప్పదగును అందుచేతనే కాబోలు వీరశైవులు విశేషించి– కన్నడ దేశమువారు ఈ కవిని అవతార పురుషునిగా నేటికిని అరాధించుచున్నారు సోమనాథుడు పుట్టుకచే ఆరాధ్యుడు, అనగా పండితారాధ్యుని వలె వైదిక శైవమతస్థుడు వర్ణవ్యవస్థను వేదవిహితకర్మలను విడనాడకయే శివుడే పరతత్త్వమను విశ్వాసముగల బ్రాహ్మణుడు ఇతని సోమనాథ భాష్యమున వైదికాచార గర్హణము లేకపోవుటయే గాక తదావశ్యకతకూడ ఉగ్గడింపబడినదట బసవ పురాణము రచించునాటికి ఇతనికి దానిపై తిరస్కార భావము ఏర్పడినది ఆ మధ్యకాలమున ఇతడు వీరశైవము నవలంబించియుండును పండితారాధ్య చరిత్ర రచన నాటికి అది ధృఢమైనట్లు ఊహింపవచ్చును ఎట్లన బసవపురాణమున తన తల్లిదండ్రులపేర్లు చెప్పకొన్నాడు

"భ్రాజిష్ణువగు విష్ణురామి దేవుండు
తేజిష్ణువగు శ్రియాదేవి యమ్మయును
గారవింపగ నొప్ప గాదిలి సుతుఁడ
వీర మాహేశ్వరాచార వ్రతుండ"

పండితారాధ్య చరిత్రమున పితృదేవతా నామోచ్చారణమునైనను చేయక పోవుటయేగాక తన సర్వస్వమును, తానును బసవని అధీనమని చాటుకొన్నాడు.

"ధర నుమా మాతా పితా రుద్రయనఁగ,
వర పురాణోక్తి నీశ్వర కులజుండఁ
బసవని పుత్తెండ బసవ గోత్రుండ
బసవేశు శ్రీపాద పద్మ సేవకుఁడ
బసవనిఁ బొగడఁ బాల్పడు కవీంద్రుండ
బసవన్నఁ బొగడఁ బాల్పడు పారకుండ
బసవన్న దూత నే బసవన్న బంట
బసవన్న యిలుఁ బుట్టు బానిస కొడుక
బసవన్న లెంక నె బసవన్న లెంగి
బసవన్న పన్నల పన్నఁ గావు నను"

**కవిత్వ పరామర్శ:** కవిత్వమును గూర్చి సోమనాథుడు చేసిన ప్రతిజ్ఞలలో ముఖ్యముగా పేర్కొనదగినవి జానుతెనుఁగు సరణి యొకటి అల్పాక్షరముల అనల్పార్థరచన ఇంకొకటి ఈ రెండవది మాట పొదుపు దీనినే పాశ్చాత్యులు Economy of word అని యందురు. సోమనాథుని ఈ ప్రతిజ్ఞలలో జాను తెనుఁగు గూర్చి పూర్వము కొంత చెప్పితిని జానుతెనుఁగెంత ఉన్నదో సంస్కృత భూయిష్ఠమైన కేవల పండిత వేద్యమైన భాషయు అంతయున్నది మఱియు కేవల సాహిత్యపరులకు అందని నిగూఢమైన శ్రుతివాక్యార్థమయ భాషయు అంత ఉన్నది ఆ భాగములన్నియు జాను తెనుఁగనుట పొసగదు. మఱి రెండవ ప్రతిజ్ఞయైన అల్పాక్షరములననల్పార్థ రచనను గురించి – వేమన ఆటవెలది పాదములో వలె– సోమన ఒక ద్విపద పాదములో

విపులమైన అర్థమును ఇమిడ్చి సంగ్రహ వాక్యమును వ్రాయగలడు మితభాషులగు సజ్జనుల వలె మితవాగ్విలాసులగు కవులందరును ఔచిత్యాపేక్షచే ఈ వాక్యధర్మమును పాలింతురు. తెనుఁగు కవులలో కవిత్రయము వారి సరస్వతికి ఈ లక్షణము తిలకాయమానము అయితే సోమనాథుడు మితవాక్యములవలె మితప్రకరణములు వ్రాయలేదు. అల్పాక్షరములు అనగా ఉపలక్షణము వలన అల్ప వాక్యములు అనియు నర్థము చెప్పవలెను. అట్టి వాక్యముల సమూహమే ప్రకరణము. ఆ ప్రకరణముల సమూహమే గ్రంథము. పైసలు పొదుపుచేసి రూపాయలు విరజిమ్మిన సంసారివలె ఇతడు అక్షరములను పొదుపుచేసి ప్రకరణముల వాక్యములను దుర్వ్యయము చేయుచుండును భావమును నిగ్రహించుకొనలేక అతిచాలనము చేయు కవుల రచనలు అధిక ప్రసంగములయి ఔచిత్యమును కోల్పోవును. ఈ దుస్థితి సోమనాథుని గ్రంథములకు పట్టినది ఈతని ద్విపద వాక్యములు రెండింటిలో ఈ అధిక ప్రసంగములను అతడు చాలవరకు సంగ్రహపరచి యుండినచో అర్థహాని కలుగకుండగనే గ్రంథములు అధిక సమాదరణీయము లయ్యెడివి

పండితార్థ మేమనగా – కావ్యశిల్ప ధర్మములనుబట్టి చూచినచో ఈతని రచన అతిప్రసంగమయము అని చెప్పవచ్చును

కవిత్వమునకు భావావేశము జీవగఱ్ఱ ఈతని కవిత్వమునకు అదియే పంచప్రాణ సారభూతమై యున్నది. మతమున భక్త్యావిష్టుడు గనుకను, కావ్యేతి వృత్తమంతయు శివభక్తి పరము గనుకను భావావేశమతావేశములు ఒండొంటికి తోడై పరస్పర పోషకములైనవి. ఏ కథ చెప్పినను శైవచిహ్నము వర్ణించినను భక్తిప్రవాహమున ఓలలాడుచు శివమెక్కిన గణాచారివలె గంతులు వేయును. శాంతముగాగాని చప్పగాగాని అతని నోటివెంట ఒక మాటయు వెలువడదు. శివపరమగు నేచిన్న కథ వ్రాసినను శివాలెత్తి వ్రాయునేగాని కన్నుదెరచి వ్రాయడు

నిదానించి ఆలోచించి తూచివ్రాసిన వాక్యమొక్కటియు నుండదు చిత్త పరవశ స్థితిలో హృదయమున పొంగి పొరలెడి భావములను నోట పలుకునుగాని ప్రయత్న పూర్వకముగా వాక్యమును వ్రాయడు ప్రయత్నరాహిత్యమెంతయున్నదో శ్రద్ధారాహిత్యమును అంతయున్నది

ఈ భావావేశమునకు నెచ్చెలియు సహజ ప్రజ్ఞకు రెండవ ముఖమును అగు భావనాశక్తి ఈ కవితలో అతినిశితముగా నున్నది. ఏ పదార్థమును ఏ సందర్భమును వర్ణింపదలచునో దానిని తన నిశిత భావనతో మనోనేత్రమునకు ప్రత్యక్షము చేసికొని, ఆ సాక్షాద్దర్శనమును వాస్తవికతకు న్యూనాధికతలు లేకుండ యథాతథముగ చిత్రింపగలడు. ఈ రెండు గుణముల వలన అతని రచన వర్షాకాలపు నదివోలె దరులు ఒరసికొని వెల్లివిరియునే కాని గ్రీష్మప్రవాహము వలె సన్నగిల్లుట కాని, శరన్నదివలె ప్రశాంతగంభీరముగా నడచుటగాని ఉండదు. ఆ వర్ణనలు చదువునపుడు ఆ మూర్తులు పాఠకునకు ప్రత్యక్ష దర్శన మొసగుచుండును ఇది స్వభావ కవులకు సర్వ సాధారణమైన లక్షణము. స్వభావప్రదర్శనము వలన మనస్సునకు ఇంపు కలిగే మాట నిజమేకాని, కవిత్వధర్మము మనస్సునకు ఇంపు నింపుటయు వాస్తవిక లోకమును ప్రదర్శించుటయు మాత్రమేకాదు మనస్సునకు ఇంపుతో పాటు చిత్తమునకు

పెంపుకూడ కలిగించినపుడే కవిత్వము శిల్పమగును కాని యెడల ఛాయాగ్రహణ మగును Photography. సోమనాథుని రచనలలో ఛాయాచిత్రములు ఎక్కువగాను, శిల్పచిత్రములు తక్కువగాను ఉండును తల్లి శిశువునకు ఉగ్గుపెట్టి, నీళ్ళుపోసి, తొట్టిలోపెట్టి, ఊచి, నిద్రపుచ్చి, అల్లారు ముద్దుగా పెంచెడి లోకధర్మమును ఇతడు ఎంత యథాతథముగ వర్ణించెనో చూడుడు.

"అనయంబు బెజ్జ మహాదేవి దాన జననియై పరమేశుఁ దనయుఁ గావించి
జననియై పరమేశుఁ దనయుఁ గావించి
తొంగిళ్ళపై నిడి లింగమూర్తికిని
నంగన గావించు నభ్యంజనంబు
ముక్కొత్తుఁ జెక్కొత్తు ముక్కున్నుఁ బులుము
నక్కొత్తుఁ గడుపొత్తునట వీఁపు నివురుఁ
బెరుఁగంగ వలెనని తరుణి వీద్వడఁగఁ
జరణము ల్కరములుఁ జాఁగంగఁ దిగుచు
నలుఁగులు నలుచు నర్మిలి గట్టిపెట్టి
జలములు వీఁపునఁ జఱచు నంతంత
వెగచి బెగడకుండ వెన్ను వ్రేయుచును
నొగి మస్తకమున నీ రొత్తు దోయిటను
వదనంబు నొచ్చునో యుదకంబు లనుచు
నదుముఁ బొట్టను నోరి కడ్డంబు పట్టుఁ
జెన్నుగాఁ బసుపార్చి చేయు మజ్జనము
గన్నులుఁ జెవులును గాఁడంగ నూఁదు
నంగిటిముల్లొత్తు నందంద వ్రేలఁ
దొంగిళ్ళఁగా ర్నీరుదోనెత్తి మిడుచు
బడఁతిచే నీరఁ దూపొడిచి బొట్టిడును
మడఁతి యంగుష్ఠంబు మన్నింత మెదిచి
కడవ నంటినయట్టి పిడుక విభూతి
యడరఁ బుత్రుని నొస లారంగఁ బూయు
నెత్తు గ్రుంగెడునని యెత్తంగ వెఱచి
యత్తన్వి ఱొమ్మున నక్కున నదుము
గాటుక యిడ నింత గన్నగు ననుచుఁ
గాటుక యిడు మూఁడు గన్నులఁ గలయఁ
జన్నిచ్చుఁ బక్షుల జననీదు మీఁద
నన్నాతి గొండొక వెన్నయుఁ బెట్టుఁ
జెక్కలి గీఁటుఁడుఁ జెలఁగి యేద్వంగ
నొక్క వేలిడిపోయు నొక కొన్ని వాలు
ఉగ్గులు వోసియు నువిద సంప్రీతి
నగ్గించు నొగియించు నట బుజ్జగించు

ముద్దాడు నగియించు ముద్దులు వేడుఁ
నద్దికొన్ వీరెవ్వరయ్యరో యనుచుఁ
బన్నుగా నుదరంబుఁ బాన్పుగాఁ జేసి
కున్న జోసఱచుచు సన్నుతిఁ బాఁడు!"

ఇంకొక యుదాహరణ చూడుడు.–

బసవేశ్వరుడు వడ్డించిన విషమును శివభక్తులు విందారగించుట.

"మారారి కర్పించి మహనీయ లీలఁ
జిందక క్రోలుము సిక్కయ్యదేవ!
సందడి సేయకు సంగయ్యదేవ!
తెచ్చెదఁ జుమ్మయ్య త్రిపురారి దేవ!
విచ్చేసి కూర్చుండు విమలాత్మ దేవ!
కాలకంఠయ్యకుఁ జాలదు లెండు
చాలుఁబోనీకు సిరాళ దేవయ్య!
వేగమింతేలయ్య విరుపాక్షదేవ!
యీ గరిటెఁడుజాలు భోగయ్య కింకఁ
జాలదో తెత్తునా శంకరాచార్య!
గొనితెచ్చి వడ్డింప గ్రోలుచు భక్త
జనులఁ దోతెండంచు ననురాగ లీల
శివున కర్పింపుచు శివశివ! యనుచు
నవధాన వంతులై యారగింపుచును
జుఱ్ఱుజుఱ్ఱునఁ గొని సొగయుచు గఱ్ఱు
గఱ్ఱునఁ ద్రేన్చుచుఁ గాళ్ళు సాఁచుచును
నిక్కుచు నీల్గుచు నక్కిలింపుచును
జొక్కుచు సోలుచుఁ జక్కిలింపుచును
నక్కిలిపడి తెప్పలల్ల మోడ్చుచును
గ్రుక్కిళ్ళు మ్రింగుచుఁ గుత్తుక బంటిఁ
గ్రోలుచు నలరుచుఁ గ్రాలుచు నాత్మ
సోలుచు సుఖవార్ధిఁ దేలుచు వేడ్క
వ్రాలుచు మెఱయుచు వక్షంబులందు
నోలిఁ బళ్ళెరము దిక్కొయ్యన మరలి
చూచుచు నించుకించుక పుచ్చి కొనుచు
లేచుచుఁ జెలఁగుచు లీలఁదలిర్ప
నాడుచుఁ గప్పెర లరచేత నొలయఁ
బాడుచు నుఱుకుచుఁ బరువు వెట్టుచును"

---

* ఈ విందారగింపు 120 పంక్తులలో వర్ణింపబడినది.

ఈ వర్ణన ఎంత ముచ్చట గొలుపుచున్నను విసుగుదలను కూడ కలిగింపక మానదు.

అసలే ద్విపద కావ్యము విసుగుపుట్టించు గుణము కలది అతిమాత్రములైన యితని అతిస్వాభావిక వర్ణనవల్ల అవిసుగుదలయే గాక వేసటయు కలుగును. రౌతువశము దప్పిన అశ్వము, నేలమీద కాలుమోపక ఎగిరి దౌడు తీయుటతో ఈతని కావ్య గమనమును పోల్చవచ్చును ఎంత ప్రయత్నించియు ఆ పరుగును ఈతడు నిలుపలేడు ఈతని యనావశ్యకములు ననుచితములు నయిన వాక్యములకు, వర్ణనలకు, కథాంశములకు ఈ యవశత్వమే కారణము అదియే యీతని మహా కవిత్వమునకు కళంకమైనది

మతములోవలెనే భాషా ప్రయోగములో కూడ ఈతడు అతి స్వతంత్ర వర్తన కలవాఁడు. సబిందు నిర్బిందుప్రాసము, వైరి సమాసము, క్త్వార్థక ఇకార సంధి, శాంతప్రాసము మొదలైన లక్షణ విరుద్ధ ప్రయోగములు ఈతని రచనలో కుప్పతిప్పలుగా కానవచ్చును. ఇవి శివకవులందరకును సాధారణ సంప్రదాయమని కొందరందురుగాని ఆ పాపమును ఉమ్మడిగా వారందరికి అంట గట్టుటకంటె తమనాటి వ్యావహారిక భాషకు అతి దూరముగ తొలగి పోకుండ కావ్యములు వ్రాసిన ద్విపద కవులలో పెక్కుమంది లక్షణమే అది అనుకొనుట మంచిదని నా అభిప్రాయము విశేషించి ఇతనికి నన్నెచోడునకును ప్రాతపడిన మాటలు వాడుట అలవాటు.

మరియు అలాక్షణికములైన ప్రయోగములు సోమనాథుని వృషాధిప శతకమున లేవు. కావున ద్విపద రచనలోనే అతడు వ్యావహారిక భాషాచ్ఛాయలు గల ప్రయోగములను చేసెనని తలంప వచ్చును.

**గ్రంథ ప్రచారము:** బసవ పురాణ పండితారాధ్య చరిత్రములు రెండింటికిని కన్నడమునను తెలుఁగునను చాల ప్రతిబింబములు పుట్టినవి తెలుగులో మొదటఁ బండిత చరితను పద్యకావ్యముగ వ్రాసినవాఁడు శ్రీనాథుడు. ఆ గ్రంథమిప్పుడు కానరాదు. శ్రీనాథ యుగములోని వాడేయగు పిడుపర్తి సోమన బసవపురాణమును పద్య ప్రబంధముగ వ్రాసెను అర్వాచీనులలో తుమ్మలపల్లినాగభూషణకవియు మహాదేవారాధ్యుడును బసవపురాణమును పద్య కావ్యములుగ వ్రాసిరి గాని వారి గ్రంథములు ప్రచారములోనికి రాలేదు కందుకూరివారు తమ ప్రాపున బసవపు రాణము సంస్కృతమున వ్రాయించిరి ప్రాయికముగ సంస్కృత గ్రంథములు తెలుఁగగుటే కాని తెనుఁగు గ్రంథములు సంస్కృతమగుట కానము ఈ గౌరవము దక్కించుకొన్న గ్రంథములు మన వాఙ్మయమున బసవ పురాణము, వసుచరిత్ర, రఘునాథ రామాయణము మాత్రమే! కన్నడమున బసవ పురాణమును భీమకవి యథామాతృకముగా అనువదించెను ఈ యితివృత్తమునే యథేచ్ఛగా రాఘవాంకుఁడను కన్నడ కవి వృషభేంద్రవిజయమను పేర ఇంకొక గ్రంథము వ్రాసెను.

ఇన్ని భాషలలోనికి ఇన్ని రూపములుగా పరివర్తన మొందినను ఈ గ్రంథములకుఁ దెనుగుఁనాట ప్రశస్తిరాలేదు దీనికి కారణము లివి – ఇవి ప్రత్యేక మతపరములైన గ్రంథములగుట, అందును బహుసంఖ్యాకుల మనస్సు నొప్పించు పరమత దూషణము బహుళముగా కలవియగుట ఇంకొకటి సహజముగా సంప్రదాయ విధేయమైన

ఆంధ్రజాతి యితని భాషాస్వాతంత్ర్యమును మెచ్చి యుండక పోవుట ఈ కారణములచే నతని గ్రంథము లనాదృతములయినవి

లోపములమాట యటుంచి గుణములనే పరిగణించినచో పూర్వ ప్రకరణములలో చెప్పినట్లు ఇతడు పదకవిత్వమునకు సారస్వత గౌరవము సంపాదించిన ప్రథమాచార్యుడు అని నిస్సంశయముగ చెప్పదగును. ఒకవంక దేశీయతను, వేరొకవంక పాండిత్యమును మన్నించుచు ఉభయతారకమైన రచనలు చేసినవారిలో ఇతడగ్రగణ్యుడు

అయినను భాషాతత్త్వ పరిశోధనలను చేయువారును వాఙ్మయచరిత్రలు వ్రాయు వారును తప్ప తక్కిన శైవేతరులు ఈతని గ్రంథములను నేటికిని ప్రీతితో చదువరు. ఎట్టి శిరోభారమునైనను సహింపగల పరిశోధకులు సయితము ఈ గ్రంథములను ఆస్థతో తుదముట్ట చదువుట దుర్ఘటము

## శైవ శాఖలు

ఈ శాఖల స్వరూపమెట్టిదో, మత స్వరూపమెట్టిదో మనము గుర్తించుట యీ యుగమున ప్రస్తావింపబడిన ముగ్గురు శివకవుల గ్రంథములబట్టియే కాని మత గ్రంథముల బట్టికాదు సారస్వత పరిశీలకులకు గల హక్కు అంత మాత్రమే ఈ శాఖల కన్నిటికి సమాన ధర్మము శివపారమ్యము (శివుడే పరముడనుట) కాని, వ్యవహారములందును, ధర్మాచరణమునందును వారి కేక వాక్యత లేదు అందు.

**కాలాముఖులు:-** (1) మఠాధిపతి ఆజన్మ బ్రహ్మచారిగా నుండవలెను నన్నిచోడఁడాశ్వాసాద్యంత పద్యములలో మఠాధిపతియైన కృతిపతి యొక్క బ్రహ్మచర్య వ్రతమును మిక్కిలిగ నొత్తి చెప్పెను

(2) వీరికి శివారాధనముతోఁ బాటు శక్త్యారాధనము కలదు కుమార సంభవమున శివశక్త్యభేదము ప్రతిపాదింపబడినది

సీ॥ జ్ఞానస్వరూపుడై సర్వాత్ముఁడున్నఁడా
జ్ఞేయ స్వరూపయై నెఱసియుండుఁ
బురుషస్వరూపుడై పరమేశుఁడున్నఁడాఁ
బ్రకృతి స్వరూపమై పరగుచుండు
సూక్ష్మ స్వరూపమై శుద్ధాత్ముఁడున్నఁడా
స్థూల స్వరూపమై తోఁచియుండు
నర్థస్వరూపుడై యమలాత్ముఁడున్నఁడా
శబ్ద స్వరూపమై జరుగుచుండు
హరుఁడు రుద్రరూపమై యున్నఁడా నుమా
మూర్తిదాల్చి లోకములకు హితము
సేయుచుండుఁగాన శివభక్తి భేదంబు
లెఱుఁగ నీకు జడున కెంతలావు

హిమవంతుడు మేనకయు బిడ్డల కొఱకు శక్తి నారాధింతురు

కం॥ "వారిరువురు సద్విధి శ
క్త్యారాధన చేసి రతిశయ స్థిరభక్తిన్
కోరిక వదలక తమ కడు
పార సతీదేవి కూఁతురై జన్మింపన్"

శాక్తేయులలో కొందరకు హింసాపరమైన ధర్మమున్నది. కాలాముఖుల కదిలేదు నన్నిచోడుఁడు కృతిపతియొక్క యహింసావ్రతము నతి మాత్రముగఁ జెప్పినాడు

(3) వివాహాది శుభకార్యములలో కాపోలు మధుపాన గోష్ఠి పూర్వకమైన మండలార్చనయను తంతుగలదు. పార్వతీ వివాహ సందర్భమున నది వర్ణింపబడినది.

"... ..అంతనంద కొందఱు మధుపానగోష్ఠికిం జొచ్చి మండలార్చన దీర్చి మూలజ వృక్షజ గరుడ మధుపిష్టకుసుమ వికారంబులగు సుగంధాసవంబులు గనక మణిమయానేక కనక భషకాదులన్నించి హర్షించి."

"అమరులు ద్రావుచో నమృత మందురు దీని నహీవ్రజం బజ
స్రమముగొని యానుచో నిది రసాయనమందురు భూసురౌఘ మా
గనిధి సోమపానమనికైకొని యానుదు రెందుఁ జక్రియా
గము నెడ వస్తువందురిది కౌశికు లీసురపేర్మి వింతయే"

"సురలకు దీనన యజరా
మరమయ్యెంగాక యమృత మధనమునకు ము
న్నెరియరె తెరలరె మృతిఁబొం
దరె యని సురపొగడి పొగడి తరుణులు ప్రీతిన్."

"అని యనేకవిధ మాంసోపదంశకంబు లాస్వాదించుచు మనోహ్వార్ద్యంబులగు మద్యరసంబులు సద్యంబ సిద్ధరసంబునుంబోలె శరీరంబులం గలయనూల్కొని ..."

(4) వీరు వర్ణవ్యవస్థ నంగీకరింతురు. కృతిపతి బ్రాహ్మణత్వమొక విశేషముగ మాటిమాటికి నిందుఁజెప్పఁ బడినది. వర్ణరాహిత్యమొక దోషముగ ఈ క్రింది పద్యమున చెప్పబడినది

"కం॥ నుత వర్ణాంతర నిమ్నో
న్నతతల నిఖిలో చ్చ నీచనానావస్తు
స్థితి సమము జేసె గత గౌ
రతఁజీఁకటి దుర్వివేకి రాజ్యము పోలెన్"

"కులజుఁడై నిక్రమ బలవంతుడగు రాజు
బడసిన దేశంబు ప్రజయుబోలె"

(5) ఇతర దైవతములను శివాంగభవు లందురు. అంతేకాని, తద్దూషణము చేయరు. నన్నెచోడుడు ఈ కాలాముఖమతమువాఁడు కుమారసంభవము నుండి తెలియదగినంత వరకు కాలాముఖ స్వరూపమిది.

**పాశుపతము:** శివతత్త్వ సారమునుబట్టి తెలియవచ్చి నంతవరకు ఇది పండితారాధ్యుని మతము.

(1) పిపీలికాది బ్రహ్మ పర్యంతము సమస్త జీవులు పశువులు సంసార బంధ మీ పశువులఁ గట్టివైచిన పాశము ఈ పశురాశికిఁబతి, యీ పాశమును సడలింపగల దక్షుడు శివుఁడు. అందుచే అయన పశుపతి అయనను పరదైవతముగా సేవించువారు పాశుపతులు.

(2) వైదికములైన భక్తిజ్ఞాన కర్మములనెడి మార్గత్రయములో వీరికి భక్తియందు మక్కువ యెక్కువ. కర్మము విసర్జింపరు; జ్ఞానమును తిరస్కరింపరు; కాని భక్తికిచ్చిన ప్రాముఖ్య మీరెంటికి నీయరు జ్ఞాన సముపార్జన లేకయే కేవల భక్తి పారవశ్యమున సిద్ధిపొందిన మహనీయులను శివతత్త్వసారము పెక్కుచోట్ల కొనియాడుచుండును వీరిది వైదిక శైవము అనవచ్చును. కాని వైదికులైన అద్వైతులను తీక్ష్ణముగ విమర్శింతురు అద్వైతమున "ఏకమేవా ద్వితీయం బ్రహ్మ," "తత్త్వమసి" అనెడి ఉపనిషద్వచనానుసారముగ బ్రహ్మముతప్ప తక్కినదంతయు 'అసత్' అనియు జీవునకును బ్రహ్మమునకును భేదము లేదనియు సిద్ధాంతీకరింపబడినది ఇక వైదికశైవమున జీవేశ్వరులకు ఐక్యమంగీకరింపబడదు అదిగాక నిత్య సత్య పదార్థమైన ఆ పరబ్రహ్మమును శివస్వరూపమనియు వక్కాణింతురు అద్వైతులవలె వీరికి సన్యాసాశ్రమము లేదు అద్వైతులును శివపూజాపరులేగాని శివకేశవ భేదమును పాటింపరు.

> "శివాయ విష్ణురూపాయ శివరూపాయ విష్ణవే
> శివస్యహృదయం విష్ణుః విష్ణోశ్చహృదయగ్ం శివః"

అద్వైతులకు యిది పరమ లక్ష్యము. వైదిక శైవులకు కేశవనామస్మరణమే పవికిరాదు.

(3) కాలాముఖులవలె వీరును వర్ణ వ్యవస్థ నంగీకరించువారే శక్త్యారాధనము వీరి కర్మాచరణమున నున్నట్లు కానరాదు కాలాముఖులవలె వర్ణవ్యవస్థ నంగీకరించుచు వీరశైవులవలె సర్వసమమైన భక్తి నుద్బోధించుచు, తాము వర్ణము నంగీకరించియు, దానిని నిర్మూలించిన బసవని కొనియాడుచు ఆన్నింటి పాశుపతులేవంకకు మొగ్గలేక సమన్వయము కొఱకో, నిరపాయస్థితి కొఱకో మధ్యమార్గమును ద్రొక్కినట్లు కానబడును. వీరు సామరస్యమునకు యత్నించి రనుటకు దృష్టాంతమే

> "భక్తిమీఁది వలపు బ్రాహ్మ్యంబుతోఁ బొత్తుఁ
> బాయలేను నేను బసవలింగ"

అని పండితుఁడు పలికిన వాక్యము. సూత్రప్రాయమైన యీ వాక్యమే పాశుపతుల మతస్వరూపము

(4) ఇతర మతములను, అందును అద్వైతమును నిందించుట యొక గొప్పగాఁ బరిగణించిరి.

(5) శివదూషకుల హింసింపవచ్చును ఆ కారణమున తామును చావవచ్చును

> "శివనిందారతుఁ జంపిన
> జవమఱి తత్కారణమునఁ జచ్చిన నీరెం
> డు విధంబుల నీ కారు
> ణ్యవశంబున ముక్తిఁబొందు నరుఁడీశానా." (శివతత్త్వ)

ఈ ఆచారము వీరశైవమునకు దగ్గరగాని, కాలాముఖమునకు దగ్గఱ కాదు.

(6) అట్లే, అశైవుల దర్శన స్పర్శనాదులు కూడ నిషిద్ధములు

*కం॥ "కాదప్పు గొనఁగ, నప్పీఁ*
*గా దీఁగొనఁ గాదుఁగాదు కనఁ దమలో నా*
*హ్లాదమునఁబలుకఁగాదు మ*
*హాదేవ పరాఙ్ముఖాత్ములగు పతితులతోన్"*

**వీరశైవము:** పాలకురికి సోమనాధుడు ఈ మతస్థుడు సంప్రదాయకమైన శైవమునకు నూతన సంస్కారరూపమే ఈ వీరశైవము వీరికి వర్ణాశ్రమ ధర్మములు లేవు ఆ వ్యవస్థ ననుసరించియున్న కర్మలు లేవు వర్ణవ్యవస్థ తుడిచివేయబడుట వలన ప్రజలలో న్యూనాధిక్యములుపోయి నూతనోత్సాహము సౌజన్యము వెల్లివిరిసినవి ఉత్సాహజన్యమైన ఈ వెల్లువచే శైవశాఖ లన్నియు ముంపబడి వరద వొడెచిన చేలవలె నూత్నఫలప్రదములుగాదొడంగెను ఇతడు కత్తిచేతబట్టి వీరశైవమును బోధించెను ఇతని కత్తి లింగప్పసాయకము ఇతని యుపదేశము కార్చిచ్చు వలె దేశమున వ్యాపించెను భక్తిమార్గము వీరి మతమునకుఁ బ్రాణసారము, లింగధారణము ప్రశస్తమైన శైవచిహ్నము. లింగార్చనతోఁబాటు జంగమార్చన కూడ విహితమైన ధర్మము స్వమతరక్షణార్థమై హింసకు పూనినను వీరికి దొసగుకాదు వేదవిహిత కర్మను నిరసించినను వారు కేవల కర్మరహితులు కారు నిజ మతానుసారముగా చేయదగిన నిత్యనైమిత్తిక కర్మలు వారికిని కలవు భవిజనుల దర్శన స్పర్శనాదులను బరిహరించుటలోఁ బాశుపతులు కూడ వీరికి జాలరు

*"సంభావితుఁడ భవిజన సమాదరణ*
*సంభాషణాది సంసర్గదూరగుఁడ"* (బసవపురాణము)

*"భవికృతారంభ సంభవధాన్యనిచయ*
*భవి నిరీక్షణ రస పాకవితాన*
*భవిహస్తగత ఫలపత్త్రశాకాది*
*భవి గృహక్షేత్రాది పథవర్జితుండ*
*భవి జన దర్శనస్పర్శ నాలాప*
*వివిధ దానాదాన విషయదూరగుఁడ"* (పండితా చ.)

పై వాక్యములు పాల్కురికిసోమనాధుని భవిజన ప్రాతికూల్యనిరూపక ప్రతిజ్ఞలు.

**శివకవి యుగములోని ఇతర కవులు:** శివకవి యుగమున జేర్పబడిన కవులలో ఏ కవియును గూర్చియు ఆతడాకాలమునకు చెందినవాడని నిష్కర్షగా చెప్పుటకు గ్రంధస్థాధారములు లేవు. కాని కొందరి పేళ్లు ఊహించుటకు మాత్రమవకాశములు కలవు.

**1. ప్రతాపరుద్రుడు:** ఇతడు సోమనాధుని గౌరవించినట్లున్నది. ఇతడు 1133 నుండి **1198** వరకు ఓరుగల్లును బాలించెను ఈతడు నీతిసారమను గ్రంధమును రచించెనని మానవల్లి రామకృష్ణకవి గారి ఊహ అది కానరాదు సకలనీతి సమ్మతమని మడికి సింగన (1500) రచించిన నీతిశాస్త్రములో దీనిలోని కొన్ని పద్యములు కలవు.

**చక్రపాణి రంగన:** ఈ కవిని గురించిన వివరములు తిక్కన యుగము నందు ప్రస్తావించబడినవి.

**శివకవులలోని సాధారణ ధర్మములు:**

1 శివేతరేతివృత్తము నేశివకవియు కావ్యవస్తువుగా గైకొనడు

2 వారి జీవితములతోపాటు కవిత్వమును శివార్పిత మొనర్చిరి

3 మతమునకు కవిత్వమునకు ఇంత సన్నిహిత సంబంధమును కలిగించిన జాతి మరియొకటి లేదు కవిత్వముచే మతమునకు ఊడిగము చేయించిరి

4 భవి కవులలో నెంతటి సమర్థునైనను స్మరింపరు. అనుకరణయోగ్యుడు కాకపోయిన శివకవి నెంత యల్పునైన అనుకరింతురు భవిజనదర్శన స్పర్శనాదుల వీరు పరిహరించిరి. ఇతర సంఘములు కూడా వీరి నంత తీవ్రముగా పరిహరించిరి వీరి కవిత యందలి పాక్షిక . మత దృష్టియు, అతిమాత్రమగు పరమతనింద సార్వజనీనముగాని కవితావస్తువు దీనికి కారణములు భారతము, ఆముక్తమాల్యద మొదలైనవి. మతోద్ధరణకై వ్రాయబడినను అందు మతవిషయములు అలవోకగా తడివినట్లుండునే కాని శైవ గ్రంథముల యందున్నంత ప్రాధాన్యము కానరాదు అందు కవిత్వము ప్రాధానము. మతము గౌణము. కావ్యమెప్పుడును పరిమిత ప్రయోజనమునకు గాదు.

5. భాషాప్రయోగములో చాల స్వతంత్రులై వేరుమార్గములను తొక్కినారు ఛందో వ్యాకరణాది నియమోల్లంఘనకు వీరు వెనుదీయరు.

6. జానుతెనుగు, దేశిరచన అను దేశీయ సంప్రదాయాభిమానమును కలిగించినది వీరే. ద్విపద కవనమునకు పాల్కురికి సోమన ప్రథమాచార్యుడు మత ప్రచారమునకై జైనులు, బౌద్ధులు వేదాంతవిషయములను జనసామాన్యమునకై ప్రాకృతమున చెప్పిరి. శైవకవులు వేదాంతార్థమును దేశితెనుగున చెప్పి, పామరజన ప్రయోజనము నొడగూర్చిరి.

7. తన గానకళా ప్రభావముచేత అన్యరాష్ట్రీయులచే కూడా తెనుగు పాటలను పాడించిన త్యాగయ్య వలె శివకవులు ఆంధ్రకవిత్వమును అన్యరాష్ట్రీయులచే చదివించినారు కారణము శైవమతమునకు అయువుపట్టులగు శైవగ్రంథములు తెనుగునందు వీరు రచించుటయే

★ ★ ★

# తిక్కన యుగము
# (1225-1320)

**రాజకీయ పరిస్థితి:**

ఆంధ్రదేశమును పరిపాలించిన చాళుక్యులుగాని చోళులుగాని ఆంధ్రులేయని మనము సరిపెట్టుకొన్నను, ఆ రాజులు మేమాంధ్రులమేయని చెప్పుకొన్నను, నిజమునకు వారు పరదేశీయులే కాని ఆంధ్రులు కారు అయినను, మన దేశములో స్థిరపడి, ప్రజలతో తాదాత్మ్యము కల్పించుకొని, పరుల మనెడి మెరమెరలేకుండ, తెలుగుదేశమే కాణాచిగా జేసికొని రాజ్యమేలిన వారగుటచేత ప్రజలకు వారియెడను, వారికి ప్రజలయెడను అభేదభావము వర్ధిల్లెను. అయినప్పటికి యధార్థమైన తెలుగు సామ్రాజ్యము కాకతీయ పరిపాలనతో ఏర్పడెనని చెప్పవలెను కాకతీయులు తెలుఁగుదేశ ప్రజలలో బహుసంఖ్యాకులైన చతుర్థ కులమునకు చెందినవారు ఆనాడు చతుర్థ కులజులలో రెడ్డి, కమ్మ, కాపు మొదలగు శాఖాంతరములు నేటివలె పొత్తులేని వర్గములుగా స్థిరపడలేదు శూద్రులలో ఉత్తమ కులజులు అనిపించుకొన్న వర్గముల వారందరు విద్యా వివేక సంపన్నులై తమలోతామేకాక క్షత్రియులతో కూడ వివాహాది సంబంధములు చేయుచు సచ్ఛూద్రులు అను పేర ప్రసిద్ధికెక్కిరి ఆంధ్రప్రజలలో వీరి సంఖ్యయే బహుళము. ఈ కులజులే కాకతీయరాజులు

వీరికి దేశమెల్లెడల సంపన్నులగు భూస్వాములు బంధువులైయుండిరి ఆ రాజవంశమునెడ ఆ సంపన్నులకును వారి నాశ్రయించియుండు ఇతర ప్రజలకునుగల బాంధవాభిమానము ప్రజలకు రాజ్యమునెడ మమత్వమును పెంపొందించియుండును పుట్టుకచే చుట్టరికముచే తమవారైన దొరలగు కాకతీయుల సామ్రాజ్యమే ప్రజలు మాదియనుకొన్న సామ్రాజ్యము కాబట్టి యధార్థమైన ఆంధ్ర సామ్రాజ్యము తొల్లింటి శాతవాహనుల తరువాత మరల కాకతీయులనాడే ఏర్పడెను. ఏ సామ్రాజ్యమైనను సుస్థిరము కావలయునన్నచో ప్రజాసమూహమునకు సింహాసనమునెడ భయముకంటె, ఎక్కువ భక్తి యుండవలెను. ఆ భక్తి ఆదరపూర్వకమును అభిమానపూర్వకమును అయినచో ఆ రాజు పరిపాలనము సుకరమును, ప్రజాజీవితము భద్రమును అగును కాకతీయులలో గణపతిదేవ చక్రవర్తి అటువంటి భాగ్యము కలిగినది అయినప్పటికిని ఆ రాజు ఎంత ప్రజారంజకుడైనను తత్పూర్వము చిన్న చిన్న మండలములను స్వతంత్రముగా ఏలుకొనుచుండిన రాజులు–కులమువారైనను సరే – తమ స్వతంత్రతను కోల్పోవుటకు ఇచ్ఛగింపక సామ్రాజ్య స్థాపనకు అటంకములు కలిగించుచుండిరి. అనగా వారు కాకతీయసింహాసనమునకు సామంతులగుట కంగీకరింపక విడివిడిగాగాని

పొత్తులుకలిసిగాని ప్రతిఘటించుచుండిరి దానికి తోడు దక్షిణమున పాండ్యులును, పడమట యాదవులును, ఉత్తరమున ఉత్కళులును అదను దొరకినపుడెల్ల సమీపస్థులగు కాకతీయ సామంతులను చీలదీసి సామ్రాజ్య ధిక్కారులను చేయుటయు, లేదా తామే వారి నణగద్రొక్కి ఆ భూభాగమును తామాక్రమించుకొనుటయు మొదలగు శత్రుకృత్యములు చేయుచుండిరి ఇట్టి సంకటస్థితిలో బహుముఖ సమర్థుడైన గణపతి చక్రవర్తి తన రాజనీతి ధౌరంధర్యమును ప్రయోగించి గడిదేశముల దుర్గములను గట్టిపరచి సామంతులకు విశ్వాసపాత్రుడై ఆంధ్ర సామ్రాజ్యమును సురక్షితముగను, ఆంధ్ర ప్రజా జీవితమును సౌఖ్యవంతముగను చేయబూనుకొని చాలవరకు కృతార్థుడయ్యెను ఈ మహాప్రయత్నములో చక్రవర్తికి తోడ్పడిన ముఖ్య సామంతుడు నెల్లూరి చోడ తిక్కరాజు తరువాత అతని కుమారుడైన మనుమసిద్ధి కూడ గణపతిదేవుని ఉద్యమమునకు తోడ్పడుచు ఆ చక్రవర్తి సాయమును పొందుచు చిరకాలము దక్షిణదిశ నుండి వచ్చు పాండ్యుల బెడదను నివారింపగల్గెను మరియు ఆ మనుమసిద్ధియే యువరాజుగనున్న కాలములోనే – గణపతిదేవుని పంపున ఉత్తరదిశకు సేనలతో తరలిపోయి ఉత్కళులను జయించి దక్షిణ కళింగమును ఆంధ్ర సామ్రాజ్యమునకు ఉత్తరపుటెల్లగా స్థిరపరచెను ఓరుగంటికి నెల్లూరికిని కలిగిన ఇట్టి అనుబంధ సంఘటనకు ఆ రెండు రాజ్యముల మంత్రుల దూరదృష్టి పూర్వకమైన రాజనీతి ప్రధాన చోదకమై యుండును మంత్రి చెప్పిన హితమును పాటింపలేని రాజు రాజ్యమును చేయలేడు ప్రజాహితమును కోరని మంత్రి మంత్రిత్వమును చేయలేడు నెల్లూరు రాజులకు అట్టి హితమును గఱపి రాజ్యమును నడపిన మహామంత్రులు మంత్రి భాస్కరుని పుత్రులును, పౌత్రులును తిక్కరాజు నొద్ద సిద్ధన్న మంత్రియు (ఖడ్గతిక్కన తండ్రి), మనుమసిద్ధి నొద్ద కవి తిక్కనయు మంత్రులుగా నుండి సామ్రాజ్య క్షేమమును, తమ రాజుల శ్రేయస్సును పెక్కు విధముల కాపాడిరి

గణపతిదేవుని తరువాత సింహాసన మధిష్ఠించిన రుద్రమదేవి కాలములో స్త్రీ పరిపాలనమును సహింపని సామంతులు కొందరు మరల తిరుగుబాట్లకు గడంగిరి ఆ అదను చూచుకొని పరదేశీయులైన శత్రురాజులు మరల దండయాత్రలు సాగించిరి అయినను రాజ్యపరిపాలనమందేకాక వీరవిహారమందును తండ్రి చేత సుశిక్షితురాలైన ఆ కుమార్తె తండ్రివలెనే రాజనీతిని, యుద్ధకౌశలమును ప్రయోగించి సామ్రాజ్యము చెక్కుచెదరకుండ కాపాడుకొనగల్గెను. ఈకథ యంతయు 13 వ శతాబ్ది ఆంధ్రదేశచరిత్ర. సారస్వత చరిత్రలో ఈ శతాబ్దియే తిక్కన యుగము ఇంచుమించు గణపతిదేవ, రుద్రమదేవుల పరిపాలన కాలమంతయు తిక్కన జీవితకాలముతో సరిపోవుచుండును వారిరువురు ఆ కాలమునకు ఆంధ్ర సామ్రాజ్య చక్రవర్తులు ఈయన సర్వకాలాంధ్రసారస్వతసామ్రాజ్యచక్రవర్తి

14 వ శతాబ్దిలో 20 ఏండ్లు గడచిన తరువాత కాకతీయ సామ్రాజ్యము అస్తమించెను ఆ దురదృష్టమునకు గురియైన మహారాజు రెండవ ప్రతాపరుద్రుడు. తిక్కన, ఆ చక్రవర్తి యొక్క రాజ్యకాలములో కొంత గడచిన పిమ్మట ఇహలోకయాత్ర చాలించెను. అయినను తక్కిన కాల భాగములో తిక్కన శిష్యుడు మారన కాకతీయ కటకపాలకుడైన నాగయ గన్న సేనానికి మార్కండేయ పురాణమును కృతి యిచ్చుటచే

పరోక్షముగా తిక్కన కవితాప్రభావముతోపాటు, ప్రత్యక్షముగా ఆయన గురుత్వ ప్రభావమును రెండవ ప్రతాపరుద్రుని కాలములో కూడ నెగడు చుండెను కాబట్టి సారస్వతమున తిక్కనయుగమును దేశచరిత్రమున కాకతీయ యుగమును ఒక మారే అంత మొందెను అందుచేతనే తిక్కన యుగమును 1320 దాక పొడింగింపదగును

**మత పరిస్థితి:**

కాకతీయ చక్రవర్తులు మొదటినుండియు శైవమతస్థులే వారు శివకేశవ భేదమును పాటింపని శివపూజా పరాయణులు, వీరశైవులు కారు సామంతులలో కూడ పెక్కుమంది అట్టివారే! కొందరు వైష్ణవులును కలరు సర్వ ప్రజా సమాదరము చూపవలసిన ఏ చక్రవర్తియైనను దురాగ్రహ తత్పరములైన సంకుచిత మతముల జోలిక పోరాదు. కాకతీయులు ఈ ధర్మసూత్రమునే శిరసావహించిరి వారిని వీరశైవమున కలుపుకొనవలెనని పెక్కు ప్రయత్నములు జరిగియుండుననుటకు సందేహములేదు. కాని వారు దానివంక కన్నెత్తియైనను చూడలేదు అనాడు వీరశైవమునకు ప్రత్యర్థిగా అచ్చటచ్చట వీరవైష్ణవము కూడ తలయెత్త సాగెను పంద్రెండవ శతాబ్ది చివర భాగములో (1182) జరిగిన పల్నాటి యుద్ధమునకు దాయభాగము ప్రధాన కారణమైనను ఆ వైరమును ప్రజ్వలింప జేసినది, ఆ రాజ్యమున పుట్టిన మతవైరుధ్యమే! పలనాటి వీరులలో అగ్రేసరుడైన బ్రహ్మనాయడు వీరవైష్ణవుడు అతడు ఆ బ్రాహ్మణ పంచమము అన్ని కులములవారికి తీర్థ ప్రసాదమిచ్చి ఏకముజేసి, సహపంక్తి భోజనాదులతో ఒక వీరవైష్ణవసంఘ వ్యవస్థను ఏర్పరచెను. అతని కుమారులలో నానా కులములవారు కలరు. అనగా వారందరు వీరవైష్ణవులు. ఆ యుద్ధమున ఎదిరి పక్షమునకు నాయకత్వము వహించిన నాగమ యనెడి వీరాంగన సంప్రదాయిక శైవ మతస్థురాలు ఆమెది కూడ వీరశైవముకాదు అందుచేతనే ఆమె, బ్రహ్మనాయడు ప్రతిపాదించిన వర్ణరాహిత్యమును సహింపలేక అతనిమీద పగబూనెను దానిఫలమే అపర భారతయుద్ధమనదగిన పలనాటి యుద్ధము. అకారణ కుటుంబ కలహములవల్ల సంభవించిన ఆ యుద్ధాగ్నిలో అనేక శూరవంశములు ఆహుతియయ్యెను అప్పటికి ఇంకను కాకతీయ సామ్రాజ్యము స్థిరపడలేదు తరువాత 13 వ శతాబ్దిలో, 12 వ శతాబ్దినాటి మత ప్రేరిత యుద్ధములు జరుగక పోయినను వీరశైవమత ప్రచారము మాత్రము సోమనాథాదుల ద్వారా అప్రతిహతముగ నడచుచునే యుండెను మత ప్రచారమునకు సారస్వతము ఎంత బలిష్ఠమైన సాధన కాగలదో వీరశైవులద్వారా ఆనాడే ఋజువయ్యెను వీరశైవ గ్రంథములను ఆ మతస్థులు తప్ప ఇతరులు ఏవగించుకొన్నను వాటికి ప్రతీకారముగ అన్యగ్రంథములు వ్రాయుటకు పూనుకొనువారు లేరైరి అనగా భిన్నమతముల యొక్కయు భిన్నదైవతముల యొక్కయు అవధులను దాటిన తాత్వికమైన పరమార్థమును గ్రహించి దానిని కాలానుగుణమైన గ్రంథ సృష్టి ద్వారా ప్రజలకు బోధింపగల మహాకవియొక్క అవిర్భావము అవశ్యకమై యుండును మతవైషమ్యముల నణచివైచు శక్తి ఒక అద్వైతమునకే కలదు ఆ పరమ ధర్మమును సాహిత్యము ద్వారా కాకుండ శాస్త్ర గ్రంథ రచనల ద్వారా బోధింపవచ్చును గాని, ప్రజలకు కేవల శాస్త్రము సాహిత్యమువలె గ్రాహ్యము కాదు; రుచింపదు. ఆ ధర్మమంతయు సంస్కృత భాషలో నిక్షిప్తమై యున్నది. అది ప్రజలకు గ్రాహ్యము

కాదు. నిజమునకు సకల ధర్మసారభూతమైన మహా భారతమైనను తెనుగున వ్రాయబడియుండెనేని ప్రజలకు వేదములు, ఉపనిషత్తులు, ధర్మశాస్త్రములు, ఇతర పురాణములు చదువనిలోపము తీరెడిది ఆ లోపము తీరుటమాత్రమే కాదు పరస్పర భిన్నములుగా అన్యోన్య విరుద్ధములుగా కానవచ్చెడి మత సాంఘిక నైతిక సిద్ధాంతముల కన్నింటికి సమన్వయ మార్గము కూడ కానవచ్చెడిది కావున ప్రజల భాషలో ఆ ధర్మమును, శాస్త్రముగా కాక కావ్యముగా రచించిననే తప్ప వీరశైవ కావ్యములకు ప్రతీకారము జరుగదు. అట్టి కావ్యావిర్భావము జరుగువరకు వీరశైవ సంకుచిత స్వరూపమును ప్రజలకు బోధించు భారము పురాణపరనవ్యాఖ్యానములద్వారా, పండితులు విద్వత్సభలు చేయుచుండుట ద్వారా తప్ప గత్యంతరము లేదు

**భాషా పరిస్థితి:**

పాలకురికి సోమనాథునితో ద్విపద రచనలకు ప్రాముఖ్యము వచ్చెను. అది జాతీయ సరణియనియు, భారతము వంటి గద్య పద్యాత్మక చంపూ రచన దేశీయము కాదనియు, అది మార్గపద్ధతి యనియు కొందరు దీనియెడ నిరసన భావము చూపిరి. దానివలన దేశి రచనకు మార్గ రచనకు ప్రతి భటత్వము తటస్థించెను మఱియు, వాఙ్మయమును మతనిరపేక్షముగ సేవింపలేక శివకవులును భవికవులును పరస్పరము గర్హించుకొన జొచ్చిరి దేశిరచన జానుతెనుగు అను పలుకుల మ్రోతయేకాని, దాని అవశ్యకమెట్టిదో అది ఎంతవరకు సాధ్యమో ఎంతవరకు గ్రాహ్యమో ఊహించి తన రచనలద్వారా నిరూపించు అధికారము గల కవి లేడయ్యెను. జాను తెనుగు నెపమున సంస్కృతమును పరహసించిన వారియెడ సంస్కృతాభిమానులకు ఏవము పుట్టెను. మనుమసిద్ధి కొలువులో తిక్కన ఉభయకవిమిత్ర బిరుదము వహించుట దీనికి నిదర్శనము

ఈ విధముగా రాజకీయ మత సారస్వతాది జీవిత రంగములలో దేశము బహునాయకమైన తరుణములో ధర్మైక్యము లేక జాతిశక్తి రిత్తవోవుచుండిన దినములలో సమస్త వైరుధ్యములను సమన్వయించి అందరకు సుగమమగు రాచబాట వేయుటకు తగిన అధికార సంస్కారములు గల మహాపురుషులు – రాజులు, మంత్రులు, కవులు, పండితులు – చేసిన అమోఘ ప్రయత్నమువలన ఆ పదుమూడవ శతాబ్దిలో ఆంధ్రత్వము యొక్క స్వరూపస్వభావములు సుప్రతిష్ఠములైనవి. వారికి పరమ లక్ష్యమైన ఆదర్శములలో ఐహికాముష్మిక ధర్మ సామరస్యము ఒకటి ఆముష్మిక వ్యాజమున ఐహికమును నిస్తేజము, నిర్వీర్యము, దరిద్రము నొనర్చుకొనుటగాని ఐహిక భోగలాలసులై పరము మిథ్య యనుకొనుటగాని వారు నిర్మింపదలచుకొన్న జాతీయతలో ఉండరానివి. ఆ అద్వైతభావమే వారు మతమునను, సారస్వతమునను కూడ ఆశించిరి

అంతకు పూర్వ శతాబ్దిలోనే ఉత్తర భారతమును తురుష్కులాక్రమించిరి ఆ వెల్లువ దక్షిణాపథమును కూడ ముంచివేయు జాడలు కన్పట్టుచుండెను ఆ చరిత్రనంతను సింహావలోకనము చేసి చూచినట్టు 13 వ శతాబ్ది యందలి ఆంధ్ర మహాపురుషులు స్వకీయ పరకీయ మహోపద్రవముల నుండి జాతిని రక్షింపగల ధర్మాద్వైత ప్రబోధమునకు నానా విధముల ఉద్యమించిరి. ఆ మహాపురుషులలో తిక్కన సోమయాజి యొకడు అట్టివాడు వాఙ్మయచరిత్రలో కూడ యుగకర్త యగుటచే

తెలుగున ఏ కవికిని రాని చారిత్రక ప్రాధాన్యము ఈ మహాపురుషునకు వచ్చెను తిక్కన యుగమున మొదట పుట్టిన గ్రంధము రంగనాధ రామాయణము. ఈ రామాయణమును రచించిన కవి గోనబుదారెడి

## గోన బుద్ధారెడ్డి

ఇతడు తన తండ్రి విట్ఠల ధరణీశుని పేర ఆ గ్రంధమును వెలయించి దానికి రంగనాధ రామాయణమని పేరిడెను ఈ యంశము గ్రంధావతారికలో శిలాశాసనము వలె ఉదాహరింపబడి యున్నను ఈ గ్రంధ కర్తృత్వము వివాదగ్రస్తమయ్యెను గ్రంధకాల కర్తృత్వాది నిర్ణయమునకు అక్కరకు వచ్చు సాధనములో గ్రంధస్థ నిదర్శనము పరమసాధనము గ్రంధాంతర నిదర్శనములు దాని అభావమున అనుమాన ప్రమాణములుగా పర్యాలోచింప దగినవే కాని స్వతః ప్రమాణములుగా గ్రహింపదగినవి కావు. కాని వాల్మీకి రామాయణమును వాల్మీకియు, భాస్కర రామాయణమును భాస్కరుడును వలె ఈ రామాయణమును రంగనాధుడు రచించుట చేతనే రంగనాధ రామాయణమని పేరు వచ్చినదని కొందరి అభిప్రాయము ఈ రంగనాధుడు గోన బుద్ధారెడ్డికి కవియశమును గడించి పెట్టదలచి అవతారికలో ఆతని పేరు పెట్టినను సత్యము దాగదు కనుక, రంగనాధుని పేరనే ఈ గ్రంధము జగత్ప్రసిద్ధమైనదని వారొక యుక్తి చెప్పుదురు. రంగనాధుడు అనునొక కవి ఆంధ్రకవి లోకమున ఉండవచ్చును. 15వ శతాబ్ది నుండి అనంతామాత్యుడు మొదలుగా కొందరు గ్రంధకర్తలు రంగనాధుని పేరు పూర్వకవి స్తుతి పద్యములలో పేర్కొనిరి కాని అతడే ఈ రామాయణ కర్తయనుట ఎట్లు పొసగును? మరియు కొందరు లాక్షణికులు ఈ రామాయణము నుండి లక్ష్యములు ఉదాహరించుచు "రంగనాధ రామాయణము నుండి"అని కొందరును, "రంగనాధుని రామాయణము నుండి" అని మరికొందరును వ్రాసిరట. కాని ఆ లాక్షణికులు గ్రంధము పుట్టిన పిదప 4,5 శతాబ్దుల తరువాతి వారు వారికిని లోకవదంతియే ఆధారముగాని వేరు చారిత్రకాధారములుండవు

అసలు లాక్షణికులు లక్ష్య సంగ్రహ పరాయణులే కాని చరిత్ర పరిశోధకులు కారు. వారికా పరిశోధనలలో ఆసక్తిలేదు ఒక గ్రంధములోని పద్యమింకొక గ్రంధములోనిదిగా, ఒక కవిపద్య మింకొక కవిదిగా ఉదాహరించుట లాక్షణికులకు పరిపాటి బహు గ్రంధ పరిశీలకుడని పేరు వడసిన అప్పకవికే అట్టి లోపము తప్పలేదు కనుక లక్షణ గ్రంధములు లక్ష్య నిరూపణ మాత్ర ప్రయోజకములు వాటిని చారిత్రక వివాదములలో సాక్ష్యముగా గైకొనుట అంత భావ్యముకాదు

## చక్రపాణి రంగనాథుడు

ఆంధ్రకవి లోకమున ఎంత వెదకినను రంగనాధుడను కవి కానరామిచే పాల్కురికి సోమనాధునకు సమకాలికుడైన చక్రపాణి రంగన్న అను వాడే ఈ రంగనాధుడని మరి కొందరి యూహ. ఇతనిది ఒక చిత్రమైన కథ రంగన అహోబల క్షేత్రమున కేగుచు దారిలోగల శ్రీశైలమును దర్శింపకపోవుటచే కన్నులు పోయెనట అంత

అహోబలస్వామి ఆదేశము ననుసరించి శ్రీశైలవాసుని ప్రార్థింపగా పోయిన కనులు వచ్చి శ్రీశైలము దర్శించెనట. దానిపై అతడు ఆనందపారవశ్యముతో "నయన రగడ" అను చిన్న గ్రంథమును చెప్పెనట నయన రగడ అనెడి ఒక చిన్న గ్రంథము తెలుఁగులో నున్న మాట నిజము అది అముద్రితము; ముద్రణ భాగ్యము నందగల గ్రంథవిస్తృతి గాని కవిత్వ గుణముగాని కలదికాదు

అది "శ్రీశైలమును గంటి శిఖరమును గంటి కన్నులు గల సార్థకతను నేగంటి" అనెడి అర్థముగల రగడ మాలిక ఆ పంక్తులకు శ్రీశైలదర్శనముచే జ్ఞాన నేత్రము ఉదయించెననియో, జన్మసాఫల్యమైనదనియో అర్థముగాని పోయిన కన్నులు వచ్చెననెడి అర్థము పొసగదు ఈ కన్నుల కథను ఎవరో కల్పించి దానిని సమర్థించుటకు గ్రంథాదిని ఈ పద్యమును వ్రాసిరి.

*కం॥ "శ్రీ పార్వతీశు చూడక*
*పాపాత్ముఁడనగుచుఁ బోవ పథమున చక్షుల్*
*దీపించు దృష్టి దొలఁగిన*
*శ్రీపతి నడుగంగ చెప్పె శివు కర్తనుగాన్ "*

నానా దోష సంకలితమైన ఈ పిచ్చి పద్యము అర్వాచీన కాలమున ఎవరో రగడకు తగిలించియుందురనుట స్పష్టము అయినను అణియాది గణపతి దేవుని శివయోగ సారమును బట్టి పాల్కురికి సోమనాథునకు చక్రపాణి రంగనాథుడు సమకాలికుడు కావచ్చునని యూహింపవచ్చును

*కం॥ "అసమ శివభక్తి రసమా*
*నసునిన్ పాల్కురికి సోమనాథుని కవిరా*
*జి సమున్నత యశు సద్యః*
*ప్రసాది నల చక్రపాణి రంగన దలతున్ "* (శివయోగసారము1–8)

ఈ చక్రపాణి రంగన పరమ శైవుడని నయనరగడనుబట్టి నిరాక్షేపముగా చెప్పవచ్చును ఆనాటి శైవులకు విష్ణునామసంస్మరణమైనను పాపావహమైన కృత్యము ఈ రంగనాథ రామాయణము కేవలము విష్ణుపారమ్యమును ప్రతిపాదించు వైష్ణవ గ్రంథము. రామకథ సర్వమత సమ్మతమైనదే అయినను రంగనాథ రామాయణమున అది సాక్షాత్తు వైష్ణవ ప్రతిపాదకకథయే అయినది ఈ ద్విపద రామాయణ కర్త పదే పదే విష్ణు పారమ్యమును వాచ్యముగా చెప్పుచుండును. మరి శైవుడైన ఆ చక్రపాణి రంగన ఈ గ్రంథమును వ్రాసెననుట ఎట్లు పొసగును? పుట్టుకచే వైష్ణవుడై యుండి తరువాత మతము మార్చుకొని శైవుడై యుండవచ్చు ననుకొందముగాక! ఆ పక్షమున మరల రామాయణ కర్తృత్వమునకై వైష్ణవము పుచ్చుకొనెననుట అసహజమే కదా! రామాయణ రచనానంతరమే వైష్ణవము పుచ్చుకొనెననుటయు అసంభవము. పాల్కురికి సోమనాథుని కాలముననే శైవము పుచ్చుకొన్నను ఆ కవి రామాయణ రచనా కాలము నాటికి జీవించియే యున్నచో శైవుడుగానే బ్రతికి యుండవలెను కావున ఈ రంగన కథ కేవలము కల్పితము.

## రంగనాథ రామాయణ కర్తృత్వము

ఇంతకును గ్రంధ నామమునకు ఉపపత్తి కుదురక ఈ వివాదము చాల పెరిగినది ప్రత్యక్షముగా గోచరించు ఆధారములను పురస్కరించుకొని ఈ పేరు సమర్ధింపవచ్చునని నేననుకొంటిని. ఎట్లనగా, ఈ గ్రంధమును బుద్ధవిభుడు రచించెను. తన తండ్రి విట్ఠలుని పేర ప్రఖ్యాతము చేసెను. విట్ఠలుడు పేరోలగ ముండి పండిత సమక్షమున కుమారుని రామాయణ రచనకు నియమింపగా అతడు తండ్రి యానతిని శిరసావహించి రచన కుపక్రమించెను. ఇది చాటు మాట కాదు కూట రచనకాదు (Forgery)

బాలకాండ: "వినయ నయోపాయ విజ సుస్థిరుఁడు
ఘనకీర్తి విట్ఠలక్ష్మాపాల వరుఁడు
రాజ సర్వజ్ఞుండు రాజ సింహుండు
రాజ శిరోమణి రాజ పూజితుఁడు
సకల జగద్ధిత చాతుర్య ధుర్యుఁ
డొకనాఁడు కొలువున నున్న తుండగుచు
బహు పురాణజ్ఞులు బహు శాస్త్రవిదులు
బహుకావ్య నాటక ప్రౌఢ మానసులు
హితులు మంత్రులు పురోహితులు నాశ్రితులు
సుతులు రాజులు బహు శ్రుతులును గొల్వ
దీపించి భూలోక దేవేంద్రు పగిది
నేపారి యున్నచో నింపు సొంపొంద
రసికులు భారత రామాయణాది
రసగోష్ఠి చెల్లింప రసిక శేఖరుఁడు
రామకథా సుధారసరక్తుఁ డగుచు
నా మహాసభలోన నందఱఁజూచి
రమణమైఁ దెనుఁగున రామాయణంబు
క్రమ మొప్పఁజెప్పెడి ఘనకావ్యశక్తి
గల కవు లెవ్వారుగల రిర్విననుచుఁ
దలపోయ విట్ఠల ధరణి పాలునకు
నున్నత మూర్తికి నురుయశోనిధికి
విన్నవించిరి వేడ్క విబుధులు గడఁగి
నీ తనూజన్ముండు నిపుణమానసుఁడు
ధూతకల్మషుఁడు బంధురనీతియుతుఁడు
సర్వజ్ఞుఁ డనఘుండు చతురవర్తనుఁడు
సర్వపురాణ విచార తత్పరుఁడు
కమనీయ బహుకళాగమ విచక్షణుఁడు
సుమనీషి పోషణోత్సుక సుఖోన్నతుఁడు
కవి సార్వభౌముండు కవికల్పతరువు

కవిలోకభోజుండు కవిపురందరుఁడు
ప్రత్యర్థి రాజన్య బల వజ్రపాణి
ప్రత్యర్థి నృపదావ పావకోజ్జ్వలుఁడు
భీకర నిజఖడ్గ ఖండిత స్వర్గ
లోకానురక్త త్రిలోక దుర్దముఁడు
వరసాధు జలజాత వనజాతహితుఁడు
పురుష చింతామణి బుద్ధ భూవిభుఁడు
నీ కతిభక్తుండు నిఖిలశబ్దార్థ
పాకజ్ఞుఁ డత్యంత పాండిత్య ధనుఁడు
మఱియు రామాయణ మర్మధర్మజ్ఞుఁ
డెఱుఁగు నాతనిఁ బిల్పుమీ కథఁజెప్ప
ననిన మజ్జనకుఁ డుదాత్తవర్తనుఁడు
నను నర్థి బిలిపించి ననుగౌరవించి
భూమిఁ గవీంద్రులు బుధులును మెచ్చ
రామాయణంబు పురాణ మార్గంబు
తప్పక నా పేరఁ దగ నంధ్ర భాషఁ
జెప్పి ప్రఖ్యాతంబు సేయింపు ముర్వి
నని యానతిచ్చిన నమ్మృదూక్తులకు
ననయంబు హర్షించి యట్ల కావింపఁ
బని పూని యరిగండ భైరవు పేర
ఘను పేర మీసర గండాంకు పేర
లలిత సద్గుణ గణాలంకారు పేర
నలఘు నిశ్చల దయాయత బుద్ధి పేర
నాతత కృతి పేర నతిపుణ్యు పేర
మా తండ్రి విట్ఠల క్ష్మానాథు పేర
రాజులు బుధులును రసికులు సుకవి
రాజులు గోష్ఠిని రాగిల్లి పొగడఁ
బదము లర్థంబులు భావము లతులు
పదశయ్య లర్థ సౌభాగ్యముల్ యతులు
రసముల కల్పన ల్ప్రాస సంగతులు
నసమాన రీతులు నన్నియుఁ గలుగ
నాది కవీశ్వరుఁడైన వాల్మీకి
యాదరంబునఁ బుణ్యులందఱు మెచ్చఁ
జెప్పిన తెఱఁగున శ్రీ రామచరిత
మొప్పఁ జెప్పెదఁ గథాభ్యుదయ మెట్లనిన."

ప్రతి కాండాంతముననను గద్య స్థానీయములైన ద్విపద పంక్తులలో బుద్ధ రాజకర్తృత్వమే ఉద్ఘాటింపబడినది. ప్రతి కాండాంతమున—

అని యాంధ్రభాష భాషాధీశనిభుఁడు
వినుత కావ్యాగమవిమల మానసుఁడు
పాలితాచారుఁ డపారధీశరధి
భూలోక నిధి గోనబుద్ధ భూవిభుఁడు
దమ తండ్రి విట్ఠల ధరణీశు పేరఁ
గమనీయ గుణ ధైర్య కనకాద్రి పేర
నలఘు నిశ్చల దయాయత బుద్ధి పేర
లలిత నిర్మల గుణాలంకారు పేర
నా చంద్రతారార్కమై యొప్ప మిగిలి
భూ చక్రమున నతిపూజ్యమై యొప్ప
నసమాన లలిత శబ్దార్థ సంగతుల
రసికమై చెలువొందు రామాయణంబు
పరఁగ నలంకార భావనల్మిండఁ
గరమర్థినీ (బాల) కాండంబుఁ జెప్పె.

గ్రంథమున గోచరించు ఆధారము లింత మాత్రమే! తండ్రిపేర ప్రఖ్యాతము చేయుట యనగా అతని పేర రామాయణమును పిలుచుట యని నా ఊహ! ఈ యర్థమున దీనికి విట్ఠల రామాయణ మనియో, విట్ఠలనాథ రామాయణమనియో పేరుండదగును. కాని అటులకాక రంగనాధ రామాయణమని యున్నది. అయినను ఇది విట్ఠల నామసూచకమే అని నేనూహించితిని. విట్ఠలు డనునది పండరిపురమున వెలసిన పాండురంగ విట్ఠలనాథుని పేరు. అదియే ఈ విట్ఠల రాజు పూర్తిపేరై యుండవచ్చును. దీనిలో ఉచ్ఛారణ సౌలభ్యము గల "రంగ" "నాథ" అను ఏక దేశములను రామాయణ శబ్దమునకు లగించి కవి రంగనాథరామాయణము అని పేరు పెట్టి యుండవచ్చును. ఇది యొక పక్షము.

1942 వ సంవత్సరములో ఆంధ్ర విశ్వవిద్యాలయ ప్రచురణముగా నా పీఠికతో ఈ రామాయణము ప్రకటింపబడిన తరువాత శ్రీ రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మగారు నా పీఠికను విమర్శించుచు 1943 సంవత్సరము మే నెల భారతిలో ఒక వ్యాసము వ్రాసిరి అందులో నేను చేసిన యీ నామ సమన్వయ సిద్ధాంతము శ్రీ వావిలాల వేంకటేశ్వరశాస్త్రిగారి సిద్ధాంతమునకు అనువాదమని ఒక నింద మోపిరి అనగా, ఈ యూహ నా సొంతము కాదనియు, శ్రీ వేంకటేశ్వరశాస్త్రిగారి యూహకు అనుకరణమనియు వారి అభిప్రాయము ఇది సత్యదూరము

శ్రీ వేంకటేశ్వరశాస్త్రిగారి "కోనబుద్ధరాజు – రంగనాథ రామాయణము" అను వ్యాసము 1940 సంవత్సరము ఆగస్టు నెల భారతిలో ప్రచురింపబడినది

నేను అంతకు ఐదేండ్లముందే 1935 సంవత్సరము మార్చి "Andhra University Telugu Association Bulletin" అనెడి పత్రికలో ఈ యూహను వ్యాసరూపమున ప్రకటించితిని శ్రీ అనంతకృష్ణశర్మగారు నా వ్యాసమును చూచియుండరు

నేను శ్రీ కట్టమంచి రామలింగారెడ్డిగారి ప్రీత్యర్థమై ఆయన మెప్పుగోరి ఈ నామ సమన్వయమునకు గడంగితినని నా స్వభావమెరుగని మరికొందరు తలచిరట నేను ఇతరుల మెప్పుకొరకు చేయరాని పనులు చేయువాడనుగాను రామలింగారెడ్డిగారితో నాకు పరిచయము కలుగుట 1936 సంవత్సరములో అంతకు 14 సంవత్సరముల పూర్వము (1922–23) ఈ రంగనాథ రామాయణము నుండి ఒక భాగము యూనివర్సిటీ పరీక్షలలో ఒకదానికి పాఠ్యమయ్యెను దానిని నేను విద్యార్థులకు పాఠము చెప్పునప్పుడు ఈ నామ సమన్వయము నూహించితిని ఆనాటి విద్యార్థులలో చాలమంది నేటికిని చల్లగా ఉన్నారు

పేర వెలయించుట యనగా కృతియిచ్చుట అను అర్థము కూడ కలదు ఈ రామాయణమున ఉత్తరకాండ రచించిన బుద్ధారెడ్డి కొడుకులు కాచవిభుడు విట్ఠలుడనువారు గ్రంథమును తమ తండ్రి బుద్ధభూవిభుని పేర వెలయించి దానికి "రంగనాథ రామాయణ" మనియే పేరిడిరి ఇచ్చట పేర వెలయించుట యనగా కృతియిచ్చుటే - అని యర్థముగాని ఇంకొక అర్థము పొసగదు. పేర వెలయించుట అనగా కృతియిచ్చుట అనే అర్థమే తంజావూరు గ్రంథములలో కొన్నిట కలదు ఈ అర్థమున ఈ గ్రంథము విట్ఠలునకు అంకితమైనదనియు దానికి ఏ క్షేత్ర దేవతాపరముగనో కవిపేరు పెట్టియుండవచ్చుననియు నేననుకొంటిని.

మొదట రంగనాథ రామాయణమన్న పేరు తొల్లింటి నుండియు కలదా? మధ్యకాలమున వచ్చినదా? అని శంకింపగా నడుమనే వచ్చినదని కొందరందురు. మరి తొలినాటి పేరేమైయుండునని యడిగినపుడు సమాధానము చెప్పలేరు ఎంత ప్రయత్నించి ప్రచారము చేసినను నడుమవచ్చిన పేరు తొల్లింటి దానిని తుడిచి వేయజాలదు కావున ఈ గ్రంథమునకు మొదటి నుండియు రంగనాథ రామాయణమనియే పేరని నా తలంపు అట్లుగాక నడుమవచ్చిన పేరేయైనచో ఆ పేరు పెట్టిన వానికి లోకవదంతియే ఆధారముగాని యథార్థ జ్ఞానము కాదు

రంగనాథుడు రచించుట చేతనే రంగనాథ రామాయణమయ్యేనేని అతని యశము తన కాపాదించుకొన్న బుద్ధారెడ్డి తన దుష్కార్యమును యుగాంతరముల దనుక మూదలించుచుండెడి ఈ పేరునకు ఎట్లు అంగీకరించియుండును? తన కీర్తి అతనికి ధారవోసిన రంగనాథుడు ఆత్మవంచనకును మిత్రవంచనకును పాల్పడి తన పేరనే గ్రంథము ఎట్లు వెలయించి యుండును? మరియు అతడు కీర్తిని బుద్ధారెడ్డికి ధారపోయనేల? అప్పటికి రాజ్యమేలుచున్న విట్ఠలునకే అర్పించియుండదగునుగదా? మరియు తాను విక్రయించిన యశమునకు వెలయిచ్చువాడు రాజైన విట్ఠలుడే కాని బుద్ధారెడ్డి కాదుగదా! విట్ఠలుడు కవి యశమును తానే ఆశింపక కుమారునకు దక్కింపనేల?

అదీగాక—

"ఆతతకృతి పేర నతిపుణ్యు పేర
మా తండ్రి విట్ఠలక్ష్మానాథు పేర"

అనెడి పంక్తిని విట్ఠలునిపుత్రుడు తప్ప ఇంకొకడు వ్రాయలేడు వ్రాయకూడదు. ఇంకొక సంగతి. ఈ బుద్ధారెడ్డి కొడుకులు కాచవిభుడు, విట్ఠలుడు అనువారలు ఈ గ్రంథ పరిశిష్టభాగమగు ఉత్తరకాండమును రచించి దానికి రంగనాథ రామాయణమనియే పేరిడిరని పైని చెప్పితిని. రంగనాథుని బట్టియే రంగనాథ రామాయణమయ్యెనని ఆ రంగనాథుడే తరువాతి తరమువరకును బ్రతికియుండు వారికిని తన కవితా తపస్సును ధారపోసెననుట హాస్యాస్పదము కాదా? లేదా రంగనాథుడు రెండు తరములలోగాక ఏకకాలముననే ఏడు కాండలను రచించెనందురా? అగుచో, వాటిలో ఆరు కాండలు తండ్రికిని, ఒక కాండ కుమారులకును పంచిపెట్టనేల? పాపము! ఈ అన్యాయార్జితమైన కీర్తిలో విట్ఠలునకు మాత్రము పాలు లేకపోయెను. దానిని అతని

కొడుకును మనుషులును పంచుకొనిరి కాబోలు! నియతోపకారములైన నిదర్శనములు భావికాలమున వెలువడు వరకు గ్రంథస్థమైయున్న కర్తపేరునే ఆమోదింతును

అవతారికలో కవి వర్ణించుకొన్న యాతని వంశవృక్షము ఈ క్రింది రీతిగా నున్నది.

గోన కాటభూపతి

రుద్రభూపతి

|

బుద్ధభూపతి

|

విట్ఠలుడు

|

బుద్ధభూపతి (రామాయణ కర్త)

వీరు, భూవిభులనియు భూపతులనియు వ్యవహరించుకొనుట రాచరికమునుబట్టి. పుట్టుకచే రెడ్డి కులజులు. వీరు వేయించిన శాసనములలో ఈ విషయము స్పష్టముగా నున్నది. కాకతీయాంధ్ర చక్రవర్తులకు వీరు సామంతులై యిప్పటి రాయచూరు ప్రాంతముల నేలుచుండిరి. ఈ వంశములో రామాయణ కర్తయగు బుద్ధారెడ్డి యెప్పటివాడో సరిగా నిర్ణయించుటకు దగిన ఆధారములు ఈ గ్రంథమునగాని, ఉత్తరకాండములో గాని లేవు. అయ్యెడ శాసనములే శరణ్యము ఈ వంశ్యనామ చిహ్నితములైన శాసనములు క్రీ శ. పదుమూడవ శతాబ్దివి – మూడు కానవచ్చుచున్నవి వాటిలో రెండింటికి బూదపూరు శాసనములని పేరు.

ఈ బూదపూరు శాసనములలో మొదటిదానినిబట్టి కాకతీయ గణపతిదేవ చక్రవర్తి సైన్యాధిపతులలో "మల్యాలగుండదండాధీశుడ"ను నతడొకడు కలడనియు, అతడు గోన బుద్ధభూపాలుని పుత్రికయగు కుప్పమాంబికు భర్తయనియు తెలియుచున్నది. ఈ శాసనము క్రీ.శ. 1259లో పుట్టినది. రెండవ బూదపూరు శాసనము క్రీ.శ.1276 లో ఆకుప్పమాంబికయే వేయించినది. అప్పటికి ఆమె భర్త గుండ దండాధీశుడు పరలోక గతుడైనట్లును, అతని పుణ్యలోక ప్రాప్తికై కుప్పమాంబిక శివలింగ ప్రతిష్ఠచేసి భూదానాదులు కావించినట్లును దానిలో వివరింపబడియున్నది. దీనియందును కుప్పమతండ్రి గోనబుద్ధభూవిభుడుగానే పేర్కొనబడెను.

ఈ కుప్పమ, రామాయణావతారికలోని వంశ వృక్షమున గానవచ్చు బుద్ధ భూపతు లిరువురిలో రంగనాథ రామాయణ కర్తయైన బుద్ధభూపతికేని, అతని తాతయైన బుద్ధభూపతికేని పుత్రిక కావచ్చును. రామాయణ కర్తకే కుమార్తెయయ్యెనని ఈ గ్రంథ రచనాకాలము పదుమూడవ శతాబ్ది పూర్వార్థమై యుండును. ఎట్లనగా క్రీ.శ. 1259 నాటికి అత్తింట కాపురము చేయుచు శాసనములో ప్రస్తుతింపబడదగిన వయస్సులోనున్న కూతురుగల బుద్ధారెడ్డికి అనాటికి కనీసము నలుబదియైదు సంవత్సరముల ప్రాయమైనను ఉండవలయును రామాయణరచన నాటికి అతడింకను చిన్నవాడు. రాజ్యమేలుచున్న తండ్రి ఆనతిని రామాయణ రచన కుపక్రమించిన ఆ

కుమారుని వయస్సు ముప్పది ముప్పయైదు సంవత్సరములై యుండవచ్చును. ఈ యూహ నిజమగునేని యీ కవి క్రీ శ 1210 ప్రాంతమున జనించి క్రీ శ 1240 ప్రాంతమున గ్రంథరచన చేసియుండును.

అటుగాక, కుప్పమాంబ రామాయణకర్త తాతకే కుమార్తె యనుకొన్నచో తండ్రికి సమవయస్కురాలగు మేనత్తకంటె ఈ కవి సుమారు ఇరువదియైదు సంవత్సరములు చిన్నవాడై యుండదగును. క్రీ.శ 1259 నాటికి శాసనములో ప్రస్తుతింపబడిన కుప్పమ్మకు ఇరువదియైదు సంవత్సరములైనను వయస్సుండవలయును. అప్పట్టున రామాయణ కర్త క్రీ.శ. 1260 ప్రాంతమున జనించి క్రీ శ. 1290–95 ప్రాంతమున గ్రంథము రచించి యుండవలయును.

ఈ రెండింటిలో నాకు మొదటి పక్షమే సమంజసముగా తోచుచున్నది. కుప్పమ రామాయణ కర్తకు కుమార్తె అనియు, రామాయణము క్రీ.శ 1240 ప్రాంతమున రచింపబడినదనియు. ఏమన, ఈ పూర్వ రామాయణము ఆరుకాండలు తనకంటె మున్ను రచింపబడినవి కనుకనే, ఉభయకవి మిత్రుడు తిక్కన, తెనుఁగున రామాయణమును పూర్తిచేయు తలంపుతో ఉత్తరకాండను ద్విపదగా గాకున్నను నిర్వచనోత్తర రామాయణమను పేర పద్య కావ్యముగా రచించియుండును లేనిచో రామాయణ రచనా కుతూహలముగల తిక్కన ఉన్నట్లుండి పూర్వకాండలను వదలి యుత్తరకాండనే చేపట్టవలసిన యావశ్యకత లేదు ఈ నిర్వచనోత్తర రామాయణము క్రీ.శ. 1260 ప్రాంతమున రచింపబడినదని చరిత్ర పరిశోధకులు నిర్ణయించిరి దాని పూర్వ రచనయైన రంగనాథ రామాయణము ముందు చెప్పినట్లు క్రీ.శ 1240 ప్రాంతమున పుట్టినదనుటలో విప్రతిపత్తి యేమియు నుండదని నా అభిప్రాయము

అటుగాక, రెండవ పక్షమునుబట్టి యిది క్రీ శ. 1290 ప్రాంతముల బుట్టెనేని క్రీ.శ. 1320 ప్రాంతమున పుట్టిన భాస్కర రామాయణమునకు చాల సన్నిహితముగా నుండును. ఆ పద్య రామాయణము ఈ ద్విపద రామాయణమును అనుసరించినట్లు గుర్తు లనేకములు గలవు. అవి అన్నియు భాస్కరాదులకు బుద్ధారెడ్డియందుగల గౌరవమునకు సూచకములు భాస్కరుని వంటి ప్రౌఢకవిచే అట్టి గౌరవము పొందదగిన ఈ ద్విపద అనాటికి ప్రాచీన గ్రంథముగా ప్రసిద్ధికి వచ్చియుండవలయునుగాని, అతనికి ఇంచుమించు సమకాలిక మగుట మాత్రము తటస్థింపదు సన్నిహితులకును సమకాలికులకును విద్యాస్పర్ధలు మెండుగా నుండునుగాని, యిట్టి గౌరవ ప్రతిపత్తులుండుట అరుదు. అందును సమానేతి వృత్తములను రచించిన కవులలో అది మరియు శూన్యము.

ఈ అంశము లన్నియు పర్యాలోచించి చూడగా, గోన బుద్ధారెడ్డి యీ రామాయణమును పదుమూడవ శతాబ్ది పూర్వ భాగముననే రచించినట్లు నిశ్చయింప వీలగుచున్నది

ఈతని పుత్రులు రచించిన ఉత్తరకాండలో వీరి వంశమును గూర్చి పొసగని వాక్య మొకటి కలదు. పూర్వరామాయణమును బట్టి బుద్ధారెడ్డి తండ్రి పేరు విట్ఠలుడు. ఈ యుత్తర రామాయణమున అతని పేరు గన్నారెడ్డి దీనిని సమర్థించుటకు

ఊహాతప్ప మరియొక ఆధారము లేదు సంపన్నులైన రెడ్డి వంశ్యులలో సాధారణముగా ప్రతి పురుషునకును రెండేసి పేరులుండునట. ఒక పేరు గృహమునను మరియొకటి లోకమునను వ్యవహరింపబడుచుండునట. విట్ఠలునకు గూడ గన్నారెడ్డియని రెండవపేరు ఉండి యుండవచ్చును, లేదా బుద్దారెడ్డికి విట్ఠలుడు – గన్నారెడ్డి అను ఇర్వురిలో ఒకడు కన్న తండ్రియు, మరియొకడు పెంపుడు తండ్రియు కావచ్చును. నిరపాయమైన యీ స్వల్ప విషయమును మిషగా గైకొని ఉత్తర రామాయణ కర్తలు పూర్వరామాయణ కర్తకు కుమారులేనా యని సందేహింపరాదు. తమ తండ్రి బుద్ధభూవిభుని ఆదేశానుసారమే తాము ఉత్తరకాండను పూర్తిచేసితిమని యీ సోదర కవులు ఎలుగెత్తి యుగ్గడించిరి దీనిని కాదనుట యెట్లు?

"గోన కులార్ణవ కువలయేశుండు
నా నొప్పు గోన గన్న క్షితీంద్రునకు
ననఘాత్మ యగుచున్న నన్న మాంబికకు
దనయుండు సాహిత్య తత్త్వకోవిదుడు
దాన ప్రసిద్ధుండు ధర్మశీలుండు
భూనుతాచారుండు బుద్ధ భూవిభుడు
తెలుగున నొప్పగా ద్విపద రూపమున
నలి పూర్వ రామాయణము మున్ను చెప్పి
. ......... . ..... .మముఁ బిల్వఁబంచి
నా కులదీపకుల్ నా గుణాన్వితులు
నా కీర్తి వర్ధనుల్ నా కూర్మి సుతులు
గాన నా పూనిన కథ యెల్ల జనులు
మానుగాఁ గొనియాడ మధుర వాక్యముల
నెమ్మిఁ జెప్పుడు మీరు నిపుణులై యనుచు
మమ్ముఁ బంచిన మేము మా తండ్రి ప్రతిన
చిరకీర్తు లెసఁగఁగఁ జెల్లింపఁగనుట
పరమ ధర్మంబని భక్తితోఁ గోరి
రామావతారంబు రమణీయ మగుట
రాము పావన చరిత్రము దివ్యభాష
లోకానురంజన శ్లోక బంధములఁ
జేకొని వాల్మీకి చెప్పిన జాడ
మా తండ్రి బుద్ధక్షమానాథు పేర
నాతతన్నప కైరవాప్తుని పేర
ఘనుడు మీసరగండ కాచవిభుండు
వినుత శీలుఁడు విన విరల భూపతియు
నని జనుల్ మము గొనియాడంగ మేము
వినుత నూతనపద ద్విపద రూపమునఁ
బ్రాకటంబుగ నాంధ్ర భాషను జెప్పఁ

గైకొన్న యుత్తరకథ యెట్టిదనిన" (ఉత్తర కాండావతారిక)

"భూ నుతుఁడగు గోనబుద్ధ భూవిభుని
సూను లుదారులు సుగుణ భూషణులు
ఘనుడు మీసరగండ కాచ భూవిభుఁడు
వినుత పుణ్యుండగు విట్ఠ భూపతియు
రచియించి రుత్తర రామాయణంబు
రుచిరమై నిత్యమై రూఢి పెంపెసఁగ
నా చక్రవాళ శైలావనియందు
నాచంద్ర తారార్క మై యొప్పఁగాత" (కాండాంతము)

ఆ కాచ విట్ఠల విభులు పూర్వరామాయణ కర్తయైన బుద్ధ భూవిభుని పుత్రులనియు, ఉత్తరకాండ రచయితలనియు స్పష్టమే కదా!

తెనుగునగల రామాయణము లన్నింటిలో రంగనాథ రామాయణము మొదటిది. రెండవది భాస్కర రామాయణము అది బహు కర్తృక మగుట చేతను, అందును మల్లికార్జున భట్టాదులు భాస్కరుని వంటి ప్రౌఢ కవులు గాక పోవుటచేతను, ఆ రచన సర్వత్ర సమముగా లేక కొన్ని పట్టుల బాగుగా, కొన్ని పట్టుల ఓగుగా అతుకులమారి కూర్పుగా పరిణమించినది ఇక రంగనాథ రామాయణమో ఆద్యంత మొక చేతిమీదనే ధారావాహినిగా నడచిన రచన యగుట చేత నట్టి లోటు లేక ప్రతి ప్రకరణ గుణాస్పదమై నెగడినది. మరియు వాల్మీకి రామాయణమువలె నిదియు "పాఠ్యే గేయేచ మధుర"మై పాటగా పాడుకొను వారికిని, కావ్యముగా చదువుకొను వారికిని సమాదర పాత్రమై పండితులకేగాక పామరులకును వినియోగపడి సార్వజనీనమైన అనురంజనమును గడించినది. ఈ రామాయణములోని కొన్ని ప్రకరణములను పాటలుగా పాడుకొను నారీమణు లిప్పటికిని కలరు రామాయణ కథా ప్రదర్శనముల వేళ తోలుబొమ్మలవారు గానముచేయు గ్రంథమిదియే!

అసలు దేశికవిత్వము ప్రాయికముగా గేయ కవిత్వము. ద్విపద కావ్యములు గేయ భావమును సంరక్షించునవి యగుటచేత సామాన్య ప్రజాలోకమున వీని వ్యాప్తి పద్య కావ్యములకు లేదు ఈ రహస్యమును గుర్తెరింగియే సోమనాథుడు తన మత ప్రచారమును ద్విపద కావ్యముల ద్వారా సాగించెను వాటి వ్యాప్తిని అరికట్టుట యితరులకు దుర్ఘటమయ్యెను ఈ ద్విపద రామాయణ వ్యాప్తియు నట్లే అప్రతిహతముగా నేటికిని ఆంధ్రలోకమున సాగుచున్నది. అందును పశ్చిమాంధ్రులు సారస్వత మహోత్సవములలో బుద్ధారెడ్డికే అగ్రతాంబూల మిచ్చెదరు. ఆ సీమలో రంగనాథ రామాయణము చదువని అక్షరాస్యుడు లేడు ఒరులు చదువగా నైనను వినని నిరక్షరాస్యుడును లేడు

శుద్ధదేశి కవిత్వమున "ఇతివృత్తము" "భాష" "ఛందస్సు" అనెడి మూడును దేశీయములేయై యుండవలెను. దానికి గీతి ఆయువుపట్టు. అట్టి లక్షణముగల వాఙ్మయమే మన పదకవిత్వము పామరకవిత్వ మనిపించుకొన్న ఆ పదకవిత్వమునకు ఏదో కొంత ప్రౌఢవేషమువేసి నాగర మర్యాదలు నేర్పి సభా ప్రవేశార్హత కలిగింపవలెనని పాటుపడినవారే ద్విపద కావ్యకర్తలు వీరు ఒక వంక తమ దేశికవితాభిమానమును,

ఇంకొకవంక విద్వత్కవికీర్తి కాంక్షను అణచుకొనలేక ఉభయతారకమైన మార్గము త్రొక్కి కొంతవరకు చరితార్థులైరి.

సహజముగా ప్రాచీన ద్విపద కార్యకర్తల చిత్తవృత్తి దేశికవితా ప్రవణము. కాని ఆ దారినే పోయినచో దృఢస్థానకమును విద్వల్లోక ప్రతిష్ఠితమునునైన సారస్వతాలయమునకు వెలివారమగుదుమేమో యన్న భయముచే తత్ప్రవేశార్హతనిచ్చు సంస్కారములను కొన్నింటిని స్వయముగా చేసికొనిరి. అనగా ముందు పేర్కొన్న దేశికవితా లక్షణములలో నీ యొకటి రెండింటినో పాటించి మిగిలినవాటిలో మార్గ శాఖానుయాయులేయై యిటు ప్రజాసామాన్యమునకును, అటు సాహిత్యపరులకును ఇష్టులై వారి హృదయములలోను, వీరి కోశములలోను స్థానములను దక్కించుకొనిరి వీరిది పదకవిత్వమయ్యు పామర కవిత్వము కాదు, పండిత కవిత్వమయ్యు దేశికవిత్వము కాకపోదు. ఇదియే ద్విపద కావ్య కర్తలకు గల ప్రత్యేకత

కాలమునుబట్టి యీ వర్గములో మొదటివాడు సోమనాథుడు. సోమనను అతిశ యించి ప్రథమ గౌరవము దక్కగొన్నవాడు బుద్ధారెడ్డి సోమన ద్విపద కావ్యములు వ్యాకరణచ్ఛందో లక్షణాది దోషములచేతను మఱియు ఇతర కారణములచేతను బహుళాంధ్ర జనమునకు ఎక్కువ ఆదరపాత్రములు కావయ్యెను. ఇక బుద్ధారెడ్డి ద్విపద కావ్యము లక్షణయుక్తమును, సర్వపూజార్హమగు రామచరితాత్మకమును అగుటచే వారు వీరనక యెల్లరకును శిరోధార్యమయ్యెను. అందువలన రామాయణములలో ప్రథమమగుటయే కాక ద్విపద వాఙ్మయ శాఖలో సైతము రంగనాథ రామాయణ మగ్రగణ్యమే. ద్విపద కావ్య సృష్టికి సోమన ప్రథమాచార్యుడయినను దాని స్థితికి, ఔన్నత్యమునకు తాకారకుడై ద్వితీయాచార్యు డనిపించుకొని ఆతనికంటె ఎక్కువ ఖ్యాతిగాంచెను. రచనాకాలమును బట్టి ద్విపద కావ్యములలో బసవపురాణమునకు ప్రథమ స్థానము కల్గినను, కీర్తినిబట్టి రంగనాథరామాయణ మగ్రస్థానమును గడించినది. దేశమున అధిక ప్రచారమును గూడా వడసెను.

మరి ఇంకొక సంగతి. సంస్కృత పురాణాంధ్రీకరణమునకు అంకురార్పణము చేసిన నన్నయభట్టు భారతానువాదములో మూలకథా విధేయముగా నడిచెనే కాని తానై స్వతంత్రించి ఆ కథలో నెట్టి మార్పులును చేయలేదు. ఒకచో కథ తగ్గించుట, ఒకచో పెంచుట, ఒకచో వదలుటయను పద్ధతి దాని యందును కలదుగాని, అది మూలభిన్నమని చెప్పదగిన స్వతంత్ర కల్పన కాదు; అది రచనా సరళికిని అనుకూలముగా వేసికొన్న యనువాద మార్గము భారతము స్వతంత్రానువాదమే యైనను, ఆ కవులు మూలభిన్నకథాకల్పనలు చేయలేదు. బుద్ధారెడ్డి అట్టివి చేయుటకు వెనుదీయలేదు. ఆంధ్ర పురాణేతిహాస కర్తలలో ఇంత స్వేచ్ఛగా నూతన గాథాకల్పన చేసిన కవి యింకొకడు లేడు.

ఈ రామాయణమునకు విశిష్టత నాపాదించిన అంశమే మూల భిన్నగాథా కల్పనలు. ఆ గాథలు రామకథా ప్రస్తావముకల పద్మపురాణాదులలో గాని నవవిధ రామాయణములలో గాని యుండిన నుండవచ్చును ఉండుగాక, కవి ఆ పురాణముల నన్నింటిని వెదకి గాలించి యేర్చి యిందు కూర్చుకొనెనని చెప్పుట కష్టము. ఆ కథలన్నియు ఏ మార్గముననో యేనాడో ఆంధ్ర ప్రజల చెవులబడి వారినోట పదములుగా

పాటలుగా కీర్తనలుగా నలిగి సంఘమున వేరు నాటుకొనిపోయి యుండును. నాటి పదకవిత్వ ఖనినుండియే ఈ కవీశ్వరుడు కొన్ని జాతిరత్నములను తీసి సానలదీర్చి తన రామాయణమహామాలలో కూర్చి యుండును. ఈ కావ్యమునకు దేశితనము నాపాదించిన యింకొక లక్షణమిదియే! అట్లుగాక దీక్షకొరకు యథావాల్మీకముగానే కవి దీనిని తెనిగించి యుండునేని, పరిచిత వస్తు రహితమైన ఆ రచన దేశీయులకు నాశాభంగము కలిగించెడిది. కావ్యమునెడ వారు విముఖులును అయ్యేడివారు

*"ఆది కవీశ్వరుఁడైన వాల్మీకి*
*యాదరంబునఁ బుణ్యులందఱు మెచ్చఁ*
*జెప్పిన తెఱఁగున శ్రీరాముచరిత*
*మొప్పఁ జెప్పెదఁ గథాభ్యుదయ మెట్లనిన"*

అని కవి ప్రతిన చేసినను తద్భిన్నముగా ప్రతికాండమునందును ఏదో యొక అవాల్మీకాంశమును కల్పించుచునే కథ నడపెను. వాటిలో పెక్కులు, కావ్యమునకు గుణసంపాదకములును తద్విశిష్టతకు హేతుభూతములునైనవి. వీటిలో కొన్నింటికి లోకమే యాధారమనుటకు నిదర్శనముగా స్త్రీల పాటలను, పదములను, భజన కీర్తనలను పెక్కింటిని చూపవచ్చును నేటి యీ పాటలే అనాడు కవికి ఆధారములయ్యెనని నేననజాలనుగాని, యీ పాటల అర్థము గల ప్రాచీన పదములేవో తప్పక ఐ యుండునని మాత్రము చెప్పగలను సంస్కృత పురాణములను పండిత కవులు తెనిగింపకమున్నే అందలి గాథలు విడివిడిగా పదకవిత్వ రూపమున తెనుగు దేశమున వ్యాపించెనని చెప్పుట సారస్వతధర్మవిరుద్ధముగాదు.

**కీర్తన:**

*చరణము: "రాతినాతిగఁ జేసె నీ పదరజ మటంచును ఖ్యాతిగా విని*
*ప్రీతితో నెఱనమ్మితిని నా పాతకము లెడబాపు తండ్రీ!"*

అహల్య రాయిగా పడియున్నదనెడి ఈ యర్థముగల ఇట్టి కీర్తనలు తెనుఁగు దేశమున ఎప్పటినుండి కలవో ఎవరెరుక?

*"అడరి గౌతముఁ డహల్యాదేవిఁ జూచి*
*పడఁతి పాషాణరూపము దాల్చి యిచట*
*కర ముగ్రమగు నెండ, గాలిఁ, బెంధూళిఁ*
*భోరలుచుండుము నీవు పొడగానఁబడక."*

ఈ పంక్తులలో బుద్ధారెడ్డి గ్రహించినది ఆ కీర్తనలలోని అర్థమే.

ఈ రామాయణములో మూలభిన్నములైన యిట్టి కథాంశములు, చిన్నవియు పెద్దవియు పెక్కు కలవు. వాటిలో ఒక్కొక్క కాండలో గల చిన్న అంశములు ఈ క్రింద చెప్పబడుచున్నవి.

1) ఇంద్రుడు గౌతమాశ్రమము చెంత కోడియై కూసి ఆ ఋషిని అకాలమున నదీ స్నానమునకు వెళ్ళునట్లు చేయుట. *(బాలకాండము)*
2) అహల్య భర్తృ శాపవశమున రాయిగా పడియుండుట. *(బాలకాండము)*

3) మంథర రామునిపై ఈర్ష్య వహించుటకు కారణము చిన్ననాడు ఆయన దాని కాలును విరుగగొట్టెననుట (అయోధ్యాకాండము)

4) అకంపనుని ప్రోత్సాహము మీద సీతాపహరణార్థము బయలుదేరిన రావణుడు మధ్యేమార్గమున మారీచుని ఉపదేశము వలన వెనుకకు మరలిపోయిన వృత్తాంతము వదలిపెట్టుట. (అరణ్యకాండము)

5) శూర్పణఖా ప్రేరణయే రావణుని సీతాపహరణ ప్రయత్నమునకు ముఖ్యకారణముగ నిరూపించుట. (అరణ్యకాండము)

6) సీతానురోధమున పర్ణశాలను వీడిపోవు లక్ష్మణుడు ఏడు బరులు గీసి వాటిని దాటిపోవలదని సీతకు ఆదేశించుట. (అరణ్యకాండము)

7) సేతు నిర్మాణ సమయమున ఒక ఉడుత తన తడితోకతో ఇసుక రేణువులు తెచ్చి రాల్చి యథాశక్తి రామకార్యమునకు తోడ్పడుట. (యుద్ధకాండము)

8) రావణుని తల్లి కైకసి శ్రీరాముని మహిమను కుమారునకు వివరించి చెప్పి సీతను రామున కర్పింపుమని బుద్ధి చెప్పుట. (యుద్ధకాండము)

9) రామలక్ష్మణులు నాగపాశబద్ధులై యున్నప్పుడు నారదుడేతెంచి రాముని విష్ణుత్వమును జ్ఞప్తికి తెచ్చి ఆత్మవాహనమైన గరుడుని స్మరింపజేయుట; గరుడుని ఆగమనము వలన సర్పములు విచ్ఛిన్నములై పోవుట.

10) శుక్రుని ఉపదేశముచే రావణుడు యుద్ధ విజయార్థము పాతాళ హోమము చేయుట. (యుద్ధకాండము)

11) రాముడు ఖండించిన రావణుని తలలును చేతులును మరల మరల మొలచుచుండుట. అప్రతీకారకృత్యముగ తోచిన రామునకు విభీషణుడు రావణుని నాభియందు గల అమృత కలశమును ఇంకింపజేయుటే దానికి ప్రతీకారమని ఉపదేశించుట. (యుద్ధకాండము)

ఇట్టి కొద్దిపాటి చేర్పులు మార్పులు మరికొన్ని కలవు. ఇవియును అవియును గాక కావ్య సౌందర్య సంపాదకములైన మూడు ముఖ్యగాథలు కలవు.

(1) **అరణ్యకాండమున జంబుకుమారుని కథః** రావణుడు తన సోదరియైన శూర్పణఖ యొక్క భర్తను విద్యుజ్జిహ్వుడనెడి వానిని సంహరించి భర్తృ మరణమునకు దురపిల్లు శూర్పణఖను ఓదార్చి దండకాటవిలో స్వేచ్ఛగా సంచరింపుము పొమ్ము అని అనుమతి యిచ్చెను. అప్పటికి గర్భిణిగానున్న శూర్పణఖకు జంబుకుమారు డుదయించెను. ఆ పిల్లవాడు బుద్ధి తెలిసిన పిమ్మట తన తండ్రి మరణమునకు కారణమైన మేనమామను సంహరింపగలశక్తిని సంపాదించుటకై సూర్యుని గురించి, వెదురుపొదలను తపోవనముగ జేసికొని, ఘోరతపమునకు దొరకొనెను. తల్లి ఆ కుమారునకు ప్రతిదినము వేళకు అన్నపానములు తెచ్చి యిచ్చెడిది. ఒకనాడు అతని తపమునకు మెచ్చిన సూర్యుని అనుగ్రహము వలన నిశితమైన ఒక ఖడ్గము ఆకసము నుండి వెదురు పొదలచెంత పడెను. అదే సమయమున ఫలపుష్పాదులను సేకరించుటకు అచటకు వచ్చిన లక్ష్మణుడు ఆ ఖడ్గమును చూచి దాని పదును పరీక్షించు తలపున ఆ వెదురు పొదను నరకుచుండగా జంబుకుమారుని శిరముకూడ

తెగిపోయెను నియత కాలమున ఆహార పానీయములు తెచ్చిన శూర్పణఖ అచ్చటకు చేరి కుమారుని శవమును చూచి అది ఆ ప్రాంతములనుండు తాపసుల పనిగా శంకించి వారిని చంపబూన, వారు జరిగిన వృత్తాంతము చెప్పి, లక్ష్మణుడు పోయిన మార్గము చూపిరి ఆమె క్రోధారుణనేత్రములతో లక్ష్మణుని చంప రాముని పర్ణశాల ప్రాంతమునకు జేరి దివ్యమోహన మూర్తియైన శ్రీరామచంద్రుని జూచి సమ్మోహితురాలయ్యెను. తరువాత కథ ప్రసిద్ధమే!

కరుణరస భరితమును అనతి విస్తృతమును అయిన ఈ చిన్న కథ శూర్పణఖా ప్రవేశమునకు ఉపపత్తిని కలిగించి సార్థకమయ్యెను పరిహాస పాత్రమైన ఆ రాక్షస స్త్రీ చరితము ఈ కథ వలన శోచనీయమును దయనీయమును అయ్యెను.

**(2) యుద్ధకాండమున కాలనేమి వృత్తాంతము:** యుద్ధ రంగమున మూర్ఛపోయిన లక్ష్మణుని పునర్జీవితుని చేయగల సంజీవ కరణి సంపాదనార్థము హనుమంతుడు ద్రోణాద్రికి వెడలెనని చారులవల్ల వినిన రావణుడు ఆ ప్రయత్నమునకు విఘ్నము కల్పింప దలచి ఆ పనికి మారీచుని కొడుకైన కాలనేమి అను వానిని నియమించెను. ఆ మాయావి కల్పించిన మాయల నన్నిటిని అతిక్రమించి వానిని చంపి హనుమంతుడు సంజీవ కరణిని తెచ్చుచుండగా మరల రావణుని పంపున మాల్యవంతుడు అతనిని దారిలో ఎదుర్కొని కాలనేమి వలెనే హతుడయ్యెను. హనుమంతుడు సూర్యోదయమునకు పూర్వమే యుద్ధరంగమును చేరి సంజీవ కరణిచే లక్ష్మణుని బ్రతికించెను. ఆ గడియ దాటినచో ఓషధి పని చేయదు కావున రాక్షసులు పన్నిన మాయలన్నియు హనుమంతునకు కాలయాపన చేయుటకే?

ఇందు మనల నాశ్చర్యముగ్నుల చేయునది రాక్షసుల ప్రతిక్రియాచతురత. అది అటుండ రావణ శక్తిచే మూర్ఛపడియున్న లక్ష్మణుడెప్పుడు పునర్జీవితుడగు నాయని తహతహపడు పాఠకులకు ఈ అవాంతరకథ వలన కలిగిన కాలయాపన భరింపరాని ఉత్కంఠను గలిగించి దుర్భర సంశయాస్పదమైన పరిస్థితిని సృష్టించి అంతమున చేకూరిన శుభమును ఇనుమడిగా ముమ్మడిగా ఆస్వాదయోగ్యమొనర్చుచున్నది

**(3) యుద్ధకాండమున సులోచనా వృత్తాంతము:** సులోచన ఆదిశేషుని కుమార్తె. ఇంద్రజిత్తు భార్య. తన పతి లక్ష్మణునిచే యుద్ధమున నిహతుడగుట విని సహగమనము చేయదలచి అతని కళేబరమును తెప్పించి యిమ్మని రావణుని వేడుకొనెను. మామగారు అది తనకు సాధ్యము కాదనగా అతని సమ్మతి మీద తానే రణరంగమునకు పోయి వినయమధుర వాక్యములతో రాముని స్తుతించి మెప్పించి భర్త శరీరమును తెచ్చుకొని సహగమనము చేసెను. ఎందును అబ్బురపాటు యెరుగని రావణుడు

"ఆ యింతి తెగువకు ఆ యింతి తెలివి
కా యింతి సమబుద్ధి కామహోమహిమ
కా యింతి పతిభక్తి కా యింతి వేగఁ
గాయము తెచ్చిన క్రమశక్తి యుక్తి
కేమనఁజాలక" మహాశ్చర్య చకితుడయ్యెను.

సులోచన రావణుని యింటికి ఒక మాణిక్య దీపము

పైని చెప్పిన అమూలక గాధ అట్లుండగా స్వీకరించిన కథాంశములలో నైనను ఈ రామాయణము వాల్మీకమునకు అనువాదమని చెప్పదగినదికాదు. కవిత్రయము వారి భారతరచనవలెనే ఇదియు యధోచితానుసరణమే. మరి అంతకంటెను స్వతంత్రమని చెప్పదగినది. ఇందలి వర్ణనలు చాలవరకు స్వకపోల కల్పితములు. మూలమున ప్రసిద్ధములై యున్న వర్ణనములనైనను తెనుగున తెచ్చుటకు ఇతడంతగా ప్రయత్నింపలేదు. వాల్మీకమున వర్ణనలు, సంవాదములు సాధారణముగా విస్తృతము లయియే యుండును. పురాణేతిహాసములు వ్రాసిన ఆర్షకవులలో వాల్మీకి వంటి వర్ణనాప్రియుడింకొకడు లేడు. బుద్ధారెడ్డి, వాల్మీకి వర్ణనలను చాల వరకు సంక్షేపించి తానై కొన్ని వర్ణనలను స్వయముగా చేసెను. కథా ప్రారంభమున ఇతడు వాల్మీకి ననుసరించుటకు కొంత ప్రయత్నించినను పోను పోను ఆ పద్ధతిని విరమించుకొనెనేమో యని తోచును ఇట్టి మూలాతిక్రమణము గ్రంధారంభము నుండియు క్రమక్రమముగా పెరిగి యుద్ధకాండమున పరిణమించెనని చెప్పవచ్చును. మూలమున మహేంద్రగిరిమీద జరిగిన హనుమంతుని సముద్రలంఘన ప్రారంభము కల ప్రథమసర్గ కథా భాగమును కిష్కింధాకాండాంతమున చేర్చుటచేతను, అచ్చటచ్చట మరికొన్ని వర్ణనలు తగ్గించుటచేతను ఈ రామాయణమున సుందరకాండ గ్రంథ పరిమాణము మూలముకంటె తగ్గినది ఆ కాండమును శీఘ్రగమనముతో దాటి కవి యుద్ధభూమిని విహరించుటకు తహతహ పడుచున్న వాడువలె కన్పట్టును యుద్ధకాండమునగల పెంపంతయు తదనుగుణముగానే యున్నది. పుట్టుకచేతను వర్తనచేతను శూరజనప్రవృత్తి పరిచితుడు గనుక ఆ కాండము నందలి వీర విహార ఘట్టములన్నింటిని తనివితీర వర్ణించెనేమోయని తోచును మరియు రావణుని అష్టవర్గము అతనికి హితము గరిపిన సందర్భములను అమూలకములైన కాలనేమి వృత్తాంతాదులను చేర్చుటచేతను, ఆ కాండము మరికొంత పెంపు వహించెను

రామాయణ రచనకు మూలభూతమైన వాల్మీకి శాపవాక్యమును దాని తెనుగును చూడుడు:

"మానిషాద! ప్రతిష్ఠాం త్వ
మగమః శాశ్వతీస్సమాః
యత్క్రౌఞ్చ మిథునాదేక
మవధీః కామమోహితమ్"

ద్విపద: "ఓరి నిషాదుడ యోరి పాపాత్మ!
యోరి నీకెగ్గేమి యొనరించె తొల్లి
కామించి క్రౌంచముల్ గవయుచో నొకటి
నేమిటికై చంపి తిబ్బంగిc కడగి
ఈ పాపమున నీవనేక దుఃఖములు
ప్రాప్తించి తిరుగుము బహువత్సరములు."

శాపము అశనిపాతము వంటిది దానిని అల్పాక్షరములతోనే వ్యక్తము చేయుట ఉచితము. అట్లుకాక పెక్కు మాటలలో తిట్టినపుడు శాపముయొక్క తీక్ష్ణత మందగించిపోవును. పై ద్విపద పంక్తులలో గల తిట్ల వలన శాపము పేలవమైనది ఈ రహస్యమును గుర్తెరింగియే కాబోలు భాస్కర రామాయణమున "మా నిషాద"

అను శ్లోకము తెనింగింపబడక యథాతథముగ ఉల్లేఖింపబడినది. ఇంతకంటెను ఎక్కువ పేలవత్వము మరికొన్నిచోట్ల గూడ తటస్థించి సందర్భ శుద్ధిని చెడగొట్టెను.

ధనుర్భంగ ఘట్టమున వాల్మీకమున ఈ క్రింది విధముగ నున్నది:

"విశ్వామిత్ర స్స ధర్మాత్మా
శ్రుత్వా జనకభాషితం
వత్సరామ! ధనుః పశ్య
ఇతి రాఘవ మబ్రవీత్."

(ధర్మాత్ముడైన విశ్వామిత్రుడు జనకుడు చెప్పినది విని "వత్స! రామ! ఆ ధనువును చూడుము" అనెను) ఆ సందర్భమున విశ్వామిత్రుడు చేసిన ప్రసంగమంత మాత్రమే! రాముడు ఆ రాజర్షియొక్క ఆదేశానుసారముగ

"ఆరోపయిత్వా మౌర్వీంచ
పూరయామాస తద్ధనుః
తద్బభంజ ధనుర్మధ్యే
నరశ్రేష్ఠో మహాయశాః"

సందర్భోచితముగా, సంగ్రహముగా చెప్పబడిన యీ యుదంతయు ఈ రామాయణమున పేలవమైన అతి ప్రసంగముగ పరిణమించినది.

**బాల కాండము:**

"అక్కజమగు శక్తి నా విల్లు రాము
డెక్కు పెట్టుచునుండ నెఱిగి కౌశికుడు
హరుని చాపము రాముఁ డతిసత్త్వయుక్తి,
బెరిగి నే డిదె యెక్కు పెట్టుచున్నాఁడు
అదరకు భూదేవి యాత్మలో నీవు,
కదు నే మఱకుఁడు దిక్పతులార మీర
లని యని పల్కఁగ నా మేటి విల్లు
గొనయ మెక్కించి గైకొనక రాఘవుఁడు
తన బాహుసత్త్వంబు దర్పంబు మెరసి,
జనకుని కనియె నా చాపంబు చూచి
యిది చాలఁ జులకన యిది చాలఁ బ్రాఁత
యిది చాల నిస్సార మిది చాల నలంతి
తెగగొన నిలవదు దీని నా యెదుట
బొగడితి పలుమాఱు భూపాల యనుచు
సురలు ఖేచరులు భూసురులు గిన్నరులు
నరులును నృపతులు నరిఁ బర్వి చూడ
నెడపక తన జయంబెల్లను జాటు
వడువున విలు గుణధ్వని చెలగించి
సీత గుణంబులు చెవిసోక దిగువ

వడి రక్కసుల పట్టు వదల నన్నట్టు
పిడిపట్టు వదలినఁ బెకలి పేరెత్తి
ఫెళ ఫెళ ధ్వనులును బెట బెట ధ్వనులు
కలయ దిక్కులద్రువగాఁ బెల్లు విఱిగి"

ఈ ప్రగల్భ వాక్యములు వినయసుందరస్వభావుడైన రాముని నోట రాదగినవికావు. విశ్వామిత్రుని పల్కులును ఆ ఋషి గాంభీర్యమునకును కళంకములే.

వేశ్యలు ఋష్యశృంగుని ఎలయించి కొనిపోవు ప్రకరణమున గూడ ఈషదనౌచిత్యము కలదు.

ఆర్షకవులకును లౌకికకవులకును గల భేదమును, లౌకికకవులు భావ నిగ్రహము లేక సందర్భౌచిత్యము చెడగొట్టెడి విధమును నన్నెచోడుని చరిత్రలో చెప్పితిని. ఆ సిద్ధాంతమే ఇయ్యెడను వర్తించును.

ఈ ధనుర్భంగానంతరంబున జరిగిన సీత వివాహఘట్టము వాల్మీకమున అతి సంగ్రహముగా వివాహకల్పవిధానానుగుణముగ, నిరాడంబరముగ చిత్రింపబడెను. బుద్ధారెడ్డి ఈ యెడగూడ ఆర్ష కవిత్వమునకు తన లౌకికకవిత్వమునకు గల భేదమునకు మఱియొక మాఱు లక్ష్యభూతము కాదగినట్లుగా కథాంశమును ప్రవచించి పెండ్లి పందిరి వేయుట మొదలు అంపకాల వరకును గల నాలుగు రోజుల వివాహమును అతివైభవోపేతముగ చిత్రించెను. ఈ వర్ణన నిజముగా సంపన్నులయిన ఆంధ్రకుటుంబముల యందు జరిగెడి వివాహములకు ప్రతిబింబము ఇది మూలమును అతిక్రమించుటయే యైనను ఆక్షేపణీయము కాదు. తెలుగు కవులు, విశేషించి ప్రబంధకర్తలు, ఇటువంటి రమణీయ దృశ్యములను తనివిదీర వర్ణించియే తమ కావ్యములను శోభాలంకృతము లొనర్చిరి భావనా బలముచే లోకాంతర కాలాంతర వస్తుదర్శనము చేయగల ప్రజ్ఞాశాలి యైనను సాధారణముగా, ఏ కవియు తన కాలమునాటి తన జాతిసంప్రదాయములను ఆచారవ్యవహారములను కథలో చొప్పింపక మానడు. అట్టి కల్పనలు మూలకథకు భంజకములు కానప్పుడు హృదయంగమములును ఆదరణీయములును అగును.

ఈ రామాయణములో అవాల్మీకమైన ఇంకొక ముఖ్యాంశము రామపాత్ర చిత్రణములో కలదు. వాల్మీకమున శ్రీరాముడు విష్ణుదేవు నంశమున నవతరించెనని పుత్రకామేష్టి మొదలగు కొన్ని సందర్భములలో చెప్పబడినను కథాకార్యమునకు రామవర్తనమునకును సంబంధించినంతవఱకును వాల్మీకి శ్రీరాముని ఉత్తమ పురుషునిగానే చిత్రించెను గాని పురుషోత్తమునిగా చిత్రింపలేదు. రామాయణమునకు ప్రస్తావన ప్రాయమైన నారదవాల్మీకిసంవాదమున వాల్మీకి అడిగిన ప్రశ్న "ఇప్పటి లోకమున సర్వోత్తమ గుణ మహితుడైన పురుషుడెవరో చెప్పుము" అని. ఆ పంక్తులివి:

"కోన్వస్మిన్ సాంప్రతం లోకే
గుణవాన్ కశ్చవీర్యవాన్
ధర్మజ్ఞశ్చ కృతజ్ఞశ్చ
సత్యవాక్యోదృఢవ్రతః
చారిత్రేణ చకోయుక్తః

సర్వభూతేషు కోహితః
విద్వాన్ కః క స్సమర్థశ్చ
కశ్చైక ప్రియదర్శనః
ఆత్మవాన్ కోజితక్రోధో
ద్యుతిమాన్ కోఽనసూయకః
కస్యబిభ్యతి దేవాశ్చ
జాతరోషస్య సంయుగే।
ఏతదిచ్ఛా మ్యహంశ్రోతుం
పరం కౌతూహలంహి మే
మహర్షేత్వం సమర్థోఽసి
జ్ఞాతుమేవం విధం నరం."।

ఈ ప్రశ్నలో పేర్కొనబడిన గుణ విశేషములకు లక్ష్యభూతుడు కాదగిన వాడు రాముడేయని యెఱిగి ఆయన చరితమును నారదుడు సంగ్రహముగ వాల్మీకికి చెప్పెను. వాల్మీకి రామాయణము నంతను ఈ గుణ పరిగణన సూత్రానుసారమే నడపెను. వాల్మీకి శ్రీరాముని పరమేశ్వరత్వము నెఱుంగక పోలేదు రామాయణమున అది అంతర్వాహినిగా నుండనే యున్నది.

ఇక బుద్ధారెడ్డి, ప్రసక్తి వచ్చినప్పుడెల్ల రాముని వైకుంఠధాముడనియే వాచ్యముగా పేర్కొనుచుండును ఈ కవి నిజముగ రామభక్తుడు తన భక్తి పారవశ్యము పాత్రకు కూడ నాపాదించి శ్రీరాముని రాజుగా గాక దేవునిగా వారిచే కొల్పించుచుండును. కావ్యముల వలన లోకము గ్రహింపదగిన నీతులును ధర్మములును ఏమైన యున్నచో అవి మానవునకు ఆచరణయోగ్యములై యుండవలయును. అందుకై కావ్యము స్వీకరించెడి ఆలంబన విభావము (పాత్రలు) మానవలోకమునకు అతీతమూర్తిగా నుండరాదు. అట్టివారి చరితములను దేవలోక చరితములుగా దూరముగా నుండియే నమస్కరింతుము గాని మన నడవడికి ఒరవడిగా గ్రహించుటకు ప్రయత్నింపలేము. కాన ఆచరణయోగ్యమైన ధర్మోపదేశమునకు ఉత్తమ మానవుని చరితమువలె దేవతా చరితములు అంతగా ప్రయోజనకారులు కాజాలవు. భగవన్నామకములైన పురాణములలో రాణించినంతగా అవి మానవనాయకములైన కావ్యములలో రాణించవు ఈ కవి ఏవంవిధ కావ్యధర్మమును విస్మరించినను పాఠకులకు శ్రీరామపాదభక్తిని దోసిళ్ళతో జూరగొననిచ్చెను

వాల్మీకి దృష్టికిని ఇతనిదృష్టికిని గల భేదమునకు ఇంకొక కారణమున్నది. సామాన్య మానవులవలె యోగులును, ఋషులును, అవతారపురుషులను చూచి విభ్రమాశ్చర్యముల పొందరు. వారు పరమాత్మకు సన్నిహితులు. మనము దూరస్థులము లౌకిక కవులలో ఏ మహానుభావులో ఒకరిద్దరు తప్ప సామాన్యులెల్లరు ఆ యెడమును అతిక్రమింపలేరు.

ఈ రామాయణమునకు విశిష్టతను ఆపాదించిన ముఖ్య విశేషమింకొకటి కలదు. బాలకాండమున అయోధ్యలో బయలుదేరిన రామకథ క్రమముగ ఆర్యావర్తమును, దండకారణ్యమును, కిష్కింధారాజ్యమును, సముద్రమును దాటి 'యుద్ధకాండమున

లంకలో ప్రవేశించి కించిదవశిష్టముగా అచటనే ముగియును. ఈ తుది ఘట్టమునగాని పాఠకులకు రావణుని యొక్కయు అతని సంసారము యొక్కయు స్థితిగతులను గూర్చి యథార్థజ్ఞానము కలుగుటకు అవకాశములేదు అందుచే లంకా పట్టణము దయ్యాల కొంపయనియు, రావణుడు దయ్యాల దైవమనియు భ్రమతో భయపడుదుము వాల్మీకమును సూక్ష్మపరిశీలన చేసిన వారికి గాని ఆ సంసార నిజస్వరూపము బోధపడదు బుద్ధారెడ్డి రావణ సంసారమును వాల్మీకి కంటె ఎక్కువగా స్పష్టతరముగా చిత్రించెను. ఆ సంసారములో రావణుని తమ్ములును తల్లియు భార్యయు కోడలును తక్కిన బంధుకోటియు రాముడు సాక్షాత్తు విష్ణువేయని ఎరిగి యుండుటయేగాక అతని మహత్త్వమును హనుమదాది భక్తులతో సమముగా కీర్తించి రావణునకు హితము గరపిన సజ్జనులు.

ఆ రావణుని స్వభావమునైనను పైకి కానవచ్చునంత ఆసురముకాదు. అతడు ఎంత లోకభీకరుడైన శూరుడో అంత మహోదారుడైన వీరుడు. క్షుద్రములైన క్రౌర్యాసూయలచే కన్నులు మూసికొనిపోయి యెదిరి ఘనతను మెచ్చని అంధుడు కాడు. ప్రపంచము అరావణమో అరామమో కావలెనని గట్టి పగబూని యుండియు, ఆ రాముని ధనుర్విద్యా కౌశలమును చూచినంతనే తలయూచి మెచ్చి బట్టుకైవడి పొగడిన గుణగ్రహణ పారీణుడు

*"నల్లవో రఘురామ నయనాభిరామ!*
*విల్లు విద్య గురువ వీరావతార*
*కరశరలాఘవ క్రమకళానిపుణ*
*స్ఫురదుపచార సంశోషిత కృపణ*
*భుజసార దృఢముష్టి భువన విఖ్యాత*
*విజితరిపువ్రాత విజయ సమేత*
*మానవరాజకుమార కంఠీర*
*వా! నవ్య దివ్య శస్త్రాస్త్ర సంపన్న*
*స్ఫార! ఘోరాక్షయబాణ తూణీర*
*వీరాగ్రగణ్యయో విశ్వశరణ్య*
*బాపురే! రామ భూపాల! లోకముల*
*నీపాటి విలుకాడు నేర్చునే కలుగ*
*పాటించి పురములపైబడ్డ హరుని*
*ఏటొప్పనిందు నీయేటొప్పగాక"*

ఈ పొగడ్త యాదైత్యవిభు మంత్రులకు వెగటయ్యెను "పగవాని నీ రీతి పంతంబు విడిచి" పొగడ రాదనియు "పొగడిన భయ మందబోలు నటంచు" "పగవారు తనవారు పలుచగా జూతు" రనియు మందలించిరి వారి మాటలకు దశకంఠుడు నవ్వి "మేటిశూరుల పెంపు మెచ్చంగ వలదె?" యని నీతి చెప్పుచు అచ్చోటు వాసిపోయెను.

ఇంతమాత్రమేకాదు – రాముడు సాక్షాద్విష్ణు స్వరూపుడని యెరిగిన మహాజ్ఞాని యీ రావణుడు. ఆ జ్ఞానమును మనమున నిగూఢముగ నుంచుకొని శత్రు సాధనచే

ఆ రాముని చేతిలో కడతేరి సాయుజ్యసుఖమును పొందగోరిన ముముక్షువు హితము గరపవచ్చిన భార్యకు—

"శ్రీరామ శరములచే జత్తునేని
నాకవాసులు మెచ్చ నా కోరుచున్న
వైకుంఠ మెదురుగావచ్చు నిచటికి
లలన! నీవేటికి? లంక యేమిటికి
దలకొన్న ముక్తి సత్పధము గై కొందు"

అని సమాధానము చెప్పెను. అతనికి సనకసనందనాదుల శాపవశమున రాక్షస జన్మమెత్తిన జయుడనని స్మృతి కల్గెనేమో! రావణుని ఈ పలుకుల అర్థములో ఈషద్భాగము సూచనా మాత్రముగా వాల్మీకమున ఇట్లున్నది కాని దాని సందర్భము వేరు.

"యస్య విక్రమ మాసాద్య
రాక్షసానిధనం గతాః
తం మన్యే రాఘవం వీరమ్
నారాయణ మనామయమ్."

ఎవని విక్రముచే ఈ రాక్షసులందరు నిహతులైరో వీరుడైన ఆ రాఘవుని నేను, అనామయుడైన నారాయణుడే అనుకొందును

బుద్ధారెడ్డి, పాల్కురికి సోమనాథునకు ఇంచుమించు సమకాలికుడు ఈ ద్విపద కావ్యకర్త లిరువురలో ఒకడు పరమశైవుడు ఇంకొకడు పరమ వైష్ణవుడు బుద్ధారెడ్డి రామాయణము సోమనాథుని బసవ పురాణమునకు సారస్వత లోకమున ప్రతిస్పర్ధిగా జనించి జయము గొనెను.

సోమనాథుని రచనలో గల పాతబడిన మాటలు, లక్షణ విరుద్ధ ప్రయోగములు ఈ రామాయణమున కానరావు. నిర్దుష్టమైన భాషలో ధారళమును ప్రసన్నమును అయిన శైలిలో నడచిన ఈ గ్రంథము ద్విపద వాఙ్మయశాఖలో అగ్రగణ్యముగ వన్నె కెక్కినది. బుద్ధారెడ్డి ఉదాత్తమైన గాథలను కూడా ద్విపదలలో వ్రాయవచ్చునని రామాయణము ద్విపదగా రచించి, ద్విపదలో రచన కుదరదేమోనన్న భ్రమను తొలగించినాడు. ఈతడు నన్నయభట్టుచే ప్రతిష్ఠింపబడిన భాషననుసరించి తన రచన సాగించెను అందువలననే రంగనాథరామాయణము లాక్షణికులలో ప్రామాణికత్వమును సంపాదించుకొన్నది

## కవిబ్రహ్మ తిక్కనసోమయాజి

**వంశము - జీవితము:**

ఏ దేశమందైనను కార్యదక్షులైన మంత్రులును, ఖడ్గనిపుణులైన శూరులును, కావ్యనిర్మాతలైన కవులును, ధర్మోపదేష్టలైన ఆచార్య పురుషులును, తత్త్వజ్ఞాన సంపన్నులగు ఆధ్యాత్మిక సాధకులును ఉందురు. కాని యీ మహత్త్వములన్నియు ఒక పురుషుని యందే రాశీభూతమై యుండుట మాత్రము అరుదు. ఉన్నచో

ఆ మహామహుడు తన జాతియొక్క పుణ్యవశమున అవతరించినవాడని చెప్పదగును అతడు తన నడవడిని తన జాతి అవలంబింపవలసిన నానా విధ ధర్మపథములకు మార్గదర్శకమొనర్చి ఆ చరితమును తీర్చిదిద్దును. 13వ శతాబ్దిని ఆంధ్ర జాతిలో అట్టివాడుగా అవతరించిన మహానుభావుడు కొట్టరువు తిక్కనార్యుడు.

ఈ వంశమువారు పెక్కు తరములుగ దండనాథులుగ మంత్రులుగ ఉన్నత పదస్థులై యుండి ఆంధ్రజాతిని సేవించి ప్రతిష్ఠ గడించుకొన్నవారు తిక్కన పితామహుడగు మంత్రి భాస్కరుడు "గుంటూరు విభుడు" "సారకవితాభిరాముడు." ఆంధ్ర పద్య కాదంబరిని రచించిన కేతనకవి, ఆ భాస్కరుని కుమారులలో నొకడగు కేతన మంత్రియే కావచ్చునని పలువుర నమ్మకము. అనగా ఈ కవి భారతకర్తయగు తిక్కనకు పెద్దతండ్రి. మఱి తిక్కన తండ్రి కొమ్మన, "దండనాథుడు", "సాంగవేదవేది" ఈ దండనాథుని అన్న కుమారుడే కదన భీముడని పేరుగాంచిన ఖడ్గతిక్కన ఈయన తండ్రి, మనుమసిద్ధి తండ్రికి మంత్రిత్వము నెఱపిన సిద్ధనమంత్రి. భారతకర్తయగు తిక్కన గంటము పట్టుటలో ఎంత కుశలుడో ఈ కదన భీముడైన తిక్కన ఖడ్గము పట్టుటలో అంత కుశలుడు కాబట్టియే సపత్న నామములగు వారిరువురిలో ఒకరిని కవి తిక్కనయనియు రెండవవారిని ఖడ్గతిక్కన యనియు లోకము పేర్కొనుట అచారమైనది. ఖడ్గతిక్కన కవిత్వము చెప్పగలవాడౌనో కాదో తెలియదు గాని కవితిక్కన మాత్రము గంటమును ఖడ్గమును పట్టగల వీరుడేయని దశకుమార చరిత్రకర్త కేతన వాడిన విశేషములను బట్టి విదితమగును. తిక్కనగారి మహోదార జీవితమును, అయన రమణీయ రూపమును దశకుమార చరిత్రావతారికలో శబ్దచిత్రిత మొనర్చి ఆ మహాపురుషుని వర్ణచిత్రము లేని లోటును తీర్చిన మహోపకారి కేతనకవి. కేతన తన కృతిపతిని "తిక్కచమూప" "తిక్కదండాధీశా" "దుర్గమశాత్రవపార్శ్వభేది" ఇత్యాది విశేషణములతో సంబోధించెను.

ఆ కాలమున రాజులును మంత్రులును వ్యూహ నిర్మాణదక్షులై యుద్ధ రంగమున సైన్యములను నడపగల సేనానులుగా వర్తించిరేగాని, తాము ప్రాసాదములలో క్షేమముగా కూర్చుండి సేనలను రణదేవతకు బలి యొసంగిన భీరువులు కారు రాజునకు క్షాత్రమును, విప్రునకు బ్రాహ్మ్యమును సమాజ ధర్మములే. ఆ విప్రుడు మంత్రియేయైనచో "ఇదం బ్రాహ్మ్య మిదం క్షాత్రమ్" అని ఉద్ఘాటించుచు ఉభయ ధర్మములను నిర్వహించుచుండును. కొట్టరువు తిక్కనయు అయన తాత తండ్రులును ఇట్టి విశిష్టతగల మంత్రులు. వారి యింటి మహిళామణులు సైతము వీరమాతలుగా, వీరపత్నులుగా, వీరవనితలుగా వెలుగొంది మహాభారతము నందలి మహిళామణులను తలపించుచుందురు.

నెల్లూరి తెలుఁగు చోడులలో రాణకెక్కినవాడు మనుమసిద్ది తండ్రియైన తిక్క రాజు. ఇతడు అరిభయంకరుడై రాజ్యమేలెననియు, పదభ్రంశము నొందిన రాజులకు సాయము చేసి వారిని తిరిగి సింహాసనప్రతిష్ఠితులను చేసెననియు చరిత్రకారులు చెప్పుచుందురు. అట్టి శూరుడు నెల్లూరిపై దండెత్తి వచ్చిన పాండ్యుని రెండుమార్లు పరాజితుని చేసి మూడవమారు ప్రతికూల దైవవశమున 1258 వ సంవత్సరమున రణ నిహితుడయ్యెనట. కొందరు ఆయన రణనిహతుడు కాలేదనియు వ్యాధిగ్రస్తుడై

1249-50 మధ్య కాలముననే మరణించెననియు చెప్పెదురు. తదుపరి అనతి కాలములోనే అతని కుమారుడు మనుమసిద్ధి కాకతీయ చక్రవర్తుల సాయముతో పాండ్యుని నెల్లూరినుండి తరిమివైచి, తాను పైతృకమైన సింహాసన మధిష్ఠించెను. ఇవి ఒక పక్షమున 1250 లో గాని, రెండవ పక్షమున 1259 లో జరిగియుండవచ్చును.

మనుమసిద్ధి సింహాసనారోహణమును తిక్కన మంత్రిపదవీస్వీకారమును ఏక కాలికములేయని పలువురి అభిప్రాయము. వెనువెంటనే, మనుమసిద్ధి దాయాదుడు విజయాదిత్యుడు కొంతమంది రాజ విద్రోహులను కూడగట్టుకొని అతనిని తరిమివేసి సింహాసన మాక్రమించెను. మనుమసిద్ధి చేయునది లేక కందుకూరు ప్రాంతమున ఒక పల్లెలో సకుటుంబముగా దలదాచుకొనవలసి వచ్చెను. అట్టియెడ రాజభక్తి పరాయణుడైన తిక్కనమంత్రి గణపతి దేవుని వద్దకు రాయబరిగా వెళ్ళి, ఆ చక్రవర్తిని బహువిధముల మెప్పించి ఆయనచే పూజలంది, కాకతీయ సైన్యమును తోడ్కొనివచ్చి శత్రువును జయించి రాజును పునః ప్రతిష్ఠితుని జేసెను. గణపతి దేవుడు 1262వ సంవత్సరమున మరణించెను. కనుక తత్పూర్వమే మనుమసిద్ధికి సాయమొనర్చియుండును.

మనుమసిద్ధికి మంత్రి కాక పూర్వమే తిక్కన తన పెదతండ్రియైన సిద్ధన మంత్రి నియమించిన యేదో ఒక ఉన్నతోద్యోగము చేయుచు, తిక్కరాజు పరిపాలనా కాలమునకూడ వన్నెయు వాసియు సంపాదించి యుండును. ఆ యోగ్యతను బట్టియే తిక్కరాజునకు మంత్రియైన తన పెద తండ్రివలె, తానును మనుమసిద్ధికి మంత్రియై రాజ్యభారమును వహించెను. ఆనాటికి తిక్కనకు ఇంచుమించు నలుబది, నలుబదియైదు సంవత్సరముల ప్రాయముండును. ఏనాడైనను అనుభవశాలియు పరిణత బుద్ధియు అయినవాడే మంత్రి పదవికి అర్హుడు. దేశము అల్లకల్లోలముగా నున్న ఆ కాలమున అట్టివాడే మంత్రియగుట, మఱియు అవశ్యకము. ఈ ఊహ నిజమైనచో తిక్కన 1205-1210 మధ్య కాలమున జన్మించి యుండును.

ఆయన 1288 వ సంవత్సరము దేహయాత్ర చాలించినట్లు ఒక శాసనమునుబట్టి చారిత్రకులు నిర్ణయించిరి అగుచో ఇంచుమించు 13 వ శతాబ్ది ప్రథమ దశనుండి తుది దశవరకు ఆయన జీవితము విస్తరించి యుండెనని అనుకొనవచ్చును. మరియు ఆయన సహస్రమాసజీవి యనియు పూర్ణపురుషాయుషభాగ్యమనుభవించిన వాడనియు, పరంపరాగతమైన జనశ్రుతి గలదు.

తిక్కన అవసాన కాలమువరకు మంత్రిత్వ భారమును మోయుచుండెననుకొనుట సమంజసముకాదు. అంతకు పదిపండ్రెండేండ్లకుముందే లోక వ్యవహార వాసనాస్పర్శ తగలని దీక్షతో భారతరచనా వ్యగ్రుడై దానిని పూర్తిచేసి యుండును. తిక్కన మరణానంతరము 1290 లో మనుమసిద్ధి దుష్టుల దుర్భోధలవల్ల సర్వస్వాతంత్ర్యము సంపాదింపవలెననెడి అడియాసతో రుద్రమదేవిపై తిరుగుబాటు చేయగా రుద్రమదేవి మనుమడగు ప్రతాపరుద్రుడు నెల్లూరిపై ఎత్తి వచ్చి మనుమసిద్ధిని అంతమొందించి అతని కొడుకైన నల్లసిద్ధిని సామంతరాజుగా నెల్లూరి సింహాసనమున కూర్చుండబెట్టెనట ఇదే నిజమైనచో కృతఘ్నతా ఫలముగా మనుమసిద్ధికి సిద్ధించిన ఆ విపత్తు తిక్కన కనులార చూడవలసిన దుస్స్థితి పట్టలేదని సంతసింపదగును. ఇరువది ముప్పది

సంవత్సరములు నిర్విఘ్నముగా సర్వతోభద్రముగా మనుమసిద్ధిచే రాజ్యమేలించి, తాను రాజోచిత వైభవోపేతముగా మంత్రిత్వము నెరపి కృతార్థ జీవనుడైన తిక్కనగారి బహువిధ పురుషార్థములలో ఈ చరిత్రకు కావలసినది మహాకావ్యరచనా పురుషకారమేయైనను అనుషంగికముగా తక్కిన మహాకార్యములనుకూడ వివరించుట కారణబద్ధమే యగును గాని అప్రస్తుతము గాదు.

తిక్కన మన వాఙ్మయమున నెంత ప్రసిద్ధుడో చరిత్రయందును అంత సుప్రసిద్ధుడు. అయన సకల సాహిత్య విజ్ఞానమునకును గురుపీఠమై విలసిల్లగా ఆయన గృహము ఒక మహా గురుకులముగ రూపొందెను. తమ కృతులు వినిపించి అయన మెప్పు పడయుటకు వచ్చు కవులు, మంత్రాలోచనమునకై వచ్చు సచివ వతంసులు, ధర్మతత్త్వ మీమాంసలు చేయనేతెంచు పండిత ప్రకాండులు మొదలగు ప్రముఖులతో ఆయన ప్రాంగణ మెల్లప్పుడును నిండియుండెడిదట. వైదుష్యము వల్లనేకాక మంత్రిత్వ ప్రాభవము వలనను ప్రజలకాయన మాటల యందు అధిక గౌరవముండెడిది కావుననే అయన నిత్యము తన యింట విద్యజ్ఞులతో చేసెడి చర్చలు, వీటివలన తేలెడు సారాంశములు దేశమున నలుదెసల శాసనములవలె వ్యాపించెడివి కాబోలు. ఇట్లాయన ఆచార్య పీఠమున నధిష్ఠించి తానే ఒక సర్వవిద్యాసంస్థగా (an institution in himself) సకల రంగములందును శ్రేయోమార్గముల నుపదేశింపజొచ్చెను ఆనాటి విజ్ఞానమునకు ఆయనయే మూాదల ఏ మతాధికారి, ఏ సారస్వతోపాసకుడు గాని, ఏ రాజకీయవేత్త గానీ నిగ్రహింపలేని సమగ్రత అమూర్తిలో నున్నది. ఎవరైన వానిని చూడ నేగుచో అతడు చేయునది ఒక్క వ్యక్తి దర్శనమే కాదు ఒక మహాసంస్థను వానిలో అతడు గుర్తించును సనాతనధర్మముతో కూడి, ఒక ప్రత్యేక విశిష్టత గల ఆంధ్రవీరజాతిని సృష్టింప వాని ప్రయత్నము. ఇట్టివాడేకాన, ఆంధ్రావళి మోదంబొరయ భారతమును రచించుచున్నానని వ్రాయగల్గినాడు ఆముష్మికమును విసర్జించిన ఐహికమును, ఐహికమును త్యజించిన అముష్మికమును కాదు వీనిది. ఐహిక సుఖముల ననుభవించుచు, ఆముష్మిక దృష్టిని విడనాడవలదని వీని సమన్వయము అప్పుడే ధర్మవీరులు సృష్టింపబడుదురు.

ధర్మ ప్రబోధమునకు సాహిత్యము చక్కని సాధనము. సరస సాహిత్యముద్వారా ధర్మతత్త్వ విశేషములను ప్రజలకందించుట అతి పురాతనమైన లోకాచారము. అట్టి భవ్యసాహిత్య సృష్టి, రాజులు, మంత్రులు మొదలగు ఉత్తమ పదస్థులు దూరదృష్టితో ప్రోత్సహించిననే కాని వర్ధిల్లదు. అందువలన తిక్కన తనయొద్దకు చేరుచుండిన కవులకు పండితులకు ఉత్తమ సాహిత్య రీతులను వివరించి వారు సరసములు, శ్రేయోదాయకములునగు కావ్యములను రచించుటకు దోహదమొనరించుటయే కాక ఆగ్రంథములు సంఘమున పెద్దల ఆదరాభిమానములు చూరగొనునట్లుగను, ప్రజలయందు ప్రచారము నొందునట్లుగను గోష్ఠులు, సభలు, సమావేశములు మొదలగు వాటి మూలమున ప్రయత్నించియుండును. ఈ సారస్వత కృషిలో ఒక భాగమే అయన కవులవలన కృతి స్వీకారము పొంది వారిని సన్మానించుట. ఆయన కృతి పతిత్వమునకు నోచుకొన్న గ్రంథములలో భాగ్యవశమున దశకుమారచరిత్రము మాత్రము మిగిలినది. ఆ యదృష్టము కేతనదే కాదు, మనది కూడ ఆ గ్రంథము

సజీవమై యుండబట్టియే మహాపురుష లక్షణలక్షితమైన తిక్కన మహోదారమూర్తిని ప్రత్యక్షముగా గాకున్నను మనోనయనములతో నైనను చూడగల్గుచున్నాము

దశకుమారచరితము నంకితముగ గొను నాటికి ఆయన లోక సంగ్రహ పరాయణుడై యెన్ని విధముల కృషి చేయుచుండెనో, లోకులాయన మహనీయతను గుర్తించి యెట్లు పూజించుచుండిరో, దశకుమార చరితము నందలి వాక్యముల వలన గ్రహింపవచ్చును అప్పటికే ఆయనకు ఉభయకవిమిత్రుడన్న బిరుదము రూఢమయ్యెను

కం॥ "అభినుతుడు మనుమ భూవిభు
సభఁ దెనుఁగున సంస్కృతమున జతురుండై తా
నుభయకవిమిత్ర నామము
త్రిభువనముల నెగడ మంత్రి తిక్కఁడు దాల్చెన్"

సంస్కృత పండితులును, కవులును దేశభాషాకవులను సరకు సేయకుండుట పరిపాటి. ఎవరో కొందరు ఉదార చిత్తులైన పండితకవులు తప్ప సాధారణముగ కేవల శాస్త్ర పారంగతులైన పండితులు తెలుగుకవులను చిన్న చూపే చూతురు. తెలుగు కవులా తిరస్కారమును సహింపక ప్రతీకారాధిక్షేపణలు చేయుటయు సహజమే! సంస్కృతపాండిత్యము కల్గి ఉభయభాషల యందును కవిత్వము చెప్పనేర్చి దేశభాషా సాహిత్యావశ్యకతను గుర్తించిన మహనీయుడు ఈ రెండు వర్గముల వారిని సమదృష్టితో చూచుచు సమముగ నాదరించుచు పొరుపులులేని పొత్తును సంఘటింపగలడు అట్టివాఁడు ఉన్నతపదస్థుడై మాటచెల్లుబడి గలవాడైనప్పుడే అది సాధ్యమగును. అట్టి ప్రాభవమును పదవియు గలవాడు అనాడు తిక్కన ఒక్కడే! ఆయన ప్రాపును కోరి చెంత చేరిన కవులలో సంస్కృత కవులును తెలుగు కవులును కలిసియేయుండిరి. అప్పటి తెలుగుకవులు సైతము సంస్కృత మెఱుగని అపండితులు కారు అయినను సంస్కృత కవులు వారిని మెచ్చకపోవుటకు కారణము తెలుగు కవిత్వము నెడ వారికిగల చిన్నచూపేగాని తెలుగు కవుల సంస్కృత రాహిత్యముకాదు.

11వ శతాబ్ది మధ్యభాగమున ఆంధ్ర భారతావిర్భావము జరిగినను తత్పూర్వము నుండియు సంస్కృతాభిమానులకు తెలుగునెడ గల నిరసన భావము తిక్కన నాటికికూడ శమింపలేదు కాబోలు! కావుననే ఆయన ఉభయ భాషా కావ్య రచనలచే, ఉభయ కవుల పోషణతో – ఆ రెండు వర్గముల వారికిని పొత్తు కుదర్చవలసిన భారము వహించెను. తిక్కనార్యుడు సంస్కృత గ్రంధములను రచించియుండు ననుటకు సందేహము లేదు ఒక దృష్టాంతము చూడుడు కాకతీయుల ఆడపడుచును, బుక్కరాయని కోడలును, కంపరాయని అర్ధాంగియునైన గంగాదేవి తన భర్త తురుష్కసంహార మొనర్చి సాధించిన ఘనవిజయములను "మధురావిజయము" అను పేర సరసమైన ఒక చారిత్రక కావ్యముగా సంస్కృతమున రచించెను. ఆ గ్రంధావతారికలో పూర్వ సంస్కృత కవుల స్తుతించు సందర్భమున ఆమె తిక్కనార్యుని కూడ స్తుతించెను ఆ శ్లోకమిది:

"తిక్క యజ్వ కవే స్సూక్తిః
కౌముదీవకలానిధేః

స తృష్టైః కవిభి స్స్వైరం
చకోరైరివ సేవ్యతే!"

కవులు కళానిధియైన తిక్కన సోమయాజి కవియొక్క భాషణమును దప్పిగొన్న చకోరములు కళానిధియొక్క కౌముదినివలె నిరాతంకముగ ఆస్వాదింతురు

ఈ ప్రశంసకు విషయభూతమైనది తిక్కనార్యుని సంస్కృత కావ్య రచన అనుటకు సందేహపడ నక్కరలేదు. అట్లుగాక గంగాదేవి ఆయన భారతమునే అట్లు కొనియాడెనని తలంపవచ్చును గాని, సంస్కృత కవయిత్రి సంస్కృత కావ్యమున సంస్కృతపూర్వకవి స్తుతిచేయు సందర్భమున సంస్కృతకవియైన తిక్కననే స్తుతియించి యుండెననుకొనుట లెస్స.

ప్రత్యేక గ్రంధ రచనలు చేయక పూర్వమునుండియు ఆయన చాటువులైన పద్యములను, శ్లోకములను రచించుచు ప్రాచీన కావ్య ప్రౌఢిని వివరించుచు సమకాలీన రచనయందలి గుణ దోషములను విమర్శించుచు సత్కావ్య రచనా గోష్ఠులను నిర్వహించుచు కవి కులగురువుగా విలసిల్లి యుండును. అట్టి ఉపదేశాచరణముల వల్లనే నాడేకాక నేడును కావ్యానుశాసనకర్తగా పూజ్యుడయ్యెను. శాసనములో ఒక భాగమే నిర్వచనోత్తర రామాయణావతారికలో సూచింపబడిన ఉత్తమకావ్యలక్షణములు

వాటిలో కొన్ని సోమనాధాదులను విమర్శించెడి అధిక్షేపణ వాక్యములును, కొన్ని సార్వకాలికములైన కవితా శిల్ప మర్యాదలును కలవు సోమనాధుడు మాటిమాటికి తెలుగు వాక్యములలో సంస్కృత వాక్యములను – శ్రుతి స్మృత్యాగమాదులందలివి – చొప్పించుచు శాంత ప్రాసమును కూర్చు[1] విశేషణ విశేష్యములకు లింగ వచనములం దుండదగిన భేదము నొప్పరికించుచు వళులు ప్రాసలు పులిమి పుచ్చుచు తన నిరంకుశత్వమును ప్రకటించెను ఈ దోషములనన్నింటిని తిక్కన నిరసించెను. ఒక భాషలో ఇంకొక భాషా వాక్యములు చొనుపుట రచనా దోషములలో నొకటిగ ఆధునిక పాశ్చాత్య విమర్శకులును వక్కాణించిరి. దీనినే తిక్కన ఆనాడు జాత్యము[2] కాదు అని సోమనాధుని రచనలో తప్పుపట్టెను.

1 ఇది సంస్కృత భాషా మర్యాద. నన్నయ్య తిక్కనాదులు దీనిని పాటించిరి "కథ జగత్ప్రసిద్ధగావున" అని తిక్కన ప్రయోగము ఈ వాక్యములో కథ అను తత్సమ పదమునకు సంస్కృతమున 'కథా' అనెడి ఆకారాంత స్త్రీలింగ శబ్దము మూలము దానికి విశేషణమైన 'ప్రసిద్ధ' శబ్దము ఆకారాంత స్త్రీలింగమే కావలయును కావుననే కథ జగత్ప్రసిద్ధ అని వ్రాసెను. ఈ సంప్రదాయము మన భాషలో పదియారవ శతాబ్ది వరకు నడచెను అప్పటి నుండి మారిపోయెను. ఇప్పుడు మనము కథ జగత్ప్రసిద్ధము అని వ్రాయుదుము.

2 "జాత్యముగాని నొప్పయిన సంస్కృత మెయ్యెడఁ జొన్ప" – ఈ వాక్యములో ఒప్పయిన అను పదము సంస్కృతము అను పదమునకు విశేషణము కాదు అది అప్యర్థకమైన అవ్యయము "ఒప్పయినప్పటికి" అని దాని అర్థము తప్పు గాకపోయినను సొగసుగా నుండినను జాత్యము కాకపోవుటచేత తెనుగు వాక్యమున సంస్కృతము చొప్పించరాదని తాత్పర్యము ఈ సిద్ధాంతము సంస్కృత వాక్యమున అనుకరించుటకు (వాక్యాన్తమున "అను" ధాతు ప్రయోగము చేయుటకు) సంబంధించినది కాదు మఱి యేక వాక్యములో కొన్ని పదములు సంస్కృతముగా కొన్ని పదములు తెలుగుగా వ్రాయుటకు సంబంధించినది పండితారాధ్యుని ప్రకరణమున దీని కొక యుదాహరణము నిచ్చితి, చూడుడు

ప్రాతబడ్డ మాటలు వాడుట, రసభంగము చేయుట, లక్షణ విరుద్ధముగ వ్రాయుట మొదలగునవి సార్వకాలికదోషములుగానే పేర్కొనెను

పాశ్చాత్య విమర్శకులు కావ్య రచనలో ప్రాతబడ్డ మాటలు ప్రయోగించుట అనాగరక లక్షణములలో ఒకటి యని నిర్దేశించిరి (One of the barbarisms of poetic art is the use of the Obselete). అర్థమునకు తగిన శబ్దమును వాడుట, పలుకు లొండొంటితో పొందియుండుట, అలతియలతి పదములతో కాహళ సంధించిన విధమున వాక్యమును సంధించి ధ్వనిపుట్టించుట మొదలగునవి ఉత్తమజాతి కవిత్వమునకు గుణములుగా అయన పేర్కొనెను.

పైని పేర్కొన్న లక్షణము లన్నియు ఉత్తమకావ్యరచన చేయదలచినవారి కెల్లరకు సర్వసాధారణోపదేశములు.

తిక్కనార్యుని మహనీయత కవిత్వ పాండిత్యములకు మాత్రమే పరిమితముగాదు. అయన వైభవము, దాతృత్వము, వ్యవహార ధౌరంధర్యము, కర్మపరత్వము, ఔదార్యము, కవి పండిత పోషణము మొదలగు మహారాజోచితములైన మహోల్లక్షణములను వర్ణించుచు కేతన వ్రాసిన ఈ క్రింది పద్యములు చూడుడు.

సీ॥ "సుకవీంద్ర బృంద రక్షకుఁ డెవ్వఁడనిన వీఁ
డను నాలుకకుఁ దొడవైన వాఁడు,
చిత్త నిత్యస్థిత శివుఁడెవ్వఁడనిన వీఁ
డను శబ్దమున కర్థమైనవాఁడు,
దశదిశావిశ్రాంతయశుఁ డెవ్వఁడనిన వీఁ
డని చెప్పుటకుఁ బాత్రమైనవాఁడు,
సకలవిద్యాకళాచణుఁ డెవ్వఁడనిన వీఁ
డని చూపుటకు గుఱియైన వాఁడు

తే॥గీ॥ మనుమసిద్ధి మహీశ సమస్తరాజ్య
భార ధౌరేయుఁ డభిరూప భావభవుఁడు,
కొట్టరువు కొమ్మనామాత్యు కూర్మి సుతుడు
దీన జనతా నిధానంబు తిక్కశౌరి॥

సీ॥ సరస కవీంద్రుల సత్ప్రబంధము లొప్పఁ
గొనునను టధిక కీర్తనకుఁ దెరువు,
లలిత నానా కావ్యములు చెప్ప నుభయ భా
షలయందు ననుట ప్రశంస త్రోవ,
యర్థిమైఁ బెక్కుళ్ళ నగ్రహారంబులఁ
గా నిచ్చు ననుట పొగడ్త పొలము,
మహిత దక్షిణలైన బహువిధ యాగంబు
లొనరించు ననుట వర్ణనము దారి,

తే॥గీ॥ వరున కొక్కని కిన్నియుఁ బ్రకటవృత్తి
నిజములై పెంపు సొంపారి నెగడునట్లు

*కొమ్మనామాత్యు తిక్కని కొలఁది సచివు*
*లింక నొక్కరుఁ డెన్నంగ నెందు గలఁడు!"*

ఆయన దశకుమారచరిత్రముగాక యింక నే గ్రంథముల నంకితము గొనెనో యిప్పుడు తెలియవచ్చుట లేదు అట్లే ఉత్తరరామాయణ, మహాభారతములు తప్ప తత్కృతములైన యితర గ్రంథములును కన్పించుటలేదు. ఆ కాలమున నవి యన్నియును ఆయన కీర్తిమకుటమున మాణిక్యములై విరాజిల్లి యుండును. ఆయన బహువిధ యాగములను మహిత దక్షిణలతో గావించెనని కేతన చెప్పెను గదా! ఆ యాగములలో సోమయాగము కూడ సూచితమై యుండుననుకొనరాదు. ఆయన అప్పటికి సోమయాజియై యున్నచో ఆ విషయమును కేతన వర్ణింపకుండ వదలుట యెట్లు? సోమయాగమునకు పూర్వము చేయదగిన శ్రౌత స్మార్త క్రతువులు చాల కలవు. కావున తిక్కనార్యుడు, కృతి స్వీకారము నాటికి సోమయాజి కాకపోయినను హవిర్యాజియై యుండును మరియు, కృతిపతిత్వమునకు పిమ్మట అనతి కాలమునకే నిర్వచనోత్తరరామాయణరచన సాగించి యుండును.

దశకుమార చరిత్రయందు, ఆ గ్రంథము ప్రస్తావింప బడకపోవుట, పై ఊహకు ఆధారము. పోయినవి పోగా, అరామాయణమే తిక్కనార్యుని ప్రథమ కృతిగా నిల్చెనుగాన, దానినే స్వీకరించి తద్గుణ విశేషములను పరిశీలింతును

**నిర్వచనోత్తర రామాయణము:**

రామాయణరచనా కుతూహలము గల తిక్కన ప్రధాన కథాత్మకమైన పూర్వ భాగమును వదలిపెట్టి ఉత్తరకాండను చేపట్టనేల? తిక్కనార్యుడు భావి లోకమునకు కలిగెడి ఈ శంకను నివృత్తి చేయగల వాక్య మొక్కటియు ఆ గ్రంథావతారికలో పలుకలేదు. పైగా—

*కం॥ "ఎత్తఱినైనను ధీరో*
*దాత్త నృపోత్తముఁడు రామ ధరణీపతి స*
*ద్వృత్తము సంభావ్య మగుట*
*నుత్తర రామాయణోక్తి యుక్తుఁడ నైతిన్!'*

అని మనస్సులోని మర్మమును చెప్పకయే ఒక త్రోపుమాట విసరెను. ఈ వాక్యము చారిత్రకులకు తృప్తి గొలుపదు. కావుననే కొందరు తిక్కన తాత గారైన మంత్రి భాస్కరుడు పూర్వ రామాయణమును రచించెననియు, అదియే భాస్కర రామాయణ మను పేర బరగుచున్నదనియు, దానిని పూర్తిచేయు తలంపు తోడనే ఉత్తరకాండను చేపట్టెననియు సమాధాన పడుదురు. అట్లే యగుచో

*తే.గీ॥ "సార కవితాభిరాము గుంటూరి విభుని,*
*మంత్రి భాస్కరు మత్పితామహునిఁ దలఁచి*
*యైన మన్ననమెయి లోక మాదరించు!*
*వేర నాకృతి గుణములు వేయునేల॥"*

అని తాతగారి ప్రసంగము తెచ్చి ప్రశంసించిన తాను అసారకవితాభిరాముని రామాయణకర్తృత్వము మరుగుపరచనేల? అది ఆయన కర్తృత్వమును ప్రకటించవలసిన

సమయమే కాని మరుగు పరచవలసిన సమయము కాదు. మరుగు పరచుట తగదనెడి ధర్మము తిక్కన యెరుగనివాడుకాదు. కనుక భాస్కర రామాయణము మంత్రి భాస్కరునిది కాదని నా తలంపు. కాగా ఆయన ఉత్తర కాండనే రచించుటకు గల కారణము దత్పూర్వము గోన బుద్ధారెడ్డి రంగనాథ రామాయణము ఆరు కాండములను రచించి యుండుటచే అసంపూర్ణముగనున్న ఆ మహాకావ్యమును ద్విపదలలో కాకపోయినను పద్యమయముగానైనను రచించి సమగ్ర రామాయణమును ఆంధ్రభారతికి అర్పించు సంకల్పమే అని నా ఉద్దేశము. మఱి నిర్వచనోత్తర రామాయణము రంగనాథరామాయణమునకు పూరకము కాదు. ఇదియు ద్విపదలోనే వ్రాయబడినచో నా రెంటిని ముడివేయవచ్చునుగాని, కానినాడు ఇది స్వతంత్ర రచనయే! రంగనాథ రామాయణమునకు ఇది పూరకము కాదు కనుకనే ఆ శతాబ్ది చివరి భాగమున బుద్ధారెడ్డి కొడుకులు, కాచవిభుడు, విట్ఠలుడు అనెడు సోదర కవులు తమ తండ్రి యానతిని ఉత్తర కాండమును ద్విపదలోనే రచించి ద్విపద రామాయణము పూర్తి చేసిరి. వారి రచన రంగనాథ రామాయణమునకు యథార్థమైన పూరణము; నిర్వచనోత్తర రామాయణము స్వతంత్రము.

తెలుగులో పూర్వ రామాయణము ద్విపదలో నుండగా నుత్తరకాండ రచించి రామాయణమునకు సమగ్రత సంపాదింప నెంచిన ఈ కవి ఉత్తర భాగమును కూడ ద్విపదగా రచింపక పద్య ప్రబంధముగా నేల రచింపవలెను? మీదు మిక్కిలి దానిని నిర్వచనమేల చేయవలయుననెడి సందేహములు ఎవరికైనను పొడముట సహజము. దానికి నాకు తోచిన సమాధానమిది – నన్నయ ఉపక్రమించిన చంపూ పద్ధతి దేశి రచన కాదనియు, చంపూ పద్ధతిలో నెడనెడ వచ్చెడి గద్యలు పద్యపఠన రక్తికి ఉపహతి కల్గించుననియు, పద్యమునకు పద్యమునకు వాక్య సాంగత్యము చేయవలసి వచ్చినచోట కలిగెడు క్లేశమును చంపూకర్త రెండిటిమధ్య వచన వాక్యమును చొప్పించి తన అసమర్థతను కప్పి పుచ్చుకొన వచ్చుననియు సోమనాథ ప్రముఖ ద్విపద కవి వర్గము యొక్క ఆక్షేపణలై యుండును బుద్ధారెడ్డి సోమనాథునితో ప్రతిభటత్వము వహించి తానును ద్విపద రచనయే చేసి బసవ పురాణమున కానవచ్చెడి లోపములు తన రామాయణమున దొరలకుండ నిర్వహించి సోమనాథుని కంటె తానే ప్రామాణికమైన ద్విపద రచన చేయుగలవాడననెడి ప్రశస్తిని సంపాదించెను. నిజమే ఎవరు వ్రాసిననేమి? తిక్కనకు ద్విపద కావ్యము నచ్చదు నిజముగా నది పాడుటకనువైనదేగాని పఠనమున కంతగా పనికిరాదు. చదువుకొనెడి వారికి అది కలిగించెడి విసుగుదలయు, వేసటయు గ్రంథము నెడ విముఖత్వము కల్గించును. పద్యకావ్యములో గల ఛందో వైవిధ్యము పఠనమునకు రక్తిని కల్గించును. ఈ విషయమంతయు సోమనాథుని ప్రకరణమున చెప్పితిని. ఒకపద్యమును ఇంకొక పద్యముతో సంఘటించునెడ కలిగెడి క్లేశమును చంపూకవి, వచనము వలన దాటగలడనెడి రెండవ ఆక్షేపణకు సమాధానముగా కాబోలు, తిక్కనార్యుడు "వాక్య సాంగత్యము సేయుచోనైన గద్యము తోడుగ చెప్పి పెట్ట" అని ప్రతిజ్ఞ చేసి నిర్వచన ప్రబంధమును రచించి అది ద్విపద కావ్యముకంటె సర్వథా మేల్ తరమని నిరూపింపదలచెనని అనుకొనవచ్చును. ఈ ప్రతిజ్ఞను ద్విపదకర్తల ఆక్షేపణలను పరాస్తము చేయుటకు మాత్రమే పూని పాలించెను కాని తదుపరి

భారత రచనావసరమున ఆయన దానిని ఆదరింపలేదు. కావుననే భారతమును నన్నయ దారిని గద్య పద్యాత్మకముగానే రచించెను

నిర్వచనోత్తర రామాయణము మనుమసిద్ధి పట్టాభిషిక్తుడైన పిదప ఎంత కాలమునకు రచింపబడెనో సరిగా చెప్పలేము. కాని దశకుమార చరిత్రమున ఈ గ్రంధ ప్రస్తావన లేదు గనుక దానిని కృతిని పుచ్చుకొన్న పిమ్మటనే దీనిని తిక్కనార్యుడు మనుమసిద్ధికి కృతి యిచ్చి యుండును. మరియును మనుమసిద్ధి, అద్దంకివద్ద సారంగపాణి అను పేరుగల మహారాష్ట్ర సామంతు నొకనిని అవలీలగా జయించి, వాడెక్కి తిరిగెడి అశ్వరాజమును కైవశము చేసికొనెనట! దీనిని ఆ దినములలో ఒక ఘన విజయముగా చెప్పకొని యుందురు. రాజధిరోహించెడి గుఱ్ఱమును వశపరచుకొనుట, అతని కిరీటమును దొలగద్రోయుట వంటిది కాబోలు! ఆ యుద్ధ విజయమును తిక్కన తన గ్రంధావతారికలో ఇట్లు వర్ణించెను

శా॥ "శృంగారంబు నలంగదేమియును; బ్రస్వేదాంకుర శ్రేణి లే
దంగంబుల్ మెఱుఁగేద వించుకయు, మాహారాష్ట్ర సామంతు సా
రంగుందోలి, తురంగం ముంగొనిన సంగ్రామంబునం దృష్ట స
ప్తాంగ స్ఫార యశుండు మన్మవిభు పంపై చన్న సైన్యంబునన్"

ఈ యుద్ధము 1257 వ సంవత్సరములో జరిగినదట. మరి మనుమసిద్ధి శత్రువులు స్వాధీనపరచుకొన్న రాజ్యమును గణపతి దేవుని సాయముతో మరల సంపాదించిన యుదంతము ఈ గ్రంధమున పేర్కొనబడలేదు. కాన తత్పూర్వమే ఇది రచింపబడి యుండవలయును అట్లుగాక ఈ రచన తరువాతనే యైనచో నది కృతిపతికి ప్రతిష్ఠాహేతువు కాదని కృతికర్త విడిచిపుచ్చెననుకొనవచ్చును గాని గణపతి చక్రవర్తి యెడ చూపవలసిన కృతజ్ఞతను తడవకుండుట వేరొక అప్రతిష్ఠకు కారణమగునని ఉచితజ్ఞుడైన తిక్కన యెరుగకపోడు 'రాజ్యనష్టము, పునఃప్రాప్తి' ఇత్యాది మాటలు లేకుండగనే గణపత మనుమసిద్ధుల మైత్రికి సూచకములైన శబ్దములతో ఆ చక్రవర్తిని ప్రశంసింప వచ్చును కావున అద్దంకి విజయమునకును శత్రువుల విద్రోహ చర్యకును మధ్య కాలమున ఎప్పుడో ఈ గ్రంధము రచింపబడి యుండును.

**కావ్య లక్షణ నిర్దేశము:** నన్నెచోడుడు తన గ్రంధమున కవిసామాన్య లక్షణముల నిర్దేశించెను. తిక్కన తననాటి కవుల కవన మందలి వక్రమార్గములను వ్యంగ్యముగా విమర్శించెను. ఆ విమర్శనావాక్యములే కావ్యసామాన్య లక్షణము లయినవి. ఆ లక్షణముల కాతని రచనలు రెండును లక్ష్యములు.

నిర్వచనోత్తర రామాయణములో నిర్దేశించిన లక్షణములు (కృత్యవతారికలో 5 మొదలు 14 పద్యముల వరకు)

1. పలుకుల పొందు – వాగర్థముల పొందు చెడకుండ పదములు హత్తియుండుట. ఇది తిక్కన కవితకు జీవగఱ్ఱ
2. హారములోని పూసల మాడ్కి వాక్యములు పొందికగా రెండింటిని హత్తియుండుట.
3. ప్రాతవడ్డ మాటలతో నేర్పు చూపకుండుట.
4. నియమము నతిక్రమింపకుండుట.

5. యతిప్రాసల సందర్భము లందు కూడ నిరర్థక పదములు వేయకుండుట.
6. అలతి యలతి మాటలతో కాహళ సంధించిన విధముగ మేరువంత ధ్వనిని సంపాదించుట.
7. తెనుగు వాక్యములలో సంస్కృత వాక్యములను జొనపకుండుట, జాత్యము గాకుండుట వలన.
8. విశేష్య విశేషణముల యెడల లింగవచన విభేదము పాటించుట.
9. గంధవహుడు పుష్పసౌరభమును వెదజల్లునటుల రసమును బయల్వెడ జేయుట.
10. ప్రాసలో ఏకాక్షరమే యుండవలెను. శాంత ప్రాసాదులు పనికిరావు.
11. కావ్యము ఒక్క కవిసంతోషమునకే కాదు లోకము మెప్ప కొరకు

ఈ నిర్దేశములలో కొన్ని సామాన్య ధర్మములు విశేషించి పాల్కురికి సోమనాథుని వక్రతలను అధిక్షేపించినవి కొన్ని.

**ఆంధ్రీకరణము:**

ఈ ఉత్తర కాండానువాదము భారతానువాదము కంటెను మిగుల స్వతంత్రము ఈ అనువాదములో తిక్కన మొదట చూపిన అతి స్వతంత్రత పూర్వరామాయణ కథను అతి సంగ్రహముగ రచించి ఉత్తరకాండ కథా ప్రారంభమునకు పూర్వరంగముగా నలంకరించుట. ఆ భాగమునందలి అయోధ్యాపుర వర్ణనము పిమ్మట రామాయణ కథా సంగ్రహము అయనదిగా మనకు లభించిన అమూలకమైన స్వంతకవిత్వ ప్రకరణము కథాంతమున రామ నిర్యాణమును పరిహరించుట రెండవ స్వాతంత్ర్యము. దీని వలన మంగళారంభము, మంగళాంతము, స్వయంసంపూర్ణమునైన యుత్తమ రామకథ ఒక తెలుగు కావ్యముగా వెలసినట్లాయెను

అసలు ఈ ఉత్తరకాండము వాల్మీకి కృతము కాదనియు ఒక వేళ తత్కృతమే యయినను అందు చాల ప్రక్షిప్తములు కలవనియు ఆధునిక విమర్శకులు అందురు ప్రాచీనులలో సైతము కొందరు కొన్ని ప్రతులలో కానవచ్చు అధికపాఠములను ప్రక్షిప్త భాగములుగానే శంకించిరి అది గ్రంథములో నించుమించు ఐదవవంతు ఉండును తిక్కన మిగిలిన భాగములో సైతము కొంత విసర్జించెను.

ప్రాచీనులు కాక ఆధునిక విమర్శకులు ఉత్తరకాండమున ఏయే భాగములు ప్రక్షిప్తములని నిర్ధారించిరో తిక్కన విసర్జించిన భాగములు ఇంచుమించు అవియే యగుట ఆశ్చర్యము. ఆ ప్రక్షిప్తములనేగాక, మరికొన్ని భాగములను విసర్జించుటయే కాక ఆయన చేసిన ఇంకొక మార్పు రాముని "ధీరోదాత్త నృపోత్తముని" గానే చిత్రించుట. వాల్మీకి రామాయణ పూర్వకాండములలో రాముని విష్ణుత్వము అంతర్వాహినిగానే యుండెనుగాని, ప్రస్ఫుటము కాలేదని రంగనాథ రామాయణ ప్రకరణమున జెప్పితిని ఉత్తరకాండమున తద్భిన్నముగా రాముని విష్ణుత్వము వాచ్యముగా నుగ్గడింపబడినది. ఇది వాల్మీకికృతము కాదని వాదించెడి వారికి ఈ రామపాత్ర చిత్రణములో కానవచ్చెడి భేదమొక హేతువైనది. నిర్వచనోత్తర రామాయణములో రాముని పురుషోత్తముడుగా గాక, పురుషపుంగవునిగానే చిత్రించిన తిక్కన తొలినాటి వాల్మీకి ఆశయమును అకుంఠితముగా పరిపాలించిన వాడయ్యెను. ఇంతేకాదు, రావణ పాత్రను సయితము

రాక్షసుడుగా గాక ధీరోద్ధతుడైన నాయకునిగా చిత్రించి అనాడు రామునకు ప్రతి నాయకుడు కాదగిన శూరుడే అనిపించెను

**తిక్కన విడిచిపెట్టిన ఘట్టములు:**

1. రావణుడు సూర్యచంద్ర మండలములకు పాతాళమునకు నేగిన దండయాత్రలు తిక్కన విడిచెను.
2. వాలిసుగ్రీవుల తండ్రి వృత్తాంతము కథావేగము నడ్డునని విడిచెను.
3. లక్ష్మణుడు సీతను విడిచి వచ్చిన తర్వాత అన్నదమ్ముల సంభాషణలో పూర్వరాజుల చరిత్రయని 7 సర్గల గ్రంథమున్నది అది అంతయు ప్రక్షిప్తము గాకపోయినను ముందు కథకు భంజకముగా నుండుటచే తిక్కన సూచనామాత్రముగా చెప్పి విడిచినాడు.
4. మాల్యవదాదులు ఈశ్వరుని వద్ద చేసిన ఆక్రోశము ఆతడే మరల తమ్మునితో చెప్పినాడు. ఇది కేవలము పునరుక్త మగుట తిక్కన విడిచెను

ఉత్తర రామాయణకథ రామునకు సంబంధించినంత వఱకు వర్తమానము, రావణునకు సంబంధించినది భూతపూర్వము. భారతమునకు హరివంశము ఎట్టి అనుబంధ పురాణమో (ఖిలపురాణమో) ఉత్తరకాండము పూర్వ రామాయణమునకు ఇంచుమించు అటువంటి అనుబంధము. ఇందు శ్రీరామ పట్టాభిషేకము, సీతారాముల ప్రణయలీల, సీతావివాసము, రాముని అనుతాపము, రాముని అశ్వమేధము, కుశలవుల రామాయణగానము, సీతా భూప్రవేశము అనునవి మాత్రమే రాముని చరితమునకు సంబంధించిన ముఖ్యాంశములు ఈ కథా భాగము 1,8,9,10 అశ్వాసములలో నడిచెను సీతా వివాసమునకు తరువాత జరిగిన కథ యంతయు తుది రెండాశ్వాసములలో నున్నది. ప్రథమాశ్వాసము పూర్వరామాయణ కథాసంగ్రహముతో ముగిసినది మధ్యగల ఆరాశ్వాసములు రావణుని వంశమునకును అతని జీవితమునకు సంబంధించినవి ఈ భాగములో ఒక్క- హనుమంతుని జనన వృత్తాంతము మాత్రము ప్రాసంగికముగా చెప్పబడ్డది.

భారతమున కావ్యశిల్ప సంబంధములగు ఏ మహోదార విశేషములు తిక్కన ప్రతిభకు నిదర్శనముగా ఉదాహరింపబడునో అవి యన్నియు ఈ ఉత్తర రామాయణముననే స్థిరరూపము దాల్చినవి. భారతము వ్రాయకున్నను ఆయన కవితాశయమునకు ఈ గ్రంధ మొక్కటియే చాలి యుండెడిది ఆయన కవిత్వమునకు జీవమని చెప్పదగిన శబ్దార్థౌచితి, సంభాషణ కౌశలము, సజీవపాత్ర సృష్టి, నిశిత ప్రకృతి పరిశీలనము, తీక్ష్ణమనోనిదానము, అల్పాక్షరముల అనల్పార్థ రచన మొదలగునవన్నియు భారతమునందువలె ఇందును వ్యక్తములగు చుండును మఱియు ఇందుగల యే చిన్న ఉపాఖ్యానమైనను భారతములో వలెనే స్వయంసంపూర్ణమును, కావ్యధర్మ శోభితముననగు శిల్పఖండముగా భాసించుచుండును. రామునకు సంబంధించిన కథాభాగములో సీతావివాసఘట్టము ప్రధానాంశము (అష్టమాశ్వాసము 92-136) రావణుని కథాభాగములో అతని జైత్రయాత్రలలో కానవచ్చెడి శూరలోక సాధారణమైన పరాక్రమ విజృంభణము కాక, అతని ఉద్ధతదుష్కాముకత్వమునకు సంబంధించినవి

రెండు కథలు కలవు. అందులో నొకటి ఈ కావ్యమున రంభారావణుల సంవాదము (షష్ఠాశ్వాసము 57 ప - 76 ప) అను పేర బరుగుచున్నది రెండవది వేదవతి వృత్తాంతము (పంచమాశ్వాసము 4 ప - 23 ప)

(1) **సీతావివాస ఘట్టము:-** ఈ కావ్యమునకు గర్భస్థానీయమును రాముని జీవితమునకు ప్రళయమును అయిన ఈ ఘట్టములో తిక్కన ప్రదర్శించిన పాత్రానుగుణమైన భావములు, తదనురూపమైన వాక్యములు, సర్వతోముఖమైన అయన నాటకీయప్రతిభకు పరమదృష్టాంతముగ వెలుగొందుచుండును. మేరుధీరుడైన రాముడు "అయ్యంగనకును నాకును నిదియ విధి అనుమానింపకుడు నిశ్చయంబగు చోటన్" అని తన తమ్ములను ఆదేశించునపుడు ఆయన తెగువ అనుల్లంఘనీయమైన రాజశాసనముగ శిరసావహింప దగినదని వ్యక్తమగుటయే కాక సీతారాముల పుట్టుకయే దుఃఖ సంవేదన కొఱకు అని ఆయన భావించినట్లు కూడ విదితమగును భవభూతి నాటకములో "దుఃఖ సంవేదనాయైవ రామే చైతన్య మాగతమ్" అని రాముడనెను సీతారాము లిరువురును దుఃఖ సంవేదనము కొఱకే పుట్టిరని ఈ కావ్యమునందలి రాముడనుకొనెను. పుటపాకమువలె హృదయమున శోకము మరుగుచున్నను ధీరతా కవచితమైన చిత్తమున పొడమిన భావమునకు "అయ్యంగనకును నాకును నిదియ విధి" అన్న వాక్యము శబ్దరూపము ఇంకొక కవియైనచో ఈ ఘట్టము నింత గంభీరముగ రచింపలేడు లక్ష్మణుడు సీతను వనమునకు తోడ్కొని పోవుసమయమున రాముడు స్వయముగా అటకు వచ్చి దహించుకొని పోవుచున్న తన హృదయతాపమును మాటలలోగాని, చేష్టలోగాని ఇంచుకయు వ్యక్తము కానీయకుండ ఆమెను రథమెక్కించి తుది వీడ్కోలు నొసంగెను ఆతని ధైర్యమునకు ఆశ్చర్యపడుచు ఈ దురంత కార్యమెరుగని ఈ ముద్దరాలి అమాయికత్వమునకు దుఃఖపడుచు చెంత నిల్చియున్న లక్ష్మణుని మొగమున ఆతని మనోభావము వ్యక్తమయ్యెనట ఆశ్చర్యచింతాముద్రితమైన మఱది మొగమును కన్నెత్తి చూచినచో సీతకు కొంచమేని అనుమానము కలిగి తీరును రాముడు ఈ సంకట స్థితి గ్రహించి 'తనకు ఇష్టము లేకున్నను నిన్ను దూర భూములకు పంపుచున్నందులకు నా మీద అలుకవచ్చి లక్ష్మణుడు మొగమును ఒక విధముగ పెట్టినాడు చూడు' మని సీతకు చూపెను ఇక్కడ వర్తించిన అమూడు పాత్రల చిత్తవృత్తి వివర్తములు మూడు పద్యములలో ప్రదర్శించి చూపిన ఆ నేర్పు నాటక కర్తలకే కాదు; నాటకమున నభినయించు నటులకును సాధ్యము కాదు. అందును లక్ష్మణుని ముఖవైఖరిని గమనించి, రాముడు దానికర్థము చెప్పుట పార్శ్వవర్తియైన పాత్రయొక్క చేష్టను కథా కార్యముతో మేళగించుట అనెడి ఒక నాటకీయధర్మమునకు దృష్టాంతము (to attune the movements of the side character to the main action of the drama). ఈ ప్రజ్ఞ నేనెరిగి నంతవరకు షేక్స్పియర్ నాటకములలో పెక్కుచోట్ల కానవచ్చును. తిక్కన కావ్యమును నాటకీయముగ రచించునను సిద్ధాంతమునకు ఇటువంటి ఉదాహరణములు పెక్కు చూపవచ్చును ఈ మూడు పద్యములు తద్గుణ గరిష్ఠతకు పాఠకులే ప్రమాణమనుదురుకాక!

*ఉ॥ "అక్కట! నాదు వేడ్క కుచితానుచితంబులు సూడకే విభుం*
*డొక్క తలంపు వాఁడయి, సముత్సుకతన్ నను దవ్వుపుచ్చఁగా*

నిక్కమ యియ్యకోలరయ నెయ్యముతియ్యముగాదె" యంచునిం
పెక్కఁగ రాముడెంద ముదు కెక్కరథంబు లతాంగి యెక్కినన్.

ఉ॥ అత్తఱి నన్న ధైర్యమున కచ్చెరువందుచు, జీవితేశుప్రా
వృత్త మెరుంగమిన్ మదిని దీనికి నమ్ముట కుమ్మలించుచుం
జిత్తము ఖేదమాననముఁజెందిన మాన్పఁగలేక, లక్ష్మణుం
డుత్తల మందుచున్న విభుఁ డుగ్మలి కాతనిఁ జూపి యిట్లనున్.

ఉ॥ "దూరమునాక, ఘోరవనదుర్గతలంబులఁ గేలిసల్పఁగాఁ
గోరెడు భామలం, బ్రియలఁ గోరినయట్టుల పుచ్చు రాజులన్
ధారుణి నెందుఁ గానమని తామును దీనికి నడ్డపెట్టఁ నేఁ
బోరితమాడి యిట్లు నినుఁ బుచ్చుట కర్గినవాఁడు సూచితే".

(2) **ఇక రంభారావణ సంవాదము:-** రావణుడు ఇంద్రలోకమునకు దండెత్తి పోవుచు కైలాసము చేరువ సేనల విడియించెను ఒకనాటి వెన్నెలరాత్రి అతడు పర్ణకుటీరమున కావల ఒంటరియై విహరించుచుండ, నలకూబరునింటికి అభిసారికా వేషము దాల్చి పోవుచున్న రంభ యాదృచ్ఛికముగ నాతని కంటబడెను ఆ స్త్రీ ఎవరైనను అగుగాక, అతడు సంకోచములేక బలాత్కరించు స్వభావము కలవాడు. వాడు ఆమెను నిలబెట్టి ఆమె పేరు, పోక మొదలగు ప్రశ్నలడిగి, తాను త్రిలోక జేతయైన రావణుడనని తన గొప్పచెప్పుకొని తన వలపును వెల్లడించెను. రావణుడెంత యుద్ధతుడో రంభ అంత ప్రౌఢ ఆమె తన వాక్చాతుర్యమును చూపి "పంక్తిముఖుండవేని నేనక్కట! నీకు కోడలఁగదయ్య! తొలంగు తొలంగు" అని మందలించెను తిరస్కార పూర్వకమైన ఈ ఉపాలంభమునకు ఇంకొకడైనచో సిగ్గుపడి సగము చచ్చిన వాడగును. అంతేకాదు. తాను లంజయైనను నలకూబరునితోడి తన తమకము లంజియ కాదని ఆమె తన అనన్యసక్తతను స్పష్టము చేసెను కాని ఈ వాదములన్నియు వానిమది కెక్కవు. వాని ఉద్రేకమట్టిది. జంకుగొంకులేక వాడా అప్సరసను ఎంగిలి చేసెను. ఈ ఘట్టమున ఈ రెండు పాత్రల సంవాదమును నడుపుటలో తిక్కన చూపిన నైపుణియటుండగా, జుగుప్సావహమైన రావణుడు చేసిన పనిని "ఎంగిలి చేయుట" అని వ్రాయుట బంగారు కిరీటమునకు రత్నము పొదుగుట వంటిది. అవమానితయైన ఆ వనిత వెనుదిరిగిపోక–

కం॥ "వెల వెలఁ బాఱుచుఁ గొంకుచుఁ
దలరుచు నడఁదొట్రు వడుచుఁ దలఁకుచుఁ దనలోఁ
బలుకుచు, నెడ నెడ నిలుచుచు,
నలకూబరు కడకు నాతి నలఁగుచు జనియెన్".

ఈయెడ ఆ అభిసారిక పొందిన చిత్తవైకల్యమును ఛాయా మాత్రముగా అర్థభేదము గల క్రియలతో వర్ణించుట తిక్కనకే తగును.

(3) **వేదవతి:-** ఈమె "కుశధ్వజుడ"ను ఒక మునీశ్వరుని పుత్రిక ఆమెను విష్ణువునకిచ్చి పెండ్లిచేయవలయునని తండ్రి సంకల్పము ఏ వరుడు వచ్చి అడిగినను ఆయన ఆమెనిచ్చుటకు ఇయ్యకొనలేదు జంభుడను ఒక రాక్షసుడు నిరాకృతుడై ఆ

మునీశ్వరుని వధించెను. ఆ కన్య దుఃఖము దిగమ్రింగి విష్ణునే పతిగా బడయుటకు తపము చేయగడగెను రావణుడు దారి వశమున ఆమె ఆశ్రమమునకు పోయి ఆమెను వలచి తన కోరికను చెప్పెను ఆమె తన కథ యంతయు చెప్పినను వాడు తన మనసును మార్చుకొనలేదు. ఆ తాపసకన్య వాని మాటలకు రోసి "ఫో!ఫో! మతిలేదు నీకు" అని వానిని ఛీ కొట్టెను తన తపః ప్రభావమును కూడ చూపెను. వాడంతతో అగక అమెను పట్టుకోబోగా "నేను విష్ణువునకే భార్యగా నీకు మృత్యువుగా మరు జన్మమున జనింతు" నని చితిఁజొచ్చెను. రంభ "నీకు కోడలగదయ్య తొలంగు తొలంగు" అనుట ఆ ప్రౌఢాప్సరసకే తగును. "ఫో ఫో మతిలేదు నీక"నుట ఈ మునికన్యకే తగును. ఆ రెండు హితములను సరకు గొనకుండుట ఆ రాక్షసరాజునకే తగును. తిక్కనార్యుని గ్రంథమందెల్లడను కానవచ్చెడి పాత్రోచితమైన భావములకు, భావోచితములైన శబ్దములకు ఇవి ఒకటి రెండు ఉదాహరణములు

సీతా పరిత్యాగమునకు పూర్వము సీతా రాములు సలిపిన వన విహారవర్ణనలో తిక్కనార్యుడు చూపిన సరసత్వము, చతురత, నాగరకత, మార్దవము, లాలిత్యము మన భాషలో ఇంకెక్కడను కానరావు ఆ చిత్రణ మంతయు సీతారాముల ప్రణయ జీవితమాధుర్యము. ప్రేమనిష్ఠము, ప్రణయసుందరమును అయిన, ఆ దాంపత్య మాధుర్య వర్ణన ఒక అమృత వాహిని. ఈ యెడనే కాదు, మరి యెయ్యెడనైనను నాగరక ముద్రాలంకృతమైన దాంపత్య సౌకుమార్యమును వర్ణించుటలో తిక్కనతో సాటి రాగల కవి మరియొకడు లేడు.

శ్రీరాముడు సీతాసౌందర్యలక్ష్మిని ఆరాధించుటకు చేసిన ప్రణయసేవా సార స్యమును వర్ణించిన ఈక్రింది పద్యమును చూడుడు·

సీ॥ "కలపంబు లభినవ గంధంబులుగఁ గూర్చి
తనువల్లిగలయంగఁ దానయలఁదు
పూవులు బహువిధంబులుగఁగట్టి ముడికొ(ౌ)క
భంగిగా నెత్తులు వట్టియిచ్చు
హారముల్ మెఱయ నొయ్యారంబుగాఁ గ్రుచ్చి
యందంబువింతగా నలవరించు
మృగ మదపంకంబు మృదువుగా సారించి
తిలకంబువెట్టి నెచ్చెలికిఁజూపు

ఆ॥ జనకరాజతనయ మనము దలిర్పంగ
వివిధ నిపుణలీల వెలయ నిట్లు
చతురముగ నొనర్చు సౌభాగ్యసారాభి
రామమూర్తియగుచు రామ విభుఁడు"

ఇందలి సీతారాముల విహార వర్ణనకు సంస్కృతాంధ్రములలో సాటి రాదగినది కాళిదాసు కుమారసంభవమున వర్ణించిన పార్వతీ పరమేశ్వరుల నందనోద్యాన విహారము మాత్రమే. అయినను ఇందు కాళిదాసానుకరణ మేమియు లేదు కాళిదాసుతో సాటిరాగల కవి ఆంధ్రమున తిక్కన ఒక్కడే మూలమున సైతము

ఈ విహారము చెప్పబడినది గాని అందు వాల్మీకి చేతిజాడయే లేదు మరి, అది తిక్కన వర్ణనతో పోలికకు నిలువజాలదు అయితే తిక్కన చేసిన ఈ విహార వర్ణనము కొంత దీర్ఘముగ ఉన్నదని నెపమెన్ను వారుండ వచ్చును. ఏ వర్ణననైనను, ఏ కథ నైనను అనతి విస్తృతముగ నడిపెడి ఈ కవి ఈ యెడ ఆ మర్యాదను ఏల పాటింపలేదు? ఈ ప్రశ్నకు నాకు తోచిన సమాధానమిది. సీతారాముల దాంపత్యమునకు అది తుది దినము పూర్వరామాయణము విప్పి చూచినను అసలు సంపూర్ణమైన వారి దాంపత్య సౌఖ్యమెట్టిదో మనకు తెలియదు. ఈ కాండమున ఆ దంపతుల ప్రణయ మధుర జీవితమును ప్రదర్శింపదగిన అవకాశమీ ఒక్కచోటనే కలదు. ఆ అవకాశమును చేజార్చక పాఠకులు ఆ మాధుర్యమును ఆకంఠముగ గ్రోలి తృప్తిచెందునట్లు కవి దానిని ప్రవచించెను. పున్నమి వెన్నెలలో విహరించు చకోరముల జంటవలె, ఆ పుణ్యదంపతులిరువురును తనివి తీరునంతకు విహరించి అలసి సొలసిరి. వెన్నెల విహారము చేసి అలసి వ్రాలిన చకోరముల జంట వ్యాధుని దెబ్బకు గురియైనట్లు, విహారదివసానంతరము రసమయమైన ప్రణయ విహార దివ్యలోకము నుండి పాపపంకిలమైన వ్యావహారిక లోకమున దిగిన వెంటనే మరునాడు పుణ్య దంపతులకు విధి ప్రహారము వల్ల శాశ్వత వియోగము కలిగెను ఆ సంయోగమునకు ప్రతియోగముగా ఈ వియోగము తటస్థించుట వలన అవి ఒండొంటికి పోషకములైనవి. ఆ సంయోగ వర్ణనమే సంక్షిప్తమగునేని, బెట్టిదమైన ఈ వియోగము నందలి విషాదభారము సువ్యక్తము గాదు అట్టి భావ భారమును మోయదగినది ఆ విహారవర్ణనా విస్తృతియే! అనుయోగములైనను ప్రతియోగములైనను సంఘటనలు రెండును సమాన బలము కలవి యైనపుడే ఒకదాని బరువును రెండవది మోయగల్గును. లేనిచో ఒకటి తేలిపోవును

తిక్కన భారతమును రచింపక పోయినను ఈ రామాయణము వల్లనే ఆంధ్ర సాహిత్య లోకమున శాశ్వతమైన యశమునకు భాజనమయ్యెడివాడు కాని భారత రచన వల్ల తెనుఁగున ఏ కవికి అందని బ్రహ్మపదమును చేపట్టి, కవి బ్రహ్మ యయ్యెను ఈ రామాయణము వల్ల అట్టి పదవి లభింపకున్నను కావ్యశిల్ప పారంగతుడైన మహాకవిగా పేరు పొందెడివాడు ఈ సామర్థ్యము కూడ అన్య దుర్లభమే! ఈ వాఙ్మయము పుట్టినది మొదలు నేటివరకు ఆయన వలె సర్వవిధముల అనవద్యమైన కావ్య కళాసృష్టి చేసిన కవి లేడు. శిల్ప ప్రౌఢిని పరీక్షించుటకు గ్రంథ విస్తృతియు పద్యముల యొక్క సంఖ్యయు క్షేతము కాదు. అయినను నిర్వచనోత్తర రామాయణము విస్తృతి యందును అల్పగ్రంథము కాదు అందు ఒకటి కాదు, రెండు ప్రబంధములకు సరిపడు గ్రంథమున్నది వస్తుతత్త్వమును బట్టి, భారతమున కూడ అన్ని యెడలను సాధ్యము కాని బహుముఖమైన కావ్యశిల్ప చాతురి ఈ గ్రంథమునందు ప్రతి పద్యమున గోచరించును. కావున ఇది తొలిరచన అనియు భారతముతో సాటిరాదనియు అప్రౌఢ మనియు అనుకొనుట సాహిత్యమునకే అపచారము చేయుట

భారతమున తిక్కన శిల్పచాతురికి, ప్రతిభకు వన్నెపెట్టిన మహోదార గుణములు యిందు ప్రస్ఫుటముగా నున్నవి.

1. శబ్దార్థౌచిత్య మాయన కవితకు జీవగఱ్ఱ.

2. ఏ ఘట్టమునైన సంభాషణాకౌశలములతో సజీవ పాత్రములతో నాటకీయముగా తీర్చుట.
3. ప్రాకృతదృష్టి కందని అగాధమైన పాత్రల మనోధర్మ సూక్ష్మాతిసూక్ష్మములను వివరించి చెప్పుట
4. అల్పాక్షరములలో అనల్పార్థ రచన చేయుట
5. బుద్ధిగమ్యమగు శైలి. (ఇంటలెక్చ్యువల్ స్టైల్) ఎరిగియున్నమాటలే యైనను వాక్యార్థము బుద్ధివిశేషమున గాని గోచరింపదు

శిల్పదృష్టిలో చూసిన నిర్వచనోత్తర రామాయణము భారతమున కేమాత్రము తీసిపోదు. ఈ గుణములలో ఏదేని ఒకటి భారతమున అతిశయముగా నున్న అది కాలవ్యవధానములో కవికి కలిగిన చిత్తపరిపక్వతయే దానికి హేతువు అసలు తిక్కనకే నిర్వచనోత్తర రామాయణము నెడ మిక్కిలి మక్కువ కలదు దీని తరువాత పది పంద్రెండేండ్లకు ప్రారంభించిన భారతములో ఇందలి పద్యములు కొన్ని సందర్భము పొసగినపుడు యథాతథముగ వాడుకొనెను తలచినచో అక్కడ వేరు పద్యము వ్రాయగలడు. కాని ఈ గ్రంథము మీది మక్కువ ఆ పని చేయనీయదు ఆ పద్యములలో కొన్ని ఇవిగో

*1.* *శ్రావ్యంబై చెలఁగన్ గభీరమధురజ్యానాద ముద్దామ వీ*
*ర వ్యాపారనిరూఢతన్ ప్రతిశరారంభంబు మర్దించుచున్*
*సవ్య ప్రౌఢి దృఢాపసవ్యగతి నాశ్చర్యంబుగా నేయుచున్*
*దివ్యాస్త్రమ్ములఁబోరి రిద్దరును సాదృశ్యం బదృశ్యంబుగన్*
(ని.రా.4.ఆ. 71–భా వి 5 ఆ 132)

*2.* *కలఁగెన్ దోయధి సప్తకంబు గిరివర్గంబెల్ల నూటాడె సం*
*చలతంబొందె వసుంధరావలయ మాశాచక్రమల్లాడెఁ గొం*
*దలమందెం ద్రిదశేంద్రు పట్టణము పాతాళంబుఘూర్ణిల్లె నా*
*కులమయ్యెన్ గ్రహతారకాకులము సంక్షోభించె నవ్వేధయున్*
(ని.రా.2 ఆ. 56–భా వి 4 ఆ 172)

3. *గుణమున లస్తకంబునను కోటియుగంబునగేలఁ దారథీ*
*షణముగ నుప్పతిల్లి రభసంబుగ రేగిన మాడ్కి దీప్ర మా*
*ర్గణనికరంబులొక్కట నరాతిబలంబులఁగప్ప శార్ఙని*
*క్వణనము రోదసీకుహర కర్పరముం బగిలింప నుగ్రతన్*
(ని రా 3 ఆ. 18–భా )

4. *తిగిచి కవుంగలించి నరదేవకులోత్తము డక్కుమారు నె*
*మ్మొగము మొగంబునం గదియ మోపు గరాంగుళులం గపోల మిం*
*పుగ బుడుకుం బొరింబొరి నపూర్వవిలోకనమాచరించు గ*
*ప్పగు మృదుమౌళి నుజ్జ్వలనఖాంకురచేష్ట మొనర్చు నర్మిలిన్.*
(ని రా.10 ఆ. 47–భా.వి 1 ఆ 247)

(ఈ పద్యములో ఒక్కపదము మాత్రము మార్పు గలదు)

"అమలోదాత్త మనీష నేనుభయకావ్య ప్రౌఢి బాటించు శి
ల్పమునన్ బారగుడన్ గళావిదుడ"

నని రామాయణమున చెప్పుకొనిన ఆవిశ్వాసము నిరర్థకమైన అహంకారము కాదు యథార్థముగా నిర్వహింపబడిన ప్రతిజ్ఞ

**భారతము: రచనా కాలము**

కాసె సర్వప్ప తన సిద్ధేశ్వర చరిత్రలో తిక్కన, గణపతి దేవునకు భారతము చదివి వినిపించి అయన మెప్పు వడసెనని చెప్పి ఉండుటచే కాకతీయ చక్రవర్తి సందర్శనమునకు పూర్వమే తిక్కన భారతము రచించి యుండెననుకొనుటకు అవకాశము కలదు. కొందరట్లే తలంచిరి అట్లే యగుచో 1262 వ సంవత్సరమునకు పూర్వము గణపతి దేవుడు మనుమసిద్ధికి సాయమొనర్చుట నిజమే కావున అప్పటికే భారతము రచింపబడి యుండవలెను ఆ కాలము నిర్వచనోత్తర రామాయణ రచనా కాలముగా చెప్పదగినదే కాని, భారత జనన కాలము కాదు భారతము నిర్వచనోత్తర రామాయణమునకును గణపతి సాయమునకును మధ్యకాలములో రచింపదగిన అల్ప గ్రంధమును కాదు. నిర్వచనోత్తర రామాయణమునకు పూర్వము రచింపబడలేదనుటకు ప్రబలమైన ఆధారములే కలవు రామాయణము నాటికి అయన సోమయాజి కాలేదు. దాని గద్యలో ఉభయకవిమిత్రుడనని చెప్పుకొన్న తిక్కన భారత గద్యలో "బుధారాధన విరాజి తిక్కన సోమయాజి" అని చెప్పుకొనెను రామాయణమున ఆయన మంత్రిత్వ ప్రస్తావన కలదు భారతమున దాని స్మరణయే లేదు మొదటి దానిలో "అమలోదాత్తమనీష నే నుభయకావ్య ప్రౌఢిఁ బాటించు శిల్పమునన్ బారగుఁడన్" అని తన ప్రజ్ఞ నుద్ఘాటించుకొనుటకు సంకోచింపని ఆ కళావిదుడు రెండవదానిలో "నా నేర్చిన భంగి చెప్పి వరణీయుఁడనయ్యెద భక్తకోటికిన్" అని వినయమధురముగా తన ఈశ్వరార్పణ బుద్ధిని వెలార్చెను. భారత కథా ప్రవృత్తితో ఇంచుమించు సమానమయిన పరిపూర్ణ జీవితము గడిపి, అవాప్త సర్వకాముడై ఫలము బ్రహ్మార్పణమన్నప్పటి రచన భారతము అభిజ్ఞాన శాకుంతల భరత వాక్యములో కాళిదాసు

"మమాపిచ క్షపయతు నీలలోహితః
పునర్భవం పరిగతశక్తి రాత్మభూః"

అని తుది మనోరథముగా మోక్షపదవిని కోరినట్లు తిక్కన భారతాంతమున "హరిహరనాథ! సర్వభువనార్చిత! నన్ దయచూడు మెప్పుడున్" అని ప్రసన్న తాంజలి ఘటించెను. ఈ పద్యమునకు తరువాత ఆయన మరల కవిత్వము వ్రాయలేదనియే నా తలంపు. రామాయణము కంటె పూర్వము భారతము పుట్టుట అసంభవము భారతాశ్వాసాది యాశ్వాసాంత పద్యములు సాక్షాద్యోగాభ్యాససిద్ధి బొందినవారికి గాని దుస్సాధ్యములు. భారతమున తిక్కన ఆర్షకవి. రామాయణమున మంగళాచరణమున 'హరిహర పద్మగర్భులకు నని త్రిమూర్తి భేదము నంగీకరించిన తిక్కన భారతమున హరి హరాత్మక మగు పరబ్రహ్మమునకు దక్క వేరొక దాని నంగీకరింపలేదు' అవకాశము లేమిచే ఉత్తర రామాయణమున నామమాత్రము ప్రదర్శితమైన ఆధ్యాత్మిక విజ్ఞానము భారతమున

సహస్రముఖముల ప్రవహించి, కవిబ్రహ్మ నామమును సార్థకము చేసినది. ఆయన కవిత్వము వలననేకాక, బ్రహ్మవిద్యోపదేశము వలనను సార్థక బిరుదనాముడయ్యెను. అదీకాక మంత్రిత్వము వదలి యజ్ఞము చేసి, లోకవ్యవహార సంసర్గము లేని దీక్షతో నిర్విఘ్నముగా భారతము పదిహేను పర్వములు నిర్వహించి యుండును ఆయన జీవితములో నిట్టి మార్పును, ఆయన ఆత్మీయతలో నట్టి పెంపును వచ్చుటకు రామాయణ రచనానంతరము అధమము పది–పదిహేను సంవత్సరముల కాలము పట్టియుండునని నా యూహ ఈ యూహ నిజమయ్యేనేని భారతము 1270 ప్రాంతమున ప్రారంభింపబడియుండును.

గణపతిదేవున కాయన భారతమును వినిపించినమాట నిజమైనచో అది సంస్కృత భారతమే కాని తెలుగు భారతముకాదు అప్పటి కాయన సంస్కృత భారతమును పెక్కు పర్యాయములు చదివి అందలి విశేషములను వ్యాఖ్యానించుచు "భారత ప్రవచనమును తిక్కన నోటినుండియే వినవలయు" ననెడి కీర్తిని గడించి యుండును కర్ణాకర్ణిగా ఆ మాటవిన్న గణపతిదేవుడు ఆయనచే భారతము చదివించుకొని యుండవచ్చును సంస్కృత భారతమును విద్యాభ్యాస దినముల నుండియే పునః పునరావృత్తముగా ఆయన పఠించియుండును గాని అనువదించుటకు పూనుకొనినపుడు మాత్రమే ఆ గ్రంథమును విప్పియుండడు భారతమనగా భారతీయ విజ్ఞాన సర్వస్వము ఆ సారమంతయు అమృతమువలె చిరకాల మాస్వాదించినవాడు కనుకనే కవిబ్రహ్మ దాని వినిర్మాణమునకు ఆశపడుటయేకాక అర్హత కూడ సంపాదించెను ఇవన్నియుకాక–

ఉ॥ "కావున భారతామృతము కర్ణపుటంబుల నారఁగ్రోలి యాం
ధ్రావళి మోదమునంబొరయునట్లుగ సాత్యవతేయ సంస్కృతి
శ్రీవిభావాస్పదంబయిన చిత్తముతోడ మహాకవిత్వ దీ
క్షావిధినూని పద్యముల గద్యములన్ రచియించెదన్ గృతుల్"

అనికదా ఆయన చేసిన ప్రతిజ్ఞ! భారత రచన కుపక్రమించినది మొదలు తుది దాక యజ్ఞదీక్షితునివలెనే కవిత్వ దీక్షితుడై రచన పరిసమాప్తి నొందించెనన్నమాట. అది యెంతకాలమైనను కానిండు. దీక్షాకాలములో దీక్షితుడు అన్యకార్యముల యెడ దృష్టిని త్రిప్పుటకు వీలులేదు. అట్టి వ్యగ్రతకే దీక్షయని పేరు మరి మంత్రిత్వకాలమునందే తిక్కన ఈ భారతము రచించియున్నచో ఆ దీక్ష యెట్లు సాధ్యమగును? రాచకార్యములు ఆయన దీక్ష కెట్లు భంగము కల్గింపకుండును? ఒకవేళ తాత్కాలికముగ మంత్రిత్వమును దూరముగ నుంచి భారత రచన కోసము దీక్ష వహించియుండరాదా అన్నచో, అట్లు ఉండుట పొసగదని సమాధానము రాజ్యమును, రాజును కన్నాకువలె కనిపెట్టియుండవలసిన మంత్రి కొంతకాలము స్వకార్య తత్పరత్వముచే మంత్రి పదవిని ఉపేక్షించుటకైనను రాజు అంగీకరింపడు. ఆ మంత్రి చిత్తమును అంగీకరింపదు. కావున సర్వలౌకిక వ్యవహార వాసనలు యజ్ఞరూపమున త్యాగము చేసిన పిమ్మటనే భారత రచనా దీక్షకు పూనుకొనెననుట సహేతుకముగను, సమంజసముగను ఉండును. ఈ సిద్ధాంతమును పూర్వపక్షము చేయువారితో నాకు వాదము లేదు

**గ్రంథారంభము:**

భారతము పంచమ వేదమనెడు ప్రశస్తి యటుండగా, అది ధర్మాద్వైత మూర్తియని తిక్కనార్యుడు సార్థకమును, అద్వితీయమునైన నామకరణము చేసెననియు, ఆ విశేష ణమే చరమ సిద్ధాంతమనియు నన్నయభట్టు ప్రకరణములో జెప్పితిని. నన్నయభట్టు రచన అరణ్యపర్వ మధ్యభాగమున నిలిచిపోగా గ్రంధము పూర్తిచేయనెంచిన తిక్కన అటనుండి కొనసాగింపక తన కృతిపతికి పట్టముగట్టదగిన స్థానము అదికాదని యెంచియే ఆ భాగమును వదలి విరాటపర్వముతో గ్రంధము ప్రారంభించెను భారతము ప్రబంధమండలియని తిక్కనయే అనెను. అందొక్కొక్క పర్వము ఒక్కొక్క ప్రబంధము. దేవునకు గాని నరునకుగాని కృతి ఇచ్చుట ప్రబంధాదిని జరుగును కాని మధ్యభాగమున జరుగదు. దానికే మంగళాచరణ పూర్వకమైన కృత్యాదియని పేరు. తిక్కన నన్నయవలె రాజనరేంద్రునకే అంకితము చేయనెంచినచో భట్టారకుని రచనను అందుకొని కొనసాగించవచ్చునుగాని అట్లుకానినాడు ఆభాగమును తడవరాదు రాజనరేంద్రున కర్పితమైన అరణ్యపర్వమున హరిహరనాధుని ప్రతిష్ఠించుట పొసగదు. ఆ పర్వము మొదలే నరాంకితమయ్యెను కనుక పిమ్మట హరిహరనాధున కర్పించుట అర్ధభుక్తాన్నమును ఈశ్వరునకు నివేదన చేయుటవంటిది. పోనీ, అరణ్యపర్వ ఉత్తరభాగమును రాజనరేంద్రునకిచ్చి విరాటపర్వాదిని హరిహరునకు పట్టము గట్టరాదా! యని యందుమేని, అది తిక్కనయేకాదు యే కవియు చేయరాని పని. ఈశ్వరునకు గ్రంధమర్పింప దలచినవాడు వ్రతమును భంగ మొనర్చుకొని కొంత భాగము నరాంకితము చేయు దోషమునకు బాల్పడడు కావుననే తిక్కన భారతమునకు విరాటపర్వము మొదటిదైనది. నన్నయ పూర్తిగ మూడు పర్వములు రచించియుండుటచేతనే తిక్కన విరాటపర్వమును చేపట్టెనని చెప్పువారు కొందరు కలరు.

ఉ॥ "ఆదరణీయసార వివిధార్థగతి స్ఫురణంబుకల్గి య
ష్టాదశపర్వ నిర్వహణసంభృతమై పెనుపొందియుండ నం
దాదిదొడంగి మూడుకృతులాంధ్రకవిత్వ విశారదుండు వి
ద్యాదయితుండొనర్చె మహితాత్ముఁడు నన్నభట్టు దక్షతన్"

అను పద్యమును వారు అధారముగ చూపుదురు ఈ పద్యమున తిక్కన మూడు కృతులు అనుటలోని అర్ధము స్థూలమేగాని గణితశాస్త్రానుసారముగా లెక్కబెట్టి చెప్పినదికాదు. అట్లు చెప్పవలసివచ్చినచో రెండు పర్వముల మూడాశ్వాసముల నూటనలుబదిరెండు పద్యములు అని చెప్పవలెను అది గణకుడు చేయవలసిన పని గాని, కవి చేయవలసిన పనిగాదు నిజముగా నన్నయ మూడు పర్వములే రచించియున్నచో పై పద్యమును చెప్పిన తిక్కన నాల్గవ పర్వమును ప్రారంభింపకముందు, ఆ మూడు పర్వములును చదివియుండవలయును గదా! ఆయనకు లభ్యమైన అసంపూర్ణభాగము తదుపరి ఎల్లుననాటికి లుప్తమైపోయెననుకొనుట హాస్యాస్పదము అసంపూర్ణ స్థితిలో అట్టిదుస్స్థితి సంభవించిన సంభవింపవచ్చునుగాని తిక్కన పదునెైదు పర్వములతో పూర్తియైన సమగ్ర గ్రంధములో ఒక భాగము లుప్తమైపోనిచ్చు ఉదాసీనత ఏ అక్షరాస్యునకును ఉండదు కావున అరణ్యపర్వశేషమును తిక్కన వదలిపెట్టిన

మాటయే నిజము దానికి కారణము పైని చెప్పినట్లు కృతిపతికి పట్టము గట్టదగిన స్థలము అది కాకపోవుట

భారతము ధర్మాద్వైత మూర్తియైనట్లే తిక్కన రచిత భాగమునకు కృతి భర్త అయిన హరిహరనాథుడును సర్వదేవతాద్వైతమూర్తి.

**హరిహరనాథ తత్త్వము:**

కల్పితములైన నామరూప భేదములచే భగవంతుని పేరను, మతము పేరను దారుణ కలహములకులోనై అలజడి పొందుచుండిన ఆంధ్రులకు తిక్కన ప్రసాదించిన భగవత్తత్త్వము హరిహరనాథము

హరిహరనాథ నామరూపములను గూర్చి ఆంధ్రులలో భిన్నాభిప్రాయములు కలవు. గ్రంథావతారికను బట్టియు ఆశ్వాసముల అద్యంత పద్యములను బట్టియు నేను గ్రహించినంతవరకు ఆ హరిహరనాథ తత్త్వమును వివరించెదను ఆ తత్త్వము సగుణమును సాకారమును ఐనప్పుడు శివకేశవాత్మకము, నిర్గుణమును, నిరాకారమైన పుడు ఉపనిషత్ప్రతిపాదితమైన పరమాత్మ ఓంకారము తద్వాచకము. ఆ తత్త్వము సగుణాత్మకముగా సాకారముగా అరాధనీయమైనపుడు శ్రీయన గౌరినాబరగెడి స్త్రీతత్త్వము. అయ్యది నిర్గుణాత్మకమై ఓంకార వాచ్యమైనపుడు హ్రీంకార వాచ్యమగును. ఈ అర్థమునే తిక్కన షష్ఠ్యంత పద్యములలో నిట్లు వ్యక్తమొనర్చెను.

*కం॥ ఓంకారవాచ్యునకు నన*
*హుంకార నిరూఢభావనారాధ్యునకున్*
*హ్రీంకారమయ మనోజ్ఞా*
*లంకారోల్లాస నిత్యలాలిత్యునకున్*

కాబట్టి హరిహరుని శివకేశవాత్మకమూర్తిగా భావన చేయుట ఆరాధనార్థము. అప్పుడా దేవుడు భక్తిగమ్యుడు యోగగమ్యుడైనప్పుడు హరిహరునకు ఆకారములేదు.[1] మరియు వ్యాసుని వాఙ్మయ ప్రపంచమునకు హరిహరనాథుడు లక్ష్యముట [2]

*కం॥ శ్రీ సంపాది పదాంబుజ*
*నాసాగ్రనివాస రసికనాదామృత ధా*
*రాసార రూప వేద*
*వ్యాస వ్యంజిత విహార హరిహరనాథా!*

ఇక్కడ వేదవ్యాసవచస్సు అనగా బ్రహ్మసూత్రములు అని అర్థము కావున బ్రహ్మసూత్రములలో ఏ పరతత్త్వము నిర్దేశింపబడినదో ఆ పదార్థమే తిక్కనార్యునకు లక్ష్యమైన హరిహరనాథ తత్త్వము. అదియే ఉపనిషత్ప్రతి పాదితము ఆ తత్త్వము జ్ఞానగమ్యము. అంతేకాదు, ఆ దేవుడు "క్రతుభూషణ మణి" నిత్యాగ్ని హోత్ర పరతంత్రులకు, క్రతుపరాయణులకు, "అపూర్వ" మనెడి వేదవిహితకర్మానుష్ఠాన ఫలము

1 "నాదామృత ధారాసారా రూపుడు" "నాసాగ్రనివాస రసికుడు"
2 "వేద వ్యాసవచో విభవలక్ష్య హరిహరనాథా"

నొసగెడి యజ్ఞపురుషుడు. కావున ఆ దేవుడు పూర్వమీమాంస ప్రతిపాదితమైన తత్త్వముకూడ అగును.

యోగి భక్తుడుగా చేతులు జోడించునపుడు నాసాగ్ర నివాసమైన ఆ హరిహరతత్త్వము శివకేశవాత్మకముగా సాక్షాత్కరించును. శివునకు కైలాసమును, విష్ణువునకు వైకుంఠమును నివాస లోకములు గదా! మరి ఈ యిరువురిలో లోకమున ధర్మగ్లాని కల్గినపుడెల్ల వైకుంఠమునుండి భూలోకమున కవతరించుట విష్ణువునకు పరిపాటి. విష్ణువు తాల్చిన అవతారములలో తిక్కనకు ధ్యేయమైనది శ్రీకృష్ణావతారము. కావుననే యశోదాస్తన్యపానము చేసిన యదునందనుని, హాలాహలపానము చేసిన పరమశివుని ఒకనిగనే భావించి ఆయన స్తుతించెను యశోద పాలు త్రాగిన ఆ బాలుడే కౌస్తుభాలంకారుడైన మహావిష్ణువు. కైలాస వాసియైన ఆ శివునకును వైకుంఠవాసియైన ఆ విష్ణువునకును భేదము లేదు. అట్లే, వైకుంఠ వాసియగు విష్ణువునకును భూలోక వాసియగు కృష్ణునకును భేదము లేదు

ఈ భేదములేని భక్తితో ఆయన రచించిన ఈ క్రింది శ్లోకమే భగవద్దర్శన యోగ్యతను సంపాదించినది

"కిమస్థి మాలాం కిము కౌస్తుభం వా
పరిష్క్రియా యాం బహుమన్యసే త్వం
కిం కాలకూటః కిమువా యశోదా
స్తన్యం తవ స్వాదువద ప్రభోమే!"

ఇంతేకాదు, శివకేశవుల అభేద ప్రతిపత్తికి భారతమున అమోఘమైన ఇంకొక రూపకల్పన చేయబడినది సైంధవ వధకు ప్రతిజ్ఞ చేసిన అర్జునునిచే శ్రీకృష్ణుడారాత్రి పూజనందుకొని ఆవీరుని విశ్రాంతికై నిద్రింపుమని ఆదేశించెను. అనిద్రలో స్వప్న మిషచే అతనిని కైలాసమునకు గొనిపోయి శివుని దర్శింపజేసెను ఇక్కడ జాగ్రదవస్థలో కృష్ణు నర్చించునపుడు అర్జునుడు ఏయే గంధపుష్పాది పూజా ద్రవ్యములు సమర్పించెనో అవియే స్వప్నావస్థలో శివుని శరీరమున కానవచ్చెను. మహోద్భుతమైన ఈ దృశ్యమే.

"శివాయ విష్ణు రూపాయ శివ రూపాయ విష్ణవే
శివస్య హృదయం విష్ణుః విష్ణోశ్చ హృదయగ్ం శివః॥"

అను మంత్రమునకు రూపకల్పనము. తిక్కన నాడు ఆంధ్రదేశమునగల విషమ మత పరిస్థితులలో ఈభావనయు ఈసాధనయు ఈయుపదేశములును ఎంత ఆవశ్యకము లయ్యెనో విజ్ఞులు గ్రహింపగలరు

ఈ హరిహరనాథ తత్త్వము తిక్కనగారు కల్పించినది కాదు వ్యాసుని భారతమున గల అనేక తత్త్వములలో ఒక తత్త్వముగ నున్నది మరియు విష్ణుని అష్టోత్తర శతనామావళిలో "హరిహర రూపైక మూర్తయే నమః" అన్నచోట పేర్కొనబడినది. ఇట్లు అనేక తత్త్వములలో నొకటిగ అనేక నామములలో నొకటిగానున్న ఆ సర్వదేవతాద్వైత మూర్తియైన తత్త్వమును తిక్కనార్యుడు ధర్మాద్వైత మూర్తియైన భారతమున ఏకైక పరతత్త్వముగా ప్రతిష్ఠించెను. భారత కృతిపతియైన హరిహరనాథుడు ఏదో ఒక గ్రామమున వెలసిన గుడి కట్టించుకొన్న దేవుడు కాడు సృష్టి స్థితి లయములకు

కర్తయైన విశ్వమయుడు సారంశ మేమనగా, హరిహరనాథుడు శైవులకు, వైష్ణవులకు, కర్మిష్ఠులకు, జ్ఞానులకు, భక్తులకు, యోగులకు, మంత్రోపాసకులకు, తపస్వులకు సాధారణ శరణ్యుడు. ఐహిక మనోరథములనుగాని అముష్మిక సుఖమునుగాని, మోక్ష పదవినిగాని, యోగసిద్ధినిగాని ప్రసాదించెడి సర్వఫలప్రదాత తిక్కన భారత రచనావసరమున హరిహరనాథుడు సాక్షాత్కరించినపుడు "జన్మాంతర దుఃఖముల్ తొలఁగునట్లుగఁ జేసి, సుఖాత్మఁజేయవే" అని బ్రహ్మానంద స్థితిని కోరి నమస్కరింపగా ఆ దేవుడు-

*తే॥గీ॥ "జనన మరణాదులైన సంసార దురిత*
*ములకు నగపడకుండఁగఁ దొలఁగు తెరువు*
*గను వెలుంగు నీ కిచ్చితి. . ..*

అని వర మొసగెను అనగా మోక్షమన్నమాట. తన జీవితయాత్ర సార్థకమైన దనియు మోక్ష పదవి నిశ్చితమనియు ఎరిగియు అంతలో కర్మ సన్యాసము చేయక లోక సంగ్రహార్థమై భారత రచన కుపక్రమించెను

**భారతాంధ్రీకరణము:**

ఆంధ్ర భారతము మూలవిధేయము కాక స్వతంత్ర రచనయే యైనదనెడి గౌరవము ఆ ముగ్వురు తెలుగు కవులకును చెందవలసినదే యధా మాతృకతాపేక్ష వారిలో నెవ్వరికిని లేదు. అది ఫలములేని వ్రతమని వారెరుగుదురు అందును తిక్కన పాలబడిన భాగము చాల దుర్ఘటమైనది యుద్ధ పంచకమున వర్ణనీయమైన విషయమంతయు నమిత వేగముతో సంచలించెడి దృశ్య పరంపరామయము. దానిని విసుగుదలయు పునరుక్తి లేకుండ రసవంతముగా తెనుగునకు తెచ్చుట సుకరమైన పనిగాదు. ఆయన దానిని నిర్వహించిన విధమిట్టిదని వర్ణించుటయు సుకరముగాదు ఆయా వీరుల స్వభావముల కుచితమైన ఆలాపములు, పరస్పర సంభాషణములు మొదలైన వాగ్వ్యాపారములేకాక రౌద్రరసానుగుణములైన వారి హస్తన్యాస ముఖన్యాస ఖడ్గచాలన ప్రహరణాదులు సైతము సూక్ష్మాతిసూక్ష్మ వివరములతో వర్ణించి మన ఆత్మలను యుద్ధభూమిలో సంచరింపజేయును ఆపై పర్వములలో శాంతిపంచకము నానావిధ ధర్మ తత్త్వమయము ఆ భాగములను సమగ్రముగా నర్థము చేసికొనుటయే కష్టము. ఇంక వాటిని తెలుగులో చెప్పుట మిగుల దుష్కరము ఇది యిట్లుండ ఉపనిషత్తుగా ప్రసిద్ధమైన గుహ్యాతిగుహ్య మనిపించుకొన్న భగవద్గీతను దేశ భాషలో రచింపరాదనియు, ఎవరేని అందులకు పూనుకొన్నను, ఆ పూనిక సఫలము కాదనియు పండిత లోకమున ఒక రూఢమైన అభిప్రాయము కలదు. ఆ ఆధ్యాత్మిక రహస్యములు దేశభాషలో ఉచ్చరించుట పాపహేతువనియు భావించెడివారును ఉందురు. ఈ సమస్య తిక్కన పాలబడినది ఆయన ధీరుడై స్వతంత్ర దృష్టితో తన బుద్ధికి ఉచితమని తోచిన మార్గమున దానిని పరిష్కరించెను. వేదాంత భాగములను తెనిగింపక విడిచినచో తెలుగుభారతమునకు పంచమవేదగౌరవము పోవుటయే కాక భారతము ద్వారా ఆయన ఆంధ్రావళి కుపదేశింపదలచిన ఆధ్యాత్మిక విజ్ఞానము కూడ లభింపదు. మరి మూలములో గల ఆధ్యాత్మిక విషయములనన్నింటిని తెనుగున

యథాతథముగ చెప్పబూనినచో అది తా నేర్పరచుకొన్న అనువాద ప్రణాళికకు అనుగుణము కాకుండుటయే కాక రచనలో కావ్యశోభ కూడ మందగించును. ఈ సంకటావస్థను దాటుటకే ఆయన ఆ ఘట్టములలో కొన్నింటిని పరిత్యజించి, కొన్నింటిని సంగ్రహించి భారత సరస్వతీ భుజములనుండి ఆ బరువు నెంత తగ్గింపదగునో అంతదనుక తగ్గించి ఆమె క్రీడను సుకర మొనర్చెను అయినను వస్తుతత్త్వమునుబట్టి శాంతి పంచకమున అనివార్యమైన కొంత బరువును ఆమె మోయవలసియే వచ్చెను దాని నంతకంటె తగ్గించుట పొసగదు. సారాంశమేమనగా – శ్రుత్యర్థములను తెనిగింపరాదన్న నియమము ఆయనకు లేదు తెనిగింపలేని అశక్తత అంతకుమున్నే లేదు. ఒక మారటు ఒకమారిటు చేసి అనియతము వర్తించెనని లోక మాక్షేపించునన్న సంకోచమసలే లేదు. ఆయన పెట్టుకొన్న నియతి సందర్భోచితిని, కథాగతిని బట్టి యుండును. ఈ ఆత్మవ్యవస్థానమే లేనిచో ఆయన భారతమును తెలుగులో "వినిర్మించుట" సాధ్యమయ్యెడిదే కాదు. నీరసములును శుద్ధ శాస్త్ర విషయికములను అయిన ఆభాగములనుకూడ ఆయన సముచిత శబ్దఘటిత వాక్యవిన్యాసములతో పూరించి రసహీనతను తొలగించెను జీవుడు పురుషుడా స్త్రీయా? అనే శంకకు సమాధానముగా శివుడు పార్వతితో చెప్పిన ఈ క్రింది వాక్యము పై సిద్ధాంతమునకు నిదర్శనములుగా చూపదగిన పెక్కింటిలో నొకటి.

> *"తాత్త్వికములైన పురుష*
> *స్త్రీత్వంబులు లేవు పార్వతీ! జీవునకు"* (అను ప.పంచ ఆ 137)

అట్టిదే కర్మ ప్రభావమును గురించి చెప్పిన ఇంకొక పద్యమును ఉదాహరించుచు న్నాను ఈ పద్యార్థములో సహజముగాకవితావాసనయే లేదు. కాని వాక్య విన్యాస ప్రభావము వలన ఈ పద్యము మనోహరమైనది

> *విను కర్మంబొనరించును*
> *జననము మరణంబు, నదియ సౌఖ్యమ్ము దుఃఖం*
> *బును గావించుం దన చే*
> *సిన దానిం బడక పోవ శివునకు వశమే!* (అను ప.ప్ర ఆ 34)

ఆయన సంక్షేపించిన ముఖ్య వేదాంత ఘట్టము భగవద్గీత. భగవద్గీత భారత శరీరమున హృదయ స్థానమున ఉన్నది. మానవ శరీరము నందలి రక్తనాళము లన్నింటను ప్రవహించు రక్తమునకు హృదయమే మూలము. అటనుండి బయలుదేరిన రక్తమే నాళముల ద్వారా శరీరమంతటను ప్రసరించుచు పుష్టిని, జీవమును ఒసగును అట్లే భగవద్గీత నుండి ప్రసరించు ధర్మసారమే భారతము నందెల్లెడలను ప్రసరించుచుండును *"ఈ ఉపనిషత్తు తెనిగింప గూడదనెడి మర్యాదకు కట్టుపడియే ఆయన దాని సారమును నామ మాత్రముగా చెప్పెనేగాని నిజముగా తెనిగింపలేదు"* అనెడివారు కొందరు కలరు ఇది సారహీనమైన వాదము. తెనిగింపరానిదే యైనచో దానిని తడవుటకే ఆయన అంగీకరింపడు. అట్లుగాక యే కొలదిపాటి శ్లోకములు తెనిగించినను ఆ వ్రతము చెడినట్లే యగును. పూనిన ప్రతిన నామమాత్రముగ భంగపఱచుకొనుట కంటె దానిని తుదముట్ట కొనసాగించుటయే మేలు. కావున ఆయనకు ఆ ప్రతిజ్ఞ

లేదు. దానికి భంగపాటును రాలేదు. అవశ్యకమైనంత వరకు గీతోపనిషత్తు అనువదింపబడెను. భగవద్గీతాపరముగ నించుమించు అఱువది పద్యములు వ్రాయుట దానిని వదలుట కాదు; సంక్షేపించి తెనిగించుట. ఆ సంక్షిప్తత తెనుగు సేతకై ఆయన యేర్పరచుకున్న ప్రణాళికకు అనుగుణమే కాని విరుద్ధము కాదు. భగవద్గీత యెంత ఉత్తమ గ్రంధమైనను ఆ ఉపదేశమంతయు ఉభయ సైన్యములు మోహరించియున్న ఆ యుద్ధభూమిలో అప్రస్తుతమని విమర్శకుల యభిప్రాయము. ఈ ఔచిత్యమును గ్రహించియే తిక్కన తత్సారమును సందర్భమునకు పొందుపడునంత మాత్రము చెప్పి కధాగతికి నిరోధము లేకుండునంతవరకు సంగ్రహపరచెను

మరికొందరు శాస్త్రీయమైన శబ్ద నిష్కృష్టత (Scientific Precision of Word) సంస్కృతమునందు వలె తెనుఁగున సాధ్యము కాదనియు ఆ అసాధ్యతను ఎఱిగియే తిక్కన దానిని పూర్తిగా తెనిగింపలేదనియు అనుకొందురు. ఇది ఆయన వాక్కునకు గల శక్తిని ఎరుగక అనినమాట. తిక్కన కవిత్వమునకు శబ్దార్థ నిష్కృష్టతయే జీవగఱ్ఱ. తెనిగించినంత వరకు ఈ భగవద్గీత యందుగాని, శాస్త్రార్థ ప్రతిపాతకములైన ఇతర సందర్భముల యందుగాని ఆయన తెలుఁగు సేతకు అర్థన్యూనతా శబ్దన్యూనతాది లోపములేమియు రాలేదు. శాంతిపంచకమునందు ఎన్నో వాక్యములు ధర్మశాస్త్ర సూత్రములవలె ఒక అక్షరమైనను అనావశ్యకమైనది లేకుండ సంపూర్ణ అర్థస్ఫూర్తి కలుగునట్లు రచింపబడినవి.

ఈ క్రింది మూడు పద్యములు అందుకు ఉదాహరణములు

కం॥ *అనఘ! యనులోమమునఁదోఁ*
*పును, బ్రతిలోమమున లయము వొందుటయును గ*
*ల్గును సర్వతత్త్వముల కవి*
*యెనయక బ్రహ్మమును గలయు టేకత్వమగున్.* (అను–ఆశ్వా–4–ప–184)

తే॥ *"పొదలుఁ దఱుగుటకై, పొడ వొదవుఁబడుట*
*కై, కడను జేరుఁబాయుటకై, జనించుఁ*
*బొలియుటకునై, సుఖంబును బొందు దుఃఖ*
*మందుటకునై, పదార్థము లఖిలములును."* (అశ్వ 2 ఆ.ప 165)

తే॥ *"మాతకును, వేదమునకును, ధర్మంబునకును*
*బరములగు గురు, శాస్త్ర, లాభములు లేవు*
*తపములేదు ప్రవాస వ్రతంబుకంటె*
*నధికమైనది యంద్రు మహాత్ములనఘ."* (అను–4 ఆ–ప–153)

ఇక భగవద్గీతను గురించి: గీతను సంగ్రహ పరచుటలో తిక్కనార్యుడు సారభూతములైన కొన్ని శ్లోకములను యధామాత్రకముగా అనువదించెను

కం॥ *"పురుషుఁడు సెడునను వాఁడును*
*పురుషుఁడు, సెరచునని పలుకు పురుషుండును న*
*య్యిరువురు నవివేకుల య*
*ప్పురుషుఁడు సెరుపండు సెడఁడు భుజవీర్యనిధీ"* (భీ–1 ఆ–198)

ఈ పద్యము క్రింది శ్లోకమునకు యథాతథానువాదము.

"య ఏనం వేత్తి హంతారం యశ్చైనం మన్యతే హతం,
ఉభౌతౌ నవిజానీతో నాయం హంతి నహన్యతే॥" (గీత–సాంఖ్య 19 శ్లో)

మరికొన్ని పద్యములలో ఒకటి రెండు శ్లోకభాగముల అర్థములు, ఏకోపదేశ వాక్యముగ సంఘటింపబడినవి.

కం॥ "ఫలముల యెడ బ్రహ్మార్పణ
కలనపరుండగుచుఁ గార్యకర్మము నడపన్
వలయున్; దత్త్వజ్ఞానము
తలకొనినం గర్మశమము తానై కలుగున్॥" (భీ. 1–206)

ఈ పద్యములో "కార్యకర్మము నడపన్ వలయున్" అన్నంత వరకు "కర్మణ్యే వాధికారస్తే మాఫలేషు కదాచన" అనే సాంఖ్యయోగములో గల శ్లోక పూర్వార్థమున కనువాదము అటనుండి తత్త్వజ్ఞానము "దలకొనినం గర్మశమము దానై కలుగున్" అను వాక్యమున–

"శ్రేయాన్ ద్రవ్య మయాద్యజ్ఞాత్ జ్ఞాన యజ్ఞః పరంతప
సర్వం కర్మాఖిలంపార్థ జ్ఞానే పరిస మాప్యతే"

అను జ్ఞానసంయోగములోని శ్లోకము యొక్క ఉత్తరార్థము గ్రహింపబడినది.

పద్యము స్వతంత్రమైనది

ఇంకొక విశేషమేమగా కొన్ని యెడల తిక్కన భాష్యకర్తగా సయితము వర్తించి నిగూఢ విషయములను పెక్కింటిని ప్రకాశింపజేసెను శ్రీకృష్ణుని విశ్వరూప ప్రదర్శనమునకు ముందు అర్జునునిచే ఆయన అనిపించిన మాటలు దీనికి తార్కాణము

మ॥ "అతిగుహ్యంబిది, నీవు భూరికృప నీ యధ్యాత్మమున్ గానఁ జే
సితి నాకిమ్మెయి విన్కిఁ గొంత భ్రమ వాసెన్, యోగిహృద్ధ్యేయమై
యతులైశ్వర్య విభూతి నొప్పు భవదీయంబైన రూపంబు సూ
చు తలంపెత్తెదుఁ బోలునేని దయఁ జక్షుః ప్రీతిఁగావింపవే" (భీ. 1–206)

ఈ పద్యము విశ్వరూప ప్రదర్శనమునకు హేతుభూతమైన అర్జునుని విజ్ఞాపనము. గీతలో తత్పూర్వము విభూతియోగాంతము వరకు జరిగిన యుపదేశము వలన అర్జునునకు మోహము పోయినదని చెప్పబడినది. (మోహోఽయం విగతోమమ). అయినను విభూతి యోగమున వర్ణింపబడిన విశ్వరూప దర్శన యోగ్యత తనకు గలదేని తనకు చూపుమని అర్జునుడు శ్రీ కృష్ణుని వేడుకొనెను నిజమారసినచో గత మోహునకు విశ్వరూపదర్శనమే అక్కరలేదు. ఈ లోటును గుర్తించియే కవిబ్రహ్మ పై పద్యములో ఆ ఉపపత్తిని కలిగించెను. ఎట్లనగా, అర్జునునకు అప్పటికి జరిగిన ఉపదేశము వలన "కొంతభ్రమ" మాత్రమే పోయెనుగాని పూర్తిగ మోహము తొలగలేదు. మిగిలిన భ్రమ విశ్వరూపసందర్శనము వలనగాని పోదు. అప్పటికి జరిగినది సిద్ధాంత శ్రవణము మాత్రమే! తరువాత జరుగవలసినది తదర్థ సాక్షాత్కారము. నేటి ప్రకృతిశాస్త్ర పారబోధనలోని సిద్ధాన్తము విన్న శిష్యులకు ఉపాధ్యాయులు

ప్రయోగముల ద్వారా ఆ అర్థమును ఋజువుచేసి నిరూఢజ్ఞానము కలవారినిగా చేయుట వంటిదే (Theory and Practicals). కృష్ణుడు అర్జునునకు చేసినది ఉపదేశము. విశ్వరూపమును ప్రదర్శించి వస్తు స్సాక్షాత్కారము జరిగిననేగాని పూర్ణజ్ఞానము కలుగదు. అది కలుగుటకే భగవాను డర్జునునకు విశ్వరూపము చూపెను "కొంత భ్రమ వాసెన్" అన్న వాక్యములో నింత యర్థమున్నది.

మరియు, చరమోపదేశము గల–

శ్లో॥ "సర్వధర్మాన్ పరిత్యజ్య మామేకం శరణం వ్రజ
అహంత్వాసర్వ పాపేభ్యో మోక్షయిష్యామి మాశుచః॥" (18–63)

అను శ్లోకమునకు ఏ వ్యాఖ్యాతయు తృప్తికరమైన అర్థము వ్రాయలేదు. ఈ శ్లోకమును–

తే॥గీ॥ "క్రందుకొను సర్వధర్మ వికల్పములను,
నెడల విడిచి దృఢంబుగ నేనొకండ
శరణముగ నాశ్రయింపుము సకల దురిత
ములకుఁ దొలఁగింతు నిన్నుఁ బ్రమోదమంద" (భీ 1–224)

అని తెనిగించి, పరిత్యజింపదగినవి ధర్మవికల్పములు గాని ధర్మములు కావు అని బోధించుట ఆచార్య పదమధిష్ఠించిన ఆయనకే చెల్లును.*

మఱికొన్ని మూలాధారము ఏమాత్రము లేని స్వతంత్ర పద్యములు రచించి స్వానుభవగోచరములైన రహస్యములను కొన్నింటిని ఉపదేశించెను. ఈ క్రింది పద్యమందులకు ఉదాహరణము.

కం॥ "వైరమున నులిచి త్రెంపక
కారాకులు డుల్లినట్లు కర్మములెల్లన్
దారపెడఁబాయవలయుట
సారకృపన్ దెలియఁజెప్పె శౌరియతనికిన్" (భీ. 1–204)

ఎత్తివైచిన ఆధ్యాత్మిక భాగములలో ముఖ్యమైనది, భగవద్గీతతో సాటి వచ్చునది, శ్రుతి ప్రపంచములో జేరదగినది సనత్సుజాతీయము. గీతకువలెనే దీనికి శంకరులు భాష్యము వ్రాయుట దాని మహత్త్వమునకు నిదర్శనము దీనిని వదులుటలో తిక్కన వహించిన అధికారము నిరుపమానమైనది ఈ ఘట్టము వలన కధకు కల్గిన మేలేమియు లేదు. అదియుండియు లేకయు నిర్విశేషమే ఆ ఉపదేశము

* ఈ శ్లోకములో 'ధర్మ' శబ్దమునకు నేడు మనము వాడుకొనుచున్న 'బాధ్యత' (Responsibility) అనే అర్థమని నాకు తోచినది. "నీబాధ్యతలన్ని నాకు వదిలిపెట్టి నన్ను శరణు చొరుము" అని శ్రీకృష్ణుని యుపదేశము బాధ్యతా నిర్వహణాలోచనలో కలిగే కర్తవ్యతా మూఢత్వమువల్లనే వికల్పములు క్రందుకొనును "అట్టి ధర్మవికల్పములను తొలగద్రోసి నన్నాశ్రయింపు" మని తిక్కనగారి పద్యమునందలి తాత్పర్యము. నేను ఊహించిన పై అర్థము వికల్పమునకు పూర్వదశ నన్నయ భారతమున యయాతిచరిత్రలో "అలును దాసియును సుతుడునన్నవి పాయని ధర్మముల్ మహిన్" అని శర్మిష్ఠ పల్కిన వాక్యములోని ధర్మశబ్దమునకు ఈ 'బాధ్యత' యనియే అర్థము

నాలకించు ధృతరాష్ట్రుడు, భగవద్గీత నాలకించి యుద్ధోన్ముఖుడైన యర్జునుని వలె ధర్మమార్గోన్ముఖుడు కాజాలడు. అతని చంచలతను కృత్రిమబుద్ధిని మరల్పజాలని ఆ ఉపనిషత్తు నిష్ప్రయోజనముగా నుండుట కంటె తొలగుటయే మేలు. అట్లు తొలగించుట వలన అమూల్యమైన మహర్షి వాక్యము వ్యర్థముగాబోక ఆత్మగౌరవమును కాపాడుకొన్నదయ్యెను. ఆ సనత్సుజాతీయములోని విషయములు ఇట గాక గ్రంథము నం దచ్చటనచ్చట కొన్నిచోట్ల అనేక విధములుగ వివరింపబడుటచే దానిని ఇట తొలగించుట వలన నష్టమేమియు కలుగలేదు.

భారతములో తాత్త్వికి ఘట్టములు మూడుచోట్ల ఉన్నవి. అందు మొదటిది భీష్మ పర్వమునందలి గీతోపదేశము. రెండవది ఉద్యోగ పర్వమునందలి సనత్సుజాతీయము. మూడవది శాంతి – అనుశాసనిక పర్వములలో భీష్ముడు ధర్మరాజునకు చేసిన విజ్ఞానోపదేశము. ఈ మూడింటిలో మొదటి రెంటినిగూర్చి ఇతఃపూర్వము చెప్పితిని. ఇక భీష్ముని ఉపదేశము – పూర్వపు రెండింటివలె ఇది శుద్ధ తాత్త్వికము కాదు. అది చతుర్విధ పురుషార్థములకు సంబంధించిన నానావిధ మానవ జీవిత ప్రవృత్తి విశేషధర్మములను వివరించెడి విజ్ఞానకోశము. ఆ భాగము స్పృశింపని భారతీయ సంస్కృతి విశేషమే లేదు. ఆ ఉపదేశము చేసిన గురువు భీష్ముడు ఆయనయందు సంప్రదాయైక వేద్యమైన శ్రుతిస్మృతి పురాణేతిహాస విజ్ఞానమంతయు మూర్తీభవించి యున్నది. దాని నాలకించిన వాడు యుధిష్ఠిరుడు ఆయన గురూపదేశానుసారముగ ప్రజాపాలనా భారము వహింపనున్న రాజు ఈ రాజునకు యుగముల నుండియు పరంపరాగతమైన ఆ విజ్ఞానమంతయు రాజ్యపాలనావసరమున అత్యంతావశ్యకమై యుండును. ఆ ఉపదేశము శ్రీకృష్ణుడుగాని, వ్యాసుడుగాని, మరి యే ఆచార్యుడుగాని చేయుట కంటె ఆతని పితామహుడు చేయుటలో నెంతో ఔచిత్యమున్నది. వంశక్రమానుగతమైన ఆసంప్రదాయమును, మనుమనికి తాత బోధించుట పితృపైతామహమైన నిధులను అప్పగించిపోవుట వంటిది ఈ భాగమున ప్రధాన పాత్రల సన్నివేశ సంభాషణలయందును ఎడనెడవచ్చెడి ఉపాఖ్యానముల యందును తప్ప తక్కినచోటుల కవిత్వపదార్థమే యుండదు నీరసమైన ఆ భాగములను పునరుక్తులు తొలగించి యథావకాశముగా తగ్గించి ఉపదేశసారమునకు లోపము రాకుండ తిక్కన సరసముగా అనువదించెను నీరసములైన అర్థములను కూడ శబ్దగుంభన నైపుణితో ఆయన మనోహరముగ రచించిన విధమును సోదాహరణముగ ఇతఃపూర్వము పేర్కొంటిని. అయినను ఆ భాగము కావ్యోచిత వస్తువు తక్కువ కలది యగుటచే దానికి పూర్వాపరములైన ఇతర గ్రంథభాగములవలె కొందరకు ఇంపు నింపదు. కాని భారతము కేవలము కథాశ్రవణ కుతూహలము తీర్చెడి గ్రంథమనియు, అందు ప్రతి ప్రకరణమును రసవంతముగనే యుండుననియు ఆశపడుట పొరపాటు. విజ్ఞానసర్వస్వమనదగిన ఆ మహేతిహాసములో రసస్పర్శలేని శాస్త్ర ప్రసంగములు కూడ ఉండక తప్పదు. వాటిని తెనుగున ఇంకను సంగ్రహించినచో తెలుగు వారికి ఆవిజ్ఞానము అమాత్రమేని తెలుగున లభింపక పోవును దానిని సయితము ఆయన నిరలంకారమును సహజసుందరమునునైన శైలిలో రచించెను. కథానిరోధకములును నీరసములునైన ఇట్టి ఘట్టములు శాస్త్ర కావ్యము లనిపించుకొనెడి పురాణేతిహాసములలో ఉండితీరును.

ఈ భాగములను కవి యెట్లు తెనుగున అనువదించెనా అని చూచుట మాత్రమే పరీక్షాస్థానము. ఆ పరీక్షకు తాళుట మాత్రమే కాక ఇంతకంటే ఈ అనువాదము మేల్తరముగా చేయుట దుర్లభమనునట్లుగా తిక్కన రచించెనన్నమాట మరవరాదు. సూత్రప్రాయములైన ఆ శాస్త్ర వాక్యములకు అయన శైలి అనువైనట్లు వేరొక తెలుగు కవి శైలి అనువుకాదు. ఆ ఉపదేశము చేయదగిన గురుత్వము కూడ ఆయనకు వలె ఇంకొక తెలుగు కవికి లేదు. ఈ శైలినిబట్టియేకాక ఇతర యోగ్యతలను బట్టియు భారత రచనాధికారము తెలుగున తిక్కనకు తప్ప మరియొక కవికి లేదని నిస్సందేహముగా చెప్పవచ్చును

**ఇతిహాస రచనాధికారము:**

భారతమువంటి విపుల కావ్యకర్తకు ఋషిజనోచితమైన క్రాంతదర్శనము (Pervading Vision) అత్యంతావశ్యకము. మహేతిహాసము లందలి యితివృత్తము అతివిస్తృతమై అనేక దేశకాలసమ్మేళనము కల్గియుండును గావునను, అందలి పాత్రల చరితము కథ వలెనే విస్తరించి పునఃపునరావృత్త మగుచుండును. గావునను ఈ మహాలోకము నంతటిని నొక్కచూపుతో గ్రహించి, ప్రతిసూక్ష్మాంశమును గనుచెదరకుండ స్వాధీనము చేసికొని, యెచ్చటను స్వవచోవ్యాఘాతముగాని, పాత్ర స్వభావ వైరుధ్యముగాని దొరలకుండ, తుదివరకు నిర్వహించు శక్తి గలవాడే ఈ రచనకుఁ బూనుకొనవలెను మఱి స్థూలమైన ఈ కథాభాగము నతిక్రమించి, యావల దానిని నడుపుచున్న యీశ్వర చిద్విలాసమనెడి శక్తిని గూడ ఆచూపులోనే దర్శించుట, యీ క్రాంత దర్శనములో నింకొక భాగము. మహాకవులు, కథామాత్రనిర్వహణముతోఁ దృష్టి పొందరు. కథ వారికి నిమిత్త మాత్రము అది తెరమీఁది బొమ్మ. తెరచాటు నుండి ఈ బొమ్మ నాడించు సూత్రధారుని చేష్టితమును గుర్తించి ప్రదర్శించుటకే వారు యత్నింతురు.

ఏవంవిధ దర్శనమును, సర్వసుబోధములైన తెలుగుమాటల కూర్పు తోడి శైలియు తెలుగు గ్రంధములలో భారతమునకు వలె మఱే గ్రంధమునకును ఆవశ్యకము గాదు. ఆభారతము వ్రాసిన మువ్వురలో, వారి వారి రచనా భాగములనుబట్టి, తిక్కనకే యీశక్తి సమగ్రముగా వశమయినదని చెప్పవచ్చును. మఱియు, నితిహాస కర్తకు సర్వసంవేద్యము, సులభమునైన శైలివలె ప్రౌఢ జటిలశైలి యక్కరకురాదు. పాశ్చాత్యులలో ఆశైలిని 'epic simplicity' అని లాక్షణికముగా నందురు

మఱియు, మహేతిహాసకర్త మహోదార జీవితమును గడిపినవాడు కావలెను (a really epic writer must have lead an epic life). ఈ ధర్మము కూడ తిక్కనయందువలె మఱి యేకవి యెడను సార్థకము కాలేదు. అదికాక, కథ యేదైనను, నందలి విషయసారము కవిచే స్వయముగ ననుభూతము కావలెను లేనియెడల రచనకు జీవము కలుగదనెడు మాటయు పయిదానివలెనే త్రోసివేయరాని ధర్మము ఈ పంచమవేదమును సవిమర్శముగా విభజించినపుడు అందు మూడే ముఖ్య విషయములు గోచరించును.

1. రాజనీతి 2. యుద్ధ తంత్రము 3. బ్రహ్మవిద్యోపదేశము

పుట్టుకచేతను, నడవడిచేతను, విజ్ఞానముచేతను ఈ మూడు మహాధర్మములను

ఆత్మధర్మములుగ నిర్వహించి అనుభవ గోచరములు చేసికొనిన కవి తెలుఁగు నాఁట తిక్కన యొక్కఁడే. ఈ కారణములచే భారత రచనకు తిక్కన యొక్కడే యుత్తమాధికారి యని చెప్పనగును. ఈ యధికారము కేవలానువాదమునకు అక్కరలేదు. తన రచన కేవలానువాదము కాదని తిక్కన చెప్పెను

"తెనుఁగు బాస వినిర్మింపఁ దివురుటరయ
భవ్య పురుషార్థ తరుపక్వ ఫలము గాదె" (విరా. 1-18)

వినిర్మించుట యనగా విశిష్ట రూపమున నిర్మించుట యని యర్థము ఈ యర్థముననే తిక్కన భారతము పునర్నిర్మాణ మయ్యెను, శుద్ధానువాదము కాలేదు. భారతము యొక్క అంతరాత్మ ధర్మాద్వైత మూర్తియని తొలుత గ్రహించిన వేత్త ఆయనయే. ధర్మ సందేశము ద్వారా ఆ అద్వైత భావమును నిరూపించినట్లే, స్వరూప నిర్మాణమున కూడ దానిని సాధించెను. భారతమంతయు నొక ప్రబంధ మండలిగా, నందొక్కొక్క పర్వమొక్కొక్క ప్రబంధముగా పర్వాంతర్గతములగు నుపాఖ్యానములు స్వయంసమగ్రములగు కావ్యములుగా నూహించి అవయవమునకును నవయవితో పొత్తు చెడకుండ, సర్వాంగ సౌష్ఠవమును దృఢబంధమును గల భారతమూర్తిని, శ్రీకృష్ణుని విశ్వరూపమువలె తీర్చి ప్రదర్శించిన బ్రహ్మయే కవిబ్రహ్మ. కర్ణపర్వాంతము నందలి ఈ క్రింది పద్యమును చూడుడు:

చ॥ "అనలుఁడు భాస్కరుండును సుధాంశుఁడు నధ్వర సంప్రవర్తకుల్
వినుము నరేంద్ర యీ క్రతువు విష్ణుమయం బిది నిర్వహించి ర
ర్జునుఁడును కర్ణుఁడున్ సమర రూపమునన్ దగ నీ ప్రబంధ మిం
పొనర పఠించినన్ వినిన నొందునరుల్ చిర సౌఖ్య సంపదల్." (క. 1-397)

ఈ పర్వమొక ప్రబంధమనియు అది పరిసమాప్తి నొందెననియు చెప్పుటయే కాక దానిని విన్నను పఠించినను చిరసౌఖ్య సంపదలు పొందునని ఫలశ్రుతిని కూడ పల్కెను. తిక్కన ఒక్కొక్క పర్వము నొక్కొక్క ప్రబంధముగా భావించెననుటకు ఈ నిదర్శన మొక్కటి చాలును. మఱియు తిక్కన భారతములో ప్రతి చిన్న ఉపాఖ్యానమును స్వయం సంపూర్ణమైన యొక కావ్యముగా రచించుట బ్రాహ్మణ సమారాధన చేసెడి యొక గృహస్థు భోజనమునకు వచ్చిన అసంఖ్యాక బ్రాహ్మణులకు సాముదాయకముగా ఆతిథేయ మర్యాదలు జరుపుటయేగాక ప్రతి బ్రాహ్మణుని ప్రత్యేకము ఆనాటికా ఒక్కడే అతిథిగా భావించి శ్రద్ధతో ఆదరించి పూజించుట వంటిది.

**నాటకీయత:** సాహిత్యపరముగ శైలిని రెండు విధములుగ వివరింపవచ్చుననియు, అందు మొదటిది కావ్య సామాన్య సరణియనియు, రెండవది పదగుంభన సరణియనియు మొదటి దానిలో అఖ్యాన, నాటకీయ, వర్ణనాత్మకములు అను మూడు భేదములుండు ననియు, రెండవదానిలో బుద్ధిగమ్య, భావస్ఫోరక, కర్ణపేయములనెడి మూడు భేదములుండుననియు నన్నయ ప్రకరణము చెప్పితిని. ఆ ప్రమాణములను బట్టియే తిక్కన శైలి నాటకీయ మనియు బుద్ధి గమ్య మనియు నిర్దేశింపవచ్చును

**నాటకీయమనగా:** ఏ కథయైనను కథనరూపమున ఉన్నప్పుడు అఖ్యానమనియు, సంవాద రూపము నున్నపుడు నాటకీయమనియు అనిపించుకొనును. కథన రూపమున

నడచిన కథ కొంత కవివశమునను కొంత పాత్ర వశమునను వర్తించును. సంవాద రూపమునమన్న కథ కేవల పాత్ర వశముననే వర్తించును. ఇదియే దృశ్య శ్రవ్య కావ్యములకు గల ముఖ్యభేదము అయితే సంవాదమే నాటకీయత గాదు. అది అందులో నొకభాగము మాత్రమే. నాటకీయతకు ప్రాణముపట్టు అని చెప్పదగినది పాత్ర సృష్టి. అనగా పాత్రలు కవిచే వర్ణింపబడక తత్తద్గుణ కర్మానుసారముగా స్వయంవ్యక్తములగుట. పాత్ర సృష్టిచేయు కవి వాటిని స్వయంవ్యక్తములగు నట్లొనర్చునటలో నిశితముగా వాటి చిత్తవృత్తి పరిశీలన మొనర్చి తదనుగుణమైన మాటలను, చర్యలను వాటి కాపాదించును. పాత్రల వర్తనమే కథాగమనమగును. కావున గ్రంథము సంవాద రూపమున నుండుటయు, చిత్తపరిశీలనానుగుణముగ పాత్రసృష్టి జరుగుటయు, సజీవమైన ఆ పాత్రల వర్తనమే కథా గమనమగుటయు అనెడి మూడంశములు నాటకీయతకు ముఖ్య లక్షణములు. ఇట్టి లక్షణములు సమగ్రముగా గల గ్రంథము నాటకము. శ్రవ్య కావ్యమున కూడ సజీవపాత్ర నిర్మాణము జరుగవచ్చునుగాని అట్టి సందర్భములు క్వాచిత్కములుగానే ఉండును. పాత్రలు కవిచే వర్ణింపబడుటయే ఆ జాతి కావ్యముల లక్షణము. అట్లే కొన్ని శ్రవ్య కావ్యములలో సంవాద రూపమునను కథ నడుపవచ్చునుగాని కథనమే వాటి ప్రధాన లక్షణము. పాత్రను వర్ణించుటను ప్రత్యక్ష పద్ధతి యనియు (Direct method) పాత్రను స్వయం వ్యక్త మొనర్చుటను పరోక్ష పద్ధతి (Indirect method) అనియు విమర్శ పరిభాషలో నందురు. వర్ణింపబడిన పాత్రలలో చైతన్యముండదు.

భారతము రచనాక్రమమును బట్టియు, వస్తు స్వభావమును బట్టియు, శ్రవ్య కావ్యమేగాని దృశ్యకావ్యముకాదు అనగా ఆఖ్యానజాతికి చెందిన విపుల కావ్యము. ఆఖ్యానజాతిలో ప్రబంధములు కొంతకు కొంత నాటకీయ సరణిలో నడచిన నడువచ్చును గాని పురాణేతిహాసాదులైన ఉద్గ్రంథములు ఆ సరణిని నడువజాలవు అట్లు నడుపుటయు కష్టమే. ఈ గ్రంథములయందు పాత్రచిత్రణాది నాటక లక్షణములను ఆశింపరాదు. ఆ లక్షణములు లేకుండుట ఆ గ్రంథమునకు కళంకమును కాదు కాని వీటిని గూడ అనువైనంతవరకు నాటక లక్షణ ముద్రితములను చేయగల కవి ఉన్నచో ఆతని రచనాసరణియే నాటకీయము అందుము అతడైనను సందర్భము పొసగినపుడే నాటీకయ పద్ధతి ననుసరించును గాని గ్రంథమంతయు ఆ సరణినే నడుపజాలడు. ఈ లక్షణములను బట్టి తిక్కన, పురాణమనిపించుకొనదగిన భారతమును కావ్యలక్షణ శోభితమైన ప్రబంధముగా నొనర్చుటయేగాక, ఆ ప్రబంధమును నాటకీయముగా గూడ సంతరించెనని సహృదయులకు విదితముకాక మానదు. 'అదియే, ఆయన సరణి నాటకీయము' అను మాటలోగల తాత్పర్యము. ఇట్లనుటచే ఆయన చేతిలో భారత కథ కథన రూపమున నడవలేదని గాని పాత్రలు ఎచ్చటను వర్ణింపబడలేదని గాని అనుకొనరాదు. కాని అట్టి ఆఖ్యాన లక్షణముల కంటె నాటకీయ లక్షణములే ఆయన భారతమున మిక్కుటముగ నుండును. మరియు సజీవపాత్రసృష్టిలోను దాని కాధారమైన పాత్రమనోధర్మ పరిశీలనలోను ఆయనకు గల ప్రతిభ నాటక కర్తలలోనే చాలమందికి లేదు. ఇక శ్రవ్యకావ్యకర్తల సంగతి చెప్పనేల?

**తిక్కన నాటకీయతలోని మరికొన్ని విశేషములు:** ప్రబంధముల మాట ఎట్లున్నను

పురాణేతిహాసాదులకు నాటక లక్షణము పట్టించిన కవి తెలుగున ఇంకొకడు లేడు. ఆయన నాటకమునందువలె రంగప్రసాధనమును, అభినయ సూచనను, జనాంతిక స్వగతములను, పాత్రప్రవేశనిష్క్రమణములను, పాత్రల అవయవవిక్షేపములను సైతము ప్రదర్శించును. స్వభావముచేత ఆయన నాటకకర్త కావలసినవాడు కాని ఆఖ్యాన రచన చేయుటచే అలక్షణములను దీనియందు ప్రవేశపెట్టి తన రచన నాటకీయసరణి అని అనిపించుకొనెను. కావుననే ఆయన భారతమును చదువుచున్నపుడు కథను చదువుచున్నట్లుగాక నాటకమును చూచుచున్న భావన కల్గును అనగా రసాస్వాద జన్యమైన ఆనందము కల్గును. అసలు సాహిత్య పఠనమునకు ఫలముగా చెప్పబడిన రసాస్వాదము నాటక ప్రదర్శనము చూచున్నపుడు సామాజికులకు కల్గెడి ఆనందానుభవ పరముగ భరతునిచే చెప్పబడెను. శ్రవ్య కావ్యమునకుగాని ప్రదర్శనార్హత లేని దృశ్య కావ్యమునకుగాని, భరతుని సిద్ధాంతము అన్వయింపదు. దర్శనవేళ కాక శ్రవణ పఠన వేళయందును కావ్యములు ఆనందదాయకము లగుచుండుటను గుర్తించిన ఆలంకారికులు తరువాతి కాలమున ఆ రససిద్ధాంతము శ్రవ్యకావ్యములకుకూడ అనువర్తింపజేసిరి. అట్లు చేయుటలో వారు శ్రవ్యకావ్యముల నన్నిటిని లక్ష్యములుగా గ్రహింపక ప్రత్యక్ష కల్పములైన వాటియందు మాత్రమే రసోదయము కల్గునని ఒక మేర నిర్వరిచిరి. "ప్రత్యక్ష కల్పము" అనగా భూతపూర్వకమైన వృత్తాంతము ఇంచుమించు యథాతథముగా మరల కంటి యెదుట కానవచ్చుట. నాటక ధర్మమిదియే కదా? ఏనాడో, ఎక్కడనో జరిగిన యొక వృత్తాంతమును ఈనాడు మన కంటియెదుట జరుగుచున్నట్లుగా చూపుటయే నాటక ప్రదర్శనము. అందుచేతనే కథ భూతకాలికమైనను నాటక రచన వర్తమాన క్రియా ప్రయోగముతో రచింపబడును. నాటకేతరమైన కావ్య పఠనవేళను రసోదయము కావలెనన్నచో కథాసంవిధానము నాటకమునందువలె ప్రత్యక్షము కావలసియుండును. పాత్రల మానసిక భావవివర్తములను, శరీరావయవ విక్షేపములను, గాత్ర స్వరకాకువులను భావించి పాత్రానుగుణముగ సందర్భానుసారముగ చిత్రింపగల కవులకే కావ్యమును ప్రత్యక్షగోచర మొనర్చుట సాధ్యమగును. అట్టి కావ్యములే రసవంతములు అనిపించుకొనును తెలుగు కవులలో కూలంకషనాటకీయప్రజ్ఞగల మహాకవి తిక్కన. ప్రబంధకవులలో అట్టి ప్రజ్ఞ కలవారు మఱికొందరు గలరు గాని వారు తిక్కన తరువాతనే పరిగణింపదగినవారు. మరియు ఆ ప్రబంధములు భారతమువలె అతి విస్తృతి కల కథలు కావు. అవి పరిమిత పరిమాణము కలవి అందు వర్తించు పాత్రలును పరిమిత సంఖ్య కలవి. ఇక భారతమో, అసంఖ్యాక పాత్రలతో నడిచెడి అతివిస్తృతి వస్తు ప్రపంచము. విపులతరమైన పటముమీద చిత్రింపబడిన మూర్తులలో సూక్ష్మ రేఖలు మరుగుపడుననుట చిత్రలేఖన కళాధర్మములలో నొకటి. అట్లే సాహిత్యమునకూడ విపులతరమైన వస్తు ప్రపంచములో సూక్ష్మ వివరణములు కవి భావనను తప్పించుకొని పోవును. భారతములో అట్టి సూక్ష్మ వివరణ విస్మరణ మెయ్యెడను జరుగలేదు. ఈ సిద్ధాంతమునకు గ్రంథమంతయు ఉదాహరణమే. అయినను ఒకటి రెండు ఉదాహరణములు చెప్పెదను. 1. ద్రౌపది సైరంధ్రీ వేషమున విరాటపురము చొచ్చునపుడు సైరంధ్రీ జాతి వేషమున కుచితమౌనట్లు జడను విప్పుకొని "వలపలి దిక్కున కించుక మలగునట్లు" కొప్పు పెట్టుకొన్నదట.

2. సుదేష్ణను చేరబోవునప్పుడు 'తల సీరయరసి' వినయవైభవముతో చనియెనట. 3. గాంధారీ ధృతరాష్ట్రుల వెంట వనవాసమునకు పోవ సంకల్పించిన కుంతీదేవి ఆ తలంపు మానుమని వేడుకొనిన ధర్మజునకు తన తలంపు మారదని చెప్పినపుడు.

"నిజస్కంధంబున నున్న గాంధారి కరంబుఁ గరంబు నయంబునఁ బాపి అతని దిక్కు మొగంబై"

కం॥ "నీవేమియు ననకుము, సహ
దేవుని నేమరక యరయు, దినకర సుతునిన్
భావమునఁ దలఁపు, మే నా
దేవసముని పుట్టు వడచితిం గపటమునన్" అనియెను.

4. ద్రౌపది కీచకునివలన తాను పడిన భంగపాటు భీమున కెరిగించునదియై రాత్రివేళ మహానసశాలకుపోయి నిద్రలోనున్న అతనిని మెల్లగా సంబోధించెనట. అతడు మేల్కొని చీకటి గావున వ్యక్తిని గుర్తుపట్టలేక "యెవ్వరిది?" యనెనట. ఆమె "నేను" అని బదులు చెప్పినదట. ఆ యెలుంగును బట్టి అతడు ఆమెను ద్రౌపదిగా గ్రహించెనట. ఇట్టి శారీరక చేష్టలు, వాచిక కాకువులు, నాటక ప్రదర్శనమున నటులు చేసెడి అభినయ విశేషములు. వాటిని కూడ కథా వర్ణనమున ఇముడ్చుట చేతనే కావ్యార్థము ప్రత్యక్ష కల్పమైనది. దాని ఫలితముగా విషయ ప్రధానమైన ఈయితిహాసము నాటకముగా రస ప్రధానమైనది. నిర్వచనోత్తర రామాయణ ప్రకరణమున నే నుదాహరించిన సీతావివాస, రంభారావణసంవాదములు ఇయ్యెడను ఉదాహరణములు కాదగును. మరి అట్టివి వేనవేలు.

**శైలిలో రెండవ అంశమైన పదగుంభన సరణి:** శబ్ద విన్యాస సరణిని బట్టి ఒక కవి యొక్క శైలి భావస్ఫోరకమో (ఆవేశజనకమో) కర్ణపేయమో బుద్ధిగమ్యమో అయి ఉండుననియు, ఈ గుణములు సందర్భమును బట్టి ఒక్కొక్క యెడ సమ్మిళితములై యుండుట కలదనియు అయినను ప్రధానముగా ఏదో ఒక గుణము ఒక్కొక్క కవి శైలికి ఆత్మధర్మముగా నెగడుచుండుననియు ఇతఃపూర్వము చెప్పితిని. ఆ ప్రమాణమును బట్టి తిక్కన శైలి ప్రధానముగా బుద్ధిగమ్యము అని చెప్పవచ్చును. ఆలంకారికులు కావ్యగుణముగా పేర్కొన్న వాటిలో అర్థవ్యక్తి (Propriety), సమ్మితత్వము (Precision), సంక్షేపము (Brevity), సమత (Balance) మొదలగు గుణములన్నియు బుద్ధిగమ్యమైన శైలికి లక్షణములు. కేవల కర్ణపేయములైన గుణములను తిక్కన ఎచ్చటను ఆదరింపలేదు. భావస్ఫోరకము, బుద్ధిగమ్యములైన గుణములలో సందర్భోచితముగా ఒక్కొక్క దానికి ప్రాధాన్యమిచ్చి హృదయార్ద్రతను, బుద్ధి వికాసమును సమముగా కలిగించును. భావావేశము గల ఘట్టములందును బుద్ధిగుణములకే ఎక్కువ అధికారమిచ్చును గాని, ఆ ఆవేశ ప్రవాహమునబడి మున్కలువైచుచు కొట్టుకొనిపోడు. తత్ఫలితముగా కావ్యశిల్ప లక్షణములలో శిరోభూషణ మనదగిన ఔచిత్య పరిపాలనము ఆయన రచనలో ప్రతి వాక్యమునందును ప్రస్ఫుటమగుచుండును. జీవితములో ఆయన మహామేధావి. ఆ మేధావితయే ఆయన శైలికి ఆత్మధర్మము.

ఈయన రచనలో అర్థము ననుసరించి శబ్దము నడచును గాని శబ్దము తీసిన దారిని నడచి అర్థము భ్రంశముకాదు. ఏ కవికేని తన భావమునకు గోచరించిన దంతయు

రచించి చూపుట దుర్లభము. శుద్ధభావనాప్రపంచమునకు సంబంధించిన అతని యూహా మూర్తప్రపంచమనదగిన శబ్దములో అవతరించునప్పటికి అనేక సంకటములకు లోనై పరిమిత రూపముతోనే వ్యక్తమగును. సాధారణ కవులందరు శబ్దాధికార సంకటములకు లోనయి, యివి నడిపిన దారినే తమ భావముల పోనిచ్చి, యా యాషత్తలముతోనే తృప్తి పొందెదరు. భావభ్రంశము నంగీకరింపని మహాకవులు శబ్దమునే భావమునకు లోనుగావించి భావానుగుణముగ దానిని పలువిధముల త్రిప్పిమలచి నడపింతురు. వీరే వశ్యవాక్కులు. ఈ కార్యము తిక్కనవలె నిర్వహించిన తెలుగుకవి మరియొకడు లేడు. మరియు ఈయన రచనలో నొక్కొక్కయెడ ఒకే పద్యమున కార్యకారణ సంబంధముగల అనే వాక్యములుండును. ఈ వాక్యముల సంబంధములను మన మూహించుకొనవలసినదేగాని ఆయన చెప్పడు.

*చం॥ "పగయడఁగించు టెంతయు శుభం బది లెస్స; అడంగునే పగన్*
*పగ; పగగొన్న మార్కొనక పల్కక యుండగవచ్చునే; కడున్*
*దెగ మొదలెత్తి పోవఁ బగ దీర్పఁగ వచ్చిన క్రౌర్యమొందు; నే*
*మిగతిఁ దలంచినన్ బగకు మేలిమి లేమి ధ్రువంబు కేశవా!"*

ఈ పద్యమున "పగ అడగించుట లెస్స" అని ఒక సిద్ధాంతము చేయబడినది ఆ అడగించుట క్రౌర్యరహితముగా జరుగవలెనని ఇంకొక సంకేతవాక్యము చేర్చబడ్డది. ఈ రెండు వాక్యములకు నడుమ ఒకదాని నొకటి పూర్వ పక్షము చేయుచు మూడు వాక్యములున్నవి. ఆ మీమాంసా ఫలితముగా క్రౌర్యరహితముగా పగదీర్చుకొనుట సాధ్యముకాదు గనుక అసలు పగ బూనుటయే అకార్యమని నిశ్చయింపబడినది అర్థ సంవాదము కలిగి సమానబలము గల ఇందలి వాక్యములను ఇంకొక కవియైనచో ఏ సీసపద్యముననో వివరముగ వ్రాసియుండును. తిక్కనది ఆ పద్ధతి కాదు. మరియు సిద్ధాంతమును సయుక్తికముగా సమర్థింపుచు తర్కసహము చేయుట ఆయనకు పరిపాటి. "అమలోదాత్తమనీష" కలవాడు కనుక తర్కమునకు తాళజాలని యే సిద్ధాంతమును చేయడు. ఒక పద్యము నుదాహరించెదను.

*"వలనధికంబుగాఁ గలుగు వైద్యులు శాస్త్రము లభ్యసించి మం*
*దుల నొడగూర్ప నేర్చి, తనుదోషము లారయు శక్తి కల్గి యా*
*ర్తులకు జికిత్స చేయుదురు, రోగము వాయమిలేదె? వారు రో*
*గులగుట కానమెట్లు? ప్రతికూల విధిన్ నరు నేర్పుతోఁచునే?"*

ఈ పద్యములో నరుడు తన ప్రజ్ఞచే ప్రతికూల విధిని అతిక్రమింప జాలడను సిద్ధాంతము చేయబడినది. దానికి సమర్థుడైన వైద్యుడు చికిత్స చేసినను రోగము పోకుండుట దృష్టాంతముగా నీయబడినది. వైద్యుడు అసమర్థుడేయైనచో ఆ దృష్టాంతమే అసమర్థమగును. కావున సమర్థుడైన వైద్యుడే గ్రహింపబడెను వైద్యుని సామర్థ్యమును నిరూపించుటకు అయిదు లక్షణములు పేర్కొనబడినవి. వాటిలో మొదటిది శాస్త్రాభ్యసనము, రెండవది మందులు చేయు నేర్పు, మూడవది రోగనిదానము, నాల్గవది చికిత్సా కౌశలము, అయిదవది వలను– అనగా ఉపాయమని సాధారణార్థము. సమయోచితోపాయము అని విశేషార్థము (Resourcefulness);

చికిత్స చేయునప్పుడు ఎప్పటి కప్పుడు తటస్థించు బెట్టిదములను తొలగద్రోయు నేర్పు, ఈ లక్షణములలో నేదిలేకున్నను వైద్యుడు సమర్థుడే కాజాలడు. వాటిలో ఉపాయము అతిముఖ్యమగుటయే కాక శాస్త్రాభ్యాసమునకు పూర్వమే వైద్యుడు కాదలచిన వానికి ఉండవలసిన సహజ లక్షణము. అందుచే నది మొదట పేర్కొనబడెను. సులభముగానున్న ఈ పద్యములో తర్కమయమైన ఇంత విపులార్థమున్నది ఇందు అర్థాతిశాయియైన శబ్దముగాని శబ్దాతిశాయియైన అర్థముగాని ఎచ్చటనులేదు. ఇట్టివే ఆయన శైలికిగల లక్షణములు. ఈ శైలియే బుద్ధిగమ్యమని చెప్పదగినది.

మరికొన్ని చోట్ల భావము యొక్క లోతును బట్టి అర్థమునకు ఝటితి స్ఫూర్తి కలుగదు. అసలు ఏ కవి రచించిన పద్యమునకైనను అర్థము చెప్పబూనెడివాడు ఆ కవి ఆ పద్యములో చెప్పదలచిన భావమేదియో మునుముందు ఊహించి అవగతము చేసికొన్ననేగాని అర్థము చెప్పజాలడు. కవి హృదయము గోచరము కానివాడు ఆ పద్యమునకు అర్థమే చెప్పలేడు. అనగా వ్యాఖ్యాత కవికి గల భావుకత్వము కలవాడై యుండవలె నన్నమాట. ఒకటి రెండు ఉదాహరణములు చూడుడు:

కం॥ *"పరిచారికాత్వ రేఖా*
*పరిణతి తనమేన నచ్చుపడు భావనకున్*
*దిరమై తలకొను నంతః*
*కరణముతో పురము ద్రుపదకన్యక సొచ్చెన్"*

ఇది ద్రౌపది సుదేష్ణయొద్ద సైరంధ్రిగా వర్తింపబోవు సందర్భమున చెప్పినది ఆమె ఒక మహారాజునకు పట్టమహిషి, కాలవశమున పరిచారిక కాబోవుచున్నది. ఎంత నేర్పుతో వేషము మార్చుకొని నటింప బూనినను ఆమె రూపురేఖలు సహజ ప్రాభవమును వెల్లడించుచునే యుండును. వేషమేగాక రేఖ సైతము పరిచారికాత్వ స్ఫురణ కల్గింపనిచో గుట్టు బయటపడును. రేఖను మార్చుకొనుటకు శరీరవర్ణమును మార్చుకొనుటవలె అతి దుర్ఘటము. కాని భావితాత్ములైన వారు త్రికరణశుద్ధిగా భావన చేసినచో ఆత్మీయ రేఖను గూడ మార్చుకొనగలరు అట్టి భావన చేయుటకు, అంతఃకరణము అచంచలమై యుండవలెను. ఈయెడ పాంచాలి తన శరీరమున పరిచారికత్వరేఖ పొచ్చెము లేకుండ ముద్రితమగుటకై తాను చేయు భావన స్థిరమైయుండదగిన అంతఃకరణముతో పురముసొచ్చినదని ఈ పద్యము యొక్క భావము. "భావన వలన రేఖ మార్చుకొనవచ్చును" అనెడి యోగశాస్త్ర రహస్యమును అర్జునుడు బృహన్నల యయ్యెడు సందర్భమున కూడ తిక్కన వ్యక్తపరచెను ఆ వాక్యమిది: "వదనంబు కొమరు భావన చేసి వేరుగా" అర్జునుని ముఖసౌందర్యము భావన వలన మారిపోయినదట. అగాధమైన ఇట్టి అర్థగాంభీర్యము నూహింపలేనివారికి, ఆయన పద్యములు విన్నంతనే అర్థములు కావు. ఈ గుణమును గ్రహింపలేక తిక్కన కవిత్వమునకు ప్రసన్నతా గుణము తక్కువయని కొందరనుకొందురు. అర్థగాంభీర్యమును అప్రసన్నతగా తలచుట అశిక్షితబుద్ధులకు సహజమే!

*"గుఱియైన చెలువున నెఱసిన లోక ర*
*క్షణ మనంగ గళంబు చాయదోఁప"*

హరిహరనాథుడు తనకు ప్రత్యక్షమైనపుడు తిక్కన చేసిన ఆ రూపవర్ణన గల పద్యములోని పాదమిది. కాలకూటము మ్రింగిననాడు ఏర్పడిన గళంబుచాయ ఆ దేవుని కంఠమున కానవచ్చెనట. ఆనాడు లోకరక్షణార్థమై అయన హాలాహలమును మ్రింగెనుగాన ఆ చాయయే ఇక్కడ లోకరక్షణముగా అభేదాధ్యవసితమైనది. అయితే ఆ నల్లని చాయయే ఆదర్శప్రాయమైన సౌందర్యముతో నిండియున్నదట. ఈ అర్థమునకు తిక్కనవాడిన వాక్యము "గుఱియైన చెలువున నెఱసిన" (filled with ideal beauty) అని. ఈ మూడు అచ్చతెనుగు మాటలలో *"ఆదర్శప్రాయమైన సౌందర్యములో నిండిన"* అన్న వాక్యార్థము ఇమిడియున్నది. ఇది గ్రహింపలేనివారికి ఆయన కవిత్వము అప్రసన్నముగ తోచుట వింతగాదు. మరి ఆధ్యాత్మికములైన కొన్ని ఘట్టములలో వేదాంతశాస్త్ర పరిజ్ఞానము, యోగశాస్త్రానుభవము లేనివారికి ఎంత ఆలోచించినను అర్థముగాని పద్యములున్నవి. అట్లే ధర్మశాస్త్ర ప్రసంగములు వచ్చినపుడును అట్టివే కొన్ని పద్యములు గలవు వాటినైనను అప్రసన్నతాదోషజుష్టము లనరాదు. కావ్యములలో శాస్త్రార్థ ప్రసంగము వచ్చినపుడు తచ్ఛాస్త్ర పరిజ్ఞానము లేనివారికి అవి దుర్బోధములగుట సహజమే. దానికి మన విజ్ఞాన లోపమే కారణముగాని కవిరచనాలోపము కారణము కాదు.

అర్థమునకు ముందు విన్నంతనే చెవికి ఇంపును, మనస్సునకు హాయిని గొల్పెడి పద్యములు తిక్కన రచనలో చాల అరుదుగా నుండును. క్వాచిత్కములైనవి కొన్ని ఉండవచ్చును. అవియైనను కేవలము అక్షర రమ్యత నాశించి వ్రాసిన పద్యములుగావు. భారతమున ఇతర భాగములందును భాగవతాది ఇతర గ్రంథములందును సందర్భము నుండి వేరుపరచి, ఇంపుగా చదువుకొనదగిన పద్యము లనేకములుండును. తిక్కన భారతమున ప్రతి పద్యమును సందర్భసంకీలితమై అవయవితో విడరాని పొత్తును కలిగియుండునుగాన దానిని వేరుపరచి ముచ్చటగా చదువుకొని మురియుట పొసగదు.

*"చిచ్చరకన్ను మూసికొని చేతిత్రిశూలము డాఁచి లీనమై*
*వచ్చిన రుద్రుచందమున వ్రాలెదవీవనిలోన నోర్వఁగా*
*వచ్చునె నిన్ను నెట్టి మగవారికి నీ కృపనాశ్రయింపఁగా*
*వచ్చితి మేగతిన్ గెలువవచ్చు మహాత్మ యెఱుంగఁజేయవే!"*

ఇత్యాది పద్యములు కొన్ని సందర్భము నుండి వేఱుపరచి చదువుకొనుటకు అనువుగా నుండునుగాని అవియైనను సందర్భముతో కలసి యున్నప్పటి చిత్త సుఖమును విడిగాకలిగింపలేవు. అనగా తిక్కన పద్యరచనాపరాయణుడు కాడు; కావ్యశిల్ప పరాయణుడు; ఆ శిల్పములో ఏ స్థానమున ఏ పద్యము ఏ వాక్యము అవశ్యకమగునో దానినే ఘటించి మూర్తి సౌష్ఠవమును రసస్ఫూర్తిని కలిగించును. అవయవి నుండి విడదీసిన ఏ అవయవమును ఇంపు గొలుపదు.

ఇంకొక విశేషము–

ఆంధ్రవాఙ్మయములో సంస్కృత జటిలము, సమాస ఘటితము, అక్షర రమ్యము, భావాతిశాయిశబ్దము, నైఘంటికము అయిన శైలి యొకటియు; దేశ్యపదఘటితము, నాతిసమాస భూయిష్ఠము, లోకవ్యవహారసిద్ధము అయిన శైలి యింకొకటియు రెండు భిన్నమార్గములుగా తొలినాడే యేర్పడెను. దీనిలో మొదటి దానికి నన్నయయు

రెండవ దానికి తిక్కనయు గురువులు. ఈ రెండు తెలుగుభాషలో నాటినుండి నేటికిని విడివిడిగా సాగుచునే యున్నవి. అర్వాచీనులలో నన్నయ శైలిని అనుకరించి కృతకృత్యులయిన కవులు చాల మంది కలరు. శ్రీనాథ పోతనాదులు, ఆ శైలికే మరికొంత వన్నె పెట్టి గురువునకు ప్రత్యుపదేష్టలు అనదగినవారుగా గణనకెక్కిరి. తిక్కనను అనుకరింప జూచినవారు దేశ్యపదమయమైన రచన చేయగలిగిరేగాని ఆయన శైలిలో తక్కిన విశేషములను స్పృశింపలేకపోయిరి. అనగా ఆయన శైలి అనుకరణ సాధ్యము కాదు. నిజమునకు భావగతి కూడ శైలిలో ఒక భాగమని అంగీకరింతుమేని ఒకనిశైలి మఱియొకని కెన్నడును అనుకరణీయముకాదు. అది అతని ఛాయ వంటిది. ఇచ్చట ప్రస్తావింపబడిన అనుకరణీయత బాహిరమైన శబ్దగతికి సంబంధించినది మాత్రము. తిక్కన శైలి అననుకరణీయ మన్నప్పుడు ఆయన శాబ్దిక శైలియు అసాధ్యమే అనుకొనవలయును. ఆయనవలె లోకసాధారణ భాషలో జీవవంతములైన వాక్యములు వ్రాసిన కవి ఇంకొకడు లేడు.

**వర్ణనలు - చిత్రణము:** కావ్యమునందలి వర్ణనలు వస్తు వర్ణనమనియు రూపచిత్రణమనియు భావచిత్రణములనియు మూడు విధములు. రమణీయములైన సూర్యచంద్రోదయాది ప్రకృతి దృశ్యములును, పాత్రలు వర్తించు రంగస్థలాది సన్నివేశములును, వస్తు వర్ణనలగును. మరి ఆ రంగమున ప్రవేశించు పాత్రల రూపరేఖలను, మనోభావములను వర్ణించుట రూపచిత్రణమగును. అలంకార శాస్త్రమున వీటిలో మొదటి వర్గమున కుద్దీపన విభావమనియు, రెండవ దానికి ఆలంబన విభావమనియు పేర్లు-కథలో ఒక వివాహ ఘట్టము సందర్భించినపుడు ఆ వివాహ మంటపమును అందలి వేదిని నానావిధ మంగళ ద్రవ్య సముచ్చయ స్థితిని బంధుమిత్ర జనసమావేశమును వర్ణించుట వస్తువర్ణనము. పెండ్లి పీటమీద ఆసీనులైన నూతన వధూవరులను వర్ణించుట రూపచిత్రణము. మరి వారి మధుర మనోభావ సంచారమును వర్ణించుట భావచిత్రణము. ఈ మూడును విడదీయరాని పొత్తు కలిగియుండుట నిజమే. కాని, వాటికిగల ఈషద్భేదమును గుర్తించుట మాత్రము విమర్శ ధర్మము ఈ మూడును ఉత్తరోత్తర చతురతరములు. అందును మూడవది (భావవర్ణన) కవియొక్క ఆంతర జగద్దర్శన నిపుణతకు పరీక్షా స్థానము సజీవపాత్ర సృష్టికి ఆ దర్శనమే మూలభూతము. సాధారణముగా ఈ మూడు విధములను వర్ణనలనియే చెప్పుచుందుము. అందు తప్పేమియు లేదు. తిక్కనగారి సన్నివేశ వర్ణనలను, మూర్తి వర్ణనలును, భావ వర్ణనలును పరస్పర పోషకములై రసోదయము కల్గించుచుండును.

ఆయన చేతబడిన భారత భాగమున యుద్ధభూమియు, అందు సంహార తాండవ మొనర్చు వీరుల మూర్తులును ప్రధాన వర్ణనీయాంశములు. యుద్ధ పంచక భాగమునగల కథయంతయు ముఖ్యముగా ఈ రెండంశములకు సంబంధించినదే. ఈ భాగమునను యుద్ధభూమిని ప్రవహించెడి రక్తవాహినులవలె రౌద్రభయానక రసప్రవాహములను వెల్లివిరియించి తిక్కన రమణీయభయంకరమైన ఒక లోకమును చిత్రించి ప్రదర్శించెను. ఆయన యుద్ధభూమిలో రుద్రునివలె ఆనంద పారవశ్యముతో తాండవించుచు అయిదు పర్వముల వీరగీతము దేవతలు ఆలకించునట్లు ఎలుగెత్తి పాడెనా? అని యనిపించును. ఆ వీరగీతము యొక్క తుదిచరణమే స్త్రీ పర్వము. అప్పటికి గతించిన

పదునెనిమిది రోజులలో పోరిపోరి వీరస్వర్గ మలంకరించిన శూరుల కళేబరములను, అవి చివికి జీర్ణించి గుర్తుపట్టరాని అంగవైకల్యముతో పడియున్న స్థితిని చిత్రించుటలో ఆయన చూపిన సునిశితమైన భావన ఊహింపవలసినదే కాని ఉగ్గడించుటకు సాధ్యముకాదు. యుద్ధములను వర్ణించిన యుద్ధపంచకములో ప్రవహించిన రౌద్ర భయానక రసములవలెనే ఇచ్చట స్త్రీ పర్వమున కురుకాంతల అశ్రుజలముతోపాటు కరుణ బీభత్స రసములు వెల్లివిరియుచుండును భర్తల శవముల మీదబడి విలపించు వీరపత్నులు, పుత్రుల శవముల మీదబడి విలపించు వీరమాతలు దుఃఖపరవశలై చేయు ఆక్రోశ నినాదములు నీరవమైన నాదముతో పాఠకుల హృదయములనే కాక ఆత్మలను గూడ ద్రవింపజేయుచుండును. ఆ పర్వములో అక్షుణ్ణములైన కొన్ని వృత్తములు వాడబడినవి. అవి గేయ ప్రాయములు. పఠన సామర్థ్యము కలవాడు వాటి గేయ లక్షణమును సువ్యక్తమగునట్లు చదివిన యెడల ఆ కరుణరసము ద్విగుణీకృతముగా అనుభవింపబడును. కావ్యకళలో కరుణమునకును గీతికిని సహజ సంబంధము కలదు. ఆ పాలికలనిలో పడియున్న శవముల చిత్రణము, చిత్రకారుడు చిత్రింపలేక పోవుటయేకాదు. ఛాయాగ్రాహక యంత్రము కూడ గ్రహింపజాలదు. ఆ మూర్తులను తిక్కన ప్రత్యక్షముగా శబ్దచిత్రిత మొనర్చిన నేర్పు ఆయనకే చెల్లును. ఒక ఉదాహరణ చూడుడు ఇది శల్యుని శవవర్ణన:

*గీ॥ "బోరగిలఁబడ్డ వాఁడు గపోలమొకటి*
*పుడమి మోసినయది మోము పొలుపు సెడదు*
*వీఁడె చూచితె శల్యుఁడు వెడలియున్న*
*జిహ్వదినియెడి వాయసశ్రేణి కృష్ణ!"*

అసాధ్య సంస్థానకములైన ఇట్టి రూపములను స్వాభావికముగా చిత్రించుటలో ఆయనకు గల కౌశలము భారత మెల్లెడలను కానవచ్చును ఇంకొక ఉదాహరణము నిచ్చెదను. పాంచాలి సుదేష్ణను చేరబోవునపుడు ఆసీనయైయున్న ఆ రాజపత్ని ఆదరపూర్వకముగా "రమ్ము" అని చేరదీయుట ఇందు వర్ణింపబడినది.

*"కనుఁగొని గారవంబును మొగంబునఁ; గేలఁ బురః ప్రసారముం*
*దనువున నమ్రభావమును దంతమరీచుల సామి నిర్గమం*
*బును దనలోఁ గడల్కొనఁగ భూరితరాదర రేఖ నిందు ర*
*మ్మనవుడు నంతనంత ద్రుపదాత్మజ చేరి వినీతి నిల్చినన్."*

సుదేష్ణ, గౌరవభావము తోచెడు మొగముతో చాచిన చేతులతో, లేచినపుడు సగము వంచిన శరీరముతో, చిరునవ్వుల వలన కొంచెము వ్యక్తమైన దంత కాంతులతో, మిక్కిలి ఆదరభావము సూచించుచు "ఇందురమ్ము" అని చేరబిలిచినదట. పాంచాలి అంతంతజేరి వినీతితో నిల్చినదట. ఇంకొక కవియైనచో సుదేష్ణజూపిన ఆదర భావమును ఆమె అవయవచేష్టా వివరములతో పని లేకుండగనే స్థూలముగా ఒక్క-వాక్యములో చెప్పి ముగించును. ఆ వాక్యము వలన సందర్భ తాత్పర్యమే బోధపడునుగాని ప్రత్యక్ష మూర్తిదర్శనము కలుగదు. మనచే ఆ మూర్తి దర్శనము చేయించుటయే తిక్కనగారి శిల్ప లక్షణము. సంస్కృత కవులలో భట్టుబాణుని

కాదంబరి ఈ రూపచిత్రణ కౌశలమునకు ప్రథమోదాహరణము. అయినను అది వచనరచన కనుక కొంచెము సుకరమే యగును. తెలుగులో ఈ ప్రజ్ఞ కలవారు ముగ్గురు, నలుగురు మాత్రము కలరు. వారిలో తిక్కన కాలమునుబట్టియేకాక ప్రతిభను బట్టియు ప్రప్రథముడు. మరియు మూర్తి చిత్రణములో స్థిరరూపమును వర్ణించుటకంటె చరరూపమును వర్ణిచుట కష్టమైన పని. రూపగతమైన సహజ సౌందర్యము దాని చలనావస్థలో ద్విగుణీకృతమై మోహనమగును. ఆ చలనావస్థను వర్ణించు నేర్పు ఎగిరెడి పక్షిని కొట్టెడు విలుకాని నేర్పువంటిది తిక్కన క్లేశతరమైన అట్టి చరరూపమును వర్ణించుటకే కుతూహలపడును. దీనివంటిదే ప్రాణుల అకారములకంటె తన్మనోభావముల వర్ణించుటలో గల క్లేశము. ఆకారము బాహిర ప్రపంచమునకు సంబంధించినది; ఇంగితము అంతర ప్రపంచమునకు సంబంధించినది. ఉభయాత్మకమైన రూపము వర్ణింపబడినప్పుడే దాని ఆత్మ వ్యక్తమగును తిక్కన రూపచిత్రణలో ఆకారము, దాని చలనము, తదంతఃకరణ ప్రవృత్తి కలిసి రాశీభూతమై సమగ్ర సౌందర్యమును వెలార్చుచుండును.

**భాషాసృష్టి:** కావ్యరచనకు యోగ్యమైన ఆంధ్రభాష లేని రోజులలో శిష్టమైన భాషను నిర్మించుకొని కావ్యరచనను నిర్వహించిన సిద్ధసంకల్పుడు నన్నయ. ఆయన చేతిలో తత్సమ శబ్దజాలమువలె శుద్ధాంధ్రము పెంపొందలేదు. తత్కారణము నన్నయ ప్రకరణమున చెప్పితిని. అచ్చతెనుఁగున కా గౌరవము తెచ్చినవాడు తిక్కన. ఒక భాష యొక్క శక్తియు సంపన్నతయు, అది వ్యక్తము చేయు భావములయు నర్థములయు గంభీరతను బట్టి తెలియవచ్చును అచ్చ తెనుఁగు భాష సూక్ష్మాతి సూక్ష్మములైన మనోభావములను వ్యక్తము చేయుటయందును అతిగంభీరములైన శాస్త్ర పరమార్థములను విస్ఫుర్తిగా వివరించుట యందును కూడ సమర్థమే యని తన ప్రయోగముచే లోకమునకు చూపినవాడు తిక్కన. అట్టి యీ భాష అంతయు ఆయన సృష్టించుకొన్నదే. ఆ భాషాసృష్టిలో కొంత వరకు నాటి వాడుక పదముల సహాయము చాల కలదు. ఆయన వాక్యములు వ్యాకరణలక్షణానుసారముగానే ఉన్నను, భాష అంతయు వ్యావహారిక భాష. అందును నెల్లూరు మాండలిక పదప్రయోగములు అమితము* గా కలవు. దేశ్యమైన తెలుఁగుభాషను పాల్కురికి సోమనాథుడును విస్తారము వాడెను. కాని అతని భాషకు తిక్కన భాషవలె సాధారణీకృతిరాలేదు. దీనికి కారణము సోమనాథుని ప్రకరణమున వివరించితిని, అందు చూడదగును. ఆ వ్యావహారిక భాషా పదములకే శుద్ధ రూపమును క్రొత్త ప్రాణము నిచ్చి ఆయన భారతము రచించెను.

"ఒక కవియొక్క రచనా సామర్థ్యమునకు పరీక్షా స్థానము క్రియాపదప్రయోగము (the use of the verb)" అని అరిస్టాటిల్ ఒకచోట నిర్దేశించెను. ఇది సత్యమే!

---

* ఆ మండలములో "పనిలేదు పలుకకుండుము" అను మాటలు ఇతర ప్రాంతములలో "అక్కరలేదు, ఊరకుండుము" అని వాడుదురు. అట్లే "వచ్చిన దానికి, పోయినదానికి" అనునవి "వచ్చుటకు, పోవుటకు" అను భావార్థమున ఉపయోగింతురు. ప్రశ్నార్థకమున "ఎట్లు?" అనుట ఇంకొక మాండలికము "నీవురావా ఎట్ల" అనిన నీవు రావా ఏమి? అని అర్థము. ఇట్టి ప్రయోగములు భారతమున తండోపతండములుగా నున్నవి.

మానవ వర్తనమే కవిత్వమునకు ప్రకృతి. వర్తనమును వ్యక్తము చేయునది క్రియా రూపమేగాని తక్కిన భాషాభాగములు కావు. అవన్నియు క్రియకు అంగభూతములు. కావున వాక్యములో క్రియాపదము ప్రాణము మరియు శారీరక వర్తనమును సూచించు క్రియాపదములు లభించినంత ప్రచురముగ మానసిక వ్యాపారమును సూచించునవి లభింపవు అందును సమానార్థకములుగా కానవచ్చే క్రియలలో ఛాయా మాత్రముగ అర్థభేదముండును. అర్థమునకు తగిన క్రియాప్రయోగము చేయలేని కవి తనకు స్ఫురించిన ఏదో ఒక క్రియను ప్రయోగించి పులిమి పుచ్చును.

ఈయన, ఒకే వ్యాపారములో ఛాయా మాత్ర భేదము గల అంశములెన్ని యుండునో వాటి అన్నిటికి అర్థచ్ఛాయా భేదము గల క్రియాపదములను ప్రయోగించి నిష్కర్షమైన అర్థమును వ్యక్తీకరించును. ఒక ఉదాహరణము చూడుడు.

ద్రౌపది కీచకునింటికి సురను తేబోవు సందర్భమున ఆమెకు కలిగిన భయసందే హములలో ఎట్టి భావాంతరములు కలవో అవన్నియు ఛాయా మాత్రభేదము గల క్రియలలో వ్యక్తము చేయు ఈ క్రింది పద్యము చూడుడు.

*ఆ॥ "తలఁకు పుట్టె గొంకు కొలఁదికి మీరె వె*
*న్బాటు దోచె ముట్టుపాటు దొడరె*
*వెఱఁగు పాటు దనికె నెఱినాడె నొవ్వు నె*
*వ్వగలు వగల నీనె దిగులు వొదివె"*

రావణునిచేత అవమానితయైన రంభయొక్క చిత్త వైకల్యమును వర్ణించిన పద్యమటువంటిదే దానిని అచ్చట వివరించితిని మరియు ఒకే అర్థమును పలుమారులు చెప్పవలసి వచ్చినపుడు ఆయన భంగ్యంతరముల చెప్పును గాని పునరుక్తి దోషము పొంతబోడు. ద్రోణపర్వమున గల షోడశ మహారాజ చరిత్ర కథనము దీనికి దృష్టాంతము. ఆ కథనములో, ఎంతెంత గొప్ప బ్రతుకులు బ్రతికినను ఆ పది యారుగురు మహారాజులును లోకాంతరగతులగుట తప్ప లేదు అని చెప్పవలసి వచ్చెను. ఒక్కొక్క మహారాజును గురించి "లోకాంతర గతుడయ్యెను" అను వాక్యార్థమును భంగ్యంతరమున పదియారు పద్యములలో పదియారు విధముల వ్రాసెను.

**తిక్కనగారి సందేశము:** ఇట్టి మహాకవి తన రచనల ద్వారా లోకమునకు చేసిన ఉపదేశమేమి? కవిగా ఆయన మన కిచ్చిన సందేశమేమి? అని ఎవరైనను ప్రశ్నించినపుడు భారతమున చెప్పబడిన ఉపదేశమే ఆయన సందేశము అని సద్య స్సమాధానము చెప్పవచ్చును. "అయితే, ఆ భారతము తన సందేశద్యోతనార్థము ఆయన స్వతంత్రముగా వ్రాసిన గ్రంథము కాదు; అది వ్యాసకృతము. అందలి ధర్మోపదేశము వ్యాసుడు చేసినట్టిదే కాని తిక్కన చేసినట్టిదికాదు" అని 'భారత సందేశము' అనెడి సిద్ధాంతమును పూర్వపక్షము చేయవచ్చును. నిజమే, వ్యాసప్రోక్తము కాని ధర్మమును దేనిని తిక్కన స్వయముగా బోధింపలేదు వ్యాసరచనము తనకే కాక ఆ నాటి తన జాతికిని అనుసరణీయమును, ఆధారనీయమును కనుకనే దానిని తెనిగించుటకు పూనుకొనెను. అనువాదకుడైన ఏ కవియైనను మూలమందలి ధర్మ మహత్త్వము గాని కథాచమత్కారము గాని పాత్రల యుదాత్తగాని తనను ఆకర్షించి హృదయమునకు హత్తుకొనినపుడే దానిని భాషాంతరీకరించుటకు తలపడునుగాని

లేనిచో దానిని చేపట్టడు. కావున భారతమునందలి కథ–పాత్రలు–ధర్మము అనెడి మూడంగములు తిక్కన హృదయము నాకర్షించినవి. కావుననే ఆయన దానిని తన రచనకు మాతృకగా గైకొనెను. అయితే ఆయన భారతమును 'తెనుగుభాష వినిర్మించుట' అనగా ఒక విశిష్ట రూపమున నూత్న నిర్మాణము చేయుటయే అని ఇతఃపూర్వము చెప్పితిని. ఆ నిర్మాణము ముఖ్యముగా గ్రంథశిల్పమునకు సంబంధించినది. అనువాదమున గల రూప సౌష్ఠవముగాని శిల్ప సౌందర్యముగాని మూలమున లేవనుట నిర్వివాదమైన విషయము. కాని ధర్మ ప్రతిపాదనము ఇంచుమించు మూలానుసరణమే! అయినను మూలమున పెక్కు తత్త్వములు వికీర్ణములై సమన్వయము కుదురని వైవిధ్యము కలవిగా గోచరించుచుండును. ఆ ధర్మతత్త్వములో వైవిధ్యముగాని అనేకత్త్వముగాని లేదనియు నానా ధర్మములయొక్క అద్వైతమూర్తియే భారతమనియు దర్శించి తద్దర్శనానుగుణముగా భారతమును తెనుగున వినిర్మించిన మహాకవి తిక్కన. కావున శిల్పమునకేకాక ధర్మ సమన్వయము చేయుటలో కూడ కొంత విశిష్టత కలదు ఇయ్యెడను ఆయనను వ్యాస ఋషి ఆశయమును వ్యాఖ్యానించిన భాష్యకర్తగా గ్రహింపవలెను అయితే మూలమందలి రహస్యములను విప్పి చెప్పినవాడే భాష్యకర్తయగును గాని, తానై తనదిగా చెప్పతగిన నూతనధర్మమును ఉపదేశించినవాడు కాజాలడు కావున ఆయన ఉపదేశమును గ్రహించుటకు ఆయన స్వతంత్రముగా రచించిన గ్రంథ భాగములను పరిశీలన చేయవలసియుండును

అవతారికను బట్టి ఆయన వైదికమార్గనిష్ఠమగు వర్తనచే భేదములేని భక్తిచే నిరంతర భగవత్పాదపద్మ సంస్మరణచే కావ్య రసాస్వాద తపస్సుచే భగవంతుని మెప్పించి మోక్షమును వశముగా గైకొన్న ధన్యుడు అని స్పష్టమగును అదిగాక ఆ హరిహరనాథుని సాకార నిరాకారత్వములను గూర్చియు, ఆ దేవుడు నానా విధముల ఐహికాముష్మిక సుఖమును కోరువారికి ఏకైక శరణ్యుడనియు హరిహరనాథ తత్త్వ నిరూపణ సందర్భమున చెప్పితిని. తిక్కనగారు కర్మజ్ఞాన భక్తియోగాది మార్గములలో నేదో యొక్క దానిని అవలంబించి తక్కిన వాటిని ఉపేక్ష చేసిన సంకుచిత. దృష్టి కలవాడు కాదు. అవన్నియు సోపాన పరంపరాక్రమమున మోక్ష ప్రాప్తికి కారణము లనియు అన్నియు క్రమముగా సంసేవ్యములనియు గ్రహించుటే కాక తదనురూపముగా తన జీవితయాత్రను సాగించి పూర్ణపురుషుడుగా ముక్తిని పొందెను. హరిహరనాథుడు సర్వ దేవతాద్వైత మూర్తియైనట్లే తిక్కన సర్వ ధర్మమార్గాద్వైతమూర్తిగ వెలుగొందెను.

ఇదంతయు ఆయన పారలౌకిక సాధనకు సంబంధించిన ధర్మాచరణము. ఈ సాధనను మిషగాబెట్టుకొని ఐహికమును నిర్వీర్యము, నిస్తేజము ఒనర్చుకొన్న పేద మనస్సు కలవాడు కాదు. మంత్రిగా, రాజనీతి విశారదుడుగా, వైభవోపేతుడుగా, మహాకవిగా, మహాదాతగా, బహువిధ జీవిత రంగములలో గణనకెక్కి ఐహిక జీవితమును సఫలమొనర్చుకొన్న సంసార యోగి.* తనకు శ్రీమత్త్వము, అయుష్మత్త్వము, సుధీమత్త్వము భగవదనుగ్రహలబ్ధములని భక్తితో స్వీకరించి భోగియు, త్యాగియునై

* కం॥ శ్రీ మత్త్వాయుష్మత్త్వ సుధీమత్త్వ ప్రద కటాక్ష దీపిత భక్త
స్తోమారామవసంతా వ్యామోహ ప్రశమ కరణ హరిహరనాథా॥

ఆసంపదల వ్యామోహమున బడక నిర్లిప్తతతో మెలగిన బ్రహ్మజ్ఞాని కావున తిక్కనగారు లోకమునకిచ్చిన సందేశము అద్వైత మార్గానుసారియైన పూర్ణయోగసాధన.

## తిక్కన సమకాలికులు

### కేతన

**దశకుమార చరిత్ర:** తిక్కన సమకాలికులలో మొదట పేర్కొన దగినవాడు మూలఘటిక కేతన; ఇతడు సోమయాజికి అత్యంత సన్నిహితుడగుటయే కాక, ఆయన కంకిత మిచ్చిన దశకుమార చరిత్ర పీఠికలో ఆ మహాపురుషుని మహోదారమైన బహిరంతర మూర్తిని చిత్రించి లోకమున కొసంగిన శిల్పి.

కేతన వేంగి దేశమునందలి "వెంటిరాల" అనే అగ్రహారమునకు అగ్రణి అవగా అగ్రహారీకుడో లేదా గ్రామణియో? ఆ గ్రామము నేటి ఏలూరునకు సమీపమున ఉండెడిదట. ఆ దినములలో నెల్లూరు పట్టణమున సార్వస్వతపీఠాధిపతియై అనేక విధముల కవి పండితుల ఆదరించుచున్న తిక్కననుజేరి ఆయనను మెప్పించి తన కవిత్వ పాండిత్యమునకు ఆమోదముద్ర సంపాదింపవలెనని అభిలాషతో కేతన నెల్లూరు చేరియుండును అంతేకాని కేవలము ధనసంపాదనార్థమై వెళ్ళి యుండడు. అగ్రహారమున కగ్రణియగుటచే అట్టి అవసరము ఉండియుండదు.

కేతన యీ గ్రంథమును తిక్కన కోరికమీద గాక, తత్పూర్వమే రచించి ఆయనకు కృతియిచ్చు సంకల్పముతో వినిపింపగా ఆయన సమ్మతించియుండును కృతిపతిచే అడిగించుకొని, కృతి ప్రదానము చేసినట్లు, కవులలో పెక్కురు తమ గ్రంథములలో వ్రాసికొనుట సంప్రదాయముగాన, కేతనయు అట్లే వ్రాసికొని యుండును.

మరి ఆ గ్రంథమును ఆలకించిన తిక్కన అతనికి అభినవ దండి బిరుద ప్రదానము చేసి యుండును. గ్రంథావతారికలో—

> *"వెంగి విషయమున వెంటిరాలను పేర*
> *నభిరామమగు నగ్రహారమునకు*
> *నగ్రణియగు వాని నభినవదండినాఁ*
> *బొలుపు మీరినవాని...."*

అను విశేషణములనుబట్టి ఆ బిరుదము అతనికి తత్పూర్వమే ఉన్నటుల తోచును. కానీ అది తిక్కన ప్రసాదించినదియే అనియు, ఈ అవతారిక కృతి స్వీకారమునకు తిక్కన అనుమతించిన పిమ్మట వ్రాయబడినదనియు నా ఉద్దేశము. ఈ సంప్రదాయము కూడ కవిలోక సాధారణమే!

కృతి ప్రదాతగా కేతన తిక్కనకు బంధువగుటయే కాక, ఆయనకు శిష్యుడనని చెప్పుకొనుటకు చనవుకూడ సంపాదించెను. ఇతడు రచించిన "ఆంధ్ర భాషా భూషణ"మను తొలి తెలుగు వ్యాకరణ గద్యలో తాను తిక్కన సోమయాజి శిష్యుడనని ఈ విధముగ జెప్పికొనెను. "శ్రీ మదుభయకవిమిత్రకొమ్మనామాత్యపుత్ర బుధారాధన విరాజి తిక్కన సోమయాజి వరప్రసాద కవితావిలాస వేదశాస్త్ర పురాణేతిహాస కళా

కోవిద మానస.. కేతనామాత్య ప్రణీతంబైన"* తిక్కన నెరపిన ఆ గురుత్వము ఏ విధమైనదో చెప్పలేముగాని ఆయన పరిచయము వలన కేతన కవిత్వకళలోను, సాహిత్యములోను, అనేక శాస్త్రములలోను పెక్కు రహస్యములు గ్రహించి తన ప్రతిభకు మెరుగులు దిద్దుకొని తనకు కలిగిన ఆ మేలునకు శిష్యుడనని చెప్పికొని యుండును. శుశ్రూష అనగా నట్టిదే!

పై గద్యలో తిక్కనను సోమయాజి అని పేర్కొన్న కేతన దశకుమార చరితమున ఆయనను అమాత్యుడుగానే పేర్కొనెను కావున దశకుమార చరిత్ర నాటికి తిక్కన యజ్ఞము చేసి యుండలేదనియు ఆంధ్రభాషా భూషణము తిక్కన సోమయాజియైన పిమ్మట రచింపబడెననియు తలంప వచ్చును. కాని దశకుమార చరిత్ర కృత్యవతారికలో—

"మహిత దక్షిణలైన బహు విధ యాగంబు
లొనరించుననుట వర్ణనము చొప్ప"

అని వ్రాయుట బట్టి తిక్కన సోమయాగము చేసిన తరువాతనే తత్కృతి స్వీకారము చేసెనని భావింపరాదు. సోమయాగమునకు పూర్వము గృహస్థుచేయదగిన శ్రౌతస్మార్త క్రతువులు పెక్కుగలవు. అవి అన్నియు యాగములే! వాటిలో సోమపాన విధానముండదు.

"వైదిక మార్గనిష్ఠమగు వర్తనమున్ తగ నిర్వహించు" చుండిన తిక్కన సోమ యాగమునకు పూర్వమే అట్టి క్రతువులు పెక్కుచేసి యుండును.

కావున దశకుమార చరిత్ర నాటికి ఆయన సోమయాజి కాడు మరి ఈ గ్రంధమున భారత ప్రస్తావన లేకపోవుటయేగాక నిర్వచనోత్తర రామాయణ ప్రశంసయు లేదు. తిక్కన గ్రంధరచనా ప్రశస్తిని తడవిన ఈ క్రింది పద్యముననైనను దాని పేరెత్తలేదు.

కం॥ కృతులు రచియింప సుకవుల
కృతులొప్పఁ గొనంగ నొరునకుం దీరునె? వా
కృతినిధుఁడు వితరణశ్రీ
యుతు డన్నమసుతుఁడు తిక్కఁడొకనికి దక్కన్.

భారత నిర్వచనోత్తర రామాయణములు కాక తిక్కన రచించిన ఇతర కృతులను మనసున పెట్టుకొని కేతన ఈ పద్యమును వ్రాసియుండును నిర్వచనోత్తర రామాయణమే ఆనాటికి పుట్టియున్నచో అతడు దానిని ప్రశంసింపక విడువడు. ఈ కారణములబట్టి దశకుమార చరితము నిర్వచనోత్తర రామాయణమునకు పూర్వరచన యని నేనే గాక పలువురు భావింతురు. ఈ విషయమంతయు తిక్కన ప్రకరణమున చెప్పితిని.

తెనుగున గ్రంధావతారికలో ఏ అవతారికకును లేని ప్రాధాన్యము దశ కుమార చరితావతారికకు కలదు. అందు కృతిపతి యైన తిక్కన యొక్క మహనీయమైన బహిరంతర మూర్తి వర్ణన చేయబడెను. మనకు యధార్థమైన కవుల జీవిత చరిత్రలు

* ఈ గద్య కొన్ని వ్రాత ప్రతులలో లేదట, కొన్నిట నున్న చాలునుగదా!

లేవు. వారిని గురించి జీవితాంశములు వ్రాయ తలపెట్టిన చరిత్రకారులకు ఉపకరించు అధారములు సైతము చాల తక్కువ. రాజాంకితము వరకు కానవచ్చును గాని అదియు రాజకీయ చరిత్ర వర్ణనమేగాని కృతిపతి యొక్క ఆత్మీయతా వర్ణనగాదు

దశకుమార చరిత్ర ఒక మహాకవి యొక్క లోకాతిశాయి యైన స్వరూప స్వభావములను శబ్దములతో చిత్రించి ఆయన వర్ణచిత్రములేని లోటును తీర్చెను అంతేగాదు, తిక్కన వంటి కారణజన్ముడు అవిర్భవించుటకు అర్హక్షేత్రమైన కొట్టరువు వంశమును మూడు నాలుగు తరముల పూర్వమునుండియు వర్ణించి తిక్కన చరిత్రమును వ్రాయువారికి అధారమును కల్పించెను. తిక్కన తానై భారతమున గాని, నిర్వచనోత్తర రామాయణమునగాని తన వంశమును వర్ణించుకొనని లోటు కూడ ఈ మూలముగా తీరెను.

దండి దశకుమారచరిత్రము ప్రసిద్ధములైన సంస్కృత గద్య కావ్యములలో రెండవది మొదటిది భట్టబాణుని కాదంబరి. దీనిని కూడ కేతనకాలములోనే ఇంకొక కేతన పద్యప్రబంధముగా తెనిగించినట్లు సంకలన గ్రంధములలో నున్నది. అ కేతన కొట్టరువు కేతనయనియే పలువురి అభిప్రాయము అది యటులుండుగాక. ఒకే శతాబ్దిలో అ రెండు గద్యకృతులను ఇరువురు కవులు చంపూకావ్యములుగా పరివర్తనము చేయుట చూడగా ఆ కాలము వారికి పద్య ప్రబంధములపై గల అదరము కేవలగద్యకృతుల మీద లేదని తలపవలసివచ్చును గద్య పద్యాత్మకములైన చంపువులు ఉభయతారకము లగునన్న నిబ్బరము చేతనో గద్యము పద్యమువలె ధారణ యోగ్యము కాదను అనుమానము చేతనో పద్యమువలె గద్యము కీర్తి కారణము కాదనెడి నిరసన భావము చేతనో మన పూర్వ కవులు ప్రత్యేక గద్యరచనల నాదరింపరైరి. కానిచో కాదంబరీ దశకుమార చరిత్రలు ఉత్తమ గద్య ప్రబంధములుగానే తెలుగున అవతరించి యుండును. తెనుగు దశకుమార చరిత్రలో ఏ వచన భాగమునైనను మూలముతో పోల్చి చూచినపుడు ఆ అనువాద సరళినిబట్టి పై అభిప్రాయము నిజమనిపించును.

సంస్కృతమున దండి దశకుమార చరిత్ర ఒక చిత్రాఖ్యాయిక. ఇది కేవలము కల్పితము కాదనియు ఇందలి కథాప్రణాళిక కథా సరిత్సాగరములోని మృగాంకదత్తుని చరిత్ర ప్రణాళికను బోలియున్నదనియు ఈ కథలలో కొన్ని అందలి కథలతో సంవదించుచుండుననియు శ్రీ వేదము వేంకటరాయ శాస్త్రివారు ఒకచో ననిరి అ పోలికలున్నను దండి రచనా విధానమంతయు స్వతంత్రమే. ఈ గ్రంధమున కథా ప్రణాళిక ఈ విధముగా నుండును.

**కథాప్రణాళిక:** మగధ దేశాధీశుడైన రాజహంసుడను రాజు మాలవాధీశుడగు మానసారునిచే యుద్ధమున ఓడిపోయి భార్యతో, నలువురు మంత్రులతో, వారి కుటుంబములతో వామదేవముని అశ్రమము చేరి ఆయన ప్రాపున అందు నివసించుచుండెను. యుద్ధకాలమునాటికి అంతర్వత్నిగనున్న అతని భార్య వసుమతి, అయాశ్రమమునే ఒక కుమారుని ప్రసవించెను. ఆ శిశువునకు వామదేవముని జాతకర్మాది సంస్కారములు చేసి రాజవాహనుడని పేరిడెను అనతికాలములోనే నలువురు మంత్రులకు నలువురు కుమారులు పుట్టిరి. పూర్వము దేశాంతరగతులైన రాజహంసుని మంత్రుల కుమారులు ముగ్గురు భాగ్యవశమున కారణాంతరములచే ఆ యాశ్రమమునే రాజు

నొద్దకు చేరిరి. మానసారునితో జరిగిన యుద్ధమున రాజహంసునకు సహాయపడిన ప్రహారవర్మ యనెడి మిధిలానగర రాజుయొక్క కవలపిల్లలు అటవికుల చేతులలోపడి అదృష్టవశమున ప్రాణములతో రాజహంసుని చెంతచేరిరి. తన పుత్రునితో పదుగురైన ఆ కుమారులందరిని రాజహంసుడు సర్వ విద్యా ప్రవీణుల జేసెను. ఆ కుమారులు యుక్తవయస్కులు కాగానే వామదేవుని ఉపదేశమున రాజు వారిని దైత్రయాత్రకు ఆదేశించెను. ఆ యాత్రలో ఒక చోట వారందరు విశ్రమించి యుండగా రాజవాహనుడు మతంగుడను బ్రాహ్మణునకు సహాయము చేయుటకు మిత్రులకు తెలుపకుండ వెడలెను. మిగిలిన తొమ్మండుగురు రాజవాహనుని వెదకుటకు మరునాడు నానా దిక్కులకు వెళ్ళిరి ఆ పదుగురును దేశాంతరములలో చేసిన సాహసకృత్యములే ఇందలి కథలు.

వారందరు ప్రియ సాహసులు. వీరవిక్రమవిహారమే వారి జీవిత ధర్మము. ఆశ్రిత పక్షపాతము వారి వ్రతము. ఆత్మ రక్షణార్థము, ఇతర ప్రాణి రక్షణార్థము పాప పుణ్య శంకలేక ఎట్టి సాహసములైన చేయుటకు వెనుదీయరు. వలచిన కన్యలను ఎట్టి ఇక్కట్టుకైనను లోనై చేపట్టి తీరుదురు. అంజనాది విద్యలచే నిధులను కనుగొనుటలో ఎంత నేర్పరులో ఆ ధనరాసులను అవసరము కొలది విరజిమ్ముటలో కూడ అంత యుదారులు. కన్నములు వేయుట, ఇంద్రజాలములు చేయుట, జూదమాడుట మొదలగు కళలలో నిష్ణాతులు. వీరి కృతములన్నియు ధర్మశాస్త్ర విరుద్ధము లైనప్పటికి "సాహసేలక్ష్మీః" అను నీతివాక్యమునకు లక్ష్యభూతములై యుండును ఈ కథలన్నియు దశవిధరూపకములలో భాణము, ఈహామృగము, ప్రహసనము మొదలైన చిల్లర నాటికలకు వస్తువుగా పనికివచ్చు స్వభావము కలవి. వీటిలో ప్రాయికముగా కొన్నిట శృంగారవీరరస భావములను కొన్నింట హాస్యాద్భుత కరుణరస భావములును అపరిపుష్టమైన రూపమున వ్యక్తమగుచుండును. ఏవంవిధ నానా రసమయ సాహసకృత్యములు విడివిడిగా చేసి తుదకు అందరును ఒకచోటజేరి తమ తమ సాహస కృత్యములను చెప్పుకొనిరి. ఆ కథలలో రాజవాహనుడు అవంతి సుందరిని పెండ్లి యాడుట ప్రధాన కథ

అవంతి సుందరి రాజహంసుని శత్రువైన మానసారుని కుమార్తె ఆ మానసారుని కుమారుడైన దర్పసారుని సంహరించి రాజవాహనుడు తన్ను వలచిన అవంతి సుందరిని వివాహమాడి ఆ రాజ్యమున కభిషిక్తుడై మిత్రులతో కలిసి తలిదండ్రుల వద్దకు వచ్చెను. రాజహంసుడు తన శత్రు రాజు యొక్క రాజ్యలక్ష్మియే కాక అపరలక్ష్మియైన అతని కుమార్తె కూడ తన కుమారునకు లభ్యమైనందులకు పరమానంద భరితుడై, కుమారుని తన రాజ్యమునకు అభిషిక్తుని జేసి చరితార్థుడాయెను.

దండి సంస్కృతభాషా శైలి చాల ఉజ్జ్వలమైనది. సంవాదములు మిక్కిలి సహజముగానున్నను వర్ణనములు నానావిధములైన ఉత్ప్రేక్షలతో, అతిశయోక్తులతో అనుప్రాసాది శబ్దాలంకారములతో ఎంతో ప్రౌఢముగ నుండును ఆ శబ్దములను యథాతథముగా ప్రయోగించిననే తప్ప ఆ ఉజ్జ్వలత తెనుగున రాదు కేతన ఆ ప్రయత్నము చేయలేదు. కారణము తిక్కన వర్గములోని వారికి అర్థము మీద నున్న దృష్టి శబ్దముమీద లేకపోవుటయే. తెలుగు దశకుమార చరిత్ర, కథామాత్రాను

సరణమేగాని వాక్యానువాదము కాదు. ఈ కథలను తెనిగించుటలో కేతన కొన్ని యెడల భారత కవులవలె స్వతంత్రుడయ్యే వర్ణించెను. కథాప్రారంభమునవే కుసుమపుర వర్ణనను, వసుమతీదేవి సౌందర్యవర్ణనను నామమాత్రమున స్మరించి విడిచిపెట్టెను. చెలికత్తెలతో ఉద్యానవనమున ప్రవేశించిన అవంతి సుందరి రూపమును సమయ సిద్ధములైన ఉపమానములతో ఉత్ప్రేక్షలతో దండి నఖశిఖ పర్యంతము అంగ ప్రత్యంగ దీర్ఘవర్ణనలతో చిత్రింపగా కేతన దానిని స్పృశింపలేదు మరొక కథలో శయ్యమీద నిద్రించుచున్న ఒక కన్యను దండి వర్ణించిన విధానము చిత్రకారునికి కూడ దుస్సాధమేమో యని తోచునటులున్నది. కేతన దానిని ఎందుచేతనో విడిచిపుచ్చెను. దీనికి శక్తి చాలమి హేతు వనుటకంటె ఇతర సందర్భములలో కూడ వర్ణనలు సంక్షేపించుట కలదు కనుక వర్ణనలయెడ అతనికి అభిలాష తక్కువ యని అనుకొనుట మంచిది. ఒకవేళ పర్యాప్తమైన శక్తి లేదే అనుకొందము. అయినను ఆ వాక్యములను అనువదించుట అసాధ్యము కాదు. ఏమనగా ఆ పదములతోనే తెలుగు వాక్యములు వ్రాయవచ్చును కదా! అవంతి సుందరి కథా ప్రారంభమున దండి చేసిన దీర్ఘ వసంతఋతువర్ణనము కేతన మనసుతోనైనను స్పృశింపక రెండు స్వతంత్రములైన పద్యములతో సరిపుచ్చెను.

*"దంపతులకు నింపు పెంపార విరహుల*
*కంతరంగతాప మతిశయిల్ల*
*సకల జీవులకును సంప్రీతిగా మనో*
*హారియగు వసంత మరుగుదెంచె"*

*"వేకువఁ గమ్మతెమ్మెరలు వీవఁగ మాపులనెల్లిదంపు గాఁ*
*రాకులపాటు డెందముల నాకులపాటొదవింపఁజొచ్చె శో*
*భాకర పల్లవ ప్రచయ మంగజ వహ్నిశిఖాసరూపతం*
*గైకొని వంతఁజేసెఁ బధిక ప్రకరంబునకున్ వనంబులన్."*

ఈ అనువాద పద్ధతిని, సాధు సరళమైన శైలిని, ఉచితానుచిత వివేచన గల యీతని సంస్కారమును తిక్కన మెచ్చి యుండెననుటకు సందేహము లేదు. కావుననే–

*"కవిత చెప్పి యుభయ కవిమిత్రు మెప్పింప*
*నరిది బ్రహ్మకైన నతడు మెచ్చ*
*పరగ దశకుమార చరితంబు చెప్పిన*
*ప్రోడ నన్ను వేర పొగడనేల"* (ఆంధ్ర భాషా భూషణము)

అని కేతన సగర్వముగా చెప్పికొనెను. మన భాషలో గల కథా వాఙ్మయ శాఖలో కేతన దశకుమార చరిత్ర ప్రథమగ్రంథము

**కేతన ఇతర గ్రంథములు:–** 1. ఆంధ్ర భాషా భూషణము, 2. విజ్ఞానేశ్వరీయము. వీటిలో మొదటిది ఆంధ్రభాషను గురించిన మొదటి వ్యాకరణము. గ్రంథము చిన్నదైనను, ఆంధ్ర భాషా స్వరూపమును తేటతెల్లముగ ప్రదర్శించిన గ్రంథము.

**విజ్ఞానేశ్వరీయము:-** ఇది యాజ్ఞవల్క్యస్మృతికి అనువాదము మితాక్షరి యని దానికి వ్యాఖ్యానమును విజ్ఞానేశ్వరుడు రచించెను వానిపేరుమీదుగా కేతన దానిని అనువదించెను.

ఈ రెండును పద్య గ్రంథములు గద్య నిలువదను అనుమానమే దీనికి కారణము.

## కాచవిభుడు-విఠ్ఠలుడు

**రంగనాథ రామాయణము: ఉత్తరకాండము:**

ఈ సోదర కవులు, ద్విపద పూర్వ రామాయణము రచించిన గోనబుద్ధారెడ్డి కుమారులు తండ్రి యానతిని శేషభాగమైన ఉత్తరకాండమును రచించి రామాయణమును పూర్తిచేసిరి ఆ పంక్తులను బుద్ధారెడ్డి ప్రకరణమున ఉదాహరించితిని మరి ఆ తండ్రి ఈ కాండమునుకూడ తానే రచింపక కుమారులకు వదలిపెట్టనేల? అనే ఆ శంకకు సూచనామాత్ర సమాధానము కాదగిన కొన్ని పంక్తులు ఈ ఉత్తరకాండమునందు కలవు పూర్వ రామాయణము పూర్తిచేసిన పిమ్మట బుద్ధారెడ్డికి శ్రీరాముడు స్వప్నములో సాక్షాత్కరించి "నీ భక్తికి మెచ్చితిని నీవింక నన్ను జేరుము ఉత్తరకాండమును నీ కుమారులు పూర్తిచేయగలరు" అని ఆదేశింప భగవదాజ్ఞానుసారమున నాతడు ఈ కాండ రచనాభారమును కుమారులకు వదలిపెట్టెను.

"... ....పంకజోదరుఁడు
మానసంబునఁదోఁచి మహిత వాక్యముల
నీవు నాకెంతయు నెఱయ భక్తుఁడవు,
నీవు పుణ్యుఁడవు నీవు మాన్యుఁడవు
కావున నీ భక్తికైకొంటి మేము
నీవింక మముగూడి నెమ్మి నేతెమ్ము
నీ వాంఛితార్థంబు నిర్వహింపంగ
నీవరనందనుల్ నిపుణమానసులు
వారి నియోగింపు వారు నీ కోర్కి
గారవంబున చేయగలవారు మీఁద"

అని బుద్ధారెడ్డికి అభయమిచ్చెను బుద్ధారెడ్డి పూర్వరామాయణము వ్రాసి ఉత్తర కాండమును ప్రారంభింపకముందు జీవయాత్ర చాలింపవలసి వచ్చినదనియు రామాయణము అసంపూర్ణముగ నున్నదనెడి చింతతో అతడు మనసున బాధపడుచుండగా, శ్రీరాముడు ప్రత్యక్షమై పైని చెప్పిన రీతిగా ఆదేశించి అతనికి సద్గతి కలిగించెననియు భావింపవచ్చును. పూర్వ రామాయణము 1240 ప్రాంతమున రచింపబడి యుండుననియు బుద్ధారెడ్డి ముప్పది సంవత్సరముల వయస్సు కలవాడై యుండెననియు బుద్ధారెడ్డి ప్రకరణమున సయుక్తికముగ నిరూపించితిని అపర వయస్సున అతడెప్పుడు మృతినొందెనో చెప్పలేముగాని, అప్పటికి అతని కుమారులు గ్రంథ రచనానుకూలమైన ప్రౌఢ

వయస్సు కలవారై యుందురని చెప్పవచ్చును బుద్ధారెడ్డి అపర వయస్సునగాక పూర్వ వయస్సుననే ఈ కుమారులు జన్మించి యుందురనుకొన్నను, వీరికి 1270 ప్రాంతమునగాని గ్రంధ రచనకు అనుకూలమైన ప్రౌఢ వయస్సురాదు. తత్పూర్వము ఏ కొద్ది సంవత్సరముల క్రితమో బుద్ధారెడ్డి పరమపదించి యుండును. కావున ఈ ఉత్తర కాండము తిక్కన నిర్వచనోత్తర రామాయణమున కర్వాచీనమును, భారతమునకు సమకాలికమును అయియుండును 1290 సంవత్సరములో రుద్రమదేవి పరిపాలనా కాలమున పశ్చిమ దిశ నుండి దేవగిరి యాదవరాజులు కాకతీయ సామ్రాజ్యమునకు ఉపద్రవము కలిగింప బూనగా విట్ఠలుడనెడి కాకతీయ సామంతుడు ససైన్యముగా బళ్ళారి మండలమున ప్రవేశించి యాదవులను అణచివైచెనని చరిత్రకారులు చెప్పుచున్నారు. ఆ విట్ఠలుడు ఈ కాండకర్తలలో నొకడేమో? అగుచో, పైని నేను నిర్ణయించిన గ్రంధరచనా కాలమునకు ఇంకొక ఆధారము కల్గినట్లు అగును. ఎటులైనను ఇది నిర్వచనోత్తర రామాయణమునకు పిమ్మట కొంతకాలమునకు రచింపబడినదనుట నిక్కము. తిక్కనగారు రంగనాధరామాయణమును పూర్తిచేయకపోవుటను ఈ సోదర కవులే అందులకు పూనుకొనుటకును గల కారణములను నిర్వచనోత్తర రామాయణ సందర్భమున జెప్పితిని రంగనాధుడను కవియే మొదటి ఆ ఆరుకాండములను పిమ్మట ఏడవ కాండమును రచించి ఒక భాగమునకు బుద్ధారెడ్డిని, ఇంకొక భాగమునకు ఆతని కుమారులను కర్తలుగా నిలిపి యుండుననను వాదము పరమహాస్యాస్పదము ఈ రెండు భాగములకును కాల వ్యవధానము చాల కలదు. మరియు శైలిలో చాల భేదమున్నది. పూర్వ భాగమున గల ధారాళతయు, సారళ్యమును, భావావేశమును ఉత్తరభాగమున లేవు. ఉత్తరకాండ కర్తలు ద్విపద రచనా సమర్థులేగాని పూర్వభాగ కర్తవలె భక్త్యావేశము కలవారు కాదు మరియు కధాకధనములో అతడు పాటించిన ఔచిత్యము వీరికి లేదు

తిక్కనగారు విసర్జించిన భాగములను కూడ స్వీకరించి మూలమునగల కధనంతను అనువదించిరి. నిర్వచనోత్తరరామాయణమును వీరు చదివియే యుందురనుటకొక నిదర్శన మిచ్చుచున్నాను తిక్కనగారు అభిసారికయైన రంభను వర్ణించిన ఈ పద్యములోని కొన్ని పదములు ఉత్తరకాండ ద్విపదలలో యధాతధముగా స్వీకరింపబడ్డవి

ఉ॥ "అప్పుడొకర్తు గొంచెమగు నాభరణంబులు, సన్న పూఁతయుం
గొప్పిడి త్రిప్పి లోఁజెరివికొన్న నడంగిన పూవులుం బయిం
గప్పిన చేలకొంగు నునుఁగప్పును మెల్పున నేగు మెట్టిలే
జప్పుడు, చెన్నుచేయు గతి చందము, వింతగ బోవునయ్యెడన్"
(నిర్వచనోత్తర రామాయణము. రంభా రావణ సంవాదము)

"..... కొలది భూషణములు కొమరారఁ బూని
కొన్నియు ~~విరులొ~~ప్పఁగొప్పున దుఱిమి
సన్న పునుఁబూఁత చదునుగాఁబూసి
కట్టిన పుట్టంబు కప్పుదన్గప్ప
మెట్టుచో మట్టియల్ మెలపునదాఁక"

ఈ ద్విపదపంక్తులకర్త పైతిక్కన పద్యమును చదివియుండుననుటకు సందేహము లేదు. మూలములోని కథను తంౘిడివలెనే వర్ణనలతో పెంపుచేయుచు గ్రంథమును పూర్తిచేసిరి. ఈ గ్రంథమునకు చారిత్రక ప్రాధాన్యమే గాని సారస్వతిక ప్రాధాన్యము లేదు.

వీరిరువురును ఆంధ్రవాఙ్మయములో మొదటి జంటకవులు.

## మంచన

**కేయూరబాహుచరిత్ర:**

**కాలము:** మంచన కేయూరబాహుచరిత్రను నండూరి గుండయామాత్యునకు అంకితమిచ్చెను. ఈ మంత్రి నెల్లూరు తిక్కరాజు చేతిలో నిహతుడైన వెలనాటి పృథ్వీశ్వరునకు మంత్రియగు నండూరి కేతనకు మనుమడు. పృథ్వీశ్వరుడు 1200 సంవత్సరములో చనిపోయెను. కావున గుండయమంత్రి పదుమూడవ శతాబ్ది ఉత్తరార్ధమున నుండి యుండును. ఇది యటులుండ మంచన పూర్వకవిస్తుతి చేయుటలో నన్నయ తిక్కనలను మాత్రమే ప్రస్తుతించుటచేత తిక్కనకు తరువాత వాడు కావలయును లేదా, తిక్కనను సమకాలికకవులు సైతము ప్రస్తుతించిరి గాన మంచనయు అట్టి ప్రస్తుతి చేసినవాడేయని అనుకొన్నచో ఈతడు తిక్కనకు సమకాలికుడే యగును. కావున ఈ గ్రంథము పదుమూడవ శతాబ్ది చివరిదశలో గాని, పదునాల్గవ శతాబ్ది ప్రారంభమున గాని రచింపబడి యుండును కృతిపతియగు గుండయమంత్రి—

*కం॥ "స్థాయిరసము శృంగారం*
*బైయలపడఁ, గథలు నీతులై యెడనెడ రాఁ*
*గేయూరబాహు చరితము*
*సేయుము నీవాంధ్రభాష శిల్పము మెఱయన్"*

అని కోరుటనుబట్టి ఈ కావ్యమున పెక్కు నీతి కథలు చేరినవి

**కథాసంగ్రహము – సమీక్ష:** కళింగదేశమును కేయూరబాహుడను రాజు పాలించుచుండెను. ఆయన భార్య రత్నసుందరి. అతడు భార్యాలోలుడై రాజ్యకార్యములయెడ ననాదరము జూపుచుండుటచే, అతని మంత్రి భాగురాయణుడు రాజు మనస్సును మరల్చుట యెటులనా, అని ఆలోచించుచుండగా దేశాంతరగతుడైన చారుడొకడు వచ్చి ఒక వృత్తాంతము చెప్పెను. ఆ వృత్తాంతమిది—

"లాటదేశాధీశుడును రత్నసుందరి పినతల్లిభర్తయునగు చంద్రవర్మకు పుత్రసంతానము లేమిచే ఏకపుత్రియగు మృగాంకావళికి పురుషవేషమువేసి మృగాంకవర్మయను పేరుతో పెంచుచుండిరి. మఱి ఆకన్యనువివాహమాడినవాడు సామ్రాజ్యాధిపతి యగునని సిద్ధాపదేశము కలదు మహారాష్ట్రాధిపతి అదను దొరకినప్పుడు లాట దేశముమీద దండెత్తునేమోయని చంద్రవర్మ భయపడుచుండెను." చారుడు చెప్పిన ఈ వార్త ఉపశ్రుతిగా భాగురాయణునకు భావికార్యము స్ఫురించెను.

భాగురాయణునకు సోమదత్తుడు అను మేనల్లుడు కలడు. అతడు మంత్రతంత్రము లందు మేనమామకు తోడ్పడగల బుద్ధిశాలి భాగురాయణుడు అతనితో ఆలోచించి ఒక ఉపాయము పన్నెను. తదనుగుణముగా చంద్రవర్మను ఒప్పించి మృంగాకవర్మను తన దగ్గరకు తెప్పించుకొనెను. చంద్రవర్మ శత్రుభీతిచే తన కుమారుని ఈ పురమునకు పంపెననియు, అతనికి తన యింటనే రాజకుమారోచితములగు సమస్తోపచారములు జరుగుననియు, ఒక పరిచారికను మాత్రము అంతిపురము నుండి పంపుమనియు రాణిగారిని అడిగెను. రత్నసుందరి తన పరిచారికలలో నెల్ల మిక్కిలి నిపుణురాలయిన కళావతియను దానిని భాగరాయణుని యింటికి బంపెను. భాగురాయణుడు ఆ పరిచారికతో ఏమియు దాచక రహస్యమంతయు వివరించి మృగాంకావళికి చెలికత్తెగా వర్తించునటుల నిలిపెను. సమయము వచ్చినపుడు మృగాంకావళి రహస్యముగ రాజుగారి శయనమందిరము చొచ్చుటకు వీలగునట్లు ఒక యపూర్వ యంత్రగర్భిత స్తంభ కుడ్యములతో రాజప్రసాదమున ఒక సుందరమందిరమును నిర్మింపజేయగా రాజు ఆ సుందరమందిరమును తన శయనగృహముగా చేసికొనెను

భాగురాయణుని పంపున కళావతి రాణికి ఇష్టురాలయిన మేఖలయను చెలికత్తెను పరాభవించుటకు రాజుగారి విదూషకుడగు చారాయణుని ప్రేరేపింపగా అతడు ఒక పరిచారికకు పురుషవేషమువేసి మేఖలకు వివాహము చేసెను. ఆ మరునాడు తనకు జరిగిన వంచనను మేఖల రాజదంపతుల సమక్షమున నివేదించి మొఱపెట్టుకొనగా, రాజుగారి ప్రోత్సాహముననే చారాయణుడటుల చేసి యుండుననియు, తన ప్రియసఖికి జరిగిన పరాభవము తనకే జరిగినటులగుననియు రాణి భావించి అతికోపమున రాజు చెంతబాసి నిజాంతఃపురమునకు వెడలిపోయెను.

రాజు, రాణిగారి ప్రియపరిచారికల ద్వారా ఎన్ని ఎన్ని అనునయసందేశములు పంపినను, రత్నసుందరి తనచెంతకురామిచే రాజు విరహార్తుడై వెచ్చనూర్చుచుండెను ఈ వృత్తాంతమంతయు కళావతి భాగురాయణున కెఱింగించెను రాజు నిద్రించుచున్న సమయమున మృగాంకావళి కళావతీసహాయముతో రహస్యమార్గమున అతని శయనాగారముజేరి అతడు మేల్కొనునంతవఱకు వేచియుండెను. రాజు లేచి కూర్చుండినంతనే తన మెడలోని ముత్యాల హారమును అతని మెడలో వేసి "నమః ప్రసవశరాయ" అని నమస్కరించెను విభ్రామాశ్చర్యానంద పరవశుడైన రాజు కరము గ్రహింప నుంకింప "వలదు రాజా! నేను రత్నసుందరికి వెఱతు" నని తప్పించుకొని యంత్రకుడ్యముల ద్వారా అదృశ్యురాలాయెను ఈ పథకమంతయు భాగురాయణుని వల్ల కళావతి నేర్చుకొని మృగాంకావళికి నేర్పెను మరునాడు ఉదయమున రాజు విదూషకునితో గతరాత్రి జరిగిన వృత్తాంతమంతయు చెప్పికొని, అపూర్వ కన్య తన గృహము ప్రవేశించుటకును, నిష్క్రమించుటకును హేతువుగాని మార్గముకాని తోచక విరహాందోళన చెందుచుండెను. ఇది యిటులుండగా, కళావతి రాజుగారిని దర్శించి మృంగాకావళి చరితమును గూర్చి యథార్థము నంతయు నివేదించి, ఆ కన్యకూడ రాజునెడ బద్ధానురాగయై యుండుట తెల్పెను. రాజు తన మనోరథసిద్ధి యెప్పుడగునాయని తహతహపడుచుండెను.

కళావతి అంతఃపురమున రాణిని దర్శించి రాజుగారి ప్రేరణమున మేఖలకు జరిగిన

పరాభవమునకు ప్రతీకారముగా ఒక యువకునకు స్త్రీ వేషము వేసి రాజుగారికి వివాహము చేయుట తగియుండునని బోధింపగా, అమె దానిని ఆమోదించి ఆ కపట వివాహ ప్రయత్నము చేసెను. మృగాంకావళినే స్త్రీ రూప ధారియగు యువకుడని రాణిని నమ్మించి, కళావతి ఆ కన్యను పెండ్లి కూతురుగా కూర్చుండబెట్టెను. ఆ మిథ్యా వివాహతంతు జరుగుచుండగా రాణిగారి పినతల్లి తమకు పుత్రసంతానము కలిగినట్లును, మృగాంకవర్మగానున్న వ్యక్తి తమ కుమార్తెయగు మృగాంకాళియే యనియు, అమెను వివాహమాడినవాడు. సార్వభౌముడగునను సిద్ధాపదేశము కలదనియు, ఆ కన్యకు తగిన వరుని జూచి వివాహము చేయు భారము వహింపవలసినదనియు వ్రాసిన లేఖ రత్న సుందరికి అందినది. రాణి అది చదువుకొని మోసము చేయబోయి మోసపోతినని వగచినదయ్యెను, తాను సంపాదించుకొనుచున్న సపత్ని తన తోబుట్టువే యగుటయు, అమెను చేపట్టిన తన భర్త చక్రవర్తి కాబోవుటయు ఎఱిగి వగపుమాని సంతోషభరితురాలై కన్యను ఇచ్చుటకును పుచ్చుకొనుటకును తానే యధికారము కలదై శుభ కార్యము పూర్తి చేసెను

ఇంత మాత్రమే ఈ కావ్యములలో గల ప్రధానేతివృత్తము ఈ కథ గ్రంథమున మూడింట ఒక పాలు మాత్రమే యున్నది. తక్కిన రెండు పాళ్ళును పంచతంత్ర హితోపదేశములలో గల కథలవంటి నీతి కథలతో నింపబడినవి. అవి రెండవ అశ్వాసమున భాగురాయణుడు సోమదత్తునితో సంప్రదించు సందర్భమున చెప్పినవి కొన్నియు, రెండు మూడాశ్వాసములలో అంతఃపుర పరిచారికలు ముగ్గురు తమలో తాము రహస్యముగా ఇష్టాగోష్టిగా మాటలాడుకొనునప్పుడు మేఖలా చారాయణుల కలహమును గురించియు తరువాతి కపట స్నేహమును గురించి రాణిగారి కోపమును గురించియు చెప్పుకొనినవి కొన్నియు, నాల్గవ ఆశ్వాసములో చారాయణుడు విరహోర్తుడైన రాజునకు చెప్పినవి కొన్నియు కలవు. ఇవి యన్నియు మొత్తము మీద సుమారు ఇరువది యుండును. వీటిలో కొన్ని మాత్రమే సందర్భోచితముగ నుండును. తక్కినవి అనావశ్యకములగుటయేగాక, ఉమ్మెత్తపూవు దొంతరవలె ఒకదాని నుండి యింకొకటి పుట్టి దీర్ఘముగా వ్యాపించి ప్రధాన కథకు సహింపరాని అంతరాయము కలిగించును. కాని ఏ కథకు ఆ కథయే ముచ్చటగా నింపుగొలుపుచుండును.

మంచన శైలియు ఇతర ప్రబంధ కవుల శైలివలెగాక ఆ చిన్నకథలు చెప్పుటకు తగిన సౌకుమార్యము సౌలభ్యము కలది. వీటివల్లనే కేయూరబాహుచరిత్ర ప్రబంధకోటికెక్కినదిగాని లేనిచో అల్ప పరిమాణము గల ఆ గ్రంథము ఆ పేరునకే తగియుండదు. ఉద్గ్రంథ రచనయే కవియశమునకు ఆధారముగా భావింపబడు ఆ కాలమున ఈ కవి తన కావ్యమును నానావిధ కథాబృంహితము జేసి ఉద్గ్రంథ కర్తలలో నొకడయ్యెను.

మఱి ఈ కథ నాటకోచితమైనదే కాని ప్రబంధోచితమైనది కాదు నాటక కథ పాత్రల వర్తనమునకును, ప్రబంధ కథ కథకుని కథనమునకు అనుకూలించును. ఈ ఇతివృత్తమున కథనానుకూలమైన సందర్భములు చాల తక్కువ ఏ కావ్యములో నైనను వర్ణన భాగము సైతము కథనము ననుసరించి వచ్చునదియే కావున, దానియందు కథన భాగముతో బాటు వర్ణన భాగములు తగ్గిపోయినవి. ఇతర ప్రబంధములలో

వలె కథ మోయలేని వర్ణనలు ఇందులేమికి ఇదియొక కారణము. రెండవ కారణము కవి సందర్భ శుద్ధి యెఱింగిన వివేకియగుట.

ఇది యనువాదము మాత్రము కాదు. 'షేక్స్పియర్స్ వింటర్స్ టేల్' కథ కూడా యిట్టిదే. 'కామర్స్ ఆఫ్ పొయటిక్ థాట్' అని యిట్టి సామ్యమును గూర్చియే క్విల్లర్ కౌచ్ చెప్పెను.

ఇందుగల నాలుగాశ్వాసములలో "ఏకైక దిన సంవృత్తమ్" అను నాటికా లక్షణమును బట్టి మొదటి మూడాశ్వాసములును మూడు అంకములుగా సంధానింపబడినవి. నాల్గవ ఆశ్వాసమున మాత్రము రెండుదినముల ఇతివృత్తము ఇమిడియుండుటచే, ఇది అంకసంవాది కాదు.

పాత్రలు, పాత్రల సంవాదము, పాత్రల వర్తనము ప్రధానాంశములై నాటకోచితముగా నడిచెడి కథను కథనాత్మకమైన కావ్యముగా మలచుట చాల దుష్కరమైన కార్యము. శ్రవ్యకావ్యమును దృశ్యకావ్య మొనర్చుట సుకరము గాని దృశ్య కావ్యమును శ్రవ్యముగా నొనర్చుట దుష్కరము. ఇది శ్రవ్య, దృశ్య, కావ్య భేద నిరూపకమైన ఒక సారస్వత ధర్మము. ఇది యిట్లుండుగాక!

ఈ కావ్యమునకు కథానాయకుని గురించి–

కావ్యమును బట్టి కేయూరబాహువు కథానాయకుడును నాటక కార్యమున ప్రధానుడును కావలయును కాని ఈ కావ్యమందలి కథయంతయు మంత్రి సత్తముని మేధా సంపత్తి మీదను అతని రాజ్యక్షేమాభిలాష మీదను ఆధారపడి యుండినందున భాగురాయణుడు ప్రముఖ పాత్రయనియు, మిగిలిన వారందరు ఆ మంత్రి పన్నిన వ్యూహమున, అతడు సంకల్పించిన విధమున చరించినవారనియు తోచక మానదు అటులనే అనేక సన్నివేశములను నేర్పుతో సంఘటిత పరచి భాగురాయణునకు చేదోడయిన కళావతి స్త్రీ పాత్రలలో ప్రధాన మనవలయును. రత్నసుందరీ కేయూరబాహువులు నామమాత్ర నాయికానాయకులు. శృంగార రస ప్రధానములయిన పెక్కు సంస్కృత నాటికలలో పాత్ర ప్రాధాన్యమిట్లే యుండును ఈ కావ్యమునకు రాజశేఖరుని విద్ధసాలభంజికయను సంస్కృత నాటిక మూలమని ఒక వదంతి కలదు ఆ నాటికలోని కథ ఈ కావ్యమునకు ఇంచుక ఆధారభూతమే కాని మాతృకకాదు. నాటక పాత్రల పేర్లలో మాత్రము ఒకటి రెండు ఇందు స్వీకరింపబడినవి. ఆ నాటికలో రాజునకు మృగాంకావళితోపాటు కువలయమాలయను ఇంకొక రాకుమారితో ఏకకాలముననే వివాహము జరుగును ఇందు ఆ రెండవ పెండ్లి పరిహరింపబడినది. ఇట్టి భేదము లింకను కొన్ని కలవు. రాజశేఖరుని వలెనే మంచన కూడ ఏ కథా సరిత్సాగరము నుండియో ఈ కథను గ్రహించి యుండవచ్చును. అదిగాక రాణిగారిని మోసపుచ్చి రాజు రెండవ వివాహమాడుట రాత్నావళి, ప్రియదర్శిక, మాళవికాగ్నిమిత్రము మొదలగు సంస్కృత నాటకములలో కలదు. కావున విద్ధసాలభంజికయే దీనికి ఏకైక మాతృక కయనుట పొసగదు. కేయూరబాహు చరితమున గల నీతి కథలలో నొక్కటియు సంస్కృత నాటికలో లేదు. ఉండుటయు తగదు. నాటకములలో ఉపాఖ్యానములను, నీతి కథలును ఉండవు కదా! కావున ఈ కావ్యముపట్ల విద్ధసాలభంజికా మాతృకత్వము సార్థకమగు

అవకాశము ఈషణ్మాత్రము. కొందరు విమర్శకులు ఈ కావ్యము, ఆంధ్రమున వెలసిన సంస్కృత నాటకానువాదములలో ప్రథమమని కూడ అనాలోచితముగా చెప్పదొడగిరి.

తిక్కన యుగమున పుట్టిన కథాకావ్యములలో కేతన 'దశకుమార చరితము' మొదటిది. ఈ కేయూరబాహుచరితము రెండవది. అ కథలు సాహస కథలు; ఈ కథలు నీతి కథలు

## యథావాక్కుల అన్నమయ్య

### సర్వేశ్వర శతకము:

ఈ కవి వయస్సున తిక్కనకంటె కొంచెము పెద్దవాడు. ఎట్లనగా ఈ శతకము క్రీ॥శ॥ 1242 లో రచింపబడినట్లు గ్రంథకర్తయే వ్రాసెను. అప్పటికి ఇతడు సంసారమును రోసి ఆముష్మికము వంక పూర్తిగా దృష్టిమరల్చిన వాని వలె కానవచ్చును. ఈ క్రింది పద్యములో అట్టి భావన ప్రస్తుట మగుచున్నది.

మ॥ "జ్వరసంతాప విశోషితాంగుఁడు సుధాసంకాశదివ్యాన్న పా
న రసశ్రేణి భుజింప రోయుగతి నున్మాదేంద్రియ ధ్వాంత దు
స్తర సంసార మదప్రమత్తుఁడు మహా సౌఖ్యోత్సవంబైన మీ
చరణారాధనయందు బుద్ధిఁజొనుపం జాలండు సర్వేశ్వరా!"

శతకరచన నాటి కపర వయస్సులో నున్న ఇతడు పంద్రెండవ శతాబ్ది చివరి భాగములో జన్మించి యుండవలయును. అగుచో తిక్కన కంటె ఇంచుమించు పదిహేను సంవత్సరములు పెద్దవాడును, పాలకురికి సోమనాథుని అపర వయస్సులో బాలుడును అయియుండును. మరియు శైవుడగుటచే విద్యాభ్యాస దినముల నుండియు సోమనాథుని గ్రంథములను సాహిత్య సంపాదనార్థమే కాక, మతధర్మ సంగ్రహార్థము కూడ పఠించి యుండును. అన్నమయ్య పండితారాధ్యునివలె వైదిక శైవుడే కాని సోమనాథునివలె వీరశైవుడు కాడు. అందుచేతనే కాబోలు, సోమనాథుని కృతులలో పండితారాధ్య చరిత్ర యందలి భావములను, తన పద్యములలో అనుకరించెను. సంస్కృతములో గల మహిమ్నస్తోత్రాది శివస్తోత్ర గ్రంథముల నుండియు కొన్ని శ్లోకార్థములను స్వీకరించెను.

గ్రంథకర్త దీనిని శతకమని పిలువలేదు. 'సర్వేశ్వర స్తోత్రం బన్నయ జెప్పె నిజ్జగములో శోభిల్ల సర్వేశ్వరా' అనుటచే సంస్కృతమునందలి మహిమ్నస్తోత్రాదులవలె తన గ్రంథము కూడ స్తవముగానే పరిగణింప బడవలయునని అతని కోర్కెగా తోచును. లోకములో దీనిని శతకమనుట "సర్వేశ్వరా" యనెడి మకుటమును బట్టి కాబోలు. పద్యసంఖ్య మాత్రము శతక నామమును సార్థకము చేయదు. అసలు తెలుగు శతక కర్తలలో కొందరు మకుట నియమమునే తప్ప సంఖ్యా నియమమును పాటింపలేదు. ప్రసన్న రాఘవ శతకములో 200 పద్యములు కలవు. అయినను అది శతకమే అనిపించుకొనెను అట్లే అన్నమయ్యది కూడ శతకముగానే పరిగణింపబడెను

అన్నమయ్య స్తుతికి పాత్రమైన ఈ సర్వేశ్వరుడెవరు? బ్రహ్మ విష్ణు మహేశ్వరుల కతీతుడును, విశ్వాత్మకుడును అయిన పరబ్రహ్మతత్త్వమును సర్వేశ్వర శబ్దవాచ్యముగా అద్వైతులు నుతింతురు అన్నమయ్య సర్వేశ్వరుడు త్రిమూర్తులలో నొకడగు మహేశ్వరుడు. అయన లింగాకారుడు. ఆ లింగము యొక్క గర్భసముద్రమున బ్రహ్మాండములు బుద్బుదముల వలె పుట్టుచు నణగుచు నుండును హరి బ్రహ్మాది దేవతలందరును అబుద్బుదములు నివాసముగా కలిగి వాటితోపాటు పుట్టుచు అణగుచు నుందురు. ఈ అర్థమును అయన ఈ క్రింది పద్యమున స్పష్టీకరించెను:

మ॥ *"జలజాత ప్రభవాండ బుద్బుదము లశ్రాంతంబునుం బుట్టుచుం*
*గలయం గ్రాఁగుచునుండు నీ పృథుల లింగస్ఫార గర్భాబ్ధి లో*
*పలఁ దద్బుద్బుదగర్భవాసులు హరిబ్రహ్మాది దేవాళియుం*
*గలదే? వారికి నీ మహత్త్వ మెరుగంగా శక్తి, సర్వేశ్వరా!"*

ఇతడు పరమ శివభక్తుడనియు, అన్యదేవతా పరాఙ్ముఖుడనియు, ఈ శతకము శివార్చనగానే వ్రాయబడినదనియు వేరే చెప్పనక్కరలేదు. ఇతడు పండితారాధ్య మార్గానుయాయియైన శైవుడు గనుక కర్మాచరణమును తెగనాడక జ్ఞాన సముపార్జనము నుపేక్షింపక భక్తి ప్రాధాన్యమును కొనియాడెను. ఆ భక్తి ఈశ్వరుని యెడనే కాక శివభక్తుల యెడను చూపవలయుననియు, శివభక్తుల పాదోదకము సర్వతీర్థ మహిమ కలదనియు పండితారాధ్యుని వలె ఇతడును ఉద్బోధించెను వీరశైవులకును, అరాధ్యులకును గల సమాన ధర్మములలో ఈ భక్త పాదోదక సంసేవన మొకటి లింగార్చనతో జంగమార్చనయు ప్రధాన ధర్మాచరణముగ చెప్పుట కూడ అతని జంగమ భక్తికి ఇంకొక నిదర్శనము. ఈ శతకములో అన్యదేవతా దూషణము చేయకపోయినను అద్వైత దూషణము మాత్రము చేయబడ్డది.

శా॥ *మోహధ్వాంతములో మునింగిన మహా మూఢుం డతిభ్రష్టుఁడై*
*సోహంబంచుఁ దొడంగి నీకుఁ గడు దూరాత్ముండగుంగాని దు*
*ష్టాహంకార గుణంబుమాని మది సొంపారంగ సద్భక్తి దా*
*సోహంబన్న భవత్పదార్చకుఁడు నీవై యుండు సర్వేశ్వరా!*

ఇందులో అతడు ఉద్దేశించిన మహామూఢుడు అద్వైతి. అద్వైతియే 'సోఽహం' అనుకొనెడివాడు. ఈతని అనుభవమునుబట్టి చూచినచో భక్తియోగము లోకులనుకొను నంత సులభము కాదనియు, అది అష్టాంగ యోగాది సాధనల వల్లను, మంత్రజపము వల్లను, లభ్యమగునది యనియు ఈ క్రింది పద్యము వలన ఊహింపనగును

మ॥ *"అనుబంధేం ద్రియభూతవర్గము యమాద్యష్టాంగ మంత్రోరు సా*
*ధన ముచ్చాటన సేసి, పాపి, గురు సద్వాక్య ప్రకాశోత్తమాం*
*జన దృష్టిం బరికించి యేర్పరచి వాంఛంగోరి సాధించి చే*
*కొను చిన్మూర్తికిఁగాని భక్తి విధి గీల్కొ దెందు సర్వేశ్వరా!"*

భక్తి యోగమే ముక్తికి పరమ సాధనముగా చెప్పినను అన్నమయ్య భక్తి, జ్ఞాన, ధ్యానమార్గములను సమముగానే అనుగమించి ఈశ్వరానుగ్రహమును బడసిన తపస్వి

యనక తప్పదు. తాను కవిగనుక ఈశ్వరుని పువ్వులతో పూజ చేయుట వంటిదే పద్యములతో స్తుతియించుట యనియు, ఆ పువ్వులు గాని ఈ పద్యములుగాని భక్తిభరిత హృదయు డర్పించినపుడే ఈశ్వరుడు స్వీకరించుననియు ఈ క్రింది పద్యములో వ్రాసి అంతశ్శుద్ధిలేని పూజలను, కవిత్వములును వ్యర్థములని సూచించెను

*"అమితామోద నవ ప్రసూనముల నిన్నర్చించుచో గద్య ప*
*ద్యము లూహించి నుతించుచో, వివిధ గీత వ్రాతము ల్పాడు చో*
*నమృతాహారము లిచ్చుచో నిపుణుఁడై యాటాడుచో నందు జి*
*త్తమునన్ భక్తియె నీవు జేకొను పదార్థం బెల్ల సర్వేశ్వరా!"*

కవిజన సహజమైన ఈతని ఆర్ద్రహృదయము ధ్యాన యోగనిష్ఠమై యున్నపుడును, రసమయ దృశ్యముల భావించుచుండునేమో అని ఊహింపదగిన భావములు కొన్ని ఈ శతకమున కలవు. వాటిలో ఈ క్రింది పద్యమొకటి:

*శా॥ "ప్రారంభించి చకోర పోతము మహీయ జ్యోత్స్న యం దుత్సవ*
*శ్రీ రంజిల్లెడు వేడ్కనుండుగతి, నాచిత్తంబు నీ దివ్య శృం*
*గారధ్యానము నం దపార్ణిశము జొక్కం జేయవే దేవ శ్రీ*
*గౌరీ లోచన నర్తకీ నటనరంగస్థాన! సర్వేశ్వరా!"*

పద్యముల శైలి ప్రాయికముగా సంస్కృత సమాస భూయిష్ఠమైనను, ప్రసన్నమై, నిండుదనముకలిగి, చెవికిని చిత్తమునకును సుఖము కలిగించుచుండును. తెలుగు పద్యములలో సంస్కృత వాక్యములు చొప్పించుట ఇతనికి అలవాటే కాని పండితారాధ్య సోమనాథుల వలె అనుధాతుప్రయోగములేని మణి ప్రవాళ శైలి వ్రాసినట్లు పొడగట్టదు. సంస్కృత వాక్యమయమైన ఈ క్రింది పద్యము చదువుచున్నపుడు రుద్రాభిషేక సమయము నందలి నమకమును జ్ఞప్తికి దెచ్చును

*శా॥ "శ్రీ కంఠాయ నమో నమో, నతసురజ్యేష్ఠాయ రుద్రాయ లిం*
*గాకారాయ నమో, నమో విగత సంసారాయ, శాంతాయ చం*
*ద్రా కల్పాయ నమో, నమో దురిత సంహారాయతే యంచు ని*
*న్నాకాంక్షం బ్రణుతించు మానవుడు నీవై యుండు సర్వేశ్వరా!"*

జ్ఞాననిష్ఠమైన భక్తి ప్రతిపాదన యటుండ కవిత్వ సంపదను బట్టి చూచినను ఈ శతకము తెలుగు శతకములలో అగ్రశ్రేణికి చెందినదని నిస్సందేహముగా జెప్పవచ్చును.

## మారన

### మార్కండేయ పురాణము:

మారన తిక్కన సోమయాజికి సాక్షాత్ శిష్యుడు ఆ మాట మార్కండేయ పురాణ గద్యలో *"శ్రీమదుభయకవిమిత్ర తిక్కనసోమయాజి ప్రసాదలబ్ద సరస్వతీ పాత్ర తిక్కనామాత్యపుత్ర మారయ నామధేయ ప్రణీతంబైన మార్కండేయ పురాణంబు"* అని భక్తిపూర్వకముగా ఉగ్గడించుకొనెను ఈతని తండ్రి పేరుకూడ తిక్కనయేనట

ఈ తిక్కన భారతకర్త తిక్కనకాదు. ఆ కాలములో తిక్కన నామధేయులు చాలమంది కలరు. ప్రాయికముగా వారిది నెల్లూరు మండలము అయి ఉన్నట్లు పొడగట్టును. ఈ పేరు "తిగక్కన్" (ముక్కంటి) శబ్ద భవమనియు, శ్రీ కాళహస్తీశ్వరుడు "తిగక్కన్" శబ్ద వాచ్యుడనియు చెప్పుదురు. అగుచో ఆ దేవుని పేరు ఆమండలమున పెక్కుమంది గృహస్థులు తమ బిడ్డలకు పెట్టుకొనుట సహజమే భోజరాజీయకర్తయైన అనంతామాత్యుని తండ్రిపేరు తిక్కనయే. అతడు కృష్ణాతీరమువాడు. ఆ పేరు ఆ మండలమున వాడుకలో నున్నది కాకపోయినను అనంతామాత్యుని తాత బయ్యనమంత్రి తిక్కనసోమయాజిని దర్శించి 'భవ్యభారతి' అనెడి బిరుదుతో సన్మానింపబడెనట. మరికొన్ని ఉపకారములు కూడ పొందియుండవచ్చును. ఆ భవ్యభారతి తిక్కన సోమయాజి యెడ తనకుగల కృతజ్ఞతకు సూచకముగా కుమారునకు తిక్కన నామధేయము పెట్టియుండును.

మారన ఈ గ్రంథమును ఓరుగల్లు కటకపాలకుడైన (Police Commissioner) నాగయగన్నమంత్రికి కృతియిచ్చెను. నెల్లూరు మండలము వాడైన ఈ కవి కృతిపతికోసము అంతదూరము పోనేలా? అనే శంకకు నాకు తోచిన సమాధనమిది–

మనుమసిద్ధి కుమారుడైన నల్లసిద్ధితో నెల్లూరున చోళవంశపరిపాలనము అస్త మించెను. నెల్లూరుచోళుల రాజ్యము కాకతీయసామ్రాజ్యములో లీనమై పోయెను. రాజాశ్రయమును కోరెడి మారనాది పెన్నా తీర నివాసులైన కవులకు దేశాంతరగమనము అవశ్యకమై యుండనోపు తిక్కనగారి శిష్యుడనెడి ఖ్యాతితో కాకతీయ రాజధానీ నగరమున తనకు మర్యాదలు జరుగుననెడి ఆశతో మారన ఓరుగల్లనకు ప్రయాణము కట్టియుండును. మరియు తిక్కనగారి కాలముననైని, తదుపరిగాని నాగయగన్న మంత్రితో పరిచయము లభించియుండుటచే అతని ప్రాపును కోరియైనను రాజధానికి వెళ్ళియుండవచ్చును. కృతిపతియైన ఈ నాగయగన్న సేనాని ప్రతాపరుద్రునితోపాటు 1323 ప్రాంతమున తురుష్కులచే బందీకృతుడై ఢిల్లీకి కొనిపోబడెనట. అతడు పదస్థుడైయున్న కాలముననే ఈ గ్రంథము రచింపబడినదగుటచే 1310–1320 మధ్య నెప్పుడో రచించబడి యుండును

నిజమారసినచో తిక్కన సోమయాజి ప్రసాదలబ్ధ సరస్వతి పాత్రుడైన మారన భారతమునకు అనుబంధరూపమై ఖిలపురాణముపేర నొప్పు హరివంశమును రచింపవలసినవాడు గురుకృతమైన గ్రంథమునకు పరిశిష్ట భాగమైన గ్రంథమును రచించుట కంటె శిష్యునకు వేరొక గర్వకారణము కాని ధన్యతగాని యుండదు. మరి మారన హరివంశమును ఏల చేపట్టలేదో చెప్పలేము బహుశః గరువుగారి ప్రక్కన నిలబడుటకు సాహసింపలేదేమో? ఆ భాగ్యము ఎఱ్ఱనకు దక్కెను. ఇంతకంటె ప్రబలమైన కారణము వేరొకటి యుండవలెను. అది యిట్లై యుండవచ్చు.–

మారన ప్రౌఢకవిగా తలయెత్తు నాటికి సంస్కృత పురాణములలో నేదియు తెనుగున అనువదింపబడలేదు భారత రామాయణములు వెలసినను అవి పురాణములలో పరిగణింపబడవు. అవి ప్రత్యేకము ధర్మప్రబోధముగాని మతప్రచారము గాని చేయుటకు పుట్టినవికావు రామాయణమున విరళముగాను భారతమున ప్రచురముగాను ధార్మిక ప్రసంగములు, తాత్త్వికమీమాంసయు ఉన్నను, ఆ భాగములు ప్రసంగవశమున

చెప్పబడినవేకాని, అధికారికములుకావు. అందులో రామాయణము రాముని సాంసారిక చరిత్ర ప్రధానము భారతము కురువంశ సాంసారికచరిత్ర ప్రధానము.' ఇక పురాణములో ప్రత్యేకము ఒక పురుషుని గురించిగాని ఒక వంశమును గురించిగాని కాక, సర్వమానవ లోకమునకు సర్వకాలములకు సంబంధించిన విజ్ఞానమును వర్ణించు గ్రంథములు. పురాణమనెడి శబ్దమునకే పూర్వచరిత్ర యని పేరు. పురాణ గ్రంథములయొక్క రచన అధునికముగానే పొడగట్టుచున్నను చెప్పబడు విషయము మాత్రము విశ్వసృష్టి నుండి ప్రారంభమగును. అందుచేతనే పురాణము సృష్టి, ప్రతిసృష్టి, వంశము, వంశానుచరితము, మన్వంతరములు అను పంచలక్షణములు కలది అని నిర్వచింపబడినది. అనగా కాలచక్రము ప్రవర్తితమైన నాటినుండియు కథా కాలము నాటికి ఎన్ని సృష్టులు జరిగెనో, ఎన్ని ప్రళయములు వచ్చెనో, ఆయా కాలముల యందు ఏయే రాజవంశములు తలయెత్తి, ప్రజాపాలనము చేసెనో, ఏయే మనువులు ఏయే కాలముల నుద్భవించిరో నిర్దేశించును. అంతేకాక, వేదశాస్త్రములలో విహితమైయున్న విజ్ఞానమంతకును పురాణములలో స్థానము కల్పింపబడుటచే అవి చరిత్రలు అని గాని, కావ్యములనిగాని పేరు పొందక, జ్ఞాన విజ్ఞాన కోశములను పేర బరగుచుండును. మరి ఈ పురాణములలో కొన్ని వైష్ణవములని, కొన్ని శైవములని వివిధ దేవతా మహాత్త్వముల నుగ్గడించునవి యైనను అన్నియు కలిసి పురాణ సంహిత యను పేర వేదసంహితవలె సర్వలోకసంసేవ్యములై యుండును.

అష్టాదశ మహాపురాణములలో నేడవదియైన ఈ మార్కండేయ పురాణము శైవ వైష్ణవాదులైన ఏ మతశాఖకును సంబంధింపక ఎల్లరకును ఆరాధనీయమై యుండుటను బట్టి మారన, గురువు నడచిన సర్వమత సమన్వయ మార్గమునే అనుసరించి ఈ పురాణమును స్వీకరించి యుండును. ఈ గ్రంథములో దేవీ సప్తశతి యనుపేర మహిషాసురమర్దన మొనర్చిన పరదేవతయొక్క మహాత్త్వమును వర్ణించిన ఘట్ట మొకటి కలదు. మహిషాసుర మర్దిని, దుర్గ, శక్తి మొదలైన శైవమత సూచక నామములతో పిలువబడినను ఆ దేవత త్రిమూర్తులకు వారి భార్యలకు అతీతమైన స్థానము నలంకరించెడి పరాశక్తి యనియు, ఆమెకు నారాయణి, వైష్ణవి మొదలైన విష్ణుమత సంబంధనామధేయములు కూడ కలవనియు గ్రహింపవలయును కావున మహిషాసురమర్దన కథ ఈ పురాణములలో నొక భాగమైనంత మాత్రమున ఈ గ్రంథము శైవ పురాణములలో గాని శాక్తేయ పురాణములలో గాని చేరదు. మరియు పదునాలుగు మన్వంతరములలో ఆయా పురాణములందు ఏవో కొన్ని కొన్ని మాత్రమే వర్ణింపబడి యుండునుగాని అన్నియు అన్నిటనుండవు. అందులో ఈ పురాణము నందు పది మన్వంతరములు వర్ణింపబడినవి. అందుచే ఇన్ని మనుజన్మల కథనము గల పురాణ మింకొకటి లేదు అదియుగాక గ్రంథకర్త తన కవితా ప్రతిభను ప్రదర్శించుటకు అనువైన రసవత్కథలు ఈ పురాణములలో ఉండుటయు మారన దీనిని చేపట్టుటకు కారణమై యుండవచ్చును. ఆంధ్ర వాఙ్మయమున అనంతర కాలమున వెలసిన స్వారోచిషమనుసంభవమునకు, హరిశ్చంద్రోపాఖ్యానమునకు, కువలయాశ్వ చరిత్రకు మూలము ఈ మార్కండేయపురాణమే

అష్టాదశపురాణములలో మార్కండేయపురాణము బ్రహ్మర్షి నామమున ప్రసిద్ధమైనది. అనగా పురాణసంహితలో నీ గ్రంధము పరమపూజ్య స్థానము నలంకరించిన దన్నమాట. హరివంశము కంటె ఇన్నివిధముల గుణాధికమై స్వతంత్రమైన ఈ పురాణము తెనిగించుట కవిలోకమున తన విశిష్టతకు హేతువగునన్న ఆశచే మారన ఈ అనువాదమునకు పూనుకొని యుండును.

ఈ గ్రంధములో ఎనిమిది ఆశ్వాసములు కలవు. వీటిలో నాల్గవ ఆశ్వాసమునుండి యధార్థముగా పంచలక్షణ సమన్వితమైన పురాణము ప్రారంభమగును. ఆ అయిదు ఆశ్వాసములలో వర్ణింపబడిన సృష్టిక్రమము, ప్రళయ విధానము, సూర్య చంద్రాదిరాజవంశ చరితము, ప్రసక్తానుప్రసక్తముగా అందు వచ్చెడి ఇతిహాసములు మొదలైన విషయమంతయు మార్కండేయ మహర్షి క్రోష్టుకి యనే ఒక మునికి చెప్పిన క్రమమున జైమినిమునికి వింధ్య పర్వత నివాసులగు ధర్మపక్షులు జెప్పెను. ప్రస్తుత వక్తలు ధర్మపక్షులైనను, తొలినాడు మార్కండేయమహర్షి ప్రవచించిన పురాణమగుటచే, దీనికి మార్కండేయ పురాణమను పేరు సార్థకమైనది. మొదటి మూడాశ్వాసములలో ప్రథమాశ్వాసము ఇష్టదేవతా స్తుతితో ప్రారంభమై షష్ఠ్యంతములతో అంతమగును. రెండు మూడాశ్వాసములు ఈ పురాణమునకు సంబంధించినవి కావు. అయినను పురాణ శ్రోతయైన జైమినియే ఈ గ్రంధభాగమున గూడ ప్రధాన పాత్ర అయియుండుటచే రెండుభాగములకును ఒక విధమైన బంధము కల్గినది.

భారత పఠనానంతరము జైమినికి నాలుగు ధర్మ సందేహములు కల్గినవట.

1. ఆదిమధ్యాంతరహితుడైన పురుషోత్తముడు శ్రీకృష్ణరూపమున మర్త్యజన్మ నొందుటకు గల కారణమేమి?
2. పుణ్యచరిత్రయైన పాంచాలి పంచభర్తృక యెట్లయ్యెను?
3. బలరామునకు బ్రహ్మహత్యాపాతక మెట్లు సంభవించెను? వానికి నిష్కృతి యెట్లు కల్గెను?
4. ద్రౌపదేయులు వివాహమైననుకాకముందు చిన్నతనముననే యేల మృతినొందిరి?

ఈ ధర్మ సందేహములకు సమాధానము చెప్పగలవాడు త్రికాలజ్ఞుడును, మరణ రహితుడును అయిన మార్కండేయు డొక్కడే యని యెంచి జైమిని ఆ మహర్షిని ఆశ్రయించి వేడుకొనెను. ఈ యెడ పాఠకులకొక పెద్ద సందేహము కలుగవచ్చును. ఏదనగా –

వేదవ్యాసుడు భారత సంహితను రచించి తత్ప్రచారార్థము వైశంపాయనాది శిష్య చతుష్టయమును నియోగించెను. ఆ నలువురలో జైమిని ఒకడు ఈ శిష్యునకు తాను భారతమును గురుసన్నిధానమున అధ్యయనము చేసినపుడు పొడమని ధర్మసందేహములు కాలాంతరమున ఎట్లు పొడమెను? తాను జిజ్ఞాసువే అయినచో ఆ సందేహములు అనాడే వ్యాసుడు తీర్చియుండును గదా! ఇటువంటి ప్రశ్నలకు పురాణములు, సమాధానములు చెప్పవు. పురాణములు ఎవరు వ్రాసినను, ఎవరు చెప్పినను, ఎవరు విన్నను ఆ వ్యక్తులకు ప్రాధాన్యము లేదు. ఎవరి పేరున వెలసినను పురాణ విషయము మాత్రమే ప్రాధాన్యము వహించును. మరి ఇంకొక విశేషమేనగా పురాణములలో పేర్కొనబడెడు నామములు చాలా వరకు గోత్రనామములు.

కౌశికనామముగాని గౌతమనామముగాని పలు పురాణములలో పలుచోట్ల వచ్చినప్పుడు, ఆ కౌశికుడు విశ్వామిత్రుడే యనియు, ఆ గౌతముడు అహల్య భర్తయే యనియు అనుకొనరాదు. వారు క్రమముగా కౌశికగోత్ర సంజనితులో లేక గౌతమ గోత్ర సంజనితులో అయిన మునులని గ్రహింపవలయును. ఈ సంప్రదాయమును బట్టి ఈ పురాణమున మార్కండేయుని సందర్శించినముని వ్యాసశిష్యుడైన జైమిని కాడని యనుకొన వలయును.

ఈ జైమిని తన ధర్మసందేహములు తీర్చుమని మార్కండేయుని అర్థింపగా ఆమహర్షి తాను పవనదీక్షితుడై యుండుటచే ఆ సందేహము నివృత్తి చేయగల ధర్మపక్షుల యొద్దకు జైమినిని పొమ్మని యాదేశించి ఆ పక్షుల వృత్తాంతము జైమినికి తెల్పును. ఆ పక్షులు పూర్వజన్మమున సుకృశుడు అను ఋషీశ్వరుని కుమారులు. వారు ఒక సందర్భమున తండ్రి యాజ్ఞానుసారము దేహత్యాగము చేయుట కీయకొనక పోవుటచే ఆయన వారిని పక్షి జన్మమెత్తుడని శపించెను. ధర్మసాధనమైన మానవ శరీరములను త్యజించి తిర్యగ్జన్మ మెత్తవలసిన దుర్గతికి వారు విలపింపగా తండ్రి కరుణించి పక్షి జన్మలో కూడ వారికి జ్ఞానసంపద కల్గునట్లనుగ్రహించెను. ఈ వివరములను తెలిసికొని జైమిని ధర్మపక్షులకడ కేగెను

ధర్మ పక్షులు జైమినికి పొడమిన సందేహములకు సమాధానములు చెప్పుటలో ద్రౌపదేయుల అకాల మరణములకు నిమిత్తము హరిశ్చంద్రోపాఖ్యానములో నుండుటచే ఆ మహారాజు విశ్వామిత్రుని వలన నానా కష్టములు పొందిన వృత్తాంతమంతయు చెప్పబడెను. విశ్వామిత్రుడు హరిశ్చంద్రుని అతని ప్రజలను నిర్దయముగా దండించుటే కాక పట్టమహిషియైన శైబ్యను కఠినముగా హింసించుచుండగా దుస్సహమైన వారి బాధలను చూడలేక విశ్వేదేవతలు; పుణ్యసాధ్విని హింసించుచున్న ఆ ఋషికి పుణ్యలోకము లుండవని దేవతలు ఉద్ఘోషించిరి ఆ సులభక్రోధుడు, వారు పనిలేని పనిగా కల్పించుకొన్న జోక్యమును సహింపలేక మర్త్యులుగా జనింతురుగాక యని శపించి, వారి ప్రార్థన మీద వారి మనుష్యత్వము కొలది కాలమునకే తీరిపోవునని శాపావసానమును నిర్దేశించెను. అందుచేతనే వారు ఉపపాండవులై పుట్టి, చిన్నతనముననే మనుష్యత్త్వమును వీడి వెడలిపోయిరి.

ఇందలి హరిశ్చంద్రుని కథకును, ప్రసిద్ధమైన గౌరన హరిశ్చంద్ర కథకును కొంత భేదమున్నది. అది స్థలాంతరమున జెప్పెదము. ధర్మ పక్షులు తన సందేహములను తీర్చినను జైమిని తనివి చెందక ధర్మపక్షులను ప్రాణియొక్క జనన మరణములకు సంబంధించిన మరికొన్ని ప్రశ్నలడుగును. ఆ ప్రశ్నలివి:

1. జంతువు తల్లి గర్భమున నెట్టిబాధ నొందుచుండును?
2. తల్లి తిను ఆహారము పిండమున కెట్లు దక్కును?
3. ప్రాణి పుట్టి యెట్లు వర్ధిల్లును?
4. మరణవేళ ప్రాణికి నిజజ్ఞాన మేమైపోవును?
5. మరణానంతరమున జీవుడు ఎచ్చట ఎట్లు పుణ్య పాపముల ఫల మనుభవించును?

భూతసర్గ స్థితిలయములకు సంబంధించిన ఈ ప్రశ్నలకు సమాధానము చెప్పుటలో ధర్మపక్షులు జడోపాఖ్యానము కథనము చేయును. అందు జంతూత్పత్తి ప్రకారము,

బహువిధ నరకములు, పూర్వ జన్మకృత పాపపుణ్యముల వలన కలుగు జన్మములు మొదలగు పరమార్థము లనేకములు బోధింపబడును. ఆ సందర్భముననే దత్తాత్రేయ జన్మకథనము, కువలయాశ్వచరిత్ర చెప్పబడును. కువలయాశ్వుడను రాజకుమారుడు మదాలస యనెడి కన్యను వివాహమాడును. అతని పరోక్షమున మాయావి యైన తాళకేతుడను రాక్షసుడు ఆమె ప్రాణములు తీసెను. అశ్వకరుడను గంధర్వరాజు శివుని మెప్పించి మదాలసను బ్రతికించి నాగలోకమున నామెను పుత్రికగా పెంచుకొనుచు, ఒక సందర్భమున నాగలోకమున కేగిన కువలయాశ్వునకు ఆమె నర్పించెను. మదాలసాకువలయాశ్వులకు ఉత్తమసంతాన ప్రాప్తికలుగును. ఆమె తన పుత్రులకు వర్ణాశ్రమధర్మములు, అతిథిపూజావిధానములు, నిత్య నైమిత్తిక కర్మలు మొదలగు మతధర్మములను ఉపదేశించును పరమ జిజ్ఞాసువైన జైమిని అపై పక్షులను మరికొన్ని ప్రశ్నలడుగును వాటికి సమాధానముగా పక్షులు జగదుత్పత్తి స్థితిని గురించి, సూర్యచంద్ర వంశములను గురించి, మన్వంతరములను గురించి, కల్పవిభాగములను గురించి తొలిప్పాడు మార్కండేయుడు క్రోష్టుకియను మునికి చెప్పిన క్రమమున సవిస్తరముగా బోధించును. ఈ కథన మంతయు అయిదవ ఆశ్వాసము నుండి ప్రారంభమగును. మన్వంతర కథనములో స్వారోచిష మనుసంభవము మొదట ప్రస్తుతింపబడెను దీనినే ఆంధ్రకవితాపితామహుడు అల్లసానిపెద్దన తనప్రబంధమునకు మాతృకగా స్వీకరించి వన్నెచిన్నెలతో సింగారించెను. ఈ విధముగా ఉత్తర కాలమున రచింపబడిన మూడు ప్రబంధములకు మారన మార్కండేయ పురాణము మూలమగుటచే మారన ఆప్రబంధ కవులకు ఇతివృత్త ప్రదానముచేసి గురువయ్యెను శ్రీనాథుడు "నూనూగు మీసాల నూత్న యౌవనమున రచియించితి మరుత్తరాట్చరిత్ర" అని తన కాశీఖండమున చెప్పుకొనెను. ఆ మహాకవి బాల్యమందు రచించిన ఆ మరుత్తరాట్చరిత్రకు, బహుశః మార్కండేయ పురాణమున గల మరుత్తుని కథ – మూలమై యుండునేమో! ఈ పురాణమున గల సొగసైన ఉపాఖ్యానములలో మరుత్తరాట్చరిత్ర ఒకటి మరుత్తుడు కరందముడు అనే రాజునకు మనుమడు అవేక్షితుడనువాతని కుమారుడు. అతని తల్లి వైశాలి. విదిశా దేశాధీశుని కూతురు. అవేక్షితున కామె స్వయంవరలబ్ధ. స్వయంవరమున పరాభూతులైన రాజులందరు కుట్రచేసి ఆతనితో దొమ్మి యుద్ధము చేసి ఓడించిరి. పరాభవఖిన్నుడైన అయువకుడు దార పరిగ్రహము నొల్లనని బ్రహ్మచర్య దీక్ష వహించెను. వైశాలి భర్తృభోగ్యము కాని తన జీవితమును నిందించుకొనుచు అడవులకేగి తపోనిష్ఠపూనెను. ఎంతకాలమైనను తన మనోరథము తీరని కారణమున శరీర విసర్జన ప్రయత్నము చేయుచుండగా, ఒక దేవదూత అరుదెంచి ఆమెను ఆత్మహనన ప్రయత్నమునుండి వారించి ఆమెకు పుత్రప్రాప్తి కల్గుననియు ఆకుమారుడు దిగంత విశాలయశుడైన చక్రవర్తి కాగలడనియు ఆశీర్వదించి పోయెను. ఆ భర్త బ్రహ్మచర్య వ్రతదీక్ష వదలని కఠోర వ్రతుడు దేవదూత అమోఘ వచస్కుడు. తాను అవేక్షితుని తప్ప ఇంకొకరిని కన్నెత్తి చూడని పతివ్రత. పరస్పరానుకూల్యము లేని ఈ స్థితిగతులలో తనకు పుత్రప్రాప్తి కలుగుట ఎట్లని ఆమె ఆందోళిత చిత్తయై యున్న సమయములో ఒకరాక్షసుడు అకస్మాత్తుగా ఆ తపోవనమున కేతెంచి ఆమెను చెనక నుద్యమింపగా నామె ఆక్రోశించెను. అదే సమయమున ఆ ప్రాంతమున

వేటకై యరుదెంచిన యవేక్షితుడు ఆ స్త్రీజనాక్రందనము వినవచ్చిన దెసకు పరుగు పరుగున పోయి ఆ యువతిని బలత్కారించుచున్న రాక్షసుని సంహరించి ఆమెను రక్షించెను. తపోమహిమచే కల్గిన నూత్న తేజముతో వెలుగొందు నా యువతి నా రాజు తన భార్యయని గుర్తింపలేని సమయమున ఒక గంధర్వరాజట కేతెంచి కలరూపు ఎరిగించి వారిరువురను గంధర్వలోకమునకు గొనిపోయి అచ్చట విధియుక్తముగా వివాహము జరిపి కొన్నాళ్ళుంచుకొనెను. ఆ దంపతులాలోకమున నుండగా జనించిన పుత్రుడే మరుత్తుడు. అవేక్షితుడు గంధర్వరాజు నమజ్ఞ కొని భార్యాపుత్ర సహితుడై తండ్రిని దర్శించి, సంతోషభరితుడైన ఆ వృద్ధరాజు నాశీర్వాదము వడసెను. ఈ సంఘటనకు పూర్వమే, అవేక్షితుని తల్లి వీరాదేవి అనునామె, 'కిమిచ్ఛకవ్రతము' అనెడి వ్రతము నెఱపి వ్రతోద్యాపన దినమున ఎవరేది కోరిన నది ఇచ్చువానిగా కుమారుని దాతృస్థానమున నిల్పి భర్తచే పౌత్ర ముఖదర్శన వరమును యాచింపజేసెను. దాతృస్థానముననున్న అవేక్షితుడు తథాస్తు అని వాగ్దానము చేసెను. కాని అనాడు ఈ వాగ్దానము చేసినను అవేక్షితుడు తన బ్రహ్మచర్య నిష్ఠను వదలనే లేదు. ఇది ఈ కథలో ఇంచుక చిక్కు తెచ్చి పెట్టిన సంఘటన. ఈ చిక్కులన్నియు తీరి కథ కరంధముని పౌత్ర ముఖసందర్శనముతో సుఖాంతమయ్యెను.

కరంధముడు అవేక్షితునకు రాజ్యాభిషేకము చేయ తలపెట్టగా అతడు దాని నొల్లక మరుత్తునకు చేయించెను. ఈ క్రొత్తరాజు వర్ణాశ్రమ ధర్మరక్షకుడనియు దుష్టశిక్షణ శిష్టరక్షణ పరతంత్రుడనియు అచిరకాలముననే దిగంత వ్యాప్తమైన కీర్తి గడించెను. ఇట్లుండగా ఔర్వాశ్రమవాసులైన కొందరుఋషులు నాగులచే వధింపబడిరను వార్తరాగా అతడు నాగ సంహారార్థము వెడలి పోయి నాగలోకము మీద ఒక దివ్యాస్త్రము ప్రయోగించెను. నాగులందరు ఆ అస్త్ర జ్వాలలకు ఆహుతి కాజొచ్చిరి. వైశాలి తపః స్థితయై యున్నకాలములో ఒక నాగరాజు ఆమెను పూజించి ఎన్నడేని ఆమె కుమారుని వలన నాగలోక ప్రళయము సంభవించునేని ఆమె వారిని రక్షింపవలెనని అర్థించి ఆ వాగ్దానమును పొందెను. మరుత్తుడు నాగులను సంహరించుచుండగా వైశాలి భర్తను ప్రేరేచితాను నాగరాజుకు చేసిన వాగ్దానమును తెల్పి, శరణాగత త్రాణము కొరకు కుమారునకు మారొడ్డ పంపెను. దుష్టశిక్షణార్థము కుమారుడును, శరణాగత రక్షణార్థము తండ్రియు యుద్ధభూమిలో ప్రత్యర్థులుగా తారసిల్లి ఒండొరులు పరస్పర వధకు పూనుకొనగా దేవతలు ప్రత్యక్షమై వారికి సమాధానము కుదిర్చిరి. నాగులు తాము వధించిన ఋషులను బ్రతికించిరి. ఈ కథలో బ్రహ్మచర్యము, తపస్సు మొదలగు సార్వజనీన పరమధర్మములే కాకుండ దుష్టశిక్షణము శరణాగత రక్షణము మొదలైన క్షత్రియ ధర్మములును నిరూపింపబడినవి. కథాంశములో ఒండొంటికి పొందిక యుండకపోవుటచే కథాకార్యము నడచు మార్గము అప్రతర్కితమై పాఠకునకు ఉత్కంఠ కల్గించుచుండును. ఈ ఉపాఖ్యానకథనరచనలో మారన తన కథన కౌశలమును ప్రశంసాపాత్రముగా నిర్వహించెను. ఇందేకాదు హరిశ్చంద్ర కథలోను స్వారోచిషమనుసంభవ వృత్తాంతములోను కూడ అతడు ప్రదర్శించిన కథాకథన శిల్పము కవిబ్రహ్మ శిష్యునకు తగినట్లుగానే యున్నది. మారన శైలియు పురాణ రచనకు అనుకూలమైన సారళ్యము, సౌలభ్యము, సంయమము కలిగియుండుటయే

కాక, కావ్యోచితమైన రసవత్తయు, ప్రసన్నతయు నిండుకొని యున్నది. తిక్కనార్యుని జీవితకాలములోనే ఇది రచింపబడి యుండునేని ఆ గురువు ఈ శిష్యుని ప్రతిభకు ఎంత సంతసించెడివాడో! తిక్కనగారి పలుకుబడులు, భావచ్ఛాయలు, అర్థచ్ఛాయలు ఈ రచనలో చాల కలవు

ఈ యుగమున శ్రుతనాములైన మరికొందరు ఇతర కవులున్నారు వారి నిచ్చట ప్రస్తావింతును.

## బద్దెన

ఇతడు 'నీతిసార ముక్తావళి'ని రచించెను. అది రాజనీతి పరముగ చెప్పిన కొన్ని సూక్తుల సంపుటి. ఈ క్రింది పద్య మాగ్రంధములో నొకటి.

*"ఎత్తిన కాలెగాని సిరికెన్నఁడు నిల్చిన కాల నిల్వఁగా*
*చిత్తములేదు కాన సిరి చెందిన నాఁడె పరోపకారముల్*
*హొత్తి గడంగఁజేయుఁ డెడరైన పదంపడి వేడికొందమన్*
*చిత్తమెగాని ఇత్తమను చిత్తము పుట్టద యెట్టివారికిన్"*

ఈ పద్యముబట్టి ఈతని శైలి నాచనసోముని శైలివలె వక్రోక్తి ప్రధానముగా నుండునని చెప్పవచ్చును.

ఈ నీతిసార ముక్తావళిలో తాను సుమతి శతక కర్తనని చెప్పకొన్నాడనియు, ఇతడే ఆ శతకకర్త యనియు కొందరి తలంపు మరికొందరా పద్యము ప్రక్షిప్తమందురు. నిజము దేవుని కెరుక ఆ పద్యమిది.

*"శ్రీ విభుఁడ గర్వితారి*
*క్ష్మావర దళనోపలబ్ధ జయలక్ష్మీ*
*సంభావితుఁడ సుమతి శతకము*
*గావించిన ప్రోఢఁ గావ్యకమలా సనుఁడన్".*

ఈ పద్యము బద్దెన చెప్పినదే యైనచో నీతిసారముక్తావళి రాజనీతి పరముగను, సుమతి శతకము సామాన్య ప్రజానీతి బోధకముగను అతడు రచించెనని చెప్పవచ్చును. అట్లుగాక అది ప్రక్షిప్తమే అయినచో ఆ ఊహ నిలువదు ఇంతకు సుమతి శతకమునందలి భాషా జాత్యము బద్దెన కాలము నాటిదికాదని నా ఉద్దేశ్యము మరియు —

*అధరము కదలీ కదలక*
*మధురములగు భాష లుడిగి మౌనవ్రతుఁడౌ*
*అధికార రోగపీడిత*
*బధిరాంధక శవముఁ జూడఁ బాపము సుమతీ.*

ఈ పద్యము 'శ్రీవిభుఁడును గర్వితారిక్ష్మావర దళనోపలబ్ధ జయలక్ష్మీ సంభా-వితుఁడును' అయినవాడు వ్రాసినది కాదు ఎవడో ఒక సామాన్యుడు కార్యవశమున ఒక అధికారిని దర్శింపబోయి ఆతడు తనయెడ చూపిన అనాదరమునకు

ఔదాసీన్యమునకు కనలి తన అక్కసుదీర అధికారిని తిట్టినట్టి పద్యము ఇది సర్వసాధారణమైన నీతిపద్యము కాదు స్వానుభవ పూర్వకభావముగల పద్యము. "మా నిషాద ప్రతిష్ఠాత్వమగమ శ్శాశ్వతీస్సమాః" అనే శ్లోకములో వాల్మీకి శోకసంతప్త హృదయమెట్లు ధ్వనించుచుండెనో ఈ పద్యములో ఒక అధికారిచే చులుకన చేయబడిన సంసారి పరిభవాగ్ని అట్లు జ్వలించుచుండెను బద్దెన–భూపతియు మండలాధీశ్వరుడు అయిన మాట నిజమే యైనచో నతడొక రాజోద్యోగి మ్రోలకుపోయి అతనిచే చిన్నచూపు చూడబడుట తటస్థింపదు. మరియు నీ శతకము వ్రాసిన సంసారి ఒక గ్రామకరణమై యుండునని యూహించుటకును అవకాశము కలదు ఇతడు కరణముల సంగతి నాలుగైదు పద్యములలో ఒత్తి చెప్పెను. ఇవన్నియు పర్యాలోచింపగా సుమతి శతకకర్త బద్దెభూపతి కాడని నాయుద్దేశ్యము నాటకములో శత్రువు ప్రత్యక్షముగా ఎదుట నున్నట్లు భావించి పరుషోక్తులాడెడి పాత్రవలె, పై పద్యము వ్రాసిన కవి తనను అవమానపరచిన అధికారిని తన యెదుటనున్నట్లు భావించుకొని శపియించుచున్నట్లు కన్పడును. ఈ పద్దెము బద్దెనది కాకపోయినను తక్కిన శతక మంతయు అతడు వ్రాసియుండవచ్చును గదా అనెడి అసంగత వాదము చేయు వారుండరని నా తలంపు కర్త యెవరైననేమి? సంస్కృత విద్యార్థులకు బాలరామాయణమ వలె తెనుగు విద్యార్థుల కీశతకము ప్రధమపారమై వన్నెకెక్కినది

ఇదిగాక మరియొక పద్యము·

"కొక్కోకమెల్లఁ జదివినఁ
జక్కని వాఁడైన, రాజ చంద్రుండైనన్,
మిక్కిలి రొక్కము లీయక
చిక్కదురా వారకాంత సిద్ధము సుమతీ".

కొక్కోక మనెడి కామశాస్త్రము తెలుగులో బద్దెన తరువాత కొన్ని వందల యేండ్లకు పుట్టెను అది సంస్కృతమున గల 'రతికళా విలాస' మనెడి గ్రంధమునకు తెలుగు కావున సుమతి శతకకర్త కొక్కోకము తెలుగున వెలసిన పిమ్మటివాడై యుండును.

## శివదేవయ్య

ఇతడు కాకతీయ సామ్రాజ్యమునకు తన బుద్ధిబలమే వజ్రకవచముగా నొనర్చి, గణపతి దేవునకు రుద్రమాంబకు మంత్రిత్వము నెరపిన మేధావి. అంతేకాదు; ఆ చక్రవర్తులచే గురువుగా, హితుడుగా పూజలను మన్ననలను పొందెను. ఈయన పురుషార్థసార మనెడి ఒక నీతి గ్రంధమును రచించెనట 14వ శతాబ్ది మధ్యకాలమున సకలనీతిసమ్మతమనెడి నీతిపద్య సంకలనము చేసిన మడికి సింగన అనే కవి ఆ పురుషార్థసారమనెడి గ్రంధము నుండి ఇంచుమించు వంద పద్యము లుదాహరించెనట కాని ఆ పద్యముల కర్త శివదేవయ్య అని ఎచ్చటను అతడు చెప్పలేదు. అది అటులుండ శివదేవకవి ఆత్మసంబోధనతో 'శివదేవ ధీమణీ!' అనే మకుటము గల ఒక శతకమును కూడ రచించెననెడి యొక వదంతి కలదు. ఆ శతకము నేడు

లభింపదు. అయినను ఒక పద్యము మాత్రమెట్లో పరిశోధకులకు లభించినది ఆ పద్యమిది

చం॥ "అరయగ పిన్ననాఁట సిరియాళుఁడనై యెల్లబాయ మందు సుం
దరుఁడను నంబినై పదను తప్పిన గుండయగారి చందమై
ధర జరియింపఁగల్గిన తథాస్తు; వృధా పరిపాకరూప దు
ష్కర జననం బదేమిటికి కాలుపనే శివదేవ ధీమణీ!"

ఈ మకుటమును బట్టి ఈ శతకము అయనయే వ్రాసెనని నిర్వివాదముగ చెప్పుట కష్టము. ఎవడేని ఒక కవి శివదేయ్యను సంబోధించుచు ఈ శతకమును వ్రాసి యుండవచ్చును అసలు ఇటువంటి పద్యములు నూరు వ్రాసి ఆ కవిగాని, శివదేవయ్యగాని శతకముగా రూపొందించిరని చెప్పుటయు కష్టమే!

మరియు శివదేవయ్యయే ఈ పద్యమునకుగాని లేదా సంపూర్ణ శతమునకుగాని కర్తయే అనుకొన్నచో ఆత్మసంబోధనలో ధీమణి యనెడి ఆత్మ ప్రశంసా వాచకమైన శబ్దమును ప్రయోగించి యుండునా యని నా సందేహము.

**అప్పన మంత్రి:** 'చారుచర్య' (A beautiful life with healthy conduct) అను గ్రంథమును రచించెను. భోజకృత మగు సంస్కృత 'చారుచర్య' గ్రంథమందలి యొక భాగమునకు అనువాదము. కావ్యము కాదు నీతిశతకము వంటిది.

**అధర్వణుడు:** ఇతడీ యుగమువాడేనని తలపబడుచున్నది ఇతనిని గురించి నన్నయ ప్రకరణమున కొంత వ్రాసితిని ఇతడు నన్నెచోడునకు తిక్కనకు మధ్య కాలమువాడై యుండవలయును

## తిక్కన యుగ సింహావలోకనము

పదమూడవ శతాబ్ది ఆంధ్రదేశచరిత్రలో స్వర్ణయుగమని చెప్పదగిన కాలము ఆ యుగములో ఈ ఆంధ్రజాతి ధర్మమును సుప్రతిష్ఠితము చేయవలె నని మహాపురుషులు పలువురు ప్రయత్నించిరి. వారిలో రాజులు, మంత్రులు, కవులు, మతాచార్యులు కలరు. వారి అందరి యత్నములకు పరమ లక్ష్యము ఆంధ్రత్వమునకు సుస్వరూపము కలిగించుట భారతదేశమున నానా రాష్ట్రములలో నానాధర్మములు ప్రాధాన్యము వహించి, ఆయా జాతులకు ప్రత్యేకత ఆపాదించినవి స్థూలవిభాగమున వింధ్య కావల ఈవల నున్న దేశములకు అనగా ఉత్తర దక్షిణ దేశములకు స్వరూప వ్యత్యాసము చాల గలదు. ఈ భిన్న స్వరూపములకు సామరస్యము కలిగించుటకై ఈ రెండు భూభాగములకు నడుమ నున్న ఆంధ్రదేశమే సమర్థమైతీరును ఈ సామరస్యము ఆంధ్రదేశమున తక్క ఇంకొక యెడ కుదురుటకు వీలులేదు. ఇది ఆ మహాపురుషుల పరమలక్ష్యము.

వారి ఆశయములలో రెండవది ఐహిక ఆముష్మికజీవిత భావములకు సమ రసభావము కలిగించుట. అనగా జీవితము యొక్క సమగ్రఫలమును పొందుట ఐహికములైన యోగక్షేమములకు వీరసాహసకృత్యములు భోగానుభవములు అవశ్యము వాంఛనీయములు ఈ వాంఛాస్ఫూర్తి కేవలము విశృంఖల విహారము గాకుండుటకై

నడవడిని ధర్మబద్ధ మొనరింప వలయును అర్థకామములకు ధర్మము మూలమైనపుడే చతుర్థపురుషార్థ ఫలము లభించును గానీ, లేనిచో మూలబలము లేని వృక్షమువలె నిరర్ధకము అనగా పరమునే సేవించి ఐహికమును వదలుట కానీ, ఐహికముననే మునిగి పరమును మరచుటగానీ వారు ఊహింపజాలరు. దీనికి జీవితాద్వైతభావ మని పేరు ఈ అద్వైత భావమునే వారు మతముయెడ కూడా ఆశించిరి. ఇట్టి లక్ష్య మొకటి యున్ననేగాని అజాతి ప్రవాహములోని కాష్ఠము వలె కొట్టుకొని పోవునేమో యను భయము 12వ శతాబ్ది చరితమువలన వారికి కలిగెను. పూర్వ శతాబ్దిలో వీరశైవము వలన దేశములో కొంత అలజడి కల్గినది. అదే కాలమున పల్నాటి యుద్ధ మనెడి నిష్కారణ ప్రళయ మొకటి సంభవించినది. ఆ యుద్ధముదాయభాగ నైమిత్తికముగా పైకి తోచినను, దాని అంతరహేతువు మత సంబంధియే. బ్రహ్మనాయుడు వీరవైష్ణవుడు అతడును వీరశైవుల వలనే ఆర్షధర్మములను ముడిచివైచి సాంకర్యములను నెలకొల్పజూచెను. అతనితో ఢీకొన్న రెండవ పక్షమువారు పూర్వాచార పరాయణులు ఈ యుద్ధముపేర మూర్తీభవించిన తారుణ్యము అనదగు వీరకుమారు లెందరో మరణించిరి. మహాభారత యుద్ధానంతరము ఈ భారత ఖండము ఇంచుమించు నిక్షత్రియమైనట్లే ఈ కాలమునకూడా ఈ దేశము నిర్వీర్య మగు జాడలు పొడగట్టినవి దీనికి పూర్వ శతాబ్దిలో ఉత్తరదేశమును తురుష్కులు ఆక్రమింపజొచ్చిరి. వారిని ఈ దేశమున కాహ్వానించినది వారిచే రాజ్యస్థాపన చేయించినది అచ్చటి రాజులలోని అంతర్వైరమే ఆ ప్రళయము ముంచుకొనివచ్చి వింధ్యకు ఈవలి భాగముకూడ నాశనమొనర్చుజాడలు కానవచ్చునవి. అట్టిదానిని అరికట్టదలచినచో ఈ జాతి శక్తివంతమైన ఏకముఖావర్తనము కలిగి యుండవలెను. ఈ లక్ష్యసిద్ధికై ఈ శతాబ్ది యందలి ప్రముఖులు వీరశైవ, వీరవైష్ణవ గోత్రభేదములు తగ్గించిరి. దేశప్రజ అంతయు ఒక్క కుటుంబముగా ఉండి పరులు ఎత్తివచ్చునపుడు పొరుపులేని సమిష్టిభావనతో ఎదుర్కొనుటకు తగిన వీరప్రబోధము కావించిరి

ఈ యుగమందలి రచనలనుత్పాద్యములే కానీ కేవల ప్రతిభావ్యుత్పత్తి వికాసములకు అనువాదము లవకాశ మొసంగుట వలన స్వకపోలకల్పితముల వలె నున్నవి. 'మహిమున్ వాగనుశాసనుండు సృజియింపన్' గల్గిన 'బహుళాంధ్రోక్తిమయ ప్రపంచమునకు కుండ లీంద్రుడు తన్మహనీయస్థితి మూలమై నిలువ, సొంపు వాటిల్లినది ఈ యుగమున అలంకార, లక్షణ గ్రంథములు పుట్టినవి. కేతన యాంధ్రభాషాభూషణమును, విద్యా నాథుడు ప్రతాపరుద్రీయమును 'వ్రాసి ధన్యులైనారు'.

పురాణఖండములు, వచనకావ్యములు, ప్రాకృత నాటకములు – తెనుగున ప్రబం ధీకరింపబడుట యీ కాలముననే యారంభింపబడినవి. శతక కవిత్వము వర్ధిల్లినది. శైవకవిత్వములోనున్న పరమతాసహిష్ణుతయు, స్వమత మందు ముగ్ధాభిమానమును తగ్గినవి.

ఈ శతాబ్దిని పుట్టిన వాఙ్మయ మంతయు ప్రబోధార్థమే. ఇంతకుపూర్వము వాఙ్మయము ద్వారా బహిశ్శత్రువులను జయించుటకు ప్రయత్నములు జరిగినవి. ఇప్పుడంతశ్శత్రువులను జయించుటకు యత్నములు జరిగెను. తిక్కన తననాటి

యాంధ్ర జాతిని శాంతవీరులగు పాండవపంచకము వలె తీర్చిదిద్దెను కేతన దశకుమారచరిత్ర, వీర సాహసకృత్యములకు చోదనము. ఆతని విజ్ఞానేశ్వరీయము, బద్దెన నీతిసారముక్తావళి, అప్పనమంత్రి చారుచర్య వీర సాహసకృత్యములతో పాటు నడవడిని ధర్మబద్ధముగ సుందరముగ దిద్దుకొనుటకు చెప్పిన పాఠములు మంచెన శృంగారగాధలలో నీతికధలు జొన్పుట భోగానుభవము పేర నీతిని విడనాడకుండుటకే. ఈ విధముగా మతోపదేశమొక గ్రంధమున, నీతి ఇంకొకట, పౌరుషము వేరొకట ప్రకటింపబడినది. అది ఇది అనక సమస్త జీవిత మార్గమునకు అన్ని పురుషార్ధములకు ఏకత్వ సంపూర్ణ సిద్ధి తిక్కన భారతములో పొడసూపినది. అందు ఒకటి ఉండి ఒకటి లేకపోలేదు. అది అని, ఇది అని భిన్నభిన్నముగా ఉపదేశించుటకంటే భారతపురుషుల జీవితమే సమగ్ర ఆదర్శముగా ప్రకటించినచో సంపూర్ణలక్ష్యము సర్వోపదేశము కాగలదని ఆయన ఆంధ్రావళికై భారతరచనకు పూనుకొనెను. పైన పేర్కొనిన మహాపురుషులందరి యత్నముల యొక్క సిద్ధఫలము తిక్కనగారి భారతము ఈ భారతాదర్శము తద్రచనకు పూర్వము ఆయన ప్రజలకు ఉద్బోధించి తదనంతరము ఆ రచన పేర ఆ ఉపదేశమును స్థిరీకరించెను కావున 13వ శతాబ్దిని జరిగిన ఆంధ్రోద్యమఫలమే తిక్కన గారి భారతము ఆనాడు వారు నాటిన విత్తనమే తర్వాత వృక్షమైనది. అది శాఖోపశాఖలై విస్తరింపక పూర్వమే తురుష్కగజము దానిని పడగొట్టినది ఆధాటికి ఆ లేతచెట్టు నిలువలేకపోయినది ఆ చెట్టుకొమ్మనే ఆపై తరము వారు విద్యానగర క్షేత్రమున పాతి దుర్భేద్యమైన మహా వృక్షమును చేసిరి అదియే కృష్ణరాయని విశాల ఆంధ్రసామ్రాజ్యము

★ ★ ★

# ఎఱ్ఱన యుగము
# (1320-1400)

1323 వ సంవత్సరములో ఢిల్లీ సుల్తాను ఓరుగల్లు నగరమును స్వాధీనముచేసికొని ప్రతాపరుద్రుని బందీగా కొనిపోవుటచే కాకతీయ సామ్రాజ్యము అస్తంగతమయ్యెను. తత్పూర్వము కొలదికాలము క్రిందటనే అమహమ్మదీయరాజు ఓరుగల్లుపై దండెత్తివచ్చి ప్రతాపరుద్రుని చేతిలో ప్రాణమాత్రావశిష్టుడై పాఱిపోయెను. ఆ యుద్ధములో సామ్రాజ్య రక్షణార్థము శత్రుసంహారార్థము చక్రవర్తికి బాసటగా వచ్చి నిలచిన సామంతులందరు విజయోత్సాహముతో తమతమ మండలములకు సేనలతో తరలిపోయిరి. వారే కాకతీయ పరిపాలనలో నాయకులని పేరు పొందినవారు. అట్టివారు ప్రతాపరుద్రునకు విధేయులై డెబ్బది ఇద్దరుండెడివారట. వారి కందరికి ప్రత్యేక సేన లుండెడివట. యుద్ధ సమయముల ఆ సేనలతో వచ్చి వారు చక్రవర్తికి తోడ్పడుచుండుటయు, శత్రువిజయానంతరము తమతమ మండలములకుపోయి ప్రజాపాలనము సాగించుచుండుటయు ఆచారమై యుండెడిదట 1320 ప్రాంతమున ఢిల్లీసుల్తానును తరిమికొట్టిన పిమ్మట ఆనాయకులందరు ఆచారరీత్యా తమ తమ మండలములకు పోయి సామ్రాజ్యమున శత్రుభీతి తొలగినదనెడి పరవశముతో వ్యవసాయాభివృద్ధి, వాణిజ్యాభివృద్ధి మొదలగు ప్రజాక్షేమంకర కార్యక్రమములలో నిమగ్నులై యుండిరట. ఆ అదనుచూచుకొని ఢిల్లీసుల్తాను అకస్మాత్తుగా మరల నోరుగల్లుపై దండెత్తివచ్చి అసహాయుడైన ప్రతాపరుద్రుని బంధీకృతుని చేసెను. కాకతీయ సామ్రాజ్య పతనములో ఢిల్లీ సుల్తానుకు తోడ్పాటొసంగిన హైందవులు లేకపోలేదు కాకతీయ రాజ్యమున కాసన్నరాజ్యమైన యాదవరాజ్య మేలుచున్న దేవగిరి ప్రభువు మహమ్మదీయునకు వశుడై అతనికి నానావిధ సహాయములు చేసెనట కాకతీయరాజ్యములో తమకు పూర్వకాలమున నెగడచుండిన ప్రాభవము తగ్గుటచే జైనులు కూడ కొంత దేశద్రోహ చర్యకు పూనుకొనిరట. ఇందులో వింత ఏమియులేదు ఏనాడుగాని భారతదేశమునకు కలిగెడు కీడు బహిశ్శత్రువుల వలన కంటె అంతశ్శత్రువుల వలననే యనుట పరమసత్యము

ఓరుగల్లు నాక్రమించిన ఢిల్లీ సుల్తాను చిరకాల మా సింహాసనమును దక్కించుకొన లేకపోయెను ప్రతాపరుద్రుని సామంతనాయకులలో శౌర్య పరాక్రమములుగల ముసునూరి . ప్రోలయ, కాపయ అనెడి నాయక సోదరులు తక్కిన నాయకులతో మంత్రాలోచన చేసి పరాక్రాంతమైన దేశమునకు విమోచనము కల్గించుటకై వారి వారి సేనల నాయత్త పరచి ఓరుగల్లును స్వాధీనము చేసికొని సుల్తాను

పరిపాలనము నంతమొందించిరి. ఆ యుద్ధ విజయానంతరము సామ్రాజ్యము నంతను ఏకచ్ఛత్రముగా ఒకడే పరిపాలన చేయుట ఉచితమును, సాధ్యమును కాదని యెంచి కాబోలు ఏకకార్యార్థమై పూనుకొన్న నాయకులలో పెక్కురు అంధ్రదేశమును కొన్ని భాగములుగా పంచుకొని స్వతంత్ర పరిపాలనలు చేయదొడిగిరి ఆ విభజనలో కృష్ణానది ఉత్తర భాగమున ఓరుగల్లు రాజధానిగా మునుసూరి సోదరులు కొంతయు, రాచకొండ, దేవరకొండ రాజధానులుగా రేచెర్ల వెలమనాయకులు కొంతయు, కృష్ణకు దక్షిణమున రెడ్డి రాజులును పంచుకొనిరి తదుపరి పదియేండ్లకు హరిహరరాయలు అనెగొందిమండలమున విజయనగర రాజ్యము స్థాపించెను రెడ్డిరాజుల రాజ్యము కృష్ణా గోదావరీ నదుల మధ్య భాగముననే కాక, సింహాచలము వరకును వ్యాపించెను. కొంత కాలమునకు తిరిగి ఢిల్లీ సుల్తాను ఓరుగల్లు నాక్రమించుకొనుటకు రాగా అప్పుడు సింహాసన మధిష్ఠించి యున్న మునునూరి కాపయ నాయకుడు ఆ మహ్మదీయునితో సంధి కావించుకొని గోలుకొండను ధారపోసి త్నానోరుగల్లు ప్రాంతముతోనే తృప్తిపొందెను. కాని పొరుగున నున్న రాచకొండ వెలమరాజులు అతనితో పొందు పొసగి యుండలేకపోయిరి అప్పటికే బీజాపూరులో బహమనీ రాజ్యమును స్థాపించిన మహమ్మదీయరాజు వెలమరాజులను ప్రోత్సహించి కాపయనాయకునంతమొందించెను ఇది కాకతీయ రాజ్య పతనానంతరము ఆంధ్రదేశమున జరిగిన స్థూలచరిత్ర ఆనాడు వెలసిన స్వతంత్ర్య రాజ్యములలో ఎక్కువగా రాజకీయ ప్రభావము, సారస్వతప్రాభవము నెఱపినది రెడ్డి రాజ్యము ఆ రాజ్యమునకు ప్రథమమున అద్దంకి నగరము రాజధాని ఆ రాజ్య సంస్థాపకుడు ప్రోలయ వేమారెడ్డి, అతడు 1325 మొదలు 1353వ సంవత్సరము దాక ప్రజాక్షేమకరముగా శత్రుభయంకరముగా రాజ్యపాలన చేసెను ఆ రాజు ఆస్థాన కవియే ఎఱ్ఱాప్రెగ్గడ దేశ చరిత్రలో రెడ్డి యుగము ఆవిర్భవించినట్లే వాఙ్మయచరిత్రలో ఎఱ్ఱాప్రెగ్గడ యుగము ఆవిర్భవించెను

ఎఱ్ఱన, తిక్కన సోమయాజి నిర్యాణము జరుగుటకు సుమారు పది సంవత్సర ములకు పూర్వము (1280 ప్రాంతమున) జన్మించి 1360 వరకు ఇహలోక యాత్ర సాగించి యుండును ఆ సుదీర్ఘ జీవితకాలములో ముప్పదియేండ్ల వయస్సున్న గ్రంథ రచనా వ్యాసంగమునకు ఉపక్రమించి యుండును ఆ పదునాలుగవ శతాబ్దిలో చివరి భాగమున శ్రీనాథుడు జన్మించినను ఆ శతాబ్ది చివరి వరకు యుగకర్తృత్వము ఎఱ్ఱన పేరననే చెల్లదగియుండును

అసలు ఎఱ్ఱాప్రెగ్గడ పేరుమీద ప్రత్యేక మొక సారస్వత యుగమేల? అతనిని తిక్కన యుగంలో చేర్చరాదా? యని ప్రశ్నించెడివారు కొందరుందురు ఆ పద్ధతి సమంజసము కాదని నా యుద్దేశము తిక్కన తరువాత శకాధికార మొప్పుకొన దగిన పెద్దకవి యెవడును పుట్టియుండనిచో ఆయన యుగము మరియొక శతాబ్దివరకు పొడిగింప వచ్చునుగాని ఎఱ్ఱన, భాస్కరుడు, నాచన సోమన మొదలైన మేటి కవులవతరించిన ఆ శతాబ్దిని తిక్కన యుగములో చేర్చుట భావ్యముకాదు మఱి అంతమంది మేటి కవులు తలయెత్తిన ఆ యుగమునకు ఎఱ్ఱాప్రెగ్గడనే యేలకర్తను చేయవలె నందురేని నా సమాధాన మిది

తెలుగు సారస్వతమునకు కవిత్రయము వారు త్రిమూర్తుల వంటివారు. వారి తరువాతనే, ఇతర కవులు ఎంత మేటి కవులైనను పేర్కొనదగినవారు. ఆంధ్రభాషా ప్రపంచమునకు భారతము వలె ఆంధ్రకవి ప్రపంచమున కామువ్వురును గురుస్థానీయులు వారిలో ఒండొరులకు భారత కర్తలుగా కొంత తరతమబేధ భావమున్నను, పృథక్పరిశీలన చేసినప్పుడు ఎవరికి వారికే ప్రత్యేక ప్రాధాన్యము కలదు కావున పృథక్ప్రాధాన్యమును భారత కర్తృత్వ గౌరవమును కల కవిత్రయము వారి పేరుమీద మూడు ప్రత్యేక యుగములుండుట న్యాయమని నేననుకొంటిని ఆ శతాబ్దిలో భాస్కరుడు సోమన మొదలైనవారు మేటికవులే గాని ఎఱ్ఱనను త్రోసిపుచ్చి గురుపీఠ మెక్కదగినవారు కారు మరియు వాఙ్మయములో ఆఖ్యాన పద్ధతి, నాటకీయ పద్ధతి, వర్ణనాత్మక పద్ధతియనెడి మూడు విభాగములుండునని పూర్వ ప్రకరణములలో చెప్పితిని ఈ మూడింటిలో వర్ణనాత్మకపద్ధతిని ప్రవేశపెట్టిన వాడు ఎఱ్ఱాప్రెగ్గడ. దైవికముగా నన్నయ తిక్కనలు తక్కిన రెండు పద్ధతులకును ఆదిగురువులైనట్లుగా, ఎఱ్ఱన మూడవ పద్ధతి నవతరింపజేయుటచే భారతకర్తృత్వముననే కాక రచనా సంప్రదాయము నందును ఒక ప్రత్యేకతను సంపాదించుకొని స్వతంత్రస్థానమున కర్హుడయ్యెను మరియు తెలుగు భాషలో పలుకుబడి యందేమి, కారకమునందేమి, క్రియారూపములందేమి అధునికతా సూచకముగా కలిగిన మార్పులు ఎఱ్ఱన గ్రంథములలోనే ప్రారంభమయ్యెను. తత్పూర్వ గ్రంథములలో కానవచ్చెడి ప్రాతదనము ఎఱ్ఱనగ్రంథములలో కానరాదు, మఱియు నన్నయ శైలికి తిక్కన శైలికిని ఉన్న భేదమును తొలగించి, ఎఱ్ఱాప్రెగ్గడ శబ్దగతిలో నన్నయను, భావగతిలో తిక్కనను అనుసరించి, రెండు గతులకు సామరస్యము కుదిర్చి, తన పేరుమీదనే ఒక శైలిని నెలకొల్పెను దానినే ప్రథమదశలో శ్రీనాథుడును, తరువాత వేరొకదశలో ప్రబంధ కవులును అలవరచుకొని వర్ణనా ప్రాధాన్యముగల ప్రబంధ రచనలు చేయసాగిరి ఇతి వృత్తమును వర్ణనలచే అలంకరించెడి నూత్న పద్ధతికి సూత్రధారుడగుట చేతనే ఎఱ్ఱన ప్రబంధపరమేశ్వరుడయ్యెను ఇట్టి మహాకవిని యుగకర్తగా సంభావింపక పోవుట అధర్మమని నే ననుకొంటిని

ఎఱ్ఱన కృతులలో లభ్యములైనవి మూడు – హరివంశము, భారతారణ్య పర్వభాగము, లక్ష్మీనృసింహపురాణము నామమాత్రవశిష్టమైన రామాయణము నాల్గవది. ఇవికాక ఇంకేమి వ్రాసెనో తెలియదు ఈ నాలుగింటిలో రామాయణము మొదటి రచనమనియు, హరివంశము, భారతారణ్య పర్వభాగము, నృసింహ పురాణము క్రమముగా రామాయణము తరువాత ఒకదాని వెంట నొకటి రచింపబడెననియు నేననుకొందును.

హరివంశావ తారికయందు రామాయణ రచనా ప్రసంగము కలదు.

"నా తమ్ముండు ఘనుండు మల్లరధినీ నాథుండు నిన్నాతత
శ్రీతోడన్ సముపేతుఁ జేసి యెలమిం జేపట్టి మా కిచ్చుటన్
జేతోమోద మెలర్ప రామకథమున్ జెప్పించి యత్యుత్తమ
ఖ్యాతిం జెందితినింక నేను దనియన్ కావ్యామృతాస్వాదనన్".

ప్రోలయవేమారెడ్డి తమ్ముడైన మల్లారెడ్డి ఎఱ్ఱాప్రెగ్గడకు తొలుత పరిచితుడై ఆ కవీశ్వరుని తన అన్నగారికి ఎరిగించి ఆశ్రయ మిప్పింపగా, వేమారెడ్డి ఆయనచే

రామాయణము చెప్పించుకొని కృతిపతిత్వము వలన ఖ్యాతినొంది అంతతో తనివిచెందక హరివంశమును రచింపుమని అర్థించెనట. పై పద్యములోని తాత్పర్యమది.

మరి నృసింహ పురాణావతారిక యందు భారతారణ్య పర్వశేష రచనా ప్రసంగము కలదు.

"ఉన్నత సంస్కృతాంధ్ర చతురోక్తి పదంబులఁ గావ్యకర్తవై
యెన్నికమై ప్రబంధ పరమేశుఁ డనంగ నరణ్య పర్వ శే
షోన్నయ మంధ్రభాష సుజనోత్సవ మొప్పఁగ నిర్వహించి తా
నన్నయ భట్టు తిక్క కవినాథుల కెక్కిన భక్తి పెంపునన్".

ఎఱ్ఱన తాతగారైన ఎఱపోతసూరి (ఆయన పేరు ఎఱ్ఱన) మనుమని భావంబున నావిర్భవించి నృసింహపురాణము చేయమని ప్రోత్సహించెనట. పై పద్యమా సందర్భములోనిది. కావున హరివంశమునకు పూర్వరచన రామాయణ మనియు నృసింహ పురాణమునకు పూర్వరచన భారతమనియు తేలినది. అంతేకాని ఈ రెండు జంటలలో ఏది మొదటి జంట అనే ప్రశ్న ఈ గ్రంథములను బట్టి తేలదు. దీనికి ఊహ తప్ప వేరొక యాధారము లేదు. నా యూహ జెప్పెదను; ప్రాజ్ఞులాలోచింతురు గాక.

మొదటి జంట అనగా। రామాయణ హరివంశములు రెండును, నరాంకిత ములు. రెండవజంట భారతనృసింహపురాణములలో మొదటిది స్వార్థ నిరపేక్షమైన నిష్కామకర్మ.

రెండవది పారమార్థిక చింతతో చేసిన ఈశ్వరార్పణము (అహోబల లక్ష్మీనృసింహ స్వామి కంకితము). మానవ స్వభావమును బట్టి యాలోచించినచో రాజాశ్రయమును ధనార్జనమును ఆశించి రచించిన జంట మొదటిదనియు ఐహిక భోగచింతలేని పారమార్థిక దృష్టితో రచించినది రెండవ జంటయనియు విశదమగును అట్లుగాక భారత నృసింహ పురాణములే మొదటి జంటయైనచో గ్రంథకర్త ఆధ్యాత్మిక సాధనచే ఈశ్వరపద సన్నిధానము వరకును ప్రాకిపోయి అటనుండి పతితుడై రాజపదనిధానమున పడిన భాగ్యహీనుడనబడును. ఇట్టి అధమ వర్తనము కలవారును ఉందురు. కాని శంభుదాసుని వంటి ఆత్మవిజ్ఞానధనులకు అట్టి పతనము సంభవింపదు

మరి ఏ కారణముననైన నేమి తిక్కనకవి యంతటి మహాకవి వదలి పెట్టి పోయిన భారతారణ్యపర్వభాగమును ప్రాథమిక రచనగా చేపట్టుటకు ఆత్మజ్ఞుడైన యే కవియు సాహసింపడు. వస్తుమహత్త్వము నటుంచి చూచినను అరణ్య పర్వభాగమును కృతహస్తుడైన కవియు చేపట్టుటకు సందేహించుట సహజము. ఎట్లనగా నన్నయ అరణ్యపర్వ భాగమును వ్రాయుచు నడుమనే మృతి చెందెననెడి కవిలోక భయానకమైన వదంతి ఆనాడు కలదు. దానిని స్పృశించుట అశుభ మనెడు భీతికలదన్నమాట! తిక్కనగారు ఆ భాగమును ఏ ఉద్దేశముతో వదిలి పెట్టినను – తన ఉద్దేశము నాయన లోకులకు చెప్పి యుండడు – లోకము మాత్రము ఆ భాగమునకు గల అశుభత్వ శంకనే ఆయన కాపాడించి యుండును. శకునములను, స్వప్నములను, దీవనలను, శాపములను శుభాశుభ సూచకములుగా నమ్మెడి ఆకాలమున మంచికో చెడ్డకో అట్టి విశ్వాసము గల యింట జనించిన ఎఱ్ఱాప్రెగ్గడ కవిత్వము నేర్చితిని గదాయని

చేసేతల అరణ్య పర్వభాగమును మొదటి రచనగా స్వీకరించెనని యనుకొనుట అవివేకము మరియు ఒక వంక నన్నయ భారతము, ఇంకొక వంక తిక్కన భారతము రసతరంగములైన మహాసముద్రములవలె నుద్ఘోషించుచుండగా నడుమ నొక జలసంధిని త్రవ్వి రెండు సముద్రములను ఏకార్ణవముగా రూపొందించుటకు సిద్ధహస్తుడు కాక పూర్వము ఏ యువకుడు సాహసించును?

మరియు నృసింహపురాణ రచనా కాలము నాటికే ఎఱ్ఱాప్రెగ్గడ ప్రబంధ పరమేశ్వరుడని ప్రసిద్ధి కెక్కెను. ఆ బిరుదము అరణ్యపర్వ శిష్టభాగ రచన మాత్రమున వచ్చునది కాదు అంతకంటె స్వతంత్రమైన ఒకటి రెండు ఉద్గ్రంథ రచనలచే లభింప దగినది ఆ ఉద్గ్రంథములే రామాయణ హరివంశములు రచనా విధానమునుబట్టి చూచినను ఆ బిరుదమునకు అర్హత నిచ్చునవి ఆ రెండు గ్రంథములే అరణ్యపర్వము అంతకు చాలదు. కావున అరణ్యపర్వ నృసింహపురాణములే రెండవజంట

నృసింహ పురాణావతారికలో 'కతిపయాక్షర పరిగ్రహజనితంబైన నైసర్గిక చాపల్యంబు కతంబున'—

*"మించిన వేడ్క వీనులకు మిక్కటమై మధువృష్టి గ్రమ్మ రా*
*యంచలు కూయఁ గ్రౌంచమును నావలఁ గూయఁ గడంగు భంగిఁ బ్రౌ*
*ఢాంచిత శబ్దసారులు మహాకవులాద్యులు కావ్యశయ్యఁ గీ*
*లించిన కీర్తిసంగసుఖ లీలకు నేనును గాంక్షఁ జేసితిన్"*

అని కవి తన నిరహంకృతిని వినయసుందరముగా వ్యక్తముచేసి యుండుటచేత ఈ పురాణమే ఆయన తన పేరుమీద వెలయించిన ప్రథమ రచనయై యుండునని ఒక యుక్తిని చెప్పువారు కొందరు కలరు. ఈ యుక్తిలో సారము లేదు ఎట్లనగా ఆ అవతారికలోనే తన తాతగారైన ఎఱపోతసూరి తనను గుఱించి చేసిన ప్రశంసలో –

*కం॥ "గురు భజన పరాయణుఁడవు*
*సరస బహుపురాణ ధర్మశాస్త్ర కథా వి*
*స్తర వేదివి వినయోదయ*
*భరితుఁడ వతులాను భావభవ్యుఁడవు మహిన్.*

*కం॥ కావునఁ బ్రబంధ రచనా*
*ప్రావీణ్యము నీకు సహజ పరిణత సిద్ధం*
*బై వెలసిన యది యొక కృతి*
*గావింప జగద్ధితంబుగా నేఁ బనుతున్".*

అనెడి వాక్యములలో ఎఱ్ఱాప్రెగ్గడ తనకు గల నానాశాస్త్ర పరిజ్ఞానమును సహజ పరిణత సిద్ధమైన ప్రబంధ రచనా ప్రావీణ్యము ఉగ్గడించుకొన్నట్లే యగును కదా! అది నిరహంకృతి కాదుగదా! కావున కతిపయాక్షర పరిగ్రహ చాపలము అనేది అతనికి గల సహజ వినయ సంపదకు సూచకమే గాని ప్రాథమిక కావ్యరచనా సూచకము కాదు. అదియుమ గాక వినయ సంపద వయసుమీరిన వానికి ఉన్నంతగా వయసులో ఉన్నవాని కుండదు.

తిక్కనగారు నిర్వచనోత్తరరామాయణములో "అమలోదాత్తమనీష నేనుభయ కావ్య ప్రౌఢిఁ బాటించు శిల్పమునన్ బారగుఁడన్" అనియు, విరాట పర్వావతారికలో "నా నేర్చిన భంగిజెప్పి వరణీయుఁడ నయ్యెద భక్తకోటికిన్" అనియు వ్రాసికొనుటలో మొదటి దానియం దహంకారమును రెండవ దాని యందు వినయ గుణమును ప్రస్ఫుటమగుచున్నవి గాన ఈ రెండింటిలో విరాట పర్వమే మొదటి రచన యని వాదించుట మెచ్చదగి యుండునా? ఇంకొక విషయము, హరివంశమున పూర్వకవిస్తుతిగా ఎఱ్ఱన నన్నయకును, తిక్కనకును వేర వేర చెరియొక నమస్కార పద్యమును వ్రాసి స్తుతించెను. నృసింహ పురాణమున ఇరువురను ఒకే ఒక పద్యమున మాత్రము సన్నుతించి వదలెను.

ఈ క్రింద హరివంశ ప్రారంభమున సలిపిన నన్నయ తిక్కనల సంస్తుతి పద్యములను చూడుడు:

ఉ॥ ఉన్నత గోత్ర సంభవము నూర్జిత సత్త్వము భద్రజాతి సం
పన్నము నుద్ధతాన్య పరిభావిమదోత్కటము న్నరేంద్ర పూ
జోన్నయనోచితంబునయి యొప్పెడు నన్నయభట్ట కుంజరం
బెన్న నిరంకుశోక్తి గతి నెందును గ్రాలుట ప్రస్తుతించెదన్.

మ॥ తన కావించిన సృష్టి తక్కొడుల చేతంగాదునా నే ముఖం
బునదాఁ బల్కిన పల్కు లాగమములై పొల్పొందు నావాణి భ
ర్తను నీతండొకరుండనాఁజను మహత్త్వప్తిన్ గవిబ్రహ్మ నా
వినుతింతున్ గవి తిక్కయజ్వ నఖిలోర్వీ దేవతాభ్యర్చితున్

నృసింహ పురాణమున–

ఉ॥ భాసుర భారతార్థముల భంగులు నిక్కమెఱుంగ నేరమిన్
గాసట బీసటే చదివి గాధలు ద్రవ్వ తెనుంగు వారికిన్
వ్యాసముని ప్రణీత పరమార్థము తెల్లగఁ జేసినట్టి య
బ్జాసన కల్పులం దలఁతు నాద్యుల నన్నయ తిక్కనార్యులన్.

ఆ మహా కవులిరువురును విడివిడిగా ప్రత్యేక పద్యములలో నమస్కరింప వలెననెడి బుద్ధి ప్రాథమికునకే పొడమును ఆ పై అతడింకొక కావ్యము వ్రాయునపుడు ప్రత్యేక పూజ పూర్వము జరిగినదిగదా యనెడి నిబ్బరమున వారిరువురను ఒకే పద్యముతో నారాధింపవచ్చును ఇంకొక విషయము అరణ్యపర్వాంతమున గద్య స్థానీయమైన పద్యములో "భవ్యచరిత్రుఁ డాపస్తంబ సూత్రుండు" గుడ్లూరు నెలవుగ గుణగరిష్ఠత నొప్పు ధన్యుఁడు... ఎఱ్ఱనార్యుండు సకల లోకైక విదితుఁడయిన నన్నయభట్ట మహాకవీంద్రు సరససారస్వతాంశ ప్రశస్తి తన్ను జెందుటయు సాధుజనహర్ష సిద్ధిగోరి ధీరవిచారుఁడు తత్కవితారీతియు గొంతతోప దద్రచనయకానారణ్య పర్వశేషము పూరించెఁ గవీంద్ర కర్ణపుట పేయముగాన్" అని ఉండుటంబట్టి అద్దంకిలో ప్రోలయ వేమారెడ్డి యాస్థానమును చేరకముందు స్వగ్రామమైన గుడ్లూరులో నున్నపుడు రచించినది భారతమనియు అదే హరివంశము కంటే పూర్వ రచనయని ఇంకొక యుక్తి చెప్పుదురు. ఇదియు బలహీనమైన యుక్తియే. ఎఱ్ఱన వేమారెడ్డికి ఆశ్రితుడైనను

సకుటుంబముగా గుడ్లూరు వదిలిపెట్టి అద్దంకిలో నివాసమేర్పరచు కొనెనని చెప్పెడి చరిత్ర ఏదియు లేదు. వేమారెడ్డి కృతులిచ్చిన మాత్రమున ఆ రాజధానిలోనే కాపురముండ వలసిన అవశ్యకతయు నాతని కుండదు. అదీగాక, ఒకవేళ రాజాశ్రయ కారణమున అద్దంకిలో ఉండినను స్వగ్రామమైన గుడ్లూరును పేర్కొనుట వింతగాదు ఉద్యోగరీత్యా ఏ ప్రదేశమున నెంతకాలమున్నను తమ ఊరిపేరు చెప్పవలసి వచ్చినపుడు చిన్ననాటి స్వగ్రామమును పేర్కొనుట అభిజనాభిమానము గల వారందరకు సహజము.

ఇంకొక విషయము. హరివంశము భారతమునకు పరిశిష్ట భాగము. ఈ పురాణములో గల హరివంశ పర్వము భవిష్య పర్వము అనెడు పేరుగల రెండు పర్వములతో కలిసియే భారతము శతపర్వ సంయుతమగును. ఈ విషయమును పర్వసంగ్రహ ప్రకరణమున నన్నయభట్టే చెప్పెను. తిక్కన విరచితమగు భారతము ఆ నూరింటిలో 98 పర్వములలో ముగియును. ఎఱ్ఱన, భారత గోపురమునకు శిఖర ప్రాయమైన ఆ రెండు పర్వములను రచించి పూర్తిచేసిన పిమ్మటనే నడుమ అరణ్య పర్వములో మిగిలిపోయిన భాగమును చేపట్టి యుండును. హరివంశ రచనతో ఆయనకు మహాభారత క్షేత్ర ప్రవేశార్హత కలిగినదనెడి ధైర్య విశ్వాసములు కలిగి యుండును.

రామాయణము లభింపలేదు గనుక తక్కిన గ్రంథముల సంగతి తలపెట్టక, తక్కిన గ్రంథములను పరిశీలక బుద్ధితో చదివినచో హరివంశపు శైలి కంటె భారత శైలియు, దానికంటె నృసింహ పురాణశైలియు మేల్తరముగా నుండుననుట సత్యదూరము కాదు. అంతేగాక వాఙ్మానస వ్యాపారములు కవికి పరిపక్వమైన దశలో వ్రాసిన కావ్యము నృసింహ పురాణమని అందలి యే పద్యమైనను దృష్టాంతమగును. కావున రామాయణ హరివంశములు రచించిన పిమ్మటనే శంభుదాసుడు భారత నృసింహపురాణములను రచించి చరితార్థుడయ్యెనని నా తలంపు.

## రామాయణము

గణపవరపు వేంకటకవి తన ప్రయోగరత్నాకరములో "ఎఱ్ఱాప్రెగ్గడ సంక్షేప రామాయణము నుండి" అని ఈ క్రింది పద్యము నుదాహరించెను.

**ఉ॥** "ఆ దశరథ సూనుండు ప
యోధి జలంబింకఁజేసి యొక శరమునఁ గ్ర
వ్యాదవిభుఁ దునిమి సీతను
మోదంబునఁజేకొని కపిపుంగవుతోడన్"

దీనిని బట్టి ఎఱ్ఱన సంపూర్ణ రామాయణముగాక ఏవో కొన్ని పద్యములలో ఆ కథను సంక్షేపరామాయణమని పేరిడెనేమోయని అనుమానము కల్గును. కాని అది అట్టిదేయైనచో హరివంశమున ఆ రచనను కవి అంత గొప్పగా పేర్కొనుటగాని ప్రోలయ వేమారెడ్డి దానికి కృతిపతియై అత్యుత్తమ ఖ్యాతి జెందితినని మురియుట కావి పొసగదు.

కావున అది సంక్షేప రామాయణముకాదు. ఎఱ్ఱన వంశీయుడైన చదలవాడ మల్లయ్యకవి తన విప్రనారాయణచరిత్రమున తన వంశ కర్తయైన ఎఱ్ఱనను ప్రశంసించుచు "వల్మీకభవువచో వైఖరి రామాయణంబు నాంధ్ర ప్రబంధంబు చేసె" అని కొనియాడెను. దీనినిబట్టి ఎఱ్ఱన వ్రాసినది వాల్మీకిని అనుసరించిన సంపూర్ణ రామాయణమే గాని సంక్షేప రామాయణము కాదని ఋజువగును.

ఇంత మాత్రమే కాదు – కూచిమంచి తిమ్మకవి తన సర్వలక్షణసార సంగ్రహములో ఎఱ్ఱాప్రగడ రామాయణములోనివని ఏడెనిమిది పద్యము లుదాహరించెను. ఆ పద్యములు కథలో ప్రత్యేకము ఏదో ఒక ప్రకరణమునకు సంబంధించినవి కాక వికీర్ణములై యున్నవి. వాటి అర్థమును పరిశీలించి ఏ పద్యము రామాయణ కథలో ఏ ప్రకరణమున వ్రాయబడి యుండునో ఊహించి విమర్శకులు వాటిలో కొన్ని బాలకాండలోనివిగా నిర్ణయించిరి. ఆ పద్యములివి.

*"సందడి యధ్వర క్రియ కసంగతమేని బలంబుతోడ బెన్*
*గ్రందదియేల యేన తగ గార్ముకహస్తుఁడనై కడంగి మీ*
*ముందర నిల్చిదన్ గ్రతువు ముట్టకయుండ ఁబ్రచండదైత్యరా*
*జిందగ దవ్వుదోల వె సఁజించెదఁ బెంచెద మీకు మోదమున్".*

ఇది దశరథుడు విశ్వామిత్రునితో యాగ సంరక్షణార్థము తానే వత్తునని విన్నవించునదిగా తోచుచున్నది.

*"తాఱం గ్రాగిన నేల తంపలఱఁ బాతాళంబుదాఁకన్ జనం*
*దూఱం జల్మిరి మున్నుదాకి తరగల్ తోరంబులై నల్గడల్*
*పాఱం బెల్లుగ నేఱు లుబ్బురముగాఁబై పైన నీరెక్కుదై*
*వాఱన్ జెర్వులు చెన్నుమీరె నఖిల ప్రాణుల్ ముదంబందఁగాన్".*

ఇది గంగావతరణ సందర్భముననో లేదా ఋష్యశృంగుడు అంగరాజ్యము ప్రవేశించి నప్పటి వర్షాగమ సందర్భముననో వ్రాయబడి యుండును.

*క॥ నూఱు చెఱుంగుల నెఱసులు*
*మీఱగ నీవిభ్రమములు మెఱయించి మునిం*
*గాఱఁగఁ జేయుము మేనక*
*చూఱకొనదె యతని తెలివి సొమ్ములు మున్నున్".*

ఇది విశ్వామిత్ర తపోభంగ మొనర్చుట కింద్రుడు రంభను పంపునప్పటిదై యుండును.

*"చెఱకుం దోఁటలఁబెంచి శాలిమయసుక్షేత్రస్థలుల్నించి య*
*క్కఱలేకుండఁగఁ బూగనాగలతికా కాంతారము ల్పెంచియే*
*డ్తెఱ నంతం గుముదోత్పలాళి వనవాటీకోటిఁ బాటించి పె*
*న్తెఱువుల్ వొల్చెఁబురంబు నల్దెసలఁ బ్రస్ఫీ తాంబుపూర్ణస్థితిన్."*

ఈ పద్యము బాలకాండలో అయోధ్యాపుర వర్ణనమునందలిది కావచ్చును.

ఇవిగాక ప్రాచ్య లిఖిత పుస్తక భాండారమునందు ఒక తాళపత్ర సంపుటము నందలి ప్రకీర్ణ పద్యములలో రామాయణ కథకు సంబంధించిన ముప్పది పద్యము

లొక్కచోటనే వరుసగా నున్నవట. అవి భాస్కర రామాయణాది రామాయణ గ్రంథములలో కానరాక పోవుటచే ఎఱ్ఱాప్రెగ్గడ రామాయణములోనివి కాదగునని పరిశీలకు లూహించిరి. ఆ పద్యములలో పెక్కు యుద్ధకాండమునకు సంబంధించినవి. సుందరకాండములోనివి కొన్నియు ఇతర కాండలలోనివి కొన్ని కలవు.

వాటిలో ఈ క్రింది పద్యము హనుమంతుడు సీతతో సంభాషించునప్పటిదిగా నెంచవచ్చును.

*"ఖలునిఁ గబంధునిన్ నిశిత కాండములన్ దునుమాడి వాని ప*
*ల్కులు విని ఋష్యమూకమునకున్ జని భానుజుఁగూడి వాలి ను*
*జ్జ్వలబలుఁ గూల్చి యర్కసుతు వానర రాజ్యమునందునుంచి య*
*య్యలఘుఁడు పంపె భూమి తనయన్ వెదకన్ గపివీర కోటులన్".*

తక్కిన యుద్ధకాండమున విభీషణ శరణాగతి మొదలుకొని శ్రీరాముని అయోధ్యా పునః ప్రవేశము వరకుగల కథకు సంబంధించినవిగా నూహింపవచ్చును. అందులో విభీషణుడు శ్రీరాముని దర్శించుటను గూర్చిన పద్య మొకటియు, సీత అగ్ని ప్రవేశముచేయు సందర్భమునందలి పద్య మొకటియు, శ్రీరాముని అయోధ్యా ప్రవేశమునందలి పద్యములు రెండును ఉదాహరించుచున్నాను

*"అనిలజ రావణానుజులు హస్తములన్ గయిదండ గొంచుఁ గ్ర*
*క్కున ఁజనుదెంచి భానుజుఁడు గొల్వ సుఖంబుననున్న రామచం*
*ద్రునిగని పాదముల్ శిరముతో నొఱయ న్ప్రణమిల్లి లేచి ని*
*ల్చినయెడ నెమ్మొగమ్ము వికసిల్లి విభీషణుడుం బ్రియంబునన్"*

*సవితృఁడు చంద్రుఁడు న్దిశలు సంధ్యలు రేలుఁబగళ్ళుఁగాలమున్*
*భువియును నాదిగా సకలము న్ననుసాక్షులు వీరెఱుంగఁ నేఁ*
*బ్రవిమల సద్గుణోత్తర ధురాపరిభూషిత నైతినేని హా*
*వ్యవహుఁడు నన్ను నిప్పుడు దయాయత చిత్తతఁ బ్రోచుగావుతన్.*

*నిరుపమమూర్తి రామధరణీపతి శోభనవేళ నాడి ర*
*చ్చరపువుఁబోండ్లు కిన్నరులు సారెకుఁ బాడిరి దేవదుందుభుల్*
*మొరసెను ధాత్రి సస్యములు మోహనలీల వహించె వృక్షముల్*
*వరసురభి ప్రసూన ఫలవర్గముల న్విలసిల్లె నెంతయున్.*

*అని కొనియాడుచు న్దలరుపోక్షులు సేసలు మీఁదఁజల్లఁగా*
*ననఘ చరిత్ర! రామ! సుగుణాకర! వర్ధిల్లుమంచుఁ బౌరు లె*
*ల్లను దనచుట్టుఁ గొల్వఁగ నలంకృతమైన రథంబుపై ముదం*
*బున భరతాగ్రజుండు రఘుపుంగవుఁ డేగతి వైభవంబులన్.*

నానా ప్రదేశముల నానా విధముల ఈ విధముగ వికీర్ణములై యున్న ఎఱ్ఱాప్రెగ్గడ రామాయణపద్యము లన్నింటిని కలిపి చూచినచో అయన బాలకాండము మొదలు యుద్ధకాండాంతము వరకు గల పూర్వరామాయణమునంతను రచించిననియే ధృవపడుచున్నది. మరి గణపవరపు వేంకటకవి పేర్కొన్న సంక్షిప్తరామాయణ

విషయము సంగతియేమి? వాల్మీకి రామాయణమున కథా ప్రారంభమునకు ముందు నారదుడు వాల్మీకి ఋషికి రామాయణకథ నంతను సంగ్రహముగ జెప్పెను. ఆ నారదోపదేశమే బాల రామాయణమను పేర కొన్ని శ్లోకములలో వ్రాయబడి యున్నది. ఎఱ్ఱాప్రెగ్గడ ఆ భాగమును కూడ రచింప వలసినవాడే గనుక దానిని సంక్షేప రామాయణమను పేర వ్రాసెనేమో! కాని, గణపవరపు వేంకట కవి పద్యమా సంక్షేప రామాయణ పద్యములలో ఇముడ దగినట్లు పొడగట్టదు. అప్పట్ల ఎవరో రచించిన పద్యము నా వేంకటకవి ఎఱ్ఱన కాపాదించి యుండునని భావింపవలెను. లక్షణ కర్తల కది పరిపాటియే!

ఈ రామాయణము ఆ యుగముననే బయలుదేరిన భాస్కర రామాయణ ప్రౌఢితో దీటుకొనలేక అస్తమించిపోయి యుండునని కొందరు తలంతురు. అది అస్తమించి పోయినమాట నిజమే కాని భాస్కర రామాయణము ముందు నిలువ లేక తొలగిపోవుట మాత్రము కల్ల. భాస్కర రామాయణకర్తలలో భాస్కరుడొక్కడే కవిత్రయము వారి సరసన నిలువ దగినవాడు. అదియైనను ఎఱ్ఱన తరువాత చెప్పదగిన వాడే కాని అతనికంటె శ్రేష్ఠుడుగా చెప్పదగినవాడు కాడు. మరి ఆ రామాయణ కర్తలలో తక్కిన ముచ్చురు మహాకవి శ్రేణిలో చేరదగిన వారే కాదు కావుననే ఆ గ్రంథశైలి ఆద్యంతము ప్రౌఢముగా నుండక ఉత్తమ మధ్యమాధమగుణ సంయుతముగా కానబడును.

ఎఱ్ఱాప్రెగ్గడ రామాయణము లభించిన కతిపయ పద్యములబట్టి చూచినను భాస్కర రామాయణము కంటె మేల్తరమైన రచన యని నిస్సంశయముగా చెప్పవచ్చును అది యట్లుండ, భాస్కరాదులు రంగనాథ రామాయణమును అనుకరించెడి తలంపుతో అమూలకములైన కథాంశములను బుద్ధారెడ్డివలెనే తాము గ్రంథమున ప్రవేశపెట్టిరి. ఎఱ్ఱాప్రెగ్గడ –

"వల్మీకభవు వచో వైఖరి రామాయ
ణంబు నాంధ్ర ప్రబంధంబు చేసె"

అని చదలువాడ మల్లయ్య చెప్పి యుండుటబట్టి ఆ రామాయణము యథావాల్మీకమై యుండును. అందు ప్రజానురంజనార్థమై మూల విరుద్ధములైన వృత్తాంతములు చేరియుండవు. అట్టి మూలానుసరణము సరసుల మది కెక్కినను సామాన్య ప్రజలను మెప్పించెడి వింతలు, విశేషములు లేకపోవుటబట్టి భాస్కర రామాయణమువలె లోకమున ప్రచురమై యుండదు.

ఇది యిట్లుండగా ఈ నాలుగు గ్రంథములలో ఎఱ్ఱన అరణ్యపర్వ శేషమును రచింపనేలేదనియు, నన్నయ మూడు పర్వములు సంపూర్ణముగా రచింపగా మూడవ పర్వమునందు సగము భాగమునుండి శిథిలములై పోయిన పద్యములను పదములను పూరించెననియు, కావున ఆయన చేసినది శిథిలభాగ పూరణమే కాని శేషభాగ రచన కాదనియు కొంతకాలము క్రిందట ఒక వాదము బయలుదేరెను. దానిని గురించిన వాదోపవాదములు పెక్కు జరిగినవి. తుదకావింత వాదము పరాస్తమయ్యెను. దాని నిపుడు స్మరించువారును లేరు అయినను దాని స్వరూపమును స్థూలముగా కొంత వివరించెను.

ఆ నూతన సిద్ధాంతమును ప్రతిపాదించినవారి యుక్తులివి:

1. తిక్కనార్యుడు "మూడు కృతులాంధ్ర కవిత్వ విశారదుండు విద్యాదయితుండొనర్చె మహితాత్ముఁడు నన్నయభట్టు దక్షతన్" అని విరాట పర్వాది యందు చెప్పుటయు తదనుగుణముగా నాల్గవదియైన విరాటపర్వము నుండియే ఆయన తెనిగించుటయు నన్నయ సమగ్రముగా అరణ్య పర్వము రచించె ననుటకు ప్రబల నిదర్శనములు.

2. "ఇక్కడనుండి ఎఱ్ఱాప్రెగ్గడ కవిత్వము" అని అరణ్యపర్వమున నన్నయ ఎఱ్ఱనల కవితారాజ్యములకు సరిహద్దుగా కానవచ్చెడి శీర్షిక కొన్ని వ్రాత ప్రతులలో లేదు. అది ప్రక్షిప్తమయి యుండును. అట్లే పర్వాంతమున.

"గుర్విణ్ణారు నెలవుగ గుణ గరిష్ఠత నొప్పు
ధన్యుఁడుఁ ధర్మైక తత్పరాత్ముఁ
డెఱ్ఱనార్యుండు సకల లోకైక విదితుఁ
డయిన నన్నయభట్ట మహా కవీంద్రు
సరస సారస్వతాంశ ప్రశస్తి దన్ను
జెందుటయు సాధుజన హార్దసిద్ధిగోరి
ధీర విచారుఁడు తత్కవి
తారీతియుఁ గొంత దోఁపఁ దద్రచనయ కా
నారణ్య పర్వశేషము
పూరించెఁ గవీంద్ర కర్ణపుట పేయముగాన్".

అనెడి పద్యములు కూడ కొన్ని వ్రాత ప్రతులలో లేవు. ఇదియు ప్రక్షిప్తభాగము అయి యుండును.

3. ఎఱ్ఱన రచితమని చెప్పబడు అరణ్యపర్వ శేష భాగమునందలి అనేక పద్యములు నన్నయ రచితములైన పూర్వభాగ పద్యములను పోలియుండుటయే గాక అందలి పదములకు పదములే అనేకములు ఇందు కానవచ్చు చుండును. ఇంతేగాక ఆ రెండు భాగముల యందలి శైలికిని భేదమేమియు కానరాదు.

4. ఎఱ్ఱన తన హరివంశాదుల యందెచ్చటను మధ్యాక్కర పద్యమును వ్రాయలేదు. భారతమున ఒక్క నన్నయ రచిత పద్యములందు మాత్రమే అట్టి రచనలు కలవు. అరణ్య పర్వము ఉత్తర భాగమున ఆ మధ్యాక్కరలు కాననగుచున్నవి. వాటి ఉనికియే ఆ భాగము నన్నయ రచించె ననుటకు ప్రబల సాక్ష్యము

5. ఎఱ్ఱనకు సన్నిహిత కాలము' వాడైన శ్రీనాథుడు భీమ ఖండమున నన్నయ తిక్కనలను—

"నెట్టుకొని కొలుతు నన్నయ
భట్టోపాధ్యాయ సార్వభౌముని గవితా
పట్టాభిషిక్తు భారత
ఘట్టోల్లంఘన పటిష్ఠ గాఢ ప్రతిభున్".

పంచమ వేదమై పరఁగు భారత సంహిత నాంధ్రభాషఁ గా
వించెఁ బదేను పర్వములు విశ్వజగద్ధితబుద్ధి నెవ్వఁడ
క్కాంచన గర్భతుల్యున కఖండిత భక్తి నమస్కరింతు ని
ర్వంచిత కీర్తివైభవ విరాజికిఁ దిక్కన సోమయాజికిన్".

అని భారత కర్తలుగా ప్రస్తుతించి ఆ వరుసలో ఎఱ్ఱాప్రెగ్గడ పేరైనను తడవలేదు.

పైని పేర్కొన్న అయుక్తులు ఈ క్రింది విధమున వరుసగా పూర్వ పక్షము చేయబడినవి:

1. నన్నయభట్టు మూడు పర్వములు పూర్తిగా రచింపలేదనియు, తిక్కన అరణ్యపర్వ శేషమును వదలిపెట్టుట కృతపతిత్వ శంకచేత ననియు తిక్కన ప్రకరణమున 'గ్రంథారంభము' అను శీర్షిక క్రింద జెప్పితిని. వివరములందు జూడదగును.

2. "ఇక్కడనుండి ఎఱ్ఱాప్రెగ్గడ కవిత్వము" అన్న శీర్షిక మొదట ఆ సత్యము నెఱిగినవాడే వ్రాసి యుండవలయును గాని మధ్యకాలమున కల్పితమైనది కాదు 'ఇక్కడనుండి'యని నిష్కర్షగా సరిహద్దు నేర్పఱచుట సత్యము నెఱిగిన వానికిగాని సాధ్యపడదు. మరొకడైనచో, ఏదో ఒక కథాంతముననో, ఏదో ఒక ఘట్టము తుదినో ఆ వాక్యమున చొప్పించి యుండును అట్లే పర్వాంతమునందలి పద్యములు ప్రక్షిప్తములనుట సమంజసము గాదు ఆ పద్యములు ఎఱ్ఱన కృతములే యని శైలియే చెప్పుచున్నది. స్వార్థ రహితముగా నన్నయ పేరుమీదనే గ్రంథమును సాగించి ఆశ్వాసాంతగద్యములు భట్టారకుని పేరనే రచించి స్వకీయనామ పరిమార్జనము చేసికొన్న ఎఱ్ఱాప్రెగ్గడ గ్రంథము ముగియు వేళకు ఈషద్యశోలబ్ధుడై యుండవచ్చును. ఇది కవిలోక సహజమైన హృదయ దౌర్బల్యము ఆ శీర్షికవలెనే ఈ పద్యములును కొన్ని వ్రాత ప్రతులలో లేకపోవుటకు కారణము – అవి కథాభాగమునకు సంబంధించినవి కావు గనుక, ప్రతులు వ్రాసికొను వ్రాయసకాండ్రు వానిని వదలి యుండవచ్చును. కొన్ని ప్రతులలో లేకపోవుట ఒక పక్షము వారికి ఎంత బలమైన ఉపపత్తియో, కొన్ని ప్రతులలో ఉండుట రెండవ పక్షము వారికి అంతకంటె బలవత్తరమైన యుపపత్తి.

3 నన్నయ శైలికిని ఆరణ్యపర్వ శేషభాగ శైలికిని పోలికలు కలవని వాద సౌకర్యార్థము అంగీకరింతము. ఎఱ్ఱాప్రెగ్గడ పట్టుబట్టి బుద్ధిపూర్వకముగా, ఆ భాగము నన్నయ రచితముగా ఉండవలెనని అయనను అనుకరించుటచే శైలిలో ఆ పోలికలు తటస్థించుట తప్పదు. అదిగాక ఆ అనుకరణము శబ్ద సంబంధియేగాని భావ సంబంధికాదు. శైలియను పదము శబ్దగతికే గాక భావగతికిని వర్తించును. ఎఱ్ఱాప్రెగ్గడ శబ్దగతిలో నన్నయను భావగతిలో తిక్కనను అనుసరించిన శిష్యుడు. కావున అరణ్య పర్వమందలి రెండు భాగములకును గల పోలిక పదముల కూర్పులో మాత్రమే. భావగతిలో ఆ రెండింటికిని సంబంధములేదు.

4. ఈ వాదములో మధ్యాక్కరల ప్రసంగము తెచ్చుట ఆ పక్షము వారు ఆత్మహానిని చేసికొనుట. ఎట్లనగా మధ్యాక్కరలలో నాలుగు గణములపై విశ్రమముండును అరణ్యపర్వ శేషమందలి మధ్యాక్కరలలో మూడు గణములపై నుండును.

(i) అతిథియై వచ్చిన బ్రాహ్మణునన్ జీవితార్థినై నాకు (నన్నయ ఆదిపర్వము)
(ii) అసదృశ తేజఁడు బ్రాహ్మణానీక సహితుఁడై కడఁగి (ఎఱ్ఱన అరణ్యపర్వము)

ఈ మధ్యాక్కర యతిస్థానమే ఆ భాగము ఎఱ్ఱన రచితమని కలకాలము సూచించెడి జయస్తంభము. మఱియు తన ఇతర గ్రంథములలో మధ్యాక్కరలను వ్రాయని ఎఱ్ఱాప్రెగ్గడ ఈ భాగమున వ్రాయుటకు కారణము "తద్రచనయకా" పొడ కట్టుటకు; మరి యతిస్థానమును మార్చుట "తత్కవితా రీతియుఁగొంత దోఁప" అను వాక్యమును సార్థక పఱచుట. ఈ రెండు వాక్యములలో మొదటి దానిలోని తచ్ఛబ్దమునకు నన్నయ యనియు రెండవ దానిలోని తచ్ఛబ్దమునకు ఎఱ్ఱన యనియు నర్థము.

5. భీమ ఖండమున శ్రీనాధుడు ఎఱ్ఱనను భారత కర్తగా స్తుతింపక పోవుటయేగాక కవిమాత్రునిగా నైనను ఆయన పేరు తడవలేదు. అందుచే ఎఱ్ఱన కవిత్వము నెడనే శ్రీనాధునకు గౌరవము లేదని అనగలమా? అది యట్లుండ నిండు. భీమ ఖండమునకు పూర్వ రచనయైన నైషధమునందును అపర రచనయైన కాశీఖండమునందును శ్రీనాధుడు ఎఱ్ఱనను తిక్కన భారతకర్త లిరువురితో గలిపి 'కవిత్రయము' అను నర్థము స్ఫురించునట్లు స్తుతించెను. ఎఱ్ఱనను కవిత్రయములో ఒకనిగా భావించియే ఆ మువ్వురను ఒక పద్యములో శ్రీనాధుడు పేర్కొనెను. ఆ పద్యములివి.

"ధీరమతి నన్నపార్యునిఁ దిక్కయజ్వ
శంభుదాసునిఁ గరిమర్థి సన్నుతించి" — నైషధము.

"శబ్దశాసను నన్నపాచార్యుఁ దలఁచి
సత్కవి శ్రేష్ఠుఁదిక్కయజ్వను భజించి
సత్ప్రబంధ మహేశ్వరు శంభుదాసు
నధిక సద్భక్తి సంయుక్తి నాదరించి" — కాశీఖండము

పై పద్యములు భారత కర్తలైన కవిత్రయము వారికి శ్రీనాధుడు యోగపద్యస్మరణముతో సమర్పించిన పద్యోపహారము

ఇంతతో తృప్తి గొల్పదేని ఇంకొక సాక్ష్యము చూడుడు:

శ్రీనాధునకు సమకాలికుడైన జక్కన, తన విక్రమార్క చరిత్రములో ప్రబంధ పరమేశ్వరుడు అరణ్యపర్వ శేషకర్తయని స్పష్టముగా చెప్పెను. ఆ పద్యమిది·

"ఈ త్రయిదాఁ ప్రబంధ పరమేశ్వరుడై విరచించె శబ్దవై
చిత్రి నరణ్య పర్వమున శేషము శ్రీ నరసింహ రామ చా
రిత్రములున్ బుధవ్రత గరిష్ఠత నెఱ్ఱయ శంభుదాసుఁడా
చిత్ర కవిత్వ వాగ్విభవ జృంభితుఁ గొల్చెద భక్తియుక్తితోన్"

— విక్రమార్క చరిత్ర 1-14

అసలు అరణ్య పర్వ భాగము ఎప్పుడు శిధిలమై యుండును? ఆ పర్వమును నన్నయయే పూర్తిగా రచించి యుండిన యెడల తిక్కన కది లభ్యమై యుండును గదా! ఆ పై ఎఱ్ఱన తలయెత్తి కవితారంగమున కవతరించు వరకు గల ఆ కొలది కాలములో అది శిధిలమై పోవుట తటస్థించునా? అసమగ్రముగా ఉన్న దినములలో

ఆంధ్రుల ఉదాసీనతవలన ఆ భాగము నశించిన నశింపవచ్చునేమోగాని, తిక్కన భారతమును పూర్తిచేసి ఆంధ్రుల సారస్వత సర్వస్వముగా దానిని ప్రతిష్ఠించి పోయిన తరువాత అందులో ఏ భాగము నశించి పోవుటకు వీలులేదు లోకములో ఎక్కడైనను పోవచ్చునేమోగాని తిక్కనయింట మారన వంటి శిష్యులున్న గురుకులమున ఒక్క పద్యమైనను ఉత్పన్నమగుటకు వీలులేదు. అదిగాక దేశమున నలుమూలల నున్న అన్ని ప్రతులలోను ఒకే భాగమునందు కొన్ని పద్యములు, కొన్ని పద్యభాగములు, కొన్ని వాక్యములు, కొన్ని అక్షరములు సమముగా ఒకేమారు శిధిల మగుటయు తక్కినవి అన్ని ప్రతులలో సమముగా మిగిలి యుండుటయు ఎట్లు తటస్థించును?

మరొక్క విషయము:

స్వభావముచేత ఎఱ్ఱనది వర్ణనాత్మకమైన కవిత్వమనియు, వర్ణన లనగా ప్రకృతి వర్ణనలేకాక రూప వర్ణనలును, భావ/వర్ణనలును వర్ణనా జాతికి చెందినవే యనియు ఇంతకుముందు తిక్కన ప్రకరణమున చెప్పితిని. వర్ణనాత్మకమైన రచనలో చిన్న కథాంశమైనను పాత్రల వివిధ భావ చాలన వ్యక్తీకరణమువలన విపులమగును. ఆ భావ వ్యక్తీకరణము పాత్ర చిత్రణమునకును, రసపరిపాలనమునకు హేతువగును ఎఱ్ఱన అరణ్య పర్వములో వ్రాసిన కర్ణ జనన వృత్తాంతము ఈ సిద్ధాంతమునకు ఒక నిదర్శనము. అయ్యెడ కుంతీకన్య లోకాపవాద, పుత్రవాత్సల్య సంఘర్షణ వలన అనుభవించిన మనోవ్యథ హృదయ విదారకముగా వర్ణింపబడినది. ఈ వృత్తాంతమునే ఆదిపర్వములో నన్నయ కూడ రచించెను. ఆ రెండు రచనలను పోల్చి చూచినచో ఎఱ్ఱనది వర్ణనాత్మక కవిత్వమనియు, అరణ్యపర్వములోని రచన నన్నయభట్టు కృతము కాదనియు సామాన్య పాఠకునకు గూడ విశదము కాగలదు. వ్యాస భారతములో సైతము ఆది పర్వములోని కర్ణజనన వృత్తాంతమునకు అరణ్య పర్వములోని దానికిని ఇట్టి భేదమున్నమాట నిజమే కాని నన్నయయే రెండు సందర్భములను అనువదించి యున్నచో తన రచనా పద్ధతిని బట్టి ప్రథమ సందర్భ రచనకు విరోధము లేకుండ రెండవ దానిని కూడ సవరించి యుండును భావ చాలనము ఆయన పద్ధతేకాదు. అది యట్లుండ ఆదిపర్వములో కర్ణుడు సద్యోగర్భమున జనించెనని యుండగా అరణ్య పర్వమున కుంతి అతనిని పది మాసముల మోసి కన్నట్లు చెప్పబడినది ఈ అరణ్య పర్వభాగమును కూడ నన్నయయే రచించి యున్నచో ఈ విరోధమును తప్పక పరిహరించి యుండెడివాడు

అన్యకవి కృతమైన పూర్వపర్వకథాంశమును తాను ఉత్తరపర్వముల పునః స్పంఘటనము చేయవలసివచ్చినపుడు మొదటిదానినే అనుసరించ నక్కరలేదనియు, తనకు ఉచితమని తోచిన రీతిని రచింపదగి యుండుననియు తిక్కన విరాట పర్వావతారికలో నొక ప్రతిపాదనము చేసెను ఆ పద్యము ఇదే:

"కథ జగత్ప్రసిద్ధ గావునఁ బూర్వ ప
ర్యార్థయుక్తి చేయు నట్టి యెడల
యత్నమించుకంత యయినను వలవదు,
వలసినట్లు చెప్పవచ్చి యుండు".

ఈ పద్యతాత్పర్యమున కనుగుణముగానే తిక్కన సౌపర్ణోపాఖ్యానమును, కర్ణ జననవృత్తాంతమును రచించుటలో నన్నయను అనువదింపక తన కుచితమని తోచిన కథలను తీర్చెను. ఎఱ్ఱనకు తిక్కనార్యుని ఆ పద్యమే గురూపదేశ వాక్య మయ్యెను. కావున కర్ణజననవృత్తాంతములో నన్నయను అనువదింపక, కథ జగత్ప్రసిద్ధమే గావున – తన కవితా స్వభావానుగుణమైన భావచాలనముతో వస్తువును విపులీకరించెను. అరణ్య పర్వశేషమందలి సావిత్ర్యు పాఖ్యానము మొదలైన కథలలో ఎఱ్ఱనకు సహజమైన వర్ణనాత్మకత ప్రత్యక్షముగా గోచరించుచుండును. కావున అరణ్యపర్వశేషభాగము ఎఱ్ఱాప్రెగ్గడ కృతమే.

మఱియు ఏ భాషలోనైనను కాలక్రమమున శబ్ద స్వరూపములు వాడుకలో మారుచుండుటయు ఆమారిన రూపములనే గ్రంథకర్తలు తమ రచనలలో ప్రయోగించుటయు సహజమని భాషావేత్తలందరు అంగీకరించిన సాధారణ సిద్ధాంతము తెలుగుభాష సైతము ఈసిద్ధాంతమునకు విధేయముగానే పరిణమించెను. నన్నయ కాలమునాటి కొన్ని విశేష్యములు, విశేషణములు, క్రియలు మొదలైన శబ్దములు ఎఱ్ఱాప్రెగ్గడ కాలమునాటికి మార్పు చెంది ఆ మారిన రూపములే అరణ్య పర్వశేషమున ప్రయుక్తములై కానబడుచుండుటచే ఆ భాగము నన్నయ రచితముకాదని నిర్ధారించుటకు ఉపోద్బలకము లగుచున్నవి. ఆ మారిన రూపములనే ఎఱ్ఱన తన ఇతర గ్రంథములలో ప్రయోగించి యుండుటచే అవి సకృత్పతితములు కావనియు అతనికి సమ్మతములైన కాలపరిణతరూపములే యనియు విదితమగును. డా॥ చిలుకూరి నారాయణరావుగారు భాషావిషయకమైన ఈ పరిశోధన చేసి ఆ ప్రయోగ విశేషములను తమ 'ఆంధ్రభాషా చరిత్రము'న వివరించిరి. ఇది సారస్వత చరిత్ర గనుక సందర్భోచితిని పాటించి వాటిలో కొన్నిటినే నేను పేర్కొనుచున్నాను

1. నన్నయ కాలమున డుమంతములుగా ప్రయోగింపబడిన మహద్వాచకము లయిన మిత్ర, పాత్ర శబ్దములు ఎఱ్ఱన కాలము నాటికి 'మిత్రము, పాత్రము' అని మువర్ణకాంతములుగా మారినవి.

అంభోరుహ మిత్రున్ (ఆది: 1–22; కూర్చు మిత్రులన్ (ఆది 2–199))
రోగార్తునకు.. పరమ మిత్రంబులు (అరణ్య పర్వశేష:7–439)
రాజను పేరి–కొక్కఁడున్ బెనుపగు పాత్రమయ్యె(హరివంశ పూర్వభా 1–119)

2 నన్నయ మహదర్థమున 'ఒకరుఁడు' అనియు అమహదర్థమున 'ఒకడు' అనియు ప్రయోగించెను అచ్చు ప్రతులలో ఈ రూపములు తారుమారు చేయబడినవి. గాని ప్రాచీన తాళపత్ర గ్రంథములలో ఇట్లే కలవు.

i) వియత్తల మను కంబ మొక్కఁడున తాల్పగ (సభాపర్వ. 1–80)
ii) ఆదినపకార మొక్కఁడ యైన నదియు (అరణ్యపర్వ 1–219)

నన్నయ తరువాతి కాలమున 'ఒకడు'ను మహద్వాచకముగా వాడుట వాడుకలోనికి వచ్చినది.

i) వాసవనందన సఖుఁడగు భూసురుఁడొక (అరణ్య శేష 1–149)
ii) వాఁడొక నాథుఁడు శాశ్వత సౌఖ్యసిద్ధికిన్ (నృసింహపురా., 1–66)

అరణ్య పర్వ శేషరచనా కాలమునకు 'ఒకడు' అమహద్వాచకముగా వాడుట తగ్గి 'ఒకటి' అను ఔపవిభక్తికము అమహద్వాచకముగా వాడుకలోనికి వచ్చినది.

i) ఇతిహాసం బొక్కటి చెప్పెద (అరణ్య శేష: 4-192)

ii) తద్వ్రత్త మొకటి గోరట పడకుండ (హరి. వంశ. పూ.భా. 1-50)

3. నన్నయ 'తదర్థము' అను పదబంధమును మధ్యమోత్తమ పురుషులలో నీతదర్థము, నాతదర్థము అని చతుర్థీ విభక్త్యర్థమున ప్రయోగించెను.

సర్వశబ్దముతో 'ఎల్ల'ను కల్పి 'సర్వజనుల కెల్లను' అను రీతిని ప్రయోగించెను ఇట్టి ప్రయోగములు అరణ్య పర్వ శేషమున కానరావు

4 నన్నయ రచనయందు సంబోధన ప్రథమలో ఓ, ఓయి, ఓరి మున్నగునవి కానరాలేదు ఇవి ఆయన తరువాత వాడుకలోనికి వచ్చినవి.

ఓ పాప లార! (హ వం.పూ భా. 6-184)

ఓయి సమీర! (నృ.పురా 4-147)

ఓ రోరి యింకెందుఁ బోవచ్చు (అరణ్య శేష. 6-245)

5. నన్నయ కాలమున సమాసములందు సంఖ్యా వాచకములు ఉదంతములుగా నుండియే విశేషణార్థమున తెలుపుచుండెను. అతని తరువాత ఉకారమునకు అకారమాదేశమై అవిశేషణార్థ మేర్పడజొచ్చెను.

పం(డెండు వేల దివ్య వర్షంబులు (అరణ్య. శేష. 4 - 242)

6. నన్నయ కాలమున ఉపధలోచకారముగల కొన్ని ధాతువులు ఉపధలో యకారము గలవిగా ఎఱ్ఱన నాటికి మార్పు నొందినవి.

త్రోచు - త్రోయు - త్రోయుమన్ (నృ.పు. 4-133)

వ్రేసి త్రోసి (అరణ్య శేష 6-177)

7. తొడఁగు, కడఁగు ధాతువులను నన్నయ సకర్మకములుగా ప్రచురముగాను అకర్మకములుగా విరళముగాను ప్రయోగించెను ఎఱ్ఱన కాలమున కివి అకర్మక క్రియలుగానే ప్రాచుర్యము నందినవి. అందు 'కడఁగు' ధాతువునకు ఎఱ్ఱన రచనలలో సకర్మకత్వము లేనేలేదు.

ఈ తపంబె తొడంగెద (ఆది. 2-158)

దానిని కడంగుము (అరణ్య 2-224)

పలుకం దొడంగి (హ వం.పూ. 1-108)

కడఁగి ధర్మము తోడ (అరణ్య. శే 4-169)

8. ఛందో విషయమున నన్నయ ఎఱ్ఱనల మధ్యాక్కరలకు లక్షణములలో గల తారతమ్యమును ఇదివరకే చెప్పితిని. సీసపద్య రచనయందును వారి రువురకు కొంత భేదము కలదు. నన్నయ సీస పద్య రచనలో కొన్ని నియమముల నేర్పరచుకొని వాటిని ఎయ్యెడను భ్రంశము కాకుండ యథావిధి పాటించెను. అరణ్య పర్వశేషము నందలి సీస పద్యములలో కొన్ని చోట్ల అనియమోల్లంఘనము జరిగినది. ఎఱ్ఱనకు ఆ నియమ పరిపాలనము నందు అంతగా దీక్ష లేదనుటకు అవి దృష్టాంతములగును, ఆ పద్యములు నన్నయయే వ్రాసి యున్నచో అట్టి నియమోల్లంఘనము చేసి యుండడు.

# హరివంశము

సంస్కృత హరివంశమున హరివంశపర్వము, విష్ణుపర్వము, భవిష్యపర్వమని మూడు భాగములు కలవు. ఈ మూడిటిలో మొదటిదాని యందు ప్రపంచ సృష్టి క్రమమును తరువాత రాజవంశ వంశానుచరితములును వర్ణింపబడినవి యదువంశము ఆ వంశాను చరితములో నొక భాగమే కనుక శ్రీకృష్ణుని జననమునకు పూర్వమునగల తద్వంశ చరిత్రము సంగ్రహముగా జెప్పబడినది. ఈ గ్రంథములో హరి యనగా శ్రీకృష్ణుడనియే అర్థము. ఆ వంశ వర్ణనకు పూర్వ పీఠికగా విశ్వసృష్టియు ఇతర రాజవంశ చరిత్రలును వర్ణింపబడినవి.

రెండవ భాగమైన విష్ణు పర్వమునందలి విష్ణు శబ్దమునకును, శ్రీకృష్ణుడనియే అర్థము. ఈ పర్వము శ్రీకృష్ణుని జననము మొదలు ఆయన జీవితములోని ప్రధాన ఘట్టములన్నియు భాగవతము నందువలెనే వరుసగా వర్ణింపబడినవి. కాని శ్రీకృష్ణునకు సంబంధించిన కొన్ని జీవిత వృత్తాంతములు భవిష్య పర్వమున చెప్పబడినవి వాటిలో ముఖ్యమైనవి; శ్రీకృష్ణుడు సంతానార్థియై కైలాసమునకు తపమున కేగుట, ఆ యాత్రలో మధ్యేమార్గమున బృందావనమున విడిసి ఘంటాకర్ణునకు మోక్షప్రదానము చేయుట. కైలాసము నుండి తిరిగి వచ్చి తన పరోక్షములో ద్వారకను ముట్టడి వేసియున్న పౌండ్రక వాసుదేవుని సంహరించుట, హంస డిభకోపాఖ్యానము, ప్రద్యుమ్నుని జనన వృత్తాంతము దీనిని బట్టి మూలమున భవిష్య పర్వములో భవిష్యత్కాలిక వృత్తాంతములే కాక భూతకాలిక ఉదంతములు కూడ చేరియున్నవని స్పష్టమగును

ఎఱ్ఱాప్రెగ్గడ తన హరివంశమున ఈ విభాగములను యథాతథముగా పాటించ లేదు. అసలు ఈమూడుపర్వముల పేళ్ళను ఎఱ్ఱన గైకొనలేదు. ఆయన తన గ్రంథమును పూర్వోత్తర భాగములని రెండుగ విభజించెను. అందు పూర్వభాగమున తొమ్మిదాశ్వాసములును, ఉత్తర భాగమున పది యాశ్వాసములును గలవు. అదిగాక ఎఱ్ఱనకు లభించిన హరివంశము మూడు పర్వములు గలది గాక పూర్వభాగము, ఉత్తరభాగము అని రెండు విభాగములు కలదియై యుండునేమో యని సందేహించుట కవకాశము కలదు. ఈ రెండు విభాగములలో మొదటిదానికి హరివంశ పర్వమనియు రెండవదానికి భవిష్య పర్వమనియు పేర్లు ఉండియుండును భారత పర్వానుక్రమణికలో చివరి రెండుపర్వములకు ఆ పేర్లు కలవని ఇతఃపూర్వము చెప్పితిని

ఎఱ్ఱన పూర్వభాగమున నాలుగాశ్వాసములలో హరివంశ పర్వకథా సందర్భమును ముగించెను అటనుండి ఐదవ యాశ్వాసము మొదలు ఉత్తర భాగములో ఎనిమిదవ ఆశ్వాసమువరకు శ్రీకృష్ణుని జీవిత చరిత్రను క్రమముగా అభివర్ణించెను. అవన్నియు సంస్కృతమున విష్ణు పర్వమునందును భవిష్య పర్వమునందును గలవి. వ్యాసుడు భవిష్యపర్వమున చేర్చిన కృష్ణసంబంధి కథలను (హంస డిభకోపాఖ్యానము తప్ప) అటనుండి తొలగించి శ్రీకృష్ణుని జీవిత చరిత్రలో వాటికిగల అర్హస్థానమున నిల్పెను వాటిలో హంస డిభకో పాఖ్యానము నెందులకో తడవలేదు. మరి విష్ణు పర్వములోనిదే అయిన వజ్రనాభ వధయనెడి ప్రభావతీ ప్రద్యుమ్నోపాఖ్యానమును కూడ ముట్టలేదు. హంస డిభకోపాఖ్యానమును విసర్జించుట కేమి కారణమో

చెప్పలేము. రెండవదియైన ప్రభావతీ ప్రద్యుమ్నోపాఖ్యానము ఇంచుమించు ఉషాపరిణయ కథవంటిదే కనుక దానిని వదిలిపెట్టి యుండవచ్చును. ఇక మిగిలిన భవిష్య పర్వమును చాల సంగ్రహించి తుది రెండాశ్వాసములలో ముగించెను. ఈ హరివంశానువాదము భారతానువాదము వలెనే కథామాత్రానువాదమై స్వతంత్రముగా నడిచెను. కావ్యశిల్పమున కనుకూలించెడి ఘట్టముల నన్నింటిని రసభరితముల నొనర్చి మూలమునకు వన్నె పెట్టెడి రచనా నైపుణిని ప్రదర్శించెను. ఉషాపరిణయకథలో ఆనూతన దంపతుల ప్రథమ సమాగమవేళ వారనుభవించిన ప్రణయ మాధుర్యమును అతి సుకుమారముగా, నాగరకముగా చిత్రించి, భావగతిలో తాను తిక్కనకు పరోక్ష శిష్యుడనెడి ప్రశస్తిని సార్థకము చేసికొనెను.

సీ॥ "కలలోన నొండరుఁగలసిన యప్పటి
యానంద పూర్ణ ధన్యత్వములును
బెరసి యొండొరులపైఁ బ్రేముడి సలిపిన
సంతాప బహుళ దశాంతరములు
నెమ్మి నొండొరులకు నెచ్చెలి కతమున
నబ్బిన యసమ భాగ్యాతిశయముఁ
బ్రియుల నొండరులకుఁ గీల్కొన నొదవిన
యౌవనోచిత కళావ్యాప్తి విధముఁ

గీ॥ జెన్ను మిగుల నొండొరులకుఁ జెప్పి కొనుచు
నద్భుతంబులు భయములు నాదరములుఁ
గౌతుకంబులుఁ బొదలాడఁగాఁ బ్రియుండుఁ
బ్రియయుఁ గ్రోలిరి నూతన ప్రేమరసము" (హరి వం ఉత్తర భా. 7–204)

గోపకులు సకుటుంబముగా వ్రేపల్లె వీడి బృందావనమునకు వలసపోవుట బృందావనమున మందలకు దొమ్మ (డిఫ్తీరియా), గాళ్ళు మున్నగు వ్యాధులు వచ్చుట మొదలగు వృత్తాంతములు వర్ణించునపు డెఱ్ఱన తనకు గల జానపద జీవిత పరిజ్ఞానమును అచ్చపు తెనుగుదనముట్టిపడునట్లు ప్రదర్శించెను

సీ॥ "బండ్లమెట్టింపుపై బరువు లెక్కింపు మీ
దళ్ళను బూన్పు కావళ్ళ నునుపు
పదిలంబుగా నేతి పనఁటులు క్రొత్తగో
నియల బియ్యము వడ్లు నెమిలి వడ్లు
నొదివిరి ప్రాలును నొనరంగఁ బోసి చాఁ
పలు మంచములు మీఁద బలియ గట్టు
దామెనలును పల్లె త్రాళ్ళును దలుగులు
గవ్వము ల్గొడవలి కత్తిసూఁడుఁ

గీ॥ గొడుపు వాదోళ్ళు మొదలుగాఁ జెడకయుండ
వలయు ముట్లెల్లఁ దెమ్ముగ కంటలపు టెడ్ల

నాయితము సేయు ముదుసళ్ళ నాఁడువారి
గంప మోపులు ముందరఁగదలు మనుము"

వ: అని మఱియు బెక్కుభంగుల యెలుంగుల నొక్క కోలాహలం బెసంగ మంద యంతయు నొక్కపెట్ట కదలి లావు మానుసులు కదుపులం గొని ముందరంబోవఁ బిఱుంద బండ్లును బండ్ల జాడం దక్కిన వ్రజయును నడువం దరుణతరుణీ జనంబు లొండొరులతోడి మేలంపు టాలాపంబులం బ్రమోదకరంబులగు వినోదంబుల నదుటుమీఱి కడచి చనం బంగ్వంధజరఠప్రముఖులు గ్రుస్సి యోలాకు పడ నెడనెడం గావలియై తగువారు నడపింప నవ్విధంబునంజని బృందావనంబు ప్రవేశించి యుచిత ప్రదేశంబులు నివేశంబులుగా నిరూపించి గోపాల ముఖ్యులు నిలువ" (హరివం పూ॥భా. 6–22, 23)

చ॥ "వడఁకుచు రోమకోటి నిలువంబడి మేనులు దూలఁగన్నులం
దుడుగక బాష్పముల్ వడియుచుండఁదలల్ దిగవైచి నోరఁద్రే
గుడు దొరుఁగంగ నెంతయును గ్రుస్సి ఖురంబులు వ్రస్సి పుర్వులు
గ్గడువుగ గాఱఁ దద్దయును గాఱియఁబొందె వ్రజంబునం బసుల్"

కం॥ కడలను నెత్తురుఁ బాఱం
దొడఁగెఁ గొన్ని యతిసార దుస్తర బాధన్
బడిప్రేవులు సిక్కఁదునిసి
పడకుండునె యనఁగ నెత్తువడె నెల్లెడలన్.

ఆ. నరిడి పుష్ప కప్పనావురు గడుపూఁద
యదురుఁద్రిక్క యనఁగ నడరి మఱియుఁ
దెవులు లెన్నియేనిఁ దవిలి యెంతయు మహో
గ్రంబులయ్యెఁ బశుగణంబునందు. (హరివం. పూ॥భా. 6–44, 45, 46)

ఇట్లే వానలలో గోగణము పొందెడి బాధలు – ప్రత్యక్షానుభవమువల్ల గాక ఊహకు అందనివి – ఎంత ప్రత్యక్ష కల్పముగా వర్ణించెనో గమనింపుడు

"అట్టి సమయంబున నిరంతర ధారాపాతంబునం దడిసి వలుదెసలంబఱచివ్రేయు వాయువునఁ గొందలపోయి యొండొంటి చాటున కొదింగి కడగానక నిలువంబడియుఁ గొమ్ముల్లొడ్డి కన్నులుమోడ్చి కడఱెప్పల నీళ్ళుగాఱందలలు డిగ్గవైచి నెమరు లుడిగి మూర్ఛలు వోయినట్లుండియు వడఁకు సొచ్చి యఱచు క్రేవుల ముందటఁ బెట్టుకొని గంగడోళ్ళం బొదుపుకొని యంభారవంబుల నాకంద్రించియు వెల్లువ కతనఁడెంకిలేక నిలువుగా లుండి యుండి యోటఱి కాళ్ళు వడంక సైరణ దప్పి నెఱిదప్పం బెనరొంపి లోనం ద్రెళ్ళియుఁబెలుచ మెఱచు మెఱుంగులం జెదరి యదరంట నఱుము పేరుఱుముల బమ్మెరపోయి మందపట్లు విడిచి యిట్టు నట్టునుం దెరలఁ దిరిగియు నాహారంబులేక యీద చాటువడి మేయంజాలక యెత్తువడి తెవులుగొంట్లు ముదుసళ్ళును మడియ బలవంతంబులైనవియుఁ జేవదక్కియుఁ బసులు పెక్కు బాధలం దల్లడిల్లె"

శ్రీకృష్ణుని బాల్యవిహారములకు రంగస్థలమైన గోకులమును గోపజీవితమును

వర్ణించిన ఘట్టములు ప్రత్యేకము ఒక pastoral poemగా చదివి ఆనందింప దగియుండును. గోపికాయశోదల సంవాదము, యశోద ధూర్తగోపాలుని మందలించుట మున్నగు సాంసారిక సన్నివేశములలో హరివంశము భాగవతము కంటె గుణోత్తరమని చెప్పిన తప్పుకాదు. ఇందుకు హరివంశ పూర్వ భాగమున ఐదవ ఆశ్వాసము చూడుడు.

## లక్ష్మీ నృసింహ పురాణము

ఈ గ్రంధమునకు నృసింహపురాణమనెడు పేరు లోకమిచ్చినదేకాని కవి పెట్టినది కాదు. ఇందు పురాణ లక్షము లేమియు లేవు. ఎఱ్ఱాప్రెగ్గడ దీనిని 'నరసింహావతారంబను పురాణ కథ'యని గ్రంధావతారికలోను ఆశ్వాసాంత గద్యభాగములలోను పేర్కొనెను. పౌరాణిక లక్షణముగల కథ గావున కవి దీనిని పురాణకథ యని నిర్దేశించెను. నృసింహావతారకథ బ్రహ్మాండాదిపురాణములలో పెక్కింట కలదు వాటిలో బ్రహ్మాండ పురాణోక్తమైన కథను ఎఱ్ఱన ప్రధానముగా గైకొనెను.

నృసింహావతారకథ బ్రహ్మాండపురాణమునుండి గ్రహించినదేకాక తాను పెద్దల వలన విన్న అంశములతో కూడ ఇందు పొందుపరుపబడినది అని కవి చెప్పుటచే కథలో కొంత భాగమునకు పురాణము మూలము కాకపోవచ్చును.

శ్రీ నరసింహావతారమునకు రంగస్థలము అహోబల మగుటచేత ఈ గ్రంథము తుది భాగములో తత్ క్షేత్ర సంస్థాపనము, మహత్త్వము కొంత చెప్పబడినవి దీనిని బట్టి ఇది పాండురంగమాహాత్మ్యాదులవలె క్షేత్ర మాహాత్మ్యమని పరిగణింపబడవచ్చునేమో అనుకొన్న అదియు పొసగదు. ఏమనగా ఇతర క్షేత్ర మహాత్మ్యములయందు వలె ఇందు క్షేత్ర మహిమ నిరూపకములైన ఉపాఖ్యానములుగాని తత్క్షేత్ర సంసేవనము వలన పవిత్రులై తరించిన పతితుల కథలుగాని లేవు. కనుక ఇది స్థల పురాణమును కాదు. 'నృసింహావతారము' అని పేరిడుటలోనే ఎఱ్ఱన ఈ సూచన యొనర్చినాడు

నృసింహావతారమునకు కారణ భూతమైన ప్రహ్లాదుని చరితమే యిందు కావ్యవస్తువు. ఐనను ప్రహ్లాద చరిత్ర యంతయు ఇందు వర్ణింపబడలేదు నృసింహావతారమునకు ప్రహ్లాద రక్షణమునకు అవశ్యకమైనంత ప్రహ్లాదచరిత్ర మాత్రమే కలదు. కావున ప్రహ్లాదరక్షణ రూపమైన నృసింహావతారమే ఇందు ప్రధానేతి వృత్తము. ఈ రహస్యమును గ్రహించియే కవి ఈ గ్రంధమునకు ఆ నామకరణము చేసెను.

సనకస నందనాదులు విష్ణుని ద్వారపాలకులైన జయవిజయులను రాక్షస జన్మ మెత్తునటుల శపించుట యీ కథకు బీజము. ఈ వృత్తాంతము కారణముగా ఉపక్రమింపబడి హిరణ్యకశిపుని దుర్వర్తనముతో విజృంభించి ప్రహ్లాదుని రక్షణముతో పర్యవసించిన ఈ కథ నృసింహావతారమునకు కారణభూతమును కార్యభూతమును అయిన పూర్వోత్తర కథాంశములతో సుసంఘటితమై యున్నది. అందుచే ఈ గ్రంధమున, ఉత్తర కాలమున ప్రబంధములనుపేర ప్రసిద్ధి కెక్కిన వాటిలో పెక్కింటవలె వస్త్వైక్యము సాధింపబడినది

ఇట్లు ఈ కావ్యములో 1. కార్యకారణ నిబద్ధత 2 వస్త్వైక్యము అనవద్యముగా

నిర్వహింపబడుటకు తోడుగా పురాణములకు క్షేత్రమహాత్మ్యములకు అనావశ్యకములు, ప్రబంధోచితములునైన అష్టాదశ వర్ణనలలోని పెక్కు వర్ణనలు ఇందు కావ్యాంగములుగా అలంకరింపబడినవి. సముద్ర వర్ణన, దేశవర్ణన, పురవర్ణన, పౌరవర్ణన, నాయకవర్ణన, ఋతువర్ణన, ఉద్యానవర్ణన, గర్భిణీవర్ణన, పుత్రోదయవర్ణన అనునవి ఆ వర్ణనలలో ముఖ్యములు. ఇట్టి వాటిని సాధారణముగా పురాణ కవులు వర్ణింపరు. ఆ కౌశలము ప్రబంధ కలవుదే. ఈవర్ణనలన్నియు యధాభావరసావస్థముగా, కావ్యమూర్తికి సుందర అవయవములుగా తీర్చబడ్డవేగాని బలాత్కారముగా కథలో చొప్పింపబడినవి కావు. తెలుగు వాఙ్మయములో ఈ గ్రంథమునకు పూర్వము ఇట్టి సుసంఘటితమైన కావ్యము లేదు.

'ప్రబంధ' నిర్వచనము మాట యెట్లున్నను ప్రబంధశబ్దమునకు లక్ష్యములుగా నున్న గ్రంథములను పరిశీలించి చూచినచో వాటిలో రసపోషణము, వర్ణనా బాహుళ్యము, వస్త్వైక్యము అనునవి ప్రస్ఫుటముగా నుండును నృసింహపురాణము ఈ లక్షణములకు చక్కని ప్రథమోదాహరణమని చెప్పదగును.

కాని మనుచరిత్రాది ప్రబంధములకు దీనికి ఒక ముఖ్యభేదము కలదు. ఆ ప్రబంధములలోని నాయకులు మానవులు; అందలి కథ సాంసారికము. ఇది దేవతా నాయకము. ఆ నాయకుడు శ్రీమహావిష్ణువు. కనుక ఇది మానవ నాయకములు, సాంసారికేతి వృత్తములునగు ప్రబంధములలో చేరదు. ఇదియే దీని విశిష్టత.

ఇంకొక విషయము ప్రహ్లాదుని చరిత్రలో కూడ ఇందు పూర్వభాగమే కాని ఉత్తరభాగము లేదు. తండ్రి యనంతరము రాక్షస రాజ్యమున కాధిపత్యము వహించిన ప్రహ్లాదుడు తనకు అజన్మ సిద్ధమైన విష్ణుభక్తి పరాయణత్వమును కూడ త్రోసిపుచ్చునట్టి రాజ్య విస్తరణాభిలాషతో దేవతల మీదికి దండెత్తి వెళ్ళుట, ఒకచో విష్ణువునే ధిక్కరించుట మొదలైన రాజస కృత్యము లొనరించి –

"ప్రహ్లాద నారద పరాశర పుండరీక
వ్యాసాంబరీష శుక శౌనక భీష్మదాల్భ్యాన్
రుక్మాంగదార్జున వశిష్ఠ విభీషణాది
పుణ్యానిమాన్ పరమ భాగవతాన్ స్మరామి"

అని భక్తి పూర్వకముగా మనము సంస్మరించుకొనెడి ఆ ప్రహ్లాదుడితడేనా? అని లోకము సంశయింపదగినట్లుగా ప్రహ్లాదరాజు అప్పుడు ప్రవర్తించినట్లు అతని ఉత్తర కాలజీవితము విదితము చేయును ఈ కథా భాగముగల ప్రహ్లాద చరిత్రను హరిభట్టు అను నొక కవి ఎఱ్ఱనకు తరువాత చాల కాలమునకు రచించెను.

ఎఱ్ఱన ప్రహ్లాద చరిత్రనంతను వ్రాయ దలపలేదు. కనుక ఆ భాగమును స్మరింపలేదు కావున ఇది ప్రహ్లాద చరిత్రముకాదు, నృసింహపురాణమును కాదు మఱి, నృసింహావతారకథ పురాణేతిహాసములు అనువదింపబడుచున్న కాలములో ప్రబంధ లక్షణ శోభితమై వెలసిన మహాకావ్యము. రామాయణ హరివంశ రచనలచే ప్రబంధ పరమేశ్వర బిరుదమునకు అర్హత సంపాదించుకొన్న శంభుదాసుడు ఈ గ్రంధ రచనచే ఆ బిరుదమును అధిక్షేపణలకు, ఆక్షేపణలకు అవకాశములేని రీతిగా నొనర్చి సార్థక బిరుదనాము డయ్యెను.

## భాస్కరుడు

**భాస్కర రామాయణము:**

ఈ యుగములో ఎఱ్ఱనతోపాటు ప్రసిద్ధికెక్కిన పెద్ద కవులిరువురును అతనికి సమకాలికులగుటయేకాక యాదృచ్ఛిక ప్రతిభటత్వమును, అవిరోధస్పర్ధయును గల వారగుట ఒక విచిత్రమైన దైవఘటన. వారిలో మొదటివాడు రామాయణ కర్తయైన భాస్కరుడు. రెండవవాడు ఉత్తరహరివంశకర్తయైన నాచనసోముడు. వీరిలో ప్రథముడైన భాస్కరుని పేరుమీదనే భాస్కర రామాయణమను గ్రంధము వెలసినది ఈ రామాయణము సాహిణి మారన అశ్రయమున రచింపబడెను. ఈ సాహిణి మారన ఎఱ్ఱాప్రగడ కాశ్రయమిచ్చిన ప్రోలయ వేమారెడ్డివలెనే మొదట కాకతీయులకు నాయంకరుడును సామంతుడునై యుండి ఓరుగల్లు పతనానంతరము స్వతంత్రుడైన ఒక బ్రాహ్మణ ప్రభువు ఆ కాలమున మంత్రులకు, సేనాపతులకు, నాయంకరులకు, సామంతులకు ప్రతిపత్తిలో విశేషభేదములేదు. మంత్రులు సేనానులగుటయు, సేనానులు సామంతులగుటయు కలదు. ఇతడు పరిపాలించిన చిన్న రాజ్యము పలనాటి ప్రాంతమునదయి యుండునని ఐతిహాసికు లూహించిరి. చిన్నదైననేమి, పెద్దదైననేమి? ఇతడొక రాజ్యమున కధిపతియే. అదిగాక ఇతడు సుప్రసిద్ధులైన ముప్పది యిద్దరు మంత్రులలో ఒకడుగా ప్రస్తుతి కెక్కెను.

"కొనియె భాస్కరునిచేఁ దెనుఁగు రామాయణం
బారూఢి సాహిణీ మారమంత్రి"

ఈ 'సాహిణి' అతని యింటి పేరు కాదు ఆ పదమునకు అశ్వదళాధ్యక్షుడని యర్థమట. ఇతని యింటిపేరు నిశ్శంకవారు ఐయుండును.

రెడ్డి రాజధానిలో ఎఱ్ఱాప్రెగ్గడ రామాయణమును రచించుచుండె నన్న వార్త విని దానికంటె ముందు తాను ప్రోత్సహించిన రామాయణము పూర్తి కావలె ననెడి ఉత్కంఠతో సాహిణి మారన భాస్కరుని హెచ్చరించగా ఆ కవి తనకు తోడ్పాటుగా తన కుమారుడైన మల్లికార్జునభట్టును, మారన కుమారుడైన కుమార రుద్రదేవుని అకార్యములో నియోగించి తన కుమారునిచే బాల, కిష్కింధా, సుందరకాండములను, మారన కుమారునిచే అయోధ్యాకాండమును వ్రాయించి తాను అరణ్యకాండమును, యుద్ధకాండమును గైకొనియుండును. ఈ యూహయే నిజమైనచో ఎఱ్ఱన రామాయణము, భాస్కరుని రామాయణము ఒండొంటిని గడవ పందెము వేసికొని పరుగెత్తి యుండును. పాపము! భాస్కర రామాయణము ఏ కారణముననో యుద్ధకాండ మధ్యభాగమున నిలిచిపోయినది ఆ మిగిలిన భాగమును దేవరకొండ వెలమప్రభువైన పెదవేదగిరినాయని కాలమున అతని కాశ్రితుడైన అయ్యలార్యునిచే (1390 ప్రాంతము) పూర్తి చేయబడెను

ఎఱ్ఱన రామాయణము ఇతరుల తోడ్పాటులేకుండగనే పూర్తియై పందెము గెలుచుకొనెనా యనిపించును. ఈ రెండును సమకాలిక రచనములే కానిచో ఒక పద్యరామాయణము వెలసియుండగా ఇంకొకటి తలపెట్టెడి కవి ఉండుట అసంభవము

మఱి ఈ రెండు గ్రంధములకును పూర్వము రంగనాథ రామాయణము వెలసి యుండెనుగదా, ఈ కవులు మరల రామాయణ రచనకు ఉపక్రమింపనేల? అనెడి ప్రశ్నకు సమాధానమిది: మన భాషలో మొదటి నుండియు ద్విపద కావ్యములు పద్యకావ్యములుగా పరివర్తనచెందుట ఆచారమైనది. పద్యమునకును ద్విపదకును పరన శ్రవణ సౌలభ్యములో గల తారతమ్యమును పూర్వ ప్రకరణములలో చెప్పితిని ఆ కారణము చేతనే ఎఱ్ఱాప్రెగ్గడను ప్రోలయ వేమారెడ్డియు, భాస్కరుని సాహిణి మారనయు రామాయణమును పద్య ప్రబంధముగా రచింప అర్థించి యుందురు. భాస్కర రామాయణము రంగనాథ రామాయణమును చాల వరకు అనుసరించియే రచింపబడెను. ఆ వివరము తరువాత చెప్పెదను. ఎఱ్ఱన రామాయణము లభింపలేదుగాన రంగనాథ రామాయణమునకును దానికిని ఏమేని పోలికలు గలవేమో చెప్పలేముగాని చదలువాడ మల్లయ—

> "వల్మీకి భవు వచోవైఖరి రామాయ
> ణంబు నాంధ్ర ప్రబంధంబు చేసె"

అని యెఱ్ఱనను ప్రస్తుతించి యుండుటచేత అది రంగనాథరామాయణమువలె మూలాతిక్రమణములేని యధావాల్మీకమే అయి యుండును

ఇది యిట్లుండ తన పేర రామాయణమును చెల్లించుకొన్న ఈ భాస్కరుడెవరు? అనెడి ప్రశ్న ఆంధ్రవిమర్శక లోకమున నేటికిని ఎడతెగని సమస్యగా నెగడుచున్నది. యుద్ధకాండమును పూర్తిచేసిన అయ్యలార్యుడు యుద్ధకాండ పూర్వభాగమును హుళక్కిభాస్కరుడు రచించినట్లు చెప్పినాడు.

> "అమర హుళక్కి భాస్కర మహాకవి చెప్పఁగ నున్న యుద్ధకాం
> డము తరువాయి చెప్పెఁ బ్రకట ప్రతిభాషణుఁడప్పలార్యస
> త్తమ సుతుఁడయ్యలార్యుఁడు కృతస్థితి నార్యులు మెచ్చునట్లుగా
> హిమకర తారకా రవి మహీ వలయ స్థిరలక్ష్మి చేకుఱన్". (యుద్ధకాం.2698)

దీనిని బట్టి అరణ్య కాండకర్త ఈ హుళక్కి భాస్కరుడే యని చిరకాలముగా లోకము విశ్వసించెను. కాని ఆకాండాంత గద్యలో భాస్కరుని యింటి పేరులేదు. ఐననేమి? మన కవులలో చాలమంది యింటిపేర్లు చెప్పకొన్నవారు లేరు. వారి ప్రసంగము వచ్చినప్పుడు ఇతరులు ఆ యింటిపేరును చెప్పటయు కలదు

ఈ భాస్కరుడు తిక్కనార్యుని పితామహుడైన భాస్కరుడనియు, అయన సార కవితాభిరాముడని తిక్కన ప్రస్తుతించెను గాన ఆయన రామాయణము పూర్తిగా ఆరుకాండలను రచించుటం బట్టియే తిక్కన నిర్వచనోత్తర రామాయణమను పేర ఉత్తరకాండను చేపట్టెననియు, సాహిణి మారన నాటికి అరణ్యకాండము తక్క తక్కిన కాండలు ఉత్పన్నము లయ్యెననియు ఒక అభిప్రాయ లోకమున నేటికిని ఉన్నది. తిక్కన ఉత్తరకాండము చేపట్టుటకు గల కారణము నిర్వచనోత్తర రామాయణము ప్రకరణమున చెప్పితిని. దానిని అయ్యెడ చూడదగును. మరి మంత్రి భాస్కరుడు పూర్వ రామాయణము నంతను రచించియుండునేని ఆ గ్రంధములో అరణ్యకాండము తప్ప తక్కిన కాండలు ఉత్పన్నములై పోవుట తిక్కన గారి యింట ఎట్లు

తటస్థించును? తిక్కన నిర్యాణమునకును భాస్కర రామాయణ ఆవిర్భావమునకును 40, 45 సంవత్సరములకంటె ఎక్కువ వ్యవధి లేదు ఆ మధ్యకాలములో, మారన ఎఱ్ఱన మొదలైన మహాకవులు తలయెత్తుచుండగా తిక్కనగారి భారతముతోపాటు తత్పుత్రార్జితమైన మంత్రిభాస్కరుని రామాయణము కూడ భద్రముగా పరిరక్షింపబడి యుండును గాని నష్టమైన యుండదు.

మంత్రి భాస్కరుడు రచించినది ఒక అరణ్యకాండమే అనుకొందమన్నను అదియు పొసగదు. పుణ్యప్రదమైన రామకథారచనమున కుపక్రమించిన మంత్రి భాస్కరుడు. 'విశ్వశ్రేయః కావ్యమ్' అనియు 'మంగళాదీని మంగళమధ్యాని మంగళాంతాని కావ్యాని' అనియు శిరోధార్యములైన శాస్త్రవాక్యములను విని యున్నవాడు. అమంగళ ప్రదమును, దుఃఖహేతువును ఐన అరణ్య కాండమును ఏల మొదలిడును? అదియునుగాక ఆ కాండమును మంత్రి భాస్కరుడే రచించియున్నచో ఆ రచన నన్నెచోడునకు పాల్కురికి సోమనాధునకును మధ్య కాలమున జరిగియుండవలెను గదా? అనాటి భాష నేటి మనకు తిక్కన భాషకంటె కూడ ప్రాతబడిన భాషగా భాసించుచుండవలెను. కాని అరణ్యకాండమునందలి భాషలో అట్టి ప్రాతదనము లేదు. సరికదా, తిక్కనగారి తరువాత ఎఱ్ఱాప్రగడ నాటి ఆధునికత్వము వహించిన తెలుగు భాషగానే చెవిసోకుచుండును. అదియుగాక అరణ్యకాండకర్త తిక్కన భారతమునందలి భావములను, పలుకుబళ్ళను భక్తిపూర్వకముగా అనుకరించిన నిదర్శనములు పెక్కు కలవు. ఒక ఉదాహరణ మిత్తును చూడుడు ద్రోణ పర్వమునందు తిక్కనార్యుడు వ్రాసిన యీ క్రింది పద్యమును పోలిన పద్యము ఆంధ్రవాఙ్మయమున కరుణరస ఘట్టములలో ఎచటను లేదు.

*"హాయను, ధర్మరాజ తనయాయను, నన్నెడఁబాయ నీకుఁజ*
*న్నేయను, దల్లినేఁప జనునేయనుఁ గృష్ణుఁడు వీఁడెవచ్చెరా*
*వేయను, నొంటి పోక తగవేయను, నేగతిఁ బోవువాఁడనే*
*నో యభిమన్యుడా యను, బ్రియోక్తుల నుత్తరఁ దేర్పవే యనున్"*(ద్రోణ–2–242)

దీనిని ననుకరించిన పద్యములు తెలుగు సారసత్వమున చాలకలవు వాటిలో అరణ్యకాండమునందలి యీ క్రింది పద్యము శ్రేష్ఠము

*"హాయను, నోనరేంద్ర యను హారఘుకుంజర నీవు వేగరా*
*వేయను, నెంతదూరమున కేగితొకోయను, నాయెలుంగు విం*
*టే యను, విన్న నీశరము లీతల లింతకుఁ ద్రుంచివైవకు*
*న్నే యనుఁ గైక కోర్కి ఫలియించె బళీయను, దైవమా యనున్".*(అరణ్య 2–112)

ఈ పద్యము తిక్కనగారి పద్యచ్ఛాయలు కలదనుటకు సందేహములేదు

మఱి ఈ భాస్కరుడు హుళక్కి భాస్కరుడని అయ్యలార్యుడు చెప్పిన దానిని బట్టి నిస్సందేహముగా పెక్కు రంగీకరించిరి కనుక యుద్ధకాండ పూర్వభాగము రచించిన హుళక్కి భాస్కరుని పేరు మీదనే ఈ రామాయణము భాస్కర రామాయణమని పిలువబడిన దనియు ఈ భాస్కరుడే అరణ్యకాండకర్తయు అగుననియు నా వలెనే తలంచు పలువురు కలరు. అరణ్య కాండమునకును, యుద్ధకాండ పూర్వభాగమునకును

రససంపాదనలో ఏదేని భేదముండునేని అది ఆ రెండుకాండములలో గల ఇతివృత్త స్వభావమును బట్టి గోచరించునదే కాని భిన్నకర్తృకములగుటచే కల్గినది కాదు. అరణ్యకాండము చాల వరకు కరుణరస భరితము. అది యుద్ధకాండముకంటె రసవత్తరముగా నుండుట సహజమే హృదయమును ద్రవింపజేయుశక్తి కరుణమునకువలె వీరమునకు లేదు.

మంత్రిభాస్కర వాదులు తమ వాదమునకు ఉపోద్బలకముగా చెప్పెడి మఱి రెండు యుక్తులు కలవు

**ఒకటి:** అరణ్య కాండము యుద్ధకాండములో సగమైనను లేక పోయినను అది రెండాశ్వాసములుగా విభజింపబడుటయు యుద్ధకాండము ఏకాశ్వాసముగానే యుండుటయు అవి ఏక కర్తృకములు కావనుటకు నిదర్శనము.

ముద్రిత ప్రతులలో యుద్ధకాండ మేకాశ్వాసముగ నున్నను, కొన్ని వ్రాత ప్రతులలో యుద్ధకాండాంతమున 'సర్వంబును షష్ఠాశ్వాసము సంపూర్ణము' అని కలదని ఆ వ్రాతపత్రులు చూచినవారు చెప్పిరి. కావున అదియు ఒకప్పుడు అశ్వాసములుగా విభక్తమయ్యే యుండును.

**రెండవది:** మల్లికార్జున భట్టు తన గద్యలో 'ఇది శ్రీమదష్టభాషా కవిమిత్రకుల పవిత్ర భాస్కరసత్కవిపుత్ర మల్లికార్జునభట్ట ప్రణీతంబైన' అని వ్రాసికొనెను. ఇక అరణ్యకాండాంత గద్యలో 'ఇది సకలసుకవిజనవినుత యశస్కరభాస్కర ప్రణీతంబైన' అని కవి వ్రాసికొనెను. కావున అరణ్యకాండ కర్త మల్లికార్జున భట్టునకు తండ్రి కాడనియు, అతని తండ్రి పరముగా వాడిన విశేషణములు అరణ్యకాండ రచయిత తనకు వేసికొనిన విశేషణములతో సంవదించుట లేదనియు చెప్పుదురు.

ఈ యుక్తిలో వాద ప్రౌఢి యేమియు లేదు. మల్లికార్జున భట్టుగాని, కాండ కర్తగాని ప్రయోగించిన విశేషణములు మార్పు చెందరాని సంజ్ఞా వాచకములు కావు అలంకారసంపాదనార్థము ఒకరు 'పుత్ర' శబ్దమునకు అనుప్రాసములుగా మిత్ర, పవిత్ర, శబ్దములను ప్రయోగింపగా రెండవవారు భాస్కర శబ్దమును కను ప్రాసముగా యశస్కర శబ్దమును వాడిరి పైగా అవిశేషణములు గాని, ఈ విశేషణముగాని భాస్కరునకు బిరుదములుగావు

కుమార రుద్రదేవుడు అయోధ్యా కాండాంతమునందు తాను వ్రాసికొనిన గద్యలో తనను గూర్చి యిట్లు చెప్పుకొనెను.

"ఇది సకలకళావిశారద, శారదాముఖముకురాయమాణ సారస్వత భట్టభాణ, నిశ్శంక వీరమారయకుమార కుమారరుద్రదేవ ప్రణీతంబు".

ఈ వాక్యములో 'నిశ్శంక' అను విశేషణము మాత్రము అతని యింటి పేరు అనుటకు సందేహముండదు. మఱి యీతని తండ్రి పేరు వీరమారయ ఇందులో వీర శబ్దము విశేషణము; మారయ శబ్దము విశేష్యము అనుట స్పష్టమే గనుక ఈ కవి నిశ్శంక మారయ కుమారుడైన నిశ్శంక కుమార రుద్రదేవుడు అనుపేరు గలవాడని సమర్థించుటకు ఎక్కువ పాటుపడనక్కరలేదు. నిశ్శంక వారు బ్రాహ్మణులు. శ్రీనాథుని కాలమున రాజమహేంద్రవర రెడ్డిరాజుల ఆశ్రయమున శివలీలావిలాస మనెడి కావ్యము రచించిన నిశ్శంక కొమ్మనామాత్యుడు ఆ వంశమువాడే. కాబట్టి

ముప్పది యిద్దరు మంత్రులలో పేర్కొనబడినట్టియు, భాస్కర రామాయణ రచనను ప్రోత్సహించినట్టియు సాహిణి మారన యింటి పేరు నిశ్శంకవారైయే యుండును. అతడే పై గద్యలో చెప్పబడిన వీరమారయ. అతని కుమారుడే ఈ అయోధ్యాకాండకర్త

పూర్వకాలమున ప్రభుభక్తి పరాయణులైన మంత్రులను సేనానులును తమ యేలికల పేర్లు తమ బిడ్డలకు పెట్టుకొనుట ఆచారముగా ఉండెడిది ఆ సంప్రదాయమ్మును బట్టి ప్రతాపరుద్రునకు మంత్రియు, సేనానియు, సామంతుడును అయిన మారన తన కుమారునకు కుమారరుద్రదేవుడని పేరుపెట్టి యుండ వచ్చును. మరియు ఆ కుమారునకు హుళక్కి భాస్కరుడు విద్యాగురువై యుండ వచ్చును. అగుచో భాస్కరుడు తన శిష్యుడైన కుమార రుద్రదేవునకు, పుత్రుడైన మల్లికార్జున భట్టునకు రామాయణ రచనా పుణ్య కార్యమున కొంత పాలు కల్పించి, వారి సాయమును ఈ గ్రంధ రచన సాగించి యుండుననుటలో విప్రతిపత్తి యేమియు లేదు.

అతి ప్రాచీన కాలమునాడు సైతము ఒక విద్యా సంస్థకు కులపతిగా నిర్వాహకత్వము వహించిన ఒక ఋషి తాను కూటస్థుడుగా నిలిచి ఆ సంస్థ యందు సమర్థులైన తన శిష్యులనో మిత్రులనో సహాయులుగా చేకొని తనతో పాటు వారికిని కర్తృత్వ యశము దక్కునట్లుగా శాస్త్రములో పురాణములో వ్రాయించు ఆచారము ఉండెడిదట. ఈ భాస్కర రామాయణ కర్తయు తదుపరి బమ్మెర పోతరాజును ఆ ప్రాచీన సంప్రదాయమునే పాటించి తమ గ్రంధములలో కొన్ని భాగములు ఆప్తులైన ఇతరులచే రచింప జేసిరని నా యూహ.

కుమార రుద్రదేవుడు భాస్కరునకు సమకాలమువాడై యుండుట పై ఊహకు ఇంకొక ఆధారము – అయ్యలార్యుడు యుద్ధకాండమునువలె అతడు భాస్కరుని తదనంతరము దేశాంతరమున రామాయణ పూరణము కొఱకు అయోధ్యకాండమును చేపట్టిన కవికాడు. అసలు బాలకాండము మొదలు యుద్ధకాండ పూర్వభాగము వరకు ఒకే కాలమున రచింపబడినదే కావున అయోధ్యాకాండము మిగిలిపోవుటయు తరువాత ఎప్పుడో పూర్తి చేయబడుటయు అనునవి తటస్థింపనే తటస్థింపవు. భాస్కరునకు కుమార రుద్రదేవునకు గల శైష్యోపాధ్యాయికమునుగాని, సాహిణి మారనకు కుమార రుద్రదేవునకు గల పితా పుత్ర సంబంధమునుగాని శంకించువారున్నను వారు కూడ ఈ గ్రంధము బాలకాండమును మొదలు యుద్ధకాండ పూర్వభాగముదాక ఏక కాలమున రచింపబడినదే యని యంగీకరింతురని నే ననుకొందును.

ఇది యిటులుండ నిండు. ఇటీవల శ్రీ అనుముల సుబ్రహ్మణ్యశాస్త్రిగారు కుమార రుద్రదేవుని గురించి తమ బాహుకాల చారిత్రకపరిశోధనను పురస్కరించుకొని కుమార రుద్రదేవుడనగా రెండవ ప్రతాపరుద్రుడే యనియు, అతడే కౌమార దశలో రుద్రదేవుడు అను నామమున బరుగుచుండెననియు, ఆ అయోధ్యాకాండ కర్త ఆ యువరాజేయనియు, సాహిణి మారన ఆ యువ రాజునకు తండ్రియే యనియు ఒక సిద్ధాంతము చేసిరి. అనగా రుద్రమదేవి తన సామంతుడో సేనానియో ఐన సాహిణి మారనకు తన పెద్ద కుమార్తెయైన ముమ్మడమ్మ నిచ్చి వివాహము చేసెననియు, ఆ దంపతులకు జనించినవాడే ప్రతాపరుద్రుడనియు తాత్పర్యము.

సాహిణి మారన యింటిపేరు నిశ్శంకవారనియు అతడు బ్రాహ్మణుడయనియు

అంగీకరించినారు. అతనికి ముమ్మడమ్మతోడి వివాహమును అంగీకరింపక పోవచ్చును. కాని యీ దంపతులకు గల జాతిభేదము ఆ బాంధవమునకు ఒక ప్రతిబంధకముకాదు రుద్రమదేవి తన రెండవ కూతురైన రుయ్యమను ఇందులూరి అన్నయమంత్రి యనెడి బ్రాహ్మణునకిచ్చి వివాహము చేయుట చరిత్ర ప్రసిద్ధమే గనుక ఆమె పెద్ద కుమార్తెకు కూడ అట్టి సంబంధమే చేసి యుండవచ్చును.

పూర్వకాలమున రాజులు తమ ఆడుపిల్లలకు తగిన రాజ సంబంధములు దొరకనప్పుడు తమ రాజ్యమున ఉన్నత పదస్థుడైన ఒక బ్రాహ్మణున కిచ్చి వివాహము చేసి అతనికి రాజ భోగానుకూలమైన సంపదను కల్గించి కుమార్తెలను బ్రాహ్మణునింటికి కాపురమునకు బంపకుండ అతనినే తమ యిల్లటపు టల్లుడుగా గౌరవించుచు ఆ అల్లుని కుల బ్రాహ్మణునిగా చెప్పుకొనెడివారట.* కావున ముమ్మడమ్మ భర్త బ్రాహ్మణుడైన సాహిణి మారన అయిన కావచ్చును.

కాని కుమార రుద్రదేవుడు ప్రతాపరుద్రదేవుడేయైనచో కాలమును బట్టి అతడు హుళక్కి భాస్కరునకు శిష్యుడగుట సందేహాస్పదము. అదియుగాక ప్రతాపరుద్రదేవుని యౌవరాజ్య కాలములోనే భాస్కర రామాయణము రచింపబడి యుండునేని తరువాతి శతాబ్దిలో ఎఱ్ఱాప్రెగ్గడ ఇంకొక రామాయణము రచించుటకు హేతువు కానరాదు. ఇది యట్లుండ సుబ్రహ్మణ్యశాస్త్రిగారి సిద్ధాంతములో ఇంకొక లోపము ఉన్నది.

శాసనాద్యాధారములనుబట్టి ముమ్మడమ్మ భర్త మహాదేవరాజే కాని సాహిణి మారనకాదు. కనుక సాహిణి మారన కుమారుడగు కుమార రుద్రదేవుడు కుమార ప్రతాపరుద్రుడు కాడు.

ఈ నలుగురు కవులలో భాస్కరుడు మేటి. అతని వెనక జెప్పదగినవాడయ్యలార్యుడు. యుద్ధకాండ భాగముల బోల్చి చూచినపు డిరువురు సమాన ప్రతిభాశాలురుగనే కన్పింతురు. వీరిరువురును భారత కవుల యౌచిత్య పరిపాలనమనెడి సుగుణమును కరతలామలక మొనర్చుకొనిరి.

భారత పద్యములను ఒఱవడిగ బెట్టుకొని భాస్కరుడు రచించిన పద్యము లిందు చాల కలవు. భారతౌచిత్యము వీరియందు బాగుగా గలదు. మల్లికార్జున భట్టు కవిత్వము గుణమున తండ్రి కవిత్వము వంటిదికాదు. కవులకు ప్రారంభదశలో నుండెడి యభిరుచులు పోకడలు అన్నియు నితని కవితలో కాననగును. ఇతనికి శబ్ద జటిలతాభిమానము మిక్కుటము. అయినను ఇతని కవిత్వము ఒక విధముగ రామాయణ కావ్యరచనకు అర్హమైనదే యగును. కావున ఈతని కవిత్వము మధ్యమజాతి దనవచ్చును. భాస్కరునిది సర్వథా ఉత్తమజాతి కవిత.

రుద్రదేవుడు మల్లికార్జునభట్టు తరువాత చెప్పదగినవాడు. సందర్భోచితమైనను గాకున్నను ఉద్రేకమును వెల్లివిరియించు స్వభావ మీతనిది. రామపట్టభంగ కథ వాల్మీకమున తాల్చిన గంభీరత, నిర్భరత యీతని చేతులలో పలుచబాఱి ఆవేశ ప్రవాహమున గొట్టుకొని పోయినది. అయినను రసపోషణలోపము రాలేదు.

* ఈ సంగతి సుప్రసిద్ధ చరిత్ర పరిశోధకుడు, నా మిత్రుడు కీ.శే భావరాజు వెంకట కృష్ణారావు చెప్పగా నేను విన్నాను.

భాస్కర రామాయణము రంగనాథ రామాయణమువలెనే కొన్ని అమూలక గాథలను స్వీకరించి, ఆ ద్విపద రామాయణముతో సంవదింప దలచెనేమో అనుటకు నిదర్శనములు గలవు.

అట్టి అమూలకములైన కథాంశములలో ఆ రెండు రామాయణములకు గల పోలికలు, భేదములు ఇచ్చట ఉదాహరించుచున్నాను.

**బాలకాండ:**

1. ఋష్యశృంగుని వేశ్యలు రోమపాదునింటికి గొనితెచ్చుటకై యే హావభావములను ప్రకటించిరని రంగనాథ రామాయణమున గలదో అవే భాస్కరరామాయణమునను ప్రకటించిరి.
2. అహల్య పాషాణముగా పడియున్న దనుట రెండింటనుగలదు. కాని ఇంద్రుడు కోడియై కూసి గౌతముని అకాలమున ఇల్లు వెడలించునట్లుగా భాస్కరరామాయణమున లేదు.
3. రంగనాథ రామాయణమున సీతావివాహఘట్టము సాంఘిక కర్మకాండమును బెంచి కాలధర్మ వైపరీత్యమును గల్పించెను. ఆదోషమును భాస్కర రామాయణ కర్తలు గుర్తెరిగి యథావాల్మీకముగా రచించిరి. కాని వాల్మీకము నందలి ఆర్షత్వము సమకూడలేదు.
4. రామ పరశురాముల సంభాషణము రంగనాథరామాయణమున కేవల యోధుల సంభాషణము వలె నుండ, ఇందు దివ్యత్వమారోపింపబడి అవతారపురుషుల మధ్య జరిగినట్లుండును.

**అయోధ్యాకాండ:**

మంధరకు రామునిపై ఈర్ష్యపుట్టుటకు కారణము చిన్ననాడు అతడు దాని కాలు విరుగగొట్టుట యని రంగనాథరామాయణములో నుండగా భాస్కర రామాయణములో మంధర రామునివలన పొందిన చరణ తాడన భంగము కారణమని చెప్పబడినది.

**అరణ్యకాండ:**

1. జంబు కుమారుని వృత్తాంతము రెండింటను కలదు.
2. లక్ష్మణుడు సీత పలికిన దుస్సహములైన ఉపాలంభన వాక్యములు వినలేక ఆమెను ఒంటిగా విడిచి వెడలిపోవునపుడు పర్ణశాల ముంగిట ఏడు బరులు గీచి వాటిని దాటి రావలదని సీతకు హితము గఱపినట్లు రంగనాథ రామాయణమున గలదు. అది భాస్కర రామాయణమున లేదు

**యుద్ధకాండ:**

1. సేతు నిర్మాణ ఘట్టమున రంగనాథ రామాయణమున ప్రవేశ పెట్టబడిన ఉడుత పాత్ర భాస్కర రామాయణములేదు.
2. రావణుని తల్లి కైకసి కుమారునకు హితము గఱపుట భాస్కర రామాయణమున లేదు.

3. రామలక్ష్మణులు నాగపాశ బద్ధులై యుండగా నారదుడేతెంచి రాముని విష్ణుత్వమును తలపించి ఆయనచే గరుత్మంతుని స్మరింపజేయగ గరుడుడేతెంచి నాగపాశములను విచ్ఛిన్నము గావించుట రెండింటను సమానము.
4. కాలనేమి వృత్తాంతము రెండింటను కలదు.
5. శుక్రోపదేశముచే రావణుడు పాతాళ హోమము చేయుట రెండింటను సమమే.
6. రావణుని నాభియందు నిగూఢమైయున్న అమృత కలశ రహస్యమును విభీషణుడు రామున కెఱింగించుట రెండింటను సమానమే.
7. సులోచనా వృత్తాంతము భాస్కర రామాయణమున లేదు.

వీటినిబట్టి చూడగా భాస్కరాదులు వాల్మీకమునేగాక రంగనాథ రామాయణమును సైతము చదివియే ఈ గ్రంథమును రచించినట్లు కనబడును. అసలు చదువకుండుట యెట్లు? రామాయణరచన కుపక్రమించిన భాస్కరుడు తనకు పూర్వము తన భాషలో అవతరించియున్న రామాయణమును శ్రద్ధతో చదివి యుండునని నిస్సందేహముగా చెప్పవచ్చును.

అవాల్మీకములైన ఇట్టి కథాంశములేగాక ద్విపద రామాయణమును నందలి కొన్ని పదములు, పదబంధములు, వాక్యములుకూడ భాస్కర రామాయణమున స్వీకరింపబడిన వనుటకు నిదర్శనములు చాల కలవు. వాటిలో ఈ క్రిందివి కొన్ని .

**బాలకాండ:**

1. దేవతలు రావణుని యౌద్ధత్యమును గూర్చి బ్రహ్మతో మొఱ పెట్టుకొనుట.

రంగనాథ రామాయణము

*"వాఁడన్నఁ గులగిరుల్ వడవడ వడఁకు*
*వేఁడిమి చూపఁగ వెఱచు భాస్కరుఁడు*
*వీఁకతో నతఁడున్న వీటనెన్నడును,*

*"దేఁకువచెడి గాలి తిరుగంగ వెఱచు*
*న న్నిశాచరుఁగన్న నాటోప మెసఁగ*
*మున్నీరు కడలొత్తి మ్రోయంగ వెఱచు"*

భాస్కర రామాయణము

"కడలెత్తి మ్రోయ వెఱచును
జడనిధు లినుఁడెండగాయ శంకిలు వానిన్
బొడగను నెడ వాయువులుర
వడి వీవక యడఁగు గిరులు వడవడ వడఁకున్"

2 విశ్వామిత్రుడు వసిష్ఠునిపై బ్రహ్మాస్త్ర ముపయోగించిన సందర్భము.

రంగనాథ రామాయణము

*సకల గీర్వాణులు సకల సంయములు*
*సకల గంధర్వులు సకల పన్నగులు*

సకల భూతంబులు సకల దిక్పతులు
సకల తారా గ్రహచంద్ర సూర్యులును
సకల లోకంబులు చలనంబు నొంద.

భాస్కర రామాయణము

సకలామర గంధర్వులు
సకలోరగ సకల భూత సకల దిశాపా
లక సకల గ్రహ తారక
సకల భువన సకల మునులుఁ జలనముఁ బొందన్.

**అయోధ్యా కాండ :**

యజ్ఞదత్తుడు దశరథ బాణముచే మృతినొందిన కుమారుని గూర్చి దుఃఖించు సందర్భము:

రంగనాథ రామాయణము

"దీర్ఘాయువని నిన్ను దీవింతుఁగాని నిర్ఘాత పటుబాణ నిహతి వర్ధిల్లితివె"

భాస్కర రామాయణము

"దీర్ఘాయు వనుట కర్థము నిర్ఘాత పటిష్ఠ బాణనిహతియె పుత్రా!"

**కిష్కింధా కాండము:**

శ్రీరాముడు సీతావియోగబాధ ననుభవించు సందర్భము

"ఇది యేమి యుత్పాత మిదియేమి చంద
మిది యేమి యీ రాత్రి యినుఁడేల పొడిచె
నామేని తాప మిన్మడి గాఁగఁ బొచ్చె
సౌమిత్రి ననుఁ దరుచ్ఛాయల ఁజేర్చు
మనినఁ జంద్రుడుఁగాని యర్కుండు గాఁడు
జననాథ! హరిణ లాంఛన మదే చూడు
మని లక్ష్మణుడు పల్క హరిణాక్షిపోయె
నని సీతఁ బేర్కొని యటు మూర్ఛవోవ".

ఈ ద్విపద పంక్తులకు మూలము జయదేవుని ప్రసన్న రాఘవ నాటకము నందలి రామలక్ష్మణ సంవాదత్మకమైన యీ క్రింది శ్లోకము :

"సౌమిత్రే! నను సేవ్యతాం తరుతలం చండాంశు రుజ్జృంభతే
చండాంశోర్నిశి కాకథా రఘుపతే! చంద్రోఽయ మున్మీలతి
వత్సైత ద్విదితం కథం ను భవతా? ధత్తేకురంగం యతః
క్వాసి ప్రేయసి! హాకురంగనయనే! చంద్రాననే! జానకీ!"

ఈ శ్లోకము ద్విపద రామాయణమందువలెనే పద్య రామాయణమునను తెనిగింపబడినది, చూడుడు:

"తపనుఁడు వేఁపఁ జొచ్చెనను: దమ్ముఁడ వృక్షము క్రిందఁ బెట్టునాఁ
దపనుఁడు రేయిలేఁడు వసుధావర! చంద్రుఁడుగాని చంద్రునిన్
నృపసుత! యెట్టిజింగిలివి నీవు? మృగాంకము చూడనున్కి వో
చపల మృగాక్షి! చంద్రముఖి! జానకి యెక్కడ నున్నదానవే?"

(అరణ్యకాండము: 2–264)

కాని ఇది భాస్కర రామాయణమున అరణ్యకాండమున గానవచ్చుచున్నది. అది ఆ పద్యముండవలసిన స్థానము కాదు. దాని స్థానము కిష్కింధాకాండమే. ఆ కాండము నందలి పద్యమును ప్రతులు వ్రాసికొను వారెవరో అరణ్యకాండమునకు తరలించి యుందురు. ఆ సందర్భముననే రామలక్ష్మణ సంవాదాత్మకములైన మరి రెండు పద్యములును గలవు. వాటికి మూలములు ఏ సంస్కృత నాటకమునందైనను కలవో లేక స్వతంత్రములో నేను చెప్పలేను.

ఇవి యిట్లుండ, రామపాత్ర చిత్రణమున ఈ రెండు రామాయణములకును ముఖ్యమైన భేదము కలదు. బుద్ధారెడ్డి రాముని పురుషోత్తముడనియే వాచ్యముగా పదేపదే వర్ణింపగా, భాస్కరాదులు వాల్మీకి మతానుసారముగా రాముని ఉత్తమ పురుషపుంగవునిగానే చిత్రించిరి. ఉదా:

1. రామలక్ష్మణులతో విశ్వామిత్రుడు వామనాశ్రమము దర్శించినపుడు వామనావతారకథ చెప్పుటలో ఆమహర్షి రామునితో 'ఆ వామనుడవే నీవు' అని ఉగ్గడించుట రాముని విష్ణుత్వమును సాక్షాత్తుగా చెప్పుట.

"నీవే వామనుఁడవై నెగడి త్రివిక్ర
మావతారము దాల్చినట్టి విష్ణుఁడవు
నాఁడును నిది నీ వనంబు శ్రీరామా!
నేఁనేడును నారీతి నీవనంబయ్యె". — బాలకాండము

భాస్కర రామాయణమున ఇట్టి ప్రశంస లేదు.

2. మతంగాశ్రమమున శబరి అగ్ని ప్రవేశము చేయబోవునపుడు కవి రామునకు వాడిన విశేషణములు విష్ణుపరములే.

"పరముఁ బరంధాముఁ బరమకల్యాణుఁ
బరిపూర్ణు పరమాత్ము బరమేష్ఠివినుతు
నవ్యయు నవికారు నఖిలాంతరాత్ము
నవ్యక్తు నఖిలేశు నాద్యంత రహితు
భవ ముఖామరవేద్యు భవరోగవైద్యు
రవికులాంబుధిచంద్రు రఘురామచంద్రుఁ
దనమది నిలిపి యత్తఱి వల గొనుచు
వినుతించి శబరి యా విభుని సన్నిధిని
ననలునియందు రామార్పణంబుగను". — అరణ్యకాండము.

భాస్కరరామాయణములో నిది లేదు

3 రంగనాథ రామాయణమునందు తార వాలికి హితము గఱపుటలో రాముని విష్ణుత్వమే యుగ్గడింపబడెను.

"ఆ రాఘవుడు విష్ణుఁడంబు జోదరుఁడు
వైరంబుగొని గెల్వ వశముగా దతని" – కిష్కింధాకాండము

భాస్కర రామాయణములో ఆ విష్ణు ప్రశంస లేదు సరికదా, రాముని మానవ మాత్రునిగా నెంచి తార, గాంధారి కృష్ణుని శపించినట్లుగా శపించుటయు కలదు.

"పోలఁబతి వ్రతఁ గావున, నోలిం బొలియన్ శపింప నోపుదు నీ వి
ట్లాలిం గోల్పడివగలం, గ్రాలెదు నిను వేఱ యేల కడఁగి శపింపన్.
(కిష్కింధ 304)

నరవర! యిట్లుకారణము నా పతిఁజంపితిగాన యీవు బం
ధుర భుజశక్తితో మహిజఁదోకొని వచ్చిన సీత నీ కడం
జిరతర కాల మింపుగ వసింపక నీవతి దుఃఖపాటుతో
నెరియచునుండ భూమిఁజొర నిమ్మనుచున్ శపియించెఁ గిన్కతోన్".
(కిష్కింధ 305)

ఈ శాప ప్రసంగము వాల్మీకమున సైతము లేదు

అదియుగాక ధనుర్భంగ ఘట్టమునందు రంగనాథ రామాయణమున రామ విశ్వామిత్ర పాత్రలలో కాన వచ్చెడి గాంభీర్య లోపము భాస్కర రామాయణమున వాటిల్లలేదు. అట్లే సీతారాముల వివాహవర్ణనము కూడ రంగనాథ రామాయణమున ఎక్కువ లౌకిక తంతుతోను, భాస్కర రామాయణమున ఎక్కువ వైదిక కల్పానుసారముగను నడిచినది.

మొత్తము మీద భాస్కర రామాయణము రంగనాథ రామాయణమువలె వాల్మీకమునకు ఎక్కువ దూరము పోలేదు. మరి అమూలకమైన గాథలను రంగనాథ రామాయణము వలెనె స్వీకరించుట అవి తత్పూర్వమే ఆంధ్రమున ప్రజాదరమును పొందియున్న కథలగుట వలన వాటిని విసర్జించినచో తమ గ్రంథము లోకమునకు తృప్తి గొల్పదని భాస్కరాదులు సందేహించిరేమో! సులోచనా వృత్తాంతము అట్టి వాటిలో ఒకటియైనను ఏల వదలిపెట్టబడెనో చెప్పలేము. బహుశః కొందరు పరిశోధకులు తలంచినట్లు ఆ కథకు రంగనాథ రామాయణమున ప్రవేశము కలుగుట భాస్కరాదుల తరువాత ఎప్పుడో జరిగియుండును.

## నాచన సోముడు

కాకతీయ సామ్రాజ్య పతనానంతరము, తురుష్కులపాలై పోయినదిపోగా మిగిలిన యాంధ్ర భూభాగమున అద్దంకిలో రెడ్డి రాజ్యమును, రాచకొండలో వెలమరాజ్యమును, విజయనగరములో విజయనగర రాజ్యమును స్వతంత్రముగా వెలసినవని పూర్వ ప్రకరణములో చెప్పితిని. వీటిలో రెడ్డి రాజ్య స్థాపనకు పిమ్మట సుమారు పది సంవత్సరములకు వేదభాష్య కర్తయైన విద్యారణ్య యతీంద్రుల యాశీస్సులతో

హరిహరరాయ బుక్కరాయలనెడు సోదరులు తుంగభద్రా తీరమున విజయనగర రాజ్యమును స్థాపించిరి. ఈ రాజ్యమే క్రమక్రమముగా దక్షిణ భారతము నంత టను వ్యాపించి విజయనగర మహా సామ్రాజ్యమును పేర శత్రుదుర్నిరీక్ష్యములైన తేజోబలపరాక్రమములతో వర్ధిల్లెను.

రెడ్డి రాజ్యమునకు ప్రథమాస్థానకవి యెఱ్ఱాప్రెగ్గడ యైనట్లు, విజయనగరాస్థాన మునకు ప్రథమ కవి నాచనసోముడని చెప్పవచ్చును. కాని యెఱ్ఱన తన రాజైన వేమారెడ్డికి గ్రంథమును కృతియిచ్చినట్లు, నాచనసోముడు హరిహరరాయలకు గాని, బుక్కరాయలకు గాని గ్రంథమేదియును కృతి యిచ్చినట్లు కానరాదు ప్రసిద్ధమైన యాతని యుత్తర హరివంశము హరిహరనాథునకు కృతియీయబడినది ఆస్థానమున నున్నత మాత్రమున కవియైనవాడు తనగ్రంథములను ఆ రాజునకే అంకితము నీయవలయునను నియమము లేదు. కనుక సోమన తదాస్థానమున పదస్థుడై యుండి యుండవచ్చును. గ్రంథము కృతి యియ్యకున్నను అతని శాస్త్ర వైదుష్యమునకు మెచ్చి బుక్కదేవరాయ లొక యగ్రహారమును దానము చేసెను. దానిని బట్టియే నాచనసోముడు విజయనగర రాజ్య ప్రథమాంధ్రకవి యని చెప్పకొనుట పరిపాటియైనది.

అగ్రహార ప్రదాన సమయమున బుక్కదేవరాయలు వేయించిన శాసనమునకు రెండు ప్రతులు కలవు. అగ్రహారదాన సంవత్సరము తారణ సంవత్సరమని మాత్రము రెండింటను సమానముగా నున్నది కాని శాలివాహన శకాబ్ద సంఖ్యలో ఆ రెంటికిని భేదము కలదు. ఒకదానిలో "రస భూ నయనేందుభిః శకస్యాబ్దే అలంకృతే తారణాబ్దే చైత్రమాసే" అని కలదు. అనగా రసభూనయనేందు సంఖ్యా సంకేతితమైన సంవత్సరము. అది శాలివాహన శకము 1216 (క్రీ శ 1294) అని యర్థము. రెండవదానిలో "రసాభ్ర నయనేందుభిః శకస్యాబ్దే అలంకృతే తారణాబ్దే చైత్రమాసే" అని యున్నది. ఇది శాలివాహన శకము 1206 క్రీ.శ. 1284 ఈ రెండింటిలో తారణ సంవత్సరము 1206 లోనే సంభవించును. గనుక రెండవ పాఠమే సరియైనదది తోచును. కాని అదియు పొసగదు. ఏమనగా క్రీ.శ. 1336 లో స్థాపింపబడిన విజయనగర సామ్రాజ్యము నేలిన బుక్కరాయలు క్రీ శ 1284 లో శాసనము వేయించుట అసంభవము. కాబట్టి యీ రెండు పాఠములును దప్పేయని యూహించి శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రిగారు ఆ సంవత్సర సంకేత వాక్యమును "రసర్తునయనేందుభిః" అని సవరించిరి అనగా శా శ 1266 (1266+78=1344 క్రీ.శ.) అది తారణ సంవత్సరమే అది విజయనగర సామ్రాజ్య స్థాపనానంతర మెనిమిది సంవత్సరములకు వచ్చును. శ్రీ ప్రభాకరశాస్త్రిగారి నిర్ణయమును పండితులందరు అంగీకరించిరి. శాసన కాలము నాటికి రాజ్యమేలు చున్నవాడు హరిహరరాయలు, బుక్కరాయలు యువరాజు మాత్రమే ఐనను సర్వసమర్థతతో అన్నగారికి కుడిభుజమై రాజ్యపాలనాధికమున ప్రాభవముతో పాల్గొనుచుండినవాడు. గాన ఆ యువరాజు ఆ యగ్రహార ప్రదానము చేయుటయు అతని పేరు మీదనే శాసనము వేయబడుటయు న్యాయమే. ఈ శాసనమునుబట్టి యుత్తర హరివంశ రచనా కాలమును నిర్ణయింపలేము. ఈ గ్రంథమునకును ఆ శాసనమునకును ఏమియు సంబంధములేదు. బహుశః ఈ మహాకావ్య రచనా సముపార్జితమైన యశస్సు

వ్యాపించిన పిమ్మటనే సోముడు రాజుచే సన్మానితుడై యుండవచ్చును అగుచో ఈ గ్రంథము క్రీ.శ. 1340 ప్రాంతమున పుట్టియుండును. ఈ యూహ నిజమగునేని ఎఱ్ఱన హరి వంశము కంటె సోముని హరి వంశము వయసున సుమారు పదేండ్లు చిన్నది. శాసన కాలము నాటికి ఉద్దండ పండితుడుగా ప్రసిద్ధికెక్కి రాజసమ్మానితుడైన నాచన సోముడు శతాబ్దియారంభమున జన్మించి యుండవచ్చును కాగా ఎఱ్ఱాప్రెగ్గడ కంటె సుమారిరువది సంవత్సరములు చిన్నవాడై యుండును.

ఇతని కవితా యశస్సునకు కారణభూతమైనది ఉత్తర హరివంశము ఇతడు హరివంశమును పూర్వహరివంశము, ఉత్తరహరివంశము అను పేర్లతో రచించియుం డుననియు నందు మొదటి ఉత్పన్నమైపోగా నుత్తర హరి వంశము మాత్రమే మిగిలినదనియు కొందరనుకొందురు. వారియూహ కాధారములివి:-

1) ఈ ఉత్తర హరివంశమునకు ఇష్టదేవతాస్తుతి కృతి ప్రదానాత్మకమైన అవతారికా భాగములేదు.

2) కథా ప్రారంభమునందలి యీ క్రింది రెండు పద్యములు పూర్వభాగమును స్మరింపజేయునవిగా నున్నవి.

*కం॥ హరివంశ ప్రథమ కథాం*
*తరమునఁగల వింతలెల్లఁ దప్పక మదిలోఁ*
*దిరమయ్యెఁ గద మీఁదట*
*నరవర! యే కథలొకో? వినం బ్రియ మనుడున్.* (1-3)

*కం॥ జనమేజయుఁడిట్లను న*
*మ్మునితో? బలదేవు లావు మునువిని మఱియుం*
*దనియదు మది ముద మొదవగ*
*వినఁగోరెడుఁ జెప్పవే వివేక నిధానా!* (1-4)

కాని ఈ యుక్తులంత బలమైనవి కావు ఏమన ఈ గ్రంథమునకు అవతారిక అనావశ్యకమనియు నిది తిక్కన సోమయాజి కృత భారతమునకు పరిశిష్టభాగముగా గ్రహింపబడవలెననియు కవి భావించినట్లు గద్యమున ఈ పంక్తులు కలవు:

"ఇది శ్రీమదుభయకవిమిత్త్రి కొమ్మనామాత్య పుత్త్రి బుధారాధన విరాజి తిక్కన సోమయాజి ప్రణీతంబైన శ్రీమహాభారత కథానంతరంబున శ్రీమత్సకల భాషా భూషణ సాహిత్యరసపోషణ సంవిధానచక్రవర్తి సంపూర్ణకీర్తి నవీనగుణ సనాథ నాచన సోమనాథ ప్రణీతంబైన యుత్తరహరివంశంబు నందుఁ బ్రథమాశ్వాసము" సంస్కృతమున హరివంశము భారతమునకు పూరకమైనట్లు తెనుగున తన గ్రంథమే తిక్కన కవికృత భారతమునకు పూరకముగా భావింప బడవలెనని కవి మనోరథము, మఱియు తిక్కన తన భారతమును హరిహరనాథున కర్పించినట్లే తానును ఆ దేవునకే తన గ్రంథమును అంకితమిచ్చుటపై ఊహను బలపరచుచున్నది. అట్టిచో ఈ గ్రంథమునకు అవతారిక అనావశ్యకమని భావించుట సహజమే.

నిజమునకు సోమన యెఱ్ఱాప్రెగడ వలెనే హరివంశమునంతను పూర్తిగా వ్రాసి యుండునేని యందలి రెండు భాగములకు పూర్వభాగము, ఉత్తర భాగము అని

పేళ్ళు పెట్టవలయునుగాని పూర్వహరివంశము, ఉత్తరహరివంశము అని వ్యవహరించుట తగదు. మఱియు తాను కృష్ణావతారమహిమలు కొన్నే చెప్పదలచితిననియు, తాను చెప్పక విడిచిన వాటిని ఇతర పురాణ కథల వలన తెలిసికొనవలయునని కవి యీ క్రింది పద్యమున చెప్పెను:

కం॥ హలపాణి మహిమ చెప్పం
గలవారెవ్వరు పురాణ కథలన్ మఱియుం
దెలిసికొనుము నేఁ జెప్పక
నిలిచిన చోటులు వివేక నిర్మల బుద్ధిన్. (1–11)

దీనినిబట్టి తాను కృష్ణునకు సంబంధించిన కొన్ని కథలే చెప్పదలచినట్టు కవి స్పష్టముగా వ్యక్తము చేసెనని యనుకొనవచ్చును. మఱి ఆ చెప్పదలచిన కొన్ని కథలకు "ఉత్తర హరివంశము" అని పేరు పెట్టనేల? యని యందుమేని అందలి కథలన్నియు హరివంశమునందలి యుత్తర భాగమునకు సంబంధించినవి గనుక అని సమాధానము. అందుచే ఉత్తర హరివంశము అనుటలో తప్పులేదు. మరి యితడు పూర్వభాగమును రచింపలేదనియే పలువురి యభిప్రాయము. పూర్వభాగమున బాలకృష్ణ లీలా కథనము తప్ప తక్కిన భాగమంతయు నీరసముగా పౌరాణిక విషయ భూయిష్ఠముగా నుండును. సాహిత్య రసపోషణ సంవిధాన చక్రవర్తి యనిపించుకొన్న సోమన ఆ నీరసఘట్టములను గైకొని తన బిరుదమును సార్థకము చేసికొనలేదు. ఆయనది రసపోషణ పరాయణమైన ప్రాబంధికధోరణి. ఆ ధోరణికి విషయ ప్రధానములు, విజ్ఞానోపదేశ మాత్ర ప్రయోజకములునైన ఘట్టములు పనికిరావు.

ఉద్విగ్నమైన యీతని చిత్త ప్రవృత్తి కూడ వాటిని అంగీకరింపదు. ప్రతి పద్యమును ఏదో యొక రస భావముతోనో, చమత్కారార్థముతోనో, రమణీయార్థముతోనో, శబ్దాలంకారముతోనో, అర్థాలంకారముతోనో, అలంకరించి కావ్యమంతయు హృదయావర్జకముగా రచింపవలయుననెడి కుతూహలము కలవాడీతడు. ఇట్టి రసావిష్టుడైన కవి పౌరాణిక భాగములను తడవకపోవుట సహజమే.

ఈ గ్రంథమున గల కథలన్నియు హరివంశోత్తర భాగము నందలివగుటచే దీనికి ఉత్తర హరివంశమను పేరే తగియున్నది. ఆ ఉత్తరభాగము ఎఱ్ఱాప్రెగ్గడ గ్రంథము నందలి యుత్తర భాగమే యని యనుమానించుటకు కొంత అవకాశమున్నది సంస్కృత హరివంశము హరివంశపర్వము, విష్ణుపర్వము, భవిష్యపర్వము అను మూడు భాగములు కలది. ఎఱ్ఱన ఆ మూడు పర్వములను అనువాదములో పూర్వోత్తర భాగములుగా విభజించెను. సోమన రచించిన ఉత్తర హరివంశము నందలి కథలన్నియు నెఱ్ఱన యుత్తరభాగము నందలివియే యగుటచే దానినే యీత డనుసరించెనేమో యని యనుకొనవచ్చును. ఎఱ్ఱన రచన ప్రకారము నరకాసుర వధ కుండిన నగరమున రుక్మిని సంహరించి బలరాముడు ద్వారకకు వచ్చిన పిమ్మట జరిగినట్లున్నది. సోమన హరివంశములో సైతము నరకాసుర కథకు పూర్వవృత్తాంతముగా రుక్మిమరణమే ప్రస్తావింపబడినది.

కం॥ అనుటయు నాజనమేజయ
జనపతి యిట్లనియె రుక్మి సచ్చిన మగుడం

జని యాదవ నగరంబున
జనార్దనుండేమి సేసె సౌజన్యనిధీ?

కావున ఎఱ్ఱాప్రెగ్గడ భాగమునే యీతడు తన రచన కాధారముగా గైకొని యుండవచ్చును.

మరియు నెఱ్ఱాప్రెగ్గడ యుత్తరభాగమున నరకాసురకథకు పూర్వము జరాసంధుడు మధురపై దండెత్తుట, ద్వారకా నిర్మాణము, బలరాముడు కాళిందీ భేదనము సేయుట, రుక్మిణీ కల్యాణము, బలరాముడు రుక్మిని చంపుట యను మూడు ప్రధాన కథలు కలవు. ఆ మూడింటిని వదలి సోమన నరకాసుర కథతో తన గ్రంథమును ఉపక్రమించెను. ఆ మూడును ఉత్పన్నమై పోయినవని తలంపబడెడు పూర్వ హరివంశమున ఉన్నవేమో యని సందేహించుటకును వీలులేదు. ఏమనగా ఎఱ్ఱనకును, సోమనకును లభించిన మూలహరివంశము మూడు పర్వములు కలదిగా గాక పూర్వోత్తరము లనెడి రెండు భాగములు కలదియే యగునేని నరకుని కథకు పూర్వమున గలవని పైని పేర్కొన్న మూడు కథలు ఉత్తరభాగము నందలివియే కాని, పూర్వ భాగమునందలివి కావు. కాబట్టి బలరామకృష్ణుల చరిత్రలో గల రసవద్ఘట్టములలో కొన్ని మాత్రమే గైకొని యీతడు ఉత్తర హరివంశమును రచించెననుట సత్యము రుక్మిణీ కల్యాణము అట్టి రసవద్ఘట్టమే. సోమన దానినేల వదలిపెట్టెనో తెలియదు.

ఎఱ్ఱన భవిష్యపర్వము చాల సంగ్రహించెనని యీతని ప్రకరణమున చెప్పితిని. ఇతడు దానిని తడవనేలేదు కావున ఇతడు ఉత్తర భాగమునైనను— అది సంస్కృతోత్తర భాగమైనను కావచ్చును, ఎఱ్ఱన యుత్తరభాగమైనను కావచ్చును — పూర్తిగా అనుసరింపలేదు; అనువదింపలేదు

హరివంశము నుండి యీతడు గైకొన్న కథ లాఱు

1. నరకాసుర వధ (ప్రథమాశ్వాసము)
2. మృతుడైన యొక బ్రాహ్మణ బాలుని శ్రీకృష్ణుడు బ్రతికించుట (ద్వితీయాశ్వాసము)
3. శ్రీకృష్ణుడు సంతానార్థియై కైలాసమున కేగి శివునిచే వరము పొందుట (తృతీయ)
4. పౌండ్రక వాసుదేవుని సంహారము (చతుర్థ)
5. హంసడిభకోపాఖ్యానము (పంచమ)
6. ఉషాపరిణయము (షష్ఠాశ్వాసము)

**గ్రంథ పరామర్శ:** ఈ ఆఱు కథలలో ప్రథమాశ్వాసము నందలి నరకాసురోపాఖ్యానము రచనలో తక్కిన కథలకంటె ఉత్తమోత్తమముగా నున్నది దాని తరువాత పేర్కొనదగినది హంసడిభకోపాఖ్యానము.

నరకుని కథలో ఊర్వశీ నరకాసుర సంభాషణము తిక్కనార్యుని రంభా రావణ సంవాదనమునకు ప్రతిబింబమని చెప్పదగియున్నది. ఈ యెడనే కాదు, అనువైనప్పుడెల్ల తిక్కనగారి రచనా పద్ధతిని ఒరవడిగా పెట్టుకొని రచనసాగించుట యితనికి పరిపాటి. ఆ యనుకరణము వలన తాను తిక్కనార్యుని అపరావతారముగా లోకముచే కీర్తింపబడవలయునను ఆశ కలవానివలెనే తోచును. తన గ్రంథము తిక్కన భారతమునకు పరిశిష్ట భాగముగా హరిహరనాథునకే యంకితముగా నుపక్రమించుటలోనే సోమునకు

అట్టి యాశ కలదని స్ఫురించుచున్నది. ఆఛాయలున్నను అందు పాత్ర సృష్టిలోను సంవాద చాతురిలోనుగల శిల్ప ప్రౌఢి యిందు కొంత కొరవడినదని చెప్పవచ్చును.

ఈ కథలలో నిరువురు దేవవేశ్యలే యైనను వారికి కొంత భేదమున్నది రంభ నలకూబరునకు ప్రియురాలు. అనన్యసక్త. అందుచే రావణునితో నామె చేయు సంభాషణలో నించుకేనియు గణికాత్వము స్ఫురింపదు. అయినను ఉద్ధతుడైన రావణుని తప్పించుకొనలేక పోయినది, ఇక ఊర్వశి మొదటి నుండియు వేశ్యగానే నరకునితో సంభాషించి అతని చేయి జిక్కక తప్పించుకొని పోవుటయేగాక కపటోపాయముచే నా రాక్షసునే యాత్మ వినాశహేతువైన కార్యమునకు పురికొల్పినది. వాడు అవివేకియై ఆమె పన్నిన మాయావాగురలో చిక్కుకొనెను. ఇది సహజమే. క్రూరులకు అవివేకమును, కపటులకు ధీరుత్వమును సహజ లక్షణములు. నరకుడు హవిర్భాగ హరణార్థమై ఋషులను బాధించుటయే కృష్ణుని నరకసంహారసంకల్పమునకు ప్రథమ కారణము. నరకాసురోపాఖ్యానములో ఊర్వశి నటించిన యీ రంగమే ప్రాణవంతమైన ప్రథమ ఘట్టము. రెండవది సత్యభామ నరకునితో యుద్ధము చేయుట. కృష్ణుడొసంగిన విల్లందుకొని యరదముపై నిల్చి నా నేర్పు చూడుమని ప్రియునిపై నొక చూపును, నా శక్తిని చూడుమని రిపుపై నొక చూపును బరపుచు, ప్రణయ రసాసారమును, శౌర్య రసాసారమును సాత్రాజితి మనోహర, భయంకర రూప ద్వయమును ఏకత్ర మేళవించి ప్రదర్శించిన సోమన రూపచిత్రణ కౌశలమే అతని సాహిత్య రసపోషణ బిరుదమును సార్థకము చేయు గుణములలో నొకటిగా పేర్కొనబడదగినది. ఈ ఘట్టము భాగవతములో పోతనార్యునకు అనుకరణీయ మగుటయే దీని రసవత్తకు ప్రబల దృష్టాంతము.

హంసడిభకోపాఖ్యానము వీరరస ప్రధానమైన యొక ప్రత్యేక కావ్యముగా పేర్కొనదగిన ఉపాఖ్యానము. 'తిక్కనగారి యుద్ధ వర్ణనలకు ప్రతిచ్ఛాయలుగా యుద్ధ వర్ణనలు చేయుటలో సోముడు మిక్కిలి సమర్థుడు' – అను ప్రశస్తికి ఈ గ్రంథమందలి యుద్ధ వర్ణనలన్నియు తార్కాణములే యగునుగాని, ఈ ఉపాఖ్యానమునందలి వర్ణనలో ఆ ఛాయలు ప్రస్ఫుటములుగా నుండును మఱియు నిందలి జనార్దనుని రాయబారము భారతము నందలి సంజయ రాయబారమునకు సోదరప్రాయమని కొందరు తలంతురు. రాయబారము, సందేశము, ప్రతిసందేశము అనెడి యంశములలో తప్ప సంజయ రాయబారమునకు జనార్దనుని రాయబారమునకు వస్తుతః సామ్యము లేదు. సంజయుడు యుద్ధ సన్నద్ధులైయున్న పాండవులను మాటలచే వంచించి శాంతింపజేయుటకై వారి శిబిరమునకు వచ్చిన కౌరవ పక్షపాతి మరి జనార్దనుడు హంసడిభకుల దౌష్ట్యమును సహింపని కృష్ణ పక్షపాతి రాయబారపు నెపమున ఆ పరమపురుషుని దర్శనమైనను కల్గునెడి ఆశతో ఆయన కొలువునకు వచ్చిన మహాభక్తుడు దూతయై వచ్చినవాడు తాను తెచ్చిన సందేశములను వినిపించుట విధిగావున అభక్తుడు కృష్ణుని యాదేశమువ హంసడిభకుల పరుషవాక్యములను వినిపింప గలిగెనుగాని కానిచో వాటిని ఉచ్చరించుటయే పాపమని తలచెడి పరమపావనుడు కావున సంజయునకు జనార్దనునకును పోలిక లేదు

తుది రెండాశ్వాసములలో గల కథ (5, 6 అశ్వాసములు) ఉషా పరిణయముగా

ప్రసిద్ధి కెక్కినదిగాని, నిజమునకు అది 'బాణాసురబాహు ఖండనము' అని చెప్పదగినది. దుష్ట శిక్షకుడైన కృష్ణుని మహిమలు, పరాక్రమములు చెప్పదలచిన యీ కవి, బాణాసుర బాహు ఖండనము కూడ కృష్ణుని పరాక్రమకేళికి ఉదాహరణాంతరము కాగలదని యీ కథను ఉపక్రమించినట్లు కథాదియందే కలదు మున్ను మురాంతకుండు చేసిన లావు లెన్ని యెన్ని?

కం॥ "వీణాంక ధరుఁడు దోడుగ
బాణుఁడు మొగరింప బాహుపంక్తి శతంబున్
క్షీణముగ నఱికి వానిం
బ్రాణముతోఁ బట్టి విడిచె బలి మథనుడనిన్."

అయితే బాణ శిక్షకు ఉషానిరుద్ధుల ప్రణయ కలాపము కారణమైనందువలన దీనికి ఉషా పరిణయ మను పేరు వచ్చినది. కానీ, సోమన ఈ కావ్యమున వారి వివాహము మాటయే తల పెట్టలేదు. అనిరుద్ధునితోపాటు ఉషనుకూడ గరుడవాహనముపై నెక్కించుకొని శ్రీకృష్ణుడు ద్వారకకు తరలి పోయెనని మాత్రము చెప్పెను. వారి వివాహము అచ్చట జరిగి యుండునని మన మూహించుకొనవలయును. ఎఱ్ఱాప్రెగ్గడ మాత్రము, శోణపురముననే కృష్ణుడు వారి వివాహమహోత్సవము జరిపి మనుమరాలిచే రుద్రాణికి నమస్కారము చేయించినట్లును, పరమేశ్వరి వధువునకు దీవెన లిచ్చినట్లును తన హరివంశమున కథను మంగళాంత మొనర్చి ఉషా పరిణయమనెడు పేరు సార్థకపరచెను.

ఈ బాణాసుర కథలో ఇందుధరోపాఖ్యాన మనెడి పార్వతీపరమేశ్వరుల జలకేళీ వనవిహార వర్ణన యంతయు నిర్వచనోత్తర రామాయణమునందలి సీతారాముల వన విహార వర్ణనకు రూపాంతరముగా నున్నది. కాని అయ్యెడ సీతారాముల ప్రణయ మాధుర్యము వెల్లివిరిసినయట్లు ఈయెడ పార్వతీపరమేశ్వరుల ప్రణయ మాధుర్యము పరిస్ఫుటము నొందలేదు. ఆ సౌకుమార్యము కూడ ఇందులేదు

**కవిత్వ పరామర్శ:** సోముని తెలుగు కవులలో ఉత్తమోత్తమ వర్గమున ఒకనిగా పేర్కొను విమర్శకులు కొందరు కలరు. అందును తిక్కనకు సాటి రాగల కవి యితడొక్కడే యని వారిలో కొందరి యభిప్రాయము. వారి ఊహ సహేతుకమే యనిపించు లక్షణములు ఈతని కవితయందు చాల కలవు. తిక్కనవలెనే యీతడును గ్రంథమును హరిహరనాథున కిచ్చుట యటుండ, రచన యందును ఆయన వలెనే లోక వ్యవహారమునగల మాటలనే యెక్కువ వాడుట, అలతియలతి పదములతో తీక్ష్ణమైన వాక్యరచన చేయుట, మూర్తి చిత్రణమున స్వాభావికతను సంపాదించుట మున్నగు లక్షణములలో సోముని కవిత శోభిల్లుచుండును ఈ ప్రజ్ఞలవల్లనే యితడు తిక్కనతో సముడని కొందరు భ్రమించుట తటస్థించినది నిజమే, తిక్కన కవితా పద్ధతి అననుకరణీయము. దాని ననుకరింప బ్రయత్నించిన కవిలేడు ఏ మాత్రమో దాని ననుకరించి యీషణ్మాత్రమైనను నెగ్గితి ననిపించుకొన్నవాడీకవి.

1. తిక్కన వలెనే యీతడు అలతి అలతి పదాలతో అర్థవంతములైన మహావాక్యములు వ్రాయగలడు.

2. రెండు మూడు వాక్యములతో పాత్రల స్వరూపస్వభావముల ననాయాసముగా చిత్రింపగలడు.
3. యుద్ధములను, రాయబారములను నడుపుటలో తన లోకానుభవమును, నీతి విశారదతను వ్యక్తపరచగలడు.
4. భావము ననుసరించి భాషాగతిని మార్చగలడు.
5. జాతీయము కొరకు లోకవ్యవహార భాషనే ఎక్కువ వాడగలడు.

ఇవి తిక్కనతో సాటి యని లోకులనుటకు గల వీని గుణములు. కానీ యితని కందని సత్తా తిక్కన్నలో చాల కలదు. తిక్కన కావ్యకళా నిర్వహణలో చేరిన గమ్యము సోమునకు కనుచూపుమేరలో నైనను లేదు. ఈతడు గ్రంథమును హరిహరనాథున కంకిత మిచ్చుట లాంఛన ప్రాయమేగాని, తిక్కనవలె అపరోక్షానుభూతి ఫలము కాదు. హరిహరనాథ సంబోధనముగల ఈతని పద్యము లన్నియు అర్థద్వయ చమత్కారము కలవియేగాని పరతత్త్వ నిరూపణము గలవి కావు. మఱి పాత్రచిత్రణములో, కథాకథనములో, ఔచిత్య పరిపాలనములో, ధర్మోపదేశములో ఇతడు తిక్కనకు అల్లంత దూరమున నిలువవలసినవాడేగాని సమీపింపదగినవాడు కాదు

ఇతడు ఎంత నీరసార్థమునైనను ఉక్తివైచిత్రితో సుందరముగా చేయగలడు. ప్రతి పద్యమునందును ఏదో యొక కావ్యగుణము ద్యోతిత మొనర్పగలడు. ఇది యీతని విశిష్టత. కాని, ఆతని భావమునకు తీవ్రమైన పరుగేకాని మంద గమనము లేదు. భాష సైతము కంటకశిలా ప్రదేశమున ప్రవహించు ఝరీ వేగమున దుమికి పోవునుగాని సమప్రదేశమున శాంతముగా నడవదు. ఈతనిది చాల ఉద్రిక్తమైన స్వభావము. దాని వల్లనే వాక్యములలో కొన్నింట దురుసుతనము కన్పించుచుండును. పుత్రభిక్ష నర్థింపవచ్చిన బ్రాహ్మణుడు, శ్రీకృష్ణునితో నీవు నేడురాక రేపు వచ్చిన యెడల ఆ శిశువింతలో "మాడిన నేమి చేయుదువు? మంత్రపు నీళులు సల్లవచ్చెదే?" అని యనుట ఆతని దుఃఖ విహ్వలతదృష్ట్యా చూచినను సమర్థనీయము కాదు శ్రీకృష్ణునొద్దకు రాయబారమునకు పోవుచు తద్దర్శన పుణ్యమువలన తనకు మారుజన్మ ఉండదని సంతసించెడి జనార్దనుడు అట్టి పునర్జన్మయే కలిగివచో "కమలజాని పేర దాపటి కాలి బొమ్మ* వేసికొందును" అని తామసించుట ఆ ముహూర్తమున సాత్త్విక మనోవస్థలో నున్న ఆ భక్తునకు తగదు.

పైని ఉదాహరించిన దురుసుతనపు పలుకులు, ఉద్రిక్త స్వభావమునకు ఫలము. ఆ స్వభావము యొక్క ఫలమే రచనలో అనౌచిత్యములు దొరలుచుండుట. ఇది యిటులుండ, దుష్కరప్రాసలు, నిరోష్ఠ్య పద్యములు, ఆడంబరశయ్య, మితిమీరిన యనుప్రాస విన్యాసము మొదలగు స్వారస్య విహీనమైన లక్షణములు ఈతని కవిత్వములో తరచుగా పొడకట్టుచుండును. ఈ చిత్రకవిత్వమును అలంకారికులు అధమకవిత్వముగా నిరసించిరి. యథార్థ రస సంపాదనా శక్తిలేని ఉత్తరకాలపు ప్రబంధ కవులకు ఈ

---

* శత్రువులను జయించిన రాజులు తమ యెడమకాలి గండ పెండేరము నందు పరాజితులైన యా శత్రువుల యొక్క బొమ్మలను చెక్కించుకొని, వారు తమ పాదాక్రాంతులైనట్లుగా సంతసించుట యొక పూర్వాచారము.

చిత్రకవిత్వమే శరణ్యమై ప్రబంధముల యెడ సరసులకు వీవగింపు కలిగించినది.

ప్రాచీనాంధ్ర కవి కృతులలో దురవబోధములనబడు వానియందు సోమనాథుని కృతి ప్రధానమైనది అని శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రిగారి అభిప్రాయము. ఈ సిద్ధాంతమునకు పూర్వపక్షము లేదు. ఈ అప్రసన్నతా దోషమునకు ముఖ్య కారణములివి:

1. ఇతర మండలముల వారికి అర్థముగాని శుద్ధమాండలిక పదములు బహుళముగా వాడుట.

2. సంస్కృత పదప్రయోగమున కూడ నిఘంటు సాహాయ్యమున గాని బోధపడని మారుమూల పదములు బుద్ధిపూర్వకముగా ప్రయోగించుట.

3. వాక్యయోజనలో వింతలు విశేషములు కల్పించి అన్వయము దుష్కరము చేయుట.

ఉదా:—

ఉ॥ ఇచ్చినఁ బొంగి యచ్చెలువ యింపును దెంపును లోన మానమున్
మచ్చరముంబెనంగ మురమర్దనుపై నరకాసురేంద్రుపై
నచ్చుపుఁ జాయలం గువలయ చ్ఛదగుచ్ఛవిషచ్ఛటా వలిన్
మెచ్చని వానిఁగేల్కొలిపె మేలపుఁ జూపుల వాఁడి తూపులన్!

ఈ యెడ 'కువలయచ్ఛద గుచ్ఛ విషచ్ఛటా వలిన్' అను సమాసమును కువలయచ్ఛదగుచ్ఛము, విషచ్ఛటావలి – అని రెండుగా విభజించినగాని ఇందలి క్రమాలంకారము అర్థము కాదు. ఇది యొక వింత సమాస ఘటన.

4. అపూర్వములైన ఉపమలు, అర్థాంతరన్యాసములు ప్రయోగించుట గ్రంథస్థములైన ఉపమానాదులను ప్రయోగించుట కంటె స్వతంత్రముగా తాను ఊహించినవి ప్రతిభకు నిదర్శనమే యగునుగాని వాటివల్ల వాక్యములకు దుర్బోధకత్వము రాకూడదు. ఉదా:— 'ఇట్టిక సూడినవాడు'

నరకాసురుని చేతిలో పరాభూతుడైన యముడు వెనుదిరిగి చూడకుండ పారిపోవుటకు సోమన యిట్టికసూడిన వాని పోకను ఉపమానముగా గైకొనెను. ఇట్టిక సూడిన వాడనగా నిటుకయావమునకు నిప్పు పెట్టినవాడు. వాడు నిప్పు పెట్టి వెనుదిరిగి చూడకుండ పోవుట ఆచారము. ఈ యుపమానము సొగసుగనే ఉన్నదిగాని, విప్పి చెప్పినగాని బోధపడదు.

'చేలపంటలఁ గొయ్యలు చెప్పఁగాదె?' ఇదియొక అర్థాంతరన్యాసము. పండిన చేను కోసిన తరువాత నేలమీద మిగిలిన మొదలి భాగములను 'కొయ్యలు' అని రాయలసీమ ప్రాంతమువారందురు. కోస్తా ప్రాంతమువారు వాటిని 'మోడులు' అందురు. చేను బాగుగాపండిన మోడు లావుగా నుండుటయు, పండనిచో మోడు సన్నగా నుండుటయు సహజమే. జానపద జీవితమునుండి ఈ యర్థాంతర న్యాసమునకు తగిన సామగ్రిని గైకొనుట చాల సొగసుగానున్నది. కాని ఆ వాక్యార్థము మండలాంతర వాసులకు అర్థముకాదు. ఇటువంటివేగాక ఈ మాత్రమైనను అర్థము గానివి పెక్కులు గలవు.

5. ఈ గ్రంధమున వ్రాయస కాండ్ర పొరపాటుచేతనో, అవివేకము చేతనో కాలక్రమమున అపపాఠములు పెక్కు చొచ్చినవి. వాటిని సవరించుటకైనను వీలు లేనంతగా అవి పాతుకొని పోయి ఉన్నవి. ఇది నన్నెచోడుని గ్రంధమునకు పట్టిన దుస్థితి వంటిది.

కం॥ "నీవేమి సేయుదీ గాం
డీవము నీకిచ్చి యిమ్ము డెప్పరమైనన్
లావు గలదంచుఁ బలికిన
భావముచేఁ గాదె కోలుపడితిఁ గుమారున్."

నాల్గవ పాదము మొదట "పావకుచే గాదె" అని దిద్దినగాని పద్యమునకు అర్థము లేదు. ఈ పైవన్నియు నొకయెత్తు, కొన్ని ఘట్టములలో ఈతడు ప్రయోగించిన సాంకేతిక పదజాలము ఒక ఎత్తు. కృష్ణుడు రుక్మిణి సత్యభామలతో పాచికలాడుట వర్ణించిన పట్టున సోమన ప్రయోగించిన సాంకేతిక పదములకు తద్విద్యా నైపుణ్యము గలవారు అర్థము చెప్పగలరేమో కాని కేవల సాహిత్యపరులు చెప్పలేరు.

## ఎఱ్ఱన సోమనలు

ఎఱ్ఱన హరివంశ పురాణమునంతను అనువదించుటచేత ఆ రచనలో కావ్యత్వముగల ఘట్టములును, అవి లేని ఘట్టములును కలిసియే యున్నవి. అందుచే సమూహము మీద ఎఱ్ఱన హరివంశము కంటె సోముని హరివంశము రసవత్తరముగా నుండుటలో వింతలేదు. అయినను సోమన గైకొన్న ఘట్టములే ఎఱ్ఱన గ్రంధములో కూడ కలవు. కావున వాటిని మాత్రమే ఒండొంటితో పోల్చి చూచి వారిరువురి కావ్యగుణాన్యూనాదికతలను నిర్ణయించుటకు కొంత ప్రయత్నము చేయవచ్చును. కాని ఆ నిర్ణయము చేయుటకు వారి వారి పద్యములను పోల్చి చూచుట చాలదు. ఒక యెడ ఒకరి పద్యమును, వేరొకయెడ ఇంకొకరి పద్యమును మేల్తరముగ కానవచ్చును. కావున ఆ ప్రమాణమే పనికిరాదు. కవితా సృష్టికి అది భూతమగు కర్తృమనోధర్మము, చిత్తసంస్కారము, అంతరదృష్టి ప్రమాణముగా గైకొని విమర్శించినచో సారభూతమైన నిర్ణయము తేలవచ్చును.

కవితా కళ సత్వ రజస్సుల లీల. జగత్సృష్టికి రజోగుణమును, దాని మర్యాదా పాలనకు (సుస్థితికి) సత్త్వగుణమును కారణములైనట్లే. కవితా సృష్టికి రజస్సును దాని మర్యాదా పాలమునకు సత్త్వమును కారణము లగును. ఈ రెంటిలో రజోగుణము కవిత్వమునకు ప్రాణతుల్యము. సత్త్వము విజ్ఞాన తుల్యము. దానిస్థానము బుద్ధి. కవిత్వమునందలి ఆవేశము, తీక్ష్ణత, ఔజ్జ్వల్యము, సౌందర్యము మొదలగు గుణములన్నియు రజస్సం పాదితములగుచుండగా వాటి నన్నింటిని సముచిత స్థానమును మీరనీక ప్రశాంతముగా నడుపుచు రససిద్ధి వరకు కొనిపోవు భారము సత్త్వము వహించుచుండును. వీటి సంబంధము రథ్యసారధి సంబంధము వంటిది. ఎవని కవిత్వమున ఈ సత్త్వాధికారము న్యూనమగునో, వానిది యెంత ఉజ్జ్వల రచన యైనను, రససంపాదన వ్యాజమున కలిగెడి అతిమాత్ర భావావేశ జనితమైన దోషములకు ఆకరమగుచుండును

ఈ ధర్మములను బట్టి చూచినచో, ఎఱ్ఱన కవితలోగల సత్త్వసిద్ధి సోముని కవితలో లేదు సోమన రసభావము ఆవేశమున విశృంఖల విహారము చేయుచుండగా ఎఱ్ఱన భావము సత్త్వసంయమితమై గంభీరమందగమనముతో సాగిపోవును. సోమన భావగమనము లేడి పరుగు వంటిది. ఎఱ్ఱనది గజగమనము వంటిది. అన్నమయ (Physical), ప్రాణమయ (Vital), మనోమయ (Mental), విజ్ఞానమయ (intellectual), ఆనందమయ (Spiritual) ములగు పంచకోశములలో నేకోశమున కావ్యరసాస్వాదనము వలని వికారము కలుగునో తెలిసికొనుట కష్టము అన్నమయకోశమున గలిగిన రక్తముడుకును. ప్రాణమయ కోశమున గలిగిన హృదయము విప్పారును. ఉత్తరోత్తరముగా గుణాధిక్యము నొందును. ఆనందమయకోశమున వికారము గలిగిన పరబ్రహ్మానుభూతి గలుగును సూర్యకిరణ స్పర్శచే తామరసకోరకము చలించి, వికసించి మకరంద నిష్యంది యైనట్లు కవివాక్కిరణ స్పర్శచే భావుకుని హృదయము స్పందించి విప్పారి ద్రవీకరించును. ఈ తుది యవస్థలోనే కావ్యరసామృతాస్వాదనలోని అమృతసిద్ధి కలుగును సోమన తన భావావేశముచే సాధింపగలిగినది యిందలి రెండవ యవస్థ మాత్రమే. ప్రశాంతమైన భావగమనములో హృదయద్రవీకరణము కలిగించి, పాఠకుల తన్మయులజేయు శక్తి యీతని కవిత్వములో చాల తక్కువ. ఈతడు కలిగించు హృదయవిస్తృతినిబట్టి 'ఓహో!' యని యాశ్చర్యచకితుల మగుదుమేకాని, 'ఆహా!' యనెడి పరవశభావమును పొందజాలము. మన మాతని మెచ్చుకొందుమే గాని, అతనిలో లీనము కాలేము. ఈపరమానుభూతిని ఎఱ్ఱన సుకరముగా కలిగింపగలడు. కాని యెఱ్ఱన కలిగించెడి పారవశ్యము కొన్ని ఘట్టములలోనే కానవచ్చును. సోమన కలిగించు ఆశ్చర్యము ప్రతి పద్యములోను వ్యక్తమగును.

శృంగార రసాధిదేవత ఎఱ్ఱనకు వలె సోమనకు స్వచ్ఛమూర్తితో గానరాలేదు దాంపత్యమును పరమ పవిత్రముగా నొనర్చు ప్రణయ వాత్సల్య దాస్య సాహచర్యాది మధుర కోమల భావములు శృంగారకవులందరు నెఱుంగరు. కాళిదాసు భవభూతుల యట్టి జగదేకకవులకే యీ పవిత్రమూర్తి గోచరించునది తక్కిన లోకసామాన్య కవులకు శృంగార మనగా దంపతుల శరీర సంయోగమేకాని వేఱుకాదు. ఎఱ్ఱన యీ యుత్తమజాతి వర్గమున జేరగా సోమన యీ రెండవ వర్గములలో ప్రవేశించెను. ఎఱ్ఱన శృంగారమునకు ప్రేమబీజము. సోమన దానికి గామముబీజ మని సాహసించి చెప్పవచ్చును. కనుకనే రుక్మిణీకల్యాణోషాపరిణయాది ముగ్ధనాయికా ప్రణయ వర్ణనమున కూడ నీతడు ప్రౌఢ కామవర్ణనము జేయును గాని ప్రణయదేవతను గన్నెత్తియైన జూడడు. అతనికా శబ్దోచ్చారణమే తెలియ దనిన సాహసము గానేరదు.

సోమన నాగర జన మర్యాద లెరింగిన మేటి అతడు వర్ణించు వన విహారములు, ద్యూత క్రీడలు మున్నగునవి అందులకు తార్కాణము. రాజాస్థాన ప్రవేశమున్నను, ఎఱ్ఱనకు ఆ పరిచమున్నట్లు కానరాదు. శంభుదాసుడు సమగ్రముగా నెరిగినది పల్లీజన జీవితము. గోకుల వర్ణనమును మిషగా గైకొని యీతడు చిత్రించిన నిరాడంబర జానపద జీవితము, పోతన చిత్రణమునుగూడ మించిపోయినది. దండయాత్రలు, నగర సంరక్షణలు, ముట్టడులు, ద్వంద్వ యుద్ధములు, తుముల యుద్ధములు మొదలగు సేనా కార్యవర్ణనలు చేయుటలో సోమన ఆ రంగములను ప్రత్యక్షముగా ప్రదర్శింపగలడు.

అయినను అవి కథా కాలమునాటి పరిస్థితులుగాక అతని కాలమునాటివిగా కన్పట్టును. ఎఱ్ఱన వర్ణనములు అంత స్వాభావికముగా నుండవు.

సోమన భారతము వ్రాయవలసివచ్చినచో యుద్ధపంచకమును మాత్రము వ్రాయ గలడేమోకాని తిక్కనవలె తుదిపర్వములనుగాని, ఎఱ్ఱనవలె అరణ్య పర్వమునుగాని వ్రాయలేడు. ఆ ఘట్టములను వ్రాయుటకు అవశ్యకమైన మనోనిగ్రహముగాని, ప్రశాంత కథనముగాని అతనికి లేదు.

వ్యాసుడు, వాల్మీకి మొదలైన, ఆర్షకవులకును, నైషధాది లౌకిక కావ్య కర్తలకును సంస్కృతమున ఏ వాసి కలదో, అట్టి వాసియే తెనుగున కవిత్రయము వారికిని, ఇతర ప్రబంధకర్తలకును కలదు. ఎఱ్ఱన తెనుగున ఆర్షకవి వర్గములోని వాడు. సోమన లౌకిక ప్రబంధకర్తల కోటిలోనివాడు.

ఇతడు వసంత విలాసమనెడి యింకొక గ్రంథము రచించినట్లు లక్షణ గ్రంథముల వలన తెలియుచున్నది.

### సోముని నవీనగుణ సనాథత్వము - సాహిత్య రసపోషణము:

సాహిత్య రసపోషణ సంవిధాన చక్రవర్తి, నవీనగుణ సనాథ – ఈ రెండును వీని బిరుద నామములు. ఇంతకుపూర్వము కానరాని నవ్యత్వము దెచ్చుచుంటినని రెండవ దాని యర్థము ఆ నవ్యత్వము పురాణము ప్రబంధఛాయలను దాల్చుటయే శబ్దార్థ చిత్రాలు సహజమైన దానికంటె ఎక్కువ అలంకృతి తేవలెనని పాటుపడువాడు ప్రబంధకవి – చిత్రకారుని వలె. రసపోషణ యనగా పద్యము, అర్థము, మొదలైనవి బాగుండుట యను అర్థమును గైకొనవలెను. ప్రతి పద్యమును రసవంతముగా జేయు రసపోషణలో పూర్వ కవులకు ప్రత్యేక దృష్టి లేదు తెలుగు కవిత్వ మార్గజాతి నుండి నవీనులలో పడుట వీని చేతులలోనే. ఎఱ్ఱాప్రెగ్గడ యెంత ప్రబంధపరమేశ్వరుడైనను పురాణకవిత్వపు హద్దును మీరలేదు.

శబ్దనిర్మితమైన వాఙ్మయకళలో కవిత్వము, సాహిత్యము, సారస్వతము అనునవి ఉత్తరోత్తర విపులతర కక్ష్యలు. రసానందమీయగల పద్యరచన కవిత్వము. అది సాహిత్యమునకు ప్రధానాంగము ఛందోమయము కాకపోయినను రసానంద మీయగల్గినచో నదియు సాహిత్య పదవాచ్యమే యగును. అనగా రసవంతములైన గద్య పద్య రచనలన్నియు సాహిత్యముగా పరిగణింపబడును ఇక ఆనందదాయకములైన రసవద్ఘట్టములేగాక, విజ్ఞానప్రదములైన ఆధ్యాత్మిక చారిత్రకాది విషయ ప్రధానమైన ఘట్టములు కూడ కల రచన సారస్వతము వ్యుత్పత్తిమాత్ర ఫలములై, ఆనంద ప్రదములు కాని ఘట్టములలో కవిత్వపదార్థమే ఉండదు. కావ్య ఘట్టములతోపాటు విజ్ఞానప్రదములైన అట్టి ఘట్టములుగూడ గల గ్రంథములను అలంకారికులు శాస్త్రకావ్యములని పేర్కొనిరి. వాటిలో కావ్యమిచ్చెడి యానందముతో పాటు, శాస్త్రమొసంగెడి విజ్ఞాన విషయములు కూడ కలిసి యుండుటచే అవి ప్రత్యేకముగా కావ్యములును, ప్రత్యేకముగా శాస్త్రములునుగాక ఉభయగుణాత్మకముగా శాస్త్ర కావ్య వ్యపదేశమునకు తగునని వారి యుద్దేశము. భారతాది మహేతిహాసములును, తక్కిన

పురాణములును ఈ జాతిలోనివి. పురాణములయందు ఆసాంతము రసాస్వాదనము నపేక్షించుట వ్యర్థమనోరథము. కాని పురాణములను తెనిగింపదలచిన ఆంధ్రకవి, విషయ ప్రధానములైన ఘట్టములను తొలగించి రసవద్ఘట్టములనే చేపట్టినచో ఆ అనువాదము పురాణమే యనిపించుకొనదు. యథార్థముగా సాహిత్యకక్ష్యకు చెందవి ఆ కావ్యేతర భారమును తొలగించి, కావ్యత్వము గల ఘట్టములనే అనువదించుటకు పూనుకొని రసపోషణతో వాటి కావ్యత్వమును సార్థకము చేయబూనినచో నతడు సాహిత్యరసపోషకు డనిపించుకొనును.

ఈ సాహిత్య రసపోషణకు ప్రస్తుతః రసవత్తరమైన యితివృత్తము కావలయును. ఆ పైని కథాకథనము, కథాప్రవర్తకములైన పాత్రల చిత్రణము, కథ వర్తించిన రంగస్థల వర్ణనము, ఇంపుగొల్పెడి అలంకారికమైన శబ్దరచన ఆ రసపోషణకు సంవిధాన సామగ్రిగా నుపకరించును. నాచనసోముడు హరివంశమనెడి సారస్వతమునుండి సాహిత్య ఘట్టములను కొన్నింటిని వేరుచేసి ఆ కథలను పైని పేర్కొన్న సామగ్రితో రసపోషణ చేయుటచే నతనికి సాహిత్యరసపోషణ సంవిధాన చక్రవర్తి యనెడి బిరుదు వచ్చినది. భారతాది పూర్వరచనల మార్గమునుండి విడివడి యితడు రసపోషణ సామగ్రితో ఒక పురాణ భాగమును నూత్న పద్ధతిలో రచించుటచేతనే నవీనగుణసనాథుడయ్యెను. కేవల రసపోషణ ప్రయత్నమే ఆ నవీనగుణము. ఆ ధోరణికి విషయ ప్రధానములు విజ్ఞానదానమాత్ర ప్రయోజనములునైన ఘట్టములు పనికిరావు

## రావిపాటి త్రిపురాంతకుడు

*నన్నయ్య భట్ట తిక్కకవి నాయకులన్న హుళక్కి భాస్కరుం*
*డన్నను జిమ్మపూడి యమరేశ్వరుఁ డన్నను సత్యవీశ్వరుల్*
*నెన్నుదుటం గరాంజలులు నింతురు జేయని రావిపాటి తి*
*ప్పన్నయు నంతవాఁడ తగునా యిటు దోసపుమాట లాడఁగన్.*

అని శ్రీనాథుడు రావిపాటి తిప్పనను పూర్వ మహాకవులలో నొకనిగా స్తుతించెను. సంస్కృతమున నీతడు "ప్రేమాభిరామము" అనెడి ఏక "వీధి"ని వ్రాసెను. దానినే శ్రీనాథుడు క్రీడాభిరామ మనుపేర తెనిగించెను పై పద్య మందులోనిదే. ఆ వీధిగాక, త్రిపురాంతకుడు పార్వతీ స్తుతి పరముగా అంబికా శతక మనెడి యొక శతకమును, చంద్రతారావళి యనెడి నొక నక్షత్రమాలను వ్రాసినట్లు లక్షణ గ్రంథోదాహరణములబట్టి తెలియనయ్యెను. ఇతడు వ్రాసిన యింకొక కావ్యము 'త్రిపురాంతకోదాహరణ' మనెడి ఖండకావ్యము. అదృష్టవశమున నది మాత్రము నష్టముగాక నిల్చి యున్నది.

అంబికాశతకము పార్వతీదేవి సౌందర్య వర్ణనలతో గూడిన యొక భక్తి శతకము. ఉపాస్య దేవతా సౌందర్యమును వర్ణించు భక్త కవులకు భక్తి భిన్నమైన మనోవికారముచే మనస్సు చలించినచో ముప్పు వాటిల్లుట నిజము కనుకనే మనోనిగ్రహములేని కవులెవ్వరును ఆ జోలికి పోరాదు. ఆదిశంకరుల సౌందర్య లహరి, మూక కవియొక్క

కామాక్షీ పంచశతి సంస్కృతమున దుశ్శక్యమైన అట్టి శృంగార భక్తి భావనకు ఉత్తమోదాహరణములు. ఒకటి రెండు ఉదాహరణములచేతనే, త్రిపురాంకుడు తన అంబికా శతక రచనమున అట్టి మహనీయతను సాధించెనని చెప్పవచ్చును.

*కూడెడి వెంద్రుకల్ నిడుద కూఁకటిఁద్రోవగఁ బొట్టపై వళుల్*
*జాడలు దోపఁ గ్రొమ్మొలక చన్నుల మించు దొలంక, సిగ్గునన్*
*జూడగ నేత్రముల్ మెఱుఁగుఁ జూపులనీన హిమాద్రి యింట నీ*
*వాడుట శూలికిన్ మనము వాడుటగాదె తలంప నంబికా!*

*తెప్పల బోరుఁదల్పు లిసిరింతలు వాతెఱ చూపు గుంచియున్*
*ద్రిప్పి తళుక్కునం దెఱచి తిన్నని మోమునఁ గాయు వెన్నెలల్*
*ముప్పిరిగొన్న వేడుకలు మూఁగిన సిగ్గసియాడఁద్రీతి నీ*
*వప్పరమేశుఁజూచి తనువర్ధముఁగొంటి పొసంగ నంబికా!*

*లాఁచిపరాంగనల్ వరవిలాసిమనోహర విభ్రమంబులన్*
*జూచినఁ జూడఁ డుత్తముఁడు చూచినఁ జూచును మధ్యముండు దాఁ*
*జూచినఁజూడకుండినను జూచుఁ గనిష్ఠుడు నన్ను వీరిలోఁ*
*జూచినఁజూడకుండు గుణిఁ జూచిన చూపునఁ జూడు మంబికా!*

కవియేగాదు, విగ్రహ శిల్పిగాని, చిత్రలేఖకుడుగాని తాము సృష్టించెడి యెట్టి సుందర విగ్రహముల యెడను, మనో నిగ్రహము కోల్పోవక పరమ భక్తితోనే, క్రియా మాధుర్యమును సాధింపవలెను. లేనిచో చేసేతల ఆత్మహాని కొని తెచ్చుకొన్న వారగుదురు. బ్రహ్మ తన సుందర సృష్టియైన శతరూపయెడ మోహదృష్టిని జరపినందుకేగదా, ఒక శిరమును కోల్పోయి చతుర్ముఖుడగుట 'తన సృష్టిని తాను కామింపరాదు' అనెడి ధర్మమే ఆ పురాణ కథలో నిమిడియున్న అంతరార్థము.

**త్రిపురాంతకోదాహరణము:** ఇది శ్రీశైలమునకు తూర్పు వాకిలియైన త్రిపురాంతకమున కుమార గిరి మీద వెలసియున్న శివుని గురించి చేసిన స్తోత్రము. ఉదాహరణమనగా దేవతా స్తుతిరూపమైన యొక ఖండకావ్యమని చెప్ప నొప్పును ఇంద్రక్షర గణబద్ధములైన వృత్తములును, మాత్రాగణ బద్ధములైన (రగడ) గేయములును గలసి, మార్గదేశి కవితల రాశిగా, గేయ పద్య స్వరూపముల సంకలనముగా పొడకట్టుచుండును. ఆంధ్రలాక్షణికులలో దీని లక్షణము మొదట జెప్పినవాడనంతుడు తరువాతివా డప్పకవి. దీని స్వరూప మిట్లుండును

ఆ యిష్టదేవత పేర మొదట నొక వృత్తమును, ఒక యెనిమిది పాదముల రగడయు, మరొక యెనిమిది యర్థ పాదముల రగడయును మూడును కలిపి వరుసగా ప్రథమావిభక్తిలో నుండును పూర్ణ పాదముల రగడ కళిక యనియు, అర్థ పాదముల రగడ 'ఉత్కళిక' యనియు పిలువబడును. ఆ మూడు పద్యములును గలసి యొక దళమగును ఆ విధముగా ప్రతి విభక్తి యందొక దళము చొప్పున ఎనిమిది దళము లుండును. కడపట సార్వ విభక్తిక వృత్తమొకటి యుండును. అనగా మొత్త మిరువదియైదు పద్యము లన్నమాట.

సంస్కృతమున గూడ ఈ జాతి ఖండ కావ్యములు కలవు. అవి కేవలము ఇష్టదేవతా స్తోత్రములేకాక, రాజుల శత్రు విజయాది మహాకార్యముల వర్ణనలు కలవియై యుండినట్లు వాఙ్మయములో సూచనలు కలవు కాళిదాసు రఘువంశము నందు "జయోదాహరణం బాహ్వోర్గాపయామాస కిన్నరాన్" (రఘువం-4-78) రఘుమహారాజు జైత్రయాత్ర చేసిన సందర్భమున ఉత్సవ సంకేతులను జయింపగా ఆ జయోదాహరణమును కిన్నరులు గానము చేసిరట. ఆ 'ఉదాహరణము' ఒక ప్రబంధ విశేషమని మల్లినాథసూరి వ్యాఖ్యానించెను. కావున ఉదాహరణము ఒక ప్రత్యేక కావ్యమే. ప్రబంధ విశేష మనుటచేత నిబద్ధకావ్య జాతిలోనిదనియు, లక్షణయుతమైన దనియు గ్రహింపదగును.

ప్రతాప రుద్రీయమున సంస్కృతోదాహరణ లక్షణము కొంత కలదు

*"యేన కేనాపి తాళేన గద్యపద్య సమన్వితమ్,*
*జయేత్యుపక్రమం మాలిన్యాదిప్రాస విచిత్రితమ్*
*తదుదాహరణం నామ విభక్త్యష్టాంగ సంయుతమ్"*

ఇందలి గద్య పద్య సమన్వితత్వము తెనుగున లేదు ఆ గద్య స్థానముననే కాబోలు తెలుగు కవులు గేయములు నిల్పిరి నిజమునకు పద్యమునకువలె గద్యమునకును తాళగతి పూర్వకాలమున గలదు రానురాను ఒక్క కీర్తనకు మాత్రమే తాళము నిలిచి గద్య పద్యములకు లేకుండ బోయినది.

తెనుగునకూడ ఇష్టదేవతా పరముగా అవతరించిన ఈ రచనలు కాలక్రమమున మహాపురుషుల ఉదాత్త కార్యపరములుగా కూడ రచింపబడ జొచ్చెను పయి లక్షణములందలి జయ శబ్దోపక్రమణము తెలుగున లేదు. ఈ ఆదినియమము కూడ అతి ప్రాచీన కాలమునుండి వచ్చు సంప్రదాయమై యుండవచ్చును రాజులయు, రాజవంశములయు మహాకార్యముల నుదాహరణ రూపమున స్తోత్రము చేయు వంది మాగధులు జయశబ్దపూర్వకముగా పఠించి యుందురు. మహానవమికి గిలకలు పట్టెడి బడిపిల్లలు 'జయీభవ-విజయీభవ' అను నుపక్రమణికతో దాతను సంబోధించుట, ఈ మర్యాద యొక్క ఛాయయే కావచ్చును.

ఈ యుదాహరణములు తెనుగున శతకములవలె నసంఖ్యాకములు పుట్టియుండును ప్రాచీనములైన ఖండకావ్యములన్నిటివలె నవియు నస్తమించి పోయినవి. పోయినవి పోగా, మిగిలిన వాటిలో ప్రసిద్ధములైనవి యీ క్రింద నుదాహరింపబడుచున్నవి.

1. బసవోదాహరణము – పాల్కురికి సోమనాథుడు (తెలుగునను, సంస్కృతమునను), 12 వ శతాబ్ది.
2. త్రిపురాంతకోదాహరణము – రావిపాటి త్రిపురాంతకుడు, 14 వ శతాబ్ది
3. వేంకటేశ్వరోదాహరణము – తాళ్ళపాక తిరుమలయ్య
4. హనుమదుదాహరణము – చిత్రకవి పెద్దన (ల సా.సం), 16వశతాబ్ది అపర భాగము
5. శ్రీకృష్ణోదాహరణము – కాకునూరి యప్పకవి (అప్పకవీయము), 17 వ శతాబ్ది
6. రఘునాథీయోదాహరణము – నుదురుపాటి సాంబశివకవి, 18 వ శతాబ్ది.

**ఇతని కాలము:** త్రిపురాంతకుని ప్రేమాభిరామమునకు ఓరుగల్లు పట్టణము రంగస్థలము, కథ ప్రతాపరుద్రుని రాజ్య కాలములో జరిగినది. అనాటి యా పుర వైభవమును కన్నులార జూచి యా నగర జీవనమును అనుభవించి దానిని మనకు ప్రత్యక్ష దర్శన మొనర్చిన త్రిపురాంతకుడు ఇంచుమించు మారనకు సమకాలికుడై యుండదగును. అగుచో అది తిక్కన యుగము. ఎఱ్ఱాప్రెగ్గడ యుగమునకు కొంచెము పూర్వము. కాని యీ రెండు యుగములకును అతి సన్నిహితత్వము కలదు గనుక, ఇతనిని ఎఱ్ఱన యుగములోని వానినిగానే గ్రహింపవచ్చును. మఱియు అంబికా శతకాదులైన మూడు తెలుగు రచనలు ప్రేమాభిరామము తరువాతనే పుట్టియున్న యెడల, తిప్పనను ఎఱ్ఱన యుగములో జేర్చుటయే సహేతుకము. ఈతడు రచించిన త్రిపురాంతకోదాహరణము కూడ ఉత్పన్నమై పోయినయెడల రావిపాటి తిప్పన శ్రుతనాములలో చేరియుండెడివాడు.

**ఈ యుగమునందలి శ్రుతనాములు:** ఈ యుగమునందలి శ్రుత నాములలో చిమ్మపూడి అమరేశ్వరుడు ముఖ్యుడు.

శ్రీనాధుడు మొదలుకొని చాలమంది పూర్వ కవులు ఈ యమరేశ్వరుని ఒక మహాకవిగా పూర్వకవిగా మహాకవి సంస్మరణ పద్యములలో పేర్కొనిరి. ఈ క్రింది పద్యము శ్రీనాధుని క్రీడాభిరామములోనిది.

*"నన్నయభట్ట తిక్కకవి నాయకులన్న హుళక్కి భాస్కరుం*
*డన్నను జిమ్మపూఁడి యమరేశ్వరుఁ డన్నను సత్కవీశ్వరుల్*
*వెన్నుదుటం గరాంజలులు నింతురు జేయని రావిపాటి తి*
*ప్పన్నయు నంతవాఁడ తగునా యిటు దోసపు మాటలాడఁగన్"*

దీనినిబట్టి అమరేశ్వరుడు తిక్కన యుగమునకు శ్రీనాధుని యుగమునకును మధ్య కాలమువాడు కాదగునని ఊహచే ఈ యుగమువాడుగా పేర్కొందురు. **ఇతడు** "విక్రమసేనము" అను ఒక మహా కావ్యము వ్రాసెనట ఆ గ్రంథ మిప్పుడు **లభ్యము**కాదు లక్షణ గ్రంథములలోను, సంకలన గ్రంథములలోను, అందులోనివిగా కానవచ్చు పద్యములు సుమారు ఏబది కలవు వాటినిబట్టి యది ఒక శృంగార రస ప్రధానమైన ప్రబంధమనియు, విక్రమసేను డనెడి మాళవరాజు నాయకుడనియు, అతని రాజధాని ఉజ్జయిని యనియు, నిషధరాజ తనయ నాయికయనియు తెలి యవచ్చుచున్నది అంతేగాక, ఆ పద్యములలో పురవర్ణనమునకు సంబంధించినట్టియు, జలకేళీవనవిహారములకు సంబంధించి నట్టియు పద్యముల పోకడనుబట్టి అది యష్టాదశ వర్ణనాయుతమైన ఒక శృంగారరస ప్రబంధమని యూహింపవచ్చును. సంస్కృత వాఙ్మయములో ఆ పేరుగల కావ్యమేదియు నున్నట్లు తోచదు కావున నిది అనువాదము కాక స్వతంత్ర ప్రబంధమే కావచ్చును. అగుచో నన్నెచోడుని కుమార సంభవము తరువాత అమరేశ్వరుని విక్రమసేనము రెండవ స్వతంత్ర గ్రంధముగా పరిగణింపబడదగును.

★ ★ ★

# శ్రీనాథయుగము
# (1400-1500)

## శ్రీనాథుడు

శ్రీనాథుని గురించి చెప్పికొను సందర్భమున రెడ్డిరాజ్య చరిత్రను సంగ్రహముగా పరిశీలింతము.

రెడ్డిరాజ్యమును స్థాపించినవాడు ప్రోలయ వేమారెడ్డి. ఇతడే హరివంశ కృతిపతి ఇతని కాలము క్రీ.శ.1323–1350. అనంతరము అతని కుమారుడు అనపోతారెడ్డి రాజయి, 1362 వరకు రాజ్యమేలెనని కొందరును, 66 వరకు ఏలెనని మరి కొందరును అందురు. రాజధాని అద్దంకినుండి కొండవీటికి మార్చబడినది ఇతని కాలముననే అని ఒక మతము కలదు. ఇతని అనంతరము రాజ్యమునకు వచ్చిన ఇతని సోదరుడు అనవేమారెడ్డి కాలమున ఆ మార్పు జరిగినదని ఇంకొక మతము ఈ అనవేముడు 1381 వరకో లేదా 83 వరకో రాజ్యము నేలెను ఆ ఇరువురి సోదరుల పాలనకాలములో బాలసరస్వతి యనెడి పండితుడు విద్యాధికారిగా నుండెను. ప్రకాశభారతీయోగి అను ఒక తెలుగు కవి కూడ అనవేమారెడ్డి కాలమున ఆస్థానకవిగా నుండెనట; అతని గ్రంధము లేవియు కానరావు

అనవేమునికే ధర్మవేమన అని దాతృత్వ సూచకమైన ఒక బిరుదము కలదు. అతని అనంతరము, ఆతని అన్నయైన అనపోతారెడ్డి కుమారుడు కుమారగిరి సింహాసనమెక్కి (1381 or 1383) సుమారు ఇరువది సంవత్సరములు (1400 or 1402) త్యాగభోగ శీలుడును, సంగీత నాట్య కళాలోలుడును అయి కాలము పుచ్చెను సంస్కృతమున వసంతరాజీయ మనెడి ఒక నాట్యశాస్త్రమును కూడ వ్రాసెను. ఇతడు రాజ్యపాలనాదులకంటె, విద్యావినోదములందును, విలాసకార్యముల యందును యెక్కువ మక్కువ చూపుటచే ఈతని బావమఱిదియైన (చెల్లెలు మల్లాంబిక భర్త) కాటయవేముడు పరిపాలనా భారమును వహించి రాజుగానే ప్రవర్తించెను. ఆ దినములలో రెడ్డిరాజ్యమునకు ప్రతినిధిగా రాజమహేంద్రవరమున అల్లారెడ్డి కలడు కుమారగిరి ఆ సీమను సోదరికి అరణముగా ఒసగుటచే కాటయవేముడు దానిని సొంతముగా పాలించుకొనుటకై రాజమహేంద్రము వెళ్ళి అచ్చట స్థిరపడెను. ఈ అరణ ప్రదానము 1386 లో జరిగినదని కొందరును, 1398లో జరిగినదని కొందరును చెప్పెదురు. ప్రదానము 86లో జరిగి, కాటయవేముని స్వయంపాలనారంభము 1398లో ప్రారంభము కావచ్చును. అగుచో ఆ రెండు మతములకు సమన్వయము కుదురును.

కుమారగిరికి సంతానము లేదు. అందుచే అతని అనంతరము అతని పినతాత కొడుకు పెదకోమటి వేముడు రాజయ్యెను. ఈతని కాలము 1400–1420 లేదా 1402–1420. ఇతని ఆస్థాన కవిశేఖరుడే శ్రీనాధుడు మామిడి సింగనామాత్యుడు రాజమంత్రి. శృంగార నైషధము కృతిభర్త ఈ మంత్రి శేఖరుడే

పెదకోమటి వేమన కాలములో రెడ్డిరాజ్యమునకు ఒకవంక రాచకొండ వెలమ రాజులతోను, ఇంకొక వంక విజయనగర రాజులతోను వైరము పెరిగి, యుద్ధములు తటస్థించెను. సర్వసమర్థుడైన పెదకోమటి ఆయుద్ధములలో శత్రువులను జయించి, రాజ్యమును సురక్షిత మొనర్చెను ఇది ఇటులుండ రాజమహేంద్రవరము, రెడ్డిరాజ్యములో అంతర్భాగమే కనుక ఆ సీమకు కాటయ వేముడు స్వతంత్రరాజగుట పెదకోమటికి సమ్మతము కాలేదు. అది కారణముగా ఆ బంధువు లిరువురును శత్రువులైరి. పెదకోమటి అనంతగమున రాచవేముడు కొండవీటికి రాజయి నాలుగు సంవత్సరములే పరిపాలన చేసెను (1420–1424). ఈతని కాలములోనే కొండవీటి ప్రాభవము క్షీణించిపోయి నిలువలేక విజయనగర సామ్రాజ్యమున లీనమై పోయెను

రాజమహేంద్రవరశాఖలో మొదటి స్వతంత్రరాజు కాటయవేముడు. అతడు 1419 వరకు పాలించెను. రాజ్యపాలనాధికారము స్వీకరించుటతోనే తనకు పూర్వము రాజప్రతినిధిగా నున్న అల్లాడరెడ్డికి దండనాథ పదవి యిచ్చి మన్నించెను. కాటయవేముడు సంస్కృతమున సరసమైన పాండిత్యము కలవాడు కాళిదాస నాటకత్రయమునకు ఈ రాజు వ్రాసిన వ్యాఖ్యానములు చాల ప్రసిద్ధి గలవి ఈ రాజపండితుడు తనకీ రాజ్యమిచ్చిన బావగారి యెడల యెంతో ప్రేమాభిమానములు కలవాడు తాను వ్రాసిన నాటక వ్యాఖ్యానములలో కుమార గిరిపేరు సంస్మరించుటయే గాక తన పుత్రునకు కుమారగిరి యని పేరు పెట్టుకొనెను అతని కాకుమారుని తరువాత నొక పుత్రికయు కల్గెను ఆమె పేరు అనితల్లి కాటయవేముని అనంతరము అతని కుమారుడు కొద్ది కాలమునకే చనిపోవుటచే అతని బంధువైన అల్లాడ రెడ్డి రాజ్యమునకు వచ్చి 1420 వరకు పరిపాలించెను. ఈ యల్లాడరెడ్డి రాజప్రతినిధిగా పైని చెప్పబడిన అల్లాడరెడ్డికాడు. ఇతడు ధర్మవేమన దౌహిత్రియైన వేమాంబకు భర్త. ఇతనికి వేమారెడ్డి, వీరభద్రారెడ్డి, దొడ్డారెడ్డి, అన్నారెడ్డి అను నలుగురు కుమారులు గలరు వీరిలో రెండవవాడైన వీరభద్రారెడ్డి కాటయవేముని పుత్రికయగు అనితల్లిని పెండ్లాడి, భార్యాపరముగ లభించిన రాజమహేంద్రవర రాజ్యమునకు పాలకుడయ్యెను. అల్లాడరెడ్డి నలుగురు కుమారులలో పెద్దవాడైన వేమారెడ్డి సర్వసమర్థుడు ఇతడు పరిపాలనాభారము నంతను తానే వహించి తమ్ముని పేరనే రాజ్యమును నడిపెను వీరి మంత్రియే బెండపూడి అన్నయ్య, శ్రీనాధుని భీమేశ్వర పురాణమునకు కృతిపతి. శ్రీనాధుడు ఈ వీరభద్రారెడ్డికే తన కాశీఖండము కృతి యిచ్చెను ఈ యన్నదమ్ముల పరిపాలనము 1440 సంవత్సరము వరకు సాగెను. అంతలో ఆ రాజ్యమును నిలుపుకొనదగిన సమర్థుడు లేకపోవుటచే కొలదికాలము నామమాత్రావశేషమైయుండి తుదకు గజపతుల హస్తగతమయ్యెను అల్లాడరెడ్డి కుమారులలో మూడవవాడైన దొడ్డారెడ్డికి నిశ్శంక కొమ్మన తాను రచించిన శివలీలా విలాసమును కృతి యిచ్చెను.

## శ్రీనాథుని జీవితకాలము

శ్రీనాథుని జన్మకాలము 1365 అయియుండునని శ్రీ కందుకూరి వీరేశలింగం పంతులు మొదలగువారును, 1385 అని శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రి గారును నిర్ధారించిరి. ఆయన జీవితకాలమును నిర్ణయించుటకు మూలాధారము కాశీఖండ పీఠికలోని–

*సీ॥ చిన్నారి పొన్నారి చిఱుతకూఁకటినాఁడు రచియించితిని మరుత్తరాట్చరిత్ర*
*నూనూఁగు మీసాల నూత్న యౌవనమున శాలివాహన సప్తశతి నొడివితి*
*సంతరించితి నిండు జవ్వనమ్మున యందు హర్షనైషధ కావ్య మాంధ్రభాషఁ*
*బ్రౌఢనిర్భరవయః పరిపాకమునఁ గొనియాడితి భీమనాయకుని మహిమఁ*
*"బ్రాయమింతకు మిగులఁ గైవ్రాలకుండఁ*
*గాశికాఖండమను మహాగ్రంథమేను*
*దెనుఁగుజేసెదఁ గర్ణాట దేశకటక*
*పద్మవనహేళి శ్రీనాథభట్టసుకవి" అను పద్యము.*

ఇందు దాహృతములైన గ్రంథములలో మనకు లభించినవి మూడే. నైషధము, భీమేశ్వరపురాణము, కాశీఖండము వీనిలో మొదటిదగు నైషధము పెదకోమటి వేముని పాలన కాలములో వ్రాయబడినది ఆరాజు పరిపాలనా కాలము 1402 నుండి 1420. ప్రభాకరశాస్త్రి గారి కాలనిర్ణయము ప్రకారము 1385 వ సంవత్సరములో పుట్టిన ఈ కవి ఆ గ్రంథరచన వేళకు పరిపూర్ణ యౌవనుడు; గనుక ఆ గ్రంథ మించుమించు 1410–15 మధ్య వ్రాసియుండవలెను శ్రీ వీరేశలింగం పంతులుగారు చెప్పినట్లు 1365 జన్మ కాలమయినచో అతని యౌవనకాలము 1400 ప్రాంతమగును. అగుచో నైషధము పెదకోమటి వేముని పాలనారంభమున (1402) వ్రాయబడి యుండవలెను. కాబట్టి ఈ గ్రంథమును బట్టి శ్రీనాథుని జన్మకాలము నిర్ణయించుట సుకరముకాదు. ఏమనగా 1365 జననవత్సరమైనచో గ్రంథరచన పెదకోమటి వేముని పరిపాలనారంభమునను, 1385 జనన వత్సరమైనచో పెదకోమటి వేముని పరిపాలన మధ్యకాలమునను జరిగి యుండవలెను ఈ రెండును సంభావ్యములే గనుక ఈ గ్రంథము శ్రీనాథుని జన్మకాల నిర్ణయమునకు సమర్థమైన ఆధారము కాదు. భీమేశ్వర పురాణము అందుకు సమర్థమైన గ్రంథము రెండవదియైన భీమేశ్వరపురాణము నాటికి శ్రీనాథుని వయస్సు ప్రౌఢనిర్భరము ఇది 1426–40 మధ్య రాజ్యమేలిన వీరభద్రారెడ్డి మంత్రికి కృతిగా నీయబడినది ఆ గ్రంథ పీఠికలో నహమ్మదుషా యను బీజాపూర్ నవాబును పేర్కొనిన పద్యము గలదు.

*ఉ॥ "అన్నయ మంత్రిశేఖరుఁ డహమ్మదుషా సురధాణ భూమిభృ*
*త్సన్నిధికిన్ గడు సముచితంబుగ వేమ మహీసురేంద్ర రా*
*జ్యోన్నతి సంతతాభ్యుదయ మొందఁగఁ బారసిభాష వ్రాసినన్*
*గన్నులపండువై యమరుఁ గాకితమందలి వర్ణ పద్ధతుల్"*

ఈ నవాబు పాలనకాలము 1420–35. కావున భీమేశ్వరపురాణము 1430 ప్రాంతమున నలుబది ఐదు సంవత్సరముల ప్రాయమున రచించి యుండవలయును.

అంతకు మించియుండుట అసంగతము. ప్రౌఢనిర్భరవయఃపరిపాకమనగా 40–45 సంవత్సరముల వయస్సు 1365 లో జన్మించిన కవికి 1426 నాటికే షష్టిపూర్తి జరిగియుండును. అది అపరవయస్సుకాని ప్రౌఢ వయస్సు కాదు. భీమఖండ, కాశీఖండ రచనలకు నడుమ కాలవ్యవధి చాల కలదు కాశీఖండ రచననాటికే తన శరీరమున ముదిమి లక్షణములు పొడగట్టుచున్నట్లు కవికే గోచరించినది. "ప్రాయమింతకు మిగులఁ గైవ్రాలకుండ" అను వాక్యమునకు ఇప్పటికే వయసు మరలినది; ఇంతకు మిక్కిలిగా ముదిమిరాకముందు, అనియర్థము. అది కొంచెము తక్కువ ఏబదియేండ్ల వయస్సు. భీమఖండమునను, కాశీఖండమునను వ్యాసుని భిక్షకు దిలిచిన బ్రాహ్మణి "పంచాద్వర్షదేశీయయైన పెద్ద ముత్తైదువ" శ్రీనాథుని దృష్టిలో ఏబదియేండ్లకు ప్రాయముకైవ్రాలి పెద్దతనము వచ్చును గనుకనే ఆ బ్రాహ్మణి కావిశేషణములు వాడెను. అదియు వీరభద్రారెడ్డి కాలమందే భీమేశ్వరపురాణ రచనానంతరము కాశీఖండరచనకు బూర్వము పది సంవత్సరములైనను వ్యవధి నంగీకరింపవలెను అప్పుడే 'ప్రాయమింతకు మిగులగై వ్రాలకుండ'– అను కవి వాక్యము సంగతమగును. ఈ మూడు కాలములను సమన్వయించి చూచినచో, 1415 ప్రాంతమున జవ్వనమును, 1430 ప్రాంతమున నడివయస్సును, 1440 ప్రాంతమున జరారంభమును ననుభవించిన కవి 1380 సంవత్సరమునకు ముందు పుట్టియుండడు అతని జన్మకాలము 1380 ప్రాంతముకాని, శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రిగారన్నట్లు 1385 గాని కావలయును. కాశీఖండానంతరము పెక్కు సంచారములుచేసి, మరికొన్ని గ్రంథములు రచించి – జీవికార్థము – ఇంకను పడరానిపాట్లు పడిన యీ వృద్ధకవి 1470 ప్రాంతము వఱకు జీవించె ననుకొన్నను తప్పులేదు

**వైదుష్యము:** ఆంధ్రకవులలో తిక్కన తరువాత నింతటి విద్వత్కవి యింకొకడులేడు. తిక్కనవలెనే శ్రీనాథుడు తన కాలమున సాహిత్యసింహాసనమునధిష్ఠించిన కవి చక్రవర్తి. ఆయనవలెనే రాజాస్థానములందధికారమునెఱపి, రాజభోగము లనుభవించిన పుణ్యశాలి. సమకాలమందే కాక నిన్న మొన్నటి వరకు అర్వాచీన కావ్యరచనలకు తన శైలిని ఒరవడిగా బెట్టిపోయిన గురువు విపుల కావ్యేతిహాస పురాణముల నుండి ఆంధ్రరసికుల దృష్టిని ప్రబంధముల దెసకు మరలించిన యుగకర్త చిన్ననాటనే వేదవేదాంగాది పాండిత్యమును సంపాదించి, సాంఖ్యాది సిద్ధాంతములను, శైవవైష్ణవాద్యాగమంబులను, పాతంజలాది యోగములను, న్యాయవైశేషికాది దర్శనములను నామూలాగ్రముగా నెఱిగిన మహావేత్త ఈ సమస్త విద్యాపరిశ్రమము నాతని గ్రంథములలో ప్రసంగము వచ్చినపుడెల్ల ప్రస్ఫుటమగుచునే యుండును సంస్కృతాంధ్రములం దెట్టి పండితుడో ప్రాకృతాదులందు నట్టివాడే యనుటకు సప్తశతి తార్కాణము. ఈతని పాండిత్యమును దగ్గుపల్లి దుగ్గన నాచికేతోపాఖ్యానమున ప్రశంసించినాడు

సీ॥ సంస్కృత ప్రాకృతశౌరసేనీ ముఖ్యభాషా పరిజ్ఞాన పాటవంబు
పన్నగపతి సార్వభౌమ భాషితమహాభాష్య విద్యాసమభ్యాసబలము
నక్షపాద కణాదపక్షిలోదీరిత న్యాయకళా కౌశలాతిశయము
శ్రుతిపురాణాగమస్మృతి సాంఖ్యసిద్ధాంత కబళనవ్యుత్పత్తి గౌరవంబు

పూర్వకవిముఖ్య విరచితాపూర్వ కావ్యభావరస సుధాచర్వణ ప్రౌఢతయును
*గందళింపంగ గాశికాఖండ నైషధ ప్రముఖ వివిధ ప్రబంధము లొనర్చి.*

ఇంత యుద్దండ పండితుడయ్యు నాగర్భకవిగా బుట్టుట యీ వ్యక్తిలోని మహా విశేషము.

సంస్కృత కవులలో కాళిదాసు, మురారి, శ్రీహర్షుడు, భట్టబాణుడు – శ్రీనాధునకు ప్రధాన గురువులు. తెనుగున కవిత్రయము వారి యెడ నీతడట్టి గురుభావమే చెప్పెను. పైని పేర్కొన్న సంస్కృతకవుల శ్లోకములను సందర్భవశమున దన గ్రంధములందెల్లెడ తెనిగించుటేకాక, విశేషించి కాళిదాసు కుమార సంభవమునకు హరవిలాసమున పొసగినంతవరకు అనుసరణ మనిపించుకొదగిన అనువాదము చేసెను. అంతకంటెను విశేషము, శ్రీహర్షుని నైషధమును తెనిగించుట. వీరందఱిలో భట్టబాణుడు శ్రీనాధునికి శైలి నేర్పిన గురువు. ఆ సంస్కృత కవి యాభాషలో రీతి స్ఫూర్తికి బేరువడిన యే గద్య శైలిని అవతరింపజేసెనో, తెనుగున శ్రీనాధుడా వచనశైలిని అవతరింపజేసెను బాణుని సమాసములు, విరోధాభాసాద్యలంకారములు. పూర్ణోపమాభూయిష్టములైన వర్ణనలు శ్రీనాధుని గ్రంధములలో యధాతధముగ గానవచ్చును.

కవిత్రయము వారిలో తిక్కన పలుకుబడికే కవి యెక్కువగ మురియును. కాని, యీతని శైలి యీ ముప్వురలో నెవ్వరిదికాదు. సమాస ఘటన నన్నయ నుండి, ముద్దులొలుకు తెలుగు పలుకుబడి తిక్కననుండి, ప్రసన్నత యెఱ్ఱన నుండి గ్రహించి, యెవరికిని శిష్యత్వము నెఱపని శైలి నీతడు నిర్మించుకొనెను. తనను గురించి కృతిపతిచే

శా॥ *ఈ క్షోణిన్ నినుఁబోలు సత్కవులు లేరీ నేఁటి కాలంబునన్,*
*ద్రాక్షారామ చళుక్య భీమవర గంధర్వాప్సరో భామినీ.*
*వక్షోజద్వయ గంధసారఘుసృణ ద్వైరాజ్య భారంబు న*
*ధ్యక్షించుం గవి సార్వభౌమ! భవదీయ ప్రౌఢసాహిత్యముల్*

అని చెప్పించిన పద్యార్థము సార్థకమై చెల్లినది

## శ్రీనాధుని కృతులు

శ్రీనాధుడు నైషధ రచనకు పూర్వము మరుత్తరాట్చరితమును, శాలివాహన సప్తశతిని, పండితారాధ్యచరిత్రను రచించెను కాని ఆ మూడును నష్టములైనవి.

1. **మరుత్తరాట్చరిత్ర:** ఈ మరుత్తరాజు కధ మార్కండేయ పురాణమున కలదు అది చిత్రవిచిత్ర సన్నివేశములతో బహుపాత్ర ప్రాధాన్యముతో, అతర్కిత పరిణామములతో నాటకీయ గుణశోభితమై యుండును. శ్రీనాధుడు దాని కధాచమత్కారమునకు ముచ్చటపడి తన కావ్యమునకు ఆ కధ నితివృత్తముగా గైకొని యుండును. అతని రచన స్వతంత్రమో? లేక ఆ పేరుగల పూర్వ సంస్కృత కావ్యమునకు అనువాదమో? చెప్పలేము ఆ పేరుగల సంస్కృత కావ్యమేదియు నుండినట్లు నేనెఱుగను. శ్రీనాధుడు చేపట్టిన యితివృత్తము గనుక అతని గ్రంధము లేకపోయినను

ఇతివృత్తమైనను ఆంధ్రుల దృష్టికి తెచ్చుట మంచిదియని మూరన ప్రకరణమున ఆ కథను వివరించితిని.

**2. శాలివాహన సప్తశతి:** శ్రీనాధునకు ఆశ్రయ మిచ్చిన పెదకోమటి వేమారెడ్డి కూడ కాటయవేమునివలె, కుమారగిరివలె మంచి విద్వాంసుడు ఈ రాజు సప్తశతిలోని నూరు శ్లోకములకు టీక వ్రాసి "సప్తశతి సారటీక" యని పేరు పెట్టెను. తన రాజు టీక వ్రాయగ శ్రీనాధుడా గ్రంధమును పూర్తిగా తెనిగించెను కాబోలు ఒకవేళ ఆ ఆంధ్రీకరణము పెదకోమటివేమునకే యంకితమయ్యెనేమో! క్రీడాభిరామమున గానవచ్చు రెండు పద్యములకు ప్రభాకరశాస్త్రిగారు మూలగాధలను గుర్తించి చూపిరి. ఆ రెండు పద్యములును శ్రీనాధుని తెలుగు సప్తశతిలోనివియై యుండుననుటకు సందియము లేదు. ఆ పద్యము లివి.

i) మ॥ పటు ఝంఝూపవనోత్థ్రణాలయములో భద్రంబునన్ బట్టె కం
కటిపై ముచ్చుముడిగి నిర్భరవియోగగ్లాని శోషిల్లి యె
క్కటి నిద్రించుచున్న పాంథవనితన్ గర్వావచః ప్రౌఢిమన్
దటి దుద్యోతము సూపు నట్టనడురే ధారాధర శ్రేణికిన్.

ii) గీ॥ మాఘమాసంబు పులివలె మలయుచుండ
బచ్చడం బమ్ముకొన్నాఁడు పసరమునకు
ముదిత చన్నులు పొగలేని ముర్మురములు
.*చలికి నొఅగోయకేలుండు సైరికుండు.

ఈ రెండునుగాక ఈ క్రింది పద్యము సప్తశతిలోనిదిగా లక్షణ గ్రంధములలో గానవచ్చుచున్నది.

వారణసేయఁదావి గొనవా నవవారిజమందుఁ దేఁటి గ్రొ
వ్వారుచునుంట నీ వెఱుఁగవా ప్రియ వా తెఅగంటిగంటి కె
వ్వారికిఁ గెంపురాదు తగవా మగవారలదూర నీ విభుం
డారసి నీ నిజంబెఱుగు నంతకు నంతకు నోర్పు నెచ్చెలీ!

**3. పండితారాధ్య చరిత్ర:** ఇది పాలకురికి సోమనాధుని ద్విపద కావ్యమునకు పద్యానుసరణము. నైషధ కృతిపతియైన సింగనామాత్యుని అన్నగారికిది కృతి.

కం॥ జగము నుతింపఁగఁ జెప్పితి
ప్రెగడయ్యకు, నా యనుంగుఁ బెద్దనకు, ఁగృతుల్
నిగమార్థసార సంగ్రహ
మగు నాయారాధ్య చరిత మాదిగఁ బెక్కుల్.

అని నైషధమున ప్రస్తావింపబడినది గనుక తత్పూర్వ రచనయే!

**4. శృంగార నైషధము:** దీనికి మూలమైన శ్రీహర్షుని గ్రంధమునకు నైషధీయ చరితమని పేరు. ఈ కథకు మూలము భారత అరణ్యపర్వములోగల నలోపాఖ్యానము

* ఈ పద్యమునందలి చివరి రెండు పంక్తులలో మూలములోని యర్థము లేదు కవి హృదయము బోధపడలేదు

కాని ఆ మూల కథనంతను శ్రీహర్షుడు వ్రాయలేదు. అందుచే నైషధీయచరితము యథార్థముగ సార్థకముగాదు. వ్రాసినంత వరకు వివాహపర్యవసాయియైన నల దమయంతుల ప్రణయగాథ మాత్రమేగల యీ గ్రంథమును శ్రీనాథుడు శృంగారనైషధమనుటలో నెంతో ఔచిత్యమున్నది కష్టమయమైన నాయికానాయకుల ఉత్తర కథాభాగమును శ్రీహర్షుడు వ్రాయ తలపెట్టలేదో లేక తల పెట్టియు గ్రంథమును అసమాప్తముగానే వదలెనో నిష్కర్షగా చెప్పలేము. అయినను అతడు సంపూర్ణ కథను వ్రాయ సంకల్పించినట్లు అనుమానించుటకు కొంత అవకాశము లేకపోలేదు. ఎట్లన, నలదమయంతుల కష్టపరంపరకు, కలిద్వాపరముల కోపము కారణభూతము. శ్రీహర్షుని గ్రంథమున ఈ పాత్రలు ప్రవేశపెట్టబడినవి. నిషధపురమున అవి నలుని యావేశించుటకు రంధ్రాన్వేషణ చేయుచు నివాస మేర్పరచుకొన్నట్లు కూడ నిర్దేశింపబడినది. ఉత్తర కథ వ్రాయదలపని కవి ఆ కథా కావ్యమునకు బీజరూపమైన కలి ద్వాపర ప్రవేశమును చేయడు. కావున ఆదియందు సమగ్ర నలచరితమునే వ్రాయ సంకల్పించియు శ్రీహర్షుడు ఏ కారణము వలననో ఉత్తర కథను వ్రాయలేదని తలచుట అంతగా తప్పుకాదు. కథా ప్రణాళికలో భారత కథకును నైషధీయ చరితమునకును భేదమేమియు లేదు. నలదమయంతుల పరస్పర ప్రేమ–హంసదౌత్యము–నలదౌత్యము–స్వయంవరము–వివాహము అనెడి యైదు కథాంశములు ఇందును అందును కూడ సమానమే. కాకపోతే, అనతి విస్తృతమైన పురాణ కథను విపులాతి విపులమైన ప్రబంధ వస్తువుగా పరివర్తనము చేయునపుడు రససంపాదన వ్యాజమున కవి ప్రదర్శించిన వర్ణనా బాహుళ్యమువల్ల ఈ కావ్యము ఇరువది రెండు సర్గముల గ్రంథముగా పెరిగినది. భారతమును దానికి పరిశిష్ట భాగమైన హరివంశమును తెనుగున నవతరించిన పిమ్మట శ్రీనాథుని వంటి సాహిత్యరసలోలుపుడైన ప్రజ్ఞాశాలి విషయ ప్రధానములైన ఇతర పురాణములను కాక రస ప్రధానమైన యేదేని ఒక సంస్కృత కావ్యమును చేపట్టుట న్యాయమే కాని శ్రీహర్షునికంటె అన్ని విధముల ఉత్తముడైన కాళిదాసుని కావ్యము లుండగ ఈ ఆంధ్రకవి శ్రీహర్షునే యేల వరింపలయును? దీనికి మూడు కారణము లుండవచ్చునని నాకు తోచుచున్నది.

మొదటిది: కృతిపతియైన మామిడి సింగనామాత్యుడు–

> "శ్రీహర్ష సుకవి కవితా
> వ్యాహార కథాసుధారసా స్వాద సుఖ
> శ్రీహర్షోదయ నిత్య స
> మాహిత మహితాంత రంగు"డు...

ఆ కృతిపతికి అభిమాన పాత్రయైన గ్రంథము నాతని కోర్కెపై తెనిగించుట కృతికర్త విధి గావున దానిని చేపట్టక తప్పదు.

రెండవది: వేమ భూపాలుని ఆస్థానమున వామనభట్టబాణుడను ఒక సంస్కృత కవి కలడు. అతడు నలాభ్యుదయ మను పేర నిషధరాజ చరితమును సంస్కృతమున నొక కావ్యముగా వ్రాసెను. అందు వామనుడు తన ప్రజ్ఞనెంతగా ప్రదర్శించినను, శ్రీహర్షుని నైషధముండగా సంస్కృతవాఙ్మయమున అతని నలాభ్యుదయము రాణింపదు. అది ఫలములేని వ్యర్థ ప్రయత్నము. మామిడి సింగనామాత్యుడు వామనుని సంస్కృత

గ్రంధముకంటె రెడ్డిరాజుల అస్థానమున శ్రీహర్షుని నైషధమునే అంధ్రభాషా రూపమున ప్రతిష్ఠించుట తనకును, తన యాస్థానమునకును, కవికిని, అంధ్ర వాఙ్మయమునకును ప్రతిష్ఠాకర మగునని భావించి యుండును. అది శ్రీనాథునకును సమ్మతమై యుండును.

మూడవది: అనువాదమనగా కేవల మూల విధేయత పాటించుటగాక స్వతంత్రించి స్వీయ ప్రజ్ఞా ప్రదర్శనముతో మూలమునకు వన్నె బెట్టగల శ్రీనాథునివంటి మహాకవికి కాళిదాసు కావ్యములు ఉపకరింపవు. కవికులగురుని కావ్యములలో అనువాదకుని స్వతంత్ర విహారమునకు అవకాశముండదు. మరి స్వతంత్రతను అవలంబింపకయే యధామూలముగ, రసవంతముగా, అనువదింపరాదా యనుకొన్న శ్రీనాథుని విశృంఖల ప్రతిభావిహారము అనిర్బంధమును అంగీకరింపదు. అదియుగాక, శ్రీనాథుడు చిన్ననాటనే వేదవేదాంగాది పాండిత్యమును సంపాదించి, సాంఖ్యాది సిద్ధాన్తములను, శైవవైష్ణవాద్యాగమంబులను పాతంజలాది యోగములను, న్యాయ వైశేషికాది దర్శనములను అమూలాగ్రము ఎఱింగిన మహావేత్త. ఈ వైదుష్యమంతయు గ్రంథ రచనలో ఫలప్రదము కావలయు నన్నచో అంత వైదుష్య భూయిష్ఠమైన కావ్యమే అందులకు తగిన సారవంతమైన క్షేత్రము. సంస్కృత వాఙ్మయములో అట్టి కావ్యము శ్రీహర్షుని నైషధీయ చరితమే. కావున తన ప్రజ్ఞను, స్వతంత్రతను, వైదుష్యమును ప్రదర్శించుటకు తగిన క్షేత్రమని శ్రీనాథుఁ డిందదుగిడి యుండవచ్చును. పై ప్రశ్నకు నాకు తోచిన సమాధానమిది

## నైషధీయచరితపరామర్శ

నైషధము సంస్కృత వాఙ్మయమున నతి ప్రౌఢసాహిత్యమని పూజింపబడిన మహాకావ్యము. సాహిత్యములో ప్రౌఢియనునది కావ్యశిల్పమునకు సంబంధించినది కాని, శబ్దాడంబరమునకు సంబంధించినది కాదు దురదృష్టవశమున ఈ యర్థమును విస్మరించి దురవబోధ నారికేళ పాకమయమైన కావ్యములనే ప్రౌఢకావ్యములని సాహిత్య పరులు వాకొనుట పరిపాటి యైనది. అది యట్లుండ నిండు, శ్రీహర్షుడు సహజముగా మహామేధావి. ఆ మేధావి నిసర్గకవితా ప్రతిభ కూడ కలవాడు. ఈ సహజశక్తుల కాతడు చేసిన సమస్త విద్యా వ్యాసంగమును తోడ్పడి అతనిని మహా పండితుని జేసినది. పాండిత్య రూపమైన ఈ వ్యుత్పత్తి సహజ ప్రజ్ఞకు మించిన దగుటచే నాతని కవితాకన్య మోయలేని భారమును దాల్పవలసి వచ్చెను. ఒక్కొకయెడ సహజ సౌందర్యమునే మరుగు పరచిన కృత్రిమాలంకృతి కానవచ్చును: పాండిత్య యుతమైన మేధావిత యాతని యూహను (భావనముకాదు)* చిత్రవిచిత్ర భూముల సంచరింపజేసి అతిలోకములైన అర్థకల్పనల జేయించును. ఆ యర్థకల్పనలు అత్యుదాత్తములు, అశ్చర్యజనకములునై యుండును. ఈ గ్రంధమున-అలవోకగా ఏ శ్లోకమును స్పృశించినను ఈ గుణములే ప్రస్ఫుటములయి పాఠకుల నాశ్చర్య ప్రవాహమున మున్కలు వేయించును. ఎడనెడ హృదయావర్జకమును భావనాగమ్యమును నైన

---

* భావన: Imagination ఊహ: Fantacy.

సరసకవితా సృష్టియు దర్శనమిచ్చుచుండును మొత్తము మీద ప్రజ్ఞాజన్యమైన ఈ భాగము తక్కువగను, వ్యుత్పత్తి జన్యమైన యా భాగ మెక్కువగను ఉండుననుచో నంతగా నపరాధము కాదు. ఎంత గొప్పవాడైనను ఈ కవి కాళిదాసాదులతో పోల్చదగినవాడు మాత్రముగాదు. రసపరిపోషణము నందేమి ఔచిత్య పరిపాలనము నందేమి, కథాకథనము నందేమి, చతురస్ర శోభియైన మూర్తి సౌష్ఠవము నందేమి ఆ కవికులగురునకు గల కౌశలము ఈతనికి లేదు. మరి యెప్పటికప్పుడే ఒక్కొక్క శ్లోకరచన ఈతని దృష్టి నరికట్టును గాని సమగ్ర కావ్య నిర్మాణపు దెసకు ప్రసరింపదు. ఈతని అర్థకల్పనలు ఎంత ఆశ్చర్యజనకములైనను వాటిలో కొన్ని అనౌచిత్య కళంకితములై యుండును. ఈ దోషారోపణము నేటి సాహిత్య ధర్మముల బట్టియు ప్రమాణములబట్టియు చేసినది కాదు. శ్రీనాధుని నాటికే ఈ కవిత అట్టిదిగా సరసులకు పొడకట్టినది. ఈ యనౌచిత్యముతోపాటు పునరుక్తి, భావాతి చాలనము, వర్ణనా దైర్ఘ్యము ఈ కావ్యములో గల మరికొన్ని అవగుణములు. అయినను ఈ గ్రంథమున చక్కని రసవద్ఘట్టములు లేకపోలేదు. అట్టివాటిలో నలదౌత్యము సుందరాతి సుందరము. ఆ భాగమే ఈ కావ్యమునకు ఆయువుపట్టు. శేముషీమూర్తులైన నాయికా నాయకులిరువురు తమ తమ వ్రతనిష్ఠను అచలితముగ కాపాడుకొనుటకై పరస్పర సంభాషణ చేయు సమయమున ప్రదర్శింపబడిన చాతుర్యము, గాంభీర్యము, స్వాభావికత, ధీరత్వము అతి రమణీయములుగా నున్నవి. అందును, అదిగర్భేశ్వరియు బుద్ధిశాలినియు అగు దమయంతి వాదమున దేవదూత గెలువలేక కంటనీరు పెట్టుకొను క్షణము సరసులకంట నీరు తెప్పించును. ఇట్టి గుణాగణ సంకలితమైన యీ కావ్యమును చేపట్టి శ్రీనాధుడెట్లు ఆంధ్రీకరించెనో చూతము.

## ఆంధ్రీకరణ పద్ధతి

శ్రీనాధుడే తన ఆంధ్రీకరణ పద్ధతిని గురించి గ్రంథాంతమున "అశేష మనీషి హృదయంగమంబుగా, శబ్దం బనుసరించియు, అభిప్రాయంబు గుఱించియు భావం బుపలక్షించియు, రసంబు పోషించియు, అలంకారంబు భూషించియు, ఔచిత్యం బాదరించియు, అనౌచిత్యంబు పరిహరించియు. మాతృకానుసారంబున చెప్పబడె"నని వక్కాణించెను. శృంగారనైషధము కవి ప్రతిజ్ఞానుసారము మనీషి హృదయంగమంబుగా నున్నదని ఒప్పుకొని తీరవలెను.

ప్రాయికముగా సంస్కృత వాఙ్మయము నాంధ్రీకరించుటలో మూడు పద్ధతులు గలవు. మొదటిది పురాణేతిహాసముల యాంధ్రీకరణము, కవిత్రయము వారి భారతాంధ్రీకరణ పద్ధతి. భారతాంధ్రీకరణము కథా ప్రధాన మగుట స్వేచ్ఛానువాదము. మూలము నిమిత్తమాత్రము.

శ్రీనాధుడు మొదలిడినది ప్రబంధాంధ్రీకరణము. మూలము నందలి ప్రతి శ్లోకము నిందు గణనీయమే, అపరిహార్యమే. అర్థసౌందర్యము కొన్నిట, భావసౌందర్యము గొన్నిట, నలంకార సౌందర్యము గొన్నిట నుండును. తెనుగు సేతలోనాశోభ గోచరింపనిచో గావ్యము నిరసింపబడును. ఇంక నపరిహార్య మిషచే బ్రతి శ్లోకము దెనిగించిన గావ్యమున మూలము నందలి సొగసులతో బాటు వికారములును

ప్రవేశించును. కవియస్వతంత్రుడై తన కవితాశక్తిని చూపనేరక కేవలానువాదకుడై మూల దాసుడగును అనువాదకుడెంత సమర్థుడైనను మూలశ్లోకార్థము పద్యమున బద్ధముచేయక తప్పదు. ఈ సంకటావస్థలో శ్రీనాథుడు చాల మనము చేసికొని చక్కని దారి త్రొక్కెను. కథాప్రధానముగ గవిత్రయమువారి వలె స్వతంత్ర రచన సాగింపను లేదు. కేవలము మూలమునకు దాస్యముచేయను లేదు. మూలము ననుసరించి యుండును గాని దాస్యము చేయలేదు. శ్లోకార్థము నంతను ననువదించినను నా పద్యమనువాదము గాదనునట్లు వ్రాయును. శ్లోకము పద్యమున నిముడుగాని పద్యము శ్లోకబద్ధముగాదు. ఆవశ్యకమని తోచినచో నెంత గొప్ప శ్లోకమైనను పరిహరించుటకు వెనుదీయడు. కొన్నిట మూలగతార్థమును సంస్కరించుటకు గూడ సాహసించును. దీనిని స్వతంత్రాస్వతంత్రానువాద మందురు. ఇది యీ భాషాంతరీకరణ పద్ధతిలో రెండవ యవస్థ. ప్రధానాప్రధానముల యెడ నీతడు పాటించిన మర్యాదనే నిన్న మొన్నటి యస్వతంత్రాను వాదమునకు బూర్వకవు లందఱు శిష్యప్రాయముగ ననుసరించిరి. పినవీరన, నందిమల్లయ, ఘంట సింగయలు శ్రీనాథుని యడుగుజాడలనే నడచిరి.

ఈ యాంధ్రీకరణమున మూడవ యవస్థ నేటి నాటకములయు, గావ్యములయు బ్రతిపద పరివర్తనము. దీనివలన దెనుగు రచన యందు ధారాశక్తి కుంటుపడును. అర్థావబోధము దురవగాహ మగును ఈ యాంధ్రీకరణము లందలి పద్యము లన్వయించుటకు మూలమపేక్షణీయ మగుచున్నది దీనిని కేవలాస్వతంత్రానువాదమందురు. కాళిదాసు నాటకముల నీపద్ధతినే యనువదించు చున్నారు.

## శ్రీనాథుని నైషధాంధ్రీకరణము

I. అనౌచిత్య శంకచే వదలినవి

1. *సాపేశ్వరేశ్వణ్వతి తద్గుణౌఘాన్*
*ప్రసహ్యచేతో హరతో ర్థశంభుః*
*అభూదపర్ణాంగుళిరుద్ధ కర్ణా*
*కదాన కణ్డూయ నకైతవేన!* 3–29

2. *అలంసజన్ ధర్మవిధౌ విధాతా*
*రుణద్ధిమౌనస్యమి షేణవాణీమ్*
*తత్కంఠమాలిఙ్గ్యరసస్య తృప్తాం*
*న వేదతాం వేదజడస్యవక్రామ్* 3–30

3 *శ్రియస్తదాలింగన భూర్నభూతా*
*వ్రతక్షతి కాపి పతివ్రతాయాః*
*సమస్త భూతాత్మతయాన భూతః*
*తద్భర్తురీర్ష్యా కలుషాణునాపి* 3–31

ఈ మూడిట జగన్మాత లగు సరస్వతీ పార్వతీ లక్ష్మల పాతివ్రత్య శంక సూచితము. కావున శ్రీనాథుడు వీనిని విడిచెను. వారి కట్టి శంక లేకపోవచ్చును పాతివ్రత్యక్షతి లేకనుపోవచ్చును దివ్యులను మానవులతో బోల్చుట దివ్యత్వము

నపహాస్యము జేయుట యగును. ఇది కవితా కళకు మచ్చ. మఱియు నీశ్లోకములు జుగుప్సాకరములు.

II. పరిహార్యము లయ్యు దెనిగింపబడినది.

నకా నిశి స్వప్నగతం దదర్శతం
జగాద గోత్రస్థలితే నకానతం
తదాత్మతా ధ్యాతధవా రతేచకా
చకారవా స్వమనోభవోద్భవం. 1–30

వాని గలలోన గానని వనజముఖియు
వాని మార్పున బేర్కొని మానవతియు
వాని గానాత్మ భావించి వరుని గవయ
నప్పళించని సతియులేదయ్యె నచట. 1–62

మన కాలమును బట్టి పరిహార్యముగ దోచును. ఇది మానవ స్త్రీల గురించి కవి తానై చెప్పినది. శ్రీనాథుని కాలమున నిది పరిహార్యము గాకపోవచ్చును.

అస్మత్కృతశ్రోత్ర సుధాం విధాయ
రంభాచిరంభామతులాం నలస్య
తత్రానురక్తా తమనాప్యభేజే
తన్నామగంధాన్నలకూబరం సా 3–26

వినుకలి గూర్చి జిక్కి పృథివీ వలయంబున కుండి గంగనే
యనువును లేక రంభయును నచ్చరలేమ నలున్ వరింప బూ
నిన తన కోర్కె నొక్క మెయినిండగ జేయుటకై భజించె దా
గానకొని వేల్పులందు నలకూబరు దచ్ఛుభనామవాసనన్.

ఈ శ్లోకమున నర్థచిత్రము గలదు. దివ్య మయ్యు వేశ్య యగుట నంత విప్రతిపత్తియు లేదు.

III. శ్లోకములను బూర్తిగా విసర్జించుటయు లేక పూర్తిగా తెనిగించుటయు గాక శ్లోకములను తెనిగించుటలో ననౌచిత్యపు మాటలను గొన్నిటిని మార్చినాడు

సువర్ణశైలాదవతీర్యతూర్ణం
స్వర్వాహినీ వారికణావకీర్ణైః
తంవీజయామః స్మరకేళికాలే
పక్షైర్నృపంచామరబద్ధసఖ్యైః 3–22

ఇందలి 'స్మరకేళికాలే' యనుదానికి శ్లోక మంతయు నెత్తివేయ నిచ్చగింపక

కనకశైలంబుడిగ్గి యాకాశ సింధు
సలిలముల దోగి మిగులంగ జల్లనైన
చారుహాటకమయ గరుచ్చామరముల
వీతు నతనికి వైశాఖవేళ లందు

అని యనువదించెను. ఆ 'వైశాఖవేళలు' గూడ 'స్మరకేళికాలము' లే యగుట నామూర్పునకు మఱింత సొగసు వచ్చినది.

IV. కేవల శాస్త్రప్రావీణ్య సూచకములగు శ్లోకములను విడిచెను.

> 1. *అధరంకిల బింబనామకం*
> *ఫలమస్మాదితి భవ్య మన్వయం*
> *లభతేఽధర బింబమిత్యదః*
> *ప్రదమస్యాః రదనచ్ఛదం వదత్ 2–24*

ఈ శ్లోకము ననువదింపలేకపోయినా డని కొందరను చున్నారు. అది నిజముగాదు. దీని యవసరములేక విడిచిపెట్టినాడు. ఇంక నెక్కడనైనను అవసరమున్నదేమొ కాని వేదాంత చర్చ కొన్నిచోట్ల తప్ప శాస్త్ర ప్రసంగములకు కవిత్వము నందు స్థానము లేదు. ఇది వర్ణనచే గాని రసముచే గాని సుందరము గాదు.

2. దమయంతి సౌందర్యము హంస నలునితో చెప్పుట—

> *కలశే నిజహేతు దండజః*
> *కిం చక్రభ్రమ కారితాగుణః*
> *సతదుచ్చకుచౌ భవన్ ప్రభా*
> *ఝర చక్రభ్రమ మాతనోతియత్ 2–32*

కారణము కార్యము నొడగూర్చును. కారణము ద్వివిధము. సమవాయి కారణము (Primary or Fundamental), నైమిత్తిక కారణము (Secondary or instrumental). సమవాయి కారణమే కార్యమున సంక్రమించును. ఒక తార్కిక యుక్తిచే నైమిత్తిక కారణమును దమయంతి సౌందర్యమున సంక్రమింప జేసెను.

కార్య మయిన కుండ యందు నైమిత్తిక కారణము నుండి పుట్టిన చక్రమును భ్రమింపజేయు గుణము పుట్టినదా యేమి? ఏలన ఉన్నత కుచము లగుచు నామె లావణ్య ప్రవాహ మందలి చక్రవాకముల భ్రమను గల్గించుచున్నది. చక్రభ్రమ శ్లేష. చక్రవాకములుగా కుచపర్యాయమున అర్థము.

దీనికి సరియగు తెనుగు చేయక యీ యర్థమును సూచించు తేలిక పద్యము వ్రాసెను (2–17)

> *'హాటక కలశంబులకును*
> *బాటి యగు వధూటి మెఱుఁగుఁ బాలిండ్లు నిరా*
> *ఘాటస్ఫురణ ప్రభయును*
> *నేటికి! జక్కవల కవవహి విరాజిల్లెన్?'*

V. పునరుక్త మగు శ్లోకములను, భంగ్యంతరమున జెప్పిన యర్థమునే చెప్పెడి శ్లోకములను విడచెను. నలరూప వర్ణనము—

> *స్వకేళిలేశస్మిత నిందితేందు నో*
> *నిజాంశ దృక్తర్జిత పద్మసంపదః*

అతద్వయీ జిత్వర సుందరాంతరే
నతన్ముఖస్య ప్రతిమాచరాచరే

నలుని మందస్మితవేశముచే ఇంద్రుడును, నేత్రవిలాసముచే బద్మమును తర్జితములైనవి. చరాచర ప్రపంచమున నీరెంటికంటె సుందరతర వస్తువు లేదు.

సరోరుహం తస్యదృశైవ నిర్జితం
జితాఽ స్మితేనైవ విధోరపి శ్రియః
కుతం ఫలం భవ్యమ్ అహో మహీయశీ
తదాననశ్యోప మితౌదరిద్రతా

ఇది పైయర్థమునే సూచించును. కాని పునరుక్తము వలె గోచరింపదు. శ్రీనాధుడు తన నిశిత పరికలనాదృష్టిచే బరీక్షించి దీనిని విడచెను.

VI. మూలమున గల యతిదీర్ఘవర్ణనలు నతిదీర్ఘకథాఘట్టములు నెంతవఱకు సమంజసమో యావశ్యకమో యంతవఱకే గ్రహించి యనావశ్యకము లని తోచిన శ్లోక పరంపరను విడిచెను. నలుడు వాహ్యాళి కేగునపుడు అతని పరివారమును వర్ణించు శ్లోకములు 12 గలవు. వాని నన్నింటిని–

ప్రమద నిష్పందతర నేత్రపద్మలగుచు
బౌరజనులు విలోకింప బ్రకట శీల
సముచితానల్పపరివారసహితు డగుచు
నవనినాథసుతుండు వాహ్యాళి వెడలె 1–88

ఈ పద్యమున జెప్పి విడచెను. ఇట్లంతటను వదలలేకపోయినను (అపవాదము) తన ప్రణాళికను సూచించెను.

VII. 'వటయో రబేధః' అను దాని యందలి సొగసు సంస్కృతము నందు వలె తెలుగులో రాదు. నాయకుని కేశ మందముగా నున్నను దానిని వర్ణించుట కవిసమయము కాదు. అందువలన ప్ర. సర్గ. 25 వ శ్లోకమున దెనిగించుట మానినాడు.

**తెనిగించిన శ్లోకముల నెట్లు తెనిగించెను?:-**

శబ్ద సారస్యముచే సొగసుగ నున్న శ్లోకముల నా సారస్యము చెడకుండ తెనిగించెను. తెనుగు కవి యెంతవఱకు బాటించవలెనో యంతవఱకు మూలవిధేయతను బాటించెను.

1. అత్యంత మూలవిధేయముగ శబ్దార్థముల దెచ్చినవి.

అశ్రాంత శ్రుతిపారపూత రసనావిర్భూత భూరిస్తవా
జిహ్మబ్రహ్మముఖౌఘ విఘ్నితనవస్వర్గక్రియాకేళినా
పూర్వం గాధిసుతేన సామిఘటితా ముక్తా నవమందాకినీ
యత్ప్రాసాద దుకూలవల్లిరనిలాందోళైరఖేలద్దివి. 2–102

వేదా భ్యాస విశేషపూత రసనావిర్భూత భూరిస్తవా
సాదబ్రహ్మముఖౌఘ విఘ్నిత నవస్వర్గ క్రియాకేళిచే

నాదిన్ గాధితనూజుచే సగము సేయంబడ్డ మిన్నేఱు ప్రా
సాద స్వచ్ఛదుకూల కైతవ మనం జాలంగ నొప్పం బురిన్. 2–41

అస్తివామ్యభర మస్తికౌతుకం
సాऽస్తి ఘర్మజల మస్తివేపధు
అస్తి భీతిరత మస్తివాంఛితం
ప్రాపదస్తి సుఖమస్తి పీడనమ్ 18–62

అస్తివామ్య భారమస్తికౌతూహలం
బస్తి ఘర్మసలిలమస్తి కంప
మస్తిభీతి యస్తి హర్ష మస్తివ్య థం
బస్తి వాంఛమయ్యె నపుడు రతము 7–177

యథామూలానువాదము దుర్ఘటము కాదని యిట శ్రీనాథుడు ఋజువు చేసెను. సంస్కృతము నుండి యెట్టి సమాసము నైనను గొంతవఱకు దెనుగునకు దేవచ్చు ననుట కందలి సమాసములనే యిందవతరింప జేసెను This is because Sanskrit can be adopted by Telugu.

2. సమాస చమత్కారము గల మూలశ్లోకము నందలి సమాసములు తెనుగునకు సహజము గాకున్నను వానిని యథాతథముగ దెనుగున కవతరింప జేసి యనువదించెను.

సరసీ పరిశీలితుం మయా
గమికర్మీకృత నైకనీవృతా
అతిథిత్వమనాయి సాదృశో
సదసత్సంశయ గోచరోదరీ 2–40

ఇందలి 'గమి కర్మీకృత' యను సమాసము సంస్కృతమున బలువురు మెచ్చునది. దానిని దెనిగించిన యా చమత్కారము కుంటువడును. కావున దానిని యథాతథముగ దెనుగున నవతరింపజేసెను. ఆ సమాసము నందలి ప్రీతిచే మూలమున నది యొకచోటనే బ్రయోగింపబడియుండ దాను రెండుచోట్ల బ్రయోగించెను.

మృదురీతిం బ్రతివాసరంబు గమికర్మీభూత నానా నదీ
నద కాంతారపురా శిలోచ్చయుడనై నైకాద్భుత శ్రీజిత
త్రిదివంబైన విదర్భ దేశమున నారీరత్నముం గాంచితిన్
సదసత్సంశయ గోచరోదరి శరత్సంపూర్ణ చంద్రాననన్.
కమలేందీవర షండమండిత లసత్కాసార సేవారతిన్
గమికర్మీకృత నైకనీవృతుడనై కంటిన్ విదర్భంబునన్
రమణిం బల్లవపాణి బద్మనయనన్ రాకేందుబింబాననన్
సమపీనస్తని నస్తినాస్తి విచికిత్సాహేతుశాతోదరిన్. 2–20, 21

సామాన్యముగా మూలములోని యర్థ చమత్కారము గల సమాసముల నన్నిటిని దెనుగున నవతరింప జేసెను. హంస దమయంతి యుద్యానవనములో దిగునపుడు 'అంకుచితాభ్యాం, పక్షతిభ్యాం' అను శ్లోకమును దెనిగింపకపోయినను నా సమాసములను వచనములో నిమిడ్చెను. స్వయంవర సందర్భమున సరస్వతీరూప వర్ణన శ్లోకముల

ాసమాసములతోనే దండకముగా జేసెను. 'అస్తినాస్తి' అను పదము శ్లోకమందలి 'సదసత్సంశయు' యను సమాసముతో బందెము చఱచినట్లు వాడబడినది. మూలము లోనివే గాక వానికి దీసిపోవని సమాసములను మూలకారునికి బ్రతిద్వంద్వియై సృష్టించి ప్రయోగించి తన నైపుణిని జూపెను. ఇట్టివి శబ్దానుసరణములు. ప్రాయకముగా భావానుసరణమేకాని శబ్దానుసరణము సాధ్యము కాదు.

### 3. భావోపలక్షితములు:

మూలార్థమును స్పష్టీకరించుటకు గ్లిష్టాన్వయ పదములను విడిచి క్రొత్తవానిని వాడెను. మూలార్థమునకు సొగసు దెచ్చెను.

> విధిం వధూస్పష్టి మపృచ్ఛ మేవ
> తద్యామయుగ్యో నలకేళియోగ్యామ్
> త్వన్నామవర్ణా ఇవకర్ణపీతా
> మయాస్య సంక్రీడతి చక్రి చక్రే 3–50

> అడిగితి నొక్కనాడు కమలాసను తేరికి వారువంబనై
> నడచుచు నుర్విలో నిషధనాథున కెవ్వతె యొక్కొ భార్యయ
> య్యెడు నని చక్రఘోషమున నించుక యించుకగాని యంత యే
> ర్పడ విననైతి నీవనుచు బల్కిన చందముతోచె మానినీ 2–58

ఈ శ్లోక మందలి తాత్పర్యార్థము సొగసైనది కాని వివరణాపేక్షకము. తెనుగున నా లోపమును సవరించి స్పష్టీకరించి యధిక సారళ్యమును సంపాదించెను. ఇది యాజాతి పద్యములకు, దలమానికము అసలు రచనాపాటవము పద్యము ఎత్తుగడలో ఉంటుంది. ఇది బాగుగా తెలిసినవాడు శ్రీనాథుడు అందుకనియే 'అడిగితి నొక్కనాడు' అని మొదలుపెట్టినాడు ఇట్టివి లెక్కకు మీరి యున్నవి ఇదే యనువాదములో నున్న గుణమైనచో నింతకన్న మంచి యనువాదము లేదని చెప్పవచ్చును.

> విషమో మలయాహి మండలీ
> విషఫూత్కార మయో మయో హితః
> ఖగ బత కాల కళత్రి దిగ్భవః
> పవనస్త ద్విరహానలైధసా 2–57

> కాలాంతః పురకామినీ కుచతటీ కస్తూరికా సౌరభ
> శ్రీలుంటాకము చందనాచల తట శ్రీఖండ సంవేష్టిత
> వ్యాలస్ఫార ఫణాకఠోర విష నిశ్వాసాగ్ని పాణింధమం
> బేలా నాపయి దక్షిణానిలము పక్షీ సేయు దాక్షిణ్యమున్ 2–32

ఇట మూలశ్లోకమును బీజప్రాయముగా గైకొని దాని కొక పుష్పితవల్లి వోలె స్వకల్పనతో బెంచెను. 'పక్షీ' యని యతితో జూపి విరహార్తుని దైన్య మంతయు జూపెను. మూలకారు డూహించిన వ్యంగ్యమును గ్రహించి స్వంత కల్పనము చేసెను

కుసుమాని యది స్మరేషవో
నతు వజ్రం విషవల్లి జానితతీ
హృదయం యదమూ మహాన్నమూ
ర్కమయచ్ఛాతి తరామతీతపన్ 2–59

మోహము దాహమున్ మదికి మూడ్చుచు నన్నవి పాయదెప్డు సం
దేహము మీనకేతనుని దివ్య శరంబులు పువ్వుమొగ్గలో
నూహయొనర్పగా పిడుగులో? కులిశంబులో యట్ల భారతీ
వాహ కులావతంస విషవల్లి సముద్భవముల్ ప్రసూనముల్ 2–3

ఇది యతి క్లిష్టము. తాత్పర్యార్థమును మాత్రమే స్పష్టీకరించెను.

నైషధములోని సీసములు: నైషధాంధ్రీకరణ సౌలభ్య మంతయు దరచి చూచుటకు బట్టి చూడవలసినది నైషధమందలి సీసము. ఆంధ్రీకర్త మూల మందలి నాల్గెదు శ్లోకముల యర్థసామగ్రి నొక్క సీసమున నిమిడ్చెను. ఒండొంటికి సంవాదము గల శ్లోకగుచ్ఛమును సీసమొనర్చెను. ఈ శ్లోక సంపుటి సీస పరిమాణమునకు మించినచో నవసరమయిన భాగమునే గ్రహించి యనావశ్యక మని తోచిన భాగమును త్యజించెను. అందలి యర్థ సామగ్రి చాలనిచో మూలకారునికి ప్రతిద్వంది యై స్వతంత్ర సృష్టి నెఱపి, మూలమునకు వన్నె పెట్టుచు బూరించెను. అర్థసంవాదము, సమత, సీసమున కెనయగు నెత్తుగీతితో నవయవసంపూర్ణమగు శరీర నిర్మాణము వలె సీసమును నిర్మించెను. మూల శ్లోకములు సీస పాదములలో నిమిడిపోగా నధికాక్షరములు జారిపోయినవి సీస మాయన వశమైన ట్లెరికిని గాలేదు. వేమన కాటవెలది వలె శ్రీనాథునకు సీసము గైవసమాయెను.

సహస్రపత్రాసన పత్రహంస
వంశస్య పత్రాణి పతత్రిణః స్మః
అస్మాదృశాంచాటు రసామృతాని
స్వర్లోక లోకేతర దుర్లభాని 3–16

స్వర్గాపగా హేమ మృణాలినీ
నాళామృణాగ్రభుజో భజామ
అన్నానురూపాంతనురూపబుద్ధి
కార్యం నిదానాద్ధి గుణానధితే 3–17

సీ. నలినసంభవు సాహిణము వారువంబులు
కులముసాములు మాకు గువలయాక్షి
చదలేటి బంగారు జలరుహంబుల తూండ్లు
భోజనంబులు మాకు బువ్వుబోణి
సత్యలోకముదాక సకల లోకంబులు
నాటపట్టులు మాకు నబ్జవదన
మధురాక్షరములైన మామాటలు వినంగ
నమృతాంధసులె యోగ్యు లనుపమాంగి

గీ. భారతీదేవి ముంజేతి పలుకు జిలుక
సమద గజయాన స(బహ్మచారి మాకు
వేదశాస్త్రపురాణాది విద్య లెల్ల
తరుణి నీయాన ఘంటాపథంబు మాకు 2-49

ఇందు జీవి యుత్పత్తి మొదలు విద్యాపరిపూర్తి వఱకు - పుట్టుక, ఆహారము, సంచారము, వాక్కు, విద్యాపరిపూర్తి, మొదలగు షోడశ సంస్కారములను వర్ణించెను. మూలము నందు పాదక్రమంబును సీసమున నర్థసంవాదమునకు వలయునట్లు మార్చెను. ఎత్తుగీతి మూలమును దిరస్కరించునదిగనున్నది మూల మందలి యర్థాంతరన్యాస మెంత పాండిత్య సూచకమును, తార్కికమును, శాస్త్రోక్తము నయినను అర్థ సంవాదము కుదురమి విడిచెను. అర్థాంతరన్యాసము వృత్తానుగుణముగాని సీసమున నప్పదు. సీసమున నర్థసంవాదము సమత యావశ్యకములు మూలమీ సీసము ముందు వెలవెల బోవు చున్నది. మూల మందలి సుగుణముల మరపించు సొగసు సీసమున సమకూర్చెను.

కథాప్రసంగేషు మిథస్సఖీముఖా
త్తృణేపి తన్వ్యా నలనామ నిశ్రుతే
ద్రుతం విధూయాన్యధ భూయతానయా
ముదాత దాకర్ణన సజ్జకర్ణయా

నల మను తృణమును దీని యందలి యితరమును ద్రోసివైచి నల నామమును వినుట యం దాయత్తమయ్యెను. తాత్పర్యార్థమును మాత్రమే తెనిగించెను.

స్మరాత్పరా సోరనిమేష లోచనాత్
బిభేమి తద్భిన్న ముదాహరేతి సా
జనేన యూనస్త్యవతా తదాస్పదే
నిదర్శనం నైషధ మభ్యుపేచయత్

నలస్య పృష్టా నిషధా గతా గుణాన్
మిషేణ దూాత ద్విజ వందిచారణాః
నిపీయ తత్కీర్తి కథామధానయా
చిరాయతస్థే విమనాయ మానయా

నలుని అంతఃపురమునకు బిలిపించుట కన్యాత్వమున కనౌచిత్య మని వారి వలన నలుని సుద్ది విననిచ్చగించు నని తెనిగించెను.

ప్రియం ప్రియాంచ త్రిజగజ్జయ శ్రియా
లిఖాది లీలాగృహ భిత్తికావపి
ఇతి స్మసాకారువరేణ లేఖితం
నలస్యచ స్వస్యచ సఖ్యమీక్షతే

శ్లోకము నంతను గీతమున నిమిడ్చెను.

సీ. సఖులు దా బుష్పాస్త్ర సామ్రాజ్య పదవికి
నభిషేక మొనరించు నవనినాథు
నలనామధేయంబైన తృణంబు వినబడ్డ
నధిపతి పేర్వెన్నయట్లు యలరు
నిషధదేశపు విప్ర నికరంబు పూజించి
యలయక ప్రియు సుద్ది యడుగదలచు
నభ్యాసవశమున బ్రాణేశ్వరునిమీది
యించు గీతములు వాయించువీణ

గీ. నేర్పుగల చిత్రకరులచే నిలయభిత్తి
భువనమోహనాకారత బొలుపుమిగుల
మగని మగువను వ్రాయించి మది దలంచు
నిషధరాజును దన్నుగా నీరజాక్షి 1–76

రెండవ శ్లోకమందు మన్మధునకు వేయబడ్డ రెండు విశేషణములు విడిచిపెట్టబడినవి. రెప్పపాటు లేనివాడు, అసువులు లేనివాడు అనుట పరుషముగా నుండును గాన. ఈ తెనిగింపులో వ్యాఖ్యానము లందున్న కొన్ని సొగసులు పోయినమాట వాస్తవమే. కాని వాని నన్నిటిని యిందవతరింప జేయుట క్లిష్టమైన పని. అట్లు చేయుట వలన యనువాదము ధారాళముగా నుండదు. కాననే భావము నుపలక్షించి తెనిగించెద నని చెప్పియున్నాడు.

మదేకపుత్రా జననీ జరాతురా
నవప్రసూతి ర్వరటాతపస్వినీ
గతిస్తయోరేష జనస్తమర్దయ
న్నహావిధేత్వాం కరుణారుణద్రిన 1–135

ఇందు సీసపద్యమునకు దగిన సామగ్రి లేదు. నలుని మనసు కరుగుటకే సంక్షేప మగు మొఱ చాలదని హంస దీనత్వమును బెంచి వ్రాసెను. అన్ని వాక్యములలో జెప్పదగిన మొఱకాసీసమావశ్యకము.

సీ. తల్లి మదేకపుత్రక పెద్ద కన్నులు
గానదిప్పుడు మూడుకాళ్ల ముసలి
ఇల్లాలు గడుసాధ్వి యేమియు నెఱుగదు
పరమ పాతివ్రత్య భవ్య చరిత
వెనుక ముందఱ లేరు నెనరైన చుట్టాలు
లేవడి యెంతేని జీవనంబు
కానక కన్నసంతానంబు శిశువులు
జీవనస్థితి కేన తావలంబు

గీ. కృపదలంపగదయ్య యోనృపవరేణ్య!
అభయమీవయ్య యో తుహినాంశువంశ!

కావగదయ్య యర్థార్థి కల్పశాఖి!
నిగ్రహింపకుమయ్య యో నిషధరాజ! 1-109

ఆంధ్రీకరణమున దీర్ఘవచనము లున్నచో నది 10, 15 మూలశ్లోకములకు దెనుగు సేత మూలగత సమాసములందుండును. మూల మందలి శ్లోకసంఖ్యా క్రమమును బాటించలేదు. మూల మందలి మొదటి శ్లోక మందలి ద్వితీయార్ధము నుండి ప్రారంభించెను. మూడవది జీవిత సంబంధి తన వాక్కు పవిత్ర మగునేమోయని వదలెను.

నిపీయ యస్యక్షి తిరక్షిణః కథా
స్తదాద్రియంతేన బుధాస్సుధామపి
నలస్సితచ్ఛత్రిత కీర్తిమండల
స్సరాశి రాసీన్మహ సాం మహొజ్జ్వలః 1-1
పవిత్ర మత్రాతనుతే జగద్యుగే
స్మృతా రసక్షాళన యేవ యత్కథా
కథం నసామద్గిరమావిలా మపి
స్వసేవినీమేవ పవిత్రయిష్యతి 1-3

కథా సందర్భమున మార్చిన ఘట్టములను గలవు స్వయంవర సమయమున భీమరాజు విష్ణువుచే నాజ్ఞాత యగు సరస్వతిని సభ యందు జూచును. ఆంధ్రీకరణమున విష్ణుస్తోత్రమునకు బదులు భీమరాజు సరస్వతీస్తోత్రము జేయును. ఈ దండకమున మూలము నందలి సమాసములే గలవు.

పురాణభిన్నమైన కావ్యానువాదపద్ధతికి శ్రీనాథుడే గురువు.

ఆంధ్రనైషధకర్త శ్రీనాథుడు. విద్వదౌషధమని పేరుమోసిన ఆ సంస్కృతకావ్యము నెంత గౌరవించెనో అంత వశపరచుకొనెను.

భాషాంతరీకర్త వివేచింపవలసిన ప్రధానాప్రధానతలకు తెలుగునైషధము లక్ష్యభూతమైనది.

## హరవిలాసము - రచనాకాలము

నైషధ రచనకును కొండవీటి రాజ్య పతనమునకును మధ్యకాలము నందు శ్రీనాథుడు ఆ ఆస్థానమున మరి యే గ్రంథములు రచించెనో తెలియదు. రచించిన జాడయు కానరాదు. కాని శాసనకర్తగా కొన్ని శాసనములు రచించెను. ఆ కాలములో శాసన రచనలు కూడ గ్రంథ రచనలుగానే గౌరవింపబడెను. మరియు విద్యాధికారిగా ఆయన నిర్వహించిన విద్వత్కార్యము లనేకము లుండవచ్చును. ఊరక కాలము బుచ్చుట కాక అటువంటి పాండిత్యవ్యాసంగములో గౌరవప్రదమును, సుఖమయమునైన జీవితమును గడిపియుండును.

ఆ రాజ్యము శత్రు హస్తగత మగుటతోడనే నిరాశ్రయుడై కీర్తి సముపార్జనార్థమో ధనసంపాదనార్థమో ఆశ్రయాంతరముల వెదకికొనుచు దేశ సంచారము జేసి యుండును. అతని జీవితకాలములో అట్టి సంచారములు మూడు జరిగియుండునని

శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రిగారు ఊహించిరి. అందు మొదటిది కొండవీటి నుండి నిష్క్రమించుటకును, భీమఖండము రచించుటకును మధ్యగల కాలమున; రెండవది భీమ ఖండమునకును కాశీఖండమునకును మధ్యగల కాలమున; మూడవది రాజమహేంద్రవర రెడ్డిరాజాశ్రయము కూడ తొలగిన అనంతరము.

ఈ మూడు సంచారములలో మొదటి దానియందు కాంచీనగరమున కేగి చిరపరిచితుడైన అవచి తిప్పయసెట్టికి హరవిలాసము కృతి యిచ్చి యుండును. రెండవ దానియందు వల్లభామాత్యుని దర్శించి అతని పేర క్రీడాభిరామము రచించి ధన సముపార్జనము చేసి తదనంతరము విజయనగరమునకేగి ప్రౌఢదేవరాయల ముత్యాల శాలలో 'దీనారటంకాల' తీర్థమాడియుండును. మూడవ సంచారములో శివరాత్రి మాహాత్మ్యము మొదలగు చిల్లరరచనలు చేసియుండును. పలనాటి వీరచరిత్ర కవిసార్వభౌమ బిరుద ప్రాప్తి అనంతరము వ్రాయబడినది. కావున బహుశః అది కాశీఖండ రచనానంతరము, తుది సంచారము లోనిదై యుండును. పైని చూపిన ఈ గ్రంధ రచనానుక్రమము నిష్కర్షగా ఋజువు చేయుటకు వీలులేని యూహయేయైనను నిరుపపత్తికము కాదు. కావున నైషధమునకు తరువాతి రచన హరవిలాసము. అది 1420–25 మధ్యకాలమున లేదా భీమఖండమునకును కాశీఖండమునకును మధ్యకాలమున రచింపబడి యుండవచ్చును. అప్పట్ల తద్రచనాకాలము 1430–35 మధ్యయై యుండును. అది రెండవ సంచార వేళ. అంతేకాని, ఈ గ్రంధము నైషధమునకు పూర్వమున గాని, కాశీఖండమునకు తరువాతగాని రచింపబడెననుట తగదు.

"ఆంధ్రభాషా నైషధాబ్జభవుని" అని కవి తనను గురించి హరవిలాసమున చెప్పకొనియుండుటచే అది నైషధానంతర రచనయే యని ఋజువు చేయుటకు పాటు పడనక్కరలేదు.

కాశీ ఖండమున కాంచీపుర స్త్రీల వర్ణనగల ఈ క్రింది పద్యమునకు సందర్భశుద్ధిలేదు.

సీ॥ ముడువంగ నేర్తురు మూలదాపటికిరాఁ
    జికురబంధము లీఁగి జీరువాఱఁ
బొన్నపువ్వులఁ బోలు పొక్కిళ్ళు బయలుగాఁ
    గట్టనేర్తురు చీరకటిభరమునఁ
దొడువంగ నేర్తురు నిడువ్రేలుఁ జెవులయం
    దవతంసకంబుగానల్లిపువ్వు
పచరింప నేర్తురు పదియాఱు వన్నియ
    పసిఁడి పాదంబులఁ బట్టుచేల

గీ॥ పయ్యెదమునుంగు బాలిండ్లఁ బ్రాకనీక
తఱచు పూయుదు రొడల గంధంబుఁ బసుపు
బందికత్తెలు సురత ప్రసంగవేళఁ
గంచియెఱవత లసమాస్త్రు ఖడ్గలతలు.

ఇది శివవర్మ తీర్థయాత్రా సంచారము వస్తువుగాగల ఘట్టము. ఈ పద్యమునకు పైని—

ఉ॥ కాంచికిఁబోయి బ్రాహ్మణుడు కాంచె మదావళభూమిభృచ్ఛిరః
కాంచన కంధరా నిలయుఁ గైటభమర్దనుఁ గామకోటి ద
ర్శించి భజించె బాలశశిశేఖరు నేక రసాలనాయకు
న్దంచె ననేకపూర్వజననంబులఁ బుట్టిన పాతకౌఘముల్.

అని బ్రాహ్మణుడు కంచికిపోయి వరదరాజస్వామిని ఏకామ్రనాధుని, కామకోటిని దర్శించి, అనేక పూర్వజననంబుల పుట్టిన పాతకౌఘములను దంచినట్లు కలదు. ఆ సీసపద్యమునకు క్రింద—

గీ॥ కాంతియందురు కొందరక్కాంచి పేరు
క్రమకురువింద రత్న సత్కాంతికలిమి
నప్పురంబున నేడునా భృధివసించి
బ్రాహ్మణుడు సర్వదేవతా ప్రతతిఁ గొలిచె.

అనే పద్యము కలదు. కాంచీపుర స్త్రీల నభివర్ణించెడి యా సీసపద్యము అప్రస్తుతముగా నీ రెంటి మధ్య చొప్పించబడెను. ఆ స్త్రీల వర్ణన ఆ ఉపాఖ్యానమునకు గాని, ఆ తీర్థమునకు గాని ఘనతను గల్గించునది కాదు. అయినను శ్రీనాధుడు హర విలాస రచనా కాలమున కాంచికి బోయినపుడు ఆ రమణీమణుల దర్శించి ఆనందముతో ఆ పద్యమును వ్రాసికొని యుండుననియు దానిని అప్రసక్తమైనను కాశీఖండమున జొనిపియుండుననియు ప్రభాకరశాస్త్రిగారు అభిప్రాయపడిరి. ఈ అభిప్రాయము సమంజసమేయని సరసులకు దోచకపోదు. అదియుగాక కొమరగిరి కాలముననే కోస్తా వర్తకము చేయగల ప్రౌఢవయస్సులో నుండిన అవచితిప్పయ శ్రీనాధుని మూడవ సంచారము కాలమునాటికి సుమారు అరువది, డెబ్బది సంవత్సరముల దీర్ఘకాలము హరవిలాసము కృతినందుటకై జీవించి యుండెననుట సంభావ్యము కాదు. పూర్వోదాహృతమైన "చిన్నారి పొన్నారి చిఱుత కూఁకటినాఁడు..." అను పద్యములో హరవిలాసము పేర్కొనబడలేదు. కనుక ఆ గ్రంధము కాశీఖండము తరువాతి దనెడి వాదముకూడ బలముగలది కాదు; ఎట్లన – ఆ పద్యము శ్రీనాధుని గ్రంధముల నన్నింటిని పేర్కొన్నది కాదు. కవి వయోదశలను, తత్కాల రచనలను ఉదాహరించుట మాత్రమే దాని ముఖ్యోద్దేశము. ఒక వయోదశలో రెండుమూడు గ్రంధములు రచించినను వాటినన్నింటిని పేర్కొనవలసిన అవశ్యకము లేదు. వాటిలో ప్రధానమైన దొక్కటి ఉదాహృతమైన చాలును. మఱియు శివరాత్రి మాహాత్మ్యముగాని, హర విలాసముగాని తదితర గ్రంధములవలె శ్రీనాధుని కావ్యకలా ప్రాగల్భ్యమునకు లక్ష్యభూతములు కాదగిన గ్రంధములు కాకపోవుటచే దానిని ఆదరముతో కొండాడుకొను తలంపు లేకపోవచ్చును

హరవిలాసము కృతిపతి అవచి తిప్పయశెట్టిని శ్రీనాధుడు 'బాలసఖుడవు' అని పేర్కొనెను. అట్లనుట పురాతన మైత్రిని స్మరించుట. కుమారగిరి కాలమున శ్రీనాధుడు బాలుడయ్యును ప్రతిభాశాలి యగుట నాస్థాన ప్రవేశము గావించి

యుండును. తిప్పయాదు లానాడతనితో సఖ్యము నెరపియుందురు. హరవిలాస పీఠికలో తిప్పయ సుగంధభాండాగారాధ్యక్ష పదవిని తడవుట కాతడా పదవిని దత్కాలమునసే యనుభవించుచుండవలెనని లేదు. ఆ పదవి యాతని పూర్వవైభవ సూచకము. కృతికర్త, కృతిభర్తల మైత్రియు నీ కృతిప్రదానమును దత్పురస్కృతములే. గ్రంథ మెల్లెడల 'సుగంధ ద్రవ్యంబు లొడగూర్చియు, గాణివ్యంబుల దెప్పించియు, విఖ్యాతి గాంచిన తిప్పప్రభుండొక్కనాడు' అని భూతార్థక తద్ధర్మార్థక క్రియలే వాడబడినవి.

## గ్రంథ సమీక్ష

శ్రీనాథుని ఇతర కృతులతో బోల్చిచూచునపుడీ హరవిలాసము శైలి ఆ గ్రంథవర్గమున కంతటికి వెలిగా ప్రత్యేకముగా కానవచ్చును. వానిలోని సమాస భూయిష్ఠతాజన్యమైన శబ్దగాంభీర్య మిందులేదు. అందు ప్రదర్శితమైన యాతని నానా శాస్త్రపరిజ్ఞానమును ఇందులేదు కాని, వానికంటె సమ సంస్కృతాంధ్ర పదమయమయి, ప్రసన్నమయి, సుబోధమయి. హరవిలాసము శ్రీనాథ పండితుడుగాక శ్రీనాథకవి వ్రాసినట్లుండును. ఈ కావ్యమున నేయెడను రసవత్తకు మాత్రము లోటురాలేదు. ఇది దేనికిని అనువాదము కాకపోవుటచే, శ్రీనాథుని స్వతంత్ర రచనకు దృష్టాంతమయి ఆ ప్రౌఢకావ్యములలో లేని స్వతంత్రతను గైకొన్నది.

ఇది పురాణమును కాదు కావ్యమును కాదు, కావ్యము కాదగిన వస్త్వైక్య మిందు లేదు. కథలన్నియు శివసంబంధము గల్గియుండుటయే దీనగల యైక్యము దానిని వస్త్వైక్యమనలేము. ఈ కథలన్నియు ఒక దారముతో విడివిడిగా ముడి వేయబడిన సంపోచలం పూవులదండవలె నున్నవిగాని అనుస్యూతములుగా లేవు. సిరియాలుని కథ, గౌరీ కల్యాణము, దారుకా వనవిహారము, హాలాహల భక్షణము, కిరాతార్జునీయము ఇందలి కథలు. వీనిలో మొదటిది బసవపురాణమున కలదు గావి పాత్రల నామములలో రెండింటికిని కొంతభేదము కలదు. బసవపురాణమున సిరాల గర్వభంగము కథకు అంత్యానుబంధముగా నున్నది. దానికి మారుగా నిందు చిఱుతొండని పూర్వజన్మ కథనము కథకాద్యుపోద్ఘాతముగా నున్నది. కథానాయకుడైన చిఱుతొండనంబి పూర్వజన్మలో తుంబురుడను పేరుగల యొక ప్రమధుడు. అతడొక కారణమున దుర్వాసుని కోపమునకు పాత్రమై మానవజన్మ యెత్తునట్లుగా శపింపబడి ఆఋషి యనుగ్రహము చేతనే పరమమాహేశ్వరుల యింట సిరియాళుడుగా బుట్టెను.

ఈ కథ కాయువు పట్టనదగిన ఘట్టము బాలవధావసరము. అది కరుణమయము. ఆ రసప్లుతి శ్రీనాథుని చేతిలో నప్రయత్నముగా నాలు పద్యములలో వెల్లివిరిసినది. గురుజనము పిల్లవానికి అంత్యోపదేశముచేయు ఈ పద్యమున భక్తివాత్సల్య శమభావములు ముప్పిరిగొని మున్నీరుగా పొంగినవి.

*మ॥ మదిశంకింపకుమన్న మావలని ప్రేమస్నేహవాత్సల్య సం*
*పదవాటింపకుమన్న నాలుకతుదిన్ బంచాక్షరీమంత్ర ముం*
*బదిలంబొప్పఁ బఠింపుమన్న పరమబ్రహ్మోర్థ సంసిద్ధి యి*
*య్యది సుమ్మన్న! యనుంగునందన! సిరాలా! వీరశైవవ్రతా!*

బసవపురాణములో ఆ ఘట్టము వీరశైవతనే దాల్చినది. అనగా సోమనాధుడు దీక్షాపరుడైన వీరశైవునివలెనే పిల్లవానిని వధింపించెను గాని మానవ సహజమైన హృదయద్రవీకరణము కల్గింపలేదు. ఆతడా పట్టున వీరశైవుడే కాని కవికాడు. అనతి విస్తృతమైన ఆ చిన్నఘట్టముననే శ్రీనాధుడు మాతృభావ, పితృభావ, బాలభావములకును నిశ్చలభక్తికిని వైరుధ్యములేని సామరస్యమును వ్యక్తము చేసెను.

కాని, మాయాశివుడు పిల్లవాడున్న గురుకులమున కేగి వానికి రానున్న యాపద నెరింగించి మనసు విఱచుటకు ప్రయత్నించినపుడు ఆ పసివాడు ప్రత్యుత్తరముగా పలికిన వేదాంత వాక్యములును ఐతిహ్యములును అతని వయసునకు మించిన పెద్ద మాటలుగా గోచరించును. అది సందర్భశుద్ధిలేని అతి ప్రసంగమనక తప్పదు. ఆ వాక్యములు శ్రీనాధునివి గాని సిరియాళునివి కావు. "పాత్ర నోట కవిపలుకులు" అనెడి అసంగత సందర్భము లిట్టివే. సిరియాళునకును పుట్టుకతోనే అట్టి జ్ఞానము, ఆ జ్ఞానమున కనుగుణమైన ఉపన్యాస ధోరణియు నలవడి యుండవచ్చునని సమర్థించవచ్చునుగాని, అట్టి సమర్థనలు మానవ సంసారిక కథలుగల కావ్యముల విషయమున రాణింపవని నా యూహ. హాలాహలభక్షణకథను పార్వతితో చెప్ప నుపక్రమించినవాడు శివుడు. అందుచే వక్తృవాచకము ఉత్తమపురుషలో ప్రారంభింపబడినది. కాని కథ కొంత నడచునప్పటికి కథకుడు శివుడన్నమాట మరచిపోయి ఆ వక్తృవాచకమును శ్రీనాధుడు ప్రథమ పురుషలోనికి మార్చెను.

"వెలివోనిచ్చునె బుధు డూహించి చేయు సుకవిత్వంబుల్" అని పింగళి సూరన ప్రతిజ్ఞాపూర్వకముగా నిర్దేశించిన కావ్యబంధ శిల్ప మర్యాదకు మన వాఙ్మయములోనే పెక్కు గ్రంథములలో భంగము గల్గుట పొడగట్టును.

గ్రంథాదిని సిరియాళుని కథనే యెత్తుటకు హేతువు – ఈ కథా పురుషుడు అవచి తిప్పయ వంశమునకు మూలపురుషుడుగా సంబంధము కల్పుటకు అవతారికకును, కథారంభమునకు నిట్టి పొత్తుకలిపిన గ్రంథములు మన భాషలో చాల తక్కువ.

గౌరీకల్యాణము కాళిదాస కుమారసంభవము ననుసరించి వ్రాసినది. ఈ అనుసరణము కథానుసరణమే కాదు! నాలుగింట మూడుపాళ్ళ శ్లోకముల తెనిగింపే. ఈ తెనుగుసేత నైషధాంధ్రీకరణ పద్ధతిని స్వతంత్రా స్వతంత్రముగా నడిచినది. నైషధమును శ్రీనాధుడే తెనిగింపవలెనను ప్రశస్తి ఎట్లు గాంచెనో యట్లే యితడు తక్క వేరొకడు కాళిదాసును తెనిగింపలే డనునట్లు తెనిగించెను. కొన్నిచోట్ల మూలమందలి సొగసులు పోయినను నొకటి రెండుచోట్ల మూలమునలేని సొగసుల దెచ్చెను. రతీవిలాప ఘట్టమును రతి వసంతునితో మొరపెట్టి యేడ్చుట మూలాపేక్షలేక పద్యములు సుబోధక మగునట్లు రచించెను.

దారుకావన విహార మనునది గౌరీకల్యాణమునకు పరిశిష్ట భాగము. శివుడు ఋషిపత్నుల స్వేచ్ఛగా వెంబడించిన ఘట్టము నందు చాల పద్యము లెత్తివేయబడినవి.

ఇందలి కిరాతార్జునీయ కథ, భారతములోని పాశుపతాస్త్ర ప్రదానము ననుసరించి వ్రాసినది. భారవికిని దీనికిని ఏ సంబంధమును లేదు. పాశుపత లాభానంతరము అర్జునుడు స్వర్గమున కేగుటయు, ఊర్వశిచే శప్తుడగుటయు, నివాతకవచ కాలకేయా దులను జయించుటయు, దేవేంద్రుడు రోమహర్షునిచే పాండవులకు నర్జున కుశలవార్త

పంపుటయు ననెడి కథాభాగము "పాశుపతాస్త్ర ప్రదానము" అనెడి శివవిలాసగాథకు అనావశ్యకము. ఆ భాగము భాగవతమున కలదు గదాయని పౌరాణిక పద్ధతిని శ్రీనాథుడిందు చేర్చెను. హాలాహల భక్షణము అన్ని శివపురాణములందును కలదు.

మొత్తముమీద, శ్రీనాథుని ప్రౌఢకావ్యములలో హరవిలాస మొక్కటే స్వతంత్ర రచనయని చెప్పదగినది.

**శ్రీనాథుని ప్రథమ దేశాటనము:** కొండవీటి పతనముతో నిరాశ్రయుడైన శ్రీనాథుడు కొలదికాలము దేశసంచారము చేయుచుకాంచీపురికేగి హరవిలాసము వ్రాసెననుకొనుట సంభావ్యమని పైని చెప్పితిని. కాని ఆ సంచారమువల్ల ఉదరపోషణ జరిగినను స్థిరమైన ఆశ్రయము దొరకదు. అట్టి ఆశగల కవి యేదైన నొక రాజాస్థానమున చేరవలయును. ఆ కాలమున అతడు చేరదగిన రాజ్యములు మూడే ఉన్నవి. రాజమహేంద్రవరము, రాచకొండ, విజయనగరము. ఈ మూడు రాజ్యములును కొండవీటికి ప్రబల శత్రుస్థానములు. స్వాభిమానమును చంపుకొని శ్రీనాథుడు వానిని చేరబోయినను ప్రవేశము లభించుట దుర్ఘటము. ఆ మూడు రాజ్యములలో రాజమహేంద్రవరము తక్కిన రెండింటివలె కాక, కొండవీటితో బాంధవము కలది కనుక 'మరణాంతాని వైరాణి' అనే ధర్మ వాక్యమును పాటించి వీర భద్రారెడ్డి కొండవీటి విద్యాధికారిని ఆదరింపవచ్చును గాని అట్టి సమాధానమునకు కొంతకాలము వేచియుండుట మంచిదని శ్రీనాథుడు తలపోసి యుండును. అతడు సంచారమును తలపెట్టుటకిదే కారణము. రాజమహేంద్రవరమున తనకు బంధువైన బెండపూడి అన్నయామాత్యుడు మంత్రిత్వము నెఱపుచుండుట శ్రీనాథుని హృదయములో నొక ఆశాకిరణమును పుట్టించి యుండును. ఆ కిరణము జూపిన దారి వెలుగున మంత్రికి బంధువుగా సంచారానంతరము రాజమహేంద్రవరము చేరియుండును. అప్పటికే శృంగార నైషధ కర్తగా శ్రీనాథుడు పేరుమోసియుండెను. కనుక అతని దర్శనము కాగానే రాజమహేంద్రవర పండితులు ఆ గ్రంథ రచనను గురించి పెక్కురీతుల యధిక్షేపించి యుందురు. ఆ అధిక్షేపణలు నాడేకాదు. నేటికిని అక్కడక్కడ వినవచ్చుచున్నవి. శృంగారనైషధము డు, ము, వు, లు చేర్చిన హర్షనైషధమని కొందరు, మూలము నందలి కొన్ని శ్లోకములు వదలిపెట్టెనని కొందరు, లేని అర్థములు కొన్ని కలిపెనని కొందరు, గాఢపాకమని కొందరు, తేలిక తెలుగని కొందరు నానావిధముల విమర్శించుట అతని చెవినిబడి ఆ పండితుల అధిక్షేపణలు సరకు గొనక వారిని వైతండికులని, కూపమండూకములని తృణీకరించి మంత్రి ప్రాపున నిరాఘాటముగా నా రాజధానిలో తలయెత్తుకొని సంచరించి యుండును. భీమేశ్వర పురాణము నందలి కుకవి నిందానామకములైన ఈ క్రింది పద్యములు ఆనాటి యాతని జీవిత చరిత్రకు ప్రతీకలు.

తే॥ బోధమల్పంబు గర్వ మభ్యున్నతంబు
శాంతి నిష్ప్రచురంబు మచ్చరము ఘనము
కూప మండూకములుఁబోలెఁ గొంచె మెఱిఁగి
పండితంమన్యులైన వైతండికులకు.

తే॥ నికటమున నుండి శ్రుతిపుట నిష్ఠురముగ
నడరి కాకులు బిట్టు పెద్దరచినప్పు
డుడిగి రాయంచ యూరకయుంట లెస్స
సైఁపరాకున్న నెందేని జనుట యొప్పు.

తే॥ ప్రౌఢిఁ బరికింప సంస్కృతభాష యండ్రు
పలుకు నుడికారమున నాంధ్ర భాషయండు
రెవ్వరేమన్నఁనండ్రుగాక నాకేల కొఱఁత
నా కవిత్వంబు నిజము కర్ణాటభాష.

ఈ పద్యములలో చేరని ఇంకొక చాటుపద్యము "విద్వాంసుల్ రాజమహేంద్ర పట్టణమునన్ ధర్మాసనంబుండి, ప్రధ్వంసాభావము ప్రాగభావమనుచున్ దర్కించు రత్నాంతమున్" అనెడి పంక్తులుత్తరార్ధముగా గలది లోక విదితమే కదా! తెలుగు కవిత్వపు పోకడలను, తన ఆంధ్రీకరణ పద్ధతిని, తన ప్రతిభా సముజ్జ్వలతను కొంచెమేని యెరుగని శుద్ధశాస్త్ర పండితులు కాకులవలె బిట్టరచినపుడు ఎందేని చనుటకు దారియు, ఊరకుండుటకు ఉదాసీనతయులేని ఆ మహాకవి పద్యములు వ్రాయుటకంటె వేరు ప్రతీకారమేమి చేయగలడు?

బెండపూడి యన్నయామాత్యుడు–

సీ॥ వినిపించినాఁడవు వేమ భూపాలున
కఖిల పురాణ విద్యాగమములు
కల్పించినాఁడవు గాఢపాకంబైన
హర్షనైషధ కావ్య మాంధ్రభాష
భాషించినాఁడవు బహుదేశబుధులతో
విద్యా పరీక్షణ వేళలందు
వెదచల్లినాఁడవు విశద కీర్తిస్ఫూర్తి
కర్పూరములు దిశాంగణములందుఁ

తే॥ బాకనాటింటి వాఁడవు బాంధవుఁడవు
కమలనాభుని పౌత్రుడ వమలమతివి
నాకుఁ గృప సేయు మొక ప్రబంధంబు నీవు
కలితగుణగణ్య! శ్రీనాథ కవివరేణ్య!

అని సన్మానించుటతో ఆ పురపండితుల కోలాహలము కొంతవరకు చల్లారి యుండును. రాజుల యొక్కయు మంత్రుల యొక్కయు ప్రాపున బ్రతికెడివారు, ఆ రాజుల యొక్కయు మంత్రుల యొక్కయు బంధువులనుకాని, వారిచే పూజితులైన విద్యావంతులకాని ధిక్కరించి గౌరవముతో బ్రతుకలేరు. అన్నయామాత్యుడు భీమేశ్వర పురాణమును తనకు కృతి యిమ్మని శ్రీనాథుని అర్థించుటయేగాక, ప్రసక్తానుప్రసక్తముగా వీరభద్రారెడ్డిని కూడ కొనియాడుమని కవికి సూచన చేసి యుండును. అందుచేతనే ఈ గ్రంథమున కృతిపతి వంశ వర్ణనమునకు ముందు వేమ భూపాలుని వంశము వర్ణింపబడినది. ఆ రాజు సంస్తుతి వలన శ్రీనాథునకు ఆస్థాన ప్రవేశము కల్గునని

మంత్రి ఆశించి యుండును. ఆ ఆశ అవ్యాక్షేపముగా ఫలింపకున్నను, కొలది సంవత్సరములకు ఫలించుటచే శ్రీనాధుడు "వీరభద్రారెడ్డి విద్వాంసుడ"య్యెను. ఆ పదవి యధిష్ఠించుటకు మంత్రి కల్పించిన ప్రధమ సోపానమే భీమేశ్వర పురాణము.

## భీమేశ్వర పురాణము

స్థల పురాణములు పెక్కింటికివలెనే ఈ భీమేశ్వర పురాణమునకును స్కాందపు రాణము మూలము. చారిత్రకపరిశోధకులు ఆ స్కాందపురాణము యొక్క శుద్ధతను కొంత శంకింతురు. ఏమనగా, చారిత్రకముగా ఒక వేయి సంవత్సరములకు ఇటీవల వెలసిన క్షేత్రముల వృత్తాంతములు కూడ ఎన్నడో ద్వాపరయుగమున వ్యాసుడు రచించెనని చెప్పబడు స్కాందపురాణమున వర్ణితములై ఉండుటచే ఆ క్షేత్రములు వెలసిన పిమ్మటనే వాటి మాహాత్మ్య మా పురాణముల కెక్కియుండునని వారి యనుమానము. ఈ భీమేశ్వర పురాణమును గురించి కూడ పరిశోధకుల కట్టి శంకయే కలదు.

శ్రీనాధుడు దీనిని తెలుగున రచించిన పిమ్మట అతడో మరి యింకొకడో దీనిని సంస్కృతీకరించి స్కాందపురాణమున ప్రతిష్ఠించి యుందురని వారి యూహ. మరియు లోకముననున్న స్కాందపురాణ ప్రతులు ఒకదానితో నొకటి సంవదింపవనియు, ఒకదానిలో నున్న కధలు మరియొకదానిలో నుండవనియు చారిత్రకులు వారి వాదములకు బలముగా నింకొక యుక్తి చెప్పుదురు. ఈ క్షేత్రములన్నియు చారిత్రకులు భావించినట్లు కలియుగముననే వెలసినవి కావనియు, దేవతా ప్రతిష్ఠాపితములై యనాదిగా భరత ఖండమునందలి నదీపర్వతములతో పాటు వెలసియే యున్నవనియు, మహాపురాణములను, ఉపపురాణములను భారతముతోపాటు వేదవ్యాసుడే రచించెన నియు, స్కాందపురాణ ప్రతులొండొంటితో విరోధముండుట కాలక్రమమున జరిగిన గ్రంధ శైథిల్యమునుబట్టి యనియు, ప్రాచీనతాభిమానము కలవారు చారిత్రకవాదమును పూర్వపక్షము చేయుదురు. ఇందలి సత్యాసత్యములను వ్యాసుడే తీర్చవలయును.

ఈ భీమ ఖండమునకు స్కాందపురాణమే మూలమనుకొన్నను, శ్రీనాధుడు దానిని యధాతధముగా ననువదింప ప్రయత్నము చేయలేదు. అందులేని వర్ణనలిందు చాల కలవు. ఈ అనువాదము (.....యైనచో) భారతాంధ్రీకరణమువలె నతి స్వేచ్ఛగా నడచినది. ఎచ్చటనేని ఒక శ్లోకమునకు సరియైన తెలుగు పద్యము కాన వచ్చినచో నది యాదృచ్ఛికమేగాని బుద్ధిపూర్వకముగాదు.

ఈ గ్రంధము ద్రాక్షారామ భీమేశ్వరుని ప్రతిష్ఠకు సంబంధించినది గ్రంధాం తమునందు మాత్రము హాలహాల భక్షణము, త్రిపుర సంహార మనెడు రెండు శివలీలలు ఉపాఖ్యానములుగా చెప్పబడినవి. మరి ఈ క్షేత్ర వృత్తాంతమును తన్మహాత్త్వంబును గురించి అగస్త్యుడు కాశిని బాసి వచ్చిన వ్యాసునకు వివరించి చెప్పెను. వారిరువురి సమావేశ సన్నివేశము మిక్కిలి రసవత్తరముగా నుండును. అగస్త్యుడు ఆది యుగముననే వింధ్యపర్వత విజృంభణము నరికట్టుట కొరకు దేవతల ప్రార్థనపై లోకానుగ్రహార్థము, కాశిని వీడలేక దక్షిణాపధమునకు లోపాముద్రాసహితుడై వెడలివచ్చి దాక్షిణాత్యుడయ్యెను. మరికొంత కాలమునకు ద్వాపరాంతమున కాటోలు,

వ్యాసుడు శివునిచే శపింపబడి కాశిని వీడి రావలసి వచ్చును ఆ క్షేత్రవియోగమును సహింపలేక దుర్భరదుఃఖితుడైయున్న ఆ సంయమిని అన్నపూర్ణాదేవి ఓదార్చి దక్షిణ కాశి యనెడి పర్యాయనామముగల దక్షవాటిక, అతని కాశీవియోగబాధ నపనయించును కావున నచటికి బొమ్మని ఉపదేశించును ఆ ఋషి యామె యాదేశానుసారము దక్షిణాపథమున ప్రవేశించి ద్రాక్షారామము దెసకు వెడలుచుండగా, మధ్యేమార్గమున దక్షవాటిక నుండి పిఠాపురమునకు పోవు అగస్త్యుడు సాత్యవతేయుని కలిసికొనును. ఆ ఋషు లిరువురు పరస్పర కుశలప్రశ్నానంతరమున ఒండొరులు తమతమ వృత్తాంతములు చెప్పకొను సందర్భ మీ గ్రంథమందు మిక్కిలి రసవంతమైన ఘట్టము అదియే కథా ప్రారంభము కూడ. అగస్త్యుడు కాశినిబాయుట కాశీఖండమున కథాప్రారంభముననను, వ్యాసుడు కాశినిబాయుట ఆ గ్రంథమున కథాంతముననను కలదు. అచ్చట దక్షిణ కాశికి బొమ్మని యన్నపూర్ణ అతని నాదేశించినట్లు లేదు ఈ ఉపదేశము భీమఖండమున కల్పింపబడినది. ఇట్టి పరస్పర విరోధవాక్యములు పురాణములకు సహజమే. దానికేమి; ఆ దేవి ఉపదేశానుసారము కాశిని బాసిన వ్యాసుడు దక్షవాటికకు చేరవచ్చుట శాపానంతర కార్యమే గనుక భీమఖండము కాశీఖండమునకు ఉత్తరకథగా గైకొనదగినది.

అగస్త్యుడు పూర్వపు తన కాశీ నివాసానందమును స్మృతిపథమునకు తెచ్చుకొని, వ్యాసునితో మధురస్మృతి సంజనిత బాధాగర్భితములుగా ఆడిన వాక్యములు గల ఈ క్రింది పద్యములు ఈ గ్రంథమునకు తిలకాయమానములు

సీ॥ లోలార్కునకు నీకు లోలోన నేమేని
పోటిపుట్టదుగదా? మాట మాట
వెనకయ్య శ్రీడుంఠి విఘ్నేశ్వరస్వామి
ధిక్కరింపఁడు గదా? తెగువ నిన్ను
నాఁ కొన్న నిన్ను మధ్యాహ్న కాలంబున
నరయకుండదు గదా? యన్నపూర్ణ
నెపమేమియును లేక నీయెడాటమ్మునఁ
బాటి దప్పఁడుగదా? భైరవుండు

తే॥ ఎట్టుపాసితి మిన్నేటి యిసుక తిప్ప?
లెట్టుపాసితి వాస్తలం బేనుగ్రోసు?
లెట్టు పాసితి వవిముక్త పాట్టభూమి?
యెట్టు పాసితి విశ్వేశు నిందుధరుని?

కం॥ కాళీనందన కంఠే
కాలుర శిరములకు విరులు గల్పించునొకో?
లీలా వనాంతరముననను
మా లోపాముద్ర యిడిన మల్లీవల్లుల్.

శా॥ ఆనందంబున నర్ధరాత్రములఁ జంద్రాలోకముల్కాయఁగా
నానా సైకత వేదికాస్థలములన్ నల్దిక్కుల న్నంభుఁగా

శ్రీనాథున్ దరుణేందుశేఖరు శివున్ శ్రీకంఠునిన్ బాడుదు
న్నే నెల్లన్ బులకాంకుర ప్రకరముల్ నిండార మిన్నేటిలోన్.

వీటిలో రెండవది శ్రీనాథునకు స్వానుభవమని నాయూహ. అతడు కొండవీటిలో నుండగా పెద కోమటివేమునితో గలసి కాశీయాత్ర జేసెనని యొక ప్రతీతి కలదు. అది నిజమైనచో వెన్నెలరేల గంగాసైకతముల విహరించుచు విశ్వనాథునిపై వ్రాసిన పద్యములు పఠింపుచు, వానందము ననుభవించియుండును, లేదా రాజమహేంద్రవరము జేరినపిమ్మట గోదావరీ సైకతస్థలములలో వెన్నెల రేల స్వకీయ కవితాగానానందమును అనుభవించి యుండును. ఇది కావ్యములలో కవులు అచ్చటచ్చట ముద్రించెడి స్వానుభవరేఖల కొక ఉదాహరణము. దీనిని బట్టి శ్రీనాథుడు ప్రకృతి సౌందర్య దర్శనానందమున తన్మయత్వము నొందెడు కవియనియు, కేవల గ్రంథపరనమున నిమగ్నుడైన పండితుడు మాత్రమే కాడనియు సులువుగా చెప్పవచ్చును ఈ సౌందర్య దర్శన సుఖానుభూతియే అతడు చేసిన ద్రాక్షారామగంధర్వాప్సరల వర్ణించుటకు ప్రేరకము, వారి వరకేల, ఆకొన్నవానికి అన్నము పెట్టి పిలిచిన అన్నపూర్ణనైనను "నఖశిఖ పర్యంతము అన్నార్థి" వర్ణింపకమానడు

శ్రీనాథుడు కథామాత్ర ప్రధానములైన పురాణములను వ్రాయదగిన కవికాదు. ప్రబంధోచితమైన వర్ణనలతో కథను అలంకరించి గ్రంథమును విస్తరింపజేసినగాని ఆతనికి తృప్తి గొలుపదు. అతడు నిక్కపు కవి. కవియను శబ్దమునకే వర్ణించువాడని అర్థము. ఆ వర్ణనలు నానావిధములుగ నుండును వర్ణనీయమైన వస్తువు ఎట్టిదైనను దానిని తనివితీర వర్ణించుట ఈ కవికి పరిపాటి. అందుచేతనే కాబోలు ఈ గ్రంథమున ఒక ద్రాక్షారామమునేగాక గోదావరీమండలమందలి నదులు, కొండలు, గుడులు—గోపురములు, క్షేత్రములు, ఆరామములు, తీర్థములు సర్వము నతని రమణీయవర్ణనలకు పాత్రములైనవి ప్రబంధమున నుండదగిన అష్టాదశవర్ణనలలో కొన్నింటిని ఇందు అవకాశము కల్పించి ఈ ఉపపురాణమును ప్రబంధప్రాయముగా శ్రీనాథుడు సంతరించెనని తోచును.

ప్రబంధకవులు గ్రంథాదిని పురవర్ణన చేసినట్లుగనే ఈతడును గ్రంథారంభమున ద్రాక్షారామము నతి దీర్ఘముగ వర్ణించుటేకాక, ఆ పురమునకు భీమేశ్వరుడే నాయకుడని కావ్యనాయక నిరూపణము కూడ చేసెను. మరి ఆ దేవుని వలన ఆ పురమునకు మహత్త్వము. ఆ దేవుని సేవించెడి వేశ్యాగణము వలన శోభయు కల్గుటవల్ల కాబోలు ఆ గంధర్వాప్సరోభామినులను దేవునితో సమప్రాధాన్యము కలుగునట్లుగా వర్ణించెను. శ్రీనాథునకు ద్రాక్షారామభీమేశ్వరునిపై నెంత భక్తికలదో ద్రాక్షారామ గంధర్వాంగనలపై నంత ప్రీతి కలదు. కావుననే పురవర్ణనలో ఇతర పౌరజననమును సంస్మరింపక పోయినను వేశ్యాంగనలనే అతిమాత్రముగా కొనియాడెను.

మరి, ఆ దేవుడు ద్రాక్షారామమున ప్రతిష్ఠింపబడుట, ఉత్సవములు చేయించుకొనుట మొదలగు శుభకార్యములన్నియు ఒక సార్వభౌముడు నూత్న ప్రాసాదప్రవేశము చేయుట, వసంతోత్సవాదులగు వేడుకలను జరుపుట మొదలైన వైభవోపేతమైన రాజభోగములుగా చిత్రింపబడినవి ఆ సందర్భముల చదువునపుడు పాఠకుల భావనలో భీమేశ్వరుడు దేవతాసార్వభౌముడుగా కాక మానవసార్వభౌముడుగానే భాసించును.

దేవుని మానవునిగా మలచిన శ్రీనాథుని చాతురి యీ గ్రంథమున గమనింపదగిన ప్రధాన శిల్పవిశేషము.

ఈ గ్రంథము గోదావరీ మండల స్తోత్రమేగాని నిజమునకు పురాణము కానే కాదు. తెలుగుకవులలో స్వదేశమును ఇంత మక్కువతో తనివితీర వర్ణించిన కవి యింకొకడు లేడు. ఈ గ్రంథము అతని "ప్రౌఢనిర్భర వయఃపరిపాకమున" రచించిన దగుటచే తద్వయోనుగుణమైన భావరక్తిమయు, భావనాదోహలతయు ఈ కావ్యమునకు ఆత్మయు ప్రాణములుగా నున్నవి. మరి దక్షవాటిని, ఆ దేవుని ఉత్సవములను ఎన్ని మారులు వర్ణించినను పునరుక్తి పొంతపోక విసుగుదల పుట్టింపక రమణీయముగా క్రొంగ్రొత్త రూపములతో ప్రదర్శించుటలో కవి చూపిన చమత్కారము ప్రశంసార్హముగా నున్నది. మొత్తము మీద ఈ భీమ ఖండము ఆంధ్రభూస్తోత్రమనిన అతిశయోక్తికానేరదు.

## రెండవ దేశాటనము

పదునైదవ శతాబ్దిలో ఆంధ్రవాఙ్మయ ప్రపంచంబున శ్రీనాథుడే అనన్య విషయమైన కవిసార్వభౌమ బిరుదమును సార్థకముగా తాల్చినవాడు. అతనికి ఆ బిరుదు భీమఖండము నాటికి లేదు. కాశీఖండ రచనమునకు పూర్వమెప్పుడో ఎచ్చటనో లభించియుండును. ఆ లబ్ధి యే మహారాజు యొక్క ఆస్థానముననో పండిత ప్రకాండుల సమక్షంబుననో కలిగియుండుటను బట్టియే ఆతడు దానిని విజయ దుందుభి మ్రోగించినట్లుగా సగర్వముగా కాశీఖండమున ఈ క్రింది పద్యమున ప్రయోగించుకొనెను:

*శా॥ ఈ క్షోణిన్నినుఁ బోలు సత్కవులులేరీ నేఁటి కాలంబునన్*
*ద్రాక్షారామ చళుక్య భీమవరగంధర్వాప్సరోభామినీ*
*వక్షోజద్వయ గంధసార ఘుసృణద్వైరాజ్య భారంబు న*
*ధ్యక్షించున్ గవిసార్వభౌమ! భవదీయ ప్రౌఢసాహిత్యముల్.*

గౌడడిండిమభట్టు కంచుఢక్కను పగులగొట్టి దీనారటంకాల తీర్థమాడిన ప్రౌఢ రాయల (రెండవ దేవరాయలు 1423–46) ముత్యాలశాలలో కవితా పట్టాభిషిక్తుడైన ముహూర్తముననే ఈ కవిసార్వభౌమ బిరుదు ప్రదానము జరిగియుండును. కర్ణాటదేశ కటకమైన విజయనగరమునగల కవులును, పండితులును కవిసార్వభౌముని ప్రశంసాపూర్వకముగా సన్మానించి యుందురు. ఆ పండితులందరు విద్వత్సభలలో ఆయన దర్శనమైనపుడు సూర్యోదయవేళ తామరకొలను వలె పరమాహ్లాదముతో ఉప్పొంగియుందురు ఆ వైభవమునుకూడ ఆయన కాశీ ఖండముననే సూచించెను

*తే॥ ప్రాయమెంతయు మిగులఁ గైవ్రాలకుండఁ*
*గాశికా ఖండమను మహాగ్రంథమేను*
*దెనుఁగుజేసెదఁ గర్ణాటదేశకటక*
*పద్మవనహేళి శ్రీనాథభట్టసుకవి.*

భీమఖండ రచనముతో అన్నయామాత్యుని ఆదరము లభించినను వీరభద్రారెడ్డి ప్రాపుమాత్రము లభింపలేదు. దానికి కారణ మూహింపలేము. అది లభింపనినాడు ఆ పట్టణమున కాలయాపన చేయుట తగదని అతడు క్రొత్త భూములు వెదకికొనుచు పోయి ఉండును. ఆ సంచారములో మొదట అతనికి ఆశ్రయమిచ్చినవాడు వల్లభామాత్యుడు. ఈ అమాత్యుడు కడపజిల్లాలో మోపూరు పట్టణమున విజయనగరమువారి పాలనలో ఉన్నత పదవి యందుండెను. శ్రీనాధ వల్లభామాత్యుల కలయిక యాదృచ్ఛికమో లేక విజయనగరమునకు దారి చూపగలడని యాశతో శ్రీనాధుడే యాతనిని సమీపించెనేమో చెప్పలేము. ఏమైననేమి? వల్లభామాత్యునకు "క్రీడాభిరామము" వ్రాసిపెట్టి అతనిచే సత్కృతుడై ఆ దారిబత్తెముతో శ్రీనాధుడు విజయనగరమునకేగి దిగ్విజయము చేసి, ఆ విజయ ధ్వజముతో మరల రాజమహేంద్రవరము వచ్చియుండును. అంతతో "ఈ క్షోణిన్నినుబోలు సత్కవులు లేరీ నేటికాలంబునన్" అని వీరభద్రారెడ్డి హృదయ పూర్వకముగానే ప్రశంసించి ఆస్థానమున జేర్చుకొని కాశీఖండ కృతి పతిత్వ భాగ్యమున కర్హుడయ్యెను శ్రీనాధుడును "వీరభద్రారెడ్డి విద్వాంసుడ" నని సగర్వముగ చెప్పుకొన దొడగెను కావున నీ రెండవ దేశసంచారములో శ్రీనాధుడు రచించిన మేటి కావ్యము క్రీడాభిరామము సంపాదించిన మేటియశము దేవరాయల కొలువున కనకాభిషేకము.

## క్రీడాభిరామము

ఈ శతాబ్ది ఆరంభములో శ్రీనాధుని వీధినాటకమను పేర ఒక పద్యసంపుటి యెవరిచేతనో ప్రచురించబడినది అందులో శ్రీనాధుడు చెప్పిన నానా చాటు పద్యములు కలవు. అవేకాక లక్షణ గ్రంధములలో శ్రీనాధుని వీధి నాటకము నుండియని ఉదాహరింపబడిన పద్యములు మరికొన్ని కలవు. ఆ లక్షణ గ్రంధ పద్యములను బట్టి శ్రీనాధుని పేర నెగడుచున్న వీధి నాటకమునునది పైని పేర్కొనబడిన పద్యసంపుటియే కాబోలునని లోకము సమాధానపడినది. కొంత కాలమునకు ఆ భ్రమ తీరినది. ఎట్లనగా, శ్రీమానవల్లి రామకృష్ణ కవిగారు తంజావూరు సరస్వతీమహాల్ గ్రంధాలయమునుండి "క్రీడాభిరామమును" సంపాదించి ప్రకటించిరి దానిలో "వీధినాటక పద్యసంపుటి"లో గల పద్యములు కొన్ని కానవచ్చుటచే యధార్థమైన "వీధి" నాటకము రామకృష్ణకవిగారు ప్రకటించిన క్రీడాభిరామమే యనియు, తత్పూర్వము ఆ పేరుతో ప్రచారముననున్న చాటు పద్యసంపుటికి "వీధి" నాటకమను పేరు కల్పితమనియు తెల్లమయ్యెను తదాది శ్రీనాధుని వీధినాటకమనగా క్రీడాభిరామమేయని నిరూఢమయ్యెను "వీధి" యనగా దశవిధరూపకములలో ఒకటికదా! రూపలక్షణ మేదియులేని ఆ పద్య సంపుటి వీధినాటక మెట్లగునని పండితులకైనను సందేహము కలుగలేదు. ఈ గ్రంధము లభించిన పిమ్మట శ్రీనాధుని పేర లక్షణగ్రంధములలో ఉదాహరింపబడిన వీధినాటకమనెడి గ్రంధము ఈ క్రీడాభిరామమేయని లోకము సంతసించినది కావున లక్షణ గ్రంధకర్తలు పేర్కొన్న శ్రీనాధుని వీధినాటకము ఈ క్రీడాభిరామమే

రావిపాటి త్రిపురాంతకుని ప్రేమాభిరామమునకు ఈ క్రీడాభిరామము స్వేచ్ఛాను వాదము కానోపునని. పూర్వప్రకరణమున జెప్పితిని శ్రీనాధుని ఇతర గ్రంధములలో

కొన్ని పద్యములు, పద్యభాగము లిందు కానవచ్చుటే ఇది మూలవిధేయము కాదనుటకు ప్రబలదృష్టాంతము అనువాదములోనే కాదు, గ్రంథ నామకరణములోగూడ శ్రీనాథుడు స్వతంత్రత చూపెను. నైషధీయచరితమును శృంగారనైషధమని పేర్కొనిన ఈ నిరంకుశుడు క్రీడాభిరామమనుటలో నేమి వింత? అయితే నామకరణములో అతడు చూపిన స్వేచ్ఛ అన్వర్థమేకాని నిష్ప్రయోజనము కాదు. ఎట్లన, క్రీడాభిరామమున గల విటవిటీధూర్త శృంగార చేష్టలు త్రిపురాంతకుని దృష్టిలో ప్రేమమూలకములు. ప్రేమ శబ్దమునకు ఆ చేష్టలు అర్థములు కావనియు అవి ఒక విధమైన విలాసక్రీడలనియు శ్రీనాథుడు భావించి నామము మార్చెను పాపపుణ్యములు ధర్మాధర్మములు మనస్సునకు తట్టని యువజనము స్వేచ్ఛగా వయోనురూపముగా ననుభవించు సుఖముల అనుభూతియే క్రీడ. పవిత్రమును ధర్మబద్ధమునైనది ప్రేమ సామాన్య లౌకిక దృష్టితో చూచినపుడా క్రీడ పరిహసింపదగిన ఉద్వృత్తియేగాని శిక్షింపదగిన మహాపాపము కాదు. గ్రంథకర్త అట్టి ఇతివృత్తమును లోకసంస్కారాపేక్షచే గైకొని హాస్యరసప్రధానమైన గ్రంథము రచించెనేని అది హేళన కావ్యమగును; హేళన కావ్యమునకు మొదటి లక్షణము హాస్య ప్రధాన మగుటయేగాక, ఆ హేళనకు గురియగు వ్యక్తులు సైతము తమ్ము గురించి తామే నవ్వుకొనునట్లు చేయుట రెండవది ఆ హేళన కటువును దయారహితమునుగాక మృదువును సరసమునయి ఉండుట ఈ లక్షణము క్రీడాభిరామము పట్ల సమగ్రముగా నన్వయించును కావున ఇది తెలుగున వెలసిన మొదటి హేళన కావ్యము. దీని తరువాత తంజావూరి యక్షగానములలోను, మరికొంత కాలమునకు ఈ శతాబ్దిలో వెలసిన కొన్ని ప్రహసనములలోను, హేళన కావ్యములనిపించుకొన్న కొన్ని రచనలు కలవుగాని వాటిలో క్రీడాభిరామమునందువలె కావ్యాతిశోభ తెచ్చిన శైలీసంపన్నత లేదు. అదీగాక వీటికి క్రీడాభిరామమువలె చిరస్థాయిత్వము లేదు. అట్టి కావ్యములకు శాశ్వతత్త్వమిచ్చునది సౌందర్యారాధనము అనగా తేలిక రచనయైన ఆ హేళన కావ్యమును సయితము కావ్య గుణోపేతమైన సుందర వస్తువుగా తీర్చినచే తప్ప ఇది నిలువదు. ఈ వీధి శ్రీనాథుని ప్రజ్ఞ వలన నైషధాదులతో పాటు అనశ్వరమై యున్నది అందుచే క్రీడాభిరామము హేళన కావ్యములలో మొదటిదేగాక ఉత్తమోత్తమమును నైనది. మఱియు తెనుగున లక్షణయుక్తమైన మొదటి రూపకమును ఇదియే

క్రీడాభిరామమున సమూహాముమీద సంఘమునందలి లోపములను సహజ మనో దౌర్బల్యము గల వ్యక్తుల ధర్మవ్యతిక్రమమును ఎత్తిచూపి యెగతాళి చేయుచు కవి నోరార నవ్వి మనచే నవ్వించును. ప్రకృతివశ్యులైన ఆ దుర్బల హృదయుల చేష్టలకు వారిని వెన్నుచఱచి మందలించినట్లుండునే గాని ఆగ్రహముతో శపించినట్లుండదు.

నేటి సారస్వతాభిరుచులను బట్టి అపథ్యము లనదగిన పద్యములు దీని యందు గొన్నికలవు. అకాలమువారి కవి మోటుగా నుండకపోవచ్చును. ఇతర హేళన రచనకు లేని ప్రత్యగ్రత క్రీడాభిరామమునకు కలదు అందు పరిహసింపబడిన సాంఘిక లోపములు (పేర్లు మారినను) నాడేకాదు నేడును లోకమున ఉన్నవే. నేడేకాదు, ఎన్నటికిని ఉండునవే ఎంత నాగరికత పెరిగినను సంఘము ఆ వినోదములను జూదములను కొలువులను జాతరలను త్రోసి పుచ్చజాలదు అవి పల్లెలలోనేగాక

పట్టణములలోను ఏ మూలనో జరుగుచునే యుండును. కావున ఈ కథావస్తువు ఉదాత్తము కాకపోయినను రావిపాటి తిప్పన్నకువలె శ్రీనాధునకును, శ్రీనాధునకువలె మనకును సమకాలికముగానే భాసిల్లుచుండును.

ఇంకొక విశేషము. మూలకారుడైన రావిపాటి తిప్పన ప్రతాపరుద్రుని కాలమునాటి వాడు. కావున అప్పటికి మహావైభవోపేతముగా నున్న ఓరుగల్లు పట్టణమును ప్రత్యేకముగా దర్శించియుండు ననుటకు సందేహము లేదు. లేకున్న ఆ వీధులు, విపణులు, జాతులు, నాతులు, దేవరలు, దేవుళ్ళు, వంటపూటి ఇండ్లు, వేశ్యవాటములు సాక్షాత్కరింపజేయుట పొసగదు.

ఈ గ్రంధమే లేనిచో మనకు కాకతీయ సామ్రాజ్య రాజధాని నాగరికతను చదువుకొనియైనను కన్నీరునించుచు ఆనందించెడి భాగ్యముండెడిది కాదు.

అయితే ఈ గ్రంథము చిత్రించిన నాగరికత, ఆ రాజధానీ నగరమందలి సర్వమానవ సంఘమునకు సంబంధించినదికాదు. అందులో ఏకదేశము మాత్రమే, ప్రతాపరుద్రుని పరిపాలనకాలమునాటి ఆస్థాన వైభవముగాని, విద్వత్సభలుగాని, వీరభటుల విక్రమములుగాని, గృహస్థుల సుఖజీవనముగాని, నాటక శాలలు గాని దేవతా పూజలుగాని ఇందు స్మరింపబడలేదు.

ఈ కథకు నాయకుడు కాముకుడైన గోవింద మంచనశర్మ యనెడి ఒక బ్రాహ్మణ యువకుడు. నాయిక కామమంజరి యనెడి వితంతు యువతి. వారిరువురు అన్యోన్యానురక్తులు. మంచనశర్మ ఆంధ్రవిష్ణు నగరమైన శ్రీకాకుళమున కాకుళేశ్వరుని తిరునాళ్ళు చూచుటకేగి, కార్యాంతరవ్యాసంగుడై పురమునకు తిరిగి రాక కొంతకాలము కామమంజరికి విరహవ్యధ గొల్పెను. అతనికి ఆ సంచారములో టిట్టిభ సెట్టియను వొక వైశ్యయువకుడు స్నేహితుడయ్యెను అతనిని తన వెంట ఏకశిలానగరమునకు దోడ్కొనివచ్చి ఆ పుర విశేషములు అతనికి చూపుచు, దినమంతయు గడపెను. మధ్యాహ్నవేళ వారిరువురు పూటకూటింట భుజించిరి. పూటకూటి ఇండ్లు ప్రత్యేకముగ నొకవాడలో నుండెడివి ఆ వీధికి అక్కలవాడ యని పేరు. అందులో ఒక రూకకే షడ్రసోపేతమైన మృష్టాన్నము లభించెడిది

ఉ॥ కప్పురభోగివంటకము కమ్మని గోదుమపిండి వంటయున్
గుప్పెడు పంచదారయును క్రొత్తగఁ గాచిన యాలనే పెసర్
పప్పును క్రొమ్మునల్లనఁటి పండ్లును నాలుగునైదునంజులున్
లప్పలతోడ గ్రొంబెరుగు లక్ష్మణవజ్జల ఇంట రూకకున్.

భోజనానంతరము మరల పుర దర్శనమునకు బయల్దేరిరి. రాత్రి పడునప్పటికి మంచనశర్మ ఒక సంకేత స్థలమున కామ మంజరిని కౌగిటలో జేర్చుకొనెను. టిట్టిభ సెట్టికి గూడ నింకొక యువతి పొందు ఏర్పాటుచేసి తన మైత్రిని సార్థకము చేసికొనెను. ఆనాడు ఆ మిత్రులిద్దరు వేకువవేళ మొదలు రాత్రివరకు చూచిన వింతల యొక్కయు వినోదముల యొక్కయు వర్ణనయే ఈ నాటకమున గల ప్రధానాంశము

ఇందు చిత్రింపబడిన సంఘజీవితము ఎక్కువపాలు అనుదాత్తమును, పామరమును అనిపించుకొనదగినది ఆ జీవితమును గడపెడి వ్యక్తులు లఘువర్తనులు; రాజాస్థానమునకును, విద్వత్సభలకు దూరముగా నివసించెడి అవరవర్గీయులు.

వారు ఆ మహానగరమున రాజ వీధులలోగాక సందుగొందువాడలలో జీవితమును గడుపుకొనువారు. కానీ, "ప్రతాపరుద్ర ధరణీశోపాత్తగోష్ఠీ ప్రతిష్ఠా పారీణ" యైన మాచల్దేవి వారాంగన చిత్రశాలా ప్రవేశము చేయుట ఇందు వర్ణింపబడినది. ఆవేశ్యారత్నము సందుగొందులలో నివసించినదని చెప్పలేము. కాబట్టి పామరజనుల వాడలతోబాటు, వేశ్యావాటములు కూడ ఇందలి కథా కార్యమునకు రంగస్థలముగా గైకొనబడినవి.

వీధి యనెడి రూపకము ఉదాత్త వస్తువు నంగీకరింపదు కనుక గ్రంధకర్త లఘువర్తనుల జీవితమునే వర్ణ్యవస్తువుగా స్వీకరించెను. ప్రహసన జాతి రూపకములలో వీధి ఒకటి. హాస్యము దాని ప్రధానరసము. రాజులు, మంత్రులు మొదలైన ఉన్నత పురుషులు హాస్యరసమునకు ఆలంబన విభావము కాజాలరు. కావుననే అట్టి ఆలంబన కోసము ఈ నాటక రచయిత వెలివాడలోను, మైలసంతలోను, సందుగొందులలోను ప్రవేశించెను.

మరి దశవిధరూపకములలో భాణము, ప్రహసనము, వ్యాయోగము, అంకము, వీధి అనునవి అయిదును ఏకాంకికలు. వీటి యందలి ఇతివృత్తము ఒకనాటి కథయై యుండవలెను. వీటిలో వ్యాయోగము మాత్రము కొంచెము ఉదాత్తపాత్ర చరితము కలది. తక్కిన నాల్గింటిలో వచ్చెడి పాత్రలు ధూర్తులు, పామరులు, విటీవిటులునై ఉందురనియు, సూచ్యముగానో, ప్రత్యక్షముగానో కాముక వ్యవహారము నడచుననియు శాస్త్ర నిర్దేశము కలదు ఆకాముక క్రీడ శృంగార రసముగా భాసించినను, అది తదాభాసము మాత్రమే కాని రసము కాదు. దాని పరిపోషణము జరుగదు క్రీడాభిరామముపట్ల ఈ లక్షణము సమగ్రముగా నన్వయించును.

## కర్తృత్వము

ఈ గ్రంధమునకు కర్త వినుకొండ వల్లభామాత్యుడని ప్రస్తావన ప్రాయమైన అవతారికలోను, భరతవాక్యమునందును, గద్యయందును స్పష్టముగా కలదు. అవతారికా పద్యముల నన్నింటిని ఉల్లేఖించుట అనావశ్యకము వాటిలో వల్లభామాత్యుని వాగ్వైభవము అతిమాత్రముగా వర్ణింపబడినదని చెప్పుట చాలును. మరి భరతవాక్యమును గద్యయు అనతి విస్తృతములగుటచే ఉల్లేఖించుచున్నాను.

**భరత వాక్యము:**

చ॥ ముదమున ముక్కినాటిపుర మోహనశైల సువర్ణకందరా
సదనుఁడు కాలభైరవుఁడు శంభునిపట్టి సమగ్రవైభవా
భ్యుదయ పరంపరావిభవముల్ కృపసేయుఁ గవీంద్రకాంక్షిత
త్రిదశ మహీరుహంబునకుఁ దిప్పయ వల్లభరాయ మంత్రికిన్

గద్య:

ఇది శ్రీ మన్మహామంత్రిశేఖర వినుకొండ తిప్పయామాత్య నందన చందమాంబా గర్భ పుణ్యోదయ సుకవిజనవిధేయ వల్లభరాయ ప్రణీతంబైన క్రీడాభిరామంబను వీధి నాటకంబున సర్వంబు నేకాశ్వాసము.

ఇంత స్పష్టమైన గ్రంథస్థ నిదర్శనముండగా ఇది శ్రీనాథ విరచితమెట్లగుననియు, లక్షణ గ్రంథములలో ఉదాహరింపబడిన ఇందలి పద్యములు శ్రీనాథునివే యనియు ఆ లాక్షణికులు లోకమునందలి కింవదంతిని నమ్మినవారే గాని చారిత్రక పరిశోధనలు చేసి సత్యము చెప్పినవారు కాదనియు కొందరు విమర్శకులు వల్లభామాత్యకర్తృత్వమును సమర్థింతురు. మరికొందరు అవతారికా పద్యములు ఆత్మస్తుతి భూయిష్ఠములగుటచే వల్లభుడు వ్రాసినవి కావనియు శ్రీనాథుడే వాటిని వ్రాసియుండుననియు, దానివంటిదే భరతవాక్యమనియు ప్రతివాదము చేయుదురు. ఆ ప్రస్తావనా భరతవాక్యములు సూత్రధారుని వచనములు కావున వల్లభునకు ఆత్మస్తుతి దోషము అపాదింపజాలవని మొదటి పక్షమువారు సమాధానము చెప్పుదురు. కావున కర్తృత్వ నిర్ణయమునకీ ప్రస్తావనా భరతవాక్యములుపకరింపవు లక్షణ గ్రంథములును అంతటివే అనుకొందము.

పోతే ఈ గ్రంథమును చేతబట్టి మొదటి పద్యము చదువుటతోనే తెలుగు వాఙ్మయముతోను తెలుగుకవుల శైలీవిశేషములతోను పరిచయముగల ఏ సరసుడైనను ఇది శ్రీనాథుని కవిత్వమేయని త్రికరణశుద్ధిగా నంగీకరింపక తప్పదు ఈ అంశమును ముఖ్యాధారముగా చేకొని శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రి గ్రంథమునకు విపులమైన పీఠిక వ్రాసి ఇది శ్రీనాథ విరచితమేయని సిద్ధాంతము చేసిరి. అంతకు మించి నేను చెప్పదగినది ఒక్కమాట యైనను లేమిచే ఆయన సిద్ధాంత వాక్యములే ఇచట ఉదహరించుచున్నాను.

"క్రీడాభిరామమున పదసంవిధానము, అన్వయక్రమము, కారక ప్రయోగ వైచిత్రి, పద్యోపక్రమనిర్వాహములు, ప్రతి పదము శ్రీనాథుని పేరుగ్గడించుచున్నవి"

క్రీడాభిరామము నాటికి శ్రీనాథునికి నడివయస్సు దాటినది రాజమహేంద్రవర రాజాస్థానము మీదనో విజయ నగర రాజాస్థానము మీదనో చూపు పెట్టుకొని ఇంకను విద్వత్కవిమండలమున అధికయశము నార్జించు నాశతో నున్న కీర్తికాముడు నైతిక దృష్టిచే నంతగా సమర్థనీయముగాని ఈ గ్రంథమును రచించుటకు సంశయించి యుండును స్వతంత్రుడును, కవులయొక్కయు పండితుల యొక్కయు ఆక్షేపణలను సరకుసేయని ఉన్నతపదస్థుడునైన వల్లభామాత్యుడు దానివలన వచ్చు కీర్త్యపకీర్తులను దాను వహించుటకు తలపడి, దానిని తెనిగించుటకు ముచ్చటపడిన శ్రీనాథుని సందేహము వాపి తనపేరిమీద దానిని వెలయించియుండును. వల్లభామాత్యుని పేర ఈ గ్రంథము వెలయుటకు ఇది కారణమని నా యూహ.

## కాశీ ఖండము

కాశీమాహాత్మ్యము నభివర్ణించెడి ఈ పురాణమునకు కూడ స్కాందపురాణమే మూలము. ఈ కథా ప్రవర్తనమునకు మూలభూతమైన పాత్ర అగస్త్యుడు. ఆ ఋషి లోకహితార్థము దేవతల యభ్యర్థనపై కాశినిబాసి దక్షిణాపథమునకు వచ్చి కొల్హాపురాది క్షేత్రములను దర్శించుట ఈ గ్రంథములోని ప్రధానాంశము. మేరుపర్వతము మీది మత్సరముతో వింధ్యాద్రి విజృంభించి సూర్యసంచారము నరికట్టుట అగస్త్యుని కాశీ నిర్గమనమునకు నిమిత్తము. కావున వింధ్యపర్వత నిరోధమే ఈ గ్రంథమునకు ప్రస్తావనా ప్రాయమైనది లోపాముద్రాసహితుడై అగస్త్యుడు నానాతీర్థములు సేవిం

చుచు స్వామిమలతీర్థమున కుమారస్వామిని దర్శింపగా కుమారస్వామి అగస్త్యునకు కాశీక్షేత్రమునందలి నానాతీర్థఘట్టములను, దేవతలను వివరించి చెప్పుట గల భాగమే కాశీఖండమనెడి ఈ గ్రంధనామమును సార్థకము చేయుచున్నది. ఆ కథనములోని భాగమే వ్యాసుడు కాశిని బాయుటయనెడి ఉపకథ కావున ఈ ఖండపురాణమందలి కథా ప్రణాళికను వింధ్యపర్వత విజృంభణము, అగస్త్యుడు కాశిని బాయుట, అగస్త్యుని దక్షిణాపథ తీర్థసేవనము, కుమారస్వామి కాశీమాహాత్మ్యమును వర్ణించుట, వ్యాసుడు కాశిని బాయుట అనెడి అయిదు శీర్షికలుగా పేర్కొనవచ్చును. మధ్య మధ్య రెండు: మూడు ఉపాఖ్యానములు కలవు. వాటిలో కుబేరవృత్తాంత మను పేరుగల గుణనిధి చరిత్ర మిక్కిలి రమణీయమైనది.

**వింధ్యపర్వత విజృంభణము:** మేరు పర్వతౌన్నత్యమును చూచి సహింపలేక, వింధ్యుడు ఈర్ష్యాసూయాహంకార జ్వరపీడితుడై విజృంభించినపుడు అనుభవించిన మనఃసంక్షోభము విషాదనాటక నాయకుడు పొందెడి సంక్షోభమునకు సాటివచ్చునట్లు వర్ణింపబడినది. ఆత్మకృతదోష ఫలముగా అతనికి పతనము తటస్థించి నేలకుఒరిగి తలయెత్తుకొనలేని దుస్థితియు, విషాదనాటక నాయకుడు పొందెడి అవస్థవలె శోచనీయముగా వర్ణింపబడినది

*క॥ ఉప్పరమెగసి యజాండము*
*చిప్పలురాలంగ మేరుశిఖరంబులపైఁ*
*గుప్పించి దాఁటుకొందునొ*
*తప్పక నా మనసులోని తహతహ తీఱన్*

*ఉ॥ ఒక్కఁడు మా కులంబున సముద్ధతిఁజూపిన జాతరోషుఁడై*
*ఱెక్కలుదెంచి వేలుపులఱేఁడటు పాపముచేసెఁగాక యా*
*ఱెక్కలు నేఁడుకల్గిన నెఱిం గగనంబునఁ బాఱుతెంచి బి*
*ట్టెక్కనె కూటకోటితటులెల్లను నుగ్గులుగాఁగ మేరువున్.*

*తే॥ అడుసులోపలఁ దాటిపం డదిమినట్టు*
*లదుముదునెకాదె పాతాళమంటి కొనఁగ*
*వేల్పులెల్లను విభ్రాంతి విహ్వలింపఁ*
*బాదములమెట్టి నాదాయఁబసిఁడికొండ*

అని అసూయావిష్టుడై ఇతరుని సంపదకు ఉద్రిక్తతతో ఉపతపించిన ఆ దురహంకారి అగస్త్యుని పునరాగమమునకు అనుక్షణ నిరీక్షణ చేయునట

*తే॥ "ముని జటాధారి శివభక్తుఁడనఘ మూర్తి*
*యెవ్వఁడేతెంచు నప్పుడు..*
*గుంభసంభవుఁడను కోర్కి కొనలుసాఁగ*
*... ... .. ... ... ... ... .. ..."*

అట్టెత్తి చూడవలసిన దుస్స్థితికి వచ్చెను. ఈ కథ బోధించెడి నీతిని శ్రీనాధుడీ క్రింది విధముగా వాక్రుచ్చెను.

తే॥ మొదలిగల పెక్కు వయుఁబోయి ముడిఁగెనద్రి
కలశజుని నేత్రములఁ గెంపు గానవైన
నొరుని థైశ్వర్యమీక్షించి యుపతపించు
నట్టి ఖలునకునిది పెద్దయౌనె తలప.

క॥ సిద్ధింప వీప్సితంబులు
సిద్ధించెనయేనిఁ బిదపఁజెడు నన్యుని సం
వృద్ధిఁ గనుంగొని యెవ్వని
బుద్ధి నసూయాగ్రహంబుఁబొందు నతనికిన్.

ఈ కథా సందర్భములోనే మయూరుని సూర్యశతకములోని శ్లోకములు కొన్ని సందర్భమునకు పొందుపడునట్లు ఇంచుక మార్పుతో తెనిగింపబడినవి. పాషాణముల వంటి మయూరుని స్రగ్ధరలు శ్రీనాథుని సీసపద్యపుమూసలో మైనమువలె కరిగి అతని కిచ్చవచ్చిన రూపమును తాల్చినవి ఉదాహరణార్థము నాలుగు శ్లోకములు ఇచ్చుచున్నాను.

శ్లో. శాతఃశ్యామాలతాయాః పరశురివతమోఽరణ్యవహ్నే రివార్చిః
ప్రాచ్యేవాగ్రే గ్రహీతుంగ్రహ కుముదవనం ద్రాగుదస్తోగ్రహస్తః
ఐక్యంభిన్దన్ ద్యుభూమ్యోరవధిరివ విధాతేవ విశ్వప్రబోధం
వాహోనాంవో వినేతాప్యపనీయతు విపన్నా మధామధి పస్య॥

సీ॥ చిఱుసానఁబట్టించి చికిలిసేయించిన
గంద్రగొడ్డలి నిశాగహనంతలకుఁ
గార్చిన్న నిబిడాంధకార ధారాచ్ఛటా
సత్త్రివాటికి వీతిహోత్ర జిహ్వ
నక్షత్రకుముద కాననము గిల్లెడు పొంటెఁ
బ్రాచియెత్తిన హస్తపల్లవాగ్ర
మరసి మింటికి మంటికైక్యనందేహంబుఁ
బరిహరింపంగఁ బాల్పడ్డయవధి

తే గీ. సృష్టికందెడు తొలుసంజ చెలిమికాఁడు
కుంటు, వినతామహాదేవి కొడుకుఁ గుజ్జు
సవితృసారథి, కట్టెఱ్ఱచాయఁ దెలుప
నరుణు డుదయించెఁ బ్రాగ్దిశాభ్యన్తరమున.

శ్లో॥ వ్యక్తుర్వన్నోషధీ సేముషిత రుచిశుచేవౌషధీః ప్రోషితాభా
భాస్వద్గ్రావోద్గతేన ప్రథమ మివకృతాభ్యుద్గతిః పావకేన
వక్షచ్ఛేదవ్రణా సృక్స్రుత ఇవదృషదో దర్శయన్ ప్రాతరద్రే
రాతామ్ర స్తీవ్ర భానోరనభిమత మదేస్తా ద్గభస్త్యుద్గమోవః

సీ॥ ప్రాలేయ కిరణబింబంబు వెల్వెలఁ బాఱి
యసాచలంబుపై నతమిల

వరుసతో నోషధీవల్లీమ తల్లుల
కాంతివైభవలక్ష్మి కచ్చువదల,
రవికాంతపాషాణ రత్నంబులం దుబ్బి
యగ్ని ప్రత్యుత్థానమాచరింపఁ
బ్రబలాంధకార ధారాచ్ఛటాపటలంబు
పంచబంగాళమై పాఱిపోవ

తే.గీ. నుదయ పర్వత కటక గండోపలములఁ
బక్షమూలచ్ఛిదా వ్రణ ప్రభవమైన
నెత్తురనియెడు విచికిత్స నివ్వటిల్ల
భానుకిరణంబు లొక కొన్ని ప్రాఁకెనభము.

శ్లో॥ జ్యోత్స్నాంశాకర్ష పాణ్డుద్యుతి తిమిరమషీ శేష కల్మాషమీష
జ్జృమ్భోద్భూతేన పిఙ్గంసరసిజరజసా సన్ధ్యయా శోణరోచిః
ప్రాతః ప్రారంభకాలే సకల మపిజగ చ్చిత్రమున్మీలయన్తీ
కాన్తిస్తీక్ష్ణత్విషోఽక్ష్ణాంముద ముపనయతాతూలికే వాతులాంవః

సీ॥ తలిపి వెన్నెలలోని ధావళ్యమొకకొంత
నవసుధాకర్దమ ద్రవముగాఁగ
జిన్నారి పొన్నారి చిఱుతచీఁకటిచాయ
యసలు కొల్పిన మషీ రసముగాఁగ
నిద్ర మేల్కాంచిన నెత్తమ్మి మొగడల
పరువంపుఁ బుప్పొళ్ళు హరిదళముగఁ
దొగరువన్నియలేఁత తొలుసంజ కెంజాయ
కమనీయధాతురాగంబుగాఁగ
వర్ణములుగూడి యామినీ వ్యపగమమున
జగము చిత్రింపఁ దూలిక చందమైన
కొమరుఁబ్రాయంపు నూనూఁగుఁ గొదమయెండ
ప్రాచి కభినవ మాణిక్యపదకమయ్యె.

శ్లో॥ ధూర్ధ్వస్తాగ్ర్యగ్రహోణి ధ్వజపట పవనాందోలితేందూ నిదూరం
రాహోగ్రాసాభిలాషా దనుసరతి పునర్లత్త చక్ర వ్యథా ని
శ్రాన్తా శ్వశ్వాస హేలాధుత విబుధధునీ నిర్ఝరాంభాంసి భద్రం
దేయాసుర్వోదవీయోదివి దీవసవతేః స్యందన ప్రస్థితాని.

సీ॥ ధూర్దండ ఘట్టన త్రుటిత గ్రహాగ్రావ
ధూళిపాళీమిళ ద్ధ్వస్థ్సలములు
ధ్వజపట పల్లవోద్ధత మరుత్సంపాత
పరికంపమానోడు పరివృఢములు
గ్రాసాభిలాషానుగత విధుంతుద పునః
ప్రాప్త చక్రవ్యథోపద్రవములు

క్రాంతాశ్వనిబిడ నిశ్శ్వాశ ధారోద్ధూత
స్వర్ధునీ నిర్ఝర జలచరముల
తే.గీ. గగనపదలంఘనైక జంఘాలికములు
పద్మ బాంధవ నిజరథ ప్రస్థితములు
సాఁగెనని దక్షిణాయన సమయ మగుట
దర్దురము మీఁద మలయ భూధరము మీఁద.

ఈ గ్రంథమున నిట్లు తెనిగింపబడిన శ్లోకములు పదుమూడు కలవు కాశీఖండము స్కాందపురాణము నందలి కథకు యథార్థానువాదము కాదనుటకు ఈ సీస పద్యములే ప్రబల సాక్ష్యము. మయూరుని శ్లోకములు ఆ సంస్కృత పురాణమున నుండవు. ఈ సీసపద్యముల లక్షణము నైషధమునందలి సీసపద్య లక్షణములకు సోదరప్రాయము.

కాశీఖండమున ప్రసిద్ధికెక్కిన కథలలో గుణనిధి కథ యొకటి. తెలిసియో తెలియకయో ఈషత్ శివకైంకర్యము చేసిన మహాపతితులకయినను పుణ్యలోకప్రాప్తి లభించుననెడి శివధర్మమునకొక దృష్టాంతముగా చెప్పబడిన చిన్నకథ గుణనిధికథ. ఇందు ఈ మహాకవి ప్రదర్శించిన పాత్ర సృష్టి, సంక్షిప్తత, సందర్భశుద్ధి, ఔచిత్యము, వృత్తాంతకథనము, పాత్రోచితశైలి మొదలయిన లక్షణములతో తీర్చబడిన కావ్యశిల్పము, అధునిక కథానికలకు సైతము మేలుబంతిగా వెలుగొందుచున్నది. పాండురంగమాహాత్మ్యమునకు ఇదియే ఒరవడి.

ఈ గ్రంథమును రెండు భాగములుగా విభజించవచ్చును. మొదటిది అగస్త్యుడు లోపాముద్రకు భౌతికములైన తీర్థయాత్రల మహిమలనే కాక యౌగికములైన అంతర తీర్థములను గురించి కూడ చేసిన ఉపన్యాసభాగము ఆ ఋషి స్వామిమలక్షేత్రమున కుమారస్వామిని దర్శించి ఆయన వలన కాశీమహత్త్వమును వినుట, వ్యాసుడు కాశినిబాయుట యనెడు వృత్తాంతము ఈ రెండవ భాగములోనిదే కావున, అగస్త్యుడు కాశినిబాయుట యనెడు కథ గ్రంథారంభమునను, వ్యాసుడు కాశినిబాయుట యనెడు కథ గ్రంథాంతమునను నిబంధింపబడినవి ఆ ఇరువురి మహర్షుల వృత్తాంత కథనముచే కాశీఖండము పావనారంభమును, పావనాంతమును అగుచున్నది. అంతేగాక మమతాశూన్యులును, నిస్పృహులును, బ్రహ్మస్వరూపులును అయిన ఆ మహర్షులే కాశీవియోగ బాధను సహింపలేక వ్యథ నొందుట వలన తత్క్షేత్ర మహిమ వర్ణనాతీతమని స్ఫురింపచేయుటయే ఈ గ్రంథము యొక్క పరమప్రయోజనము.

క్షేత్రమాహాత్మ్య గ్రంథముల పెక్కింట, తత్క్షేత్ర దేవతా మహిమ వలన పతితులు సయితము పావనులయిన ఉపాఖ్యానములు చాల చెప్పబడును. ఈ కాశీఖండములో అట్టిది ఒక గుణనిధి కథ మాత్రమే కలదు. తక్కిన ఒకటి రెండు కథలు, (శివశర్మోపాఖ్యానము, కళావతి కథ) పతితులకు సంబంధించినవి కావు. ఈ గ్రంథమున ఉపాఖ్యాన భాగము చాల తక్కువగా, కాశీ మాహాత్మ్య వర్ణనము చాల ఎక్కువగా నున్నది అదియుగాక, అనేక యోగశాస్త్ర ధర్మశాస్త్రాది ప్రసంగముల వలనను, ఊర్ధ్వలోకముల వర్ణనల వలనను గ్రంథము చాల పెరిగినది. వాటివలననే ఈ గ్రంథమువలన కావ్యానందముకంటె, విజ్ఞానబోధ యెక్కువ కల్గుచు

న్నది. ఎయ్యెడనేని కావ్యపదార్థలేశమున్నచో దానిని శ్రీనాథుడు రసబంధురముగా తీర్చిదిద్దెననుటకు సందేహములేదు. మొత్తము మీద కాశీఖండము అయఃపిండ మయినను, ఆస్వాదయోగ్యమైనది.

కవి సార్వభౌముని యుద్దండశైలికి ఈ గ్రంధమే లక్ష్యభూతమైనది. నైషధాదులయందు కానవచ్చు శయ్యారామణీయకమునకు ఇయ్యెడనే పరిణామము కలిగెను. మఱి అతని నానాశాస్త్ర పరిచయమునకును, లోకవృత్త పరిజ్ఞానమునకు మానవ ప్రకృతి పరిశీలనమునకును ఈ గ్రంధమే సాక్షీభూతముగా పేర్కొనదగి యున్నది.

## శ్రీనాథుని మూడవ దేశాటనము

వీరభద్రారెడ్డి శ్రీనాథునకు ఆస్థానపదవి యిచ్చియే కాశీఖండమును కృతి పుచ్చుకొనెనో లేక ఆ పదవి ఈయకయే కృతి పుచ్చుకొని సత్కరించెనో చెప్పలేము. కాని, కవిసార్వభౌముడు పొలము పన్ను చెల్లించలేక శిక్షింపబడినపుడు తన పూర్వపు టౌన్నత్యమును సంస్మరించుకొని "వీరభద్రారెడ్డి విద్వాంసుముంజేత వియ్యమందెను గదా వెదురుగొడియ" అని వగచినట్లు కలదు. కనుక అతనికి కాశీఖండము నాడు రాజమహేంద్రవరాస్థానకవి పదవి లభించి యుండుననియే తలంచవచ్చును. పదవిలేని సత్కారమే పొందియున్నచో "వీరభద్రారెడ్డి విద్వాంసుడ" నని చెప్పకొని యుండడు.

తదాది తన రాజుయొక్క జీవితము వరకునో, రాజ్యపతనానంతరము వరకునో ఆ యాస్థానమున ఉండియుండ వచ్చును. తదనంతరము మరల నిరాశ్రయుడై ఇంకొకరి ప్రాపును సంపాదించుకొనుటకో లేక చివరి దశలోనైనను స్వతంత్ర జీవనోపాధి చూచుకొనుటకో బయలుదేరి యుండును. ఆ దశలో బొడ్డుపల్లి గ్రామమున పొలము గుత్తగొని వ్యవసాయము చేయుట అతని స్వతంత్ర జీవనాభిలాషకు సూచనగా జెప్పవచ్చును. ఆ వ్యవసాయము నిష్ఫలమై పోయిన పిమ్మటనో లేక ఆ ఊర నెలకొనక పూర్వమో శివరాత్రి మాహాత్మ్యమును రచించి యుండును. కృష్ణాతీరమున బొడ్డుపల్లి గ్రామమున కవిసార్వభౌముడు కృషీవలుడుగా జానపద జీవితమును గడుపుటకు సమకట్టి తత్ప్రాంతీయులైన జానపదులు భారతమునువలె ఆరాధించెడి పల్నాటి వీరచరిత్ర వ్రాసియుండును. అది పదకావ్యము. దానిని తత్ప్రాంత గ్రామీణుల అభ్యర్థనముపై వ్రాసెనో లేక తనకే యట్టి ఉత్సాహము కల్గెనో చెప్పలేము. దాని నటుంచి, ముందు శివరాత్రి మాహాత్మ్యమును గూర్చి ముచ్చటింతును.

## శివరాత్రి మాహాత్మ్యము

పుట్టుక చేతనేగాక గుణముచే సైతము శ్రీనాథుని పద్య కావ్యములలో కనిష్ఠము శివరాత్రి మాహాత్మ్యము. ఇది శ్రీశైలము నందలి శాంతభిక్షావృత్తి మఠాధిపతికి మూలభృత్యుడైన ముమ్మడి శాంతయ్యకు కృతి యీయబడినది. సాధారణముగా గ్రంధావతారికనే ఒక ప్రబంధముగా రచించుట శ్రీనాథునకు పరిపాటి. కాని ఈ గ్రంధావతారిక తద్భిన్నముగా నతిపేలవమై యుండుటయేగాక కొన్ని పట్ల బాలిశము

(Childish) గా నున్నది. దీనినిబట్టి కొందరు ఈకృతి ప్రదానమునే శంకించిరి. శ్రీనాథుని అనంతరము ఈ గ్రంథమును చేజిక్కించుకొని శాంతయ్య యెవరిచేతనో తనపేర అవతారిక వ్రాయించుకొని యుండునని వారియూహ. కాని శాంతయ్య అట్టి చౌర్యమును కొడిగట్టి యుండునని ఋజువు చేయుట కష్టము కృతిపతిని సంబోధించెడి ఆశ్వాసము యొక్క ఆద్యంతములలో శ్రీనాథుని వాగ్గుంభనము ద్యోతిత మగుచుండునని చెప్పదగును. మఱి అవతారికలో ఆ లక్షణమేల మరుగునపడెనో చెప్పలేము. కృతి ప్రదానము జరిగిన పిమ్మట శ్రీనాథుని పరోక్షమున శాంతయ్యగాని యాతని పరోక్షమున నాతని వంశీయులుగాని మొదట అనతివిస్తృతిగా నుండిన అవతారికను పెంచి వ్రాయించి యుండురని నా యూహ.

శ్రీనాథునకు సంస్కృత కవులలో భట్టబాణుని యందు అత్యంత తాత్పర్యము కలదు. బాణుని కాదంబరీ వచనశైలిని తెలుగు నవతరింపజేసినవాడు శ్రీనాథుడే పొసగినపుడెల్ల బాణుని విరోధాభాసములను, ఉపమాన గుచ్ఛములను, అనుప్రాసాది శబ్దాలంకారములను అనుకరించుటలో శ్రీనాథునకు కుతూహలము మెండు. ఈ గ్రంథములో యజ్ఞదత్తుని కథలో అట్టి అనుకరణమే కాక కాదంబరిలోని కొన్ని వాక్యములు యథాతథముగాను, ఈషద్భేదముతోను అనువదింపబడినవి.

శ్లో నైషధ శ్లోకచ్ఛాయలు కొన్ని, కాశీఖండ పద్యచ్ఛాయలు కొన్ని ఈ గ్రంథమున చూపవచ్చును. కాశీఖండమున గుణనిధి యిల్లు విడిచి వెళ్ళిపోయిన పిమ్మట, ఉదయపుపూట తనకు ప్రేమతో అన్నముపెట్టు తల్లిని స్మరించుకొని, విలపించిన పద్యమొకటి కలదు, ఈ గ్రంథమున సుకుమారుని ముఖమున ఆ పద్యమే వినవచ్చుచున్నది.

చ॥ "అరుణగభస్తిబింబ ముదయాద్రిపయింబొడతేర గన్నెలోఁ
బెరుఁగును వంటకంబు వడపిందియలుం గుడువంగఁబెట్టు ని
ర్భర కరుణాధురీణయగు ప్రాణము ప్రాణము తల్లియున్న దే
హార హార యెవ్వరింకఁ గడుపారసి పెట్టెద రీప్సితాన్నముల్?"

ఈ గ్రంథ రచనలో శ్రీనాథుని జటిలమైన శయ్య యేమియు కొరవడలేదుగాని, కథా సంధానమున అశ్రద్ధవలన దొరలిన కొంత వెలితి లేకపోలేదు. అందుచేతనే ఈ గ్రంథము పుట్టుకచేతనే గాక గుణముచేతను కనిష్ఠము అని అంటిని.

## పలనాటి వీరచరిత్ర

ఇది క్రీస్తుశకము 1182వ సంవత్సరమున పల్నాటి సీమలో జరిగిన ఒక మహాయుద్ధమునకు సంబంధించిన చారిత్రక పదకావ్యము ముందుగ ఈ గ్రంథమునందలి చరిత్రాంశమును వివరించెదను.

**చరిత్రాంశము:** అనుగురాజు అను పేరుగల ఒక హైహయ వంశజుడు ఉత్తర దేశమునుండి సపరివారముగా ఆంధ్రభూమికి తరలివచ్చెను. అతనికి చందవోలు వెలనాటి చోళరాజు మైలమాదేవియను పేరుగల తన కుమార్తెనిచ్చి పెండ్లిచేసి పలనాటి సీమను ఆమెకు అరణముగా నిచ్చెను. అనుగురాజు గురజాలను రాజధానిగా జేసికొని పలనాటి రాజ్యము నేలుచుండెను. అతనికి మైలమాదేవిగాక విద్యలదేవియనెడు

పట్టమహిషియు, భూరమాదేవి యనెడు మరియొక భార్యయు కలరు. వీరిలో మైలమాదేవికి నలగాముడను పుత్రుడు జనించెను. మరి విద్యలదేవికి పెద మలి దేవుడు, పిన మలిదేవుడు, బాల మలిదేవుడు అను మువ్వురు పుత్రులును, భూరమాదేవికి కామరాజు, నరసింగరాజు, ఘట్టిరాజు, పెరుమాళ్ళురాజు అను నల్వురు పుత్రులును కలిగిరి. ఈ ఎనమండుగురు కొడుకులలోను నలగామ రాజు పెద్దవాడు, పెదమలి దేవాదులు పిన్నవారు.

ఒకనాడు అనుగురాజు వేటకుపోయి మరలివచ్చుచుండగా జిట్టగామాంపాడు వాస్తవ్యురాలైన నాగమ్మ యనెడి ఒక రెడ్డి వితంతువు. అతనికి విందుచేసి మెప్పించి, రాజాస్థానమున చనవు సంపాదించి, ఉన్నత పదస్థుడైన నాయకులను తనకు విధేయులను చేసికొను తంత్రము నెరపుచుండెను. అనుగురాజు మంత్రియగు దొడ్డనాయని కుమారుడు బ్రహ్మన మాత్రము ఆమెను లెక్కచేయకుండుటచే ఇరువురికి పగ యేర్పడెను.

ఇట్లుండ కొన్నినాళ్ళకు, అనుగురాజు మరణించెను మరణవేళ అతడు తన కుమారులను బ్రహ్మనాయని కప్పగించి వారందరు నైకమత్యముతో మసలు కొనునట్లుగా అరయుచు నలగామునకు పల్నాటి పట్టము కట్టి అతడు మంత్రిత్వము చేయుమని కోరెను.

అవసానవేళ రాజుచేసిన ఆదేశము ననుసరించి బ్రహ్మన నలగాముని పట్టాభిషిక్తుని జేసి తాను ప్రధానియై అతనిచే పల్నాటి రాజ్యమును చక్కగా నేలించుచుండెను. నాయకురాలు బ్రహ్మన ప్రాభవమును సహింపలేక, నలగామునితో ఏవేవో కొండెములు చెప్పి అతని మనసు విరిచెను. నలగాము డామె మాటలు నమ్మి మలిదేవాదులను చెఱసాలలో బెట్టించెను. కుటుంబ కలహము లేకుండుటకై బ్రహ్మన మధ్యవర్తిత్వము జేసి రాజ్యమును రెండుగా విభజించెను. నలగాముని భాగమునకు గురజాలయు, మలిదేవుని భాగమునకు మాచర్లయు రాజధాని నగరము లయ్యెను బ్రహ్మనాయడు మలిదేవుని పేర తానే పరిపాలనము చేయుచు, అతడు యుక్త వయస్కుడైన పిమ్మట కళ్యాణ నగరాధీశుడైన సోమేశుని కుమార్తె నిప్పించి వివాహము చేయించి మాచర్లకు పట్టాభిషిక్తుని జేసెను నాయని మంత్రిత్వములో మలిదేవుని రాజ్యభాగము సిరిసంపదలతో తులతూగుటను చూచి యోర్వని నాయకురాలి ప్రేరణచే నలగాముడు వారిని కోడి పందెములకై గురజాల పిలిపించి, మాయా ద్యూతమున నోడించెను. గ్రంధమున నీ భాగమునకు "కోళ్ళపోర"ని పేరు.

ద్యూత సమయానుసారము మలిదేవాదులు రాజ్యమును విడిచి మండాదికి వలసపోయిరి. దీనికి మండాది వలస యని పేరు

ఆ స్థితిలోనైనను వారు బ్రతుకుట సహింపలేని నాయకురాలు, చెంచుమూకలను పంపి, వారి ఆలమందలను, ఆలకాపరులను చంపించెను ఈ వృత్తాంతమునకు "మందపోటు" అని పేరు.

అనంతరము మలిదేవాదులు అటనుండి తరలి, మేడపిచేరి తలదాచుకొని గడువు తీరినపిమ్మట తమరాజ్యభాగమునకు రాయబారము నడపిరి. ఆ దౌత్యము నడపిన రాయబారి నలగాముని అల్లుడగు అలరాజను నాతడు. నాగమ్మ అతనిని

విషప్రయోగముచే చంపించెను. ఈ భాగమునకు "అలరాజు రాయబారము"ని పేరు.

అంతటితో నుభయపక్షములకు యుద్ధము స్థిరమైనది. కారెమపూడిలో యుద్ధ రంగ నిర్మాణమునకు శంకుస్థాపన చేసిరి. ఆ వృత్తాంతమునకు 'కల్లు ప్రతిష్ఠ' అని పేరు.

ఉభయులును తమకు బాసటగా వచ్చిన మండలాధిపతులతో కారెమపూడి వద్ద సేనలను విడియించిరి. యుద్ధభూమిలో విడిసిన పిదప తుది యత్నముగా మరల సంధి ప్రయత్నము జరిగెను. బ్రహ్మనాయని కుమారుడగు బాలచంద్రుడు తనవారు యుద్ధ సన్నాహము లొనర్చుట యెరుగనే యెరుగడు. అతని సాహసము దుర్నివార్యమని తలచి కాబోలు బ్రహ్మనాయ డాతనిని వెంట గొంపోలేదు. ఎట్లో యుద్ధవార్త విని స్కంధావారమున నురికిన బాలుడు సంధి ప్రయత్నములను భగ్నము చేయగా యుద్ధము తప్పని సరియయ్యెను. నలగాముని శిరస్సు తెచ్చి బ్రహ్మనాయని పాదములచెంత పెట్టెదనని ప్రతిన చేసిన బాలుడు శత్రు సేనలపై విజృంభించి సంహారకేళి సల్పి తుదకు మరణించెను. అతని యుద్ధము అభిమన్యుని యుద్ధము వంటిది. ఆ పైని ఒక్కొక్క వీరుడే రణరంగమున బలియయ్యెను. దీనికి "బాలచంద్రుని యుద్ధము" అని పేరు. తుదకు ఆ యుద్ధమును చేపట్టిన బ్రహ్మన నలగాముని, నాగమ్మను వెన్నంటి తటిమి జయము తన్ను వరింపనున్న సమయమున నాగమ్మ శరణు వేడగా నామెను క్షమించి తానా చెంతనున్న ఒక కొండ గుహలోనికి జొచ్చి అదృశ్యుడయ్యెను. ఈ తుది ప్రకరణమునకు 'బ్రహ్మనాయుని విరుగు' అని పేరు.

ఇది చరిత్రలో రెండు తరముల కాలమున నడచిన విపుల వృత్తాంతము అది ఈశ్వర సంకల్పమేమో చెప్పలేము. కాని ఈ కథ భారత కథ పునరావృత్తమైనదా అన్నట్లుండును. అక్కడవలె ఇక్కడను వచ్చిన తగవుకూడ దాయభాగమును గురించియే. ఆ కౌరవ పాండవులు అన్నదమ్ముల బిడ్డలు. పలనాటి రాజులు సపత్నీ పుత్రులు. "అన్నదమ్ములలో జ్యేష్ఠుని పుత్రుడను గనుక రాజ్యము నాది" అని దుర్యోధనుడన్నట్లు 'నా తల్లివంక రాజ్యమునకు నేనే అర్హుడ'నని నలగాము డనెను.

"హక్కులమాట అటుంచి, హత్తిన మనస్సులతో కలసిమెలసి బ్రతుకుడ"ని, అక్కడి పెద్దలు, ఇక్కడి పెద్దలును కలహము వారించు నుద్దేశముతో హితవు జెప్పిరి కలసి బ్రతుకుట, దుర్యోధనునకు ఇష్టము కాకపోబట్టి కౌరవ రాజ్యము విభాగింపబడినది ఇక్కడ నలగామునకు ఇష్టము లేకపోబట్టి పలనాడు విభక్తమైనది. అక్కడ దుర్యోధనునకును, ఇక్కడ నలగామునకు దుష్టమంత్రుల ప్రేరణ నిమిత్తమైనది

రాజ్య విభాగము న్యాయము గాదనుకొని పంచి యిచ్చిన సగమును మరల దోచుకొనుటకు శకుని ప్రేరణచే దుర్యోధనుడును, నాగమ ప్రేరణచే నలగాముడును యత్నించిరి. నిర్జీవ ద్యూతవ్యాజమున ధర్మరాజు వనవాసము పోగా, సజీవ ద్యూతవ్యాజమున మలిదేవుడు అడవి కేగెను. అడవులలో మాత్రమేల సుఖముగా బ్రతుకనీయవలెనని దుర్యోధనుడు ఘోషయాత్రా కల్పన చేసినట్లుగా నలగాముడు మందపోటు జరిపించెను. సమయ నిర్వహణానంతరము రాజ్య విభాగ మిచ్చుటకు దుర్యోధనునివలె నలగాముడును నిరాకరించెను ఇర్వురును రాయబారులకు విషప్రయోగ ప్రయత్నములు చేసిరి. భారత కృష్ణుడు విషప్రయోగమును శంకించి

తప్పించుకొనెను వంశనాశనమును నివారించుటకు చేసిన సంధి ప్రయత్నములు, రెండు చోట్లను విఫలముకాగా చోదితులై ఇరువాగులు యుద్ధమునకు తారసిల్లెను కురుక్షేత్రమునందువలె కారెంపూడి క్షేత్రమునందును ఉభయపక్ష వీర సంఘములు సర్వనాశనమయ్యెను. అయితే భారత యుద్ధ జయముతో కురురాజ్యము ధర్మరాజునకు లభింపగా పల్నాటి రాజ్యము మాత్రము హతశేషుడైన నలగామునకు దక్కెను అతని రాజ్యప్రాప్తి యుద్ధజయ లబ్ధికాదు; అది బ్రహ్మన అనుగ్రహదత్తము

ఈ విధముగా పలనాటి కథయంతయు భారతకథతో సంవదించుట, యే కవియు చేసిన అభూతకల్పన కాదు; స్వతఃప్రవృత్తము.

మఱి ఆంధ్రమునగల ఇటువంటి చారిత్రక పదములలో ఈ పలనాటి పదమునకు అద్వితీయమైన ప్రశస్తియు బహుళప్రచారమును కలవు. దానికి మొదటి కారణము, భారతముతో దీనికి గల సాదృశ్యము రెండవది బొబ్బిలికథ మొదలైన చరిత్రలను పదములుగా వ్రాసిన రచయితలు ఈ పలనాటి పదములను వ్రాసిన కవులతో సాటి రాగల కవితాప్రజ్ఞ కలవారు కాకపోవుట. ఆ కథలు పాడుచుండగా వినుచున్నంతవరకే హృదయావర్జకములుగా నుండును గాని, చదువబూనగా రచన అంతగా రుచించదు. పలనాటిచరిత్రను పిచ్చుకుంట్లు పాడునపుడు కలిగెడి భావోద్రేకము మాట అటుండగా, గ్రంథము చేతబట్టి చదువుట మొదలిడినచో ప్రౌఢపద్య కావ్యోచితములైన పెక్కుసొగసులు, రసభావస్ఫోరకములైనవి అసకృత్తుగా ప్రత్యక్షమగును ఈ రెండుకారణములవల్ల పలనాటి పదము ఆంధ్రచారిత్రక పదకవిత్వశాఖలో అగ్రతాంబులార్హతను గడించుకొన్నది

అయితే ఈ కథకు అక్షరరూపము కల్పించిన ఆదికవి యెవడో చెప్పలేము. ఏమనగా సాంఘికములును, చారిత్రకములు నయిన ఇట్టి దేశోపద్రవములు జరిగిన వెంటనే భావావేశముగల ఒక పుట్టుకవి, వాటిని ఒక పాటగా పాడును అంతేగాని, ఆ వృత్తాంతము జరిగిన కొన్ని యేండ్లవరకు యే పండిత కవి పుట్టుకకోసమో ఆ కథలు వేచియుండవు. సుమారేబది, అరువదియేండ్లనాడు, గుంటూరుజిల్లా రెడ్డిపాలెం వాస్తవ్యుడును "ఎల్లమంద కోటప్పకొండ"లో పోలీసులపై జరిగిన తిరుగుబాటుకు నాయకుడును అయిన చిన్నపరెడ్డి బ్రిటిష్ ప్రభుత్వముచేత ఉరితీయబడిన వెంటనే "భళిరా చిన్నపరెడ్డి! నీపేరే బంగారపుకడ్డీ" అనెడి పదము లోకమున వెలసినది. అట్లే గాంధీజీ సత్యాగ్రహోద్యమము ప్రారంభించి, బ్రిటిష్ ప్రభుత్వముతో అహింసా యుద్ధము చేయుచుండిన రోజులలోనే తునివాస్తవ్యుడు రంగాచారి అను ఒక పుట్టుకవి ఆ ఉద్యమమును గురించి వేలకొలది పంక్తులలో ప్రకరణ ప్రకరణములుగా పదమును వ్రాసి ఊరూర తిరిగి పాడి ప్రజల ఉత్సాహ పూరితుల గావించెను. ఇట్టివి అనేకములు పేర్కొనవచ్చును. కాబట్టి పలనాటి యుద్ధము జరిగిన వెంటనే ఆ సంక్షోభమును కన్నులార చూచియో, లేక చూచినవారు చెప్పగా వినియో వీర రసావిష్టుడైన యే పుణ్యాత్ముడో అనాడే వీనిని పదముగా పాడి యుండును. అయినచో ఇంత సుదీర్ఘమగు నితివృత్తమునంతయు, అతడు పదముగా వ్రాసి యుండెనా? అని ప్రశ్నించునో, ఇందు ఏదైనను సంభవమే. మొదటికవి కథ నంతటినిగాక, తన హృదయమును ఆకర్షించిన ఘట్టమును – బహుశః అది యుద్ధ ఘట్టము కావచ్చు – తొలుత, పదముగా పాడియున్నచో తరువాత కొద్దికాలమునకు ఇంకొక కవి ఇంకొక

ఘట్టమును, మరియొక కవి మరియొక ఘట్టమును పరిగ్రహించి కథ యంతయు కలసి వచ్చునట్లు సంపూర్ణ గ్రంధమును నిర్మించి ఉండవచ్చును. ఆ ఆది కవియును, తర్వాతి కవులును, ఆ యుద్ధక్షేత్రమునకును సమీప గ్రామస్థులై యుందురు కాని, దూరదేశస్థులై యుండరు. ఒక ప్రాంతమున జరిగిన సంఘటన తత్ప్రాంతీయుల నాకర్షించినంతగా, దూరస్థులను ఆకర్షింపదు ఆ కథలయందు, కథా పురుషులయందు సమీపస్థులకుండెడి అభిమానము దూర దేశస్థులకుండదు

ఇప్పుడీ గ్రంధము సంపూర్ణముగా ఒకచోట లభింపదు పలువురు వ్రాసిన పలు ప్రకరణములను జతపరచిననే తప్ప గ్రంధసమగ్రరూపము పొడకట్టదు. ఈ పలువురును ఎవరికివారే పూర్తి కథను వ్రాసిరో లేక తమకు ముచ్చట గొల్పిన ఏదో ఒక ప్రకరణమును వ్రాసిరో ఊహించుటయు దుష్కరము. అంతియేకాక, ఏదైన ఒక గ్రంధభాగము లుప్తముకాగా, దానిని పూర్తిచేయు తలంపుతో రచన కుపక్రమించిరో లేక పూర్వకవికంటె బాగుగ వ్రాయవలెననెడి కుతూహలముతో వ్రాసిరో చెప్పలేము. మరియును ఈ కథాఘట్టములను పాడెడు పిచ్చుకుంట్లు అనేక కుటుంబములవారు కలరు కనుక ఏ జట్టునకు ఆ జట్టు తనకు కావలసిన ఘట్టమును ఏ కవినో ఆశ్రయించి, వ్రాయించుకొన్నదేమో తెలియదు. ఇన్ని కారణములవలన, ఈ గ్రంధము బహుకర్తృకముగుట, ఒక్కొక్క ప్రకరణము సగము లుప్తమై సగము దొరకుట, అవతారికలలో గ్రంధకర్తల పేరులు కానరాకపోవుట, ఒక ఘట్టమునే పలువురు వ్రాయుట సంభవించినది

విడివిడిగానున్న కథాభాగములను జతపరచి, కథయంతయు కలసి వచ్చునట్లు సమగ్రస్వరూపమును సంఘటించి చూడగా ఈ గ్రంధమున ఈ క్రింది ప్రకరణములు కానవచ్చును.

1. అనుగురాజు పలనాటి సంపాదనము 2. పలనాటిరాజ్య విభాగము 3. కోళ్ళపోరు—గోపన్న విరుగు 4. మండాదివలస 5. మందపోటు—లంకన్న విరుగు 6 గురుజాల యుద్ధము 7. అలరాజు రాయబారము 8 కల్లు ప్రతిష్ఠ—బాలచంద్రుని యుద్ధము 9. కొమ్మరాజు యుద్ధము 10 బ్రహ్మన విరుగు.

ఇప్పుడు లభ్యమగు ఈ భాగములు ఆ కథ జరిగిన వెంటనే వ్రాసిన కవుల పాటలను ఆధారము చేసికొని, కాలక్రమమున కావ్యశోభలతో అందముగా పెంపొందింపబడినవే కాని, ఆమూలస్వరూపములు మాత్రము కావు ఈ పది ప్రకరణములలో తమ పేర్లు చెప్పుకొన్న కవులు ముగ్గురు మాత్రమే—శ్రీనాధుడు, కొండయ, మల్లయలు. వీరిలో కొండయ, మల్లయలు 16 వ శతాబ్దమువారు. ఈ మువ్వురలో శ్రీనాధుడు "కల్లు ప్రతిష్ఠ—బాలచంద్ర యుద్ధము"ను "కోళ్ళపోరు — గోపన్న విరుగు" మల్లయయు, 'కొమ్మరాజు యుద్ధము'ను కొండయయు వ్రాసినట్లు గ్రంధస్థ పంక్తులు గలవు తక్కినభాగము లెవరు వ్రాసిరో స్పష్టముగా చెప్పలేము కాని, కోళ్ళపోరు — గోపన్న విరుగు, అనుదానికి, పరిశిష్ట భాగముగా పరిగణింపదగిన మండాది వలస, లంకన్న విరుగు, అలరాజు రాయబారము అనునవి మల్లయయే వ్రాసి ఉండును. అట్లే కొమ్మరాజు యుద్ధమునకు అనుబంధముగా నున్న బ్రహ్మన్న విరుగును కొండయ వ్రాసి ఉండును పోగా మొదటి రెండు ప్రకరణములను

వ్రాసినవారి పేరు ఊహించుటయైనను కష్టము అతడొక అజ్ఞాతకవి; ఇతడును కొండయ, మల్లయలవలె శ్రీనాథుని తరువాతి కాలమువాడే. వీరు ముప్పురు తమ తమ భాగముల అవతారికలలో శ్రీనాథుని పేరు భక్తిపూర్వకముగా స్మరించిరి. "గురుజాల యుద్ధము" వ్రాసిన కవి యెప్పటివాడో ఎవరో అసలు తేలదు

పల్నాటి వీరచరిత్ర శ్రీనాథ కృతమని చిరకాలము నుండి ప్రబలమగు జనశ్రుతి కలదు. కాని ఆంధ్రమున సారస్వత విమర్శ ప్రారంభమైన తర్వాత పెక్కుమంది పండితులు పల్నాటి వీరచరిత్రను శ్రీనాథుడు వ్రాసి ఉండునా? అని సందేహింప మొదలిడిరి. ఈ విధముగా సందేహించెడి వారు చూపెడి యుక్తులు ఇవి.

(అ) ఉద్దండ పండితుడైన శ్రీనాథుడు పామర రచన అని అనిపించుకొనదగిన సుద్దుల కవిత్వమును వ్రాసి ఉండడు.

(ఆ) శ్రీనాథుని ఇతర కావ్యములలో కానవచ్చెడి శైలీప్రౌఢి ఈ గ్రంథమున ఎచటను కానరాదు.

(ఇ) శ్రీనాథుని కర్తృకమని చెప్పబడుచున్న కల్లు ప్రతిష్ఠ అవతారిక యందు అతడు తాను "చెన్నకేశవ పాదసేవారతుండ" నని చెప్పుకొన్నట్లు కలదు. శ్రీనాథుడు శివభక్తి పరాయణుడే కాని విష్ణుభక్తుడు కాడు. కనుక పల్నాటి వీరచరిత్రను శ్రీనాథుడు వ్రాసియుండడు.

ఈ యుక్తులకు సమాధానము చెప్పుటకు ముందు 'కల్లు ప్రతిష్ఠ – బాల చంద్రుని యుద్ధము' పండితకవి రచితమా లేక పామరకవి రచితమా? అని ప్రశ్నించుకొనవలయును. ఈ ప్రశ్నకు అర్థము ఈ కవి విద్యావంతుడా లేక సహజ కవితాప్రజ్ఞ మాత్రమే కలవాడా? అని ఇట్టి పదములను వ్రాయుటకు ఎవరికైనను సహజ కవితాప్రజ్ఞ ఉన్న చాలును. అతనికి ఇతిహాస పురాణాది ఉద్గ్రంథ పరిచయము, సంగీత నాట్యాదికళల పారిభాషిక జ్ఞానము, కావ్యాలంకార శాస్త్రపరిజ్ఞానము ఉండనక్కరలేదు. ఈ పరిజ్ఞానము వ్యుత్పత్తి అందురు. ఇది కవి చేసెడి విద్యాపరిశ్రమవల్ల కలిగెడు సంస్కారఫలము. ఇట్టి సంస్కారమున్న కవి వ్యుత్పన్నుడు. ఈ కథాభాగమును రచించిన కవ వ్యుత్పన్నుడా? లేక అవ్యుత్పన్నుడా? అని పరిశీలించినచో, అతడు పరిపూర్ణ విద్యాసంస్కారమున్న వ్యుత్పన్నుడని, ఈ గ్రంథమున గల పంక్తులు అడుగడుగునను ఉద్ఘోషించుచునే ఉన్నవి ఉదాహరణకు నలగామరాజు కొలువులో గాయకులును, నాట్యకత్తెలును నెరపిన కళాప్రదర్శనములు వర్ణింపబడిన ఈ దిగువ పంక్తులు చూడుడు:

"వింతగా గాయకుల్ వీణలుపూని
తంత్రులు బిగియించి తగశ్రుతిజేసి
సరిగమేళనమైన సప్తస్వరములు
ఆరోహణావరోహణ భేదములను
బహురాగ సంస్ఫూర్తి పట్టుగా చేసి
సంచారి సంస్థాయి సరస భావముల
మృదుతర శబ్దార్థ మిళితమైనట్టి
ఘనతరాలంకార గతి పరంపరలు

మూర్ఛనల్ మొదలైన ముఖ్య ధర్మములు
జంత్ర గాత్రంబుల జంటకావించి
ఎండిన మ్రాకులు ఇగురించునట్లు;
పాడిరి తమ తమ ప్రౌఢిమీరంగ;
చెలగి నాటక జనుల్ చేరి జోహారు
గావించి నిలిచిన కామభూవిభుడు
నవ్వుచు సెలవిచ్చె నాట్యంబుసేయ
వర మృదంగము లెస్సవాయించు మేటి
కుడి భాగమందున కుదురుగా నిలచె
తాళమానజ్ఞుడు తగ నెడమ దిశను
నిలచె నుత్సాహంబు నెమ్మదినిండ
ముఖవీణ వాయించు ముఖ్యుడొకండు
రాగజాలముబాడు రమణు లిద్దరును
నిండు వేడుకతోడ నిలిచిరి వెనుక
కంజలోచనయను ఘనమైన పాత్ర
మదను పట్టపుదంతి మంజులవాణి
భరత శాస్త్రోచిత ప్రాణముల్ పదియు
గలిగిన యక్కాంత కాంతు బాణంబు
వలె వచ్చి సభవారు వర్ణించి చూడ
నిలచి నాట్యమునకు నేర్పరియైన
వేత్రపాణికి తగ వినయంబు చూపి
అత డొసంగిన గజ్జె లతిభక్తితోడ
పదములగట్టుక పరిచ వన్నియల
కాసె గట్టిగకట్టి కడు జవం బమర
మద్దెల తాళంబు మధ్య నిల్చుండి
ఓర చూపుల ప్రభు నొయ్యన జూచి
సమ పాదయుతమైన స్థానక స్థితిని
అఖిల దేవతలకు నలరులతోడ
పుష్పాంజలి యొసంగి పూని నాట్యంబు
ఆ వెనుక సమకట్టి యతివలుపాడు
సంగీత నాదంబు సభయెల్ల గ్రమ్మ
కైముడి కట్నముల్ కనుపింపచేసి
వెలయంగ తొమ్మిది విధములైనట్టి
భూచారి నాట్యంబు పొందుగా సల్పి
పదహారు విధముల పరగిన యట్టి
ఆకాశచారియు సమరంగ నాడి
అంగ హారాఖ్యచే నమరు నాట్యంబు

విదితమౌ తొమ్మిది విధములనాడి
గతిచారి భేదముల్ కనుపడునట్లు
భ్రమణ సంయుత దీప్తి పటిమ మీరంగ
పాణి భేదంబులు పదభేదములును
స్థానక సంచయ సంయోగ మమర
పేరణి దేశిని ప్రేంఖణ శుద్ధ
దండికా, కుంటలి, తగు బహుచారి
సప్త తాండవములు సరవిప్రకటింప
సభవార లాశ్చర్య సంయుక్తులైరి;
తరువాత నిరుమేల తగుచెలు లమర
సంయుక్త సంయుతా సంయుత హస్త
నానార్థకంబులు నాట్య హస్తములు
శిరమును చూపులు చెక్కిళ్ళు బొమలు
దంతోష్ఠ కంఠముల్ తగచుబుకంబు
ముఖమును వక్షంబు మొదలుగానెన్న
లంగంబులారు ఉపాంగములారు
ప్రత్యంగ సముదయంబారును కూడ
ఎనిమిది పదియగు నెసగు నంగంబు
లమరంగ నభినయం బాశ్చర్యముగను
మాచెర్ల చెన్నుని మహిమంబు తెలుపు
ఆంధ్ర సంస్కృత భాషలమరు గీతముల
భావంబు లెస్సగ ప్రకటనచేయ
చూచి రంభాదులు చోద్యంబు నొంది
శిరసులు వంచియు సిగ్గునుచెంది
రప్పుడు భూమీశుడాదరం బొప్ప
వస్త్రభూషణములు వారలకిచ్చి
భట్టును రమ్మని పంపించెనంత."

ఇందులో కవి ప్రయోగించిన పారిభాషిక పదములేవియు వినికిడి మాటలు కావు. అవి అతని సంగీత నాట్యశాస్త్ర పరిజ్ఞానమునకు నిదర్శనములు. శాస్త్రపరిజ్ఞానము కలవాడగుటయేకాక నట్టువరాలు సభాప్రవేశము చేసినది మొదలు రాజుచే కానుకలు పొంది నిష్క్రమించు వరకును గల సంప్రదాయ మంతయు అనుభవపూర్వకముగా యెరిగిన కవి; అంతియే కాదు, అతడు భగవద్గీతోపనిషత్తును నిత్యపారాయణముచేసి ముఖస్థము చేసికొన్న నిష్ఠాపరుడు. తలచుకొన్నచో ఆ గీతలను చక్కని సరసమైన శైలిలో తెనిగింపగల సమర్థుడు కూడ.

"సర్వ ధర్మాన్ పరిత్యజ్య
మామేకం శరణం వ్రజ

అహం త్వా సర్వ పాపేః
మోక్షయిష్యామి మాశుచః"

అని శ్రీకృష్ణుడు అర్జునునకు చేసిన చరమోపదేశ శ్లోకమును ఈ కవి ఎంత సరసముగా తెనిగించెనో చూడుడు.

"సకల ధర్మంబులు సమ్మతి విడిచి
నా శరణందితే నను జేర్చికొందు
వగవకు మదిలోన వద్దు భయంబు
సత్య మీమాట .. ...."

ఈతని యుద్ధ వర్ణనలను, అందలి పలుకుబడులను పరిశీలించుచో ఇతడు భారతమును కూలంకషముగా పఠించి యందలి సొగసులను పుణికి పుచ్చుకొన్న గడుసరివలె తోచును. తిక్కన భారతమున పెక్కుచోట్ల, యుద్ధ రంగమున ప్రవహించు రక్తమును నదీ ప్రవాహముగా రూపించి వర్ణించెను

"కరి కళేబరములు ధరణీధరములు, దు
రంగగాత్రమ్ములు గ్రాహ సమితి
నరశరీరములు మీనములు, గొక్షేయక
క్షురికాదిశస్త్రంబు లురగకులము
రుధిరార్ద్రశిరములు రుచిర ప్రవాళముల్
ప్రేవుల ప్రోవులు ఫేనతతులు
నెత్తురు వెల్లువ నీళులు భూషణ
సోమాస్థిచయముల తుమురు లిసుక
గాఁగ నంబురాశి కరణి సంగ్రామ భూ
భాగమొప్పె మిగులభవ్య యోగనిద్ర
నున్న విష్ణునికిబాటియగుచు శోభిల్లె
నమ్మురారి యల్లుఁడందు"

ఈ కవి బాలచంద్రుని యుద్ధమున కార్యమపూడి యుద్ధక్షేత్రమును ఇట్లే ఉపమించుట అతని ప్రాచీన కావ్య పరిజ్ఞానమును ప్రస్ఫుటీకరించుచున్నది.

"సమర రంగముచూడ చక్కనైయుండె
ఘనమైన నెత్తురు కాల్వలై నిలిచె
తెగిపడ్డ గజములు దీవులై యొప్పె
నరకిన తురగముల్ నక్రములయ్యె
పొర్లాడు శిరములు బుద్బుద పటలి
టెక్కెముల్ గొడుగులు డిండీర వితతి
ఘనమైన యరిగెలు కచ్ఛపరాజి
మేటి నేత్రంబులు మీనవారంబు
దీర్ఘ శిరోజముల్ తీరెన నాచు

మెదడును మూంసంబు మించిన బురద
తరచైన యూెటలు దర్వీకరాశి
పొడియైన భూషణ పుంజంబు లెల్ల
సైకత నిచయంబు చాడ్పున నెసగె."

ఇతడు పూర్వకావ్య పరిజ్ఞానమున్నకవి మాత్రమేకాక సంస్కృత వ్యాకరణ మర్యాదను అకళించుకొన్న పండితుడని ఆతని సమాస రచనా పద్ధతి నిరూపించుచున్నది

"పూర్వ పర్వతశిరః పూజాగ్రమందు
ఘనతర మాణిక్య ఖచిత సౌవర్ణ
కుంభంబువలె నిబ్బి గురు తేజమునను
భానుండు దిక్కుల బ్రబలె నావేళ"

సూర్యోదయ వర్ణన సర్వకవి సామాన్యమయ్యును, ఇవి కవి సమయములు తెలిసిన కవి మాత్రమే వ్రాయదగిన పంక్తులనుటకు సందేహము లేదు ఇందలి దీర్ఘసమాస రచన అపండితుడు చేయవలసినది కాదు. అట్లే "పగలును రేలును బహుజాగ్రదాత్మ కాపాడుడీ మీరెకలవారు మాకు" అనెడి పంక్తులందలి 'బహుజాగ్రదాత్మ' అను సమాసమును సంస్కృత వ్యాకరణ సంప్రదాయ మెరిగిన పండితుడు మాత్రమే ఘటింపగలడు

కావున పిండితార్థ మేమనగా, కల్లు ప్రతిష్ఠ మొదలుకొని బాలచంద్రుని యుద్ధాంతమువరకును వ్రాసిన ఈ కవి సామాన్యుడుకాడు; పండితులలో లెక్కింపదగినవాడు సాహితీసంపన్నుడు; ఇట్టివాడు, రసవంతమైన ఈ కథా భాగమును రచించి ఆంధ్రలోక మున్నంతవరకును నిల్వదగిన తన యశస్సును, శ్రీనాధునకు ధారబోయవలసిన యవసరమేమి కలదు. గ్రంథ రచనము చేయుట కవి యశము నర్జించియే కదా! గ్రంధమునుబట్టి, హస్తగతమైన ఆ యశస్సును ఆతడు వదలుకొనుటకు కారణ మూహింపగలమా? ఒకవేళ శ్రీనాధుని పేరు పెట్టిన గ్రంధమునకు పేరు వచ్చునవి ఆతడు ఆ త్యాగము చేసెనందుమా, అది పొత్తుగా పొసగదు. పసలేని గ్రంధమునకు శ్రీనాధుని పేరు పెట్టినను పేరు రాదు; కాళిదాసు పేరు పెట్టినను లాభములేదు గ్రంధ యశము రచననుబట్టి వచ్చునుగాని, కవిపేరునుబట్టి రాదు. ఈ గ్రంధము కవి పేరు లేకపోయినను స్వతః ప్రభావము వలన, ఆంధ్ర మున్నంతవరకును జీవించి యుండును కాబట్టి యెవడో అనామకుడు వ్రాసిన ఈ గ్రంధమునకు శ్రీనాధుని పేరు పెట్టెననుట యుక్తి రహితమైన వాదము

అయినచో, ఉద్దండ పండితుడైన శ్రీనాధుడు, ఈ సుద్దుల కవిత్వము వ్రాసియుండునా?! యుగకర్తలని పేరువడిన తెలుగు కవులలో శ్రీనాధునివంటి జాతీయ కవి యింకొకడు లేడు. ఆతడాంధ్రదేశము నంతటిని పర్యటించి, రాజులను సందర్శించి, వారి సత్కారములను పొందెను. రాజమహేంద్రవరపు రెడ్డి రాజుల అస్థానముల చేరి, ఆ మంత్రికి భీమేశ్వర పురాణము కృతి యిచ్చినపుడు, తత్పురాణ రచనా వ్యాజమున, గోదావరీ మండలము నంతయు తనివితీర వర్ణించుకొనెను. ఆతడు కొండవీటి రెడ్డిరాజుల ఆస్థానమున విద్యాధికారిగా ప్రఖ్యాతి వహించెను ఈ పలనాటి

చరిత్రకు రంగమైన సీమ శ్రీనాథుని కాలమునాటి కొండవీటి రాజ్యములోనిది. సుప్రసిద్ధ చారిత్రక స్థలములైన గురజాల, మాచెర్ల, కార్యమపూడి, చంద్రభాగా నదీతీరము ఆతనికి సుపరిచితములు.

చిన్ననాడు తన కాశ్రయమిచ్చిన కొండవీటి రాజ్యములో నొక భాగమైన ఆ పల్నాటి సీమను, ఆ పల్నాటి యుద్ధమును, ఆ వీరుల శౌర్య పరాక్రమమును తలపునకు తెచ్చుకొని ఆవేశపూరితుడై ఆ గాధను నోరార సాధ్యమైనంతవరకు ప్రజల భాషలో పాడియుండును. స్వదేశములో తాదాత్మ్యముచెందిన కవి ఆ దేశ సౌభాగ్యమును మాత్రమేగాక ఆ దేశీయ వీరుల పరాక్రమములను కూడ కొనియాడుట సహజమే

ఈ పలనాటి వీరగాధా మహత్త్వమును శ్రీనాథుడు క్రీడాభిరామములో కూడ అభినివేశముతో ప్రదర్శించెను.

మ. *"ద్రుతతాళంబున వీరగుంభిత కధుం ధుంధుం కిటాత్కారసం*
*గతివాయింపుచు నాంతరాళిక యతి గ్రామాభి రామంబుగా*
*యతిగూడం ద్విపద ప్రబంధమున వీరానీకముం బాడె నా*
*కృత ప్రత్యక్షరముం గుమారకులు ఫీట్కారంబునన్ దూలఁగన్"*

సీ. *"గర్జించి యరసి జంఘాకాండ యుగళంబు*
*వీరసంబెట కోలవేయు నొకఁడు*
*ఆలీఢ పాదవిన్యాస మొప్పఁగ వ్రాలి*
*కుంతాభినయము గైకొను నొకండు*
*బిగువుఁగన్నుల నుబ్బు బెదురుఁ జూపులతోడ*
*ఫీట్కార మొనరించుఁ బెలుచఁ నొకఁడు*
*పటు భుజావష్టంభ పరిపాటి ఘటియిల్ల*
*ధరణి యాస్ఫోటించి దాటునొకడు*

గీ. *ఉద్ది ప్రకటింప నొక్కరుండోలవాఁడు*
*బయలు గుఱ్ఱంబు భంజళ్ళఁ బఱపునొకఁడు*
*కొడుము దాటింపుచును బెద్ద గొలువులోనఁ*
*బడఁతి పల్నాటి వీరులఁ బాడు నపుడు"*

పల్నాటి కథలో కోళ్ళపందెము నాడు బ్రహ్మనాయుడు తెచ్చిన కోడి పుంజు పానుగంటి కలుకోడి. దాని పేరు చిట్టిమల్లు. శ్రీనాథుడు పానుగంటి కలుకోడికి పరాక్రమమున తోడబుట్టు వనిపించుకొనదగిన కోడిపుంజునే క్రీడాభిరామము నందలి కోళ్ళ పందెములో ప్రవేశపెట్టెను!

ఆ వాక్య మిది:

"ఇదియు నొక్క సజీవ ద్యూతంబు. ఈ దురోదర క్రీడా విహారంబు నాదరింపవలయు. పానుగంటి కలుకోడి తోడబుట్టువులు వోని యీ జగజెట్టి కోడి పుంజుల యందు ప్రత్యేకంబు."

'పానుగంటి కలుకోడి' యనెడు ఈ నామసామ్యము యాదృచ్ఛికము కాదు ఆ రెండు గ్రంధముల కర్త ఒక్కడేయని చూపదగిన సాక్ష్యములలో బలవంతమైన సాక్ష్యము.

ఇంతేగాక, పలనాటి వీరులపై శ్రీనాథునకు గల గౌరవ భావమునకు నిదర్శనముగా క్రీడాభిరామము నందలి యీ క్రింది పద్యములు చూడదగును·

*"కులము దైవతంబు గురజాల గంగాంబ,*
*కలని పోతులయ్య చెలిమికాఁడు*
*పిఱికి కండలేని యరువది యేగురు*
*పల్లెనాటి వీరబాంధవులకు"*
*"కోలదాపునఁ ద్రిక్కటిఁ గూడియున్న*
*గచ్చు చేసిన చిత్రంపు గద్దె పలక*
*వ్రాసినారదె చూడరా వైశ్యరాజ!*
*శీలబ్రహ్మాది వీర నాసీర చరిత"*

"ఈ వీరపురుషులు మనకుఁ గార్యసిద్ధి సేయుదురుగాక పద పద మనుచుం గతిపయ పదంబు లరిగి......"

తన కథిమాన పాత్రమైన యీ పల్నాటి వీరుల వృత్తాంతమును శ్రీనాథుడు అంతఃప్రేరణ వలన, కావ్యవస్తువుగా స్వీకరించి యుండును అంతకు ముందే పేలవముగానున్న ఆ పదమును పిచ్చుకుంట్లు పాడగా విని, అది తనకు తృప్తినీయక పోవుటచే, అంతకంటె ఉదారమైన పద్ధతిలో ఆ వీర పురుషుల చరిత్రను సత్కావ్య రూపమున ప్రతిష్ఠింపవలయునని అతడు సంకల్పించి యుండును పురాణమువలె అతి విస్తృతమగు ఆ కథనంతను కావ్యముగా సంతరించుట కిష్టము లేకయో, లేక తీరిక లేకయో, ఆతడు మిక్కిలి రసవంతమైన యుద్ధ ఘట్టమును మాత్రమే చేపట్టియుండును. అయినచో, ఆతడా కథను పద్యకావ్యముగా గాక పదముగా నేల రచించెనని ప్రశ్నించుచో, దానికి సమాధానమిది· శ్రీనాథుడు అంతకుముందే ఈ కథను ప్రజలు పాడుకొనుచు వినుచు తన్మయులగుట కన్నులార జూచెను; దానిని అట్లే ప్రజలు పాడుకొని ఆనందింపవలెనని తలంచి, పద్యకావ్యమున కట్టి యోగ్యత లేదు కనుక, తానుగూడ, ఆ కథను పదరూపమున సంతరించి యుండును

శ్రీనాథుని యితర గ్రంథములలోని సంస్కృత సమాసములు, విశేషించి అతని పద గుంభనము, దుందుభిధ్వానము వలె వినిపించెడి శైలి యివేమియు నిందు కానరావేమను ప్రశ్నకు సమాధానమిది: శ్రీనాథుడు నైషధము, కాశీఖండము మొదలైన మహాకావ్యములను ప్రౌఢ సారత్వమునకు అలంకారములుగ నుండునట్లు తీర్చిదిద్ది రచించెను. తత్కావ్య ప్రయోజనమును పొందు పరిత్ప లోకము వేరు. ఇది అట్టిది కాక, పాడుకొనుటకు, చదువుకొనుటకు వీలుగా, సామాన్య ప్రజలకు ప్రీతికరముగా సులభశైలిలో పాండిత్య ప్రకర్ష కంటె, కవితా సౌందర్యమునకు ఎక్కువ ప్రాధాన్యమిచ్చి బుద్ధి పూర్వకముగా రచించిన పదము. అది మార్గకవిత్వము, ఇది దేశి కవిత్వము. అనగా శ్రీనాథుని పద్య ప్రబంధముల లక్షణము వేరు; ఈ పద ప్రబంధ లక్షణము వేరు; కాని శ్రీనాథుడు ఎంత తేలికగా వ్రాయతలపెట్టినను "ఇవి ఈతడు వ్రాసియుండునా?" అని సందేహము కలిగించు పేలవమైన కొన్ని పంక్తులు ఈ గ్రంథమున లేక పోలేదు నా ఉద్దేశములో, ఈ పేలవమైన పంక్తులు

పిచ్చుకుంట్ల నోటబడి అసలు రూపమును పోగొట్టుకొన్నవి కావచ్చును; లేదా అవి మూలగ్రంథమున కొన్ని పంక్తులు లుప్తము కాగా ఇతరులు పూరించినవి కావచ్చును. దీనికి ఇదమిత్థమని సమాధానము చెప్పుట కష్టము

కల్లు ప్రతిష్ఠ అవతారికయందు శ్రీనాథుడు తాను "చెన్నకేశవ పాదసేవారతు"డ నని చెప్పుకొన్నట్లు కలదు. శ్రీనాథుడు శివభక్తి పరాయణుడు; అతడే దీనిని రచించియున్నచో, ఇట్లు చెప్పుకొనునా యనెడి ఆక్షేపణయు యుక్తి యుక్తముగా తోచదు. ఏమనగా, శ్రీనాథుడు ఆ అవతారికయందే "శ్రీకంఠు పరమేశుశివు నాత్మదలచి" అని తన శివభక్తిని ప్రకటించుకొనియెను. అంతేగాని చెన్నకేశవు నాశ్రయించి, శివుని విడిచి పెట్టలేదు. వాదమునకు అది సరియే కాని శివభక్తి పరాయణుడైన శ్రీనాథుడు తాను "చెన్నకేశవ స్వామి పాదసేవా రతుడనని యేల చెప్పుకొనవలయును?" అని ప్రశ్నించుచో, చెన్నకేశవుడు పల్నాటి వీరులకు ఇష్టదైవము ఆ దేవుని సంస్మరింపకుండ, పల్నాటి వీరుల కథను వ్రాయుట పొసగదు. అంతియేకాక, శ్రీనాథుడు, విష్ణు నామమును స్మరింపనేరని వీరశైవుడు కాడు, తిక్కన, పోతనలు శివపూజా ధురంధురులయ్యును ఎట్టి శివకేశవుల భేదమును పాటింపని అద్వైతులో శ్రీనాథుడుకూడ అట్టివాడే భీమేశ్వర పురాణములో విష్ణు క్షేత్రమైన సర్వపుర వర్ణనమును పరికించుచో, అతడు వైష్ణవుడేమోయను భ్రమ కల్గును. అంత దూరమెందులకు, హరవిలాసమున శివుని లీలలను వర్ణించుట ఉపక్రమించిన ఈ కవి కృత్యాది మంగళాచరణ పద్యమున కంచి వరద రాజేశ్వరస్వామిని (విష్ణువు) స్తుతించెను.

"శ్రీమహిళా పయోధర హరిన్మణిహారము హస్తి భూధర
స్వామి పయోజ సంభవుని జన్నముఁ గాచిన వేల్పు దేవతా
గ్రామణి కంచి శ్రీ వరదరాజు మనోహర పుణ్యకోటి వీ
థీమణిమండితుం డవచిదేవయ తిప్పఁ గృతార్థుఁ జేయుతన్."

హరవిలాసముననే కాదు, నైషధముననను, మంగళాచరణ పద్యము విష్ణు పరముగానే రచింపబడెను. చూడుడు

శా॥ "శ్రీరామా కుచమండలీ మృగమద శ్రీగంధ సంవాసిత
స్ఫారోదార భుజాంతరుండు, ధరణీ సంశ్లేష సంభావనా
పారీణుండు, కృతార్థుఁజేయుఁ గరుణా పాథోధి పద్మాక్షు డిం
పారన్ మామిడి పెద్దమంత్రి సుతు సింగామాత్య చూడామణిన్"

శ్రీనాథునకు శివకేశవభేదము లేదని సమర్థించుటకు ఇంకొక దృష్టాంతము కలదు. కాశీఖండమున శివశర్మోపాఖ్యానమునందు నూట యెనిమిది శివకేశవుల పర్యాయ నామములతో ఒక స్తోత్రము రచింపబడినది ఆ స్తోత్రమును దాని ఫల శ్రుతిని ఇందుదాహరించుచున్నాను:

వ॥ "అదికాలంబునం గృతాంతుడు నిజ కింకరులతో నిట్లనియె:

సీ॥ గోవింద! భూతేశ! గోప! గంగాధర!
చాణూరమర్దన! చండికేశ!
కంసప్రణాశన! కర్పూరగౌర! గో
పీపతి! శంకర! పీతవసన!
గిరిశ! గోవర్ధనోద్ధరణ! బాల మృగాంక
వర్ణ! మాధవ! భవ! వాసుదేవ!
విషమేక్షణ! మురారి! వృషభధ్వజ! హృషీక
పతి! భూతపతి! శౌరి! ఫాలనేత్ర!

గీ॥ కృష్ణ! హర! గరుడధ్వజ! కృత్తివసన!
కల్మషారి! గౌరీపతి! కమఠ! శూలి!
యనుచుఁ బరియింతురెవ్వరా ఘనులు మీకు
వందనీయులు చెనకంగ వలదు వారి.

సీ॥ హరి! రజనీశ కళావతంస! రమేశ్వ
ర! పినాకపాణి! శ్రీరామ! భర్గ!
యనిరుద్ధ! శూలపాణి! నృసింహ! త్రిపథగా
ర్ద్ర జటాకలాప! మురహర! యీశ!
రాఘవ! యురగాభరణ! పద్మనాభ! యు
గ్ర! మధుసూదన! పినాకపతి! యాద్య!
ప్రమథాధినాథ! నారాయణ! మృత్యుంజ
య! పురుషోత్తమ! త్రిదశైకనాథ!

గీ॥ యచ్యుతా! కామ శత్రువ! యబ్జపాణి
దిగ్వసన! చక్రపాణి! భూతేశ! యనుచుఁ
దలఁతు రెవ్వారు వారలుత్తములు భువన
పావనాత్మకు లందఱు ప్రభులు మీకు.

సీ॥ బ్రహ్మణ్యదేవ! శర్వ! ముకుంద! విశ్వేశ్వ
ర! సనాతన! త్రిణేత్ర! రావణారి!
శ్రీకంఠ! ధర్మధురీణ! శంభువ! కమ
లాధీశ! యీశాన! యదుపతి! మృడ!
ధరణీధర! హర! యంధకహర! శార్ఙ్గపా
ణి! పురారి! విష్ణువ! నీలకంఠ!
వైకుంఠ! దేవదేవ! మధురిపుఁడ! త్రిలో
చన! కైటభ రిపుండ! చంద్రచూడ!

గీ॥ కేశినాశ! గిరీశ! లక్ష్మీపతి! త్రిపు
రారి! వసుదేవ సూనుఁడ! త్ర్యక్ష! యనుచు
జపము చేయుదు రెవ్వరవ్విపుల పుణ్య
ఘనులఁ గదిసినప్పుడ మీకుఁగల్ల వచ్చు.

వ॥ మఱియు వినుండు. శ్రీకాంత! శివ! యసుర నిబర్హణ! మన్మథ రిపుడ! జనార్దన! ఖండపరశుడ! శంఖపాణి! శశిశేఖర! దామోదర! రిపుసూదన! యంబుధర నీల! స్థాణువ! యానందకంద! సర్వేశ్వర! యను నీదివ్య నామంబులు భావించు కృతార్థులు మీకు మాననీయులు సుండియని యవ్విధంబున నంతకుండు కింకరవర్గంబు ననుశాసించె. ఈ హరిహరనామంబుల యష్టోత్తర శతంబు వినినఁ బఠించిన జనులకు నారోగ్యైశ్వర్యంబులు సంభవించు"

ఈ స్తోత్రమును అద్వైతి తప్ప, కేవల శైవుడుగాని, కేవల వైష్ణవుడు గాని వ్రాయలేడు. శ్రీనాథుడు కేవల శైవుడే యైనచో పై స్తోత్రమందలి నూట యెనిమిది నామములలో విష్ణు పరములైన ఏబదినాలుగు నామములను నోటపలుకలేడు. ఆ కాశీఖండముననే శివకేశవుల అభేదభావ నిరూపకములైన మహావాక్యములు మరికొన్ని కలవు కావున శ్రీనాథుడు కేవల శైవుడనుకొనుట మతిలేనిమాట

శ్రీనాథుని పలనాటి వీరచరిత్ర కర్తృత్వమును సమర్థించుటకు అతని మతము గూర్చి ఇంత దూరము చర్చించవలసి వచ్చినది

పూర్వోదాహృతమైన "సకల ధర్మంబులు సమ్మతి విడిచి నా శరణందితేనను జేర్చుకొందు. వగవకు మదిలోన వద్దు భయంబు, సత్యమీ మాట" అను పంక్తులకు మూలమైన గీతా శ్లోకముతో పోల్చిచూచినచో, ఈ అనువాదము శ్రీనాథునిదే అని అంతరాత్మ ప్రబోధించును. సంస్కృత శ్లోకమును ఎంత గంభీరార్థము, జటిల శబ్దములు కలదానినైనను, సరళమైన తెలుగు పద్యమున ఇముడునట్లు అనువదించెడి నేర్పు శ్రీనాథునకు కలదు ఆయన ఈ ప్రజ్ఞను నైషధాంధ్రీకరణమున బహుధా ప్రదర్శించెను. ఆయన అనువాద పద్ధతిని గురించి పరిశ్రమ చేసిన పండితులు ఈ పంక్తులు శ్రీనాథునివే అని చెప్పుటకు సందేహింపరు.

సాధారణముగా తెలుగు కవులు, విశేష్యమునకు విశేషణమును కూర్చవలసి వచ్చినపుడు విశేషణమును ప్రథమా విభక్త్యంతముగా నుంచి దానికి "అగు" అను క్రియాజన్య విశేషణమును జేర్చి విశేష్యముతో పొందింతురు కాని శ్రీనాథుడు సంస్కృత కవులవలె తరచుగా విశేష్య విశేషణములను ఏక విభక్తిలోనే నిల్పుచుండును; క్రీడాభిరామము శ్రీనాథకృతమే అని ఋజువుచేయుటకు శ్రీ ప్రభాకరశాస్త్రిగారు చెప్పిన తిరుగులేని యుక్తులలో ఈ విషయమును పేర్కొని యున్నారు విశేషణ ప్రయోగములో శ్రీనాథునిది యింకొక విచిత్రమైన పోకడ కలదు

తెలుగు కవులు ఒక వాక్యమున విశేష్యమునకు విశేషణము వేయవలసి వచ్చినపుడు, ఆ విశేషణ వాక్యమున సమాపక క్రియతో పూర్తిజేసి, విశేష్యముతో పొందింతురు. కాని శ్రీనాథుడు అసమాపక క్రియలతో అనేక వాక్యములను మాలగా గ్రుచ్చి, ఆ విశేష్యమును అలంకరించుటకు ముచ్చటపడును దీనికొక ఉదాహరణముగా, కాశీఖండమునుండి ఈ పద్యమును పేర్కొనవచ్చును

సీ. "దుర్భిక్ష దోషంబుదోర కొన్నఁగడపని
కడపని గృహసూతకంబునందు
నింటఁ బీనుఁగువోయె నేనియుఁగడపని
కడపని ముక్కిడి గవిసెనేని

కువలయేశుఁడు దండుగులుగొన్నఁ గడపని
కడపని భవనంబుగాలెనేని
పితృ కార్యవిధి సమీపించినఁ గడపని
కడపని ముట్టంటు గవిసెనేని

గీ. వేళగాకున్నఁ గడపని వేలుపులకు
మీఁదువోకున్నఁ గడపని మిన్నకెట్లు
గడిపిరింటింట నీకాశి కాపురమునఁ
బుణ్యగేహిను లిది మహోద్భుతము గాదె?"

ఇట్లే బాలచంద్రుని యుద్ధమున, కవి, మాంచాల కురులను వర్ణించుచు విశేషణ వాక్యములను పొందించిన పద్ధతి శ్రీనాధుని తలపించుచున్నది.

"బంభరచయమును భయమొందజేయు
కాటుక కాకచే కందగాజేయు,
చీకటి గుహాలందు జేరగాదించు
కాలాంబుదంబుల గట్టుల జేర్చు
దీర్ఘమై నునుపులై తేరైన కురులు."

ఈ కారక వైచిత్రి తెలుగున ఒక్క శ్రీనాధునిదే; కనుక, పైని చెప్పిన కారణములన్నిటిని బట్టి, పల్నాటి వీరచరిత్రను అతడు వ్రాసి యుండునని భావించుట దోషముకాదు; ఏ నాటికేని భారద్వాజ గోత్రుడు, కవి సార్వభౌముడు ఇంకొక శ్రీనాధుడు, పరిశోధనలవల్ల బయటపడు వరకు, శృంగారనైషధకర్త శ్రీనాధుడే పల్నాటిచరిత్రకర్తయని అనుకొందము.

పలనాటి వీరచరిత్రలో బాలచంద్రుని యుద్ధము వస్తుతః రసవంతమైన ఘట్టము. ఆ భాగము శ్రీనాధుడు కావ్య వస్తువుగా స్వీకరించి నిర్వహించుటచే రసవత్తరమైనది. ఈ భాగమే ఆంధ్ర కవిత్వశాఖలో దేదీప్యమానమై వెలుగొందుచున్నది ఇక ఈపద కవిత్వమును గూర్చియు, అందలి అంతశ్శాఖలను గూర్చియు, వాటి తారతమ్యముల గూర్చియు వివరింతును ఏ వాఙ్మయమునందైనను ఈ పదకవిత్వమే పద్య కవిత్వముకంటె ముందు పుట్టి పెరుగుననుట బహు పండితాంగీకృతమైన సిద్ధాంతము చిత్ర విచిత్ర కార్యకమనీయ పర్వతారణ్యమయమైన ప్రకృతిలో పుట్టి పెరిగిన ప్రాకృతజీవియగు ప్రాక్తన మానవుని హృదయమున సంతోషమయమో, దుఃఖమయమో యగు ఒకానొక భావము జనించి, పరవశుని చేయగా అతని నోటివెంట అప్రతర్కితముగా, ఒక పాట వ్యక్తమై యుండుననియు, ఆవేశపూరితుడై అతడా పాటను, చిందులు త్రొక్కుచు పాడియుండుననియు, ఆడుచు, పాడిన – ఆ పాటకు 'ఆట–పాట' లేక 'నృత్తగీతము' (Ballad-dance) అని పేరు పెట్టవచ్చుననియు, అదియే కవిత్వమునకు శ్రీకారమని ఈ సిద్ధాంతము అనియు Moulton అను ఆంగ్ల విమర్శకుడు ఒక సిద్ధాంతము నెలకొల్పెను

అసలు ఒక వ్యక్తి, పరవశ స్థితియందు చేసెడి ప్రసంగము కాని, పాడెడు పాటగాని, శరీరావయవ విక్షేపముతో కూడి, అభినయ పూర్వకముగానే, వ్యక్తమగు

చుండును. భావోద్వేగ మనునది, ఒక్క హృదయమును మాత్రమే కదిలించిన అది శరీరము నంతటిని ఊగించి వేయును.

ఈ 'ఆట – పాట'లో మూడు భిన్న కళాంశములు కలవు. "అడుగు వేయుట, రాగము తీయుట, మాట పలుకుట." శాస్త్రపరిభాషలో ఈ మూడింటికిని నృత్తము, గీతము, శబ్దము అని పేరు ఈ మూడు అంశములును మూడు శాఖలుగా కాలక్రమమున నాట్యము, సంగీతము, పద్యము అనెడి కళలుగా పరిణమించి దేని రాజ్యమును అదియే యేలుకొనసాగెను. కాని ఈ మూడింటికిని జన్మ స్థాన మొకటియే. అవి స్వతంత్ర నిరూపణార్థము ఎంత విడిపోయినను పరిణత సంపూర్ణ స్వరూపములలో మరల ఏకీభవించుచుండును. కవిత్వము గీతముతోడి సంబంధమును విడనాడజాలదు. అట్లే సంగీతము శబ్దముతోడి పొత్తును విడిచి పెట్టదు. మరల నాట్యము, సంగీతముతోడి చెలిమి చేయుచునేయుండును. పద్యము తొలినాటి కవిత్వమునకు సాహచర్యము నెరపిన నృత్తగీతములలో నృత్తమును పూర్తిగా విడిచిపుచ్చ గలిగినను గీతిని మాత్రము పూర్తిగా గాదనలేకపోయెను. పద్య కవితా రాజ్యములో నృత్తమునకు ప్రవేశము లేకపోయినను గీతికి మాత్రము అప్రత్యక్షమైన అధికారము కొంత - కలదు. గీతిగతమైన యే లయ నిబద్ధత కలదో అదియే పద్యగతమైన ఛందస్సు కనుక ఈ మూడు కళలకు, తక్కిన రెండింటిలో ఏదో ఒకదాని సాహచర్యము విడరాని బంధముగా ఉండుచునే యుండును. కాని తక్కిన రెంటి పొత్తును విసర్జించి తనకు తానై స్వతంత్రముగా వర్తించగలనని చూపుటకే వాఙ్మయమున వచన కవిత్వమును, సంగీతమున జంత్రవాద్యమును, నాట్యమున మూకాభినయమును వెలసినవి. ఈ మూడును తమ రాజ్యము తామే సర్వాధికారము నెరపుటకై అవి చేయు కృషి యెంత దూరము పోవునో చూపుటకు మాత్రమే ఈ విషయమును స్మరించి విడిచితిని.

ఏ గీతముకైనను, ప్రధాన లక్షణము లయ నిబద్ధత; ఊరక రాగము తీయుట గీతము కాదు. రాగతాళయుక్తముగా పాడినదే గీతము. పాట ఎప్పుడును లయబద్ధముగానే యుండును. కావుననే గీతికి లయనిబద్ధత ప్రధాన లక్షణమైనది. గీతి గతమైన లయనుబట్టి ఛందస్సు ఏర్పడినది. ఈ ఛందస్సు కతముననే పద్యపఠనవేళ మధురమైన ఒక గీతి విశేషము, వచన పఠనముకంటె భిన్నమైనది, వ్యక్తమగుచుండును. ఇది పద్య కవిత్వముతో గీతికి గల అప్రత్యక్ష సంబంధము. అట్లుగాక గీతికి ప్రత్యక్షాధికారమే యిచ్చిన కవిత్వము పదకవిత్వము. పద్యజాతికిని, పదజాతికిని ముఖ్యమైన భేదమిదియే

ఈ పద కవిత్వమున శబ్దమునకెంత ప్రాధాన్యమున్నదో గీతికిని అంతే ప్రాధాన్యమున్నది. అనగా ఇందు సుందరశబ్దరచనతోపాటు మధురమైన పాటయును కలిసియుండును. ఈ జాతిలో ఒక శాఖ కవిత్వముకంటె గానముననకే ఎక్కువ ప్రాధాన్యమిచ్చి గేయకవిత్వమనిపించుకొనెను. ఆ గేయకవిత్వములో శాస్త్ర నిర్దిష్టమైన రాగ, తాళ, స్వర ప్రశస్త రాజ్యాంగముల ప్రాధాన్యములతో ఒక అంతశ్శాఖగా గాన కళాకోవిదుల విద్యగా వెలసినది. అదియే సంగీతము. త్యాగరాజ కృతులు మున్నగునవి ఈ శాఖలోనివి. ఇంకొక గేయకవిత్వశాఖ, ఈ కృతులవలె శాస్త్రీయసంగీతముతో పాడుటకు అనువైనదైనప్పటికి అభినయార్థముద్దేశింపబడి, నర్తన

ప్రాత్రముల వశమైనది. జావళీలు, పదములు మొదలైన శృంగారాత్మకమైన రచనలు ఈ శాఖలోనివి. మరియొక గేయకవిత్వ శాఖ సంగీత విద్యా నైపుణ్యమును, అభినయ విద్యా నైపుణ్యమును లేని సామాన్యులు సైతము, కొంచెము కంఠమాధుర్యమున్నచో పాడుకొని ఆనందించుకొనుటకు వీలుగా పాటలుగా వర్ధిల్లినది. మన ముత్తైదువులు పాడు పెండ్లి పాటలు, మంగళహారతులు ఈ జాతిలోనివి. వీటిని బోలినవే భజనకీర్తనలు కూడ.

ఈ పదకవిత్వమున ఒక శాఖ గీతిని అంగీకరించియు గేయకవిత్వమని అనిపించుకొనక, కవిత్వాంశమునకే ఎక్కువ ప్రాధాన్యమిచ్చి జాతివాచకమైన పదకవిత్వము పేరనే నిల్చియున్నది. పలనాటి వీరచరిత్ర, కాటమరాజు కథ మున్నగు కావ్యములు ఈ శాఖలోనివి. ఈ కావ్యశాఖావర్తనము భావనా ప్రధానమైన సారస్వత లోకముననేకాని, రాగతాళ ప్రధానమైన సంగీత కళాజగత్తున కాదు; అభినయ ప్రధానమైన నాట్యజగత్తున అంతకంటేకాదు. కాబట్టి పదకవిత్వములు నానా విధములైన గేయశాఖలను విడిచిపెట్టగా మిగిలిన భాగమంతయు సారస్వత లోకముననే చెందును. ఈ పదములలో చిన్నమకథ, కామమ్మ కథ, లక్ష్మమ్మ కథ మున్నగునవి సాంఘికములు; బొబ్బిలి కథ, కాటమరాజు కథ, దేశింగరాజు కథ, పలనాటి కథ మొదలగునవి చారిత్రకములు.

## శ్రీనాథుని శైలి

ఆంధ్రమున మొదటి నుండియు నక్షర రమ్యత సాధించిన కవివర్గ మొకటియు నర్థగౌరవమును పాటించిన కవివర్గ మింకొకటియుగా రెండు భిన్నశాఖలు వెలసినవి. మొదటి వర్గము వారాశించినది శయ్యాసౌభాగ్యము. దానికి నన్నయభట్టు ఆది గురువు దానిని నాచన సోముడు కొంత పరిపోషించెను శ్రీనాథుని చేతిలో నిది పరిణతిఁజెందెను. సంస్కృతమున నిరుపమాన శయ్యావైచిత్రికి పేరువడిన భట్ట బాణాదులను భక్తితో గొలుచుటయు, ననుకరించుటయు నాత్మ ధర్మములుగా వర్తించిన శ్రీనాథుడు తెనుగున ఆ అక్షర రమ్యశైలిని పరిణతి జెందించుట వింతకాదు; దుష్కరమును గాదు. ఉత్తరకాలమున నావిర్భవింపబోవు చిత్ర విచిత్రాలంకారికమైన ప్రబంధరీతికి శ్రీనాథుడే సూత్రధారుడయ్యెను. ఎల్లన ప్రబంధ కవుల కొసగిన భిక్ష వర్ణనాత్మకమగు శైలిమాత్రమే. ఆయన అలంకారిక రీతిని మాత్ర మొసగలేదు ఈ భిక్ష పెట్టినవాడు శ్రీనాథుడు కావుననే ప్రబంధ కర్తలకు సన్నిహిత గురువయ్యెను 'వచియింతు వేములవాడ భీమన భంగి' అన్న పద్యములో తనవిగా పేర్కొన్న 'ఉద్దండలీల, ఉభయ వాక్ప్రౌఢిమ, రసాభ్యుచిత బంధనము, సూక్తివైచిత్రి' అను గుణములు వీని యందు అన్వర్థము లనుటకు సందియ మేమియును లేదు.

ఉత్తర కాల ప్రబంధ కర్తలలో పెక్కురు శబ్ద సంసేవనమే శిల్పమనుకొని అర్థ గౌరవమును గొంచెపఱచుటయు, వర్ణనాంశమే కవిత్వ మనుకొని వస్తు ప్రాధాన్యమును మఱుగు పఱచుటయు కారణములుగా నీ గురువు లిద్దరును (శంభుదాస శ్రీనాథులు) జేసిన సృష్టికి దుర్విపాకము తటస్థించినది. శ్రీనాథుని రచనలలో క్వాచిత్కముగా నెచటనో తప్ప శయ్యా సౌందర్యార్థ గౌరవములు రెండును సమ ప్రాధాన్యమునే కలిగియుండును. గంభీరములును రమణీయములునగు నర్థములతో పాటు జటిలములును

సరళములునైన శబ్దములను జోడించుకొనుచు వచ్చు నేర్పు తెనుగు కవులలో శ్రీనాధునకువలె నెవ్వరికిని లేదు. అతని వాక్యములకు జిగియు బిగువును రెండును గలవు. ఈ జిగి బిగువుల కల్మి నేప్రకరణమైనను వెలితిలేక—పండిన వరిచేను గాలికి బోలె తూగుచుండును ఈ తూగు ఒక ముఖమునకు వంగుటేకాక ఉభయ ముఖముల నడచుట యగుటచే సమతయనెడు గుణ మప్రయత్న సిద్ధమయినది. ఒక్కొక్కచో వాక్య సముదాయము, యూధపతి ననుగమించు మాతంగయూధ గమనమువలె నాదరణీయమైన రీతిని బ్రదర్శించును.

ఛందఃప్రయోగములో నాతని చేతియందు సిద్ధి పొందినది—సీస పద్యము. పయిని బేర్కొన్న యీ జిగి, బిగువు, తూగు, సమత, రీతి మొదలగు గుణ సముదాయ మంతయు నించుమించుగ సీసముననే యేకత సిద్ధి పొందినవని చెప్పవచ్చును. కందమునకు తిక్కనవలె సీసమునకు శ్రీనాధు డధిష్ఠాన దేవత. ఎట్టి క్లిష్టార్థమునైనను సీస పాదమునకు దగినట్లుగా మలచుట యీ కవికి చిన్ననాడే యలవడిన సహజశక్తి కావుననే పాషాణములవంటి మయూరుని స్రగ్ధర లీసీసపద్యపు మూసలో మైనమువలె కరిగి యాతని కిచ్చవచ్చిన రూపుదాల్చినవని కాశీఖండ ప్రకరణమున నంటిని. సీస పాదోచితములైన యింద్రగణము లాఱింటిలో కొన్నింటి కయిదు మాత్రలును కొన్నిటికి నాల్గు మాత్రలును గలవు. ఛందశ్శాస్త్రమునుబట్టి అవి అన్నియు నొకే వర్గమున జేరినను, వాని అంతరమును మాత్రము శ్రవణేంద్రియము గ్రహించుచునే యుండును. ఆ గణముల పొత్తు సముచితముగ లేనప్పుడు ఛందస్సు తప్పకున్నను, లయ తప్పుటమాత్రము నిజము. లయానుసార మా గణములకు పొత్తు కుదిర్చిన మేటి కవి శ్రీనాధుడు. మఱియు 'యత్ర లయస్తత్ర యతిః' అను శాస్త్రోక్తినిబట్టి యతిస్థానమున పదము విఱిగిననే తప్ప, విశ్రాంతి యనెడి సార్థకతయు నుండదు; లయకు శుద్ధియు నేర్పడదు. ధారాశుద్ధి యను నెపమున తెలుగు కవులీ న్యాయమునే విస్మరించిరి. శ్రీనాధుడు మాత్రము తన సీసపద్యములలో నీ ధర్మమును సాధ్యమయినంత వరకు పాటించెను. ఉత్తరకాల ప్రబంధములలో మనకు మురిపెము గొలుపు సీసపద్యము లన్నియు శ్రీనాధుని సీసముల ఛాయలే

శ్రీనాధుడు హర్షనైషధమును తెనిగించి రాబోవు ప్రబంధములకొక యొఱవడి పెట్టెను. మఱి ప్రబంధముల కుచితమైన యాలంకారిక శైలిని ప్రసాదించెను కాని తానై శుద్ధ ప్రబంధ మనిపించుకొనదగిన యే కావ్యమును వ్రాయలేదు. అసలు అతని ప్రతిభ పౌరాణికమేగాని నాటకీయమునుగాదు; ప్రాబంధికమును గాదు. అందుచేతనే పెక్కుచోట్ల వస్తు సన్నివేశమర్యాదను మఱచిపోయి అనవసరములైన పౌరాణికోపన్యాసములు చేయును. హరవిలాసము యొక్కయు శివరాత్రి మాహాత్మ్యము యొక్కయు తుది ప్రకరణములు పురాణోచితములేగాని ప్రబంధోచితములు కావు.

ఇది యిట్లుండగా శ్రీనాధుడు తన శైలిని గూర్చి భీమేశ్వర పురాణమున—

> "ప్రౌఢిఁ బరికింప సంస్కృత భాషయండ్రు
> పలుకు నుడికారమున నాంధ్రభాష యందు
> రెవ్వరేమన్న నండ్రు నాకేల కొఱఁత
> నా కవిత్వంబు నిజము కర్ణాట భాష"

అని చెప్పుకొనుటను బట్టియు, చాటువులలోని–

కుళ్ళాయించితిఁ గోకజుట్టితి మహాకూర్పాసముం దొడ్గితిన్
వెల్లుల్లిన్ దిలపిష్టమున్ మెసవితిన్ విశ్వస్త వడ్డింపఁగాఁ
జల్లా యంబలి త్రావితిన్ రుచులు దోసంబంచుఁ బోనాడితిన్
దల్లీ! కన్నడరాజ్యలక్ష్మి! దయలేదా నేను శ్రీనాథుఁడన్!

అను పద్యములో "తల్లీ కన్నడ రాజ్యలక్ష్మీ!" అని సంబోధించుటను బట్టియు ఈయన కర్ణాటకుడనియు, వారి పూర్వులేనాడో తెలుగు దేశమునకు వలస వచ్చి యుందురనియు, ఆ కన్నడ రాజ్యలక్ష్మిని 'తల్లీ' అని సంబోధించుటయు, తన భాష కర్ణాటక భాషయని చెప్పుకొనుటయు అభిజనాభిమానము చేతనే యనియు ఈ దేశమున ఒకప్పుడు దుర్వాదము వెలసినది ఈ వాదము సహింపలేని విమర్శకులు "కర్ణాట రాజ్యముతో పూర్వ పరిచయమున్న శ్రీనాథుఁడు, దారిద్ర్య పీడితుడై, అపర వయస్సున మరల దేశ సంచారము చేయవలసి వచ్చినపుడు, కన్నడ భూమికిపోయి, కన్నడ రాజ్యలక్ష్మిని సంబోధించుచు తనను ఎరుక పఱచుకొన్న ఆత్మ దైన్యపూరితమైన పద్యమిది" యని సమాధానము జెప్పిరి. అది యట్టిది కావచ్చు, లేదా ప్రౌఢ దేవరాయలను దర్శించబోయిన కాలములోనే ఎన్ని నాళ్ళకును రాజ దర్శనము లభింపక ఇక్కట్లు పడుచు, ఆ రాజ్యలక్ష్మితో మొఱపెట్టుకొన్న పద్యమైనను కావచ్చును. "తల్లీ!" యని సంబోధించినంత మాత్రమున ఆ దేశము అతని స్వదేశమనెడు యర్థము రానక్కరలేదు. కాని "నా కవిత్వంబు నిజము కర్ణాటభాష" అను వాక్యమునకు సరియైన తాత్పర్యము ఇంత వరకు ఎవరును చెప్పలేదు. దీనిని గురించి నాకు తోచిన అభిప్రాయమిది:

ఇచ్చట కర్ణాటభాషయనగా, 'కర్ణాటశైలి' అని యర్థము. ఒక కవి రచనను గురించి, వాని భాష కఠినముగా ఉండును; వాని భాష రసవంతముగా ఉండును. అని మనము చెప్పునపుడు, అచ్చటి ఆ కాఠిన్యముగాని, రసవత్తగాని భాషకు సంబంధించినది గాదు; శైలికి సంబంధించినది; కనుక అక్కడ 'భాష'కును శైలి యనియే అర్థము. అయినచో 'నా కవిత్వంబు నిజము కర్ణాటశైలి' అని శ్రీనాధుడు ఎందుకు అనలేదని అడిగినచో, దానికి కారణమిది: ఈ 'శైలి' అను పదము మనము ఆంగ్లభాషలో Style అను దానికి పర్యాయపదముగా కల్పించుకొన్నదే. కాని మన భాషలోని శబ్దము కాదు ఇది మన అలంకార శాస్త్రములో ఎచ్చటను లేదు. ఈ 'శైలి' శబ్దమునుగూర్చి నన్నయ ప్రకరణములో "నన్నయ శైలి – ఆత్మీయత" అను శీర్షిక క్రింది కొంత చర్చించితిని. మన పూర్వు లెవ్వరును దీనిని వాడలేదు. శైలికి సన్నిహితమైన అర్థముగల శబ్దములు రీతి, శయ్య అనునవి కలవు. ఆ శబ్దములనైనను, విశేషార్థములో వాడెదరు. కాని సాధారణార్థములో వాడరు. కావుననే శైలీ శబ్దము మనకు నూతన సంపాదనము. శ్రీనాధుడు ఇయ్యెడ భాషా శబ్దమును లక్షణార్థములోనే వాడెను వాచ్యార్థమున కాదు.

శ్రీనాధుని పద్యములోని 'కర్ణాట భాష' అను పద్యమునకు వాచ్యార్థమే ఉన్నదనుకొన్నచో అతడు వ్రాసిన అన్ని గ్రంథములలో ఒక్క వాక్యమైనను కన్నడ

భాషలోనిది చూపగలమా? నన్నెచోడునివలె, కన్నడ పదములనైనను విచ్చలవిడిగా వాడని శ్రీనాధుడు "నాది కర్ణాటభాష" అని వాచ్యార్థములో ఎట్లులనగలడు?

అయినచో కర్ణాటక శైలి అనగా అర్థమేమి? సంగీతములో* మార్గ సంగీతము, దేశి సంగీతము అను రెండు భేదములున్నవి. మొదటిది శాస్త్ర నిబద్ధమై నిర్దుష్టమైన సంగీతము. రెండవది శాస్త్రీయము కాకపోయినను, ఆయా ప్రాంతములందలి జనులను రంజింపజేయు ప్రజా సంగీతము. ఈ రెండును విభిన్నములైనను, ఒక దాని ప్రభావ మింకొక దానిపై నెరపు కొనుచునే యుండును. శాస్త్రీయ సంగీతములోని ఫణితులు దేశిలోనికి ప్రవేశించుట, దేశి సంగీతములోని ఫణితులు శాస్త్ర సంగీతములోనికి అవతరించుట, నిరంతరము సాగుచునేయుండును. ఈ రెండిటి సమ్మేళనమువల్ల సర్వజన రంజకమైన ఒకానొక శైలి ఏర్పడినది. ఆ సంగీత శైలియే ఇప్పటి కర్ణాట సంగీతము. అంతియె కాని దాక్షిణ్యాతులందరు పాడెడి సంగీతము ఒక కన్నడ దేశమునకే చెందినది కాదు.

ఈ మార్గ-దేశి అనెడి భేదము ఒక్క సంగీతమునందే కాక, సాహిత్యమందునుకూడ కలదు. సుమారు ఏబది యేండ్ల క్రిందట, నట్టువరాండ్రు, తీర్చిన సభ యెదుట చేయు నాట్యమును భరత నాట్యమనియు, భరతాభినయ మనియు, పెండ్లి యూరేగింపు ముందు అడుగడుగున ఆగుచు జావళీలు పాడుచు చేయు అభినయమునకు కర్ణాటక మనియు పేర్లుండెడివి. ఈ రెండవ జాతి అభినయము కేవలము భరత శాస్త్రోక్తమును కాక, కేవలము స్వారస్యము లేని చిందువేయుటయు కాక, మార్గ, దేశి మేళనమున ఒక విధమైన సాధారణ రంజకత్వము కొఱకు ప్రదర్శించెడి కళ. కనుక దానికి కర్ణాటక నాట్యమని పేరు వచ్చినది. పెండ్లిండ్లకు నట్టువ మేళమును పిల్చినపుడు పెద్దలు అడిగెడివారు! "మీ మేళములో భరతాభియము చేసెడి వారెవరైన ఉన్నారా? అందరిదీ కర్ణాటకమేనా?" అని, ఆ మాటలు, ఆ సంప్రదాయము ఇప్పుడు పోయినవి సంగీత నాట్యములలోవలె, కవిత్వములో కూడ మార్గ, దేశి భేదములున్నవి. సంస్కృతమును సాంస్కృతికమును అయిన కవిత్వము మార్గ కవిత్వము జానుతనమును, దేశీయతయును కలది దేశి. ఈ రెండిటి ప్రభావము ఒకదానిపై ఇంకొకటి ప్రసరించి, ఉభయగుణ సమ్మేళనము వలన ఉభయ ప్రాధాన్యము గల ఒక శైలి ఏర్పడెను. ప్రత్యేకముగా సాంస్కృతికమునుగాని, దేశినిగాని చేపట్టక, రెండిటిసారమును ఆకళించుకొని చెవికి ఇంపును, మనస్సునకు పెంపును కలిగించెడి శైలిని శ్రీనాధుడు తెలుగుభాషలో అవతరింపజేసెను. ఆ శైలినే అతడు సంగీత నాట్య పరిభాషానుకరణముగా, కర్ణాట భాషగా పేర్కొనెను.

శ్రీనాధునకు పూర్వము, తెలుగున శబ్ద ప్రాధాన్యముగల కవిత్వ మొకటియును, అర్థప్రాధాన్యముగల కవిత్వ మింకొకటియును రెండు పాయలుగ ప్రవహించుచుండెడిది. ఒక శైలి సంస్కృతమయమైన శబ్దములతోను, వేరొకటి జాను తెనుగు శబ్దములతోను విభిన్నశాఖలుగా విడివడి వర్ధిల్లినవి. శబ్దార్థములకు సమప్రాధాన్యమును, సాంస్కృతిక దేశీయములకు సమప్రాధాన్యమును ఇచ్చి తన పేరు మీద ఒక శైలిని సృష్టించిన కవి

* ప్రాఙ్నన్నయ యుగ ప్రకరణములో "మార్గ-దేశి" అను శీర్షిక క్రింద ఈ విషయము చర్చింపబడినది.

శ్రీనాథుడు. "నా కవిత్వము శుద్ధ సాంస్కృతికమును కాదు; శుద్ధ దేశీయమును కాదు; ఉభయ ప్రాధాన్యము కలది" యని ఆయన చెప్పిన పద్యమునకు తాత్పర్యము.

## శ్రీనాథుని ఆత్మీయత

రాజాస్థానమునందలి అతని విద్యాధికారిపదము మహోకార్య వ్యవహర్తగా, నుత్తమాధికార మర్యాదాభిజ్ఞునిగా జేసెను. అతని దేశ సంచారములు శాస్త్రజ్ఞానమునకు లోకజ్ఞతను జోడించెను. కావుననే కవిబ్రహ్మవోలె కవిసార్వభౌముడును పాండిత్య మాత్ర నిపుణుడేకాక లోకజ్ఞతగల వ్యవహార దక్షుడయ్యెను. అయన వలెనే సారస్వత సింహాసనాసీనుడయి కవితా పరిపాలన చేయుటయేగాక, అన్యకవి దుర్లభములైన రాజ భోగముల ననుభవించెను. మరియు కవిబ్రహ్మ బిరుదము తిక్కయజ్వకు సార్థకమైనట్లే కవిసార్వభౌమ బిరుదము శ్రీనాథునకు సార్థకమయ్యెను. నాటికిని నేటికిని ఆ రెండు బిరుదములు తాల్పదగినవారు ఆంధ్ర కవులలో వారిరువురే. భవిష్యత్తులో అట్టి బిరుదములు ఉండవని నా నమ్మకము. ఆధునిక నాగరికతనుబట్టి ఉచితజ్ఞులకు ఆ బిరుదముల యెడ నిరసన భావమేకాక ఏవగింపుకూడ కల్గినది పూర్వకాలమున వాటికి ఉన్న పూజ్యత నేడు లేదు.

తిక్కనకు కవిబ్రహ్మ బిరుదము ఆయన కవితా మహత్త్వమును బట్టియే కాక బ్రహ్మజ్ఞానసంపన్నతను బట్టియు అన్వర్థమయ్యెను తిక్కన వ్యాసుని వలె అగమపుంజ పదార్థ తత్త్వ నిస్సంశయకారుడు. వ్యాసునివలెనే తననాడు భారతీయ సంస్కృతికి పరమ లక్ష్యములైన ధర్మార్థ కామ మోక్షములకు మూలమైనవాడు. మఱి శ్రీనాథుని కవిసార్వభౌమ బిరుదము కూడ అట్లే అతని కవితా మహత్త్వమువల్లనే కాక మహారాజలక్షణోపేతమైన జీవితమును బట్టియు అన్వర్థమైనది. అతని భోగ లాలసత, పండిత వివాదములు, జయములు, ప్రతివాది పరాభవములు, కవితా దిగ్విజయాభిలాష – యివన్నియు రాజలక్షణములే. అయన అభిరుచులు, అభిలాషలు, అనుభావము (Majesty) ఆయనకే చెల్లును. గాని కవి శబ్దవాచ్యులైన వారెల్లరు ఆశింపదగినవి కావు. ఆయన పొలముపన్ను చెల్లింపక శిక్షచే ప్రొద్దుపొడుపు ఎండలో నిలబడి నిర్వేదించుటయు యుద్ధమున శత్రువుచే పట్టువడిన యొక వీరపురుషుని స్మరింప జేయును. శ్రీనాథుని జీవితమే వీర శృంగార కావ్యోచితమైన యితివృత్తము. కాని తిక్కనకు కవితా సామ్రాజ్యముతో పాటు మోక్ష సామ్రాజ్యము కూడ వశమయినది. శ్రీనాథునకు దాని యందాశ యున్నది కాని, లబ్ధిలేదు. తిక్కన భోగములు అనుభవించుచునే తద్వ్యామోహప్రశమనమును సైతము పొందెను.

> "శ్రీమత్త్వ యుష్మత్త్వ సు
> ధీమత్త్వ ప్రద కటాక్షా! దీపితభక్త
> స్తోమారామ వసంతా!
> వ్యామోహ ప్రశమకరణ! హరిహరనాథా!"

వ్యామోహమున దగుల్కొనక భోగము లనుభవించుట అట్టి సిద్ధులకే చెల్లును. శ్రీనాథునకో – ఇహపరములు రెంటియందురు రెండు కన్నులున్నవి. కాని తుది వరకు మొదటి దానిని జూడక మానసులేదు; రెండవదాని నందుకొనుటకు

చేయి చాపనులేదు కనుకనే శరీరపతనావసరమున గూడ హేమ పాత్రాన్నమును, రత్నాంబరములను, కస్తూరిని స్మరించుకొనుచు స్వర్గ ప్రస్థానమును సాగించెను. ఆయన చేరినది స్వర్గమేగాని బ్రహ్మలోకము కాదు.

శ్రీనాథు డాజన్మభోగియేగాని, యోగి కాదు. ఆతడు కోరిన భోగములలో మొదటిది భోజనము - రాజోచితమైన షడ్రసోపేత భోజనము. లేతయు ముదురునుగాని యరటియాకులలోనో, హేమపాత్రలలోనో భుజించుట యాతనికి స్వర్గసుఖ మిచ్చును. ఒక భోజనమే కాదు, పంచేంద్రియ తర్పణముచేయు సమస్త భోగములు నాతడాశించినవే. తద్ద్వారా లభించిన భావానుభవమే తన కవిత్వమునకొక యుద్బోధకమని సూచనగా తానే వ్రాసినాడు:

"కమలాద్రి నిలయ మార్కండేయ శివమౌళి
చంద్రాంశు నవసుధాసారధార
వేదాద్రి నరసింహ విపుల వక్షస్స్థలీ
కల్హార మాలికా గంధ లహరి
కారణంబులు నుద్బోధకములు గాఁగ,
సంభవించిన సాహిత్య సౌష్ఠవమున".... - కాశీ 1-16

అరసికులైన వారాక్షేపించినను కవిత్వమునకు ఈ భోగానుభవమునకు దగ్గటి సంబంధమే కలదు. సముచితమై లోలత్వము కానంతవఱకు దాని నాదరింపవలసినదేగాని, నిరసింపరాదు. కన్ను తెఱచి ప్రకృతి సౌందర్యమును జూడగల యే కవియు ధర్మలబ్ధమైన సమస్త వస్తు జాతము ననుభవింప గోరునే కాని త్యజింప గోరదు. ఆ అనుభవము ప్రత్యక్షముగా లభింపని కొందరకు మానసికముగా నైనను కలిగి తీరును. ఈ ప్రాపంచిక యాతన ననుభవించుచు కవులు నిర్మించుకొను స్వర్గమదియే. కావున శ్రీనాథుడనుభవ రసికుడైన కవి.

నేటి ఉత్తమ కవులలో Tagore ఈ జాతికవి. భోగానంద పరవశుడయి కాని రవీంద్రుడు కవిత్వమే వ్రాయలేడట ప్రకృతి దేవతోత్సంగమున మైమఱచి పరవశులయి పాట పాడుటలో గూడ నీ యిరువురకు సామ్యము కలదు.

"ఆనందంబున నర్ధరాత్రములఁ జంద్రాలోకముల్ కాయఁగా
నానా సైకతవేదికా స్థలములన్ నల్దిక్కులన్ శంభుఁ గా
శీనాథుం దరుణేందు శేఖరు శివున్ శ్రీకంఠునిం బాడుదున్
మేనెల్లం బులకాంకుర ప్రకరముల్ నిండార మిన్నేటిలోన్." - భీమ 2-91

ఈ మిన్నేటి యిసుక తిప్పలలో పాటలు పాడినది శ్రీనాథుడే కాని, యగస్త్యుడు కాదు.

ప్రకృతి పరిశీలనములో గూడ నతని దృష్టి అతి నిశితమైనది. ఆ నేర్పాతని చాటువులలో మిక్కిలి కానవచ్చును. అతడు వర్ణించిన నానావిధ స్థలములయు, వనితలయు రూపములు ప్రత్యక్షానుభూతములే. ఎంతో లోతుగా జూచిననే తప్ప వాని నట్లు వర్ణించుటయే పొసగదు. అందును ఆ - స్త్రీ వర్ణనములు మిక్కిలి చిత్రమైనవి. ఒకదాని బోలి యొకటి యుండదు. ఎచ్చటను పునరుక్తి దోషము లేదు.

తెలుగు గ్రంధములలో గానవచ్చు వర్ణనలుత్తరదేశ స్త్రీలవేగాని, ఆంధ్రనారీ చిత్రములు కావు. ఆ నూపురధ్వనులు, ఆ చేర్చుక్కలు, ఆ మొలనూలు, ఆ మకరికా పత్రములు యథార్థముగా తెలుగు పడతుల అలంకారములే కావు ఇతివృత్త ముత్తరదేశమున జరిగినపుడా వర్ణనలు సంగతములే యగును. ఇతివృత్తము దేశీయమైనపుడు మాత్రమవి అసందర్భములు. మనలో జాతీయేతివృత్తములు గల కావ్యములే చాల తక్కువగనుక, జాతీయనారీచిత్రణలు చాల కొఱతపడినవి ఆ కొఱతను కొంతకు గొంతయైన దీర్చినవి శ్రీనాధుని చాటువులు

ఈ స్త్రీ వర్ణన లంత మిక్కుటముగా జేయుటచేతనే కొందఱు విమర్శకులా మహాకవి శీలమును శంకించుచున్నారు. దానిని సమర్థించుటకు గాని, ఖండించుటకుగాని ప్రత్యక్షములగు నాధారము లేవియు లేవు. నేనా పనికి పూనుకొనను నేనేకాదు; కవిత్వ పరామర్శలో ఎవరును ఆ దారి త్రొక్కరాదు. ఈ కవి పుట్టుకచే సౌందర్య దిదృక్షువు దానికితోడు పరిహాస రసికుడు. చక్కని రూపము కంటబడినపుడు మనసార నానందించి నోరార వర్ణించుటయు, హాస్యరసపాత్రము కాదగిన వింత వస్తువునో, వింతరూపమునో చూచినపుడు తాను నవ్వి మనల నవ్వించుటయు అతని స్వభావము. కన్నెత్తి చూచిన సుందర వస్తువునెల్ల పాప బుద్ధితో చూచెననుకొనుట అవివేకములలో నవివేకము. చూచినపుడు గలిగిన యనుభవమును ధీరుడైన కవి వర్ణింపదలచినచో యధాతథముగ వర్ణింపక దిగమ్రింగుట అంతరాత్మను మోసగించుట. కావుననే శ్రీనాధుడు తాను వర్ణింపదలచుకొనిన సుందర వస్తువుల నన్నింటిని నిర్భయముగా ఆచాటువులలో జిత్రించి లోకమున కొసగిపోయెను. ఆ పరిహాసమున నీకాలపు ధర్మమును బట్టి మోటుదనము కొంత కానవచ్చినచో నది ఆయన లోపముకాదు. ఆ కాలపు ధర్మమట్టిది. ఆరాజులు, ఆసభాస్తారులు ఆమోటుదనమును గూడ చమత్కారముగానే ఆనందించి యుందురు

శ్రీనాధుని పేర జెల్లుచున్న చాటువులలో నతడు స్వయముగ వ్రాసిన వెన్నో యూతని కంట గట్టబడిన వెన్నియో నిష్కర్షముగ జెప్పుటయే కష్టము. మొన్న మొన్నటి తురగా రామకవి మొదలైనవారు చెప్పిన చాటు పద్యములను గొన్నిటిని లోకము శ్రీనాధున కంటగట్టిన పాపము చేసినది ఇంత స్వల్ప కాలములోనే నిష్కారణ మిన్ని పద్యములు శ్రీనాధుడు మోయవలసి వచ్చినపుడు ఈ యైదువందల సంవత్సరముల వ్యవధిలో నెన్ని యూతని కిట్లంట గట్టబడెనో యెవడు చెప్పగలడు? శ్రీనాధుని వలెనే యితర కవుల భారమును మంచికో చెడ్డకో మోసినవారు తెలుగున వేమన, సంస్కృతమున కాళిదాసు, జగన్నాథ పండితుడు, పారసీకమున ఉమర్ ఖయ్యాము ఉన్నారు.

ప్రాచీనులు పరదార నెడ నెంతకఠినధర్మము నిర్ణయించిరో సామాన్యయెడ నంత యుదాసీనత జూపిరి. శ్రీనాధుని వర్ణ్యస్త్రీలు, కులస్త్రీలు, పతివ్రతలు. పరదారలు గారు. ఆకాలమున మాచల్దేవి వంటి వేశ్యాపొత్తు, గోష్ఠి గౌరవనీయము. ధర్మము నీతి యనునవి దేశ కాల పాత్ర పరిమితములు. శ్రీనాధుడు పరదారా గమనము నతి తీవ్రముగా నిరశించును.

'పరదారముఖాఘ్రాణంబు చేసిన పాపిష్ఠు వదనంబున నిష్ఠుర నిష్ఠీవనం బొనర్పుడు'

పర కళత్రంబు కుచకుంభపాళి యందు
నఖము దివిచిన పాపాత్ము ముఖము నందు
నెఱ్ఱగా నగ్నిగాచిన యినపసూాదు
లు(గ్రదృష్టిని జొన్పు డత్యా గ్రహమున

ఇది యాతని యంతశ్శుద్ధిని తెలుపును.

శ్రీనాథుని జీవితచరిత్ర వ్రాయుట యనగా పదునేనవ శతాబ్దినాటి యాంధ్రదేశ చరిత్ర వ్రాయుట అని చిలుకూరి వీరభద్రరావుగారు పలికిన పలుకు నిజమైనది. ఆ కాలమున నుచ్చస్థితిలో నున్న ఆంధ్ర కర్ణాటక రాజ్యములతో నతనికి గల సంబంధము. నానాదిశల నొనర్చిన సంచారమును ఆ కవిని ఆంధ్ర లోకైక కవిగా జేసినవి. కొండవీటి చరిత్ర వ్రాయు నైతిహాసికుడు శ్రీనాథుని కొక ప్రకరణమైన నంకితమీక తప్పదు శ్రీనాథుని చరిత్రను వ్రాయువాడు రెడ్డిరాజుల చరిత్రముతో గలిపి కాని వ్రాయలేడు. అతని కనకాభిషేకమును వర్ణించువాడు ప్రౌఢదేవరాయల రాజ్యవైభవమును వర్ణింపక తీరదు. ఈ విధముగా మఱికొన్ని విధములుగా ఆ మహాపురుషుని జీవిత మానాటి రాజులయు, మంత్రులయు, సంపన్నులయు జీవితములతో పడుగు పేకగా నల్లుకొని, ఏ పోగును విడదీయరానిదిగా నున్నది.

కవి సార్వభౌముడు తన్నాదరించిన మిత్రులను ప్రభువులను స్మరించుచునే స్వర్గ ప్రస్థానము గావించెను. ఈ మైత్రీధర్మాభిజ్ఞతయే ఆయన లోక రంజకత్వమున కింకొక హేతువైనది. అప్రధృష్యుడు సభిగమ్యుడునైన అధీరుడు జీవితచరమక్షణమున గూడ ఆత్మవిశ్వాసమును గోల్పోక, యీాలోకమున వలెనే స్వర్గలోకమునగూడ కవిసార్వభౌమ పదవి నధిష్ఠించుటకే తరలి పోయెను.

## పోతన

భారతీయ సంస్కృతికి నిధానములైన భారత భాగవత రామాయణములనెడి మూడు ఉద్గ్రంథములును బహుకర్తృకములేయైనవి. రామాయణమంతయు భాస్కరు నిచే రచియింపబడక పోయినను భాస్కర రామాయణము అను పేరనే ప్రసిద్ధికెక్కినది. అట్లే భాగవతమంతయు పోతనచే రచింపబడకపోయినను అయన పేరనే బరగుచున్నది. భారతము మాత్రము నన్నయ పేరగాని తిక్కన పేరగాని ఎఱ్ఱన పేరగాని కాకుండ సమష్టిగా కవిత్రయకృతముగా చెప్పకొనబడుచున్నది రంగనాథ రామాయణము ఏకకర్తృకమైనను భారత భాగవత రామాయణములను ఉమ్మడిగా పేర్కొన్నపుడు రామాయణమనగా భాస్కర రామాయణమనియే అర్థస్ఫురణము కలుగుచుండును.

భాగవత కర్త పోతన ఆ పురాణమందలి 12 స్కంధములలో 5,6,11,12 తప్ప తక్కిన ఎనిమిది స్కంధములను తన చేతి మీదుగనే రచించెను. ఐదువది గంగనయు, ఆరవది ఏర్చూరి సింగనయు, తుది రెండు స్కంధములు వెలిగందల నారయయు పూర్తి చేసిరి. పోతనగారు గ్రంథమంతయు రచించెననియు కొంత కాలమునకు అందులోని కొన్ని భాగములు అనగా పైని పేర్కొన్న నాలుగు స్కంధములు, ఉత్సన్నములు కాగా, గంగయాదులు వాటిని పూరించిరనియు ఒక వదంతి కలదు.

ఆ ఉత్పన్నతకు కారణముగా రెండు కథలు కల్పించబడినవి. మొదటిది సర్వజ్ఞ సింగభూపాలుడు ఈ గ్రంథమునకు కృతిపతి కాగోరి తన కంకితమిమ్మని పోతన నర్థించి నిరాకృతుడై అక్కస్సుచే ఆ గ్రంథమును నేలలో పూడ్చిపెట్టించెనట. రాముడు స్వప్నములో రాజు భార్యకు కనబడి ఆ గ్రంథమును పైకి తీయింపుమని ఆదేశింపగా ఆమె భర్తకు నచ్చ జెప్పి అట్లే చేయించెనట. పాతాళవాసము చేసి వచ్చిన ఆ గ్రంథమును విప్పిచూడగా అందు పూర్తిగా పై నాల్గు స్కంధములు శిథిలములై పోయినవట. అంత పోతన మిత్రులో, శిష్యులో అయిన గంగయాదులు మువ్వురును ఆ స్కంధములను పూర్తి చేసిరట.

ఈ కథ ఎప్పటినుండి ప్రచారములో నున్నదో తెలియదు కాని 17 వ శతాబ్ది చివరి భాగమున గ్రంథస్థమైనది. దీనిని లోకమునుండి గ్రంథమున కెక్కించినవాడు కూచిమంచి తిమ్మకవి. అతడు తన సర్వలక్షణసార సంగ్రహములో ఈ కథను భాగవత బహుకర్తృకత్వమునకు కారణముగా వ్రాసెను. ఈ కథ నమ్మదగినది కాదని విమర్శకులందరు త్రోసిపుచ్చిరి సర్వజ్ఞసింగడు సరసుడు, కవిపోషకుఁడు. అట్టివాడు ఇట్టి నీచకార్యమునకు ఒడిగట్టెననుట నమ్మతగినది కాదు. పోనీ ఎట్టి సరసుడైనను కవియొక్క నిరాకరణచే ఉద్రిక్తుడై ఆ గ్రంథమును పూడ్చి పెట్టెనేమో అనుకొందము. అగుచో అది వెలుపలికి వచ్చునప్పటికి సరిగా నాల్గు స్కంధములే శిథిలములై పోవుటగాను, తక్కిన భాగములలో ప్రతి పుటయు యథాతథముగా ఉండుటయు పొసగదు.

**ఇంక రెండవ కథః-** పోతనయే తన గ్రంథమును దేవతార్చన పీఠమున నెలకొల్పి పూజించెడి వాడట. అయన పరమపదించిన పిమ్మట కుమారుడు దానిని తీసిచూడగా ఆ నాలుగు స్కంధములు శిథిలములై యుండుట కానవచ్చెనట అంత నతడు గంగయాదులను అర్థించి వారిచే ఆ భాగమును పూర్తి చేయించెనట.

ఇది మొదటి కథకంటెను వింత యైనది. ఎంత భక్తుడైనను పోతన కూడ కైవల్యముతోపాటు కీర్తిని కూడ ఆశించిన కవియే తన గ్రంథము లోకమున పఠన పాఠనములచే వ్యాపించినపుడే ఆకీర్తి లభించును గాని దాచి పెట్టినపుడు అదిలభింపదు. అదియునుగాక దేవతార్చన పీఠమున బెట్టినను తాను దానిని నిత్యపారాయణము చేయవలసినవాడే కాని ఆసరస్వతిని గాలి చొరకుండ బంధించి యుంచవలసినవాడు కాడు. మఱి పోతన కుమారుడు మల్లన ప్రౌఢకవి యని బిరుదు దాల్చినవాడు. రుక్మాంగద చరిత్రకు కర్త. తానై శిథిల భాగమును వ్రాయదగిన సమర్థుడేకాని వ్యర్థుడు కాడు. అట్టివాడు తండ్రిగారు ప్రారంభించిన మహాయజ్ఞములో అయాచితముగా తనకొక పాలు లభింపగా దానిని గైకొనక గంగయాదులను ఆహ్వానించి దానిని వారి పరము చేసి తాను దూరముగా నిలిచి యుండుటకు ఏమి కారణము ఊహించగలము? కావున నిదియు కట్టుకథయే. అదీగాక ఆ మల్లనగాని, పోతనగారి ముని మనుమలు కేసన మల్లనలు అనెడి జంట కవులు గాని (వారు దాక్షాయణీ పరియణ కర్తలు) భాగవత శిథిలతను గూర్చి ఒక మాటయైనను చెప్పలేదు.

పోగా భాగవతమున గంగయాదుల ప్రవేశము పోతన సమక్షముననే ఆయన సమ్మతి మీదనే జరిగి ఉండునని నా **ఊహ!** అట్టి బృహద్గ్రంథము తన జీవితములో పూర్తి చేయగలనో లేదో అను శంకచే **ఆయనయే** ఆ కవులను పిలిచి ఆ భాగములు

వారి కప్పగించి యుండును. లేదా వారే ఆ పుణ్య కార్యమున తమకు కూడ కొంత ప్రవేశముకల్పింపుడని వేడగా దానికాయన సమ్మతించి యుండును. భాస్కరరామాయణ రచనలో ఇతరుల కిట్టి ప్రవేశమే కలిగెను! ఎన్నటి మాటలో ఎందుకు? ఈ శతాబ్దిలో తిరుపతి వేంకట కవులు తమ దేవీ భాగవతమున నవమ స్కంధమును తమ కవిమిత్రులచే వ్రాయించిరి. కావున భాగవతము పోతనగారి జీవిత కాలముననే ఎనిమిది స్కంధములు ఆయన చేతను ఆయన అనుమతిపై నాలుగు స్కంధములు గంగయాదుల చేతను రచింపబడెననుకొనుట లెస్స!

వీర్భూరి సింగయ షష్ఠ స్కంధారంభమున ఇష్టదేవతాస్తుతి, పూర్వ కవి స్తుతి మొదలగు అంశములతో అవతారికా భాగమును కూడ రచించెను. ఆ భాగములో–

"వెలయఁ దిక్కన సోమయాజుల భజించి,
ఎఱ్ఱనామాత్యు భాస్కరు నిచ్చఁగొలిచి,
సుకవి సోముని నాచన సోము నెఱిఁగి
కవి మనోనాథు శ్రీనాథు ఘనత మెచ్చి" అనియు–

"ఎమ్మెలు సెప్పనేల జగమెన్నఁగఁ బన్నగరాజశాయికిన్
సొమ్ముగ వాక్య సంపదలు సూఱలు చేసిన వాని భక్తిలో
నమ్మినవాని భాగవత నైష్ఠికుఁడై దగువానిఁ బేర్మితో
బమ్మెర పోతరాజుఁ గవి పట్టపురాజుఁ దలంచి మ్రొక్కెదన్"

అనియు శ్రీనాథ పోతరాజులను పూర్వ కవులలో జేర్చి స్తుతించుటచే ఈ సింగయ పోతనకు అనంతర కాలమువాడనియు ఆ స్కంధము పోతన సమక్షమున ఆయన కాలమున వ్రాయబడినది కాదనియు తలంచుట కొక అవకాశము కలదు. కాని సింగయ పోతనయెడ గల భక్తిచే ఆయనకు నమస్కరించుటకు సమకాలికత్వము ప్రతిబంధకము కాదు. అది గురుస్తుతి వంటిది. సమకాలికులను స్తుతించుట కవుల సంప్రదాయమే! "సింహాసనద్వాత్రింశతిసాలభంజిక" కర్తయైన కొరవి గోపరాజు తన సమకాలికుడైన పిల్లలమఱ్ఱి పినవీరనను అవతారికలో స్తుతించెను. అట్టి ఉదాహరణములు అనేకములు. మఱియు తన స్కంధమునకు ప్రత్యేకత సంపాదించుటకై అతడు కృత్యాది మంగళాచరణ సంప్రదాయమును పాటించెననియు తలంచుట తప్పుకాదు. గంగనయు, నారయయు తమ తమ స్కంధముల గద్యభాగములలో తమ పేర్లు చెప్పుకొనిరి. సింగయ గద్య భాగముననే కాక స్కంధాదిని కూడ తన కర్తృత్వమునకు పట్టము కట్టుకొనెను. అతని అభిలాషను పోతనగారు అంగీకరించి యుందురు.

సంస్కృత పురాణ వాఙ్మయములో ఇదిగాక ఇంకొక భాగవత మున్నది. అది దేవీ భాగవతమే. ఈ భాగవతము విష్ణుపారమ్యమును, భక్తినీ ప్రబోధింపగా దేవీ భాగవతము తాంత్రిక మతమును పరాశక్తి పారమ్యమును ప్రబోధించును. అష్టాదశ పురాణములలో పేర్కొనబడిన భాగవతము దేవీ భాగవతమే అని తాంత్రికులు చెప్పుకొందురట. కాని యీ భాగవతము ఇతర పురాణములతో పాటు వ్యాసుడు రచించినదే యనియు అష్టాదశ పురాణములు వ్యాసకృతములే గనుక ఆ పురాణ వర్గములో పేర్కొనబడిన భాగవతము ఇదియే యనియు దేవీ భాగవతము కాదనియు, ద్వైతాద్వైత విశిష్టాద్వైతులు చెప్పుదురు. భరతఖండమున తాంత్రిక మతావిర్భావము వైదిక మతమునకు చిరకాలము

పిమ్మట జరిగినది. కనుక దేవీ భాగవతము ఈ భాగవతమునకు అనంతరకాలమున రచింపబడియుండును. ఈ రెండు భాగవతములకును నామ సాపత్న్యము ఏర్పడిన పిమ్మట భ్రమ నివారకముగా ఈ భాగవతము విష్ణు భాగవతమను నామాంతరము తాల్చెను. తదనుగుణముగ ఈ భాగవతము శ్రీమహావిష్ణుని అవతార లీలలను, శ్రీమన్నారాయణుని భక్తులయొక్క పావన చరిత్రములను వర్ణ్యవస్తువుగా గైకొని, భక్తిమార్గ మొక్కటియే సంసార తరణోపాయముగా ప్రబోధించును. పరమ విష్ణుభక్తి ప్రతిపాదకత్వమే ఈ పురాణముయొక్క విశిష్టత భక్తి జ్ఞానకర్మలనెడి మూడు మోక్ష మార్గములలో భారతమువలె నిష్కామ కర్మ మార్గమును, భాగవతమువలె అనన్యభక్తియోగమును ఉపదేశించిన మహాగ్రంధములు ఇతరములు లేవు నారాయణుని అనేకావతారములలో ప్రసిద్ధమైనవి మత్స్యకూర్మాది దశావతారములు మాత్రమే! వాటిలో కాలక్రమమును బట్టి చివరిదిగా పూర్ణమహత్వమును బట్టి ప్రధమ గణ్యముగా పరిగణింపబడిన కృష్ణావతార కధనమే ఈ గ్రంధము యొక్క పరమ లక్ష్యము. అందుచేతనే—

మ. "లలిత స్కంధము, కృష్ణమూలము, శుకాలాపాభిరామంబు మం
జులతా శోభితమున్, సువర్ణ సుమనస్సు జ్ఞేయమున్, సుందరో
జ్జ్వల వృత్తంబు, మహాఫలంబు, విమల వ్యాసాల వాలంబునై
వెలయున్ భాగవతాఖ్య కల్పతరు వుర్విన్ సద్ద్విజశ్రేయమై"

అనెడి ఈ పద్యములో భాగవత కల్పతరువునకు కృష్ణావతారమే మూలము అని నిర్దేశించి ఆ కృష్ణుడే మహావిష్ణువు అని గ్రంధకర్త స్పష్టముగా ప్రతిపాదించెను. అదియుగాక మోక్షప్రదములైన శ్రీకృష్ణుని కధలను వినదలచిన శౌనకాది మునులకు సూతుడు భాగవత కధనమున కుపక్రమించుట శ్రీకృష్ణ చరిత్రయే భాగవతవిషయము అని గ్రంధకర్త మొదటనే స్పష్టీకరించుట అగును. ఆ పద్యము లిది.

సీ॥ ఎవ్వని యవతార మెల్ల భూతములకు
సుఖమును వృద్ధియు సొరిదిఁజేయు
నెవ్వనిశుభనామ మే ప్రొద్దునుడువంగ
సంసార బంధంబు సమసిపోవు
నెవ్వని చరితంబు హృదయంబుఁ జేర్వంగ
భయమొంది మృత్యువు పరువువెట్టు
నెవ్వని పదనది నేపారుజలములు
సేవింప నైర్మల్య సిద్ధి కలుగుఁ

తే॥ దపసు లెవ్వని పాదంబు దగిలి శాంతి
తెఱఁగుగాంచిరి వసుదేవకులకు
నెవ్వడుదయించెఁ దత్కధ లెల్లవినగ,
నిచ్చ పుట్టెడు నెరిగింపు మిద్ధ చరిత

ఆ॥ "అనఘ వినురసజ్ఞులై వినువారికి, మాట మాట కధిక మధురమైన
యట్టి కృష్ణ కథన మా కర్ణనము సేయఁదలఁపు గలదు మాకుఁ దనివిసనదు."

శ్రీకృష్ణ చరిత్రగల దశమస్కంధము ఈ పురాణశరీరమునకు హృదయస్థానము. ఇక ఇతరావతారములలో నృసింహ, వామన, దశరథ రామావతారములు ఈషద్విపులముగా చెప్పబడినవి. ఆ అవతారములకు నిమిత్తములైన విపుల వృత్తాంతములు గలవు. కనుక తత్కథనములు కూడ విపులములైనవి.

రామావతార కథనమంత కంటెను విపులతరముగ రచింపదగును. కాని ఆ చరిత్ర రామాయణ రూపమున వేరొక మహాగ్రంథముగ వెలసి ఉండుటచే దానిని మూలకర్త భాగవతమున యథావస్థముగా సంగ్రహించెనని తలంప వచ్చును. రామభక్తాగ్రేసరుడైన పోతన ఆ రామాయణకథాభాగమును తెనిగించునపుడు మూలకారుని ఆశయమును పాటించి ఆ సంగ్రహ రూపముతోనే తృప్తిపడెను. కానిచో సందర్భ శుద్ధిని ఉల్లంఘించియైనను వేరొక రామాయణమును భాగవతమున రచింపదగిన రామభక్తిలోలుడు పోతన! మరియు నీ భక్తుడు రామ కృష్ణ నామములకు భేదమే యెరుగని అద్వైతి. కథా ప్రారంభమునందు గల షష్ఠ్యంతములు శ్రీకృష్ణుని పరముగాను, స్కంధాది సంబోధన పద్యములు రామ నామాంకితములుగాను ఉండుటయే ఇందుకు పరమ నిదర్శనము.

ఈ రచనలో పోతనకు తోడ్పడిన ముప్పురు కవులలో వెలిగందల నారయ తుది రెండు స్కంధములను షుమారు 180 గద్య పద్యములలో సంగ్రహపరచి నామ మాత్రముగ గ్రంథ పరిపూర్తిజేసిన వాడనిపించుకొనెను. పోతన ఈ సంక్షిప్తతను ఎట్లు ఊహించెనో ఊహింపలేము. దశమస్కంధము ముగియునప్పటికే పోతనకు తన జీవితము ముగియునట్టి సూచనలు కన్పించుటచే గ్రంథ పరిపూర్తి కాలేదనెడి ఆయన మనోవ్యథను తీర్చుటకై నారయ అనతికాలములో ఆ కార్యము నెరవేర్చి శాంతి గొల్పి యుండును. అంతేకాని పోతన తానై మునుముందే గంగన సింగనలతోపాటు నారయకు 11, 12 స్కంధములు పంచి యిచ్చి ఉండడు. ఏమనగా భాగవత దేవాలయమునకు పూనుకొన్న మహాశిల్పి అనుల్లంఘనీయమైన కారణము తటస్థించిననే తప్ప శిఖరారోహణ కార్యమును ఇతరుల పరము చేసి తాను దూరముగా తొలగియుండడు. నిర్వహణానందము ఆరంభోత్సాహము కంటె పెద్దది.

ఈ పక్షమున గూడ నారయ పోతన జీవితకాలముననే ఆయన సమక్షముననే 11,12 స్కంధములు రచించిన వాడగును. ఈ ముప్పురు కవులలో "పోతనామాత్యుని శిష్యుడను" అని చెప్పుకొన్న కవి ఇతడే! లేదా పోతనగారు గ్రంథమును అసంపూర్ణముగా వదలిపెట్టి పోగా ఈ శిష్యుడు అనంతరము పూరించియుండును. అప్పుడైనను గురుని ఆదేశానుసారమే చేసియుండును.

కాని ఆ రెండు స్కంధములను సంక్షేపించుటలో నారయచూపిన వేగిర పాటు చూడ గురువుగారి అవసానమునకుముందే దానిని పూర్తిజేసి ఆయనకు తృప్తి గొలిపి యుండునను ఊహను బలపరచును.

అర్వాచీనులలో హరిభట్టు అను కవి ఆరు, పదునొకండు, పండ్రెండు స్కంధములను ఆధునికులలో సింగరాచార్యులు పదునొకండు, పండ్రెండు స్కంధములను మరల వ్రాసిరి. పదకొండు పన్నెండు స్కంధములను ఎవరైనను మరల వ్రాయుటకు నారయ చేసిన సంక్షిప్తతయే ప్రోద్బలకమగును. కాని హరిభట్టు ఆ రెండు స్కంధములనేగాక

ఆరవ స్కంధమును కూడ మరల వ్రాయబూనుటకుకారణమేమో తెలియదు అతడు ఏర్చూరి సింగయకంటె గొప్ప కవి కాకపోవుటయేగాక అతనితో సాటిరాదగినవాడును కాదు. భాగవత కర్తలలో పోతన తరువాత పేర్కొనదగినవాడు సింగనామాత్యుడే!

తొలినాడుగాని నేడుగాని ఇతరులు ఏ ఏ స్కంధములు ఎన్ని మార్లు వ్రాసినను దశావతార కథనము మాత్రము పూర్తిగా పోతన చేతిమీదుగానే నెరవేరినది. ఆయన వ్రాసిన ఎనిమిది స్కంధములలోనే దశావతార కథలు గలవు. అంతేకాదు, భాగవతమున అనేక ఉపాఖ్యానములున్నవి. పరమ భాగవతోత్తములుగా భాగవత ధర్మపరిపాలనకు ప్రథమోదాహరణములుగా ఏ భక్తుల చరిత్రలు పేర్కొందురో అట్టి ప్రహ్లాద చరిత్ర, అంబరీషోపాఖ్యానము, గజేంద్రమోక్షము కూడ పోతనగారి పరమే అయ్యెను. కావున భగవంతుడును, భగవద్భక్తులును పోతనగారి కవితాపూజనే స్వీకరించిరి.

తెలుగు కవులలో శ్రీకృష్ణనామాత్మకమైన భాగవత తత్త్వ ప్రబోధము ప్రారంభించిన భక్తకవియోగి పోతనయే; అంతేకాదు, వంగదేశమున రాధాకృష్ణ మత సంప్రదాయమును వెలకొల్పి, దేశమెల్లెడల దానిని వ్యాపింపజేసిన చైతన్యస్వామి పోతన తరువాత ఏబదిసంవత్సరములకు అవతరించెను. కావున చైతన్యావతారమునకు ముందే ఈ ఆంధ్రభక్తయోగి కృష్ణతత్త్వమును మనదేశమున గానము చేసి ఆంధ్రుల మనోలోకమున ఒక పరివర్తనమును దెచ్చెను. ఆ సమయమందే అపర ప్రహ్లాదు డనదగిన తాళ్ళపాక అన్నమయ్యయు (1408–1503) తన సంకీర్తనాదులచే భక్తిప్రధానముగా విష్ణుపారమ్యమును బోధింప నారంభించెను. మహాభక్తులు జన్మించిన యుగమది. చైతన్యుడు రాధాప్రణయమూర్తియైన బృందావన కృష్ణుని మాత్రమే దర్శించెను. మరి పోతన దర్శించినది నవరస భరితమైన విరాట్ పురుషమూర్తి. మరియు చైతన్యుని కృష్ణతత్త్వము అద్వైత పరబ్రహ్మాత్మకము. అసలు భాగవతము అద్వైతపరమా? అని ప్రశ్నించినచో ఆ మహాగ్రంధము ఉభయతత్త్వ పరమని నిస్సందేహముగా చెప్పవచ్చును. అద్వైతపరముగా జ్ఞానమును, ధర్మాచరణముగా ప్రసన్నతను ఉపదేశించిన గ్రంధరాజము ఈ భాగవత మొక్కటియే! భాగవత ధర్మావలంబులైన పురుషులలో కొందరు శుద్ధజ్ఞానమును, కొందరు శుద్ధభక్తిని అవలంబించి కైవల్యప్రాప్తి పొందినట్లు ఈ గ్రంధమందలి ఉపాఖ్యానములవల్ల విదితమగుచుండును. ప్రహ్లాదుడు అగర్భజ్ఞాని. గజేంద్రుడు "నీవేతప్ప నితఃపరంబెఱుఁగ" అని మొరపెట్టుకున్న ప్రపన్నుడు. అంబరీషుడు ద్వాదశీవ్రత నిష్ఠాగరిష్ఠుడు. ఈ ముగ్గురకును మార్గములు వేరైనను ప్రాప్యస్థానమొక్కటియే. కావున భాగవతము అద్వైత పురాణమా? విశిష్టాద్వైత పురాణమా? అని సంశయించువారు అది ఉభయాత్మకమనియు, భాగవతభక్తి జ్ఞాననిరూఢమైన భక్తియే కాని మూఢభక్తి కాదనియు, భాగవతజ్ఞానము ఈశ్వరసేవా పూర్వకమే కాని భక్తిరహితజ్ఞానము కాదనియు గ్రహింపవలయును

## ఆంధ్రీకరణము

భాగవతము భారతమువలె కథా ప్రధానముగా నడచిన స్వతంత్రానువాదము కాదు. మరి మూలమును యథాతథముగా అనుసరించిన అస్వతంత్రానువాదమును కాదు. కొన్నిచోట్ల కథామాత్ర ప్రాధాన్యము కొన్నిచోట్ల శ్లోకానువాదము. కొన్నిచోట్ల

అమూలక కల్పనలు గలవు. నిగూఢము లయిన వేదాంతార్థముల వివరించుపట్ల వానికి వివరణ వ్రాయుట మాత్రమే గాక, ఆ శ్లోకములకు సంబంధించిన శ్రీధరీయ వ్యాఖ్యను గూడ తెనిగించెను. కథారంభమునగల నైమిశారణ్య వర్ణనమునకు మూలము లేదు. అట్లే అష్టమ స్కంధమున కూర్మావతార ఘట్టమున చేయబడిన మహాకూర్మ వర్ణనయు, సముద్ర మథన వర్ణనయు, హాలాహల విజృంభణ వర్ణనయు సొంతములే. వీటికి గల మూలాధారము నామమాత్రము. సముద్ర మథనవేళ నావిర్భవించిన లక్ష్మీదేవియొక్క జననాదిక వర్ణనమంతయు అమూలకము. వామన చరిత్రలో కూడ కొన్ని సొంత కల్పనలు కలవు. వామనుడు బలిచక్రవర్తి యజ్ఞశాల ప్రవేశించి—

ఉ॥ స్వస్తిజగత్త్రయీ భువనశాసనకర్తకు హాసమాత్ర వి
ధ్వస్త నిలింప భర్తకు నుదారపద వ్యవహర్తకున్ మునీం
ద్రస్తుత మంగళాధ్వర విధాన విహర్తకు నిర్జరీ గళ
న్యస్త సువర్ణ సూత్రపరిహర్తకు దానవలోక భర్తకున్

అని యజమానుని యాశీర్వదించుట పోతనగారు చేసిన సందర్భశుద్ధి సహితమైన కల్పన. దీనికి మూలము లేదు.

శుక్రుని హితమును పాటింపక—

శా॥ ఆదిన్ శ్రీసతి కొప్పుపైఁ దనువుపై నంసోత్తరీయంబుపైఁ
బాదాబ్జంబులపైఁ గపోలతటిపైఁ బాలిండ్లపై నూత్న మ
ర్యాదం జెందు కరంబు గ్రిందగుట మీదై నాకరంబుంట మేల్
గాదే రాజ్యము గీజ్యమున్ సతతమే కాయంబునాపాయమే!

అనుచు తన ధన్యత్వమును కొండాడుకొనిన బలిచక్రవర్తి ఉదారవాక్యములకు మూలాధారము లేదు మరియు వామనుడు తన మూర్తిని విశ్వవ్యాపకముగా పెంచునపుడు—

మ॥ రవిబింబంబుఁపమింపఁ బాత్రమగు ఛత్త్రంబై శిరోరత్నమైఁ
శ్రవణాలంకృతియై గళాభరణమై సౌవర్ణకేయూరమై
ఛవిమత్కంకణమై కటిస్థలి నుదంచద్ఘంటయై నూపుర
ప్రవరంబై పదపీఠమై........

వెలుగొందె ననెడి రూపకల్పన పోతన ప్రతిభాజన్యము. ఈ భాగవతము నలంకరించిన మూలాధారములేని ఇట్టి పద్యరత్నములు వందలకొలది కలవు. అట్టి పద్యముల వలననే భాగవతము ఆంధ్రులకు నిత్యస్మరణ పాత్రమైనది. వీటినన్నింటిని మించినది గజేంద్రమోక్ష ఘట్టము. గజయూథ ప్రస్థానము మొదలు యూథపతి మకరిచే పట్టువడు వరకుగల కథ మూలమునకంటె అనువాదమున యెన్ని రెట్లో పెరిగినది. నిజమునకు అందు కథ లేనేలేదు. ఉన్నదంతయు వర్ణనయే. పోతన యితర సందర్భములలో వలెనే ఇచ్చటకూడ వర్ణనలచేతనే ఆ ప్రకరణమును పెంపొందించెను. గజేంద్రుని స్తుతిమాత్రము ఇంచుమించు మూలానుసారముగానే యున్నదికాని, ఆ స్తుతిమాలకు మేరుపూస యనదగిన ఈ క్రింది పద్యమునకు మూలము లేదు

శా॥ లావొక్కింతయు లేదు, ధైర్యము విలోలంబయ్యెఁ బ్రాణంబులున్
ఠావుల్దప్పెను మూర్ఛవచ్చె తనువున్ డస్సెన్ శ్రమంబయ్యెడిన్

*నీవేతప్ప నితఃపరంబెఱుఁగ మన్నింప న్దగు న్దీనునిన్*
*రావే యీశ్వర కావవే వరద సంరక్షింపు భద్రాత్మకా!*

కొండలకైనను మలగని బలముగల ఆ గజేంద్రుడు విధివశమున మకరికి చిక్కి సహస్రవర్షములు పౌరుషము నెరపి దానితో పోరాడి తుదకు అలసి పురుషకార నిస్సారతను గ్రహించి ప్రపన్నుడై రావే ఈశ్వరా, కావవే వరదా అని చేసిన ఆక్రోశమే చాలును, ప్రపన్నత్రాణ పరాయణుడైన వైకుంఠుని భూలోకమునకు తీసుకొనివచ్చుటకు. ఇచటి గజేంద్రుని మొర పోతన మొరయే. ఈ పద్యము భక్తి పరాయణత్వమునకు పరమావధి. ఆ పై స్తోత్రమంతయు ఉపనిషత్ప్రతిపాదితమైన నిర్గుణతత్త్వ వర్ణనము.

గజేంద్ర రక్షణార్థము "సిరికిన్ జెప్పక శంఖచక్ర యుగమున్ చేదోయి సంధింపక" శ్రీ మహావిష్ణువు సంరంభముతో వైకుంఠమునుండి దిగివచ్చుటయు ఆయనను వైకుంఠపురమునగల ఆబాలగోపాలము అనుసరించుటయు పోతన గారు భావించి చిత్రించిన సన్నివేశమే! మరియు దశమస్కంధములో రాసక్రీడాసందర్భమునగల రసగుళికలని చెప్పదగిన పద్యములకు మూలము మృగ్యము. ఆంధ్రులకెల్లరకు వచోవిధేయమైయున్న ఈ క్రింది పద్యము పోతనగారు ప్రసాదించిన అమృత భిక్షయే!

*"నల్లనివాఁడు పద్మ నయనంబులవాఁడు కృపారసంబు పైఁ*
*జల్లెడువాఁడు మౌళి పరిసర్పిత పింఛమువాఁడు నవ్వు రా*
*జిల్లెడు మోము వాఁడొకఁడు చెల్వల మానధనంబుఁదెచ్చె నో*
*మల్లియలార మీ పొదల మాటున లేఁడుగదమ్మ చెప్పరే!"*

తెనుగునగల పురాణేతిహాసములలో భాగవతమునకు గల సర్వ ప్రజానురంజకత్వము మఱి దేనికిని లేదు. న్యాయముగా ఈ అనురంజకత్వము భాగవతము కంటె భారతమునకే యెక్కువ ఉండదగినదికాని సార్వజనీన ప్రశస్తి భాగవతమునకు దక్కెను. దానికి కారణము లివి:

1. సంసార తరణోపాయముగా భారతము ఉపదేశము చేసిన పరమ ధర్మము దుష్కరమైన నిష్కామ కర్మయోగము. భాగవత ముపదేశించినది సుకరమైన భక్తియోగము. నిష్కామ కర్మ యోగము సామాన్యు డాచరింపదగినది కాదు. అది నిజముగా మోక్షసాధనములలో ఉత్తమోత్తమమే యైనను తిక్కనవంటి యే పరిపూర్ణులకో తప్ప సామాన్య లోకమున కసాధ్యము. భాగవతమున ప్రతిపాదింపబడిన భక్తియోగము సర్వప్రాణి సాధారణమైన తారకమంత్రము. నేటికిని ఆపద్వేళల గజేంద్ర మోక్షమును సంజీవనిగా జపించువారున్నారు. గోపికా గీతములను భగవద్గీతకంటెను ఎక్కువగా నధ్యయనము చేయువారున్నారు. గొంతెత్తి ఆ ఘట్టముల యందలి పద్యములను పాడుకొనుట కంటె ఏ జపములును తపములును అధిక ఫలప్రదములు కావు

2. తెనుగున భారతములోనున్న శిల్ప కౌశలము సర్వకళాసంపన్నులైన ప్రౌఢులకుగాక సామాన్యులకు అర్థముగాదు. కవిత్వమును గానముగా ఆలపింపదగిన పద్యములు భారతమున దొరకవు. ఆ గ్రంథమున పద్యముల సొగసు వరకే పద్యములు వ్రాయుట యనునది జరగలేదు. భారతములో సందర్భము నుండి విడదీసి ఏ పద్యమును ఆనందించుట పొసగదు. అది నిబిడమైన మూర్తి నిర్మాణము. ఇక భాగవత పద్యములు

భజన కీర్తనలవలె, పెండ్లి పాటలవలె, ఏలపదములవలె అతిమధురములై ఎల్లరు ఎల్లవేళల పాడుకొనుటకు అనువై దేశమెల్లెడల వ్యాపించినవి. ఆ పద్యములలోని శ్రుతి లయలు ఉచ్చారణ మాత్రముననే మనస్సును లోగొనుశక్తి గలవి. ఏ పద్యమున కాపద్యమే ఒక కావ్యమనిపించుకొనుచుండును శిల్ప నిర్మాణమున భారతముకంటె న్యూనమేయయ్యు భాగవత కవిత్వము ఎక్కువ లోకరంజకమగుటకు అందలి పద్యగత గీతియే కారణము.

3. భాగవతకవి అనుభవించిన దారిద్ర్యము, దాని నెదుర్కొని పోరాడిన ఆయన ధీరత్వము ఆశ్చర్యజనకములై లోకమునకు ఆ మహానుభావుని యెడ ఎక్కువ పూజ్యభావమును కలిగించెను. ఆ భావమే భాగవతమునకును సంక్రమించెను. విమర్శకులు ఎంత కాదన్నను వ్యక్తియెడ గల గౌరవాగౌరవములు తత్కృతమైన కావ్యమునకు గూడ సంక్రమించుట మానవ సహజము. మఱి మన జాతి లక్షణమును బట్టి సంపన్నులకంటె దరిద్రులకే పెద్ద పూజలు జరుగుచుండును. ఇవిగాక మరి యేవైన కారణములుండవచ్చును.

## కవిత్వ పరామర్శ

పోతన కావ్యశిల్ప మర్యాదలకు కట్టుబడిన కవి గాడు. ఆ ధర్మములకు అతీతుడైన భాగవత శేఖరుడు. భాగవత పరనవేళ ఈ మర్మమును గుర్తుంచుకొనక పోయినచో ఆ గ్రంథమును పూర్తిగా ఆమోదింపలేము. అసలు భాగవతముననే సందర్భౌచితిని పాత్రౌచితిని కోల్పోయిన ఘట్టములు కొన్ని కలవు. అట్టివి అన్ని పురాణములకును సహజములే. ఒక ఉదాహరణమును చూడుడు·

హిరణ్యాక్షుని మరణమునకై విలపించుచుండిన అతని తల్లి దితిని ఓదార్చు సందర్భమున ఆమె రెండవ కుమారుడైన హిరణ్యకశిపుడు

సీ॥ *"సర్వజ్ఞుఁ డీశుండు సర్వాత్ముఁడవ్యయుఁ*
*డమలుండు సత్యుఁ డనంతుఁ డాఢ్యు*
*డాత్మ రూపంబున నశ్రాంతమును దన*
*మాయా ప్రవర్తన మహిమ వలన*
*గుణములఁ గల్పించి గుణ సంగమంబున*
*లింగ శరీరంబు లీలఁదాల్చి*
*కంపిత జలములోఁ గదలెడి క్రియదోఁచు"*
*పాదపంబులభంగి భ్రామ్యమాణ*

ఆ॥ *చక్షువుల ధరిత్రి చలితయై కానంగఁ*
*బడినభంగి వికలభావ రహితుఁ*
*డాత్మమయుఁడు కంపితాంతరంగరంబునఁ*
*గదలినట్లు దోఁచుఁగదలఁడతడు.*

అని ఆత్మతత్వము నుపదేశించుటేకాక, ఆ పైని శరీరానిత్యత్వమును గూర్చి యజ్ఞోపాఖ్యానమనెడి ఒక ఐతిహ్యమును ఉదాహరించును ఈ పలుకులు నిత్యానిత్యవివేకము కలిమిచే పరమ భాగవతోత్తముడైన ప్రహ్లాదుని నానాబాధలు ఁట్టి

హింసించిన హిరణ్యాకశిపుని నోట వెలువడ దగినవి కావు. ఇందు పాత్రౌచిత్యము లేదు. అందుచేతనే పురాణములలో వక్తృ విశేష శ్రోతృ విశేషముల విశేష వివేచన చేయతగదని ఒకచో చెప్పితిని. మూలమున అట్లున్నను ఆ కథను ఆ సందర్భమును సవరించుటకు పురాణానువాదకులు ప్రయత్నింపరు. కాని మూలమున లేని ఇట్టి అసందర్భ వాక్యములే పోతనకూడ వ్రాసెను. ప్రహ్లాదుని గుణవర్ణనలో "కన్నుదోయికి నన్య కాంత లడ్డంబైన మాతృభావముచేసి మరలు వాడు" అనియు "భవ్య వయోబల ప్రాభవోపేతుడై కామరోషాదుల క్రందుకొనడు" అనియు వ్రాయుటలో ఔచిత్యము లేదు. ఆ బాలుడు పంచశరద్వయస్కుడని కదా కథలో చెప్పబడినది! అట్టి వానికి స్వపర కాంతాభేదము, కామరోషాది భావన మొదలగు దుర్గుణములు లేవని చెప్పదలచుటయే న్యాయము కాదు. పరమ భాగవతుల ప్రవృత్తిలో అట్టి సుగుణ సంపద ఒక అంశము. పోతన ఆ పద్యములలో వర్ణించినది ప్రహ్లాదుడనెడి బాలునికాక ఒక పరమ భాగవత శ్రేష్ఠుని అనుకొన్నచో ఆ పద్యార్థము ఆస్వాద్యమగును. కావున అయన ఈ కావ్యశిల్ప ధర్మములను పాటించి కవి కాడు.

స్వభావముచే తిక్కన కవితా ప్రతిభ నాటకీయమైనట్లు, పోతనది భావ కవితా ప్రతిభ. మరియు తిక్కనశైలి బుద్ధిగమ్యము, పోతన శైలి కర్ణపేయము. భాగవతము భక్తి ప్రధానమైన పురాణ మగుటయు, ఈకవివతంసుడు మహాభక్తుడగుటయు కారణములుగా అందలి భక్తులతో ఈయన కవితాత్మకు తాదాత్మ్యము కలిగి వారే తానుగా, తానే వారుగా వర్తించుచున్నాడా? యనెడి ఊహను కల్గించును. అందును భక్తి శృంగార భావ పరిపోషణమునందు పోతన అతి మాత్రమునకు పాల్పడు భావలోలుడు. శ్రీకృష్ణుని బృందావన విహారాదుల వేళ ఆనందమున ఉప్పొంగిన యమునా నదివలెనే, భాగవతమున వెల్లివిరిసిన శృంగార రస ప్రాధాన్యమునకు పోతనగారి భావలోలతయే ప్రధాన కారణము. పురాణేతిహాస కర్తలలో ఇట్టి భావావేశము కల వ్యక్తి ఇంకొకడు లేడు. ఈయన శృంగారము ప్రబంధ శృంగారము వంటిదిగాక జీవేశ్వరైక్య ప్రతిపాదకమగు ఆధ్యాత్మిక శృంగారమగుటచే ఆ రసరాజము భాగవతమున పరమ పవిత్రతను తాల్చినది.

అయనది స్త్రీ జనోచితమైన సరస కోమల హృదయము సహజముగా భక్తులహృదయము స్త్రైణ సౌకుమార్యము కలది (Femininly tender) భాగవతమున స్త్రీ పాత్రల పలుకులేవి ఆలకించినను చెవులకు చల్లగా హృదయమునకు హాయిగా వినబడును. ఒక ఉదాహరణ: పాండవులు అశ్వత్థామను బంధించి తెచ్చి తనయెదుట పెట్టినపుడు నిరపరాధులైన తన పుత్రులను నిద్రలో చంపిన అతనిని పరుష వాక్యములతో చిత్రహింస చేయవలసిన ద్రౌపది దానికి విరుద్ధముగా తల్లివలె మృదువుగా మందలించిన వాక్యములలో గల మార్దవము పోతనగారి హృదయ మార్దవము యొక్క బహిర్గత రూపమే!

*కం॥ "భూసురుఁడవు బుద్ధిదయా భాసురుఁడవు శుద్ధ వీరభట సందోహా*
*గ్రేసరుఁడవు శిశుమారణ మాసుర కృత్యంబు ధర్మమగునే తండ్రీ!*

*శా॥ ఉద్రేకంబున రారు శస్త్రధరులై యుద్ధావనిన్ లేరు కిం*
*చిద్ద్రోహంబును నీకుఁ జేయరు బలోత్సేకంబుతోఁ జీఁకటిన్*

భద్రాకారులఁ జిన్నపాపల రణప్రౌఢ క్రియాహీనులన్
నిద్రాసక్తుల సంహరింప నకటా! నీ చేతులెట్లాడెనో!"

సమస్త కళలకును మూలధర్మములగు శ్రుతి లయలను గవిత్వమున ఛందో నిబద్ధమగు శబ్దమెంత వరకు సాధింపగలుగునో పోతనవలె దృష్టాంత పూర్వకముగా చూపిన పురాణ కవి యింకొకడు లేడు. ఛందస్సంభవమైన మాధురి యాయనకువలె నింకొక కవికి లభ్యము కాలేదు. ఆయనకు గల శబ్దాలంకార ప్రియత్వము దీనికి మఱికొంత వన్నె పెట్టినది మితిమీఱినచోట్ల ననుప్రాసము అర్థానౌచిత్యమునకుఁ బాల్పడిన పట్టులున్నను, సముచిత ప్రయుక్తమయినచోట్ల నది భాగవత కవితా గానమునకు మృదంగ వ్యాపారమును నిర్వహించుచున్నట్లుండును కవి స్వేచ్ఛగాఁ గాడుకొను భక్తి గానమును, ఆ గానమున కనురూపమైన మధురాతి మధురమైన శబ్దమును, ఆ శబ్ద సంఘమునకు మకుటాయమానమైన యంత్యప్రాసము గలసి భాగవత కవితా పఠనమును తాళమృదంగములతోడి గానసభగాఁ బ్రవర్తింపజేయును.

## తిక్కన - పోతన

శ్రీ ఉన్నవ లక్ష్మీనారాయణ గారొకసారి ప్రసంగవశమున తిక్కన ఆంధ్ర కవులలో సూర్యునివంటి వాడనియు, పోతన చంద్రునివంటి వాడనియు చెప్పిరి. అనగా ఆంధ్రలోకమునకు వీరిరువురు రెండు వెలుగులన్న మాట. ఆంధ్రజాతికి తెలుగు వేదములనదగిన మహాగ్రంథములను ప్రసాదించిన గురుమూర్తులు కేవల కవులు కాక ఇరువురును ప్రవక్తలని చెప్పదగిన ద్రష్టలు. హరిహరాభేదము, నిష్కామ కర్మయోగమును తిక్కన ఉపదేశము. శ్రీకృష్ణ భక్తియోగము పోతన మంత్రము. తిక్కన ఉపదేశమునకు బీజాక్షరములు 'సోఽహం', పోతన మంత్రమునకు 'దాసోఽహం' అయ్యు సిద్ధివేళ పోతనయు నద్వైతియే కాని, విశిష్టాద్వైతికాడు సూక్ష్మముగా విచారించినచో ఆంధ్రుల మనః క్షేత్రముల యుగయుగములనుండి వేరు నాటుకొని యున్న ఈ రెండు ఆధ్యాత్మిక లక్షణములను (నిష్కామకర్మ, జ్ఞాన నిరూఢమైన భక్తి) ఈ ఇరువురి మహాకవులు తమ మహాగ్రంథములలో ప్రతిఫలింపజేసి తాము జాతికి ప్రతినిధులుగా నిలబడుటయే కాక తమ జాతి యాధ్యాత్మిక సంపదకు వ్యక్తస్వరూపమును నిలువబెట్టిరి.

పోతన జీవితము తిక్కన జీవితమువలె పరిపూర్ణమైనది కాదు. ఆయన నిస్పృహత్వము వల్ల ఐహికానుభవము దూరమైనది. ఈ కొఱతయే ఆయన కళా దక్షతలోను లోటు దెచ్చినది. ఆ ఉభయసిద్ధియే తిక్కనను శిల్పపారంగతుని జేసినది. లోకమును ప్రకృతిని కన్నార చూచి మనసార ననుభవించిన కవికి గలుగు అనుభవములు శిల్ప నిర్మాణములో ఎంతో సహాయకారి యగును. దీని యెడ విముఖతగల కవి, సృష్టికి ప్రతిసృష్టి యనదగిన శిల్పనిర్మాణములో కృతహస్తుడగుట సంశయాస్పదము జీవితానుభవ మెంత విశాలముగ నున్న కవితా ప్రపంచ సృష్టి యంత గంభీరముగా సజీవముగా నుండును. నిస్పృహులైన కవులు కాల్పనిక లోకములను సృష్టింపకలరే కాని స్వాభావికమైన మానవ లోకమును సృష్టింపలేరు. అసలు కళాభేదములలోనే స్వాభావికమని యొకటి కాల్పనికమని యొకటి - రెండు కలవు. ఈ రెంటిలో

మొదటిది తిక్కన కళ; రెండవది పోతన కళ. స్వాభావిక కళ యనగా చూచినది చూచినట్లు చిత్రించుట కాదు. అట్టి చిత్రణము శిల్పమే కాదు. శిల్ప ప్రపంచ మెప్పుడును జగదతీతముగనే యుండును. స్వాభావిక శిల్పి ఆ అతీతమును లక్ష్యముగా నుంచుకొని మానవు నక్కడకు గొంపోవుచు, ఈ వాస్తవ జగత్తు కూడ చూపుచుండును. అనగా ప్రత్యక్ష జగత్తును ప్రతిఫలింపజేయుచునే ఆదర్శ జగత్తు సృష్టింపగలడన్నమాట. ఇక కాల్పనిక శిల్పి ఈ ప్రపంచమును సరకుగొనడు. అతని లక్ష్యమువలెనే అతని సృష్టియు లోకాతీతమే. ఈ ఇరువురకు గల ఈ భేదము సామాన్య స్థూల ధర్మముగా జెప్పినదే కాని ఏకాంత లక్షణముకాదు. తిక్కన పూర్తిగా నేకాంత వాస్తవిక శిల్పియనిగాని, పోతన ఏకాంత కాల్పనిక శిల్పియని కాని దీని యర్థము కాదు. ఈ భేదము వారి మనో ధర్మములలోనే యున్నది. సహజముగా ఉత్తమ నాటక కవి విధిగా స్వభావముచే ఆశ్రయించి నడచును. ఉత్తమ భావకవి నిరంతరము ఆదర్శ జగత్తునే ఆశ్రయించును.

హృదయమున పొంగి పొరలిన రసభావముల నెప్పట్టున వట్టిపోనీక యొక బిందువును సముద్రముగా విస్తరింపజేయు శక్తి పోతనది. వెల్లివిరిసిన భావోద్రేకమును మహాకవి యెంతవరకు నిగ్రహించుకొనగలడో ప్రదర్శించిన వాడు తిక్కన. భావ పరిప్లుతి రసస్ఫూర్తికి దోహదమైనట్లే భావ నిగ్రహము కావ్యకళాసిద్ధికి ప్రాథమిక ధర్మము. రసము పేర కళా న్యూనతగాని, కళా వ్యాజమున రసలోపముగాని కలిగినపుడా రెండును వర్జనీయములే! ఆ సామరస్య సంపాదనమే ఉత్తమ కవితకు ముఖముద్ర భావకవులలో పెక్కురకు హృదయములు రసనిమగ్నములైనట్లే దృష్టియు అశ్రుపూరిత మగును. నీరుగ్రమ్మిన ఆ కన్నులతో వారు వర్ణ్య వస్తువును సమగ్రముగా చూడజాలరు. అనగా బుద్ధి జ్యోతి మసకమసకలాడి కధార్పితములైన వస్తువుల సముచితాంగప్రత్యంగ స్థానాది ధర్మములను చక్కగా చూడజాలదు. తిక్కనకువలెనే పోతనకును శిల్పసిద్ధి యున్నచో అయనను మించిన కవి ఈ ప్రంపచమున నుండెడి వాడు కాడు. విధివిలాస మట్టి సమగ్రత నుండనీయదు.

తిక్కన లోక ప్రవృత్తి యందువలెనే కావ్యము నందును వ్యక్తావ్యక్త స్వరూపుడుగా పట్టువడియు, పట్టువడక నడచును. ప్రతి వాక్యమునందును అయన మూర్తి స్ఫురించుచునే యుండును. మరల కాదనిపించుచుండెను. ఇక పోతనయో సంసారమున పట్టువడకపోయినను కవిత్వమున స్పర్శ మాత్రముననే చేతికందును. నాటక కవులకును భావ కవులకును గల ముఖ్యభేదమిదియే!

## భోగినీ దండకము

ఒక వేశ్యయువతి సుందరాకారుడైన సర్వజ్ఞ సింగమ నాయకుని వలచి, వలవంతకు లోనై వ్యధ చెందుచుండగా ఆమె తల్లి అది కులాచార విరుద్ధమని కుమార్తెను మందలించి హితము గరపును. ఆ తరుణి తల్లి మాటలము సరకు గొనక తెగించి యెటో నాయకుని సన్నిధానమునకేగి పాదములపైబడి తన్నేలు కొమ్మని అర్థించును. అతడు ఆమె ననుగ్రహించి ఏనుగుపై నూరేగించి ప్రియురాలిగా స్వీకరించి అనుగ్రహించును. ఈ కధాలేశమే ఇందలి ఇతివృత్తము. ఇందు వేశ్యమాత

పుత్రికకు చేయు హితోపదేశము చాల సొగసుగా నుండును. ఇది పోతన కృతముగా గ్రంథాంతమున ఈ క్రింది పద్యము కలదు:

ఉ॥ "పండిత కీర్తనీయుఁడగు బమ్మెర పోతన యాసుధాంశు మా
ర్తాండ కులాచలాంబునిధి తారకమై విలసిల్ల భోగినీ
దండకమున్ రచించె బహుదాన విహర్తకు రావు సింగ భూ
మండల భర్తకున్ విమత మానవనాథ మదాపహర్తకున్."

ఈ సింగ భూపాలునకే సర్వజ్ఞ సింగుడను బిరుదు కలదు. ఇతని తండ్రి అనపోతనాయకుడనియు, తాత సింగభూపాలుడనియు ఈ దండకముననే కలదు. ఇతని కాలము 1430 – 1475 శ్రీనాథుడు–

"ఎట్లు మెప్పించెదో నన్ను నింకమీఁద
రావు సింగ మహీపాలు ధీవిశాలు
నిండు కొలువున నెలకొనియుండి నీవు
సకల సద్గుణ నికురంబ శారదాంబ!"

అని సరస్వతిని వేడుకొనుట ఈ రాజును సందర్శించబోవు సందర్భముననే 1475 సంవత్సరము వరకు రాజ్యమేలినను ఈవేశ్యా ప్రణయగాథ ఆతని అపర వయస్సున కాక కౌమార దశలోనిది కాదగును కానిచో ప్రాయంపుటౌచిత్యమే యుండదు. అప్పట్ల రాజ్యపాలన ఆరంభకాలమున యెప్పుడో జరిగియుండును. ఈ దండకము పోతనయే వ్రాసిన దగుచో అయనకూడ ముప్పది సంవత్సరముల ప్రాయము వాడగును కాబట్టి పోతన శ్రీనాథునికంటె 15–20 సంవత్సరములు చిన్నవాడు. పోతన శ్రీనాథ సర్వజ్ఞసింగులు సమకాలికులగుట యథార్థము. చిన్ననాడు ఈ దండకము వ్రాసి పెట్టిన చనవు బలిమినే సింగము నాయకుడు భాగవతమును తన కంకిత మిమ్మని అర్థించుటయు, ఆయన నిరాకరించుటయు జరిగి యుండవచ్చును.

ఇది పోతన కవిత్వమగునా? కాదా యని చిరకాలము నుండి వివాదము కలదు. ఎన్నికడగండ్లకైన నొప్పుకొని భాగవతమును నరాంకితము జేయని ఈ స్వార్థత్యాగి, యీ మహాభక్తుడు రావు సింగమహీపాలుని వేశ్యపై దండకమును వ్రాసెననుట సహింపలేక విమర్శకులు కొందరది పోతన కృతము కాదందురు. ఇతర కవులకు ప్రయత్న సాధ్యమును భాగవతకవి కాజన్మసిద్ధమునగు ననుప్రాసాలంకార మీ దండకమున ప్రతి పంక్తిలోను పరిస్ఫుట మగుచున్నది. అదిగాక కర్తృనామము సయితము పోతనదిగానే గ్రంథస్థమయియున్నది. కావున దీనిని పోతన వ్రాసి యుండవచ్చును. ఆ రోజులలో కీర్తి హేతువులుగా పరిగణింప బడినట్టియు, రాజానుగ్రహకారకములై నట్టియు నిట్టి రచనలు దండకాదులు పెక్కులు గలవు. ఈ రచనవలన పోతన కీర్తికి కళంకముగాని ఆయన భక్తికి మాలిన్యముగాని అంటదు. చిన్నవయసున విద్వత్ప్రభువగు నారాజు కోర్కెపై అదండకమును వ్రాసియుండవచ్చును గ్రంథమును నరాంకితము చేయగూడదను నియమము వయః పరిణామమును బట్టి కలగు సంస్కారము కావచ్చును. అదిగాక ఆంధ్రకవులలో చాలమంది రాజుల కోర్కెలనుబట్టి వారి ప్రియురాండ్రపై పట్టపు దేవులపై అనేక శృంగార దండకములను వ్రాసి యిచ్చిరి.

రాజులు కోరిన చిత్ర పటములను రచియించెడి చిత్రకారులుండగా, వారిని కాదని వీరినే తిరస్కరించుటకు హేతువుండరాదు. అది వేశ్యాచిత్రమనికాని శృంగార ప్రధానమనికాని యా చిత్రకారుడు నీకవియు సేవగించుకొని యుండరు. మఱి ఈ వేశ్యలు నేటి భోగమువాండ్రు కారు. వారికి పట్టమహిషితో సమానమైన గౌరవ ప్రపత్తులుండెడివి. తంజావురిలో మధురవాణి, రంగాజమ్మ మొదలగు వేశ్యలు సమస్త విద్యా సంపత్తిచే సభలలో నగ్రస్థాన మలంకరించిన మహనీయురాండ్రు. ప్రతాపరుద్రుని ప్రియురాలు మాచల్దేవి గొప్పదనమును శ్రీనాధుడు క్రీడాభిరామమున వర్ణించెను గదా! అమర్యాదలు అకాలధర్మములు వేరు. నేటి యాచారములను బట్టి వాటిని తిరస్కరించుట తప్పు.

**భోగినీ దండకము వంటి కొన్ని తెలుగు దండకములు:**

1. చంద్రకవి – మైసూరు రాజైన కృష్ణ ప్రభువు నాస్థానకవి (పద్మావతీ దండకము)
2. నుదురుపాటి సాంబన్న – పుదుకోటలోని తొండైమాన్ ఆస్థానకవి (చంద్రాననా దండకము)
3. లక్ష్మీదాస కవి – పద్మినీ దండకము (కూర్మేటి రాయప్ప అను సంపన్నుని కోర్కెపై వ్రాసినది)
4. గణపవరపు వెంకట కవి – (విద్యావతీ దండకము) ఇట్టివి పెక్కులు.

**దండకములు:** మనము విస్మరించిన వాఙ్మయ శాఖలో దండక మొకటి పాటలు, పదముల వలెనే దేశ మంతటా ఇవి వ్యాపించి యున్నవి. దండకము లయాన్వితమైన గద్య. తెనుగున శతకము లెన్ని కలవో దండకములన్ని కలవు. శతకములలోవలె దండకములలో కూడ సగపాలుకంటె నెక్కువ భక్తిపరములయి యున్నవి. ఆ భక్తి భావము వీటిలో స్తోత్రరూపము దాల్చును. వాఙ్మయ వ్యవస్థాపకులైన పెద్ద కవులు సైతము తమ తమ గ్రంధములలో వీనిని స్తోత్రపరముగానే రచించిరి. భారతారణ్య పర్వమున ఈశ్వర దండకము, నైషధ మందలి భీముని సరస్వతీ స్తోత్రము. కళా పూర్ణోదయ మందలి మణికంధురుని శ్రీకృష్ణస్తోత్రము మొదలైనవి.

ఇక ప్రత్యేక దండకశాఖలో ప్రధానములైనవి మహాలక్ష్మీ దండకము, ఆంజనేయ దండకము, నృసింహ దండకము మొదలైనవి. ఇవి ఆపన్నివారకములని ప్రజల నమ్మకము. ఇవికాక సాంఘికములగు తేలిక దండకములును గలవు. వింతలు విశేషములు జరిగినపుడో, దేశోపద్రవములు వాటిల్లినపుడో, నవ్వులాటకో, మెప్పుకో ఆయా ప్రాంతీయులు వ్రాసిన దండకములట్టివి ఉప్పెన దండకము (బందరు), జమాబంది దండకము మొదలగునవి.

## వీరభద్ర విజయము

భాగవతములో దక్షాధ్వరధ్వంస సందర్భమున పోతన చేసిన శివనిందా పాపము సమసిపోవుటకై ఆయన ఈ వీరభద్రవిజయమును రచించెనని లోకమున ఒక పుక్కిటి పురాణము గలదు. ఆ విషయమే వీరభద్ర విజయమున షష్ఠ్యంతములకు పూర్వము ఒక పద్యములో నున్నది. ఆ పద్యమిది:

ఉ॥ "భాగవత ప్రబంధమతి భాసురతన్ రచియించి దక్షుదు
ర్యాగ కథా ప్రసంగమున నల్పవచస్కుఁడనైతి తన్ని మి
త్తాగత వక్త్రదోష పరిహారముకై యజనైకశైవ శా
స్త్రాగమ వీరభద్ర విజయంబు రచించెద వేడ్కనామదిన్."

ఈ పద్యము కొన్ని వ్రాతప్రతులలో లేదట. లేని మాటయే నిజమై యిది ప్రక్షిప్తమేయయి యుండినచో గ్రంథ రచనా వివాదము సగము పరిష్కారమగును. ప్రక్షిప్తము కాదనెడి వాదమును ఈ పద్యమును బట్టియే గ్రంథము పోతన కృతము కాదని పూర్వపక్షము చేయవచ్చును. ఎట్లనగా భాగవతమును శివనింద చేసినవాడు దక్షుడుగాని పోతనకాదు. పాత్ర నోట పల్కించిన దుర్వాక్య పాపఫలము రచయిత అనుభవింపవలసినవాడే యయినచో కవులందరును పుణ్యపురుషులనే పాత్రలుగా నెన్నుకొని వారినోట వెడలెడి సద్వాక్యములతోనే కథలు నడుపలసి వచ్చును. ఇది అసంభవము కదా! రామాయణమున రావణునిచే కథావశమున సీతారాములను నిందింపజేసిన వాల్మీకి పాపప్రాయశ్చిత్తము చేసికొనవలెనా? మరి ఈ భాగవతముననే ఆ దక్షాధ్వర ధ్వంసముననే నందికేశుడు వేదములను, దేవతలను అతి పరుషముగా దూషించెను శివనిందా పాపమువంటిదే ఈ వేదనిందా పాపము కూడ! వీరభద్ర విజయరచనతో శివనిందా పాపము పోవుట నిజమేని మరి ఈ వేదనిందా పాపము పోవుటకు పోతన ఇంకొక గ్రంథమును వ్రాయవలె గదా! ఇవన్నియుగాక యీ వీరభద్ర విజయముననే దక్షాధ్వర ధ్వంస కథనము మరల కలదు కదా! వీరభద్ర విజయమునకు ఆ దక్షాధ్వరమే పూర్వరంగము. మరి ఇయ్యెడను ఆ దక్షుడు శివనింద చేయవలసివచ్చెను. అట్లు చేయనిచో కథయే నడువదు. అందుచే ఈ గ్రంథము రచించుటవలన పోతన రెండుమార్లు శివనింద చేసినవాడయ్యెను. కావున ఈ గ్రంథ రచనకు శివనిందా పాపప్రాయశ్చిత్త వ్యాజము కారణము కాజాలదు. ఆపై పద్యమును లోకవదంతిని విస్మరించి యీ గ్రంథ రచనా విషయమును పరిశీలింతము.

ఈ గ్రంథ రచనకు పోతనను ప్రోత్సహించినవారు ఆయన గురువైన ఇవటూరి సోమశేఖరుడు. ఆ గురువు పోతనతో-

తే॥ "...... ఇప్పుడు మాకెల్ల నూహాలోన
వింతపండువు బోలెను వీరభద్ర
విజయమెల్లను వినఁగడు వేడ్కయయ్యె
నది దెలుంగున రచియింపు మభిమతముగ.

ఆ.వె॥ పిన్నవాఁడననియుఁ బెక్కు సంస్కృతులను
విననివాఁడననియు వెఱపుమాను
మత్ప్రసాద దివ్య మహిమచే నెంతైన
కవిత చెప్పలావు గలదు నీకు"

అని పలికెను. దీనిని బట్టి పోతన భాగవతానంతరమున కాక పిన్ననాడే యీ గ్రంథమును గురు నాదేశము ప్రకారమ్ము వ్రాసి యుండవచ్చును. కాని అట్లగుచో శివనిందకును, ఈ రచనకును ఏమియు సంబంధములేదు. కాని తీరని సందేహమొకటి కలదు.. ఈ రచనా

కాలమునాటికి పోతన ఇంచుమించు వీరశైవుడని చెప్పదగిన పరమమాహేశ్వరుడు. అందుకు నిదర్శనముగా అవతారికలో పద్యములు గలవు. మరి ఆ అవతారికలోనే *"జనక శిక్షిత నిహితాక్షరాభ్యాసుండను"* అని చెప్పుకొనెను. అనగా తన తండ్రియే తన విద్యా గురువు అని దాని అర్థము. అదియునుగాక గద్యలో "శ్రీ మన్మహామహేశ్వర ఇవటూరి సోమనారాధ్య దివ్యశ్రీ పాదపద్మారాధక కేసనామాత్య పుత్ర పోతయ నామధేయ ప్రణీతంబైన" అని సోమనారాధ్యుని గురుత్వమును ఉగ్గడించుకొనెను ఇక భాగవతములో ఇందుగల వీరశైవ భక్తుల నామస్మరణమైనను లేదు. తండ్రిగారు చేసిన విద్యా, గురుత్వమును విస్మరించి సహజ పాండిత్యుడనని చెప్పుకొన్నాడు. తొలినాటి వీర మహేశ్వరుడు ప్రౌఢ వయస్సున వైష్ణవము పుచ్చుకొని, విద్యాగురువు మత గురువు తలపునకురాని రెండవ జన్మ ఎత్తెనా? అనెడి సంశయము పోతన యెడ తాత్పర్యముగల విద్వల్లోకమును మిక్కిలి బాధించును ఈ సంశయము తీర్చగల సోపపత్తికమైన వాదము ఇంతవరకు వెలువడలేదు.

ఇంకొక విషయము. భాగవతమున కానవచ్చు పోతనగారి కవితా లక్షణములు ఈ గ్రంథము మచ్చునకైనను కానరావు. ఇది పిన్ననాటి కవిత్వము కనుక భాగవతశైలి యీ గ్రంథమునాటికి పరిణమింపలేదేమో అని అనుకొందమన్నను అది పొసగదు ఏమన పరిణామదశయందలి శైలీ విశేషములు ఆరంభ దశయందు అంకురములుగా పొడగట్టుచునే ఉండును. మొదట అంకురములేని పరిణామము ఎయ్యెడను జరుగదు.

## మడికి సింగన

ఈతడు పోతన కించుక పూర్వుడు. భాగవత దశమస్కంధ ద్విపద, పద్మపురాణోత్తర ఖండము, వాసిష్ఠరామాయణములను 'సకల నీతి సమ్మతము'ను సంకలన గ్రంథమును కూడ రచించెను.

ఈతడు పోతన కించుక పూర్వుడగుట భాగవత ద్విపద పోతన రచనకు పూర్వ రచన యని ఊహ. హరివంశమున కృష్ణచరిత్ర యాదవచరిత్రకు ఏకదేశము. శ్రీకృష్ణచరిత్రకు ప్రత్యేకత నాపాదించుటకై భాగవత దశమ స్కంధమును ద్విపదగా రచించెను. ఈ ద్విపద కవిత్వము లలితమయ్యు రసవత్తరము గాదు.

శ్రీనాథుని తాత కమలనాభామాత్యుడు పద్మపురాణ పూర్వఖండమును వ్రాసెను మడికి సింగన 'పద్మపూరాణోత్తర ఖండము'ను వ్రాసెను

**వాసిష్ఠ రామాయణము:** ఇందు రామాయణ కథయుండదు. బాలకాండ కథ కలదు. రాముడిందు నిరుత్సాహుడుగా చెప్పబడెను. ప్రాపంచిక దుఃఖములను చూచి నిర్వేదము చెందిన వాని వలె యుండును. ప్రపంచ స్వభావమును రామునికి వశిష్ఠుడు చెప్పెను. అర్జునునకు కృష్ణుడొనర్చిన బ్రహ్మవిద్యోపదేశము వంటిది. ఈ వాసిష్ఠ రామాయణమును తరిగొండ వెంగమాంబ ద్విపదగా రచించెను

'సకల నీతి సమ్మతము' తెలుగున మొదటి సంకలన గ్రంథము

## జక్కన

ఇతని విక్రమార్క చరిత్ర వెన్నెలకంటి సిద్ధన మంత్రికి అంకితమీయబడినది. ఆ కృతిపతి 1423 నుండి 1447 వరకు విజయనగర రాజ్యమును పాలించిన ప్రౌఢ దేవరాయల కాలములో, ఉదయగిరి దుర్గాధిపతిగానో, ఆ దుర్గపరిపాలకుని మంత్రిగానో పెద్దపదవి యందుండిన ఒక సంపన్నుడు. ప్రౌఢదేవరాయని ప్రధానమంత్రియు దండనాయకుడైన చామనామాత్యుడు ఈ సిద్ధయమంత్రికి చామరచ్ఛత్రాందోళికాది రాజపరిచ్ఛదములనిచ్చి గౌరవించినట్లు ఈ గ్రంధమున కలదు. శ్రీనాధునకు ముత్యాలశాలలో కనకాభిషేకముచేసిన విజయనగర ప్రభువు ఈ ప్రౌఢ దేవరాయలే కావున జక్కన శ్రీనాధునకు సమకాలికుడు. వయస్సున వారిరువురిలో ఎవరు జ్యేష్ఠులో చెప్పలేము. బహుశ సమవయస్కులై యుండవచ్చును.

విక్రమార్క చరిత్ర అనెడి యీ గ్రంధమునకు ఉజ్జయినీపురము నేలిన విక్రమార్క చక్రవర్తి కధానాయకుడు. ఆ చక్రవర్తి చారిత్రక పురుషుడైనను అతని గూర్చి చెప్పబడిన ఇందలి కధలు చారిత్రకములుగా కన్పట్టవు. వాటిలో కొన్నిట లేశమాత్రముగానైన వాస్తవికత ఉండిన ఉండవచ్చునుగాని అతిమానుషమైన ఆ కధా సముద్రమునుండి ఆ లేశమును ఉద్ధరించుట అసాధ్యమైన కృత్యము. కావున ఈ గ్రంధము చారిత్రక పురుషుని పేరుమీద ఉన్నను గ్రంధ విషయము మాత్రము చిత్రాఖ్యాన జాతిలో చేరును. తెలుగులో దీనికి సాటిరాగల పూర్వ గ్రంధము కేతన దశకుమార చరిత్ర మొక్కటియే. దాని యందువలె దీనియందును చిత్ర విచిత్రములైన సాహస కృత్యములే వర్ణింపబడినవి. అయితే దశకుమార చరిత్రలో ఆ సాహస కార్యములు నాయకునితో పాటు అతని మిత్రులు కూడ నెరవేర్చినవి. ఈ గ్రంధమున ఆ సాహసములన్నియు నాయక కృతములే మరి దశకుమారచరిత్ర కధలలో విక్రమార్క కధలో నున్నంత ఉదాత్తత లేదు. ఈ సాహస కార్యములను బట్టియే విక్రమార్కునకు సాహసాంకుడను బిరుదు కల్గినది కాబోలు! తన పేరుమీద ఒక శకమును నెలకొల్పిన విక్రమార్క చక్రవర్తి క్రీ.పూ. మొదటి శతాబ్దమున ఉజ్జయిని రాజధానిగా సామ్రాజ్యమును పాలించినట్లు చరిత్ర ప్రసిద్ధమే. ఆ అంశముతోపాటు వరరుచి, భట్టి, భర్తృహరి అనెడి ముగ్గురు మహానుభావులు అతని అస్థానమును అలంకరించినట్లు లోకవదంతి కలదు. అది యెంతవరకు చారిత్రక సత్యమో లోకమెరుంగదు.

సంస్కృతమున విక్రమార్క చరిత్ర యనియు, భేతాళ పంచవింశతి యనియు పేర్లతో విక్రమార్కునకు సంబంధించిన కధలు గల గ్రంధములు కలవు. వాటిలో మొదటి దానిలో గల కొన్ని కధలతో ఇందలి కధలకు వస్తుసామ్యము కలదు. అంత మాత్రమున అది ఈ గ్రంధమునకు మాతృకయని చెప్పజాలము. మరి జక్కన ఇది ఒక సంస్కృత గ్రంధమునకు అనువాదము అని గాని స్వతంత్ర రచన అనిగాని అవతారికలో చెప్పలేదు. అందుచే ఇందు చాలభాగము అతని స్వంతరచనయే యని ఊహింపవచ్చును

ఇపుడు లభ్యమైయున్న "విక్రమార్క చరిత్ర" యనెడి సంస్కృత వచన గ్రంధము కాదంబరివలె, హర్ష చరిత్ర వలె ప్రౌఢశైలి కలది కాదు. దాని శైలి

కొంత పంచతంత్ర శైలిని, కొంత దశకుమార చరిత్ర శైలిని, పోలి మధ్యమ ఫణితిని అలరారుచుండును. చిత్రాఖ్యానములకును నీతి కథలకును అట్టి శైలియే సముచితమైనది. ఆ కథలు ఈషద్భాషాపరిచయము గల సామాన్యులు తమంత చదువుకొని ఆనందించుట ఉద్దేశింపబడినవి. అంతేగాని కావ్య నాటకాదుల వలె గురువుల నాశ్రయించి పారము చదువుకొనుటకు ఉద్దేశింపబడినవి కావు. జక్కన విక్రమార్క చరిత్ర పద్యమయము గావున ఆ కథలనే ఇతడు ప్రౌఢముగా ప్రబంధ శయ్యలో సంతరించుటకు ప్రయత్నించెను. ఈ క్రింది పద్యము ఆతని సంకల్ప మట్టిదే యని చెప్పుటకు తార్కాణము:

*చ॥ తలపఁ దదీయ నాయకవితానము కంటెను సాహస క్రియా*
*కలిత వదాన్యతాదిగుణ గౌరవ రేఖల విక్రమార్క భూ*
*తలపతి యెక్కుడై నెగడెఁ దచ్చరితంబు ప్రబంధ శయ్యగా*
*దెలుఁగునఁ జెప్పి యా కృతిపతిత్వము మా కొడగూర్పు నేర్పునన్.*

ప్రబంధ శబ్దమునకు నిర్వచనమేమి? దానికి లక్ష్య భూతములైన గ్రంథములేవి? అనెడి ప్రశ్నలను గురించి స్థలాంతరమున చెప్పెదను. ఇచ్చట జక్కన ఉద్దేశించిన ప్రబంధ శయ్యకు అర్థము కావ్యోచితమైన శైలి అని చెప్పుకొనిన చాలును. వాఙ్మయములో కావ్యశైలికి ప్రధానముగా కావలసినది రసవత్త. రెండవది ఆలంకారిక శబ్ద విన్యాసము. కావున చక్కని పదగుంభనము రససంపాదనము గల రచన ప్రబంధ మనిపించుకొనును. అంతేగాక ఆ రచన ముక్తకాది చాటుపద్యమయము కాకుండ, వస్తు నిబద్ధమై యుండవలెను. ఆ వస్తువు యథావస్థముగా సముచిత వర్ణనలతో అలంకరించబడవలెను. ఇట్టి గుణ విశేషములు కలదానినే జక్కన ప్రబంధశయ్య యని నిర్దేశించి ఊహించి యుండవచ్చును.

యథార్థమైన ఉత్తమ ప్రబంధము ఈ శయ్యా మాత్రము చేతనే సిద్ధి పొందదు దానిలో పాత్ర చిత్రణము ప్రత్యక్ష కల్పమైన నాటకీయత మొదలగు ఇతర శిల్ప విశేషములుండును. ఆ శిల్ప నిర్మాణము రాబోవు ప్రబంధయుగమునందు మహాప్రబంధ కర్త లనిపించుకొన్న చాల మంది పెద్ద కవులకే వశమయిన కృత్యము కాదు. ఇక యథార్థమైన ప్రబంధావతరణము జరిగియు జరుగని కాలములో పుట్టిన విక్రమార్క చరిత్ర యనెడి కథల సంపుటిలో ఆశిల్పము నాశించుట నిష్ప్రయోజనము. జక్కన చక్కని వెలితిలేని పదముల కూర్పుతో సుబోధముగా మల్లెపూలదండవలె గుబాళించు సమాసములతో పద్యము వ్రాయగల మేటికవి. ఒకచో చెప్పినది మరియొకచో చెప్పవలసి వచ్చినప్పటికిని పునరుక్తి దోషమును రానీయక క్రొత్తదనమును వెలయింపగల నేర్పరి. సంస్కృతాంధ్రముల రెండింటను సమానాధికారముగల శబ్ద సామగ్రి సంపన్నుడు. పూర్వకవులందరివలెనే నానా శాస్త్ర వైదుష్యముగల మనీషి. ఈ గుణముల కలిమివల్లనే స్తుతిపాత్రమైన పూర్వకవి వర్గమున గణింపబడెను.

విక్రమార్క చరిత్రమునే జక్కన తరువాత అర్ధశతాబ్ది కాలములో కొఱవి గోపరాజనెడి మఱియొక కవి సింహాసనద్వాత్రింశిక యనెడి పేరుతో రచించెను ఈ రెండు గ్రంథములకు గల భేద సాదృశ్యములను కొఱవి గోపరాజు ప్రకరణమున జెప్పెదను.

## అనంతామాత్యుడు

అనంతుడు జిక్కనకువలెనే శ్రీనాధునకు సమకాలికుడు.

ఇతడు భోజరాజీయ మనెడి ఒక కథా కావ్యమును, ఛందోదర్పణమనెడి ఒక ఛందశ్శాస్త్రమును, (దీనికే అనంతుని ఛందస్సని పేరు. దానిలో కొంత వ్యాకరణ విషయము కూడ కలదు.) రసాభరణము అనెడి ఒక అలంకార శాస్త్రమును రచించెను. ఈ మూడు గ్రంథములును వరుసలోనే రచింపబడెను. ఎట్లనగా రసాభరణమున ఛందశ్శాస్త్రమును, ఛందశ్శాస్త్రమున భోజరాజీయమును పేర్కొనబడినవి. మూడవదియగు రసాభరణ రచన శాలివాహన శకము 1356 (క్రీ.శ. 1434) సంవత్సరమున పూర్తియైనట్లు కవియే ఈ క్రింది పద్యమున వ్రాసెను.

*శా॥ జానొందన్ శక వర్షముల్ ఋతుశర జ్వాలేందువై యొప్ప న*
*య్యానందాబ్దమునందు మాఘమునఁ గృష్ణైకాదశీభౌమయు*
*క్తానామామృతవేళ నీ కృతి యనంతాఖ్యుండు సమ్యగ్రస*
*శ్రీనిండన్ ధ్రువపట్టణాధిపున కిచ్చెన్ భక్తి పూర్వంబునన్.*

రసాభరణ జనన వత్సరమైన క్రీ.శ 1434 కు పూర్వము తక్కిన రెండు రచింపబడి యుండుటచే మొదటిదైన భోజరాజీయము 1425–30 మధ్యకాలమున పుట్టి ఉండును.

అనంతామాత్యుని ముత్తాత బయ్యన, తిక్కయజ్వచే భవ్య భారతి యని బిరుదు పొందిన మహాకవి. ఆ బిరుదము తమ వంశమునకే ఒక అలంకారముగా అనంతామాత్యుడును అతని పూర్వులును భావించి యుందురు. అనంతుడా బిరుద ప్రదానము నిట్లు కొనియాడకొనెను:

*చ॥ క్షితిగ్రతు కర్తృతా మహిమ చేకొని పంచమ వేదమైన భా*
*రతముఁ దెనుంగుబాస నభిరామముగా రచియించినట్టి యు*
*న్నత చరితుండు తిక్కకవినాయకుఁ డాదట మెచ్చి భవ్య భా*
*రతి యనఁ బేరుగన్న కవిరత్నము బయ్యనమంత్రి యల్పుఁడే!*

ఈ బయ్యన కవి ఏ మహా కావ్యమును వ్రాసి తిక్కనగారిని మెప్పించెనో ఊహించుటకైనను ఆధారములు లేవు. కాని ఆ బిరుదప్రదానము తనకొక వరప్రసాదముగా ఆ భవ్య భారతి శిరసావహించి యుండును. కావుననే మనుమనికి తిక్కనయని పేరు పెట్టుకొనెను. ఆ తిక్కన కుమారుడే ఈ అనంతుడు. తన తాత తండ్రులు, తాను తిక్కన సోమయాజిని నిష్కళంక భక్తితో పూజించిరి. గావుననే ఈ కవికి కావ్యశిల్ప నిర్మాణమున తిక్కనగారి పరోక్ష గురుత్వము లభించినది. అనంతామాత్యునకు పేరు తెచ్చిన గ్రంథము భోజరాజీయము. కవిపోషకునిగా ప్రసిద్ధిచెందిన భోజునకు సర్పటి అను సిద్ధుడు ప్రసంగ వశమున చెప్పిన కథలే భోజరాజీయమున గల కథా సముచ్చయము. అవన్నియు మానవజీవిత ధర్మములకు ఉదాహరణములుగా చెప్పబడినవి.

*"ధర్మో రక్షతి రక్షితః"* అనెడి ఆర్యోక్తి ప్రకారము ధర్మ పరిపాలనము యొక్క మహిమ ప్రతి కథకు ఫలశ్రుతిగానో, మకుటముగానో నిబంధింపబడినది ధర్మము

లనేకములు. వాటిలో అవశ్యాచరణీయములైన వాటిని కొన్నిటిని మాత్రమే ఆశ్రయించి ఈ కథలు నడచినవి. అట్టివి సుమారు ఇరువది కథలు కలవు. అవన్నియు ఒకదానినుండి ఒకటి ప్రతిపాదితధర్మ సమర్థనార్థము ఉపకథలుగా ఉత్పన్నములగును. కాని యే కథకాకథయే స్వయం సంపూర్ణమై వెలుగొందుచుండును. ఆకొన్నవారికి అన్నమిడుట, ఆడినమాట తప్పకుండుట, ఇతర ప్రాణి రక్షణార్థము శరీర త్యాగము చేయుట, మిత్ర ద్రోహము చేయుకుండుట మొదలగునవి ఇందు ప్రతిపాదింపబడిన పరమ ధర్మములు. అందును అన్నిటికి మిన్నగా సత్యవ్రతనిష్ఠ జీవిత పరమావధిగా కొనియాడబడినది.

కావ్యమున అంతర్వాహినిగా ప్రవహించు ఈ నైతిక నిష్ఠయే ఈ కావ్యమును ప్రకాశింపచేయు జ్యోతి. నీతిబద్ధమైన మానసిక బలము (అనగా ధర్మబలము) శారీరక బలము కంటె సహస్రగుణముగా శక్తిమంతమనియు, ఆ శక్తి క్రూరరాక్షసులను పరమసాధువులుగా, ఘోర వ్యాఘ్రములను గంగి గోవులుగా జేయజాలునది యనియు కవి చేసిన ధర్మ ప్రతిపాదనము. పరస్పర విరుద్ధములైన యీ శారీరక మానసికబలములకు పరస్పరాభిముఖముగా ప్రతియోగము సంఘటించి పైని పేర్కొన్న పరమ సిద్ధాంతమును సమర్థించుటకే ఈ విజ్ఞాన ధనుడు ఇందలి కథలను కల్పించెనా అనిపించును. ఒక కన్ను నీతివంక, ఒక కన్ను శిల్పమువంక నిలిపి రెంటి నాకర్షించి తత్సమ్మేళనమున ఆ రెండు సమాన సౌందర్యముతో వెలుగున ట్లొనర్చిన యీతని శిల్పము శిల్ప సౌందర్యము ధర్మసౌందర్యము కంటె భిన్నము కాదను సిద్ధాంతమునకు పరమలక్ష్యమగుచున్నది. ఈ సిద్ధాంతమునకు పరమ దృష్టాంతముగా ఈ కావ్య లక్ష్మికి కల్యాణ తిలకముగా పేర్కొనదగిన కథ గోవ్యాఘ్ర సంవాదము. అడవిలో పూరి మేయబోయిన ఒక పాడి ఆవుమీద ఆకొన్న ఒక పెద్దపులి దూకుటయు, ఆ యావు నిబ్బరముతో ఆ పులిని నిలుమని పలికి తన కోసము ఎదురు తెన్నులు చూచుచుండిన దూడకు పాలిచ్చివచ్చి పులికి ఆహారమగుదునని వేడుకొని శపథము చేయుటయు, ఆ పులి ఆ యావు చేసిన ప్రమాణములను నమ్మి దానిని పోనిచ్చుటయు, అది ఇంటికేగి దూడకు పాలు కుడిపి ఆడినమాట తప్పకుండ పులి యెదుటకు వచ్చి నిలుచుండుటయు, ఆ పులి అత్యాశ్చర్యముతో అమృతపారణము చేసినంతగా సంతోషించి ఆవును కొనియాడుటయు, భగవంతుడు ఆ గోవు యొక్క సత్యనిష్ఠకు ఈ పులికి కలిగిన స్వభావ పరివర్తనకు సంతోషించి మోక్షమిచ్చుటయు అనునది గోవ్యాఘ్ర సంవాదమనెడి కథయొక్క సంగ్రహ కథనము ఏ కావ్యమునందైనను ఏ కథాపాత్రకైనను సాధారణీకృతి (Universalisation) అనే రూపాంతరము కలుగనిచో ఆ కావ్యమునకు విశ్వజనీనత రాదు. ఆ పాత్రయు సర్వమానవ బంధుత్వమును సంపాదింపలేదు. అందుకు తిర్యగ్జంతువులకు సాధారణీకృతి వలన అట్టి రూపాంతర స్థితిని కలిగించుట మానవ పాత్రలకు కలిగించుటకంటె ఎక్కువ దుష్కరము. ఈ దుర్ఘట కార్యమును అవలీలగ నిసర్గమధురముగ నెరవేర్చి ఈ కథను రసవాహినిలో నడిపిన మహాశిల్పి ఈ అనంతామాత్యుడు. ఈ కథలో పాత్రయైన గోవుతత్పోషకుడైన వేదవిప్రుని చతుష్పాత్ జంతువు కాదు. మరి, ప్రసవ ధర్మిణియు సర్వ భూతములకు అధిష్ఠాన దేవతయు అయిన మాతృదేవత. మాతృమూర్తికి

వాత్సల్యము అంగభూతము. అందుచేతనే పుత్రవాత్సల్య శబ్దము తండ్రియెడ కంటె తల్లియెడ ఎక్కువ సార్థకమగుచుండును. ఆకొన్న బిడ్డకు అన్నము పెట్టునది తల్లిగాని తండ్రికాదు. తల్లి తానీలోకమును విడిచి పోవలసివచ్చిన తుది గడియలలో కూడ తన బిడ్డ పస్తుండునేమో అను చింతలోనే వ్యాకుల పడుచుండును. మృత్యుదేవత ఆ మాతృ హృదయమును గ్రహించి క్షణకాలము అనుమతించినచో, ఆ వ్యవధిలోనే ఆ తల్లి ఆకొన్న తన బిడ్డకు కడుపునింపి నిశ్చింతగా పరమునకు పయనమగును. ఆదర్శమైన మాతృ ధర్మమిది ఈ ధర్మము మానవ మానవేతర సర్వప్రాణి సాధారణము అందుచేతనే ఈ 'గోవ్యాఘ్ర సంవాద మనెడి కథలో చతుష్పాత్ జంతువుగా ప్రవేశపెట్టబడిన ఆ గోవు ఆదర్శమాతృదేవతగా ప్రదర్శింపబడెను.

ఆంధ్ర వాఙ్మయమున ఇంత వ్యాప్తి గల నీతి కథ ఇంకొకటి లేదు. ఈ కథ అనంతామాత్యునకు పూర్వమే లోకమున ఉండవచ్చును కాని నేటి దాని ప్రశస్తికి కారణము అనంతామాత్యుడు దానిని చేపట్టి సర్వాంగ సౌష్ఠవమైన శిల్ప మూర్తిగా చిత్రించి లోకమున కర్పించుటయే!

గోవ్యాఘ్రసంవాద కథ వంటిదే మదనరేఖావృత్తాంత మనెడి ఇంకొక కథ కలదు. ఈ రెండవ కథలో ప్రసంగ వశమున చెప్పబడినది మొదటి కథ. మదనరేఖ యనెడి ఒక రాజు కూతురు తాను చేసిన ఒక ప్రతిజ్ఞను నెరవేర్చుకొనుటకుగాను అర్ధరాత్రమున పోవుచు మార్గ మధ్యమున ఒక బ్రహ్మరాక్షసుని బారిపడి వానిని ఒప్పించి తిరిగి వాని మ్రోలకు రాగా, ఆ రాక్షసుడామె సత్యసంధతను కొనియాడుటయే కాక తన్మహిమ వలన తానును పవిత్రుడయ్యెను. ఈ కథలో అనంతామాత్యుడు పాటించిన ఔచిత్యము, సౌకుమార్యము, నాగరక వృత్తి స్వభావ చిత్రణము సామాన్య "కవులకు దుర్ఘటములు. మానవుని హృదయగహ్వరమున నిగూఢములై వర్తించు భావములను అనంతామాత్యుని నిశిత భావన అతి సుకరముగా చేపట్టి వెలార్చగల శక్తి గలది

బాహ్య ప్రపంచ దర్శనము చేయునప్పుడు కూడ అనంతుని చక్షువు సూక్ష్మాతి సూక్ష్మ వివరములను సైతము దర్శించి తన హృదయ ఫలకమున ముద్రించుకొని, దానిని యథాతథముగా పునః సృష్టి చేసి ప్రదర్శింపగలదు. చెట్టు తొఱ్ఱలో ఉనికి యేర్పరచుకున్న ఒక ఎలుక పిల్ల యొక్కయు, దాని అవయవముల యొక్కయు, చెట్టు కొమ్మ మీద అది యొనర్చిన సంచార విలాసముల యొక్కయు వర్ణనగల ఒక కథా భాగమును ఇచ్చట ఉదాహరించుచున్నాను. అనంతుని పరిశీలకతా నిశితత్వమునకు, భావనాపటిమకు, వర్ణనాకౌశలమునకు ఇది ఉత్తమ దృష్టాంతము కాగలదు

"మఱియు నచ్చిఱుతయెలుకఁ దన తొఱ్ఱలోనన యుండి వెలుపలికి తన మూతి సాఁపుచుం దలచూపి మరలఁ దిగుచుచు నర్ధ శరీరంబుదోఁప నిగిడి మగుడుచుఁ బుచ్చంబుదక్కం దక్కిన శరీర మంతయు బయలుపడ నించుక సేపు కంపంబు నొందుచు నుండి యుండి మఱచి తలఁచిన ట్లదరిపడి తిరిగితొఱ్ఱ చొచ్చుచు వెండియు నుండలేక వెలువడి శాఖా మార్గంబునఁ గొంత దవ్వరిగి పర్ణ రవంబు కర్ణంబులు సోఁకినం బెదరి కోటర ద్వారంబునకుం బఱతెంచుచు నిట్లు శైశవ క్రీడల నడిపి తదనంతరంబు యెల ప్రాయంబు సొచ్చుడు నూఁగు దోసపిందెగతి నందంబగు దేహంబును దరుణ శాకినీ మూలంబునుబోలు వాలంబును శాల్మలీతూల

కంబళంబు విధంబున నత్యంత మృదులంబగు నుదరంబును నాఖు కర్ణిపర్ణంబుల మాడ్కి ఆక్కిళించుకొనియున్న కర్ణంబులును నలంతిపూస లంటించి నట్లు దనరు కనుంగవయును నుచ్చింత పువ్వులలోని కేసరంబుల క్రియ భాసురంబగు పలువరుసయుఁ దన వయోరూపంబుల కనురూపంబగుచుండఁ జెలంగి సెలగొమ్మలెక్కి వ్రేలుచు బలిష్ఠంబులగు తిర్యక్శాఖలపైఁ ద్రుళ్ళగింతలు వెట్టుచు నాకుజొంపంబులు సొచ్చి దాఁగుచు నిటు బహువిధముల విహరించుచుండు నమ్మూషక యోషం జూచి"

## జక్కన - అనంతామాత్యుడు

జక్కన విక్రమార్క చరిత్రమును, అనంతామాత్యుడు భోజరాజీయమును రచించిరి. విక్రమార్కుడును, భోజుడును విద్యాపోషణకును వదాన్యతకును సాహసమునకు బేరు మోసి యనేక చిత్ర విచిత్ర కథల కాస్పదమై తరలి పోయిరి సమకాలికులగు ఇరువురు కవులును సదృశగుణోపేతులగు నిరువురు చక్రవర్తుల చరిత్రములను ప్రబంధములుగా వ్రాయుట యాదృచ్ఛికము.

జక్కనది శబ్దవిన్యాసనైపుణి శైలికి మెరుగు పెట్టు దృష్టి. అనంతునిది శిల్ప సామర్థ్యము. శిల్పమున దృష్టి నుంచిన శైలి దాని కదే వచ్చునని యాతని యభిప్రాయము.

అనంతామాత్యునికి భావన ఎంత కలదో జక్కనకు ఊహ అంత కలదు అనంతునికి శయ్యాలబ్ధి తక్కువ జక్కనకు భావనిష్ఠ తక్కువ జక్కనది దివ్యమైన వర్ణనాత్మక శైలి ఒకే వస్తువును పునరుక్తిలేక ఎన్నిసార్లైనను వర్ణించును. పదముల కూర్పు ఉత్తరోత్తరా రమ్యత కలిగి విసువు పుట్టింపకుండును

ప్రాణప్రతిష్ఠితములైన పాత్రలు అనంతుని చిన్న పిట్టకథ లందును కానవచ్చును. జక్కనది భౌతికరూప వర్ణనము అనంతామాత్యునిది అంతస్సార వర్ణనము జక్కన కవితలో శ్లేష చమత్కారములు కలవు. అనంతామాత్యుని కవితలో ధర్మశ్లేషము మాత్రమే కలదు

## గౌరనమంత్రి

గౌరన పోతనవలెనే శ్రీనాథునికంటె కొంచెము చిన్నవాడు. "ఎట్లు మెప్పించెదో నన్ను నింకమీద రావు సింగమహీపాలు ధీవిశాలు నిండుకొలువున నెలకొనియున్న నీవు సరస సద్గుణ నికురంబ శారదాంబ" యని వాగ్దేవతను ప్రార్థించుచు శ్రీనాథుడు ఏ సర్వజ్ఞుని కొలువును ప్రవేశించెనో ఆ సర్వజ్ఞ సింగుని కుమారుడైన మాధవరాయునకు గౌరన పెద తండ్రియగు పోతనామాత్యుడు మంత్రిగా నుండెను కావున సర్వజ్ఞ సింగుని కుమారునకు మంత్రియైన పోతనామాత్యుని తమ్ముని కొడుకు, శ్రీనాథుని తరువాత రెండవ తరము వాడై యుండుట సమంజసమే. వారిద్దరు సమకాలికులుగాని సమ వయస్కులు కారు. అదియునుకాక శ్రీనాథుని శివరాత్రి మహాత్మ్యమును ముమ్మడి శాంతయ్యకు కృతి యిప్పించిన శ్రీశైల మఠాధిపతి శాంతభిక్షావృత్తి యోగియే గౌరనచేత నవనాథ చరిత్రమను శైవ సిద్ధుల గ్రంథమును వ్రాయించినవాడు. ముమ్మడి శాంతయ్య

కృతిపతిత్వము సంశయాస్పదమేయయ్యు శ్రీనాథుని కాలమున ఆ యోగీశ్వరుడు శ్రీశైల మఠాధిపతిగా మహోరాజోచితమైన ప్రాభవము నెరపు చుండుటయు అతడే గౌరనచేత ఆ స్వామికి నవనాథ చరిత్రను అంకిత మిప్పించుటయు నిజమే! గౌరన ద్విపద హరిశ్చంద్ర కావ్యకర్తగా ప్రసిద్ధి కెక్కిన మేటికవి. హరిశ్చంద్రోపాఖ్యానమనెడి ప్రత్యేకకావ్యమును తెలుగున రచియించిన మొదటి కవివతంసుడును ఈతడే! నవనాథ చరిత్రము హరిశ్చంద్ర కావ్యమువలెనే ద్విపద కావ్యమే కాబట్టి పంద్రెండవ శతాబ్దమున తలయెత్తి రెండు శతాబ్దులు మరుగు పడిపోయిన ద్విపద కవిత్వమునకు మరల పదునైదవ శతాబ్దమునకు సారస్వత రంగ ప్రవేశము కల్గించిన ప్రశస్తి గౌరనకు దక్కినది. నవనాథ చరిత్రమును తత్పూర్వమే శ్రీగిరి అను పేరు గల ఒక కవి పద్య ప్రబంధముగా రచించెనట. దాని ననుసరించియే గౌరన ఈ ద్విపద కావ్యమును రూపొందించెను.

పాల్కురికి సోమనాథుని పండితారాధ్య చరిత్రమును శ్రీనాథుడు పద్యకావ్యముగా పరివర్తనము చేయగా, గౌరన ఆ యుగముననే శ్రీగిరి కవి పద్యకావ్యమును ద్విపదగా పరివర్తించెను. ఆనాటికి ద్విపద పునరుద్ధారణ ఖ్యాతి గౌరనకు దక్కినను మరికొంత కాలమునకు అతని హరిశ్చంద్రకావ్యము పద్య ప్రబంధముగా శంకరకవిచే కూర్చబడెను. పద్యములు ద్విపదలుగాను, ద్విపదలు పద్యములుగాను మారిన ఈ ప్రక్రియ ఆంధ్ర వాఙ్మయ చరిత్రలో చిరకాలము సాగినది.

ద్విపద కవులు దేశి కవితాభిమానులు. పద్య ప్రబంధకర్తలు మార్గకవి తానుయాయులు. వారి సొత్తును వీరు వీరి సొత్తును వారు ఆత్మీయత్తము చేసికొను ఫూనికతో ఎంతస్పర్థ చూపినను వారికి ఒండొరులయెడ గౌరవభావమే యుండెడిది కాని విరోధము లేదు. అందుచేతనే ద్విపదలను పద్యములుగా మార్చిన కవులు మూల గ్రంథమును ఛాయవలె అనుసరించుటే కాక ఆ ద్విపద పంక్తులే తమ పద్యములలో అంతర్భూతము లగునట్లు వాక్య సంఘటనములను చేసిరి. ద్విపద కవులు పద్యములను అట్లే ద్విపదలలో నిమిడ్చిరి. ద్విపద రచనా రూపముననున్న ఈ దేశి కవితాభిమానము శివకవుల వ్రతమని స్థూలముగా స్ఫురింపవచ్చునుగాని అది సంపూర్ణ సత్యముకాదు. ఎట్లన, పాల్కురికి సోమనాథుని బసవ పురాణమును అతనివలెనే పరమ మాహేశ్వరులైన పిడుపర్తివారు గౌరన తరువాత కొంతకాలమునకు పద్య ప్రబంధములను జేసిరి. అదియునుకాక ద్విపద భారతము, ద్విపద భాగవతము మొదలైన ఉద్గ్రంథములు శైవేతరులచేతనే రచింపబడెను. కాబట్టి ద్విపద కవిత్వమునకు శైవ మతమునకు ముడిపెట్టుట కుదురదు. కాకున్న శైవమత సిద్ధాంతములు సర్వసాధారణ భాషలో సామాన్య ప్రజలకు బోధపడునట్లు రచింపవలెనని పాల్కురికి సోమనాథుడు సంకల్పించిన మాట సత్యమే కాని అతనిది సర్వ సామాన్య భాష కాదనియు కొన్నిచోట్ల భారతాదులకంటె ప్రౌఢతరమైన భాష కలదనియు అందుచే నాతని సంకల్పము పూర్తిగా నెరవేరలేదనియు ఇంతకుముందే చెప్పితిని. దానిని బట్టియే కాబోలు పిడుపర్తివారు ఈ ద్విపదలకు ప్రౌఢ వాఙ్మయ భాండారమున శాశ్వత స్థానము లభింపదని సంకోచించి బసవపురాణమును ప్రబంధీకరించి యుందురు. ద్విపదలు పద్యములుగా పరివర్తన చెందుట కిదియే ప్రధాన కారణము. ఇది

యెరిగియు గౌరన తన రెండు గ్రంథములను ద్విపదలలోనే రచించుట సామాన్య ప్రజావబోధనము కొరకేనని తలంపవచ్చును. తలచినచో నీతడు పద్య ప్రబంధమును వ్రాయలేని కవి కాడు. లక్షణ దీపిక యనెడి ఒక సంస్కృత లక్షణ గ్రంథమును వ్రాసిన పండితుడతడు. ఇంకొక విశేషము, పాల్కురికి సోమన గ్రంథములకంటె గౌరన గ్రంథములే సర్వసాధారణ మనిపించుకొనదగిన భాషలో వ్రాయబడిన వనుటలో సందియములేదు. ఇతర ద్విపద కావ్యములవలెకాక ఈతని ద్విపద హరిశ్చంద్ర వాఙ్మయమున శాశ్వత కీర్తిని సంపాదించినది. శంకర కవియును మరికొందరును హరిశ్చంద్రుని కథను పద్యములలో పొదిగినను వారి కావ్యములు గౌరన కృతిని అధఃకరింప జాలవాయెను. ఆ కథను ఆంధ్ర వాఙ్మయమున ప్రతిష్ఠించి ప్రచారమునకు తెచ్చిన గౌరవము గౌరనకే దక్కినది.

## నవనాథ చరిత్ర

ఇది తొమ్మండుగురు శైవసిద్ధుల మహిమలను వర్ణించిన గ్రంథము. వీరు నామమాత్ర శైవసిద్ధులే కాని వారు చూపిన మహిమలలో శైవమత ప్రభావమేమియులేదు. కాకున్న వారిలో ప్రథముడును, ముఖ్యుడును అయిన మీననాథుడనెడి సిద్ధుడు శివతేజస్సంభూతుడగుట చేతను శివుని వలన యోగమార్గోపదేశమును పొందిన వాడగుట చేతను అతడు శైవసిద్ధుడుగానే పరిగణింపబడెను. తక్కిన ఎనమండుగురు అతని శిష్యులగుటచేత వారు శైవ సిద్ధులుగానే లోకమున కొనియాడబడుచున్నారు.

**మీననాథుడు:** ఈ సిద్ధునకే మత్స్యేంద్రుడని మరియొక నామము కలదు. శివుని తేజమును ధరించిన ఒక ఆడ చేపకు పుట్టుటచేత అతనికి మీననాథుడని పేరువచ్చెను జననవేళనే పార్వతీపరమేశ్వరులు ఆ శిశువును తమ పుత్రునిగా స్వీకరించిరి పరమేశ్వరుడు అతనికి అధ్యాత్మ విద్యను యోగమార్గమున నుపదేశించి ఆ విద్యలను లోకమున ప్రచారము గావింపుమని దీవించి పంపివైచెను. ఆ సిద్ధుడు నానా దేశములు సంచరించుచు రాజమహేంద్రుడను రాజు పాలించుచున్న మాళవ దేశమునకు రాజధానియైన మాంధాతృ నగరమునకు సమీపమున నున్న ఒక కొండగుహలో తపస్సు చేయుచుండెను. సారంగధరుని వధ జరిగిన పట్టణము ఆ మాంధాతృ నగరమే! కాలుసేతులు తెగి అరణ్య రోదనము చేయుచున్న సారంగధరుని ఆక్రోశము నాలకించి మీననాథుడాతని చెంతకేగి ఆదరించి ఒక విధమైన యౌగిక చికిత్సచే అతనికి మరల ఆ అవయవములు మొలచునట్లు చేసెను. నూతనముగా అంకురించిన ఆ నాలుగు అవయములు రంగవర్ణము కలవి యగుటచే (నారింజపండు వర్ణము) అతనికి చౌరంగియని పేరుపెట్టి తనకు ప్రథమ శిష్యునిగా చేసికొనెను. చాళుక్యరాజైన మన రాజరాజ నరేంద్రునకును, ఆ కథకును ఏమియు సంబంధము లేదు. ఆ సంబంధమును ఎవరు ఎప్పుడు కల్పించిరో తెలియదు. కాని అప్పకవి నాటినుండియు అది లోకమున తెనుగు కథగా ప్రచారమయ్యెను. తదనంతరము మీననాథుడు మాల్యవంతమున పరుసవేది, చింతామణి మొదలగు ఓషధులను సంపాదించుకొని కొంతమంది శిష్యులను చేర్చుకొని పశ్చిమమున మంగళాపురమను పట్టణమును చేరెను ఆ సమయమున ఆ పట్టణరాజు, మృతుడై యుండుటవలన పరకాయ ప్రవేశయోగమున

ఆ రాజు శరీరమున తాను ప్రవేశించి. ఆ దేశపు రాజై మహాభోగములనుభవించుచు సంతానమును గూడ కనెను. తరువాత గోరక్షక సిద్ధుడను శిష్యుని ప్రబోధము వలన నిజ శరీరమును దాల్చి శిష్యులతో హిమవంతంబున కేగెను మాంధాతృపుర సమీపమున కొండగుహలో మీననాథుడు తపస్సు చేయుకాలమున రాజమహేంద్రుని గోగణమున కధికారియైన ఒక గోపాలుడు ఆ తపస్వికి నిత్యము ఆవుపాలు ఆహారముగా సమర్పించెను మీననాథుడాతని భక్తికి మెచ్చి చౌరంగి తర్వాత ఆతనిని శిష్యునిగానో, ప్రశిష్యునిగానో స్వీకరించి సిద్ధుని చేసెను. అతడే గోరక్షక సిద్ధుడు

అపై అట్లే అర్థులుగానో జిజ్ఞాసువులుగానో వచ్చిన మరి ఆరు మందిని అనుగ్రహించి ఉద్ధరించి యోగ సిద్ధులను చేసి వారందరితోకలసి హిమవంతము చేరిన మీననాథుడు నలుదెసల యోగ విద్యా ప్రచారము చేయుడని వారిని పంపివేసెను. చౌరంగి మాత్రము గురువును వెన్నంటియే యుండెను ఆ శిష్యులలో శీలనాగార్జునుడు అను శిష్యుడు ఆంధ్రదేశమునకు వచ్చెను. అతని శిష్యుడు సిద్ధనాగార్జునుడను నాతడు శ్రీశైలమును బంగరుకొండను చేయబూనగా శ్రీమహావిష్ణువు అతని సాహసమునకు కినిసి తన చక్రముచే అతని శిరస్సు ఖండించెనట ఈ సిద్ధుల మహిమలలో ముఖ్యమైనవి రసవాదము, పరకాయ ప్రవేశము, అకాశయానము, శారీరక గరిమ, లఘిమ మొదలైనవి.

ఈ నవనాథ చరిత్ర ఏక కథాశ్రయము కాకపోవుటచేతను, హరిశ్చంద్రలో గల శిల్ప ప్రౌఢిమ లేనిదగుట చేతను వాఙ్మయమున ప్రసిద్ధికెక్కలేదు కాని ఉపాఖ్యానప్రాయములుగా నున్నను సారంగధర చరిత్ర, వంచక పురోహితుని చరిత్ర మొదలగు కొన్ని ఘట్టములు రసవంతములుగా పఠన యోగ్యములుగా నుండును

## హరిశ్చంద్ర

ఈ మహారాజు చరితము వేదవాఙ్మయమున, పురాణవాఙ్మయమున, కావ్య వాఙ్మయముననను ప్రసిద్ధికెక్కెను వేద వాఙ్మయమునలో ఋగ్వేదమునకు చెందిన ఐతరేయ బ్రాహ్మణమునను, పురాణ వాఙ్మయమున మార్కండేయ పురాణమునను, కావ్య వాఙ్మయమున ద్విపద కావ్యముగా, పద్యప్రబంధముగా, నాటకముగా నానా రూపముల దాల్చెను. ఈ కథకు కావ్య వాఙ్మయమున రూపకల్పన చేసినవాడు గౌరన యని చెప్పనొప్పును. ఈ కవి—

"చెలఁగి ఋగ్వేద ప్రసిద్ధుఁడై జగతి
వెలయు హరిశ్చంద్ర విభు పుణ్యచరితఁ
గవితా చమత్కృతి గాంచి హర్షించి
కవులందరు శిరః కంపంబు సేయఁ
బచరించి వీనుల పండువుగాఁగ
రచియింతు. . ......"

అని తన కథకు మూలము ఋగ్వేదమని చెప్పకొనెను. అనగా ఋగ్వేద బ్రాహ్మణమైన ఐతరేయ మనియే అర్థము. కాని ఆ బ్రాహ్మణమునందలి కథకును, ఈ గౌరన కథకును

హరిశ్చంద్ర నామ సాదృశ్యము తప్ప వేరొక పొత్తేమియు లేదు మార్కండేయ పురాణ కథకును ఈ కావ్యకథకును కొంత పోలిక కలదు అయ్యు అదికూడ గౌరన కావ్యమునకు మూలమని చెప్పదగినది కాదు భాగవత నవమ స్కంధమున కూడ ఈ కథ సూచనామాత్రముగా కలదు. కాని ఆ కథ ఇక్ష్వాకు రాజవంశానుచరిత కథనమునకు అవశ్యకమగుట బట్టి ఉదాహరించబడినదే కాని, హరిశ్చంద్రుని ప్రాధాన్యమును బట్టి చెప్పబడినదికాదు. మరి గౌరన హరిశ్చంద్రకు మూలమింకే పురాణమున కలదో తెలియదు. స్కాందపురాణమున నున్నదని కొందరందురు కావచ్చు కాని హరిశ్చంద్రుని కథ తెలుగు దేశమున గౌరన కృతిని బట్టియే ప్రఖ్యాత మయ్యెను గాని పురాణమును బట్టికాదు. పాఠక లోకము వేద పురాణ హరిశ్చంద్ర కథల స్వరూపమును తెలిసికొనుటకును, వాటికిని గౌరన కథకును గల భేద సాదృశ్యములను గ్రహించుటకును, కుతూహల పడునను ఉద్దేశముతో మొదట వేదపురాణకథల సారమును ఇచ్చట చూపుచున్నాను

## ఐతరేయ బ్రాహ్మణము నందలి కథ

హరిశ్చంద్రుడు చిరకాల మనపత్యుడై యుండి తనకు పుత్రుని ప్రసాదించినచో ఆ పిల్లవానినే పశువరించి నరమేధము చేసెదనని వరుణుని వేడుకొని తదనుగ్రహమున రోహితుడను పుత్రుని బడసెను. కాని చేసిన ప్రతిజ్ఞ ప్రకారము ఆ నరమేధమును చేయక పుత్రమోహముచే ఏదో ఒక సాకు కల్పించుచు కాలము గడపి పుచ్చెనే గాని అన్నమాట చెల్లించుకొనలేకపోయెను ఆతని అసత్యవర్తనకు వరుణుడు కోపించి శపింతునని బెదరింపగా ఆ రాజు తద్వృత్తాంతమంతయు కుమారునకు విశదపఱచెను. అప్పటికి ధనుర్గ్రహణ యోగ్యమైన వయస్సు వచ్చిన ఆ బాలుడు తండ్రి తనను బలిపెట్టునేమో యను భయముచే అడవులకు పాఱిపోయెను. అంతలో వరుణుని శాపఫలముగా హరిశ్చంద్రునకు జలోదర వ్యాధి సంభవించెను

తాను కారణముగా తండ్రికి మహాపద సంభవించుట సహింపని ఆ పిల్లవాడు శునశ్శేపుడనెడి యొక విప్రకుమారుని విలిచితెచ్చి వానిని యాగపశువుగా జేసి నరమేధమును నెరవేర్చుమని తండ్రికి సమర్పించెను. హరిశ్చంద్రుడు తన కుమారునకు మారుగా ఆ విప్రకుమారుని పశువుగా బంధించి యాగసంకల్పము చేయగా దిక్కులేని యా బ్రాహ్మణపుత్త్రుడు ఋక్కులతో దేవతలను స్తుతించెను దేవతలు ప్రీతులై అతనిని పాశవిముక్తుని జేసి హరిశ్చంద్రునకు యాగఫలము నొసగిరి. అతని వ్యాధియు నివారితమయ్యెను. ఆ కుమారులిరువురును అయుష్మంతులైరి (ఈ నరమేధమునకు విశ్వామిత్రుడే ఆధ్వర్యవము నెరపెననియు శునశ్శేపునవి నిరపరాధ నిస్సహాయత్వమునకు వగచి అయనయే ఆ పిల్లవానికి స్తుతి పూర్వకమైన వరుణ మంత్ర ముపదేశించెననియు దానిని జపించియే ఆ పిల్లవాడు వరుణు ననుగ్రహముచే పాశవిముక్తుడయ్యెననియు వేరొక గాథ కలదు.)

## మార్కండేయ పురాణము నందలి కథ

హరిశ్చంద్రుడనెడి రాజర్షి సత్యవ్రత గరిష్ఠుడు ధార్మిక వర్తనుడునై అయోధ్యా నగరమున ప్రజాపాలనము చేయుచుండెను. ఆ భూపతి ఒకనాడు వేటకై అరణ్యమున కరుగ నా అడవిలో ఒక దెసనుండి 'రక్షింపుము రక్షింపు'మని స్త్రీ ఆక్రందనము వినవచ్చెను. ఆర్తత్రాణ పరాయణుడైన యా రాజు అభయవాక్య ప్రదాన మొనరించుచు శీఘ్రముగా ఆ వైపునకు వెడలెను.

అచ్చట కష్టసాధ్యములైనట్టి అపాత్రునివద్ద నుండ వెఱచునట్టి బ్రహ్మవిద్యలను విశ్వామిత్రుడు వశపఱచుకొనగోరి బలవంతముగా నాకర్షించుచుండెను. అదృశ్యములుగా నున్న యా విద్యలు అతనివద్ద నుండ వెఱచుచు రక్షణకై అట్లు స్త్రీల కంఠస్వరముతో నాక్రోశించుచుండెను. ఆర్తస్త్రీజన రక్షణార్థము ఆ దెసకు వెడలిన హరిశ్చంద్రునకు విశ్వామిత్రుడు కానవచ్చెను గాని మఱి స్త్రీజన మెవ్వరును కానరాలేదు. విశ్వామిత్రుడు హరిశ్చంద్రుని హరాత్ప్రవేశమునకు, అతని ఔద్ధత్యమునకు కోపించి అతని వలన ఆలు బిడ్డలును, ధర్మమును, ఆతడును వెలిగా సర్వరాజ్యమును దానమడిగి పుచ్చుకొని ఆ రాజును ఆలుబిడ్డలతో రాజ్యము వెడలనడచెను.

హరిశ్చంద్రుడు సతియగు చంద్రమతితో, సుతుడగు లోహితాస్యునితో జీవిత శేషమును గడపుటకు కాశికి చేరగా విశ్వామిత్రుడాతని వెన్నంటి వెళ్ళి తాను పూర్వము హరిశ్చంద్రునిచే చేయించిన యాగమున కీయవలసిన భూరిదక్షిణ నిమ్మని నిర్బంధించెను. (ఈ యాగము హరిశ్చంద్రుడు శునశ్శేపుని బంధించి చేయ సంకల్పించిన నరమేధమై యుండవచ్చును. ఈ గ్రంధమున ఆ వృత్తాంతము స్పష్టముగా లేదు) రాజు ఆ ధనమును సమకూర్ప భార్యను పుత్త్రుని ఒక వృద్ధ బ్రాహ్మణున కమ్మి తుదకు తాను కూడ ఒక కాటికాపరికి అమ్ముడుపోయి యా ఋషి ఋణము తీర్చెను.

బ్రాహ్మణు నింట నూడిగము సేయుచున్న చంద్రమతి ఉరగదష్టుడై మరణించిన తన కుమారుని శ్మశానమునకు గొంపోయి యెలుగెత్తి యేడ్చుచుండగా కాటికాపరియైన హరిశ్చంద్రుడు ఆమెను సమీపించి గుర్తించి కుమారుని మరణ వృత్తాంతమును విని ఇక భూమిపై బ్రదుకుట నిరర్థకమను నిశ్చయముతో చితిపేర్చుకుని సకుటుంబముగా ఆహుతియగుట కుద్యుక్తుడయ్యెను అతని సత్యవర్తనకు మెచ్చి దేవతలు వారిని వారించి కుమారును బ్రదికించి సశరీర స్వర్గసుఖ మనుభవింప స్వర్గమున కాహ్వానించిరి. ఆ చక్రవర్తి తన ప్రజలను వీడి తాను స్వర్గసుఖ మనుభవించుటకు నిరాకరింపగా అతని ప్రజా ప్రణయ వృత్తికి దేవతలు మఱింత మెచ్చి లోహితునకు రాజ్యపట్ట మొసగి రాజ దంపతులకు ప్రజలకు స్వర్గనివాస మొసగిరి.

పిమ్మట వసిష్ఠ మహర్షి తన యాజ్యుడైన హరిశ్చంద్రుని నానా హింసలు పెట్టిన విశ్వామిత్రునిపై కినిసి అతనిని కొంగవై పుట్టుమని శాపమిచ్చెను. విశ్వామిత్రుడు వసిష్ఠుని ఆడేలు పక్షిగా పుట్టుమని ప్రతిశాపమిచ్చెను. ఆ ఋషులిరువురు పరస్పర శాప ప్రతి శాపములవల్ల ఆడ బకములుగా మారి కోపావిష్టులై కొంతకాలము పోరాడిరి. ఆ పామర వ్యాపారమును చూచి సహింపలేక బ్రహ్మదేవుడు సాక్షాత్కరించి వారిని శాంతింపజేసి ఆ కలహమును మాన్పించెను.

## గౌరన హరిశ్చంద్ర

పై రెండు కథలలో గౌరన హరిశ్చంద్ర కథ ప్రధానాంశములలో మార్కండేయ పురాణానుసారము ఉన్నదనుట స్పష్టమే. కాని దేవలోకమున వసిష్ఠ విశ్వామిత్రులు కలహించుటయు హరిశ్చంద్రుని సత్యనిష్ఠను గూర్చి తమ పరువును పణముగా నొడ్డి పందెము వేసి వారిద్దరు ప్రతిజ్ఞలు చేయుటయు అనెడి కథా ప్రారంభమున గల వృత్తాంతము మార్కండేయ పురాణమున లేదు విశ్వామిత్రుడు హరిశ్చంద్రుని వెంట తన శిష్యుడైన నక్షత్రకుని పంపుటయు పురాణకథలో లేదు. ఈ నక్షత్రక పాత్ర కావ్యములోని ప్రధాన పాత్రలలో నొకటి. ఇవిగాక కాశీరాజు కుమారుని చంపి నగలు దొంగిలించి పారిపోవు దొంగ ఆ నగలు చంద్రమతి కిచ్చుటయు ఆమెయే తన కుమారుని చంపిన ఘాతకురాలని రాజు ఆమెకు మరణశిక్షను విధించి శిరచ్ఛేదము నిమిత్తము శ్మశానమునకు పంపుటయు, అచ్చటి కాటి కాపరి వృత్తిలోనున్న హరిశ్చంద్రుడు ఆమె శిరమును ఖండింప నుంకించుటయు, అతడెత్తిన కత్తి చంద్రమతి మెడలో పూలమాలగా మారుటయు మొదలగు అంశములన్నియు మార్కండేయ పురాణమున లేవు ఇన్ని యిటులుండ ఆడబక యుద్ధము గౌరన కావ్యమున నేడు కానరాదు. కాని ఆ వృత్తాంతమును అతడు కూడ రచించెను ఈ ద్విపద కావ్యమును మొదట సంస్కరించి ప్రచురించిన శ్రీ వేదము వెంకటరాయశాస్త్రిగారు ఆ కథను ముద్రణలో తొలగించిరి ఆ కథాభాగము అనౌచిత్య భూయిష్ఠమగుటచే తొలగించితినని వారు ముద్రణ పీఠికలో వ్రాసిరి శ్రీ శాస్త్రిగారు దానిని ఏ దృష్టిలో తొలగించినను ఫలితము మాత్రము కావ్యశిల్ప ధర్మబద్ధమై ఆదరపాత్రమయ్యెను. హరిశ్చంద్ర కథకు అనావశ్యకమును వస్త్వైక్యమునకు భంజకమ్మును అయిన ఆ భాగము తొలగిపోవుటయే మేలయ్యెను. కాని యీ సంస్కారమే గౌరన చేసియుండినచో, ఎంతో ప్రశంసార్హముగా నుండెడిది. ఎట్లును అతడు దానిని రచించినవాడే అయ్యెను గాన ఆ సంస్కారయశము అతనికి దక్కలేదు. గౌరన ఆ ఆడబక యుద్ధమును రచించుట పురాణకథను పూర్తిగా తుదివరకు అనుసరించవలెననెడు కుతూహలముచే నై యుండును. పురాణకథలను ప్రబంధములుగా పరివర్తింప జేసిన మన పూర్వ కవులలో కొందరు మూలకథనంతను అనుసరింపవలెనను కుతూహలముతో ప్రబంధోచితములు కాని ఉదంతములు కూడ పరిహరింపరైరి. అసలు ఏ యే కథావయవముల సంధానము వస్త్వైక్యమునకు ఆవశ్యకమో ఏవి అనావశ్యకమో విమర్శించి చూచెడి కావ్యశిల్ప దృష్టియే ప్రబంధకవులలో కొందరికి లేదు. శుద్ధ ప్రబంధయుగ మనిపించుకొన్న పదియారవ శతాబ్ది మొదట వెలసిన ప్రబంధములలోనే అట్టి లోపములు కలవు ఇక ప్రబంధమునకు స్పష్టమైన రూపురేఖ లేర్పడని తత్పూర్వ కాలమున వెలసిన ఈ హరిశ్చంద్ర మొదలగు కావ్యములలో అట్టి లోపము లుండుటయు వింతకాదు ప్రబంధ కవులలోనైనను ఏ ఒకరిద్దరో తప్ప కావ్యశరీర బంధమున శిల్ప మర్యాదలు పాటించిన కవులు చాలమంది లేరు.

గౌరన రచించిన రెండు గ్రంథములలో ఆతని కవియశమునకు నిధానమైనది హరిశ్చంద్ర కావ్యమే. నవనాథ చరిత్ర సారస్వత విద్యార్థులకును, పరిశోధకులకును, తప్ప సామాన్య పాఠకలోకమునకు కొంత దూరమయ్యెను దీనికి మొదటి కారణము

ఆ కథ సర్వలోక పూజ్యుడైన హరిశ్చంద్రుని కథను పోలినది కాకపోవుట. ఇది సహజమే. కావ్య ప్రశస్తికి కవిరచనా సామర్థ్యమే కాక కథానాయకుని మహత్త్వము కూడకొంత కారణము. రెండవ కారణము నవనాథ చరిత్రలోకంటె హరిశ్చంద్రలో గౌరన శిల్పకౌశలము పరిణతి చెందుట. ప్రథమ రచనలో కొనలు సాగుచున్న రస సంపాదనము, పాత్ర చిత్రణము, స్వాభావికత, ఔచిత్య పరిపాలనము మొదలైన సాహిత్యగుణ లతికలు రెండవ గ్రంథములో పరిపూర్ణ వికాసము చెంది మనోహరముగా వాసించెను.

గౌరన రూప చిత్రణమును అతి స్వాభావికముగ, అతి సుకరముగ చేయగలడు. స్వభావ చిత్రణమునందు కూడ అట్టి సామర్థ్యము కలవాడే. ద్విపద పంక్తులను మలచుటలోను, దేశితనమును వెలార్చుటలోను పాల్కురికి సోమనాథునితో పందెము చరచి పరుగెత్తెడి వానివలె పొడగట్టును. ఒక్కొక్కయెడ ఆ పందెములో సోమనాథుని అతిక్రమించిన సందర్భములును కలవు. శబ్దప్రయోగ నిరంకుశత్వమున సోమ కంటెను ఎక్కువ స్వతంత్రుడు. ఇంచు మించు ఈతని శైలి వ్యావహారిక భాషయేమో అనుపించునంత ధారాళముగా నుండును. మరియు తెలుగు భాషలో హాస్యరసము లేదనెడి వాదును పోగొట్టిన ప్రథమ పూర్వకవి ఈ గౌరన. శ్రీనాథుని క్రీడాభిరామములో కొంత హాస్యమున్నది. కాని అది మందహాస మాత్ర పర్యవసితముగా నుండును. గౌరన సాధించిన హాస్యము పాఠకుడు విరగబడి నవ్వునట్లు చేయును.

ఈతని హాస్యరచనకు నిధానమైన పాత్రలు ఉదాత్త పాత్రలతో ప్రతియోగమున నిల్పబడి పరమహాస్యాస్పదములయ్యెను. నవనాథ చరిత్రలో త్రిలోక సుందరియైన రాజకుమార్తెను కామించి నానా విధములైన పాపచేష్టలు చేసిన మర్కటరూప వంచక పురోహితుడు, ఆ యువతి సౌందర్యకాంతి పటలమును దిగమ్రింగ జూచెడి మసిబొగ్గువలె పరమ హాస్యాస్పదు డగుటయే గాక గర్హణీయుడును అయెను. అట్లే మహాపతివ్రతయు ప్రథమ చక్రవర్తి భార్యయునైన చంద్రమతిచే నూడిగము చేయించుకొనెడి పరమ నిర్భాగ్య పురోహితుని గయ్యాళి పెండ్లామైన కలహకంఠి చంద్రమతి పాత్రతోడి ప్రతియోగమున జుగుప్సావహయును, గర్హణీయయును అయెను.

మరియు ఇంకొక విశేషము. గౌరన కేవలము శైవుడు కాకపోయినను విష్ణుద్వేషి కాకపోయినను వైష్ణవ మతముపట్ల కొంత అసహనము కలవాడనుట మాత్రము నిజము. కాలకౌశికుని రూపవర్ణనలో గౌరన అతనికి వైష్ణవ చిహ్నమైన పట్టె వర్ధనములు పెట్టి వైష్ణవము మీద తనకున్న అక్కసును తీర్చుకొనెను. ఆ బ్రాహ్మణుని హేయమైన వృత్తియు, రోత పుట్టించెడి రూపమును మిత్తికూడు కుడిచి సంపాదించిన ధన సంచయమును వర్ణించుటలో కవి కాలకౌశికుని పరమనీచ పురోహిత జాతికి ప్రతీకగా జేసెను. మన సంస్కృతాంధ్ర వాఙ్మయములలో విదూషకాది హాస్యపాత్రలన్నియు శైవ వైష్ణవాది శాఖాభేదములేని స్మార్త బ్రాహ్మణ పాత్రలే. గౌరన మాత్రము ఈ వింత మార్గమును త్రొక్కి విశ్వేశ్వర క్షేత్రమైన కాశీలో శ్రీరంగక్షేత్ర లక్షణమును ప్రవేశపెట్టినవాడయ్యెను. ఇందు సందర్భ శుద్ధిలేదు

# దగ్గుపల్లి దుగ్గన

పిల్లలమఱ్ఱి పినవీరభద్రుఁడు శ్రీనాథునకు పరోక్ష శిష్యుడై యుండునని ఊహించినను దుగ్గన మాత్రము ప్రత్యక్ష శిష్యుడే. ఈతడు కాంచీమాహాత్మ్యము, నాచికేతూపాఖ్యానము రచించెను. ఇందులో మొదటిదానిని చందలూరి గంగయామాత్యుని కుమారుడైన దేవయామాత్యున కంకితము చేసెను. రెండవ దానిని ఆ కృతిపతి యొక్క పెదతండ్రి కుమారుడైన గంగయామాత్యున కంకితము చేసెను ఈ గంగయామాత్యుడు ఉదయగిరి రాజగు బసవరాజు నొద్ద మంత్రిగా నుండెను. వీరు విజయనగర రాజైన సాళువ నరసింహరాయలకు సమకాలికులు సాళువ వంశరాజులు విజయనగర రాజ్యమునకు సామంతులైన చంద్రగిరి రాజధానిగా కొంత భూభాగము ఏలుచుండిరి. ప్రౌఢ దేవరాయలు తరువాత విజయనగర రాజుల అసమర్థత చేత కేంద్ర పరిపాలనము క్షీణింపజొచ్చెను. ఆ సంగమవంశరాజులలో తుదివాడైన విరూపాక్షరాయని కాలమునకు ఆ క్షీణదశ మరింత ఎక్కువకాగా, సామంతుడైన సాళువ నరసింహరాయలు విజయనగరమునకు తరలివెళ్ళి కేంద్రప్రభుత్వమును స్వాధీనము చేసికొనెను

ఇతడు కాంచీమహాత్మ్యమును గంగయామాత్యుని పినతండ్రి కుమారుడైన దేవయామాత్యున కంకిత మొసంగినట్లు, నాచికేతూపాఖ్యానమున కృతి పతియైన గంగయామాత్యుని ప్రసంగము వలన తెలియుచున్నది

ఉ॥ "మా పినతండ్రి గంగయ యమాత్యశిఖామణి; తత్తనూభవుం
డై పెనుపొందు దేవసచివాగ్రణి కిచ్చితి వాంధ్రభాషఁ గా
చీపురనాథు దివ్యకథఁ జిత్రతరంబుగ విస్తరించి; నీ
వోపుదు వార్యహృద్య మధురోక్తుల సత్కృతు లొప్పఁ జెప్పఁగన్"

"కాంచీపురనాథు దివ్యకథఁజిత్రతరంబుగ విస్తరించి" అని గంగయామాత్యుడు పేర్కొనుట వలన, అది అప్పటికి రసోల్లసితమైన గ్రంథముగా ప్రశస్తినొంది యుండునని ఊహింపవచ్చును. కాని ఇప్పుడా గ్రంథము లభ్యము కాదు

ఇక నాచికేతూపాఖ్యానము గురించి:

నాచికేతుని కథ కఠోరపనిషత్తునందును, మహాభారతము నందును కూడ కలదు. ఈ నాచికేతుని కథ వరాహపురాణమునందును కలదు.

కోపనుడైన తండ్రి పిల్లవానిని శపించుటయు, వాడు యమలోకమునకు పోయి యముని దర్శించి వచ్చుటయు మూడింటను సమానమే! ఇక ప్రబంధ కథ యందలి పూర్వ భాగము పిల్లవాని అపూర్వ జననము గురించియు, అతని జననీ జనకుల అవిజ్ఞాత దాంపత్య సంబంధము గురించి, అఘటనఘటనా సమర్థమైన విధివిలాసము గురించియు అత్యద్భుతముగా సంధానింపబడిన ఒక చిత్రకథ ఇట్టిది ఆంధ్ర వాఙ్మయమున ఇంకొకటి లేదు ఈ కథా నిర్వహణములో దుగ్గన చూపిన కథన కౌశలము ఎఱ్ఱన, తిక్కనల కథన కౌశలముతో సాటివచ్చుచున్నది. భారత కవిత్వమునకు ఔచిత్యము జీవగఱ్ఱ. ప్రబంధ కవులందరు, భారతమున పునః పునః పఠనము చేసినవారే అయ్యు, భారతము నందలి ఔచిత్య సౌందర్యము నలవరచుకొన్న వారు చాలమంది లేరు.

అనంతామాత్యుడు, పింగళి సూరన మొదలగు కొలది మందిలో ఈ దగ్గుపల్లి దుగ్గన ఒకడు విశేషించి చంద్రావతి యడవులపాలై తనకు వచ్చిన నిష్కారణ నిందకు విలపించు సందర్భముననుు, తృణబిందు ఋషి ఆమెను ఆదరించి ఆశ్రమమును చేర్చు సందర్భముననుు, దుగ్గన తిక్కనసోమయాజి నిర్వచనోత్తర రామాయణము నందలి సీతా వనవాసఘట్టము తన రచనకు మేలు బంతిగా మనో నయనముల ఎదుట నిల్పుకొన్నైనా యని తోచును. మరియు చంద్రావతి మహారాజపుత్రిక యైనను, ఆమె బాల్య యౌవనములను వర్ణించు సందర్భమున శ్రీనాథుని బావమరిది, అవయవసౌందర్యాది వర్ణన కొంతపోక ఆమె భావి జీవితమునకు ప్రాతిపదిక కాదగిన సాధుగుణ వర్ణనములతో ఆ సుగుణ సుందరిని చిత్రించెను. ఋషిపత్నిగా ఆశ్రమ జీవితమును గడపనున్న ఆ రాకుమారి శరీరసౌందర్య వర్ణనకంటె మానసిక శరీర సాధువర్తనల వర్ణనయే కథౌచిత్య మునకును పాత్రౌచిత్యమునకును అనువై యుండునని రసజ్ఞులకు నేను చెప్పనక్కరలేదు మరి దుగ్గన శైలియు ఎట్టిన శైలివలె సాధుతా సుందరమును ప్రసన్నతా మహితమును అయి ఈ కథయే తానై అతని కర్తృత్వమును వరించినదా? అని స్ఫురింపజేయును దుగ్గన శ్రీనాథుని ముద్దు మరదియయ్యు కవి సార్వభౌముని భావగతిగాని, శబ్దగతిగాని అలవరచుకొన్న వాడుకాదు ఆ గురువు వెంట ఎంత కాలము తిరిగినను ఆ శైలి అభ్యసింపవలెనని ప్రయత్నించిన వాని వలె తోచదు శ్రీనాథుని శృంగార వర్ణనోల్బణముగాని, ప్రౌఢసమాస ఘటనగాని దుగ్గనకు పట్టుపడలేదు. ఆ పద్ధతియే అలవడి యుండినచో అది ఈ కావ్యరచనకు అక్కరకు వచ్చెడిది కాదు మరియు, ఇతనిది పారమార్థిక పరాయణమును, శమసంపన్నమునైన చిత్తవృత్తి కావుననే ఈతడు దైవపరమైన కాంచీమహాత్మ్యమును, బ్రహ్మజ్ఞానపరమైన నాచికేతూపాఖ్యానము రచించుట కర్హుడయ్యెను.

ఈ నాచికేతూపాఖ్యానమునకు కృతిపతియైన చందలూరి గంగయామాత్యుడు దీనికేకాక, నంది మల్లయ ఘంటసింగయ్యల ప్రబోధచంద్రోదయమును కూడా కృతి పుచ్చుకొనెను అది అద్వైత తత్త్వము అంతరార్థముగాగల వేదాంత గ్రంథము ఆ మంత్రి వర్యుడు 'సంసారయోగి' యని ప్రబోధ చంద్రోదయ కర్తలు వర్ణించిరి. కావుననే శాంతరస ప్రధానములును, జ్ఞానోపదేశకములు అయిన పైరెండు గ్రంథములకు కృతిపతి అయ్యెను నాచికేతూపాఖ్యానమను గ్రంథమును మిక్కిలిమల్లికార్జునుడనెడి ఒక కవికూడ రచించెను అది దుగ్గన కావ్యము నెదుట నిలువజాలదు. నిల్వకూడదు

## పిల్లలమఱ్ఱి పిన వీరన

ఇతడు రచించిన గ్రంథములలో లోకమునకు లభించినవి రెండు జైమిని భారతము, శాకుంతలము పోయిన వింకెన్నో కలవట. ఈ రెంటిలో జైమిని భారతమే ఉత్తమ రచన ఇది సాళువ సింగరాయనికి (1485–93) గృతి శాకుంతలము దీనికి పూర్వ రచన యగుటచే 1480 ప్రాంతముది కావచ్చును. ఇతడు శ్రీనాథునకు శిష్యుడని కూడ నొకవాడుక కలదు. ప్రత్యక్ష శిష్యత్వము సమర్థించు నాధారము లేవియు లేకున్నను, పరోక్షముగా నైనను శిష్యుడని చెప్పక తప్పదు. శ్రీనాథుడొసగిన ప్రబంధ

శైలీ భిక్షను తానొక చేత నందుకొని, యింకొకచేత దరవాతి ప్రబంధకవుల కందిచ్చిన దీ శిష్యుడే నైషధమునకు శ్రీనాథుడు శృంగారనైషధమని పేరు పెట్టినట్లుగా ఇతడు తన గ్రంధమునకు శృంగార శాకుంతలమని పేరు పెట్టుటలోనే ఆ శిష్యత్వము వ్యక్తమగుచున్నది.

**శాకుంతలము:** ఈ శృంగార శాకుంతలమునకు భారతములోని దుష్యంత చరిత్రము కొంతయు, కాళిదాసుని నాటకము కొంతయు మూలములు ఈ రెండు మూలములకంటె భిన్నముగాఁ గవి స్వయముగా కల్పించిన ప్రకరణమును కొన్ని కలవు. ఈ విషయ మీ గ్రంధముననే కృతిపతియైన చిల్లర వెన్నయామాత్యుడన్నట్లుగా కలదు. ఆ వాక్య మిది·

*"భారతప్రోక్త కధ మూలకారణముగ ఁ*
*గాళిదాసుని నాటక క్రమము కొంత*
*తావకోక్తికి నభినవశ్రీ వహింపఁ*
*గూర్చిఁ గృతి సేయు నాకు శాకుంతలంబు"*

కాళిదాసు నాటకములో విప్రలంభాత్మకమైన ఉత్తరార్ధ మితడు కైకొన లేదు భారతమునందువలెనే పుత్త్రసహితయైన శకుంతలకు రాజాస్థానమున భర్తృ సంయోగముఁ గల్గించెను. పూర్వార్ధమున ఋషుల ప్రార్ధన, రాజు ఆశ్రమ ప్రవేశము, వృక్షజల సేచనావసరమున శకుంతలాదర్శనము, కణ్వుని సోమతీర్ధ గమనము, అనసూయా ప్రియంవదల ఘటనాకుశలత, అంగుళీయక ప్రదానము మొదలగు రసవంతములైన అంశములు కాళిదాసు నాటకమునుండి కయికొన్నవే ఆ పైకధ మాత్రము భారతానుసారి. సూత్రాప్రాయముగ చెప్పవలయునన్న కధా వికాసము నాటకానుసారి యనియు తత్పరిణామము భారతానుకారి యనియు జెప్పవలెను.

నడుమ నడుమ కవి స్వయముగా కల్పించిన ఘట్టములు కొన్ని కలవు 'తావకోక్తికి నభినవశ్రీ వహింప' అన్న కృతిపతిమాట వాటివలననే సార్ధక మగును కధా ప్రధానమైన భారతమున ఈషన్నిర్దిష్టములును ప్రదర్శనా ప్రధానమైన నాటకమున అస్థానకములునైన కొన్ని సన్నివేశములను సందర్భాను గుణముగ వీరన విపులముగా వర్ణించెను ప్రబంధమైన ఈ కృతి కావర్ణనలుచితములే యగును అవి హస్తినాపుర వర్ణన, మృగయా వర్ణన మొదలగునవి

అన్నిటికంటెను ముఖ్యమైన స్వకల్పన శకుంతలా జనన వృత్తాంత కధనము భారతమున శకుంతలయే తానై యీ వృత్తాంతమును దుష్యంతునితో చెప్పెను అది సరసముకామి విదితమే. అందుచేతనే కాళిదాసు డాకధను చెలికత్తెలనోట అతి వినయ లజ్జాన్వితముగా నొకటిరెండు మాటలతో సూచించి అర్ధోక్తిలో విడిచి పుచ్చెను ఎట్లైన నాకధ స్త్రీ జనోక్తమగుట కంగీకరింపక వీరన దానిని కణ్వశిష్యుని నోట చెప్పించెను. ఇతని సంకల్పము మంచిదే కానవచ్చునుగాని, కార్యము మాత్రము చెడినది ఏ వికారము నెరుగని ముగ్ధుడైన ఆశ్రమ బాలకుడు మేనకావిశ్వామిత్రుల పచ్చి శృంగారమును మఱింత పచ్చిగా వర్ణించుట 'ముల్లుపుచ్చి కొఱ్ఱడచిన చంద' మయినది వక్తృవిశేష వివేచన చేయకపోబట్టి ఆ అనౌచిత్యము తటస్థించినది ఈదోషము

పెక్కు గ్రంథములలో కానవచ్చును. దీనిని గురించి నన్నెచోడుని కుమారసంభవ ప్రకరణమున సప్త ఋషులు పార్వతిని వర్ణించిన సందర్భమున వివరించితిని.

కాళిదాసు తన నాటకమున మానవ ప్రకృతికి మానవేతర ప్రకృతికి ఋష్యాశ్రమమున సాధించిన అభిన్న సాజాత్యము పినవీరనయు చేజార్చక కొంత వరకు సాధించెను కాని, ఆశ్రమమునకు మూలాధారమై దివ్యతేజోరాశియగు కణ్వపాత్ర మీ ప్రబంధమున కొంచెము కలుషితమైనది నాటకమున దేదీప్యమానముగా వెలుగు నాజ్యోతి ప్రబంధమున మసకగా నున్నది. ఈ ప్రబంధమున శకుంతల నత్తవారింటి కంపునపుడు కణ్వుడు పల్కిన పల్కులలో ఎంత ఆర్ద్రత ఉన్నను, ఋషిజనోచితముగాని పేలవత ఆ ఘట్టమునకు కళంకము తెచ్చినది కూమార్తెకు అయన చేసిన ఉపదేశము కూడా అతిచాలనమే యైనది. నాటకమున గర్భస్థానమున ఉన్న నాల్గవ అంశముననే కణ్వపాత్ర యొక్క ప్రవేశ నిష్క్రమణలు జరుగును పర్వత శిఖరము మీద పెట్టిన అఖండ దీపము కొండ కిరుప్రక్కలకు వెలుగునొసంగునట్లు నాల్గవ అంకమున జ్యోతివలె ప్రతిష్ఠింపబడిన కణ్వపాత్ర నాటక పుర్వోత్తర భాగములకు దీప్తినొసగినది ఉత్తర భాగమున ఆ పాత్ర లేకపోయినను, ఆతేజము అంతర్వాహినిగా ప్రవహించుచునే యున్నది. కణ్వపాత్ర కామహత్త్వ మీ ప్రబంధమున రాలేదు

కాళిదాసు నాటకమున వ్యంగ్యముగా ఋష్యాశ్రమమునకు రాజాస్థానమునకు గల తారతమ్య మహత్త్వము నాటకము యొక్క పూర్వోత్తర భాగములలో నెంతో సున్నితముగా ప్రదర్శింపబడినది. ప్రాణుల పరస్పర సంయోగమున కాశ్రమములు స్థానములు; వాని వియోగమునకు రాజాస్థానములు నెలవులు అకలుష చిత్తవృత్తికి, నిర్మలప్రేమకు నాశ్రమములు తావులు; కాపట్యమునకు చిత్తాందోళనమునకు అసూయలకు రాజాస్థానములు నిలయములు కేవల కామ ప్రేరితమైన దాంపత్యము సౌందర్య సాపేక్షమైనది పవిత్రమును, స్థిరమును కాదు ఆ కామ మనుతాప రూప తపోబలముచే క్షాళితమై సౌందర్య నిరపేక్ష మయినపుడు లోకపావనమును దివ్యము అగును. శాకుంతల నాటకమును అంతర్భూతమైయున్న జీవిత మహాధర్మము లివి ఈ మహాధర్మములను పరామర్శించు నుద్దేశ్యముతోనే, ఆ జగదేకకవి భారతకథకు భిన్నముగా ఒక ప్రణాళికను నిర్మించుకొనెను. కాళిదాసుడే చేపట్టకపోయినచో శకుంతలా వృత్తాంతమునకు లోకమున ఈ పూజ్యతయే లేదు. భారతమునందలి అనేకోపాఖ్యానములలో నిది యొకటియై యుండెడిది పినవీరన భారతానుసారిగా కథను ముగించుటచే ఈ ప్రబంధము నాటక మహత్త్వమును కోల్పోయినది. నాటకము నుండి గ్రహించిన సందర్భములలో నక్కడక్కడ సంస్కృత శ్లోకములను కొన్నింటిని చక్కగా తెనిగించెను ఆ తెనిగింపు ఇంచుమించు శ్రీనాథుని అనువాద పద్ధతిలో నున్నది అందును శ్రీనాథుడు నైషధమున చూపిన శబ్దానుకరణ సమాసాను కరణ చమత్కారము లుండవు మరి హరవిలాసము నందలి గౌరీ కళ్యాణమున శ్రీనాథుడు చేసిన కుమారసంభవ శ్లోకానువాదమునకు పినవీరన అనువాదము మిక్కిలి సన్నిహితముగా నుండుననుట సత్యము గౌరీ కళ్యాణమునందువలె శృంగార శాకుంతలము నందును భావానువాదమే ప్రధానముగా ఉన్నది కాళిదాసుని కవిత్వముతో వీరేకాదు, యే అనువాదకుడును చెలగాట లాడలేడు ఈ కవియే శాకుంతల మంతయు

నాటకముగా తెనిగించినచో, మన వాఙ్మయమున నాటకములేని కొఱత చిరకాలము క్రిందటనే తీరుటయటుండ, సంస్కృత నాటకానువాదములకు మంచి ఒరవడి యేర్పడి యుండెడిది. అనువాదమునకు కొన్ని ఉదాహరణములు –

"గ్రీవా భఙ్గాభిరామం ముహురనుపతతి స్యన్దనే బద్ధ దృష్టిః
పశ్చార్ధేన ప్రవిష్ట శ్శరపతనభియా భూయసా పూర్వ కాయమ్
దర్భై రర్ధావలీఢై శ్శ్రమ వివృతముఖ భ్రంశిభిః కీర్ణవర్త్మా
పశ్యోదగ్ర ప్లుతత్వా ద్వియతి బహుతరం స్తోకముర్వ్యా మ్ప్రయాతి"

చ॥ "విలుగొని వెంట వెంటఁ బృథివీపతి రాఁ శరపాత భీతిఁ దా
మలఁగి మలంగి కన్గొనుచు మార్గము క్రేవకు నడ్డగించుచున్
నిలుచుచుఁ గొంతకొంత గమనించుచు నర్ధము మేసిమేసి ద
ర్భలు నివృతాస్య పార్శ్వముల రాలఁగ మింటికి జౌకళించుచున్"

"అసంశయం క్షత్రి పరిగ్రహక్షమా
యదార్యమస్యా మభిలాషి మే మనః
సతాం హి సన్దేహ పదేషు వస్తుషు
ప్రమాణ మన్తః కరణః ప్రవృత్తయః"

ఉ॥ సందియమేల యీ వికచసారస లోచన రాజపుత్రి నా
డెందము మౌనికన్యల బడిం జననేరదు నిక్కువంబ యే
చందమునందు సంశయ విచారపదంబగు నట్టి వస్తు సీ
మం దమ చిత్తవృత్తులు ప్రమాణము లుత్తములైన వారికిన్

పై శ్లోకమును శ్రీనాధుడైనచో గీత పద్యమున తెనిగించి యుండును పిన వీరన వృత్తమున తెనిగించినాడు.

"అనాఘ్రాతం పుష్పం కిసలయ మలూనం కరరుహై
రనా విద్ధం రత్నం మధునవమనాస్వాదిత రసం
అఖణ్డం పుణ్యానాం ఫలమివచ తద్రూప మనఘం
నజానే భోక్తారం కమిహ సముప స్థాస్యతి విధిః"

చ॥ "కొనకొని తావి మూర్కొనని క్రొవ్విరి, యెయ్యెడ వజ్రసూచి మా
యనిరతనంబు, జిహ్వ చవియానని తేనియ, గోరు మోపి గి
ల్లని చిగురాకు, లాలిత విలాస నికేతన మూలతాంగి, దా
నను భవకర్త యే ఘనుఁడొ యావిధియత్న మెఱుంగనయ్యెదన్"

"పాతుం న ప్రథమం వ్యవస్యతి జలం యుష్మా స్వపీతేషుయా
నాదత్తే ప్రియ మణ్డనాఽ పి భవతాం స్నే హేన యా పల్లవమ్
ఆద్యేవః కుసుమ ప్రసూతి సమయే యస్యాభవత్యుత్సవః
సేయం యాతి శకున్తలా పతి గృహం సర్వై రనుజ్ఞాయతామ్"

సీ॥ అలపెఱుంగక తావకాలవాలములకు నెమ్మితో నిరవొంద నీరువోసి
క్రమవృద్ధిఁబొందు మార్గంబు లారసివచ్చి పూఁటపూఁటకుఁ జాలఁ బ్రోదిచేసి

ప్రేమాతిరేకతఁ బ్రియ మండనమునకుఁ జిగురాకుఁ గొనగోరఁ జిదుమ వెఱచి
పరిపాటి నల్లన ప్రసవోద్గమంబైన సఖులు దానును మహోత్సవ మొనర్చి
"తల్లియై పెంచె మిమ్ము సీతలిరుబోడి, యత్తవారింటి కరిగెడు నాలతాంగి
క్షితి రుహములార పుష్పిత లతికలార యనుమతింతురుగాన కళ్యాణయాత్ర"

'నలిన సంభవు' – అన్న నైషధ పద్యమును మనమున లక్షించుకొనియే పినవీరన యీ శ్లోకమును తెనిగించినాడు. ఆంధ్రీకరణమున కాపద్యము పరమావధియని చెప్పనొప్పును ఈ పద్యము దానితో తులతూగుచున్నది 'కళ్యాణ యాత్ర' యన్నది శ్రీనాథుని ప్రయోగసరణి నున్నది ఇది సర్వదా దానివలెనే మూలమును గౌరవించుచు, సమతను పాటించుచున్నది మూలార్థము సీసపద్యమునకు చాలనప్పుడు అధిక పారకల్పనము చేయుటయు శ్రీనాథుని సీస పద్యములనే తలపించుచున్నది

మఱియు నీతడు శాకుంతలము నుండియేకాక, కుమార సంభవము నుండియు కొన్ని శ్లోకము లాంధ్రీకరించెను అది విశ్వామిత్రుని తపో వర్ణమునకు ముందు చేసిన హిమవద్వర్ణన సందర్భము. అందలి తొలిపద్య మాంధ్రీకరణ విషయమున సరిగా 'తపనీయ దండైక' యన్న నైషధ పద్యమును బోలియున్నది. ఎత్తుగీతి మాత్రము కాళిదాసుని మొదటి శ్లోకమునకు సరియైన తెనిగింపు.

"అస్త్యుత్తరస్యాం దిశి దేవతాత్మా
హిమాలయో నామ నగాధి రాజః
పూర్వాపరో వారినిధీ విగాహ్య
స్థితః పృథివ్యా ఇవ మాన దండః"

"అలరి పెంపొందుఁ బూర్వాపరాంబు నిధుల
నడుమ ధరణికి మానదండంబువోలె
దేవతాత్మ ధరాధీశ దిగ్విభూష
పుణ్య నిలయంబు నీహార భూధరంబు"

"యం సర్వశైలాః పరికల్ప్య వత్సం
మేరౌస్థితే దోగ్ధరి దోహ దక్షే
భాస్వన్తిరత్నాని మహౌషధీశ్చ
పృథూపదిష్టాం దుదుహు ర్ధరిత్రీమ్"

"భూధరములెల్లఁ దనువత్సముగ నొనర్పఁ
బృథు నృపాలోపదిష్టయై ప్రియము మీఱ
నఖిల రత్నౌషధులను జన్నవిసి పిదికె
నమర శైలంబు దోగ్ధగా నవని సురభి"

"పదం తుషార స్రుతి ధౌతరక్తం
యస్మి న్నదృష్ట్వాఽపి హతద్విపానాం
విదన్తిమార్గం నఖరన్ధ్రముక్తై
ర్ముక్తాఫలైః కేసరిణాం కిరాతాః"

"వారని మంచు పైఁ బొదివి వచ్చిన పోయినచొప్పు మాసినన్
భూరి నఖాగ్ర ముక్తమయి పొల్పగు ముత్తెపుఁ జాలువెట్టఁగా
దారటులేఁగి కాంతురు హాతద్విపకేసరి వాస సీమలన్
వీర కిరాతు లద్రి వన వీథుల సింగపు వేటలాడుచున్"

ఇతర సంస్కృత గ్రంథములందలి శ్లోకములను తెనిగించి ఈ పద్యములకు సందర్భోచితముగ ప్రస్తుత గ్రంథమున పొందించుట శ్రీనాథుని మర్యాదయే

**జైమిని భారతము:** ఇందలి శైలి శాకుంతలమునందు కంటె పరిపక్వముగా నున్నది. అందుచే శాకుంతలముకన్న దీని కెక్కువ ప్రశస్తి కలదు శాకుంతలమునకే ప్రశస్తి లేకుండుట కింకొక కారణము కూడ కలదు భారతానుసారిగా శాకుంతలమును వ్రాసిన వాడెవ్వడును కాళిదాస నాటకము ముందు దానిని బాగున్నదనిపింపలేడు. ఆ నాటకము ననుసరించి యే ప్రబంధము రచించినను వెలితిగా నుండును. పినవీరన ఉత్తర భాగమెల్ల భారతానుసారిగా వ్రాయుటచే నాటకము ముందీ ప్రబంధము వన్నె కెక్కలేదు. ఈ రెండు కారణములచే జైమిని భారతమునకు వచ్చిన ప్రశస్తి శాకుంతలమునకు రాలేదు ఈ కథ భారత కథా భాగము కనుక యుద్ధ ఘట్టముల యందు శైలి, తిక్కన శైలికి ఛాయవలె కన్పట్టుచుండును; కాని శ్రీనాథ శిష్యత్వమును దృఢపరచు ప్రత్యేకతయు నందు కలదు

ఈ కథ పాండవుల అశ్వమేధమునకు సంబంధించినది కనుక తద్యాగ ప్రయత్న నిర్వహణములయందు మాత్రము వ్యాస భారతమునకును, జైమిని భారతమునకును పోలిక కలదు. తక్కిన గ్రంథమునకు భారతముతో పోలికయే లేదు యాగాశ్వ రక్షకుడుగా అర్జునుడు సంచరించి దేశములైనను అందును ఇందును సమముగా లేవు వ్యాస భారతమున సూచనా మాత్రముగ ఒక వాక్యములో చెప్పబడిన దాక్షిణాత్య దేశములన్నియు జైమిని భారతమున! విపులముగా వర్ణింపబడినవి వ్యాస భారతమున బ్రహ్మ విద్యోపదేశము మెండు. ఇందా వాసనయే లేదు అందలి విశ్వరూప ప్రసక్తియు నిందులేదు. ఉత్తరా శిశువును శ్రీకృష్ణుడు బ్రతికించుటయు నిందులేదు. ఇన్ని మార్పులిందుగాన వచ్చినను, ఈ భేదమునకు కారణము శ్రీకృష్ణుని మాహాత్మ్యమును కొంచెపరచు నుద్దేశమేమో అని సందేహింప వీలు లేకున్నది ఏమన ఇందలి ప్రధాన కథ యందేకాక ఉపాఖ్యానములందును శ్రీకృష్ణుని మాహాత్మ్యము బహుధా ఉగ్గడింపబడినది. కుశలవోపాఖ్యానము, చంద్రహాస చరిత్ర, ప్రమీలార్జునీయము మొదలగు చక్కని ఉపాఖ్యానములు మహాభారతమున లేనివి ఇందు కలవు ఈ కథలు చాల రసవంతములుగా నున్నవి. ఈ జైమిని యెవ్వరు? వ్యాస శిష్యుడును, భారత ప్రచారకులలో ఒకడైన జైమినియేనా? అగుచో గురువుగారి రచనకు భిన్నముగా తానొక భారతమును రచించెనా? అదియు అష్టాదశ పర్వనిర్వహణ సంభృతమా? అశ్వమేధ పర్వము ఒకటియే యైనచో దానియందీ జైమినికి గల అభినివేశమునకు కారణమేమి? యను ప్రశ్నలకు సరియైన సమాధానము కుదురదు. కాని ఈ జైమిని నామమును గురించి మార్కండేయ పురాణ ప్రకరణమున కొంత చర్చించితిని. అందు చూడదగును.

మరి ఈ జైమిని భారతకర్త, భారత మంతను రచించినచో పోయినవి పోగా మరి ఇంకొక పర్వమైనను లభించి యుండెడిదే అట్టిది ఎచ్చటను కానరాక పోవుటచే ఈ ఒక్క పర్వమునే అతడు వ్రాసెనేమో యని అనుకొనవలసి వచ్చును. మరియు ఇతడు దక్షిణ దేశమున కెక్కువ ప్రాధాన్యమిచ్చుటచే దాక్షిణాత్యుడేమో యని కూడ అనుమానించుట కవకాశమున్నది. ఈ ఊహ నిజమైనచో, ఇతడు ద్వాపరయుగము నాటివాడు కాడనియు వ్యాసుని శిష్యుడంతకు మున్నే కాడనియు సిద్ధాంతీకరింపవచ్చును

## దూబగుంట నారాయణకవి

దూబగుంట నారాయణకవి కవి పంచ తంత్రమును 1470 ప్రాంతమున రచించి, ఉదయగిరి ప్రభువైన బసవరాజున కంకిత మిచ్చెను ఇది నీతి కథాసముచ్చయమన్న మాట లోక మెరిగినదే నీతికథలు బాలురకు సైతము సుబోధముగా నుండగల సులభ శైలిలో ఉండుట సమంజసమని సంస్కృత పంచతంత్ర మూలకర్త అ గ్రంధమును తదనుగుణమైన శైలిలో వ్రాసెను. నారాయణకవి తనకు సహజమైన సరళ ధారాళ శైలిలో గ్రంధమును తెనిగించి మూలకారుని ఆశయమును యధాశక్తి పాటించినా డనిపించుకొనెను ఈ తెనిగింపులో అతడు స్వతంత్రించి కొన్ని వర్ణనలు చేసి గ్రంధమునకు సొబగు గూర్చెను ఇతని వర్ణనలు స్వాభావికముగా కథలో పొంది పొసగి యుండును. కోతుల చేష్టలు గల ఈ క్రింది వర్ణనను చూడుడు.

సీ॥ గుడి యెక్కి తరులపైఁ గుప్పించునవియును
దరువుల పై నుండి దాఁటునవియు
నురుతర శాఖల నూఁగాడునవియును
బ్రాకారములు ప్రాఁకి పాఱునవియు
గోపురంబుల మీఁద గూర్చుండు నవియును
గోళ్ళఁ బ్రక్కలు వీఁపు గోఁకునవియు
నిక్కుచు బొమలెత్తి వెక్కిరించెడు నవి
యొండొంటితో బోరుచుండు నవియు

గీ॥ ఇట్లు వానర యూథంబు లిట్టునట్టు
సహజమగు చాపలంబున సంభ్రమింప
వానిలోపల నొక వృద్ధ వానరంబు
దూరముగఁ బాఱి తా విధి ప్రేరణమున

ఇతడు వ్రాసిన నీతి వాక్యములు ఒకమారు చదివి నంతనే కంఠస్థములగు నట్లుండును చూడుడు.

పౌరుష జ్ఞాన కీర్తులఁ బరఁగె నేని
వాని సంపద యొక పూఁటయైనఁ జాలు
నుదర పోషణ మాత్రకై యుర్వి మీఁదఁ
గాకి చిరకాలమున్న నే కార్యమగును?

మడికి సింగన కాలమునకు పూర్వమే తెలుగులో ఒక పంచతంత్రమున్నట్లు సింగన సంకలనము చేసిన సకలనీతిసమ్మత మను గ్రంధమున అతడుదాహరించి పద్యములను బట్టి తెలియుచున్నది కాని ఆ గ్రంధమిప్పుడు కానరాదు. ఆ గ్రంధము నారాయణకవి నాటికే లుప్తమై యుండును. లేనిచో అతడు ఈ రచనకే పూనుకొని ఉండడని నా ఊహ

## బైచరాజు వేంకటనాథుడు

బైచరాజు వేంకటనాథుడు నారాయణ కవికి కొంచెము తరువాతి వాడు ఇతడు పంచతంత్రము తెలుగులో భారతము వలె ప్రసిద్ధమై తాను తిక్కనయంత వాడుగా కీర్తి సంపాదింపవలెనను ఆకాంక్ష కలవాడు. ఈ విషయమున నీతడు నాచన సోమనాథు ననుసరించెను. తిక్కనార్యుని వలె గ్రంధమును హరిహరాంకితము కావించుటయే కాదు – పీఠికను సైతము పర్వాది యందున్న తిక్కన్నగారి అవతారిక ననుకరించియే రచించెను.

"ఏ చనవు గలదు హరి హర
సాచివ్యము నొంద నన్యజనులకు మది నా
లో చింపఁ దిక్క యజ్వకు
నాచన సోమునకు మఱియు నాకుందక్కన్" అని సగర్వముగా చెప్పకొనెను

తన కావ్యము విద్వజ్జన సేవ్యముగా ఉండవలెనని ఈతని ఆశయము అందుచేతనే ఆ కథలకు అసహజమైనను విద్వజ్జనతుష్టికొరకు ప్రౌఢశైలి నవలంబించెను నారాయణ కవి పంచతంత్రము సులభమైన శైలి యందుండుటచే పేలవముగా నున్నదని భ్రమించి కాబోలు ఇతడు మరల ఆ గ్రంధమునే ప్రౌఢమైన శైలిలో రచించెను నీతికథా ప్రచురమైన ఈ కావ్యమునకు సరళ శైలి తగియున్నట్లుగా ఉజ్జ్వలమైన శైలి తగియుండదు రెండు కావ్యములను సమాన సందర్భములలో పోల్చి చూచినప్పుడు ఈ కావ్యమునకు ముఖ్య ప్రయోజనమైన సరసకథా పూర్వక నీతిబోధనము నారాయణకవి రచనముననే సిద్ధించెనని వ్యక్తమగును. ఇతడిందు క్రొత్తకథలను జేర్చుటయేకాక మూలములోని పాత్రల రూప రేఖాదులను సన్నివేశములను పెంచి వర్ణించెను శబ్దాలంకారములపైని గూడ ఇతనికి మక్కువ కలదు. శ్లేషాద్యలంకారములతో వచనమును సైతమితడు ప్రౌఢముగ గద్యకావ్య ఫక్కికలో రచించెను. కాని యితనికి శబ్ద సార్థక్యముపై దృష్టియున్నట్లు కన్పట్టదు. కీలోత్పాటన మొనర్చిన వానరము యొక్క కథ మూలమున చాల చిన్నది. దీనిని ఆరు పద్యములలో నారాయణకవి రచింపగా ఇతడు 22 గద్య పద్యములకు పెంచెను.

ప్రబంధ ధోరణి కథలకు పట్టించి వ్రాసెను. గానీ ఈ శైలీ భారమును ఆ కథలు మోయలేకపోయెను. రసవత్తత వాక్కులోను భావములోనేగాని శైలిలోనూ, వర్ణనలోనూ కానరాదు.

## వెన్నెలకంటి సూరన

ఈతడు విష్ణుపురాణమును తెనిగించెను. ఉత్తరార్ధము, ధర్మశాస్త్రము, వేదాంతము, శిష్యము నగుట దెనిగింప లేదు. కొంతభాగమునే ఆంధ్రీకరించెనని యీతడు చెప్పెను రావూరి రాఘవరెడ్డి కృతిపతి ఈ తెనిగింపు పురాణేతిహాస రచనల వలెనే స్వతంత్రము హరివంశము, భాగవతము, విష్ణుపురాణములను మూటను సమాన ఘట్టములుండును ఏకజాతి వగుట నరకాసుర వధ, ప్రహ్లాద జడభరతోపాఖ్యానము, రుక్మిణీకల్యాణము, ఉషాపరిణయము గలవు ఇతని కెల్లన శిల్పచాతురి కానీ, సోమన యర్థచమత్కృతి కానీ లేవు పోతన భక్తి పారవశ్యమును లేదు ప్రశస్తికి మాత్రమొక వైలక్షణ్యము కలదు కథౌచిత్యము, పురాణోచిత శయ్యాసౌలభ్యము, ప్రసన్నమైన యధార్థ వ్యక్తీకరణము గలవు రచన కివి సహజాలంకారములు తారా శశాంకము, ధృవోపాఖ్యానము రసవంతములు. పురాణ కర్తలలో నీతడు గణనీయుడు.

16వ శతాబ్దిని అడవి భావనారాయణ విష్ణుపురాణమును దెనిగించెను వెన్నెల కంటి కంటె మూలాశ్రయుడు అతని పురాణశైలిని మించిన శైలి యిందు గలదు. ప్రబంధశైలి యనవచ్చు. ప్రబంధరచన యీనాటికి వ్రేళ్ళు పాటీనది

## దుపర్తి సోమన

ఆంధ్ర సాహిత్యమునందు వైష్ణవ మతమునకు తాళ్ళపాక వారివలె శైవమునకు పిడుపర్తి కవులు సేవ చేసిన పుణ్యులు పాల్కురికి సోమనాధునికి ముఖ్య శిష్యుడైన శివరాత్రి కొప్పయ్యగారి వంశమందే ఈ పిడుపర్తి కవులుద్భవించినారు పిడుపర్తి సోమనాధుని తండ్రి పేరు బసవయ్య. ఈ బసవయ్య గురుదీక్షా బోధ, పిల్లనైనారు కథ, బ్రహ్మోత్తర ఖండము మొదలైన గ్రంధములు వ్రాసినాడట. ఇతడు పిడుపర్తి నిమ్మయ్యగారి పినతండ్రి కొడుకు. ఆ నిమ్మయ్యగారు క్రీ శ 1440 ప్రాంతమువాడు కాబట్టి అతడు కూడ ఆ ప్రాంతమువాడే యైయుండుననుట నిజము కాబట్టి ఈ బసవ కవియొక్క కుమారుడైన సోమనాధుడు పదునైదవ శతాబ్దము యొక్క ఉత్తరార్ధమునందు రచనలు చేసియుండునని చెప్పవచ్చును (1480 ప్రాంతము).

ఈయన పాల్కురికి సోమనాధుని ద్విపద కావ్యమైన బసవ పురాణమును చంపూ కావ్యముగా రచించి తండ్రి కోరికమీద మూలకర్తయైన పాల్కురికి సోమనాధునికే అంకితమిచ్చినాడు ఆ తండ్రియే రచన మూలానుసారముగా నుండవలెనని కుమారున కుపదేశించెను

"నీవును సోమేశుని ద్విప
దావళి యర్థములు చేయు, మందుల యర్థం
బావంతయు దిగ వీడక
యేమియు మున్నుందు లేని విడకు కుమారా!"

పాల్కురికి సోమన, పండితారాధ్యుని పద్యములను తన ద్విపదలలో నిమిడ్చినట్టుగా ఈ పిడుపర్తి సోమన బసవపురాణ ద్విపదలను తన పద్యములలో చాలవరకు ఇముడ్చగలిగెను. ద్విపదలు పద్యములుగాను, పద్యములు ద్విపదలుగాను మారిన ప్రక్రియలో ఇట్టి శబ్దానువాదము వాక్యానువాదము సహజమేనని లోగడ చెప్పియుంటిని ఇతడు ప్రతి శివభక్తుని సాక్షాత్తు 'శివస్వరూపునిగానే వర్ణించెను పాల్కురికి సోమనాథునివలె ఇతడును అమితముగా వాగ్వ్యయము చేయును ఒక వాక్యములో సరిపోవు ఒక విషయమును చెప్పుటకు పది వాక్యములు వెదజల్లును. పెక్కింటికి సార్థకత ఉండదు. పెక్కు విశేషణములకు సుభగత్వ ముండదు. అందుచేతనే కావ్యరసాస్వాదన కుతూహలపరులకు ఈ రచన మనోజ్ఞముగా నుండదు ఇతడు సహజ కవితాశక్తి కలవాడే అయ్యు మితిలేని భక్త్యావేశమున శబ్దార్థ స్వారస్యము నెడల అనాదరము చూపి సహజశక్తిని విఫల మొనర్చుకొనెను.

## నంది మల్లయ-ఘంట సింగయ

దూబగుంట నారాయణ కవి పంచ తంత్రమును ఉదయగిరి ప్రభువగు బసవరాజు కృతి పుచ్చుకొనెను. అతని మంత్రియగు చందులూరి గంగయామాత్యుడు దగ్గుపల్లి దుగ్గన నాచికేతూపాఖ్యానమునకు కృతిపతి అనియు, ఆ గంగయామాత్యుడే వీరి ప్రబోధ చంద్రోదయమునకు కృతిపతి యని ఇతః పూర్వము చెప్పితిని ఇతడు సాళువ నరసింహరాయలు విజయనగరరాజ్యమేలు కాలమున అతనికి సమకాలికుడు ఆ సాళువరాజు పిల్లలమఱ్ఱి పినవీరన జైమిని భారతమునకు కృతిపతి. కావున పినవీరన, నారాయణ కవి, దుగ్గన, నంది మల్లయ్య, ఘంట సింగయ్యలు సమకాలికులు ఈ జంటకవులు తమ వరాహ పురాణమును సాళువ నరసింహరాయని సర్వసేనాధ్యక్షుడగు తుళువ నరసరాయలకు కృతి యిచ్చిరి. ఈ సేనాధిపతియే కృష్ణదేవరాయల తండ్రి, కృతి ప్రదానము నాటికి తుళువ నరసింహరాయలింకను రాజుగా సింహాసనమెక్కలేదు. ఈ అంశము గ్రంథములోనే ఉన్నది.

కం॥ ధరణీనుత దేవకీపుర
వరనిలయ, శ్రీగిరీశ వర సంపన్నే
శ్వర విభు తనయా, సాళువ
నరసింహ నృపాల దండ నాయక తిలకా!

ఈ సాళువ నరసింహరాయలకు తుళువ నరసింహరాయలు సేనాధ్యక్షుడే కాక, దగ్గర చుట్టము కూడ. తుళువ వంశపు రాజులు దేవకీపురము రాజధానిగా (అది నేటి ఉత్తరార్కాడు జిల్లాలో ఒక పల్లెగా ఉన్నది) ఒక చిన్న రాజ్యమును ఏలుచుండిరి. వారికిని చంద్రగిరి రాజులైన సాళువ వారికిని స్నేహబాంధవ్యములు కలవు. స్వంత రాజ్యము ఏలుకొనుచునే తుళువ నరసింహరాయలు సాళువ నరసింహరాయునకు సర్వసేనాధ్యక్షుడై యుండెను. కావుననే తన రాజుతో కలసి తానును విజయనగరమునకు తరలిపోయెను కృష్ణదేవరాయలు ఈ దేవకీ పురముననే జన్మించి యుండును. ప్రభుభక్తి పరాయణుడైన ఆ సేనాధ్యక్షుడు, తన యేలిక

అనంతరము, అతని కుమారుని కొలువున కూడ సేనాధిపతిగా ఉండి, వాడు అసమర్థుడును నీతిదూరుడును అగుట గమనించి విజయనగర రాజ్యమునకు తాను రాజయ్యెను. దీనినిబట్టి నంది మల్లయ, ఘంట సింగయలు మొదట ఉదయగిరి ఆస్థానమునను, పిమ్మట విజయనగర ఆస్థానమునను కవులుగా ఉండిరని విదితమగును. ఈ ఇరువురిలో సింగయకు మలయమారుత కవియని బిరుదనామము కలదు ఈ మలయ మారుత కవి "మదన సేనము" అను కావ్యము ప్రత్యేకము రచించెనట. వీరిద్దరు మేనమామయు, మేనల్లుడు నగుదురు మల్లయకు సింగయ మేనల్లుడు కృష్ణదేవరాయని అష్టదిగ్గజములలో .నొకడగు నంది తిమ్మన సింగయకు మేనల్లుడు కావున నంది మల్లయకు నంది తిమ్మన సాక్షాత్పౌత్రుడు కాకపోయినను మనుమని వరుస కలవాడు. కృష్ణరాయని కాలమున నంది తిమ్మనయు, విజయనగర ఆస్థానమున కవిగా ఉండుట, ఆ తుళువ వంశముతో నంది వంశమునకు గల స్నేహపూర్వక సంబంధము మరవరానిది

ప్రబోధ చంద్రోదయము:

ఇది యొక అంతరార్థము గల ఆధ్యాత్మిక కావ్యము (Allegorical Poem) సంస్కృతమున కృష్ణ మిశ్రుడు వ్రాసిన నాటకము దీనికి మూలము ఇట్టి నాటక మొకటి బౌద్ధమత పరముగా అశ్వఘోషుడు రచించెను. అందలి శిథిలావశేషము టిబెట్ లో దొరకినది. జైనమత పరముగా గూడ ఇట్టి గ్రంథములు గలవట అశ్వఘోషుని నాటకములో మానవత్వ మారోపింపబడిన ఆధ్యాత్మిక పాత్రలకే కాక మానవ పాత్రలకును ప్రవేశము గలదు ప్రబోధ చంద్రోదయమున మానవ పాత్ర లేనేలేదు. దీనిని జూచి వేదాంత దేశికుడు విశిష్టాద్వైత పరముగ సంకల్ప సూర్యోదయము రచించెను. చైతన్యస్వామి పైనిగూడ నిట్టి నాటక మొకటి కలదట.

ప్రబోధ చంద్రోదయము తెనుగున నొక అసమానమైన కావ్యమయినది దీనివలె సమగ్రముగా ఆధ్యాత్మికమైన కావ్యము తెనుగున మరియొకటి లేదు సంస్కృత నాటకమును సమగ్రముగా తెనుగులోని కవతరింపజేసిన వారీ కవులే' సమగ్రముగా తెనుగునకు వచ్చిన మొదటి రూపకము ప్రేమాభిరామ మనెడి వీధి. దాని తెనుగే శ్రీనాథుని క్రీడాభిరామము.

ఈ కావ్యము కృష్ణమిశ్రుడు భారత కథా ప్రణాళిక ననుసరించియే నిర్మించెను. దుర్మార్గులైన దుర్యోధనాదుల పక్ష మవలంబించి పాండవులను వేరు చేసికొన్న చంచల ధృతరాష్ట్రునివలె, సహజ చంచల స్వభావము గల మనస్సనెడి వాడు మహామోహాదులనెడి యొక సంతాన వర్గమును లాలించి, వివేకాదులనెడి రెండవ వర్గమును ద్రోసిపుచ్చును. దుర్యోధనునకు దుష్ట చతుష్టయమువలె మహా మోహునకు కామ క్రోధాదులు మంత్రులుగా నుందురు. మరియు ఆ కురురాజునకు అనాడు అవైదిక జాతి యంతయు ప్రాపయి నిల్చియుండగా, ఈ మోహునకు సైతము చార్వాకాది నాస్తికు లండ యగుదురు ధర్మరాజున కతని తమ్ములు వలె, వివేకునకు యమనియమాదులనెడి మంత్రులును, కృష్ణుడు వలె విష్ణు భక్తియు బాసటయయి శత్రు విజయమును కాంక్షింతురు భూ రాజ్యమునకై కురు పాండవులకు జరిగిన యుద్ధము వలెనే ఈ పక్షముల వారికి ఆధ్యాత్మిక రాజ్యాక్రమణమునకై ఘోర

యుద్ధము జరుగును. పాండవులవలె వివేకాదులే జయింతురు పుత్రనాశఖిన్నుడగు ధృతరాష్ట్రునకు వ్యాసుడు వలె, మహామోహనాశ దుఃఖితుడైన మనస్సునకు వైయాసికి విద్య జ్ఞానోపదేశము చేసి శాంతి చేకూర్ప యత్నించును భారత చరమ భాగమున గల ఉపనిషదర్థ ప్రతిపాదనము వలెనే యీ నాటకమున చరమాంకములలో ఉపనిషద్దేవి ప్రవేశించును. వివేక సంయోగమున ఆమెయందు జనించు పుత్రుడే ప్రబోధ చంద్రుడు. ఈ కథకు మహామోహాదుల విజృంభణ బీజము, జ్ఞానోదయము నిర్వహణము.

ఈ నాటకమును తెనిగించుటలో ఈ కవులు కథా మాత్రమును గాని, శ్లోక క్రమముగాని ఎచ్చటను మార్చలేదు ప్రబంధమునకు అవశ్యకములైన వర్ణనలు మాత్రము స్వతంత్రములైనవి; అచ్చటచ్చట ఒకటి రెండు కలవు వాటిలో ముఖ్యమైనది చిదానందనగర వర్ణనము వేదాంత రాజ్యమునకు రాజధానియగు ఆ నగరమునకు ఆ పేరు పెట్టిన ఈ కవుల యొక్క కల్పనాశక్తి ప్రశంసింపదగును. ఈ పేరు మూలమున లేదు. యుద్ధ ప్రకరణములో చేయబడిన సూర్యాస్తమయాది వర్ణనలు మరికొన్ని కలవు. సంవాదాత్మకమైన నాటకమును కథనాత్మకమైన ప్రబంధముగ తెనిగించుట, అనువాద సరళికి కష్టతరము. ఈ దుర్ఘట కార్యనిర్వహణమున ఈ కవులు మంచి నైపుణిజూపి చరితార్థులైరి. వాక్య సాంగత్యముచేయు సంధి వచనములు మొదలగు నలతి మార్పులు తప్ప కొంచమేని మూలాతిక్రమణము లేకుండ నిట్టి యనువాదమును నిర్వహించుటచేతనే వీరియు, వీరి గ్రంధము యొక్కయు కీర్తి అజరామర మయినది. శ్లోకముల తెనిగింపు సయితము శ్రీనాథ పినవీరనల పద్ధతియే మూలము నాత్మీయముగా జేసికొని, వన్నెపెట్టి, క్రొత్త వస్తువుగా ప్రదర్శించిరి.

"సంతు విలోకన భాషణ
విలాస పరిహాసకేలి పరి రంభాః
స్మరణ మపి కామినీ నా
మలమిహ మనసో వికారాయ"

కం. "తరుణుల చూపులు మాటలు
గర గరికలు నగవు బిగవుఁ గౌఁగిటి పొందుల్
పరికింప నేల? తత్సం
స్మరణమె చాలదె మనంబు సంచల పఱుపన్"

శ్లో. "అహల్యాయై జారస్సురపతి రభూ దాత్మతనయాం
ప్రజానాథోఽ నయాసీద భజత గురోరిందుర బలామ్
ఇతి ప్రాయః కోవా న పద మపథేఽ కార్యతమ యా
శ్రమో మద్బాణానాం క ఇవ భువనోన్మాథ విధిషు"

సీ. "తన కన్న కూఁతును తాన పెండ్లాడఁడే
వారిజగర్భుండు వావిదప్పి
బలభేది గౌతము భార్య నహల్యఁగా
మించి చేయఁడే నల్లమేఁక తప్పు

*కడలేని రట్టడి కొడిగట్టుకొని యైనఁ*
*గమలారి గురు తల్పగతుఁడుగాఁడె*
*తపన సూనుడు తార దానాక్ర మింపఁడె*
*యన్న ప్రాణములకు నడ్డుతలఁచి*

*గీ. మఱియు నట్లు జగంబుల మరులుకొల్పి*
*యెట్టి నియతాత్మకుల నైన గుట్టుచెఱిచి*
*కానిత్రోవల నడపించు కడిమికాదు*
*వాలుఁదూపుల గమి కవలీల గాదె."*

మూల శ్లోకములో ఇంద్రునకు ప్రధమస్థానము, బ్రహ్మకు రెండవదియు ఈయబడగా ఈ కవులు మొదటి వేల్పునకు రెండవస్థానము తగదని అగ్రస్థానమే ఇచ్చి గౌరవించిరి. మరియు శ్లోకార్థము సీసమునకు చాలక పోబట్టి సుగ్రీవునకు నాలుగవ పాదమును అంకితమొనర్చి పద్యమును పూర్తిచేసిరి. ఇది శ్రీనాధుని ఫక్కికి అనుసరణమని నేను వేరె చెప్పనక్కరలేదు ఈ క్రింది సీసపద్యము కూడ అట్టిదే:

*"శ్రీదేవీ జనకాత్మజా దశముఖ క్యాసీ ద్గృహే రక్షసో*
*నీతా చైవరసాతలం భగవతీ వేదత్రయీ దాన వైః*
*గంధర్వస్య మదాల సాంచ తనయాం పాతాల కేతుశ్చ లా*
*దైత్యేంద్రోఽపజహార హన్త విషమా వామా విధేర్వృత్తయః"*

*సీ. "చాఁపచుట్టగఁ జుట్టిచంకఁ బెట్టుక పోఁడె*
*ధరణి హిరణ్యాక్ష దానవుండు*
*వేదత్రయీ కాంత వెస ముచ్చిలింపఁడే*
*చూఱపట్టిన యట్లు సోమకుండు*
*సాక్షాన్మహాలక్ష్మి జనక భూపాలనం*
*దనఁజెఱ వట్టఁడే దశ ముఖుండు*
*కొసరక యమ్మదాలసఁ గొనిపోఁడె పా*
*తాళ కేతుఁడను నక్తంచరుండు*

*గీ గాన నింతేసి వారముగా యనంగ*
*రాదుపో యెట్టి పుణ్యవర్తనునికైన*
*సహజ వక్రంబు గాన సజ్జనుల మేలు*
*చూడఁజాలక విధితప్పఁ జూచెనేని"*

పై సీసపద్యములో హిరణ్యాక్షుడు ధాత్రీదేవిని గురించిన గాధ నూతనముగా జేర్పబడినది.

*"నిత్యం స్మరన్జలద నీల ముదార హార*
*కేయూర కుండల కిరీట ధరం హరిం వా*
*గ్రీష్మే సుశీత మివ హ్రాద మస్తశోకం*
*బ్రహ్మ ప్ర విశ్వభజ నిర్వృతి మాత్మ నీ నాం"*

"నందన ధరున్ ఘన పురందర మణి ప్రతిము
నిందిర మనోహరు ముకుందు హరిఁగానీ
చందన మరాళబిస కుందధవళాంగు గిరి
మందిరు నుమారమణు నిందుధరుఁ గానీ
పొందుగ సదా మనసునం దలఁచి యైనఁ జిర
మందమగు తత్పరమునిం దలఁచి యైనం
డెందముల పాపము వడిం దలఁగు ఘర్మమునఁ
గుంది మడుగుందఱియ డిందుపడు లీలన్"

వైష్ణవ మతస్థుడైన కృష్ణ మిశ్రుడు శ్రీమహావిష్ణువుని ధ్యేయముగా పేర్కొనగా, అద్వైతులైన ఈ కవులు ఇందుధరునికూడ పేర్కొనిరి అనువాదములో ఇటువంటి భేదములు క్వాచిత్కములుగా ఉండును అవి గ్రంధమునకు గుణ సంపాదకములే గాని దోషాపాదకములు కావు

ఈ నాటకము ప్రబంధముగా తెనిగింపబడుట ఎందుచేత? ఆనాడు మన దేశమున నాటకములాడు ఆచారము లేదేమో యనుకొన్న, అతిప్రాచీనములైన యక్షగానముల యునికి ఇట్టి సందియమును లేకుండ చేయుచున్నది కాని, ప్రబోధ చంద్రోదయమువంటి మార్గనాటకములు, ఆ యక్షగానములవలెనే ఏ పందిరిలోనో ఆడదగిన వీధి నాటకములు కావు. వీనికి సర్వోపస్కర సంపన్నములైన రంగస్థలము లుండవలయును అట్టి రంగములు రాజపోషణమున కాని నిర్మింపబడనేరవు ఒకవేళ సరసుడైన ఏ రాజైనను ఆ నిర్మాణమునకును పూనుకొన్నను, రాజధానీ నగరము వంటి ఒకటి, రెండు పట్టణములలో ఒకటి, రెండు శాలలు నిర్మింపగలడే కాని సమస్త ప్రజా వినోదార్థమై ఊరూర ఒకటొకటి కట్టింపలేడు నాటకమును నాటకముగానే తెనిగించుట ప్రదర్శన సౌకర్యమున్నప్పుడే చరితార్థమగును గాని, లేనిచో వ్యర్థమే యగును. ఏమన, నాటకమును శ్రవ్యకావ్యముగా పఠించి ఆనందింపుడనుట కవికిని తగదు; ప్రజలును ఆనందింపలేరు పరనార్థమయియే తెనిగించునపుడు అది శ్రవ్యకావ్యమగుటయే ఉచితముగాని నిరర్థకముగా దృశ్యకావ్యమగుట ఉచితము గాదు ఈ వృధాశ్రమ మేలయనియే ఈ కృతికర్తలును, కృతిపతియును భావించియుందురు పండిత రంజకమును శాస్త్రసమ్మతమునగు రంగ నిర్మాణమే యుండి ఆ రంగము రాజాదరణ పాత్రమయి ఉండినచో, నాటకము ప్రబంధముగ మాఱుటయు తటస్థింపదు వాటి అభావముననే, మన పూర్వుల నాటక దర్శన కుతూహలమును శ్రవ్యకావ్య శ్రవణమే తీర్చవలసివచ్చెను

అదిగాక, తెలుగు ప్రబంధము ఒక వింత శిల్పనిర్మాణము సంస్కృతమున క్వాచిత్కములగు చంపువులు దక్క, గద్య కావ్యములు వేఱు, పద్య కావ్యములు వేఱు, కథనాత్మకములగు శ్రవ్య కావ్యములు వేఱు సంవాదాత్మకములగు దృశ్య కావ్యములు వేఱు ఇక తెలుగు ప్రబంధమో, గద్య పద్య కథన సంవాదాత్మకమయి, సమస్త కావ్యభేదములు ఏకత్ర రాశీ భూతములయి వెలసిన సంపూర్ణమూర్తి ఇట్టి వైలక్షణ్యము కలిగిన సమగ్ర సారస్వతమూర్తి ఏ దేశ భాషలలోను లేదు. మనలో ప్రత్యేక గద్యకావ్యములు లేనిలోటు, నాటములును లేవనెడి లోపమును ఈ

ప్రబంధమే తీర్చినది మరియు, వర్ణనాత్మకమైన భావ కవిత్వము ఇముడ్చుకొన్నదియు నీ ప్రబంధమే ఇది కవితా శక్తులనన్నిటిని నొఱపి చూచు స్థానమని మన పూర్వుల అభిప్రాయము. "The parts lose their individuality in the finished whole" (Moulton). ఇతర కవులకంటె ప్రబంధ కర్తలే పెద్దలని మనవారు కొనియాడుటయు అందుచేతనే పాశ్చాత్యాధునిక విమర్శకులు కొందఱు, కవితాశక్తి సంపూర్ణవ్యక్తికి Epic (ప్రబంధము) వలె ఏ కావ్యభేదమును జాలదని, దానిని నిర్వహించిన వాడే మహాకవి యని ఒక కళా సిద్ధాంతమును ప్రతిపాదించిరి అట్టి ప్రబంధము ప్రదర్శన సౌకర్యము లేని నాటకముకంటె వాఙ్మయమున చిరస్థాయిగా నుండునను నాశచే ప్రబోధ చంద్రోదయము వంటి నాటకములు తెనుగున ప్రబంధములయి యుండవచ్చును

**వరాహ పురాణము:**

ఇది వరాహవిష్ణువు భూదేవికి చెప్పిన పురాణము కావున దీనికి వరాహ పురాణమను పేరు వచ్చినది ఈ కవులు రచించిన ఈ రెండు గ్రంథములలో ప్రబోధ చంద్రోదయమునకు వచ్చిన ఖ్యాతి వరాహ పురాణమునకు రాలేదు అనాడు ఈ పురాణముపై గౌరవముండవచ్చును గాని కాలము గడచిన కొలది ప్రబంధ రుచి ప్రచుర మగుటచేత కొన్ని పురాణములపై ప్రజాదరము తగ్గెను వాటిలో ఇది ఒకటి అదియును గాక ఏవో కొన్ని ఉపాఖ్యానములు తప్ప రసవత్కవిత్వమునకు అక్కరకు రాదగిన గ్రంథ భాగము చాల తక్కువ. అందుచేతనే కాబోలు వీరు గ్రంథ మంతయు తెనిగింపక ఉత్తర భాగమును విడిచి పుచ్చిరి. మూలమున వ్రతదాన భాగము వరకు తెనిగించి ఫలశ్రుతి చెప్పి గ్రంథము ముగించిరి. మూల గ్రంథములో కొంత భాగమే తెనిగించినను ఈ తెలుగు గ్రంథము 12 అశ్వాసముల వరకును పెరిగినది దీనికి కారణము రసవంతములైన కొన్ని ఉపాఖ్యానములను వీరు విస్తరించి వ్రాయుట ఆ ఉపాఖ్యానములలో ముఖ్యమైనవి (1) దుర్జయోపాఖ్యానము (2) గౌతమ్యుపాఖ్యానము (3) ధర్మవ్యాధ వృత్తాంతము.

ఈ మూడు ఇతివృత్తములును రసవంతములు గావున వీటిని ఉపాఖ్యానములుగా రచించుటలో రస సంపాదన మనెడి దృష్టి నిలిపి మూలములో లేని వర్ణనములతో, పాత్రచిత్రణముతో చక్కని ఖండ కావ్యములుగా తీర్చిదిద్దిరి

ఇటువంటి ఉపాఖ్యాన రచనా నైపుణిని బట్టియైనను వరాహ పురాణము సరసులకు అవశ్యపఠనీయము కాదగిన గ్రంథము. తక్కిన భాగములలో గల దాన ధర్మములు, వ్రతానుష్ఠానములు మొదలుగునవి మత సంబంధముగల సదాచార బోధకములు ఆ భాగములు ధర్మశాస్త్రముల వలె చదువదగినవి.

రసము మాట ఎట్లున్నను శబ్ద గుంఫనమున ప్రబోధ చంద్రోదయము కంటె పురాణమే మేల్తరముగా నున్నదని సాహసించి చెప్పవచ్చును.

## కొఱవి గోపరాజు

గోపరాజు శ్రీనాథ యుగములో తుది దశాబ్దిలోని వాడుగా పొడకట్టును. అపై ప్రబంధ యుగమని చెప్పదగిన పదునారవ శతాబ్దమున గూడ ఇతడు కొంతకాలము

జీవించి యుండవచ్చును అయినను, ఆ శతాబ్దికి ప్రబంధ యుగమని పేరు తెచ్చిన ప్రబంధ కర్తలలో ఇతడు చేరడు ఇతని గ్రంధము సింహాసనద్వాత్రింశిక పెద్దనాదుల ప్రబంధములకు గల విశిష్ట లక్షణములలో ఒకటియు ఈతని ద్వాత్రింశికకు పట్టదు. కాబట్టి ఇతనికి శ్రీనాధయుగముననే స్థాన మొసగుట న్యాయము ఆ యుగములో వన్నెకెక్కిన పెద్ద కవులలో పిల్లలమఱ్ఱి పినవీరన ఒకడు అతడు తన జైమిని భారతమును 1485-93 మధ్య విజయనగర రాజ్యమేలిన సాళువ నరసింహ రాయలకు అంకితమిచ్చుటచేత ఆ గ్రంధ రచనా కాలము 1490 ప్రాంతమని చెప్పవచ్చునని ఇతఃపూర్వము చెప్పితిని. గోపరాజు పూర్వకవిస్తుతి పరముగా వ్రాసిన ఈ క్రింది పద్యములో పినవీరనను కూడ గణించెను

"అనఘు హుళక్కి భాస్కరు మహామతి బిల్లలమఱ్ఱి వీర రా
జును ఘను నాగరాజుఁ కవి సోముని తిక్కనసోమయాజి కే
తన కవి, రంగనాథు నుచితజ్ఞుని నెజ్జన నాచిరాజు సో
మన నమరేశ్వరున్ దలఁతు మత్కుల చంద్రుల సత్కవీంద్రులన్"

ఈ పద్యముబట్టి పినవీరన, గోపరాజునకు చాల పూర్వుడని అనుకొనరాదు కొందరు కవులు తమ సమకాలీన కవులకు కూడ నమస్కార పద్యములు సమర్పించుట కలదు. సమ వయస్కుల యెడ సమకాలము వారియెడ అసూయాద్వేషములు కల కవులున్నట్టుగానే గౌరవాభిమానము గల కవులును ఉందురు ఈ గోపరాజునకు పినవీరన యెడ అట్టి భక్తిభావము కలదని మనము తలంపవచ్చును కాబట్టి పినవీరన గోపరాజునకు ఇంచుక పూర్వుడై అతనికంటె ముందు గ్రంధ రచన చేసినవాడై యుండును. అదిగాక ఈ పద్యములో గోపరాజు తనకు ఇచ్చవచ్చిన కవులను కొందరను మాత్రమే పేర్కొనెను. కాని వాఙ్మయమున తనకు పూర్వము ఖ్యాతి వహించిన కవులందరను స్మరింపదలపలేదు కానిచో ఈ పద్యమున శ్రీనాధుని నామము లేకపోవుట సమర్ధనీయము కాదు. కాబట్టి పినవీరన కంటె కొంచెము అనంతరము కాలమువాడైన ఈ గోపరాజు 1500 ప్రాంతమున ఈ ద్వాత్రింశిక రచించియుండెను. ఇది ఇట్లుండ గోపరాజు గ్రంధావతారికలో చేసిన తన వంశావతార వర్ణనను బట్టి అతడు 15 వ శతాబ్ది మధ్యకాలమువాడై యుండునని చరిత్ర పరిశోధకులు ఊహపడిరి కాని పినవీరన ఆ శతాబ్ది తుది వాడగుటచేత అతనిని స్తుతించిన గోపరాజు ఆ శతాబ్ది మధ్యకాలమువాడై యుండుట పొసగదు వంశావతార పద్యములను వ్యాఖ్యానించుటలోను, తరములను లెక్కించుటలోను, తరముల కాల పరిమితిని నిర్ణయించుటలోను, చరిత్ర పరిశోధకులకు ఏకాభిప్రాయముండదు ఆ చారిత్రక సాక్ష్యము కంటె ఈ సారస్వత సాక్ష్యమే బలవత్తరమనుటలో తప్పులేదు. ఆ వంశావతార వర్ణన బట్టియే కొందరు చారిత్రకులు, గోపరాజు పదునైదవ శతాబ్దిలో తుది దశకమువాడై యుండవచ్చుననియు నిర్ణయించిరి ఈ భేదమునకు కారణము తరమునకు ఇన్ని సంవత్సరములు అని నిష్కర్షగా ఎవరును చెప్పలేకపోవుట, అది బ్రహ్మ కూడ చెప్పదగినదికాదు.

ద్వాత్రింశిక:

ఈ యుగమున పుట్టిన కథా కావ్యములలో అధిక సంఖ్యాక కథలు కల గ్రంథము సింహాసన ద్వాత్రింశిక జక్కన గ్రంథమువలె ఇదియు విక్రమార్కుని చరిత్రకు సంబంధించినదే కాని ఈ రెండింటికి కొంత భేదమున్నది జక్కన విక్రమార్కుని జననాదికముతో గ్రంథము ప్రారంభించి అతని సాహస కృత్యములలో కొన్నిటితో గ్రంథమును పూరించి వైభవోపేతముగా రాజ్యపాలన చేయుటతో ముగించెను అనగా జక్కన గ్రంథము విక్రమార్కుని జీవితకాలములో నడచిన ఉదంతములు గలది ద్వాత్రింశికలో విక్రమార్కుని గురించి చెప్పబడిన కథలన్నియు ఆ మహారాజుయొక్క జీవితానంతరము సింహాసన సాలభంజికలచేత భోజ మహారాజునకు చెప్పబడినవి. జక్కన విక్రమార్కచరిత్రలో సాహసాంకుని మహా గుణములకు ఉదాహరణముగ పది, పండ్రెండు కథలు మాత్రమే కలవు ద్వాత్రింశికలో అట్టివి ముప్పది రెండు కలవు ఈ రెండింటను సమముగా ఉన్నవి కొలది మాత్రమే మరి జక్కన గ్రంథములో చంద్రగుప్తుని కుమారులు నలుగురిలో విక్రమార్కునకే మాతామహుని రాజ్యమును క్షత్రియత్వమునుబట్టి తండ్రి ఇచ్చినట్లు కలదు ద్వాత్రింశికలో ఆ రాజ్యము భర్తృహరికి సంక్రమించినట్లును, అతడు దుశ్శీలయగు భార్యచే వంచితుడై వైరాగ్య మవలంబించి రాజ్యమును విక్రమార్కునకు సమర్పించి తపస్సున కేగినట్లును కలదు. భర్తృహరి వైరాగ్యమునకు కారణభూతమైన రసాభాస కథ రెండింటను కలదు కాని భర్తృహరిచేత విక్రమార్కునకు రాజ్య ప్రదానము చేయబడినట్లుగా జక్కన గ్రంథములో లేదు జక్కన గ్రంథమునకు మూలమేదియో తెలియదు. అతడు గ్రంథావతారికలో మూలగ్రంథము సంగతియే ప్రస్తావించలేదు గోపరాజు మాత్రము తన గ్రంథము అనువాదము అని స్పష్టముగా చెప్పెను

ఉ॥ ఈ సరసోక్తి కావ్యమొకఁ డిమ్ముల సంస్కృతభాష నచ్చుగాఁ
జేసిన నట్ల వీఁడు మరిసేయుట యేటిది యంచుఁ జెప్పఁగా
జేసి యనాదరం బురక సేయకుఁడీ, విలుకాఁడు తూఁటుగా
నేసిన నందె పారమఱి యేసిన వానిద సూటిగావునన్

ఒక సంస్కృత గ్రంథమును తాను అనువదించుచున్నట్లు అతడు ఈ పద్యములో స్పష్టీకరించెను సంస్కృతమున విక్రమార్కుని కథలుగల ఒక గద్యపద్యాత్మక గ్రంథమున్నది అది గోపరాజు ద్వాత్రింశిక వలెనే భోజరాజునకు ముప్పదిరెండు సాలభంజికలచేత చెప్పబడిన విక్రమార్కుని మహాగుణ కథనముగల గ్రంథము. ఉపక్రమ ఉపసంహారములలో ఈ రెండు గ్రంథములు ఏకీభవించుచునే యుండును. కావున గోపరాజు ద్వాత్రింశికకు ఈ సంస్కృత గ్రంథమే మూలమనుకొనుట భావ్యమని తోచుచున్నది. కాని గోపరాజు ఆ మూలమున నామమాత్రముగానైనను కానరాని అనేక శాస్త్ర విషయలకు ప్రవేశము గలిగించి ఆయా శాస్త్రములలో తనకుగల విజ్ఞాన పారంగతత్వమును చూపుటకు చాల గ్రంథమును పెంచి వ్రాసెను. నన్నెచోడునివలె ఇతడు కూడ చతుర్దశ విద్యలను చతుష్షష్టి కళలను ఎరిగియున్నవాడే కావ్యము వ్రాయవలెననెడి ఒక ఉద్దేశ్యముకలవాడు. ఇది పాండిత్యపక్షపాతముగల ఉద్దేశ్యమైనను కావ్యములు ఆనందదాయకములే కాక విజ్ఞాన ప్రదములు కావలెననెడి ప్రాచీన

సంప్రదాయమునకు అనుగుణముగా ఉండుటబట్టి ఆ కాలమున అది లోకస్తుతి పాత్రముగా చెల్లుబడి అయ్యెను ఆసంస్కృత గ్రంధములో ఉన్న కథలన్నియు యధాతధముగా ద్వాత్రింశికలో లేవు రెంటికి కొంత భేదమున్నది అసలు ఈ విక్రమార్క చరిత్రకు కథాసరిత్సాగరము మూలము గోపరాజు సంస్కృత విక్రమార్క చరిత్ర అనువదించునపుడు ఎడనెడ తనకు నచ్చినప్పుడు కథాసరిత్సాగరమును కూడ అనుసరించి యుండెను. అంతేకాదు, సందర్భమును కల్పించుకొని హర్షుని నాగానంద నాటక కథను ఆమూలాగ్రము అనుసరించుటయేకాక, అందలి శ్లోకములను కూడ పెక్కింటిని తెనిగించెను కాబట్టి ద్వాత్రింశికకు యథార్థమైన మూలగ్రంధము ఇదియని చెప్పలేము. కాకపోతే అతడు స్వేచ్ఛావిహారము చేసినను ఇది యొక సంస్కృత గ్రంధమునకు అనువాదమేనని ఒప్పుకొనెను కనుక ఆ గ్రంధము, పైని పేర్కొన్న గద్య పద్యాత్మక విక్రమార్కచరిత్రయేయని భావించవచ్చును మరి ఇతడు అచ్చటచ్చట ప్రసంగవశమున వివరించిన అనేక శాస్త్ర విషయములు ఆ సంస్కృత గ్రంధమున లేవని చెప్పితిని ద్వాత్రింశికలో ఆంధ్రచ్ఛందో వ్యాకరణ విషయ ప్రసంగము కూడ కలదు ఈ శాస్త్ర ప్రసంగము ఆ సంస్కృతమున ఉండుట పొసగదు కదా! ఆ సంస్కృత గ్రంధకర్త ఆంధ్రుడై యుండి స్వకీయభాషా వ్యాకరణచ్ఛందస్సులను ఇతర భాషల వారికి విశదీకరించుటకు ఆ శాస్త్ర ప్రసంగము చేయవచ్చునేమోగాని ఆ గ్రంధకర్త ఆంధ్రుడును కాడు, ఆ గ్రంధమున ఈ ఆంధ్ర భాషా విషయములును లేవు

జక్కన తన గ్రంధమును ప్రబంధ శయ్యలో రచింపవలెనని దానికి ప్రౌఢ ప్రబంధ యశము రావలెనని సంకల్పించి అందు కృతకృత్యుడయ్యెను గోపరాజు ప్రౌఢ శైలిలో దీనిని మహా ప్రబంధముగా సంతరించవలెనని పాటు పడలేదు ఎంత పాటుపడ దలచినను ఈ కథలకు ప్రౌఢ కావ్యత్వసిద్ధి కలుగదని అతడెరుగును. అందుచేతనే ఇతడు శయ్యా సౌందర్యమునెడ దృష్టి నిలుపక కథా కథనమే లక్ష్యముగా రచనను సాగించెను ఒక్కొక్కచో వర్ణ్య, వస్తుతత్త్వమును బట్టి ప్రౌఢశైలి గోచరించెడి సందర్భములును కలవుగాని అవి అతని సహజ ధారాళ శైలికి అపవాద ఘట్టములు గోపరాజు శైలి గౌరన శైలి వలె ఇంచుమించు వ్యావహారిక భాషకు సన్నిహితముగా నుండును కొన్ని లోకోక్తులు వ్యాకరణ విరుద్ధముగా నున్నను వాటిని యధాతధముగా ప్రయోగించునే కాని నిర్దుష్టముగా నుండునట్లు సంస్కరించుటకు పాటుపడ్డాడు. ఇన్ని ఉత్తమ గుణములున్నను ఈ గ్రంధము నిన్న మొన్నటిదాక మరుగుపడి యుండుటకు కారణము విద్వల్లోకమునకు జక్కన గ్రంధమునందున్న గౌరవము దీనియెడ లేకపోవుటయే దానికి కారణము జక్కన శైలిలోకల ఆకర్షణ శక్తి ఇంకొక విషయము; గోపరాజు తన గ్రంధమును కూడ హరిహరనాథునకు కృతి ఇచ్చెను అయినను తిక్కనవలె, నాచన సోమునివలె కాక హరిహరులకు విడివిడిగా పద్యములు సమర్పించెను.

# వెన్నెలకంటి అన్నయ్య

వెన్నెలకంటి అన్నయ్య అను కవి షోడశకుమార చరిత్ర అను గ్రంధమును రచించెను ఆ షోడశకుమార చరిత్ర గ్రంధము సంపూర్ణముగా దొరకలేదు.

# శ్రీనాథయుగ సింహావలోకనము

తెనుగు వాఙ్మయ చరిత్రలో "ఈ యుగమునకు ఈ లక్షణమని" నిరపవాదముగా నిష్కర్షగా నిర్దేశించుట చాల కష్టము అనువాదయుగ మనుకొన్న కాలమున స్వతంత్ర గ్రంధము పుట్టుటయు, స్వతంత్రయుగము అనుకున్న కాలమున అనువాదములు వెలయుటయు, పురాణయుగము అనుకొన్న కాలమున ప్రబంధములును, ప్రబంధయుగము అనుకొన్న కాలమున, పురాణములును రచింపబడుటయు మొదలగు అన్యోన్య సంక్రమణము ఆదికాలము నుండి నేటి కాలము వరకును సాగుచునే ఉన్నది. కావున ఏ యుగమ్మును గురించియైనను మనము చేయు సిద్ధాంతము స్థూలరూపముగానే యుండును

శ్రీనాథుని యుగమును సంధియుగమని కొందరు అందురు ఇది ఆంగ్లమున 'Age of Transition' అను పదమునకు సరియైన తెనుగుగా కల్పింపబడిన పేరు. శ్రీనాథుని యుగము ఒక అర్థమున సంధియుగమనుట, నిజమే కాని, అది Age of Transition మాత్రము కాదు. ఆంగ్లభాషలో సంధియుగమనగా ఇట్టిది - కొన్ని ఉత్తమ లక్షణములతో ఒక మహాయుగము కొంత కాలము నడచి ఆగిపోయిన పిమ్మట మరికొంత కాలమునకు మరికొన్ని ఉత్తమ భిన్న లక్షణములతో ఇంకొక మహాయుగము ఆవిర్భవింప నుండగా ఆ రెంటికి నడుమ చెప్పదగిన స్వతంత్ర లక్షణము లేవియు లేక అవ్యవస్థితముగ, అప్రధానముగ ఉండెడి కాలవ్యవధికి Age of Transition అని పేరు. శ్రీనాథయుగమును మన వాఙ్మయ చరిత్రలో అవ్యవస్థితమనిగాని, అప్రధానమనిగాని తలచుట వివేకలక్షణము గాదు .కావున ఈ యుగమును ఆ అర్థమున సంధియుగ మనరాదు.

భారత కవులు పురాణానువాదమునకు దారి చూపిన గురువులు. శ్రీనాథ యుగమునందలి కవులలో ముఖ్యుడైన శ్రీనాథుడు సంస్కృత కావ్యానువాదమునకు దారిచూపిన గురువు కావున సంస్కృత ఆంధ్రీకరణ చరిత్రలో .భారతకవుల కున్నంత ప్రాధాన్యము శ్రీనాథునకును కలదు అంతేకాక గత శతాబ్దులలోని పురాణాదులును, భావికాలములోని ప్రబంధములును సంగమించిన తీర్థస్థలము శ్రీనాథుని యుగము. ఈ అర్థమున దీనిని సంధియుగ మనవచ్చును.

మరియు ఈ యుగమునే ప్రబంధ పూర్వ యుగమని చెప్పవచ్చును అనగా అచ్చట ప్రబంధముల ఆవిర్భావమును సూచించుచు దానికి అవ్యవహిత పూర్వముగా ప్రవర్తిల్లిన కాలము అని అర్థము. సూర్యోదయమునకు అరుణోదయమువలె, ప్రబంధయుగమునకు శ్రీనాథుని యుగము ప్రబంధపూర్వయుగమనెడి పేరునకు అర్హత గణించుకొన్నది ఇంచుమించు క్రీ॥శ॥ 1350 వ సంవత్సరము వరకు భారత,

రామాయణముల అనువాదములే ప్రధాన వాఙ్మయప్రక్రియ యైనది క్రీ॥శ॥ 1500 సంవత్సరముల నుండి స్వతంత్రము లయిన ఆంధ్ర ప్రబంధము లవతరించినవి ఆ పురాణాదుల అనువాదములకు, ఈ ప్రబంధముల స్వతంత్రతకు నడిమి కాలమున శ్రీనాథుని యుగము ఆ ప్రబంధ ప్రచారమునకు దారి చూపినది ఈ యుగములో కొంత వాఙ్మయభాగము అనువాదముగా, మరికొంత స్వతంత్రముగా, ఇంకొక కొంత యధోచితానుసరణముగా నానావిధముల ఆవిర్భవించి, సంస్కృత సారస్వత కరావలంబమును 'వదలి పెట్టియు, వదలిపెట్టని రీతిగా చాలదవ్వు నడచి కాలు నిలువ ద్రొక్కుకొనగలిగినది ఈ యుగములోని మహాకవుల కృషి యంతయు ఉత్తర కాలమున జరుగబోవు ప్రబంధసరస్వతీవిహారమునకు మెత్తని పూలదారులు పరచుటయైనది ఈ మహానుభావులే ప్రబంధ నాటక ప్రదర్శనమునకు పూర్వరంగ ప్రవర్తకులు వీరు నెరవేర్చిన ప్రస్తావన కనుగుణముగానే ప్రబంధ నాటకము ప్రదర్శింపబడినది అందుచేత ప్రబంధ యుగమున కవ్యవహితమయిన ఈ కాలమున ప్రబంధ పూర్వయుగమని పేర్కొనుటలో ఆక్షేపము ఏమియు నుండదు దీనికి నాందీ శ్లోకమును పఠించి ప్రస్తావనను నడపినవాడు శ్రీనాథుడు అందుచే ప్రబంధ పూర్వయుగమన్నను, శ్రీనాథుని యుగమన్నను అర్థము ఒక్కటియే .

ఈ కాలమున పురాణములు కూడ పుట్టినమాట నిజమే కాని వాటియందును ప్రాబంధిక లక్షణములైన రసోత్కర్షము, వర్ణనా భూయిష్ఠత, శయ్యానిష్ఠ, అలంకార ప్రియత మొదలగునవి నెలకొని, కేవల పురాణ పద్ధతిని మరపించినవి కాశీఖండ, భీమఖండములు నామమాత్రమునకే ఖండ పురాణములు కాని, గుణమున ప్రబంధ లక్షణములు కలవియే వరాహపురాణకర్తలు ఆ పురాణమునందలి ఉత్తరార్ధము నీరసమగుటచే అనువాదమున దానిని విసర్జించుట చూడగా ఈ యుగ పురాణకర్తలకు కూడ చాల వరకు పూర్వాభిరుచి తగ్గినదనియే చెప్పవచ్చును. మరియు ఈ పురాణకర్తలు మూలమున నామమాత్రముగ అతి సంగ్రహముగ ఉన్న చిన్న కథలను ఆలంకారిక రచనా శోభితములైన ఉపాఖ్యానములుగా సంతరించుట కూడ వారి చిత్తములు ప్రబంధములకు ఉన్ముఖములైన వనుటకు నిదర్శనముగా చెప్పవచ్చును పురాణముల యెడ తగ్గిన రుచి ప్రబంధముల దెస హెచ్చుట సహజమే

ఈ ప్రబంధ ప్రక్రియకు మొదట నైషధాంధ్రీకరణ రూపమున మార్గదర్శకుడైన వాడు ఈ యుగకర్తయైన శ్రీనాథుడు శృంగార నైషధముతో ఆంధ్ర వాఙ్మయమున నొక క్రొత్త శకమారంభమయినది సంస్కృతము నందలి పురాణేతిహాసములు, కావ్యములు, నాటకములు అనెడు ప్రధాన వాఙ్మయ శాఖలు మూడింటిలో 'పురాణే తిహాసముల ఆంధ్రీకరణ పద్ధతి భారతరూపమున కవిత్రయమువారే నిర్ధారణ చేసిరి. శ్రీనాథుడు చేపట్టినది కావ్యము. అది స్వతంత్రానువాదమా, అస్వతంత్రానువాదమా, కథాప్రధానమా, శ్లోక ప్రధానమా అన్నచో ఇదమిత్థమని చెప్పలేని ఒక అపూర్వ రచనా క్రమమును సాగించి అర్వాచీన కవులందరకు సంస్కృత శ్లోకానువాదమునకు పటిష్ఠమయిన ఒరవడి పెట్టెను.

ఈ మహాకవి ఉత్తరకాల ప్రబంధ కవులకు పెట్టిన ఒరవడులలో శైలికి సంబంధించినది యొకటి. ఆంధ్ర వాఙ్మయమున అక్షర రమ్యత సాధించిన కవివర్గమొకటియు,

అర్థగౌరవమును పాటించిన కవివర్గ మొకటియు స్థూల విభాగమునకు గోచరించును. ఈ రెండు విధములయిన గుణములను సమముగా సమ్మేళన మొనర్చి – శబ్దార్థములు రెంటికిని ప్రాధాన్యమిచ్చిన శిల్పియు శ్రీనాథుడే ఉత్తరకాల ప్రబంధ కవులలో ప్రముఖులైనవారు ఈ శైలినే అనుకరించిరి

శ్లోకానువాదములోను, వర్ణనలలోను శ్రీనాథుని గురుత్వమునే శిరసావహించి పిల్లలమఱ్ఱి పినవీరన కొంతవరకు స్వతంత్ర ప్రబంధమే యనిపించుకొనదగిన శృంగార శాకుంతల రచనా రూపమున ప్రబంధ సరస్వతికి ఇంకొక భూషణ మలంకరించెను. గౌరన హరిశ్చంద్ర ద్విపదరచన యైనను స్వతంత్ర కావ్యముగా చెప్పుకోదగినదే

పై వివరణమును బట్టి శుద్ధ ప్రబంధ నాటక ప్రదర్శనమునకు జరుగవలసిన ప్రస్తావన యంతయు ఈ యుగమున జరిగినదని చెప్పవచ్చును

లోకములో ప్రజలు ఉబుసుపోకకై చెప్పకొనెడి చిత్ర విచిత్ర కథలన్నియు ఈ కాలముననే కావ్యరూపమును తాల్చినవి జక్కన విక్రమార్క చరిత్ర, అనంతామాత్యుని భోజరాజీయము, గోపరాజు ద్వాత్రింశిక, నారాయణ కవి పంచతంత్రము, వేంకట నాథుని పంచతంత్రము కథా వాఙ్మయమును చాల వరకు పెంపొంద జేసినవి.

పద కవిత్వ జాతిలో ఒక ఉపశాఖయగు గేయ కవిత్వము గానాంశ ప్రధానముగా సంగీత కళా జగత్తున ప్రవర్తిల్లినదని పలనాటి వీర చరిత్ర ప్రకరణమున జెప్పితిని. ఈ కవితా శాఖను గూడ వర్ధిల్లజేసిన గౌరవమును శ్రీనాథయుగమునకే దక్కినది పదకవితాపితామహుడు, సంకీర్తనాచార్యుడు అని కీర్తికెక్కిన తాళ్ళపాక అన్నమాచార్యుడు ఈ శాఖను ఆంధ్ర సాహిత్యములో సుస్థిరము చేసినవాడు

మొత్తముమీద ఈ ప్రబంధ పూర్వయుగము ఆంధ్ర వాఙ్మయమున విశిష్టమయినది నూరు సంవత్సరముల కాలములో నింత కావ్య ప్రక్రియా వైవిధ్యమును చూపిన యుగము ఆంధ్ర వాఙ్మయ చరిత్రలో వేరొకటి లేదు

ఈ యుగమునకు ప్రారంభదశలో కొండవీడు రాచకొండలును, మధ్యకాలములో రాజమహేంద్రవరమును, ఆపై ఉదయగిరియు, అంతమున విజయనగరమును సాహిత్య పీఠములైనవి. నాచన సోముడు బుక్కరాయల ఆస్థానమున అడుగిడెనే కాని అయ్యెడ స్థిరపడినట్లు తోచదు ప్రౌఢదేవరాయని ముత్యాలశాలలో శ్రీనాథుడు పొందిన కనకాభిషేకము ఆంధ్ర సరస్వతీ విజయనగర ప్రవేశమునకు మంగళాచరణ మయ్యెను. ఈ యుగాంతమునాటికి ఆ దేవి నందిమల్లయ, ఘంటసింగయల వరాహ పురాణము రూపమున విజయనగరా స్థానమున సుస్థిర సింహాసన మధిష్ఠించినది రాబోవు చరిత్ర ఆ మహావైభవ వర్ణన

## శ్రీనాథ యుగములో శ్రుత నామములు, శాస్త్ర గ్రంథము:

1 మడికి అనంతయ్య – మడికి సింగన తమ్ముడు. విష్ణుమాయా నాటకము వ్రాసినాడనీ, చింతలపూడి ఎల్లనార్యుడనే కవి వ్రాసినట్లు లోకము భ్రమపడినదని ఒక మతము ఎల్లనార్యుని కంటె అనంతయ్య పూర్వుడైన, ఆ ప్రబంధము అనంతయ్యదే కావచ్చు.

2. వెన్నెలకంటి జన్నమంత్రి – విక్రమార్క చరిత్ర కృతిపతి సిద్ధన మంత్రికి తండ్రి దేవకీనందన శతక కర్త మకుటము కృష్ణా! దేవకీనందనా!
3 కొలని గణపతిదేవుడు – శివయోగసారము, మనోబోధలు ఈ రెంటిలో శివమహత్త్వము, వేదాంతబోధ కలవు
4. అయ్యలరాజు తిప్పయ్య అయ్యలరాజు రామభద్రునకు పితామహుడు ఒంటిమెట్ట రఘువీర శతకకర్త
5. ఆంధ్రకవి రామయ్య – విష్ణుకాంచీమాహాత్మ్యము
6. చెందలూరు చిక్కయ్య – నాచికేతూపాఖ్యానము
7. పశుపతి నాగనాథుడు – విష్ణు పురాణము

వెన్నెలకంటి సూరన విష్ణు పురాణమువలె ఇది ప్రఖ్యాతికి రాలేదు ఒకే ఇతివృత్తముగల, ఒక పేరు గల రెండు గ్రంథములలో మేలైనది నన్నెకెక్కుటయు, రెండవది మాసిపోవుటయు సాధారణ ధర్మము కొన్ని యెడల అపర గ్రంథమే (Inferior) రాణించుటయు కలదు మేలైనదే మరుగుపడి పోవుట కలదు ఎఱ్ఱాప్రెగడ రామాణమునకు ఈ స్థితియే కారణము

**శాస్త్ర గ్రంథములు:**

1. దోనయామాత్యుడు – సస్యానందము, శాస్త్ర గ్రంథము, వర్షముల ఆగమసూచనలు జ్యోతిశ్శాస్త్ర ప్రకారము వ్రాయబడినవి
2 విన్నకోట పెద్దన – కావ్యాలంకార చూడామణి ఇది ఒక్క అలంకార శాస్త్రమే కాక ఛందో వ్యాకరణాది ప్రకరణములు కూడ గల గ్రంథము (1402–1407 మధ్య రచితము) చాళుక్య వంశజుడగు విశ్వేశ్వరభూపతికి అంకితము.
3. మనుమంచిభట్టు – అశ్వశాస్త్రము (హయలక్షణ విలాసము)
4. కూచిరాజు ఎఱ్ఱన – కొక్కోకము ఇది కామశాస్త్రము సంస్కృతమున రతి విలాసమనెడి గ్రంథమునకు తెనుగట

★ ★ ★

# శ్రీకృష్ణదేవరాయల యుగము
# (1500-1600)

సంగమ వంశములో తుదివాడైన విరూపాక్షరాయలు అసమర్థుడును దుర్నీతి పరుడును అగుటచే హిందూమత రక్షణార్థమును, హిందూ ప్రజారక్షణార్థమును పరమ ధ్యేయములుగా అవతరించిన ఆ సామ్రాజ్య భారమును తాను వహించి సాళువ నరసింహరాయలు 1485 వ సంవత్సరములో విజయనగర వజ్ర సింహాసనము నధిష్ఠించెను అప్పటికి ఆ రాజ్యమును కబళించుటకు పొంచియున్న ఆసన్న శత్రురాజ్యములు రెండు కలవు. ఒకటి తురుష్కుల బహమనీ రాజ్యము, రెండు గజపతుల కళింగ రాజ్యము ఆ ఇరువురు శత్రువులను విజయనగర సామ్రాజ్యమునకు దూరముగా నిలువరింపవలెననియు, దక్షిణభారతమునంతను తన సామ్రాజ్యములో నంతర్భాగము చేయవలెననియు, సాళువనరసింహరాజు అకుంఠిత దీక్షతో, మహాపరాక్రమముతో ఎన్నో యుద్ధములు నడపెను కాని రెడ్డి రాజ్యపతనము నాడే గజపతుల స్వాధీనమైన ఉదయగిరి దుర్గమును అతడు జయింపలేక పోబట్టి అది గజపతుల అధీనముననే ఉండవలసివచ్చెను కావుననే శ్రీనాథుని యుగమునందలి తుది దశకములోని వారైన నంది మల్లయ ఘంట సింగయ్య అనెడి జంట కవులు తమ గ్రంథములలో నొకదానిని ఉదయగిరి దుర్గమంత్రికిని, రెండవ దానిని తుళువ నరసరాయలకును కృతినిచ్చుట తటస్థించెను ఆ రాజునకు గాని ఆ మంత్రులకుగాని శత్రుపక్షమును ఆశ్రయించిన వారన్న అసూయాద్వేషములు కవుల యెడ నుండెడివికావు సాళువ నరసింహరాయలు విజయనగర రాజ్యవిస్తృతిని స్థిరీకరణమును నెరవేర్చక ముందే 1493 వ సంవత్సరములో దివంగతుడయ్యెను అతని సర్వసేనాధ్యక్షుడే తుళువ నరసరాజు తన కుమారుని పట్టాభిషిక్తుని చేసి రాజ్యభారమును తానే వహింపవలసినదని సాళువరాజు తన సేనాధ్యక్షుని కోరెను అతడు ప్రభు నాదేశానుసారము సాళువ తిమ్మరాజునకు పట్టము గట్టి తాను సర్వతంత్ర స్వతంత్రుడై రాజ్యము నేలజొచ్చెను కాని దైవదుర్విపాకమున నా బాలరాజు కొలది కాలముననే మరణించెను. స్వామిభక్త తత్పరుడైన తుళువ నరసరాయలు, అవకాశము చిక్కెను గదాయని రాజ్యము తానే అపహరింపక చనిపోయిన యువకుని తమ్ముడొకడుండగా వాని నభిషిక్తుని చేసి తాను యథా ప్రకారము రాజ్యాధికారము నిర్వహించెను ఆ పిల్లవాని పేరు ఇమ్మడి నరసరాయలు అతనికి పెనుగొండ దుర్గము నివాస స్థలముగా యేర్పరుపబడెను. బహుశః నరసరాయలు అతనినందు నిర్బంధించెనేమో!

సర్వసమర్థుడైన తుళువ నరసరాయలు తాను రాజ్యభారమును పూనినది మొదలు అవసానకాలము వరకు నిర్విరామముగా పరిశ్రమించి సహజ శత్రువులనే కాక తన

అధికారము ధిక్కరించిన దుర్గాధిపతులను సైతము అణచివైచి రాజ్యమును విస్తృతమును ప్రబలమును చేసెను. పూర్తిగా కాకున్నను ఈ రాజు కొంతవరకేని సాళువ నరసింహరాజు సంకల్పమును సఫలముచేసి, పది పంద్రెండేండ్ల పరిపాలనానంతరము 1503 వ సంవత్సరములో స్వర్గస్థుడాయెను ఈ రాజు కాలమున కూడ ఉదయగిరి దుర్గము విజయనగరమునకు స్వాధీనము కాలేదు

నరసరాయల అనంతరము అతని పెద్దకుమారుడు వీరనరసింహరాయలు పెనుగొండదుర్గములో నిర్బంధింపబడియున్న సాళువ నరసింహరాయని రెండవ కుమారుని హత్యకావించి తాను తన తండ్రివలె రాజప్రతినిధిగా కాక స్వతంత్ర రాజుగనే సింహాసనము నెక్కెను అతడు ఆ వైభవము ననుభవించినది ఆరు సంవత్సరములు మాత్రమే. అతని స్వామి ద్రోహమును సహింపని దుర్గాధిపతులు చాల మంది తిరుగుబాటు చేసిరి అతని అనంతరము మన వాఙ్మయ చరిత్రలో ఈ యుగమునకు యుగపురుషుడైన కృష్ణదేవరాయలు విజయనగర సామ్రాజ్యాధిపతియై తన పూర్వేతరములవారు కాంచిన స్వప్నములెల్ల నిజములు చేసి శత్రు దుర్నిరీక్ష్యమైన ప్రతాపముతో కటకము మొదలు కన్యాకుమారము వరకు గల దక్షిణ భూభాగమునంతను తన యేలుబడిలోనికి తెచ్చి తనది రామరాజ్యము అనిపించెను. శత్రుభయంకరుడైన వీరుడుగా, కవిపండిత సమాదరముగల భాషా పోషకుడుగా, సంస్కృతాంధ్ర కవితా ప్రజ్ఞానిధిగా రాయలు పొందిన యశస్సు ఆంధ్రదేశము నేలిన మరి యేయితర చక్రవర్తికిని లభింపలేదు ఎంత వాడైననేమి, ఆయన పరిపాలనలో తుది ఐదారు సంవత్సరముల కాలము చిత్తశాంతి లేకయే గడపి 1530 వ సంవత్సరములో దివంగతుడయ్యెను. ఆయన మనోవ్యధకు మొదటికారణము తన తరువాత రాజు కాగలడనుకొన్న లేబ్రాయపు కొడుకు మరణించుట రెండవది సింహాసనముకోసము, తన తమ్ములలో కుటుంబ కలహము రేగి, రాజ్యమునకు ఎట్టి ముప్పు వాటిల్లునో అనెడి చింత అతని అనంతరము అతని సవతి తల్లి కొడుకు అచ్యుతదేవరాయలు కృష్ణదేవరాయని ఆదేశానుసారము సింహాసనము నెక్కి పంద్రెండు సంవత్సరములు యేలుబడి సాగించెను (1530-1542) ఆపై కృష్ణదేవరాయని అల్లుడైన అర్వీటి రామరాజు (ఇతనికే అళియ రామరాజు అని పేరు) కృష్ణదేవరాయని ఇంకొక తమ్ముడైన శ్రీ రంగరాయల కొడుకు సదాశివరాయలు అను నాతని రాజును చేసి, తాను ఆ యువకునకు అంగరక్షకుడుగా, సామ్రాజ్యమునకు పాలకుడుగా 23 సంవత్సరములు వీరవిహారములో మామగారికి సాటిరాగలవాడనిపించుకొని 1565 వ సంవత్సరములో రాక్షసతంగడి (తళ్ళికోట) యుద్ధమున ఒక స్వామి ద్రోహి చేతిలో హతుడయ్యెను ఆనాటితో విజయనగర రాజ్యప్రాభవమునకు, విజయనగరపుర వైభవమునకు మసకచీకట్లు క్రమ్మనారంభించెను

రామరాజు తమ్ముడు తిరుమల దేవరాయలు పెనుగొండకుపోయి సదాశివరాయలు పేరుమీదనే రాజ్యపాలనము సాగించి 1572 వ సంవత్సరమున మరణించెను తిరుమలరాయలు తన మరణకాలమున రాజ్యమును మూడు భాగములు చేసి తన ముగ్వురు కొడుకులకు పంచి యిచ్చెను. పెద్దవాడైన శ్రీ రంగదేవరాయలు పెనుగొండ రాజధానిగా తెనుగుదేశము నేలజొచ్చెను (1572-1585). రెండవవాడైన

రామదేవరాయలు శ్రీరంగపట్టణము రాజధానిగా కన్నడ దేశమును రాజప్రతినిధిగా ఏలుకొనసాగెను మూడవవాడైన వెంకటపతిరాయలు చంద్రగిరి రాజధానిగి తమిళ దేశమునకు రాజప్రతినిధిగా ఏలికయయ్యెను ఈ ముప్వురలో పెనుగొండ రాజధానిగాగల శ్రీరంగదేవరాయలే సమ్రాట్టుగా తక్కిన యిరువురు రాజప్రతినిధులుగా తండ్రిచే నియమింపబడిరి తురకలు పెనుగొండ మీదికి దండెత్తిరాగా సవరం చెన్నప్ప నాయకుడు అను సేనాధిపతి, రాజును చంద్రగిరి పంపి, తాను తురక సేనలను నిలువరించి జయించెను శ్రీరంగదేవరాయలు అనపత్యుడై 1585 లో చనిపోయెను. తదనంతరము రెండవ వెంకటపతి దేవరాయలు పెనుగొండకువచ్చి పట్టాభిషేకము జేసికొని (1586–1614) 28 సంవత్సరములు పరిపాలనము చేసెను రాక్షసతంగడి యుద్ధముతోనే క్షీణదశ ఆరంభమైన సామ్రాజ్యమునకు అప్పటి నుండి మరల పుష్టి కలుగనేలేదు మాటిమాటికి తురకలు పెనుగొండను ముట్టడిం చుట తరిమిగొట్టబడుట పారిపోవునప్పుడు చేజిక్కినది అపహరించుకొనిపోవుట పరిపాటియయ్యెను శ్రీరంగదేవరాయల తరువాత రామదేవరాయలు రాజ్యముకు రావలసియుండగా అతనిని కాదని వెంకటపతిదేవరయాలు రాజైనందున సామంతులతో పెక్కురు అతని అధికారమును ధిక్కరింపసాగిరి కొందరు విధేయులై యుండిరి మట్లి అనంతభూపాలుడు మొదలైన సామంతుల అండవల్ల వెంకటపతి రాయలు సంకట స్థితులను అతిక్రమించి రాజ్యమును సుభిక్షముగా నేలసాగెను అతనికి ఆర్గురు భార్యలున్నను సంతానము లేదు ఆ ఆరుగురిలో గొబ్బూరి జగ్గరాజు అనే తంత్రజ్ఞుని చెల్లెలు ఒకామె కలదు వెంకటపతిరాయలు తన అవసానవేళ తన అన్నగారైన రామదేవరాయల రెండవ కుమారుని, రెండవ శ్రీరంగ చొక్కరాయలు అను పేరుగల వానిని రాజ్యమునకు నియమించి పోయెను తంత్రజ్ఞుడైన గొబ్బూరి జగ్గరాజు ఆ రాజును సకుటుంబముగా కారాగారబద్ధుని చేసి సంహరింపనుండగా వెలుగోటి యాచమ నాయకుడనెడి వెలమదొర ఆసంసారములో రాజు పెద్దకుమారుడైన రామదేవరాయలు అను వానిని ఉపాయముతో తప్పించి, తంజావూరు రఘునాథ నాయకుని సహాయముతో గొబ్బూరి జగ్గరాజు నెదుర్కొని అతనిని అతని మిత్రులను యుద్ధమున ఓడించి సంహరించెను ఆ యుద్ధమునకు తోపూరు యుద్ధము అని పేరు (1614) అట్లు ఉపాయముతో కాపాడబడిన రామదేవరాయలు 1619 నుండి 1629 వరకు రాజ్యమునేలెను ఆపై మూడవ వెంకటపతిరాయలు అను రాజు 1642 వరకును, మూడవ శ్రీరంగదేవరాయలు అను రాజు 1678 వరకును నామమాత్రపు రాచరికము నెరపి అస్తమించిరి అంతలో 1335 వ సంవత్సరములో ఆవిర్భవించిన విజయనగర సామ్రాజ్యము కూడ 1680 ప్రాంతమున అస్తమించెను. పైన వివరించిన రెండు శతాబ్దుల (16th & 17th) దేశ చరిత్రలో శ్రీకృష్ణదేవరాయల పేరుమీద నెగడెడి సారస్వతచరిత్ర ఒక శతాబ్దికి మాత్రము సంబంధించినదే రెండవ శతాబ్ది 1600 మొదలు దక్షిణాంధ్ర యుగమునకు సంబంధించిన సారస్వత చరిత్ర కలది శ్రీకృష్ణదేవరాయల సారస్వత యుగమునకే ప్రబంధయుగము అని పేరు*

* "తెలుగు భాషా సమితి" వారి "విజ్ఞాన సర్వస్వ తెలుగు సంస్కృతి" సంపుటములో ఆంధ్ర ప్రబంధము మీద నేను వ్రాసిన వ్యాసమునకు "ప్రబంధ యుగము" అని పేరు పెట్టబడినది ఆ వ్యాస విషయము "ప్రబంధ చరిత్ర" గాని, ప్రబంధ యుగము కాదు

# రాయలయుగము-స్వర్ణయుగము

ఆంధ్రవాఙ్మయచరిత్రమున రాయలయుగము స్వర్ణయుగమని చెప్పదగినది ఆంగ్లవాఙ్మయమున స్వర్ణయుగమని పేరుగాంచిన ఎలిజబెత్తు యుగమునకందెంత ప్రాధాన్యముగలదో మన వాఙ్మయ చరిత్రమున నీయుగమున కంత ప్రాధాన్యము గలదు కాలమనుకూలముగా నున్నప్పుడు భూమి యెట్లు సస్య సంపన్న మగునో యట్లే యీ యుగమున సారస్వతము సంపన్న మయినది రాయలు మూలపురుషుడుగా గలిగిన జాతీయాభ్యుదయమే యీ సారస్వతాభ్యుదయమునకు కారణము సారస్వతము జాతి యొక్క జీవితము సంవదించుననుట కిది ప్రబల నిదర్శనము కాకతీయులకు బూర్వము నుండియు నాంధ్రులు కలలు గాంచుచున్న యఖండాంధ్రసామ్రాజ్య స్థాపనము జరిగినది అసామ్రాజ్య వైభవానుభవముత్సాహ సాహసవీరత్వముల జాతి నినుమడించెను పరాధీనత, దైన్యము, శత్రుభీతియు నా జాతి యానా డెఱుగదు ఆనాడు సంపదతో దులతూగని కుటుంబమే లేదు ఈ వైభవోత్సాహములే సారస్వత రూపమున వెల్లివిరిసెను రాయల సారస్వత సేవాసక్తత, సహృదయతయు నీ యుత్సాహమునకు మఱింత పోషకము లయినవి ఒక్కొకయెడ నీరాజు సరస్వతీపూజకై లక్ష్మిని సైతము దిరస్కరించె ననినచో నతిశయోక్తి గానేరదు కవులను బోషించిన రాజులు లేకపోలేదు కవిత్వము చెప్పిన రాజులును లేకపోలేదు కాని యాయాయెడల పృథక్పృథక్కుగా నున్న గుణము లన్నియు నీయనతో రాశీభూతమై మూర్తీభవించి నిరుపమాన వ్యక్తినిగా జేసినవి. తన ప్రాభవము కంటె గవి మన్ననమున్నని గ్రహించిన రాజింకొకడు లేడు స్వయముగా బెద్దన గారి కాలికి గండపెండేరము దొడుగుట, యూరేగు పల్లకి దనకేల బట్టి యెత్తుట, మొదలగు నీతని మహోదార చర్యలు బరికించిన బ్రజారక్షణార్థ మయిగద్దె నెక్కిన రాయలు కవితారక్షణార్థ మయి యాత్మార్పణము గావించినాడని తోచకపోదు రాయ లొనర్చిన కవిపూజలు అయన ప్రాపు బొందుటకై కవులలో నొకరిని మించి యొకరికి నుత్కంఠ కలిగించినవి సామ్రాజ్యమున నెచట నెవరే కావ్యమును వ్రాసినను విజయనగరమున రాయల యాస్థానమున వినిపించుటే కృతార్థతగా నెన్నిరి దురదృష్టవశమున నాయన యేలుబడి స్వల్పకాలమే యున్నను, అయన యారంభించిన యుద్యమము యుగాంతము సాగినది

ఈ యుగమహత్త్వ మెట్టిదో గాని యొక్క ఆంధ్రదేశముననే గాక హిందూదేశమందలి యితర భాగములను, నొక్క హిందూదేశముననే గాక ఖండాంతరములయందును సరస్వతి యవిచ్ఛిన్నముగా మహావైభవముతో గొలువు దీర్చిన యుగమిది ఆంగ్లేయులీ కాలముననే వీరులై సముద్రము లుత్తరించి క్రొత్త భూముల నాక్రమించిరి. ద్వీపాంతరముల నుండువారు ధనరాసులను దెచ్చి యాంగ్ల దేశమున గ్రుమ్మరింప బ్రజ లానందించిరి. ఎలిజిబెత్తు రాణి వారల బ్రోత్సహించి ప్రేమించి జాతికి నవనవోత్తేజము గలిగించినది. ఆ జాతీయాభ్యుదయమే సారస్వతాభ్యుదయముగా బ్రభవించినది కవుల నామె మంత్రుల కంటె నెక్కువగ నాదరించెడిది ఆమె కవితాలౌల్యము 'సిడ్ని' అను కవి యామెను వివాహ మాడునని ప్రజలు భ్రమ పడునట్లు చేసెను. ఇదే శతాబ్దిలో నుత్తర హిందూస్థానమున నక్బరు చక్రవర్తి పారశీక

గ్రంథములను సంస్కృత గ్రంథములను హిందూస్థానీ ఉర్దూ భాషలలో వ్రాయించెను. పదియవ శతాబ్ది నారంభించిన దేశభాషా గౌరవము పదునాఱవ శతాబ్దికి బరిపూర్ణత నందినది పై ముప్పురిలో జ్యేష్ఠతా గౌరవము రాయలదే అక్బరు గాని, ఎలిజిబెత్తు గాని రాయలకు సమకాలికులు. గారు. వారిరువురును రాయల కర్వాచీనులు

రాయల వంటి మహోదారమూర్తి ప్రపంచమున నెచట గానరాడు కళారసికుడైన రాజు రాజ్యపాలనాదక్షతలో వెలితిపడును కాని యితని కొకదాని యందెంత సరసత్వ మున్నదో రెండవదాని యందంత సామర్థ్య మున్నది. రెండును గల రాజున్న గళాసిద్ధియు, రాజ్యపాలనా దక్షత కుపాయనము అగును 'Nero was fidling while Rome was burning' అనునట్టి లోపము మాత్రము రాయల యందు లేదు రాయల యందెంత శిల్పలౌల్యమున్నదో రాజ్యతంత్రమున నంత నిశితదృష్టి గలదు కవితాపోషణాది గుణములలో భోజరాజాదుల పేళ్లు చెప్పినను నింత సర్వగుణసంపత్తి వారికి లేదు నానాభాషకవుల నితనివలె బోషించిన రాజు లేడు తెనుగు రాజభాషయు నగుట సారస్వత మన్నిటిని మించి యభివృద్ధి గాంచెను

ఆంగ్లవాఙ్మయమున ఎలిజిబెత్తు యుగమునకు నాటకయుగ మని పేరున్నట్లే ఆంధ్ర వాఙ్మయమున రాయల యుగమును ప్రబంధయుగ మందురు. అతః పూర్వము ప్రబంధములు లేవనుట కాదు ఈ యుగమున బ్రధానముగ బ్రబంధములే పుట్టినవి ఇవియే విరివిగా బుట్టెను. ఆంగ్లమున గ్రీకు నాటకానుసరణము తొలగి నవీన నాటక రచన పుట్టి దేశీయ మయినటులనే రాయల యుగమున సంస్కృతానుసరణముగాక స్వతంత్రము దేశీయము నని చెప్పదగిన ప్రబంధము, సృష్టింప బడెను ఈ నవీన ప్రబంధ సృష్టి వలననే యీయుగమును The first Romantic movement in Andhra Literature అందురు.

రాయలయుగమును 1650 వఱకు బెంచి చూపు విమర్శకులు గొందరు గలరు తంజాపురము, మొదలగు దాక్షిణాత్య రాజ్యములలో విజయవిలాసాది ప్రబంధములు, మనుచరిత్రాది ప్రబంధములను బోలినవి వెలయుటను, ప్రబంధయుగమన రాయల యుగమే యగుటను, దక్షిణాంధ్ర యుగపు పూర్వభాగము నందలి 50 సం॥నిందు చేర్చుచున్నారు. కాని యది యంగీకృతము గాదు అధునిక యుగము వఱకు బ్రబంధరచన సాగుచున్నది గదా యని దీనిని గూడ బ్రబంధ యుగము, రాయల యుగము నని యనగలము. ఇంతకు దాక్షిణాత్య కవిత్వరచనకు గొన్ని ప్రత్యేక లక్షణము లున్నవి. ఆ ప్రత్యేకతను బట్టి యది వేఱు యుగముగానే చెల్లవలెను. ఆ యుగమున ప్రబంధములే గాక యక్షగానములు, వచనములు, మొదలుగా నానాజాతి కావ్యములు నుద్భవించినవి ఈ నానాజాతి కావ్యరచనయే దాని ప్రత్యేకత. మఱియు నీ దాక్షిణాత్య కవిత్వము బోషించిన నాయకరాజులు లోనగు వారు గూడ రాయల వంటి రాజకవులును భాషా ప్రియులును కవిపోషకులును గాన నా కవివర్గమును వేఱుగా దక్షిణాంధ్ర రాజుల గొడుగు నీడను జేర్చుట యుక్తముగాని విజయనగరమునకు గొనివచ్చుట పాడిగాదు. ఇంతకు రాయలనాటి ప్రబంధములకు దంజాపుర ప్రబంధములకు రూపసామ్యతకన్న భిన్నత్వ మధికము అంతస్తత్వములు గేవలము భిన్నములు తంజాపుర ప్రబంధములు మహాకావ్యములు గావు. కావున రాయల యుగమున కవధి 1600 వఱకే

రాయలు 1530లో గతించినను 1600 వఱకు రాయల యుగమననేల? రాయలు గతించినను గొంతకాలము వైభవముతోను, మఱికొంతకాలము దుర్దశతో నా రాజ్యలక్ష్మి నేలిన రాజులు రాయల బరిపోషితమైన సారస్వతలక్ష్మిని గూడ జేవిడువక వచ్చిరి, గావునను దామై క్రొత్తగా నార్జించిన భూఖండములుగాని కల్పించిన కవిత్వపు దారులు గాని లేవు గనుక నన్నిటను సమర్థుడైన రాయల పేరుమీదనే విజయనగర రాజధాని నాశ్రయించి బయలుదేరిన కవిత్వ మంతయు నా రాజకవి సొత్తుగానే పరిగణింపవలయును. అదియునుగాక యుగకర్తృ ప్రభావము తజ్జీవితపరమావధి గలది మాత్రమే గాదు కావున 1600 వఱకు రాయల యుగమే

## రాయలయుగము నేల 'ప్రబంధయుగము'న వలెను?

ఈ యుగమున బ్రధానముగా ప్రబంధములే రచింపబడెను గనుక నిది ప్రబంధ యుగమని సూత్రప్రాయముగా నంటిమి ఈ ప్రబంధము స్థూలముగా నెంచిన పురాణమ్మునకు భిన్నము మహాపురాణము కావచ్చును ఖండపురాణము గావచ్చును

### ప్రబంధమన నేమి?

ఆలంకారికుల మతమున గావ్యములు నిబద్ధములు ననిబద్ధములు నని యిరుదెరగులు నిబద్ధమన 'కూర్పబడ్డది' యని యర్థము ఇది పద్యముల కూర్పు గాదు కథ కూర్పు కథా నిబంధనము గలది నిబద్ధకావ్యము. కథానిబంధనములేని చాటుసముదాయములును (సంఖ్యానియమము లేనివి) శతకములును సంఖ్యానియమము లున్నను నక్షత్రమాల మొదలైనవియు ననిబద్ధ కావ్యములు నిబద్ధకావ్యము నిబద్ధము, కథాశ్రయము, అనిబద్ధకావ్యము భావాశ్రయము

నిబద్ధకావ్యములలో కథానిబంధనమేగాక యితర సంధిసామగ్రి (other unifying factors) కూడ నుండవలెను కథ యందలి ప్రత్యవయవమునకు వెలితిలేని ప్రకృష్టమగు బంధముండ వలెను కథాశరీరనిర్మాణము సౌష్ఠవముగా నుండవలెను ప్రకృష్టమయిన బంధము గలది ప్రబంధము నిబద్ధమగుట కన్న ప్రకృష్టమగుట గుణాధిక్యము. కేవల కథానిబంధము లగుట పురాణములు నిబద్ధకావ్యములే గాని ప్రబంధములు గావు తిక్కన భారతమును బ్రబంధముగా బేర్కొనుట యీ యర్థముననే ఆలంకారిక మతమున బ్రబంధమనగా –

1 అష్టాదశవర్ణనా భూయిష్ఠము,
2 ఉదాత్తేతివృత్తము, నుత్తమ నాయకాశ్రితము,
3 ఏకనాయకాశ్రయము ఇది ప్రబంధమును పురాణేతిహాసముల నుండియు నిబద్ధకావ్యముల నుండియు వేఱుచేయును.
4. రసప్రాధాన్యము
5 నాటకమునందు వలె ముఖము నుండి నిర్వహణసంధి వఱకు వికాసము సక్రమముగా జరుగవలయును (కావ్యానుశాసనమున వామనుడీ లక్షణమును ప్రబంధమునకు జెప్పెను) ధ్వన్యాలోకకారుడు దీనిని గావ్య శరీరబంధ మనెను
6 ఆశ్వాసములుగా విభాగింపబడవలెను.

ఏవంవిధ ప్రబంధములు రాయలయుగముననే పుట్టినవాయన నతః పూర్వము కొన్నియున్నను నవి క్వాచిత్కము బాహుళ్యముగ బ్రబంధములీ యుగముననే గలవు. ఆ క్వాచిత్కములైనను బహుళ ప్రబంధలక్షణ యుతములే గాని నిర్వికల్పముగా బ్రబంధములనజాలము

1. నన్నెచోడుని కుమారసంభవమున బ్రబంధకర్త యపేక్షించు వస్త్వైక్యము లేదు ప్రబంధేతివ్రత్తమును మించి పురాణేతివృత్తము గలదయ్యెను వర్ణనాదులలో బ్రబంధలక్షణము లనేకములు గలవు
2. సంస్కృత రామాయణమేక నాయకాశ్రయ మగుట కావ్యము కాని తెనుగు రామాయణము పురాణేతిహాసములలో జేర్చదగినది సంస్కృత భారత మితిహాసము. భాగవతము పురాణము
3. ఎఱ్ఱన నృసింహపురాణములో ప్రబంధమునకు జీవగఱ్ఱ యైన పాత్ర నిర్మాణము లేదు.
4. నైషధము శుద్ధమగు ప్రబంధమే గాని భాషాంతరీకరణ మగుట రాయల నాటి ప్రబంధమునకు భిన్నము. మనుచరిత్ర వంటిది కాదు
5. హరవిలాసము నిబద్ధకావ్య మయ్యు నందు వస్త్వైక్యము లేదు.
6. శృంగారశాకుంతలమున గొంత యనుకరణము, కొంత స్వతంత్రము
7. విక్రమార్క చరిత్ర, భోజరాజీయము – ఇవి పురాణములును గావు, ప్రబంధములును గావు చిత్రకథాత్మకములు ప్రత్యేకములు.
8. గౌరన హరిశ్చంద్ర యేకనాయకాశ్రయమును వస్త్వైక్యము గలదియు నయ్యును నాలంకారికరీతిలేమి (style) ప్రబంధము గాదు.

**రాయలనాటి ప్రబంధలక్షణములు:**

1. స్వతంత్ర రచనలు, భాషాంతరీకరణములు గావు
2. పురాణాంతర్గతోపాఖ్యానములను నిమిత్తములుగా గైకొని యా యస్థిపంజరములను మాంసలములుగా సర్వావయవసుందరములుగా నున్మీలితములు చేసిన స్వతంత్ర చిత్రణములు. భాషాంతరీకరణముగాని స్వతంత్ర రచనయే యీ ప్రబంధమున కాయువుపట్టు
3. ఆలంకారికశైలి, అర్థాతిశాయియైన శబ్దము, ప్రాయికముగా శృంగారరస ప్రాధాన్యము నితరాలంకారిక ప్రబంధ లక్షణములు

ఈ తారతమ్య నిరూపణము యొక్క సారమేమనగా కథైక్యము, అష్టాదశ వర్ణనలును గలిగి శృంగారరస ప్రధానమై అర్థాతిశాయియైన శబ్దముండి ఆలంకారిక సాంకేతికములకు విధేయమై అనతి విస్తృతి గల ఇతివృత్తముతో భాషాంతరీకరణముగాక స్వతంత్రరచనయే అయిన తెనుగు కావ్యము ప్రబంధము.

పురాణములు నీరససారసేతివృత్తభూయిష్టములు అందు నిస్సారభాగముల త్యజించి రసవత్తర ఘట్టములనే గైకొని వ్రాసినది కావ్యమగును అట్టి కావ్యమానందదాయకము.

మారన మార్కండేయపురాణములోని వరూథిని ప్రవరాఖ్యుల ఘట్టమునే యెత్తి పెద్దన ప్రబంధ మొనర్చెను అధునికకవి యైనచో నా ప్రబంధ మందలి వర్ణనాదికము

నితర కథాభాగమును విడిచి వరూథినీ ప్రవరుల శృంగార ఘట్టమునే గైకొని యొక ఖండకావ్యమును రచించును భావకవియైనచో వరూధిని సౌందర్యమునుగాని ప్రవరుని శ్రౌతమును గాని వర్ణించును. ఈ పరిణామము సహజము వీరందఱి దృష్టియు నేకస్థానముననే లగ్నమయ్యెను ఇందు భావకవి కాలంబన మవసరము గాదు ఇతరుల కాలంబన ముండవలెను

ఆద్యకవుల రచన లరణ్యము లయిన (పురాణములు) ప్రబంధకవుల రచనలు ద్యానములు

పురాణమున నరణ్యమున వలెనే జీవి కేది కావలసిన నది గలదు. బుద్ధి వర్ధకములు, శరీరపోషకములు, నన్నియు నందు గలవు అతిగాంభీర్యమైనది ఇట నడుగిడిన మానవునికి దన యల్పత్వము గోచరించును ప్రబంధముద్యానవనమువలె నాగరిక జీవికే తగినది. తీర్చిదిద్దిన దగుట నతి రమరణీయము సుందరము నయినది మానవ హృదయమున కానందము గలిగించును పురాణము బ్రహ్మసృష్టి. ప్రబంధము శిల్పి సృష్టి. పురాణము సహజము. ప్రబంధము శిల్పి ఫలము

భారతము నాధిక్య మిందే యిమిడియున్నది ఆ గహనగాంభీర్యమును చెడపక యందే రాజమార్గముల నిర్మింప యత్నించిన మహిమాన్వితుడు తిక్కన ఆ కొమ్మనే తెచ్చి రాయలయుగమున బ్రబంధముగా బెంచిరి

## పెద్దన

ఈ యుద్యానవన నిర్మాణమున మొదటి వనపాలకుడు అల్లసాని పెద్దన అతని కాలము 1475–1540 రాయలు నలుబదియారేండ్ల ప్రాయమున 1530లో నస్తమించెను. అనగా 1484 జననము రాయలు స్వయముగా పెద్దన కాలికి గండపెండేరము దొడగుట, పల్లకి మోయుట, విద్యాధిక్యముతోబాటు వయోధిక్యము గూడ సూచించును లేనిచో సమ్రాట్టట్లు చేయడు 'ఆంధ్రకవితాపితామహ'లోని పితామహ శబ్దము జ్యేష్ఠతాసూచకమే. ఇక రాయల యనంతరము పెద్దన జీవించియున్నట్లు తాజెప్పికొనిన పద్యమే సాక్షి

సీ. ఎదురైనచో దన మదకరీంద్రము డిగ్గి
  కేలూత యొసగి యెక్కించుకొనియె
మనుచరిత్రం బందుకొనువేళ పురమేగ
  పల్లకి తనకేల బట్టి యెత్తె
బిరుదైన కవి గండపెండేరమున కీవె
  తగుదని నాదు పాదమున దొడిగె
గోకట గ్రామాద్యనేకాగ్రహారంబు
  లడిగిన సీమల యందు నిచ్చె

తే.గీ నాంధ్రకవితామహ! యల్లసాని
  పెద్దన కవీంద్ర యని నన్ను పిలచునట్టి

కృష్ణరాయలతో దివి కేగలేక
బ్రతికియున్నాడ జీవచ్ఛవంబు నగుచు

**మనుచరిత్ర:** మనుచరిత్రము శాంతశృంగార రసములు సమప్రాధాన్యముతో సంగమించిన యొక తీర్థము తత్కర్త సహజముగా శృంగార ప్రియుడు ఆ చిత్తవృత్తి శాంతాభిముఖమయి నప్పటి రచన యిది. శృంగారానుభవరుచి, శాంత నిష్ఠయు రెండును మనోగోళము నావరించి యున్నప్పటి రచన కర్తకు రెంటను ప్రీతి సమానమే కాని మార్పు రెండవదాని వంకకు పోవుచున్నది ఇది మధ్య వయస్సు దాటిన తరువాతి రచన అనగా 45 సం॥ మనుచరిత్ర రచనాకాలము 1519–20 అని చారిత్రక నిర్ణయము దీనినిబట్టి పెద్దన గారి జననము 1475 రాయచూరి ముట్టడి (1520) ఆముక్తమాల్యదలో వర్ణితము మనుచరిత్రమున నాప్రసంగము లేదు. పూర్వ దిగ్విజయయాత్ర వర్ణితము. కావున మనుచరిత్ర రచనాకాలము 1519–20

**మనుచరిత్రము - కావ్యపరామర్శ:** మనుచరిత్రకు మూలము మారన మార్కండేయ పురాణము పురాణేతి వృత్తమునకును ప్రబంధేతివృత్తమునకును నొకటి రెండు స్థలముల దప్ప భేదము లేదు

1. **స్వరోచి వేట:** మూలమున మనోరమ స్వరోచి కాతని పురబాహ్యోద్యానవనమున కానిపించినట్లు గలదు. అప్పుడాతడు వనవిహార మొనర్చుచుండెను మనుచరిత్రలో నీసంఘటనము స్వరోచివేట కేగినపుడు మహారణ్యమధ్యమున గల్పింపబడినది ఈ మార్పులతిగా గానవచ్చినను ప్రయోజన మధికము ఘోరాకారుడగు రాక్షసుడు త్రిలోకసుందరి యగు కన్యను మనోరమను తరుముకొని వచ్చునప్పటి బీభత్సమునకుద్దీపన విభావముగా వేట, మహారణ్యము గూర్పబడినవి మహాకావ్యమున వేటవర్ణన మవసరము గాన నీ వర్ణనల వలన నా లక్షణ నిర్దేశము సిద్ధించినది.

2 మూలమున స్వరోచి మరణముతో కథ ముగియును ఇందు స్వరోచి మహావిష్ణువును స్తోత్రము చేయుట, యాశీర్వాదమును బొందుటతో గథ ముగియును దీనివలన 'మంగళాంతం కావ్యమ్' అను ధర్మము నిర్వహింప బడినది ఇతర కథావయవము లన్నియు మూలములోనివే.

## గుణదోషముల విమర్శనము

1. **దోషములు:**

1. సిద్ధుడు ప్రవరునికి నౌషధ దానము చేసిన కాలము నిర్దిష్టముగా లేదు అందుచే నుత్తరకథాకాలముతో బొత్తు కుదరలేదు
2. ప్రబంధోచిత వస్త్వైక్యము లేదు. వరూథినీ ప్రవర ఘట్టము వస్త్వైక్యభంజకము
3 కావ్యమున రసాభాస మున్నది.
4 మనోరమ తన చెలికత్తెలను రక్షింపకముందే స్వరోచిని వివాహమాడుట యామె స్వార్థపరత్వ సూచకము
5. కవికి నైతికనిష్ఠ లేదు.

తరుణి ననన్యకాంత నతిదారుణపుష్పశిలీముఖ వ్యధా
భర వివశాంగి నంగభవు బారికి నగ్గముసేసి క్రూరుఁడై
యరిగె మహీసురాధముఁ డహంకృతితోనని రోషభీషణ
స్ఫురణ వహించెనో యన నభోమణి దాల్చెఁ గషాయదీధితిన్

ఇది కవి వాక్యము గావున నాతని మనోప్రవృత్తి ద్యోతకము

**పూర్వపక్షము:**

1. అనుచు గ్రమ్మఱువేళ నీహారవారి
   బెరసి తత్పాదలేపంబు గరగిపోయె

ఇది వాక్యము. కావున నీ నెపమపరిశీలనా ఫలితము.

2 వస్త్వైక్యము లేదనుటకంటె నితివృత్త మతి విస్తృత మయ్యెననుట యుక్తము గ్రంథనామము స్వారోచిష మనుసంభవము ఈ పేరుగల ప్రబంధకథా నిర్వహణమునకు నేయే కారణకలాపములు, పూర్వాపూర్వ కథాంశములు గలవో వాని నన్నిటిని సూత్రించి కవి యీకథ కైక్యమును సమకూర్చెను అనావశ్యకమయిన యొక్క సందర్భము నిందు జేరలేదు. ఏ ఘట్టమును బరీక్షించినను నది యుపసంహారప్రవణమై (that which inclins) యుండును కానియప్రస్తుత మనిపించదు ఈ యేకసూత్రము వలననే వస్త్వైక్యము పాటింపబడినది యెంచవలెను

మను సంభవమన మానవజాతికి ధర్మశాసన మొనరింపగల మహాపురుషుని జననమని యర్థము మనువులు దివ్యులకు తక్కువ వారు. మానవాతీతులు మానవాతీతులగుట జన్మసంక్రాంత మగు తేజస్సును బట్టియే తన తేజోవిశేషముచే ధర్మనిర్దేశము చేయగలవాని జననకారకులు తేజశ్శాలురు పరమ సుందరులు ధర్మపరులు గావలెను వారు మానవజాతివారు గాని దేవయోని జాతివారు గాని కావలెను.

స్వారోచిషమనువు స్వరోచికి వనదేవతకు బుట్టెను స్వరోచి వరూధినీ ప్రవరుల సంతానము స్వారోచిషమనువు తేజోశక్తికి కారకు లతని జననీ జనకులకు బూర్వతరము వారగు వరూధినీప్రవరులు వీరి తేజమే స్వారోచిషమనువు నందు సంక్రాంత మొనర్ప బడెను. అపరాగ్నిహోత్రు డనదగు ప్రవరునితో దివ్యసుందరి యగు వరూధిని కలయుటే స్వారోచిష మనుసంభవమునకు హేతువు అందుచే నీఘట్టము ప్రధాన కథ కెంతయు నావశ్యకము వస్త్వైక్యభంజకము గానేరదు

స్వరోచి జననీజనకులు వరూధినియు మాయాప్రవరుడైన గంధర్వుడును గాని ప్రవరాఖ్యున కందు స్థానము లేదనిన భౌతికముగ స్వరోచి జననీజనకులు వరూధినీ గంధర్వులే గాని మానసికముగ వరూధినీప్రవరాఖ్యులే వరూధిని యా గంధర్వుని ప్రవరుడను నమ్మకమున గవిసెనేకాని గంధర్వుడని కాదు. ఆమె యుత్కంఠ ప్రవరుని కొఱకు గాని గంధర్వుని కొఱకు గాదు కావున స్వరోచి వరూధినీప్రవరుల సంతతియే యగును వరూధినీప్రవరాఖ్యుల ఘట్టము నునికి వలన కథ విస్తరించినదేగాని వస్త్వైక్యము చెడలేదు

నన్నెచోడని కూమారసంభవమున దక్షాధ్వర ధ్వంసము, గణేశ్వర జననము, కథైక్యభంజకములు; కళాపూర్ణోదయమున సూత్రభంగము లేదు అవయవముల కూర్పు గలదు వస్త్వైక్యము అవయవముల కూర్పునుబట్టి యుండును

**3. రసాభాసము:** వరూధినీప్రవరాఖ్యుల గాథ యందును, వరూధినీ మాయాప్రవరులు గాథ యందును రసాభాసము గలదు రెంటను నేకత్రైవానురాగమను దోషము గలదు

ఏకత్రైవానురాగశ్చేత్తిర్యఙ్మ్లేచ్ఛ గతోపివా
యోషితో బహుసక్తి శ్చేద్రసాభాస స్త్రిధామతః

కావ్యమునకు రససిద్ధి కావలెను గాని రసాభాసము కూడదు కాని కావ్యమున రసాభాసము వలన గలిగిన నష్టమేమియు నుండదు లోకములో ననేకములైన కథలు రసాభాసములై యున్నను నవి కవుల చేతుల బడి మహనీయ కావ్యములుగా బేరుగాంచినవి. (సారంగధర, కీచకవధ, మొ) ఆ యాభాసమునకు నొప్పుకొనుచు దక్కిన శిల్పనిర్మాణసౌష్టవమునకే వానిని మెచ్చుకొందుము ఏ యాలంకారికుడును రసము సిద్ధి పొందిననేకాని యానందముండదన లేదు రసపరిపోషణయే యానందమునకు హేతువు కవి రసపోషణము చేయునేగాని కథలోలేని సిద్ధిని తెచ్చిపెట్టలేదు కథానుసారిగా రసమును బోషించుట కళాధర్మముగాని రసానుగుణముగా గథను కృత్రిమము చేయుట గాదు ఏ కావ్యముననైనను నంగిరసము సిద్ధిపొందినం జాలును అంగరసము సిద్ధిపొందవలెనను నియమము లేదు పరిపోషణ జరిగిన జాలును వరూధినీపరమైన శృంగారకథ ప్రాసంగికము తదాశ్రయమైన శృంగారమంగ రసము కావ్య ప్రధానరసము శాంతము అది ప్రాసంగిక ప్రధాన ఘట్టములలో సిద్ధి పొందినది.

**మనుచరిత్రము నందు శాంతరసము ప్రధానము:**

కథోపక్రమనిర్వహణముల యందు శాంతరసమే నిరూపణమైనది శాంతమూర్తి యగు ప్రవరునితో నారంభమై ధర్మావతారమగు స్వారోచిష మనువు తానంత మయ్యెను ఈ బీజమునకు నిర్వహణమునకు ఉపక్రమోపసంహారములకు గల యానుకూల్యమే యీకథ శాంతరసము ప్రధానమని చెప్పక చెప్పను మధ్య నితర రసము లన్నియు శాంతరస పరిపోషణములు ఈ కథలో కవి శాంత శృంగారములకు బద్ధవైరము గల్పించెను కథావసానమున శాంతము జయించి శృంగార మణగిపోయినది. జయించినదే ప్రధానరసము

స్వరోచి కథలో పారకుడీ శాంతరస ప్రాధాన్యము విస్మరింపకుండుటకై స్త్రీసక్తు డగు నాతని శృంగారలౌల్యమునే ఉపదేశముగా పశుపక్ష్యాదులచే జెప్పించి శాంతోపదేశ మొనర్చెను.

4 మనోరమ పాత్రచిత్రణమున స్వార్థమను దోషములేని, భర్తయెడ జనవు చెలిమి గాంచిన పిదపనే యాతని దనచెలికత్తె రక్షణార్థమై నియోగించుట యుక్తము బద్ధానురాగుడగు భర్త భార్య కోర్కె నిరాకరింపజాలడు అటుగాక వివాహమునకు ముందే యీ షరతు నుంచుట సరసము గాదు

5 కవికి నైతికనిష్ఠ లేదనుట కేవలము కవిని దూఱుట పెద్దన చిత్రించిన వరూధినీ పాత్రము నిరుపమానము ప్రవరునిచే దిరస్కరింపబడిన వరూధిని యవస్థ

జూచిన ఏ రసికహృదయ క్షేత్రమున నైనను జాలి పుట్టును బాధితుని జూచి విశ్వమెంత జాలిపడునో వరూధినిని జూచి కర్మసాక్షి యంత జాలిపడుట సహజము ఆమె నట్లు విడిచి వెడలుటలో ప్రవరుడు క్రూరుడని యపుడు దోచును ప్రవరు డామె కోర్కె దీర్చవలెననరాదు తీర్చుట తప్పే యగును మనకు బ్రవరు డెంత పూజనీయుడో వరూధిని యంత దయనీయ సూర్యుడా బాధపడు ప్రాణిని జూచి యామె యట్టి బాధపడకూడ దనెను. ఎంతటి కఠినుడైనను నీసందర్భమున నుదాసీనుడు కాజాలడు.

పెద్దనగారే యేపాత్రముఖముననను గాక తానే ప్రవరుని శ్రోత్రియునిగా వర్ణించెను. అందాయనకు శ్రోత్రియత్వ మందలి భక్తితాత్పర్యములు సూచితములు

'కలంచునే సతుల మాయల్ ధీరచిత్తంబులన్' అని పెద్దనగారే ప్రవరుని ధీరత్వమును బ్రశంసించెను

**గుణములు:** మనుచరిత్ర యందలి గుణము లివి యనునప్పటికి నిరసనపరు లందఱు నాశిల్పగుణములు మూలమగు మార్కండేయపురాణముననే కలవని యందురు పెద్దన గారి పాత్రచిత్రణా విశేషము నెడ దిరస్కార మిది మూలమున పాత్రాపాదిత గుణములే యిటను బట్టినవనిన మూలమున రేఖామాత్రములుగనున్న, పాత్రములు ప్రబంధమున నున్మీలితచిత్రము లయ్యెను మూలము వికసింపని కోరక మయిన నీకావ్యము వికసిత పుష్పము వీమహా కావ్యము నయినను మూలముతో బోల్చి చూచునపుడే గుణమును బురస్కరించుకొనియే పరీక్షింపవలెను అటుగానిచో కవిశిరోమణి యగు షేక్స్పియర్ నాటకములు నిలువనేని నిలువవు ఆయన నాటకముల కన్నిటికి మూలములు గలవు. నాటకము లందలి పాత్రలు కవి సృష్టి ఆ పాత్రోన్మీలితత్వ మాతని కృత్యము కావుననే యా ఖ్యాతి. భాసుని ఉదయన కథాత్మకము లయిన నాటకములకు (వాసవదత్త, ప్రతిజ్ఞాయౌగంధరాయణము) కథాసరిత్సాగరము మూలము భాసుని నాటకముల నేగుణసంపత్తిని బట్టి కొనియాడుదుమో మనుచరిత్రకు మూలమున్నను దీనినందుకే కొనియాడుదము

వరూధినీ ప్రవరులను పాత్రద్వయసృష్టియే పెద్దన గారి శిల్పచాతుర్యము ఈ పాత్రద్వయము నటించిన ప్రబంధ పూర్వభాగ మాయన సిద్ధహస్తమునకు దార్కాణము (Man hand) నకు ఇది ప్రబంధమయ్యు నంత నాటకీయ మొనర్చుట ఆయన చాతుర్యము మఱియు గోచరించును ఈ సంవాదము కేవలము నాటకీయమే గాక యతిప్రౌఢము, చతురము నయినది. అది పెద్దన గారి మనీషామహిమకు తార్కాణ ఈ సంవాద మేకరసాశ్రయమైన నాస్పృష్టి కొంత తేలిక. కాని యిది విరోధ రససంఘర్షణ మగుట గష్టతరము భిన్నప్రవృత్తము లయిన రెండుపాత్రలు పరస్పరవిరోధరసముల నాశ్రయించిన వానితో గథ నడపుటయే యిందలి విశేషము. కృతహస్తుడుకాని కవి కిది మిక్కిలి సంకటమయిన పని ఆయన యారెండు పాత్రము లందు నేవంకకు మ్రొగ్గక సమదృష్టితో జిత్రించెను రెండిటిని సమానముగా నాదరించెను విరోధములయ్యు నీ రెండు రసములను ప్రవాహములుగా వెల్లివిరియించెను ఆ భాగ మందలి శాంతశృంగారరసములు రెండును సమానమగు నానందము నొసగును కావ్య రసాస్వాదనమున నెఱుగనివాని మాటకేమి గాని కావ్యరసాస్వాదన రుచిగలవానికా రెండు పాత్రములును రుచికరములే. ఏ రసిక పాఠకుడును శ్రోత్రియునికి వ్రతభంగము కలిగింప

నెంచిన వేశ్య యని వరూధినిని నిరసింపదు. ఇంకను సహృదయు డామె యనురాగ మస్థానపతిత మయినదని చింతించును. 'బ్రతుకు నీవాచారవంతుండవై' యనుట వరూధినిని జిత్రించిన పెద్దనగారి ప్రతిభ ఇక ప్రవరుని జూచి 'యెంత ధీరుడవయ్యా' అని భక్తితో నమస్కరింతము భగవంతుడందఱను, సమదృష్టితోనే చూచినను నాయా జనులు వారి వారి పూర్వకర్మలబట్టి చరింతురు అట్లే నాటకకవి కాతని సృష్టిలో నేపాత్ర యందును పాక్షిక బుద్ధి యుండదు అప్పుడే యది సృష్టికి బ్రతిసృష్టి యగును ఈ సమాదరత్వము నాటకకవి కుండవలసిన శక్తులలో ముఖ్యమైనది. పాత్రచిత్రణమున్న నాటకమున గవికా పాత్ర లన్నియు నాతని బిడ్డలే పెద్దన తనకున్న యాత్మశక్తి నంతయు వినియోగించి యీ రెండు 'పాత్రలను సృష్టించెను. వరూధినీ ప్రవరు లనగానే సజీవపాత్రములుగా రూపురేఖావిలాసములతో మన కంటి యెదుట తాండవింతురు. సజీవపాత్ర నామమాత్ర స్మరణమున సాక్షాత్కరించును. మనుచరిత్ర పుట్టిననాటి నుండియు జితేంద్రియత్వమునకు శుకమహర్షిని వదలి ప్రవరుని, వలపు ప్రయోగమునకు రంభను వదలి వరూధినిని ఆంధ్రులు పేర్కొనుచున్నారు. ఇది పెద్దన పాత్రచిత్రణ మహిమ. తిక్కన భారత పాత్రలు తరువాత నీరెంటికంటె మనకు సన్నిహితమగు పాత్రల సృష్టి జరుగలేదు.

ఉత్తరార్ధములో బద్యరచనాసౌలభ్యము, కథనాచాతుర్యము, సుందరవర్ణనలు గలవు పూర్వభాగము నందు వలె బాత్రసృష్టి యనునది లేదు ఈ కథాభాగ మట్టిది కావ్యమందు బ్రతిపాత్రయు సృష్టింప బడదు కొన్ని కథలో నిమిత్తముగ నుండును. కొన్ని తమవశాన కథ నడపును తమ వశాన కథ నడపునవి సజీవములు. మొదటివి కథావశ్యకములు. ఇవి సజీవములు గావు. ఏ మహానాటకమున నైనను నింతియే. శకుంతలలో దుష్యంతు నాశ్రమమున కాహ్వానించిన ఋషి కవిసృష్టి గాదు. కథావశ్యకము. కణ్వుడన్నో కాళిదాసు సృష్టించిన తండ్రి పాత్ర

పద్యరచనాసౌలభ్యమున కితని కొరవడి వెట్టినది శ్రీనాధుడు ఇత డాయనకు బరోక్ష శిష్యుడై యనుకరించిన భాగములు చాల గలవు వరూధిని కులగోత్రములు చెప్పిన 'చిన్ని వెన్నెల' యను పద్యము నైషధములో హంస తన కులగోత్రములు చెప్పిన 'నలిన సంభవు' యను పద్యమును బోలియున్నది. శ్రీనాధుని మొదట యనుకర్త పినవీరన సిద్ధి పొందినవాడు పెద్దన బహుగ్రంధకర్త యగుట శ్రీనాధుని రచనలో నశ్రద్ధ యెడనెడ తోచును పెద్దన రచన యందాలోపము లేదు ఇతడిది ప్రౌఢవయస్సున వ్రాసిన దగుట వయోదోషమును లేదు. పెద్దన శ్రీనాధుని వంటి విద్యావేత్త కాకపోవచ్చును అటులనుట కాధారములును లేవు. కాని- పండితుడు కాకపోడు పండితకవి కాకపోలేదు.

శ్రీనాధుని శైలి దుందుభిధ్వానము వలె, నగారామోతవలె నుండును. పెద్దనది యపేలవమయి నిండయిన మృదంగధ్వని వలె నుండును ఇతడు ప్రవృత్తిని గూడ శ్రీనాధుని వంటివాడే. 'నిరుపహతిస్థలంబు' అను పద్యము శ్రీనాధునికి శిష్యుడే యనగలడు. ఆ రాజాశ్రయ మనునదీ యిరువురకు లోపములేని భోగానుభవము నిచ్చినది.

పెద్దన ప్రబంధమున కంగములుగా బెక్కు వర్ణనల జొప్పించెను ఇందేదియు

మితిమీఱి యుండదు. కథ కుంటుపడనీయదు కథయు వర్ణనలును నంగ ప్రత్యంగ భావమున గలిసి హత్తియుండును

ఈ గుణసంపదకలిమిని మనుచరిత్రము అనుకరణము అనువాదముగాక స్వతంత్రాంధ్రకావ్యమై తరువాతి ప్రబంధములకు మార్గదర్శకమయ్యెను ప్రబంధ రచన మనెడి నవీనకవితకు సూత్రధారుడు పెద్దనయే

ప్రబంధోచిత శైలి యన పెద్దనగారిదే రసవంతము, నపేలవము, ననతి గంభీరము, పురాణేతిహాస భిన్నము నైన శైలి, సంస్కృతాంధ్రముల నందముగా గలియగూర్చు కతన నితని కవనమున సంస్ర్పత ప్రౌఢియు దెనుంగు నుడికారమును మిసమిసలు దేఱుచు జెలఁలాడుచున్నది

పాత్రచిత్రణ, శైలి, వర్ణన, కథ వీని కన్నిటికి యధోచితమైన స్థానముల నిచ్చి చక్కని సమన్వయము కల్గించిన గ్రంధము పెద్దన మనుచరిత్రము ఈ మహాశక్తియే పెద్దనకు గౌరవమును దెచ్చినది ఆంధ్రవాఙ్మయములో నవ్యకవితావిర్భావమున కాయన పితామహుడు గాన అయనకే 'ఆంధ్ర కవితాపితామహుఁడ'ను బిరుదు దక్కినది

పెద్దన హరికథాసారమను బ్రబంధమును రచించి శరగోపయతికి కృతి యిచ్చెను. అందలి పద్యములు అనందరంగరాట్ఛందమున నుదాహరింపఁబడినవి

## ముక్కుతిమ్మన

ఈ కవికి నందితిమ్మన యను నామాంతరము గలదు. పారిజాతాపహరణము మనుచరిత్రముతో సమాన మగు వయస్సు గలది రాయల యాస్థాన కవులలో బెద్దన తరువాత నెక్కువ మన్ననల నందిన కవి యీతడే రాయలవంశముతో దిమ్మన వంశమునకు బూర్వతరముల నుండియు సంబంధము గలదు (నంది మల్లయ, ఘంట సింగయులు రాయల వంశమగు తుళువ వంశమునకు బ్రథమాస్థానకవులు)

పారిజాతాపహరణమునకు భాగవతము నంతలి మూడు శ్లోకములే మూలమనెడి వారు గలరు. కాని నిజమునకు దీని మూలము సంస్కృత హరివంశమున వజ్రనాభుని వధ యను కథకు సన్నిహితముగ గలదు ఇందు ఇతివృత్తమతి స్వల్పము దీనిని ప్రబంధముగ సంతరించుట కేయే యాలంకారిక సౌందర్యములు గూర్పవలెనో వాని నన్నిటిని తిమ్మన గూర్చెను ఈ ప్రబంధోచిత సౌందర్యమునకు ముఖ్యహేతువు పాత్రచిత్రణము, వర్ణనలు కృష్ణుడు సత్యభామ యింట గడపిన నాటి మజ్జన భోజనాది విలాసములు, సత్యాకృష్ణుల యాకాశయానము వర్ణనలే గాని కథాంగములు గావు. ఈ వర్ణనలే లేనిచో నిది మిక్కిలి చిన్న కావ్యమగును

సత్యాంతఃపురమున కృష్ణుని దినచర్య వర్ణన కృష్ణదేవరాయల దైనిక చర్య వర్ణనయే యని పెక్కుమంది అభిప్రాయము రాయలనాటి వైభవోపేతమైన జీవిత (grand life) వర్ణన మది. అందుచే నీ వర్ణన చాల ముఖ్యమైనది ఇదిగాక గ్రంధాంత మందు చేయబడిన పుణ్యకవ్రత వర్ణన కూడ సమంజసమయినది పారిజాతాపహరణ కథకు బీజము వేసినవాడు నారదుడు. అయన మఱల కథాంత మందు వచ్చుట న్యాయమే ఇంకొక సంగతి – సత్య పట్టినపట్టు నెగ్గినది అందుచే నామె చీటికిమాటికి

నిక్లే పట్టుబట్టుచుండ వచ్చును ఆమెకు భక్తిమార్గమును బోధింపవలసి యున్నది దానినే నారదుడు పుణ్యకవ్రతము ద్వారా బోధించినాడు. తిమ్మన నేర్పు జూడవలసిన దీవర్ణనల గాదు. సత్యభామ పాత్రసృష్టి యాతని పాత్రచిత్రణా ప్రభావమునకు దార్కాణ కృష్ణుని యంతి పురములో సత్యాదేవికి గల చనువేరికిని దెలియదనియు నాతడు సత్యభామ వశుడనియు నిర్ధారణ చేయుటకు సన్నివేశములతో సత్యయే కృష్ణునికి బరిపాలకురాలిగా సృష్టించి చూపెను ఆమె మానక్రోధ వివశాత్మయైనట్లు ప్రదర్శించినఘట్ట మపూర్వ శిల్పనిర్మాణము

శ్రీకృష్ణుని ప్రేమ నంతయును తానే డక్కగొంటినని సత్యభామ కొక యభినివేశ మున్నది. అందులకేమాత్రము వికృతము వచ్చినను, కలిగెడి కోపతీక్ష్ణత చాల యెక్కువగా నుండును ఆ మానక్రోధభావమునకులోనై సత్యభామ జంత్రపు బొమ్మవలె నది యాడించినట్లెల్ల నాడును.

అక్కడ నానా విధములైన వ్యభిచారి భావముల సంఘట్టన యుండును. ఈ వ్యభిచారి భావముల (Translitory imotions) పరిప్లుతిని (overflow) వానితో నిండిన పాత్రయొక్క వివశత్వమును ఇంత స్ఫూర్తి కలుగునట్లుగా నాయికాపాత్రను వర్ణించిన కవి యింకొకడు లేడు అలంకారశాస్త్రములలో మానవిప్రలంభ శృంగారమున కేయే వ్యభిచారి భావములు చెప్పబడెనో వాని కన్నింటికి దార్కాణగా దగినటు వంటి పద్యరచన యీభాగమున గలదు భరతశాస్త్రానుసారముగా నిట్టి శృంగార పాత్ర నభినయింపనెంచు నటుడు, ఇందలి పద్యములను మాతృకగా గైకొని తన యంగవిన్యాసములను దిద్దికొనవచ్చును.

సత్యభామాకలాప ప్రదర్శన మప్పుడు కూచిపూడివారు చూపునదీ రహస్యమే ఖండితనాయిక లక్షణములన్నియు సమగ్రముగా నిట జెప్పెను

మనుచరిత్ర సొగసంతయు వరూధినీ ప్రవరుల శృంగారాయత్తమయినటులే పారి జాతాపహరణము సొగసంతయు బూర్వభాగ మందలి మానక్రోధ యగు సత్యాదేవి భావావేశముననే గలదు నిజమునకు మహాప్రబంధములు వెలిసిన యానాడు కాక ఖండకావ్యములు వెలిసిన యుత్తరకాలమునకు జెందవలసినదీ రచన ఇందలి యితివృత్తము విస్తృతిని బట్టి మహాకావ్యమునకు జాలదు లోకమేమనునో యని శంకింపక యింత భిన్నమగు నితివృత్తమును గొని మహా కావ్యరచన మొనర్చుటనే యుత్తరకాలమున నితనికి శిష్యప్రాయులు బయలుదేరిరి నాయకరాజుల యుగమున వెలిసిన కృష్ణనాయకములగు శృంగారప్రబంధములెల్ల దీని యనుకరణములే

1. పారిజాతాపహరణము – రఘునాథరాయలు
2 సత్యభామాసాంత్వనము – శ్రీ కామేశ్వరకవి
3. రాధామాధవ సంవాదము – వెలిదండ్ల వేంకటకవి
4. రాధికాసాంత్వనము – ముద్దుపళని

ఇంకను బెక్కు శృంగారప్రబంధములు కృష్ణనాయకములు కానివి, యిందలి 'సపత్నీర్ష్య' ప్రధానముగా గలవి, దీని యనుకరణములు పుట్టినవి

వరూధినీ పాత్రచిత్రణమున బెద్దనగా రెంత సిద్ధహస్తుడో సత్యభామ పాత్ర సృష్టియం దితడంత కృతహస్తు డయ్యెను. ఈమె రెండవ ప్రబంధనాయిక. ఇందలి

కథకు కృష్ణపాత్ర నిమిత్తమాత్రము కథతో దానడచి కథను తనతో నడిపించిన పాత్రము సత్యభామయే కావున నిది నాయికాశ్రయమైన కావ్యము తంజాపుర ప్రబంధములు సామాన్యముగా నాయికాశ్రయములు పారిజాతాపహరణము నాయికాశ్రయములైన ప్రబంధములలో మొదటిది

పెద్దన కావ్యములో నాటక ధర్మ ప్రాధాన్య మెక్కువ ఇది భావప్రాధాన్యము (Lyrical). మానక్రోధ వివశాత్మయైన సత్యాదేవి యాటయంతయు నేక భావాశ్రయము. ఈ కావ్య మందలి సొగసంతయు దద్భావోన్మీలితముగనే గోచరించును కథ తక్కువ. సంవాదాత్మకముగ కథ నడచిన భాగము చాల తక్కువ.

సూక్ష్మాతిసూక్ష్మ వివరములతో ఆ పాత్రయొక్క మనోధర్మములను నిదానించి చూచుటలో ఒకవేళ పెద్దనయు నీయనకు చాలకపోవచ్చును భావానుగుణమైన పదప్రయోగమునందు ఈయన మేటి అందుచేతనే 'ముక్కు తిమ్మనార్యు ముద్దుపల్కు' అని ప్రశంసింపబడెను

హరివంశము నందలి కథ నెత్తి శృంగారప్రబంధము వ్రాయుట కీతడు మార్గదర్శకు డయ్యెను పింగళి సూరన ప్రభావతీప్రద్యుమ్నమును దీనిని జూచియే వ్రాసెను

## అయ్యలరాజు రామభద్రుడు

సకలకథాసారసంగ్రహమును, రామాభ్యుదయమును రచించెను మొదటిది రాయల యానతిపై నారంభించినట్లును, రాయల జీవితకాలములో బూర్తిగా నట్లు పీఠికలో గలదు ఇది యుత్కృష్ట గ్రంధము గాదు. పురాణ రాజశ్రేష్ఠుల భక్తి శృంగారగాథల సమీకరణము ఇతనికి యశము గూర్చిన కావ్యము రామాభ్యుదయము రాయల యనంతరము వ్రాసి అళియరామరాజు మేనల్లుడు గొబ్బూరి నరసరాజునకు గృతి యిచ్చినట్లు ప్రసక్తాను ప్రసక్తముగ రామరాజు పౌరుషాదులు గూడ వర్ణించెను కావున రామరాజుచ్ఛస్థితి నుండగా నిది పుట్టియుండును. (రామరాజు 1542–65, గ్రంధము 1550 ప్రాంతము)

రామాభ్యుదయము ప్రబంధీకృతమైన రామాయణము అయ్యలరాజు రామ భద్రుడు మహేతిహాసములకు ప్రబంధత్వమును కల్పించెను ప్రాసంగికములైన అనేకాంశములు (Episodes) అందుండుటచేత వానిని శుద్ధప్రబంధము లనుటకు వీలులేదు అందుచే నీప్రబంధకవి యట్టి ప్రాసంగికముల నెత్తివేసి ప్రధానమైన కథ వెలితిపడకుండ నేకసూత్రత్వమును గల్పించుటకు పాటుపడెను మహేతిహాసములలో వర్ణనాదులుపాథేయములు కావు. ప్రబంధములలో వర్ణనలకే ప్రాధాన్యము కలదు ప్రాసంగికేతివృత్తములలో కథకు ప్రస్తుతాప్రస్తుతములని రెండు తెగలుండును కొన్ని యుపాఖ్యానములు కథతోకొంచెము దూరముగానైన ప్రాధాన్యము గల్గియుండును అట్టివి విడనాడదగినవి కావు రామాయణకథ యందు విశ్వామిత్రుడు వచ్చి రామలక్ష్మణులను దోడ్కొనిపోవుచు త్రోవలో వారికి కథలు చెప్పు విషయమును ప్రబంధకవి విసర్జింపవచ్చును ఇట్టివి యప్రస్తుత ప్రాసంగికములు గుహుడు, శబరి, మొదలగు వారి గాథలు మాత్రము విసర్జనీయములు కావు ప్రబంధకవి వ్రాసిన

గ్రంథమునకు ఇతర గ్రంథాపేక్ష యుండరాదు అందుచే ప్రస్తుత ప్రాసంగికములను బూర్తిగా సంక్షేపింపక, వానికి తగిన స్థాన మొసంగవలయును. ఇట్టివి యీ గ్రంథమున కొన్ని గలవు. కథ కప్రస్తుతమైన రాముని విషయములో ప్రస్తుత మనదగిన యహల్యా శాపవిమోచనము నీత డొక్కమాటలో త్రోసివేసెను. అందుచే మహేతిహాసములను ప్రబంధములుగా చేయబూనుటలో గల్గు దొసగులు దీనియందును గలవు కాని కథకు సౌందర్యము మాత్రము పోకుండ కాపాడెను కథైక్యమునకు పడగల పాట్లన్నియు పడినాడు ప్రబంధోచితము లయిన వర్ణనములను పెక్కిటిని చేసినాడు

**శబ్దప్రాధాన్యము:** ఈ కవి ఇతిహాసముల నిరాడంబర శైలికి భిన్నమైన శబ్ద ప్రాధాన్యమును తన ప్రబంధమున కొసంగుటయేకాక అంత్యప్రాసలు, అనుప్రాసలు, శ్లేషలు, అర్థాలంకార శబ్దాలంకారములు ఇందవతరింపజేసినాడు శబ్దచిత్రములననేకమును చూపినాడు అలంకారికమైన శబ్దచాతుర్యమును జూపిన కవులలో నీతడు ప్రథముడు. ఈతడు చూపిన శబ్దచిత్రములు, అర్థగుంభనములు తరువాత వసుచరిత్రకారునికి మార్గదర్శకములైనవి. రామభద్రుడా కాలమున మహాకవిగా నెన్నబడియుండును ఈయన ప్రబంధయుగమున కొక యంతరువు (Land mark) సృజించి మేటి యనిపించుకొనినాడు

రామాయణము నంతను నేకైక ప్రబంధమున నిముడ్చుట కష్టము కాన మూలకథను బెక్కుతావుల సంక్షేపించెను; విడచెను. ప్రబంధత్వము నాపాదించుటకు దశరథుడు ముప్వురు భార్యలతో వనవిహారము నొనర్చుట మొదటి యాశ్వాసములో నెత్తెను పురాణేతిహాసములకు జెందిన రామాయణము ప్రబంధమైన నెట్లుండునో చూచుటకే దీనిని జదువవలెను. కథ కొఱకు గాదు దశరథుని రాజ్యపాలనముతో మొదలిడి రాము డరణ్యావాసము ముగించి నందిగ్రామము చేరువఱకు గల కథ నిందిమిడ్చెను ఇందు నాయకుడు రాముడు నాయకుని జనన కారకులను బ్రవేశపెట్టి యేకనాయకము, వస్త్వైక్యము గల ప్రబంధము చేసి రామాభ్యుదయమని పేరిడెను, ఇందు సుందరకాండ ఘట్టము చాల సరసముగ నున్నది ఇట గానవచ్చు కావ్యసౌందర్యము కవి భావనాబలము నన్యత్రగోచరములు గావు ప్రబంధకవులు, వర్ణనాకౌతూహలమున కథౌచిత్యమును విస్మరింతు రనుటకు దార్కాణగా పినవీరన శాకుంతలమున గణ్వశిష్యుడు శకుంతల జన్మవృత్తాంత కథన మొనర్చునట్లుగా నిందు విశ్వామిత్రుడు సీతను వర్ణించును ఇది యౌచిత్యభంజకము. పాత్రాధికారము, అనుకూల్యము లేనిచో ననౌచిత్యమే యగును కవి పాత్రముఖమున వర్ణించుట నీదోషము గలుగును. కవి తానై (యేపాత్ర ముఖమునను గాక) యిట్టి వర్ణనలు చేసిన నౌచితీ దోషముండదు

ఒంటిమెట్ట రఘువీర శతకము నీతడు వ్రాసె నందురు కాని యీతని తాత యీ శతకకర్త.

## ధూర్జటి

ధూర్జటి రాయల యాస్థానములో నొక మేటి కవి ఇతడు రాయలకు గృతి యిచ్చిన గ్రంథమేదియు లేకపోవుట రాయల యాస్థానమునకు నితనికి గల

సంబంధము నితర గ్రంధాధారముల బట్టియే నిర్ణయింపవలెను. ఇతని తమ్ముని మనుమడు కుమారధూర్జటి రచించిన కృష్ణరాయ విజయమున నీయంశముదాహరింప బడినది

స్తుతమతియైన యాంధ్రకవి ధూర్జటి పల్కుల కెట్లుగల్గెనో
యతులిత మాధురీమహిమ నా మునుమీ పెదతాత చాల స
న్నుతిగనె కృష్ణరాయల మనోజ్ఞసభన్ వినుమీవునట్లు మ
త్కృత బహుమాన వైఖరుల కీర్తివహింపుము ధాత్రిలోపలన్

– కృ రా వి , పీఠిక 29

ఈ కుమారధూర్జటి కొడుకు లింగరాజు ధూర్జటి వలెనే 'శ్రీకాళహస్తీశ్వర మహాత్మ్యము' వ్రాసెను అందు ధూర్జటి రాయల యాస్థానమందుండినట్లు యుదాహరింపడెను

కృష్ణరాయల కిరీట కీలిత మణిగణార్చిత పదాబ్జద్వయ శ్రీవహింప

ధరణి చెలువొందె నేకవీశ్వరవతంస
రత్న మమ్మహనీయు ధూర్జటి సుధీంద్రు
దలతు కామ లింగరాజు

ఈ రెండు పద్యములబట్టి యీకవి రాయల యాస్థానమున నుండెనన వచ్చును రెంటను 'కృష్ణరాయల సభ' పేర్కొనబడెను ఇదిగాక జనశ్రుతియు దీని కుద్బోలకముగానే యున్నది.

శ్రీకాళహస్తిమాహాత్మ్యము భీమేశ్వర పురాణము వంటి క్షేత్రమాహాత్మ్యము రెండును శివపారమ్యబోధకములే ఈ కవు లిరువురును శివభక్తి గల యద్వైతులు ఇతడు శ్రీనాధుని వలెనే నానాశాస్త్రరహస్యముల నెఱింగిన బ్రహ్మవిద్యాపండితుడు. ఇరువురును తృణీకృత పురందరులని చెప్పదగిన స్వతంత్రులు చాటు పద్యములలో శ్రీనాధుడు, శతకములో ఈయన తమ స్వభావములు, వర్తనములు, లోకమునకు చాటినారు. ఇరువురు నవసానకాలము వఱకు సంసారతాపత్రయము లనుభవించిన కష్టశీలురు.

లింగరాజు ధూర్జటి గ్రంధము షడధ్యాయకధ యనెను ధూర్జటి కాళహస్తిమాహాత్మ్యము, మనకుపలబ్ధమైనది నాలుగాశ్వాసములే యున్నది అధ్యాయ మాశ్వాసమ మనుకొనిన రెండాశ్వాసములు నశించినట్లగును. కాని రహస్యమేమన సంస్కృతమున శివరహస్య సంగ్రహమను చిన్న పురాణము గలదు. అందుత్తరభాగమున 120 అధ్యాయములలో గాళహస్తి మాహాత్మ్యము వర్ణితము ధూర్జటి నాలుగాశ్వాసముల గ్రంధమున కందలి యాఱాధ్యాయముల గ్రంధము సరిపోవును ఈ యాఱాధ్యాయముల గ్రంధము ధూర్జటి నాలుగాశ్వాసముల ప్రబంధ మొనర్చెను అంతేగాని గ్రంధపాతము లేదు.

కాళహస్తి మహాత్మ్య మనుపేరు కన్నప్ప (తిన్నడు) పేరుమీదనే వెలిసినది. శ్రుతి వ్యవహారేతరమయ్యు నచంచల భక్తి, మోక్షదాయకమని యిందు జెప్పెను అమాయిక

భక్తులకు సాక్షాత్కరించినంత సులభముగా దక్కినవారికి భగవంతుడు సాక్షాత్కరింపడు. ఆ భక్తుడును ననన్యగతికుడై యాత్మార్పణము చేసినప్పుడే పరమేశ్వర సాక్షాత్కార మగును ఈషత్సందేహ మున్నను వ్యర్థమగును. ప్రహ్లాదుడు రాతిలోనున్న భగవంతుని జూపెను. ఇతని భక్తి జ్ఞానసహితము. తిన్నడు రాతిబొమ్మతో మాటాడెను. ఇతనిది జ్ఞానరహితము ఇందుభయములును సమర్థములే. రెండవది సులభసాధ్యము. పూర్వకర్మను బట్టి ప్రాప్తించును మొదటి మార్గము కష్టమయినది. రెండవది సద్యఃఫలప్రదము, సుకరము. శైవవైష్ణవ మతముల మూఢభక్తికి ప్రాధాన్యము విజ్ఞానసహితమగు భక్తి యేరికో సాధ్యము రెండవది సమస్త మానవాదరణమయినది

శ్రీకాళహస్తి మహాత్మ్యములో నున్న యుపాఖ్యానముల కొండొంటితో సంబంధ ములేదు హరవిలాసములో వలె అనగా వస్త్వైక్యము లేదన్నమాట శివపారమ్యము నేకసూత్రముగా బోధించుటలో మాత్రమే వాని కైక్యమున్నది అయినను ఏకథ కాకథ చక్కగా పరిష్కృతమైనదో లేదో మనము పరిశీలింపవలసి యున్నది ఈ ధర్మమును ధూర్జటి యకుంఠితముగా పరిపాలించి యున్నాడని గ్రంధ పఠనానంతరము మన మొప్పుకొనితీరుదుము అనగా ఏకథ కాకథనే ఒక ఖండకావ్యముగా, పరిష్కృతమైన ఒక చక్కని అవయవముగా ధూర్జటి యుపాఖ్యానములను తీర్చిదిద్దగలడు

ఇందలి కథలలో తిన్నని కథ, వేశ్యకన్యాకథ, నత్కీరుని కథ ముఖ్యములు

నత్కీరుని కథ – తమిళవాఙ్మయ పితామహుడు అగస్త్యుడు వానిచే నేనాడో పాండ్య భూపతి యాస్థానమందు స్థాపింపబడిన సరస్వతీపీఠము నధిష్ఠించిన వాడు నత్కీరుడు వాని కథను జెప్పునప్పుడు ధూర్జటి తనకున్న సమస్త లోకపరిజ్ఞానమును, పాండిత్యజీవితములో తనకున్న స్వానుభవమును చక్కగ వెల్లడించియుండె ననుటలో నేమాత్రము సందేహములేదు నత్కీరుడు వాదింప వచ్చిన శివునైన లెక్కసేయలేదు అతడు మూడవకన్ను దెఱవగా –

*తలచుట్టు వాఱగన్నులు*
*గలిగిన బద్యంబు దప్పుగా దనవశమే?*
*వలదిచ్చట నీమాయా*
*విలసనములు పనికిరావు విడువుమటన్నన్*

అని తిరస్కరించినాడు.

గ్రంధ మంతటు కవి లోకవృత్త పరిజ్ఞాన మకుంఠితముగ దోచును. తెలుగు కవులలో చాలమంది గ్రంధపరిచయము గలవారేగాని లోకపరిచయము గలవారు కారు. అయున్న కతిపయవర్గములో ఈయన యొక ఘేటి విజయనగరవాసి యయిన నాతడు తిన్నని కథలో బ్రదర్శించిన యాటవిక జీవనము సాక్షాదనుభూతమయినదే గాని భావనాశక్తి ఫలితమునగాదు

అట్లే వేశ్యాకుటుంబ వర్ణన యందును భావనామాత్రముచే నెఱుగరాని రహ స్యములెన్నో చూపెను. రాజాంతఃపుర వ్యవహారముల నూహింపవచ్చును గాని యీ నిరాడంబరజీవిత మట్టిదిగాదు. కిరాతుల యాచారవ్యవహారములు, తిను తిండి, తాల్చు నగలు, పండించు పంటలు, కొలుచు దేవతలు, మొదలగు సమస్త వివరములు కవికి సుపరిచితములే. ఏ వర్ణన చేసినను స్వభావోక్తి యనుభవ రూపమున నుండును గాని

గ్రంథముల నుండి యెరువు తెచ్చికొనునట్లుండదు కవి యీ స్వతంత్రశబ్దప్రయోగ విషయమున గూడ జూపును కొన్ని ప్రయోగములు చాల నిరంకుశములు (అద్రిరాజు నల్లుడు). ఈ నిరంకుశత్వము శ్రీకాళహస్తీశ్వర శతకమున నింతకంటె నధికము నిజమునకు దెనుగు శతకములలో నుత్తమోత్తమ మయిన దీ శ్రీకాళహస్తీశ్వర శతకమను యోగ్యత దానికి గలదు కవి తన యాత్మభావవ్యక్తీకరణకై వ్రాసిన (Lyrical poetry) యిది భావ కవిత్వమన నాత్మవంచనము జగద్వంచనములేని స్వీయ భావవ్యక్తీకరణమే యైన నీశతకమును మించిన భావకావ్యములేదు ధూర్జటి యీ శతకమును వ్రాసిననాటి యాతని యాత్మ ప్రతిబింబము ప్రతి పద్యమునను గోచరించును.

కవి సుఖదుఃఖాది ద్వంద్వములకు వశుడై పొంగిపొరలెడి హృదయావేదన నీశ్వరుని యెదుట మొఱవెట్టుకొనెను. ప్రవృత్తి నుండి నివృత్తికి, భోగము నుండి త్యాగమునకు మఱలుటకై యుద్రేకించి రాగద్వేషమును విస్మరించుటకై ప్రయత్నించి చరితార్థతకై తన శక్తి చాలక యాశక్తి ననుగ్రహింపుమని యశ్రువర్షముతో నీశ్వరుని వేడుకొనెను. రోసీరోయని కామము, పాసీపాయని మమత్వము, కోసీకోయని వాంఛలు, తిరస్కరించియు తిరస్కరింపని రాజద్వారములు (మార్గములు), మొదలగు బంధముల జిక్కి వానిని దెంపుకొనలేక పెనగులాడు ధూర్జటి భాగవతములో మకరికి జిక్కిన గజేంద్రమును దలపించును.

పాల్కురికి సోమన భక్తిశతకము నందలి పద్యములు, దాశరథీశతకములోని పద్యములు తత్కర్త లీశ్వరానుగ్రహపాత్రులమైతి మను విశ్వాసముతో వ్రాసినవి ఇది యీనుగ్రహలబ్ధికై చేసిన మొఱ కాబట్టియే యీ యాంతర యత్నము, పెనగులాట, ఆవేదన, ఆత్మసంస్కారార్థమయి యీశ్వరునకు దన యవస్థ నివేదించుకొనుటయే గాని, లోకసంస్కారార్థము నీతులుపదేశించిన పద్యములు లేవు ఆత్మకృత దోషము నుగ్గడించుటేకాని దానిని గప్పిపుచ్చుటకై ధర్మకవచము దాల్చలేదు కవి యీ శతకమును రచించిన కాలమున నీశ్వరుని ముఖమునుదక్క ప్రపంచమును చూడలేదనిపించును. ఇంతటి యంతశ్శుద్ధిగల కవిత్వ మేత్యాగయ్య కృతులలోనో కాని సర్వత్ర లభింపదు

నోట వచ్చిన ప్రతివాక్యమును కవి దాని యిచ్చవచ్చినట్లు బోనిచ్చెనేగాని వ్యాకరణ కశాఘాతములచే మరల్పదలచుకొనలేదు. ఈ స్వతంత్రత, పశ్చాత్తాపము, ప్రపత్తి (Surrender) రసభావస్ఫూర్తి వైరాగ్యాభిముఖము, రాశీభూతమై యీశతకము పేరిట నమృతరసాయనమును లోకమున కిచ్చెను ఇతడు రాయల ప్రబంధయుగము నందలి యొక కవీభము

## మాదయ్యగారి మల్లన

రాయల యాస్థానమున వెలసిన యష్టదిగ్గజములలో నొకడని కుమార ధూర్జటి రచించిన కృష్ణరాయవిజయమున పీఠికలోని –

సరస సాహిత్యరచన విస్ఫురణ మెనయు
సార మధురోక్తి మాదయగారి మల్ల

నార్యు డల యల్లసాని పెద్దనార్యవరుండు
ముక్కు తిమ్మన మొదలైన ముఖ్యకవులు — కృ రా వి ,3–48

అను పద్యము సాక్ష్య మిచ్చుచున్నది. పాండ్యరాజుల స్థానాపతి రాయవాచకమును రచింప దానిని కుమారధూర్జటి కృష్ణరాయవిజయమను ప్రబంధముగా నొనరించెను.

తన గ్రామ మయ్యంకి యని మల్లయ చెప్పికొనినాడు క్షేత్రయ్య నివాసమగు మొవ్వ, కూచిపూడుల వద్ద నొక అయ్యంకి యున్నది కృతిభర్త నివాస మగు కొండవీటి కిది దగ్గరలో నున్నది గాన మల్లన గ్రామ మిదియే గావచ్చును

రాజశేఖరచరిత్ర దశకుమారచరిత్ర వంటి చిత్రకథ ఇది పురాణాంతర్గతమైన కథ కాదు. ఇందలి కథ యిది — హేమధన్వుడను నొక రాజ నపత్యుడై తపము చేసి శివప్రసాదమున రాజశేఖరుడను కుమారుని గాంచెను అంత కౌశికుడను నొక ఋషి రాజు వద్దకు వచ్చి తన కుమార్తెను భానుమతియనుదానిని విశంకట రాక్షసు డెత్తికొనిపోయె ననియు, నామెను విడిపింప యువరాజును పంపవలె ననియు ప్రార్థించెను అందుకై యువరాజు ససైన్యముగా వెళ్లి రాక్షసుని జంపి బాలికయున్న గుహలోనికి వెళ్లును. అప్పుడు దుర్గ సౌమ్యరూపమున వానికి సాక్షాత్కరించి సర్వమనోరథములను దీర్చునొక మణిని ప్రసాదించి యంతర్ధానము సేయును అంతట పార్వతీ భక్తురాలగు నొక యోగిని రాజశేఖరునకు బాలికను, ఒక చిలుకను దెచ్చి యిచ్చును బాలికను కౌశికుని కప్పగించి సైన్యమును రాజధాని కంపివేసి, తిరుగు ప్రయాణములో నొక యుద్యానవనములో విశ్రమించును. ఒక రాజకన్య సఖీసమేతయై నచటకు విహరింపవచ్చును. ఆమె పూర్వజన్మలో నొక గంధర్వ కన్య యట ఇరువురికి ప్రథమానురాగము కలుగును ఇటు చిలుక, అటు చెలికత్తె ప్రణయ సందేశములు నడుపుదురు. ఆ కన్య తల్లిదండ్రులు రాజశేఖరుని గౌరవించి, కుమార్తె నిచ్చి వివాహము గావించి కుమార్తె నత్తవారింటి కంపుదురు. ఇది కథ.

మార్కండేయ పురాణము నందలి మదాలస చరిత్రమునకు దీనికిని పోలికలు గలవు. ఇది వీరశృంగారాత్మక మగు చిత్రకథ

ఇతర కథల పోలిక లిందులో చాల నున్నవి హేమధన్వు డనపత్యుడై తపస్సు చేయుట కాదంబరి యనుకరణ

కౌశికుడను ఋషి మొఱపెట్టుకొనుట, ఉత్తరహరివంశములో కృష్ణునితో బ్రాహ్మణుడు మొఱపెట్టుకొనుట వలె నున్నది. ఇచ్చట రచనయు సరిగ నట్లే యున్నది యువరాజుతో నాతని సంభాషణము రామాయణము నందలి రామ విశ్వామిత్రుల సంభాషణను దలపించుచుండును.

తక్కిన శృంగారకథ వసుచరిత్ర పోలిక — సందేశములు తెచ్చుట

శైలి ప్రబంధోచితముగ నున్నది వర్ణనాత్మకమైన గద్యలను లయతో వ్రాసినాడు. విజయవిలాసము, కళాపూర్ణోదయములలోని శైలి వంటి శైలి యిది ప్రబంధకవి కుత్ప్రేక్ష ప్రాణాధారము దీనితోబాటి గ్రంథ మందు స్వభావోక్తియు నున్నది మల్లన భావుకత కొక మచ్చుతునక

చిలుక పురోహితుండగుచుఁ జెంగట నుండగ సిగ్గు పెందెరల్
దొలఁగగ ద్రోచి బంధుగతి దోరపుఁ గోర్కులు సందడింపఁగా
దలపు లతాంగి కన్నమును తాన కనుంగవ దోయిలించి చూ
పుల దలబ్రాలు పోసె నృపపుత్రునిపై విరహోగ్ని సాక్షిగన్

ఈ పద్యమున చిలుక పురోహితత్వమును నెఱపిన విషయమును గ్రహించి ప్రభావతీప్రద్యుమ్నములో సూరన –

ప్రమదంబున రాకొమరుడు
కమలాక్షఁ బరిగ్రహించె గాంధర్వ వివా
హముచే 'నయంముహూర్త
స్సుముహూర్తోఽ స్తంచు గెలనశుచిముఖి నవ్వెన్'!

అని శుచిముఖి అను హంస పురోహితత్వము నెఱపినట్లు రచించెను

## అష్టదిగ్గజకవులు

రాయల సరస్వతీ పీఠమును బరివేష్టించి యష్టదిగ్గజములను నెనమండుగురు కవులుండెడివారను కథ గలదు. అయిదుగురి పేళ్లు నిశ్చయముగా జెప్పవచ్చును. వారు అల్లసాని పెద్దన, నంది తిమ్మన, అయ్యలరాజు రామభద్రుడు, మాదయగారి మల్లన, ధూర్జటి వారిలో బెద్దన తిమ్మన లిరువురే రాయలకు గృతి యిచ్చిరి మిగిలిన ముప్పురును రాయలకు గృతి నీయలేదు మల్లన కొండవీటి ప్రాంతము వాడు అతడు కొండవీటి దుర్గాధిపతియు దిమ్మరసు నల్లుడు నగు నాదెండ్ల అప్పామాత్యునకు గృతి యిచ్చెను. ఇతడు రాయల యాస్థానకవి యగుట యెట్లనిన –

1. రాయల యాస్థానమున నీతడు కవియై యుండెను. వసంతోత్సవ దినములలో దుర్గాధిపతులు సామంతులాదిగా గలవారందఱు రాజధానికి వచ్చెడివారు అప్పుడు కవికి అప్పామాత్యునితో బరిచయము గలిగియుండును కృతి యిచ్చియుండును
2 కొండవీటి ప్రాంతముననే యుండి దుర్గాధిపతికి కృతి యిచ్చిన యనంతరము కవి రాయల యాస్థానప్రవేశము గాంచి యుండును ఇక రాయల యాస్థానకవులు రాయలకే కృతి నీయ నక్కఱలేదు ధూర్జటి, రామభద్రుడు శ్రీకృష్ణ దేవరాయల సమకాలికులని కుమారధూర్జటి కృష్ణరాయవిజయము నందు గలదు

ఈ యైదుగురుగాక మిగిలిన ముప్పురు కవులును నిర్ణయించుటకు దగిన చారిత్రికాధారములు లేవు పలు పేళ్లూహింపబడు చున్నవి

1 తాళ్లపాక చిన్నన్న 2. పింగళి సూరన 3. తెనాలి రామకృష్ణుడు 4 కందుకూరి రుద్రయ్య 5. రామరాజ భూషణుడు 6 ఎడపాటి ఎఱ్ఱన 7 చింతలపూడి ఎల్లన వీరిలో ముప్పురు అష్టదిగ్గజములలోని వారని పలువురు పలురకములుగా ఊహించియున్నారు. అసలు వీరిలోనెవ్వరైన అష్టదిగ్గజములలోని వారగుటకు –

1. అతడు శ్రీకృష్ణదేవరాయల సమకాలికుడు కావలయును
2. కేవల సమకాలికుడే గాక రాయల ఆస్థాన ప్రవేశమున్నవాడై యుండవలెను

ఈ రెండును వీరిలో నెవ్వరెవ్వరియందు సరిపోవునో పరిశీలింపవలయును.

**తాళ్లపాక చిన్నన్న:-** తిరుపతికాపురస్థుడు. తాళ్లపాక అన్నమయ్య శ్రీనాథుని సమకాలికుడు. ఇతడు ప్రహ్లాదునివంటి భక్తుడు. కీర్తనలు, శతకములు, మంజరులు ననేకముల నితడు వేంకటేశ్వరస్వామిపై రచించెను. ఇతనికి పెదతిరుమలయ్య, చినతిరుమలయ్య, తిరువేంగళనాథ మనువారు కుమారులు. మన చిన్నన్న అన్నమయ్య కుమారుడో మనుమడో కావలెను. తాళ్లపాక వారిది కవివంశము. అష్టమహిషీకళ్యాణము, పరమయోగి విలాసము, ద్విపదకావ్యములుగ రచించిను. చిల్లర కావ్యము లనేకములు రచించెను. ఈ వంశమువారు స్వామి కైంకర్యమునకు భూగోదానములు చేసిరి. వీరి గొప్పదనమును మెచ్చి రాయలు వీరికి అద్దంకి కొండవీడు అగ్రహారముల నిచ్చెను కొండవీ డిచ్చినట్లు కొండవీటి చరిత్రయందు గలదు. చిన్నన్న సదాశివరాయల కాలము వఱకు జీవించెను. తాళ్లపాకవారందఱు తమ కావ్యములను వేంకటేశ్వరస్వామివారికేగాని నరాంకిత మొనర్పలేదు కావున రాయల కేతడేల యంకిత మీయలేదను ప్రశ్న లేనేలేదు. అంతేగాక నరాంకిత మొనర్పమను నియమములేని రామభద్రుడు, మల్లన, రాయల కంకితము చేయలేదు. కావున తాళ్లపాక చిన్నయ అష్టదిగ్గజములలోని వాడు కావచ్చును

**కందుకూరి రుద్రయ్య:** కందుకూరు కాపురస్థుడు ఇతని వంశీయుల యింటిలో నొక దండకవిలె యందు స్పష్టముగా నాతడు రాయల సరస్వతీ మహాలున నీశాన్యమూల నున్న యాసనముపై కూర్చుండెడివాడని కలదు. ఇతడు నిరంకుశోపాఖ్యాన కర్త. 1580 ప్రాంతమున వ్రాయబడినది 1580లో ప్రౌఢప్రబంధము వ్రాసిన కవి 1530లో బుట్టియుండును అనగా నితని చిన్నతనముననే రాయలు గతించెను. లేదా యాతని తాత రుద్రయ యాస్థానకవియేమో యను నీవిషయము నిరంకుశోఖ్యానమున గానరాదు. ఈవిషయము లోకము మఱచినను రుద్రయ మఱువరానిది. చెప్పియున్నచో దాత గ్రంధకర్త గాకున్నను విప్రతిపత్తి లేదు. కావున దండకవిలెను సమర్థించుట దుష్కరము.

**రామరాజభూషణుడు:** ఇతనివిషయమున గూడ వయోవిప్రతిపత్తియే గలదు. వసుచరిత్రను తళ్లికోట యుద్ధానంతరము, తిరుమలరాయని కాలమున, కవిప్రౌఢవయస్సున రచించినట్లు తోచును. అనగా గవి 1510 ప్రాంతమున జన్మించియుండును. కావున రాయల యాస్థానప్రవేశ మీతనికి దుర్లభము. జీర్ణకర్ణాటలక్ష్మీపునస్సృష్టిత్వాదులచే తళ్ళికోట యుద్ధము (1565) కొండవీడు యుద్ధము (1577) చెప్పబడుటచే వసుచరిత్ర రచనాకాలము 1580 ప్రాంతము. 1580 లో పెనుగొండ పుచ్చుకొనుట వర్ణితముగాన నటుతరువాతిది గాదు.

**పింగళి సూరన:** రామరాజభూషణునికన్న పెద్ద. రాఘవపాండవీయ రచన 1550 ప్రాంతమున. తత్పూర్వ రచన యగు గారుడ పురాణము బాల్య రచన 25 – 30సం॥ వయస్సులో వ్రాసినది ఇతని జననము రాయల నిర్యాణమునకు సుమారు 25సం॥ ముందయి యుండును కావున నితనికా సింహాసనాధికారము లేదు.

రాయలు సూరన తండ్రికి నిడమానూ రగ్రహారము నిచ్చినట్లు గలదు. రాయలచే గౌరవింపబడినవాడు సూరన తండ్రి సూరన రామరాజభూషణుడు, రాయల యాస్థానమును దవుదవ్వుల నుండి చూచుట, వినుట, తటస్థించి యుండును. వారు

తలయెత్తు నాటికి రాయలస్తమించినందుకు వారిర్వురును ఖేదపడిరి వారికా యర్హత గలవారమను విశ్వాస ముండెడిది అ ప్రాప్తి లేకయే వీరుగూడ నాయాస్థానము వారని తరువాతి వారు చెప్పటకు గారణమైనది ఇది లోకుల మనోరథము

**తెనాలి రామకృష్ణుడు:** తన యుద్భటారాధ్య చరిత్రమును బట్టి రాయల సమకాలికుడు. కాని యితనికి నష్టదిగ్గజములలో స్థానములేదు ఉద్భటారాధ్య చరిత్ర రాయల కాలములోనే వ్రాసెను పాండురంగమాహాత్మ్యము రాయల యనంతరము నిరువది యేండ్లకు రచించెను ఇందు మొదటి గ్రంథము రెండవ గ్రంథమున కేమాత్రము సరిరాదు అమాత్రపు శక్తితో రాయల సమకాలికుడైనను, అష్టదిగ్గజముల నొకడగుట కర్హత చాలదు.

సరస్వతీమహలున నున్న యెనిమిది పీఠములను నెనమండుగురు కవులు అలంకరించిరి. వారందఱు తెనుగువారే కానక్కరలేదు నానారాష్ట్రములు, భాషలు గల సామ్రాజ్యమున నాయా భాషా కవులకు బ్రాతినిధ్య ముండి యుండును. ఆ యెనమండుగురు నాంధ్రు లగుట రాయల రాజనీతికి దూరము అయిదుగురు ఆంధ్రకవులై, ముగ్గురు తదితర భాషాకవులునై యుందురు అయన తెనుగురాజు అయన భాష తెనుగు, రాజ్యము తెనుగురాజ్య మగుట తెనుగు కవుల కైదు స్థానము లుండియుండును ఇటు లనుటలో దోసగులేదు అందరు తెనుగువారే యని చరిత్రకారుఁడెవడైన వ్రాయదలచినచో చిక్కులు కలుగును

కన్నడములో కృష్ణకవి భారతమును రచించి కృష్ణదేవరాయల కంకిత మిచ్చెను (తిమ్మణార్యు డని వే|ప శాస్త్రి గారి మనుచరిత్ర పీఠిక).

## శ్రీకృష్ణదేవరాయలు

విజయనగర సామ్రాజ్యమునకు దత్ప్రాభవసూచకమును నష్టదిగ్గజ పరివేష్టితము నయిన సరస్వతీ పీఠమునకు నధిపతి రాయలు ఆయన సాహిత్యకీర్తికి ధ్వజప్రాయమైన గ్రంథరాజ మాముక్తమాల్యద దురదృష్టవశాన నీ గ్రంథకర్తృత్వమును గూర్చి చాల వివాదము గలదు. పెద్దనగారే అముక్తమాల్యద రచించి రాయలపేరు పెట్టెనను నైతిహ్యము గలదు అందుకుపపత్తులుగ నీక్రింది విషయముల నెత్తి విమర్శకులు చూపుదురు.

1. రాయలవంశాభివర్ణన పద్యములు, విష్ణుస్తోత్రపర మయిన పద్యములు మనుచరిత్ర లోనివే యిందు గలవు
2. పెద్దనగారే యాముక్తమాల్యద రచించినట్లు లోకములో నొక చాటువు గలదు
   ప్రౌఢదీర్ఘసమాసముల గూర్చి శ్రీనాథుండు కూలార్చె నైషధంబు
   దాని తల్లన నల్లసానిపెద్దన చెప్పె ముది మదితప్పియాముక్తమాల్యద
   —రామలింగకవి చాటువు
3. లక్షణ గ్రంథములలో 'అల్లసానిపెద్దన విష్ణుచిత్తీయము' నుండియని యుదాహరింపబడెను.
4. అముక్తమాల్యద ప్రథమ వ్యాఖ్యాత యిది పెద్దనదిగానే స్వీకరించెను

పూర్వపక్షము: 1. మనుచరిత్ర మందలి పద్యము లాముక్తమాల్యదలో నున్నమాట సత్యమే. మనుచరిత్రలోనివేగాక యితర కవులప్పుడప్పుడు రాయల గూర్చియు, రాయల వంశమును గూర్చియు జెప్పినవి గూడ నిందు గలవు కృత్యాదిని కృతికర్త వంశ వర్ణన మవసరము. ఆచారము రాయలవికత్థను డగుట తన్ను, తన వంశమును తానే వర్ణించుకొనుట కిచ్చగింపక తన్ను గూర్చి యాస్థాన కవులు చెప్పిన పద్యములనే యిట జొప్పించెను అట్లు చొప్పించుటలో గూడ గొప్ప సందర్భశుద్ధిని పాటించెను శ్రీకాకుళాంధ్ర విష్ణువు తనకు స్వప్నమున దర్శన మొసంగి –

ఆంధ్రభాష యసాధ్యంబె యందు నొక్క
కృతి వినిర్మింపు మిక మాకు బ్రియముగాగ

అని యానతిచ్చిన విషయము రాయలు తన పండిత సభలో నన, వారందఱు రాయలనే తత్కావ్యనిర్మాణమునకు బ్రోత్సహించుచు 'నీకిట్టి శోభనంబులే మద్భు తంబులవధరింపుమ'ని రాయల వంశ వర్ణము నొనరించిరి అవి వారి మాటలే గావున వారిదివఱలో చెప్పిన పద్యములనే రాయలు చేర్చెను కాన ఏ యితర ప్రబంధములకులేని ఔచిత్యమును సంపాదించిన వాడయ్యెను ఇక విష్ణుస్తోత్రపరమైన పద్యములు పెద్దనగారివే వారిరువురి చెలిమి శరీరమాత్ర భిన్నమైనది పెద్దనగారే తాను, తానే పెద్దనగారు ననునట్లా కవియు రాజును వర్తించిరి పెద్దన గారి పద్యములను వాడుటకు రాయలు సందేహింపలేదు అయనకు లోకమిట్టి నిందారోపణ మొనర్చునన్న సందేహము కలిగినచో నాపద్యములను గ్రహించి యుండడు ఇక పెద్దనయే రచించి రాయల పేరు పెట్టె నందుమా, పెద్దన తన యితర గ్రంధము లందలి పద్యముల నిందు జేర్పడు ఆముక్తమాల్యదలో నిసర్గముగా రాయల శైలికి భిన్నమైన శైలిగల పద్యములు పెక్కు గలవు సారళ్యము ప్రసన్నత ప్రధానముగ గల శైలిలో నున్నవా పద్యములు సాహిత్యసమరాంగణచక్రవర్తి యని పేరు గాంచిన రాయలు తన రచన సాగినంతకాలము తాౘ్రాసినది తనయాస్థాన కవులకు వినిపించు సందర్భమున వారికి దనతో గల చనవు బలిమిని వారి కోరికపైగాని తాగోరి కాని వారి పద్యముల నక్కడక్కడ జొప్పించి యుండును. అది వారికి ముచ్చట, ఆయనకు గోర్కె. కావుననే యాముక్తమాల్యద యందు భిన్నశైలు లున్నవనుట. ఏపద్యము లెవరు చెప్పినను గ్రంధ నిర్వహణము రాయలదే కాన నాతడే కర్త.

2 చాటువులే ప్రబంధములుగా వెలసిన రోజులవి. అనగా చాటుపద్యము నొక ప్రబంధముగా గొనియాడినరోజులు. పెద్దనయే ఆముక్తమాల్యద రచించెనన్న చాటువు కేవలము జల్లిపదముల కూర్పు ఇక నందలి విషయము చారిత్రక ప్రమాణమునకు జాలదూరము. ఆముక్తమాల్యద రచన రాయచూరు ముట్టడి 1520 యనంతరము మనుచరిత్ర తత్పూర్వమే రచింపబడినది ఈ చాటువునందాముక్తమాల్యద మనుచరిత్రకు బూర్వము రచింపబడినట్లు గలదు ఇది కేవలము నిరాధారము.

3,4 ఆముక్తమాల్యద పెద్దన కృతమని యుదాహరించిన లాక్షణికులు గాని ప్రధమ వ్యాఖ్యాతగాని రాయల సమకాలికులు గారు లోకములోని వదంతులు నమ్మి వ్రాసిన మాటలవి ఇంత రాజ్యకార్యభారము వహించు రాయలకు గ్రంధరచన కవకాశముండునాయని లోకుల యభిప్రాయము కాని యెంత వ్యవహార

నిమగ్నుడైనను రాయలు విశ్రాంతి కొఱకైనను సంగీతసాహిత్యాది కళల నాశ్రయించెను. ఇంతకు నానాటి రాజులు తమ యాస్థాన కవులతోను, పండితులతోను తుల్యులగు విద్యావంతులయియుండెడివారు

ఇంతకును రాయలు కవితాగంధము లేనివాడైన గదా యిట్టి శంకల కవకాశము. అతడు బహుగ్రంథకర్తయైనట్లు అముక్తమాల్యదలోని –

పలికితుత్ప్రేక్షోపమలజాతి పెంపెక్క
రసికులౌనన మదాలసచరిత్ర
భావధ్వని వ్యంగ్య సేవధిగాగఁ జె
ప్పితివి సత్యావధూప్రీణనంబు
శ్రుతి పురాణోపసంహిత లేర్చికూర్చితి
సకలకథాసారసంగ్రహంబు
శ్రోత్ర ఘచ్ఛటలు విచ్చుగ రచించితి సూక్తి
నైపుణి జ్ఞానచింతామణికృతి
మఱియు రసమంజరీముఖ్య మధురకావ్య
రచన మెప్పించుకొంటి గీర్వాణభాష
నంధ్రభాష యసాధ్యంబె యందు నొక్క
కృతి వినిర్మింపు మిక మాకు బ్రియముగాగ॥

అను పద్యము సాక్ష్యమిచ్చుచున్నది ముక్కుతిమ్మన పారిజాతాపహరణ కృత్యాదిని రాయలను 'కవితాప్రావీణ్యఫణీశ!' యని సంబోధించెను. రాయలు కవిగాక విద్వాంసుడే యైనచో దిమ్మన 'విద్యాప్రావీణ్య ఫణీశ!' యనియే చెప్పియుండును

ఇక లాక్షణికుల మతమునకు విరుద్ధము లయిన ప్రయోగము లిందు గొల్లలు గలవు 'పత్తుం పత్తుం', 'మఱుమక్కతాయిరం' మొదలయిన యన్యదేశ్య పదప్రయోగములు, వ్యాకరణ విరుద్ధము లయిన 'నిట్టతాడు నంటతివ', 'చించిచ్చువారు', 'గంగనుకాసె', 'నెలతిచ్చెను' మొదలగు ప్రయోగములు గలవు మనుచరిత్రలో నిట్టి దోషములు లేవు పెద్దనయే యీరెండు గ్రంథములకు గర్తయైన లాక్షణిక సమ్మతమైన మనుచరిత్రను తన పేరుమీద నుంచుకొని లక్షణవిరుద్ధములగు ప్రయోగములు గల అముక్తమాల్యదను రాయలపేరుమీద వెలయించి ప్రాణమిత్రుడగు రాజు నపఖ్యాతి పాల్జేయు ననుట సమంజసము గాదు ఇక నీప్రయోగములు పెద్దనగారికి సమ్మతములనిన మనుచరిత్రయందట్టిది యొక్కటియు గానరాదు. ఇట్టి ప్రయోగములు రాయలకే సమ్మతములు. పెద్దన గారికి గావు ఈ యసాధుశబ్దప్రయోగములను రాజాస్థానములో బరిహసింతురను భయము రాజాదరణము గోరు కవులకుండును గాని యాకవులను పోషించు రాజున కవసరములేదు. కావున రాయలే అముక్తమాల్యద కర్త

ఈ రెండు గ్రంథములు భిన్నకర్తృకములనుటకు –

మనుచరిత్రము జదివి పెద్దనగారి శైలి యెట్టిదో గ్రహింతుము కాశీఖండము నైషధము చదివి శ్రీనాథుని శైలి గ్రహింతుము క్రీడాభిరామమందలి పద్యములను జదివి శ్రీనాథుని వాక్కెంత స్ఫుటముగా విందుమో 'అముక్తముల్యద' లోని

పద్యములను జదివి యిందు పెద్దనగారి వాక్కు గోచరింపనేలేదని యంత నిష్కర్షగా జెప్పగలము మనుచరిత్ర పద్యముల శ్రావ్యతకు బ్రసన్నతకు, నశ్లిష్టాన్వయమునకు బ్రౌఢములయ్యు గాఢములుగాని సమాసములకు బ్రసిద్ధి జెందిన గ్రంథము మాధుర్య సంపాదనము పెద్దన గారి సొమ్ము వర్ణనలకు సందర్భౌచితి గాపాడుట యాయన రీతి అప్రసిద్ధపదములను వాడకుండు టాయన దీక్ష. ఆముక్తమాల్యదయందలి పద్యములకు శ్రావ్యత లేదు ప్రసన్నత మృగ్యము వర్ణన లతిదీర్ఘములు సందర్భౌచితిని గోల్పోయినవి సమాసములకు గారిన్య మెక్కుడు అయ్యును రాయలకు బ్రకృతి పరిశీలనాదుల యందు బెద్దనగారిని మించిన భావనాపటిమ గలదు పెద్దన చూపుకంటె రాయలచూపు అతి నిశితమైనది స్థూలాకారదర్శన వర్ణనలతో బెద్దన తృప్తిని బొంద, రాయ లాంతరస్నాయులగుండ దర్శించి గాని తృప్తి బొందడు. ఆయన రూపచిత్రణములు చిత్రకారులకు గూడ నసాధ్యములు. లోకజ్ఞత యందును బెద్దన రాయలకు జాలడు ఈ స్వభావభేదమే, కవితాగుణభేదమే యారెండు గ్రంథములకు గలదు మెఱుగుపెట్టిన పద్యరచన పెద్దనది సూక్ష్మపరిశీలనతో స్నాయువులు పట్టి చూపునది రాయల రచన అందుచే నీరెండు గ్రంథములును భిన్నకర్తృకములు గాని యేకకర్తృకములు గావు

**ఆముక్తమాల్యద:** రాయల సాహిత్యకీర్తికి ధ్వజప్రాయమైన ఈ కావ్యరచనాసంకల్పము పూర్వదిగ్విజయయాత్ర నొనరించి శ్రీకాకుళాంధ్ర విష్ణువును సందర్శించునపుడైనను, రచన పూర్తియగుట రాయచూరు ముట్టడి యనంతరము జరిగెను అనగా 1520–22 ప్రాంతము. రాయచూరు ముట్టడించి ఎడిల్‌షాను జయించి నిశ్చాత్రవ మొనర్చిన పిదప నీరచన.

ఈ కావ్యమునకు విష్ణుచిత్తీయమను నామాంతరము గలదు విష్ణుచిత్తీయ మనుపేరు సార్థకము చేసిన విష్ణుచిత్తుని కథ పూర్వభాగమునకు ఆముక్తమాల్యద యనుపేరు సార్థకము చేసిన గోదాదేవి చరిత్ర యుత్తర భాగమునను గలవు

గోదాదేవి ఆముక్త = తానుధరించి విడిచిన, మాల్య = పూలమాలికను, ద = ఇచ్చినదగుటచే గ్రంథమునకీ నామము వచ్చెను దీనికి సరియైన ద్రావిడభాషాపదము 'చూడికొడుత్తాళ్ '(ధరించి యిచ్చినది). ఇందలి యాధికారిక వృత్తము విష్ణుచిత్తుని చరిత్రము దీనికి గురుపరంపరా ప్రభావమను వైష్ణవగ్రంథము మూలము విష్ణుచిత్తుడు పన్నిద్దరాళ్వారులలో నొకడు. ఇందు బ్రాసంగికముగ యామునాచార్యచరిత్ర, మాల దాసరి కథ, ఖాండిక్యకేశిధ్వజోపాఖ్యానము నతుక బడినవి. యామునాచార్యునికథకు మూలము పై వైష్ణవగ్రంథమే మాలదాసరికథయు వరాహపురాణమున గలదు. ఖాండిక్య కేశిధ్వజోపాఖ్యానము పరాశరకృతవిష్ణుపురాణమున గలదు

కృతికర్త కావ్యమున బ్రతిపాదింప దలచిన విష్ణుభక్తికి విశిష్టాద్వైతమునకు పోషకము లుగా నీప్రాసంగిక విషయములు చేర్పబడినవి ఈయతుకుదల కావ్య శరీరసౌష్ఠవమునకు గొఱత దెచ్చినది అనగా నివి గ్రంథమున కపరిహార్యములైన యంగములు గావు మనుచరిత్ర యందలి వరూధినీప్రవరుల శృంగారఘట్టము స్వారోచిషమనుసంభవమున కపరిహార్య మగు వృత్తము. ఆముక్తమాల్యద యందలి ప్రాసంగికేతివృత్తములు కావ్యమునకు నిర్మాణసౌష్ఠవము (Structural Perfection) లేకుండ జేసినవి ఈ

ప్రాసంగికములను పరిహరించిన వస్త్వైక్యము, సార్థకనామధేయము గల చక్కని కావ్యమయ్యెడిది.

కావ్యమున బ్రధాన ప్రతిపాద్య మయిన విష్ణుభక్తి వివిధరూపముల వర్ణిత మయ్యెను. ఐదురకము లయిన భక్తిభేదములు అయిదు కథ లందు సూచింపబడినవి.

యామునాచారి వేదవేదాంగ పరిజ్ఞానము జీర్ణము చేసికొన్న విష్ణుభక్తి గలవాడు విష్ణుచిత్తున కట్టి జ్ఞానము లేదు. అమాయికపు భక్తుడు ఆయన బుద్ధిసంపద యంతయు విష్ణుకైంకర్యము నందలి యాసక్తియే విష్ణుకైంకర్యమే పరమావధిగా గల ప్రపన్నుడు (He surrendered himself to God). గోదాదేవి ప్రపన్నత శృంగారరూపమును దాల్చినది. మాలదాసరి జ్ఞాని కాడు కులమునుబట్టి కైంకర్యమున కవకాశములేదు ఇతడు చేసినది గానకైంకర్యము.

ఖాండిక్యకేశిధ్వజోపాఖ్యానమున విష్ణుభక్తి పూర్వకయోగాభ్యాసముదాహరింపబడి నది. పై భక్తిమార్గము లన్నియును స్వరూపభేదములయ్యును మోక్షప్రదములే. మాలదాసరి కీర్తనసేవ యన్నిటికి మిన్నయని కైశికగాన సుకృత దానము వలన బ్రహ్మరాక్షసునకు విప్రత్వమును భాగవతశ్రీయును గలిగించినట్లు చెప్పెను. గోదాదేవియు గీర్తనసేవకే పేరుగాంచినది. తాను నాయికగా కృష్ణుని గూర్చి యామె చెలికత్తెలతో జెప్పుచు పాడిన 'పాసురముల'ను ద్రావిడ వైష్ణవులు నేటికిని పాడుదురు గానలోలుడగు భగవంతుని దృష్టిపఱుప గలిగినది కీర్తన కైంకర్యమే

ప్రణయము వలన గోదాదేవి తానొక్కతెయె తరించినది కాని మాలదాసరి తాను దరించుటయేకాక యొక బ్రహ్మరాక్షసుని గూడ దరింపజేసినాడు మొత్తముమీద నద్వితీయమయిన వైష్ణవతేజము సర్వత్ర తానయై వెలుగుచు నధికారి వశమున భిన్నభిన్న రూపముల నొందుచు నేరూపమునందైనను ధ్వాంతనాశనమును చేయునన్న రహస్యము నీకావ్యము నానావిధముల ప్రదర్శించుచున్నది

గోదాదేవి శృంగారము లౌకికము గాదు ఆధ్యాత్మిక మయినది. శృంగారమున నిరువురు వ్యక్తుల మానసికసంయోగము (Union of two Souls). భక్తిరసము గాదు. శృంగారమున నొక భావము భక్తిరసముగా బరిణమించిన శృంగార మగును భక్తి కాలంబనము స్త్రీయైనచో దాని చరమావస్థ శృంగారముగా బరిణమించును గోదాదేవి శ్రీరంగశాయికాత్మార్పణ మొనర్చు కొనిన ధన్యజీవి. (She wedded her life to SRI Ranga Sai) ఇక రూపకల్పన లౌకికముగుట విరహము, పెండ్లి, మొదలైనవి కవి వర్ణించెను. కవికి విష్ణుభక్తియెడ గల చూపు మధురాతిమధురమైనది.

రాయలకు గోదాదేవికి గల మధురభావము, యామునాచార్యునికి గల యుప నిషద్జ్ఞానము, పాతంజలాది యోగశాస్త్ర జ్ఞానము గలదు ఈ విజ్ఞాన మాయన కభ్యసనప్రాప్తమేకాని శ్రుతపాండిత్యమున గాదు.

కవిగా నీత డతి తీక్ష్ణమైనట్టియు లోకాతిగమైనట్టియు భావనలో (Imagination which transcends the visible) దిక్కనకు దుల్యుడు. వాస్తవిక చిత్రణలో గూడ దిక్కననే తలపించును. కాని గ్రంథమున సగభావములో నీభావనాశక్తి మరుగుపడి తదాభాసమగు నూహప్రకటితమయ్యెను. ఇది సాధారణముగ ప్రబంధము లన్నిట గల దోషమే. ఒకచోట సరళమగు పద్యములను వ్రాసి మఱియొకచోట పాకకాఠిన్యములగు

వానిని వ్రాసెను ఇమిడిక యను నెపముతో భావవ్యక్తీకరణము కుదురక యంతర్వేదన పొందు దానివలె గోచరించును ఇతడు సహజముగా సంస్కృతకవి తరువాత తెనుగు కవి. తెనుగు పలుకుబడి వ్యక్తీకరణము కుదురదు

రాయలు నిర్దుష్టమయిన వైదుష్యము గల పండితకవి. నన్నెచోడుని తరువాత నింతవఱకు వర్ణనాకుతూహలము గల కవి యింకొకడులేడు. కథ నొకప్రక్క నిలిపి మూడు ఋతువులను నూఱు పద్యములలో వర్ణించెను. పైని పేర్కొన్న ప్రాసంగికేతివృత్తములును వర్ణనలును కథాప్రవాహమును పర్వతమువలె నడ్డివేసినవి

ఇతర గ్రంథములలో దఱచి చూచినగాని కానరాని తత్కాలిక లోకతంత్ర మంతయు నిందు బహుళముగా గోచరించును అనాటి సంపన్నుల, పేదసాదల, రాజుల, మంత్రుల, దేవళముల, అర్చకుల, వేయేల సమస్త జీవితరహస్యములను కవి యిందు బ్రతిబింబింప జేసెను

రాయలనాటి యాచారవ్యవహారములెఱుంగవలె నన్నచో నీగ్రంథమువోలె నేయితర ప్రబంధమును ప్రయోజనకారి కాదు.

వర్ణన ఘట్టములలోని ప్రకృత్పరిశీలన మెంత నిశితముగ దోచునో యీ ఘట్టము లందు బ్రజాజీవితపరిశీలన యంత గలదు ఈ నైపుణి ప్రజలతో దాదాత్మ్యమును పొందిన రాజునకు దక్క ననితర లబ్ధము.

## రాయల సమకాలికులయిన యితర కవులు

### చింతలపూడి ఎల్లనార్యుడు

రాధామాధవ మచ్యుతాంకితముగాఁ బ్రౌఢక్రియం జెప్పిత
న్మాధుర్యంబునఁ గృష్ణరాయవిభుఁ గర్ణాటేశు మెప్పించి నా
నాధాత్రు ప్రతిమానసత్కవులలోనన్ భూషణశ్రేణితో
రాధామాధవ నామమందిన జగత్ప్రఖ్యాత చారిత్రుఁడన్ —రా.మా 1–30

ఇతడు రాధామాధవ మను ప్రబంధమును రచించి రాయల వలన రాధామాధవకవి యను బిరుదు గాంచెను రాధచరిత్ర మన వాఙ్మయములో జిత్రవిచిత్రరూపముల వర్ణింపబడినది. కవులలో జాలమంది యీామెను స్పష్టముగనో గూఢముగనో పరకీయ నాయికగా బ్రదర్శించియున్నారు. విష్ణుకథాసంకలితములైన పురాణాదులలో భాగవతము, విష్ణుపురాణము, హరి వంశములలో రాధపేరెచ్చటను లేదు. స్కాందపురాణములోను బ్రహ్మవైవర్త పురాణములోను నీస్మరణ గలదు స్కాందపురాణము కథనుబట్టి రాధ కృష్ణుని మనఃప్రీతి కొఱకు శతగోపుని కూతుగా బ్రహ్మచే సృష్టింపబడినది నేడు లోకములో వాడుకపడియున్న రాధామాధవ శృంగార సంబంధ మందు జెప్పలేదు బ్రహ్మవైవర్తపురాణములో ఊర్ధ్వలోకముల కన్నిటికిని పైన గోలోక మొకటి గలదనియు, నాలోకమున కధిదేవత కృష్ణుడనియు, రాధ శక్తిస్వరూపిణి యనియు నున్నది అట వారిరువురు (పురుషుడును ప్రకృతియు) దేవదేవేరులు. భరతవర్షము నందలి బృందావన గోలోకము దాని ప్రతిబింబము వారే వీరనుకొన్నను లోకములోని

గాథలనుబట్టి వీరికున్న సంబంధము వంటిది మాత్రము ఊర్ధ్వలోకమున వీరికి లేదు ఇట రాధ కృష్ణుని మేనయత్త. వలపుకత్తె. పరకీయనాయక

మఱి యీశృంగార గాథ కాధారమేది యని ప్రశ్నింపవచ్చును. దీనికి పునాది జయదేవుని యష్టపదులలో వేయబడినది అందు వైవాహిక సంబంధముగాక పరకీయ శృంగారము వర్ణింపబడినది

ఈ సంబంధమును బుధస్కరించుకొని రాధాకృష్ణ కావ్యములు తెనుగున జాల పుట్టెను. పరకీయ శృంగారాత్మకము లైనవి –

1 సముఖము వేంకటకృష్ణప్పనాయని 'శృంగార రాధామాధవము',

2. వెలిదండ్ల వేంకటపతి 'రాధామాధవ సంవాదము',

3 ముద్దుపళని 'రాధికాసాంత్వనము',

(పాండురంగమాహాత్మ్యములో స్కాందపురాణగాథనే కవి గైకొనెను)

ఎల్లనార్యుని రాధామాధవ మట్టిది గాదు ఇట రాధ కృష్ణునకు స్వయంవర లబ్ధమైన భార్య ఇది చాలవఱకు రుక్మిణీపరిణయమును బోలియుండును రాధ తండ్రి సహస్రగోపుడు. వినుకలి వలన గృష్ణునెడ బద్ధానురాగయైన కూతు నాతని కిచ్చి వివాహము సేయ తండ్రి నిశ్చయింప నట రుక్మి వలె నిచట భద్రుడను నామె సోదరుడు ప్రతిపక్ష మాచరించును. అట బ్రాహ్మణుడు నిట ముకుందిని యను చెలికత్తెయు రాయబారము నడుపుదురు స్వయంవరమున సరస్వతి పంపిన చిలుక రాజుల నెఱుకపఱుప రాధ కృష్ణుని కడకు పంపును నారదుడు శౌరి కడ రాధ గూర్చి పలుకుట, సరస్వతి రాయబారము దక్క మిగిలిన కథాభాగ మంతయు రుక్మిణీపరిణయము ప్రబంధ మొనరించిన నెట్లుండునో యట్లే యుండును

ఈ కవి విష్ణుమాయా నాటకమును రచించెను ఇట నాటకమన జగన్నాటక మనియే గాని రూపకవిశేషము గాదు. నారదాది యోగీంద్రులు సహితము విష్ణుమాయను దాటలేరని భీష్ముడు ధర్మజునకు జెప్పినట్లుగా పౌరాణిక పద్ధతిని జెప్పబడినది ఇది ప్రబంధము గాదు (ఇతని తుది రచనయై యుండును)

తారకబ్రహ్మరాజీయ మను శుద్ధవేదాంత గ్రంథము నొకదాని నీతడు రచించెను అచ్యుతదేవరాయల మంత్రి యగు నంజయతిమ్మరుసు కోర్కెపై యామంత్రి యిష్ట దైవమగు శ్రీరామవిభునకు గృతి యిచ్చెను అనగా నితడచ్యుతరాయల కాలమున గూడ నుండెను

ఇతనిది లక్షణోపేత మయిన ప్రౌఢకవిత్వమే గాని మనుచరిత్రాదులతో బోల్పదగిన నిర్మాణము గాదు.

## ఎడపాటి ఎఱ్ఱన

'శృంగారమల్హణచరిత్ర'ను రచించెను. రాయలకే కృతి నీయనెంచెను గాని సంకల్పసిద్ధుడు కాలేదు. తరువాత నింకొకరికిచ్చి యాముచ్చట తీర్చుకొనెను చుంటికాళయ్య అను మంత్రికి కృతి ఇచ్చెను.

మల్లణుడు శైవానుగ్రహపాత్రుడైన సంస్కృతకవి మల్లణ రచిత శివస్తోత్రములు కలవు పాల్కురికి సోమన పండితారాధ్యచరితమున మల్లణుని కథ గలదు శైవపారమ్యమును ప్రతిపాదించుటయే సోమన దృష్టి. ఆబాల్యవర్ధిత స్నేహము ప్రణయముగా, దాంపత్యముగా పరిణమించుటయం దెల్లన దృష్టి ఇందు ప్రణయము, శృంగారము, కథాంతమున శివసాయుజ్యము ప్రధాన విషయములు కావుననే శృంగారమల్లణ చరిత్ర మనుపేరు పెట్టెను

ఎల్లన యిందు శ్వేతోపాఖ్యాన మను చిన్న కథ నిమిడ్చెను. వేశ్యాసంపర్క మనర్థదాయకము కాదని నిరూపించుట దీని ప్రయోజనము ఇందు గొంత కామశాస్త్రప్రసంగము నడిపెను ఈ రెండును గథ కప్రస్తుతములు వీనిని బరిహరించిన బ్రధానేతివృత్తము సుందరమగు ప్రబంధ మగుటకు దగియున్నది ఇందీత డప్రస్తుతమును బరిహరింపను లేదు ప్రధానభాగమున బరిపోషింపనులేదు ఇందు గూర్పు తక్కువ. వెలితి యెక్కువ ఉపనాయకుడైన సెట్టి వర్ణనము హాస్యపూరితముగ నున్నది

## సంకుసాల నృసింహకవి

ఇతడు రాయల యాస్థానమున బ్రవేశింపవలెనని పాటుపడి ఫలింపక వెడలిపోయెనని పుక్కిటిపురాణములు గలవు ఈ కవి కవికర్ణరసాయనము అను ప్రబంధమును రచించెను గ్రంథమునకు కవితాగుణ సూచకమైన నామము పెట్టినవారిలో మొదటివాడితడే దీనిని మాంధాతృచరిత్రయని కూడ నందురు కవి యీగ్రంథమును శ్రీరంగేశ్వరుని కంకిత మిచ్చెను. గ్రంధావతారికలో రాజతిరస్కార పద్యములు చాల గలవు కుడిచి కూర్చుని నిష్కారణముగ దిరస్కారపద్యముల నేకవియు వ్రాయుట జరుగదు గాన రాజద్వారము నొద్ద నాతడు పొందిన యాశాభంగమే యీ తిరస్కారమునకు హేతువని యూహ గ్రంధస్థాధార మేదియు లేమి నిదియే రాజద్వారము యొద్దనో చెప్పజాలము

యవనాశ్వుని పుత్రుడగు మాంధాతృచరిత్ర మిందలి యితివృత్తము

మాంధాత తండ్రి యనంతరము సింహాసన మధిరోహించి, దిగ్విజయయాత్ర సలిపి, విమలాంగి యనెడి కుంతలపతి కుమార్తెను బెండ్లియాడి, సంసార భోగానుభవము వలన దనిసి, చిరకాలము తప మొనర్చి విష్ణుసాక్షాత్కారమును బొంది యాదేవుని యాజ్ఞచే నాయుశ్శేషము ప్రజాపాలనమందే గడిపి, తరించిన చక్రవర్తి ఇది కథ

తానైై కథ చాల చిన్నది. కాని కవి తన వర్ణనా చాతుర్యముచే నాఱాశ్వాసముల గ్రంథముగా బెంచి వ్రాసెను ఆ వర్ణనలలో గూడ శృంగారమున కాధారము లయిన జలక్రీడాది విలాసవర్ణనలు, ఋతువర్ణనలు కథ లేకనే మూడవ ఆశ్వాసము నిండియున్నవి నాల్గవ యాశ్వాసమించుమించు దాని పరిశిష్టభాగమే అందలి విటవిటీ, వారవనితాశృంగారకేళీ మధుపానక్రీడాదులు నన్నెచోడని కుమారసంభవ మందలి పార్వతీదేవి వివాహము నాటి రాత్రి వర్ణనలను దలపించుచున్నవి. ఇందయిదవ యాశ్వాసము రాజగురువగు వశిష్ఠుడు రాజునకు జేసిన బ్రహ్మవిద్యోపదేశము.

ఈ శతాబ్దిలో బుట్టిన ప్రబంధములలో విపుల శృంగారవర్ణనలు గలవి కొన్నియు, విపుల భక్తి వర్ణలు గలవి కొన్నియు గలవు కాని శృంగార వైరాగ్యముల రెంటి నింత విపులముగా బ్రపంచించి వ్రాసిన కవి యింకొకడు లేడు ఈ కావ్యమందలి పూర్వభాగము నాశ్రయించి శృంగారమును నుత్తర భాగము నాశ్రయించి వైరాగ్యము నున్నవి. మొదటిది రాగప్రవృత్తి మార్గమును రెండవది నివృత్తి మార్గమును, అనగా రక్తి విరక్తి పూర్వభాగమున కవి యొక్క రాగరంజితభావ మెంత తీక్ష్ణమో తెలియును ఉత్తరభాగమున నాభావమే యెంతో శాంతగంభీరముగా గోచరించును ఈ కవి చేతిలో నీగుణద్వయమునకు సమప్రాధాన్యము వచ్చినది దీనినిబట్టి కృత్యాదిని కవి చేసిన ప్రతిజ్ఞ సార్థకమైన దనవచ్చును.

యతి విటుడుగాకపోవు టెట్లస్మదీయ
కావ్యశృంగారవర్ణనా కర్ణనమున
విటుడు యతి గాకపోవునే వెసమదీయ
కావ్యవైరాగ్యవర్ణనాకర్ణనమున

ఏ పద్యము వ్రాసినను పలుకుబడిలోను, నర్థములోన నేదోయొక క్రొత్తదనముండును చర్వితచర్వణ పద్ధతిని బోడును పూర్వకవుల ననుకరించుటలో నింత వెనుకాడిన కవి యింకొకడు కానరాదు ఎంతో ప్రయత్నముమీద నొకటి రెండుచోట్ల భోజరాజీయము, మొదలగువాని యనుకరణము గానవచ్చును శృంగారవర్ణనాపద్ధతి ప్రాతదయ్యును భావములు నూతనములు పద్ధతికి భావమునకు నూతనత్వ మాపాదించిన కవిపుంగవుడు పింగళి సూరనార్యుడు ఆకాలపు ప్రబంధకవులలో నితని శైలి కొక ప్రత్యేకత గలదు పురాణకవుల యర్థసౌలభ్యము ప్రబంధకవుల శబ్దజటిలత, రీతిప్రాధాన్యము, నీరెంటి కలియక యితని శైలిలో గోచరించును దీనికి దగినట్లే కావ్యవస్తువులో నీరెండు గుణములు నిమిడియున్నవి ఈ కావ్యపరనము వలన బురాణ పరనము వలన గలుగు నివృత్తియు, కావ్యపరనము వలన గలుగు రక్తియు రెండును గలుగును కావ్యమున కథ తక్కువ వర్ణన లధికమునను లోపము దక్క నితర లోపము లేవియులేవు

## రాయల యుగమున దరువాతి తరమువారు (1550 తరువాత)

### పింగళి సూరన

వీరిలో మొదటివాడు పింగళి సూరన ఇతని కవిత్వప్రవృత్తి 1540–70 రాఘవపాండవీయము రచనాకాలము 1550. దీని కృతిపతి అకువీటి పెదవెంకటాద్రి ఈ కృతిపతి తాత రాయల సమకాలికుడు, పూర్వ దిగ్విజయ యాత్రలోఁ బాల్గొనినవాడు. కళాపూర్ణోదయ రచనాకాలము 1560. రాఘవపాండవీయమునకుఁ బూర్వము గారుడపురాణము వ్రాసెను కళాపూర్ణోదయమునకుఁ బరమున ప్రభావతీప్రద్యుమ్నము రచించెను. ఈ పూర్వాపరములకు నొక్కొక్క దశ కలిపినచో సూరన కవిత్వజీవితము 1540–70 యని తెలియును

ఆంధ్రకవులలో నిరుపమాన ప్రతిభాసాకల్యముగల కవి తిక్కనసోమయాజి ఆయన యొక యుగనిర్మాత. ఒక ధర్మగురువు ఒక శిల్పాచార్యుడు ఈ త్రివిధాత్మక శక్తియే యాయన ప్రతిభాసాకల్యమునకు దార్ష్టాణ. ఇందు మొదటిదానిలో శ్రీనాథుడును, రెండవదానిలోఁ బోతనయు, మూఁడవదానిలో సూరనయుఁ దిక్కనకు ద్వితీయులు. శిల్పచాతురిలో శారదాదేవి దిద్దిన సూరనదే పైచేయి యనిపించు లక్షణములు క్వాచిత్కముగ సూరన కవిత్వమున గలవు. ఇందుకు గారణము భారత మనువాదమును కళాపూర్ణోదయము స్వతంత్రము నగుటయే.

**రాఘవపాండవీయము:** మనకుపలభ్యమగు వానిలో రాఘవపాండవీయము మొద టిది. గారుడపురుణముఁ గానరాదు. వాఙ్మయములో నక్కడక్కడ సకృత్తుగా రెండర్థములు వచ్చు శ్లేష రచనలు నన్నెచోడ, శ్రీనాథ, నాచన, సోమనల రచనలలో గానిపించును.

శ్లేష, ద్వ్యర్థికావ్యములకు భేదమున్నది ఏపద్యమున కాపద్యమే రెండు, రెండు ప్రత్యేకార్థములు గల పద్యముల కూర్పు గల గ్రంథము శ్లేషకావ్యము వసుచరిత్ర శ్లేషకావ్యమున కుదాహరణము. కాని యాసాంతము నియతమగు రెండర్థములే గల కావ్యము ద్వ్యర్థికావ్యము.

ఆ జాతి రచనకీ రాఘవపాండవీయము పరిణామరూపము ఈ తరువాత వెలసిన ద్వ్యర్థి త్ర్యర్థికావ్యములన్నియు నీ మాతృస్తన్యమును గ్రోలిన పిల్లలే. రాయల యనంతరము గవిత్వముకన్న బాండిత్యము నధికముగ నెన్నెడివారు. శబ్దముతోను, అర్థముతోను, ఎంత సాముచేసిననంత యాధిక్యము లాభించెడి రోజులవి ఆ కాలప్రభావము సూరనమీదఁ గూడఁ గలిగినది కాని యాతని కవితాలక్ష్యము వేఱు నూతన సృష్టి కావలెనని యితని తలంపు లోకములో నుత్తమ పండితుడనిపించుకొనిన పిదపనే స్వేచ్ఛావిహార మొనరింపవచ్చునని తన పాండిత్యమునకు నికషోపలముగా రాఘవపాండవీయము రచించెను శ్లేష కావ్యమున కిది ప్రథమసృష్టి యగుటచే దీని యగ్రత్వము నాటికి నేటికి నట్లే నిలచియున్నది. వేములవాడ భీమన రచన చూచినవారు లేరు. సూరనకుఁ గూడ దానిపేరే తెలియును. ఇతనికి మార్గదర్శకముఁ గాదగిన సంస్కృత కావ్యమైన నిట్టిది లేదు ఇటీవల కృష్ణకవి రచించిన రాఘవపాండవీయమను సంస్కృత ద్వ్యర్థికావ్యము దొఱికినది. దీనికిని దెనుగు గ్రంథమునకు నొక యక్షరమైనను జన్యజనకభావము లేదు. ఇంతకు నీసంస్కృత రాఘవపాండవీయము ప్రసిద్ధముగాదు సూరన దీని నెఱింగియే యుండడు. రెండర్థముల సంపాదన సంస్కృతకవికి సుకరమే గాని తెనుగు కవికి దుష్కరము ఆమాటయే 'అందునున్ దెనుగు కబ్బం బద్భుతంబంద్రు' అన్నచోట సూరన సూత్రించెను. ఈ దుష్కరకార్యమును సాధించుట కాయన స్వతంత్రముగా గొంత లక్షణము గల్పించుకొనెను. అర్వాచీనుల కందరికి నది యనుకరణ యోగ్యమును సూత్రసంపుటియు నయినది. కాని యితర కవి యెవడును రాఘవపాండవీయము నర్థసౌలభ్యమును సంపాదింపలేదు శ్లేషకావ్యములలో సులభమైనది లేదు తెలుగు పదములలో శ్లేషను కల్పించుటలో ఈతడద్వితీయుడు.

**కళాపూర్ణోదయము:** రాఘవపాండవీయమునుఁ దన కాలమునకు బద్ధుడైన కవి కళాపూర్ణోదయమున దన కాలమునకేకాక నాలుగైదు శతాబ్దుల కుత్తర కాలమునకు పురోగమించెను ఇట్టి కవుల కావ్యములను సమకాలికులైనవారు మన్నింపజాలరు. కావుననే యానాటి వాఙ్మయలోకమున నిది మహాసంచలనము గలిగించినది రామ రాజభూషణుని వంటి యుపజ్ఞాశాలియే దీనిని గృత్రిమరత్నమనెను హీనకులజాత యగు కలభాషిణి నాయికయేమని కొందఱు తిరస్కరించిరి అవక్రమగు పోకడలేని యాకల్పనచే గథకు బ్రసన్నతలేదని కొందఱు చిడిముడి పడిరి నాయిక వశమైన యీ శృంగార వర్ణనము శాస్త్రవిరుద్ధముగా నుండి యాలంకారిక సరణిని గోల్పోయినదని కొందఱాక్షేపించిరి ఇట్లే యందఱి యొక్కొక్క భావమునొక్కొక్క విధముగా దుర్గ్రాహ్యతకతన నెందఱో గేలిసేసి యుందురు అరసికులైనవారు నేడు గూడ నీకావ్యము నావిధముగా నాక్షేపించుచునే యున్నారు

అధిక్షేపణీయమైన యీ వక్రమార్గమునేల సూరన అవలంబించెను

కావ్యము ధర్మార్థకామములను త్రివర్గపురుషార్థప్రదము కవి యిందు బ్రతిపాదింప దలచినది తార్తీయపురుషార్థసిద్ధి. విశ్వలీల కాదికారణమైనది ప్రణయము కవి యిందు బ్రదర్శించినది ప్రణయదేవతా విశ్వరూపము అధికారి తారతమ్యమున నీ ప్రణయ మెన్నివిధముల వర్తించునో యెట్టి రూపాంతరములను బొందునో యని జీవితపరిశీలనము చేసి తాసాక్షాత్కరింపజేసికొనిన యా ప్రణయదేవతావిన్యాసములకు కవి రూపకల్పన మొసంగెను. అదియే బ్రహ్మసృష్టి కర్థము చెప్పుట కళాపూర్ణోదయమనగా ప్రణయదేవతా విశ్వరూప ప్రదర్శన మన్నమాట తార్తీయ పురుషార్థ రహస్యమును శిల్పరూపమున కవి వ్యక్తము చేసెను పురాణేతిహాసములలోని యేయుపాఖ్యానమును ఈ ప్రయోజనమునకక్కఱకు రాదు. అందుచే గవి తనప్రపంచమును తానే సృష్టించుకొనెను అయ్యది కల్పితమయ్యు సత్యదూరము గాదు. కనుక కృత్రిమత్వము లేదు. అనగా బ్రహ్మసృష్టికి శిల్పసృష్టిచే రూపాంతరము గల్పించెను

1. కవిదృష్ట్యా శీలసంపత్తియేగాని కులీనత మాత్రమే యుత్తమత్వమునకు గారణము గాదు. రెండునున్న మేల్తరము. లేనిచో శీలమునకే ప్రాధాన్యము కవి చెప్పబోవు స్థానద్వయపతితమగు ప్రణయమునకు గులీనత గల నాయిక యాలంబనము కాజాలదు ఇందు నాయిక యేరాకుమారియో కులస్త్రీయోయైనచో నౌచిత్యమునకు భంగము గలుగును. ఇట మానసిక వ్యభిచారము ప్రత్యక్షము ఇక రాజులు, రాజులనుభవించు శృంగారము యథార్థమయిన ప్రణయము గాదు అది కృత్రిమ ప్రేమ అందు గామమునకున్న స్థానము ప్రణయమునకు లేదు ఇట కలభాషిణి చరిత్రమన్ననో ప్రణయపూర్వకము కవి చెప్పదలచినది ప్రణయదేవతా రహస్యము. (పురాణములు ధర్మపరముగా కథ చెప్పెను )

2. కావ్యకల్పనామహత్వము కథ వక్రముగా నడచుటలోనే గలదు మూలబీజము సరస్వతీబ్రహ్మలప్రణయకలహము అది యీ కథాబంధమున గర్భస్థానము నాక్రమించినది. మానవశరీరమునకు భారకేంద్రము (centre of gravity) నాభి స్థానము ఈ కథకా ప్రకృతిపురుషుల ప్రణయకథ యట్టిది పూర్వోత్తరము లయిన యాశ్వాసము లన్నియు నా శరీరము నితరావయవములు. 'కావ్యారంభ

మొకచోటను కథారంభ మింకొకచోట' నుండుట వలన కథకు మంచి సొగసు వచ్చినది. ఇందలి ప్రతి వృత్తాంతమునకు గార్యకారణ సంబంధము నిబిడీకృతమయి యున్నది దీనివలన బరితలకుత్కంఠ హెచ్చును ఆద్యంతము తెలుంగునంతవఱకు బారకులను వశపఱుచుకొని తచ్చిత్తవృత్తులను విధేయము చేయగలిగినదీ ప్రణాళిక ఉత్తర కథాభాగము నెక్కడ నూహింప నవకాశము లేకుండ 'ఇతిశ్రీ' అను వఱకు చదువు శ్రద్ధను గల్గించెను ఆదిమ దంపతులైన సరస్వతీబ్రహ్మల ప్రణయకలహముతో నారంభించినచో నీ నిబిడబంధము శిధిల మగును. ఉత్కంఠ తగ్గును ఇక ప్రతిపాదిత విషయము లెల్ల నాతని యుపజ్ఞాజన్యములే పాత్రసృష్టి కథారంభము తదనుగుణములే

కళాపూర్ణోదయము నంద్యాల కృష్ణభూవిభున కంకిత మీయబడినది ఇంతచే సియు లోకమీకథను కేవల కల్పనాకథయనుచున్నదను కించచే నలుగురితో పాటు పురాణాంతర్గతమగు కథ నెత్తి ప్రభావతీప్రద్యుమ్నమును రచించెను.

ప్రభావతీ ప్రద్యుమ్నము: ఈ ప్రబంధమును తన తండ్రికి అంకిత మొసగెను ఇది సంస్కృత హరివంశమున వజ్రనాభవధ యను దానిలో నున్నది పురాణ కర్తకు కథ చెప్పుటయందే తృప్తి ఇతనికి వివాహసమయపు శృంగారమును వర్ణించుట యందు రక్తి.

ప్రభావతీప్రద్యుమ్నకథను రవివర్మభూపుడను మళయాళరాజు నాటకముగా రచించెను దానిపేరు ప్రద్యుమ్నాభ్యుదయము ఈ నాటకకవి వజ్రనాభునివధ యను పౌరాణికకథలో రెండు మార్పు లొనరించెను

1. నాయికానాయకుల మధ్య దౌత్యమును శుచిముఖి నుండి తొలగించి భద్రనటుని మీద బెట్టెను. పక్షి రంగప్రవేశార్హము గాకపోవుటయే కారణము

2. ప్రభావతి కనురాగబీజము నాటుటకు బ్రద్యుమ్నుని చిత్రపటము నొకదానిని గల్పించెను ఇది మూలమున లేదు నాటకమున నీచిత్రపటమును భద్రుడు చిత్రించినట్లు వ్రాసెను సూరన పార్వతి చిత్రించినట్లు మార్చెను ఆ చిత్రపటమునకు బ్రామాణికత్వము నాపాదించుటకు బార్వతి యాజ్ఞ యనుల్లంఘనీయమనుటకు నీ మార్పొనరించెను విధియు నట్లున్నది భద్రుడే చిత్రపటము నిచ్చియున్నచో ప్రభావతి తన తండ్రికి గర్భశత్రువగు కృష్ణుని కుమారుని వలచి తండ్రి చావునకు దానే కారణ మగుటకు వెనుకాడియుండును.

భద్రనటుని దౌత్యము రంగోపయోగమయ్యు సందర్భశుద్ధిని గోల్పోయెను నటుడు తేలికమానసి ఆడిపాడి జీవించువాడు వీని ముఖమున కథలో నడుపవలసిన కార్యము రాజ్యములు తల్లక్రిందుల చేయు దేవరహస్యము కృష్ణుని వంటి రాజనీతిదురంధరుడీ కార్యము నొక నటుని ముఖమున నడిపించెననుట యనాలోచితకార్యమగును. ఇది కథాభంగమేగాక పాత్రభంగము గూడ నగును అదియునుగాక నాయికకు బ్రణయదోహదము చేయుట కభ్యంతర గతులైన చెలికత్తెలేకాని పరపురుషులు పనికిరారు సూరన శుచిముఖిని శుచిముఖిగానే యుంచెను అన్ని పురాణగాథల వలెనే హరివంశమున నీకథ యసంగతములైన యంశములతో గూడియున్నది దానికి సుసంగతత్వము చేకూర్చుటలో సూరనార్యు డొనర్చిన కథాసంస్కారము ప్రశంసనీయము

1 వజ్రనాభుని వధకు ప్రభావతి పరిణయమునకు మూలమునలేని కార్యకారణ సంబంధమును గల్పించెను కేవల మవినాభావ సంబంధము సమకూర్చెను

2. మూలమున గదసాంబుల వివాహములు హరాత్సంభవములేగాని పూర్వ రాగరంజితములు గావు. ప్రబంధములో నీవివాహములు గూడ మొదటినుండియు రాయబారముల మీద నడచినవి ఈ రాయబారము చిలుక వశాన నడచును వీరి భార్యలు వజ్రనాభుని తమ్ముని పుత్రికలు అక్క పెండ్లికి అంచ, చెల్లెండ్ర పెండ్లికి చిలుక రాయబారులు

కల్పన జేసి గదసాంబుల వివాహమునకు పూర్వరంగము గల్పించుటయేకాక, రెండుముఖముల ప్రవహించుచున్న రెండు శృంగారవాహినులను, ఏకత్ర సంగమింపజేసి, యాఘట్టములను ప్రబంధమునకు దీర్ఘభూతము చేసెను.

తుదకు వివాహములు శుచిముఖి చేతిమీదుగా నగును ఈ ఘట్టమీ కథలో గర్భసంధిని (climax) ముట్టును ఇది కథా సంస్కారము

సూరనార్యుని నైపుణి యింతకంటె నధికముగా శుచిముఖి పాత్రచిత్రణమున గోచరించును నిజమునకీ శుచిముఖి పాత్రనిర్మాణమునకే యీ కథాశరీరమూహిం పబడినట్లు తోచును కలభాషిణి సృష్టికొఱకే కళాపూర్ణోదయ కథ నూహించి యుండును. మూలము నందలి హంసకు నిందలి శుచిముఖి యనుపెరున్నదే గాని తక్కిన యేప్రౌఢగుణ విశేషములును లేవు. మూలమున నిది ఇంద్రోపేంద్రులకు విధేయమైన పక్షి మాత్రము ఇట నింద్రోపేంద్రులకు గర్తవ్యము నుపదేశించిన గురువు, కార్యము నిర్వహించిన మంత్రియు నా రాజహంసి దాని వైదుష్యము, పలుకు పొంకము, ప్రౌఢవర్తనము, నాగరవృత్తము, రాజనీతి, ప్రణయసంఘటనము, సమస్తము సూరనూర్యుని సృష్టి. భారతమున శ్రీకృష్ణుని పాత్రతో దిక్కన తాదాత్మ్యము నొందినటులే సూరన శుచిముఖి పాత్రతో తాదాత్మ్యము నొందెను

ప్రభావతీప్రద్యుమ్నమును కొంచెము మార్పులతో నాటకముగా నంక విభజనముతో గూడ జేయవచ్చును అనగా కథాసన్నివేశములు, శైలి నాటకీయములు. కథాసంవిధా నమున కళాపూర్ణోదయమున కిది యీడుగాకున్నను సంవాదశైలిలో కథ నడుపుట యందిది మిన్న 'పొసగ ముత్తైపుసరుల్' అను పద్యమును 'శబ్దసంస్కార మెచ్చట' అను పద్యమును బోల్చి చూచిన ప్రభావతీప్రద్యుమ్నము నందు గవి శైలీపరాయణత్వము కుదిరెనని చెప్పవచ్చును కాని పాత్రనిర్మాణము అని తడవి చూచినచో శుచిముఖి పాత్రవినా సజీవమయిన పాత్ర లిందు లేనేలేవు కళాపూర్ణోదయమున బాత్ర లన్నియు సజీవములే.

సూరనార్యునికి శృంగారరసాధిదేవత నర్తకి వలె బహురూపముల సాక్షాత్కరించెను. ఆ వివిధరూపముల వ్యక్తీకరణమే కళా పూర్ణోదయము నందలి వివిధ గాథలు ఇందలి శృంగార గాథ లొకదానితో నొకటి పోలియుండవు. శృంగార మనునది సమస్త ప్రాణులలోను బ్రహ్మలోకము నుండి రాక్షసలోకము వఱకు వ్యాపించి యుండును సత్యలోకమునుండి క్రమముగా దేవమానవరాక్షసలోకముల కవతరించుటలో మాత్రాభేదముచేత పవిత్రతను గోల్పోవును. సత్యలోకమున శృంగారమున కిచ్ఛామాత్రముననే సిద్ధి గలుగును. దీని కుదాహరణము సరస్వతీబ్రహ్మల ప్రణయము దేవగంధర్వవిద్యాధరాది దివ్యలోకముల

శృంగారమునకు సౌందర్యము కళాలౌల్యము ప్రధానము. రంభానలకూబరుల ప్రణయము సౌందర్యప్రధానము. మానవలోకమున శృంగారమునకు దాంపత్యపాతివ్రత్యములనే సిద్ధి. మానవలోకమునను కళాభినివేశముగల వ్యక్తుల శృంగారము ధర్మప్రాధాన్యమును గోల్పోయి దేవగంధర్వ లోకముల శృంగారమును బోలియుండును కలభాషిణీప్రణయము దీనికి నిదర్శనము రాక్షసలోకమున 'నీశృంగారము తుచ్ఛకామపరము ఇష్టసిద్ధికి బలాత్కారమునకు గూడ సిద్ధపడుదురు శల్యాసురుని వశమైన శృంగార మిట్టిది అనగా శృంగారదేవత యధికార తారతమ్యమునుబట్టి మూర్త్యంతరములను దాల్చును

1. బ్రహ్మసృష్టికర్త యని పురాణ ప్రసిద్ధి. ఈ సృష్టివ్యాపారమునకు రూపకల్పనము కళాదృష్టితో నొనర్చి బ్రహ్మ సృష్టి నెట్లొనర్చునో సరస్వతీచతుర్ముఖుల ప్రణయమున కవి చెప్పెను సరస్వతి ప్రకృతి బ్రహ్మ పురుషుడు ఆ ప్రకృతి తన విలాసవిభ్రమములచే నాపురుషుని రాగరంజితచిత్తుని చేయును. ఆ యవస్థలో నాతడు ప్రపంచసృష్టి కున్ముఖు డగును అయన నోటివెంటననినది యధార్థమయ్యెను ఇదియే యిచ్ఛామాత్ర ప్రణయము

2 కలభాషిణీమణికంధరుల ప్రణయకథలో నాయికానాయకు లిరువురు గానకళా విద్యార్థులు. సహాధ్యాయనసహవాసము నాటి స్నేహము, కాలక్రమమున ప్రేమగా, ననురాగముగా బరిణమించి ప్రణయసాయుజ్యమున సిద్ధి పొందెను అనాటి స్నేహ మవ్యాజము నిశితము నైన నద్దానికి దాంపత్యమున దక్క నన్యథాసిద్ధి లేదు ఒకవేళ నాప్రేమనే గురుజన భయముననో లోకభీతినో యణచుకొన్నను ద్విగుణీకృతవేగముతో జన్మాంతరమున నైన ఫలించితీరును

3. సుగాత్రి పరమపతివ్రత. శాలీను డతిధార్మికుడు మానవలోకమున నతి పవిత్రమైన శృంగారము వీరిది సహజ సౌందర్యమునకు సాధుచిత్తమునకు బింబప్రతిబింబ న్యాయమున్నదని కవి యిందు జూపెను. ఆ ధార్మికుని చిత్తవృత్తి సహజసౌందర్యమునేగాని కృత్రిమాలంకారమును గ్రహింపలేకపోయెను. సాంసారిక దాంపత్యమట్టి చిత్తవృత్తిని సౌందర్యమును మాత్ర మపేక్షించును పాశ్చాత్యశాస్త్రజ్ఞుడొకడు (principal of fetish) (తన కన్ను పెట్టి చూచుట) అను ప్రణయ సిద్ధాంతమును జెప్పెను. దీనివలన లోకములో సామాన్యముగా సంభవించుచున్న దాంపత్యవైముఖ్యములు, సాముఖ్యములు, వ్యాఖ్యానింప వచ్చును. సౌందర్య మందటికండ్ల కొకేరీతిని గానరాదు అతిలోక సౌందర్యమూర్తి యొకటి యెదిరి చిత్తము నాకర్షింపలేకపోవచ్చును కాని యవస్థాంతర మున గలుగు రేఖావిపరిణామముచే నాసౌందర్యమే యాచిత్తమునే యాకర్షించుటకు నింద్రజాలము వలె జగన్మోహనాకారమై నిలచును ఆ నూత్నరేఖ తొలగి తొల్లింటి రూపమే తిరుగ ధరించిన యధాస్థానపతిత మగును. సౌందర్య మవస్థాసాపేక్షము కేవలత్వము లేదు.

4 శల్యాసురినిది రాక్షస శృంగారము ఇది యాసురమైన కామము మాత్రమే గాదు. క్రౌర్యసహితము ఆ క్రౌర్యమవివేకముతో గూడియుండి వాని నాశనహేతు వగును

సూరనార్యుడు ప్రతిపాదించిన శృంగారము విషాదరేఖాశబలితము ప్రణయమూర్తి యగు కలభాషణి మృగేంద్రవాహనాలయమున గత్తి కెరయగుట, వలపు ఫలింపనున్నవేళ

మణికంధరుడు శాపదగ్ధుడగుట, పవిత్రప్రేమ గోష్టిలో నున్న సుగాత్రీశాలీనులు హఠాత్తుగా ప్రాదమున బడుట చూడ నీవిషాదము కేవల దుఃఖాత్మకమే గాదు అద్భుతాపాదితము గూడను శృంగార మనునది యిన్ని కష్టములనుభవించిన పిదపనేకాని చూపుమాత్రాన, మాటమాత్రాన ఫలించునది గాదని కవి యభిప్రాయము

**సృష్టించినగాథలనుబట్టి సూరనపాత్రనిర్మాణపద్ధతి:** ఇతని పాత్ర చిత్రణ పద్ధతి నాటక కవులవలె బరోక్షపద్ధతియే గాని యాఖ్యాయిక కవుల వలె బ్రత్యక్షపద్ధతి గాదు నాటకీయ పాత్రచిత్రణమునకు సిద్ధి కళాపూర్ణోదయముననే లభించినది మనోధర్మవేతృతలేని వారికి పాత్రల చిత్తవృత్తులగమ్యములుగ దోచును

*1. మణికంధరుని వలచినట్లు తోచిన కలభాషిణి నలకూబరుని పొందు గోరు టెట్లు?*

ఇది తెలిసికొనుటకతిసూక్ష్మమగు నొకప్రణయధర్మము నెరుంగవలెను కామ్యవస్తువు దుర్లభమైనపుడు తదాభాస మయినను నాత్మకు గొంత తృప్తి నొసగును ఇది ప్రణయప్రకృతి ధర్మము. ఆభాసమన ఛాయ కాని యిట వ్యభిచారమను దోషమున్నది కలభాషిణి మనస్సు వ్యభిచరించినను దేహము చేయలేదనుట కామె కాపొందు కవి మణికంధరునితోనే కూర్చెను. ఇంతకు నామె మణికంధరునేగాని నలకూబరుని వరింపలేదు ఈ మానసిక వ్యభిచారము శారీరకము గూడ నైన దూష్యమగునని యాపొందు మణికంధరునితోనే కల్పించి కవి యామెను రక్షించెను ఆమె మానసిక వ్యభిచారము కేవలము దూష్యము కాదనుట కామెను వేశ్యకులసంజాతనుగా నొనర్చెను కలభాషిణి శీలమునకీ ఛాయాభిలాషయు హృదయదౌర్బల్యమును ప్రధానహేతువులు. మానవ లోకముననే గంధర్వజాతి శృంగారమును కవి వీరిరువురి ముఖముునను బ్రదర్శించెను

*2. సుముఖాసత్తియు మణిస్తంభుడును స్త్రీత్వ పురుషత్వముల మార్చుకొనుటకు హేతువేమి?*

అత్యంత బద్ధానురాగుడైన భర్త తమ దాంపత్యసుఖమున తనివితీరక తాస్త్రీత్వమును దాల్చి భార్య ప్రణయమును పొందగోరును రాధ యొకనాడతిగా సింగారించుకొని యారూపమున కృష్ణుని మనము చూరగొననెంచి తన అలంకృతినద్దమున చూడబోగా తన ప్రతిబింబమునకు మాఱుగా కృష్ణునిరూపమే చూచెనట చైతన్యస్వామి రాధ వేషముతో నృత్య మొనర్చెడివారట స్త్రీపురుషుల యైక్యము జీవేశ్వరుల యైక్యము వంటిది ఆ యైక్యావస్థలో స్త్రీత్వ పురుషత్వములు తారుమాఱగును భార్యాభర్తలొండొరులలో దమరూపముల చూడగలిగి యుండవలెను ఆ యవస్థనే తద్భావభావన యందురు. అట్టి యవస్థలో గలిగిన సంతానమే షోడశకళాపరిపూర్ణము. కావుననే కళాపూర్ణోదయము సంభవించినది

సూరనార్యుని పాత్రనిర్మాణ మిట్టి యతిగంభీరములు, దురూహ్యములు నయిన జీవితరహస్యములపై నాధారపడియున్నది.

తెనుగు ప్రబంధములలో నాయక ప్రధానములే గాని నాయికాప్రధానములు లేవు పాత్ర ప్రాధాన్యమునుబట్టి చూచిన కలభాషిణి, శుచిముఖియు బ్రధాన పాత్రలు శాస్త్రనుసారముగ నాయకు డొకడయిన గార్యానుసారముగా నాయకుడింకొక డగును నాయికా ప్రాధాన్యము లయిన ప్రబంధములలో నీ రెండును మేల్తరములు పురుషపాత్ర

చిత్రణము కంటె స్త్రీ పాత్రచిత్రణము దుష్కరము ఎంత వివేకవంతునికైనను దురవగాహానమైన వస్తువులో స్త్రీ చిత్తమొకటి పాత్రనిర్మాణము చిత్తవృత్తి నిదానముమీద నుండును గాని పైపై కార్యములనుబట్టి కాదు ప్రణయ వర్తనమున స్త్రీకి గల గంభీరవర్తనము పురుషున కుండదు. అట్టి స్త్రీపాత్రలను దిద్దుటలో నీతడు కృతహస్తుడు. పురుషపాత్రలతో బోల్చి చూచిన స్త్రీపాత్రలే మేల్తరములు ఇతడు సృష్టించిన స్త్రీపాత్రములు రెండు రకములైనవి - ప్రేమమూర్తులు, ప్రజ్ఞామూర్తులు. స్త్రీని ప్రజ్ఞామూర్తిగా చిత్రించిన ప్రబంధములు లేవు ఇట్లు ద్వివిధములైన స్త్రీపాత్రల సృష్టించిన యితర కవి షేక్స్పియర్ ఒక్కడే

కళాపూర్ణోదయము ప్రేమమూర్తి యైన కలభాషిణి చరిత్ర. ప్రభావతీ ప్రద్యుమ్నము ప్రజ్ఞామూర్తి యైన శుచిముఖి చరిత్ర.

సూరన తన పాత్రల రూపస్వభావములను ప్రతియోగ సంఘటనలచే (The creation of contrast) నెక్కువ భాసమాన మొనరించును అట్లు భాసింపజేయుట యుత్తమ శిల్పధర్మము ఈ కావ్యద్వయమున నీ ప్రతియోగ సన్నివేశమే పెక్కుచోట్ల కావ్యశోభ నాపాదించెను కలభాషిణికి రంభకు, మణికంధరునకు నలకూబరునకు, నారదుతుంబురులకు, శుచిముఖీరాగవల్లరులకు యిుండొరులకు పందెము వైచి పరుగిడినట్లు కథ నడచును. రూపచిత్రణమునను, నీధర్మమును వదలలేదు వృద్ధసుముఖాసత్తి రూప మొక పద్యమున పునర్యౌవనప్రాప్తరూప మొక పద్యమున, మణిస్తంభునిచేత జిక్కి చకితయైన కలభాషిణి రూపొక పద్యమున, ఆతని చేయిజారి పూలసెజ్జపైపడి మరల ప్రత్యక్షమయిన రూప మొక పద్యమున, శయ్యాగృహమున భూషణాలంకృత యగు సుగాత్రిరూప మొక పద్యమున నిరస్తభూషయై పూదోటలో బనిచేయు నామె రూప మొక పద్యమున నిట్లు తన ప్రజ్ఞను తానే ఒరసి చూచుకొను సన్నివేశముల గల్పించుకొనెను

ఇంతటి కవిలో గూడ కాలవశమున దొర్లిన లోపములు గిలవు

1 గ్రంథాంత శృంగారవర్ణనము ప్రబంధసామాన్యముగ నున్నది (కళాపూర్ణ మధురలాలసలు;)

2 ప్రభావతిని గూర్చి చెప్పిన దీర్ఘవర్ణన సర్వప్రబంధసామాన్యమే ఈ వర్ణనము కవి శుచిముఖి నోట నుంచెను దానికి సరస్వతి ఉపమ ఉత్ప్రేక్ష అతిశయోక్తి కామధేను వని బిరుదు లిచ్చెను. అంతటి పాత్ర వర్ణించినచో నట్లే యుండును ప్రభావతీప్రద్యుమ్నమున 'ఏయర్థమున దగుల్కొన దివియక వెలిపోనిచ్చునె, బుధుడూహించి చేయు సుకవిత్వమ్ముల్', 'అచ్చపుబుద్ధికి లేదగమ్యముల్' అని చెప్పినవి తన ప్రజ్ఞలే

ఈ రెండు కావ్యము లాయన యీరెండు గుణముల ఫలములే

## రామరాజభూషణుడు

ఈకవి అళియరామరాజు కాలమునను తళ్లికోట యుద్ధానంతరము విజయనగర రాజ్యము పెనుగొండలో నున్న కాలమున తిరుమలరాయల ఆస్థానకవిగా నుండెను

వసుచరిత్ర పెనుగొండలోనున్నప్పుడు 1565–70లో వ్రాసెను ఈ ప్రబంధము తిరుమలరాయల కంకితము వసుచరిత్రకు మూలము భారతాదిపర్వములలోని యుపరిచర వసుచరిత్రము భారతమందలి యత్యల్పమగు నీకథను గైకొని కవి వర్ణనాంగములతో బెంచి మహాప్రబంధమొనర్చెను కవికర్ణరసాయనము గూడ నట్లు పెంచి వ్రాసినదే కాని యందలి వైరాగ్యభాగమును చెప్పునపుడు వేదాంతమంతయు శాస్త్రఫక్కినే కవి చెప్పెను అట్టి నీరసఘట్టములు వసుచరిత్రమున గానరావు సాధ్యమయినంత వఱకు వస్త్వైక్య సన్నివేశము నొనర్చెను ఏప్రకరణమును రసహీనము గాదు. కవి తనకు బూర్వప్రబంధములలో దోచిన లోపముల నెల్ల సంస్కరించి యొక యుత్కృష్ట ప్రబంధమును వ్రాయదలంచెను.

**కవి మూలకథను సంస్కరించినవిధము:**

1 భారతకథలో వసురాజు సమస్త భోగముల ననుభవించి తపస్సుచే నింద్రుని మెప్పించి తదనుగ్రహమునకుబాత్రుడై విమానమును గొనినట్లు గలదు ఆ యింద్రుని వరమున బుత్రులను బడయును. వృద్ధుడగు రాజు యువతీప్రణయమున కనర్హుడని యెంచి కవి తన శిల్పదృష్టితో నీభాగమును సంస్కరించి మూలవిషయమును బరిహరించెను.

2. కోలాహలనిరోధమును దప్పించినందుకు శుక్తిమతి తన కూతు గిరికను వసురాజునకు గాన్కగానర్పించినట్లు మూలమున గలదు ఉపాయనముగా గ్రహించిన కన్య శృంగారమున కాలంబనము గానేరదు. కాన కవివేఱొక కల్పనము చేసెను

ఈ మార్పు లేనిచో నీకథ యనౌచిత్యకళంకిత మయ్యెడిది కవి విద్యా సంస్కారముచే గొప్ప లక్షణవేత్త. రామరాజభూషణుడు స్వయముగ సరసభూపాలీయ మను అలంకారిక గ్రంథమును రచించెను సమస్తాలంకారిక సూత్రములకు లక్ష్యభూతములుగాదగిన వని వ్రాసిన పద్యములచే గ్రంగము చాల బెరిగెను దీనికి దోడు లోక మచ్చెరువు నొందదగిన యితని వర్ణనాచమత్కారమున మఱికొంత పెరిగెను. అనగా గథ కనావశ్యకమయిన పెంపధికముగానున్నదన్నమాట ఇది యాధునిక ప్రమాణములబట్టి యన్నమాటగాదు. పూర్వకాలముననే యొక సాహసికుడందలి 800 పద్యములలో 500 పద్యములను దొలగించి 300 పద్యములతో గథకు లోపములేకుండ సంక్షేపించి పిల్లవసుచరిత్ర యని పేరిడెను. ఆ భాగమునకు సాగసేమాత్రమును జెడలేదు. ఇందువలన లోకమునకు దేలిన విషయమేమన నద్భుతావహమైన వర్ణనలు చేయుటలో జూపిన తననైపుణేని కవి కథాప్రపంచమున జూపలేదు

వసుచరిత్రలో నున్న శిల్పమంతయు నేపథ్యమున కాపద్యమునే పరిశీలించినప్పుడు మాత్రమే తెలిసెడి కవిత్వమే గాని సాకల్యతగల శిల్పముగాదు అంతమాత్రమున నీగ్రంథమునకు గల ఖ్యాతి క్షీణింపదు. ఈ కవి గాయకుడు. సంగీతమునకు గవిత్వమునకు గల పొత్తు నీతడు గ్రహించినట్లే కవియు గ్రహింపలేదు ఇతడు సంగీతకళా రహస్యనిధి. ఇతని పద్యము లన్నియు లయగమకములుగలవై ప్రతి పాదమును కమ్మిచ్చు లాగిన కుందనపు తీగవలె సాగివచ్చునది. ఈ పద్యములు కీర్తనల వలెఁ బాడదగినవి. ఆ పాదము లన్నియు వెలితిలేని చిక్కని కూర్పు గలవి. ఇదిగాక యీ కవి గొప్ప విద్వాంసుడు. నానాశాస్త్ర నిష్ణాతమైన బుద్ధిశాలి కావ్యమంతట నా

బుద్ధిసంపద విన్యాసము నిబిడమైయుండును వ్యంగ్యము, శ్లేష, మొదలగు చిత్రకవిత్వ మప్రయత్నమని గోచరించును. పద్యరామణీయకము, ప్రౌఢసాహిత్యము, విజ్ఞానపటిమ గ్రంధమునకీ ఖ్యాతి నిచ్చును. ప్రౌఢకవు లనిపించుకొనదలచిన యర్వాచీనులు పెక్కురు దీని ననుసరించిరి.

వస్తుసన్నివేశములో బద్యరచనలో నీతడు పూర్వకవుల ననుకరించును అనుకరణ మెక్కువ. స్వాతంత్ర్యము తక్కువ. వస్తు సన్నివేశములో శాకుంతల యనుకరణములు చాల గలవు. రాజు లతాంతరితగాత్రుడై నాయిక శృంగారముచూచుట, తిరస్కరిణీ తిరస్కృతయై మంజువాణి రాజును జూచుట, మొదలైనవి పద్యరచనలో శ్రీనాధుని, పెద్దనను అనుకరించును. అనుకరణము కంటికి కానరాకుండ గప్పిపుచ్చుట కెంతో శ్రమపడును అనుకరించుచు వారినతిక్రమింపవలె నని యత్నించును కాని వారి పద్యములలోని సహజత, యితని యనుకరణశ్రమ స్పష్టముగా గనుపించుచునే యుండును. కధను నాటకీయముగ సూరనార్యుని వలె నడప యత్నించెను అందు వస్తుసన్నివేశమున గొంతవఱకు గృతార్థుడయ్యెను గాని ఆయన వలెఁ బాత్రనిర్మాణము చేయలేక పోయెను.

ఈ గ్రంధము సంస్కృత నైషధము వంటిది ఇందుండి మనకు లభించునది ప్రౌఢసాహిత్యసంపదయే కాని, భావించి ఆనందించగల పాత్ర నిర్మాణము లేదు

వరూధిని–ప్రవరాఖ్యుడు; కలభాషిణీ–మణికంధరుడు వలె గిరికావసురాజులు తలచినమాత్రాన మనకు సాక్షాత్కరించునట్టి సజీవ పాత్రములు గావు

శ్లేష యొక్క పరమ ప్రయోజనము చమత్కారము. కధలో రెండర్థముల యవసర మున్నచోటనే వాడిన గొంత ప్రయోజనముండును నైషధములో బంచనలీయ దేవతలను భారతీదేవి వర్ణించును ఇట రెండర్థముల యవసరము గలదు కావుననే శ్లేష యట సార్ధకము లేనిచోట సకృత్పఠితమైన గొంత చమత్కారముగా నుండును ఈ రెండు విధములు గాక శ్లేష యధిక ప్రయోగమయిన గావ్యమునకు గళంకము గలుగును. ఈ కవికి స్థానాస్థానములు, సమయాసమయములులేని శ్లేష రక్తియుండుట శోచనీయము. ఉచితము, సహజము, సుబోధము నైన శ్లేష శుక్తిమతీనదిని కోలాహల పర్వతము నిరోధించిన ఘట్టమున నున్నది నదికి స్త్రీత్వమును, బర్వతమునకు ధూర్తనాయకత్వము నాపాదించెను సంవాదమునకు, గధనమునకు బ్రబంధమున నాయువుపట్టే భాగమే. కాని యిది ప్రాసంగికవృత్తమే యగుట నాధికారికవ్రత్తము కంటె బ్రాసంగికమే మేల్తరమైన లోపమీ గ్రంధమున గలిగినది

వసుచరిత్రము చాల సాహిత్యభారము గల గ్రంధము కవిత్వసంపద కంటె బాండిత్యసంపద యధికము. ప్రబంధమనిన నింత ప్రౌఢసాహిత్య మనుపేరు పరివర్తనము దెచ్చినదీతడే. ఇతని ననుకరించి పిల్లవసుచరిత్రను వ్రాసినవారు నలుగురు గలరు

1. కనుపర్తి అబ్బయామాత్యుడు – పురూరవశ్చరిత్ర
2 అద్దంకి గంగాధరకవి – తపతీసంవరణము
3. అడిదము సూరకవి – కవిజనరంజనము
4 కూచిమంచి తిమ్మకవి – రసికజన మనోభిరామము

అద్దంకి గంగాధరకవి రామరాజభూషణుని సమకాలికుడు తక్కిన ముగ్గురు

క్షీణయుగపు కవులు ఇట్టివారియుపజ్ఞారహిత మయిన యనుకరణముల వలననే యీ యుగమునకు క్షీణయుగ మని పేరు వచ్చినది ఎంత యనుకరించినను వీరి కెవ్వరికి వసుచరిత్ర పద్యపు కూర్పు అబ్బినది కాదు అద్దంకి గంగాధరకవి తపతీసంవరణము వసుచరిత్ర కంటె ముందని భావరాజు కృష్ణారావు గారి వాదన ఈ రెండు కథలు భారతాదిపర్వముననే కలవు వీని పౌర్వాపర్యము లింకను తేలలేదు కవు లిరువురు సమకాలికులగుట నెవరి రచనము ముందో చెప్పజాలము

హరిశ్చంద్ర నలోపాఖ్యానము ద్వ్యర్థికావ్యము రాఘవపాండవీయమే దీనికి మార్గ దర్శకము. దానిలోని ధృతి దీనికి లేదు. అంత ప్రౌఢియు లేదు జోడించిన కావ్యముల జంటలలో రామాయణ భారతముల కున్న దూరము హరిశ్చంద్రనలోపాఖ్యానములకు లేకపోవుటయే యిందులకు గారణము. అంతదూర మున్నను సారస్యము చెడని జోడింపు సూరన చూపగల్గెను ఇట దగ్గరయైనను శ్లేషలో సుబోధకత లేకపోయినది. ఇట నూరుపద్యములు పైగా నుభయకథలకు నక్కఱకు వచ్చు సమాన వర్ణనలు గలవు. శేషించిన పద్యములు 125

నిజమునకు సూరనార్యునికి శ్లేష సహజముగాదు. ఇతనికే సహజము. ఎవరెన్ని ద్వ్యర్థి త్ర్యర్థికావ్యములు రచించినను వీరిరువురే ప్రథమ ద్వితీయులుగా నెన్నబడుచు న్నారు రామరాజభూషణుని వలె బద్యము వ్రాయగలవారు లేరు శాస్త్రజ్ఞానముచే దలబరువెక్కి యితనికి గవిత్వసౌకుమార్యము గొంత దూరమాయెను పాండిత్యము కవిత్వమున కాధారమే కాని పాండిత్యప్రదర్శనము కవిత్వము గానేరదు కవులలో నింతటి లాక్షణికుడు లేడు

## తెనాలి రామలింగడు

తెనాలి రామలింగని కాలనిర్ణయము చాలకష్టము రామలింగడు, రామకృష్ణుడు నను రెండుపేర్లు తెలుగుకవుల పేళ్లలో గలవు రామలింగడు ఉద్భటారాధ్య చరిత్ర కర్త; రామకృష్ణుడు పాండురంగమాహాత్మ్య కర్త ఉద్భటచరిత్రకర్త రాయల సమకాలికుడు. దీని కృతిపతి దేచమంత్రి అతడు కొండవీటిలో నాదెండ్ల గోపమంత్రి యొద్ద నొక యుద్యోగి. నాదెండ్ల గోపమంత్రి తిమ్మరుసు మేనల్లుడు కావున నీగ్రంథము రాయలనాటిదే.

పాండురంగమాహాత్మ్యము కృతిపతి విరూరివేదాద్రి అతడు కందాడై అప్ప లాచార్యులశిష్యుడు. అప్పలాచారి 1550 ప్రాంతము వాడని యనెడివారు. 1600 ప్రాంతమువాడని యిటీవల నిర్ధారణ చేయబడినది విజయనగర సింహాసనము పెనుగొండ నుండి చంద్రగిరికి మారినరోజులలో నుండె నందురు ఇదియే నిజమయిన నీ గ్రంథద్వయమ్మునకు సుమారు డెబ్బదిసంవత్సరములు వ్యవధానముండును కావున భిన్నతరముల బుట్టినవిగా నెంచవలెను అప్పలాచారి 1550 ప్రాంతమువాడే యైనచో నీ వ్యవధానము ముప్పదిసంవత్సరములుండును గాన నీ రెండు గ్రంథములు నొకే తరమునబుట్టినవేయనవచ్చును. అప్పలాచార్యులిరువురీ రెండుకాలముల నుండియుం దురు ఈ కావ్యద్వయము ఏకకర్తృక మని శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రిగారి వాదము. అందుకాయన చూపిన యుపపత్తులు

1 ఈ కవు లిరువురును గౌండిన్యస గోత్రులు శుక్లయజుర్వేదశాఖకు జెందినవారు ఇరువురి తల్లిదండ్రులును లక్ష్మమ్మ, రామయ్యలే. సాంసారికమైన యీ విషయములను బట్టి వీరిరువురు నన్నదమ్ములో లేక యభిన్నులో గావలెను

నామభేదమే గాక, వీరిరువురకు బిరుదుల భేదము కూడ కలదు కుమారభారతి బిరుదము రామలింగనిది 'శారద' బిరుదము రామకృష్ణునిది (శారద నీరూపు) శ్రీ ప్రభాకరశాస్త్రిగారీ విప్రతిపత్తి కిట్లు పరిహారమును చెప్పియున్నారు ఈ కవి మొదట శైవుడై యుండి తరువాత వైష్ణవుడై యుండును గాన నీనామముల మార్పు సంభవించి యుండును శైవుడైన రామలింగడు శివపారమ్యప్రబోధక మగు నుద్భటారాధ్యచరిత్రమును వ్రాసెను తరువాత వైష్ణవుడై రామకృష్ణుడను పేరుతో పాండురంగమాహాత్మ్యమును విష్ణుపారమ్యప్రతిపాదకముగా వ్రాసెను రామలింగని చిన్ననాటి కవిత్వము కుమారభారతి బిరుదము నిచ్చుచో తరువాతి రామకృష్ణుని ప్రౌఢ కవిత్వము 'శారద' బిరుదము నిచ్చి యుండును శైవుడైన రామలింగకవి మధ్య వైష్ణవమున రామకృష్ణు డయ్యెను ఆ రోజులలో వైష్ణవాచార్యుల ప్రచారమును బట్టియు వైష్ణవమతాభిమానులగు రాజుల యాదరణము కొఱకును మధ్యవైష్ణవమును స్వీకరించిన బ్రాహ్మణులు తండోపతండములుగా గలరు కావున నితడు శైవుడుగా నున్నప్పుడు శివపర మయిన గ్రంథమును దరువాత వైష్ణవుడై విష్ణుపరమైన గ్రంథమును వ్రాసెను

ఉత్తర గ్రంథమున బూర్వకృతి స్మరణయైనను లేదు అనాటి రచన, మతము కవి మతమున స్మరణయోగ్యములు కావేమో

2 తెనాలి రామభద్రుడను కవి 'ఇందుమతీ పరిణయము'ను గ్రంథమును రచించెను తన వంశానుక్రమణిక యందు దన పెదతాత రామకృష్ణకవి పాండురంగాది కృతుల రచించె ననియు, దన చినతాత, అన్నయ సుదక్షిణా పరిణయకర్త యనియు జెప్పెను రామలింగకవి వీరిరువురికి సోదరుడైన కావలెను లేదా రామకృష్ణునితో నభిన్నుడైనను కావలెను సోదరుడే యైనను నిరువురి తాతలను స్మరించిన రామభద్రుడు మూడవ తాతను, కవిగా బ్రసిద్ధి కెక్కిన వానిని విడువడు పాండురంగాది సత్కృతులు చేసిన రామకృష్ణుడని చెప్పుటలో నుద్భటారాధ్య చరిత్ర కర్తృత్వము గూడ నిమిడి యున్నది కావున రామలింగరామకృష్ణు లభిన్నులు.

3 ఈ రెండు గ్రంథముల కవిత్వమును బట్టియు నివి యేక కర్తృకములని చెప్పవచ్చును రెంటికి గల కాలవ్యవధానములో కవికి భావగతిలో శబ్దగతిలో పరిణతి గల్గెను రెండవ దెంత ప్రౌఢమో మొదటి దంత సుకుమారము ఆ ప్రౌఢి భావములోను, భాషలోను గూడ గలదు. మొదటిదానిలో భాష సుకుమారము భావము గంభీరమైనది గాదు లలితమధురములైన తెనుగు పదముల కూర్పు గలదు రెండవదానిలో సాంస్కృతిక జటిలత యధికము మొదటి దానిలో గుణమున బ్రసన్నతయు, రెండవదానిలో నీషత్ క్లిష్టతయు నేర్పడినది. మొదటి దానిలో మృదుత్వమంత పటుత్వము లేదు. రెండవదానిలో మార్దవమును జంపిన పటుత్వము గలదు.

కథౌచిత్యము, పాత్రచిత్రణము, భావసంపద రెండవదానిలో నధికము. రెండిట సమానేతివృత్తము గలదు మదాలసునిచరిత్ర, నిగమశర్మచరిత్ర ఈ రెంటిని బోల్చిన పైధర్మములు దార్ఢ్యాణ మగును ఈ పరిణామము మధ్యకాలమున వచ్చినది కవికి మధ్యకాలములో గలిగిన సంస్కృత విద్యాభ్యాస సంపద రెండవ గ్రంథ మందలి ప్రౌఢిమకు హేతువు. పాండురంగమాహాత్మ్యముతో బోల్చిన నుద్భటారాధ్యచరిత్ర మొకవిధముగ నప్రౌఢకావ్య మనిపించుకొనును.

ఇతడు ఘటికాచలమహాత్మ్య మను క్షేత్రమాహాత్మ్యమును కూడ రచించెను.

**పాండురంగమాహాత్మ్యము:** మహాప్రౌఢప్రబంధశైలిలో నడచిన క్షేత్రమాహాత్మ్యమిది ఇతఃపూర్వము మనము బరిశీలించియున్న క్షేత్రమహాత్మ్యము లందు దేనిలోను నిట్టి శైలి జటిలత లేదు కేవలము శైలిలోనేకాక, తక్కిన కావ్య గుణము లన్నిటిలోను నిది ప్రాబంధిక మార్గమునే యనుసరించియున్నది ఇందలి యుపాఖ్యానములు గూడ చక్కని చిన్ని ప్రబంధములవలె రచింపబడి యున్నవి– నిగమశర్మోపాఖ్యానము – ఈ గ్రంథ మందు మంచి పాత్రచిత్రణ మున్నది. కథౌచిత్యము, కథాలంకారమున కవసరమైన సముచితవర్ణనలునున్నవి. శబ్దార్థములకు చక్కని గుఱియున్న కవిత్వ మిది. రామకృష్ణుడు శుద్ధ దేశిపదములను, మూరుమూల సంస్కృత పదములను గూడ ఎరువు తెచ్చినట్లు లేకుండ చక్కగా నతుకగలడు కొన్నికొన్నిచోట్ల సాంస్కృతిక జటిలతయే యెక్కువేమో యనిపించెడి రచన యున్నది ఆయాచోటులం దర్థసౌలభ్యము కొంచెము తక్కువ. రామకృష్ణుని పేరుమీద నిలిచియున్న పాత్ర నిగుమశర్మ అక్క ప్రబంధకాలములో సృష్టింపబడిన ముఖ్యస్త్రీపాత్రలలో నీమెయొకతె. 'ఆడబడుచు'న కున్న గౌరవమంతయు రామకృష్ణుడా పాత్రలో జూపించినాడు. ఈ పాత్రనిర్మాణముత్తరకాలమున నిరంకుశోపాఖ్యానమున నిరంకుశునితల్లి పాత్రకు నొరవడి యయ్యెను. ఈ పాత్రమతని యుపజ్ఞా ఫలితము పెద్దన దిద్దిన ప్రవరుని పాత్ర వంటిది రెండును శ్రోత్రియ కుటుంబమునకు సంబంధించినవే

## చదలువాడ మల్లయ - విప్రనారాయణ చరిత్ర

'పరమయోగి విలాసము' అను పేరున తాళ్లపాకచిన్నన్న ఆళ్వారుల చరితమును ద్విపదలో రచించెను. దానిని అళియరామరాజు మేనల్లుడు తిమ్మభూపుడు 1560 ప్రాంతమున జంపువుగా మార్చెను. అదే కాలములో చదలువాడ మల్లయ యాళ్వారులలో నొకడగు విప్రనారాయణుని చరిత్రమును రచించెను సంస్కృతంబు నందలి ప్రసన్నామృత సారమో, ద్రవిడవాఙ్మయములోని పన్నిద్దఱాళ్వారుల చరిత్రమో చిన్నన్న ద్విపదయో దీనికి మూలము సమకాలికమగుట చంపువు మాత్రము గాదు.

## సారంగుతమ్మయ - వైజయంతీవిలాసము

1580 తరువాత సారంగుతమ్మయ్య దీనినే 'వైజయంతీ విలాసము'ని వ్రాసెను.

మల్లయ భక్తి ప్రధానముగా రచింప తమ్మయ్య శృంగార ప్రధానముగా రచించెను దేవదేవి యెంతో పాటుపడినగాని యా భక్తుని మనస్సుచూరగొన లేకపోయెనని,

వైరాగ్యనిష్టను మల్లయ చెప్పగా నాయాళ్వారుబేలయై తనంత తానే చలించినట్లు తమ్మయ్య చెప్పెను. మల్లయ రచనలో వేశ్యమాత హాస్యము మృదువైనది తమ్మయ్య రచనలో గటువుగా నున్నది.

తమ్మయ్య కవిత్వము సాపును సాధువు నైనది కథౌచిత్యము పాత్రౌచిత్యము మల్లయ రచనలో నధికము.

## కుమార ధూర్జటి

ఇతడు తళ్లికోట యుద్ధానంతరము వాడే కృష్ణరాయవిజయమును రచించెను. సారంగు తమ్మయ గూడ తళ్లికోటయుద్ధానంతరమువాడే రాయవాచక మని రాయల యాస్థానమున నున్న పాండ్యదేశపు స్థానాపతి యొక డొక వచన గ్రంథమును రచించెను దానిని మూలముగా గొని కుమార ధూర్జటి ప్రబంధ మొనర్చెను రాయల తండ్రి పరిపాలనము కొంతయు, రాయలు గజపతికూతురు తుక్కాదేవిని వివాహమాడు వఱకు (పూర్వ దిగ్విజయయాత్ర) చరిత్రాంశ మిందున్నది ఈ వివాహఘట్టము దక్క మిగిలిన దంతయు రాయల పూర్వదిగ్విజయ యాత్రకు సంబంధించిన చారిత్రాంశమే చరిత్ర కావ్యముగా రచింపబడినచో నందలి సూక్ష్మవివరములను గోల్పోయి స్థూల ప్రదర్శనముగాఁ దయారగును ఇది యట్లే యున్నది ఆపై చిలుక రాయబారము మొదలగు ప్రబంధోచిత విషయములు గలవు నాయిక శృంగారమునకు జిలుక వక్త. నాయక విహారాదికములు ప్రబంధోచితములు రాజకీయములైన యన్యదేశ్యపదముల నీతడే తొలిసారిగా గావ్యమున బ్రయోగించెను ఈ గ్రంథమున కవి ప్రతిభ లేదు. అంత ప్రౌఢమయిన కవిత్వమును లేదు కాని యిది యొకవిధముగా మొదటి చారిత్రక ప్రబంధము.

ఇంచుమించీకాలముననే 'అందుగుల వెంకయ్య' 'రామరాజీయమ'ని అళియ రామరాజు చరిత్ర వ్రాసెను.

తంజపురయుగమున విజయరాఘవుడు రఘునాధాభ్యుదయమని తన తండ్రి రఘునాధభూపాలుని చరిత్ర వ్రాసెను.

దిట్టకవి నారాయణకవి బొబ్బిలి యుద్ధమును రంగరాయచరిత మని వ్రాసెను

ముదిగొండ వీరభద్రకవి పల్నాటి వీరభారతము, ఆధునిక కాలమున రాజశేఖర శతావధాని 'రాణాప్రతాపచరిత్ర' వ్రాసెను గడియారము వేంకటశాస్త్రి శివభారత మనుపేర, శివాజీ చరిత్ర వ్రాసెను చరిత్రపదమగుట వేఱు. ప్రబంధమగుటవేఱు అచ్చుటచ్చుట స్థంభముల వలె గానవచ్చు చారిత్రక ప్రబంధము లివి.

చారిత్రాత్మక కావ్యకర్తలకు దమరచనలోఁ జాలక్లేశమున్నది. కేవల చరిత్ర కావ్యవస్తువుగానేరదు. కవితాకల్పన యుండవలెను. కావ్యత్వమునకై చేయు కల్పన చరిత్రభంజకము గావచ్చును. సౌందర్యము కొఱకు జేయునేకల్పనయైనను చరిత్రగ ఛిన్నమయినను చరిత్రసత్యమునకు మాత్రము దూరముగాగూడదు. చరిత్రకారుని వలె నిష్పాక్షికముగాఁ బ్రబంధకర్త వ్రాయలేడు. వ్రాసినచో నది కావ్యమే గాదు. కవి నాయకపక్ష మగును కావున నిట్టి కావ్యములు చరిత్ర సత్యనిరూపణార్థముపకరింపవు

ఆకువీటి చినవేంకటాద్రి కృష్ణరాయవిజయకృతిపతి రాజ్యము చంద్రగిరిలో నున్నప్పటి రచన యిది ఇతడు రాఘవపాండవీయ కృతిపతి పెదవేంకటాద్రికి దమ్ముడు. విజయనగరవినాశమును గూర్చి కించయేని యిందుగానరాకుంట నిది రాజ్యము చంద్రగిరికి రాకముందు బుట్టినదేమో యనిపించును.

## బట్టేపాటి తిరుమలయ్య

**ద్విపద భారతము:** ద్విపద భారతము 1550 ప్రాంతమున పుట్టెను. బట్టేపాటి తిరుమలయ్య సంకల్పించినవాడు. ఇతడు ద్రోణపర్వాంతము వఱకు వ్రాసెను. ఇందును సభాపర్వము బాలసరస్వతి వ్రాసెను. కర్ణపర్వము నుండి తుదవఱకు ఆత్మకూరి సోమన వ్రాసెను. తిమ్మన చాలసమర్థుడు. నిసర్గమయిన ద్విపద రచన సాగింపగలవాడు. సోమన యంత ప్రౌఢకవి గాకున్నను గ్రంథ పరిపూర్తి చేయగలవాడని తోచుచున్నది బాలసరస్వతి కేవల బాలకవి కవిత్రయభారతమునకు దండాన్వయ రూపమయిన ద్విపద వీరు రచించిరి వీరు చాలచోట్ల సంక్షేపించిరి అది పర్వములో దిమ్మన కథాప్రారంభమున చాల సందర్భములు వదలివేసెను ఉదంకుని సభాప్రవేశముతో భారతము ప్రారంభించును ఆ పూర్వగాథలు రేఖాచంక్రమాణముగా దీనితో బొత్తుకలుపబడినవే గాని, భారతకథతో బోరాని సంబంధము గలవి గావు అందుచే నితడా భాగములను విస్మరించెను. కద్రూవినతల కథలో నుచ్చైశ్రవజననమునకు హేతువైన క్షీరసాగరమథనము కథను చెప్పెను మూలమును సంక్షేపించుట, లేనివి కలుపుట యీతనియాచారము అరణ్యమున మఱియు స్వతంత్రుడై యందలి బహుళోపాఖ్యానములనెల్ల తొలగించెను. గ్రంథపరిసమాప్తికి బూనిన సోమన యాయుపాఖ్యానముల ద్విపదలో వ్రాసి యరణ్యపర్వమున జొప్పించెను. తిమ్మన భాగములో బాల్కూరికి సోమన ద్విపద లక్షణములు గోచరించును. ఛందోవ్యాకరణాది విషయముల నాతని మార్గములనే యనుసరించెను. కొన్నిచోట్ల శివస్తోత్రావసరమున నందలి పంక్తులనే యెక్కించెను. ద్విపద కావ్యమున కాదిగురువు సోమన యను భావ మానాటి కవు లందఱకు గలదన్నమాట.

**టేకుమళ్ల రంగశాయి:** ద్విపదభాగవత కర్త – 1775 ఇతడు బట్టేపాటి తిమ్మనను ఒక గురు స్థానముగా స్తోత్రము జేసినాడు.

## కందుకూరి రుద్రయ

రుద్రయ, పొన్నగంటి తెలగన్న, అద్దంకి గంగాధరకవియు నొకేదశలో కవిత్వము వ్రాసిన సమకాలికులు. వీరు ముష్వురకు దురక ప్రభువులు పోషకులైరి. అద్దంకి గంగాధరకవికి, కందుకూరు రుద్రకవికి గోల్కొండ నవాబు మల్కిభరాము భూదానముల నిచ్చెను. తెలగన్నకు ఇబ్రహీంకుబ్లాహియను సర్దారు (మల్కిభరాము) పోషకు డయ్యెను (1570–80 ప్రాంతము)

రుద్రయ 1580లో నిరంకుశోపాఖ్యానము రచించెను. ఇంతకుబూర్వము మనము చూచిన క్షేత్రమహాత్మ్యములు దుస్సాంగత్యము వలన జెడిన కులీనుడగు యువకుడు

క్షేత్రమాహాత్మ్యమున ముక్తి పొందెనని చెప్పను పతితునైనను భావన మొనర్చునని క్షేత్రమాహాత్మ్యమును గూర్చి చెప్పటయే తత్కర్తల యుద్దేశము క్షేత్రము లిట్లు పతితులను రక్షించుచున్న బ్రజలు దురాచారముల పాల్పడుదురు. ఇది యిందలి కృత్రిమము. ఈ లోపము నీతడు కనిపెట్టి యొక నూత్న ధర్మప్రతిపాదనము చేయదలచెను. తృతీయ పురుషార్థమునే యనన్యచిత్తుడై యాత్మధర్మముగా సేవించిన వానికి నూర్ధ్వలోకప్రాప్తి దుష్కరము గాదను నూత్న సిద్ధాంతము నీతడు ప్రతిపాదింప దలచెను గ్రంధావతారికలో నీ ప్రతిపాదనము గోచరించును ఈ ప్రతిపాదిత ధర్మము నీతడు సహజముగ బరిణమింపజేసెను. కాని తుదినాతడు గూడ గృత్రిమము దైవికమునైన కల్పనచేసెను. దేవతాప్రవేశము గర్హించినవాడే యిట్లొనర్చెను. ఇందీతడు ప్రతిపాదించినధర్మము సమ్యక్పరిష్కృతముగాని సమస్య యైనది తిరుపతి వేంకటకవుల పాణిగ్రహీత, శ్రవణానందము నిట్టివే కాని వీని యందు సహజ పరిణామము చేకూరినది దుష్టవిదులైన నాయకులు పశ్చాత్తప్తులై సన్మార్గ వర్తనులైరి ఆ పాపప్రక్షాళనమునకు క్షేత్రమాహాత్మ్యము దైవశక్తియు నవసరము లేదు తొలినాటి విశృంఖల విహారము తరువాతి యనుతాపము కారణ మగును ఇది యుత్తరోత్తరముగా మేలు. ఇవి యొకరీతి సాంఘికకథలు

నిగమశర్మోపాఖ్యానమున కిందలి పూర్వభాగము సోదరప్రాయముగ నుండును. నిగమశర్మభార్య మానవతి నిరంకుశుని భార్యకు దెగువతన మెక్కువ

నిరంకుశోపాఖ్యానము వ్రాయకున్నను రుద్రయకీర్తిని చిరస్థాయి చేయుట కాతని జనార్దనాష్టకముచాలును. అది యాధ్యాత్మిక భావకవిత్వము. ఖండితనాయిక విషయమునకు దగిన వృత్తముగా కాళిదాసు మేఘసందేశము నుండి మందాక్రాంతము నేరికొనెను ఇది తద్భావానుగుణమైన వృత్తము ఈ వృత్తానుగుణమైన భాషయు గలదు.

ప్రబంధకర్తలలో మొదటి యక్షగానకర్త యీతడే. సుగ్రీవపట్టాభిషేకమీతడు రచించిన యక్షగానము. ఇందతని గేయకవితానైపుణి ప్రస్ఫుటమగును ఇది యాకవి వైశిష్ట్యము. ఈ సుగ్రీవపట్టాభిషేకము (సుగ్రీవ విజయము) ప్రదర్శనయోగ్యము కూడను.

## పొన్నగంటి తెలగన్న

అచ్చతెనుగు కవులలో మొదటివాడు ఇతని కావ్యము యయాతిచరిత్ర క్వాచిత్కముగ నున్న శ్లేష పద్యముల జూచి సూరన ద్వ్యర్థి ప్రబంధమును వ్రాయగా నీతడు సకృత్తుగా గానవచ్చు నచ్చతెనుగు పద్యముల జూచి యచ్చ తెనుగు ప్రబంధమునే వ్రాయ సమకట్టెను సూరన యీశాఖలో బ్రథముడే గాక ప్రముఖుడు నయ్యెను తరువాత ద్వ్యర్థి త్ర్యర్థి కావ్యములు రాఘవ పాండవీయము ముందు వెలవెలబోయినట్లే యితని కర్వాచీను లయిన కవుల యచ్చతెనుగు కావ్యము లీతని రచనల ముందు వెలవెలబోయినవి. ఇతని తరువాత నున్న యచ్చతెనుగు కావ్యకర్తలలో కూచిమంచి తిమ్మకవి కొంత పేరు గాంచెను.

18వ శతాబ్ది యుత్తరార్థమున

| | |
|---|---|
| అడిదము బాలభాస్కరుడు | – శుద్ధాంధ్ర రామాయణము, |
| కూచిమంచి తిమ్మకవి | – అచ్చతెనుగు రామాయణము, నీలాసుందరి పరిణయము |
| అల్లమరాజు రామకృష్ణకవి | – భాగవతము |

19వ శతాబ్దిని –

| | |
|---|---|
| దాసు శ్రీరాములు పంతులు | – శాకుంతలము |
| తిరుమామిడి సీతారామశాస్త్రి | – కవ్వడి కైవారము (కిరాతార్జునీయము) |

20వ శతాబ్దిని

| | |
|---|---|
| కం. వీరేశలింగంపంతులు | – శుద్ధాంధ్ర నైషధము |
| అడవి శివకవి | – మేఘసందేశము రచించిరి |

అచ్చతెనుగు కావ్యమన నేమి?

వైయాకరణులు విభజనము ప్రకారము' తద్భవము వేఱు, అచ్చతెనుగు వేఱు తత్సమ తద్భవ దేశ్యమని తెనుగు ముత్తెఱుగులు దేశ్య మచ్చతెనుగు మూడును కలిసిన నాంధ్రము తత్సమ తద్భవములుకాని దాచ్ఛికము కాని యీ కవులు తత్సమేతర భాష నంతను ఆచ్ఛికముగా నెంచి అనగా తద్భవము నచ్చతెనుగుగా స్వీకరించిరి సంజ్ఞావాచకములకు దత్సమములనే వాడిరి కొందఱు వారికి వికృతరూపము లిచ్చిరి. (సుగ్రీవుడు మంచిమెడయెకిమీడు) ఇది కృత్రిమమే కాని స్వచ్ఛము గాదు తద్భవముల వీడి శుద్దదేశ్యమున గావ్యరచన సాగనే సాగదు అచ్చతెనుగు పదము లత్యంత పరిమితము. కవి యేదోపాటుపడి సాధించినను కావ్యమునకు శోభ యుండదు. దేశీయ పదగతమయిన మార్దవముతో బాటు తత్సమశబ్ద కటుత్వము గూడ సంపాదించుటనే ఆంధ్రమునకు శబ్దగుణసౌష్ఠవ మేర్పడినది ఈ రెంటి కలయిక వాని సముచిత ప్రయోగము మన భాషాఫణితిని రుచిరమును మనోహరమును జేసెను ఇట్టి గుణభూయిష్టమైన భాషలో నీ తత్సమ శబ్దమును బరిహరించుటచే బదగతమయిన శోభ ఓజస్సు తగ్గి నీరసభాష యేర్పడును. అందుచే నచ్చతెనుగు రచన చమత్కారార్థమే గాని చిరకాలము సేవింపదగినది మాత్రము గాదు కృత్రిమ నియమములతో వ్రాసిన కవిత్వ మెద్దియు రంజకముగాదు ఇందీకవుల పరిశ్రమను పాండిత్యమును మెచ్చుకొనవలెను.

## శంకర కవి

ఇతడు హరిశచంద్ర కధను ప్రబంధముగా రచించి పేరుగాంచెను గౌరన ద్విపద కావ్యమున కిది పద్యరూపము. మహా ప్రబంధములు వెలసిన దినములు గాన శంకర కవి ద్విపదగా నున్న ఈ కధకు ప్రౌఢత్వము సాధించుటకై ప్రబంధమొనర్చెను ప్రబంధ మందలి ప్రౌఢశైలి ద్విపద యందుండదు గౌరన భావనా శక్తి శంకర కవికి లేదు. గౌరన రెండు మూడు మాటలలో అతి సుకరముగా పాత్రల అకార

స్వభావములు చిత్రించును. కలహకంఠి కాలకౌశికుల సంసారవర్ణన యందలి హాస్యము ద్విపదయందే మేల్తరముగ నున్నది. ప్రబంధమున కరుణరస పరిపోషణ స్ఫూర్తి గాంచినది. హరిశ్చంద్ర కథలో నుత్తర భాగమున కరుణమే ప్రధాన రసము శంకర కవి అర్ధానిని సార్థక మొనర్చెను కొన్నిచోట్ల ద్విపద పంక్తులనే పద్యములలో నిమిడ్చెను. కారణ మాద్విపదపైగల గౌరవము. ద్విపదలు ప్రబంధము లయిన పిమ్మట ఆ ద్విపదలు ప్రశస్తి గోల్పోవుట ఆచారము. లేదా అట్టి ప్రబంధము ఉత్తమము గాకపోయిన అదియే నశించుటయు ఆచారమే పాల్కురికి సోమన బసవ పురాణము ప్రబంధమైనను ద్విపదకే ప్రశస్తి. భారతమును తిమ్మనాదులు ద్విపదగా రచించినను కవిత్రయ భారతము ప్రశస్తి తగ్గలేదు. భాస్కర రామాయణము పుట్టిన తరువాత రంగనాథ రామాయణము కీర్తి కొంత తగ్గినది కాని గౌరన శంకరుల రచనలు మాత్రము తుల్య ప్రాశస్త్యముతో వెలుగొందుచున్నవి శరభ కవి, మల్లారెడ్డి, చంద్రమౌళియు నుత్తర కాలమున ఈ కథనే వ్రాసిరి కాని, వారి రచనలు లోకము విస్మరించెను అనగా కథనుబట్టి కాక కవితాసామర్థ్యమునుపట్టి కావ్యమునకు ప్రశస్తి కలుగును. గౌరన శంకరు లిరువురు సామర్థ్యము గల కవులు

పదములు, ప్రబంధములు నాటకములు కావచ్చును పల్నాటి వీరచరిత్ర బొబ్బిలి పాట ప్రబంధములు నాటకములు నయినవి కాని పదముల ప్రశస్తి పోలేదు. పదము వినువారికే, దీని సంచార క్షేత్రము వేఱు నాటకములు ప్రబంధములు చదువుకున్నవారికే వీని సంచార క్షేత్రము వేఱు

## తరిగొప్పుల మల్లన

చంద్రభాను చరిత్రమను ప్రబంధమును వ్రాసెను. కళాపూర్ణోదయము నందలి కథాకల్పనవంటి కల్పన చేయనెంచి శక్తికి మించిన పాటు పడెను కాని ఇతని కంత శక్తి లేదు. తనకు పూర్వము పుట్టిన ప్రతి ప్రబంధము నందలి మేలిగుణము ననుకరింప ఎంతయో శ్రమ పడెను. (మనుచరిత్ర, వసుచరిత్ర, పారిజాతాపహరణము, దశకుమారచరిత్ర) దీనివలన కథలోని సందర్భములేకుండుట, అస్వతంత్రత బయటపడుట యను దోషములు సంభవించెను.

## ఎలకూచి బాలసరస్వతి

కవియయ్యు పండితుడుగా నధిక ప్రశస్తి గాంచెను. ఆ పాండిత్య ఫలమే యాదవరాఘవపాండవీయము. ఇది త్ర్యర్థి కావ్యము. ఇట్లు కవిత్వము నీరసము కృత్రిమముకా జొచ్చెను. భర్తృహరి నీతడు మల్లభూపాలీయమని అనువదించెను గాని లక్ష్మణకవి అనువాదమునకు గల ప్రశస్తి దీనికి లేదు

ఇతడు రంగకౌముది అను గ్రంథమును రచించినట్లు చెప్పుకొనెను. కాని అది కానరాదు. పేరును బట్టి యది నాటకమో నాటక లక్షణమో కావలెను సంస్కృతమున ఈ పేరుగల నాటకలక్షణగ్రంథమేదియు నున్నట్లు తోచదు. స్వతంత్రమైనచో నిది తెనుగునాటక లక్షణమయి యుండును. ఆనాటికింకను సంస్కృత నాటకానురూపముగు

నాటకము తెనుగున లేదు. కావున నిది యక్షగాన లక్షణ గ్రంధమయి యుండవచ్చును. ఆనాటి కితడు లక్షణము వ్రాయ నవసరము కలిగినంత విరివిగా యక్షగానములు పుట్టి యుండును లేదా యీ గ్రంధమే యక్షగానము కావచ్చును.

## కుమ్మరి మొల్ల

ఈమె మొదటి కవయిత్రి. పూర్వకవి స్తుతిలో నీమె శ్రీనాధుని వఱకే పేర్కొనుటచే నీమె నీ యుగమున జేర్చితిమి. ఈమె కాలనిర్ణయమునకు ఇతరాధారము లేవియు లేవు కవిత్వము పేర పాండిత్యము శైలి ప్రౌఢి మొదలయిన వీమెకు రుచింపనట్లవతారికలో చెప్పినది. "తేటతెనుగున కావ్యము చేయబూనినది. ఈమెకు విద్యా సంస్కారము కొంచెము తక్కువే కవిత్వములో ప్రౌఢత్వము తక్కువ. కాని సుకుమార స్త్రీ జనోచితమైన సహజ కోమలత యీామెవాక్కునకు నిసర్గముగ కలదు సీత హనుమంతునికి జెప్పిన సందేశము నింతయందముగా నేరామాయణ కర్తయు జొప్పింపలేదు. కథ జగత్ప్రసిద్ధమగుట మిక్కిలి సంక్షేపించెను. కథా పరిచయము లేనివారి కిందలి కథ నడవదు.

## మాదయ్య

మైరావణ చరిత్రమును వ్రాసెను

## నాదెండ్ల గోపయమంత్రి

కృష్ణార్జున సంవాదము ద్విపద రచించెను రామకవి దీనిని ప్రబంధ మొనర్చెను చిలకమర్తివారి గయోపాఖ్యానమున కిదిమూలము

## దోనేరు కోనేరు కవి

బాలభాగవతమును ద్విపదగ రచించెను బాల యనుట సంక్షిప్తార్థమున (Abridge)

## కాకుమాని మూర్తి కవి

ప్రబంధ కవులలో నించుమించు రామరాజభూషణునివంటి కీర్తి గడించినవాడు కాకుమానిమూర్తి కవి. ఈతడు 1560 తరువాత వాడు వీని గ్రంధమగు పాంచాలీ పరిణయము, వసుచరిత్రము ముందో, తరువాతనో చెప్పలేము ఈతడు సంకుసాల నృసింహకవి సమకాలికు డనియొక వదంతియున్నది ఇరువురును రాజభూషణ మెక్కువగా చేసియున్నారు.

పాంచాలీ పరిణయమందలి "పాండురంగవిభుని పదగుంభనంబు"అను పద్యమును బట్టి యీాతడు వారి సమకాలికుడేమో యని యనుమానింపదగియున్నది ఈతడెవ్వరి సమకాలికుడైనను రచనమాత్రము పాండురంగ మాహాత్మ్యము తరువాతనే జరిగినదని చెప్పక తప్పదు

భారతములోని కథనే గ్రహించి మార్పులేమియు చేయక రచించినాడు. నాటి కాలప్రవాహము ననుసరించినచో గ్రంథము చాల పెరుగవలసినదేగాని, యీతడు పురాణోక్త సంక్షిప్తతనే యనుసరించి ద్రుపదుని పుత్రకామేష్టి మొదలు, పాండవుల యింద్రప్రస్థ రాజ్యపాలన వరకుగల కథను కావ్యముగ చేసినాడు

పాంచాలీ పరిణయ మందీతడు చెప్పుకున్న పద్యమునందలి మూడు గుణములును సరిగా వీనికి పట్టలేదు. అల్లసానివారి యల్లికజిగిబిగి వీనికేగాదు, ఎవరికిని అలవడలేదు అది రామరాజభూషణునికే సాధ్యము కాలేదు ముద్దు తిమ్మనవలె ముద్దుగా పద్యమునుకూర్చగలడు గాని, ఆ మాధుర్యమును తేలేకపోయినాడు అక్కడక్కడను కొన్ని పద్యములు పాండురంగవిభుని పదగుంభనమువలె అతిక్లిష్టముగా మాత్రమున్నవి. వివాహాదులను వర్ణించుట పట్ల మెత్తని తెలుగు పద్యములను కొన్ని వ్రాసినాడు అవియే ముద్దుపల్కులనుకోవచ్చును గాని అది తిమ్మనగారిఫక్కి మాత్రము గాదు.

**రాజవాహన చరిత్ర:** ఇది రెండవ గ్రంథము. తిరుపతి వేంకటేశ్వరునికి కృతి. ఈ గ్రంథమునకు మూలము తెలియదని పీఠికా కర్తలు వ్రాసినారుగాని యిది దశకుమార చరిత్రలోని అవంతి సుందరీ పరిణయమన్న కథయే. వీని యీ రెండు గ్రంథములలోను రాజవాహన విజయమే ప్రౌఢతరము. చాలవరకు వ్యాఖ్యానమునపేక్షింపవలసిన పద్యములున్నవి బహుళాశ్వ చరిత్ర మను గ్రంథము వ్రాసినాడు కాని లభ్యముగా లేదు.

★ ★ ★

# దక్షిణాంధ్రయుగము (1600-1775)

## నాయకరాజులు

17 వ శతాబ్ది ప్రారంభమునకు విజయనగర సామ్రాజ్య శోభ నశించి నామ మాత్రావశేషమైనది. తల్లికోటయుద్ధముతో నా రాజ్యప్రాభవము నశించిపోయినదన వచ్చును. తరువాత రాజధానియైన పెనుగొండలో నాఖరు వెలుగులు వెలిగినది పిమ్మట చంద్రగిరి రాజధాని యైనప్పుడా రాజ్యమే యస్తమించిపోయినది వీరందరును తుళువ వంశీయులమని చెప్పు కొనుటకే సిగ్గుపడవలసినవారు తమ్ము తాము సంరక్షించుకొనలేక తమ సామంతుల సాయమును వీరపేక్షింపవలసి వచ్చినది అయినను ఆ రాజులు పూర్వ మర్యాదల ననుసరించి కవి, పండిత గోష్ఠులను జరుపుచు, కావ్యరచనములకు ప్రోత్సాహ మిచ్చుచునే వచ్చినారు కాని రాజకీయములలో సామంతు లెప్పుడు ప్రబలులైనారో, అప్పుడే సారస్వతము కూడ వారి యండ జేరినది ఆ సామంతు లందరిలో విజయనగర ప్రాభవము నంతను తమ యాస్థానములో తిరిగి నెలకొల్పుటకై తంజావురు నాయకులెక్కువగా పాటుబడినారు విజయనగర రాజ్యనిర్మాణములో నున్న విద్యారణ్యుల యుద్దేశమును గ్రహించి దానిని పునరుజ్జీవింపజేయుటకై వీరు ప్రయత్నించినారు రాయలవలె భారతీయసంస్కృతి పరిపోషణతోపాటు, ఆంధ్ర సారస్వత పరిపోషణ చేసినారు. మధురలోని పాండ్యులును వీరి వలె ప్రబలులే ఆంధ్రులే కాని సామంతులై యుండియు రాజభక్తిలేని ద్రోహులు వారు ఈ రాజభక్తిహీనత రాయలకాలము నుండియు నా మధుర క్షేత్రములో నున్నది (ఎదురుతిరిగిన తండ్రిని కొడుకు ఓడించి తీసికొనివచ్చును) అంతియేకాక తంజావూరు వారికిని మధుర వారికిని (చోళ, పాండ్యులు) ప్రబలవైర మున్నది. అంతశ్శత్రువుల నడచుటకై ఆదికాలములో రాయలు పడినంత శ్రమయు తంజావూరు నాయకులు పడినారు వారికి పొరుగైన మధురయే శత్రువైపోయినది ఈ తంజావూరు నాయకులలో మరల రాయలే యనదగినవాడు రఘునాథ నాయక్.

రఘునాథరాయల తండ్రి అచ్యుతనాయక్. తాత చవ్వప్పనాయక్ ఈతడు అచ్యుతదేవరాయలతోడియల్లుడు ఈతడు 1535లో తంజావూరు ప్రతినిధిగా వెళ్లినాడు అంతకుపూర్వము చోళ వంశీయులే తంజావూరులో విజయనగర సామంతులుగా నుండెడివారు. మధురలో మాత్రము రాయలకాలము నుండియు నాంధ్రులే నాయకులుగా నున్నారు. అచ్యుతరాయలు తన బంధువుని తంజావూరు నాయకునిగా పంపుటలో చాల రాజనీతిజ్ఞత యున్నది. ఆ యుక్తి ఫలించినది దక్షిణాదిక్కు నంతను వాని

వంశీయులు దిట్టము చేసినారు. రఘునాధుని పైరెండుతరములకు చోళరాజ్యమును సుస్థిరము చేసికొనుటలో పాండ్యులు తరిమిరాకుండ చూచుకొనుటలో కాలము గడిచిపోయినది. అందుచే ఆస్థానములో కవులు, గాయకు లున్నను కళాసంసేవనము జరుగలేదు 1616 నుండి రఘునాధనాయకుని యాస్థానము లక్ష్మీసరస్వతుల కాలవాలమైనది. 1614లో వాని పట్టాభిషేకము జరిగినది నాటి కాతడు చాల చిన్నవాడు కాని అతిసమర్థుడనుటలో సందియము లేదు అతడు రాజ్యమునకు వచ్చినప్పటి కొక క్లిష్టమైన సమస్య తలెత్తినది. దానిని గొబ్బూరి జగ్గరాజను ఒక ద్రోహి లేవనెత్తినాడు ఆతడు 'చంద్రగిరి రాజు బావమఱది – అనగా రాజుకున్న బహుభార్యలలో నొకామె తోబుట్టువు రాజు చనిపోగానే నిక్కపు వారసుని సంహరించి తన మేనల్లునికి పట్టము గట్టి తాను తిరుగుబాటు చేసెను అప్పుడు విజయనగరముపై కన్నెఱ్ఱగా నున్న శత్రువు లందఱను కూడదీసినాడు అందులో పాండ్యులును జేరినారు తోపూరు యుద్ధములో రఘునాధనాయక్ వీరి నందరిని ప్రతిఘటించినాడు ఆ యుద్ధములో విజయమంది విజయనగరమునకు అసలు వారసుని సింహాసనము నెక్కించి నిగర్వముగా తాను వానికి సామంతుడనని ప్రకటించుకొనినాడు. ఈ యుద్ధము రాయలుదయగిరిని గెల్చుటవంటిది ఆ విజయముతో రఘునాధుని పేరు దక్షిణాంధ్రపధములో సింహస్వప్నమైనది ఇందులో చోళ, పాండ్యు లెదురుపడుటచే వారి శతృత్వము స్పష్టపడినది. అయినను వారేమియును చేయలేకపోయినారు రఘునాధుడు నాగపట్టణము వద్ద పోర్చుగీసువారితో సముద్రయుద్ధము చేసినాడు వానికీర్తి సింహళము వరకును వ్యాపించినది రఘునాధాభ్యుదయమే దక్షిణదేశములో తిరిగి యాంధ్రాభ్యుదయమన వచ్చును

రాయల యుగాంతమునకును, నాయకరాజుల యుగ ప్రారంభమునకును మధ్య సుమారిరువది సంవత్సరముల వ్యవధి యున్నది (నాయకయుగము అసలు రఘునాధునితో మొదలు కావలె – 1620 ప్రాంతం) ఈ కాలములో పేరెక్కిన మూడు నాల్గు గ్రంధము లవతరించినవి. ఈ కావ్యములను నాయకయుగమునకు పూర్వరంగముగా పరిగణింప వచ్చును. ఆ కవు లెల్లరు నేదో యొకవిధముగా నీనాయక రాజులతోడనే సంబంధము కలవారగుటచేతను, వారికి దక్షిణయుగముతోడనే యెక్కువ పొత్తు గలదు దేశమునుబట్టి దాక్షిణాత్యులుకానంతమాత్రమున వారి కొక స్వల్ప యుగమును నిర్మించుట కాని, 1600 నాటికే మిక్కిలి క్షీణదశ నొందిన రాయల యుగమును పొడిగించుట కాని తగిన పని కాదు. ఈ యిరువది సంవత్సరములను తంజావూరు భాస్కరోదయమునకు నరుణోదయముగా స్వీకరింపవచ్చును పైగా వీరు ముప్పురును తంజావూరు నాయకుల స్నేహితులు.

**1. కకుత్స్థ విజయము:** మట్ల అనంతభూపాలుడు కర్త ఇతడు శ్రీరంగరాయలకు మిత్రుడును, రాజోద్యోగియునై యుండెను

**2. కువలయాశ్వ చరిత్ర:** సవరము చిననారాయణ నాయక్ కర్త ఇది మార్కండేయ పురాణములోని మదాలస కథ. కథ నత్యద్భుతముగా చేయుటకై కొంతవరకును కళాపూర్ణోదయము ననుకరించినాడు. ఆ కాలము నందలి యుద్ధతంత్రాది చర్యలీ గ్రంధము నందు స్పష్టముగా పరికింప దగును. సేనలు దండువెడలుట, విడియుట,

విడిదిలో స్వేచ్ఛావిహారములు, మదిరా పానములు, విట విటీనర్తనములు, మొదలగునవి యన్నియు అనాటి యాంధ్ర భటుల చర్యలు. కావ్య మాతని తండ్రి నారపరాజున కంకిత మీయబడెను. ఈ నారపరాజు మట్ల యనంతభూపాలుని మిత్రుడు.

3. **బహుళాశ్వచరిత్ర:** దామెర్ల వెంగళనాయక్ కర్త. ఈతడు వేంకటగిరి ప్రభువగు యాచమనాయకుని బావమఱది. విజయనగర సింహాసనకలహములో నిక్కపు వారసుని పక్ష మవలంబించి, ఈ యాచమనాయకుడును, రఘునాధ రాయలును కలిసి తోపూరు యుద్ధమున జగ్గరాజు నోడించిరి.

## రఘునాథనాయక్ (1614-1633)

ఈయన 1614లో సింహాసన మధిష్టించెను. పిమ్మట రెండేండ్లకు (1616) తోపూరు యుద్ధము జరిగెను. అటు తరువాతనే యాతని కీర్తి లోకమున వ్యాపించినది. కృష్ణరాయల ఖ్యాతికి తొలుత నుదయగిరి విజయ మెట్లు కారణమయ్యెనో యీయన యశమునకీ తోపూరు విజయము నట్లే కారణమయ్యెను. ఈ రాజుల కిరువురకును బెక్కింట సామ్యము గలదు. ఇరువురును కవులే. పరాక్రమశాలురు. ఇరువురును లక్ష్మికంటె సరస్వతి నెక్కువ యారాధించినవారు. వీరిరువురు నడివయస్సుననే మరణించిరి రఘునాథనాయకుని మూలముననే దక్షిణాంధ్రమున తంజావూరు సాహిత్యమునకు ముఖ్య కేంద్రమయ్యెను. మధుర కూడ నించుమించుగా నింత ఖ్యాతి వహించిన కేంద్రమే. ఈ రెండిటికిని తరువాత చెప్పదగినది పుదుక్కోట

రఘునాథనాయక్ కొడుకగు విజయరాఘవునకు సంగీత సాహిత్యము లందున్న శ్రద్ధ రాజ్యపాలనము నందు లేదు. తరుణముకైవేచియున్న మధుర నాయకులు దండెత్తిరి అందుచే విజయరాఘవుని యంత్యదశలో తంజావురు అన్యాక్రాంతమైనది ఆ యుద్ధకాలములో విజయరాఘవుని కొడుకు మన్నార్‌దాసు కూడ చనిపోయెను. (1673). ఆ యుద్ధపుటలజడిలో నొక దాది వలన గాపాడబడి నాగపట్టణములో తలదాచుకొనుచున్న చంగమలదాసు (విజయరాఘవుని మనుమడు) రాయసం వెంకన్న యను విశ్వాసపాత్రుడైన వీరుని ద్వారా రాయబారము నడిపి ఛత్రపతి శివాజీ తమ్ముడగు వెంకోజీ సహాయ్యము నొంది మరల తంజావూరుకోట ప్రవేశించి 1675లో కొన్ని నెలలు మాత్రము పేరునకు రాజుగా నుండెను. ఈ మధ్యకాలములో రెండేండ్లు రాజ్యమును పాండ్యరాజులు పరిపాలించిరి. చంగమలదాసుని రాజుగా చేసి ఏకోజీ సేనలతో కుంభకోణములో నుండెను ఇంతలో దాదికిని, రాయసం వెంకన్నకును అభిప్రాయభేదము వచ్చినది. వెంకన్నముందువెనుక లాలోచింపక యీ తంజావూరు రాజ్యమును ఏకోజీకి ధారాదత్తము చేసివేసినాడు. అంతటితో నిది మహారాష్ట్రులవశమైనది. తరువాత నిది డల్హౌసీకాలములో బ్రిటిషు సామ్రాజ్యములో కలిసిపోయినది. మహారాష్ట్రు లన్యదేశీయులైనను నాయకరాజులు పోషించిన సాహిత్యమునే మహోత్సాహముతో 1780 వరకును పోషించిరి. వారిలో మిక్కిలిగా భాషారసికుడైనవాడు ప్రతాపసింహుడు. ఇతనికాలము 1740–1765. రాధికాసాంత్వనము రచించిన ముద్దుపళని వీని ప్రియురాలు

ఈ కాలమునాటి వాఙ్మయమున కాధారము తంజావూరులోని రాజప్రాసాద

పుస్తక భాండారము (పాలస్ లైబ్రరీ) దీనిని తొలుత నెలకొల్పినవాడు రఘునాథ నాయకుడు. తన యాస్థానమందు రచింపబడినవానినేకాక నానా దిక్కుల నుండి గ్రంథములను, ప్రతులను వ్రాయించి తెప్పించి యా గ్రంథాలయము నాతడు పెంపుచేసెను. ఈ రాజ్యనాశనము చేసిన శత్రురాజులు దేశీయులేకాన వారికి రాజులయందు వలె భాష యందు వైరములేకపోయినది కావుననే 1673లో కోట నాశనమైనప్పటికిని, పుస్తకభాండారము నిల్చియున్నది పూర్వము పరదేశీయుల చేతులలోబడిన కోటల వలెనే దగ్ధములైపోయిన గ్రంథాలయముల దుర్దశ దీనికి పట్టలేదు అన్యరాష్ట్రీయులయ్యు ఈ పుస్తకభాండారమును స్వదేశీయుల వలెనే పోషించిన మహారాష్ట్రులును కొనియాడబడదగినవారు వారి కాలమున మహారాష్ట్ర గ్రంథము లిందు పెక్కుచేరి దీనికి మఱింత ప్రాధాన్యము తెచ్చినవి మొదటి నుండియు తెలుగుతోబాటు సంస్కృత ప్రాకృత ద్రావిడభాషా గ్రంథములు నందు గలవు ఈ గ్రంథము లన్నియు నపూర్వములు; ప్రాచీనములు నయిన సాహిత్యస్వరూపములు

ఈ నాయక యుగమునకు వైలక్షణ్యమును, ప్రాధాన్యమును సంపాదించిన యంశములలో ముఖ్యములు –

1. ప్రక్రియావైవిధ్యము (Variety in Literary form): సాంప్రదాయసిద్ధములయిన పూర్వయుగ ప్రబంధముల వంటి మంచి ప్రబంధములను రచించిరి. అంతేకాక పెక్కింటిననతి విస్తృతము లయిన ఖండకావ్యములుగా జేసి శబ్దము కంటె భావమునకే ప్రాధాన్య మొసగి యిరువదియవ శతాబ్ది కవులకు మార్గదర్శకులైరి ఇతఃపూర్వము పురాణప్రబంధములలో సకృత్ప్రయుక్తమైన వచన మీనాడు మహాకావ్య రచనకు సంపూర్ణముగ నుపకరించినది. కేవల వచన రచనకు యీ యుగము మార్గదర్శకము

2 తెలుగున గ్రొంగొత్తగా కేవల వచనకావ్యములను సృష్టించిరి

3. గేయకవిత్వమునకు ప్రబంధకవిత్వముతోబాటు సమానమైన గౌరవ మొసంగిరి దేశఫణితిని రచింపబడిన దీనికి పండితామోదమును రాజగౌరవమును లభించినవి

4 యక్షగానమునకు నగ్రస్థానమును ప్రథమతాంబూలము నిచ్చి ప్రజలలో నాటక కౌతూహలమును వృద్ధి చేసిరి

5 పురాతన గాథలతోబాటు తాత్కాలిక లోకవృత్తమును సైతము కావ్య వస్తువుగా స్వీకరించిరి –– మన్నారుదాస విలాసాదులు, రఘునాథాభ్యుదయం, విజయరాఘవవిలాసము

6 కావ్యములం దనావశ్యకమైన వేదాంతబోధను పరిహరించుటయేకాక కళాసౌంద ర్యమునకు ధర్మబోధకును ముడిపెట్టకుండ కళాసిద్ధియే కళా ప్రయోజన మనెడి పాశ్చాత్యమతమున కుపలక్ష్యము కాదగిన కొన్ని రచనలను చేసిరి – తారాశశాంకం, అహల్యాసంక్రందం.

7 భాషాప్రయోగ విషయములో చాల స్వతంత్రులయి వ్యాకరణ నియమములను, రచననుబట్టి యుల్లంఘించిరి త్యాగరాజు కీర్తనలలో కాననగు వ్యావహారిక భాషా ఛాయ లన్నియు వారి ప్రబంధము లందు సైతము గలవు

8. కవయిత్రులును వర్ధిల్లు టింకొక యపూర్వవిషయము. ముద్దుపళని, మధురవాణి, రామభద్రాంబ, రంగాజమ్మ, మొ

**రఘునాథరాయులు - వాని కృతులు:** వాల్మీకిచరిత్ర, పారిజాతాపహరణము, భారత రామాయణ సంగ్రహములు, శృంగారసావిత్రి యనునవి యీయన రచనలు

**శృంగార సావిత్రి:** భారతములో శాంతప్రధానమై కానవచ్చు సావిత్రి కథ యీ కావ్యమున శృంగార భూయిష్ఠముగా నుండును. అనూర్చు అనాటి రాజులయు, ప్రజలయు శృంగారప్రియత్వమునకు మొదటి తార్కాణము వారందరును శృంగార ప్రియులు. జీవితమును మాధుర్యముగా చేయుటకు అనుభవములోను, దర్శనములోను దుఃఖచ్ఛాయలను తొలగించుటకు వారు ప్రయత్నించినారు వారు శృంగారరసికులే కాక హాస్యచతురులు కూడను వారి కావ్యములలో నీగుణము కూడ వ్యక్తమైనది. అశ్వపతి తపమునకు విఘ్న సాధనములుగా నప్సరసలను సృజించి వారి చర్యల ద్వారా హాస్యచతురతను వెల్లడించినాడు అనాటి శృంగార ప్రబంధములలో నాయికలుగా వర్తించు పాత్రలుగాని, యుపపాత్రలుగా వర్తించు నప్సరసలుగానీ యప్పటి రాజాంతఃపుర జనమునకు గాని వారి వేశ్యాజనమునకుగాని బ్రతిసృష్టి యనుటలో సందియములేదు

వాల్మీకి చరిత్ర దీనికంటె మేల్తరముగా నుండును ఆటవికుల జీవితములను వర్ణించుపట్ల నీతడు ధూర్జటిని తలపించుటయేకాక కొన్నిచోట్ల నితని కావ్యము దాని నతిక్రమించినట్లు కానవచ్చును వాల్మీకికి నాగంతుకముగా దటస్థించిన రామభక్తిని తద్దట్టమును దలచుకొనిన కవి పరవశుడై రామకీర్తన పాడుచున్నట్లుండును ఇతని యాస్థానకవులలో నల్గురు ప్రధానకవులున్నారు.

## చేమకూర వేంకటకవి

విజయవిలాసము, సారంగధరచరిత్ర అను రెండు ప్రబంధములు వీని రచనలు వీని రచనలు వీనిలో రెండవది మొదటిదానికన్న అప్రౌఢ రచన విజయవిలాస పద్యము లందలి వ్యంగ్యాదులు మొగ్గతనంత తాను విచ్చునట్లుగా విచ్చుతవని వేదం వేంకటరాయశాస్త్రులు వారన్నారు వేంకటకవియొక్క వాక్కునకు, తెనుగు సాహిత్యము యొక్క మార్దవమునకు విజయవిలాసము పరిణతరూపము తెలుగునకున్న సహజమాధుర్యమును గేయములలో తంజావూరుకవులు వ్యక్తము చేసినట్లుగా మరే కవియును వ్యక్తము చేసియుండలేదు. కీర్తనలో క్షేత్రయ్య, ప్రబంధములో వేంకటకవి సుప్రసిద్ధులు. వేంకటకవిలో స్త్రైణమైన లాలిత్య మున్నది (Feminine grace) వసుచరిత్రకారు డతిప్రయత్నముమీద సాధించిన ధ్వనులు, వ్యంగ్యములు వేంకటకవి సహజధోరణిలో నప్రయత్నముగా నుచ్చరింపగలడు ఈ మేలిగుణము సారంగధర చరిత్రలో కానరాదు. కావ్యము ప్రతిపద్యరసాత్మకముగా నున్నది కూడ విజయ విలాసమే. విజయవిలాసములో నాతడు చేసిన ప్రతినయే యది విజయవిలాసము తెలుగు పంచకావ్యములో నైదవది ఇది లలితసాహిత్యమునకుగా, పరింపదగినది మొదటి నాల్గును ప్రౌఢసాహిత్యములు ఆంధ్రవాఙ్మయములో దీని స్థానమిది ఈ ప్రబంధేతివృత్తములో నాట్టే పసలేదు అయినను రచనావిశేషముచే కథావస్తువును మెఱిపించిన కావ్యమిది. వసుచరిత్రకారుడు సంగీతనిధి యగుటచే పద్యములు వీణపై పాడుకొనుటకు వీలుగా వ్రాసియున్నాడు కాని అసలు చేమకూర పలుకులే

సంగీతమయము. సంగీతసాహిత్యములు నాటి కవులందఱకును కరతలామలకములు రసికత గీతిసాహితీమోహనవాణుల కలయికయొక్క ఫలితమే యని వారి తలంపు. క్షేత్రయ్య, వేంకటకవి, ఆంధ్ర సాహిత్యములో రెండుత్తమ శిఖరములు గీతిలో క్షేత్రయ్య, సాహిత్యములో వేంకటకవి.

2. **కృష్ణాధ్వరి:** ఈతడు రెండవ యాస్థానకవి. 'శృంగారనైషధపారిజాతమను' ద్వ్యర్థికావ్యమును రచించెను. ఇది ద్వ్యర్థికావ్యములలో వెన్నికకు వచ్చిన వానిలో నాల్గవది ఇది అచ్చుపడలేదు.

వీరిరువురేకాక వీని యాస్థానములో నిరువురు కవయిత్రులు గూడ నుండిరి

3. **మధురవాణి:** సంస్కృత కవయిత్రి గొప్ప పండితురాలు రఘునాధుని రామాయణ సంగ్రహమును సంస్కృతీకరించినది

4. **రామభద్రాంబ:** ఈమెయును సంస్కృతకవయిత్రియే ఉషాపరిణయమను నొక యక్షగానమును రచించినది

*'కతి కతి న్నక్షితి పతయఃకింతే రఘునాధనాయకాయంతే'* అని కీర్తించినది.

రాయల యాస్థానములో శారదాధ్వజ ముండెడిదట. సామ్రాజ్య ధ్వజముతోపాటు దానిని కాపాడుచుండెడివారు రాజధానితోపాటు దీనిని తరువాత పెనుగొండకు తర్లించినారు. దీనిని తంజావూరు తెప్పించు డన్నది రామభద్రాంబ రఘునాధుడు సంకోచించినాడు వాని యనుజ్ఞ వడసి యీామె పెనుగొండ వెళ్లి అక్కడి పండితులను వాదములం దోడించి శారదాధ్వజమును తంజావూరు పట్టించుకొని వెళ్లినది ఈ కవయిత్రు లిరువురును నాటి కవి, పండిత లోకములో మంచి గౌరవము కల్గియున్నారు

## విజయరాఘవుడు (1633-73)

తండ్రివలె నీతడును కవియే కాని యీతడన్నియు యక్షగానములనే వ్రాసెను వాని కాలములో పుట్టిన వన్నియు నించుమించుగా యక్షగానములే. తంజావూరు యొక్క కీర్తనకు, యక్షగానమునకు వీని యాస్థానము సుక్షేత్రముగా పరిణమించినది కృష్ణరాయల వలె రఘునాధనాయకుడు రాజకీయ, సారస్వతరంగములలో సమానముగా మెలిగినాడు. కాని విజయరాఘవుడు తన జీవితమును, ఆస్థానమును గూడ కళామయము చేసివేసినాడు

రఘునాథాభ్యుదయము, ప్రహ్లాదచరిత్ర, విప్రనారాయణచరిత్ర, పార్వతీపరిణయము, మొదలైన యక్షగానము లీతనిచే రచింపబడినవి ఇవన్నియును గద్యపద్యాత్మకమైన గేయములు. పద్యము చాల విరళము ద్విపద ప్రాచుర్య మెక్కువ. గేయ భాగము లన్నియును చాలవరకు ద్విపదలే. వీనిలో చారిత్రక ప్రాముఖ్యమున్నది రఘునాథాభ్యుదయము ఇది వీని తండ్రి చరిత్ర

## రంగాజమ్మ

విజయరాఘవుని యాస్థాన కవయిత్రి రంగాజమ్మ ఈమె వేశ్య యయ్యు తాను విజయరాఘవుని పట్టమహిషి నని చెప్పుకొన్నది ఈమె రచించిన గ్రంథములు రెండు – 1 మన్నారుదాస విలాసము (యక్షగానము), 2. ఉషాపరిణయము (ప్రబంధము).

మన్నారుదాసనునది విజయరాఘవుని నామాంతరము విజయరాఘవుని వివాహ గాథ యంతయు నిందలియితివృత్తము. ఇందు రాజులు కొలువు తీర్చుట, విన్నపములు వినుట, ఆజ్ఞాపత్రము లిచ్చుట, కుల దైవమును సేవించుట, ఊరేగుట, లోనగు నిత్య దినచర్య లన్నియును సమగ్రముగా గ్రహింప దగినట్లు వర్ణింపబడి యున్నవి అరవల కరవము, ఆంధ్రులకు తెలుగు, కన్నడులకు కన్నడము – ఈరీతిగా పాత్రోచితములైన భాషలు వాడబడుటచే నానాటకములకు స్వాభావికత కొంత హెచ్చినది. జాతినిబట్టియేకాక వృత్తిని బట్టియు పాత్రోచితమైన భాష వాడబడినది తత్కాల యితివృత్తమును దీసికొని గ్రంథము వ్రాయుట కిదియే ప్రారంభము

ఈమె చాటువులు చాలా నున్నవి అందులో నొకటి యుదాహరణము –

*ఏవనితల్ మముం దలపనేమిపనో తమ రాడువారు కా*
*రో వలపించు నేర్పెరుగరో, తమ కౌగిటిలోన నుండగా*
*రావది యేమిరా విజయరాఘవయం చిలుదూరి బల్మి మై*
*తీవరకత్తెనై పెనగి తీసుకవచ్చితినా తలోదరీ!*

దీనినిబట్టి విజయరాఘవుడీమె యందు మహానురక్తుడని యూహింపవలసి యున్నది ఈతడు గొప్ప రసికుడు వీని కళాతృష్ణకు మురిసియే కాబోలు క్షేత్రయ్య అంతటివాడు వీనిపై కొన్ని పదములను చెప్పియున్నాడు. ఈతడు విజయరాఘవుని మిత్రుడని చెప్పుదురు. ఆస్థానకవి కూడ యగునేమో తెలియదు ఈతడు మువ్వగోపాల పదములను వ్రాసి గొప్ప కీర్తి సంపాదించినాడు

విజయరాఘవుని కుమారుడగు మన్నారు తండ్రి దురాగ్రహమునకు పాత్రుడై కారా గారముననే యస్తమించెను ఈతడు హేమాబ్జనాయికాపరిణయ మను యక్షగానమును వ్రాసెను అందలి కథ లక్ష్మీస్వయంవరము

**కోనేటి దీక్షితచంద్రుడు:–** విజయరాఘవ కళ్యాణమను యక్షగానమును వ్రాసెను.

**చల్లా సూరయ్య:–** ఈతడును విజయరాఘవుని కాలము వాడే యగునని తోచుచున్నది ప్రబోధచంద్రోదయమునకు వివేకవిజయమను పేరుతో యక్షగానమును వ్రాసినాడు.

## మహారాష్ట్రులు

వీరి కాలములో యక్షగానములు తండోపతండములుగా పుట్టినవి కాని వానిలో నేరాజు ఏకవిచే వ్రాయించెనో నిర్ణయించుట కేమియు నాధారములు లేవు వీరి యక్షగానములలో కొన్ని తెనుగు వాని కనుకృతులుగా మహారాష్ట్ర రచనలును గలవు ఈ జాతి యక్షగానమే మహారాష్ట్రములోని ప్రభావతీప్రద్యుమ్నము. ఈ రాజులలో

శహాజీ అనువాని పేరుమీద ననేక యక్షగానములు కలవు వీని నితడే స్వయముగా వ్రాసెనో, లేక యితర కవులు వ్రాసి వాని పేరు పెట్టినారో తెలియదు. కిరాత విలాసము, జలక్రీడలు, కృష్ణలీలలు, పార్వతీపరిణయము మొదలగునవి వీని పేరుమీదనే చెల్లుబడి యగుచున్నవి రాజులు వ్రాసినవేకాక, రాజుల శృంగారవిలాసములను గూర్చి కూడ యక్షగానములు పుట్టినవి శహాజీ కళ్యాణము, శరభోజీ కళ్యాణము మున్నగునవి

మహారాష్ట్రుల రాజ్యపాలనములో ప్రతాపసింహునికాలము నందు పుట్టిన ముద్దు పళని యొక్క రాధికాసాంత్వనము అను ప్రీణనకావ్యము ముఖ్యమైన ప్రబంధము. రాధామాధవాత్మకములైన శృంగార ప్రబంధములలో దీనిని పోలదగిన దింకొకటి లేదని చెప్పవచ్చును నందితిమ్మనతో పందెము చఱచి విప్రలంభశృంగారమును వ్రాసిన దాని వలె నీమె కనపడుచున్నది. అన్యాసక్తుడైన ప్రియుని యెడ జనించెడి తీక్ష్ణ వ్యభిచారి భావము లింకే ప్రబంధములో నింత స్ఫూర్తిగా వర్ణింపబడి లేవు. పుట్టుకచే వేశ్యయై, మహారాజున కుంపుడుకత్తెగా రసమయజీవితమును గడిపినది రాజులతో మెలగి మంచి సంస్కారము నలవర్చుకొన్నది ఈమూడుగుణము లామె గ్రంథములో రాశీభూతముగా నున్నవి తానే నాయికగా నీమె గోచరించుచుండును. ఈమె రచనలో భావ మెంత తీక్ష్ణముగా నున్నను సరసులకా పచ్చిశృంగారమేవకొల్పును. కొన్నిచోట్ల స్త్రీజనోచితమైన లజ్జ కూడ పరత్యజింపబడినది అనాటి కాలములో ప్రబంధము లందు దుస్సహమును, కామపరమునైన శృంగారము చిత్రింపబడి యున్నది. ఈ కావ్యములో నిది మరియును దుస్సహతరమైనది

అరవములో పాశురములని ముప్పదిరెండు వైష్ణవగీతములున్నవి వీటిని అముక్తమాల్యదా నాయికయగు గోదాదేవిరచించినదట. వానిలో పదింటిని ముద్దుపళని తెనిగించినది. (బందరు శృంగార గ్రంథముల వారు రాధికాసాంత్వనమున కనుబంధముగా వీనిని ప్రచురించి యున్నారు) వీని కామె సప్తపదులని పేరు పెట్టుకొన్నది రాధికాసాంత్వన మొకవేళ నీమె రచించియుండక పోయినను, ఈ సప్తపదులు చాలు నీమె పేరు నిల్పుటకు. అతి మధురమైన నీమె వాక్కు కృష్ణార్పితమై తరించినదిక్కడనే. అదిలో నీమె కామపరమైన పచ్చి శృంగారమునే వెలయించినను, పరిణతి నొంది భక్తిభరితమైన యీ సప్తపదులను రచించి సిద్ధినే పొందినది.

కొరవంజి అను నొక రకము తంజావూరు యక్షగానములలో నున్నదని వేటూరి ప్రభాకరశాస్త్రిగారి యూహ విజయరాఘవకొరవంజి, మన్నారుదాస కొరవంజి, మొదలైనవి.

కొరవల + అంజ (అడుగు – కోయనృత్యం) కోయవారి నృత్యవిశేషాలు కలవి గాన నా యక్షగానములు కొరవంజులైనవని వారి సిద్ధాంతము కాని యీ నిర్వచనమును ఒక్క గానమునకే యన్వయించుటలో నర్థము లేదు. అసలు కవిత్వ బీజమే కొరవల యంజి కొరవలే ప్రాక్తన మానవులు వారి యాట పాటయే సాహిత్య సృష్టికి బీజము. కాని అంజ శబ్దము ననుసరించి యొక్క నాటకమునకే జాతి వాచకము కావలసి వచ్చుచో నన్ని రకముల నాటకములకు నీపేరే రావలెను. అట్లు లేదు కొన్ని కేవల యక్షగానములు. కొన్ని కొరవంజులు. అరవములో కొరవంజి యన్నచో సోదె, సోదెకత్తె అని లక్షణార్థము ఈ పేరు గల అన్నింటిలోను సోదెకత్తెలేనిది

లేదు. అయోగశృంగారములో నాయికానాయకులకు పునస్సమాగపుటాశ కల్పించుటకీ పాత్ర వచ్చుచుండును. అందుచే నీ పాత్ర యున్న వానికే కొరవంజలని పేరు అది విధిగా శృంగారేతివృత్తమై యుండును. సాధారణముగా నామె నాయికకే సోదె చెప్పుచుండును.

తిరుమలాధ్వరి యను నాతడు చిత్రకూటమహాత్మ్యమును వ్రాసినాడు

చిల్లరకవులేకాక ఆనాడు గొప్పగొప్పపండితులుకూడ యక్షగానములనే వ్రాసియున్నారు

## యక్షగాన స్వరూపము

తంజావూరు యక్షగానము అప్పకవి మొదలైన వారు చెప్పిన లక్షణమునకు సరిపడదు ఇది దేశివిభాగమునకు జెందిన యొకజాతి నాటకము అనగా సంస్కృతము నుండి యనుకరింపబడని యాంధ్రుల నాటక మన్నమాట ఈ దేశి యక్షగాన నాటకమునకు భిన్నమైనదే మార్గ నాటకము. అది సంస్కృతానువాదము గాని, అనుసరణముగాని, రెంటిలో నేదియో యొకటి యగును యక్షగానమును బ్రదర్శించుటకు ప్రత్యేక రంగస్థల మక్కరలేదు కాని మార్గ నాటకమును నాటకశాలలో నాడవలెను దానికి ప్రత్యేక రంగనిర్మాణ ముండవలెను ఈ యక్షగానమును రెండు, మూడు వీధులు కలిసిన ప్రదేశములం దాడుచుందురు అందుకనియే యక్షగానమునకు వీధినాటక మను వేరొక పేరు కూడ నున్నది ఇట్టివి యితర రాష్ట్రములలో గూడ నున్నవి ఉత్తర హిందూస్థానములో వీనిని 'యాత్రలు' అనెదరు అనగా ప్రజల వినోదార్థ మిది యాత్రాస్థలము లందును, జాతర సమయము లందును ప్రదర్శింపబడును గాన 'యాత్ర'యైనది. సాధారణముగా సంస్కృత నాటకములు కూడ నుత్సవసమయము లందే యాడినట్లు వ్రాయబడియున్నవి. ఉత్తరరామాయణము, అనర్ఘరాఘవము మొదలగునవి. సంస్కృతము నుండి యెరువు తెచ్చుకొని తెలుగువారి సొమ్ములలో యక్షగాన మొకటి

ఇట్టి యక్షగానములు సంస్కృతములో లేనేలేవు గదా! మరి యా సంస్కృత శబ్ద మెక్కడ నుండి వచ్చినదను సంశయము రానగును అసలీ యక్షగానమునకు 'జక్కులవారిపాట' యని లౌకిక నామ మున్నది. అదియే అసలు పేరనియు, దానిని సంస్కృతీకరించి యక్షగానమని పిలుచుచున్నారనియును కొందఱు సమాధానము చెప్పుదురు. అది నిజమే కావచ్చును భీమ ఖండములో శ్రీనాథుడు జక్కులవారిని పేర్కొని యున్నాడు. ఆంధ్రదేశ మందవతరించిన భూలోక గంధర్వులీ జక్కులవాళ్లు అనగా గాంధర్వ విద్యను (దేశీయ సంగీతమును) కులవృత్తిగా జేసికొని జీవించు వారు గాన గంధర్వు లనబడిరి వారే జక్కులు (వీరిప్పుడు తెనాలి తాలూకాలో కన్పింతురు).

ఈ జక్కులవారు తమ వ్యస్తములగు పాటల నభినయించుటకు మొదలు పెట్టినప్పుడది ప్రదర్శనీయమైనది కథాత్మకమైన పాటకు పాత్ర సమారోపణము చేసినప్పుడది రూపకమైనది. అప్పుడు కూడ నది (At the same time)

సంగీతప్రధానముగానే నిల్చియున్నది ఆ కీర్తన సముదాయమును కథగా కలుపుకొనుటకు భాగవతులు సంధి వచనములను తామే కూర్చుకొనెడివారు తరువాత కీర్తనతోపాటు తోహరము, ద్విపద, గీతము మొదలైనవందులో ప్రవేశించినవి మొదటి రెండు దశలలోను సంవాదాత్మకమైన వచనమే లేదు. అలాగే యక్షగానములో మొదట పద్యము కూడ లేదు గీతము, మొదలైనవి గేయములుగా మాత్రమే స్వీకరింపబడినవి సంధి వచనములకు బదులెక్కడేని యొకటి రెండు పద్యము లున్నను నవి సంజాతములు కావు కొన్నికొన్నియెడల పురాణాంతర్గతమైన పద్యములను చొప్పించి చదువుటయును కాననగును అటుపిమ్మట స్వతంత్ర పద్యరచన బయలుదేరినది

ఈ స్వతంత్ర పద్యరచన ప్రారంభమైన తరువాతనే ఈ రూపకమునకు పరిమితావస్థ వచ్చినది. పూర్వపు కీర్తన కంటె భాషయును ప్రౌఢమైనది కాని యిప్పటికిని సంవాదము వచనరూపములో ప్రవేశింపలేదు సంవాదములు వచనములో నున్న యక్షగానములు మృగ్యములని చెప్పవచ్చును పేలవమైన కీర్తన, సంస్కారశూన్యమైన భాష, శాస్త్రీయముగాని నృత్యము వీనిని యక్షగానముల పరిణామ దశలో నున్న రసవంతమైన కీర్తన, ప్రౌఢమైన రచన, శాస్త్రీయమైన యభినయములతో పోల్చి చూచినచో గొల్లభాగవతుల జలక్రీడ నాటకమునకును, కూచిపూడి వారి ప్రహ్లాద నాటకమునకు గల యంతరమును యక్షగానముల పరిణామమును దెలియును. గొల్లవారికి జలక్రీడలందు, యానాది వారికి గరుడాచల నాటకము నందు అభిమానము.

జలక్రీడాదులను ప్రత్యేకము గొల్లభాగవతులే యభిమానించి ఆడుదురు అకృష్ణుడు ఆగోపికలు యాదవు లయిన తమ సొత్తని వారి యభిప్రాయము వారిలో గోపికల వేషములు స్త్రీలే ధరింతురు. జలక్రీడల తరువాత ప్రచారమునకు వచ్చినది చెంచు నాటకము. దీనికే గరుడాచల నాటక మని పేరు వచ్చినది కొందరి ఉద్దేశమున ఈ నాటకమే దానికంటె ప్రాచీనము దీని నెక్కువగా ప్రదర్శించువారు యానాది భాగవతులు కథానాయిక యైన చెంచెత యాటవికు లయిన తమ యింటి ఆడపడుచని వారి యభిప్రాయము. వీని ప్రదర్శనములో భాగవత పద్యములు కాక ప్రత్యేక రచనముగా పద్యము వ్రాయుట సంభవించినది ఈ మార్పులు ఫలాని యప్పుడు జరిగినవని నిర్దేశించుట కష్టము

నన్నయ భారతముకంటె ముందు నుండి, అనగా పదకవిత్వమునకు ముందు నుండియు నీ స్వరూపము మన వాఙ్మయములో నుండి యుండును అప్పుడీ యక్షగాన మన్నపేరు లేకపోవచ్చును పెద్దకవులు వ్రాసిన యక్షగానములలో ప్రప్రథమముగా పేర్కొనవలసినది సుగ్రీవపట్టాభిషేకమను రుద్రయ్య యక్షగానము అది 1580 ప్రాంతము లందలిది ఈ యక్షగానములకు సంపన్నమైన కాలము 17వ శతాబ్ది. అనగా 1600 తరువాత నాయకయుగ మన్నమాట నాడు పండిత కవులే దీనిని చేపట్టి వీధులలో నున్నదానిని అంతఃపురములో కూడ ప్రవేశపెట్టి యాడించినారు నాడు సంగీతసాహిత్యములపై సమానాదరణమున్న రాజులుండిరి గాన యీ రూపకము తదాత్మకమై వెల్లివిరిసినది. ఆ 17వశతాబ్దిలోనే కూచిపూడి వారు దీనిని చేపట్టి ఫలవంతము చేసినారు రచనకు గాంభీర్యము రాజులును, ప్రదర్శనమునకు

గాంభీర్యమును వీరును మెచ్చినారు. కూచిపూడి వారు భరతశాస్త్రాభినయమును చాలవరకు దీనికి చొప్పించినారు కాని యిప్పుడిది చాలవరకు తగ్గిపోయినది.

## కూచిపూడి వారు

కూచిపూడి వారి యక్షగాన ప్రదర్శనములో కలాప మని, నాటక మని రెండు విధము లున్నవి కలాపములో పాత్ర సమారోప మున్నను బహుపాత్ర లుండవు. కథాకార్య ముండదు. ఇది భావప్రధానమైన యొక జాతి రూపకము (లిరికల్ డ్రామా). కథాత్మకమైన రూపకము నాటకమైనది. కలాపములో కొలదిపాటి కథ యున్నను, అది కేవలము నిమిత్తమాత్రమే. భామకలాప మన్నది పారిజాతాపహరణములోని మానక్రోధయైన సత్యభామా చిత్తవృత్తి ప్రదర్శనము మాత్రమే గొల్లకలాపములో నసలు కథయే లేదు. సృష్టి స్థితి లయములను గూర్చిన వేదాంత మది ఆధ్యాత్మిక సంపద దాని ప్రాణసారము అందలి సుంకర కొండని పాత్ర కేవలము హాస్యము కొరకు మాత్రమే పుట్టినది. అభినయము – అనగా భరత శాస్త్రాభినయము నాటకములో నొక యంగముగా మాత్రమే యుండును కాని కలాపములో నదియే ప్రాధాన్యమును వహించును వేషము వేసిన యాతడు 'నేనేమి సేతునే' అన్న చరణము నొక యరగంట సేపు అభినయించును. ఈ యభినయములో నలంకారశాస్త్రములలో చెప్పబడిన సాత్త్విక వ్యభిచారాది స్థితు లన్నియు ననుక్షణము వాని మొగములో తాండవించుచునే యుండును (In quick succession). వెంపటి వేంకట నారాయణ యను నాయన ఆ కీర్తివంతమైన కూచిపూడి వంశములో తుదివాడని చెప్పవచ్చును. ఆయన చూపించు నేత్రవిన్యాసమును ఛాయాగ్రహణ యంత్రము కూడ యనుకరింప లేదనుటలో నతిశయోక్తి యుండదు ఈ కూచిపూడి వారు గొప్ప మంత్రశాస్త్రవేత్తలు కూడను. అభినయములో వీరఖిలభారత కీర్తిని గడించియున్నారు వీరిశిష్యులమని చెప్పకొనెడివా రిప్పటికిని తంజావూరు ప్రాంతముల నాల్గైదు గ్రామాలలో నున్నారు.

కూచిపూడి వారి నాటకములలో ప్రథమముగా పేర్కొనదగినది ప్రహ్లాద నాటకము. తరువాత రామనాటకము (ఉత్తరరామాయణ గాధ). మూడవది ఉషాపరిణయము ఇటీవల నభ్యసింపబడినది గయోపాఖ్యానము, ఉషాపరిణయమును, ఉషాభరత మని వారందురు అనగా నందులో భరతశాస్త్ర మెక్కువ యుపయోగపడిన దన్నమాట. ఉషాకన్య వనవిహారమును ప్రత్యేక మొక కలాపము వలెనే వారు ప్రదర్శింతురు. కవి శబ్దముతో, శిల్పి రంగులతో దేనిని చిత్రించునో, నటుడు దానినే తన శరీరావయవముతో చిత్రించును. అందుచేతనే నాట్యము గాత్రవిక్షేపవిద్యయైనది. భరతశాస్త్రములో నున్న రహస్యమే యిది ఈ శరీరమనే మృత్పిండమును నటుడు మలచి చూపించగలడు అట్లే ప్రతియంగమును మట్టిమలచినట్లు మలచి చూపుటలో కూచిపూడి వారద్వితీయులు ఆ ఉషాకన్య యుద్యానవనములో వారి శరీరములోకొక్క యెడ గుర్తుపట్టలేనంతగా లతల వలెనే పొడగట్టుచుండును వీరిలో వేదాంతం రాఘవయ్య ఆఖరివాడు. కూచిపూడి వారి యుషాభరత ప్రదర్శన మమోఘమైన దనుటలో సందేహము లేదు

ప్రహ్లాద నాటకములో 'వెడలె హిరణ్యకశిపుడు' అని పాడుచు హిరణ్యకశిపుడే ప్రవేశించును. న్యాయమున కిది సూత్రధారుని వాక్యము కాని పాత్రయే దానిని

పాడుచు ప్రవేశించుట యాక్షేపణీయమని నేటివా రందురు దాని యర్థ మిది గాదు తాను అసలు హిరణ్యకశిపుడను గాననియు, తన శరీరముపై హిరణ్యకశిపుని రూపమును ప్రదర్శించుచున్నాననియు నానటుని యభిప్రాయము అందుచే నిది యాక్షేపణీయము గాదు.

మన తెలుగు సాహిత్యములో కూచిపూడి వారిని మినహాయించుచో చెప్పుకోదగిన నాటకమే లేదు. 17వ శతాబ్ది తరువాత కూడ పెద్దకవులు యక్షగానమును వ్రాసియున్నారు

లాక్షణికుడైన అప్పకవి – యక్షగానము; కంకంటి పాపరాజు – విష్ణుమాయా విలాస యక్షగానము. అదే కాలములో గోకులపాటి కూర్మనాధకవి సింహాద్రి నారసింహ శతకమును, మృత్యుంజయవిలాస యక్షగానమును వ్రాసినాడు. నరహరి అను నొక వైష్ణవుడు తిరుమంగయాళ్వారు (దొంగతనము చేసి దేవుని సేవించినవాడు) చరిత్రను యక్షగానముగా వ్రాసియున్నాడు

వీని నన్నిటిని వీధినాటకములుగా మనవారు పేర్కొని యుండలేదు. వీనిని యక్షగానము లనినారు అందుచే విధిగా వీని నన్నిటిని ప్రదర్శించినారనుకోనక్కరలేదు పాడియుందురు అట్లే గీతగోవిందమును పాడి చూపించు వారున్నారు ప్రదర్శిం చువారు నున్నారు. మృత్యుంజయ విలాసము, రఘునాధాభ్యుదయము మొదలగునవి చాలవరకు పాడి చూపించుటకొరకే

మన కాలములో (Latest Stage) నారాయణదాసు, బాలాజీదాసు (అనకాపల్లి) యక్షగానములను రచించినారు ఇవి కేవలము పాడెడివే ఇట్టివానికి రెండే రూపములు – 1 హరికథగా చెప్పుట లేదా 2 ప్రదర్శించుట కొన్ని రెండురకములుగాను చూపించవచ్చును

## మధురశాఖ

మధుర శాఖలో తిరుమల నాయకునికి పూర్వ మెట్టి గ్రంధము లుండినవో తెలియుటలేదు ఇతడు 1623–1658 వరకు రాజ్యము చేసెను అనగా మధుర, తంజావూరు – ఉభయ కేంద్రము లందును సాహిత్యాభివృద్ధి యొకే కాలము నందు జరిగిన దన్నమాట లింగనమఖి శ్రీకామేశ్వర కవి వీని యాస్థాన కవి. ఈతడు సత్యభామాసాంత్వన మను ప్రబంధమును రచించి రాజకుమారుడైన ముద్దు అళ్హరి యను వానికి కృతి నిచ్చెను. కామేశ్వరకవి తిరుమలనాయకునిపై కొన్ని కీర్తనలను గూడ రచించెను. సత్యభామాసాంత్వనములోని కథ నరకాసుర వధ సత్యభామ, తాను గూడ కృష్ణననుసరించెద నని యొకసారి, అతడు 16000 మందిని చెట్టవట్టినప్పుడింకొకసారి – రెండుసారులు యలుగుటయే యిందలి కథ యనవచ్చును. వీరరస ప్రధానమైన నరకాసుర వధ కథను శృంగార ప్రధానముగా చేసి సత్యభామాసాంత్వనమని పేరుపెట్టుటలో (శృంగారసావిత్రి వలె) నా కాలప్రభావమును గమనింపనగును నాటి వారందరును శృంగారప్రియులే ఇతని రెండవ గ్రంధము ధేనుమాహాత్మ్యమను వచన గ్రంధము ఆ యుగములో రచింపబడిన వచన గ్రంధములలో ఇప్పటికిదే మొదటిదిగా కానవచ్చు చున్నది.

భారతమున శాంతిపర్వమున భీష్ముడు చెప్పిన గాధలలో నిది యొకటి. ఈ కావ్యమును రచించుటకు గల కారణ మానాటి 1. క్రిస్టియన్ మత ప్రాబల్యమును, 2. ఈస్టిండియా కంపెనీ వారి దౌర్జన్యకరమైన గోమాంసభక్షణమును నిరోధించుటయే యనవచ్చును. విజయనగర సామ్రాజ్య మంతరించిన తరువాత వీరి ప్రాచుర్యము హెచ్చినది. తేలిక రచనలో ప్రజలకు సుబోధముగా నుండుటకై యిది రచింపబడినది (మధుర ఫోర్ట్ మిషనరీస్ వల్లనే అంగ్లేయులకు పట్టుబడింది).

## వెలిదండ్ల వేంకటపతి

ఈతడు ముద్దుఅళ్ఘరి కాశ్రితుడు. అయినను ఈతడు తన శృంగారరాధా మాధవమును రాజున కంకితమీయక రామదాసామాత్యున కంకితమిచ్చెను ఇందు రాధ వివాహితగా, వెట్టిగొల్లని కిచ్చి వివాహము చేయబడినదిగా, కృష్ణుని మేనత్తగా, కృష్ణుని యందు మోహము కలదానినిగా వర్ణించి యున్నాడు. రాధామాధవకథ పరకీయశృంగారముతో రచింపబడిన మొదటి తెలుగుప్రబంధ మిది. తరువాత నీమెనువదలి కృష్ణుడుమధురకు బోవుట, ఆమె చిలుకచే రాయబార మంపుట, మొదలగునవి సాధారణ ప్రబంధఫక్కీని నడిపినాడు. వీనిది చాల రసవంతమైన రచన మొదటి యాశ్వాసము నద్భుతముగా రచించినాడు బాలుడైన కృష్ణుని, ప్రౌఢయైన రాధ మోహించుటను చిత్రించుట మనునది చాల దుర్ఘటమైన పని ఈ కవి అతిసాహసుడనుటలో సందేహములేదు నేటి స్వేచ్ఛాప్రణయమును (Free Love Movement) ఈతడు వాచా ప్రతిపాదించినాడు

'వినవేమొ వావివరుసలు తనువుల ధర్మంబొ, ఆత్మల ధర్మంబొ తలప ' అని యీతడు ప్రతిపాదించినది. 'తాటాకులలోన వ్రాసిరి..' అను తారాశశాంకములోని ప్రతిపాదనను గూడ మించిపోయిన దనుటలో నతిశయోక్తి లేదు.

## చొక్కనాధుడు

1658–1680 వరకు వీని పరిపాలన ఇతడు ముద్దు అళ్ఘరి యొక్క సవతితల్లి కొడుకు. తంజావూరును మధుర వారు జయించినప్పుడా రెండేండ్లు ముద్దు అళ్ఘరి యచ్చుటకు రాజప్రతినిధిగా వెళ్లినాడు. ఇతని కాలమున బయలుదేరిన గ్రంధము లేమియును లేవు. వీనిమీద పెక్కు కీర్తనలు మాత్ర మున్నవి.

## విజయరంగచొక్కనాధుడు

ఇతడు 1680–1704 వరకు రాజ్యము చేసెను తంజావూరు రాజులతో సాటికి, పోటీకి నిలువదగినవాడు ఇతడు స్వయముగా గ్రంధకర్త చాలమంది కవుల నాదరించి చేరదీసినాడు. రాజోద్యోగులు కూడ కవులే. ఈతడు నాగమాహాత్మ్యము, శ్రీరంగమాహాత్మ్యము అను రెండు వచన గ్రంధములను రచించెను ఈతని సేనాపతియే సముఖము వేంకటకృష్ణప్పనాయకుడు జైమినిభారతము (పినవీరభద్రునికిది వచన రూపము), సారంగధర చరిత్ర (చేమకూర కిది వచన రూపము) అను రెండు వచన గ్రంధములను రచించెను. (శ్రీరంగ మహాత్మ్యమును గౌరన కొడుకు భైరవి యను నాతడు పద్యప్రబంధముగా వ్రాసియున్నాడు) ఇవిగాక అహల్యాసంక్రందనము,

రాధికాసాంత్వనము (ఏకాశ్వాసము) అను రెండు శృంగారప్రబంధములను గూడ రచించెను. తారాశశాంకకర్తయైన వేంకటపతి యీతని మిత్రుడు దీనిని చూచియే ఆతడు అహల్యాసంక్రందనమును రచించి యుండునని తోచుచున్నది. ఇందులో తారాశశాంకుల ప్రేమ యుదాహరిపబడి యున్నది

## శేషము వేంకటపతి

మధురశాఖ కంతకును ప్రౌఢమైన ప్రబంధము తారాశశాంకము దీని కర్త శేషము వేంకటపతి ఈతడును విజయరంగ చొక్కనాథుని యాస్థానకవియే

కుందుర్తి వేంకటాచలకవి మిత్రవిందాపరిణయమును రచించెను

వెలగపూడికృష్ణయ్య మాలతీమాధవమును రచించెను. ఇది భవభూతి నాటకమునకు ప్రబంధరూప మని చెప్పవచ్చును

తంజావూరులో యక్షగానములకున్నంత ప్రాధాన్యము మధురలో వచన రచనల కున్నది. పరకీయాశృంగారగ్రంథములీ కాలము నందే యెక్కువ వెలసినవి ఈ వచన రచనలలో పూర్వ పద్యగ్రంథములకు దండాన్వయ రూపములు కొన్ని పూర్వరచనల యందలి యుపాఖ్యానములకు వివరణలు కొన్ని. వీరు దండాన్వయరూపముగా వ్రాసిన వానిలో నందలి సమాసముల నట్లే వాడిరి వచనము ద్వారా విద్యావ్యాప్తి జరుగుట కెక్కువ యవకాశ మున్నదన్న సదుద్దేశముతో నీపని ప్రారంభమైనది కాని దండాన్వయములుగా వ్రాసినచోట నవి ప్రబంధములంత ప్రౌఢముగా నున్నవి అందుచే వారి యుద్దేశము నెఱవేరియుండదు. క్రొత్తరకపు కథలు గాని, జనసామాన్యమునకు సుబోధమగు భాష గాని లేకపోవుటచే నీ వచనరచన యంతయు నిర్విశేషమైనది కాని తెనుగు వాఙ్మయమున వచనగ్రంథములు లేవను నొక కొఱత మాత్రము దీర్చబడినది.

## తొండమండరు శాఖ

ఆకాలమున తంజావూరు, మధురలతోబాటు మరియొక యాస్థానము గలదు. అదియే పుదుక్కోట ఆ రాజులకు తొండమండరు రాజులని పేరు. ఇది నేటికిని తెనుగురాజుల క్రిందనే యున్నది విజయరంగ చొక్కనాథునికి సమకాలికుడు రఘునాథ తొండమానుడు ఇతడు పార్వతీపరిణయమను నొక ప్రబంధమును రచించెను. ప్రసిద్ధిలో లేకపోయినను ప్రౌఢప్రబంధ మనదగినదని యిటీవల ప్రచురించబడిన తరువాత నెఱుకలోనికి వచ్చినది.

నుదురుపాటి సాంబయ్య, వెంకయ్య (ఆంధ్రభాషార్ణవము, సాంబ నిఘంటువు రచించినవారు) యీ యాస్థానము వారే ఈ నుదురుపాటి వెంకయ్య మల్లపురాణమును రచించెనట దాని స్వరూపమెట్టిదియో తెలియ రాకున్నది.

బాహుళ్యము మీద నీ దాక్షిణాత్యాంధ్ర కవులకు నత్యుత్సాహము, విలాసతత్పరత, హాస్యచతురత ముఖ్యలక్షణములుగా గానవచ్చుచున్నవి. వారి గానవిద్యా కౌశలము, గాయకులైన వేశ్యలతో వారికి గల సాహచర్యము, వారికిని వీరికిని ఉభయవిద్యా పోషకులైన

నాటి రాజులు చూపిన యాదరణము కారణములుగా నాశిల్పు లందఱును భోగలాలసులై జీవితము నానందముగా గడిపిరి. వారానందమునకు, విలాసమునకు భేదమెఱుంగరు. రాజదత్తము లయిన భోగములను, భగవద్దత్తమైన యింద్రియపటుత్వముచే తనివిదీర నమభవించువారే కాని జీవితము నెడ నౌదాశీన్యమును, ప్రపంచమునెడ వైరాగ్యమును వహించినవారు కారు. తేజస్తిమిరముల వలె పడుగుపేకగా జీవితము నల్లుకొనియున్న సుఖదుఃఖములలో వారు రెండవదానిని జూడనైనను జూడలేదు వెన్నెలపులుగుల విహారము వలె వారి జీవితమంతయు వెన్నెలలోనే మిలమిలలాడుచు నడచినది ఈ విహారము 'ధర్మమా? శాశ్వతమా?' యను జిజ్ఞాస కాని 'కవుల కిదే పరమధర్మమా?' యను నాశంక కాని వారికి లేనేలేదు వారి రాజులకును లేదు ఇంచుమించుగా వాటి సంఘమునకును లేదు పరము మాట యటుండగా 'రేపు' అనెడిమాటనే వారెఱుంగరు. అందుచేతనే వెల్లివిరియు నుత్సాహముతో రసవంతమయిన జీవితమును గడిపి రసపరిప్లుతి గల కావ్యములను రచింపగల్గిరి

ఆనాటి యా చిన్న ప్రబంధములలో నేయొక్కదానియందును వేదాంత ప్రసంగములు గాని, ధర్మమీమాంసలు గాని మచ్చునకైన లేవు అంతియకాదు, ధర్మశాస్త్రానుసార ముగా నస్పృశ్యము లయిన సాంఘిక సిద్ధాంతములను గూడ వారామోదించిరి పరకీయాశృంగారము, స్వేచ్ఛాప్రణయము మొదలైన సాంఘిక విప్లవ సిద్ధాంతములు వారికి రుచ్యములైనవే కాని వెగటుకొల్పలేదు ఈ నైతికనిష్ఠ లేకపోవుటచేతనే ఆ కావ్యములలో లెక్కింటికి ధర్మసౌందర్యలోపము వాటిల్లినది మఱికొన్నిటి యందు కథానిర్మాణములో వెలితి కలిగి కూర్పుసొంపుశిథిలమైనది. దీనిలో చాలమందికి కేవల శక్తియే కాని, వ్యుత్పత్తి యున్నట్లు తోచదు ఈ కారణములచే వీరు సృజించిన వాఙ్మయమునకు సమగ్రసిద్ధి రాలేదు

ఇవియేకాక తంజావూరు గ్రంథాలయమున కర్తృత్వము, కాలము తెలియని పెక్కు కావ్యములు, కీర్తనల సంపుటులు, చిత్రకథల సంపుటులు ననేకములు కలవు వాని నన్నిటిని విషయమును బట్టి విభజించి భక్తి, శృంగార, తత్త్వ కీర్తనలని వేర్పాటు చేసినారు. ప్రబంధములతోబాటు కీర్తనలకు గూడ నంత ప్రాధాన్యము నిచ్చినవారు వీరే. అనగా నాడుద్భవించిన వాఙ్మయములో యక్షగానములును కీర్తనలును చెప్పుకోదగినవి

ఈ మూడు సంస్థానములకును జెందని కట్టా వరదరాజు అను నాతడు ద్విపద రామాయణము నీకాలమందే రచించెను. మైసూరు సంస్థానమునకు సంబంధించిన యొక మిలిటరీ యుద్యోగి యగు కళువ వీరరాజు భారతమునంతను వచనముగా వ్రాసెను. వాని గురువు నంజయ్య హాలాస్యమహాత్మ్యమును వ్రాసినాడు. ఇవిగాక చిన్నచిన్న వచనరచనలు, కర్తృత్వనిర్ణయముచేయ వీలులేనివి పంచతంత్రము, విక్రమార్కకథలు, భేతాళ పంచవింశతి, మొదలైన చిత్రాఖ్యానములు పెక్కులు పుట్టినవి. భారత చిత్రకథలని (ధేనుమాహాత్మ్యం వంటి కథలు) యొక వచన రచన సంపుటి యున్నది తాళ్లపాకవారి వేంకటేశ్వరవిన్నపముల వంటివి, ఇతర దైవములపై కొన్న గద్యలున్నవి (Poetic Prose) నిమిత్తమాత్రమైన కథాంశమును దీసికొని యొక పాత్రగతమైన భావచాలనమును జేసిన గద్యలు కొన్ని యున్నవి (మేఘసందేశము వంటివి)

విన్నపము అనెడి ఒకజాతి వచనరచన ఛందోరహితమైన కవిత్వ మనదగినది, ఆకవులలో గొందఱు భక్తిపరు లయినవారు వృద్ధికి దెచ్చిరి అవి భగవత్పరము లయిన స్తోత్రములు. బైబిల్‌లోని సామ్స్ (Psalms) ను బోలియుండును అవి యన్నియు నాయాకవులు తమ యిష్టదైవతములపైని వ్రాసినవి వానిలో వేంకటేశ్వర విన్నపము లనునవి చాల యుత్తమములు పాలకురికి సోమనాథు డిట్టి విన్నపములు వ్రాసినట్లు నిదర్శనము లుండుటనుబట్టి యాజాతివచనకవిత్వము మనలో ననాదిసిద్ధమైనదే యనుకొనవలెను.

కథావస్తువేమియు లేకుండ పాత్ర మనోవస్థలను మాత్రము ప్రకటించిన వచనములు కలవు వానిని భావవచనము లనవచ్చును వానిలో నుత్తరగోపుర మనునది యుత్తమము రావణుడు తన యుత్తరగోపురముపై నిల్చి రామదండును బరిశీలించి యుద్ధవిషయికమైన యాలోచనము సేయుట యది ఈ కవు లందఱును నాటివరకును తెనుగులో పురాణేతిహాసములు తప్ప వేరేమియు లేదన్న నిందను పూర్తిగా తొలగించినారనవచ్చును

## వేమన

ఆ తొండమండరు రాజుల కాలమున నుత్తరదిక్కున చెప్పకోదగిన కవి ఒక్క వేమన మాత్రమే. వీని కాలనిర్ణయమును గూర్చి చాల వాదోపవాదము లున్నవి కాని 17వ శతాబ్దివాడని మాత్రము చివరికి నిర్ణయింపబడినది (అట్లుగాదు, ఈతడు కొండవీటి రెడ్ల కాలమువాడని కొంద ఱందురు) దాక్షిణాత్య కవులకును వీనికిని చీకటికి, వెలుగున కున్నంత భేదమున్నది వారిలో ఎంత ఐహికరక్తి యుండునో వీనిలో నంత విరక్తి యున్నది

వేమన కవిత్వమును గూర్చి భిన్నభిన్నాభిప్రాయము లున్నవి. ఇంతకంటె మహాకవి యింకొకడు లేడనియు, నిదేకవిత్వమనియు వాదించు వారున్నారు వేమనకు శాస్త్రాభ్యాసము లేదు ఉపనిషచ్ఛ్రవణము లేదు ఈసాంప్రదాయసాధనము లేమియును లేకుండగనే గురూపదేశము వలన యోగసిద్ధి పొందిన ప్రతిభాశాలి యితడు. (స్వయంకృషియు నున్నది) అద్వైతము యోగసిద్ధితోడనే పూర్ణమగు చున్నది. ఆ సిద్ధిని కొందరు శాస్త్రజ్ఞానముతోడను, మరికొంద రాత్మజ్ఞానముతోడను పొందుదురు. వేమన రెండవజాతిలోని వాడు అట్లే వాని కవిత్వమును పాండిత్యహీనమైన పద్యరచన మాత్రమే ఈ రెండు శక్తులును వానికి ప్రకృతిసిద్ధములే యని తోచుచున్నది. ఇట్టి యద్వైతదృష్టితో చూచిన వాటి లోకవ్యవహార మంతయు నవ్యవస్థితముగా కన్పించును. లోకములో నిండుకొన్న యజ్ఞానమును సంస్కరించవలెను ఆ సంస్కరణ రెండురకములు 1. దరిచేరిన శిష్యులకు ప్రపంచ తత్త్వమేమో చెప్పి దానిని ప్రచారమునకు తెచ్చుట; 2 బాహాటముగా తానే చాటుట. ఈ బాహాటముగా చాటుటలో మరల రెండురకము లున్నవి 1. ఆదరముతో సదుపదేశము చేయుట, 2. అనాదరముతో హేళనచేసి దూషించుట. ఈ రెండవ పద్ధతిని వేమన యవలంబించినాడు

వేమన తననాటి ప్రపంచమును హేళన చేయుట మొదలిడినాడు వాని కవిత్వ మంతయు హేళనమయమే. (Satirical) లోకమన్న తిరస్కారభావమే కాని

పురస్కారభావ మాతనికి లేనేలేదు. అందుచే లోకము వీనికవిత్వమువైపు మొగ్గ లేదు. అది కారణముగా వీనికి లోకముపై కోపము, ఈర్ష్య ఎక్కువైనవి ఇది కారణముగా వాని రచనలో మార్దవము కంటె పారుష్య మెక్కువైనది. ఈ గుణము కవి కనుచితము.

కాని వేమన పద్యములలో నద్భుతమైన శక్తి యున్నది అది శబ్దార్థముల రెండింటిని ఆశ్రయించి యున్నది. ప్రతి పద్యములోను అమోఘమైన అంతఃకరణశుద్ధి జీవనాడుల వలె నంటుకొనియుండును. నిర్భయముగా నిర్ణయముగా నంతఃకరణమును వ్యక్తము చేయుటలో నీతడీశ్వరుని గూడ లెక్కసేయలేదు. తానొక కవినన్న జ్ఞానమే వీనికి లేదు. తన్ను లోకమొక కవిగా నెన్నవలె నన్న యాశయును లేదు వాని శబ్దజాలము కూడ ఈ దృష్టికే తగినంత తీక్ష్ణత కలది. వాని పద్యము లన్నియును జానుతెనుగు గని నుండి తీసిన రత్నములు. ఆ శబ్దము లన్నియు ప్రతి పల్లె కుటీరములోను వాడుకలో నున్నవే గాని గ్రంథముల నుండి కొనితెచ్చినవి కావు ఏ శతక కవియు నింత సూటియైన వ్యవహారభాషలో, నింత లక్ష్యశుద్ధి గల నీత్యుపదేశమును చేయలేదు. ఈ పద్యము లన్నియును యాదృచ్ఛికముగా వానికి తోచినప్పుడు నోటివెంట వచ్చిన కఱకులే కాని ఒక ప్రణాళికపై వ్యవస్థితమైన గ్రంథ రచనము మాత్రము కాదు. ఆ పద్యములలోనున్న స్వవచోవిఘాతములకు, పూర్వోత్తర విరోధములకు నిది కారణము. ఏవస్తువులో, ఎప్పుడేగుణము కవిపించినదో, దానినెల్ల పద్యమల్లినాడు ఇట్టి గుణములను జూచి లోకమీతనిని పిచ్చివాడన్నది లోకమే పిచ్చిదన్నాడీతడు

వేమన పేరుమీద కొన్నివేల పద్యము లున్నవి అవన్నియు వేమన కృతములు కావు వానిలో చాల ప్రక్షిప్తములు గలవు. ఎన్ని త్రోసివైచినను సొంత మనదగినవి కొన్ని వేల పద్యము లయిన నుండును వీని నన్నిటిని వేమన కవిత్వ మనుట పొరపాటు వేమన సూక్తు లనుట సమంజసము కారణమేపద్యములోను రమణీయత లేకపోవుటయే. అవన్నియును స్మృతులకు వలె విధి నిషేధములకు సంబంధించినవి అవన్నియును ధర్మాధికారి శాసనములు. లోకమును సమాశ్వాసించుట, ఆదరించుట, రమణీయార్థమును వ్యక్తపరచుట – ఇవి కవిత్వ ధర్మములు ఈ గుణములు మూడు కూడ వేమన సూక్తులలో లేవు. కాని శైలి మాత్రము చాల పటువైనది ఆఒక్కగుణమును బట్టి మాత్రమే యది కవిత్వ మనదలచుకొన్నచో ననవలెను ఈ సూక్తులలో రసవాదము మీద పెక్కుదుర్బోధకములైన పద్యము లున్నవి అసలీ పద్యము లర్థముకాక పిచ్చివాడనినారు కొందఱు అర్థమయినను, ఈ వికారము లన్నిటిని జూచి పిచ్చివాడనినారు మరికొందరు.

వేమన చాల దురదృష్టవంతుడు. ఏమనగా సంఘముకొరకే తానిన్ని సూక్తులను జెప్పియున్నను, తాను సంఘమునకే దూరమయినాడు తన రచనలతో కాని వేమన నొక మహాపురుషునిగా మనము పేర్కొనుటకు కారణము వాని యోగసిద్ధియే. వేమన మహాకవి యని వాదించువారీ యర్థమును భ్రమించినారు పైగ, వాని శైలిని మాత్రమే కవిత్వ మనుకొనుట రెండవ కారణము. వాని పద్యములు మన హృదయావర్జకము లగుటకు హేతువు వాని యకుంఠితమైన శైలి విరోధాలంకారమును, దృష్టాంతాలంకారము (భాస్కరశతకంలో వలె)ను వానికి సహజాలంకారములు ఈతడు

చెప్పదలచిన సూక్తులకు సరిగా సరిపోయిన దాటవెలది. నన్నయకు వృత్తము, తిక్కనకు కందము, శ్రీనాథునికి సీసము, వేమన కాటవెలది – ఇవి తెలుగు వాఙ్మయములో మఱపురానివి.

## పోతులూరి వీరబ్రహ్మము

వేమన వంటివాడే పోతులూరి వీరబ్రహ్మమును. అతడు తన యుపదేశములను తత్త్వములలో, కీర్తనలలో ప్రారంభించినాడు. నిజమునకు వానిలోనే కొంత కవిత్వమున్నది. లేకపోయినా యున్నట్లు భ్రమింపజేసెడి శక్తిగలది కీర్తనలలోని గీతి. ఈ జాతివారందఱును యోగము వలనే అద్వైతసిద్ధి పొందినారు శాస్త్రజన్యమైన సంస్కారము వీరికి లేదు (పరమహంసయు నట్టివాడే వివేకానందుడీ రెండింటిని సమదృష్టితో జూచినాడు) వీరబ్రహ్మములో ఒక ప్రణాళిక యున్నది కేవల తత్త్వమునే యాతడు బోధించినాడు భర్తృహరియు నిట్టి సూక్తులు చెప్పినవాడే కాని యా సూక్తులను కవిత్వముగా చేయుట వాని కొక్కనికే సాధ్యమైనది.

★ ★ ★

# క్షీణయుగము (1775-1875)

ఇంతకు పూర్వయుగము లన్నిటిలో నెన్ని పుస్తకములు పుట్టినవో, అంత నెక్కువ యీయొక్క యుగములో పుట్టినవి అనగా కవులలో శక్తి, కావ్యములలో గుణము నశించిన యుత్పత్తి యన్నమాట కారణ మూహించుట సులువు సంఘజీవితమునకు కవిత్వమునకు నవినాభావసంబంధ మున్నదని గుర్తించవలెను ధర్మనిష్ఠ, రాజ్యకాంక్ష అంధ్రుల చిరకాల వాంఛ తిక్కనాదుల కాలములో నందులకై తీవ్రతరమైన కృషి జరిగినది. ఆ కృషి రాయలకాలములో సిద్ధిపొందినది. చిరకాలవాంఛ సఫలము కాగనే, రాయల తరువాత ఆంధ్రులు వినోదాలలో పడినారు ఏయెడ జూచినను శృంగార గాధలే చివరికా వినోదము కూడ పోయి కేవల యైహికలాలసతయే మిగిలినది. అదియుపోయి, చివరికి తుచ్ఛకామము మాత్రమే నిల్చినది

మధుర తంజావూరు రాజ్యములస్తమించుటతోడనే సామ్రాజ్యస్థాపకులైన యాంధ్రులకు సామంతరాజ్యములైన లేకుండపోయెను స్వాతంత్ర్యరహితము, నైశ్వర్యశూన్యమునైన పిల్లజమీందారీలతో నాంధ్రలక్ష్మి ముఖము విన్నదనము నొందినది జాతి బలము శల్యావశిష్టమైనది. తదాశ్రితమైన కవిత్వమునకు నాక్షీణదశయే పట్టినది ఆ దారిద్ర్యపరాధీనతయే కవులలోని భావదాస్య, పరాధీనతకు కారణమైనది జాతి మహోన్నతస్థితిలోనున్నప్పుడు, ఉండుటకు ప్రయత్నించినప్పుడును సంఘశ్రేయస్సునకు పరమలక్ష్యములుగా నున్న ఉన్నతాశయములు నశించి యీనాటికి వ్యష్టిగాను, సమష్టిగాను క్షుద్రభావములు పొడసూపినట్లుగానే, ఆ సంఘ వ్యక్తులే యైన కవులలోను పూర్వపుటుదారభావములు నశించి నైచ్యము తలచూపినది పూర్వ సామ్రాజ్యకాలములతో అనగా చాళుక్య, కాకతీయుల కాలములో నైహికాముష్మికముల రెంటిని సాధించు సంకల్పబలము కల ధర్మపరాయణులైన వీరులుజన్మించినట్లుగానే, ఆ ధర్మములనే ప్రబోధించుచు, ఆ సంకల్పసిద్ధికే పాటుబడిన ఆత్మబలము గల కవులును జన్మించిరి. వారు వేసినపునాదులమీదనే విజయనగరసామ్రాజ్య నిర్మాణము జరిగినది దక్షిణాపథమంతయు నాంధ్రముద్రాంకితమైన సామ్రాజ్యమైనది దాని మహైశ్వర్యాభివృద్ధియే, అనాటి సారస్వతైశ్వర్యాభివృద్ధికి హేతువైనది

కాని యా ప్రజలా యైశ్వర్యప్రమత్తతలో పూర్వులుపదేశించిన ధర్మనిష్ఠను కొంతవరకుమరచిపోయిరి పూర్వులకు రాజ్యలక్ష్మి యెడను, స్వధర్మదేవతయెడను కన్నుచెదరని సమానమైన దృష్టి కలదు సమగ్రమైన ఆ చూపులో వారు పూనిన దీక్ష తపఃప్రాయమై మరు తరము వారికి సిద్ధరూపమున సాక్షాత్కరించినది సహజముగా సాధనవేళగల నిష్ఠయు, దీక్షయు సిద్ధ్యనంతర ముండుట పొసగదు నిరంతర కృషిచే నలసిన ప్రాణి శ్రమాపనయనార్థము వినోదమున కంగలార్చును అనగా నియ్యెడ

ధర్మము నెడ రాజులకును, ప్రజలకును కొంత యౌదాసీన్యత యేర్పడిన దన్నమాట దాని పరిణామమే తళ్లికోట యుద్ధము. మరి తంజావూరు, మధుర సామంతరాజుల కాలమునాటికి అరాజకును, కవులకును పూర్వధర్మమునెడ యౌదాసీన్యమే కాదు, విస్మృతియును కలిగి, భోగలాలసతయే పరమపురుషార్థముగా పరిణమించినది

ఈ పతనము వచ్చినరోజులలోనే పరదేశీయులు దేశమున కాలుమోపిరి వారి రాకవలన వీరు భ్రష్టులైరనుట పొరపాటు వీరి భ్రంశమే వారి రాకకు కారణము అంతటితో యావద్భారతము వలె నాంధ్రభూమియు శృంఖలాబద్ధమై, ఆ సంకెళ్లే అలంకారములుగా మురియుట తటస్థించినది మహాసామ్రాజ్య పాలకులైన యాంధ్రులకు నీ జీవచ్ఛవములైన జమీందారీలు మిగిలినట్లు, భారతాది పురాణేతిహాసములను సృజించిన యాంధ్రులకు జీవకళలేని తుచ్ఛ ప్రబంధ పరంపర గతియైనది జాతిని పునరుద్ధరించి, పూర్వప్రతిష్ఠ నెలకొల్పగల వీరులు లేనట్లే సారస్వతమును పునరుద్ధరించి క్రొత్త మార్గమున నడపగల కవి, యుగపురుషుడు లేకపోయెను. ఈ నూత్నత్వమును సృజింపలేకపోవుటయే ఈ యుగమునకు క్షీణయుగ మని పేరు తెచ్చినది పూర్వకవులలోని కొందఱు అనుకరణశీలురు, వారి సంఖ్య స్వల్పము ఇక నీయుగములో బహు సంఖ్యాకులసమర్థులు ఏమాత్రమేని పేరుగలవారిలో నీక్రిందివారు ముఖ్యులు. వీరి రచన లన్నియును 1775 తరువాతనే ఒకవేళ వీరు అంతకుపూర్వమే కొంత పేరు సంపాదించియుండిన నుండవచ్చును.

## కంకంటి పాపరాజు

ఈతడు 1798 ప్రాంతమువాడు వస్తుగుణమునుబట్టి యుత్తరరామాయణము పురాణము పూర్వరామాయణములో కంటె దీనియం దెక్కువ పౌరాణిక లక్షణము లున్నవి. 1. దీనికి తిక్కన నిర్వచనోత్తర రామాయణములో ప్రబంధాకార మిచ్చినాడు. ఇచ్చి పురాణేతిహాసోచితమైన సాధుశైలిలో వ్రాసినాడు పాపరాజు పురాణమును పురాణముగానే యుంచి ప్రబంధోచితమైన శైలిలో వ్రాసినాడు (Influence of Historic Style). దీనికి కారణ మానాటికి ప్రబంధశైలి వేరులను దన్నియుండుటయే కావచ్చును. 2. ఈ యుత్తరరామాయణములో శిల్పనికషోపములైన ఘట్టములు కొన్ని యున్నవి – సీతాపరిత్యాగము, రంభారావణ సంవాదము – ఆ ఘట్టములలో నీతడు తిక్కనతో సాటిరాడు సరిగదా, వాని సమీపమునకు గూడ వెళ్లలేడు

ఎంత రాక్షసుడైనను రావణుని తిక్కన రసికునిగావర్ణించెను. రంభ దేవవేశ్యాత్వము తిక్కనకు దోపగా నామె బేలతనమే పాపరాజునకు గానబడెను సీతాపరిత్యాగ ఘట్టమున తిక్కన ఎంతవరకు సంక్షేపించి దిఙ్మాత్రముగా వ్రాయవచ్చునో అంతవరకు చేసి కృతకృత్యుడైనాడు పాపరాజా భాగమును చాల పెంచి వ్రాసి కరుణరస మునుప్పొంగ జేసినాడేగాని దానివలన సీతాలక్ష్మణులిద్దరును బేలలై బోవుదురని తలంచలేదు. సీతారాములప్రణయము సఖిత్వముగా నిరూపించినవాడు భవభూతి (దండకారణ్యవాసప్రియసఖీ). దానిని పునరుద్ధరించినవాడు తిక్కన పాపరాజున కారహస్యము గోచరించలేదు అయినను, ప్రౌఢిమ లేకపోయినను భారతము కంటె భాగవతమునకెక్కువ పేరు వచ్చినట్లుగ తిక్కనరామాయణముకన్న పాపరాజు

గ్రంథమే జనసమ్మత మందినది. దీనికి కారణమాతని శైలిమాధుర్యమును, కరుణరసపోషణమును.

పాపరాజు మిత్రుడగు పుష్పగిరి తిమ్మన ఈతని గ్రంథరచనలో కొంత సహాయము చేసెనని యా కావ్యముననుండుటచే నిది తిమ్మన రచితమేమో యని కొందరు శంకింతురు. కాని తిమ్మన కృతమైన సమీరకుమారవిజయముతో దీనిని బోల్చిచూచినచో రెండింటి కర్తలును వేర్వేరని తెలియకపోదు.

## కనుపర్తి అబ్బయామాత్యుడు

ఇతడు అనిరుద్ధచరిత్రను వ్రాసెను. ఇది పిల్ల వసుచరిత్రలలో నొకటి విజయవిలాసమును గూడ ననుకరింప బ్రయత్న మిందు గాననగును కాని దీనికి దాని యేలక్షణమును అబ్బలేదు.

## కూచిమంచి తిమ్మకవి

ఇతడు బహు గ్రంథకర్తయే గాని ఇతనికి వచ్చినపేరు శతక కర్తగను, అచ్చతెనుగు గ్రంథకర్తగను మాత్రమే కుక్కుటేశ్వరశతకము, నీలాసుందరీ పరిణయము, అచ్చతెనుగురామాయణము, రుక్మిణీకల్యాణము ప్రసిద్ధి కెక్కినవి

## కూచిమంచి జగ్గకవి

ఈతడు తిమ్మకవి తమ్ముడు. ఇతని గ్రంథము చంద్రలేఖా విలాపము. ఇది హేళన (Satire) కావ్యము అను పేరునకు తగని యొక మోటు హాస్య గ్రంథము ఇందలి గుణము నాయకుని యందు కవికి గల అక్కసు నెంతో నేర్పరితనముతో వెళ్లబోయుటయే.

## వక్కలంక వీరభద్రకవి

కూచిమంచి కవులకితడు బంధువు, స్నేహితుడు. వాసవదత్తాపరిణయము ఇతని కృతి.

## అడిదము సూరకవి

ఇతడు గ్రంథకర్తగా కంటె చాటుపద్యకర్తగా నెక్కువ ప్రసిద్ధి కలవాడు కాని ఇతడు పిల్లవసుచరిత్ర యనిపించుటకు చంద్రమతీ పరిణయమును కవిజనరంజనముగా వ్రాసెను. ఇది మూడాశ్వాసముల గ్రంథము. కానీ హరిశ్చంద్రుని చంద్రమతి వివాహమాడినదని తప్ప మరి కథయేమియును లేదు ఇతని రామలింగేశ్వర శతకము సంఘ లోపముల నెన్నుచు వ్రాసిన హాస్య శతకము. అందలి హేళన కటుకుగా నుండినను సవ్యముగానే యుండెను

## ధరణిదేవుల రామయమంత్రి

ఇతని గ్రంధము దశావతారచరిత్రము

## 19వ శతాబ్ది కవులు

## దిట్టకవి నారాయణకవి

ఇతడు రంగరాయ చరిత్రము రచించెను ఇది యెక్కువ రసవంతమైన కావ్యము కాదు. కానీ (దీనికంటె బొబ్బిలి పదమే మిన్న) వెలమదొరల మరియాదలు మొదలగునవి చూపుటలో సిద్ధహస్తుడు హిందూస్తానీ మొదలగు అన్య దేశీయపదములను వ్యవహారవశమున రాజకీయము లందు వాడినటులే ఇతడు కావ్యమున కూడ వాడెను

## చిత్రకవి సింగనార్యుడు

ఇతడు బిల్హణీయమును రచించెను కథాశిల్పవిస్తృతిని బట్టియు, పరకీయా శృంగారమును బట్టియు నిది దాక్షిణాత్యవాఙ్మయమున జేరదగినది. ఆ కవులే ఇట్టి గ్రంథ రచనమున కొరవడి యని చెప్పవచ్చును

## కృష్ణదాసు

ఇతడు జయదేవుని గీతగోవిందమును రాధాకృష్ణవిలాసము అను పేరుతో పద్యకావ్యము జేసెను.

## వేమనారాధ్యుల సంగమేశ్వరకవి

ఇతడు అహల్యాసంక్రందనమును పెద్ద ప్రబంధముగ వ్రాసినాడు. కృష్ణదాసు, సంగమేశ్వరకవులకు కూడ దాక్షిణాత్యకవులే యధార్థముగ గురువులు

## అయ్యలరాజు నారాయణకవి

ఇతడు హంసవింశతిని రచించెను. ఇందలి విషయము కులటావిషయమైనను నీతిదాయకము. ప్రభుత్వముచే నిషేధింపబడినది. కవికి చాల అకుంఠిత మయిన లోకజ్ఞాన మున్నదని ప్రతి కథలోనుద్యోతకమగును

## గట్టు ప్రభువు

ఇతడు కుచేలోపాఖ్యానము రచించెను. కృష్ణకుచేలుర స్నేహ పురస్కృతి యగు గాథ నెత్తి ప్రబంధమనిన శృంగారమే యన్న నిందను బాపెను. కవి కుచేలునితో తాదాత్మ్యము నందినవానిగ గాన్పించును.

## కృష్ణకవి

శకుంతలాపరిణయమును వసుచరిత్రపంథాలో వ్రాసెను

## ద్వ్యర్థికావ్యకవులు

ఈ యుగమునం దనుకరణము శృంగార ప్రబంధము లందు కంటె ద్వ్యర్థికావ్య రచనలో కన్పించును. పూర్వము ఎనిమిది శతాబ్దముల కాలములోను రెండు మూడుకంటె ఎక్కువలేని శ్లేషకావ్యములు ఈ 19వ శతాబ్దిలో పదిపంద్రెండు బయలుదేరినవి. కవికి సహజమైన శక్తి క్షీణించుసరికి అనుకరణము చిత్రణము మున్నగు నిరర్థకతల బట్టి ప్రాకులాడును

క్రొత్తలంక మృత్యుంజయకవి ధరాత్మజాపరిణయము (సీతాపార్వతులు) రచించెను.

బుక్కపట్టణం తిరుమల వేంకటాచార్యులు అచలాత్మజా పరిణయము అని పై కథనే వ్రాసెను.

అయ్యగారి వీరభద్రకవి వెనుక బాలసరస్వతి వ్రాసిన యాదవరాఘవ పాండవీయమును తిరిగి వ్రాసెను

ఓరుగంటి సోమశేఖరకవి రామకృష్ణార్జునరూపనారాయణీయము అనుపేర పై గ్రంధమునే వ్రాసెను.

ఈ నిరర్థక శ్లేషకావ్యకవులలో గొంతకు గొంతయైన పేరు గాంచినది పిండిప్రోలు లక్ష్మణకవి ఇతని గ్రంధముపేరు రావణదమ్మీయము (లంకావిజయము) 1840. ఇందలి విషయము స్వీయము శత్రువు చేసిన యపకారమువల్ల కలిగిన యంతరావేదన ప్రజ్వరిల్లుచుండును వాని దౌర్భాగ్యమును శ్లేషరూపమున వెల్లడిచేసిన హేళన చాల చమత్కారముగనున్నది.

మనకున్న శ్లేషకావ్యములలో దీనికి సాటియగు కథావస్తువు గల శ్లేషకావ్యము లేదు

## తరిగొండ వేంకమాంబ

ఈ శతాబ్దిని వేరువిధముగ పేరుగాంచినవారు గలరు. తరిగొండ వేంకమాంబ వేంకటాచలమాహాత్మ్యమును రచించెను. రాజయోగసారము అను నొక వేదాంత గ్రంధమును ద్విపదలో వ్రాసినది ఈమె శైలి సులభముగానే యుండును స్త్రీయైనను దక్షిణాది వారివలె గాక పారమార్థికమైన రెండు వేదాంత గ్రంధములు వ్రాసిన ఈమె గణనీయ.

## చెళ్లపిళ్ల నరసకవి

ఈయన వేంకటశాస్త్రి గారి పినతాత వేంకటేశ్వరవిలాసము, యామినీపూర్ణ తిలకావిలాసము అను రెండు గ్రంధములను రచించెను. సింగనార్యునితో సమవిషయికము లయిన వర్ణనలుగల ఘట్టములందు తన ప్రౌఢిమ చూపెను.

## మండపాక పార్వతీశ్వరశాస్త్రి

ఈ యుగాంత్యము నందలి కవి ఈయన వ్రాసినన్ని శతకములు (60, 70) తెలుగులో మరియేకవియు వ్రాయలేదు. వేంకటగిరి రాజులలో నొకని పట్టాభిషేకమును రాధాకృష్ణసంవాద మను ప్రబంధముగ వ్రాసెను ప్రబంధముకంటె శతకములే చాలా దీప్తిమంతములు.

* * *